

# నక్సల్బరీ వెలుగులో...

## (భారతదేశ నక్సలైట్ ఉద్యమ చరిత్ర)

సుమంతా బెనర్జీ

విరసం

# నక్సల్బరీ వెలుగులో

## (భారతదేశ నక్సలైటు ఉద్యమ చరిత్ర)


ఆంగ్ల మూలం : **సుమంతా బెనర్జీ**

తెలుగు : **కృష్ణమూర్తి**



విప్లవ రచయితల సంఘం

**నక్సల్బరీ వెలుగులో**
రచయిత : సుమంతా బెనర్జీ
తెలుగు అనువాదం : కృష్ణమూర్తి

**Naxalbari Velugulo**
*by Sumantha Benarji*
*Telugu Translation by :* Krishna Murthy

విరసం ప్రచురణలు
Website : www. virasam. in
Mail Id : arunatara1977@gmail. com
http://www. facebook. com//arunatara. virasam

మొదటి ముద్రణ : నవంబరు, 1982
రెండవ ముద్రణ : సెప్టెంబర్, 2014
ప్రతులు : 1000
వెల : 180/-
డిటిపి, లే అవుట్ : ఆర్. భాగ్యలక్ష్మి
కవర్ డిజైన్ : క్రాంతి

చిరునామా :
పాణి
50-348, ఎల్ 19, బి-2,
అరోరా నగర్, బి క్యాంప్,
కర్నూల్ - 2, ఆంధ్రప్రదేశ్.

ప్రతులకు :
అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో

ముద్రణ :
చరిత ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్.
ఫోన్ : 040-27678411

# విషయసూచిక


| | |
|---|---|
| దేశమంతా నక్సల్బరీ వెలుగు | 4 |
| వివరణలపై ముందుమాట | 11 |
| ఉపోద్ఘాతము | 13 |
| పరిచయం | 16 |
| అనువాదకుని ముందుమాట | 23 |
| గ్రామాలు | 29 |
| నగరాలు | 66 |
| కమ్యూనిస్టు పార్టీ | 100 |
| నక్సల్బరీ | 132 |
| శ్రీకాకుళం | 155 |
| పార్టీ పుట్టుక | 182 |
| మార్గాల కూడలిలో (మా.లె.) పార్టీ | 211 |
| యువజనోద్యమం | 239 |
| ఒక దశ ముగిసింది | 293 |
| భావిలో అవకాశాలు | 360 |
| References | 414 |
| అనుబంధం - 1 | |
| కొందరు సి.పి.ఐ. (మా.లె.) పార్టీ నాయకుల జీవిత విశేషాలు (1967-72) | 439 |
| అనుబంధం - 2 | |
| చారుమజుందారు రచనల పట్టిక | 445 |

# దేశమంతా నక్సల్బరీ వెలుగు

.... ఈ మాట అతిశయోక్తి కాదు. అలంకారికం కాదు. నక్సల్బరీ ఒక ఊరు కాదు అనే పుస్తకాన్ని సుమారు రెండు దశాబ్దాల కింద అఖిల భారత విప్లవ విద్యార్థి సమాఖ్య అచ్చేసింది. ఆ రోజుల్లో విప్లవంలోకి వచ్చిన యువతరానికి, విద్యార్థులకు ఆ పుస్తకం గొప్ప ప్రేరణ. అయితే, అప్పటికి నక్సల్బరీ దేశమంతా అనగలిగే పరిస్థితి లేదు. వాస్తవానికి నక్సల్బరీ ఎప్పుడూ ఒక ఊరు కాదు. ఒక ప్రతీక కాదు. ఒక రాజకీయ పంథా. అందువల్లే దేశవ్యాప్తమైంది. ఆ పుస్తకానికంటే సాధికార రచన సుమంతా బెనర్జీ రాసిన నక్సల్బరీ వెలుగులో.

ఇది 1980లో ఇంగ్లీషులోనూ, 1982లో తెలుగులోనూ వచ్చింది. హైదరాబాదులోని సామ్యవాద సాహితి అనే సంస్థ అచ్చేసింది. కృష్ణమూర్తి అనువాదం చేశారు. మూడు దశాబ్దాల తర్వాత ఈ తరం పాఠకుల కోసం, విప్లవాభిమానుల కోసం విరసం పునర్ముద్రిస్తోంది. నక్సల్బరీ పంథా దేశ వ్యాప్త ఐక్య విప్లవోద్యమంగా పురోగమిస్తున్న తరుణంలో ఉద్యమ ప్రారంభదశను తెలుసుకోడానికి ఈ పుస్తకం గొప్పగా పనికి వస్తుంది. అందువల్ల అప్పట్లో ఈ పుస్తక రచనకు ఉన్నట్లే, ఇవాళ పునర్ముద్రణకు కూడా విప్లవోద్యమ వికాస చరిత్రలో ప్రాధాన్యత ఉంది. ఈ దృష్ట్యా మూడు వైపుల నుంచి ఈ పుస్తకాన్ని పరిశీలించవచ్చు. 1. ఈ పుస్తకంలోని పరిశీలనా చట్రం, 2. ఆనాటి ఉద్యమం, ఈ రచన ఆ తరం మీద వేసిన ప్రభావం, 3. ఈ రచనలో లేదా ఆనాటి ఉద్యమంలోని మౌలిక భావనలు, పోరాట–నిర్మాణ సన్నాహాలు, ఈ నలభై ఏళ్లలో సాధించిన ప్రగతి.

* * *

నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల మీద ఉద్యమ నిర్మాణం నుంచి సాధికార విశ్లేషణ రచనలు రానట్టే. బయటి నుంచి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. అయితే ఉద్యమాల మౌలిక పంథాను గుర్తించడంలోనే లోపం ఉన్నప్పుడు ఇలాంటి ప్రయత్నాలు అరకొరగా

మిగిలిపోతాయి. అపసవ్యంగా తయారవుతాయి. ఏ ప్రత్యేక చారిత్రక రాజకీయార్థిక పరిస్థితుల్లో, ఉద్యమ సంక్షోభాల్లో, జాతీయ అంతర్జాతీయ పోరాట సంప్రదాయాల బలీయ ప్రభావాల్లో ఆ ఉద్యమాలు జరిగాయో తెలుసుకోగలగాలి. అనేక వ్యక్తీకరణలుగా, నినాదాలుగా, పోరాట నిర్మాణ రూపాలుగా బయటికి కనిపించినవే ఆ ఉద్యమ మౌలిక పంథా అని నేరుగా నిర్ధారణకు రావడం కూడా కష్టమే. వాటన్నిటినీ తొలుచుకుంటూ వెళ్లి మౌలిక పంథా ఏమిటో తెలుసుకొని, అది ఏ చైతన్యంతో, ఏ బలీయతల మధ్య రూపొందిందో స్పష్టత సాధించాలి. ఆ తర్వాత ఆ పంథా మీద విమర్శలు ఉంటే ప్రకటించవచ్చు.

విప్లవోద్యమం మీద .. లేదా అందులోని కనీసం ముఖ్య దశల మీద అయినా బయటి నుంచి కూడా ఒక రకమైన సమగ్ర దృక్పథంతో, పరిశీలనా చట్రంతో రచనలు పెద్దగా రాలేదు. కొన్ని మంచి ప్రయత్నాలు జరిగి ఉండవచ్చు. మంచి వ్యాసాలు కూడా ఉండవచ్చు. నడుస్తూ ఉన్న ఉద్యమం మీద విశ్లేషణ ఇవ్వడంలో సౌకర్యం ఉన్నట్టే అసౌకర్యం కూడా ఉంటుందేమో. అయితే భారత విప్లవోద్యమం మీద బయటి నుంచి అలాంటి సమగ్ర రచనలు రాకపోయినా గత పదిహేనేళ్లుగా ఉద్యమకారులే ఆ వెలితి తీర్చుతూ తమ పద్ధతిలో మంచి ప్రయత్నాలు చేస్తున్నారు. అవన్నీ ఎప్పటికైనా రావాలని సమగ్ర రచనకు గొప్పగా ఉపయోగపడేవే.

నక్సల్బరీ వెలుగులో నడుస్తూ ఉన్న ఉద్యమం మీద వచ్చిన పుస్తకం విశిష్టత. నక్సల్బరీ అనే ఊళ్లో పోరాటం ఆ తర్వాత ఏమైపోయిందోగాని నక్సల్బరీ పంథాలో దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజా సంచలనాలు జరిగాయి. అవి కూడా కొద్ది కాలానికే సంక్షోభంలో పడిపోయాయి. శత్రువు నిర్బంధం వల్ల, సొంత తప్పిదాల వల్ల ఆగిపోయాయి. అయితే నక్సల్బరీ పంథా రద్దు కాలేదు. పోరాటశక్తులు దాన్ని విరమించుకోలేదు. ఒక రకంగా 1972 నాటికే నక్సల్బరీ వెలుగులో వెల్లువెత్తిన పోరాటాలు ఎదురు దెబ్బలు తినడం మొదలై 1974 నాటికి దాదాపుగా ఆగిపోయాయి. అప్పుడే పునర్నిర్మాణ ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆ కాలంలో రాసిన పుస్తకం ఇది. కాబట్టి ఉద్యమ కాలంలో, స్వయంగా ఉద్యమంలో ఉన్న రచయిత రాసిన పుస్తకమిది.

ఈ రచనలో సుమంతాబెనర్జీ ఒక సంవిధానాన్ని పాటించారు. 1969 ఏప్రిల్ 22న ఏర్పడ్డ సీపీఐ ఎంఎల్ ఈ దేశాన్ని అర్ధవలస, అర్ధ భూస్వామ్యమని, చైనా మార్గంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయాలని ప్రకటించుకుంది. ఇంకా బాగా చెప్పాలంటే 1967 నవంబర్‌లో ఏర్పడ్డ కమ్యూనిస్టు విప్లవకారుల

సమన్వయ కేంద్రం ఒక పక్క విప్లవ పంథా, నిర్మాణ సన్నాహక ప్రయత్నాలు చేస్తానని అంటూనే ఇంకోపక్క చైనా మార్గాన్ని అనుసరించాల్సిందే అని ప్రకటించింది. అంతకంటే ముందు 1964 ఏడో కాంగ్రెస్ తర్వాతి నుంచి ఉభయ రివిజనిస్టు పార్టీలకు వ్యతిరేకంగా రాసిన 8 డాక్యుమెంట్లలోనే చైనా మార్గమే మా మార్గం అని ప్రకటించారు. అందులోని ముఖ్యమైన అర్ధ వలస అర్ధ భూస్వామ్యం, గెరిల్లా యుద్ధం అనే ప్రాతిపదికలపై సుమంతాబెనర్జీ ఈ పుస్తక రచనా చట్రాన్ని రూపొందించుకున్నారు. అందువల్ల పుస్తకంలోని తొలి రెండు అధ్యాయాలు గ్రామాలు, నగరాలను వర్ణిస్తూ ఈ సమాజం అర్ధ వలస, అర్ధ భూస్వామ్యమని చెప్పడానికి ప్రయత్నించారు. నిజానికి నక్సల్బరీ వెలుగులో సుమారు ఐదారేళ్లపాటు పోరాటాలు జరిగిన వెనుకబడిన గ్రామీణ ప్రాంతాలు, ఆదివాసీ ప్రాంతాలు దుర్భర స్థితిలో ఉండేవి. పల్లె సమాజంలో ఫ్యూడల్ ఆధిపత్య రూపాల్లో దోపిడీ జరుగుతూ ఉండేది. భూమి లేని నిరుపేదలు చాలా పెద్ద సంఖ్యలో ఉండేవారు. సామ్రాజ్యవాదం, సోషల్ సామ్రాజ్యవాదం మద్దతుతో వలసానంతరం ఇక్కడి పాలకులు తమ విధానాలు చేపట్టారు. వీటన్నిటినీ వివరిస్తూ భారతదేశం అర్ధ వలస అర్ధ భూస్వామ్యని చెప్పడమేగాక ఉమ్మడి పార్టీ మీద మార్క్సిస్టు లెనినిస్టు అవగాహనలో విమర్శనాత్మక అంచనా వేశారు.

నక్సల్బరీ ప్రజ్వలనాన్ని ఈ దేశంలోని రాజకీయార్థిక వ్యవస్థను, కమ్యూనిస్టు పార్టీ నిర్వాకాన్ని మౌలిక పునాదిగా విశ్లేషించారు. ఆ తర్వాత నక్సల్బరీ శ్రీకాకుళం తదితర పోరాటాల తీరుతెన్నులను, వాటి సమన్వయాన్ని, ఎంఎల్ పార్టీ ఆవిర్భావాన్ని వివరించారు. పార్టీ పుట్టక ముందే విప్లవ శిబిరంలో ఉన్న భిన్నాభిప్రాయాలను, పార్టీ ఏర్పడ్డాక ఏడాదిలోపే అంతర్గతంగా సాగిన భేదాభిప్రాయలను కూడా చాలా వరకు వాస్తవిక దృష్టితో రాశారు. ముఖ్యంగా చారుమజుందార్ పాత్రను గుర్తిస్తూనే, గౌరవిస్తూనే ఆయన మార్గంపై చెలరేగిన వివాదాలను రికార్డు చేశారు. అట్లాగే చారుమజుందార్ 1970 మే నెలలో జరిగిన 7వ (1వ) కాంగ్రెస్‌లో కూడా తన వర్గశత్రు నిర్మూలనా కార్యక్రమాన్ని సమర్థించుకున్న తీరును ఆయన ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదిక ఆధారంగా గుర్తు చేశారు. ఆ తర్వాత కొద్ది కాలానికే పార్టీ ముక్కలు చెక్కలైపోవడం, దారుణమైన నిర్బంధం మధ్య, అసాధారణ త్యాగాల మధ్య ఉద్యమాలు 1972 నాటికే దాదాపుగా ఆగిపోయాయని కూడా రాశారు.

ఈ మొత్తాన్ని చారిత్రక పత్రాల ఆధారంగా, ప్రత్యక్ష పరిశీలన ద్వారానే గాక అసలు నక్సల్బరీ పంథా సారాంశాన్ని ఈ పుస్తకం ఎత్తిపట్టింది. చాలా సంక్షోభభరితంగా, ఉద్యమ కల్లోలంగా అనేక ఒత్తిళ్ల మధ్య, అనివార్యతల మధ్య

ఉద్వేగభరితంగా సాగిన ఆ కొద్ది కాలంలో బయటికి కనిపిస్తున్న ఈ దృశ్యపరంపర మధ్య నుంచి లోపలికి వెళ్లి నక్సల్బరీ పంథా విశిష్టతను రచయిత గుర్తించారు. అంతేకాదు.. చారుమజుందార్ మీద కొంత విమర్శనా స్వరాన్ని వినిపిస్తూనే ఆయనలోని పునరాలోచనను సహితం గుర్తించారు. అయితే చారుమజుందార్ తన పరాజయాన్ని అంగీకరించలేకపోయారని కూడా రాశారు.

ఉదాహరణకు పరాజయ కాలంలో చారుమజుందార్ అనే అధ్యాయంలోని కొన్ని వాక్యాలను చూడండి: “1971 చివరి నుంచి, 1972 మధ్య కాలం వరకూ.. అంటే జూలై నెలలో తన అరెస్టు–చావు జరగక పూర్వం చారుమజుందార్ (కొన్ని ప్రధాన సమస్యలపట్ల) సింహావలోకనం చేసుకుంటూనే ఉన్నాడు. భావిలో విప్లవపు తీరు తెన్నులు వివరించేందుకు జరుగుతున్న సంఘటనల అంతరార్థాన్ని గ్రహించే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. పరాజయం పరిహసిస్తున్నా కూడా అతను విప్లవం కోసం కన్న తీపి కల మరుగునపడిపోవడానికి ఒప్పుకోలేదు...” దీన్నే 1974 నాటి ఆత్మవిమర్శ రిపోర్టులో కామ్రేడ్ కేఎస్ చాలా నిర్దిష్టంగా చెప్పారు. చారుమజుందార్ తన చివరి రోజుల్లో పునరాలోచనలో పడ్డ విషయాలను, సన్నిహిత కామ్రేడ్స్‌తో పంచుకున్న మాటలను బయటికి ప్రకటించడానికి అహంకారం అడ్డంపడింది.. అని రాశారు.

చారుమజుందార్‌లోని అంతర్మథనాన్ని కొన్ని అముద్రిత రచనల ఆధారంగా కూడా సుమంతాబెనర్జీ వివరించారు. అంటే ... ఆ కొద్ది కాలంలోనే అనేక సంచలనాత్మక పరిణామాల మధ్య ఉద్యమంలో, నిర్మాణంలో, నాయకత్వంలో వచ్చిన అన్ని మార్పులను పరిగణనలోనికి తీసుకొని నక్సల్బరీ మార్గంలోని రాజకీయ, సిద్ధాంతపరమైన అసలు సారాంశాన్ని విశ్లేషించే ప్రయత్నం చేశారు. నిజానికి ఆ కాలంలో విభిన్న విప్లవ బృందాలు ఉద్యమ కేంద్ర స్థానంలో ఉన్న చారుమజుందార్‌పైన, సీసీఐఎంఎల్‌పైన, అది నిర్దేశించిన రాజకీయ మార్గంపైన చాలా చర్చలు చేశారు. ఆ మొత్తంలోని లోపాలు, పరిమితులు, పెడ ధోరణులను గుర్తించి సవరించడం కంటే విమర్శలు, వ్యతిరేకతే ప్రధానంగా సాగింది. ఆ పద్ధతిలోనే రాశారు కూడా. అంతేగాదు నలభై ఏళ్ల తర్వాత శ్రీకాకుళ పోరాటం మీద వచ్చిన ఒకటి రెండు పుస్తకాల్లో కూడా కొన్ని వక్రీకరణలు కనిపిస్తాయి. అయితే ఆనాటి ఉద్వేగాలు, ఒత్తిళ్లు చల్లారని కాలంలోనే సమంతాబెనర్జీ విమర్శా స్వరంతోనే నిర్మాణాత్మకంగా ఉద్యమ వాస్తవిక దృక్పథాన్ని, లక్ష్యాన్ని చారిత్రకంగా వివరించగల సంవిధానాన్ని పాటించడం ఈ పుస్తకం గొప్పదనం. నక్సల్బరీ వెలుగులను తర్వాతర్వాత దేశవ్యాప్తం చేయడంలో ప్రధాన శక్తి అయిన చారుమజుందార్ మార్గీయులపై సుమంతాబెనర్జీ 1990ల నుంచే

అనేక భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ వచ్చారు. బహిరంగ విమర్శలు ప్రకటించారు. అయినా ఈ పుస్తకం ఆ తరానికేగాక ఈ తరానికి కూడా విప్లవోద్యమ తొలి దశను అర్థం చేసుకోడానికి ఉపయోగపడుతుంది.

ఈ పుస్తకాన్ని చదువుతొంటే రచయిత పాటించిన సంవిధానంతోపాటు ఆ తరం మీద నక్సలైట్ ఉద్యమం వేసిన ప్రభావం కూడా తెలుస్తూ ఉంటుంది. అంటే ఒక ఉద్యమాన్ని ఆనాటి సమాజ స్థితిగతుల మధ్య గుర్తించడం వల్ల ఆ తరం ప్రతిస్పందనలు ఈ రచనలో కనిపిస్తూ ఉంటాయి. నక్సల్బరీ ఒక పోరాట మార్గంగా సమాజంలోని ఆదివాసులను, భూమి లేని రైతాంగాన్ని, మధ్య తరగతి బుద్ధి జీవులను పెను సంచలనంలోకి తీసికెళ్లింది. ఆ మార్గంలో ఆయా బృందాలు తమ పద్ధతిలో భాగస్వాములయ్యాయి. ఈ పుస్తకం ఎందుకు ఉత్తేజభరితంగా ఉంటుంది? అనే ప్రశ్న వేసుకుంటే నక్సల్బరీ తరహా విప్లవోద్యమం ఆనాటి సమాజానికి ఏకైక విముక్తి మార్గంగా కనిపించింది. అది ఆ పోరాటానికి, ఆ కాలానికి కూడా సంబంధించిన ప్రత్యేకత, విశిష్టత. ఉద్యమ చరిత్రగా ఈ పుస్తకం ఆనాటి ఉద్యమంపట్ల ఆ తరం ప్రజల మనో స్పందనలను కూడా పరిగణనలోకి తీసుకుంది. నేరుగా అలాంటి విషయాలు రాయకపోయినా అదంతా మనకు కనిపిస్తూ ఉంటుంది.

నిజానికి చరిత్రను కేవలం ఘటనల పరంపరగా కాక ఒక నిర్దిష్ట చారిత్రక యుగావధిలోని పరిణామాల క్రమంగా చూడటం, ఆ క్రమం మనుషుల మధ్య, వారి చైతన్యవంతమైన ఆచరణ మధ్య సాగేది కాబట్టి వారి ప్రతిస్పందనలు సహితం మనకు స్ఫురించేలా రాయడం రచయిత ఎంచుకున్న చరిత్ర రచనా పద్ధతి. ఆ తరం కామ్రేడ్స్, ప్రజల మాటల్లో ఆనాటి పోరాటం ఆ కాలంపై ఎంత గాఢమైన ముద్ర వేసిందో మనకు తెలుస్తూ ఉంటుంది. ఈ పుస్తకంలో అది కూడా ఉంది. ఆనాటి పోరాటం అనేక ఆటుపోట్ల మధ్య ఇవాళ మరింతగా విస్తరించినందు వల్ల ఆనాటి స్ఫూర్తి అందుకోదల్చినవాళ్లకు, స్వీకరించాల్సినవాళ్లకు ఈ పుస్తకం చాలా అవసరం.

అయితే 1970లలో, 80లలో వలె పోరాటాలు లేవనే వాళ్లు మనకు తరచూ తారసపడుతూ ఉంటారు. నిజమే ఆ కాలానికి చెందిన పోరాటాలు అప్పుడే ఉంటాయి. ఆ నినాదాలతో, ఆ రూపాలతో అప్పుడు మాత్రమే ఉద్యమాలు జరిగి ఉంటాయి. ఉద్యమాలు ఎంచుకున్న మార్గంలో అవి ఎలా పురోగమిస్తున్నాయో తెలియకపోతే ఆ రోజుల్లోలాగా ఉద్యమాలు లేవనే అభిప్రాయం కలుగుతుంది. వాస్తవానికి ఆరోజుల్లాగా మనం ఉన్నామా లేదా? అనే ప్రశ్న కూడా వేసుకోవాలి. ఆ తరంలాగా నక్సల్బరీ పంథా పట్ల విశ్వాసం లేకుండా, నిబద్ధతంగా లేకుండా, భాగస్వామ్యం వహించకుండా

ఉద్యమాలు ఆ రోజుల్లో లాగా లేవని అనడం పాక్షిక సత్యమే అవుతుంది. కొత్త పరిస్థితుల్లో సాగుతున్న ఉద్యమ గతిని శాస్త్రీయంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. మనం అప్పట్లాగా లేమని, సమిష్టి.. చారిత్రక విషయమైన ఉద్యమాలు అనేక ప్రత్యేకతల మధ్య పురోగమిస్తుంటాయని, మనమే వాటిని అర్థం చేసుకోవాల్సి ఉంటుందని, దాని కోసం వాటికి సన్నిహితంగా మెలగాలని, వీలైనంత భాగం కావాలని తెలుసుకోవాలి. అప్పుడు మాత్రమే విమర్శనాత్మక విశ్లేషణకు అవకాశం ఉంటుంది.

ఈ పుస్తకం చదువుతూ ఉంటే ఉద్యమాలు ఆనాటి లాగా లేవు కదా? అంత ఉద్వేగంగా లేవు కదా? అనిపిస్తుంది. నిజమే. ఆనాటికంటే చాలా పరిణతితో, దీర్ఘకాలిక దృష్టితో, తప్పొప్పులపై నిర్మొహమాటమైన స్వీయ విమర్శతో, విప్లవ ప్రజాస్వామిక పోరాటాలు ఒక క్రమంలో పురోగమిస్తూ అంతిమ విజయం సాధిస్తాయనే వాస్తవిక అవగాహనతో సాగుతున్నాయని స్పష్టమవుతుంది.

విప్లవం గురించి, యుద్ధం గురించి, మౌలికంగానే సామాజిక పరివర్తన గురించి ఆ రోజుల్లో ఎన్నో అతివాద నిర్ధారణలు జరిగాయి. అలాంటి నినాదాలు, పోరాట రూపాలు వచ్చాయి. చారుమజుందార్ తదనంతరం జరిగిన పునర్నిర్మాణ ప్రయత్నాల్లో అనేక మంచి విషయాలు ఉన్నా ఒక గొప్ప ఎరుక కలిగింది. చైనా మార్గమే మన మార్గమని అనుకుంటూ వచ్చిన ఉద్యమంలోని అతివాద పోకడలపై ఆనాటి ఆంధ్ర రాష్ట్ర కమిటీ తీవ్ర విమర్శ చేసింది. ఈ పెడ ధోరణులకు వ్యతిరేకంగా దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను పార్టీ యావత్తు స్థాపించింది. ఇది అన్నిటి కంటే అతి ముఖ్యమైన విజయం. దీని మీద ఆధారపడే నక్సల్బరీ దేశవ్యాప్త ఉద్యమంగా మారింది. ఇది సామాన్యమైన విషయం కాదు.

అట్లాగే నక్సల్బరీ నిర్మాత అయిన చారుమజుందార్ ఆనాడే చెప్పిన పటిష్టమైన పార్టీ, ఎర్ర సైన్యం, ప్రజారాజ్యాధికార సాధనంగా ఐక్య సంఘటన అనే మావోయిస్టు సూత్రాలను ఈ పుస్తకం కూడా చాలా సాధికారికంగా, వాటి అసలైన అర్థంలో విశ్లేషించింది. నిజానికి చారుమజుందార్ మిగతా వాటిలాగే ఈ విషయాల్లో కూడా తొందరపాటు సూత్రీకరణలు చేశాడు. ఆయన స్ఫూర్తిని, ఆయన నాయకత్వ పాత్రను విమర్శనాత్మకంగా స్వీకరించే క్రమంలో విప్లవోద్యమం తర్వాత్తర్వాత పార్టీ, ఎర్ర సైన్యం, ప్రజారాజ్యాధికారంగా ఐక్య సంఘటనలాంటి విషయాలపై సహజంగానే ఆయన కంటే చాలా మెరుగ్గా ఆలోచించింది. ఆచరణలో వర్గపోరాటం తీవ్రమయ్యాకనే ఉద్యమం తొలి రోజుల్లో ఈ పుస్తకంలో చెప్పిన పై మూడింటిలో అనేక విజయాలు సాధ్యమయ్యాయి. దేశంలోని ప్రధాన విప్లవ పార్టీలైన పార్టీ యూనిటీ, మావోయిస్టు

కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా, సీపిఐ (ఎంఎల్) నక్సల్బరీ, సీపిఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్) రెండు మూడు దశల్లో ఐక్యతా క్రమాన్ని సాధించడంతో ఐక్య పార్టీ అవతరించింది. సుమారు పదిహేనేళ్ల కిందనే ప్రజా గెరిల్లా విముక్తి సైన్యం ఆవిర్భవించి ప్రజా యుద్ధం మధ్యనే పురోగమిస్తూ ప్రజా విముక్తి సైన్యంగా మారే దశలో ఉంది. ప్రజా రాజ్యాధికార బీజ రూపంగా జనతన సర్కార్ ఐక్య సంఘటనగా నిలదొక్కుకుంటున్నది.

ఆ రకంగా ఈ పుస్తక రచయిత విప్లవోద్యమ తొలి దశలో ఏ విషయాల్నైతే కేంద్రంగా తీసుకున్నారో అవి ఇవాళ దేశంలో బీజ రూపంలో అయినా ఆవిష్కారమయ్యాయి. సుమంతా బెనర్జీ నలభై ఏళ్ల కింద ఈ పుస్తకంలో చూపిన నక్సల్బరీ వెలుగులు ఇవాళ దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. అందుకే మొదటే అన్నట్లు ఈ మాట ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. ఆలంకారికత కాదు. ఒక ఆచరణ క్రమం. విస్తరణ, వికాస క్రమం.

**– పాణి**

సెప్టెంబర్, 2014

# వివరణలపై ముందుమాట

ఈ పుస్తకంలో ఉదహరించిన సి.పి.ఐ. (మా.లె.) పార్టీ పత్రాలు చాలా వరకు బెంగాలీ, హిందీ, తెలుగు మూలాల నుంచి అనువదించినవి. కొన్ని పార్టీ పత్రిక లిబరేషన్‌లో ఇంగ్లీషులో వచ్చాయి. కాని వాటి అనువాదంలో తరచు కనిపించిన స్వేచ్ఛ దృష్ట్యా; నేను వాటిని మళ్లీ ఇంగ్లీషులోకి అనువదించో, లేక అనువదింపజేసో, అధికార తర్జుమాలకు బదులుగా వాటిని వాడాను.

చారుమజుందారు రచనలకు వస్తే, మూలాధారాలివి; అతని రచనలు మూడు బెంగాలీ సంపుటాలున్నాయి. 'ఎనిమిది పత్రాల'ను సి.పి.ఐ. (మా.లె.) పార్టీ బెంగాలీలోనూ ఇంగ్లీషులోనూ కూడా ప్రచురించింది. ఏరిన రచనల మరో సంపుటాన్ని కూడా ఇంగ్లీషులో వెలువరించింది. కాని చారుమజుందారు రచనల విషయంలో కూడా ఇతర పత్రాలపట్ల అవలంబించిన పద్ధతినే చేపట్టాను. *

చారుమజుందారు రచనలు, పార్టీ పత్రికలు – లిబరేషన్, దేశబ్రతి, లోక్ ఆయుధ్‌లను 1970 మే నెల తరువాత దేశంలో నిషేధించినందున, ధారావాహికం గానూ విస్తారంగానూ వెలువడిన సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ప్రచురణలు చాలా వరకు సామాన్య ప్రజానీకం దృష్టికి రాలేకపోయాయి.

ప్రచురించిన సమాచారమేకాక, ప్రధాన సమావేశాల తాలూకు మినిట్సు, జైళ్ల నుంచి రాసిన లేఖలు, చారుమజుందారు రూపొందించిన (ప్రచురించని) సమాచారం, ఎంతో ఉంది. వాటిని కూడా ఈ పుస్తక రచనలో విరివిగా వాడాను.

సి.పి.ఐ. (మా.లె.) సంఘర్షణల సమాచారం, నివేదికల యొక్క శైలిని గురించి ఒక్కమాట. భాష పొంతన లేనిదిగా, అతిశయోక్తికరంగా కనిపిస్తుంది. ఆయా

---

* *సంవత్సర క్రమంలో రూపొందించిన చారుమజుందారు రచనల పట్టికను చివర (అనుబంధం–2) 501వ పేజీలో చూడుడు. ఆ రచనల నుంచి ఉదహరించినప్పుడు అందులోని క్రమ సంఖ్యను ( )లో సూచించాను – అను.*

నివేదికలను రూపొందించిన వ్యక్తులు, పోరాట ప్రాంతాల సమాచారాన్ని భూమిలేని రైతాంగపు దృక్పథంతో రచించారని గుర్తుంచుకోవాలి. తరతరాలుగా పీడింపబడే అణగదొక్కబడ్డ ప్రజలు, తమ పీడకులపై తుపాకుల్ని ఎక్కుపెట్టి ఒకటై నిలిచిన సంగతి సామాన్య నగర పాఠకులకంత ప్రాముఖ్యంగా కనిపించకపోవచ్చు. కాని అదే గ్రామీణ బీద జనులకు చాలా గొప్ప విషయం. ఓ మారుమూల కుగ్రామంలో అజాపజాలేని భూస్వామి చావు వార్త పత్రికలో చదివిన బస్తీవాసి అంతగా చలించక పోవచ్చు. కాని సంవత్సరాల తరబడి ఇదే భూస్వాములు తన వర్గీయులను నిర్దాక్షిణ్యంగా హింసిస్తుంటే, గుడ్లప్పగించి చూసిన బీద రైతు చిన్న ప్రపంచంలో అది వర్ణనాతీతమైన సంచలనాన్నే కలిగిస్తుంది. పీడిత జన పక్షపాత దృక్పథాన్నవ లంబించడంలోనే ఈ తేడా అంతా ఉంది. *

---

* *ఈ ముందుమాటలోని పేరాలు రచయిత తిరగ రాసిన పరిచయంలో కూడా ఉన్నాయి. 1980వ ముద్రణలోని వివరణ, ఉపోద్ఘాతం, పరిచయాలను కలబోసి మరింత రాజకీయ వ్యాఖ్య చేర్చి 1981 ఆగస్టులో రచయిత రాసిన 'పరిచయాన్ని' ముందు చూడొచ్చు.*

# ఉపోద్ఘాతము*

ఈ పుస్తకంలో వర్ణించిన సంఘటనలంత రసవత్తరంగానే, ఈ పుస్తక రచన ప్రచురణల కథనం కూడా సాగింది. 1972లో ఒక ఆంగ్ల వార్తా పత్రిక విలేకరిగా ఉన్నప్పుడు ఒక ప్రచురణ కర్త దీన్ని రాయమన్నాడు.

చిత్తు ప్రతి రాయడంలోనే మొదటి గుణపాఠం వచ్చింది. ప్రతిని తయారు చేసి ప్రచురణకర్తల పరిశీలనకిచ్చినా, దాన్ని రూపొందించేప్పుడు దొలిచిన సందేహాలు నన్ను వెన్నాడుతూనే ఉన్నాయి. నేను వర్ణించిన ప్రజలు, సంఘటనల తాలూకు కథనానికి న్యాయం చేకూర్చాలంటే, పాత్రికేయునిగా నాకున్న ప్రతిభావ్యుత్పత్తులు మాత్రమే చాలా? ఏదైనా ఉద్యమాన్ని గూర్చి రాసి. దూరంగా ఉండి కీర్తిస్తే సరిపోతుందా?

మరింత లోతుగా అధ్యయనం చేయాలనే తపన, ఇంకా నిబద్ధం కావాలనే కోరిక; చుట్టూ పట్టి పీడించే రాజకీయ వాస్తవాలు నాలో రేకేత్తించగా, సి.పి.ఐ. (మా.లె.) పార్టీ దిశలోకి ముందుకు పోయిన నేను అనతికాలంలోనే ఆ పార్టీ కార్యకర్తల ముంగిట వాలాను.

బీద రైతులతో ఉండి, వాళ్ల సాహసాల్లో పాలు పంచుకునే మరుపు రాని అనుభవం; వాళ్ల సమస్యల్ని సిద్ధాంతాల్ని నూతన కోణంలో చూచే అమూల్యావకాశాన్నిచ్చింది. మొత్తం సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమ చరిత్రనే మరో కొత్త కోణంలోంచి నేను చూడగలిగేందుకు అది సాయపడింది.

ఆయా సమాచారం సూచించిన రాజకీయ, ఆర్థిక వైఖరులు, తరువాత కాలంలో పరిణతి చెందాయి. ఎలాంటి అసమ్మతినైనా అణిచేందుకై పాలక వర్గాలు తీసుకున్న

* *రచయిత 1981 ఆగస్టులో తిరగ రాసిన 'పరిచయం'లో దీన్ని కొద్ది మార్పులతో విలీనం చేసాడు. పాఠకులు తేడాలతో పాటు అనువాదంలో తేడాను కూడా గమనిస్తారు. దాని ద్వారా రచయిత భావం మరింత వివరించడమే నా ఆశయం – అను.*

ఎమర్జెన్సీ చర్య తాలూకు ఛాయలు వాటిలో పాఠకులకు కనిపిస్తాయి. చివరి అధ్యాయం ముగింపులో వెలిబుచ్చిన ఆశల పునాదులన్నీ నేటికీ మౌలికంగా బలంగానే ఉన్నాయి. 1977 ఎన్నికలు తవ్వి తలకెత్తిందేమీ లేదు.

చరిత్రకుండే లక్షణాలైనా అసమగ్రత, రేఖాత్మకంగానే ఉండడం, అసంపూర్ణతలు దీనికీ ఉన్నాయి. ఉద్యమంలో పాల్గొన్న వీరుల జీవితాలు సంఘటనల పరంపరలో తుంచుకుపోయాయి. ఎందరో పూర్తిగా కథ చెప్పకుండానే అమరులయ్యారు. మిగిలిన వాళ్లు పరస్పరం నిందించుకునే ప్రత్యర్థి కూటమిలలో ఉండి ఖండించుకుంటున్న మూలంగా కథనానికి నిర్ధారింపు సాధ్యం కావడం లేదు. మరికొందరి జ్ఞాపకాల పుటలలో, వదంతులు, వక్రభాష్యాలు, పచ్చి అబద్ధాల పుట్టలలో వాస్తవాలు కలిసిపోయాయి.

ఇందులో వివరించిన కొన్ని సంగతులు నేను విలేకరిగా గమనించినవి. మరికొన్ని ఉద్యమ నిర్వాహకులతోనూ, వాటిని అణిచేందుకు నియమితులైన సన్నాహకులతోనూ జరిపిన సంభాషణల ద్వారా రూపొందించినవి. 1973 చివరిదాకా నేను పనిచేసిన ఆంగ్ల పత్రిక ప్రతినిధిగా రెండవ వర్గం వారిని కలిసే వీలు కలిగింది. కాని చాలా భాగం సి.పి.ఐ. (మా.లె.) ముద్రిత అముద్రిత పత్రాల ద్వారా రూపొందించబడినదే.

ప్రకాశకుల దగ్గరున్న నా రాత ప్రతి సమగ్రత లోపించి, తప్పుల తడకగా అనిపించింది. కొత్త అనుభవాలు, సమాచారపు వెలుగులో మొత్తం తిరగరాసారు. 1974 చివరికి మరో ప్రతిని రూపొందించాను.

కాని ప్రచురణ సాగకుండా కొత్త అవాంతరాలొచ్చి పడ్డాయి. జూన్ 1975లో ఎమర్జెన్సీ ప్రకటించాక జరిగిన నా అరెస్టు మూలాన, చట్టాన్ని సాకు చేసుకుని దాన్ని సాకే తొత్తుల వాత పడకుండా, రాత ప్రతిని చీకటి కోణాల్లో నిద్ర పుచ్చువలసి వచ్చింది.

1977లో ఎమర్జెన్సీ ఎత్తివేశాక ఎన్నికల తరువాత వచ్చిన మార్పులతో రాత ప్రతి ముద్రణకు నోచుకునే వీలుకలిగింది. ప్రస్తుత ప్రచురణ కర్తలైన నా స్నేహితులు ముందుకొచ్చారు కాని మళ్లీ కొత్త చిక్కులు. ప్రెస్సుకై వేట, కలకత్తా ముద్రణా పరిశ్రమలో సాగిన దీర్ఘకాలిక సమ్మె, సర్వాంతర్యామిగా వచ్చిన కరెంటు కోత సరేసరి. దాంతో పుస్తకాన్ని రూపొందించిన ఎంతో కాలం తరవాత అది వెలువడుతోంది. దీని ప్రచురణలో వచ్చిన అవాంతరాలకు ఇందులోని ముద్రారాక్షసాలే ప్రత్యక్ష సాక్షులు.

కొన్ని స్వల్ప మార్పులతో 1974లో రూపొందించిన రెండో ప్రతినే మీ ముందుంచుతున్నాను. ఆఖరి అధ్యాయంలో పేర్కొన్న సమాచారం. అంకెలు 1974

వరకే వర్తిస్తాయి. ప్రచురించే ముందు ప్రతిని మళ్లీ చదవగా వాటిని సవరించడం అనవసరమని తోచింది.

మనకు ఎంతో సమకాలీనమైనవీ, గజిబిజిగా కనిపించే ఈ సంఘటనల తాలూకు కథనం తరువాత సమాచారం వల్ల భంగ పడవచ్చు. ఇందులో చేసిన నిర్ణయాలు తరువాతి సమాచారం మూలంగా వ్యతిరిక్తం కావచ్చు. కాని అత్యంత ముఖ్యమూ, ఉత్సాహభరితమైన ఈ కథనాన్ని వివరాలన్నీ నిండేదాకా రుజువులన్నీ పండేదాకా ఆపడం అసాధ్యం. దాని సంగతి భావిచరిత్రకారులే చూసుకుంటారు. *

---

* ఇంగ్లీషు ప్రతిలోని అచ్చుతప్పుల గురించి తరువాతి చివరి పేరాలో రచయిత వివరించాడు. అను.

# పరిచయం*

"గెలిచినా ఓడినా - శత్రువుపై చేసిన యుద్ధాలు -"

- ఛే గువేరా

'ప్రపంచానికో సందేశం' 1967

"కలలు కనలేనివాడు, ఇతరులను కలలో
ముంచెత్త లేనివాడు, విప్లవకారుడు కాలేడు."

- చారుమజుందారు

('నక్సల్బరీ శిక్షా'లో ఉదహరించబడినది)

మనదేశపు ఈశాన్యపు కొసనున్న 'నక్సల్బరీ'లో 1967 మే నెలలో ఒక రైతాంగ తిరుగుబాటు జరిగింది. పశ్చిమాన నేపాలు, ఉత్తరాన సిక్కిం, భూటాన్లు, దక్షిణాన తూర్పు పాకిస్తాను హద్దులుగా ఉన్న ఈ ప్రాంతంలోని తిరుగుబాటును నాటిదాకా మార్క్సిస్టు పార్టీ సభ్యులుగానే కొనసాగుతున్న కమ్యూనిస్టు విప్లవకారుల ఆధ్వర్యంలో జరిగింది. తరువాత వాళ్లు ఆ పార్టీ నుంచి తెగతెంపులు చేసుకొని సి.పి.ఐ. (మా.లె.) పార్టీని ఏర్పరచుకున్నారు.

పోలీసులు ఆ తిరుగుబాటును కొద్ది నెలల్లోగానే అణగ ద్రొక్కారు. కాని ఆ తరువాత భారతీయ గ్రామీణ ప్రాంతం మునుపటిలా లేదు. తరతరాలుగా పీడనకు గురైన భారత రైతాంగ ప్రజలు తమ వీరోచిత సాంప్రదాయాన్ని వెలికి తెచ్చుకుని గుర్తించారు. ఈ పుస్తకంలో ప్రధానంగా వర్ణించిన 1967-72 కథా కాలంలో దేశంలో చాలా చోట్ల భూస్వామ్య వర్గాలను నిరోధించిన అట్టి రైతాంగ తిరుగుబాట్లు చాలా జరిగాయి. భూస్వామ్య వర్గాలకు మద్దతుగా పంపిన పోలీసులనూ, సైన్యాన్నీ కూడా ఎదిరించి

---

* *1980లో మొదటి ఆంగ్ల ముద్రణలోని 'పరిచయం' రచయిత నవంబరు, 1974లో రాసినవి. తరువాత ఆగస్టు 1981లో రచయిత, ఈ ముందుమాటను మరింత పెంచి రాసాడు. - అను*

సి.పి.ఐ. (మా.లె.) నాయకత్వంలో పోరాటాలు సాగించారు. దుస్సహసమైన పీడన నుంచీ సాంఘిక అవమానం నుంచీ విముక్తి చెందాలనే తపనకు ఆ పోరాటాలే నిదర్శనం. గ్రామసీమల్లో విముక్తి ప్రాంతాల నేర్పరిచి, పాలకవర్గాల నుంచి రాజ్యాధికారాన్ని పట్టుకోవాలనే సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కార్యక్రమానికి కూడా అవి ప్రాతినిధ్యం వహించాయి. పార్టీబలం దేశంలోని కొద్ది ప్రాంతాలకే పరిమితమైనా, సి.పి.ఐ. (మా.లె.) భావజాలం మాత్రం భారత సామాజిక రాజకీయ జీవనంలోకి చొచ్చుకుపోయింది. దేశంలో యథాస్థితిపై ఏ దాడికైనా (నక్సల్బరీ నుండి రూపొందిన) 'నక్సలైట్' పదం సంకేతంగా నిలిచింది. ఫిలిప్పైన్స్ దేశపు 'హక్' లాగా, పాలెస్తినా 'ఆల్‌ఫటా' లాగా, ఉరుగ్వే దేశపు 'తుపామరోస్' వలె, ఈ పదం కూడా ప్రపంచ విప్లవపు వినూత్న పదజాలంలో చోటు చేసుకుంది. దేశంలో వాడుక భాషలో నిలిచి పోయింది.

1967లో నిర్దేశించుకున్న బాట నుంచి తరచు అతిక్రమిస్తూ, వైదొలగుతూ సాగిన ఉద్యమం, 1972 నాటి ఎదురు దెబ్బతో ఒక దశను ముగించుకున్నది. 'నక్సలైటు బెడద'గా (పోలీసుల పరిభాషలో) పేర్కొనే ఈ ఉద్యమం భారత వామపక్ష చరిత్రలో మరో వీరోచితమైన ఆశగానే, విఫలమైన జ్ఞాపకంగానే నిలిచిపోతుందా? లేదా విజయవంతమయ్యే కమ్యూనిస్టు విప్లవానికి నాందిగా నిలుస్తుందా?

ఈ ఉద్యమానికి అంతిమ వ్యాఖ్యలు చేసిన వారందరూ పొరబడ్డారనే రుజువైంది. దేశంలో ఒక ప్రాంతంలో ఉద్యమాన్ని అణచగానే మరో మారుమూల సంబంధం లేని చోట తలెత్తేది. నక్సల్బరీ, శ్రీకాకుళం, వెంటనే దేబ్రా–గోపీవల్లభపూరు, ఆవెంట భీర్భం, తరవాత భోజపూర్–ఇలా అనేకచోట్ల నాటికీ నేటికీ సి.పి.ఐ. (మా.లె.) గెరిల్లాలు దమనాత్మక భూస్వామ్య పాలనపై పోరాటాన్ని సాగిస్తూనే ఉన్నారు.

1972 నాటి ఎదురుదెబ్బ మూలంగా; ఈ ఉద్యమాన్ని లేవదీసిన ప్రజా సంక్షోభాన్ని కాని, సాయుధ పోరాటపు ఆవశ్యకతను కాని ఏవిధంగానూ కొట్టిపారేసే అవసరం లేదు. తీక్షణమైన చూపులు, బక్క పల్చటి శరీరం కల చారుమజుందారు ఈ ఉద్యమ సారథిగా నిలిచాడు. కార్డాయిక్ ఆస్త్మావ్యాధి పీడితుడై దుర్భర పోలీసు చిత్రవధ మూలంగా చనిపోయిన చారుబాబు ఎప్పుడూ ఇలా అనేవాడు "ఏ మాట నశించదు. ఇవాళ మనం చెపుతున్నది; ఈ క్షణాన ప్రజలు ఒప్పుకోక పోవచ్చు. కాని మన ప్రచారం ఊరికే పోదు. మన మాటలు ప్రజలలో శాశ్వతంగా నిలిచిపోతాయి". *

* *'నక్సల్బరీ శిక్షా, (నక్సల్బరీ గుణ పాఠాలు) నుంచి ఉదాహరించబడినది – సి.పి.ఐ. (మా.లె.) ఎన్.బి.బి.ఆర్.సి. ప్రచురణ.*

1972 నాటి ఎదురుదెబ్బకు చాలా వరకు బాధ్యుడైన చారుమజుందారు సరైన నాయకత్వం ఇవ్వడంలో తరచు విఫలమైనా, అతని భావాలు మాత్రం శాశ్వతంగా నిలిచాయి. భూస్వామ్య వ్యవస్థను వలసవాదాన్ని ఎదుర్కొనేందుకు భారత పాలక వర్గాలు కూడా అతని వేషాన్ని ధరిస్తూనే అతన్ని దుయ్యబట్టారు. *

భారత రాజ్యయంత్రం నెరపిన మిక్కిలి దమనాత్మకమైన అణచివేతను కూడా తట్టుకుని నిలబడ్డ సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమపు, చేవను గుర్తించిన పాలక వర్గాల బెంబేలుకు చిహ్నంగానే వాళ్ళు కలవరపడుతూ 'నక్సలైట్ల'ను కించపరుస్తారు. భారత దేశీయాంగ శాఖ ఉపమంత్రి ఏప్రిలు 1, 1981న పార్లమెంటుకు తాజా పరిస్థితిని నివేదిస్తూ "నక్సలైట్లు చాలా ప్రాంతాలలో హింసాపూరితమైన చర్యలకు పాల్పడుతున్నారు. హత్య, దోపిడీ, పోలీసులపైనా ప్రభుత్వాధికారులపైనా దాడి చేయడం లాంటి చర్యలు తలపెడుతున్నారు" ఇదివరకులాగే సి.పి.ఐ. (మా.లె.) పార్టీపై ప్రభుత్వం గందరగోళంగా దుష్ప్రచారం సాగిస్తోంది. తరతరాలుగా బీద రైతుల ఆక్రందనల్ని కుత్తుకలోనే నొక్కాలనుకుంటోంది. భూస్వామ్య పాలనకు స్వస్థిచెప్పి, తమదైన రాజ్యాన్ని స్థాపించుకునేందుకు వారు నెరపే పోరాటాన్ని మొగ్గలోనే తుంచాలని చూస్తోంది. ఈ దోపిడీ వ్యవస్థను అంతం చేసేందుకై ఎంతో సాహసంతో ముందుకు దూకిన పీడిత ప్రజల వీరోచిత ధోరణిని పచ్చి అబద్ధాల మురికి తెరల మాటుకు నెట్టి, వాళ్ళ త్యాగానికి దుర్గంధాన్ని పూయాలని చూస్తోంది.

సి.పి.ఐ. (మా.లె.) విప్లవోద్యమం నిరాటంకంగానే కొనసాగుతుంది. భూస్వామ్య దోపిడీ, గ్రామీణ దారిద్ర్యం, వీటినెదిరించే గ్రామీణ పీడిత ప్రజలపై దమన చర్యలు, రెండు అగ్రరాజ్యాలకూ తొత్తుగా వ్యవహరించే దేశ విధానం మొ॥ మౌలిక కారణాలు కొనసాగినంత కాలం, మరింతగా అవి విషమించినంత కాలం. ఈ ఉద్యమం కూడా అవిచ్ఛిన్నంగానే కొనసాగుతుంది.

నాటి (1960ల చివరి) అంతర్జాతీయ పరిస్థితిపై సరైన అవగాహన లేకుండా, దాన్నించి విడివడి, సి.పి.ఐ. (మా.లె.) విప్లవోద్యమ తీరును అవగాహన చేసుకోలేం. 60ల చివరిలో నక్సల్బరీ పోరాటం వెల్లువలా ముందుకొచ్చిన భారత విప్లవోద్యమ కాలంలోనే ఐరోపా, ఆసియా, లాటిన్ అమెరికాలలో కూడా విరోచిత పోరాటాలు తలెత్తాయి. మార్పును మళ్ళా తరచి చూచి, విప్లవాత్మక మానవతావాదాన్ని కనుగొనే

---

* *ఇంతటితో నవంబరు '74 పరిచయం ముగిసినట్టే. తరువాత వచ్చే మరో రెండు పేరాలు ముందు సూచించాను – అను.*

ప్రయత్నాలు జరిగాయి. ఒక ఆశయం కోసం ప్రాణాల్నే బలిపెట్టే ధైర్యం, ఆకాంక్షను రేకెత్తించే ఆశయాలను నిలబెట్టే ప్రయత్నాలు జరిగాయి. కమ్యూనిస్టులను, అరాచకవాదులనూ కూడా ప్రభావితం చేసిన విప్లవోద్యమాల తొలిదినాల నిజాయితీని త్యాగబుద్ధిని పునరుజ్జీవించే ధోరణులు కనిపించాయి. రాజకీయ విధానాల అవకాశ వాదాన్ని నిరసించి, నీతికి ప్రాధాన్యమిచ్చే పౌరహక్కుల ఆందోళనలు, యుద్ధవ్యతిరేక ప్రదర్శనలు అమెరికాలో జరిగాయి. పశ్చిమ యూరోపియన్ పాలకవర్గాలు అరచేత చూపిన భోగభాగ్యాలను కాలదన్ని, వ్యవస్థ చట్రంలో చక్కగా ఇమిడిపోయిన వామపక్షాల బ్యూరోక్రటిక్ జడత్వాన్ని నిరసిస్తూ విద్యార్థి ఉద్యమాలు లేచాయి. స్వయంపాలన, స్వయం ప్రాతినిధ్యం వంటి గతకాలపు సోషలిస్టు ఆశయాలకై అర్రులు చాచారు.

దేశదేశాల విప్లవకారుల సమైక్యతను వాంఛించే గతకాలపు మధురానుభూతికై బొలీవియా దుర్గమారణ్యాలలో బలిదానం చేసిన ఛే గువేరా పోరాటంలో ఆ మహదాశయమే ప్రతిఫలించింది. చైనా సాంస్కృతిక విప్లవపు తొలిదశలలో కూడా (మార్క్సిజం పేరుతో తరువాత జరిగిన పొరపాట్లు, నేరాలు, అత్యాచారాలు కొన్ని జరిగినా) ప్రజలే సర్వాధికారులని, వ్యక్తిని సమూలం మార్చాలనే రూసో* మహాశయుని మహోన్నతాశయాన్ని సాధించాలనే సదుద్దేశ్యమే కనిపించింది.

విప్లవాత్మక భావవాదపు లోతులను తాకేందుకు ప్రపంచవ్యాప్తంగా సాగిన ఉద్యమంలో నక్సల్బరీ ఉద్యమం కూడా అంతర్భాగమే. తృతీయ ప్రపంచంలో సామ్రాజ్యవాదంపై భూస్వామ్య దమననీతిపై ఎదురు నిలిచి పోరాడిన సాంప్రదాయం గల రైతాంగాన్ని జాగృతం చేస్తేనే విప్లవాలు విజయవంతమౌతాయనే ధోరణిని నక్సల్బరీ నిరూపించింది. 18, 19 శతాబ్దాల రైతాంగ తిరుగుబాట్ల నుంచి. 1940లలో కమ్యూనిస్టులు నిర్వహించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల నుంచి ఉత్తేజం పొందింది. రైతాంగం తాముగా పోరాడతారని, ప్రాంతీయ ప్రాతిపదికపై అధికారాన్ని పట్టుకొని గ్రామ సోవియట్లు స్థాపించాలనే ధ్యేయంతో ఉద్యమించి, పార్లమెంటరీ వృత్తివాద ప్రతిపక్ష వాదాన్ని నిరసించింది. 20వ శతాబ్దపు బూర్జువా ప్రజాస్వామ్య సంస్థలను నిరాకరించింది. భూస్వాములు, ప్రభుత్వాధికారుల వాతబడని స్వతంత్ర గ్రామజీవనమనే రైతాంగపు భూతల స్వర్గపు తీపి కలలను నిజం చేసేందుకు నడుం కట్టింది.

---

* *ఫ్రెంచి తత్త్వవేత్త. వ్యక్తిస్వేచ్ఛను, ప్రజాసర్వ సహాధికారాన్ని (Popular Soveriegnity) ప్రతిపాదించాడు... రాబోయే ఫ్రెంచి విప్లవానికి (1789) సైద్ధాంతిక పునాదిని కల్పించాడు – అను.*

రైతాంగపు విప్లవ శక్తిపైనే నమ్మకంతో పనిచేసే ఈ రాజకీయ ధోరణి, నాటికే రాష్ట్ర ప్రభుత్వాలలో యధాస్థితిని పదిలంగా కాపాడుతూ బూర్జువా వ్యవస్థకే అంకితమై పబ్బం గడుపుకుంటున్న వామపక్షాల కన్నెర్రకు కారణమైంది. వాటి సైద్ధాంతిక దివాళాకోరుతనాన్ని బట్టబయలు చేసింది. కొన్ని సంవత్సరాలుగా దేశంలోని మార్క్సిస్టు ఉద్యమంలో కొరవడిన నిజాయితీ, మానవతా దృష్టి; నక్సల్బరీ ఉద్యమనాయకుల కార్యకర్తల ధైర్యం, త్యాగనిరతి, ద్వారా మళ్ళీ నెలకొన్నాయి.

పూర్తిగా రైతాంగ లక్షణాన్నే సంతరించుకున్న ఈ ఉద్యమం దేశంలోని ఇతర ప్రధాన ప్రజావర్గాలను సమీకరించలేనందున చేవను కోల్పోయిందనే చెప్పాలి. పశ్చిమాన నూతన వామపక్ష ధోరణులనుంచి, చైనాలో వచ్చిన సాంస్కృతిక విప్లవం దాకా విస్తరించిన సమకాలీన ప్రపంచోద్యమాలలాగే, ఇది కూడా ప్రపంచ మార్క్సిస్టు ఉద్యమంలో తలెత్తి దాన్ని నీరసింపజేసిన పిడివాదపు ధోరణుల నుంచి కాని; రాజ్యశక్తిని పట్టుకోవాలనే తక్షణ వ్యూహాన్ని కాని అధిగమించలేకపోయింది. కమ్యూనిస్టు పార్టీలో ఉండాలని ఆశించిన ప్రజాస్వామిక ధోరణి కాని, వ్యతిరేకతను సహించడం కాని, కొరవడినందున ఉద్యమంలో ఎన్నో చీలికలు వచ్చాయి. పోల్‌పాట్ ద్వారా కంపూచియాలో తలెత్తిన అమానుష ధోరణులతో దిగజారిన* మావోయిజానికి సరైన వ్యాఖ్యానం గురించికాని, విప్లవం తరువాతి సమాజాలలో తలెత్తే అసమానతలు, బాధలు పట్ల సరైన విశ్లేషణ. దేశంలోని మార్క్సిస్టు–లెనినిస్టు వర్గాలలో ఇంకా జరగలేదు. కాని అటువంటి పొరపాట్లు జరగకుండా ఉండేందుకు మొదటినుంచి వాటిపట్ల జాగ్రత్త అవసరం. మార్క్సు కమ్యూనిస్టుల నాశించినట్టు “.... వర్తమాన ఉద్యమ క్రమంలో వారు ఆ ఉద్యమం భవిష్యత్తుకు కూడా ప్రాతినిధ్యం వహిస్తారు” (కమ్యూనిస్టు మానిఫెస్టో)**

ఏమైనప్పటికీ దేశంలోని వివిధ పార్లమెంటరీ పక్షాలు ప్రతిపాదించిన వందలాది కార్యాచరణ ప్రణాళికల కంటే ఎంతో ప్రముకమైన సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమం మాత్రం ఎంతో మహత్తరమైనది. ఏకైక రాజకీయ వాస్తవ పరిణామం. మహత్తర చారిత్రక చర్య. ఈ మొలకకు దోహదం చేసిన కారణాలింకా అశాంతి, తిరుగుబాట్లు

---

* రచయిత అభిప్రాయం పాఠకుల్ని తికమక పెట్టేదిగా ఉంది. కంపూచియాలో నాటి స్థితి గురించిన నిజాలన్నీ ఒకేలా లేవు–అను.

** కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక, అనువాదం: ఇంగువ మల్లిఖార్జున శర్మ, విప్లవ సందేశం ప్రచురణ, హైదరాబాదు, పే. 48.

ఉన్నాయి. వాటి దృష్ట్యానైనా, ఈ ఉద్యమ వివిధ దశల వెలుగులో దేశంలో రాజకీయ మార్పులను తెచ్చే సిద్ధాంతాలను విశ్లేషించి, ఉద్యమాన్ని సమీక్షించవలసిన అవసరం ఎంతైనా ఉంది. *

ఈ పుస్తకంలో వర్ణించిన సంఘటనలలాగే, ఈ పుస్తకరచన, ప్రచురణన, కథనం కూడా రసవత్తరంగానే గడిచింది. 1972లో నేనో ఇంగ్లీషు వార్తాపత్రికకు విలేకరిగా ఢిల్లీలో ఉండగా ఓ ప్రచురణకర్త దీన్ని రాయమన్నాడు.

చిత్తు ప్రతిరాయడంలోనే మొదటి పాఠం వంట బట్టింది. రాతప్రతిని పబ్లిషర్ల కిచ్చాక కూడా దాన్ని రాసేటప్పుడు తలెత్తిన సందేహాలు వెన్నాడసాగాయి. నేను రాసిన సంఘటనలు, ప్రజల గురించి చెప్పేందుకు పాత్రికేయునిగా నాకున్న ప్రతిభావ్యుత్పత్తులు మాత్రమే చాలా? ఏదైనా ఉద్యమాన్ని గురించి రాసి దూరాన్నించి కీర్తిస్తే సరిపోతుందా?

ఇంకా లోతుగా తరచి చూడాలనే తపనకు మరింత నిబద్ధం కావాలనే తపన తోడైంది. చుట్టూ పట్టిపీడించే రాజకీయ వాస్తవాలు వాటిని నాలో రేకెత్తించాయి. సి.పి.ఐ. (మా.లె.) పార్టీదిశలో ముందుకు పోయాను. త్వరలోనే కార్యకర్తల సమక్షంలోకి చొచ్చుకుపోయాను.

బీద రైతులతో గడిపి, వాళ్ల సాహసచర్యల్లో పాల్గొనడమనేది మరువలేని అనుభవం. దీనివల్ల వాళ్ళ సమస్యల్ని సిద్ధాంతాల్ని మరోకొత్త కోణంలోంచి చూచే అమూల్యావకాశం దొరికింది. మొత్తం సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమ చరిత్రనే నూతన దృక్పథంతో చూడగలిగాను.

ప్రచురణ కర్తల దగ్గరున్న నా రాతప్రతిలో సమగ్రత లోపించినదని, తప్పులు దొర్లాయని అనిపించింది. కొత్త అనుభవాలు, సమాచారాల దృష్ట్యా మొత్తం తిరగరాసాను. 1974 చివరకు దాన్ని రూపొందించాను. జూన్ 1975లో ఎమర్జెన్సీ వచ్చింది. నేను అరెస్టయ్యాను. చట్టాన్ని పరిరక్షించే పాలకవర్గపు తొత్తుల వాతబడకుండా రాతప్రతిని చీకటికోణాల్లో నిద్రపుచ్చాను. 1977లో ఎమర్జన్సీ ఎత్తివేయడం, ఎన్నికల తర్వాత వచ్చిన మార్పుల దృష్ట్యా పుస్తకం అచ్చుకు నోచుకుంది. 1980లో ఇది మనదేశంలో 'In the wake of Naxalbari' అనే పేరుతో ప్రచురితమైంది.

ప్రస్తుత పుస్తకానికీ 1980 ఇండియన్ ఎడిషనుకూ ఏమీ తేడాలేదు. చివరి అధ్యాయంలో మాత్రం కొన్ని అంకెలను తాజా సమాచారం దృష్ట్యా సవరించాను.

* 1974 పరిచయంలోని చివరి రెండు పేరాలను రచయిత పై పేరాగా తిరగ రాసాడు.

పదజాలానికి సంబంధించిన పట్టికను ఇచ్చాను.*

అసమగ్రత, రేఖాత్మకంగానే ఉండడం చరిత్ర లక్షణం. అలాంటి అసంపూర్ణత దీనికీ ఉంది. సంఘటనల పరంపరలో ఉద్యమవీరుల జీవితాలు తుంచుకు పోయాయి. చాలామంది పూర్తి కథను చెప్పకుండానే అమరులయ్యారు. మిగిలిన వాళ్ళు పరస్పరం దుమ్మెత్తుకుంటూనే వేరు వేరు కూటమిలుగా విడిపోయి, ఒకర్నొకరు ఖండిస్తున్నారు. అందువల్ల కథనంలో నిర్ధారింపు సాధ్యపడడం లేదు. మరికొందరు స్మృతుల్లో వదంతులు, వక్రభాష్యాలు, పచ్చి అబద్ధాలతో, నిజాలు పెనవేసుకుపోయాయి.

ఇందులో చెప్పిన సంగతులు కొన్ని నేను విలేకరిగా గమనించినవి. మరికొన్ని ఉద్యమ నిర్వాహకులతోనూ, వాటిని అణించేందుకు నియమితులైన సన్నాహకులతోనూ (పోలీసు వర్గాలు – అను) జరిపిన సంభాషణల ఆధారంగా రూపొందించినవి. 1973 చివరిదాకా నేను పనిచేసిన ఆంగ్ల పత్రిక విలేకరిగా రెండవ వర్గంవారిని కలిసే అవకాశం కలిగింది. అయినా చాలా భాగం మాత్రం సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ప్రకటించిన, ప్రకటించని పత్రాల ఆధారంగా రూపొందించాను.

ఈ పుస్తకంలో ఉదహరించిన సి.పి.ఐ. (మా.లె.) పార్టీ పత్రాలు చాలావరకు బెంగాలీ, హిందీ, తెలుగు భాషల నుంచి అనువదించినవే. వాటిలో కొన్ని పార్టీ పత్రిక 'లిబరేషన్'లో ఆంగ్లంలో వచ్చాయి. కొన్నిచోట్ల వాటిని అనువదించడంలో తీసుకున్న స్వేచ్ఛ దృష్ట్యా, నేను వాటిని నేరుగా ఇంగ్లీషులోకి అనువదించో, ఇతరులచే అనువదింపజేసికాని, అధికార తర్జుమాలకు బదులుగా, వాటిని వాడాను.

మనకు ఎంతో సమకాలీనమైనవీ, గజిబిజిగా అనిపించే ఈ సంఘటనల తాలూకు కథనం తరువాతి సమాచారం ద్వారా వమ్ముకావచ్చు. ఇందులోని నిర్ణయాలు తరువాతి సమాచారం వల్ల కొట్టివేయబడవచ్చు. కాని అత్యంతాసక్తికరమైన ఈ కథనాన్ని వివరాలన్నీ నిండేదాకా, రుజువులన్నీ పండేదాకా ఆపడం కుదరదు. నిజానిజాల నిగ్గుతేల్చే పనిని భావి చరిత్రకారులకే వదులుదాం.

**– సుమంతా బెనర్జీ**

ఆగస్టు 1981

---

* *ఈ అనువాదం విషయంలో ఇది వర్తించదు. రచయిత ప్రతిపాదించిన (ప్రధానంగా ఎడిటింగ్‌కు చెందిన, అప్రధానమైన, రాజకీయపరమైన) కొన్ని భాగాలను మొత్తం 10 పేజీలలోపు కొట్టివేసి, ఒకటి రెండు వాక్యాలను చేర్చడం జరిగింది. స్థల విస్తరణ భీతివల్ల పదజాల పట్టికను చేర్చలేదు – అను.*

# అనువాదకుని ముందుమాట

ఈ పుస్తక రచనలో రచయిత పడ్డ శ్రమతో పోల్చితే, అనువాదకునిగా నేను ఎదుర్కొన్న సమస్యలు లెక్కలోనివి కావు. అవి చాలా వరకూ హార్ధికమైనవీ, ఆర్థికమైనవీ. ఎంతో విలువైన సమాచారాన్ని చాలామందికి అందించాలనే వెర్రికోరికతోనే నేనీ పనికి నడుం కట్టాను కాని, అనువాదకునిగా, నా మీద నాకున్న వెర్రినమ్మకంతో ఎంత మాత్రమూ కాదు. ఏ వర్గం వాళ్ళ సాహిత్యాన్ని ఆ వర్గం వాళ్ళే సృష్టించుకుంటారు కనుక; ఇలాంటివి తెలుగులో ప్రచురించాలనుకునే వాళ్లు ఇంకా వర్గంగా రూపొందనందున, దీని ప్రచురణ బాధ్యతను కూడా నేనే చేపట్టవలసి వచ్చింది.

వీలైనంతవరకు దీన్ని ఆంగ్లమూలానికి మక్కికి మక్కీ అనువాదంగానే రూపొందించాను. స్వేచ్ఛానువాదం చేస్తే ఇంతకంటె అందంగా ఉండొచ్చుకాని, భావానికి న్యాయం చేకూర్చలేమోనని అందుకు సాహసించలేదు. అందుకని వాక్యాన్ని పూరించేందుకు తెలుగు మాటలను తెగించి చేర్చి తెనిగించేటప్పుడు, ఆయా మాటలను బ్రాకెట్లలో (ముఖ్యమనిపించిన చోట్ల) సూచించాను. రచయిత వివరణలకు తోడు, అవసరమనిపించిన చోట నేను కూడా వివరాలను సేకరించి జేర్చాను. కొన్ని చోట్ల రచయితనే వివరించాను.

నేను తయారు చేసిన అనువాదపు రాతప్రతిని కొందరు సహవాసులే కాక కా॥ వరవరరావుగారు కూడా చదివి పరిష్కరించారు. భాషలోకాని, భావంలోకాని, సొబగులేవైనా ఉంటే వారూ, ఇన్ని కళ్ళు కప్పి అచ్చులోకొచ్చిన లోపాలకు నేనూ బాధ్యులమని మనవి చేస్తున్నాను.


పాఠకులను తికమకపెట్టే కొన్ని అచ్చుతప్పులు సాంకేతిక కారణాల వల్ల చొచ్చుకుపోయాయి. 40వ పేజీ మళ్ళీ 41వ పేజీగా అచ్చయింది. అలాగే 431వ పేజీలోని అధోసూచికలోని మొదటి పంక్తి (ఇంగ్లీషుది) (రాత ప్రతిలోని సూచన) పొరపాటున అచ్చయింది. మిగిలిన తప్పులను తప్పొప్పుల పట్టికలో సూచించాను.

దాదాపు సంవత్సరానికి మించి జరిగిన ఆలస్యానికి ఎంతో ఆసక్తితో ముందే డబ్బు పంపిన పాఠకులు, పుస్తక విక్రేతలు క్షమిస్తారని ఆశిస్తున్నాను. ఆర్థిక కారణాలకు తోడు, దినదినం గడంగా, వ్యవస్థ అస్తవ్యస్తతకు ప్రతీకగా నిలిచిన భాగ్యనగరపు ట్రాఫిక్‌రద్దీలో, 1982 మార్చిలో నాకు జరిగిన ప్రమాదకారణంగా కాలుకి దెబ్బ తగిలి నాలుగు నెలల పాటు మంచానికే అంకితమైపోవడం కూడా ఈ ఆలస్యానికి కొంత కారణం.

నా వేధింపును ఓర్పుతో భరించి నేర్పుగా అచ్చుపని చేసిన ఆవేర్ ప్రింటింగ్ ప్రెస్సు వారికీ, అడిగిన వెంటనే భావగర్భితమైన ముఖచిత్రాన్ని తీర్చి ఇచ్చిన శ్రీ చంద్రగారికీ, దాన్ని మరింత అందంగా అచ్చు వేసిన అనుపమా ప్రెస్సు వారికీ, ఇవన్నీ ఓ దగ్గరికి చేర్చిన అశోక్ బైండర్సు వారికీ నా కృతజ్ఞతలు. చివరగా, అనువాదపు దశనుండి చివరిదాకా ఈ పుస్తక ప్రచురణలో ఎన్నో విధాలుగా నాకు సాయం చేసిన మిత్రులందరికీ లెక్కలేనన్ని కృతజ్ఞతలు.


**– కృష్ణమూర్తి**

హైదరాబాదు
నవంబరు, 1982





MAP I- 1967-72 కాలంలో సి.పి.ఐ (మా.లె.) పార్టీ కలాప ప్రాంతాలను పశ్చిమ బెంగాలులోనూ దాని పరిసరాలలోనూ సూచించే రాష్ట్ర పటం.

1. సి.పి.ఐ (మా.లె) ఉత్తర బెంగాలు బీహారు సరిహద్దు ప్రాంతీయ కమిటీ.
2. సి.పి.ఐ (మా.లె.) పశ్చిమ బెంగాలు బీహారు సరిహద్దు ప్రాంత కమిటీ.
3. సి.పి.ఐ (మా.లె.) బెంగాలు-బీహార్ ఒరిస్సా సరిహద్దు ప్రాంతీయ కమిటీ.




MAP II- 1969-70 కాలంలో ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లాలోనూ పక్కనున్న ఒరిస్సా రాష్ట్రపు కోరాపుట్ జిల్లాలోనూ గల సి.పి.ఐ(మా.లె.) స్థావరాలను చూపే పటం.




MAP III- 1970లో సి.పి.ఐ (మా.లె.) కలాపాలను సూచించే పటం. 'దేశబ్రతి', (ఏప్రిలు 23, 1970)లోని పటం ఆధారంగా రూపొందించినది.

*I N   T H E   W A K E   O F   N A X A L B A R I*

# రచయిత గురించి....

**సుమంతా బెనర్జీ :** (జననం 1936) కలకత్తాలో. అక్కడే విద్యాభ్యాసం. విద్యార్థిగా స్టూడెంటు ఫెడరేషన్‌లో క్రియాశీల కార్యకర్త. 1960–62 సం॥ రాలలో స్కాటిష్ చర్చి కాలేజీలో ఇంగ్లీషు లెక్చరరుగా పనిచేసి, తరువాత 1973 దాకా స్టేట్సుమన్ పత్రికలో జర్నలిస్టుగా ఉన్నాడు. జర్నలిస్టు యూనియన్ నాయకుడు కూడా. అప్పుడే, India's Monopoly Press ; A Mirror of Distortion (Indian Federation of Working Journalists. New Delhi 1973) అనే పుస్తకాన్ని రాసాడు. '73 లో స్టేట్సుమన్ పత్రిక ప్రత్యేక ప్రతినిధి పదవిని వదలి మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలో జేరాడు. ఎమర్జెన్సీ విధించాక అతనిని గాలిస్తున్న పోలీసులు, అతనిని ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆవరణలో అరెస్టుచేసి, ముషీరాబాద్ (సికింద్రాబాదు) జైలులో పెట్టారు. అదే జైలులో మరణశిక్ష విధించబడి ఉంటున్న భూమయ్య, కిష్టాగౌడ్ లను కలుసుకున్నాడు.✽ ముషీరాబాద్‌నుంచి కలకత్తాకు, తరవాత బర్ద్వాన్ సెంట్రలు జైలుకు తరలించారు. ప్రముఖ మార్క్సిస్టు-లెనినిస్టునాయకుడైన మహాదేవ్ ముఖర్జీతో కలిపి ఆరోపించిన కమాన్‌పూర్ కుట్రకేసులో నిందితుడు. 1976లో జైలునుంచి బెయిలుపై విడుదలయ్యాడు. 1978లో వామపక్షప్రభుత్వం కేసు ఉపసంహరించుకునేదాకా బెయిలుపైనే ఉన్నాడు. ప్రస్తుతనివాసం ఢిల్లీలోనే. దేశీవిదేశీ పత్రికలకు రచనా వ్యాసంగం. వ్యాపకం.

ఇతర రచనలు : Family Planning Communication-A Critique of Indian Programme (Radiant Publishers, New Delhi 1979) Child Labour in India : (Anti-Slavery Society London, 1979)

---

✽ తరువాతి కాలంలో రచయిత భూమయ్య కిష్టాగౌడ్‌ల స్మారకోపన్యాసం ఇచ్చాడు.

# 1. గ్రామాలు

భారతదేశంలో వివిధ భాగాలు అత్యంతమైన ఘర్షణలతో లుకలుకలాడే మిశ్రమపు అనుసమూహాల్లాంటివి.

– గున్నార్ మిర్దాల్, ఆసియన్ డ్రామా.

.... మన దేశంలోని ప్రధాన వైరుధ్యాలన్నింటిలోనూ భూస్వాములకూ రైతాంగానికీ మధ్యగల వైరుధ్యం... అంటే ఫ్యూడలిజానికీ భారతదేశంలో మిగతా జనానికి గల వైరుధ్యమే ప్రస్తుత ఘట్టంలో ప్రధాన వైరుధ్యం.

– భారత కమ్యూనిస్టు పార్టీ (మా.లె.)
16వ అధికరణం

## రైతాంగ పరిస్థితి – 1966–67

బీద రైతాంగంలో పెరుగుతున్న అసంతృప్తి సారాన్ని తమ సిద్ధాంతాలు, కార్యక్రమాలలో భారత కమ్యూనిస్టు పార్టీ (మా.లె.) పరిగణనలోకి తీసుకుంది. అందువల్ల, 1966–67లో భారత రైతాంగ పరిస్థితి యొక్క ముఖ్య అంశాలను మళ్లీ గుర్తుకు తెచ్చుకోవడం ఎంతో అవసరం. నక్సల్బరీ తిరుగుబాటుకు ముందున్న ఈ పరిస్థితే భారతదేశం అంతటా వీరోచిత పోరాటాలకు నాంది పలికింది. పల్లెపట్టు 'కేంద్రం'గా రైతాంగం ప్రధానబలంగా, సి.పి.ఐ. (మా.లె.) 'సాయుధ ప్రజాయుద్ధాన్ని' చేపట్టింది.

1967 మార్చి మధ్యలో బెంగాలీ వార్తాపత్రికలలో మారుమూల ఒక దారుణ వార్త చోటు చేసుకుంది. పశ్చిమ బెనిగాల్ రాష్ట్రంలోని 'బాంగాం' ప్రాంతంలో ధర్మాపూర్ గ్రామంలో ముకుంద సర్కార్ అనే నిరుద్యోగి తన భార్యను ముగ్గురు పిల్లలను పోషించలేక వారిని చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడనే వార్త అది. సర్కార్ చావు వంటి విషయం ఏదో చెదురుముదురుగా జరిగిన సంగతి కాదు. భారతదేశం

పల్లెపట్టులో 1966-67 సంవత్సరాలలో అసంతృప్తి వెల్లువలు వ్యాపిస్తూనే ఉన్నాయి. ఆకలిచావులు, పస్తులుండే రైతుల ఆత్మహత్యలు, అర్ధనగ్నంగా ఉన్న దరిద్రులు, ఆహారపు గిడ్డంగుల దోపిడీలు, కాటక పరిస్థితులు మొదలైన సమాచారాలు పత్రికల వాళ్ళకు అందసాగాయి.

అంతకుముందు (మే 19, 1966) ఢిల్లీ మండువేసవిలో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి తన ఏర్ కండిషన్డు గదిలో పత్రికల వాళ్లనుద్దేశించి మాట్లాడుతూ, దేశంలోని (మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, రాజస్థాన్, పంజాబ్, మహారాష్ట్ర మొ॥) వివిధ రాష్ట్రాలలోనూ 117 జిల్లాల్లో 46.6 మిలియన్ల ప్రజలు "కరువు పరిస్థితుల"కు గురయ్యారని ప్రకటించింది. ఆకలిచావులు మాత్రం లేవంది. పోషకాహార కొరత (malnutrition) వల్ల ఇతర వ్యాధుల వల్ల ఏదో కొందరు ముసలివాళ్లూ ముతకవాళ్ళూ చనిపోయి ఉండవచ్చునని మభ్యపరిచేందుకు ఆవిడ ఎంతో శ్రమపడింది.

సంవత్సరాల తరబడి సరియైన ఆహారం లేక అంగవైకల్యాలు ఏర్పడతాయని ఇందిరాగాంధి విమర్శకులు అన్నారు. పోషకాహార కొరత ఆహార సరఫరాలు సరిగా లేవనేందుకు తగిన నిదర్శనం అన్నారు. ఇది గ్రామాలలో కొత్తకాదు. ప్రజలు పస్తులుండడం వల్ల చచ్చారా, పోషకాహారం లేక చచ్చారా అని రాజకీయవాదులు కోడిగుడ్డుకు వెంట్రుకలు పీకుతూంటే, దేశంలోని బీదా బిక్కీ మాత్రం పస్తులతోనో రోగాలతోనో నిరంతరం చస్తూనే ఉన్నారు.

1967 ఆరంభం నాటికి దేశంలో ఆహార ధాన్యాల కొరత 10 మిలియన్ల టన్నులకు చేరుకుంది. 1967 మార్చి 27న పార్లమెంటుకు నివేదించిన ఆహార ధాన్యాల పరిశీలనా పత్రంలో "రానున్న నెలలో ఆహార పరిస్థితిలో గడ్డు రోజులు రావచ్చునే" హెచ్చరిక ఉంది.

ఆ సంవత్సరం ఏప్రిలు 18వ తేదీన రాష్ట్రంలో మూడో వంతు భాగాన్ని బీహారు ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించింది. దాంతో ఆ గడ్డు జోస్యం నిజమైంది. 1947 ఆగస్టు అధికారమార్పిడి తరవాత ఒక రాష్ట్ర ప్రభుత్వం అలాంటి ప్రకటన చెయ్యడం అదే మొదటిసారి. ఆగస్టు 8న మధ్య ప్రదేశ్ ప్రభుత్వం కూడా తన రాష్ట్రంలో 18 జిల్లాలను కరువు ప్రాంతంగా ప్రకటించింది.

భారత జనపదాల్లో సంవత్సరాల తరబడి విలయతాండవం చేస్తున్న దారిద్ర్యం 1966-67లో ఒక్క పెట్టున పెరిగింది. ఆ పరిస్థితి భారత రైతాంగ వ్యవస్థలోని సంక్షోభాన్ని వేలెత్తి చూపింది. 1967 మార్చిలో పైన పేర్కొన్న ఆహారనివేదిక ఇలా

వివరించింది. వసూలు చేయబడిన ధాన్య సేకరణ చాలా తక్కువగా ఉంది. దిగుమతులు కూడా అంతంత మాత్రంగా ఉన్నాయి. అనావృష్టివల్ల బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో పంటలు దెబ్బతిన్నాయట.

అనావృష్టి ప్రకృతి సిద్ధమైన ఉపద్రవం కావచ్చు. కాని మిగతా లోపాలకు కారణం ప్రభుత్వ విధానాలే. ఆహార ధాన్యాల సేకరణ విషయంలో రాష్ట్రాలు అంచనాలను సాధించలేక పోయాయి. అందుకు చాలా కారణాలున్నాయి. కొన్ని ప్రాంతాలలో పెద్ద రైతులు తమ మిగులు పంటను ప్రభుత్వానికి ఇవ్వడానికి ఇష్టపడలేదు. మిగతా ప్రాంతాలలో లంచగొండితనం, అసమర్థతలకు పుట్టిల్లైన పాలనా యంత్రాంగం స్థానిక బడాభూస్వాములతో లాలూచీ పడిపోయింది. కేంద్ర ఆహారమంత్రి జగ్జీవనరాం 1967 మార్చి 28న పార్లమెంటులో ఆహారధాన్యాల సేకరణ విషయంలో రాష్ట్రాల ఉదాసీన వైఖరిని ఆహార సరఫరాలు సరిగా లేకపోవడానికి ముఖ్యకారణంగా పేర్కొన్నాడు.

## భూమి కౌలు పద్ధతి

1966–67 నాటి ఆహారకొరత మౌలికమైన కారణాలు వేరే ఉన్నాయి. భూవ్యవస్థ, ప్రస్తుత భూమి సాగు విధానం, కౌలు విధానాలు, సాగుబడి, పంటను అమ్మే విధానాలు దేశంలోని బీదలకు ఆటంకంగా ఉంటూనే వచ్చాయి.

మొత్తం సాగుబడికింద ఉన్న భూమిలో చాలా భాగం బహు కొద్దిమంది గ్రామీణ కుటుంబాల ఏలుబడిలో ఉంది. అవన్నీ పెద్ద భూకమతాలే. చాలా గ్రామీణ కుటుంబాలు చిన్న చిన్న పొలాల్ని సాగుచేసుకుంటున్నారు. దేశంలో నికరంగా పంటలు పండే భూమి 1966–67 నాటికి 343 మిలియన్ల ఎకరాలుంది.[1] అంతకుముందు నేషనల్ సర్వే (ఎన్.ఎస్.ఎస్.) వారు జరిపిన సర్వేలో తెలియవచ్చిన ధోరణులివి.[2] భూమిని సొంతంగా సాగుచేయని 5 శాతం భూస్వాముల పెద్ద రైతుల ఆధీనంలో 40 శాతం భూమి ఉంది. కౌలుకిచ్చికాని, కూలీలతోకాని వాళ్ళు భూమిని సాగుచేస్తున్నారు.

1960–61 సమాచారం ప్రకారం "మొత్తం భూమిలో 7 శాతం మాత్రం, 57 నుంచి 59 శాతం (2.5 ఎకరాలలోపుగానూ, అసలు భూమే లేకుండానూ ఉన్న కుటుంబాల"[3] చేతిలో ఉన్నట్టు తెలుస్తోంది. ఇదీ చిన్న రైతులు భూమిలేని రైతుల పరిస్థితి. చిన్న రైతులు కుటుంబ సభ్యుల శ్రమతో సాగుచేస్తారు.

స్వల్ప సంఖ్యలో సంపన్న మధ్యమ రైతువర్గం (Middle Reasantry) సాగుచేయని భూస్వాములకూ, బీదా బిక్కి రైతులకూ మధ్యలో ఉంది. స్వయంగానూ కూలీల

సాయంతోనూ కూడా వీళ్లు వ్యవసాయం చేస్తారు.

దేశంలోని ఆహార సరఫరాల అస్తవ్యస్తతకు ఈ తాడూ బొంగరం లేని భూవ్యవస్థే మూలకారణం. చిన్నరైతులు తమ తిండికి చాలినంత కూడా పండించలేకపోతున్నారు. మరోపక్క పెద్ద రైతులు మాత్రం, ఆహార ధాన్యాల కొరత దృష్ట్యా తమ మిగులు ధాన్యాన్ని అక్రమంగా నిలవచేసి కాలక్రమాన పెద్ద లాభానికి అమ్మసాగారు. కలకత్తాకు అక్రమంగా తరలించి పశ్చిమ బెంగాలు గ్రామాలలో పలికే ధరకన్న ('జోతెదార్లు'గా పిలువబడే భూస్వాములు) ఎక్కువ రాబట్టుకున్నారు. పక్క రాష్ట్రాలకు దొంగ రవాణా చేసి లాభాలార్జించారు. వాళ్ళు 1966లో రాష్ట్ర ప్రభుత్వ సేకరణ కోటాను తప్పించుకుని ఆ విధంగా ధాన్యాలు గుత్తగా కైవసం చేసుకున్నారు. ఆహార ధాన్యాల సేకరణకై నియమించిన రాష్ట్రప్రభుత్వ పాలనా యంత్రాంగం ఈ దుర్మార్గానికి అండగా నిలచింది. దానితో చౌక డిపోల ద్వారా ఆహారధాన్యాల అమ్మకం అస్తవ్యస్తమైపోయింది. స్వేచ్ఛా విపణిలో బియ్యం అమ్మకాన్ని ప్రభుత్వం నిషేధించింది. కానీ ఆహారధాన్య సేకరణ విఫలమవడం వల్ల చౌక డిపోల ద్వారా బియ్యాన్ని సరఫరా చెయ్యలేకపోయింది. నెలల తరబడి పాలనా వ్యవహారాల్ని స్తబ్దం చేస్తూ ఆహారధాన్యాలకై ఘర్షణలు (food riots) మొదలయ్యాయి.

భూకమతాల గురించిన మొద్దు అంకెలు. నానాటికీ క్షీణించే ఆదాయాలపై చిన్న పొలాలను సాగుచేసుకునే రైతాంగం సంఖ్యలో వృద్ధి, గ్రామీణ దారిద్ర్యపు తీవ్రతను బాగా వ్యక్తం చెయ్యకపోవచ్చు.

## గ్రామాలలో బీదలపాట్లు

భారత వ్యవసాయ వ్యవస్థలో అట్టడుగు పొరలోని చిన్న రైతులు, కౌలుదార్లు, భూమిలేని రైతుకూలీలు ఎలా జీవుస్తున్నారు? ఊళ్ళోని షాహుకార్ల దయాదాక్షిణ్యాలపైనే వీళ్ళు ఆధారపడి ఉన్నారు. అప్పు-వడ్డీ అనే విషవలయంలో శాశ్వత బందీలు వీళ్ళు. అప్పు చేసిన డబ్బుతో వీళ్ళు కనీసావరాలను మాత్రమే తీర్చుకుంటారు. చేసిన అప్పుపై పెరిగిన వడ్డీకై మిగతాదంతా అర్పించుకుంటారు.

కాలక్రమేణా చిన్నరైతులు దివాళా తియ్యసాగారు. తిండికే గతిలేకుండా తయారైన వీళ్ళు ఇక భూమికి పెట్టుబడి ఏం పెట్టగలరు? నీటి సరఫరా, ఎరువులు వంటి ఖర్చులు ఎలా భరించగలరు? తమ చిన్న పొలాల్ని భూస్వాములకు ఆదిలో తాకట్టు పెట్టిన వీళ్ళు, అసలు వడ్డీల భారం మొయ్యలేక ఆ భూముల్నే వాళ్ళ పరం చేసి తమ భూముల మీదే కౌలుదార్లుగానూ, పాలెగాళ్ళుగానూ మిగిలిపోయారు. ఉత్తర

భారతంలోనూ, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో ఇలానే పైనున్న కొద్ది భూస్వాముల చేతుల్లోకి భూమి సంక్రమించింది. పంజాబ్ దీనికి చక్కటి ఉదాహరణ. "... 1955-56 కూ 1967-68కి మధ్య పెద్ద రైతుల చేతుల్లోని భూమి దాదాపు 9.5 శాతం పెరిగింది. అభివృద్ధి పరిమితుల మార్పుల తీరును ఈ విధమైన సరాసరి శాతం చాలా భాగం మరుగుపరుస్తోంది. 20-25 ఎకరాల కమతాలు 4 శాతం మాత్రం పెరగగా 100-150 ఎకరాల కమతాలు 40 శాతం పెరిగాయి. వీటిలో చాలామటుకు కొనుగోలు ద్వారానే పెరిగాయి."[4]

భూమిపోయి పాలెకావుగా మారిపోయిన ఈ సన్నకారు రైతుస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. అనేక రాష్ట్రాలలో అతని హక్కులేవీ చట్టాలు నిర్ణయించలేదు. భూస్వామికి భూమి పంటలో చెల్లించవలసిన శిస్తు దారుణంగా ఉండేది. కొన్ని సందర్భాలలో ఆ శిస్తు పండిన పంటలో సగం నుంచి మూడు వంతులు దాకా ఉండేది. కొన్ని ప్రాంతాలలో భూస్వామి నాగలి, కాడెద్దులు వంటి వ్యవసాయ సాధనాలు ఇస్తాడు. మరికొన్ని చోట్ల రైతు సొంతంగానో బాడుగకో సాధనాలను తేవలసి వస్తుంది.

చట్టం కొంత వరకు కౌలుదారు హక్కులను పరిరక్షించిన రాష్ట్రాలలో కూడా చిన్న రైతుకు తన భాగం దక్కటం లేదు. 1953 నాటి పంజాబు రాష్ట్ర భూమి కౌలు భద్రత చట్టం, 1955 నాటి పి.ఇ.పి.ఎస్.యు. (PEPSU) కౌలు వ్యవసాయ భూమి సాగు చట్టం ప్రకారం భూస్వామికి కౌలుదారు చెల్లించవలసిన పంట భాగం, భూమి పంటలో మూడవ భాగం లేదా దానికి సమానమైన రొక్కానికి మించకూడదనే నిబంధన ఉంది. కాని పంజాబులోని మూడు జిల్లాల్లో జరిపిన సర్వే ప్రకారం రైతులు తమ పంటలో సగం దాకా ఇవ్వడం మామూలని తెలిసింది.[5]

చట్ట ప్రకారం భూస్వాములకు ఇవ్వవలసిన దానికంటే మించి ఇవ్వడమే కాకుండా, సాగుదార్లు ఇతర పద్ధతుల ద్వారా కూడా పీడింపబడేవారు. అనేక రాష్ట్రాలలో రైతులకు వాళ్లు సాగుచేసిన పొలాలను చట్ట ప్రకారం కొంత కాల పరిమితితో పాటు తమ స్వాధీనంలో ఉంచుకునేందుకు హక్కు ఉంది. భూస్వాములు ఆ ప్రమాదం రాకుండా కాపాడుకునేందుకు రైతుల్ని అటువంటి నిర్ణీత కాలపరిమితికి ముందే తొలగించేవారు. వాళ్ళ వృత్తి, భుక్తి పోతుందనే భయంతో సాగుదార్లుగా కూడా నమోదు చేయించుకునే సాహసం లేని వీళ్ళకు అలా తొలగింపు జరిగినప్పుడు చట్టం కల్పించిన రక్షణలు కూడా నిరుపయోగంగానే ఉండేవి.

సాగుదార్లు కౌలుదార్లు గురయ్యే బాధలు ఒకటి కాదు. భూస్వామి ఇంటిలో 'బేగార్' అనబడే వెట్టిచాకిరీ చెయ్యాలి. భూస్వామి ఇంటిలో జరిగే శుభకార్యాలు

మొదలైన సందర్భాలలో 'దండుగ' కాని, కానుకలు కాని చెల్లించుకోవాలి. పల్లెల్లో ఇవి మామూలు విషయాలు.

పల్లెల్లో అట్టడుగు వర్గాలలో ఉన్న వ్యవసాయ కార్మికులు, భూమిలేని రైతులూ (భూమిలేని కారణం చేత) ఇతరుల పొలాల మీద పనిచేస్తూనో, మిగతా రోజులలో కూలీనాలీ చేసుకుంటూనో బతుకుతూ ఉంటారు. అటువంటి రైతు కార్మికులు 1951లో 30.6 మిలియన్లుకాగా, ఆ సంఖ్య 1971 నాటికి 45.5 మిలియన్లకు పెరిగింది. దీనికి కారణం జనాభా పెరుగుదల మాత్రమే కాదు. అనేక మంది చిన్న రైతులు భూమి లేని రైతులుగా మారిపోవడం వల్ల కూడా ఆ సంఖ్య పెరిగింది. సాధారణంగా సిగ్గుమొగ్గలు తొడిగే అధికార గణాంకాలు కూడా ఈ వర్గపు పల్లెజనుల బీదతనాన్ని దారుణంగానే చిత్రీకరించాయి. 1963–64 రూరల్ లేబర్ ఇంక్వయిరీ కమిటి అంచనా ప్రకారం వ్యవసాయ కార్మిక కుటుంబాల సంవత్సరాదాయం 660 రూపాయలు. అదే సంవత్సరంలో పట్టణ ఫ్యాక్టరీ కార్మికుని ఆదాయం. రూ. 1,660.

వ్యవసాయ కార్మికులకు కూలీరేట్లు తక్కువగా ఉండడం ఒక బాధయితే, తగినంత పనిలేక పోవడం (Unemployment, and under employment) మరో బాధ. "వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో 200 రోజులు పని ఉంటుంది. వాళ్లలో చాలా మంది రోజుకూలీ నికరం కాదు. కొలువుకు భద్రత లేదు. పని దొరకడంలో ఒక తీరు తెన్నూ లేదు. కాలాన్ని బట్టి పని దొరుకుతుంది."[6] వ్యవసాయపు పనుల రోజులు రాష్ట్రానికో విధంగా ఉంటాయి. ఒకే రాష్ట్రంలో కూడా ఓ జిల్లాకీ మరో జిల్లాకీ కూడా లగ్గసరిలో (పని రోజులు)* తేడా ఉంటుంది. పశ్చిమబెంగాలులో (వర్షానంతర కాలం) 'అమాన్' వరి పండించే ప్రాంతాలలో సంవత్సరంలో 3 నెలల పాటు పని దొరుకుతుంది. రెండు పంటలు పండించే చోట్ల 9 నెలల పని దొరుకుతుంది. కాని రాష్ట్రంలో చాలా భాగం ఒక పంట పండించే 'అమాన్' ప్రాంతమే. అందుచేత హెచ్చుమంది వ్యవసాయకూలీల పాట్లు ఊహించవచ్చు.

కూలి చేస్తే చాలదు. వ్యవసాయపు పని తప్ప మరోపని దొరకదు. బతుకులు గడవాలంటే వడ్డీ వ్యాపారస్తుల నుంచి అప్పే గతి. పెద్ద భూస్వాములు వ్యవసాయదార్లు వడ్డీలకు అప్పు ఇస్తారు. లేదా వడ్డీ వ్యాపారం చేసేవాళ్లు ఉంటారు. రిజర్వుబ్యాంకు సర్వే ప్రకారం వ్యవసాయ దార్లకు లభించే పరపతిలో 70 శాతం వీళ్లు ఇస్తున్నారు. బ్యాంకులు, సహకార సంఘాలు 7 శాతం మాత్రం ఇస్తున్నాయి.[7]

---

* (busy season)

కొన్ని సందర్భాలలో ఈ వడ్డీ వ్యాపారస్తులు పుచ్చుకునే వడ్డీ శాతం 50 లేదా అంతకు మించి కూడా ఉంటుంది. రెండవ వ్యవసాయ దర్యాప్తు సంఘం (The Second Agricultural Commission) "దేశంలోని 163 మిలియన్ల వ్యవసాయ కూలీ కుటుంబాలలో 63.9 శాతం అప్పులో ఉన్నారు. రుణగ్రస్తమైన ప్రతీ రైతు కూలీ కుటుంబానికీ సాలుకు రూ. 138 అప్పు ఉంద"ని నివేదించింది.

అప్పులు, వాటిపై పెరిగిన వడ్డీలు తీర్చలేక బీద వ్యవసాయ కూలీ జనులలో కొందరు, ప్రత్యేకించి దళిత కులాలకు చెందినవారు, ఒక రకమైన కట్టు బానిసలుగా మారిపోయారు. 1965–66 షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తరగతుల సంఘం నివేదిక ప్రకారం : "కేరళ ప్రభుత్వ అర్థగణాంక శాఖ బ్యూరో (Bureau of Economics and Statitstics) కేరళ రాష్ట్రంలోని వైనాడ్‌లోని పన్యన్ల ఆర్థిక స్థితిగతుల గురించి జరిపిన సర్వేలో ఆ ప్రదేశంలో ఒక రకమైన వెట్టిచాకిరి ఉందని తెలిసింది." అదే నివేదికలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యాఖ్య ఇలా ఉంది. "శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల్లోని షెడ్యూల్డు ప్రాంతాలలో వెట్టిచాకిరి కట్టుబానిస పద్ధతులు అంతరించాయని రాష్ట్ర ప్రభుత్వం చెపుతోంది. ఇంతకు ముందు నివేదికలలోనూ అదే చెప్పింది. ఈ విషయంలో ప్రభుత్వం చెప్పినది నిజం కాదని తేలింది. ఈ సంఘం చేసిన పరిమిత సర్వే కూడా (ప్రభుత్వ సమాచారం) అబద్ధమని రుజువు చేసింది." కమ్యూనిస్టు విప్లవకారుల నాయకత్వంలో జరిగిన రైతాంగ తిరుగుబాట్లలో మొదటిది శ్రీకాకుళంలో జరిగింది. రెండవది 1968 నవంబరులో కేరళలోని వైనాడులోని పోలీసు స్టేషన్లపై జరిగిందని ఈ సందర్భంలో గుర్తించాలి.

నేషనల్ సాంపిలు సర్వే (ఎన్.ఎస్.ఎస్.) వారి వ్యవసాయ కూలీరేటు సూచిక వివిధ వ్యవసాయ వర్గాల శాతాల ప్రకారం, కనీస జీవన స్థాయి కింద కల బీద రైతు కూలీల శాతం 1960–61లో 33 శాతం కాగా 1968–69 నాటికి 54 శాతానికి పెరిగింది. సంఖ్యాత్మకంగా చూస్తే 1960–61లో 135 మిలియన్లున్న వీళ్ళ జనాభా 1968–69 నాటికి దాదాపు 230 మిలియన్లకు పెరిగింది.[8]

ఈ కూలీలలో చాలా భాగం తక్కువ కులాలకు తెగలకు చెందినవారే. వీళ్లు ప్రభుత్వ పరిభాషలో షెడ్యూల్డుకులాలు తరగతుల వాళ్లుగా అభివర్ణించబడుతున్నారు. వీళ్ళను పట్టిపీడించే దరిద్రానికి తోడు సాంఘిక పీడన, వెలికి గురౌతున్నారు. 1967లో ఢిల్లీకి కొద్ది మైళ్ళదూరంలోగల హర్యానా సరిహద్దులోని ఒక గ్రామానికి వెళ్లాను. అక్కడ స్థానిక భూస్వాముల పొలాలలో పని చేసే చామర్ (చర్మకార) కులానికి చెందిన నిరుపేద వ్యవసాయ కూలీలు, అగ్రకులాలకే పరిమితం కాబడిన బావి

నీటిని తోడు కోలేకపోవడం నాకింకా జ్ఞాపకం ఉంది. అధునాతన సౌకర్యాలన్నీ అమర్చుకుని, ఇటుకలు సిమ్మెంటుతో కట్టిన తమ ఇంటి ఆవరణలలోకి కూడా భూస్వాములు వీళ్ళను రానివ్వరు. ఈ నిరుపేద కూలీలు మాత్రం గుడిసెలలోనే, ఇరుకులో మురికిలో మగ్గిపోవాలి. తక్కువ కులాలకు చెందిన రైతుకూలీలను అత్యల్పకారణాల సాకుగా దక్షిణ భారత దేశంలోని గ్రామాలలో సజీవంగా దహనం చెయ్యడం, హింసించడం పరిపాటై పోయింది. ఇవి యూరపులోని ఇంక్విజిషను కాలాన్ని జ్ఞప్తికి తెస్తాయి.

భారతీయ గ్రామాలలో ఈ దారిద్ర్యం ఇంకా కొనసాగుతూనే ఉంది. అది దుస్సహం మాత్రమే కాదు. వాళ్ల హృదయాలలోనూ మనసుల్లోనూ ఒకరకమైన భయంకర బానిస భావాన్ని నింపి. వాళ్ళ మానాభిమానాల్ని హరింపచేస్తూ, వాళ్ళ జీవితంలోని సున్నితమైన అంశాలను చిన్నాభిన్నం చేస్తుంది. ఈ పరిస్థితి తరచి చూచిన మనసున్న వాళ్ళను కలిచి వేస్తుంది.

కొద్ది మంది ధనిక భూస్వాములు వడ్డీ వ్యాపారస్తులూ. భారత దేశంలో సగంపైగా గ్రామీణ జనుల్ని అంగుళం అంగుళం పీల్చి పిప్పి చేస్తున్నారు. వాళ్ళ భూమినీ శ్రమనూ దోచుకుంటున్నారు. దానికి బదులుగా వాళ్ళకు బ్రతికేందుకు చాలినంత తిండి పెట్టగలిగే కూలి మాత్రమే ఇస్తూ దారిద్ర్యంలో కూరుతున్నారు. తమ భూములపై దౌర్జన్యంగా పని చేయించుకుంటున్నారు. గ్రామాలలో అంతటా విలయతాండవం చేసే దారిద్ర్యం, దోపిడీ అవమానాల స్వరూపం మనకు కనిపిస్తుంది. ఈ కనీసపు తిండి కూడా వాళ్ళకు కరువైపోయింది. ఫలితంగా అనేక మంది రోగిష్టి చావులు, ఆకలి చావుల పాలయ్యారు.

ఈ సమాచారం దృష్ట్యా, మావోసేటుంగ్ విశ్లేషణా విధానంతో సి.పి.ఐ. (మా.లె.) దాని వ్యవసాయిక సిద్ధాంతాన్ని రూపొందించింది.

## గ్రామీణ సాంఘిక జీవనంపై సి.పి.ఐ. (మా.లె.) అభిప్రాయం

1969లో ఆమోదించిన సి.పి.ఐ. (మా.లె.) రాజకీయ తీర్మానం గ్రామాలలోని మౌలిక ధోరణులనిలా సమీక్షించింది "నానాటికీ భూమి కొద్ది మంది భూస్వాముల చేతులలోకి చేరుతోంది. భూమిశిస్తు కిందో మరో విధంగానో రైతులు శ్రమించి పండించిన మిగులు పంటలు దోచుకుంటున్నారు. అసలు వడ్డీల సంకెళ్లలో, రుణభారంతో వాళ్ల నడుములు విరిగి పోతున్నాయి. పాశవికమైన దమనకాండకు తోడు, హరిజనులు[9] చిత్రవధలకు కూడా గురవుతున్నారు. ఉత్పత్తి విధానాలు వెనకబడి

ఉన్నాయి. మన సమాజం యొక్క అర్ధ భూస్వామ్య విధానం వీటన్నిటిలోనూ వివరంగా కనపడుతుంది."[10]

గ్రామాలలో రైతాంగాన్ని పార్టీ నాలుగు తరహాలుగా విభజించింది. పెద్ద భూస్వామిని "సాగు చేయని భూమి కలవాడు." పెత్తందారు రైతులు, ధనిక రైతాంగం, మధ్యమ తరగతి రైతులు, బీద రైతులు, భూమి లేని రైతులు. వాళ్ల పొలాల పైజును బట్టి రైతుల వర్గ స్వభావాన్ని నిర్ణయించడం "ప్రమాదకరమైన పొరపాటుగా" పార్టీ అభిప్రాయపడింది. "సంపాదన జీవన స్థాయిల ఆధారంగా దాన్ని నిర్ణయించాల"ని కూడా తలచింది. (4)

అంతేకాక రైతాంగ పరిస్థితిని నిర్ణయించేందుకు వాళ్లు ఎంతమేరకు శ్రమశక్తిని అమ్ముకొంటున్నారు. ఎంతవరకు కూలీల శ్రమను దోచుకుంటున్నారు అనే విషయాన్ని కూడా పార్టీ లెక్కలలోకి తీసుకుంది. తన భూమిలో కొంత సాగుచేస్తూ తన ఆదాయానికి కూలీ జనం, పాలెగాళ్ళపై ఆధారపడే వ్యక్తిని ధనిక రైతుగా పేర్కొంది. తన ఆదాయానికి సొంత శ్రమపై ఆధారపడుతూ అప్పుడప్పుడు కూలీకి వెళ్ళేవాళ్లను మధ్య రైతుల్లో చేర్చింది. తన శ్రమపైనే ఆధారపడుతూ, చిన్న పొలంపైన శ్రమచేసికాని, కూలి పని చేసి కాని పొట్ట పోషించుకునే వాళ్లను చిన్న రైతుల జాబితాలో చేర్చారు. భూమిలేని రైతుకూలీ బతుకంతా తన శ్రమశక్తిని అమ్ముకొంటేనే గడుస్తుంది.[11]

గ్రామాలలోని చేతిపనివారలైన "కమ్మరి, కుమ్మరి, సాలె తదితర వర్గాలు చేతిపని తరగతుల కిందికి వస్తారు. వర్గస్వభావం చేత వాళ్లు బీదరైతు వర్గంలోకి" వస్తారు. (73)

రైతాంగంలో బీదరైతులు, భూమిలేని రైతులు అత్యధికంగా ఉన్నారు. వీళ్లే అత్యధికమైన సాంఘిక దోపిడీకి గురౌతున్నారు. వీళ్లు కార్మిక వర్గంతో సన్నిహితంగా ఉండి మధ్య రైతులతో కలిసి ఈ విధంగా భారత దేశంలో అత్యధిక వర్గాలను సమీకరిస్తే, భూస్వామ్య వలస విరోధ ప్రజాతంత్ర విప్లవం తప్పక విజయవంత మౌతుంది.[12]

## ప్రభుత్వ చర్యలు

సంవత్సరాల తరబడి విలయతాండవం చేస్తున్న గ్రామీణ దారిద్ర్యం పట్ల భారత ప్రభుత్వ వైఖరి ఎలా ఉంది?

భూకమతానికి సంబంధించిన కొన్ని మార్పులు తెచ్చేందుకు విధానపరంగా కొన్ని ఆర్థిక చర్యలు తీసుకుంది. వీటిని "భూసంస్కరణలు"గా పేర్కొనవచ్చు. "1960ల

మధ్య కాలానికి ఉత్పత్తిని పెంచేందుకై ప్రభుత్వం కొన్ని సాంకేతిక మార్పులు ప్రవేశపెట్టింది. దీన్నే నవీన వ్యవసాయిక వ్యూహం అనవచ్చు". క్లుప్తంగా ఈ రెండు విధాల చర్యలను సమీక్షిద్దాం.

## భూసంస్కరణలు

ప్రభుత్వ భూసంస్కరణ చర్యలను స్థూలంగా మూడు స్థాయిలుగా విభజించవచ్చు. 1947లో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు జమీందారీ వ్యవస్థను రద్దు చేసి, పరాన్నభుక్కులుగా ఉన్న సాగుచేయని కౌల్దార్లను, దళారీలను తొలగించే చర్యలు తీసుకున్నాయి. ఇది మొదటి దశ. 1950లలో కౌల్దార్లకు రక్షణ కల్పించే చట్టాల నిర్మాణం రెండవదశ. 1950ల చివరన వ్యక్తి ఆస్తులపై గరిష్ఠ పరిమితిని విధించడం మూడవ దశ. పరిమితిని మించిన మిగులు భూమిని భూమిలేని పేదలకు చిన్న రైతులకు పంచిపెట్టే చర్యలు అమలు చేసే ప్రణాళికలు కూడా రూపొందాయి.

జమీందారీ వ్యవస్థ నిర్మూలనవల్ల భూవ్యవస్థ ఎంత మాత్రం మారలేదు. జమీందార్లు పెత్తందారీ భూస్వాములూ అప్పటికే కాంగ్రెసులో కాలూనుకుని రాష్ట్ర ప్రభుత్వాలలో పలుకుబడి సంపాదించుకున్నారు. పరంపరగా అనుభవించే పన్ను వసూలు హక్కుల్ని మాత్రమే పోగొట్టుకున్నారు. చట్టాలలోని లోపాలు, వాటి అమలులో జరిగిన జాప్యాల వల్ల చట్టాన్ని ఉల్లంఘించి తమ తమ ఆస్థుల్ని పోకుండా కాపాడుకున్నారు. 1948లో బీహార్ అసెంబ్లీ ఆమోదించిన జమీందారీ నిర్మూలన చట్టం దీనికి చక్కటి ఉదాహరణ. 1956లో బీహార్‌లో పర్యటించిన డేనియల్ తోర్నర్ అనే అమెరికన్ విద్యార్థికుడిలా అన్నాడు. "బీహార్ శాసనసభ జమీందారీ నిర్మూలనను (సూత్రప్రాయంగా) ఆమోదించిన 8 సంవత్సరాల తరవాత బీహారు జమీందార్లలో చాలామంది ఆయా భూముల్ని చట్ట ప్రకారం అనుభవిస్తూనే ఉన్నారు"[13]

"జమీందారీ నిర్మూలన" అనే పదం విప్లవాత్మకంగా ధ్వనించినా, పన్ను వసూలు విధానంలో మార్పును మాత్రమే తెచ్చిన ఈ సంస్కరణ అమలు జరిపేందుకు దేశ ఖజానాకు ఏ మాత్రం ఖర్చయింది? ప్రభుత్వం మాజీ జమీందార్లకు 2,360 మి. రూపాయిలు చెల్లించవలసి వచ్చింది. మరో 3,340 మి. రూపాయిలు ఇంకా చెల్లించవలసి ఉంటుంది.[14] ఇంత డబ్బు పన్నులు వసూలు చేసే అధికారం రద్దు చేసేందుకే అయింది! పెద్ద ఆస్తులను స్వాధీనం చేసుకోవడం కాని వాటిని భూమిలేని వారికి పంచడం కాని ఏమాత్రం జరగలేదు.

కౌలు సంబంధాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు కూడా

అంతకుమించిన గొప్ప ఫలితాలు ఇవ్వలేదు. కౌలుదారీ సంస్కరణల ముఖ్యోద్దేశాలలో మొదటిది కౌలుదార్లకు భూములను సాగు చేసుకునే రక్షణ కల్పించడం. వాళ్ల భూస్వాములకు చెల్లించే పంట శిస్తులను క్రమబద్ధం చెయ్యడం రెండవ ఉద్దేశ్యం.

ఈ విషయంలో కూడా పెద్ద రైతులూ, భూస్వాములూ బీద రైతులపై మరో విజయాన్ని సాధించారు. అనేక రాష్ట్రాలలో కొన్ని ప్రతిపాదనలు ప్రకటించడానికీ వాటిని చట్టాలుగా ఆమోదించడానికీ మధ్య కాలవ్యవధి చాలా ఉండేది. దీనివల్ల భూస్వాములకు తగినన్ని జాగ్రత్తలు తీసుకునే వీలు కలిగేది. కొత్త ప్రతిపాదనల ప్రకారం నిర్ణీతకాలం పాటు సాగు చేసిన భూములపైనే రైతులకు కౌలు హక్కులు సంక్రమిస్తాయి. కనుక భూస్వాములు పెద్ద ఎత్తున కౌలుదార్లను తొలగించడం ద్వారా వాళ్ల హక్కులను వినియోగించుకోలేకుండా చేసారు. కౌలుదార్ల బతుకులు పూర్తిగా భూస్వాములపై ఆధారపడి ఉండడం చేత, తమ పేర్లను కౌలుదార్లుగా నమోదు చేయించుకునే ధైర్యం కూడా వాళ్లకు లేకపోయింది. దానివల్ల కొత్త చట్టాలు కల్పించిన రక్షణలు వాళ్లను కాపాడలేకపోయాయి. కౌలుదార్లుగా నమోదు చేయించుకున్న వాళ్లు కూడా వివాదాన్ని పెంచి కోర్టుకుపోయే స్తోమత లేక, తీర్పు గురించి పడిగాపులు కాచే ఓర్పులేక నిస్సహాయులయ్యారు. అనేక రకాల ఒత్తిడులకు గురైన కౌలుదార్లు కొన్ని ప్రాంతాలలో తమ హక్కుల్ని "ఐచ్ఛికంగానే" వదులుకున్నారు. 1959 ప్రణాళికా సంఘ భూసంస్కరణల పేనలు యొక్క కౌలుదారీ కమిటీ ఇలా వాపోయింది. "మొత్తం మీద కౌలుదారు – భూస్వామ్య సంబంధాల సమీకరణ విఫలమయ్యింది" రాష్ట్రాల చట్టాలలో గల లోపాలను సాకు చేసుకున్న జమీందార్లు కౌలుదార్లను తొలగించి కూలీలతో వ్యవసాయం మొదలెట్టారు. భూమి రికార్డులు లేవు. రెవిన్యూ అధికారులు విరోధభావం కలిగి ఉన్నారు. వీటన్నిటి వల్ల సంస్కరణలు విఫలమయ్యాయి.

మూడవ పంచవర్ష ప్రణాళికలో ఓ అధ్యాయంలో "కౌలుదార్ల సంక్షేమం విషయంలో కౌలుదారీ చట్ట సముదాయం ఆశించినంత ప్రభావం కల్పించలేదని" ప్రభుత్వమే ఒప్పుకొంది. కౌలుదార్లు "ఐచ్ఛికంగా భూముల్ని వదలడం" గురించి కూడా పేర్కొంది. వాటిలో చాలా మట్టుకు "నిజమైన లావాదేవీలనుకోవడానికి" వీల్లేదని భావించింది.[15]

భూసంస్కరణల సముదాయంలో మూడవదశగా వెలుగొందిన భూమి సీలింగు చట్టాల విషయంలో కూడా, ప్రతిపాదించిన పరిమితులు ప్రకటించడానికీ ఆయా చట్టాలను రూపొందించడానికీ మధ్య ఎంతో కాలవ్యవధి ఉంది. అటువంటి జాప్యాల వల్ల భూస్వాములు పొందిన లాభాలు చూస్తే ఆ విధంగా గరిష్ట పరిమితులను ముందే ప్రకటించడం రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశ్య పూర్వకంగా చేసాయనిపిస్తుంది.

ఈసారి చట్టాన్ని భూస్వాములు మరో మాదిరిలో తప్పించుకున్నారు. పరిమితిని మించిన భూమిని నౌకర్ల పేరా, బంధువుల పేరా పెట్టి మిగులు భూమిని రక్షించుకున్నారు. దీన్నే 'బినామీ' మార్పిడిగా పేర్కొన్నారు. ప్రణాళిక సంఘపు పరిశీలన కార్యక్రమ కమిటీ (Research Programme Committee of Planning Commission) వాళ్ళు చేసిన ఒక అధ్యయనం ప్రకారం 1952–54 సంవత్సరాలలో సీలింగుల నుంచి తప్పించుకునేందుకు తలపెట్టిన భూస్వాములు 1,05,600 ఎకరాల మిగులు భూమిని 'బినామీ' మార్పిడి ద్వారా కాపాడుకోగలిగారు.

చివరకు సీలింగు చట్టాలు అమలుకు వచ్చాయి. భూస్వాములు వీలైనంత ఎక్కువ భూమినే మిగుల్చుకునేలా భూపరిమితుల్ని ఎక్కువగానే ఉంచారు. భూమి తరహాను బట్టి పరిమితుల్ని నిర్ణయించారు.

ఆంధ్రప్రదేశ్‌లో 27 నుంచి 324 ఎకరాల దాకా, బీహారులో 20 నుంచి 60 ఎకరాల దాకా, పంజాబ్‌లో 27 నుంచి 100 ఎకరాల దాకా, పశ్చిమ బెంగాలులో 25 ఎకరాలు, ఉత్తర ప్రదేశ్‌లో 40 నుంచి 80 ఎకరాల దాక పరిమితి నిర్ణయించారు. భూమి తరగతుల ప్రకారం చట్టప్రకారం వచ్చిన మినహాయింపులు, ప్లాంటేషన్లు (టీ, కాఫీ, రబ్బరు, జీడిమామిడి, యూకలిప్టసు, పొగాకు, టేకు మొ॥ తోటలు – అను) పండ్లతోటలు, చేపల పెంపకానికి చెరువులు, మతపరమైన సంస్థలకు ఇచ్చిన భూములపై ఇచ్చిన మినహాయింపుల వల్లా వాళ్ళకు ఇటువంటి రాయితీలు వచ్చాయి.

'బినామీ' మార్పిడుల వల్ల గరిష్ఠ పరిమితిలు ఎక్కువగా ఉండడం వల్లా భూస్వాముల నుంచి ప్రభుత్వానికి సంక్రమించిన మిగులు భూమి నామమాత్రంగానే ఉంది. దిగువ అంకెల్నిబట్టి పై విషయం తెలుస్తుంది. 1964లో ఆంధ్రప్రదేశ్‌లో అమలుకు వచ్చిన సీలింగు ప్రకారం 73,692 ఎకరాలు మిగులుతుందని అంచనా. 1970 నాటికి 191 ఎకరాల మిగులు భూమిని మాత్రమే ప్రభుత్వం పొందగలిగింది. ఉత్తర ప్రదేశ్‌లో మిగులు భూమిగా ప్రకటించిన 2,38,000 ఎకరాలకూ 1970 నాటికి 1,99,000 ఎకరాలు మాత్రమే సేకరించగలిగింది. 1965 నాటికి పశ్చిమ బెంగాలులో రాష్ట్ర ప్రభుత్వం 7.76 లక్షల ఎకరాలు మాత్రమే మిగులు భూమిగా గుర్తించింది.

మొత్తం మీద చూస్తే భూసంస్కరణా చర్యలు భావపరంగా భూస్వామ్య పెత్తందారీ వర్గాలకే లాభించే విధంగా రూపొందాయి. భూమి లేని పేదల కోసం, కౌలుదార్ల కోసం చేసిన చట్టాలలో గల లోపాల వల్ల ఆ కలిగే కొద్ది మేలు కూడా వాళ్ళకు జరగలేదు. తమ హక్కుల్ని కాపాడుకునేందుకు కావలసిన వ్యయప్రయాసలకు తట్టుకునేందుకూ ప్రస్తుత వ్యవస్థలో వాళ్లకు డబ్బూ, సమయం కూడా లేవు. అమలు

స్థాయిలో గల రెవిన్యూ అధికార్లు బీదవాళ్ళంటే సహజమైన ఏహ్యాభావం కలిగి ఉండడం వల్ల పెత్తందార్లంటే మానసిక తాదాత్మ్యం వల్ల చిన్న రైతులకూ, కౌలుదార్లకు ఏవిధంగానూ తోడ్పడతారని భావించలేం. ప్రణాళికా సంఘం ఒక సమీక్షలో ఇలా పేర్కొంది. "... భూసంస్కరణల అమలు విషయంలో పాలనా యంత్రాంగానికి సాధారణంగా ఏహ్యాభావమే. రెవిన్యూ యంత్రాంగంలో దిగువ స్థాయి అధికార్లకు చట్ట సంబంధమైన సూత్రాలు తెలియవు. (సరిగదా వాళ్ళందరూ) చట్టాలను అతిక్రమించడం వల్ల లాభం పొందే బడా భూస్వాముల గుప్పిట్లో ఉన్నారు."[16]

## "హరిత విప్లవం"

అధికాహారోత్పత్తి సాధించేందుకు గ్రామీణ సమస్యలను చేపట్టిన ప్రభుత్వం తన ప్రణాళికలో రెండవ అంశంగా "కొత్త వ్యావసాయిక వ్యూహాన్ని"* చేపట్టింది.

అధిక దిగుబడినిచ్చే విత్తనాల వాడకం, వంగడాల వినియోగం, వ్యవసాయంలో యాంత్రీకరణ రసాయనిక ఎరువులు వాడకం, పురుగు మందుల (Pesticides) నుపయోగించడం వంటివి ఈ ప్రణాళికలో ప్రధానాంశాలు. 1969-70 నాటికి భారతదేశపు ఆహారధాన్యాల ఉత్పత్తి మునుపటి స్థాయిని మించి 100 మిలియన్ టన్నులకు చేరుతుంది. "హరిత విప్లవం" అని వర్ణించబడిన ఈ వ్యూహం ఫలితాలు పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ, హర్యానా, పశ్చిమ-ఉత్తర ప్రదేశ్‌లలోనూ కనిపించ సాగాయి. కాని భారత వ్యవసాయ మంత్రి సి. సుబ్రహ్మణ్యానికి అమెరికా వ్యవసాయ కార్యదర్శి ఓర్విల్ ఫ్రీమన్‌కూ మధ్య 1965లో రోములో జరిగిన సమావేశం దీనికంతటకూ మూలం.

1960లలో అమెరికా తన విదేశీ సహాయ విధానాన్ని పునర్ వ్యవస్థీకరించు కోవాలనుకుందని గుర్తుంచుకోవాలి. అంతవరకూ అమెరికా తన మిగులు పంటలను పిఎల్-480 ఎగుమతుల ద్వారా ఇండియాకూ మిగతా దేశాలకూ పంపిణీ చేసేది. కాని 1960ల నుంచీ అభివృద్ధి చెందుతున్న దేశాల వ్యవసాయోత్పత్తిలో సాంకేతిక మార్పులు జరగాలని ఆదేశించింది. అమెరికన్ వ్యూహాన్ని భారతదేశానికి అనువదించడం వల్ల అధికాహారోత్పత్తి (జరిగి) ప్రత్యేకంగా గోధుమపంట పెరిగింది. కాని స్వల్ప సంఖ్యలో ఉన్న ధనిక భూస్వాముల యాంత్రీకరణ చేసిన పెద్ద కమతాలకే అటువంటి అధిక దిగుబడి పరిమితమైంది.

---

* New Agricultural Strategy

ఈ 'హరిత విప్లవం' ఉత్తర భారతంలోని గోధుమ బాగా (Wheat Belt) నికే పరిమితం అవడానికి కారణం పాక్షికంగా ఆ వ్యూహంలోనే ఉంది. ముందు చెప్పినట్టుగా, ఈ వ్యూహానికి రసాయనిక ఎరువులు, ఆధునికయంత్ర పరికరాలవంటి ఖరీదైన పెట్టుబడులు (in-puts) కావాలి. ధనిక రైతులే ఈ పెట్టుబడులను భరించగలరు. కొత్త వ్యవసాయ వ్యూహాన్ని ప్రసిద్ధిచెందిన అధ్యయనకర్త వోల్ఫ్ లెడిజెన్స్కి ఇలా వివరించాడు. "10 ఎకరాల నేలను మళ్ళీ సాగుకు సిద్ధం చెయ్యాలంటే పది పన్నెండు వేలవుతుంది. ఇంత సొమ్మును రైతు సహకార పరపతి ద్వారా మాత్రమే భరించగలడు. సాధారణంగా అతనికి చాలినంత రుణం దొరకదు. కారణం భారతదేశంలోని అధికార యంత్రాంగం ధనిక పక్షపాతిగానే ఉంది."[17] మరో పరిశీలకుడు ఇలా చెప్పాడు. ఈ కొత్త వ్యూహం "37 మిలియన్ల ఎకరాల గోధుమ క్షేత్రాలకు పాక్షికంగా అన్వయించగలదనీ, చిన్న చిన్న పొలాలు, కౌలుదార్ల విధానాలు వల్ల వైజ్ఞానిక వ్యవసాయపు సౌకర్యాలు ఏదో కొంత మందికి తప్ప లాభదాయకం కానందుచేత 92 మిలియన్ల ఎకరాలు గల వరి పండించే ప్రాంతాల్లో పూర్తిగా అసంబద్ధంగా ఉండిపోయింది."[18] ఈ హరిత విప్లవం గోధుమ ప్రాంతంలో కూడా కొత్త సాంఘిక ఘర్షణలకు దారి తీసింది. కొత్తగా వచ్చిన ఈ లాభసాటి వ్యవసాయం వల్ల భూముల ధరలు పెరిగాయి. "పదవి చాలించిన సైనికాధికార్లు, ప్రభుత్వాధికార్లు, డాక్టర్లు, ప్లీడర్లు వ్యాపారస్తులతో కూడిన కొత్త తరహా వ్యవసాయదార్లు" రంగం మీదకి వచ్చారు. "వీరిలో చాలా మంది దగ్గర 'పనిలేని' రూపాయిలు నల్లధనం రూపంలో ఉన్నాయి. వీళ్ళు వ్యవసాయాన్ని పన్నులు లేని స్వర్గంగా భావించారు. వీళ్ళు దీన్నించి ఎటువంటి పన్నులకూ గురి కాని ఇతరాదాయాన్ని పొందసాగారు."[19]

భూమిరేట్లు పెరగడంతో కౌలుదార్లు చెల్లించే పంటశిస్తు కూడా పెరిగింది. ఇదివరలో చెప్పినట్టు, చట్టప్రకారం నిర్ణయించిన శిస్తులను అంగీకరించకుండా ఎలాగోలాగ భూస్వాములు కౌలుదార్ల నుంచి హెచ్చు పంటను రాబట్టుకుంటూనే ఉన్నారు. హరిత విప్లవం వల్ల పంజాబులోని కొన్ని ప్రాంతాల సాగుదార్లు తమ పంటలో 70 శాతం దాకా భూస్వాముల పరం చెయ్యవలసి వచ్చేది. పంజాబులోని లూఢియానా జిల్లాలోని గ్రామాలను, 'హరిత విప్లవ ప్రాంతాలలోని కొన్ని ప్రదేశాలను సందర్శించిన ఫ్రాంసిస్. ఆర్. ఫ్రాంకేల్ అనే ఆమె ఇలా వివరించింది. "... గ్రామీణ ప్రాంతాలలో నవీన సాంకేతిక విజ్ఞానాన్ని అధికోత్పత్తి ప్రణాళికల ద్వారా ప్రవేశపెట్టడం వల్ల, ఆర్థిక పునర్నియమం జరగడం కాక, సాగుదార్లకూ, భూస్వాములకూ, భూస్వాములకూ కూలీలకూ మధ్య సాంఘిక వైరుధ్యాలు కూడా తలెత్తాయి.[20]" వరి

పండించే ప్రాంతాలలో 'హరిత విప్లవం' ఫలితాలను తెలుసుకునేందుకు ఫ్రాంసిస్. ఆర్. ఫ్రాంకెల్ ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాలోనూ, పశ్చిమ బెంగాల్‌లోని బర్ద్వానునూ సందర్శించింది. రెండు మూడు ఎకరాల పొలాలు కల చిన్న కమతాల రైతులు, ఎకరా దిగుబడిలో అభివృద్ధి సాధించినప్పటికీ, మొత్తం పంటలో వచ్చిన పెరుగుదల మాత్రం భూమిని అభివృద్ధి చేసేందుకు మళ్లీ ఖర్చు పెట్టవలసిన మొత్తం కంటే తక్కువేనని పేర్కొంది. పెరుగుతున్న వ్యయాల వలయంలో చిన్న రైతులు తమ జీవనస్థాయిని కాపాడుకునేందుకు మాత్రం ఇది పని చేసింది. చిన్న రైతులు గతంలో తమ భూమి కౌలుకిచ్చే సందర్భాలుండేవి. భూముల రేట్లు పెరిగినందువల్ల పెరిగిన పంట శిస్తు వల్ల సాగుదార్లు నష్టపోయారు. కొత్త పద్ధతుల కారణంగా లాభసాటిగా తయారైన వ్యవసాయం వల్ల భూస్వాములు సొంత సేద్యానికి ఉపక్రమించారు. మొత్తం మీద వీటన్నిటి వల్ల సాగుదార్లు సొంతదార్లకు చెందిన భూమిని సాగుచేసే రైతాంగం పరిస్థితి మరింత అధ్వాన్నమైపోయింది.

ఇక భూమిలేని కూలీల పరిస్థితి ఎలా ఉంది? వసూళ్ల రోజులలో వాళ్ల కూలీ పెరిగింది. కాని "పెరుగుతూన్న ధరల వల్ల కూలీల నికరాదాయంలో మార్పు రాలేదు సరికదా కొన్ని సందర్భాలలో గతించిన సంవత్సరాల మీద వాళ్ళ పరిస్థితి క్షీణించింది..."[21] అదీగాక యంత్రాలు విరివిగా ప్రవేశపెట్టబడడం వల్ల అనేక మంది వ్యవసాయ కూలీలు పనిలేని రద్దుగా మిగిలిపోయారు. గ్రామ ప్రాంతాలలో ఆదాయాల పంపిణీలలో అసమానతలను 'హరిత విప్లవం' మరింత పెంచింది. కొత్త సంపదలు తెచ్చి పెట్టిన కొత్త కోరికలు ధనిక రైతుల జీవనస్థాయిని పెంచడంతో హరిత విప్లవం బీదల హృదయాలలో కూడా కొత్త ఆశలను చిగురించింది. ఖర్చుకు సంబంధించిన స్థాయిలు సమానమవగా ఆదాయాల స్థాయిలు మాత్రం సమానం కాలేదు.

ఉత్తర భారతదేశంలో 'హరిత విప్లవం' వల్ల ఉత్పన్నమయిన ఘర్షణలు తలెత్తక మునుపే, భారతదేశంలోని మాజీ అమెరికన్ రాయబారి చెస్టర్‌బౌల్స్ భారత వ్యవసాయ సమస్యల తీరుతెన్నులు గురించి 1967 అక్టోబరు 30న ఒక నివేదికను తయారు చేసాడు. నక్సల్బరీ తిరుగుబాటును అప్పుడే అణచి, మొత్తం వృత్తాంతాన్నే ఏదో చెదురు మదురుగా జరిగిన హటాత్సంఘటనగా వర్ణిస్తూన్న సమయం అది. బౌల్సు ఇలా రాసాడు "గ్రామంలో అందరూ బీదవాళ్ళుగానే ఉన్నంత వరకు భూమిలేని బీదవాళ్ళు రెండు మూడు రూపాయిల కూలీని తీసుకుంటారు. కాని భూస్వాముల ఆదాయాలు పెరగడం వాళ్లు చూసాక తమ కూలీ మాత్రం (అసలంటూ పెరిగితే) తక్కువగానే పెరగడాన్ని వాళ్లు అసహ్యించుకుంటారు. చీకాకు పడతారు. ఆహారోత్పత్తి

సాధించే ఈ అభివృద్ధి (రానున్న సంవత్సరాలలో కూడా ఇది కొనసాగుతుంది). ఆదాయాలలో చూపే పదునైన హెచ్చుతగ్గుల వల్ల పెచ్చరిల్లే ఆర్థిక సామాజిక అన్యాయాలకు గురౌతున్నామనే భావానికి తావిస్తుంది."[22]

కొత్త వ్యావసాయిక విప్లవం తెచ్చిన మార్పుల్ని గుర్తించేందుకు భారత ప్రభుత్వానికి రెండు సంవత్సరాలు పట్టింది. 1969 సంవత్సరాంతానికి 'హరిత విప్లవం' తెచ్చిన అధికాహారోత్పత్తి వల్ల కూడా కొత్త అసమానతలు తలెత్తాయి. ఆ సంవత్సరం నవంబరులో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో వై.బి. చవాన్ ఇలా హెచ్చరించాడు. ".... సాంఘిక న్యాయంపైన ఆధారపడిన విప్లవం కూడా వస్తే తప్ప 'హరిత విప్లవం' పచ్చగా ఉండక పోవచ్చు."[23]

గ్రామీణ దారిద్ర్య నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన భూసంస్కరణలు, కొత్త వ్యవసాయిక వ్యూహం. రెండు కార్యక్రమాలూ ఏ విధమైన మార్పులూ సాధించలేక పోయాయి. పల్లెల్లో ఉన్న అర్థ భూస్వామ్య విధానానికి అవి మరింత దోహదం చేసాయి. గ్రామీణ బీదజనం ఆది నుంచీ భూస్వామ్యం వల్ల వచ్చిన సాంఘిక దూరాచారాలకు గూరౌతూనే ఉన్నారు. భూస్వాముల, వడ్డీ వ్యాపారస్థుల దోపిడీని అనుభవిస్తూనే ఉన్నారు. మొక్కుబడి చెల్లించుకున్నట్టుగా ప్రభుత్వం అమలు చేసిన భూసంస్కరణల వల్ల వాళ్ళకేమీ ఒరగలేదు. ఇదివరకెలా ఉన్నారో వాళ్లు ఇప్పుడూ అలాగే ఉన్నారు. ఇక సాంకేతిక చర్యల విషయానికొద్దాం. దేశం మొత్తంగా చూస్తే 'హరిత విప్లవం' తెచ్చిన విప్లవాత్మకమైన మార్పులేమీ లేవు. ఉత్తర భారతంలో కొందరు ఆర్థిక వేత్తలు ఆ కాలంలో కంగారు పడిపోయి దాన్ని "వ్యవసాయంలో పెట్టుబడిదారి విధానం"గా అభివర్ణించారు. కానీ అది ఆ మాటను సంతరించుకునేటంత సర్వతోముఖమూ, సర్వత్రమూ కాదు. యంత్ర పరికరాల ఉపయోగం పెరిగినా మొత్తం శక్తి వినియోగంలో వాటి శాతం 1970-71 కాలానికి కూడా చెప్పుకోదగినంతగా లేదు. నాటికి కూడా మొత్తం పొలాల్లో వినియోగించే శక్తిలో మనుషుల పశువుల శ్రమశక్తి 70 శాతం ఉంది.[24] ధనిక భూస్వాములకు సాంకేతిక విధానాలను అనుసరించినందువల్ల అధిక లాభాలు వచ్చాయి. కాని వాళ్లలో పెత్తందారీ భావాలు పోలేదు. కనుక మిగులు పంట వల్ల వచ్చిన అధిక లాభాల్ని తిరిగి ఉత్పత్తి రంగాలలో పెట్టుబడి పెట్టలేదు. ఆభరణాల కొనుగోలు, ఆడంబరంగా ఉత్సవాలు చేయడం, పెద్ద భవంతులు కట్టుకోవడం వంటి వ్యూడలు ఖర్చులు పెట్టసాగారు. ఇంకా మిగిలిన సొమ్మును వర్తకం, వడ్డీ వ్యాపారం వంటి రంగాలలో తిప్పసాగారు. ముందే చెప్పినట్టు 'హరిత విప్లవం' దేశ సాంఘిక జీవనంలో మరిన్ని అస్థిరతలను

తెచ్చి పెట్టింది.

ప్రభుత్వ వ్యవసాయ విధానాల చరిత్ర, స్వభావాలను పురస్కరించుకొని ఈ అనుభవాల దృష్ట్యా సి.పి.ఐ. (మా.లె.) పార్టీ భారత ప్రభుత్వాన్ని (Indian State) తన శత్రువుగా అభివర్ణించింది. దాన్ని "పెద్ద భూస్వాముల, దళారీ, బ్యూరోక్రాటిక్, పెట్టుబడిదార్ల ప్రభుత్వంగా" పార్టీ వర్ణించింది. పెద్ద భూస్వాముల పెత్తనానికి నిదర్శనంగా "భూస్వాములు రైతాంగాన్ని ప్రభుత్వ యంత్రాంగం సాయంతో హద్దులేని స్వేచ్ఛతో చేసే దోపిడీని, అణచివేతను" పేర్కొంది.

## గ్రామీణ సాంప్రదాయం : నిజం – మిథ్య

గ్రామీణ బీదజనం నానాటికీ అధ్వాన్నమౌతూన్న పీల్చి పిప్పిచేసే దారిద్ర్యాన్ని ఎలా అనుభవిస్తున్నారు? భూ సంస్కరణలను, అసలు – వడ్డీలను జలగల్లా పీల్చే షావుకార్ల దోపిడీని వాళ్లెలా స్వీకరిస్తున్నారు?

నక్సల్బరీ, శ్రీకాకుళాలలో తిరుగుబాట్లు పరాకాష్టగా 1966, 67 సంఘటనలు పత్రికలలో పతాక శీర్షికల నలంకరించే వరకు సామాన్యంగా అనుకున్న విషయం ఒకటుంది. అది. భారతదేశం అన్ని రకాల దోపిడీలనూ అన్యాయాలనూ సహిస్తున్న అసంఖ్యాక గ్రామాల సమూహం అనే దృఢమైన అభిప్రాయం చాలా మందిలో ఉండేది.

1947 అధికార మార్పిడికి ముందు బ్రిటిష వ్యతిరేకోద్యమాలలోనూ, జాతీయ బూర్జువా నాయకులు ప్రచారం చేసి పెంపొందించిన విలువలు, నిలబెట్టిన నీతుల ద్వారా వాస్తవ చరిత్రకు వ్యతిరేకంగా ఈ నమ్మకాన్ని చొప్పించడం జరిగింది. ఇటువంటి నమ్మకాల్ని చొప్పించిన భారత బూర్జువా నాయకులలో మొదటివాడు గాంధీ. భారత గ్రామీణ ప్రజల దుర్భర దారిద్ర్యాన్ని ఆయన గుర్తించి కూడా దేశ సాంప్రదాయాలలోని ద్వంద్వాల మధ్య పొత్తు కుదిర్చే వాటికే ప్రాధాన్యతనిచ్చాడు. వాటితో సరితూగే ఘర్షణలకు నిలయమైన సాంప్రదాయాల్ని లెక్కపెట్టలేదు. గాంధీ శిష్యులలో తెలివైన ఒక శిష్యుడిలా రాసాడు. "ద్వేషాన్ని ప్రేమతో, కోపాన్ని మౌనంతో, ఒక మంచి పనికై పోరాడేటప్పుడు ఇతరులపై దండన, హింస అవలంబించేందుకు బదులు తమపైనే బాధను మోపుకోవడం అనే ప్రాచీన భారత సాంప్రదాయం.... గాంధీ నాయకత్వంలో ఒక కొత్త వ్యాఖ్యానాన్ని సంతరించుకుంది."[26]

అందుకనే గాంధీ ఉద్యమాలను నిర్వహించేటప్పుడు ఎటువంటి హింస పొడచూపినా అణచివేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించేవాడు. ఎటువంటి హింస జరిగిన ఆధారం కనిపించినా అతడు ఉద్యమానికి బ్రేకులు వేసి ఆపు చేసేవాడు.

1922లో 'చౌరీ చౌరా' పోలీస్టేషనుకు నిప్పు పెట్టినప్పుడు అతను అలానే చేసాడు. అలాగే 1933 ప్రజా ఉద్యమాన్ని వ్యక్తి సత్యాగ్రహంగా మార్చి వేశాడు. భూస్వాములకు రైతులకూ మధ్య వైరుధ్యం విషయంలో కూడా గాంధీ ఎదిరింపులకు బదులు రాజీనే బలపరచాడు. 1921 సహాయ నిరాకరణోద్యమంలో ఉత్తర ప్రదేశ్‌లోని 'కిసాన్లు' "తమ హద్దును మీరి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నందుకు" నిరసించాడు. ఇంకా ఇలా అన్నాడు. ".... మన సహాయ నిరాకరణోద్యమం ఏ స్థాయిలోనూ జమీందార్ల శిస్తును ఎగ్గొట్టేందుకు ఉద్దేశించినది కాదు. కిసాన్ల అంతస్థులో అభివృద్ధిని సాధించి జమీందార్లకూ కిసాన్లకూ మధ్య సత్సంబంధాలు నెలకొల్పడమే కిసాన్ ఉద్యమ లక్ష్యం. వాళ్ల మధ్య అనాదిగా వస్తున్న ఒప్పందాలు రాతమూలకంగా లేకపోయినా అమలు చెయ్యాలని కిసాన్లకు చెప్పాలి. ఒక సాయం కాని లేదా రాత మూలకంగా ఉన్న ఒప్పందం బాగా లేనప్పుడు ముందుగా జమీందార్ల దృష్టికి ఆ విషయం తేవాలి. అంతేకాని కిసాన్లు దానిని బలవంతాన అతిక్రమించడానికి ప్రయత్నించ కూడదు. అన్ని సందర్భాలలోనూ జమీందార్లతో సుహృద్భావచర్చలతోనే అంగీకారానికి ప్రయత్నించాలి."[27]

కాబట్టి గాంధీ రాజకీయ అనుచరులు పరిపాలన చేపట్టినప్పుడు, స్వతంత్ర పోరాటాలను, అందునా రైతాంగ ప్రదర్శనను నిరసించడం ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు. 1947కు ఎంతో ముందే 1938లో ఏప్రిలు 14వ తేదీన "మాటిమాటికీ జరిగే కిసాన్ ప్రదర్శనలు చవుకబారుగానూ అసంబద్ధంగానూ తయారౌతున్నాయని" జవహర్‌లాల్ నెహ్రూ నిరసించాడు.[28]

ఆ విధంగా రైతాంగం యొక్క వీరోచిత పోరాటాలను కాంగ్రెసు నాయకులెప్పుడూ నిరుత్సాహపరుస్తూనే ఉండేవారు. అందువల్ల సహజంగానే అధికార జాతీయోద్యమ చరిత్రలలో రైతులు చేసిన తీవ్ర వ్యతిరేక పోరాటాల్ని చిన్న చూపు చూడడం జరిగింది. పెత్తందారీ భూస్వాములకూ రైతాంగానికీ మధ్య గల ఘర్షణలకు ప్రాధాన్యత నివ్వలేదు. గ్రామీణ జీవితంలో గల రాజీ ధోరణులకు పెద్ద పీట వేశారు. గ్రామీణ జీవితంలోని వర్గ వైరుధ్యాల దారుణ వాస్తవానికి ప్రతిగా, గ్రామాల్లోని అన్ని తరగతుల సమీకరణ సుహృద్భావాశయ వేదికగా 'పంచాయత్'ను నిలబెట్టారు.

లొంగిపోయిన రైతాంగమనే మిధ్యను ప్రచారం చేశారు. దేశీ విదేశీ మేధావులు ఈ మిధ్యను నిజమని నమ్మారు. ఒక విద్యాధిక బృందం చేసిన ఈ దిగువ తరహా చప్పటి సూత్రీకరణను ఏమనుకోవాలి? "దాదాపు 300 మిలియన్ల రైతాంగం భారత గ్రామీణ జీవిత నిశ్చతలకు పునాది. వీళ్ళు అత్యంత వినయ విధేయులు. భారతీయ

సంఘ పరంపరను క్రమణికలో స్థిరమైన భాగం. మౌలికమైన పునాదిగా ఉన్నారు. మరే నాగరిక వారసత్వానికైనా దీటైన ఈ పునాదిపైనే దేశం తన జాతీయ సంఘ జీవనాన్ని నిర్మించుకుంటుంది."[29]

## రైతు తిరుగుబాటు

కాని వాస్తవం ఏమిటి? ఇటీవలి భారతదేశ చరిత్రలో రైతు ఎంతో హింసకు గురయ్యాడు. అవకాశం దొరికినప్పుడల్లా విదేశీ అధికార దొంగలపైనా దేశీయ పీడకులపైనా కూడా తిరుగుబాటు చేసాడు.

భారతదేశంలో బ్రిటిషు పరిపాలన ప్రారంభంలోనే రైతు తిరుగుబాట్లు అనేకం జరిగాయి. మొదటి స్వాతంత్ర్య సంగ్రామంగా వర్ణించబడే సిపాయీల తిరుగుబాటుకు చాలాముందే అటువంటి తిరుగుబాటు జరిగింది. కరువుకు గురైన బెంగాల్, బీహార్ రైతులు 1770లోనే ఈస్టిండియా కంపెనీపై తిరుగుబాటు చేసారు. ఇదే సన్యాసి తిరుగుబాటుగా ప్రసిద్ధికెక్కింది. ఈ 'సన్యాసుల్ని', 'ఫకీరు'ల్ని అనేక విధమైన వసూళ్ళతో బ్రిటిషువారు పీల్చి పిప్పి చేసారు. వాళ్ళు రైతాంగాన్ని సమీకరించి తిరుగుబాటులో ప్రముఖ పాత్ర వహించినందువల్ల ఇది 'సన్యాసి తిరుగుబాటు'గా పేరు పొందింది. వీళ్ళే కాక చిన్నాభిన్నమై పోయిన మొగలు సైన్యపు వేలాది నిరుద్యోగ సైనికులు, గ్రామీణ పనివారలు, బ్రిటిషు వర్తకులకు బానిసలుగా మారిన బెంగాలు పట్టునేతగాళ్లు ఇందులో పాల్గొన్నారు. మజ్నూషా, భవానీపతక్, దేవీచందు రాణీ... మరెందరో వీరులు పాల్గొన్న ఈ తిరుగుబాటు 19వ శతాబ్దం ఆరంభం వరకూ నడిచింది. బీహార్, బెంగాల్‌లలో గల అనేక ప్రాంతాలలో ఈస్టిండియా కంపెనీ కార్యాలయాలపై దాడి చేశారు. కంటకులైన భూస్వాముల నెందరినో చంపారు. వడ్డీ వ్యాపారస్తులనూ, పీడించే బ్రిటిషు వర్తకులనూ, సైనికాధికారులనూ చంపారు. సాధారణ యుద్ధం, గెరిల్లా యుద్ధం వంటి రెండు యుద్ధపద్ధతులనూ అనుసరించి బ్రిటిష్ సైన్యంతో పోరాడారు.[30]

సన్యాసి తిరుగుబాటులోని సంఘటనలను పరిశీలిస్తే అనేక విషయాలలో మావో సే-టుంగ్ రూపొందించిన గెరిల్లా యుద్ధపద్ధతుల్ని తలంపుకు తెచ్చే ఎత్తు గడల్ని ఈ తిరుగుబాటుదార్లు అనుసరించడం కుతూహలకరమైన విషయం. ఈ దిగువ అటువంటి పోరాటాలలో ఒకటి వర్ణించబడింది.

రంగం : రంగాపూర్ దగ్గర గల శ్యాంగంజ్. తేదీ డిశంబరు 30, 1772 ఉదయం. తిరుగుబాటుదార్లను కమాండర్ థామస్ ఎదుర్కొన్నాడు. తిరుగుబాటు సైన్యపు

నాయకులు ముందు యుక్తిగా తమ సైన్యాలతో పారిపోతున్నట్టు నటించారు. మెల్లగా వెను తిరుగుతూ థామస్ సైన్యాలను దాపున గల దట్టమైన అడవిలోకి ఆకర్షించుకున్నారు. విజయోత్సాహంతో విజృంభించిన బ్రిటిషు సైన్యాల మందుగుండు సామాగ్రీ తుపాకీగుళ్లు ఐపోయాయి. తిరుగుబాటు సైన్యం ఈ అవకాశాన్నుపయోగించు కుని బ్రిటిషు సేనల్ని నలువైపులా చుట్టుముట్టింది. గ్రామాలలోని రైతులందరూ తమ తమ ఆయుధాలైన విల్లు, బాణాలు, బల్లేలు, బడిగెలతో తిరుగుబాటుదార్లతో చెయ్యి కలిపారు. కొద్ది సేపటిలోనే థామస్ సైన్యం ఓడిపోయి పారిపోయింది. కమేండర్ థామస్‌ను తిరుగుబాటుదార్లు కత్తితో పొడిచి చంపారు."[31]

దక్షిణ భారతంలో 1800–1801 కాలంలో బ్రిటిషు సైనికుల మీదా, దేశీయ ఫ్యూడలు రాజకుమారుల మీద దళ నాయకులు జరిపిన తిరుగుబాటులో రైతాంగ తిరుగుబాటుదార్లు అనుసరించిన పద్ధతులతో మావో గెరిల్లా యుద్ధపు ఎత్తుగడల పోకడలు మరింత కొట్టొచ్చినట్టు కనబడతాయి. మంచి ప్రజాబలం కలిగిన నాయకులైన శివగంగకు చెందిన మురుడు పాండ్యన్ రామనాడుకు చెందిన మాలప్పన్, మరెందరో ముఖ్యులు దక్షిణ భారతంలో ద్వీపకల్ప సంఘటనను (Peninsular Confederacy) అనేక ప్రాంతాలలో బ్రిటిషు సైన్యాలను ఓడించారు. అనేక గ్రామాలలో అధికారాన్ని నెలకొల్పి ప్రజాకమిటీలను ఏర్పరిచారు. గ్రామస్తులు తూర్పు ఇండియా కంపెనీకి పన్నులు చెల్లించ నిరాకరించారు.[32] తమకంటే అధికులైన విదేశీ సైన్యాల్ని దుర్గమమైన కొండల నుంచీ, అడవుల నుంచీ రైతులు ఇచ్చిన ఆయుధాలతో ప్రచ్ఛన్న యుద్ధంలో చికాకు పరిచారు. "అన్ని వైపుల నుంచీ శతృవు మీద పడితే ఏ ఒక్కవైపు నుంచీ ఎదుర్కొనేందుకు చాలినంత శక్తి శత్రువుకు లేకుండా శత్రుబలం అన్ని వైపులా విభజింపబడుతుందనీ, దానివల్ల శత్రు బలాన్ని నీరసపరచవచ్చునని వాళ్ళు భావించారు.[33]

తిరుగుబాటుదార్ల ధాటికి తట్టుకోలేక బ్రిటిషువాళ్ళు అత్యవసర ప్రాతిపదికపై సిలోన్, మలయా, ఇంగ్లాండుల నుంచి పటాలాలను తెచ్చుకోవలసి వచ్చింది. కాని "బ్రిటిష్ వాళ్ళకంటే, తిరుగుబాటుదార్లు నిలదొక్కుకోలేక పోవడానికి ముఖ్యకారణం రాజకుమారులు అవలంభించిన విరోధ వైఖరి. వాళ్ల సేవల వల్ల బ్రిటిషు వాళ్ళు అజేయులయ్యారు. దేశభక్తుల మనోబలంపై వెన్నుపోటు పొడిచారు. వాళ్ళలో వాళ్ళకు భేధాభిప్రాయాలు వచ్చాయి."[34]

అలాగే బీహార్‌లోని చోటానాగాపూర్‌లోని 'హో' ఆదిమజాతి రైతులు కూడా బ్రిటిషు పాలకులపై 1820లో తిరుగుబాటు చేసారు. ఆ తిరుగుబాటు స్థానిక షాహుకార్లపైనా,

జమీందార్లపైనా కూడా సాగింది. ఆ ప్రాంతంలో స్థాపించిన బ్రిటిషు పాలనాధికారం 'హో' ప్రజల సాంఘిక, ఆర్థిక జీవనాన్ని కలచివేసింది. వాళ్ళ మధ్యలో అనేక మంది హిందూ, ముస్లిం, సిక్కు వర్తకులు, షాహుకార్లు స్థిరపడ్డారు. న్యాయస్థానాల తీర్పుల నాధారం చేసుకుని వాళ్ళ భూముల్ని ఆక్రమించారు. హో ప్రజల్లో అసంతృప్తి తాండవించింది. బ్రిటిషువాళ్లు 1820 హో తిరుగుబాటును త్వరగానే అణచివేశారు. హో ప్రజలు 1821లో మళ్ళీ తిరుగుబాటు చేశారు. ఈసారి వాళ్ళు సంఘటితమై చినేపూర్ కోటను పట్టుకొన్నారు. కొల్హాన్ ప్రాంతం వాళ్ళ వశమైంది. జమీందార్లు, పోరాబాట్‌రాజా కలసి బ్రిటిషు సాయం కోరారు. వాళ్ళు హో తిరుగుబాటును నిర్దాక్షిణ్యంగా అణచివేశారు.

19వ శతాబ్దం అంతా ఛోటా నాగపూర్ ప్రాంతం తిరుగుబాట్లతో కల్లోలంగానే ఉండేది. 1820, 1832, 1890 సంవత్సరాలలో ఓరాన్లు అనే మరో ఆదిమ తెగ ప్రజలు తిరుగుబాట్లు చేసారు. 1831-32లో కోల్ ఆదిమ తెగ ప్రజలు ప్రభుత్వాధికార్లపైనా సాహుకార్లపైనా తిరుగుబాటు చేసారు. ఒక నివేదికలో వర్ణించిన నాటి స్థితిగతులు నేటి రైతాంగపు దుస్థితికి ఎంతో చేరువగా కనపడతాయి. కోల్ తిరుగుబాటును అణచడానికి నియమితులైన జాయింటు కమిషనర్లు విల్కింసన్, డెంటులు తమ నివేదికలో ఇలా రాసారు. "మహాజన్"లు డబ్బు, ధాన్యం అప్పుగా ఇచ్చి 12వ నెల లోపల వాళ్ల నుంచి 70 శాతం లేదా అంతకు మించి రాబట్టుకునే వారు... ఎంతో మంది కనుమ కింద నుంచి వచ్చి నాగపూర్‌లో స్థిరపడ్డారు... కోలులు గత ఐదు సంవత్సరాలలో ఈ ప్రవాసులకు బాగా రుణపడ్డారు. వాళ్లు బాకీల చెల్లింపుకు వత్తిడి చేస్తే కోలులు 'సేవకపత్తాలు' రాసి తమను తాము కట్టు బానిసలుగా బాకీ తీరేంతవరకూ అమ్ముడు పోయారు. తమ సంపాదనంతా బాకీదార్ల పరం చేస్తూ వాళ్లు ఆజన్మాంతకం బానిసలుగా మారారు..."[35] కోలు తిరుగుబాటును అణచేందుకు కలకత్తా నుంచి, దానాపూర్ నుంచీ బెనారస్ నుంచి సైన్యాలను తరలించారంటే ఈ తిరుగుబాటు ఏ స్థాయిలో జరిగిందో ఊహించవచ్చు.

ఈ కాలంలో జరిగిన వాహాబీ తిరుగుబాటు మరో ముఖ్యమైన తిరుగుబాటు. ఇది ప్రసిద్ధి చెందిన తితూమీర్ నాయకత్వం కింద 1931లో జరిగింది. మత సంస్కరణోద్యమంగా ఈ తిరుగుబాటు మొదలై పాత కాలపు ముల్లాలపై, ఫ్యూడలు భూస్వాములపై, బ్రిటిషు సైనికులపై సాయుధ తిరుగుబాటుగా మారింది. ఈ పోరాట కాలంలో నరికేల్బరియా గ్రామం నుంచి టిటూ తన అనుయాయులతో బ్రిటిషువారిపై అంతిమ యుద్ధం కొనసాగించి ఓడిపోయాడు. అనేక పోరాటాల్లో అంతకు ముందు

బ్రిటిషువారిని జయించి దక్షిణ 24 – పరగణాలలోనూ, నాడియా, జెస్సూర్లలోనూ జమీందార్ల నుంచి పన్ను వసూలు చేసి అధికారం చెలాయించాడు.[36] రాజకీయ పరిపక్వత లేకపోయినా "ప్రాంతీయ పద్ధతిన అధికారం పట్టుకోవడం" ద్వారా "విముక్త ప్రాంతాల్ని" నెలకొల్పడం మనకిందులో కనిపిస్తుంది. చాలాకాలం తరవాత ఇవే భావాలు సి.పి.ఐ. (మా.లె.) ఆచరణ సిద్ధాంతాలలో చోటు చేసుకోవడం గమనించాలి.

1855–57లో జరిగిన సంథాల్ తిరుగుబాటు భావిలో రైతు పోరాటాలను మరింత ఉత్తేజపరచగలిగినదిగా నిలిచిపోయింది. సంథాల్ దేశంగా పరిగణించబడిన ప్రాంతం సువిశాలమైంది. ఉత్తరాన బీహార్లోని భగల్పూరు, దక్షిణాన ఒరిస్సా, హాజరీబాగ్ నుంచి బెంగాలు సరిహద్దు దాకా తూర్పు పడమరలలో గల రాజమహల్ కొండలలో గల 'దమిన్–ఇ–కో' (కొండ సరిహద్దుల) దేశానికి కేంద్రం. అడవులను కొట్టుకుని, ప్రతీ అంగుళం మేరా సాగుచేసుకుని సంథాల్ ప్రజలు ప్రశాంతంగా జీవించేవారు. వాళ్ళ ప్రశాంత జీవనంలో బెంగాలీ వ్యాపారులు ఇతర వర్తకులు ప్రవేశించారు. సంథాల్‌లకు విలాస వస్తువులను అరువుగా ఇచ్చి ఎక్కువ వడ్డీలు వేసి పంటల కాలంలో ఆ అప్పులను వసూలు చేసుకునేవారు. ఏటేటా మహాజన్‌ల పద్దు పుస్తకాలలో సంథాల్‌ల ఖాతాలలో బాకీ పెరిగేది. అలా పెరిగి పెరిగి చివరకు పేద సంథాల్ రైతులు పంటను, నాగలిని, ఎడ్లను చివరకు భూమిని కూడా వదులుకోవలసి వచ్చేది. క్రమంగా భూమిలేని సంథాల్‌ల నడుంపై మోయలేని రుణభారం వాళ్ళనూ వాళ్ళ వారసుల్నీ కూడా వర్తకుల కుటుంబాలకు వెట్టిచాకిరీ చేసే కట్టు బానిసలుగా మార్చింది.

సంథాల్ తిరుగుబాటుకు భగ్నదిహేకి చెందిన సిధూ, కానూ సోదరులు నాయకత్వం వహించారు. బీహార్ నుంచి ఒరిస్సా దాకా గల సంథాల్ ప్రాంతంలో ఆ తిరుగుబాటు పెద్ద పెట్టున సాగింది. న్యాయస్థానాల నుంచి న్యాయాధీశుల నుంచి న్యాయం పొందే విఫల ప్రయత్నం చేసిన నాటి సంథాల్‌ల నినాదం – "షాహుకార్లకు భూస్వాములకు, సివిల్ కోర్టులకు, పోలీసులకు చావు!" అది భూస్వామ్య వ్యతిరేక పెత్తందారీ వ్యతిరేక ఉద్యమంగా రూపొందింది. కొన్ని నెలల్లో పరిస్థితులు తారుమారయ్యాయి. షాహుకార్లు రేపిన సుడిగాలి వాళ్ళనే నిర్దాక్షిణ్యంగా చుట్టుముట్టింది. కంటకులైన భూస్వాముల్ని, వర్తకుల్ని, మహాజన్‌లను ఏరి చంపేశారు. తరువాత చరిత్రకారులు తిరుగుబాటుదార్లు చేసిన "అత్యాచారాల" పై విభ్రాంతిని వెలిబుచ్చారు. కాని సంవత్సరాల తరబడి భూస్వాములు చేసిన చిత్రవధలు, వర్తకుల పాశవికత్వం గుర్తించడానికి వాళ్ళకు కళ్లు, హృదయం లేకపోయాయి.

దిగువ తరగతులకు చెందిన భూమిలేని బీద రైతులు, గ్రామాల్లో చేతి పనివారలు

కూడా సంథాల్ తిరుగుబాటులో చేరారు. అనేక పోరాటాలలో వాళ్లు బ్రిటిషు సైన్యాలను ఓడించారు. వలస ప్రభుత్వం బీర్భూం నుంచి బెంగాలులోని ముర్షిదాబాదు వరకు, బీహారులోని భగల్పూరు దాకా సైనిక పాలన విధించింది. తిరుగుబాటుదార్లు ఆ ప్రాంతంలో బ్రిటుషు పాలనను నామరూపాల్లేకుండా చేశారు. సంథాల్ విప్లవాన్ని బ్రిటిషి సైన్యాలు అణచివేశాయి. మందుగుండు పేల్చే సైనికులకూ విల్లంబులతో పేద రైతులకూ మధ్య జరిగిన ఆ అధర్మయుద్ధంలో దాదాపు 10,000 మంది సంథాల్ తిరుగుబాటుదార్లు చనిపోయారు. ఉద్యమాన్ని అణచివేసిన ఒక బ్రిటిషు సైన్యాధికారి అన్నట్టు పాపం! సంథాల్‌ల నిరాడంబర ఆయుధ సామాగ్రిలో తెల్ల జెండా లేదు. లొంగుబాటు అంటే ఏమిటో వాళ్ళకు తెలీదు.

హటాత్తుగా అప్పుడప్పుడు జరిగిన ఈ తిరుగుబాట్లన్నీ 1857 తిరుగుబాటుతో పరాకాష్టకు చేరుకున్నాయి. ఈ తిరుగుబాటులో అంతర్భాగంగా ఉత్తర భారతంలో రైతాంగ తిరుగుబాట్లు జరిగాయి. 1857 తిరుగుబాటులో రైతాంగ పాత్రను బూర్జువా చరిత్రకారులు గుర్తించలేదు. అయినా సమకాలీన చరిత్రలో రైతుల పాత్రను గురించిన సమాచారం ఎంతో ఉంది. ఒక బ్రిటిషు ప్రత్యక్షసాక్షి ఇలా వివరించారు : "..... ఔధ్‌లోని ప్రజలందరూ ఆయుధాల్ని పట్టారు. ప్రతి గ్రామం ఒక కోటగా ప్రతి పౌరుడూ మనపై ఎదురు తిరిగాడు. ఉదాహరణకు లక్నోను ముట్టడించిన 40 వేల మందిలో 20 వేల మంది పొలాల్లో నాట్లకు వెళ్ళారు."[37] లక్నో కాన్పూరుల మధ్య 1858లో జరిగిన ముగంజ్ యుద్ధంలోని 8000 మంది తిరుగుబాటుదార్లలోనూ వెయ్యిమంది సిపాయిలు. మిగిలినవాళ్ళు చుట్టుపక్కల గ్రామాల రైతులు.[38]

తిరుగుబాటు మొదలైన కొద్ది రోజుల్లోనే ఉత్తర భారతం అంతటా బ్రిటిషుపాలన తుడిచిపెట్టుకు పోయింది. ప్రజలలోని వివిధ వర్గాల నుంచి సిపాయిల నుంచి ఎన్నుకొన్న ప్రతినిధులతో 'పరిపాలనని' ఏర్పరిచి ఏదో రూపంలో ప్రజా ప్రభుత్వాన్ని నిలబెట్టే ప్రయత్నం చేసారు. మిగతా కథ తెలిసిందే. బ్రిటిషు సామ్రాజ్య వాదుల్ని ఎదిరించేందుకు వలస వ్యతిరేక బూర్జువా వర్గం ఇంకా ఏర్పడలేదు. కనుక వాళ్ళు అసంతృప్తి చెందిన మాజీ భూస్వాములు పాలకులను నాయకత్వం చేపట్టమని కోరారు. తమ తమ లాంఛనాల్ని ఎంతో కొంతగా కాపాడతారనే ఆశతో వీళ్ళు విదేశీ శక్తులతో కుమ్మక్కై తిరుగుబాటుకు వెన్నుపోటు పొడిచి ద్రోహం చేయడం అతి సహజంగా జరిగిపోయింది.

బ్రిటిషు పాలన దేశంలో వేళ్ళూనుకొన్నా 1857 తర్వాత కూడా రైతాంగంలో అసంతృప్తి బహిర్గతమౌతూనే ఉంది. బ్రిటన్లో పెరుగుతున్న పత్తి పరిశ్రమకు అందించే

నీలిమందు రంగును తయారు చేసే ఇండిగో తోటలలో బ్రిటిషు ప్లాంటర్లకింద జీవితాంతం కట్టు బానిసలుగా పనిచేసే బెంగాలు రైతులు 1850లో తిరుగుబాటు చేసి ఆ దమననీతిని అంతం చేసారు.

ఇటీవలి చరిత్రలో దేశంలో రెండు పెద్ద రైతాంగ తిరుగుబాట్లు జరిగాయి. వాటిలో మొదటిది 'తెభాగా' (మూడు భాగాల ఉద్యమం) పోరాటం. రెండవది 1946-51 కాలంలో జరిగిన తెలంగాణా సాయుధ పోరాటం. హటాత్తుగాను, స్వయంచోదితంగాను జరిగిన తిరుగుబాట్లకూ వీటికీ తేడా ఉంది. ఈ రెండు తిరుగుబాట్లు స్పష్టమైన రాజకీయాశయంతో, బలమైన సంఘటనతో ఆచరణయోగ్యమైన కార్యక్రమంతో జరిగాయి. ఈ రెండు తిరుగుబాట్లలోనూ నాటి అవిభక్తి భారత కమ్యూనిస్టు పార్టీ ప్రముఖ పాత్ర నిర్వహించింది.

పేరుకు తగినట్టుగానే 'తేభాగా' ఉద్యమం భూస్వాములకు రైతులు చెల్లించే పంట వాటాను సగం నుంచి మూడొంతులకు తగ్గించాలని కోరుతూ జరిగిన పోరాటం. కమ్యూనిస్టు పార్టీ ఆధీనంలోకల కిసాన్ సభల నాయకత్వంలో రైతులు పొలాలు సాగు చేసి బలవంతంగా మూడింట రెండొంతుల పంటను తమ గాదెల్లో పోసుకున్నారు. భూస్వాములు గూండాలు పోలీసుల సాయంతో రైతుల్ని ఎదిరించారు. పోరాటాలు జరిగాయి. ఉత్తర బెంగాలులోని దినావూ రంగాపూర్లనుంచి మొదలై ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వ్యాపించిన ఈ ఉద్యమం దక్షిణాన 24 - పరగణాల దాకా విస్తరించింది. ఆర్థిక మెరుగుదలలు (economic demands) ప్రాతిపదికగా ఈ ఉద్యమం నడిచింది. ఉద్యమం ఉధృతమైన కొన్ని ప్రాంతాలలో భూస్వాములు తమ భూములను రైతుల పాల్జేసి గ్రామాల్ని వదలి పారిపోయారు. ఆయా ప్రాంతాలలో గ్రామ వ్యవహారాలన్నీ కిసాన్ సభల ఆధ్వర్యం కింద జరగసాగాయి. దాదాపు 'విముక్తి ప్రాంతాలు' ఏర్పడ్డాయి.

అనేక కారణాల వల్ల 'తెభాగా' ఉద్యమం ఆగిపోయింది. కొంత మంది సి.పి.ఐ. నాయకుల అభిప్రాయం ప్రకారం పార్టీ మధ్య తరగతి రైతులను తమతో ఉంచుకోలేకపోయింది. పాలెగాళ్ళ కోర్కెలకు జడిసి వాళ్ళు భూస్వాముల పక్షానికి పోయారు. మాసూలైన పంటలో రెండింట మూడు వంతులు పాలెగాళ్ళకు సంక్రమించాలని శాసించే 'బార్గాదార్' చట్టాన్ని ముస్లింలీగ్ మంత్రివర్గం ప్రవేశపెట్టింది. దీనితో కోపోద్రిక్తులైన పాలెగాళ్ళు శాంతించారు. దాంతో తాత్కాలికంగానైనా ఉద్యమంలో కొంతవరకూ చేవ కొరవడింది. కాని కమ్యూనిస్టు నాయకులు ఆ చట్టాన్ని అమలు చేసేందుకు ఎటువంటి ప్రయత్నం చెయ్యలేదు. భూస్వాములదే పై చేయి

అయింది. రైతులపై తీవ్ర దమనకాండ మొదలెట్టారు. ఉగ్ర పోరాటాలను నిర్వీర్యం చెయ్యడమే కాంగ్రెసు విధానం. దానికనుగుణంగా 1947 కాంగ్రెసు పాలెగాళ్ళకు, భూమి లేనివాళ్ళకు వ్యతిరేకంగా భూస్వాముల కొమ్ముకాస్తూ పాలనా యంత్రాంగం సాయంతో వాళ్ళకు రక్షణ కల్పించింది.[39]

సి.పి.ఐ. (మా.లె.) వివరణ మరో విధంగా ఉంది. 'తెభాగా' ఉద్యమంలో స్వయంగా పాల్గొన్న చారుమజుందార్ ఇలా వివరించాడు. "ఈ ఉద్యమంలో 60 లక్షల మంది రైతులు పాల్గొన్నారు. మొత్తం రైతు ఉద్యమ చరిత్రలోనే ఇది స్వర్ణయుగం. ఈ ఉద్యమం బహుళమైంది. భావోద్వేగంతో వెల్లివిరిసింది. తీవ్ర వర్గద్వేషాన్ని వెలిబుచ్చింది. వీటన్నిటి దృష్ట్యా వర్గపోరాటానికి అత్యున్నత దశ ఇది." ఇన్ని ఉన్నా రైతులు అధికారాన్ని ఎందుకు చేజిక్కించుకోలేకపోయారో అదే వ్యాసంలో ఇలా వివరించాడు. "... అది జరగకపోవడానికి ఒకే ఒక కారణం ఉంది. ఆ రోజుల్లో విప్లవ ప్రజా కేంద్రం నుంచి ఆయుధాలను ఆశించారు. లెనిన్ మార్గంలో మాకు నమ్మకం పోయింది. స్థానికంగా ఆయుధాలను సేకరించి, ప్రాంతీయపరంగా అధికారాన్ని చేపట్టాలనే స్థిర నిర్ణయాన్ని ఆ రోజుల్లో ఆమోదించలేకపోయాం. నిరాయుధులైన రైతులు ఆయుధాల ధాటికి ఎదురొడ్డి నిలవలేకపోయారు. చావుకు తెగించి పోరాడిన వాళ్ళు కూడా చివరకు వెన్ను చూపవలసి వచ్చింది. "భావితరాల విప్లవకారులు ఈ తప్పుల నుంచి నేర్చుకోవలసిన గుణపాఠం" ఆయుధాలు సేకరించవలసిన బాధ్యత స్థానిక సంస్థలదే కాని కేంద్రానిది కాదు" అని చారుమజుందార్ వివరించాడు (2)

## తెలంగాణ సాయుధ పోరాటం

దక్షిణ భారతంలో గల పూర్వపు హైదరాబాదు సంస్థాన్‌లో తెలంగాణ ఒక భాగం. హైదరాబాదు సంస్థానం దేశంలోని సంస్థానాలన్నిటిలోనూ పెద్దది. ఆ రోజుల్లో దాని జనాభా 17 మిలియన్లు. జిల్లాలు 17. అందులో సగం తెలుగు మాట్లాడే తెలంగాణ ప్రాంతం. తెలంగాణా సాయుధ పోరాటం చారిత్రాత్మక విలువ గల ఉద్యమం.

ఈ తెలంగాణ ఉద్యమం 1946లో మొదలైంది. వెట్టిచాకిరీ, అక్రమ వసూళ్లు, రైతుల్ని దుర్మార్గంగా తొలగించడం వంటి చర్యలకు గ్రామ పటేళ్ల దమనకాండలకు వ్యతిరేకంగా ఆ ఉద్యమం మొదలైంది. తరువాత అది నిజాం వంశపారంపర్య పాలనపై, పెత్తందారీ భూస్వామ్య విధానంపై రైతాంగ విముక్తి పోరాటంగా మారింది. భారత సేనలు 1948 సెప్టెంబరులో పోలీసు చర్య జరిపి నిజాం సంస్థాన్‌లో ప్రవేశించడంతో నిజాం పరిపాలన అంతమైంది. హైదరాబాదు భారత యూనియన్‌లో విలీనమైంది.

అయినా పోరాటం కొనసాగింది. ఈ పోరాట ఆరంభంలో భూస్వాముల గూండాలను పోలీసులనూ లాటీలతో కొడవళ్ళతో ఎదుర్కొని రైతులు ఆత్మరక్షణ చేసుకోవడం మొదలెట్టారు. తరువాత కాలంలో నిజాంపైన, నిజాం సైన్యాలపైనా ఆ తరువాత భారత సైన్యాలపైనా సమగ్ర సాయుధ పోరాటం నడచింది.

1947లో దాదాపు 5 వేల మంది గల గెరిల్లా సైన్యం తెలంగాణాలో పని చేస్తోంది. 1951 దాకా కొనసాగిన ఈ ఉద్యమకాలంలో 10 వేలమంది గల గ్రామ దళాలు 2 వేల మంది గల గెరిల్లా దళాలు ఏర్పడ్డాయి. ప్రధానంగా మూడు జిల్లాల్లోని (వరంగల్, నల్లగొండ, ఖమ్మం) 3000 గ్రామాలలో 16 వేల చదరపు మైళ్ల ప్రాంతంలో 30 లక్షల మంది ప్రజలు 'విముక్తి' చెంది 'గ్రామరాజ్యం' (సోవియట్లు) స్థాపించుకున్నారు. గ్రామాల నుంచి భూస్వాములను వెళ్లగొట్టి, వాళ్ళ భూములను ఆక్రమించుకుని రైతాంగం దాదాపు 10 లక్షల ఎకరాలను పంచుకున్నారు. ఈ ఉద్యమంలో 4 వేల మంది దాకా కమ్యూనిస్టు కార్యకర్తలు రైతువీరులు అసువులు బాసారు. కమ్యూనిస్టులు లేదా వారి సానుభూతిపరులుగా అనుమానించబడిన దాదాపు 10 వేల మంది ప్రజలను నిజాం ప్రభుత్వం తన జైళ్లలో కుక్కింది. తరువాత భారత సైన్యాలు కూడా వాళ్లను అలాగే సన్మానించాయి.[40] (సెప్టెంబరు 1948కి ముందు) నిజాం వ్యతిరేక ఉద్యమ భాగంలోని తిరుగుబాటుదార్ల వ్యూహం, ఎత్తుగడల గురించి రాస్తూ ఆ ఉద్యమంలో పాల్గొన్న ఒక కమ్యూనిస్టు నాయకుడిలా రాసాడు. "సుశిక్షితులైన గెరిల్లాలు లేకుండా రజాకార్ల* పోలీసుల సైనికుల దాడుల్ని ఎదుర్కోలేమని అభిప్రాయపడ్డాం. దీనికి ఆయుధాల సేకరణ, గెరిల్లా దళాల నిర్మాణం అవసరం. ఇంతకు పూర్వం జరిగిన పోరాటాలన్నీ ఆత్మరక్షణపరమైనవీ, ఆర్థికపరమైనవీ. రాజకీయంగా ప్రధానమైనవైనా, రాజకీయ విముక్తి నినాదాల నుంచి అవి జరగలేదు. అందువల్ల ముందు ముందు పోరాటాలను రాజకీయ విముక్తి నినాదాలతో నిర్మించాలి. కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభ (రాజకీయంగా నిషేధించబడ్డ కమ్యూనిస్టుపార్టీ దీని వెనకాల రహస్యంగా పనిచేసింది) కలసి ఆయుధాల సేకరణకు, గెరిల్లా దళాల నిర్మాణానికి పిలుపునిచ్చాయి. అర్ధరాత్రి భూస్వాముల ఇళ్లపై మెరుపు దాడులు చేసి వాళ్ల ఆయుధాలను ఒక నిర్ణీత దినాన సంగ్రహించాలని ఉత్తర్వులు ఇచ్చారు.... తమ పూర్తి కాలాన్ని ఈ ఉద్యమానికి వినియోగించ గల యువకులతో గెరిల్లా దళాలను

* *మజ్లీస్ ఇత్తెహాదుల్ ముస్లీమాన్ నాయకుడైన కాశింరజ్వీ నాయకత్వంలో రజాకార్ సైన్యం ఏర్పడింది. హైదరాబాద్ సంస్థానాన్ని హిందువుల బారినుంచి కాపాడడం వీళ్ల ఆశయం.*

నిర్మించారు. ఇది మొదటి రకం దళం. తమ పూర్తికాలాన్ని వినియోగించలేని యువకులు గ్రామరక్షణ దళంగా ఏర్పడ్డారు. ఇది రెండోరకం దళం. మూడో రకం దళాలు రజాకార్ల, సైనికుల రవాణా మార్గాల్ని సంబంధాల్ని విచ్ఛిన్నం చేసేవారు.... ఇది వరకు సైన్యంలో పనిచేసిన కామ్రేడ్లు యుద్ధ వ్యూహాల్లో దళాలకు తర్ఫీదు ఇచ్చేవారు. కాలక్రమేణా మా కార్యకర్తలలోనే శిక్షకులు తయారయ్యారు. ఇది నిరంతర పోరాటం, దళాల విస్తరణల ద్వారా సాధ్యపడింది."[41]

భూస్వాములు అధికారులు పారిపోయిన గ్రామాలలోని కొత్త పరిపాలనా విధానం గురించి ఇలా వివరించాడు. "భూస్వాములు దొంగ రెవిన్యూ సర్టిఫికేట్లతో అనుభవిస్తున్న భూములను స్వాధీనం చేసుకుని పంచిపెట్టారు. భూస్వాముల కమతాలపై కొంత పరిమితి విధించి మిగులు భూమిని పంచారు. ఆ భూమిని ముఖ్యంగా వ్యవసాయ కార్మికులకూ భూమిలేని రైతులకూ పంచారు. శత్రువుతో కుమ్మక్కయిన భూస్వాము లందరి భూములనూ పనిముట్లనూ స్వాధీనం చేసుకుని పంచి పెట్టారు. వ్యాపారుల వద్ద భూస్వాముల వద్ద చేసిన అప్పులను రద్దు చేశారు. అప్పు పత్రాలను తగులపెట్టారు. భూస్వాములకు చెందిన వందల కొద్దీ బస్తాల ధాన్యాలను ప్రజాపరం చేశారు. వ్యవసాయ కూలీ రేట్లు పెంచారు."[42]

1948 సెప్టెంబరులో భారత సైన్యాలు నిజాం సంస్థానంలో ప్రవేశించాక భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులలో విభేదాలు తలెత్తాయి.

ఒక సంవత్సరం పాటు తన సంస్థానం యథాతథంగా కొనసాగేందుకు నిజాం నవంబరు 1947లో కొత్త కాంగ్రెసు ప్రభుత్వంతో ఒక ఒప్పదం (Stand Still Agreement) కుదుర్చుకున్నాడు. ఒప్పందం ఇంకా అమలులో ఉండటం వల్ల నిజాం సైన్యాలు, వాడి తొత్తులైన రజాకారు సైన్యాలు వీరోచితంగా పోరాడుతున్న తెలంగాణా రైతు సైన్యాల్ని హింసిస్తున్నారు. 1948 మధ్య కాలానికి దాదాపు 1/6 వంతు ప్రాంతం కమ్యూనిస్టులు పట్టుకున్నారు. భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకున్న భూములను రైతులకు పంచి పెట్టసాగారు. ఒప్పందంలోని కొన్ని అంశాలను అతిక్రమించాడని నిజాంపైనా, విజయాన్ని అందుకుంటున్న కమ్యూనిస్టులపైనా కాంగ్రెసు ఆధీనంలో ఉన్న భారత కేంద్ర ప్రభుత్వం ఆగ్రహించింది. 1948 సెప్టెంబరులో నిజాంకు అంతిమ హెచ్చరికను జారీ చేసింది. దాన్ని నిజాం తిరస్కరించాడు. 1948 సెప్టెంబరు 13వ తేదీన భారత సైన్యాలు నిజాం సంస్థానంలో ప్రవేశించాయి. రాజ్యాన్ని అయిదు రోజుల్లో ఆక్రమించాయి. కమ్యూనిస్టు తిరుగుబాటుదార్లు తమ ఆధీనంలో ఉన్న ప్రాంతాలలో బలంగానే ఉన్నారు. భారత సైన్యం పైన కూడా సాయుధ పోరాటం

కొనసాగించాలని కమ్యూనిస్టు నాయకత్వంలోని ఒక వర్గం భావించింది. మరో వర్గం దాన్ని విరమించాలని అభిప్రాయపడింది. చివరకు ఆయుధాలను వదలిపెట్టి పోరాటం విరమించాలని 1951లో కమ్యూనిస్టు పార్టీ ఆదేశించింది.

నిజాం రాజ్యంలోకి భారత సైన్యం వచ్చాక పోరాటం కొనసాగించాలా లేక విరమించాలా అనే రెండు తరహాల అభిప్రాయాలూ ఇది వరలో తెలంగాణ పోరాటంలో పాల్గొన్న వారిలో ఉన్నాయి. ప్రస్తుతం సిపిఐలో ఉన్న కొందరు సైన్యం వచ్చాక "మొత్తం మీద ప్రజలందరూ" భారత ప్రభుత్వ జోక్యానికి స్వాగతం పలికారని భావించి, పోరాటాన్ని కొనసాగించడం "వేర్పాటు స్వభావం" (Sectarian Manner) గల ఉద్యమంగా మారిందని భావించారు. తిరుగుబాటుదార్లకంటె సైనికపరంగా శక్తివంతమైన భారత సైన్యంపై తిరుగుబాటు కొనసాగించడం వాంఛనీయం కాదని వీరి వాదన.[43]

రెండోవర్గం వాళ్లు ప్రస్తుతం సి.పి.ఐ. (మా) పార్టీకి చెందినవారు. వీళ్ల వాదన ప్రకారం బూర్జువా భూస్వామ్య భారత ప్రభుత్వం భూస్వాములను సమర్థిస్తుంది. రైతులు నిజాం వ్యతిరేక ఉద్యమంలో సాధించుకున్న విజయాల్ని కాపాడుకునే పాక్షిక పోరాటం (partisan struggle) గానే దాన్ని కొనసాగించాలని వీరి వాదన. అంతేకాని విముక్తి యుద్ధంగా కొనసాగించకూడదు. నెహ్రూ ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఉద్దేశించిన సాయుధ పోరాటంగా కొనసాగించాలని ఆ రోజులలో అభిప్రాయపడిన వర్గాలను వాళ్లు విమర్శించారు.[44] ఆ పోరాటంలో పాల్గొన్న ఒక వ్యక్తి మాటలలో చెప్పాలంటే; "రాయల్ ఇండియన్ తిరుగుబాటుకు మద్దతుగానూ, 1945-47 కాలంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ* ఖైదీల విడుదలను సమర్థిస్తూనూ ముందుకు వచ్చిన కార్మికవర్గం తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాన్ని బలపరుస్తూ ముందుకు రాలేదు. సెప్టెంబరులో ఇండియన్ యూనియన్ సైన్యాల జోక్యానికి ముందు కాని, మూడేళ్లపాటు, అంటే 1951 దాకా నడచిన సాయుధ వ్యతిరేకతకు గాని మద్దతుగా సమ్మెలు జరగలేదు.... భారత ప్రభుత్వ సైనిక దళాల దమనకాండను మొత్తం తెలంగాణ సాయుధ పోరాటకారులే భరించవలసి వచ్చింది. అది కూడా నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోయాలనే కాల్పనికాశయంతో నడచిన పోరాటం.[45]

ఇంక సి.పి.ఐ. అభిప్రాయం "వేలకొద్ది సైన్యం మీద పడగానే ఎదిరించడం

---

* *ఐ.ఎన్.ఎ. సుభాష్‌బోసు సైన్యం, బ్రిటిషు వారిని ఎదుర్కొనేందుకు ఏర్పడినది. దీన్నే 'ఆజాద్ హింద్ ఫౌజ్' అని కూడా అంటారు.*

దళాలకూ ప్రజలకూ అసాధ్యమైపోయింది." భారతీయ సైన్యాలు ప్రవేశించిన తరువాత తెలంగాణా పరిస్థితిపై వ్యాఖ్యానిస్తూ సి.పి.ఐ. అభిప్రాయంతో ఏకీభవించిన ఒక కమ్యూనిస్టు వ్యతిరేకి అభిప్రాయం.[46] ఈ విదేశీ దౌత్యాధికారి ఇలా వివరించాడు "భారతీయ సైన్యం ఆక్రమణ తర్వాత కొత్తగా వేసిన రోడ్ల వల్ల సాయుధ వాహనాల గస్తీ సాధ్యపడింది. జైల్లనిండా అరెస్టయిన కమ్యూనిస్టులు, దగ్గర దగ్గరలో పోలీసు స్థావరాలు, కొన్ని కొన్ని చోట్ల నిర్దాక్షిణ్యమైన దమనకాండ, ఇన్ని ఉన్నా అదుపూ ఆపూ లేకుండా అప్పుడప్పుడు గెరిల్లా యుద్ధం జరుగుతూనే ఉంది. రెండు సంవత్సరాల తర్వాత కమ్యూనిస్టులే తమంత తాముగా తమ హింసాత్మక కార్యక్రమం విరమించుకునే దాకా గెరిల్లాలు పోరాడుతూనే ఉన్నారు."[47] సైనిక చర్యలో పాల్గొన్న భారతీయ సైన్యాధికారితో ఆ దౌత్యాధికారి జరిపిన ఇంటర్వ్యూ ఇంకా విచిత్రమైన సమాచారం వెల్లడిస్తోంది. గెరిల్లా యుద్ధం అంటే నిజంగా ఏమిటో నీకు తెలుసా? – ఒక భారతీయ సైనికాధికారి అడిగాడు. ఇండో–చైనాలో ఫ్రెంచివాళ్లు ఎందుకు ఓడిపోయారో నాకిప్పుడు తెలుస్తోంది. హైదరాబాదు (రాజ్యం)లో ఒక భాగంలోనే మేం పూర్తిగా జయించలేకపోయాం. మేం ఇండియన్లం. తెల్లవాళ్లం కూడా కాదు అన్నాడు. మిగతా రైతుల లాగే దుస్తులు ధరించి వాళ్లలాగే బతికే కమ్యూనిస్టు నాయకులను కనుక్కోవడం కష్టమని వివరించాడు. వాళ్లే రాత్రి ఆయుధాలను వెలికితీసే ఎర్రయోధులు. ఏదో చెదురుగా ఉన్న స్థావరాన్ని ముట్టడిచేస్తారు... అంతటి కమ్యూనిస్టు వ్యతిరేకి అయిన ఆ దౌత్యాధికారి కూడా తెలంగాణా కమ్యూనిస్టు గెరిల్లాలను చేపలుగా గ్రామస్థులను సముద్రంగా ఒప్పుకున్నాడు. "సముద్రం వెచ్చగా, స్నేహపూర్వకంగా ఉన్నప్పుడు చేపలు వృద్ధి చెంది యథేచ్ఛగా ఈదుతాయి." దీనివల్ల హైదరాబాదు సంస్థానాన్ని అధికారికంగా భారతీయ సైన్యం ఆక్రమించిన చాలా కాలం తరవాత కూడా నిజాం బానిస రాజ్యం నుంచి విముక్తి పొందిన ప్రాంతం కమ్యూనిస్టుల పూర్తి ఆధీనంలో ఉందని తెలుస్తూంది." "భారతదేశంలో నేనున్న కాలంలో ఆఖరి సంవత్సరంలో (1953) కమ్యూనిస్టులు తమంత తామే తమ ఎత్తుగడలను శాంతి–సహకారాలకు మార్చిన తరవాతే ప్రభుత్వ మద్దతుదార్లు ఈ కల్లోలిత ప్రాంతాలలో నిర్భయంగా సంచరించసాగారు."

అందువల్ల బలమైన సైనికదాడివల్ల ధైర్యం చెదిరిందనేదీ, దేశంలో మిగతా భాగాలలో సానుభూతి ఉద్యమాలు లేవనేది ఉద్యమం విరమించడానికి గల బహిరంగ కారణాలుగా కనిపించినా నిజమైన కారణం ఇంకేదో ఉంది. ప్రస్తుతం సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం)లలో ఉన్న ఇరువర్గాల నాయకుల ఊగిసలాట బహుశా వారి వారి దృక్పథాన్ని బట్టి వచ్చి ఉంటుంది. తెలంగాణాలో కమ్యూనిస్టు పార్టీ నాయకులలో

చాలామంది ధనిక రైతు కుటుంబాలకు, భూస్వామ్య రైతు కుటుంబాలకు చెందినవారే. అటువంటి ఉన్నత వర్గాలతో కూడిన కాంగ్రెసు పార్టీ అంటే వీళ్లకు సహజంగానే భ్రమలు ఉండవచ్చు. వాళ్లు నిజాయితీగా తమ ఆస్తి మొత్తం పార్టీకి ధారపోసి అనేక త్యాగాలు చేసి ఉండవచ్చు. తెలంగాణలోకి భారత సైన్యాల ప్రవేశపు వర్ణనను చేసిన రావినారాయణరెడ్డి మాటలలో మెల్లగా చోటుచేసుకున్న అటువంటి సానుభూతి మనకు కన్పిస్తుంది. "రాజ్యంలో ప్రజలు పోలీసు చర్యను ఆహ్వానించారు." తరవాత వాక్యం మాత్రం అలా స్వాగతం చెప్పిన ప్రజల నిజమైన వర్గస్వభావాన్ని తెలుపుతుంది. గ్రామాల్లో పెద్ద భూస్వాములు లేరు. ఈ స్వాగతాలకు ధనిక మధ్య తరగతి రైతులు నాయకులు."[48] పోరాటం విరమించడానికి ఈ ధనిక మధ్య తరగతి రైతులే కారకులు అని ఆయనే తరవాత నిర్మొహమాటంగా ఒప్పుకున్నాడు. కొంతమంది వ్యవసాయ కూలీలు, బీదరైతులు పోరాటాన్ని కొనసాగించాలనుకొన్నా మధ్య తరగతి ధనిక రైతుల వ్యతిరేకత దృష్ట్యా ఏమీ చెయ్యలేకపోయారు."[49]

నిజాం వ్యతిరేక పోరాటంలో రైతులు గెల్చుకున్న హక్కుల్ని పరిరక్షించుకునే సాయుధ పాక్షిక పోరాటమే (నెహ్రూ ప్రభుత్వాన్ని పతనం చేసేందుకై విముక్తి పోరాటం కంటే మేలుగా) భూమి సమస్య పాక్షికంగా సంప్రదింపుల ద్వారా సత్వర పరిష్కారమయ్యేది"[50] అనే పుచ్చలపల్లి సుందరయ్య భావనలో కూడా భారత పాలకవర్గాలపై అలాంటి భ్రమలే కన్పిస్తాయి. పాలకవర్గాల రాజ్యశక్తిని నాశనం చెయ్యందే గెలుచుకున్న ప్రయోజనాలను రక్షించుకోవడం సాధ్యమా? ఫ్యూడలు శక్తుల మద్ధతుతో నడుస్తున్న నెహ్రూ ప్రభుత్వం అదే ఫ్యూడలు శక్తులపై సాయుధపోరాటం జరిపి గెలుచుకున్న విజయాలను భూమిలేని పేద రైతులకు కట్టబెట్టే ఎటువంటి ఒప్పందాలనైనా ఎలా సహిస్తుంది?

తెలంగాణ సాయుధ కమ్యూనిస్టుల విజయాల దృష్ట్యా ప్రభుత్వం 'జాగీర్ల రద్దు చట్టం' (Jagir Abolition Act) హైదరాబాదు కౌలు చట్టాలను ప్రవేశపెట్టింది. వీటి ఉద్దేశాలను కమ్యూనిస్టు నాయకులు గుర్తించలేదు. సి.పి.ఐ.కి చెందిన చంద్ర రాజేశ్వరరావు సి.పి.ఐ. (ఎం)కు చెందిన సుందరయ్యలు ఇద్దరూ ఈ చట్టాలను "విప్లవాత్మక"మైనవి గానూ, అభ్యుదయకరమైనవి"గానూ పేర్కొన్నారు.[51] ఒక పరిశీలకుడు చెప్పినట్లు "ఈ చట్టాలలోనూ" చిన్న భూస్వాములూ, ధనిక రైతులూ కోరుకున్న రాయితీలనే" పొందుపరచారు.[52] సుందరయ్య అంగీకరించినట్టుగానే "గ్రామ ప్రాంతాల నించి తరమబడిన భూస్వాములు తిరిగి వచ్చి తమ పరిస్థితిని గట్టిపరచుకున్నారు. వాళ్ళ 'సేరీ' భూములను తిరిగి ఆక్రమించుకున్నారు. 'అన్యాక్రాంతాలు'గా పేర్కొన్న భూములను ధనిక రైతులకు లేదా రక్షిత కౌలుదార్లకు అమ్మి

వేశారు. 1950 'మొదటి కొనుగోలు' రక్షణ చట్టం ఇటువంటి కౌలుదార్లకు ఇబ్బంది... రైతాంగం రైతుకూలీలు సాగు చేసుకుంటున్న బంజరు భూముల్నించి వాళ్ళను తొలగించే ఉద్యమం ముమ్మరంగా ఉంది..."[53]

కాంగ్రెసు ప్రభుత్వ నిజస్వరూపాన్ని బయటపెట్టేందుకు సాక్ష్యమే కావాలనుకుంటే, భారత సైన్యాలు తెలంగాణాలో ప్రవేశించిన తరువాత జరిపిన దమన కాండ చాలు. కాంగ్రెసుపార్టీ "ఉక్కు మనిషి" సర్దార్ పటేల్ 1950లో తన చావుకు కొద్ది ముందు, తెలంగాణాలో ఒక్క కమ్యూనిస్టును కూడా బతకనివ్వనని హైదరాబాదులో చెప్పాట్ట.[54] ఆయన తొత్తులు కృతనిశ్చయంతో దాన్ని అమలు చేస్తూ పోయారు. "ప్రజలు పోలీసు చర్యకు స్వాగతం పలికారన్న" సి.పి.ఐ. నాయకుడు రావి నారాయణరెడ్డి భారతీయ సైన్య దమనకాండనిలా వర్ణించాడు. "పార్టీపై అన్ని ప్రాంతాలలోనూ ఏక కాలంలో దాడులు జరిపారు. ఒకటి రెండు నెలల్లో అన్ని ప్రాంతాలలో స్థావరాలు నెలకొల్పారు. ఐదారు గ్రామాల్ని ఐదారు వేల సైన్యంతో చుట్టుముట్టి మా దళాలను సైన్యం నాశనం చేయడం మొదలెట్టింది. ఇలానే చాలా గ్రామాలలో దళాలు తుడిచిపెట్టుకుపోయాయి. ప్రజలను హింసించి, దమనకాండకు బలిచేసి పార్టీనుంచి రాజీనామా చెయ్యమని వత్తిడి చేశారు. లాఠీలతో కొట్టారు. బాయ్‌నెట్లతో హింసించారు. చివరకు సుత్తికొడవలి రూపంలో చర్మాన్ని ఒలిచి చిత్రవధ చేసారు. ప్రత్యేకించి పార్టీ కార్యకర్తల కుటుంబాలపైనా, దళ సభ్యులపైనా సైన్యం తన దుశ్చర్యలను కొనసాగించింది. అరెస్టయిన కామ్రేడ్స్‌ను పాశవికంగా హింసించి ప్రజల మధ్య పెట్టి కాల్చిచంపారు..."[55]

ఇంత జరిగాక కూడా తెలంగాణా కమ్యూనిస్టు నాయకులు నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోసే విముక్తి పోరాట ఆవశ్యకతను వ్యతిరేకించి, అటువంటి ప్రభుత్వం చేసిన చట్టాలలో 'విప్లవాత్మక' 'అభ్యుదయకర' విషయాలను చూడ ప్రయత్నించడం ఆశ్చర్యం కలిగిస్తుంది.[56]

## రైతాంగ తిరుగుబాట్లలో కొన్ని సారూప్యాలు

ఈ తిరుగుబాట్లన్నింటిలోనూ సూత్రప్రాయంగా కనిపించే సామాన్య లక్షణాలు ఉన్నాయి. బ్రిటిషు పరిపాలన ఆరంభం నుంచి 1947 వరకూ జరిగిన పోరాటాలను బట్టి రైతాంగం ఎప్పుడూ పటిష్టవంతమైన తిరుగుబాటు శక్తిగా ఉందని తెలుస్తోంది.

క్రమం తప్పకుండా భూమి సొంతదారుగా ఉన్న రైతు, అప్పుల వల్ల భూమి లేనివాడుగా మారడం, బికారిగా తయారుగావడం, పంటలు పోవడమనే నిత్య ప్రమాదం, ధనవంతులకు నిత్యావకాశమయింది. నామమాత్రపు ఖరీదుకు రుణపడ్డ రైతు తన

భూమిని బాకీదారుకు ఇచ్చెయ్యడం, అవసరం వస్తే తనను తాను బానిసగా దఖలుపరుచుకోవడం మామూలు. గత రెండు వందల సంవత్సరాలుగా గ్రామాలలో ధనికులూ, పేదవారూ ఒకలాగే ఉన్నారు. ధనికులు వాళ్ళ పీడనలోనూ, పేదల తిరుగుబాటులోనూ తమ స్వభావాల్ని సరిగానే చూపెట్టుకున్నారు. ప్రతీ తిరుగుబాటులోనూ ఇదే పునరావృతమౌతుంది. భూస్వాముల ధనదాహం, రైతుల్నించి భూములు లాక్కోవడం చివరకు రైతులను తిరుగుబాటుకు పురికొల్పాయి. భూస్వాములను చంపి వాళ్ళ ఇళ్ళను కాల్చడం ద్వారా గుప్తమైన ప్రతీకార వాంఛ బయటపడింది.

"ఈస్టిండియా కంపెనీ" కాని, గడిచిన బ్రిటిషు ప్రభుత్వం కానీ, కాంగ్రెసు పార్టీకానీ పాలకపార్టీ పాత్ర ఎప్పుడూ మాములే. గ్రామ పెత్తందార్ల కొమ్ము కాసేందుకు తిరుగుబాటుదార్లను అణచేందుకు సైన్యాలను పంపడమే దాని పని.

ఈ పోరాటాల రెండవ లక్షణాన్ని చూద్దాం. సాంఘిక పరిణామంలో ప్యూడలు దశ ఒక భాగం అనే అవగాహన లేని రోజుల్లో తిరగబడ్డ రైతాంగం పరిస్థితిలో ఒక మౌలికమైన మార్పు కోసం గజిబిజిగా పోరాడారు. ఈ తిరుగుబాట్లలో చాలా భాగం ఆర్థిక విషయాల మీద, మతపరమైన విషయాలమీద మొదలై, తరువాత కొద్దిమంది చేతుల్లోకి భూమి చేరడం. హెచ్చు వడ్డీలపై వడ్డీవ్యాపారం, వెట్టిచాకిరీ, భూస్వాముల సాంఘిక పీడన వంటి విషయాలకు వచ్చి – మొత్తం వ్యావసాయిక వ్యవస్థపైనే తిరుగుబాటుగా మార్పు చెందడం రివాజు. 1871–1875ల మధ్య పశ్చిమ భారతంలోని కైరా. అహమ్మద్‌నగర్, పూనాలలో చెదురుమదురుగా జరిగిన రైతు తిరుగుబాట్లలో బాకీదార్ల చేతిల్లో ఉన్న బాండ్లు, డిక్రీలు, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకుని నాశనం చేయడం తిరుగుబాటుదార్ల ఉమ్మడి ఆశయంగా కనిపిస్తుంది. అటువంటి తిరుగుబాట్లు తరువాత దశలలో సహజంగానే రాజ్యశక్తి యొక్క స్వరూపాన్ని గుర్తించాయి. సంథాల్ తిరుగుబాటులో మాదిరిగా పోలీసుల్ని న్యాయాధికార్లను ఈ తిరుగుబాట్లలో తుడిచిపెట్టారు. ఈ తిరుగుబాట్లు మొత్తం సాంఘిక వ్యవస్థను కూల్చగలిగే మహావిప్లవపు సామర్థ్యాల్ని తమలో ఇముడ్చుకున్నాయి.

ఇక మూడవ లక్షణం, లక్ష్యం. అస్పష్టంగానైనా వీటికి గల ధ్యేయం అధికారాన్ని కొల్లగొట్టి స్వతంత్ర పాలన ఏర్పాటు చేసుకోవడం. 1831లో తితుమీర్ ప్రయత్నం నుంచి, ఆలక్ష్యం 1857 ఉద్యమంలో, "పాలనా వ్యవహారాల న్యాయాలయం" ద్వారా మరింత స్పష్టమై 1946–51 తెలంగాణా పోరాటపు అరుణరాజ్య స్థాపనలో పరాకాష్టకు చేరుకుంది.

ఈ తిరుగుబాట్లలో ప్రత్యేక లక్షణం మరొకటుంది. అదే ఆదిమ, ఆటవిక, గిరిజన ప్రజలు ప్రముఖపాత్ర వహించడం. కోలులు, ముండాలు, ఓరానులు, తూర్పు

భారతదేశంలో సంథాల్‌లు, ఉత్తరాన మియోలు, భిల్లులు దక్షిణాదిన కోయలు అనేక రైతాంగ పోరాటాల్లో ముందు నిలిచారు. వెల్లువలుగా వచ్చే వలసదార్లు తమ భూముల్ని ఆక్రమించుకోవడం ద్వారా వ్యాపార పెట్టుబడి ఒత్తిడిని మొదట ఆదిమవాసులు, గిరిజనులుగా పిలువబడే వీళ్లే భరించవలసి వచ్చింది. ఫ్యూడలు భూస్వాములకు లోబడి, వర్తకులు, వడ్డీ వ్యాపారుల పీడనను చవి చూశారు. దుర్గమమైన అడవుల్లో కొండల్లో తలదాచుకునే వీళ్లు అడవులను పడగొట్టి వ్యవసాయం చేసుకునేవారు. సంథాల్ పరగణాలలో జరిగినట్టుగానే వీళ్లు వర్తకుల ధనదాహానికీ, వ్యాపారానికీ, అనేక దళారీల పీడనకు గురయ్యేవారు.

నేటికీ ఆ సాంప్రదాయం కొనసాగుతూనే ఉంది. 1967–68 షెడ్యూల్డు కులాల, తెగల కమీషనర్ నివేదిక ఇలా వివరించింది. “దక్షిణ బీహార్, ఒరిస్సాలకు చెందిన అనేక ప్రాంతాల్లో గిరిజనుల భూమి సమీప మైదాన ప్రాంతపు వడ్డీ వ్యాపారులు, నాగరిక వ్యవసాయదారుల చేతిలోకి చేరిపోయింది. గిరిజనేతరులకు భూమి సంక్రమించనివ్వని చట్టాలున్నా వారికి భూమి సంక్రమిస్తూనే ఉంది. బీదరైతు తాను సహజంగా తీర్చలేని అప్పు వాళ్లనుంచి హెచ్చు వడ్డీకి తీసుకుంటారు. అతడు సాగుచేసినా పంట మాత్రం అతనిది కాదు. ఆ పంట చేసిన అప్పుకు సరిగా వడ్డీ వ్యాపారస్తునికి చెందిపోతుంది. అతడు దాన్ని బజారు ధరకంటె తక్కువకే మదింపు వేసి లెక్క కడతాడు. చివరకు అలా భూమి సొంతదారు వడ్డీ వ్యాపారస్తుడి కూలీగా మారిపోతాడు. భూమి చేతులు మారదు. న్యాయం దృష్టిలో ఏమీ కాలేదు. కాని స్వేచ్ఛాజీవి కూలి బానిసగా మాత్రం మారతాడు. ఎటువంటి సహాయమూ దొరకని ఆ సమయంలో వడ్డీ వ్యాపారి అతనికి చేసే సాయమే దీనికంతకూ కారణం.” కాని ఇన్ని కష్టాల మధ్య కూడా గిరిజనులు తమ సాంఘిక కట్టుబాట్లను స్వయం ప్రతిపత్తిని శ్రద్ధగా కాపాడుకున్నారు. తమ హక్కులకు భంగం కలిగినపుడల్లా తిరగబడే వీరత్వాన్ని నిలుపుకున్నారు.

1961 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో పదకొండు వంతు అంటే మూడుకోట్ల మంది గిరిజనులున్నారు. 1951 జనాభా లెక్కల ప్రకారం మొత్తం భూమిలేని ప్రజలలో 6.3 శాతం భూమి లేని గిరిజన రైతు కార్మికులే. 1961కి ఈ సంఖ్య 10.6 శాతానికి పెరిగింది. ఈ వర్గం ప్రజలలో పెరుగుతున్న దారిద్ర్యానికిది నిదర్శనం.

1967లో మొదటగా తిరుగుబాటు జరిగిన నక్సల్బరీ, సంథాల్ గిరిజనులు నివసించే ప్రదేశం కావడం గమనార్హం. 1968లో పరాకాష్టకు చేరిన శ్రీకాకుళం పోరాటంలో గిరిజనులే (సవర) పోరాటానికి పట్టుకొమ్మ. 1969 నాటికి ఆదివాస

నివాస ప్రాంతాలైన ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం, వరంగల్ జిల్లాలోను, ఒరిస్సాలోని సరిహద్దు జిల్లాలలోను, పశ్చిమ బెంగాల్‌లోని మిద్నపూర్‌లోనూ సి.పి.ఐ. (మా.లె.) కార్యకలాపాలు ప్రముఖంగా సాగాయి. ఈ ప్రాంతాలలోని కల్లోలాలను గురించి చెప్తూ నాటి కేంద్ర దేశీయాంగ శాఖ చేసిన సర్వే ఇలా తెలిపింది. "ఆదివాసుల క్షేమానికి తయారు చేసిన చట్టాలు సరిగా అమలుకాకపోవడమే ఆందోళనకు ముఖ్య కారణం. ఇది జరిగితేనే కాని తీవ్రవాదుల నాయకత్వం కింద ఉన్న ఆదివాసుల నమ్మకాన్ని పొందడం సాధ్యపడదు."[57]

## గ్రామసీమలలో సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కార్యక్రమం

గిరిజన – ఆదివాసి జన ప్రేరితమైన వ్యావసాయిక తిరుగుబాటుల మాలికగా సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమాన్ని పేర్కొనడం దాని స్వరూపాన్ని తగ్గించి చెప్పడమే అవుతుంది. దేశంలో వ్యావసాయిక స్థితి యొక్క విస్తృత ప్రాతిపదికలెన్నో ఈ ఉద్యమ సిద్ధాంత ఆచరణ ప్రణాళికలలో చోటు చేసుకున్నాయి. 18, 19వ శతాబ్దాలలోని రైతు తిరుగుబాట్లనుంచీ, ఈ శతాబ్దంలో ఫ్యూడలిజంపై ధ్వజమెత్తిన రైతాంగ పోరాటాల్లో కమ్యూనిస్టు నాయకత్వ పాత్ర, ప్రభుత్వం యొక్క భూసంస్కరణల స్వభావం మొదలైన చారిత్రక సత్యాల నుంచి బహుళమైన గుణపాఠాలను నాయకులు కార్యకర్తలు కూడా మననం చేసుకున్నారు. అధ్యయనం చేసారు.

కాబట్టి సి.పి.ఐ. (మా.లె.) ఆదివాసుల సమస్యపై ప్రత్యేక శ్రద్ధతో ఆలోచించడం సహజమే. పార్టీ ఏర్పాటుకు చాలా ముందే కమ్యూనిస్టు విప్లవకారులు నాగాలతో, మిజోలతో తమ సంఘటన ప్రకటించారు. 1968 మే సంచిక 'లిబరేషన్'లో ఒక విదేశీ పత్రిక నుంచి అంగీకారపూర్వకంగా ఉదహరించిన వాక్యాలు చూడండి. "భారత బడా భూస్వాములు, బడా పెట్టుబడిదార్ల నిర్దాక్షిణ్య వర్గపీడన కారణంగా నాగాలు, మిజోలు ఆయుధాలను చేపట్టారు" కమ్యూనిస్టు విప్లవకారులు ఆదివాసుల వీరోచిత చరిత్రను గుర్తు చెయ్యడం మరచిపోలేదు. 1968లో బీహారులోని రాంచీ జిల్లా చిరీ గ్రామంలో పోలీసు కాల్పులలో అనేక మంది ఆదివాసి రైతులు చనిపోయిన సందర్భంలో కమ్యూనిస్టు విప్లవకారులు బీహారు రాష్ట్ర కమిటీ విడుదల చేసిన ప్రకటనలో "భూస్వాములపైనా, షాహుకార్లపైనా వాళ్ల ఏజెంట్లపైనా విప్లవాత్మకమైన పోరాటాలను ప్రారంభించాల"నీ, "ఘనతచెందిన బిర్సా, సిధూ, కానూలు విదేశీ, స్వదేశీ పీడకులనెదిరించి పోరాడినట్టు" ఎదిరించి పోరాడాలని ఆదివాసి రైతులకు విజ్ఞప్తి చేసింది.[58]

1970లో ఆమోదించిన పార్టీ కార్యక్రమం భారతదేశ రైతాంగపు "గొప్ప విప్లవాత్మక

సాంప్రదాయాల్ని" గుర్తు చేస్తూ గత రెండ వందల సంవత్సరాల చరిత్రను "వీరోచితమైన భారతీయ రైతాంగం బ్రిటిషు సామ్రాజ్యవాదంపైనా ఫ్యూడలు పీడనంపైనా చేసిన నిరంతరం సంఘర్షణలు"గా అభివర్ణించింది. కాని ఈ సంఘర్షణలు విఫలం చెందాయి. "ఒక వైజ్ఞానిక సిద్ధాంతం లేకపోవడం, విజయానికి దారితీసే విప్లవాత్మక నాయకత్వం లేకపోవడమే" కారణం.

నేటికీ భారతీయ పల్లెసీమల్లో విలయతాండవం చేసే భూస్వామ్య పీడన కరకు కోరల నుంచి రైతాంగ విముక్తిని సాధించడం ఎలా?

దానికి సి.పి.ఐ. (మా.లె.) జవాబు, పల్లెసీమల్లో ఫ్యూడలిజాన్ని నిర్మూలించాలి. ప్రజాతంత్ర విప్లవంలో ప్రధాన భాగం వ్యావసాయిక విప్లవం జరగాలి."[59] కార్మికవర్గ నాయకత్వంలో సాధించే అటువంటి విప్లవం యొక్క ప్రాధాన్యతను పార్టీ ఇలా వివరించింది. "భారత ప్రజలు ఫ్యూడలిజం నుంచి విముక్తి పొందటం ద్వారా సామ్రాజ్య వాదాన్నుంచి, దళారీ బ్యూరోక్రటిక్ పెట్టుబడి నుంచి విముక్తిని పొందుతారు. ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా జరిగే ఈ పోరాటంపై ఇద్దరు శతృవుల పై కూడా జరిగే పోరాటమే" అవుతుంది. పాలకవర్గం నిర్మించిన అనేక భూ సంస్కరణ చట్టాలను నిరసిస్తూ "భారత ప్రభుత్వంను దళారీ బ్యూరోక్రటిక్ పెట్టుబడిదారుల బడా భూస్వాముల ప్రభుత్వం"గా పేర్కొంది. అటువంటి ప్రభుత్వం చేసిన చట్టాల వాగాడంబర తెరలను తొలగించితే బీదరైతుల, భూమి లేని రైతాంగపు వ్యతిరేకతనే ప్రధానంగా సంతరించుకుని ఉంటాయి.

సి.పి.ఐ. (మా.లె.) ప్రజాతంత్ర విప్లవోద్యమ నిర్మాణానికి ముఖ్య సిద్ధాంత ప్రాతిపదిక : "ఏభై కోట్ల మంది జనాభాలోనూ 40 కోట్ల మంది గ్రామాల్లోనే నివసిస్తున్నారు. నేటికీ ఫ్యూడలు దోపిడీ ప్రధాన దోపిడిగా ఉంది. కనుక నేటికీ గ్రామాల్లో గల వైరుధ్యాలలో రైతాంగానికీ భూస్వాములకూ గల వైరుధ్యమే ప్రధాన వైరుధ్యం"(12) ఈ వైరుధ్యాన్ని సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ప్రజాతంత్ర విప్లవంద్వారానే పరిష్కరించాలని భావించింది.

చారుమజుందార్ చక్కగా చెక్కిన మాటల కూర్పులో నేర్పుగా అటువంటి విప్లవ చిత్రాన్ని మనముందుంచాడు. ".... మనం ప్రజాతంత్ర విప్లవ కార్యక్రమాన్ని చేపట్టాం. అటువంటి విప్లవాన్ని సాధించేందుకు రైతు సంక్షేమాన్ని నిలబెట్టే భూసంస్కరణలు జరపాలి. గ్రామప్రాంతాలలో రైతాంగానికి అనుకూలమైన భూసంస్కరణలు అమలు జరగాలంటే పెత్తందారీ భూస్వామ్య విధానాన్ని (భూస్వామ్య వర్గాల ఆధిపత్యాన్ని) నాశనం చేయాలి. దాన్ని సాధించాలంటే భూస్వామ్య వర్గాల నుంచి భూమిని లాక్కొని, దాన్ని భూమిలేని వారికీ బీద రైతులకూ పంచాలి. ఆర్థిక సంఘర్షణలకే పోరాటం

పరిమితమైతే దాన్నెప్పటికీ మనం సాధించలేం...(8) కాని భూమిని లాక్కుని దానిని పంచడం కమ్యూనిస్టు విప్లవకారులకు ప్రస్తుత ప్రభుత్వ వ్యవస్థలో సాధ్యపడదు. "ప్రభుత్వ యంత్రాంగాన్ని నాశనం చెయ్యకుండా, వ్యావసాయిక విప్లవం (అంటే భూసంస్కరణలు) గురించి పని చెయ్యడం పచ్చి రివిజనిజం అవుతుంది."(8) ప్రస్తుత ప్రభుత్వ యంత్రాంగాన్ని సమూల నాశనం చెయ్యాలనీ, రాజ్యాధికారాన్ని చేపడితేనే నవ ప్రజాతంత్ర రాజ్యం సాధ్యమనీ చెప్పడం ద్వారా, చారు మజుందార్ అతని అనుయాయులూ, ప్రస్తుత వ్యవస్థా చట్రంలో భూసంస్కరణలు సాధించాలని కాని, లేదా వ్యావసాయిక విప్లవానికి రైతాంగం ప్రభుత్వ శక్తిని పట్టుకునేందుకు సమీకరించకుండా, భూమిని ఆక్రమించడానికే పరిమితం చెయ్యాలనే వివిధ తరగతుల పార్లమెంటరీ వామపక్షీయుల (leftists) నుంచి తమను తాము వేరుగా గుర్తించుకున్నారు.

మూలం నుంచీ రాజ్యాధికారాన్ని పట్టుకునే పద్ధతులను తెలుపుతూ చారు మజుందార్ ఇలా అన్నాడు "అందువల్ల ప్రభుత్వ యంత్రాంగాన్ని నాశనం చెయ్యడం రైతాంగ ఉద్యమం యొక్క ప్రథమ బాధ్యత. ఇది దేశమంతటా రాష్ట్రమంతటా చెయ్యడం సాధ్యం కానంత మాత్రాన రైతులు చేతులు ముడుచుకు కూర్చోవాలా? అక్కర్లేదు. ఏ ఒక్క ప్రాంతంలోని రైతాంగమైనా రాజకీయ భావజాలం వల్ల చైతన్యవంతం కాగలిగితే, ఆ ప్రాంతంలోని రాజ్యాంగ యంత్రాంగాన్ని నాశనం చేసే పని ముందుకు నడపాలని మార్క్సిజం – లెనినిజం – మావో ఆలోచనా విధానం ప్రభోదిస్తుంది. దాన్నే రైతాంగ విముక్తి ప్రాంతం అనవచ్చు. అటువంటి విముక్తి ప్రాంతపు ఏర్పాటుకు పోరాడడం ప్రస్తుత రైతాంగ ఉద్యమ తక్షణ సత్వర కర్తవ్యం. విముక్తి ప్రాంతం అంటే ఏమని అర్థం చెప్పుకోవాలి? వర్గ శతృవుల్ని (అంటే జోతేదార్లు, భూస్వాములు, వడ్డీ వ్యాపారులు) మనం తొలగించ గలిగిన ప్రాంతాన్నే విముక్తి ప్రాంతం అందాం. ఈ విముక్తి ప్రాంతాన్ని సాధించేందుకు సాయుధ రైతాంగ శక్తి కావాలి. రైతుల చేతి ఆయుధాలు, తుపాకులు కూడా ఈ సాయుధ రైతాంగ శక్తి కిందకే వస్తాయి... రైతులకు తుపాకులెలా వస్తాయి? వర్గ శతృవుల దగ్గర తుపాకులున్నాయి. వాళ్లు గ్రామాల్లోనే ఉంటారు కదా? వాళ్ల దగ్గర నుంచి తుపాకులు కొల్లగొట్టాలి. వాళ్లంతట వాళ్లు మనకు తుపాకులు ఇవ్వరు. మనం తుపాకుల్ని బలవంతంగానే తీసుకోవాలి. వర్గ శతృవుల ఇళ్లకు నిప్పు పెట్టడం నుంచి అన్ని ఎత్తుగడలను చురుకైన రైతులకు నేర్పాలి. ఇది కాక సైనికులపై మెరుపుదాడులు చేసి తుపాకులను సాధించాలి... పెద్ద పెట్టున దీన్నాచరించేందుకు రైతాంగంలో సాయుధ పోరాటాలను నిర్మించాలనే రాజకీయాలను పెద్ద ఎత్తున ప్రచారం చేయాలి. చిన్న రహస్య దళాలను నిర్మించి

తుపాకులను సేకరించే కార్యక్రమాన్ని చేపట్టాలి.(8) తెలంగాణాలో మొదటి గెరిల్లా దళ నిర్మాణపు టెత్తుగడలనే చారుమజుందార్ ఇక్కడ చెపుతున్నాడు. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ధనిక మధ్య రైతుల నాయకత్వంలో జరిగిన రైతాంగ పోరాటాల తిరోగమన మార్గం దృష్ట్యా చారుమజుందార్ భూమిలేని బీదరైతుల నాయకత్వాన్ని ఏర్పరచాలని నొక్కి చెప్పాడు." కారణం రైతాంగంలోని అన్ని తరగతులలోనూ వాళ్లే అంత్యంత విప్లవాత్మక శక్తి.... మధ్యమ రైతు కూడా స్నేహితుడే కాని అతని సమరోత్సాహం భూమిలేని పేదరైతులకున్నంత బలమైనది కాదు. కనుక పోరాటంలో (అంటే సాయుధ పోరాటంలో) అతను భాగస్వామి కాలేడు. అతనికింకా కొంత వ్యవధి కావాలి"(9).

చారు మజుందార్ కార్యక్రమం ప్రకారం కార్మిక వర్గ నాయకత్వంలో సాయుధ రైతాంగం చెదురుమదురుగా ఏర్పరచిన విముక్తి ప్రాంతాలకే కాక, భారత గ్రామసీమలలో మరింత ప్రముఖ పాత్ర వహించవలసి ఉంది. మావోయిస్టు తరహాలో గ్రామాలతో నగరాలను చుట్టుముట్టాలి. "కార్మిక నాయకత్వంలోని వ్యవసాయ విప్లవం గ్రామ ప్రాంతాలలో విప్లవ స్థావరాలనేర్పరచాలి. ఈ విప్లవ ప్రాంతాలను విస్తృతం చేసి పట్టణ కేంద్రాలను చుట్టుముట్టాలి. పట్టణాలను ముట్టడించి విప్లవానికి విజయం చేకూర్చాలి. (అంటే ఛైర్మన్ మావో ప్రజాయుద్ధానికి నిర్మించిన ఎత్తుగడలను ఆచరించడం ద్వారా). వీటన్నిటి ద్వారానే ప్రజాతంత్ర విప్లవం సాధ్యమౌతుంది."(10)

ఇదే సి.పి.ఐ. (మా.లె.) పార్టీ నాయకత్వం భారత రైతాంగం విప్లవాన్ని సాధించేందుకు తయారు చేసిన పోరాటపు నమూనా. దాని ముఖ్య లక్షణాలివి. రైతుల సాయుధ పోరాటం. పోరాటపు నాయకత్వాన్ని భూమిలేని బీదరైతులకు అప్పజెప్పాలి. గ్రామాల్లో అధికారాన్ని గెరిల్లా యుద్ధంతో సాధించాలి. ప్రభుత్వ శక్తిని (State Power)ను కొల్లగొట్టడంలో చివరి దశగా నగరాల చుట్టూ ఏర్పడ్డ విముక్త ప్రాంతాలుంటాయి. గతంలో జరిగిన రైతాంగ తిరుగుబాట్ల ముఖ్యాంశాలను, గ్రామాలలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలను, రైతాంగ పోరాట పటిమలను దృష్టిలో ఉంచుకుని ఈ నమూనాకు అవసరమైన సిద్ధాంత ప్రాతిపదికలను తయారు చేసారు.

పోరాటం మధ్యలో ఈ నమూనా ఎత్తుగడలు, కొత్త హంగుల్ని సంతరించుకున్నాయి. ప్రత్యేక పరిస్థితులలో ప్రత్యేకమైన ఎత్తుగడలను రూపొందించుకున్నారు. (వివిధ స్థాయిలలో ఆయా ఎత్తుగడలను గట్టిగానో మెల్లగానో సందర్భానుసారం సమర్థించారు). అప్పుడప్పుడు పక్కదార్లు పట్టినా సి.పి.ఐ. (మా.లె.) పార్టీ నాయకత్వంలో గ్రామీణ పోరాటం ప్రధానంగా చారుమజుందార్ నిర్మించి నిర్దేశించిన బాటలోనే చాలా వరకు సాగింది.

# 2. నగరాలు

ఇరుకుగా వ్యాధితో నగరం
తొంగిచూచె చావు నిరంతరం

– రుడ్యార్డ్ కిప్లింగ్

... ఉద్యమంలో కలిగే అంతరాయాల వల్ల అనేక తికమకలు వస్తాయి. ఇటువంటి తికమకలు నగరాలలో కార్మేద్సుకే ఎక్కువగా ఉండొచ్చు. కాబట్టి నగరాలలో కార్మేద్సు రాజకీయాలపై ఎక్కువ శ్రద్ధ చూపాలి.

– చారుమజుందార్

నగర ప్రాంతాలలో పార్టీ కార్యక్రమంపై ఒక వివరణ నవంబరు 18, 1971.

## దరిద్రం – అనారోగ్యం

రెండు విషయాలు సి.పి.ఐ. (మా.లె.) సిద్ధాంతాలలో ప్రముఖంగా చోటు చేసుకున్నాయి. తరతరాలుగా వీరత్వాన్ని సంతరించుకున్న రైతాంగ సముదాయం వాటిలో మొదటిది. రైతాంగానికి నాయకత్వం వహించేందుకు, దాని ద్వారా రాజ్యాధికారాన్ని చేపట్టేందుకు తయారైన కార్మికవర్గం రెండవది.

కార్మిక వర్గానికి కేంద్రం నగరం. దేశ ఆర్థిక రాజకీయాభివృద్ధిని నిర్ణయించే వైఖరులకు నిలయమైన నగరం సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమంలో మరో ప్రముఖ పాత్ర కూడా నిర్వర్తించింది. కొత్త రాజకీయాలోచనలను ఆహ్వానించే అసమ్మతిదారులైన మేధావులు కూడా ఈ నగర వాతావరణం నుంచే ఉద్యమానికి కానుకగా వచ్చారు. కమ్యూనిస్టు విప్లవకారుల సాయుధోద్యమానికి ముందు దేశంలో గల నగర పరిస్థితిని ఆకళింపు చేసుకోవడం అవసరం.

నగరాలలో నాడూ (1966–67), నేడూ కూడా ప్రధానంగా కనిపించే విషయాలు – జనాభా పెరుగుదల, నిరుద్యోగం, మురికివాడలు, దిగజారే ప్రజారోగ్య పరిస్థితులు,

హీనమవుతున్న జీవనస్థాయి.

ప్రణాళికా సంఘం వారి ఒక సర్వే ప్రకారం ప్రతీ సంవత్సరం పెరిగే నగర జనాభాలో 2 శాతం సహజమైన పెరుగుదల కాగా, 2 నుంచి 4 శాతం దాకా అంతరంగిక జనాభా తరలింపు వల్ల జరుగుతోంది.[1] వీరిలో చాలా భాగం ప్రధానంగా దేశంలోని గ్రామ ప్రాంతాల నుంచి తరలి వచ్చినవారే. ముందు అధ్యాయంలో చర్చించినట్టు గ్రామీణ దారిద్ర్యం వల్ల గ్రామ ప్రజలు పట్టణాలకు చాలావరకు తరలిపోవడం జరుగుతోంది. ఒక పరిశీలకుడు చెప్పినట్టు... మంచి ఉద్యోగం వచ్చిందని నగర ప్రాంతాలకు తరలి వచ్చిన ప్రతీ 100 మందికీ మరో 254 మంది ఉపాధి కోసం వస్తున్నారు."[2]

మంచి ఉద్యోగం వచ్చిందనుకున్న వాళ్లందరూ తక్కువ ఉత్పాదక విలువ (productivity) గల వ్యవసాయపు ఉపాధి నుంచి, చేతి పనులు, చిల్లర వర్తకం, ఇంటి చాకిరీ వంటి తక్కువ ఉత్పత్తి గల నగర రంగాల్లోకి మారడం మాత్రమే జరిగింది. అంతకంటే దురదృష్టవంతులు నిరుద్యోగుల, చిరుద్యోగుల జాబితాలోకి చేరారు.

పెరిగే జనాభాతో ఇళ్ళ కొరత కూడా పెరిగింది. 1965 నాటికి పట్టణ జనాభాలో ఇళ్ల కొరత 12 మిలియన్ల యూనిట్ల దాకా ఉంది. ఉన్న ఇళ్లలో 73 శాతం ఇళ్లలో బాత్‌రూములు లేవు.[3]

మరి వీళ్లందరూ ఎక్కడ ఎలా తల దాచుకుంటున్నారు? నగరాలలో నివసించే చాలా భాగం ప్రజలు ఇళ్ళు లేకుండా తిరుగుతూ పేవ్‌మెంట్ల మీదే నిద్రపోతారు. కలకత్తా, దాని చుట్టూ గల పారిశ్రామిక వాడల్లోని 6, 7 మిలియన్ల ప్రజల్లోనూ 30,000 మందికి అసలు ఇళ్లే లేవు. వీళ్లు వీధుల్లోనే నిద్రిస్తారు. జనాభాలో చాలా మంది మురికివాడల్లోనే ఉంటారు. కేంద్ర ప్రభుత్వం మురికివాడల నిర్మూలన సలహా కమిటీ సమాచారం ప్రకారం 1958 నాటికే దేశంలో దాదాపు 15 మిలియన్ల మురికివాడలున్నాయి.[4] ఇవన్నీ మానవ మాత్రులు నివసించేందుకు వీలైనవి కావు. వీటిని ఢిల్లీలో 'జుగ్గేలు' 'జోఫ్రేలనీ, బొంబాయిలో 'చాలు'లనీ, కాన్పూరులో 'అహతార్ల'నీ, దక్షిణ భారతంలో 'చేరీ'లనీ కలకత్తాలో 'బస్తీ'లనీ వ్యవహరిస్తారు.

సి.పి.ఐ. (మా.లె.) నగర వ్యూహానికి కేంద్రం కలకత్తా. ఇది పట్టణ జనసమ్మర్దానికీ, అనారోగ్యానికి పరాకాష్ట. అందువల్ల ఈ నగర పరిస్థితిని క్లుప్తంగా అర్థం చేసుకోవడం అవసరం. 1966లో జరిపిన ఒక సర్వేలో కలకత్తాలోనూ దాని పరిసరాల్లో గల పారిశ్రామిక వాడల్లోనూ 4,00,000 మురికివాడలున్నాయని తెలిసింది. ".... 33 శాతం కుటుంబాలకు నీటి సరఫరా లేదు. 61 శాతం కుటుంబాలకు ఆ సదుపాయం

ఉమ్మడిగా ఉంది. 1 శాతం కుటుంబాలకు మాత్రమే వేరే నీటి కొళాయిలున్నాయి."[5] కొన్ని దశాబ్దాల క్రితం కట్టిన డ్రైనేజీ సూయేజ్‌లు ప్రస్తుతావసరాలకు సరిపడడం లేదు. నగరంలో ప్రజారోగ్య సౌకర్యాల అధ్వాన్నస్థితి పెద్ద వానలు కురిసినప్పుడు బయటపడుతుంది. నగర జనాభాలో చాలా భాగం 'సర్వీస్ ప్రైవీ'లనే చాలా పాతకాలపు తరహా పాకీదొడ్లపైనే ఆధారపడుతున్నారు. నగరంలో గల అటువంటి 42,000 ప్రైవీలలోనూ 17,000 మురికి వాడల్లో ఉన్నాయి. వర్షాకాలంలో మురికిగొట్టాలు పొర్లి వాటిలోని మలమూత్రాలు మురికివాడల్లోకి కొట్టుకు వచ్చి స్నానం చేసేందుకు బట్టలుతుక్కునేందుకుపయోగించే మంచి నీటి టాంకుల్లోని నీటిని కలుషితం చేస్తాయి.[6] అందువల్ల కలకత్తా ప్రపంచ 'కలరా రాజధాని'గా ప్రసిద్ధికెక్కిందంటే ఆశ్చర్యం లేదు. 1958లో దాదాపు 1800 మంది కలరా వాతబడి చచ్చిపోయారు.

వీళ్ళందరూ తమ కడుపులెలా నింపుకుంటున్నారు? 1957 నాటికి పెద్ద నగరాలలో 78.4 శాతం అక్షరాస్యులు. వారిలో 5.1 శాతం కాలేజీ చదువు కూడా సాగించారు. చదువుకున్న నిరుద్యోగులలో 46 శాతం దేశంలోని నాలుగు మహానగరాలైన కలకత్తా, ఢిల్లీ, బొంబాయి, మదరాసులలోనే ఉన్నారు.[7]

నగర నిరుద్యోగులలో చాలా భాగం అత్యంత విలువైన 16–40 సంవత్సరాల వయసులో వారు. మొత్తం నిరుద్యోగులలో 33 శాతం నుంచి 52 శాతం దాకా మొదటిసారి ఉద్యోగం గురించి ప్రయత్నం చేసే 16–24 వయసుల మధ్యలో ఉన్నారు.[8] కలకత్తా పరిస్థితి ఈ విషయంలో దయనీయం. "ఒక జాగ్రత్తగా చేసిన అంచనా ప్రకారం, జనాభా సంఖ్యలను బట్టి 1961 నాటికి అధమపక్షం 1,70,000 మంది ప్రత్యక్షంగా నిరుద్యోగంలో ఉన్నారు. ఉద్యోగులుగా నమోదు అయిన వారిలో దాదాపు 3,30,000 దాకా అంతంత మాత్రం, పార్టు టైం ఉద్యోగాలే చేస్తున్నారు."[9]

కాలానుగుణంగా గ్రామాలలో వచ్చే నిరుద్యోగం మాదిరిగానే నగరాలలో కూడా ఉద్యోగమాంద్యం (under employment) ఉంటుంది. చాలా మంది తక్కువ ఉత్పత్తి విలువ (low productivity) గల కూలీ రంగంలో పనిచేస్తున్నారు. వాళ్ళలో చాలా మంది నైపుణ్యం లేని (unskilled) నిరక్షరాస్యులు. వీళ్ళకు కాంట్రాక్టు పద్ధతి మీద, 'బద్లీ' (సెలవు ఖాళీలను భర్తీ చేసే) పద్ధతి మీద అప్పుడప్పుడు పనిచేసే అవకాశం దొరుకుతుంది.

ఉపరంగంలో (teritiary sector) ఉద్యోగవకాశాలు, మధ్య తరగతి, దిగువ మధ్య తరగతికి చెందిన వాళ్లకే ఉద్యోగాలు లభిస్తాయి. చదువు లేని నిరుద్యోగులనూ, ఉద్యోగ మాంద్యంతో సతమతమయ్యే వాళ్ళనూ 'లంపెన్ కార్మిక వర్గం'గా పేర్కొనవచ్చు.

"పాత సంఘపు అట్టడుగు పొరల మాటున మూగగా మగ్గే ఈ సంఘశ్లేష్మం చాలా 'ప్రమాదకరమైన వర్గం' "[10] ఈ లంపెన్ కార్మికవర్గంలో చాలామంది దొంగతనం, ముష్టి, దొంగరవాణాల ద్వారా బతుకుతున్నారు. నగరాలలో లాభసాటిగా ఉంటే వ్యభిచారం వంటి రంగాలలో కొందరు చోటుచేసుకున్నారు. 1960లలో వచ్చిన రాజకీయ ప్రాపకం వాళ్ళకు కొత్త మార్గాలు చూపింది. వీళ్ళు రాజకీయ నాయకులకు అంగరక్షకులుగా వ్యవహరిస్తూ వాళ్ళ ప్రత్యర్థుల్ని చంపే హంతకులుగా తయారయ్యారు. పారిశ్రామికులు వీరిని సమ్మెల్ని విచ్ఛిన్నం చేసే గూండాలుగా వాడుకున్నారు. వీళ్ళు తమ తమ యజమానులను బెదిరించి కూడా డబ్బు చేసుకోవడం మొదలెట్టారు.

గ్రామాల నుంచి వేరుపడిపోయిన వీళ్ళకు, మత పరంగా కాని, నైతికంగా గాని, రాజకీయంగా గాని ఎటువంటి సాంప్రదాయక పవిత్రతలూ లెక్క లేదు. పీల్చిపిప్పి చేసే దారిద్ర్యం, అవమానాల నుంచి వచ్చిన పేదవాళ్ళ కోసం తొందరపాటు, నైరాశ్యం కల వీళ్ళ నాశన శక్తిని నగర ఆందోళనలలో ఇంధనంగా వాడుకున్నారు. చారుమజుందార్ వాళ్ళ గుడ్డిద్వేషం గురించి ఇలా అన్నాడు "ఆందోళనకారులు రైల్వే స్టేషన్లు, పోలీసు స్టేషన్లు మొదలైన వాటిపై దాడి చేస్తున్నారు. ప్రభుత్వ భవనాల్ని, బస్సుల్ని, ట్రాముల్ని రైళ్ళను అనేక ఆందోళనల్లో నాశనం చేస్తున్నారు. లడ్డైట్లు జరిపిన ఆందోళన ఇటువంటిదే."(5)

## కొందరికే అందే అంతస్తు

నగరాలలో దుర్భర దారిద్ర్యం, దిగజారే సాంఘిక జీవనం సరసనే కొందరికి నానాటికీ ఐశ్వర్యమూ సంపదా పెరుగుతున్నాయి.

దేశంలోని వస్తూత్పత్తి కార్మాగారాలన్నీ నగర ప్రాంతాలలోనే ఉన్నాయి. "1960–61–1965–66 మధ్యకాలంలో పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల మొత్తం లాభం (Gross Profit) 51 శాతం పెరిగింది."[11] నగరాలలో పరిశ్రమలకు తోడు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల పరిపాలనాలయాలు కూడా ఉన్నాయి. 1956లో ప్రభుత్వోద్యోగుల సంఖ్య 52.34 లక్షలు. ఆ సంఖ్య 1965 జూన్ నాటికి 90.20 లక్షలకు పెరిగింది.[12] ప్రభుత్వరంగంలో పెరిగిన ఉపాధి అవకాశాల వల్ల ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్నత స్థాయి అధికారులు పెరిగారు. ప్రణాళిక సంఘ పెరుగుదల తీరును అధ్యయనం చేసిన ఒక ఆర్థిక శాస్త్రవేత్త సార్వత్రికమైన ఈ పెరుగుదల దాన్ని ఉదాహరణగా చూపాడు. "1951–52లో 244 మందితో చిన్న సైజులోనున్న సంఖ్య 1964 నాటికి 1,141కు చేరుకుంది... 1950–51లో రూ 3 లక్షలున్న అధికారుల జీతాలు

1964-65కు 30 లక్షలకు పెరిగాయి. గౌరవ వేతనాలు రూ 2 లక్షల నుంచి 13 లక్షలకు, మొత్తం ఖర్చు రూ. 8.6 లక్షల నుంచి రూ 67 లక్షలకూ పెరిగింది."[13] ప్రభుత్వ కార్యకలాపాల వల్ల, పారిశ్రామిక విస్తరణల వల్ల ఉపరంగంలో జరిగిన భారీస్థాయి విస్తరణ వల్ల తెల్లచొక్కా (గుమస్తా) ఉద్యోగాలు కూడా పెరిగాయి.

గతించిన వలస విధానంలోనూ, ప్రస్తుత జాతీయ ప్రభుత్వంలోనూ భ్రష్టులైన ముద్దుబిడ్డలకు అది స్వర్ణయుగం. నగర జనాభాలో మూడింట రెండు వంతులు నగర వినియోగపు కనీస మొత్తం (సంవత్సరానికి రూ. 359[14]) సరాసరి కిందే ఉన్నారు. పైనున్న U-రంగపు వారు మాత్రం విలాస వస్తువులపై పెరిగే తమకంతో కొత్త కొత్త మార్గాల్లో చేసే ఖర్చుల్లో తేలియాడుతున్నారు. వాళ్ల విలాసావసరాలకు అనుగుణంగా దేశంలో ఉత్పత్తి పద్ధతుల్ని తీర్చిదిద్దారు. బురదలో చెమటలో అనూహ్యంగా ఏహ్యంగా బతుకుల్ని మురికివాడల్లో, ఇరుకుగదుల్లో, చీకటి కూపాల్లో, అడుగుపొరల్లో నగర జనాభాలో మూడింట రెండు వంతుల జనం తమ బతుకుల్ని అధ్వాన్నంగా గడుపుతున్నారు. కాని మరోవైపు కొత్త భవంతులకూ, ఎకరాల కొద్దీ వ్యాపించే ఫైవ్-స్టార్ హోటళ్లకూ, మయసభల్లాంటి నాటక శాలల నిర్మాణానికీ, సినీమాహాళ్లకూ కావలసిన సిమెంటును సరఫరా చేసేందుకై సిమెంటు ఉత్పత్తిని పెంచారు. "తొమ్మిది మహానగరాల్లోనూ 66 శాతం పైగా జనాభా సరాసరి నలుగురు నివసించే ఒకే గది ఇళ్ళల్లో ఉంటున్నారు. మిగిలిన వారిలో 25 శాతం మురికి వాడల్లోను 'జోపాడ్ పత్తీ'లలోనూ, ఇంకా చాలామంది పేవ్‌మెంట్లపైనా నిద్రపోతున్నారు. జనాభాలో 5 శాతం మాత్రమే ఎంతో జాగాను ఆక్రమించిన విలాసమందిరాలలో పెద్ద భవంతులలో నివసిస్తున్నారు."[15]

సామాన్య ప్రజానీకానికి అవసరమైన వస్తూత్పత్తి రంగాలలో ఉత్పత్తి స్తబ్దత, పెరుగుదలలో మందకొడితనం నెలకొని ఉండగా[16], U-రంగంలో* కావలసిన వినియోగపు వస్తువుల ఉత్పత్తి క్రమంగా పెరగసాగింది.[17]

ఈ విధంగా 1960ల మధ్య కాలానికి నగరాలలో ఆర్థిక పరిస్థితి దేశంలోని గ్రామ ఆర్థిక పరిస్థితిని అనేక విషయాలలో పోలి ఉంది. పై స్థాయిలో కొద్దిమంది ఆర్థిక పెరుగుదల వల్ల కలిగిన లాభాలను అనుభవిస్తున్నారు. మెజారిటీ జనాభా ముద్ద దొరికితే పొద్దుగడిచే బతుకులు వెళ్లమారుస్తున్నారు. కొద్దిమంది భూస్వాముల

---

* *U- రంగం అంటే మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి, సంపన్న వర్గాలకు రచయిత వాడిన సంకేత పదం.*

గుత్తాధిపత్యంలో సాగుచేసే విశాల భూభాగం ఎలా ఉందో అలానే నగరంలో దేశపరిశ్రమపై 75 పారిశ్రామిక కుటుంబాలు ఆధిపత్యం వెలగబెడుతున్నాయి.[18] గ్రామ ఫ్యూడలు వ్యవస్థలో వర్తకులూ, వడ్డీవ్యాపారులు, అనేక తరహాల దళారీల మాదిరిగానే నగరాలలో కూడా రెండవ రంగ విస్తరణ వల్ల, బ్యూరోక్రాట్లు, ప్రైవేటు వ్యాపారసంస్థల అధికార్లు, కాంట్రాక్టర్లు, ఏజెంట్లు వంటి పరాన్నబుక్కులు పెరిగిపోయారు. పరిపాలనకు వ్యాపారాలకు నిలయాలైన ఈ నగరాలలో అవినీతి లంచగొండి తనం, దళారీతనం వంటి అవినీతి పద్ధతులకు మరింత అవకాశం ఏర్పడింది.

## పరిశ్రమలలో స్తబ్దత - 1966-67

గత అధ్యాయంలో వివరించిన 1966-67 నాటి గ్రామ ప్రాంతాల ఆహార సంక్షోభం నగర పారిశ్రామిక రంగంలో కూడా తన ప్రభావాన్ని కనబరచింది. ఆహారపు కొరత, పంటల నష్టాల వల్ల పెరిగిన ధరలు, అక్రమ నిల్వల కారణంగా పారిశ్రామిక రంగంలో తయారైన వస్తువుల గిరాకీ తగ్గింది. వినియోగపు వస్తువుల అమ్మకం పడిపోయింది. రవాణా సర్వీసులలోకి గిరాకీ తగ్గడం వల్ల రవాణా రంగ పరిశ్రమలైన, రైలు వాగన్లు, ట్రక్కులు, టైర్లు ట్యూబులు మొదలైన వాటి గిరాకీ కూడా పడిపోయింది. 1967-68 పూర్వార్ధానికి రైలు వేగన్లు, వ్యాపారపు వాహనాల ఉత్పత్తి వరుసగా 23,000; 36,900గా నున్న అత్యున్నత ప్రమాణ స్థాయిల నుంచి 15,000; 25,600 యూనిట్ల సంవత్సర ప్రమాణాలకు పడిపోయింది.[19]

పరిశ్రమల స్తబ్దత లేక మాంద్యం (Industrial recession)గా వ్యవహరించబడ సాగిన ఈ పరిస్థితి కార్మికులపై కూడా గట్టి దెబ్బ తీసింది. 1967 జనవరి 1 నుంచి మార్చి 15వ తేదీ దాక 95 సంస్థలలో 23,000 కార్మికులు పని పోగొట్టుకున్నారు. 8 సంస్థలు మూతపడ్డాయి. వాటిలోని 700 మంది కార్మికులు నిరుద్యోగులయ్యారు.[20] నగర మధ్య తరగతి వర్గాలకు చెందిన చాలా భాగం గుమాస్తా ఉద్యోగులు కూడా పెరుగుతున్న ధరల పట్ల కలత చెందసాగారు. 1967లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఒపీనియన్ బొంబాయి, కలకత్తా, మద్రాసు, ఢిల్లీ మహానగరాల్లో జరిపిన సాంపులు సర్వే ఇలా సమీక్షించింది. "ఆదాయపు స్థాయిలతో సంబంధం లేకుండా ద్రవ్యోల్బణపు ఒత్తిడుల నుంచి తిండి బట్టా వంటి విషయాలలో కూడా తగ్గింపులు చేసుకోవలసి వచ్చిన సార్వత్రిక సంఘర్షణే మనకు కనబడుతుంది." సూటిగా చెప్పాలంటే, దిగజారే సాంఘిక పరిస్థితులు, పెరుగుతున్న నిరుద్యోగానికి తోడు

పారిశ్రామిక స్తబ్దత సామాన్యుని నడుంపై మోయలేని భారానికి తగిలించిన గుదిబండలా వచ్చి పడింది. 1966–67లో పెరిగి విరిగి పడబోతున్న నగర సమస్యలకు దారితీసిన పారిశ్రామిక స్తబ్దత ఎందువల్ల కలిగింది? 1947 నాటి నుంచి ప్రభుత్వం అనుసరించిన ప్రణాళిక విధానాలు, పారిశ్రామిక వైఖరులే దీనికి చాలా వరకు కారణం.

## ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు

విరుద్ధ వర్గాల మధ్య పోటీపడే వర్గ ప్రయోజనాలకు రాజీ చేయాలనే గాంధీగారి తాపత్రయమే; భారత ప్రభుత్వ పారిశ్రామిక విధానాలలో కూడా ప్రతిబింబించింది. పారిశ్రామిక రంగంలో అణగారిన ప్రజల తరఫునే ఉన్నానని నోటి మాటలతో మాత్రమే ప్రకటించే ప్రభుత్వం యజమాన్ల సదుపాయాలను కొనసాగిస్తామని వాగ్దానం చెయ్యడంలో కూడా అటువంటి శ్రద్ధనే చూపించింది.

ప్రభుత్వ రంగాన్ని విస్తరించే ఆశయంతో 'పారిశ్రామిక విధాన ప్రకటన' (1948)ని ప్రభుత్వం ఆమోదించింది. కాని అదే కాలంలో నాటి ఆర్థిక మంత్రి డా. జాన్‌మత్తాయ్ "భవిష్యత్తులో ప్రైవేటు వాణిజ్యం ఎంత వరకు ఉంటుందనేది వాస్తవాల తర్కంపైన (ఆధారపడి ఉంటుంది కాని) సిద్ధాంత సంవిధానాల అవసరం పైన (ఆధారపడదు)" అని వర్తక వాణిజ్య మండలి సమాఖ్య (Associate Chamber of Commerce)కు హామీ ఇచ్చాడు. ఇది ఆ సంవత్సరం డిసెంబరు నాటి సంగతి. 1948 నుంచి ప్రభుత్వ రంగం స్థాయి అప్పుడప్పుడు కాంగ్రెసు సమావేశాలలో ఆమోదించే తీర్మానాల వల్ల నిర్ణయించబడలేదు. ప్రైవేటురంగం ముందుకు రాని, ప్రైవేటు పెట్టుబడి సాధ్యపడని పరిశ్రమల వల్ల అది నిర్ణయించబడింది. అట్టి పరిశ్రమలలోనే భారత ప్రభుత్వం శ్రద్ధ చూపింది.

ప్రణాళికవేత్తలు కాని పారిశ్రామికవేత్తలు కాని ఆశించిన స్థాయిలో ప్రైవేటు వ్యాపార రంగం మూలాధారపు సర్వీసులలో కాని, ఉక్కు, నౌకా నిర్మాణం, రైలు మార్గాలు, ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ పరిశ్రమలవంటి కీలక రంగాలలో పెరగలేదని తెలుస్తుంది. భారత రాజకీయాలను సానుభూతితో చూసే ఒక పరిశీలకుడు ఇలా వివరించాడు. "ఉక్కు... పబ్లిక్ రంగంలో వృద్ధి చెందడానికి కారణం నెహ్రూ సోషలిస్టు కావడం కాదు. ఈ రోజులలో అంతటి జాతీయ స్థాయి వ్యాపారానికి కావలసిన పెట్టుబడి బిర్లాల అపార సంపదనంతా గుమ్మరించినా చాలదు."[21] భారత ప్రభుత్వం ఉక్కు ఫ్యాక్టరీలను నిర్మించ పూనుకోవడానికి అసలు కారణం ఏదైనా కనక ఉంటే అది

ప్రైవేటు రంగం అంత పెట్టుబడి పెట్టలేకపోవడం, ప్రైవేటు రంగం కంటే సరసమైన పరిస్థితులు ప్రభుత్వానికి సాధ్యపడడమే అని నాటి వాణిజ్యం, పరిశ్రమల మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి అంగీకరించాడు.[22] అంతేకాక పబ్లిక్ రంగం ప్రైవేటురంగానికి చవకగా ముడిదినుసుల్ని, యంత్రాంగాన్ని సరఫరా చేస్తూ ప్రైవేటు పారిశ్రామికుల పాలిటి పాడి ఆవులా ఉంటూ వచ్చింది. పబ్లిక్ రంగం ఉత్పత్తిలో చాలా భాగం ప్రైవేటు రంగ ప్రయోజనాలకై ఉపయోగపడ సాగింది. "ప్రైవేటు రంగంలో విరివిగా లైసెన్సులు మంజూరయ్యాయి. ప్రభుత్వ భారీ పరిశ్రమలలో మూడు నాలుగు సంవత్సరాల జాప్యం అలక్ష్యం జరిగింది. అదే కాలంలో ప్రైవేటు రంగంలో (ఉత్పత్తులు) అంచనాలను మించాయి. ప్రభుత్వం ఏం చెయ్యలేదు. పబ్లిక్ రంగం ఉత్పత్తిలో బకాయి పెరుగుతూ వచ్చింది"[23] అని ఒక పరిశీలకుడు అన్నాడు.

పారిశ్రామిక ద్రవ్య సహాయసంస్థ (Industrial Finance Corporation) జాతీయ పరిశ్రమాభివృద్ధి సంస్థ (National Industrial Development Corporation) వంటి సహాయక సంస్థల ద్వారా ప్రైవేటురంగపు బృహత్ పరిశ్రమలకు దీర్ఘకాలిక రుణాలిచ్చి ప్రభుత్వం సాయపడింది. జీవిత బీమా సంస్థ (ఎల్.ఐ.సి.) ద్వారాను, నేరుగా ప్రభుత్వ సహాయం ద్వారాను, 1955 నుంచి 1966 దాకా మొత్తం ప్రైవేటు రంగం పొందిన ఆర్థిక సహాయంలో మంజూరైనది రూ. 808.04 కోట్లు. అందులో రూ. 584.32 కోట్లు పంపకం జరిగింది. ఇందులో పెద్ద పరిశ్రమలకు రూ. 455.85 కోట్లు మంజూరై రూ. 333.46 కోట్లు పంపకమైంది.[24] 1967 నాటికి 88 శాతం జాతీయోత్పత్తి ప్రైవేటు రంగానికి పోతూంది. ప్రభుత్వ రంగపు వాటా 5 శాతం మాత్రమే పెరిగింది.[25]

వ్యవసాయరంగంలో అధిక పెట్టుబడులను పెట్టగలిగే సమర్థత కలిగి ఉండడం వల్లా, నవీన పద్ధతులననుసరించగలిగినందువల్లా పెద్ద రైతులు మాత్రమే వాటి లాభాలను పొందగలిగారు. అలాగే సకాలంలో చెల్లింపులు చేయగలగడం వల్ల ప్రభుత్వ రుణాలను, పెట్టుబడి యంత్రాంగపు దిగుమతికి విదేశీమారకం, వీటన్నిటినీమించి ఉత్పత్తికి, విస్తరణకు చెందిన లైసెన్సులు కూడా సహజంగానే పెద్ద పారిశ్రామికులు చేజిక్కించుకో గలిగారు. ఈ మాదిరిలో ఒకే పరిశ్రమకు చెందిన అనేక లైసెన్సులను 75 పెద్ద పారిశ్రామిక సంస్థలు సంపాదించి, ఆ సరుకులో గుత్తాధిపత్యం సంపాదించినా, తాము పూర్తి ఉత్పత్తిని సాధించకుండా ఇతరులకు మాత్రం అట్టి అవకాశం దొరకనివ్వలేదు.[26] 75 పారిశ్రామిక సంస్థలకు చెందిన కంపెనీల ఆస్తులు 1967-68 నాటికి రూ. 4,032.4 కోట్లున్నాయి. ఈ పెరుగుదల 1963-64

స్థాయిపై 54.7 శాతం ఉంది.[27] ఈ విధంగా పెద్ద సంస్థలు తమ గుప్పిటలో మార్కెటును ఉంచుకుని ఉత్పత్తిని తమకు లాభసాటిగా ఉండే స్థాయికి తగ్గించుకుంటూ, ధరలను నిర్ణయించగలుగుతూ కొత్తవాళ్ళకు ద్వారాలు మూసి వేయగలిగారు. గ్రామప్రాంతంలో పెద్ద రైతులాగే నగరంలోని బడా పారిశ్రామికవేత్త కూడా ఉత్పత్తిని తారుమారు చేస్తూ, అత్యవసర వస్తువులు, ఆధార పారిశ్రామిక వస్తువుల పంపిణీ, ధరల నియంత్రణలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు.

ఐతే ప్రభుత్వ యంత్రాంగం పాత్ర ఏమిటి? ధనికుల కొమ్ము కాచేలా తయారైన భూసంస్కరణలను అమలు పరిచే విషయంలో, బీదలపై గల సహజమైన ద్వేషంతో గ్రామ ప్రాంతాలలో పాలనా యంత్రాంగం ఫ్యూడలు పెత్తందార్ల చేతిలో ఎలా ఆయుధాలుగా వ్యవహరించిందో ముందు అధ్యాయంలో చూశాం. అలాగే పారిశ్రామిక రంగంలో కూడా పారిశ్రామిక కుటుంబాల నుంచీ లైసెన్సులను వచ్చిన దరఖాస్తులను నిర్ణయించేటప్పుడు, ఆయా బడా పారిశ్రామికవేత్తలకు లాభసాటిగా ఉండేలా లైసెన్సులు మంజూరు చేసేవారు. ఈ విషయాన్నే పారిశ్రామిక లైసెన్సుల జారీ విధానపు దర్యాప్తు కమిటీ నివేదిక (The Industrial Licencing Policy Enquiry Committee Report) ఇలా చెప్పింది. “చాలా పారిశ్రామిక సంస్థలు లైసెన్సుల నిర్ణయాలు తీసుకునే సంచాలకాధికారుల (Liason Officers) ను పోషిస్తూంటాయని అందరూ ఎరిగినదే. వీళ్లు ప్రభుత్వంలోని ఉన్నత వ్యక్తులతో వ్యాపార సాంఘిక స్థాయిలలో సహచర్యం నడుపుతూ తమకు అనుకూలంగా ఆయా వ్యక్తుల స్వయం నిర్ణయాధికారం ఉపయోగపడేలా చూస్తారు” భారత పారిశ్రామికార్థిక వ్యవస్థలోని ఈ ధోరణుల్ని సి.పి.ఐ. (మా.లె.) “హెచ్చు లాభశాతాల ద్వారా భారత ప్రజలను దోపిడీ చేసే 75 కాంప్రడార్ బ్యూరోక్రటిక్ పెట్టుబడిదార్ల చేతుల్లో కేంద్రీకృతమవుతున్న భారతదేశ సంపద విదేశీ గుత్తాధిపతులకు స్వదేశీ బృహత్ పారిశ్రామికులకు అనుకూలంగా ప్రభుత్వ రంగం వినియోగపడడం....”[28] గా అభివర్ణించింది.

దేశ ఆర్థిక వ్యవస్థను ప్రైవేటురంగపు ఆధిపత్యం ఎలా అస్తవ్యస్తం చేయగలదో రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో తెలిసింది. పారిశ్రామికవేత్తలు విచ్చలవిడిగా విదేశాల నుంచి విరివిగా కొనుగోలు చేసి విదేశీమారకపు నిల్వలను ఖాళీ చేసారు. ఉన్నత వర్గాలకు కావలసిన విలాస వస్తువుల తయారీకి ప్రాముఖ్యతనిచ్చి, నిత్యావసర వస్తువుల ఉత్పత్తి, సాంఘిక సంక్షేమ పథకాలపై ఖర్చును నిర్లక్ష్యం చేసారు. అప్పటి ఆర్థికమంత్రి సి.డి. దేశ్‌ముఖ్ తరువాత ఇలా అన్నాడు. “..... మనకు అవసరం లేని వస్తువులపై కనీసం రూ. 100 కోట్ల విలువైన విదేశీమారకం వృధా చేసారు...

ప్రైవేటు రంగపు విదేశీమారకపు వినియోగం ఒక రకమైన దొంగ నిల్వగా తయారైంది. 1955 నాటికి రెండవ పంచవర్ష ప్రణాళికకు 800 కోట్లు విదేశీమారకం కొరత అని తెలిసింది." ఈ విషయంలో ప్రభుత్వం లాలూచీపడిందని ఆరోపిస్తూ "మన వ్యాపారస్తులు వాళ్ళ పెట్టెలో నిలవచేసేందుకు (విదేశీమారకాన్ని) .... ప్రణాళిక ఇంకా పూర్తిగా ఆమోదం పొందేలోగానే, (ఆ వ్యాపారస్తులంటే) సానుభూతి కురిపించే మంత్రిత్వశాఖ (అనుమతించింది)."[29]

తమ సొంత వనరుల్ని ఎక్కువగా ప్రణాళిక పెట్టుబడిగా వినియోగించాలనే కోరికను అడ్డుకునేందుకు, అప్పుల రూపేణా, ఉమ్మడి కంపెనీలుగా ఆర్థిక రంగంలో పెట్టుబడి రూపేణా పెద్ద పారిశ్రామిక కుటుంబాలు విదేశీ పెట్టుబడిని చేతులెత్తి ఆహ్వానించాయి.

## విదేశీ కోరల్లో చిక్కుకున్న భారత ఆర్థిక వ్యవస్థ

గతంలో వడ్డీ వ్యాపారం, వర్తకం, వాణిజ్యం ప్రాతిపదికలుగా గల భారతీయ పారిశ్రామికాధిపతులు బ్రిటిషు పెట్టుబడిదార్ల ఏజెంట్లుగానే ఉండేవారు. పెట్టుబడిదారీ పూర్వ ధనసేకరణ విధానాల ననుసరించిన వీళ్ళు నిజానికి బ్రిటిషువారి ఔదార్యంతో వాళ్ళ గొడుగు నీడలోనే పెరిగారు. గారడీ వాడి మామిడి మొక్కలా (పుట్టుక నుంచీ అంగ లోపంతో) ఉన్న వీళ్లు స్వతంత్ర వ్యాపార వర్గంగా ఎదగలేకపోయారు. బడాయి కాపాడుకునేందుకు అప్పుడప్పుడు వేసే చిందులూ, తిరుగుబాట్లూ తప్పిస్తే, విదేశీపెట్టుబడి, సరఫరాలు, సేవలపై చేవలేకుండా వాళ్ళు ఆధారపడడం ఆనాడు వాళ్ళ సహజమైన ధోరణి.

భారత ప్రభుత్వం కూడా అటువంటి ధోరణినే కనపరచింది. 1948 పారిశ్రామిక విధాన తీర్మానం ప్రకారం "విదేశీ పెట్టుబడి, వ్యాపార నిరతి యొక్క భాగస్వామ్యం... దేశం త్వరగా పారిశ్రామికం అయ్యేందుకు ఎంతో ఉపయోగపడుతుంది." ఒక సంవత్సరం తరవాత, 1949 ఏప్రిలు 6వ తేదీన జవహర్‌లాల్ నెహ్రూ పార్లమెంటులో, ప్రస్తుతం ఉన్న విదేశీ ఆస్తులకు జాతీయ ప్రతిపత్తి ఉంటుందనీ, కొత్త విదేశీపెట్టుబడికి ప్రోత్సాహం ఉంటుందనీ ప్రకటించాడు. విదేశీ సంస్థలతో కలిసిన భారతీయ మెజారిటీ యాజమాన్యం మంచిదే. ఒక వ్యాపారం పైన పూర్తి విదేశీ పెట్టుబడి ఆధిపత్యాన్ని పరిమిత కాలం పాటు "జాతీయ ప్రయోజనాలకు అవసరమని భావిస్తే" ప్రభుత్వం అభ్యంతరం పెట్టదు.

1950ల మధ్యకాలానికి పెట్టుబడి తరలింపులపై ఉన్న కొద్ది ఆంక్షల్ని సడలించారు. మెషీన్ టూల్స్, ఎరువులవంటి ప్రత్యేకించిన పరిశ్రమలలో కూడా విదేశీ సంస్థలు

చేరేందుకు ప్రోత్సాహం దొరికింది[30]. నూనెశుద్ధి కర్మాగారాల స్థాపనకు ప్రోత్సాహంగా తగు మాత్రం రాజ్యేతర లాంఛనాల్ని కూడా ఇచ్చారు. 1951లో స్టాండర్ట్ వాక్యూమ్, బర్మా షెల్ కంపెనీలతోనూ, 1953లో కాల్టెక్సుతోనూ ఒప్పందాలు జరిగాయి. 1947 నుంచి జారీ చేసిన క్రమశిక్షణాత్మక సూత్రాలు నిబంధనలు వీటికి అమలు జరగకుండా వేరే రక్షణ ఇచ్చారు. ముఖ్యమైన వోటులేని వాటాలు (Preferential Non-Voting Shares)25 శాతం గరిష్టపరిమితిగా దేశవాళీ భాగస్వామ్యానికి కేటాయించారు. 25 సంవత్సరాల పాటు జాతీయం చెయ్యకుండా హామీనిస్తూ తరువాత కనుక జాతీయం జరిగితే సక్రమమైన పరిహారాన్ని చెల్లించే ఏర్పాటు చేసారు.[31]

1957 సెప్టెంబరు – అక్టోబరు మాసాలలో బిర్లా ఆధ్వర్యాన దేశీయ పారిశ్రామిక వేత్తల ప్రతినిధి బృందం ఒకటి అమెరికా. బ్రిటను, పశ్చిమ జర్మనీలను సందర్శించింది. అప్పటికే మొదలైన విదేశీ పెట్టుబడుల ప్రవాహం ఆ తరవాత చాలా బాగా పెరిగింది. వస్తూత్పత్తి రంగంలోనే 1948లో 70.7 కోట్లున్న విదేశీ పెట్టుబడులు 1958 చివరకు 214.9 కోట్లకు పెరిగాయి. మార్చి 1967 నాటికి అవి రూ.630.9 కోట్లకు పెరిగాయి. విదేశీ పెట్టుబడులున్న అటువంటి ఉమ్మడి వ్యాపారాల వల్ల పెద్ద పారిశ్రామికులు లాభాలు పొందారు. పేరు ప్రతిష్టలు కల విదేశీ కంపెనీలతో కలవడం వల్ల, ప్రమాణం కల వాళ్ళ వస్తువుల బ్రాండ్‌లను వాడడం వల్ల, అప్పటికే రంగంలో ఉన్న దేశీయ కంపెనీలకు పోటీగా నిలుస్తూ ఈ బడా పారిశ్రామికవేత్తలు తమ గుత్తాధిపత్యాన్ని పటిష్టం చేసుకున్నారు. కాని విదేశీ పెట్టుబడిదారుకు మాత్రం ఇంతకంటే ఎక్కువ లాభమే ఉంది. రిజర్వుబ్యాంకు వారి అధ్యయనాల ప్రకారం వాళ్ళ దేశాలలో సరాసరి లాభం కంటే మన దేశంలో విదేశీ పెట్టుబడి మీద లాభాలు ఎంతో ఎక్కువగా ఉన్నాయి. 1953లో అసలు విలువలో 13.5 శాతం, 1965లో (టాక్సు మినహా) 12.8 శాతం లాభాలను అమెరికన్ కంపెనీలు పొందాయి. అదే సంవత్సరంలో తమ దేశంలో 10 నుంచి 12వ శాతం మాత్రమే లాభాలు వస్తున్నాయి. అలాగే ఆ రెండు సంవత్సరాలలో బ్రిటిషు కంపెనీలు 11.9 శాతం నుంచి 9.5 శాతం దాకా లాభాలార్జించగా స్వదేశంలో 8.9 శాతమే లాభాలొస్తున్నాయి.[32]

1968, 1969, 1970 సంవత్సర కాలాలలో బర్మాషెల్, ఎస్సోకాల్టెక్సు వంటి విదేశీ నూనె కంపెనీలు రూ. 226 కోట్లు లాభాలను రవాణా చేసాయి. భారతీయ పెట్టుబడి రూ. 10 కోట్లతో సహా ఈ కంపెనీల మూలధనం రూ. 110 కోట్లు. సాలుసరి రవాణా లాభశాతం 71.3కు వస్తుంది.[33] విదేశీ కంపెనీల శాఖల విదేశీ మారక భాగాలను (FB)* విదేశీ అజమాయిషీలోని రూపాయి కంపెనీల (FCRC)*

భాగాలను 1954-55 నుంచి 1967-68 దాకా విశ్లేషించిన ఒక ఆర్థికవేత్త ఇలా అన్నాడు. "ఈ కాలంలో తరలించిన లాభాల కంటే నికరం విదేశీ పెట్టుబడి తక్కువగానే ఉంది." ముగింపుగా "..... పూర్తిగా వినియోగదార్లనూ కార్మికులనూ లాభసాటిగా ఉపయోగించుకోవడం వల్లనే విదేశీ వ్యాపారులు వాళ్ల పారిశ్రామిక సామ్రాజ్యాలనూ వాటి పెంపునూ తీర్చిదిద్దుకుంటున్నార"ని తేల్చాడు.[34]

ప్రభుత్వ విధానాలు కూడా ఈ విషయంలో వాళ్ళకు ఎంతో తోడ్పడ్డాయి. విదేశీ సంస్థలలో మొదటి 6 శాతం లాభాలపై, మొదటి 5 సంవత్సరాల పాటు ప్రభుత్వం పన్ను రద్దును (Tax holiday) ప్రకటించింది. ఆదాయపు పన్ను మదింపు అవసరాలకు మినహాయింపును అనుమతిస్తూ విదేశీ పెట్టుబడిదార్లకు అభివృద్ధి రిబేటును ప్రకటించి ఫ్యాక్టరీ యంత్రసామగ్రిపై 120 శాతం మినహాయించుకొనే వీలు కల్పించింది. కొన్ని ఆధార పరిశ్రమలలోని డివిడెండ్ల (లాభాలు)పై సూపర్‌టాక్సు మినహాయింపులు ప్రకటించింది.[35] దేశీయ పారిశ్రామికులతో కలిసి కొత్త వ్యాపారాలను ప్రారంభించేందుకు విదేశీ ప్రైవేటు పెట్టుబడిదార్లకు ఇచ్చిన లైసెన్సుల సంఖ్య 1951 నుంచి 1961 నాటికి 5 రెట్లు పెరిగింది. మొత్తం విదేశీ పెట్టుబడులలో 1948లో నాలుగు శాతం ఉన్న అమెరికన్ల వాటా 1965 నాటికి 22 శాతానికీ, 1967 నాటికి 25 శాతానికి పెరిగింది.[36] కాని మొత్తం పెట్టుబడులలో బ్రిటీషు పెట్టుబడులే ఇంకా పైచేయిగా ఉన్నాయి. మొత్తం విదేశీ పెట్టుబడులలో 61 శాతం బ్రిటీషు వారిదే.[37]

భారతీయ బడా పారిశ్రామికవేత్తల, విదేశీ పెట్టుబడుల ఉమ్మడి, ఆర్థిక వ్యవహారిక లాభాలు మాత్రం దేశ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పణంగా పెడితేనే వచ్చాయి. కొన్ని బహుళ వినియోగ వస్తురంగంలో తమకు గల గుత్తాధిపత్యాన్ని ఆసరా చేసుకుని ఈ విదేశీ కంపెనీలు హెచ్చు ధరలు నిర్ణయించేవి. ఈ విధంగా ప్రైవేటు రంగంలోని మందుల అమ్మకంలో విదేశీ కంపెనీల అనుబంధ సంస్థల (Subsidiaries) (50 శాతం అంతకు మించి ఈక్విటీ పెట్టుబడి ఉన్నది.) పాత్ర సగం ఉంటుంది. తక్కువ శాతం ఈక్విటీ**** భాగస్వామ్యం గల కంపెనీలను కూడా లెక్కలోకి తీసుకుంటే మొత్తం వాటా అమ్మకంలో 2/3 వంతలకు పెరుగుతుంది. టారిఫ్ కమీషన్ ప్రకారం టోకు అమ్మకం ధరలు ఫ్యాక్టరీ ఖర్చులపై 160 నుంచి 350 శాతం వరకూ ఉండగా, చిల్లర ధరల నిర్ణయం 600 నుంచి 2000 శాతం దాకా ఉంటోంది.[38]

---

* FB - Foreign Branches

** FCRC - Foreign Controlled Rupee Companies

*** *వాటాధనం.*

కంపెనీ మధ్యంతర ఒప్పందాల షరతుల ప్రకారం, భారతీయ భాగస్వాములకు ఎక్కువ వాటా ఉన్నప్పటికీ ఉమ్మడి వ్యాపారాలపై విదేశీ పెట్టుబడిదార్లకు పూర్తి పట్టు ఉంటూ వచ్చింది. అటువంటి ఒప్పందాలలోని ఒక విషయాన్ని తీసుకుందాం. సాంకేతిక అస్వతంత్రత. అంటే విదేశీ సాంకేతిక సముదాయం మొత్తం మన దేశం మీద రుద్దడం "ఆ సాంకేతిక సముదాయానికి అనుబంధంగా కావలసిన ఎంతో విలాసప్రదమైన సేవాసముదాయం. అనుబంధ పరిశ్రమలు కలిగి–వేతనాల దృష్ట్యా సమర్థనీయం కానిది."[39] భారతీయ కంపెనీలు చాలా భాగం విదేశ సహకారంలో చేసే పెట్టుబడి మూలకమైన (Capital Intensive) పెట్టుబడిని (Capital) గురించి చెపుతూ మైకేల్ కిడ్రోల్ చాలా భాగం గ్రామీణంగా ఉండే సాంప్రదాయిక ఉత్పత్తిని ఇది దెబ్బ తీస్తుందని భావించాడు. దీనివల్ల ఒకవైపు బాహాటంగా నిరుద్యోగం. గ్రామీణ కూలీరేట్లు ఇది వరకు కంటే తగ్గిపోవడం, నిపుణత కల కూలీ రేట్లు పెరగడం, పెట్టుబడి – మూలక, కార్మిక నిరోధ (Labour displacing) పెట్టుబడి మరోవైపు జరుగుతుంది. "దానివల్ల హెచ్చు జీతాలు కల ఒక చిన్న మైనారిటీవర్గం పుట్టుకొస్తుంది. పట్టణాలలో నిరుద్యోగం కొట్టొచ్చేలా పెరుగుతుంది. గ్రామాల నుంచి వలస వచ్చిన ప్రజల ఆశలు అడియాసలౌతాయి. వీటి సంయోగం చాలా శక్తివంతమైన ప్రేలుడు మిశ్రమంగా తయారౌతుంది."[40] అదీకాక విదేశీ సంస్థలు ఒక్కో ప్రాజెక్టుకు సరఫరా చేసిన యంత్ర సామాగ్రి దాని ఖరీదుకు రెండింతలుగా ఉండడం, విదేశీ సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఖరీదుగా ఉండడం మామూలే. కాంగ్రెసు పార్టీ అధికార పత్రికలో ఒక రచయిత చెప్పినట్టు "... సాంకేతిక పరిజ్ఞానానికీ, మూల యంత్ర పరికరాలకూ, రాయల్టీలకూ, లాభాలకూ, భారతదేశంలో ఏకైకంగా అమ్మే హక్కులకూ మనం (అసలు) చెల్లించవలసిన దానికంటే ఎంతో ఎక్కువ చెల్లించవలసి వచ్చింది."[41]

విదేశీ పెట్టుబడి అప్పుల రూపంలో కూడా దిగుమతైంది. 1963 నాటికి అప్పులు, పరపతి, చందాలు, సహాయాల రూపంలో ఒక్క అమెరికన్ పెట్టుబడే రూ. 27,000 మిలియన్లుంది. దేశ పారిశ్రామికోత్పత్తిలో కొంత భాగం దీనికిందే చెల్లిపోగా, భారత ప్రభుత్వ రుణభారం మాత్రం భారతమయమై దేశం సతమతమౌతోంది. 1968–69 సంవత్సరిక వాయిదా చెల్లింపుల తరవాత ఖాతాలలో బాకీ ఉన్న చెల్లించవలసిన అప్పులు దాదాపు రూ. 6000 కోట్లున్నాయి.[42]

1966లో అమెరికన్ ఆధిపత్యం క్రింద ఉన్న ప్రపంచ బ్యాంకు ఒత్తిడి వల్ల రూపాయి విలువ తగ్గించడంతో విషయం పాకానపడింది. 1966–67 పారిశ్రామిక స్తబ్దతకు దారితీసిన పరోక్ష కారణాలలో ఇది కూడా ఒకటి. దిగుమతి చేసుకునే

ముడిసరుకులపైనా, పెట్టుబడి సరుకులపైనా మన దేశం ఎక్కువ మొత్తాన్ని చెల్లించవలసి వచ్చింది. ఎక్కువ ధరలతో ఆహారధాన్యాలకు సబ్సిడీలు చెల్లించడం వల్ల వినా – అభివృద్ధి (Non-developmental) ఖర్చు మొత్తం పెరిగింది.

సోవియట్ యూనియన్ సంవత్సరానికి 10,000 రైలువాగన్లు కొనేందుకూ, నిరుపయోగంగా పడి ఉన్న ఉక్కు తదితర వస్తువులు కొనేందుకూ, భారత ప్రభుత్వంతో 1968 ఫిబ్రవరిలో ఖరారు చేసుకున్న ఒప్పందాలు పారిశ్రామిక స్తబ్దత నుంచి దేశాన్ని కొంతవరకూ కాపాడాయి. కాని పెరుగుతున్న సోవియట్ ఆర్థికసహాయం భారత్‌తో సహకారం పరిస్థితిని మౌలికంగా మార్చలేదు. బ్రిటిషు, అమెరికన్ సహకార ఒప్పందాలలాగే సోవియట్ సహాయం కూడా ప్రైవేటురంగాన్నే బలపరచసాగింది.

నిజానికి మొట్టమొదటి రష్యన్ పరపతి. 1954లో బిర్లాల హిందూస్తాన్ కంపెనీకి – అంటే ప్రైవేటురంగంలోనే – మంజూరయింది.[43] నాటినుంచీ సోవియట్ యూనియన్ కూడా మిగతా దేశాలతో కలసి బిర్లాల హిందూస్తాన్ అల్యూమినియంలోను, టాటాల ఎసోసియేటెడ్ సిమెంట్ కంపెనీలలోనూ (ఎ.సి.సి.) బిర్లాల జౌళిమిల్లులలోనూ మరెన్నో భారతీయ సంస్థలతో సహకరించింది. అంతేకాక సోవియట్ సాయంవల్ల పబ్లికు రంగంలోని ఉక్కు పరిశ్రమలో రాయితీ రేట్లతో ఉత్పత్తి, అమ్మకాలు సాధ్యమయ్యాయి. భారత్ – సోవియట్ రెండిటి సబ్సిడీల వల్ల వినియోగ రంగంలో వచ్చిన లాభం పొందిన అనుసంధాన కర్మాగారాలు (Fabricating Plants) ప్రైవేటు యజమాన్యంలోనివే.

భారతీయ బడా పారిశ్రామిక వేత్తల నుద్ధరించే సోవియట్ విధానం, (20వ కాంగ్రెసు తరవాత) దాని విదేశీ ఆశయాల కనుగుణంగానే ఉంది. సోషలిజం సాధనకు కార్మికవర్గ నాయకత్వం కింద ముందుకుపోవాలని కాని ఆర్థిక స్వాతంత్ర్యానికి దేశంలోని సొంత వనరులపై ఆధారపడాలనే తృతీయ ప్రపంచ దేశాల అవసరాన్ని ఇకముందు సోవియట్ కమ్యూనిస్టులు నమ్మనట్టు కనిపించింది. దానికి బదులు 'పెట్టుబడేతర' (Non-Capitalist) అభివృద్ధి మార్గానికి ప్రాముఖ్యతనిచ్చింది. ఒక సోవియట్ వ్యాఖ్యత మాటల్లో చెప్పాలంటే "...... సామ్రాజ్యవాదాన్ని చురుకుగా వ్యతిరేకించే సోషలిస్టు దేశాల నుంచి సహాయమే పెట్టుబడేతర పురోగమనానికి పునాదిగా ఉండి ఈ పురోగమనం దానివల్లనే సాధ్యమౌతుంది."[44]

కాని సోవియట్ యూనియన్ అటువంటి 'పెట్టుబడేతర' అభివృద్ధి మార్గానికి దోహదం చెయ్యడం దేశంలోని 75 పారిశ్రామిక కుటుంబాల కండబలాన్ని మరింత పెంచడమే అయింది. ముందు చర్చించిన ఆచరణల దృష్ట్యా 'సోషలిస్టు సమాజ నిర్మాణపు

బాటనుంచి' ఆయా విధానాలలో గ్రూషో మార్క్సుకూ కారల్‌మార్క్సుకూ ఎంత తేడా ఉందో, అంత దూరంలోకి సోవియట్ కమ్యూనిస్టులు వచ్చారని మనం చూశాం.

సోవియట్ యూనియన్ కూడా భారత దేశంలో వర్తకంలో చాలా లాభం పొందిందనే చెప్పాలి. 1968లో జరిగిన UNCTAD* రెండవ సమావేశంలో భారతీయ ప్రతినిధి. (ప్రత్యేకించి మెషీన్ పరికరాలు, బట్టలమిల్లు ఉత్పత్తులు వంటి రంగాలలో) ఇండియన్ వస్తువులనుకొని వాటిని తిరిగి హెచ్చు ధరకు విదేశాలలో అమ్మడం వంటి సోవియట్ దురలవాటును నిరసించాడు. 45 పారిశ్రామిక ఉత్పత్తిశాఖ మంత్రి 1973 ఆగస్టు 16 తేదీన పశ్చిమ బెంగాలులోని దుర్గాపూర్‌లోని ఇండియా ఆస్త్రాల్మిక్‌గ్లాస్ లిమిటెడ్, పెద్ద మొత్తంలో ఆర్థిక నష్టాన్ని పొందుతోందని చెప్పాడు. సోవియట్ యూనియన్‌లో కంటి అద్దాలకు, టెలిస్కోపులకు మొదలగు వాటికయ్యే ఉత్పత్తి ఖర్చులో మూడోవంతు ఖరీదుకే ఆయా పరికరాలు సోవియట్ యూనియన్‌కు ఎగుమతి కావడమే దీనికి కారణంగా పేర్కొన్నాడు. అంతేకాక సోవియట్ యూనియన్ భారత్‌కు తన సరుకులను హెచ్చు ధరకు కూడా అమ్ముతూండేది. 1969లో భారత్‌కు అమ్మిన 15,000 ట్రాక్టర్లకు కావలసిన విడిభాగాలను తూర్పు యూరపు దేశాలకు అమ్మిన ధర కంటే మూడు రెట్లు ఎక్కువ ఖరీదుకు మాస్కో భారతదేశానికి అమ్మింది. అదే కాలంలో యూరోపియన్ మార్కెట్లలో నికెల్ టన్ను రూ. 15000 ఉండగా మాస్కో మనకు టన్ను 30,000కు అమ్మింది.

మొత్తం దేశ సంక్షేమాన్ని చూస్తామని చెప్పే భారతీయ బడాపెట్టుబడిదారుల సమర్థత పూర్తిగా పూజ్యం అని తేలిపోయింది. 19వ శతాబ్దంలో యూరోపియన్ వలస వ్యాపారుల వస్తువులను అమ్మి తిరిగి సరకులను సేకరించడానికి తోడ్పడే వాళ్ళ పూర్వీకుల నాటి నుంచీ వస్తున్న దాస్యపు అలవాటు వల్ల సహజంగానే వాళ్లు విదేశీ గుత్త వర్గాలను సేవించగలుగుతున్నారు. వారిలో కొందరు నేటికి అటువంటి ప్రయోజనాలకే కొమ్ము కాస్తున్నారు. ఈ విదేశీ పెట్టుబడిదార్లు స్థానికంగా ఉమ్మడి సహకారం ఎందుకు కోరుకుంటారో నిర్మొహమాటంగా వివరించే ఈ విశ్లేషణ ఉదాహరణగా చూడవచ్చు. "స్థానిక మధ్యవర్తుల అవసరం పెరిగింది. అది అతిముఖ్యమైనది. ప్రభుత్వ ఆర్థిక జోక్యం విస్తరించడం వల్ల అధికార సముదాయంతో వ్యవహరించడం కూడా వీరు నిర్వర్తించే పాత్రల్లో ఒకటి. అనేక స్థాయిలలో చెయ్యవలసిందెంతో ఉంటుంది. లైసెన్సులు సంపాదించాలి. న్యూఢిల్లీలో

* United Nations Conference on Trade and Development.

నిబంధనలకూ, నియమావళులకూ తమకనుకూలంగా భాష్యం చెప్పించుకోవాలి. కిక్కిరిసిన రేవుల్లోని సరుకులను కదిలించాలి. రెండు మూడు రైలు వేగన్లను సంపాదించాలి.... భారతీయ భాగస్వాముల ప్రాముఖ్యతను ఈ పాత్రలో బాగానే గుర్తించడం జరిగింది."[46] ఈ విధంగా తమ తమ పెద్ద లాభాలనే విధంగా తగ్గించుకోని, తిరిగి పెట్టుబడి పెట్టడం ఇష్టంలేని బానిస వర్గపు భారత వ్యాపారులు తయారయ్యారు. వాళ్ళు స్వతంత్రంగా ఎదగడాన్ని త్యాగం చెయ్యగలరు. వాళ్లు విదేశీ పెట్టుబడిని, విదేశీ పెట్టుబడిదార్లను ఆహ్వానించి, పెట్టుబడి వస్తువుల తయారీపై వాళ్ళ ఆధిపత్యాన్ని, నిరంకుశత్వాన్ని సహిస్తూంటారు. దాని ద్వారా రాయల్టీలు, సాంకేతిక సేవలు, పేటెంట్లు, బ్రాండ్ పేర్ల వినియోగం, రుణాలపై చెల్లించే వడ్డీల కంటే అధిక మొత్తాల ప్రవాహానికి విదేశీ పెట్టుబడిదార్ల దారిని మరింత చక్కబరిచారు.

భారత ప్రభుత్వం కూడా ఈ విధానానికి తన అలవాట్లు, పొరపాట్ల ద్వారా దోహదం చేసింది. ముందు పేర్కొన్న రాయితీల నెన్నిటినో విదేశీ పెట్టుబడిదార్లకు మంజూరు చెయ్యడం కాక, U-రంగం సంపాదించిన లాభాలు, వనరులుగా సమీకరించడానికి బదులు బయటకు పోనిచ్చింది. ప్రభుత్వం 1968-69లో విదేశీ రుణాలపై రూ.376 కోట్లు చెల్లిస్తూ,[47] అదే కాలంలో బడా పారిశ్రామిక వేత్తలు ఎగవేసిన రూ. 470 కోట్లు ఆదాయపు పన్ను మొత్తాన్ని పోగొట్టుకుంది.[48]

ముందు అధ్యాయంలో వివరించినట్లు దేశంలో చిన్న రైతు గ్రామంలోని వడ్డీ వ్యాపారికి బానిసగా తయారైన కథే, అంతర్జాతీయ బాకీదార్లతో భారతీయ పారిశ్రామికవేత్తల విషయంలోనూ భారీస్థాయిలో పునరావృతమయింది. తేడా అంటూ ఉంటే, రైతు బానిసత్వంలోకి నెట్టబడ్డాడు. బుద్ధిపూర్వకంగానే భారతీయ పారిశ్రామికుడు తాబేదారుగా వ్యవహరించడం మొదలెట్టాడు.

భారతీయ బూర్జువాల బానిసతత్వాన్ని ఎత్తి చూపేందుకు పైన వివరించిన విదేశీ సహాయం పెట్టుబడులకు సంబంధించిన గుణాంకాలు చాలవనుకుంటే, భారతీయ పట్టణాలలోని 'నడమంత్రపు సిరి'గాళ్ల సాంఘిక సాంస్కృతిక అలవాట్లను పరిశీలిస్తే ఎగువతరగతి సంఘపు 'అర్థవలస' తత్వం పూర్తిగా కనిపిస్తుంది. వ్యాపారపు సంస్థలలోనూ, ప్రభుత్వ కార్యాలయాలలోనూ హెచ్చు జీతాలలో ఉన్న అధికార్లు హై సొసైటీలో చెలామణీ అవుతూ పెంచుకున్న 'ఆంగ్ల వ్యామోహాని'కి కుక్కగొడుగుల్లా పెరిగిన ఇంగ్లీషు మీడియం స్కూళ్ల విస్తరణే మంచి నిదర్శనం.

ప్రభుత్వంలోనూ మరో స్థాయిలో అటువంటి బానిసత్వమే కనపడుతుంది. ఏవిధంగానూ 1947 అధికార మార్పిడి కొత్త మలుపుగా కనపడదు. వలస కాలం

నాటి లాంఛనాలను శ్రద్ధతో అనుసరించారు. పార్లమెంటు ప్రారంభ సమావేశం నాడు రాష్ట్రపతి చేసే పార్లమెంటు ప్రయాణం చూస్తే విక్టోరియా మహారాణి కూడా తృప్తి పడుతుంది. దీన్నేదో తమాషాగా తోసి పారేస్తే బ్యూరోక్రటిక్ సాంప్రదాయాల్లో అవమానకర విషయాలు చాలా ఉన్నాయి. 1960లలో కలకత్తాలోని లాల్‌బజార్ పోలీస్ కేంద్రాలయంలో పోలీస్ కమీషనర్ గదినలంకరించిన బ్రిటిష్ పోలీసు అధికారుల చిత్రాలు వరుసలు నాకింకా జ్ఞాపకమున్నాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో అనేక మంది దేశభక్తుల ఖూనీలకు, హత్యలకు వాళ్లలో చాలామంది బాధ్యులు. 1947 తర్వాత వచ్చిన వాళ్ల భారతీయ వారసులూ ఉన్నారు. ఈ కొనసాగింపు దేశ పరిపాలనా విభాగాలలోనూ, సైనిక పరిపాలనా విభాగాలలోనూ కనపడుతుంది. వాళ్లలో కొందరు బ్రిటిషు శిక్షణ పొందిన సివిల్ అధికారులు, ఉన్నతోద్యోగులు. (వాళ్ళలో కొందరు తమ బానిస చర్యలకు నాటి వలస అధిపతుల నుంచి కితాబులు పొందినవారు.) లేదా దేశీ శిక్షణ పొందిన వాళ్ల వారసులు. కీలక స్థానాల్లో ఉన్న వీళ్లు సామాన్య జనం అంటే అదే అసహ్యాన్ని జీర్ణించుకున్నవాళ్లు. 'స్వతంత్ర భారతం' యొక్క ముఖ్య నావికాధికారి (Chief of the Naval Staff) ఎడ్మిరల్ నందా HMIS Thalwar లో లెఫ్‌టినెంటుగా (RIN* Voulanteer Reserve) తన అధికార్లను సేవించాడు. దాని నావికులే 1946 నాటి రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటులో విదేశీ యాజమాన్యాన్నెదిరిస్తూ పాల్గొనగా, మరోవైపు తన బానిస సేవలు చేసిన వాడు నందాయే.[49]

పరిపాలన, అణచివేత, రక్షణల వంటి అన్ని విషయాలలోనూ బ్రిటిషు కాలం నాటి పాత రాజ్య యంత్రాంగాన్ని అన్ని విధాలా పరిరక్షించి పోషిస్తూ తద్వారా ప్రజా వ్యతిరేక భావజాలాన్ని పూర్తిగా పరిరక్షించే అవకాశాన్ని నిర్మిస్తూన్న భారతీయ పాలకవర్గం బ్రిటిషు రాజ్యం నాటి రోజులకు యావచెందే సంస్కృతీ సంస్కృతిని బాహాటంగా కనపరచుకుంటూనే ఉంది.

## భారత బూర్జువాలపై సిపిఐ (మా.లె.) అభిప్రాయాలు

భారతీయ పారిశ్రామిక రంగంలో పైన ఉదహరించిన ధోరణులనన్నీ సి.పి.ఐ. (మా.లె.) సరిగానే అర్థం చేసుకుందని గమనించాలి. పార్టీ రాజకీయ తీర్మానంలో

---

* Royal Indian Navy.

పెద్ద పారిశ్రామికవేత్తలను "కాంప్రడార్ బ్యూరోక్రాట్* కేపిటలిస్టులు"గానూ, దేశాన్ని "అర్థవలస" రాజ్యంగానూ, ప్రభుత్వాన్ని "అమెరికన్ సామ్రాజ్యవాదానికీ సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదానికి తొత్తుగానూ అభివర్ణించింది. పై అంశాలను వివిధ సందర్భాలలో రాసిన అనేక వ్యాఖ్యలలో, వివరణలలో చారుమజుందార్ మరింత విపులంగా చెప్పాడు.

భారతీయ బూర్జువాలందరూ కాంప్రడార్లేనా? జాతీయ బూర్జువాలు** ఇండియాలో ఉన్నారా? ఆయన ఇలా హెచ్చరించాడు "అర్థవలస దేశంలో జాతీయ బూర్జువాలు కూడా కాంప్రడార్ బూర్జువాలుగానే ఉండి తీరతారు" వాళ్ళ సంబంధాలను వివరిస్తూ ఇలా అన్నాడు. "చిన్న మధ్యమ తరగతి బూర్జువాల నుంచి వాళ్ళ పెట్టుబడికై కాంప్రడార్ల సహాయాన్ని కోరతారు. రెండు: వాళ్ళ పరిశ్రమలకు ముడిసరుకుల్ని కాంప్రడార్ బూర్జువాల నుండే కొనాలి. మూడు: తమ పరిశ్రమల అభివృద్ధికి కూడా వాళ్లు కాంప్రడార్ బూర్జువాలపైనే ఆధారపడి ఉంటారు. నాలుగు: వాళ్లు ఉత్పత్తి చేసిన సరుకులో కూడా చాలా భాగం కాంప్రదార్ బూర్జువాలే కొనాలి. దీన్ని సాకుగా తీసుకొని కాంప్రడార్ బూర్జువాలు చిన్న మధ్య తరగతి బూర్జువాలపై తమ సంక్షోభాన్ని రుద్దుతారు. ఐదు: కార్మికవర్గాన్ని వ్యతిరేకించడంలో వీళ్ళు కాంప్రడార్ బూర్జువాలతోనే కలుస్తారు. ఆరు: ఈ చిన్న మధ్య తరగతి బూర్జువాలు తాము సమీకరించిన లాభాలలో భాగాన్ని రిజర్వు ఫండుగా కాంప్రడార్ బూర్జువాల పెద్ద పరిశ్రమలలో వాటా ధనంగా పెట్టుబడి పెడతారు. ఈ కారణాల చేత జాతీయ బూర్జువాలే అతినీరసమైన వర్గం. అందువల్ల వీళ్ళు ఎటువంటి స్వయం నిర్ణయం చెయ్యడం, దాన్ని అమలుపరచడం అసంభవం."(60)

---

* *కాంప్రడార్ అనే మాటకు అసలు అర్థం విదేశీ వ్యాపార సంస్థలోని చైనీయ ఉద్యోగి, చైనీ మానేజర్ – "చైనా సమాజంలో వర్గముల పరిశీలన" మావోసేటుంగ్ వ్యాసంలో వివరణ (Selected Works. Vol. I P. 19. పెకింగ్ ముద్రణ)*

*పెట్టుబడిదారీ దేశాలను నేరుగా సేవిస్తూ వాళ్ళచే పోషింపబడేవాడు కాంప్రడార్ బడాబూర్జువా. గ్రామ ప్రాంతాలలోని ఫ్యూడలు శక్తులతో అనేక సంబంధాలతో దగ్గరగా ముడిపడి ఉంటాడు. మావోసేటుంగ్ 'చైనా విప్లవం. చైనా కమ్యూనిస్టు పార్టీ' (Selected Works. Vol. II P. 320. పెకింగ్ ముద్రణ)*

** *మధ్యమ బూర్జువాలు, అంటే జాతీయ బూర్జువాలు చైనా విప్లవం పట్ల పొంతన లేని వైఖరిని కలిగి ఉన్నారు. మావోసేటుంగ్ "చైనా సంఘంలో వర్గాల పరిశీలన" (Selected Works. Vol. I P. 13. పెకింగ్ ముద్రణ)*

చారుమజుందార్ సిద్ధాంతాలలో పెటీ బూర్జువాలకు మాత్రం విప్లవాత్మక పాత్ర ఇవ్వబడింది. "ప్రస్తుత విప్లవంలో కార్మికవర్గానికి మిత్రులెవరు?" అని ప్రశ్నించి ఇలా వివరించాడు. "మొదటగా రైతాంగం యావత్తూ అని చెప్పుకోవాలి. అంటే భూమిలేని రైతులు, బీదరైతులు, మధ్య తరగతి రైతులలో చాలా భాగం... వీళ్ళు కాక శ్రమపడే పెటీ బూర్జువాలు కూడా కార్మికవర్గంతో ఉంటారు. ఈ కారణంగా వాళ్ళపైనే విప్లవం ఆధారపడి ఉంటుంది... కనక కార్మికవర్గం నాయకుడుగా, విప్లవాత్మక వర్గంగా "పెటీ బూర్జువాలు రైతాంగంతో ఐక్యత చెందాలి. సరిగ్గా ఇటువంటి ఐక్యతనే మనం ఐక్య సంఘటనగా పేర్కొంటాం."(4)

తరువాత సి.పి.ఐ. (మా.లె.) కార్యక్రమం ఇదే ఉద్దేశాన్ని ఇముడ్చుకుంటూ "నగరంలో పెటీబూర్జువాలు, విప్లవాత్మక మేధావులు, విప్లవాత్మక శక్తులుగా ఉంటూ విప్లవంలో నమ్మదగిన మిత్రపక్షంగా ఉంటారు" అని పేర్కొంది.

భారతీయ బూర్జువా వర్గం గురించి సి.పి.ఐ. (మా.లె.) సిద్ధాంతాలలో గల ముఖ్యాంశం భారత పాలకవర్గంపై పెరుగుతున్న సోవియట్ ఆధిపత్యాన్ని గుర్తించడం. భారతీయ ఆర్థిక రాజకీయ విధానాలపై అమెరికా సోవియటు యూనియన్లు సాగించే ఉమ్మడి పెత్తనాన్ని పార్టీ తన కార్యక్రమంలో వివరించింది. భారత ఆర్థిక రంగాలలోని కీలక రంగాలలో వాటి ఆధిక్యత, "విదేశాలకు పెద్ద పెట్టున లాభాల తరలింపు", కాంప్రడార్ బ్యూరోక్రటిక్ కాపిటలిజం పెరుగుదలకు లభిస్తూన్న ప్రోత్సాహం, రెండు అగ్రరాజ్యాలూ సైనిక స్థావరాల స్థాపనకై చేసే మిలిటరీ సరఫరాల గురించి పేర్కొంది. భారత విదేశాంగ విధానాన్నిలా వివరించింది. "అమెరికన్ సామ్రాజ్యవాదులూ, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులూ సోషలిస్టు చైనాను చుట్టిముట్టి, ఆసియాలో, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో వివిధ ప్రాంతాలలో రగిలే జాతీయ విముక్తి పోరాటాలను అణచివేసి ప్రాపంచిక వ్యూహావసరాలకు అనుగుణంగా.... 1952లో సోషలిస్టు చైనాపై భారత్ దురాక్రమణనూ; జెకోస్లోవాకియాపై సోవియట్ దురాక్రమణను మౌనంగా ఆమోదించడం, వియత్నాం ప్రజలపై అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని సమర్థించడం వంటి (భారతదేశపు) దుష్టపాత్రనూ" దీనికి ఉదాహరణలుగా పేర్కొంది.

"అమెరికన్ సామ్రాజ్యవాదం సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదాల నాయకత్వంలో" సంయుక్తంగా జరిగే ఈ సామ్రాజ్యవాదపు పీడన వల్లనే సి.పి.ఐ. (మా.లె.) పార్టీ భారత్‌ను అర్థవలస దేశంగా వర్ణించింది. * "బ్రిటిషు సామ్రాజ్యవాదం ఫ్యూడలిజాలనే

* *"అనేక దేశాల ఆధీనంలో ఉన్న అర్ధవలస దేశానికీ ఒకే దేశం ఆధీనంలో ఉన్న వలస దేశానికీ తేడా ఉంది" – మావోసేటుంగ్, చైనా విప్లవంలో యుద్ధ సమస్యలూ, వ్యూహం. (Selected Works. Vol. I P. 197)*

రెండు పర్వతాలకు బదులు, అమెరికన్ సామ్రాజ్యవాద నాయకత్వం, ఫ్యూడలిజం, కాంప్రడార్ బ్యూరోక్రటిక్ పెట్టుబడి, అనే నాలుగు పెద్ద పర్వతాల బరువుతో" భారత ప్రజల నడుం విరిగిపోతుంది. దాన్నుంచే "దేశంలో నాలుగు ప్రధాన వైరుధ్యాలను" అంటే "ఒకవైపు సామ్రాజ్యవాదం, రెండో వైపు మన ప్రజలకూ గల వైరుధ్యమూ, ఫ్యూడలిజానికీ ప్రజాబాహుళ్యానికీ గల వైరుధ్యమూ, పాలక వర్గాలలో అంతరంగిక వైరుధ్యమూ...' అనే వైరుధ్యాలను స్థిరీకరించింది. ముందు అధ్యాయంలో వివరించినట్టు వీటన్నిటిలోనూ "భూస్వాములకూ రైతాంగానికీ, అంటే, ఫ్యూడలిజానికీ భారత ప్రజలలో బహుళజన సందోహానికీ, గల వైరుధ్యమే ప్రస్తుత దశలో ప్రధాన వైరుధ్యం."

పైన వివరించిన నగర–పారిశ్రామిక స్థితిలో సాయుధ "జనతా ప్రజా తంత్ర విప్లవ" సాధన విషయంలో ప్రజల్లోని వివిధ వర్గాల శక్తి సమర్ధతలను ఆలోచించవచ్చు.

## పట్టణ కార్మిక వర్గం

1967–68 నాటికి మన దేశంలో పారిశ్రామిక కార్మికులు 5 మిలియన్ల దాకా ఉన్నారు. గనులు, ప్లాంటేషనులు, రైల్వేలు, తంతితపాల రంగాలలోని కార్మికులతో సహా మొత్తం 18.5 మిలియన్ల మంది ఉంటారు. షాపులు, రెస్టారెంటులు తదితర సంస్థలలో మరో రెండు మిలియన్లు పని చేస్తున్నారు.[50]

ఈ తరహా కార్మికులు దేశ జనాభాలో 7 శాతం ఉన్నారు. స్థానిక భూస్వాములపై జపాన్ సామ్రాజ్యవాదులపై 1939లో చైనా కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటం జరిపిన కాలంలో అటువంటి కార్మికులు నాటి చైనా జనాభాలో 31 1/3 శాతం ఉండేవారు.[51] భారతీయ పరిస్థితులలో పట్టణ కార్మికవర్గపు ప్రాముఖ్యత దీనివల్ల తెలుస్తుంది.

మొత్తం కార్మిక జనాభాలో 4.5 మి. కార్మికులు అంటే 1/8 వంతు మంది మాత్రమే, ట్రేడు యూనియన్లలో సంఘటితమైయున్నారు.[52] 1960లో జనుము, నూలుమిల్లులు, ఇంజనీరింగు వంటి అనేక పరిశ్రమలలో సంప్రదింపులు ఐక్యంగా జరపడం వల్ల కార్మికులు తమ జీతాలను పెంచుకోగలిగారు. సంవత్సరాల తరబడి సంఘర్షణ ఫలితంగా వచ్చిన రక్షణ ద్వారా ఈ సంఘటిత కార్మికులు స్థిరతను, అభివృద్ధిని సాధించారు. కాని అలాంటి స్వల్ప లాభాలు కూడా సంఘటిత కార్మికులకే పరిమితమయ్యాయి. కార్మిక సంఘ పరిధి వెలుపల ఉన్న కార్మిక జన బాహుళ్యం మాత్రం దురవస్థలోనే మిగిలిపోయారు.

ద్రవ్యోల్బణ పరిస్థితులలో పెరిగిన జీతాల వల్ల వచ్చిన లాభాలు నిరంతరం పెరిగే నిత్యావసర వస్తువుల ధరల వల్ల తుడుచుకుపోయాయి. పారిశ్రామిక కార్మికుల ధనవేతనాలను (money wages) నిజ వేతనాల (real wages)తో పోలిస్తే ధనవేతనాలు 1996లో 139 నుంచి 1968లో 160 (ఆధార సంవత్సరం 1960–100)కు పెరగగా, నిజవేతనాలు 1966లో 95 నుంచి 1968లో 94కు (ఆధార సంవత్సరం 1961–100) తగ్గాయి.[53] సంక్షోభాల కాలంలో ఉద్యోగాల రక్షణ ఎందుకూ కొరగా లేదు. 1966–67 పారిశ్రామిక స్తబ్ధత వల్ల వేలకొలదీ కార్మికులు పనిని కోల్పోయారు. లేదా లాకౌట్లు మూసివేతల వల్ల నిరుద్యోగులయ్యారు.

తమ తమ ట్రేడ్ యూనియన్ నాయకత్వం కారణంగా దేశంలోని కార్మికవర్గం ప్రస్తుత వ్యవస్థ యొక్క ఉక్కు చట్రపు పరిధిలోనే చట్టబద్ధమైన ఆశయాలకు అంటే వేతనాలు, పనికాలం, పని స్థితి గతులకే పరిమితమై వాటిని సమ్మెలు సామూహిక సంప్రదింపులు వంటి చట్టబద్ధమైన ఒత్తిడులు ఎత్తుగడలకే పరిమితం చేసి ఆహారం, ఉద్యోగాలు, గృహ నిర్మాణం వంటి తక్షణ లాభాల వరకే సహజమైన ఆసక్తిని కనపరచారు. ఆ విధంగా భారత దేశంలో 1947 తరువాత ప్రముఖంగా ఉద్యోగ రక్షణ తరహా కార్మిక సంఘోద్యమం ఆదరణలోకి వచ్చింది.* ప్రముఖ రంగాలలో కార్మికశక్తిని ఆధీనంలోకి తెచ్చుకున్న ఏ కార్మిక సంఘం కాని రాజకీయ పక్షం కాని ప్రస్తుత రాజ్యశక్తిని (state power) నిర్మూలించాలని కాని, ఉత్పత్తి సాధనాలు జాతి పరం చెయ్యాలని కాని నినాదాలివ్వడం, పోరాడడం, కాని చెయ్యలేదు. అందుచేత కార్మిక సంఘాలు కార్మికులకు వస్తురూపమైన లాభాలే తేగలవు కాని సంఘాన్ని విప్లవాత్మకంగా మార్చడంలో అవెప్పుడూ ముందులేవు.

అయినప్పటికీ భారత్‌లోని పారిశ్రామిక కార్మికవర్గానికి, ప్రస్తుత ఆర్థిక కోర్కెల పరిధిని దాటి రాజకీయ పరిణామాలకై తోడ్పడేందుకు కొంత శక్తి ఉంది. గతంలో రాజకీయ పోరాటాలకు సంబంధించిన పిలుపులను కార్మికవర్గం అమలు పరచిన సందర్భాలున్నాయి. 1908లోనే బాలగంగాధర తిలక్‌ను అరెస్టు చేసినప్పుడు నిరసనగా బొంబాయి నూలు మిల్లుల కార్మికులు సమ్మె చేసారు. బహుశ అది భారతీయ కార్మికవర్గం యొక్క మొట్టమొదటి రాజకీయ చర్య. అప్పుడు లెనిన్ దాన్ని రానున్న కాలానికి సంకేతంగా కొనియాడాడు. 1930లో, పౌర అవిధేయతా ఉద్యమ (Civil

---

* *సూక్ష్మంగా చూస్తే ఇది వలస పాలకులు తరలిపోతూ మనకంటించిన, రివిజనిస్టు, ఉదారవాద కార్మికోద్యమ సాంప్రదాయం – అను.*

Disobedience Movement) కాలంలో కూడా బొంబాయి ప్రెసిడెన్సీలోని షోలాపూర్‌లోని నూలు మిల్లు కార్మికులు తిరుగుబాటు చేసారు. ఒకవారం రోజులపాటు నగరాన్ని తమ ఆధీనంలో ఉంచుకుని పోలీసుల్ని తొలగించి తమ సొంత పాలనను ఏర్పాటు చేసారు. మే 12వ తారీఖున సైనిక పాలన విధించే దాకా ఆ పరిస్థితి కొనసాగింది. 1930 మే 14వ తేదీ 'టైమ్సు' పత్రిక ఇలా వ్రాసింది. "తమ సొంత పాలన ఏర్పాటు చేసుకున్న ఈ 'మంద'ను కాంగ్రెసు నాయకులు కూడా అదుపులో పెట్టలేకపోయారు." చివరగా బ్రిటిషు సైనికులు తిరుగుబాటును అణచారు. తిరుగుబాటు నాయకులు అరెస్టయ్యారు. వాళ్ళలో కొందరికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.[54] ముప్ఫైలలో పారిశ్రామిక కార్మిక వర్గపు రాజకీయ చైతన్యాన్ని ప్రస్తావిస్తూ కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకు డొకరిలా అన్నాడు. "చాలా మంది కార్మికులు మన పార్టీలో చేరే అవకాశం ఉండేది... మేం వాళ్ళ మధ్య పని చేసి ఉంటే వాళ్ళలో చాలా మంది మన పార్టీలో చేరి ఉండేవారు."[55]

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన వెంటనే దేశంలో రవాణారంగాన్ని ఆర్థిక వ్యవస్థలోని తదితర ముఖ్య రంగాలనూ స్థంభింపచేస్తూ అనేక సమ్మెలు జరిగాయి. అధికారంలోనూ, ఆస్తి సంబంధాలను మార్చే విషయంలోనూ కార్మిక వర్గంలో కమ్యూనిస్టు నాయకులు ఎటువంటి ప్రచారం చెయ్యకపోవడం దురదృష్టకరం. తరువాత సంఘటనలు దీన్ని రుజువు చేసాయి. హెచ్చు వేతనాలకు జరిగే పోరాటాలకు యూనియన్లు నిర్మించుకునే హక్కుల్ని సంపాదించుకొనే పోరాటాలకు ఈ ఉద్యమం పరిమితమయింది. కాని ప్రస్తుత వ్యవస్థనూ దాని ఉత్పత్తి విధానాలనూ మార్చి రాజ్యశక్తిని ముట్టడించే మరింత మౌలికమైన రాజకీయ పోరాటంలో ఎప్పుడూ చేతులు కలపలేదు. కమ్యూనిస్టులు బొంబాయి, కలకత్తా పారిశ్రామిక ప్రాంతాలలో తగినంత పలుకుబడిని కలిగి ఉండి కూడా 1946–51 తెలంగాణ ఉద్యమ కాలంలో కార్మిక వర్గాన్ని తెలంగాణ పోరాటానికి మద్దతుగా ఎటువంటి పోరాటాలలోనూ దించలేదు. అందువల్ల కమ్యూనిస్టు విప్లవకారులు కార్మిక వర్గాన్ని "జనతా ప్రజాతంత్ర విప్లవానికి" నాయకత్వ స్థాయికి ఎదిగేలా చేయాలంటే కార్మికవర్గంలోని "ఆర్థిక కోర్కెల" (అధిక వేతనాలకై పోరాటాల వంటి ఆర్థిక కోర్కెలకై చేసే చచ్చు పోరాటాల వంటి) పోరాట ధోరణులను నిరసించడం మొదలెట్టాలి.

కార్మిక సంఘాలలో పనిచేసి అధిక వేతనాలకై సమ్మెలను జరిపించడం మొదలైనవి ప్రస్తుత వ్యవస్థపై కార్మిక భ్రమలను కొనసాగిస్తాయి. "..... రాజకీయ పరిజ్ఞానం కలిగి ఛైర్మన్ ఆలోచన (అంటే మావో సేటుంగ్)తో పరిచయం కలిగిన విప్లవాత్మక

కార్మిక వర్గ కార్యకర్తలు ఎంతో అవసరం. అటువంటి కార్యకర్తలు రహస్య పార్టీ కార్యక్రమం ద్వారానే వస్తారు."(22)

అయినా చారుమజుందార్ "కార్మిక సంఘాల ద్వారా పోరాటాలు జరుగుతూనే ఉంటాయి. (కారణం) కార్మికుడికి పోరాడడం సహజం. కనక ఈ పోరాటాలలో చేరతాడు" అని గుర్తించాడు. సి.పి.ఐ. (మా.లె.) కార్మిక వర్గపు ప్రాంతాలలో కార్యకర్తల కర్తవ్యాలను నిర్దేశిస్తూ: "కార్మిక సంఘ పోరాటాలలో పాల్గొనేది సామాన్య కార్మికులు. రాజకీయాల ద్వారా రహస్య పార్టీని నిర్మించే పనిని మన కార్యకర్తలు చేపడతారు. దీని ద్వారా సామాన్య కార్మికులలో చైతన్యం ఆత్మ విశ్వాసం మొలకెత్తిస్తే అటువంటి వాళ్ళలో ట్రేడ్ యూనియన్ పోరాటాలలో విలువైన నాయకత్వాన్నిచ్చే వ్యక్తులు పుట్టుకొస్తారు. అక్కడ కూడా వాళ్ళు రివిజనిస్టుల్ని ఎదుర్కొంటారు."(33) అది ఒక విధమైన కత్తిమీద సాములాంటిది. ట్రేడ్ యూనియన్ పోరాటాలకు మద్దతునిస్తూనే సి.పి.ఐ. (మా.లె.) కార్యకర్తలు తాము 'ఆర్థికవాదం' (economism)లోకి జారిపోకుండా జాగ్రత్త పడాలి. సమ్మెలు మొదలైన ట్రేడ్ యూనియన్ పోరాట విధానాలను సమర్థిస్తూనే వాళ్లు కార్మికులకు అటువంటి చర్యల నిరుపయోగాన్ని, నిష్ఫలతనూ బోధించాలి. ప్రస్తుత, రాజ్యతంత్ర్యాన్ని, (State) వాళ్ళ నిజమైన శత్రువును, ముసుగు తీసి చూపించాలి.

గ్రామ ప్రాంతాలలోని బీదరైతులకూ, భూమిలేని రైతులకూ సి.పి.ఐ. (మా.లె.) తక్షణ కర్తవ్యాలనుద్బోధిస్తూ కార్యక్రమావళిని నిర్దేశించింది. గ్రామాలలో ఫ్యూడలు భూస్వాములను తొలగించడం, ఆయుధాలను సంగ్రహించడం, గెరిల్లా దళాలను ఏర్పాటు చేయడం మొదలైనవి ఆ కార్యక్రమాలు. వాటితో పోలిస్తే "ఆర్థిక వాదం" (economism)లో మునిగి తేలే నగర కార్మికవర్గం విప్లవ నాయకత్వానికి వచ్చే ముందు సుదీర్ఘమైన క్లిష్టమైన జ్ఞానోదయాన్నీ స్వయంచోదితమైన మార్పును పొందే దశలో ప్రయాణించి ఉండాలి.

దేశంలోని పీడిత జన విముక్తితోనే తమ విముక్తి కూడా ముడిపడి ఉందని మొదట కార్మికవర్గం గుర్తించాలి. బీదరైతులు, కార్మికరైతులు ఎంతో మంది పీడించబడుతున్నవారే. దేశంలోని ఆర్థిక దారిద్ర్యానికి మూలకారణం గ్రామీణ ఫ్యూడలు వ్యవస్థ. సి.పి.ఐ. (మా.లె.) మాటలలో చెప్పాలంటే, "ఫ్యూడలిజానికీ భారత ప్రజా బాహుళ్యానికీ మధ్య కల వైరుధ్యమే ప్రధాన వైరుధ్యం". తమ హక్కుల కోసం కాని, అధికారం కోసం కాని నగర కార్మిక వర్గం ఒక్కటే పోరాడలేదు. అందుకోసం అది రైతాంగంతో సంఘటితం కావాలి. వాళ్ల సాయుధ పోరాటాలలో పాల్గొని వాళ్లను

ముందుకు నడిపించాలి.

నగర కార్మికవర్గం దృష్టిని గ్రామ ప్రాంతాలకు వ్యవసాయిక పోరాటాల వైపుకు మళ్లించాలి. పారిశ్రామిక కార్మికుల విషయంలో సి.పి.ఐ. (మా.లె.) కార్మికుల ముఖ్య కర్తవ్యం ఇది. రష్యాలోని తదితర పశ్చిమ దేశాలలోనూ తిరుగుబాటు పోరాటాలలో, ముందుగా నగరాలను పట్టుకొని, తరువాత గ్రామాలలోకి చొచ్చుకుపోవడం జరిగింది. మన దేశంలో అలాకాక మావోసేటుంగ్ నిర్దేశించినట్టు మొదట గ్రామాలను విముక్తి చేసి తరవాత పట్టణాలను చుట్టుముట్టాలి. అత్యున్నతమైన ఆర్థిక విధానంతో కల పరిచయం చేత, ప్రగాఢమైన సంఘటన, క్రమశిక్షణల కారణంగా, ప్రైవేటు ఉత్పత్తి సాధనాలు లేని కారణంగా, భారత కార్మికవర్గం మార్క్సిజం ప్రకారం విప్లవానికి నాయకత్వం వహించాలి. కాని "ఆర్థికవాదపు" పెను నిద్దర నుంచి దాన్ని జాగృతం చేసి రాజకీయ నాయకత్వం చేపట్టే స్థితికి దాన్నెలా ఉద్ధరించాలి?

కార్మికులలో ఆత్మగౌరవాన్ని కలిగించాలని చారుమజుందారు పదే పదే చెప్పాడు. "... కార్మికుడు తన చేతులతో స్వయంగా అన్నీ తయారుచేస్తాడు. కాని యజమానీ, మానేజరూ అతనిపై పెత్తనం చేస్తారు. విప్లవ రాజకీయాలన్ని ప్రచారం చేసి, (కార్మికునిలో) ఆత్మ గౌరవ పరిజ్ఞానాన్ని కలిగిస్తే అతనికి ఆర్థికవాదపు సాలెగూళ్ళను ఛేదించుకోవడం సులువు అవుతుంది."(33)

ఇంక ఎత్తుగడల విషయం. సమ్మెలు, "ఘెరావో" (మిల్లు యజమాన్లను చుట్టుముట్టడం – 60ల ఉత్తరార్థంలో కార్మికవర్గంలో ఆదరణ పొందిన కార్మిక పోరాట పద్ధతి)ల వంటి కార్మికపోరాటాలు, యజమాన్లపై, రాజ్యాంగ యంత్రంపై సాయుధ తిరుగుబాటుగా మార్పు చెందాలని చెప్పాడు. ఆచరణలో మాత్రం పార్టీ యంత్రాంగం పారిశ్రామిక కార్మికుల మధ్య అంతగా పనిచేయలేదు. గ్రామ ప్రాంతాలలో విశాల భూభాగాల్ని భారత రైతాంగం విముక్తి చేసేంత వరకూ కార్మిక వర్గానికి అనుబంధకమైన, దోహదకరమైన పాత్రనూ ప్రాధాన్యతనే (పార్టీ) ఇచ్చినట్టుగా కనపడుతుంది. సి.పి.ఐ. (మా.లె.) పోరాటాలలో ఫ్యాక్టరీలలో కాని బయట కాని పారిశ్రామిక కార్మికులు చెప్పుకునేంతగా కలిసి రాకపోవడం చూస్తే ఇది స్పష్టమౌతుంది. కలకత్తా పోలీసు ప్రత్యేక విభాగం వారు విచారణలో ఉన్న 300 మంది సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఖైదీల విషయంలో 1970 చివరలో జరిపిన సర్వేలో, ఇలా తెలిసింది. మొత్తంలో 10 మంది మాత్రమే కార్మిక సంఘాల నుంచి వచ్చారు. చారుమజుందారు ఇలా వాపోయాడని తెలిసింది. "ఇవాళ కార్మికవర్గంలో మన ప్రచారం లోపభూయిష్టంగానే ఉంది. అత్యంత రాజకీయ చైతన్యవంతమైన అత్యంత వీరోచితమైన

కార్మికులు మన పార్టీ ప్రభావానికి లోనై కూడా, వాళ్ళలో చాలా కొద్ది మంది మాత్రమే గ్రామాలలోని సాయుధ రైతాంగ పోరాటాలలోకి ముందుకు వస్తున్నారు."(33)

## పెటీబూర్జువా వర్గం

నగర జనాభాలో అతిముఖ్యమైన ఒక వర్గం; మధ్య తరగతి దిగువ మధ్య తరగతులవారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులు మొదలగువారు. రాజకీయంగా చూస్తే వాళ్లెంత ఉద్రేకపరులో అంత అవ్యవస్థితులు. వలస పాలనకు అనుబంధంగా ద్వితీయ తృతీయ రంగాలలో జవాబుగా మొలుచుకు వచ్చిన వీళ్ళ పుట్టుపూర్వోత్తరాలు బ్రిటిషుపాలన నాటివి. చదువు ఉద్యోగం ఉండడం వల్ల ఉత్పత్తి బాధ్యతలకు దూరంగా ఉంటూ మేధోసంబంధమైన జీవితానికి నోచుకోగలిగారు. మధ్యయుగం నాటి లక్షణాలనూ, నవీన యుగపు లక్షణాలనూ కూడా సంతరించుకున్న సంకరవర్గం ఇది. వారిలో కొంతమంది పూర్వపు వ్యాపారస్తుల (బనియాలు) జమీందార్ల (యూరోపియన్ వ్యాపారస్తుల దళారీలు – కాంప్రడార్లు) వంశీకులు. వీళ్ల పూర్వీకులు బ్రిటిషు వర్తకులతో సంబంధాల వల్ల డబ్బు చేసుకున్నవాళ్లు. అందువల్ల వీళ్లు తమ పూర్వీకులలో అతి చెడ్డ లక్షణాలను (పచ్చి అవకాశవాదం, చల్లగా చూసుకునే స్వార్థచింతన) సంతరించుకుని కాలం చెల్లిపోయిన తమ ఆర్థిక సామాజిక వైభవానికి అశ్రులు చాస్తారు. ఈ వర్గంలోని కొందరు మేధావులు మాత్రం సమకాలీన యూరోపియను ఉదారవాద ప్రజాస్వామ్య భావాల వల్ల ప్రభావితులై తమ చుట్టూ ఉన్న హేయమైన దారిద్ర్యం పట్ల కలత చెందుతారు. వాళ్ళ హక్కులకూ లాంఛనాలకు ఎలాంటి హాని కలిగినా ఎదురుతిరిగి కోపోద్రిక్తులయ్యే వాళ్ల విప్లవతత్వానికీ, అప్పుడప్పుడు తన్నుకు వచ్చే వ్యక్తి వాదపు దురుసుతనానికీ కారణం ఇదే.

బ్రిటిషు పాలనలోని రాజకీయ పోరాటాలలో ఈ వర్గం చాలా ముఖ్య పాత్రను ధరించింది. వీళ్ళ బలాలూ, దౌర్బల్యాలూ జాతీయ ఉద్యమ పురోగమనంపై ముద్ర వేసాయి. కాంప్రడార్ – బూర్జువాల నాయకత్వంలోని భారత జాతీయ కాంగ్రెసు రాజీ రాజకీయాల పట్ల విసుగు చెందిన ఈ వర్గంలోని తీవ్రవాదులు సాయుధ తిరుగుబాటు పంథాలోకి వచ్చారు. సోషలిజం అనే సిద్ధాంతం వీళ్లకు లేకపోవడం వల్ల రైతాంగ కార్మిక జనబాహుళ్యానికి దూరమైన వీళ్లు వ్యక్తిగత దుడుకుదనం, వీరోచితమైన సాహసం. ప్రతిబింబించే చర్యలు మాత్రమే చేసేవారు. అటువంటి చర్యలలో సామ్రాజ్యవాద వ్యతిరేకత అద్భుతంగా నిండి ఉన్న మాట నిజమే. వాళ్లలో చాలా మంది తరువాతి కాలంలో కమ్యూనిజం వైపు మొగ్గు చూపారు. అందువల్ల

ఉపాధ్యాయులు, న్యాయవాదులు, పాత్రికేయులు, రాజకీయవాదులు, విద్యార్థులు మొదలగు గల మేధావి వర్గం సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమానికి నాయకత్వం వహించి దాని ప్రముఖ సిద్ధాంతకారులుగా ఉండడంలో ఆశ్చర్యమేమీ లేదు. తమ వర్గ సంస్కారం వల్ల తెచ్చుకున్న తప్పుడు భావాలను తప్పిస్తే వాళ్లు అత్యున్నతమైన ఆత్మ త్యాగానికి మణిపూసలుగా నిలిచారు.

ప్రమాదం లేని దూరంలో ఉంటూ, విప్లవాత్మక పదజాలాన్ని వల్లిస్తూ, ప్రస్తుత వ్యవస్థలోనున్న ప్రతీ మార్గంలోనూ సొంత పబ్బం గడుపుకుంటూండే పార్లమెంటరీ తరహా వామపక్ష (Leftist) నాయకులకు భిన్నంగా పెటీ బూర్జువా వర్గానికి చెందిన ఈ సి.పి.ఐ. (మా.లె.) నాయకులు వర్గావతరణ (declassify) చెంది పూర్తి విప్లవకారులుగా మారేందుకై తమ తమ ఇళ్లనూ ఉద్యోగాలనూ వదిలిపెట్టారు. పాత వాతావరణంలో వాళ్ళకు సమకూరే సదుపాయాలను స్వచ్ఛందంగా వదలి, బూర్జువా ప్రపంచంలో సాంఘిక హోదాతో వచ్చే ఆకర్షణీయమైన ఉపయోగకరమైన లాంఛనాలను కాలదన్ని, చట్టబద్ధమైన వ్యవస్థకు లొంగిపోవడం వల్ల వచ్చే లాభాలను కాదని, దేశంలోని బీద ప్రజానీకం ఈ వ్యవస్థను మార్చేందుకు చేసే పోరాటంలో చేరి వాళ్ళతో మమేకంగా నిలిచారు.

తమ క్షేమానికి, సదుపాయాలకూ, సంక్షేమానికీ వచ్చే ప్రమాదాన్ని లెక్క చేయకుండా వాళ్ళను ధీరులుగా నిలబెట్టిన కార్యదీక్ష (రైతాంగంతో మమేకం అవడం మాత్రమే కాక) వాళ్ళకు మిగతా రాజకీయ నాయకులకూ గల తేడాను చాటిచెపుతోంది. తమకంటే ఎంతో ఉన్నతమైన ఆశయానికి పోరాడిన ధీరులు వాళ్ళు. రాక్షస పోలీసుల దయలేని వేటలో బలైన ఒకే ఒక రాజకీయ పార్టీనాయకులు వాళ్ళు. వాళ్ళలో చాలా మంది సంవత్సరాల తరబడి పాశవికమైన చిత్రవధలననుభవిస్తూ జైళ్లలో మగ్గిపోయారు. నేటికీ మగ్గిపోతున్నారు. శ్రీకాకుళంలోని చిక్కని అడవుల్లో, నిర్మానుష్యమైన కలకత్తా నిశీథిని వీథుల్లో, దుర్మార్గం చీకటి రాజ్యమేలే పోలీసులు ప్రశ్నామందిరాల్లో (interrogation cells) వాళ్ళు క్రూరంగా చంపబడ్డారు. నిశ్శబ్దం వాళ్ళ చుట్టూ కుట్రగా నిలిచింది. "మృతవీరుల పార్టీ" అని నిజమైన అర్థంలో చెప్పుకోదగిన పార్టీ అది. దాని నాయకుడు చారుమజుందారుతో సహా, ఆ పార్టీ కేంద్రకమిటీలో చాలా భాగం ఆ ఉద్యమానికై తమ ప్రాణాలనే అర్పించారు.

## విద్యార్థులు

పెటీ బూర్జువాలలో విద్యార్థులు మరో ముఖ్యభాగం. కేంద్ర దేశీయాంగ మంత్రిత్వ

శాఖ ఒక పరిశీలనలో 1965 నాటికి "విద్యార్థుల క్రమశిక్షణా రాహిత్యం" పెరుగుతూనే ఉందనీ ఈ విషయం "సాంఘిక శాంతికి తీవ్ర ప్రమాదంగా" పరిణమించిందనీ పేర్కొంది. విద్యార్థులలో క్రమశిక్షణ లోపించడానికి గల కారణాలనిలా పేర్కొంది. (ఎ) సరియైన విద్యా వ్యాసంగపు వాతావరణం లోపించడం. (బి) పైతృకమైన, విద్యాపరమైన, ప్రభుత్వపరమైన అధికారం అంటే గౌరవం లేకపోవడం. (సి) సిద్ధాంతపరమైన నైరాశ్యం. (డి) రాజకీయ నిర్లక్ష్యం. అధికార వర్గాలలో "విద్యార్థులలో క్రమశిక్షణా రాహిత్యం" (student indiscipline)గా వ్యవహరించబడే ఈ విద్యార్థి ఆందోళనలు 1965లో 271 నుంచి 1966 నాటికి 607కు పెరిగాయి. వాటిలో 42 శాతం 1966లో ప్రమాదకరమైన మలుపు తిరిగాయి.[56]

ధరలు పెరుగుదల వంటి సామాన్య ఆర్థిక సమస్యలతో ముడిపడి ఉన్న నగరాలలోని విద్యార్థి ఉద్యమం, పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు సన్నగిల్లగా విద్యా ప్రపంచంలో పాత విలువల్ని తల్లకిందులు చేసే మౌలికమైన సంక్షోభానికి దారి తీసాయి.

పరీక్షలు ప్రశాంతంగా జరగనిచ్చే రోజుల్లో కొద్ది సంవత్సరాల క్రితం నాటి కలకత్తా వార్తాపత్రికల్ని తిరగవేస్తే వాటిలో వెల్లడైన అధికార్ల పూర్తి నిర్లక్ష్యవైఖరికి ఎవరైనా దిగ్భ్రాంతి చెందుతారు. జవాబు పత్రాలు గల్లంతు కావడం మార్కుల పత్రాలలో తప్పులు వంటి ఎన్నో అవకతవకలు, బంధుప్రీతితో పరీక్షలు హాస్యాస్పదంగా తయారయ్యాయి. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే క్రూర నాటకాలను ఆ వార్తలు ప్రతిబింబించాయి. పట్టభద్రులయ్యాక ఉద్యోగాలు దొరుకుతాయనే ఆశలు లేకపోవడం చేత, (యువతకు) పరీక్షలూ పట్టాలూ అర్థంలేని తంతుగా తోచాయి. దేశంలోని ఎంప్లాయ్‌మెంటు ఎక్ఛేంజీలలోని కాలం చెల్లని జాబితాల ప్రకారం. 1953లో 1,63,000 చదువుకున్న నిరుద్యోగులుండగా వారు 1966 చివరకు 9,17,000కు పెరిగారు. తమ పేర్లు నమోదు చేయించుకున్న వారి సంగతే ఈ సంఖ్య తెలుపుతుంది. నమోదు కానివారి సంఖ్యను కూడా కలిపితే నిజపరిస్థితి ఇంకా అధ్వాన్నంగా కనపడుతుంది. స్నాతకోత్సవాలలో పట్టభద్రులు "మాకు ఉద్యోగాలు కావాలి డిగ్రీలు కాదు!" అనే నినాదాన్ని 1960లలో చేయడంలో ఆశ్చర్యం లేదు.

నైరాశ్యం వల్ల సహజంగా కలిగిన వ్యవస్థా వ్యతిరేక ధోరణితో పాటు విద్యార్థులలో కొంతమందిలోనైనా ప్రస్తుత వ్యవస్థను మార్చాలనే నిజమైన కోర్కె కూడా ఉంది. 1960ల ఉత్తర భాగంలో పశ్చిమ బెంగాలు నగరాలలోనూ, దేశంలోని ఇతర భాగంలోనూ వచ్చిన కమ్యూనిస్టు విప్లవోద్యమ వైతాళికులు ప్రముఖంగా విద్యార్థులే

కావడానికి ఇదే కారణం. చారుమజుందారు పిలుపునందుకుని నక్సల్బరీ తిరుగుబాటు తరువాతి కాలంలో రైతాంగంలో కొత్త భావాలను ప్రచారం చేయడానికి నడుం కట్టి చాలా మంది విద్యార్థులు చదువుల్ని వదిలిపెట్టి పల్లెలో నివసించేందుకు తరలివెళ్ళారు. చివరకు వ్యావసాయక విప్లవంలో వాళ్ళకు పరిష్కారం కనిపించింది కాబోలు. చాలా సంవత్సరాల తరువాత, నిబద్ధులైన, నిమగ్నులైన, ఒక కొత్త తరం రాజకీయ కార్యకర్తలు ఆవిర్భవించారని వాళ్ళ బద్ధ విరోధులు కూడా ఒప్పుకున్నారు.

రాజకీయంగా ఈ విద్యార్థులు సాయుధ పోరాటం వైపు మొగ్గడం 1966లోనే జరిగింది. కీర్తి పొందిన కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీలో జరిగిన సాధారణ సంఘటన దానికి నాంది పలికింది. ప్రభుత్వ ఉన్నతోద్యోగులు. పారిశ్రామిక వేత్తలు, వ్యాపార రంగపు అధికార్లువంటి పశ్చిమ బెంగాలు ఉన్నతోద్యోగులు ఆదరించే ఆ కాలేజీలో ప్రవేశం చదువులో ముందుండే విద్యార్థులకే పరిమితం. వాళ్లే తమ పిల్లల్ని ఈ కాలేజీలో చేర్చగలుగుతారు. తరువాత అందులోని గ్రాడ్యుయేట్లే చాలా భాగం ప్రస్తుత పాలనా యంత్రాధికార సముదాయానికి కార్యకర్తలుగా తయారౌతారు. ఈ కాలేజీకి రాజ్యాంగ యంత్రానికీ గల సాంప్రదాయిక అనుబంధం అటువంటిది.

1965 కాలేజీ విద్యార్థి సంఘపు ఎన్నికలలో, విద్యార్థి సమాఖ్య (Student's Federation) అనే కమ్యూనిస్టు విద్యార్థి సంఘం ఆ కాలేజీ విద్యార్థి సంఘాన్ని ఎన్నికల్లో గెల్చుకొంది. విద్యార్థి ఆందోళనల సాధారణ ధోరణికి చాలా కాలం దూరంగా ఉన్న ఆ కాలేజీ ఒక్కసారి రంగం మధ్యలోకి వచ్చింది. ఆ కాలేజీ పక్కనున్న హిందూ హాస్టలు విద్యార్థులు సంవత్సరాలుగా పెరిగిన ఇబ్బందులకు తమ అవస్థలకు హాస్టలు సూపరెండెంటును బాధ్యుణ్ణిగా భావించి 1966 అక్టోబరులో అతడి రాజీనామాకై ఆందోళన జరిపారు. పశ్చిమ బెంగాలు విద్యాశాఖ తరువాత జరిపిన ఒక దర్యాప్తులో హాస్టలు విద్యార్థుల కోర్కెలు న్యాయబద్ధమైనవని కనుగొంది. కాని కాలేజీ అధికార్లు మాత్రం దానికి జవాబుగా కాలేజీ నుంచీ హాస్టలు నుంచీ అనేక మంది విద్యార్థులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేసారు. వారిలో చాలామంది సి.పి.ఎం. ఏక్టివిస్టులు.* త్వరలోనే ఆ సంఘటనకు రాజకీయ ప్రాముఖ్యం కూడా వచ్చింది. రూలింగు కాంగ్రెసుకు (Congress (R)) చెందిన హాస్టలు సూపరెండెంటు చర్యను కాంగ్రెసు బలపరచింది. ప్రెసిడెన్సీ కాలేజీ పవిత్ర పరిసరాల్లోకి "విద్యార్థి సమాఖ్య" చొచ్చుకురావడం ఇష్టంలేని ప్రభుత్వం కాంగ్రెసు పార్టీల కుయుక్తులలో భాగంగా

* చురుకైన కార్యకర్తలు.

విద్యార్థులపై పగ సాధింపు చర్యలు జరుగుతున్నాయని వామపక్షీయులు ఆరోపించారు.

తొలగించబడిన విద్యార్థులలో కొందరికి ఆ సంవత్సరం పట్టభద్రులైనా అదే కాలేజీలోని పోస్టుగ్రాడ్యుయేటు తరగతులలో ప్రవేశాన్ని నిరాకరించారు. శిక్షకు గురైన విద్యార్థులకు మద్దతుగా కలకత్తా విశ్వవిద్యాలయ విద్యార్థులు కూడా సమ్మె చేసారు. అనతి కాలంలోనే విస్తరించిన విద్యార్థి ఉద్యమం పోలీసులు విద్యార్థుల మధ్య ఘర్షణలతో సమ్మెలతో నిండిపోయింది. కాలేజీ అధికారవర్గాలు పోలీసుల సాయం కోరడం మామూలైంది. ఈ ఆందోళన రాష్ట్రంలో మిగతా ప్రాంతాలకు కూడా పాకింది. తొలగింపు ఆజ్ఞల ఉపసంహరణను కోరుతూ పశ్చిమ బెంగాలు అంతటా మూడుసార్లు సమ్మెలు జరిగాయి. 1966 డిసెంబరు 8వ తేదీన కలకత్తా విశ్వవిద్యాలయం 110 సంవత్సరాల చరిత్రలో మొదటిసారి నిరవధికంగా మూతబడింది.

1967 జనవరి దాకా కొనసాగిన ఈ ఆందోళన భావిలో సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమంలో ఎంతో ముఖ్యమైంది. సి.పి.యం. నాయకులు విద్యార్థులకిచ్చిన సలహాలు, ఆదేశాలు, లెక్క చేయకుండా తన మార్గంలో ఈ ఆందోళన కొనసాగింది. ఈ కాలంలోనే సి.పి.యం.తో వాళ్ళకు అభిప్రాయ బేధాలేర్పడి; దాన్నించి తరువాత విడిపోయి, సి.పి.ఐ.(మా.లె) పార్టీలో వాళ్ళు జేరడం జరిగింది.

ఇన్ని సంవత్సరాలుగా తమ నాయకుల విప్లవాత్మక ఉపన్యాస విన్యాసాలకు ముగ్ధులైన సి.పి.ఎం. విద్యార్థి కార్యకర్తలు విప్లవం సందుమొగలకు ఉందని నమ్మారు. కొన్ని నెలలకిందటే మార్చి 1966లో ఆహారోద్యమం మున్నెన్నడూ కనీవినీ ఎరుగనంత స్థాయిలో రాష్ట్రాన్ని కుదిపివేసింది. తమకు తాముగా ప్రజలు ధాన్యపు దుకాణాలపై దాడి చేశారు. పోలీసుల్ని ఎదిరించారు. ప్రెసిడెన్సీ కాలేజీ విద్యార్థుల ఆందోళన దేశంలోను పశ్చిమ బెంగాలులోనూ జరిగిన ప్రభుత్వ వ్యతిరేకోద్యమాలతో జతపడింది. సి.పి.ఎం. ఆధీనంలోని అఖిల బెంగాలు ఉపాధ్యాయుల సంఘం (All Bengal Teachers Association) ఆధ్వర్యాన సమ్మె జరిగింది. 48 గంటల సమ్మె మరోటి పశ్చిమ బెంగాలు అంతటా జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా బస్సు, ట్రాము కార్మికులు సమ్మె చేసారు. 1966 నాటి ఆర్థిక సంక్షోభంతో మిగతా రాష్ట్రాల ప్రజలలో కూడా ప్రభుత్వోద్యోగుల సమ్మెలు జరిగాయి. అనేక చోట్ల పోలీసులూ ఆందోళనకారులూ తీవ్రంగా తలపడ్డారు.

ఈ ఆందోళనలనన్నిటినీ సమీకరించడం ద్వారా దేశమంతటా మాటెలా ఉన్నా పశ్చిమ బెంగాలులోనైనా సామూహిక తిరుగుబాట్లు జరుగుతాయని చాలా మంది సి.పి.ఎం. విద్యార్థి కార్యకర్తలు ఆశించారు. పాలకవర్గ పార్టీపై ఒత్తిడి తేవడం, తద్వారా

పటిష్టమైన రాజకీయ ప్రతిపక్షంగా ప్రజలలో కొన్ని వర్గాలలో పలుకుబడి సంపాదించడం. వచ్చే ఎన్నికలలో వాళ్ళ ఓట్లు సంపాదించడం వంటి పరిమిత ప్రయోజనాలకే వాళ్ళ నాయకులు తమ (విద్యార్థుల) సమ్మెలను ఉపయోగించు కోదలచారని వాళ్లు గ్రహించలేకపోయారు. నిజానికి ప్రెసిడెన్సీ కాలేజీ విద్యార్థులు నిర్విరామంగా ఆందోళన కొనసాగించాలనుకున్నారు. పార్టీ నాయకులు మాత్రం నిర్విరామంగా తగ్గు స్థాయిలో ఆందోళన నడపాలని సలహా ఇచ్చారు. చివరకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో కలగజేసుకుని సి.పి.ఎం. విద్యార్థులపై "తొలగింపు ఉత్తర్వులను" ప్రిన్సిపాలు విరమించుకోవాలని అంగీకరిస్తూ రాజీపడిపోయారు. వాళ్ళను మళ్లీ కాలేజీలో చేర్చుకోకపోయినా ఇతర కళాశాలలలో తమ చదువులు కొనసాగించుకునేందుకు టి.సీ.లను ఇచ్చారు.

ఈ ఆందోళనకాలంలో పరిచ్యుతులైన వ్యక్తులలో అషీం ఛటర్జీ ఒకడు. స్నేహితులూ, అనుయాయులూ ఇతనిని 'కాకా' అని పిలిచేవారు. సి.పి.ఎం. విద్యార్థి విభాగ నాయకుడు. తొలగించబడ్డ విద్యార్థులలో ఇతడు కూడా ఒకడు. తరువాత కాలంలో సి.పి.ఐ. (మా.లె.) ప్రముఖ నాయకులలో ఒకడిగా ప్రకాశిస్తూ మిద్నపూర్ రైతుల సరసన అనేక వీరోచిత పోరాటాలలో పాల్గొన్నాడు. మడతబడిన పైపెదవి; చొక్కా పైజమా ధరించే అషీం బక్క పలచటి విగ్రహం; ఆ రోజుల్లో కాలేజీ వీధి ప్రాంతంలో సర్వాంతర్యామిగా సంచరించేవాడు. ప్రెసిడెన్సీ కాలేజీ, కలకత్తా విశ్వవిద్యాలయం, ఆర్ట్సు విభాగం, కాఫీ హౌస్, కాలేజీ వీధిలోని ఈ ప్రాంతాలన్నీ నాటి విద్యార్థి రాజకీయాలకు కేంద్రస్థానంగా ఉండేవి. పోలీసులకూ విద్యార్థులకూ ఎప్పుడూ జరిగే ఘర్షణలకు నిలయాలవి. కాఫీ హౌస్‌లోనూ, లేదా కాలేజీ గేట్ల దగ్గర తను అనుయాయులనుద్దేశించి ప్రసంగిస్తూనో పోలీసుల నెదుర్కొనేందుకు వాళ్ళకు నాయకుడుగా ముందు నిలిచో హడావుడిగా అటూ ఇటూ అషీం తిరుగుతూ ఉండేవాడు.

ప్రెసిడెన్సీ కాలేజీ ఒంటరితనానికి చిల్లుపడింది. ఎగువ మధ్యతరగతికి చెందిన ఆ విద్యార్థులలో అషీం చటర్జీకి గల పలుకుబడిని గమనిస్తే 60లలో విద్యార్థులలో కలిగిన వీరోచిత మార్క్సిస్టు వైఖరికి ఆర్థిక నైరాశ్యం మాత్రం కారణం కాదని తెలుస్తుంది. ఆ కాలేజీ నుంచి చదువును వదలిపెట్టి గ్రామాలలో పనిచేసేందుకు వెళ్ళిన చాలా మంది విద్యార్థులు తమ తమ కుటుంబపు పలుకుబడి వల్ల, తెలివిని చూపే ఉన్నత ఫలితాలతో సులభంగానే ఉద్యోగాలను సంపాదించుకోగలిగి ఉండేవారు. ప్రస్తుత విద్యా వాతావరణం వల్ల మేధో సంబంధమైన నైరాశ్యం వాళ్ళను కలత పెట్టింది.

సర్వత్రా వ్యాపించిన సాంఘిక ఆర్థిక సంక్షోభంలో అంతర్భాగంగా ఆ వాతావరణాన్ని గుర్తించారు. దాని బారి నుంచి తప్పించుకోవాలంటే సాంఘిక వ్యవస్థను మార్చాలనే రాజకీయ నిశ్చయానికి వచ్చారు. 1967 సార్వత్రిక ఎన్నికల తరువాత అనేక రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చిన ఐక్య సంఘటన ప్రభుత్వాల పరాజయాన్నీ ప్రస్తుత పార్లమెంటరీ రాజకీయ పార్టీతో తమ అనుభవాన్నీ పురస్కరించుకొని రాజ్యాంగబద్ధమైన రాజకీయాలు, సాంఘికంగా అవసరమైన మార్పును తీసుకు రాలేవనే నమ్మకాన్ని బలపరుచుకున్నారు.

సాయుధ గెరిల్లా రైతాంగ ఉద్యమ రాజకీయాలవైపు విద్యార్థులు సమీకృతం కావడం పశ్చిమ బెంగాలుకు మాత్రమే పరిమితం కాలేదు. 60ల చివరకు దేశంలోని మిగతా భాగాలలో విద్యార్థులు కూడా ఆ ఉద్యమం వైపుకు చేరుకుంటున్నారు. రక్షిత కేంద్ర ప్రభుత్వ రాజధాని న్యూఢిల్లీలో కూడా క్యాంపస్ గోడల మీద మావోయిస్టు పోస్టర్లు వెలిసాయి. రాజధానిలో సంపన్నుల కుమారుల విద్యానిలయమైన సెంట్‌స్టీఫెన్స్ కాలేజీలోని విద్యార్థులు కూడా దగ్గరలో గల పంజాబు, హర్యానా రాష్ట్రాల గ్రామాలకు వెళ్లినట్టు తెలిసింది. అయితే 1967–68 సంవత్సరాలలో గ్రామాలకు వెళ్ళిన చాలామందిలో కమ్యూనిస్టు విప్లవకారుల కార్యక్రమం గురించి కాని, వాళ్లు తేవాలనుకున్న విప్లవ స్వభావం విషయంలో కాని సరియైన అవగాహన లేనిమాట నిజం. నక్సల్బరీ పోరాటపు వార్త వాళ్లలో ఆత్మ విమర్శను కలగజేసింది. గ్రామీణ దారిద్ర్యం విషయంలో, గ్రామీణశౌర్యం విషయంలో యువతకు గల చిన్నచూపుపై పెద్ద అఘాతాన్ని కలగజేసింది. గ్రామ ప్రాంతాలకు ఉదార ఉద్దేశాలతోనో, రైతాంగాన్ని సమీకరించాలనే చూచాయగా ఉన్న ఊహలతోనో, తమాషా చూసేందుకో గ్రామ ప్రాంతాలకు తరలివెళ్లారు.

ఉద్యమంలో జేరిన వారిలో మరో రకం యువకులు కూడా ఉన్నారు. మందకొడిగా తప్ప ప్రగతి సాధ్యంకాని వ్యవస్థలో పనిచేయాలనే భావంపై యువతకు (అంతటా వ్యాపించి ఉన్న) సామాన్యంగా ఉండే అసహనం, తమకు ఉద్యోగాలివ్వలేని ఈ వ్యవస్థపై ద్వేషం, వర్తమానంపై నమ్మకం లేకపోవడం, గతంపై గౌరవం లేకపోవడం వంటి అనేక కారణాలు వాళ్ళను పురికొల్పాయి. వారిలో కొంత మందికి సాహసం పట్ల గల కాల్పనిక వ్యామోహం కూడా ఒక కారణమే.

పశ్చిమ బెంగాలులో 1970–71లో అణచివేత ప్రారంభం కాగానే చాలా మంది సి.పి.ఐ. (మా.లె.) అనుయాయులు తమ విశ్వాసాన్ని పాలక కాంగ్రెసు పార్టీకి ఎందుకు బదలాయించారో దీనివల్ల తెలుస్తుంది. ఉద్యోగాల వాగ్దానం, యువశక్తిని గుర్తించడం,

కాంగ్రెసు చేసే సోషలిస్టు నినాదాలు, ప్రభుత్వం ప్రయోగించిన పాశవిక బలం, కారణంగా వాళ్ళంతకు ముందు నిరాకరించిన సాంఘిక పరిధిలోకి తిరిగివచ్చారు.

## లంపెన్ (రద్దు) కార్మిక వర్గం

లంపెన్ కార్మికులంటే నగర జనాభా తనలో ఇముడ్చుకోలేని కొన్ని రకాల ప్రజలు. గతంలోనూ వర్తమానంలో కూడా కమ్యూనిస్టు నాయకులు విప్లవాలలో లంపెన్ కార్మికుల శక్తి సామర్థ్యాల్ని కొన్ని మినహాయింపులతోనే గుర్తించారు. మార్క్సు ఏంగెల్సులు కమ్యూనిస్టు మానిఫెస్టోలలో ఇలా రాసారు "ఆ 'ప్రమాదకరమైన వర్గం' సాంఘికశ్లేష్మం, పాత సంఘం విసిరేసిన అట్టడుగు పొరల్లో మౌనంగా మగ్గే ప్రజా సమూహం, కార్మిక విప్లవం ద్వారా, అప్పుడప్పుడు ఉద్యమంలోకి నెట్టబడతారు. వాళ్ళ జీవన పరిస్థితులు వాళ్ళను ప్రతీఘాత విప్లవ కుట్రకు కొమ్ము కాచే లంచగొండి సాధనంగా పని చేసేందుకే పురిగొల్పుతాయి." ఇంకొంత కాలం తరువాత "ఫ్రాన్సులో వర్గపోరాటం"లో 1848–50ల ఫ్రాన్సులోని లంపెన్ కార్మికవర్గాన్ని మార్క్సు ఇలా వర్ణించాడు. "సంఘం విసిరేసిన ఎంగిలి మెతుకులతో బతికే నానా విధాల నేరస్థులకు దొంగలకూ నిలయమైన ముఠా ఇది." కాని వాళ్ళ విప్లవాత్మక, ప్రగతి విరోధ సమర్థతలను కూడా మార్క్సు గుర్తించాడు. ".... అత్యంత హేయమైన చర్యలకూ, మహోదాత్తమైన త్యాగాలకూ, హేయాతిహేయమైన దొంగతనానికీ నీచమైన అవినీతికీ పూర్తిగా లొంగే" వారిగా గుర్తించాడు. కార్మిక వర్గం నాయకులను లంపెన్ కార్మిక వర్గం విషయం ఏంగిల్స్ 1870లో ఇలా హెచ్చరించాడు. "అన్ని వర్గాలకూ చెంది అధఃపతనమైన సంఘశ్లేష్మం ఇది. పెద్ద పట్టణాలలో కేంద్రీకృతమై ఉంటూ, మిత్రపక్షాలన్నిటిలోనూ మిక్కిలి చెడ్డది. ఈ గందరగోళపు జనాభా పూర్తి విషపూరితమైనది. ఎటువంటి సిగ్గులేనిది ఈ వర్గం.... ఈ వెధవల్ని అంగరక్షకులుగా ఉపయోగిస్తూ వీళ్ళ నుంచి మద్దతు ఆశించే ఏ కార్మికనాయకుడైనా ఈ ఒక్క చర్యవల్లనే ఉద్యమద్రోహి అవుతాడు."[57]

కాని గత వంద సంవత్సరాలలోనూ, ప్రధానంగా, అభివృద్ధి చెందని, పారిశ్రామికంగా తక్కువ ప్రగతి చెందిన, ప్రాంతాల కమ్యూనిస్టు ఉద్యమ నాయకులకు, ఈ లంపెన్ కార్మికుల విషయంలో గల వైఖరి మార్పు చెందింది. మావోసేటుంగ్, వాళ్ళు "చాలా సాహసంతో పోరాడగలిగారు. కాని వాళ్లు వినాశానికి కూడా సమర్థులు. సరిగా నడిపిస్తే వాళ్లు విప్లవాత్మక శక్తి"[58] అవుతారని భావించాడు.

తృతీయ ప్రపంచంలో (Third World) విప్లవోద్యమంలో ప్రసిద్ధి చెందిన

సిద్ధాంతకారుడు ఫ్రాంజ్ ఫెనాన్ ఇంకో అడుగు ముందుకెళ్లాడు. "...... స్వాతంత్ర్యం గురించి నడిపే ఉద్యమమైనా లంపెన్ కార్మికవర్గంపై దృష్టి నుంచాలి. తిరుగుబాటుకై ఇచ్చే పిలుపుకు ఎప్పుడూ బదులు పలుకుతారు. కాని ప్రజలను లెక్కకు తీసుకోకుండా తిరుగుబాటు వృద్ధి పొందుతుందని నాయకులు అనుకొంటే లంపెన్ కార్మికులు పీడించే వర్గం తరఫున పోరాడడానికి ఉద్యమంలోకి దిగుతారు. దోపిడిదార్లు... లంపెన్ కార్మికుల తెలివిహీనతను బుద్ధి లేకపోవడం వంటి దౌర్భల్యాన్ని తెలివిగా వాడుకుంటారు. మానవ కృషికి స్వరూపంగా ఉంటూ సిద్ధంగా ఉన్న ఈ వర్గాన్ని తిరుగుబాటు నాయకులు సత్వరం సమీకరించకపోతే వీళ్ళు వలస సైనికుల సరసన కిరాయి సైనికులుగా తిరుగుబాటుదార్లపై పడతారు."[59]

పశ్చిమ బెంగాలులో, సి.పి.ఐ. (మా.లె.) పట్టణ వ్యూహంలో పోలీసుల్ని చంపడం, పోలీసులకు చాడీలు అందించే వాళ్ళను చంపడం అనే ఎత్తుగడలో లంపెన్ కార్మికులు తమ ఏకాకితనం వల్లా, చీకటి ప్రపంచంతో తమకు గల సాన్నిహిత్యం వల్లా పార్టీకి సహకరించారు. నగర లంపెన్ కార్మికుల వ్యక్తిగత పగ సాధింపు చర్యలు. 1970–71లో సి.పి.ఐ. (మా.లె.) రాజకీయ చర్యలు, ఒకదానితో ఒకటి పెనువేసుకున్నాయి. దుష్టులైన ఈ రౌడీలు కొన్ని ప్రాంతాలలో కొన్ని సందర్భాలలో పోలీసుల ప్రోద్బలంతో సి.పి.ఐ. (మా.లె.) సంస్థలలోకి చొచ్చుకుపోయి, ఆ ఉద్యమానికి అప్రతిష్టను తేవడంలో కొంతవరకూ కృతకృత్యులయ్యారు. మధ్య తరగతి ప్రాంతాలలో రగిలే తిరుగుబాటు నిప్పు రవ్వలను ఆర్పే ప్రయత్నాలు దీనివల్ల మరింత సులభమై, ప్రజలు వాటిని నమ్మగలిగేవిగా చిత్రీకరించ గలిగారు. అర్థం లేని హింస, వ్యక్తిగత పగసాధింపులతో ఈ ఉద్యమాన్ని అభిమానించే మధ్యతరగతి అనుయాయులు దీనివల్ల విసుగుచెంది, పార్టీపై ఆ శక్తిని ఉత్సాహాన్ని చూపడం తగ్గించారు.

కార్మికవర్గమే కాక దేశంలో మిగిలిన తరగతుల నగర జనాభా కూడా అనేక విధాలుగా దుర్గంధంతో నిండిపోయింది. దీనికి కారణం దేశంలో జరుగుతున్న నగరాభివృద్ధి తీరుతెన్నులే. భారతదేశంలోని నగరాలన్నీ పాలనా కేంద్రాలుగా, వ్యాపార కేంద్రాలుగా మొదలైనవే. 1947 తరవాత కూడా అవి అలాగే కొనసాగాయి. నగరాభివృద్ధి తీరుతెన్నులే. భారతదేశంలోని నగరాలన్నీ పాలనా కేంద్రాలుగా, వ్యాపార కేంద్రాలుగా మొదలైనవే. 1947 తరువాత కూడా అవి అలాగే కొనసాగాయి. నగరాభివృద్ధికి పునాదిగా నిలిచే పరిశ్రమల పెరుగుదల సరిగా లేనందువల్ల, గ్రామాల నుంచి జీవనోపాధికై వచ్చిన ప్రజలు, నిపుణత, విద్య లేనందువల్ల అలాగే ఉండి, నిరుద్యోగులుగా స్థిరపడి, పై స్థాయిలకు చలనాన్ని నిరోధించే సామాజిక అడ్డు తెరగా

ఉండిపోయారు. మన నగరాలు గ్రామాల నుంచి వచ్చిన వాళ్ళనూ, వాళ్ళ మనస్సుల్నీ కూడా కలుషితం చేస్తున్నాయి. ఆ గ్రామీణ జనానికి వరిపొలాలు, మామిడి తోటల జ్ఞాపకాలకంటే, కాంతివంతమైన నియాన్‌లైట్లు, సినిమాలు, టెరిలీన్ చొక్కాల పైనే మరింత మోజు. ద్వితీయ రంగంలో సేవకులుగా (ఆఫీసు మెసెంజర్లు, ఆర్డర్లీలు)గా పనిచేసే వీళ్ళు నగరవాసుల గొర్రెదాటు మనస్తత్వం, బానిస భావం, అలవర్చుకొన్నారు. నగరాలలో పైకి కనిపించే ఐశ్వర్యం వీళ్ళను వివశుల్ని చేసింది. తమ స్థాయిని పెంచుకోవాలని చూస్తూ గ్రామ ప్రజలని 'పల్లెటూరి బైతులు'గా చూడడానికి అలవాటు పడ్డారు.

పల్లెనుంచి వచ్చిన కారణంగా సహజంగా రైతుకు కార్మిక స్నేహితుడు కావలసిన వ్యక్తి ఈ విధంగా నగర సంస్కృతి వెదజల్లిన ఎంగిలి మెతుకుల మోహంలో గ్రామీణ కార్మికుడికి దూరమయ్యాడు.

నగరాలలో కంటికి కనిపించే ఈ సంపన్నత, నానాటికీ పెరిగే దారిద్ర్యంపై కప్పిన మేలిముసుగు మాత్రమే. ఢిల్లీలో దాన్ని పర్యాటకుల నుంచి దూరంగా దాచేశారు. కలకత్తాలో మాత్రం ఈ దారిద్ర్యం ఉబికి ఉబికి బైటకు వచ్చేందుకు ప్రయత్నిస్తూ ఉంటుంది. అదీకాక నగరాలలోనే కాపురం చేసే ప్రభుత్వానికి గ్రామీణ సమస్యలు, నిజానికి కొరుకుడుబడడం లేదు. నోరున్న వర్గాల కోర్కెలు, ముఖ్యమైన రాజకీయ నిర్ణయాలు తీసుకోవడంలో అతిముఖ్య పాత్ర ధరించే రాజకీయ ముఠాలతో నగరానికి గ్రామానికి గల అంతరం పెరిగింది. వలసకాలం నుంచీ ఈ రెంటి మధ్యనా గల అడ్డుగోడ కాలక్రమేణా మరింత మందంగా తయారైంది.

తన నగర వ్యూహాన్ని రూపొందించుకోవడంలో పారిశ్రామిక కార్మికులపై 'ఆర్థికవాదపు' వ్యామోహం; మధ్యతరగతి ఊగిసలాట మనస్తత్వం, యువత యొక్క, విద్యార్థుల యొక్క అపరిపక్వ స్థితి, లంపెన్ కార్మికుల కిరాయి మనస్తత్వం వంటి అనేక సమస్యలతో సి.పి.ఐ. (మా.లె.) సతమతమైంది.

# 3. కమ్యూనిస్టు పార్టీ

ప్రజలు చైతన్యవంతులు కాకుండా మనం ముందుకు పోవడానికి ప్రయత్నిస్తే అది 'దుడుకుదనం' (Adventurism) అవుతుంది. ప్రజలు ముందుకు పోవాలని కోరుతుండగా మనం ముందుకు పోకపోతే అది మితవాద అవకాశవాదం (Right opportunism) అవుతుంది.

– మావోసేటుంగ్, ఏప్రిలు 2, 1948

Selected Works Vol IV. P. 243

భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర వర్గ పోరాట పంథాకూ, విద్రోహకరమైన వర్గ సహకార పంథాకూ, విప్లవాత్మకమైన కార్మిక అనుమాయ వర్గానికీ, బూర్జువా తిరోగమన నాయకత్వానికీ మధ్య జరిగిన సంఘర్షణల చరిత్ర

– సి.పి.ఐ. (మా.లె.) పార్టీ రాజకీయ తీర్మానం – మే 1996

## 1947కు ముందు – భారత కమ్యూనిస్టు పార్టీ

కొన్ని కొన్ని మాటలు అతిగా వాడబడతాయి. ఆ మాటలకు ప్రతీకలుగా ఉండే పనులను ఎప్పుడో అప్పుడు చెయ్యకతప్పదు. విప్లవం అనే మాటకు భారత కమ్యూనిస్టు ఉద్యమంలో అలాంటి గతే పట్టింది. 1920లో పార్టీ పుట్టిన నాటి నుంచీ భారత కమ్యూనిస్టు పార్టీ ప్రస్తుత వ్యవస్థను మార్చేందుకు జరిగే కార్మిక కర్షక విప్లవానికి సారథ్యం నెరపుతానని పదే పదే తన కార్యక్రమాలలో వాగ్దానాలు చేస్తూనే ఉంది. 1930లలో ఎన్నో తిరుగుబాట్లు వాటంతటవే జరిగాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కూడా ప్రముఖంగా ఎన్నో తిరుగుబాట్లు జరిగాయి. పార్టీ అనుచరులు కూడా వీరోచితంగానే పోరాడారు. సి.పి.ఐ. నాయకత్వం ఈ తిరుగుబాట్లను విప్లవంగా మలచలేకపోయింది.

బ్రిటిషు సామ్రాజ్యంలో డొమినియన్ ప్రతిపత్తితో సంతృప్తి పడతామని 1924లో

భారత జాతీయ కాంగ్రెసు ప్రకటించుకుని తన కాంప్రడార్ తత్వాన్ని కూడా ప్రకటించుకుంది. మొట్టమొదటగా కమ్యూనిస్టు పార్టీయే భారత దేశానికి పూర్తి స్వాతంత్ర్యం కావాలని అడిగింది. అయినప్పటికీ కాంగ్రెసును జాతీయోద్యమ నాయకత్వం నుంచి దించలేకపోయింది.

ఈ అసమర్ధతలకు గల కారణాలలో కాంగ్రెసు పార్టీ వర్గ స్వభావాన్ని విశ్లేషించ లేకపోవడం కూడా ఒకటి. దానిపట్ల తన వైఖరిని వివరించుకోలేక తరచుగా కాంగ్రెసు వెనకాలే తన ప్రయాణం సాగించింది. అందువల్ల విశ్వాసపాత్రమైన కార్యకర్తల సముదాయం ఉన్నా కూడా కార్మిక కర్షక వర్గాలలో సొంత పలుకుబడి అంటూ ఏర్పరచుకుని విస్తరించుకోలేక పోయింది. ప్రజా సంఘాలలో పని చేసే కార్యకర్తల కోరిక వల్లనైతేనేం, ప్రజల విప్లవాత్మక మనస్థితి వల్ల కింద నుంచి వచ్చిన ఒత్తిడుల వల్లనైతేనేం, పార్టీ తరచు కార్మిక కర్షక పోరాటాలకు సారథ్యం వహించక తప్పలేదు. కాని కాంగ్రెసు నాయకత్వాన్ని మెప్పించేందుకు వెంటనే ఉద్యమంపై నీళ్లు చల్లి తిలోదకాలివ్వడం కూడా మామూలుగానే సాగేది.

భారతీయ ప్రజలలో ఏ వర్గం విప్లవ కార్యక్రమంలో కీలకపాత్ర వహిస్తుంది? నగర పారిశ్రామిక కార్మికులా లేక గ్రామీణ రైతాంగమా? ఈ విషయాలలో భారత కమ్యూనిస్టులు ఒక నిర్ణయానికి రాలేకపోయారు. వాళ్లు విప్లవానికి నాయకత్వం వహించలేక పోవడానికి ఇది కూడా మరో ముఖ్య కారణం. పాశ్చాత్య కమ్యూనిస్టు సాంప్రదాయాలలోనూ, 1917 నాటి రష్యా విప్లవానుభవాలలోనూ గుడ్డిగా నమ్మకాన్ని పెంచుకుని పెరిగిన ఈ పార్టీ యొక్క పెట్టీ బూర్జువా నాయకత్వం దేశంలోని పారిశ్రామిక కార్మికవర్గాన్నే విప్లవాత్మక శక్తిగా భావించింది. దేశంలోని నగరాలలోనూ పారిశ్రామిక కేంద్రాలలోనే తన దృష్టిని కేంద్రీకరించింది. అందులో కూడా అధిక వేతనాలపై నడిపే ట్రేడ్ యూనియన్ పోరాటాల రొంపిలోనే కమ్యూనిస్టు ఉద్యమం కూరుకుపోయింది. నిరంతరం జరిపే సమ్మెలతో సమాచార సంబంధాలను పరిశ్రమలను స్థంభింపజేసి వలస శక్తిని అధికారంలోంచి దింపాలనే సమస్య అలా గాలిలోనే ఉండిపోయింది.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత కార్మిక పోరాటాలను రాజకీయ నిబద్ధం చేసే అవకాశం వచ్చింది. దేశంలో (కొన్ని సందర్భాలలో కమ్యూనిస్టు నాయకత్వంలో కూడా) ఎన్నో కార్మికవర్గపు సమ్మెలు వెల్లువగా వచ్చాయి. పార్టీ నాయకత్వం కర్తవ్యాన్ని వదిలిపెట్టి కాంగ్రెసుపై గల మొహమాటంతో కార్మికులను గంగలో ముంచింది. నాటి పరిస్థితిని ఇద్దరు సోవియట్ వ్యాఖ్యాతలిలా వివరించారు. "తాత్కాలిక ప్రభుత్వపు

మంత్రులు కార్మికుల కోర్కెలను పరిశీలిస్తామనీ పనిని తిరిగి ప్రారంభించమనీ కోరగానే సమ్మెలు (వాటి సంఖ్య తగ్గిపోయినా) పూర్తిగా ఆగిపోయాయి. కార్మిక ప్రజలకు కమ్యూనిస్టులు వాళ్ళ ప్రదర్శనలలో నాయకత్వం వహించినప్పటికి..."[1] సమ్మెల విషయంలో కాంగ్రెసు ఆజ్ఞలను ధిక్కరిస్తూ తిరిగి ఫిబ్రవరి 1946లో రాయల్ ఇండియన్ నేవీ నావికుల తిరుగుబాటును బలపరుస్తూ బొంబాయి కార్మికవర్గం సమ్మె చేసింది. వాళ్లు సమ్మెలతో బలపరచడమే కాక బ్రిటిషు సైనికులను ఎదిరించడంలో కూడా నావికులకు చురుకుగా తోడ్పడ్డారు. అయినా కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతపరంగా అయోమయంలోంచి బయటపడలేదు. మానసికంగానూ, సంస్థాపరంగానూ కూడా సాయుధ తిరుగుబాటుకు సంసిద్ధంగా లేదు. అందువల్ల 5 రోజుల పాటు నావికులు పోరాటం జరిపాక బ్రిటిషువాళ్లకు లొంగిపొమ్మని కాంగ్రెసు నాయకులు వాళ్ళపై తెచ్చిన ఒత్తిడిని ఏ విధంగానూ సి.పి.ఐ. అడ్డుకోలేకపోయింది.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాతి పరిస్థితి సాయుధ తిరుగుబాటుకు ఎంతో అనుకూలంగా ఉంది. 'అజాద్ హింద్' ఖైదీల విడుదలకై ఉద్యమం జరిగింది. విద్యార్థులు దేశమంతటా సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రదర్శనలు జరిపారు. 'తేభాగ' 'బా కష్ట' ఉద్యమాలు వచ్చాయి. స్వతంత్ర రాజ్యాలలో ఫ్యూడలు వ్యతిరేక పోరాటాలు తలెత్తాయి. తంతి తపాలా కార్మికులు సమ్మె చేశారు. రాయల్ ఇండియన్ నేవీ నావికులు సమ్మె చేసారు. వైమానికదళంలోనూ సైన్యంలోనూ తిరుగుబాటు తలెత్తింది. బీహారులో పోలీసులు ఎదురు తిరిగారు. తరువాతి కాలంలో, 1945-46 కాలంలో జరిగిన ఈ తిరుగుబాట్లను సింహావలోకనం చేస్తూ సి.పి.ఐ. (మా.లె.) పార్టీ "ఇదివరకెన్నడూ లేనంత విప్లవాత్మక పరిస్థితి భారత ఉపఖండంలో నెలకొంద"ని భావించింది. "కాని కార్మికవర్గం జాతీయ విమోచనోద్యమంపై నాయకత్వం సాధించలేక పోయింది. ఎన్నో అవకాశాలున్నా కూడా పార్టీ నాయకత్వం గాంధీ ఇజాన్నీ, గాంధీ నాయకత్వాన్నీ ఎదుర్కొని విప్లవపు బాటపై పోవడానికి నిరాకరించింది. మార్క్సిజం - లెనినిజం అనే సార్వత్రిక సత్యాన్ని భారత విప్లవపు వాస్తవాచరణతో అనుసంధించేందుకు నాయకత్వం ఒప్పుకోలేదు. వీరోచిత ప్రజావాహినితో, ప్రత్యేకించి విప్లవాత్మక రైతాంగంతో విప్లవాత్మక ఐక్య సంఘటనను నిర్మించేందుకు నాయకత్వం సుముఖంగా లేదు."[2]

ఏమైనా కమ్యూనిస్టుల కంటే కాంప్రడార్ బూర్జువా నాయకులే ఎంతో మెలకువతో ఉన్నారు. ప్రపంచ యుద్ధానంతరం దేశంలో తలెత్తిన కార్మికుల ఉద్రిక్తతకు కళ్ళు తెరిచిన కాంగ్రెసు నాయకులు దాన్ని మొగ్గలోనే తుంచి వేయాలని భావించారు.

1946లో జరిగిన కాంగ్రెసు కార్యవర్గపు సమావేశం వేరే కార్మిక సంఘ సంస్థను ఏర్పరచేందుకు తీర్మానించింది. 1947 మే 3వ తేదీన, అంటే లాంఛనప్రాయంగా, తన పార్టీ పాలకత్వాన్ని చేపట్టేందుకు మూడు నెలల ముందుగా, కొత్త ఢిల్లీలో భారత జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు (INTUC) ప్రారంభ సమావేశంలో తన అధ్యక్షోపన్యాసంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ నీళ్ళు నమలకుండా చెప్పిన మాటలివి, "మాటలకలవి కాని ఉపద్రవం నుంచి దేశాన్ని రక్షించి, శాంతియుతంగా అధికార మార్పిడి జరగాలంటే, వెంటనే కార్మిక ఉద్యమంలోని అరాచకత్వాన్ని ఆపు చెయ్యాలి."[3] ముఖ్య ట్రేడ్ యూనియన్ సంస్థ ఐన అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (AITUC)లో అంతవరకూ కాంగ్రెసువాళ్లూ కమ్యూనిస్టులూ కలిసి పనిచేసేవారు. దేశంలోని వివిధ ప్రాంతాలలోనూ సమ్మెలు జరిపించే కమ్యూనిస్టుల ఆధీనంలోకి అది వచ్చింది. వేరే కార్మిక సంఘ సంస్థ అవసరాన్ని INTUC నాయకులు ఆ విధంగా సమర్థించుకున్నారు.[4]

గ్రామ ప్రాంతాలలో భూమిలేని నిరుపేద రైతులను సమీకరించి వాళ్ళ సమర్థతను విప్లవాత్మక శక్తిగా గుర్తించడంలో కమ్యూనిస్టు పార్టీనాయకత్వం నిర్లక్ష్యం చేసింది. ఈ పుస్తకం మొదటి అధ్యాయంలో వివరించినట్లుగా ప్రస్తుత వ్యవస్థలో మౌలికమైన మార్పు రావాలని వాళ్లెప్పుడూ కోరుకుంటూనే ఉన్నారు. అటువంటి పోరాటాలు అహింసాయుత సత్యాగ్రహాలు చట్టబద్ధ ఉద్యమాల పరిధిని సామాన్యంగా దాటుతూనే ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతర దశలో దేశంలో గ్రామీణ సంస్థా నిర్మాణాన్ని పార్టీ నిర్లక్ష్యం చేసినప్పటికీ అనేక ప్రాంతాలలో తీవ్ర పోరాటాలు తలెత్తాయి. బెంగాలులోని తేభాగా ఉద్యమం, తెలంగాణాలోని నిజాం వ్యతిరేకోద్యమం అలాంటి పోరాటాలలో ప్రధానమైనవి. తెలంగాణా తిరుగుబాటులో కమ్యూనిస్టులు గెరిల్లా శిక్షణ ఇచ్చి ఆయుధాలను చేపట్టారని ముందు చెప్పుకున్నాం. తరువాతి కాలంలో ఆ ఉద్యమాన్ని వివరించిన ఒక కమ్యూనిస్టు పత్రం ఆ ఉద్యమం "పార్టీని హటాత్తుగా మేలుకొల్పింద"ని అంగీకరించింది. ఆ విధంగా వాస్తవికత నుంచీ అనుయాయుల నుంచీ కూడా దూరమైనట్టు తెలుపుకుంది. ఆ పత్రం ఇలా కొనసాగింది "…. తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ శైశవదశలో ఉండి నీరసంగా ఉంది. ఆకారం లేని ఆంధ్ర మహాసభ (వంటి) ప్రజాసంఘం తప్పితే. (దానికి) ఆది నుంచీ ఎటువంటి వర్గ సంస్థ కాని ప్రజా సంస్థ కాని లేదు. 1938-40ల మధ్య జరిగిన రాష్ట్ర కాంగ్రెసు సత్యాగ్రహం మినహా (దానికి) వర్గపోరాటాల ప్రజా పోరాటాల అనుభవం (కూడా) ఎప్పుడూ లేదు. అందుచేత మొత్తం మీద అతి తక్కువ రాజకీయ చైతన్యంతో

చరిత్రాత్మకమైన సాయుధ రైతాంగ పోరాటంగా ఎదిగింది..."[5]

మనం ముందు చర్చించినట్టుగానే, ఈ సందర్భంలో కూడా పార్టీ కాంప్రడార్ – బూర్జువా పాలకవర్గంతో తప్పక జరగవలసిన పోరాటపు వాదాన్ని చేపట్టేందుకు విముఖతను చూపింది.

## 1947 తరువాత సి.పి.ఐ.

1947 అధికార మార్పిడి తరవాత సి.పి.ఐ. క్రొత్త పరిస్థితిని ఎదుర్కొంది. అంతకు పూర్వం కాంగ్రెసుపట్ల తన వైఖరి యొక్క అస్థిరత వల్ల కుంటుపడిన పరిస్థితి అలాగే కొనసాగుతోంది. మరో పక్క హైదరాబాదు ప్యూడలు నిజాంకు వ్యతిరేకంగా నడుస్తూన్న సాయుధ పోరాటానికి నాయకత్వాన్ని వహించవలసి వచ్చింది.

1947 జూన్‌లో లాంఛనప్రాయంగా 'స్వతంత్రం' ప్రకటించగానే సి.పి.ఐ. కేంద్రకమిటీ "ముందుకు సాగేందుకు కొత్త అవకాశాలు జయించబడ్డాయ"ని తీర్మానించింది. కాంగ్రెసును "ముఖ్య జాతీయ ప్రజాతంత్ర సంస్థగా" ఆ తీర్మానం పేర్కొంది. "ప్రజాస్వామిక పునాదిపై భారత రిపబ్లికును నిర్మించడమనే ఉన్నత కార్యక్రమంలో జాతీయ నాయకత్వంతో పూర్తిగా సహకరిస్తుంద"ని సి.పి.ఐ. హామీ ఇచ్చింది. మౌంటుబాటెన్ తీర్పు వల్ల వచ్చిన దేశ విభజన ద్వారా ఏర్పడిన పాకిస్తాన్‌లోని ముస్లింలీగు ప్రభుత్వాన్నీ ఇండియన్ యూనియన్‌లోని కాంగ్రెసు ప్రభుత్వాన్నీ ఆ తీర్మానం ఇలా పేర్కొంది. "రెండు ప్రజాదరణకల ప్రభుత్వాలూ రాజ్యాంగ సభలూ జాతీయ నాయకత్వం చేతిలోని వ్యూహాత్మక ఆయుధాలు. జాతీయాశయాల్ని త్వరగా సాధించేందుకు వాటిని ఉపయోగపడేలా చూసే బాధ్యత జాతీయోద్యమాలకుంటుంది." బెంగాల్‌లోని తేభాగా ఉద్యమ నాయకుడైన భవానీసేన్ రైతాంగాన్నుద్బోధిస్తూ "గత సంవత్సరం తలపెట్టినట్టు ఈ సంవత్సరం ప్రత్యక్ష చర్యను తలపెట్టవద్దనీ, చట్టబద్ధమైన మార్గాల ద్వారా తన వాగ్దానాలను నెరవేర్చుకునే అవకాశాన్ని కొత్త ప్రభుత్వాని"[6] కివ్వాలనీ విజ్ఞప్తి చేసాడు. దాంతో కాంగ్రెసు ప్రభుత్వం పట్ల పార్టీ నాయకత్వపు లొంగుబాటు వైఖరి తారస్థాయికి చేరుకుంది.

కాంగ్రెసు ప్రభుత్వంపై కమ్యూనిస్టు నాయకులకు గల గుడ్డి నమ్మకానికీ, దాని వాగ్దానాలను నమ్మే తీరుపైనా మనకు ఆశ్చర్యం కలగక మానదు. గతంలో ప్రజా పోరాటాల వీరోచిత స్థాయిపై గాంధీ విధించిన ఆంక్షల ద్వారా కార్మికుల పట్ల రైతాంగం పట్ల కాంగ్రెసు తన నిజవైఖరిని నిరూపించుకోలేదా? 1937–39 నాటి కాంగ్రెసు మంత్రి వర్గకాల్‌లో నెహ్రూ రైతాంగ ఉద్యమాల్ని వ్యతిరేకించలేదా? సర్దార్

పటేల్ RIN తిరుగుబాటుదార్లను బ్రిటిషువారికి లొంగిపొమ్మనలేదా? కమ్యూనిస్టు నాయకత్వం గురించి సి.పి.ఐ. (మా.లె.) పార్టీ చేసిన అంచనాతో మనం ఏకీభవించాలి. "..... సి.పి.ఐ. నాయకత్వం మొదటి నుంచీ తనకు పూర్తిగా తెలిసే కాంగ్రెసు నాయకత్వం వెనకాల తోకలా వ్యవహరిస్తూ విప్లవానికి ద్రోహం చేసింది."[7] ఆ కాలంలో పార్టీలో ప్రముఖ సభ్యుడుగా ఉన్నాననే పశ్చాత్తాపం, ప్రగాఢ విచారాలతో చారుమజుందారు తన అనుయాయులను పదే పదే ఇలా హెచ్చరించేవాడు. "మన గతాన్ని అసహ్యించుకోవడం నేర్చుకోండి. అప్పుడే మీరు మంచి విప్లవకారులవుతారు."[8]

1947 చివర కాలానికి కొత్త ప్రభుత్వం పట్ల తన వైఖరిపై సి.పి.ఐ. పునరాలోచన మొదలుపెట్టింది. 1947 డిశంబరులో బొంబాయిలో జరిగిన కేంద్రకమిటీ సమావేశ కాలానికి, కాంగ్రెసులో నెహ్రూకు సర్దార్ పటేలుకూ తేడా చూపుతూ నాటి జనరల్ సెక్రటరీ పి.సి. జోషి నెహ్రూను బలపరచాలనగా కొత్త సిద్ధాంతంతో ముందుకు వచ్చిన బి.టి. రణదివే అతడిని తప్పించడం మొదలెట్టాడు. రణదివే సిద్ధాంతం ప్రకారం భారత జాతీయ కాంగ్రెసు ఆంగ్ల – అమెరికన్ కూటమిలో చేరి ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తోంది.

1948 మార్చిలో కలకత్తాలో జరిగిన సి.పి.ఐ. రెండవ కాంగ్రెసు సమావేశంలో పార్టీ కొత్త వైఖరిని మరింతగా విపులీకరించింది. అధికార మార్పిడిని "నకిలీ స్వాతంత్ర్యం"గా వర్ణించింది. "బ్రిటిషు పెత్తనం అంతరించలేదు. ఆ పెత్తనం విధానమే మారింది. ఇంతవరకూ బూర్జువా వర్గం రాజ్యాధికారానికి దూరంగానే ఉంది. దానికి బదులు జాతీయ ప్రజాతంత్ర విప్లవాన్ని విచ్ఛిన్నం చేసి, దాన్ని రక్తంలో ముంచెత్తేందుకు రాజ్యాధికారంలో ఆ వర్గానికి వాటా యిచ్చారు." అని వక్కాణించింది. "బూర్జువా ప్రభుత్వానికీ దాని విధానాలకీ కాంగ్రెసు పార్టీ బూర్జువా నాయకత్వానికీ పూర్తి వ్యతిరేక దిశలో ప్రజాతంత్ర విప్లవం ప్రయాణించవలసి ఉంటుందనే" నిర్ణయానికి కూడా వచ్చింది.

ఈ దశను తిరిగి పరిశీలించిన సి.పి.ఐ. (మా.లె.) సిద్ధాంత కర్తల అభిప్రాయం ప్రకారం భారత కమ్యూనిస్టు పార్టీ "వామపక్ష అవకాశవాద" ధోరణిని చేపట్టింది. పి.సి. జోషీ యొక్క "మితవాద అవకాశవాదం"పై పెరుగుతున్న అసంతృప్తిని సాకు చేసుకుని బి.టి. రణదివే నాయకత్వానికి వచ్చాడని సి.పి.ఐ. (మా.లె.) నాయకుల అభిప్రాయం. "పార్టీ వర్గాలలో పచ్చి మోసం పట్ల పార్టీ రెండవ కాంగ్రెసులో తిరుగుబాటు జరిగింది. రణదివే వర్గం వలస నాయకత్వాన్ని చేపట్టేందుకు ఈ తిరుగుబాటునుపయోగించుకుంది."[9] మరింత వీరోచితమైన కార్యక్రమాలకై

అనుయాయులు తెచ్చే ఒత్తిడికి తోడు, నానాటికీ కొత్త ప్రభుత్వ విధానాలలో బయటపడుతున్న అసంతృప్తికర లక్షణాల దృష్ట్యా పార్టీ రెండవ కాంగ్రెసు భారతదేశ పరిస్థితిని విశ్లేషించింది.

ఒక రాజ్యాంగాన్ని తయారు చేయాలన్న నిర్ణయాన్ని కొత్త ప్రభుత్వం అప్పుడే ప్రకటించింది. ప్రతిపాదించిన రాజ్యాంగంలో అనేక అంశాలపై సి.పి.ఐ. సుముఖంగా లేదు. ఉదాహరణకు స్వయం నిర్ణయాధికారాన్ని భాషా ప్రయుక్త ప్రాంతాల ప్రాథమిక హక్కుగా కొత్త రాజ్యాంగం ఆమోదించలేదు. పార్లమెంటులోనూ, రాష్ట్ర శాసన సభలలోనూ నిష్పత్తి ప్రాతినిధ్యాన్ని (proportional representation) అంగీకరించలేదు. ప్రాథమిక హక్కులలోని ఒక అధికరణం ద్వారా ధనికుల ఆస్తి, అధికారాలకు రక్షణ ఇస్తూ ఒక వ్యక్తి లేదా సంస్థ యొక్క ఆస్తిని ప్రజోపయోగానికై తగిన నష్ట పరిహారం చెల్లించి కాని ప్రభుత్వం తీసుకోరాదనే సదుపాయాన్ని కలగజేసింది.

నాటికీ కొనసాగుతున్న బ్రిటిషు ఆధిపత్యం గురించిన సి.పి.ఐ. అనుమానం కూడా త్వరలోనే నిజమయింది. ఒక నెల తరవాత అంటే 1948 ఏప్రిలు మాసంలో, పరిశ్రమలలో విదేశీ పెట్టుబడి భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తూ ప్రభుత్వం తన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. ఆ తరువాత మరింత బాహాటంగా, తమ లాభాల తరలింపులపై ఎటువంటి ఆంక్షలూ విధించమని విదేశీపెట్టుబడిదార్లకు వాగ్దానం చేసింది. తత్ఫలితంగా 1948 జూన్ నెలలో 2,099 మి. రూ. ఉన్న బ్రిటిషు పెట్టుబడులు, 1955 డిసెంబరు నాటికి రూ. 3,290 మిలియన్లకు పెరిగాయి.[10]

1948 నాటి సి.పి.ఐ. విధానంలో నాటి అంతర్జాతీయ కమ్యూనిస్టు నాయకులు చేసిన ప్రపంచ పరిస్థితి వివరణ ప్రభావం గోచరిస్తుంది. నాటి ప్రపంచ పరిస్థితులలో రాజకీయ శక్తులను నిశితసమీకరణ కనపడుతుంది. ప్రచ్ఛన్న యుద్ధం అత్యున్నత స్థాయికి జేరుకుంది. గ్రీసులో కమ్యూనిస్టు విప్లవకారులను అణచేందుకు అమెరికా స్వయంగా కలగజేసుకుంది. యుద్ధానంతరం యూరోపియను ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింప జేసుకునేందుకు మార్షలు ప్లానును ప్రకటించింది. తనను ఏకాకిగా చేసేందుకై ఆంగ్లో - అమెరికన్ కుట్రసాగుతోందని సోవియటు యూనియను భయపడుతోంది. చైనా కమ్యూనిస్టులు ప్రాచ్యంలో అందుకుంటున్న విజయాల దృష్ట్యా చైనాకు వ్యతిరేకంగా ఆంగ్లో-అమెరికన్ కూటమి దక్షిణ ఆసియాలో సుస్థిరం చేసుకునే ప్రయత్నం సాగిస్తోంది. ఇటువంటి పరిస్థితులలో అంతర్జాతీయ కమ్యూనిస్టు నాయకులు ప్రపంచ శక్తులు సోషలిస్టు కూటమిగానూ సామ్రాజ్యవాద కూటమిగానూ

విభజింపబడాలని ఆశిస్తూ వలస, అర్థవలస ప్రాంతాలలో జాతీయ విమోచనోద్యమాల అవసరాన్ని వక్కాణించారు.

జపాన్ వ్యతిరేక (నిరోధ) యుద్ధపు కొసలను పట్టుకొని, ఇంకా పరిపాలిస్తున్న వలస రాజ్యాలపైగాని, రాజ్యాధికారాన్ని దఖలు పరుచుకొన్న స్థానిక ప్రభుత్వాలపైన కాని వచ్చిన సంఘర్షణల జాతీయ విమోచనోద్యమాలుగా మార్చించుకునే ఆశతో – ఆశయంతో బర్మా మలయా, ఫిలిప్పైన్సు, ఇండోనేషియా తదితర ఆగ్నేయాసియా దేశాలలోనూ గల కమ్యూనిస్టులు అప్పుడే సంఘటితమౌతున్నారు. 1948 మార్చిలో ఆగ్నేయాసియా, యువజన సంఘం ప్రతినిధులు కలకత్తాలో సమావేశమైనప్పుడు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల కమ్యూనిస్టులు, ప్రత్యేకించి ఆగ్నేయాసియా దేశాల ప్రతినిధులు ఆగ్నేయాసియా దేశాలలో సాయుధ దాడికి సంబంధించిన కార్యక్రమాన్ని చర్చించారు. అదే కాలంలో కలకత్తాలో తన రెండవ కాంగ్రెసు సమావేశం సి.పి.ఐ. జరుపుకొనడం గమనించాలి.

కాని (ప్రపంచ కమ్యూనిస్టు నాయకుల కార్యాచరణ) కార్యక్రమాన్ని భారత దేశ పరిస్థితులకు అనువదించేటప్పుడు సి.పి.ఐ. కొన్ని విషయాలను గమనించలేక పోయింది. మొదటగా, బర్మా తదితర ఆగ్నేయాసియా దేశాలలో లాగ జపానుపై కాని మరే ఇతర వలస రాజ్యంపైన కాని సాయుధ పోరాటం ద్వారా పోరాటానుభవం పొందిన సాయుధులైన అనుచరవర్గం భారత కమ్యూనిస్టులకు లేకపోయింది. రెండోది, పశ్చిమ యూరోపియను కమ్యూనిస్టు అనుభవాల పట్ల గల వ్యామోహం గల నాయకత్వం, సమ్మెలు, సాయుధ ఘర్షణలు వంటి నగర ప్రాతిపదిక చర్యల ద్వారా విప్లవం సాధించాలని ఆశించి, దీర్ఘకాలిక యుద్ధానికి కావలసిన గ్రామీణ స్థావరాల్ని నిర్మించే కార్యక్రమాన్ని చేపట్టడం నిర్లక్ష్యం చేసింది. మూడోది దేశమంతటా పోరాటాల్ని సమీకరించేంత సమానంగా సి.పి.ఐ. సంస్థాపరంగా అభివృద్ధి చెందలేదు. విస్తరించలేదు.

తత్ఫలితంగా వెంటనే ఎన్నో చర్చలు జరిగాయి. కలకత్తా వంటి నగరాలలో ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం, పోలీసులతో సాయుధ ఘర్షణలు, బ్యాంకు దోపిడీలు జరిగాయి. బెంగాలులోని మైమన్సింగ్ కొండ ప్రాంతాలలోనూ కాక ద్వీప్, బారా, కామ్లాపూర్ ప్రాంత గ్రామాలలో పోలీసులపైనా భూస్వాముల పైనా రైతాంగాన్ని సమీకరించిన సందర్భాలున్నాయి. ప్రభుత్వం త్వరలోనే జవాబు చెప్పింది. కలకత్తా కాంగ్రెసు నిర్వహించిన కొద్ది నెలలలోనే పార్టీ కార్యాలయాలపై ప్రభుత్వం మెరపుదాడులు జరిపింది. పశ్చిమ బెంగాలు, బొంబాయి, మద్రాసు రాష్ట్రాలలో

అంతరంగిక భద్రతా చట్టాలను ప్రవేశపెట్టి పార్టీని నిషేధించారు. అనేక మంది నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

కలకత్తా కాంగ్రెసులో జనరలు సెక్రటరీగా ఎన్నికైనా ఇంకా జైలు బైటనే ఉన్న బి.టి. రణదివే ఆరునెలల్లో దేశమంతటా సార్వత్రిక సమ్మె జరుగుతుందనీ రైతాంగ తిరుగుబాట్లు జరుగుతాయనీ వాగ్దానం చేస్తూ 1948 ఆగస్టులో కామ్రేడ్లందరికీ ఒక లేఖను పంపించాడు. 1949 మార్చి 9వ తేదీ నుంచి తలపెట్టిన అఖిల భారత రైల్వేల సమ్మె పిలుపుపై ఆశ పెట్టుకున్న కమ్యూనిస్టులు ఆ సమ్మె విప్లవజ్వాలను రగుల్కొలుపుతుందని ఆశించారు. కాని ప్రభుత్వం మాత్రం వీళ్ళను మించిన యుక్తిని పన్నింది. అఖిల భారతీయ రైల్వే కార్మిక సమాఖ్య (AIRF) నాయకుడైన జయప్రకాశ్ నారాయణతో ఒక ఒప్పందానికి వచ్చేసింది. దాంతో అతను సమ్మె పిలుపును ఉపసంహరించుకున్నాడు. ఆ ఒప్పందాన్ని తిరస్కరిస్తూ కమ్యూనిస్టులు సమ్మెను అమలు చేసారు. ఆ సమ్మె ఒక భాగోతంగా తయారై వీగిపోయింది. అనేక మంది కమ్యూనిస్టులు ఉద్యోగాల నుంచి తొలగించబడ్డారు. వాళ్ళను కటకటాల వెనక్కి తోసారు.

పట్టణాలలో చర్యలు ఉద్యమాన్ని నిలదొక్క లేకపోయినా 1946లో మొదలైన వ్యవసాయిక సాయుధ పోరాటం* మాత్రం 'అధికార మార్పిడి' తర్వాత, పి.సి. జోషీ నాయకత్వ కాలమంతటా కూడా కొనసాగడం గమనార్హం.

## తెలంగాణ విషయంలో పార్టీలో అంతరంగిక ఘర్షణ

పోలీసు చర్య పేరుతో 1948 సెప్టెంబరులో భారత సైన్యాలు తెలంగాణాను ఆక్రమించాయి. కమ్యూనిస్టు తిరుగుబాటుదార్లకు కొన్ని సమస్యలు తలెత్తాయి. సైన్యాలకు వ్యతిరేకంగా సాయుధపోరాటాన్ని విమోచనా యుద్ధంగా కొనసాగించాలా? అటువంటి విముక్తి పోరాటంలో ఎవరు మిత్రులుగా ఉంటారు? ఇంత వరకు జరిగిన నిజాం వ్యతిరేక పోరాటంలో మధ్య రైతులు చిన్న పెట్టుబడిదార్లు కలిసి వచ్చారు. కాని ఇప్పుడు వాళ్లు భారత ప్రభుత్వాన్ని సమర్థించి, ఇండియన్ యూనియన్లో తమకు మంచి భవిష్యత్తు నాశించవచ్చు.

ఈ సమస్యల మీద తెలంగాణా కమ్యూనిస్టు నాయకులలో రెండు నిశితంగా విబేధించే అభిప్రాయాలు తలెత్తాయి. తరువాత వాటివల్ల అఖిలభారతీయ నాయకత్వం

---

* *1948లో భారత సైన్యాలు తెలంగాణాలో ప్రవేశించక ముందు జరిగిన పోరాటపు చర్యల వివరాలకై మొదటి అధ్యాయం చూడవచ్చు.*

ఆ విషయాలపై రెండు వర్గాలుగా కూడా విడిపోయింది. ఒక వర్గం సాయుధ పోరాటాల్ని విరమించాలని కోరగా, మరో వర్గం ఆ పోరాటాన్ని భారతీయ సైన్యం పైన కూడా కొనసాగించాలని కోరింది. రెండో అభిప్రాయం పార్టీ యొక్క ఆంధ్రా కార్యనిర్వాహక వర్గానిది (Andhra Secretariat). కాంగ్రెసు పార్టీ ఆధ్వర్యంలో గల బూర్జువా – భూస్వామ్య ప్రభుత్వంపై సాగించే సాయుధ విముక్తి పోరాటానికి తెలంగాణా పోరాటాన్ని నాందీగా భావించింది. ఆంధ్రా సెక్రటేరియట్ 1948 మే లో తయారుచేసిన ఒక పత్రంలో ఇలా చెప్పింది. "మన విప్లవానికీ చారిత్రక రష్యన్ విప్లవానికీ చాలా విషయాలలో తేడా ఉంది. మన విప్లవం చాలా మటుకు చైనా విప్లవాన్ని పోలి ఉంది. సార్వత్రిక సమ్మె సాయుధ తిరుగుబాటుద్వారా గ్రామీణ విముక్తి వచ్చే పరిస్థితి ముందు కనిపించడం లేదు, కాని వ్యవసాయిక విప్లవ రూపంలో జరిగే తీవ్రపోరాటం, దీర్ఘకాలం సాగే అంతర్యుద్ధం ద్వారా ప్రజాతంత్ర సంఘటన రాజ్యాధికారాన్ని పట్టుకోవడంలో పరాకాష్టను చేరుకుంటాయి."[11] ఆ విధంగా 1948లో మొదటిసారిగా తెలంగాణలో రష్యన్ ఎత్తుగడలకు బదులు చైనా ఎత్తుగడలను ప్రతిపాదించడం జరిగింది.

సి.పి.ఐ. కలకత్తా కాంగ్రెసులో తెలంగాణా పోరాటాన్ని బలపరిచింది. బి.టి. రణదివే కాంగ్రెసుకు సమర్పించిన నివేదికలో "ఇవాళ తెలంగాణా అంటే కమ్యూనిస్టులు. కమ్యూనిస్టులంటే తెలంగాణ" అని రాసుకున్నాడు. అయినప్పటికీ ఆంధ్రా సెక్రటరియేట్ ప్రతిపాదించిన చైనా ఎత్తుగడలని నిరాకరించాడు. భారతదేశంలో ప్రజాతంత్ర విప్లవ సాధనకై, ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలను పూర్తి చేస్తూ సోషలిస్టు నిర్మాణాన్ని కూడా జరపాలని అభిప్రాయపడ్డాడు.

చైనా ఎత్తుగడలను అనుసరించి ఉంటే, దేశంలో వర్గ సంబంధాల విశ్లేషణ మరోవిధంగా జరిగి తక్షణ భవిష్యత్తులో మరో విధమైన కార్యక్రమం రూపొంది ఉండేది. చైనా పద్ధతిలో బీదరైతులు భూమిలేని రైతులూ మధ్య రైతులతో పొత్తు కుదుర్చుకుంటే పట్టణ కార్మిక వర్గం మీద ఆ రైతాంగ పాత్ర ప్రాముఖ్యం కలిగి ఉండేది. భారతీయ విప్లవ ప్రజాస్వామ్య దశలు రష్యన్ పద్ధతిలో పెనవేసుకోవాలనే కలకత్తా కాంగ్రెసు సిద్ధాంతానికి భిన్నంగా, చైనా పంథా ప్రకారం జనతా ప్రజాతంత్ర రాజ్యం ముందర స్థాపించాలి. సోషలిజం సాధించే దిశలో ఇది మధ్యంతర దశ. కమ్యూనిస్టు పార్టీనాయకత్వంలో అనేక తరగతుల సంకీర్ణ ప్రభుత్వం. పోరాటం విరమించి విప్లవకారులు భారత ప్రభుత్వానికి లొంగిపోవాలని రైట్ (కుడి) వర్గం వారు భావించగా, పార్టీ వామపక్షీయులు చైనా వైఖరిని అనుసరించినందుకు

విమర్శించారు. ఆ విధంగా రెండు వైపుల నుంచీ తిట్లుపడుతూ తెలంగాణ విప్లవకారులు అచంచల ధ్యేయంతో దీక్షతో తమ సాయుధ పోరాటాన్ని కొనసాగించారు.

తరువాతి కాలంలో పరిస్థితిని విమర్శించిన సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఆంధ్రరాష్ట్ర కమిటీ (Andhra Secretariat) "చైనా వేసిన మార్గమైన ప్రజా యుద్ధ మార్గాన్ని అనుసరించడం వల్లనే భారత విప్లవం విజయవంతమౌతుందని భావించడం సరియైనదే"నని అభిప్రాయపడింది. 'రణదివే ముఠా' ఈ వైఖరిని వ్యతిరేకించినందుకు నిందించింది. "ఒకే దెబ్బతో ప్రజాస్వామ్య విప్లవాన్ని సాధించాలనే ట్రాట్స్కీవాదాన్ని" అనుసరించినందుకు గర్హించాలి. "ప్రజాతంత్ర విప్లవపు ముఖ్య కర్తవ్యమైన వ్యావసాయిక విప్లవాన్నుంచి పార్టీ కార్యకర్తల దృష్టిని మళ్లించినందుకు ఆ ముఠాయే" కారణమని వక్కాణిస్తూ "ఒంటెత్తు పోకడల వల్ల (Sectarianism) పార్టీ సభ్యులు సాహసిక చర్యలకు దిగారు. రణదివే ముఠా ఈ ఆత్మహత్యా సదృశ్యమైన తప్పుడు విధానాన్ని అనుసరించినా, తెలంగాణా విప్లవకారులు మాత్రం పోరాటపు మార్గం నుంచి వైదొలగలేదు. గెరిల్లా యుద్ధపు ఎత్తుగడలను అనుసరిస్తూ వాళ్ళు పోరాటాన్ని ముందుకు తీసుకుపోయారు."[12]

కాని దాక్షిణ్యం లేని జిత్తులమారి శత్రువుపై సాయుధపోరాటాన్ని కొనసాగించాలంటే వ్యక్తిగత వీరత్వమొకటే చాలదు. తెలంగాణా పరిస్థితికి ఒక దీర్ఘకాలిక రాజకీయ అవగాహన అవసరమైంది. నాయకత్వంలో చంచల ధోరణుల వల్ల అటువంటి అవగాహన ఏర్పడలేదు. బీదవాళ్లు, భూమిలేని రైతులు, మధ్య రైతాంగం ధనిక రైతాంగంలో కొంత భాగంతో కలసిన మిత్రమండలి ఆధ్వర్యంలో నడుస్తూన్న నిజాం వ్యతిరేకోద్యమాన్ని, కాంగ్రెసు ప్రభుత్వాన్ని కూలదోసే విమోచనాయుద్ధంగా మార్చాలంటే భూమి లేని రైతులపైనా బీదవాళ్ళపైనా ఆధారపడాలి. ఫ్యూడలు విధానం, దాన్ని పెంచి పోషించే ప్రభుత్వాన్నీ విచ్ఛిన్నం చేయాలనే పట్టుదల వాళ్ళకే ఉంది. కాని నిజాం వ్యతిరేకోద్యమ ప్రారంభ దశలోనూ, తరవాతా చైనా పంథాను ప్రతిపాదించిన నాయకులు కూడా తరువాతి దశలో ఎప్పుడైనా పోరాటాన్ని విమోచనా యుద్ధంగా మార్చే అవసరం వస్తుందని కాని మార్చాలని కాని అనుకోలేదు. 1948లో వాళ్లు చైనా పంథాను సమర్థించడం కూడా పెద్ద పెట్టున జరిగిన భారతీయ సైనికజోక్యం వల్ల కలిగిన యాంత్రిక భావన తప్ప ముందు యోచించి చక్కగా వ్యూహం పన్నుకున్న ఎత్తుగడల విధానం మాత్రం కాదు. అల్లంత దూరంలో చైనా కమ్యూనిస్టులు అందుకొనబోయే విజయం, ఆగ్నేయాసియాలో జరిగే గెరిల్లా ఉద్యమాలు కూడా వాళ్ళను ఉత్తేజితుల్ని చేసాయనడంలో సందేహం లేదు.

1948 సెప్టెంబరు నాటి 'పోలీసు చర్య' అనంతరం కాంగ్రెసు ప్రభుత్వం ప్రకటించిన రాయితీలు మధ్యమ, ధనిక రైతులను పోరాటాన్నుంచి విరమించుకునేలా చేసాయి. ప్రధానంగా ఇదే వర్గాల నుంచి వచ్చిన కమ్యూనిస్టు నాయకుల్ని కూడా అవి ప్రభావితం చేసాయి. ప్రస్తుతం వ్యతిరేక కూటాలలో ఉన్నా, ఆనాడు తెలంగాణా ఉద్యమంలో కలసి పాల్గొన్న పి. సుందరయ్య, రావి నారాయణరెడ్డి ప్రభృతులు తరువాత ఇలా ఒప్పుకున్నారు.[13] బీదవాళ్లు, భూమిలేని రైతులు సాయుధ పోరాటాన్ని కొనసాగించాలనే దృఢ నిశ్చయంతో ఉన్నారు. ధనిక రైతులు ప్రభుత్వ పక్షంలో చేరారు. మధ్యమ వర్గం రైతులు ఊగిసలాడుతున్నారు. గ్రామీణ జనంలోని బీదవర్గాలను గంగలో ముంచేలా కమ్యూనిస్టు నాయకులు 1951లో పోరాటాన్ని విరమించారు. సి.పి.ఐ. అఖిల భారత నాయకత్వంలో వచ్చిన చీలికవల్ల ఇతర ప్రాంతాలలో పోరాటాలను జరపడం ద్వారా తెలంగాణా తిరుగుబాటుదార్ల పోరాటానికి ఊపిరిపోయాలనే తాపత్రయం పార్టీకి లేకపోయింది.

ఈలోగా తెలంగాణాలోని భారతసైన్యం తన పోరాటాన్ని ఉధృతం చేసింది. దాంతో తిరుగుబాటుదార్ల సైనిక నిస్సహాయత బయటపడింది. మొదటినించీ కూడా దీర్ఘకాలిక వ్యూహరచనకు ఎలాంటి ఏర్పాట్లూ లేవు. బహుశ శతృబలాన్ని కూడా తక్కువగానే అంచనా వేయడం జరిగింది. వీటివల్ల గెరిల్లాల శిక్షణ, ఆయుధీకరణలకు ప్రాధాన్యత నివ్వలేదు. ఈ పరిస్థితిని పి. సుందరయ్య ఇలా వర్ణించాడు. "ఎదుర్కోవడం, తిరోగమించడం వంటి ప్రాథమిక సైనిక ఎత్తుగడలు కూడా లేకపోవడం గెరిల్లా దళాలు శతృవుపై జరిపే పోరాటాలను సమీకరించడంలో మేం విఫలమవడంలో కొట్టొచ్చినట్టు కనిపించింది. ప్రజలు సంఘటితం కాకపోయినా శతృవుపైనా, వాళ్ల స్థావరాలపైనా సుదీర్ఘమైన తీవ్రపోరాటాల్ని ఎంతో ఉత్సాహంతో నడిపేవారు. దాంతో మేం దారుణ నష్టాలకు గురయ్యాం. శతృవు మొండిగా ఎదిరిస్తూంటే మేం తిరోగమించ వలసి వచ్చింది. లేదా సైనికదాడుల వల్ల నిరంతరం పారిపోవలసి వచ్చేది. శతృవును చీకాకు పరిచే చిన్న తరహా గెరిల్లా చర్యలను సమీకరించి, శతృవుకు అక్కడక్కడ గల స్థానాల నుంచి తరిమికొట్టే భారీ యుద్ధాలుగా మార్చి మరింత పెద్ద ప్రాంతాల నుంచి శత్రువును ఖాళీ చేయించలేకపోయాం."[14]

మైదానాలలో "విముక్తి ప్రాంత"పు ఇరుకు పరిధులలో చిక్కుకుని ఆ ప్రాంతపు విస్తరణావకాశాలు సన్నగిల్లగా, అక్కడ తిరుగుబాటుదార్లు చాలా కాలం పాటు నిలవలేకపోయారు. గోదావరీ నదీ తీరారణ్యాలలోకీ, కృష్ణానది కిరువైపులా గల నల్గొండ, కరీంనగర్ జిల్లా అడవులలోకి సాయుధ పోరాటం తిరోగమించింది. గోదావరీ

తీరాటవీ ప్రాంతపు భూమిలేని ప్రజలు, ప్రధానంగా కోయలు సహాయంగా ముందుకు వచ్చి చాలామంది గెరిల్లా దళాలలో జేరారు. దుష్టపూరితమైన బ్రిగ్స్ ప్రణాళిక ప్రకారం ఆటవికుల జనపదాలను అంటించి, కోయవాళ్ళను కాంసంట్రేషన్ కాంపుల్లో మగ్గబెట్టి ప్రభుత్వం తగిన ప్రతిఫలం తీసుకుంది. కాని అలాంటి దమనచర్యలు జరుగుతున్నా కూడా మిలటరీ స్థావరాలపై గెరిల్లాదాడులు జరుపుతూ, భూస్వాములపై దాడులు జరిపి, పట్టుకున్న భూమినీ ధాన్యాన్ని పంచుకుంటూ, తిరుగుబాటుదార్లు సాయుధ పోరాటాన్ని కొనసాగించారు. కమ్యూనిస్టుల వెనుక సామాన్య ప్రజలు ఉన్నారనీ, అందుచేత వాళ్ళను అణిచేందుకు భారత సైన్యాలు ఎంతో శ్రమపడవలసి వచ్చిందనీ కమ్యూనిస్టుల బద్ధ శత్రువులు కూడా ఒప్పుకున్నారు.[15]

ఈలోగా 1948 నాటి కలకత్తా సమావేశంలో ఆమోదించిన పార్టీ కేంద్ర కమిటీ రాజకీయ విధానాన్ని, బి.టి. రణదివే సిద్ధాంతాన్ని నిశితంగా ఎదుర్కొంటూ అంతర్జాతీయ కమ్యూనిస్టు నాయకత్వం ఒక విమర్శ చేసింది. ఆ విమర్శ 1950 జనవరి 27వ తేదీన 'కోమింఫారమ్' అనే అధికార పత్రికలో 'మనగలిగే శాంతికీ, జన ప్రజాస్వామ్యానికీ' (For a Lasting Peace, for a Peoples Democracy) అనే శీర్షికలో ప్రచురితమైనిది. దాంట్లో చెప్పినదాని ప్రకారం "చైనా ప్రజలు అనుసరించిన మార్గం... అనేక వలస దేశాల దాస్యదేశాల ప్రజలు, జాతీయ స్వాతంత్ర్యం జన ప్రజాస్వామ్యాల సాధనకై జరిపే పోరాటానికి అనుసరించవలసిన మార్గం."

దీన్తరవాత సి.పి.ఐ. అధిష్టానవర్గంలో మార్పులు జరిగాయి. తెలంగాణాలో చైనా పంథాను సమర్థించిన వారిలో ఒకడైన సి. రాజేశ్వరరావు జనరలు సెక్రటరీ (ప్రధాన కార్యదర్శి)గా పొలిట్ బ్యూరో పునర్వ్యవస్థీకరించబడింది. ఆంధ్రా సెక్రటేరియట్ యొక్క చైనా ఎత్తుగడలనూ, రణదివే నగర చర్యలను కూడా వ్యతిరేకించిన సి.పి.ఐ.లోని రైటిస్టులు ఎస్.ఎ. డాంగే నాయకత్వంలో కొత్త పొలిట్ బ్యూరోను కూడా వ్యతిరేకిస్తూనే ఉన్నారు. రైటిస్టులు, చైనా అనుకూల వర్గీయుల సంయుక్త ప్రాతినిధ్యం గల భారతీయ కమ్యూనిస్టు ప్రతినిధి వర్గం ఒకటి సోవియట్ కమ్యూనిస్టు పార్టీ సలహాకై వెళ్లింది. వాళ్లు నేరుగా స్టాలిన్నే కలుసుకున్నారు. మాస్కో చర్చల ఫలితంగా వచ్చిన కొత్త సిద్ధాంతం సి.పి.ఐ. 1951లో చేసిన విధాన ప్రకటననూ, కార్యక్రమాన్నీ ప్రభావితం చేసింది.[16]

## 1951 సిద్ధాంతం

సి.పి.ఐ. 1951లో ఆమోదించిన విధాన ప్రకటన, కొత్త కార్యక్రమాలు, వివాదంలో పడ్డ రెండు అంశాల మీద కొత్త వెలుగును ప్రసరింపజేసాయి. మొదటిది, భారత పాలకుల వర్గ స్వభావం. రెండవది, విప్లవ దశ. మిత్రుల ఎన్నిక విషయమై భారతీయ విప్లవం భావిలో నడిచే తీరుతెన్నుల విశ్లేషణ.

విధాన ప్రకటనలో మొదటి అంశాన్ని పురస్కరించుకుని, నెహ్రూ ప్రభుత్వం ప్రముఖంగా "ఫ్యూడలు భూస్వాముల, గుత్తపెట్టుబడిదార్ల క్షేమాన్ని, వాళ్ళ వెనకాల బ్రిటిషు సామ్రాజ్యవాదుల లాభాన్ని" సేవిస్తోందని భావించింది. ఈ విషయంలో 1948 నాటి కలకత్తా కాంగ్రెసు సిద్ధాంతం నుంచి మౌలికమైన మార్పేమీ లేదు. కాని ప్రజాతంత్ర విప్లవాన్ని సోషలిస్టు విప్లవ సాధనతో మేళవించి, సోషలిస్టు విప్లవం దిశలో సత్వరం ముందుకు పోవాలనే దృక్పథాన్ని వదిలిపెట్టారు. దానికి బదులుగా 1951 కార్యక్రమం "దేశంలోని ప్రజాస్వామ్య ఫ్యూడలు వ్యతిరేక సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల ప్రాతిపదికగా గల సంకీర్ణజన సమూహాలతో జన ప్రజాస్వామికాన్ని" నిర్మించాలని ఆశించింది.

ఇంక ఎత్తుగడల విషయానికి వస్తే, సి.పి.ఐ. విధాన ప్రకటన ఇలా అంటోంది. "కొత్త రాజ్యాంగం ప్రవేశపెట్టిన పార్లమెంటుని సాధనంగా చేసుకుని ప్రస్తుత ప్రభుత్వానికి బదులుగా జన ప్రజాతంత్ర ప్రభుత్వాన్ని స్థాపించవచ్చునని చాలామంది భావిస్తున్నారు..." "ప్రస్తుత ప్రభుత్వాన్ని దాన్ని అధికారంలో నిలబెట్టిన (పాలక) వర్గాలు పార్లమెంటరీ విధానం ద్వారానే మౌలిక ప్రజాతంత్ర మార్పును తేనిస్తాయని భావించేందుకు, కమ్యూనిస్టులు, ఇతర ప్రజాస్వామ్యవాదులు, విప్లవకారుల మాట అటుంచి, నేడు, ఉదారవాదులు (liberals) కూడా సిగ్గుపడతారు. అందువల్ల మన పార్టీ రూపొందించిన కార్యక్రమపు (ఆశయాలైన) శాంతి, స్వాతంత్ర్యం, భూమి, భుక్తి మొదలైన వాటిని సాధించేందుకు అనుసరించవలసిన మార్గం మరెక్కడో ఉంది." మరో సందర్భంలో ఆ ప్రకటన ఇలా వివరించింది. "సామాన్య ప్రజలు తమ ప్రయోజనాన్ని కాపాడుకునేందుకు విముక్తిని సాధించేందుకు చేపట్టే చర్యలన్నీ పవిత్రమైనవే." కాని మాజీ ప్రధాన కార్యదర్శి రణదివే ఎత్తుగడలను గర్హిస్తూ, "కాని ఒక్క చారిత్రక (ఖతం) చర్య ఆమోదం పొందదు. అది వ్యక్తిగత హింసావాదమవుతుంది. వ్యక్తిగత హింసావాదం అంటే ఒక వ్యవస్థలోని లేదా వర్గంలోని వ్యక్తులపై వ్యక్తులు కాని లేదా గ్రూపులు కాని దళాలుగాని జరిపే హింస ...."గా పేర్కొంది.

సోవియట్ కమ్యూనిస్టు నాయకులతో జరిపిన చర్చల దృష్ట్యా పూర్తిగా రష్యన్

మార్గంకాని చైనా పంథాను కాని భారతీయ విప్లవం అనుసరించదని భారత కమ్యూనిస్టులు భావించారు. నాడు చైనాలో ఉన్న కార్మిక వర్గం కంటె హెచ్చు సంఖ్యలో ఉన్న సంఘటిత కార్మిక వర్గం దృష్ట్యా, 1917 పూర్వం బోల్షివిక్కులు అనుసరించిన ఎత్తుగడలు మనదేశానికి అనువైనవిగా కనిపించాయి. కాని బీద, భూమిలేని రైతులు హెచ్చు జనాభాగా ఉన్న కారణాన చైనా మాదిరికీ (model) దగ్గరగానే ఉంది. చైనాలో కమ్యూనిస్టు పార్టీ 1927 నాటికే 30,000 మంది గల సైన్యానికి నాయకత్వం వహించింది. అదీ కాక చైనాలో (రోడ్డు) రవాణా సౌకర్యాలు అంతగా అభివృద్ధి చెందకపోవడం చేత కేంద్రాధికారులు కమ్యూనిస్టు తిరుగుబాటుదార్లపై కేంద్రీకృతమైన దాడిని చేయలేకపోయారు. వీటికి తోడు చైనా కమ్యూనిస్టులకు స్నేహపూర్వకమైన 'వెనుక స్థావరం' (Rear Base) గా సోవియట్ యూనియన్ ఉంది.

అట్టి పరిస్థితులలో సి.పి.ఐ. ఎటువంటి ఎత్తుగడలను అనుసరించాలి? 1951 ఎత్తుగడల రచన (Tactical line-1951)గా రహస్యంగా పార్టీ వర్గాలలో సర్క్యులేట్ చేసిన పత్రంలో అవి వివరంగా పొందుపరచబడ్డాయి. కాని దాన్ని పార్టీ అనుచరవర్గాలలో మాత్రం ఎప్పుడూ సర్క్యులేట్ చెయ్యలేదు. ఆ పత్రం పార్టీ కార్యక్రమంలో నిర్దేసించిన ఆశయాలను ఉదహరించింది. "ఫ్యూడలిజాన్ని పూర్తిగా నాశనం చెయ్యడం, ఫ్యూడలు భూస్వాముల ఆధీనంలో ఉన్న భూమినంతటినీ రైతులకూ వ్యవసాయ కార్మికులకూ పంచిపెట్టడం, పూర్ణజాతీయ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను సాధించడం" శాంతియుతంగా సాధించడం కుదరని పని. అది "ప్రజల సాయుధ విప్లవం ద్వారానే" సాధ్యమౌతుంది. గ్రామ ప్రాంతాలలో గెరిల్లా యుద్ధపు అవసరాన్ని ప్రస్తావిస్తూ "పాక్షిక యుద్ధం మన ఆయుధాలలో ముఖ్యమైనదిగా ఉండాలి. .... దాన్ని సాయుధ కార్మికవర్గపు నాయకత్వంలో నగరాలలో జరిపే సమ్మె, తిరుగుబాటు, తదితర ముఖ్యాయుధాలతో మేళవించాలి... నగరాలలో కార్మికుల తిరుగుబాటునూ, రైతుల పాక్షిక యుద్ధం, అనే ఈ రెండు మౌలిక పరిస్థితులనూ మేళవించడం పూర్తిగా అవసరం" అని పేర్కొంది. "పాక్షిక సైన్యాలపై, విముక్తి ప్రాంతాలపై, శత్రువు జరిపే దాడిని బహుళమైన, సమ్మెలవంటి చర్యల ద్వారా నిరోధించాలి. స్తంభింప చేయాలి." అని కూడా ఉద్బోధించింది.

కాని రైటిస్టులకూ వామపక్షీయులకూ కుదిరిన మనసులేని రాజీ 1951 విధాన ప్రకటనలో మనకు కనపడుతుంది. 1951 తరువాతి సంవత్సరాలలో రైటిస్టులదే పై చేయి అయింది. సి.పి.ఐ. పార్లమెంటరీ పంథా వైపుకూ, శాంతియుత పంథాకూ మొగ్గు చూపింది. "సరియైన మార్గాన్ని అనుసరించబోయినప్పుడల్లా భారతీయ

విప్లవకారుల్ని మరోవైపుకు మళ్లించిన" సి.పి.ఐ. అధిష్టాన వర్గాన్ని చారుమజుందారు దుయ్యబట్టాడు. చారుమజుందారు తరువాతిలా అన్నాడు "ప్రజాతంత్ర విప్లవంలో రైతాంగ పాత్రను గురించిన పరిశీలన ఎన్నడూ జరగలేదు. ఆ విధంగా పార్టీ అనుచర వర్గాన్ని మితవాద సంస్కరణ వాదానికీ, వామపక్షపు ఒంటెత్తువాదానికీ, ఒకసారటూ, ఒకసారిటూ ఊగిసలాడుతూ, పార్లమెంటరీ తత్వంలోకీ రివిజనిజం రొంపిలోకి లాగి వేశారు"(26)

## 1951 తరువాతి మార్పులు

1951 నాటి ఎత్తుగడల రచనను వదిలెయ్యడానికి దారితీసిన పరిస్థితులు చాలా ఉన్నాయి. 1952లో మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. కాంగ్రెసు నెగ్గినా కూడా, అధికారంలో ఉన్న గత నాలుగు సంవత్సరాల కాలంలో ఆ పార్టీ తన పలుకుబడిని చెప్పుకోతగినంతగా కోల్పోయిందని ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. ఆంధ్రరాష్ట్రం వంటి కొన్ని రాష్ట్రాలలో కమ్యూనిస్టులు ఘనవిజయాన్ని సాధించారు. కాంగ్రెసు ఎన్నికలలో జయించి, వివిధ ప్రతిపక్షాల సాయంతో ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చనే తియ్యని ఊహ, కమ్యూనిస్టుల్ని ప్రలోభపెడుతూ వచ్చింది.

భారత ప్రభుత్వం తన విదేశాంగ విధానంలో గతంలో అనుసరించే ఆంగ్లో-అమెరికన్ అనుకూల వైఖరి నుంచి, అలీనవిధానం వైపుకు మార సాగింది. ఆసియాలో పెరుగుతున్న చైనా పలుకుబడితో ప్రపంచ శక్తుల బలాబలాలలో మార్పు వచ్చింది. ప్రచ్ఛన్న యుద్ధ (cold war) వాతావరణంలో ఇదివరకటి వేడి తగ్గింది. సోవియట్ యూనియను యొక్క స్నేహపూర్వక ప్రతిపాదనలను అంగీకరించే అవకాశం భారత ప్రభుత్వానికి కలిగింది. సోవియట్ సహాయానికి నాందీ జరిగింది. ఆ సహాయం ఆంగ్లో - అమెరికన్ కూటమితో బేరం సాగించడానికి తోడ్పడింది. ఈ బేరసారాలను అలీన విధానంగా తప్పుడు పేరుతో వర్ణించుకునే వీలు దేశ ప్రభుత్వానికి చిక్కింది. 1953లో జరిగిన మధురై సమావేశంలో సి.పి.ఐ. ఆ విధానానికిలా స్వాగతం పలికింది. "భారత ప్రభుత్వం ఇటీవలి కాలంలో అనేక ముఖ్యమైన అంతర్జాతీయ సమస్యల విషయంలో నిర్వహించిన పాత్రను శాంతికాముక రాజ్యాలు ప్రజాబాహుళ్యాలు అభినందిస్తున్నాయి".

1956లో పాల్ఘాట్‌లో జరిగిన సి.పి.ఐ. నాల్గవ సమావేశం నాటికి భారత విదేశాంగ విధానంలో అనేక మార్పులు వచ్చాయి. పాకిస్తానుకు సైనిక సహాయాన్నందించాలనే అనేక మార్పులు వచ్చాయి. పాకిస్తానుకు సైనిక సహాయాన్నందించాలనే అమెరికా

నిర్ణయం వల్ల 1954 ఫిబ్రవరిలో భారత్ – అమెరికాల మధ్య సంబంధాలు దెబ్బ తిన్నాయి. అదే సంవత్సరం జూన్‌లో చైనా కమ్యూనిస్టు ప్రధాని చౌ–ఎన్–లై మరోపక్కన భారత్‌ను సందర్శించి, పరస్పర అంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం, స్నేహం వంటి సూత్రాలను సమర్థించే "పంచశీల" ఒప్పందాన్నొకదాన్ని నెహ్రూతో కుదుర్చుకున్నాడు. సోవియట్ నాయకులైన నికితాకృశ్చేవ్ బుల్గానిన్‌లు ప్రధానమంత్రి నెహ్రూ అతిథులుగా 1955 నవంబరులో భారత్‌లో పర్యటించారు. భారతీయ త్రివర్ణపతాకం సరసన, సుత్తి–కొడవలి గుర్తు గల సోవియట్ అరుణ పతాకం ఆ పర్యటన కాలంలో ప్రభుత్వం భవనాలపై ఎగిరింది. చాలామంది భారత కమ్యూనిస్టుల కళ్ళకు ఆ రోజుల్లో భారతీయ బూర్జువా వర్గం కమ్యూనిస్టు మోహానికి వివశమైనట్లే కనిపించింది. సి.పి.ఐ. ప్రధాన కార్యదర్శి అజయ్‌ఘోష్ ఇలా అన్నాడు. "..... నేడు సామ్రాజ్యవాదం క్షీణించడం వల్ల, శక్తివంతమైన సోషలిస్టు ప్రపంచ ప్రత్యామ్నాయ సోషలిస్టు విపణులు ఉండడం చేత, అస్వతంత్రమైన ఆర్థిక విధానం కల దేశానికి కూడా, తన సర్వం సహాధికారాన్ని నిలుపుకుని, స్వతంత్ర రాజ్యంగా మనగలిగే అవకాశం కలిగింది.... గతంలో అటువంటి విషయాలు ఊహించడానికి కూడా వీలుండేది కాదు. కాని అవి నేడు జరుగుతున్న సత్యాలు."[17]

అటువంటి ఉన్మత్త వాతావరణంలో, నెహ్రూ ప్రభుత్వాన్ని, అందునా సోవియట్ రష్యా స్నేహితుడిని, సాయుధ విప్లవం ద్వారా 1951 ఎత్తుగడల రచనలో నిర్దేశించినట్టుగా కూలదోయడానికి పూనుకోవడమనేది భారతీయ కమ్యూనిస్టులకు సహజంగానే "ఊహించడానిక్కూడా వీల్లేని విషయమై పోయింది. కాని భారత కమ్యూనిస్టులకంటే భారతీయ పాలకవర్గమే ఒక ఆకు ఎక్కువ చదివింది. భారత ప్రభుత్వం సోవియట్, చైనా సైనిక దురాక్రమణల నుంచి కాక, భారతీయ సంఘం నుంచే కమ్యూనిస్టు ప్రమాదం రావచ్చని 50లలో గుర్తించింది. అందువల్ల అది సోషలిస్టు శక్తులతో యథేచ్ఛగా స్నేహాన్నీ సంపాదించింది. దేశంలోపల తలెత్తిన ఎటువంటి వీరోచిత కమ్యూనిస్టు ఉద్యమాన్నైనా అంత అలవోకగానూ అణచి వేయగలిగింది కూడా. అమెరికాతోనూ రష్యాతోనూ కూడా లాలూచీ పడగలిగే ఒక రకమైన ద్వంద్వస్నేహమే భారతీయ తటస్థవిధానంగా ఖ్యాతికెక్కింది. కమ్యూనిస్టు ప్రమాదం నుంచి ఇండియాని పరిరక్షించేందుకు అమెరికా సహాయం పొందింది. సోవియట్ సహాయమే భారతదేశాన్ని సామ్రాజ్యవాద కూటమిలోకి జేరిపోకుండా నిలబెడుతోందని సోవియట్ యూనియనుకు చెప్పింది. భారతీయ పాలక వర్గం నడిపిన నాటకమే దౌత్యపరంగా చెప్పాలంటే, అలీన విధానంగా కనపడుతుంది.

అమెరికాపై అప్పుడప్పుడు చూపే కోపతాపాలను వదిలేస్తే ఇండియా ప్రధానంగా అమెరికా సాయంపైనే ఆధారపడింది. అమెరికా పాకిస్తానుకు అందించే సైనిక సహాయం గురించి భారతదేశం పెంచుకున్న అపార్థాలను పోగుడుతూ ఐసెన్ హోవరు 1954, ఫిబ్రవరి 24వ తేదీన, "ఆర్థిక సాంకేతిక సహాయాన్ని కొనసాగిస్తామని" హామీ ఇస్తూ, "సంయుక్త భద్రతాచట్టం ద్వారా నిర్ణయించిన ఎటువంటి సైనిక సహాయం అవసరమయ్యే పరిస్థితులున్నాయని మీ ప్రభుత్వం అనుకున్నా, మీ అభ్యర్థన నా అత్యంత సానుభూతికరమైన శ్రద్ధను పొందుతుందని మీరు తప్పక భావించవచ్చు"ని ప్రకటించాడు.

నిజానికి అమెరికన్ పాలకవర్గం 1955 మేలో (తరువాత ఆర్థిక సంవత్సరాలలో అందేలా) 85 మిలియన్ల డాలర్ల సహాయాన్ని మన దేశానికి సిఫారసు చేసింది. 1955 ఆగస్టు 25వ తేదీన ఇండియాకు ఆసియాలోని మిగతా దేశాలకూ ఇతోధికంగా ఆర్థిక సహాయం చేయవలసిన అవసరాన్ని సమర్థిస్తూ ప్రెసిడెంటు ఐసెన్‌హోవరు అమెరికన్ కాంగ్రెసులో ఇలా అన్నాడు. "ఆసియాలోని స్వతంత్ర ప్రభుత్వాలకు దగ్గరున్న కమ్యూనిస్టు చైనా నుంచి ఎదురయ్యే రాజకీయ ఆర్థిక ప్రమాదాన్ని, ఆర్థికపరమైన సవాలునూ ఎదుర్కోవాలని మనం గుర్తించాలి. ఆ ప్రాంతంలో ప్రత్యేకమైన ఆర్థికాశయాలకై జరిగే పోటీలో వచ్చే సవాలు అది. "అజయ్ ఘోష్" సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకుని స్వతంత్రదేశంగా ప్రవర్తించే" భారతదేశపు సమర్థతకు ముచ్చటపడుతున్న సమయంలోనే పి.ఎల్.480 క్రింద అమెరికన్ వ్యవసాయ మిగులు పంటను జారీ చేసే మొట్టమొదటి ఒప్పందాలకు వాషింగ్‌టన్‌లోనూ న్యూఢిల్లీలోనూ కూడా సన్నాహాలు మొదలయ్యాయి. ఆ ఒప్పందం వల్ల ప్రభుత్వం తిండి గింజలకు బదులుగా దేశంలోని అమెరికన్ సంస్థలకు పరోక్షంగా సాయం చేయవలసి వచ్చింది. *

నిజానికి నెహ్రూ అమెరికాపై చూపిన వ్యతిరేకత చేవలేని నిరసన ఉత్తరాలు,

---

* *అమెరికన్ కాంగ్రెసు భారతదేశానికి ఆహార సరఫరాకై పి.ఎల్. 480 కింద మొదటి ఒప్పందాన్ని ఆమోదించింది. 1956 ఆగస్టులో సంతకాలు జరిగాయి. దాని ప్రకారం అమెరికాకు ఇండియా చెల్లింపులను రూపాయిలలోనే చేయాలి. ఆ చెల్లింపులో కొంతభాగం, రూ. 26 కోట్లు ప్రైవేటు రంగానికి పెట్టుబడిగా ఇవ్వాలనే నిబంధనతో, మన దేశానికి తిరిగి అప్పుగా ఇచ్చింది. ఒక సంవత్సరం తరువాత సెనేటర్ కూలీ (coolie) ప్రవేశపెట్టగా ఆమోదించిన ఒప్పందం ప్రకారం అమెరికన్ గోధుమ అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తంలో 25 శాతం, అమెరికన్ ప్రైవేటు కంపెనీలకు లేదా, అమెరికన్ సరుకులు అమ్మే ఇండియన్ కంపెనీలకు అప్పులుగా ఇవ్వాలి.*

ప్రమాదం లేని తీర్మానాలను మించలేదు. అమెరికా విదేశాంగ కార్యదర్శి జాన్ ఫాస్టర్ డల్లెస్ 1956 ఫిబ్రవరి 28వ తేదీన ఒక పత్రికా సమావేశంలో చెప్పినట్టు ఇండియా అమెరికాల మధ్య "పైపై కోపాలు" మాత్రమే ఉన్నాయి. అటువంటి పైపై కోపతాపాల పొరల కింద, భారత ఆర్థిక రంగంలోని కీలకరంగాలలో, సహాయం పెట్టుబడుల రూపంలో, అమెరికా పెత్తనం అనుమతించబడుతూనే ఉంది. మన దేశం 1951–54 సంవత్సరాల కాలంలో పొందిన మొత్తం విదేశీ సహాయంలో నాలుగింట మూడువంతులు అమెరికన్ సహాయమే![18] 1955 నాటికి అమెరికన్ ఆధిపత్యంలోని ప్రపంచ బ్యాంకు తదితర అంతర్జాతీయ సంస్థల నుంచి ఇండియా రూ.1.985 మిలియన్ల రుణాన్ని తీసుకుంది.[19] అదే కాలంలో 1948లో రూ.179.6 మిలియన్లున్న ఆర్థిక రంగంలోని అమెరికన్ ప్రైవేటు పెట్టుబడి 1955 నాటికి రూ. 476.4 మిలియన్లకు పెరిగింది.[20]

ఇన్ని ధోరణులు కనిపిస్తూన్నా, సి.పి.ఐ. మాత్రం భారతదేశపు విదేశ సంబంధాలలో స్వతంత్ర విధానపు ఛాయలనే కనుక్కొనేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. 1956 నాటి పాల్ఘాట్ కాంగ్రెసులో సమర్పించిన పార్టీ నివేదికలో "కొంత వరకు ఇంకా కొనసాగుతున్న ఊగిసలాటలు అవక తవకలు ఉన్నా, అది (భారతదేశ విదేశాంగ విధానం) ప్రధానంగా స్వతంత్ర విధానమే" అని పొంగిపోయారు.

ఈ లోగా పార్లమెంటరీ తత్వం, అహింసాయుత పద్ధతులలో బూర్జువా ప్రభుత్వాన్ని మార్చడం గురించి కూడా సోవియటు కమ్యూనిస్టు పార్టీ ఆమోదం వచ్చింది. 1956 ఫిబ్రవరిలో సి.పి.యస్.యు. 20వ కాంగ్రెసు (సమావేశం)లో సోషలిజంలోకి మార్పులు అంతర్యుద్ధం ద్వారా రానవసరం లేదనీ, పార్లమెంటరీ మెజారిటీ ద్వారా కమ్యూనిస్టులు అధికారంలోకి రావచ్చుననీ కృశ్చేవ్ ప్రకటించాడు. పరస్పర విరోధ కూటములుగా ప్రపంచం విడిపోయి, మొత్తం బూర్జువా వర్గం శత్రువుగా పరిగణించబడ్డ 1948–49 రోజుల నుంచి సి.పి.ఎస్.యు. చాలా దూరం ప్రయాణించిందని వెల్లడైంది. ఇటీవలే స్వతంత్రం పొందిన ఆసియా, ఆఫ్రికా దేశాలను ఆర్థిక సహాయం ద్వారా కొనుక్కోవచ్చు. అందుకు వాటిని 'ఆలీన' మిత్ర దేశాల (మూడవ) కూటమిగా పరిగణించవచ్చు.

మాస్కో సిఫారసు చేసిన ఈ కొత్త విధానానికి వంత పాడేందుకు సి.పి.ఐ. మానసికంగా ఏనాడో సిద్ధపడింది. సి.పి.ఐ. మిగతా సోషలిస్టు ప్రజాస్వామ్య శక్తులతో మిత్రత్వం నెరపి "దాని శక్తి కొద్దీ" భారతదేశంలో "శాంతియుత పద్ధతుల ద్వారా" సోషలిస్టు మార్పును పొందేందుకు కృషి చేస్తుందని పార్టీ ప్రధాన కార్యదర్శి అజయ్‌ఘోష్ 1956, ఆగష్టు 24వ తేదీన ఒక పత్రికా సమావేశంలో చెప్పాడు. నిజానికి కొంత

కాలంగా దేశం లోపల కూడా ప్రభుత్వాన్ని వ్యతిరేకించడంలో సి.పి.ఐ. తన స్థాయిని తగ్గిస్తూ వచ్చింది. నాటి కాలంలో సి.పి.ఐ. వారపత్రిక 'న్యూఏజ్' సంపాదకుడైన పి. రామ్మూర్తి ప్రధాని నెహ్రూను బలపరిచేందుకు "శాంతికి, స్వతంత్రానికి, జాతీయ వేదికను" ఏర్పరచాలనే నినాదాన్నిచ్చేంత వరకూ పోయాడు. "శాంతి శక్తుల సరసన ఉండి నెహ్రూ సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా ఎంత ఎక్కువ ఉంటే... అంత ఎక్కువ ఉత్సాహంగా లక్షలాది ప్రజల మద్దతు ఉంటుంది."[21]

పార్టీ మరో నాయకుడైన ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ ఈ వైఖరిని అధికారికంగా,[22] నిరసించినప్పటికీ, అదే నంబూద్రిపాద్ మరో సందర్భంలో, అదే కాలంలో, అటువంటి వర్గ సహకార ధోరణులనే వెలిబుచ్చాడు. రామ్మూర్తి అభిప్రాయాల్ని ఖండించిన వారంలోనే అంటే 1954 సెప్టెంబరు 13-19 తేదీల మధ్య సి.పి.ఐ. ఆధ్వర్యంలో మోగాలో జరిగిన అఖిల భారత కిసాన్ సభ 12వ సమావేశమే ఆ సందర్భం. మొదటి అధ్యాయంలో వివరించినట్టు, భూకమతాలపై గరిష్ట పరిమితిని నిర్ణయించడంలో ప్రభుత్వపు ఊగిసలాటలు ధనిక రైతులకు లాభించాయి. భూకమతాల గరిష్ట పరిమితులపై సమావేశం ముందున్న తీర్మానాన్ని వివరిస్తూ నంబూద్రిపాద్ ఇలా అన్నాడు ".... ఇక ధనిక రైతుల విషయానికి వద్దాం. ఈ తీర్మానంలో ధనిక రైతు ప్రయోజనాలు భంగపడకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నాం. సీలింగుల విషయంలో కోర్కెలను రూపొందించడంలో కొంత వైరుధ్యం ఉందనుకోండి. ఉద్యమంలో నుంచి ధనికరైతులను బయటకు పోకుండా చూస్తూ, బీదరైతు సమూహాన్ని వ్యవసాయ కార్మికులను ఏక కాలంలో జాగృతం చేసే అవసరాన్ని దృష్టిలో ఉంచుకుంటే ఆ వైరుధ్యాన్ని అధిగమించవచ్చు."[23] పెద్ద పెద్ద భూకమతాలకు యజమానులైన ధనిక రైతులకు తన పార్టీ ఇచ్చిన రక్షణతో బీదరైతుల వ్యవసాయ కార్మికుల కోర్కెలకు ఎలా పొత్తు కుదురుతుందో నంబూద్రిపాద్ వివరించలేదు.

50ల మధ్యకాలానికి సి.పి.ఐ. నాయకులలో వర్గ విధాల విషయమై పీచులా అల్లుకున్న మెత్తటి వైఖరి చోటు చేసుకుందని స్పష్టమౌతోంది. ఏభైలలో "బహుళ జన రైతాంగోద్యమంలోని స్తబ్దత" గురించి తరువాతి కాలపు సి.పి.ఎం. పత్రం ఒకటి పేర్కొంది. "పెరిగే బీదజనావళి, వ్యవసాయ కార్మికులపై కాకుండా నామమాత్రంగా నడపబడే కిసాన్ ఉద్యమం ప్రముఖంగా మధ్యమ ధనికరైతుల సేవకే నడుస్తోంది. మధ్యమ ధనిక రైతు వర్గాలకు కలుగజేసిన ఈ కొత్త అవకాశాల వల్ల గ్రామ ప్రాంతాలలో కమ్యూనిస్టు పార్టీ తీరుపై హెచ్చు ప్రభావాన్నే చూపింది. మధ్యమ ధనిక రైతుల వాసనలతో నున్న చాలా భాగం కార్యకర్తలు గ్రామ పార్టీ

కమిటీలలో (ప్రముఖ) నాయకత్వ స్థానాలలో చోటుచేసుకున్నారు."[24] పాలక పార్టీపైన, భూస్వామ్య వర్గంపైనా అవలంభించిన ఈ సామరస్య వైఖరి, పాలకపార్టీ అంతరంగిక విధానాల దృష్ట్యా కాని, దేశ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యాకాని అవసరపడలేదు. ప్రభుత్వ విధానాలు గ్రామీణ జన బాహుళ్యపు జీవన ప్రమాణాల్ని ఎలా అధ్వాన్నం చేశాయో, పారిశ్రామిక కార్యవర్గాన్ని ఎలా దెబ్బకొట్టాయో గత రెండు అధ్యాయాల్లోనూ చూశాం.

అయినా 1956 పాల్ఘాట్ సమావేశంలో పార్టీ స్పష్టంగా కుడివైపుకు మలుపు తిరిగింది. దాని నివేదికలో ఇలా వివరించింది. "ప్రజాస్వామ్య సంఘటనను నిర్మించే బృహత్ప్రయత్నంలో బూర్జువా వర్గంతో ఏకకాలంలో ఐక్యత–సంఘర్షణ (Unity & Struggle) విధానం అవసరమౌతుంది... ఈ ప్రజాస్వామ్య సంఘటన కాంగ్రెసు వ్యతిరేక సంఘటన అని ఒప్పుకోకూడదు... తనలో అనేక మంది భూస్వాములను ఇముడ్చుకున్న ఈ బూర్జువా వర్గపు రాజకీయ పార్టీలో ప్రజాస్వామ్యవాదులు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేకత, ప్రజాస్వామ్య సాంప్రదాయం, దానికి ఉన్నాయి."

పాల్ఘాట్ సమావేశపు తీర్మానాలు అనేక విషయాలలో పార్టీలోని రైటిస్టుల విజయాన్ని సూచించినా, కాంగ్రెసు పార్టీతో లాలూచీ విధానానికి నాందీ పలికినా, వామపక్షీయులు కూడా తమ అభిప్రాయాలు వెలిబుచ్చేందుకు తంటాలు పడ్డారు. తరువాతి కాలంలో సి.పి.ఐ. నుండి విడిపోయి సి.పి.ఎం.గా ఏర్పడనున్న పి. సుందరయ్య, బసవ పున్నయ్య, హనుమంతరావులు (అంతా ఆంధ్ర నుంచి వచ్చినవారే) పాల్ఘాట్ కాంగ్రెసులో భారత దేశం "అర్థవలస దాస్యభూయిష్ట" దేశంగానే ఉందనీ ప్రభుత్వం "బ్రిటిషు సామ్రాజ్యవాదంతో లాలూచీ పడుతోందనీ" ఒక నోట్‌ను దాఖలు చేశారు. వాళ్ల నోట్ సహజంగానే వీగిపోయింది.

జాతీయ సంఘటన రూపంలో కాంగ్రెసు మిత్రత్వాన్ని రైటిస్టులు వాంఛించారు. కాంగ్రెసు వ్యతిరేక ప్రజాస్వామిక సంఘటన ఏర్పడవలసిన అవసరాన్ని వామపక్షీయులు గుర్తించారు. 50ల చివరలోనూ 60ల ఆరంభంలోనూ 1962 నాటి చైనా – భారతీయ యుద్ధం వచ్చే వరకూ రైటిస్టులకూ వామపక్షీయులకూ ఈ ఘర్షణ కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వపు అంతరంగిక విధానాల అంచనాలపై తమలో తాము కొట్టుకుంటున్న భారత కమ్యూనిస్టుల అయోమయానికి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో తలెత్తిన విధం మరింత సాయం చేసింది. ప్రభుత్వపు ఆర్థిక చర్యలైన, జాతీయీకరణ, భారీ పరిశ్రమల నిర్మాణం బడా బూర్జువా గుత్తపెట్టుబడిదారీ ప్రయోజనాలను కాపాడుతున్నాయని వామపక్షీయులు భావించగా, రైటిస్టులు మాత్రం ఈ చర్యలు

దేశం యొక్క స్వతంత్ర ఆర్థిక పెరుగుదల (Economic Growth)ను బలపరుస్తాయనీ, సదరు చర్యలకు బాధ్యులైన పాలకవర్గపు "అభ్యుదయకర విభాగాన్ని" బలపరచాలనీ భావించారు.

వామపక్షీయులు కలకత్తాలోనూ, రైటిస్టులు బొంబాయిలోనూ సమావేశమయ్యారు. ఇది 1964లో జరిగింది. వామపక్షీయులు సి.పి.ఐ. (యం)గా పిలువబడుతూ, సి.పి.ఐ. పేరును రైటిస్టులు మిగుల్చుకున్నారు.

## సి.పి.ఐ. (ఎం)

సి.పి.ఐ. (యం) కలకత్తా సమావేశంలో ఆమోదించిన కార్యక్రమంలో భారత ప్రభుత్వము (Indian State) ఇలా వర్ణించింది. "బడా బూర్జువాల నాయకత్వంలో బూర్జువా భూస్వామ్య వర్గాల వర్గపాలనా సాధనం ఇది. (ఈ వర్గాలవారు) పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గాన్ని అనుసరించేందుకై ఇతోధికంగా విదేశీ రుణపెట్టుబడి (Foriegn Finance Capital)తో లాలూచీ పడుతున్నారు." సి.పి.ఐ. మాత్రం ప్రభుత్వము "భారతదేశ జాతీయార్థిక వ్యవస్థలో పెట్టుబడిదారీ ఉత్పత్తి, పంపిణీ, మారకపు సంబంధాలను పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించి అభివృద్ధి చేసే మొత్తం జాతీయ బూర్జువా వర్గపు" వర్గపాలనకు సాధనంగా అభివర్ణించింది. "జాతీయ బూర్జువా వర్గం భూస్వాములతో లాలూచీ పడుతూ ప్రభుత్వాల ఏర్పాటులోనూ మంత్రి వర్గాలలోనూ ప్రత్యేకించి రాష్ట్రస్థాయిలో వాళ్ళను చేర్చుకుంటూ, భూసంస్కరణ చర్యలను చట్టాలను ఆమోదించడం అమలు చెయ్యడాన్ని వాళ్లు నిరోధించేందుకు అనుమతిస్తూ..." భారత రాజ్యశక్తి సంచరిస్తోందని కూడా పేర్కొంది.

"కార్మిక వర్గ నాయకత్వంలో నిజమైన ఫ్యూడలు వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల సంకీర్ణత్వంపై ఆధారపడిన జన ప్రజాస్వామ్యాన్ని" ఏర్పాటు చేయాలని సి.పి.ఐ. (యం.) ఆశించింది. "గుత్త పెట్టుబడిదార్ల గుత్తాధిపత్యాన్ని విచ్ఛిన్నం చేసేందుకూ, అర్ధ ఫ్యూడలు శక్తులను ఓడించడంలోనూ, సామ్రాజ్యవాద ప్రయోజనాలను తుడిచిపెట్టడంలోనూ ఆసక్తి గల వర్గాలచే సంయుక్తంగా నిర్వర్తించే అధికారం" కల ప్రభుత్వం ద్వారా "పెట్టుబడేతర అభివృద్ధి మార్గపు దశను"* తీసుకువచ్చే జాతీయ ప్రజాస్వామ్య విప్లవాన్ని సి.పి.ఐ. ప్రతిపాదించింది. "ఈ వర్గ మిత్రమండలిలో బూర్జువా వర్గపు ఏకైక నాయకత్వం లేకపోయినా, ఇంకా కార్మికవర్గపు ఏకైక నాయకత్వం

* Non-Capitalist Stage of Development.

స్థాపించబడలేదు.”

తమ తమ ఆశయసాధనకై అనుసరించవలసిన ఎత్తుగడల విషయంలో సి.పి.ఐ. “శాంతియుత మార్గాలకే” అంకితమైంది. కాని” పాలకవర్గాలు తమ అధికారాలను ఐచ్ఛికంగా వదులుకోరనీ.... కాబట్టి విప్లవశక్తులు తమనీ తమ పనినీ దేశరాజకీయ జీవితంలో ఎదురయ్యే ఎటువంటి అవాంతరాలు తికమకలు, మలుపులనైనా ఎదుర్కొనేందుకు ఆయత్తం చేయడం అవసరమనీ” హెచ్చరించింది. సి.పి.ఎం. తన కార్యక్రమంలో ఆశయ సాధనకు “శాంతియుత మార్గాల ద్వారా” సాధించేందుకు ప్రయత్నిస్తామని చెప్పడం ద్వారా అదే ఎత్తుగడల మార్గాన్ని ప్రతిధ్వనించడం గమనార్హం. “దేశ రాజకీయ జీవితంలో ఎటువంటి తికమకలు, మలుపులను, అవాంతరాలను ఎదుర్కొనేల “విప్లవాత్మక శక్తులు తమ పనిని రూపొందించుకోవాలనీ, పాలక వర్గాలు తమ అధికారాన్ని ఐచ్ఛికంగా వదులుకోరనీ.... కాబట్టి విప్లవశక్తులు తమనీ తమ పనినీ దేశ రాజకీయ జీవితంలో ఎదురయ్యే ఎటువంటి అవాంతరాలు తికమకలు. మలుపులనైనా ఎదుర్కొనేందుకు ఆయత్తం చేయడం అవసరమనీ” హెచ్చరించింది. సి.పి.ఎం. తన కార్యక్రమంలో ఆశయ సాధనకు “శాంతియుత మార్గాల ద్వారా” సాధించేందుకు ప్రయత్నిస్తామని చెప్పడం ద్వారా అదే ఎత్తుగడల మార్గాన్ని ప్రతిధ్వనించడం గమనార్హం. “దేశరాజకీయ జీవితంలో ఎటువంటి తికమకలు, మలుపులను, అవాంతరాలను ఎదుర్కొనేలా” విప్లవాత్మక శక్తులు తమ పనిని రూపొందించు కోవాలనీ, పాలక వర్గాలు అధికారాన్ని ఐచ్ఛికంగా వదులుకోవడంలోని అనిష్టతను గురించి చెప్పడంలో సి.పి.ఎం.సి.పి.ఐ. హెచ్చరికను తూ॥చ తప్పకుండా అప్పచెప్పింది. సి.పి.ఎం. గంభీర వైఖరిలోంచి ఉమ్మడి పార్టీ యొక్క 1951 నాటి ఎత్తుగడల మార్గాన్ని నీరు కార్చడం కూడా చక్కగా కనపడుతోంది. తన అనుయాయుల్ని “అన్ని అవాంతరాలనూ ఎదుర్కొనేందుకు” సంసిద్ధం చెయ్యడంలో దాని వైఫల్యం పాలకపార్టీ 1971-72లో దానిపై జరిపిన దాడిలో తెలిసింది. దాని ద్వారా సి.పి.ఎం.కు శాంతియుత పార్లమెంటరీ విధానంలో గల పూర్తి నిబద్ధత కూడా బయటపడింది.

1964 సి.పి.ఎం. సమావేశ సమయంలో కూడా 1951 సిద్ధాంతానికి తిరిగి రావాలనే వీరోచిత ధోరణిని పార్టీనాయకత్వం నిరుత్సాహపరిచింది. 1964 కలకత్తా సమావేశపు పార్టీ కార్యక్రమపు ముసాయిదాకి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపార్టీ సమావేశం ఆమోదించిన సవరణ ప్రకారం, భారత ప్రభుత్వ విదేశాంగ విధానం నకిలీ అలీన విధానమనీ, అమెరికన్ సామ్రాజ్యవాదానికి తొత్తుగా దాని విదేశాంగ విధానం

వ్యవహరిస్తోందని పేర్కొంది. కాని కలకత్తా సమావేశంలో ఇది ఓడిపోయింది. వివిధ జాతులకు స్వయం నిర్ణయాధికారాన్ని కోరుతూ పార్టీ కార్యక్రమానికి మరో సవరణ ప్రతిపాదించబడింది. కాని సి.పి.ఎం. కేంద్రనాయకత్వం సదరు అంశాన్ని ప్రవేశపెట్టడం వాయిదా వెయ్యాలని సమావేశాన్ని కోరింది. మరెన్నో అటువంటి విప్లవాత్మక ధోరణి గల సవరణలను పశ్చిమ బెంగాలులో కొందరు ప్రతిపాదించారు. కాని అవి కూడా ఓడిపోయాయి. భారత ప్రభుత్వము 'నయా వలస'గా అభివర్ణించాలనీ పార్టీ సాయుధ పోరాట కార్యక్రమాన్నామోదించాలనే అవసరాన్ని ఈ ప్రతినిధులు వక్కాణించారని ప్రతీతి. తరువాతి రోజులలో సి.పి.ఐ. (మా.లె.) సిద్ధాంతకర్తగా కావలసిన సుశీతలరాయ్ చౌధరి ఆ ప్రతినిధులలో ఒకరు.

తన అనుచర వర్గంలో అణచిపెట్టిన తీవ్రవాదులతో సి.పి.ఎం. తన ప్రయాణాన్ని ప్రారంభించింది. 'రివిజనిస్టు సి.పి.ఐ.కి భిన్నంగా విప్లవాత్మక పార్టీగా దాన్ని రూపొందిస్తామనే వాగ్దానాలు కొంత కాలం పాటు అనుయాయుల్ని జోకొట్టాయి. సి.పి.ఎం. నిజంగానే విప్లవ నాయకత్వం వహిస్తుందని నమ్మినవాళ్లు కూడా. 1967 ఎన్నికల తరువాత పశ్చిమబెంగాలు, కేరళ ఐక్య సంఘటన ప్రభుత్వాలలో సి.పి.ఎం. జేరడంతో పార్టీపై అనుమానాలు పెంచుకోసాగారు.

వాళ్ళలో కొందరు తమ ఆశలకు పశ్చాత్తాప పడవలసి వచ్చింది. "డాంగే గ్రూపు రివిజనిస్టు విధానాలపై సిద్ధాంత పోరాటం ద్వారా మా పార్టీ పుట్టింది. మార్క్సిజం లెనినిజం ప్రాతిపదికగా అది పనిచేస్తుందని భావించాం. వ్యావసాయిక విప్లవం ద్వారా జనతా ప్రజాతంత్ర రాజ్యాన్ని స్థాపించడం తన ఆశయాలలో ఒకటిగా కలకత్తా కాంగ్రెసు ప్రకటించింది."[25] అంతేకాక భారత కమ్యూనిస్టులను చీల్చిన ముఖ్యాంశాలలో ఒకటి చైనా పట్ల వైఖరి. సి.పి.ఐ.లోని 1962 నాటి వామపక్షీయులను 1964 సి.పి.ఎం. ఏర్పడినాక చైనా గురించి, చైనా సోవియట్ సిద్ధాంత వివాదం గురించి, మూడవ ప్రపంచ యుద్ధం వచ్చే అవకాశం వంటి ప్రశ్నల గురించి, అలీన దేశాల పాత్ర జాతీయ విమోచనోద్యమాల భవిష్యత్తు గురించీ సోషలిజంలోకి మార్పు విషయంలో హింసాయుత, అహింసాయుత మార్పుల గురించీ తన అభిప్రాయాలను చెప్పేందుకు పార్టీ నాయకత్వం వెనుదీసింది.

సిద్ధాంతపరమైన విషయాలపై తమ తమ అభిప్రాయాల్ని నిర్మించుకునేందుకు వివిధ రాష్ట్ర శాఖలను సి.పి.ఎం. నాయకులు వాళ్ళ మానాన వాళ్ళను వదిలేశారు. సి.పి.ఎం. తరువాత అంగీకరించినట్టు" .... 1964 జూలైలో తెనాలి కన్వెన్షనులో మా కార్యక్రమ ముసాయిదా మూజువాణీ ఆమోదం పొందిన తరువాత 1967

ఆగస్టు దాకా మూడు సంవత్సరాల పాటు కమ్యూనిస్టు ఉద్యమంలో చర్చలో నున్న సిద్ధాంత విషయాలపై మా కేంద్ర కమిటీ అధికార వైఖరి.... చైనా కమ్యూనిస్టు పత్రాలపై పూర్తిగా ఆధారపడుతూ, వివిధ భాషలలో వెలువరించే పత్రికలలోనూ కరపత్రాలలోనూ వాటిని పునర్ముద్రిస్తూ నిర్వహించాం. బహుశ పశ్చిమ బెంగాలును మినహాయిస్తే, మరే ఇతర రాష్ట్ర శాఖలోనూ గత మూడు సంవత్సరాలలో ఈ విషయాల మీద అంత ఆసక్తి పట్టుదల, నమ్మకాలతో ఆంధ్రప్రదేశ్ శాఖలో జరిగినంత పని జరగలేదు. కాని అసమ్మతి ఆంధ్ర, పశ్చిమ బెంగాలులకే పరిమితం కాలేదు. అది మిగతా రాష్ట్ర శాఖలలో నిద్రాణంగా ఉండి, ప్రత్యామ్నాయ కార్యక్రమం దొరికిన వెనువెంటనే బయటకు వచ్చేందుకు పొంచి చూస్తోంది.

## చారుమజుందారు సిద్ధాంతాలు

ఈ అసమ్మతి వర్గపు అభిప్రాయాలకు క్రమబద్ధమైన సైద్ధాంతిక రూపాన్నిచ్చేందుకు 1960ల ప్రారంభం నుంచీ చారుమజుందారు సిలిగురి సబ్ డివిజన్‌లో గల తన స్వగ్రామంలో ఉండి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. 1965 నాటికి ఈ అభిప్రాయాలకు ఒక రూపకల్పన ఏర్పడి దాదాపు ప్రత్యామ్నాయ కార్యక్రమం తయారైంది. ఉత్తర బెంగాలు గ్రామాలలో బీదవారిలోనూ భూమిలేని రైతాంగంలోనూ అప్పటికే అతని అనుయాయులు అతని భావాలను ప్రచారం చేస్తూ పోరాటాలను నిర్వహిస్తున్నారు.

చారుమజుందారు 1965–1967 మధ్యకాలంలో రాసిన ఎనిమిది ముఖ్య వ్యాసాలలో ఆ కాలంలో అతని భావాలను పొందుపరిచాడు. 'మన ప్రియతమ నాయకుడు, అమరవీరుడు, కామ్రేడ్ చారుమజుందారు రాసిన చరిత్రాత్మకమైన ఎనిమిది రివిజనిస్టు వ్యతిరేక వ్యాసాలు'గా వాటిని సి.పి.ఐ. (మా.లె.) చిన్న పుస్తక రూపంలో ప్రచురించింది. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ యొక్క ఉత్తర బెంగాలు బీహారు సరిహద్దు ప్రాంతీయకమిటీ వెలువరించిన బెంగాలీ ప్రచురణ 'నక్సల్బరీ శిక్షా' (నక్సల్బరీ గుణపాఠాలు)లో ఆరంభ దశలోని అతని అభిప్రాయాలు సూచనగా కనిపిస్తాయి. దాంట్లో నక్సల్బరీ తిరుగుబాటు వర్ణన, చారుమజుందారు సంభాషణలు, ఉపన్యాసాలు కూడా ఉన్నాయి.

ఇవన్నీ చదివిన మీదట 1963 ప్రాంతంలోనే, సి.పి.ఐ. (మా) పార్టీ ఏర్పడక పూర్వమే, అవిభక్త సి.పి.ఐ.లోని అసంతృప్తి వర్గాలు డాంగే సిద్ధాంతాలపై రాద్ధాంతాలు జరుపుతున్న కాలంలోనే, అసలు సమస్య గురించి చారుమజుందారు ఉత్తర బెంగాలులోని తన అనుయాయులకిలా చెప్పాడని తెలుస్తుంది. "రైతు, విప్లవాత్మక

ఆచరణ ద్వారా దాన్ని ఆరభించకుండా రివిజనిజంపై నిజమైన దాడి ప్రారంభం కాదు." రాజకీయాల్ని రైతాంగంలోకి తీసుకుపోవలసిన అవసరాన్ని నొక్కి చెపుతూ "విప్లవాత్మక పార్టీని నిర్మించే కార్యక్రమాన్ని చేతిలోకి"[27] తీసుకోవాలన్నాడు. ప్రస్తుత పార్టీ నుంచి బయటకు వచ్చి ఒక కొత్త పార్టీని ఏర్పరచాలనే అభిప్రాయం సూత్రప్రాయంగా అప్పటికే తలెత్తింది. అతని ఆలోచనలు రైతాంగాన్ని చాలక శక్తిగా గుర్తించాయి. సి.పి.ఎం. పుట్టుక తరువాత కూడా చారుమజుందారు పార్టీ నాయకత్వపు ప్రవర్తనలో "రివిజనిస్టు ధోరణులను" ప్రతిఘటించాలని తన అనుయాయుల్ని కోరాడు. ఈ రివిజినిస్టు ధోరణులు ఏమిటి? "అధికారాన్ని పట్టుకోవడం" అనే ప్రధాన రాజకీయాశయాన్ని మరచిపోయి, రైతు సంఘాలలోనూ, కార్మిక సంఘాలలోనూ కొన్ని ఆర్థిక కోర్కెలకు పనిచెయ్యడమే పార్టీ కార్యక్రమంగా భావించడం రివిజనిజం యొక్క ప్రథమ అవతారంగా భావించాడు.(2)

కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, బహిరంగ చట్టబద్ధమైన పోరాటాల విషయమై ఈ కాలంలో చారుమజుందారు వైఖరిని వివరిస్తూ ఇక్కడ కొన్ని మాటలు చెప్పాలి. ఎందుకంటే, తరువాతి దశలో సి.పి.ఐ.(మా.లె.) నాయకుల మధ్య దీన్ని గురించి చాలా కీలకమైన అభిప్రాయ భేదాలు వచ్చాయి.

పాలకవర్గపు "విప్లవ ప్రతీఘాత హింస"ను ఎదుర్కొనేందుకు ఆయుధ సేకరణ రహస్య సంస్థల స్థాపనల అవసరం గురించి ఎనిమిది వ్యాసాలలోనూ నొక్కి చెప్పాడు. కార్మిక సంఘం, రైతు సంఘం (కిసాన్ సభ) ఉద్యమాలు ఈ విప్లవాత్మక కాలంలో ప్రస్తుత దశలో ప్రముఖమైన ఉపశక్తి (Auxilliary force)గా ఉండలేవు" అని స్పష్టం చేసాడు. "దీన్నించి కార్మిక సంఘాలు లేదా రైతు సంఘాల కాలం చెల్లిపోయినదనే నిర్ణయానికి రావడం సరియైనది కాదు. ఎందుకంటే మార్క్సిస్టు-లెనినిస్టు కార్యకర్తలకూ, కార్మిక వర్గానికీ, రైతు జన బాహుళ్యానికీ మధ్య ఐక్యతను నిర్మించేందుకు ప్రధానంగా ఉద్దేశించబడిన సంస్థలివే. విప్లవాత్మక పోరాట ఉద్యమపు ఎత్తుగడలు కార్మికవర్గంలోకి రైతాంగ జనావళిలోకి చొప్పించడం ద్వారా (జరిగే) విప్లవాత్మక పార్టీ నిర్మాణంలో మార్క్సిస్టు లెనినిస్టు ఔత్సాహికులు ముందంజ వేయడంతో ఈ ఐక్యత స్థిరమౌతుంది." అనే విషయాలను తన ఎనిమిది పత్రాల ద్వారా తెలిపాడు.

గ్రామ ప్రాంతాలలో రైతు సంఘాల ప్రజా ఉద్యమాల పాత్ర గురించి చర్చిస్తూ అదే విషయాన్ని మరింత సూటిగా చెప్పాడు. పార్టీ ఔత్సాహికులకిలా గుర్తు చేస్తూ, ".... రైతాంగం యొక్క మౌలిక కోర్కెలపై జరిగే ఏ ఉద్యమమైనా ఎన్నడూ శాంతియుత

పంథాల్లో జరగదు... ఈ ప్రగతి నిరోధక ప్రభుత్వపు ఏ ఒక్క న్యాయసూత్రంతోటీ వాళ్ళ మౌలిక సమస్యలు పరిష్కరింపబడవని (బీదజనుల, భూమిలేని రైతుల నాయకత్వాన్ని ఏర్పాటు చేసేందుకు) రైతాంగానికి స్పష్టంగా చెప్పాలి." కాని "... మనం ఎటువంటి చట్టబద్ధ పోరాటాన్ని అనువు చేసుకోమని దీని అర్థం కాదు. చట్టం నిర్ధేశించిన లాభాల్ని పొందేందుకు, చట్టం ఆశించిన మార్పుల్ని తెచ్చే ఉద్యమాల్ని నిర్వహించడమే, బహిరంగ రైతు సంఘాల కార్యక్రమం." "పార్టీ గ్రూపులను ఏర్పర్చడం, వ్యావసాయిక విప్లవ కార్యక్రమాలను వివరించడం, ప్రాంతీయ ప్రాతిపదికపై అధికారాన్ని పట్టుకోవడమనే వ్యూహాన్ని వివరించడం."(4) పార్టీ ఔత్సాహికులు రైతాంగంలో చేపట్టవలసిన కార్యక్రమం.

ఆ కాలంలో చాలా మంది లేవదీసిన ఈ ప్రత్యేక వివాదాన్ని మరింత వివరంగా చారుమజుందారు ఎనిమిదవ పత్రంలో చూడవచ్చు. "ఈ కాలంలో పాక్షిక సమస్యలు ప్రాతిపదికగా ప్రజా ఉద్యమాలు నిర్వహించే అవసరం రైతులకు లేదా?" అతని జవాబు. "అటువంటి అవసరం తప్పక ఉంది. ఇకముందు ఉంటుంది కూడా" దానికి గల కారణాన్నిలా వివరించాడు. ఇండియా విశాలదేశం. రైతులు అనేక తరగతులుగా ఉన్నారు. అందువల్ల అన్ని తరగతులలోనూ, అన్ని ప్రాంతాలలోనూ రాజకీయ చైతన్య ప్రమాణం ఒకే స్థాయిలో ఉండదు. అందువల్ల పాక్షిక కోర్కెల ప్రాతిపదికపై రైతుజన సంఘోద్యమాల అవకాశం, సంభవం ఎప్పుడూ ఉంటుంది. కమ్యూనిస్టులు ఎప్పుడూ అటువంటి అవకాశాల్ని పూర్తిగా వినియోగించుకోవాలి." అటువంటి ప్రజా ఉద్యమాల నిర్వహణలో రివిజనిస్టు పద్ధతికీ విప్లవ పద్ధతికీ తేడాను చెప్పేందుకు ఇలా ప్రశ్నించాడు. "పాక్షిక కోర్కెలపై నడిచే ఆ ఉద్యమాల్ని మనం ఎటువంటి ఎత్తుగడలతో నడపాలి, వాటి ఆశయమేమిటి?" ఇలా వివరించాడు. "రైతాంగంలోని బహుళ జనభాను సమీకరించేలా చూడడం మన ఎత్తుగడలలోని ప్రధాన విషయం. రైతాంగంలోని వర్గ చైతన్యపు స్థాయిని పెంపొందించేలా చూడడం మన ముఖ్యాశయం. సువిస్తారమైన సాయుధ సంఘర్షణ దశలో వాళ్ళు పురోగమించేలా చూడాలి" దీన్ని మళ్లీ వక్కాణిస్తూ "ఆర్థిక కోర్కెలపై (జరిగే) ఉద్యమాలెన్నడూ తప్పుకాదు." కాని "ఈ ఉద్యమాలను ఆర్థిక వాదపు ధోరణిలో నడపడం నేరం" అని హెచ్చరించాడు. "ఈ ఆర్థిక కోర్కెలపై (జరిగే) ఉద్యమాలు వాటంతటవే రాజకీయ సంఘర్షణలుగా రూపొందుతాయని ప్రచారం చెయ్యడం కూడా నేరమే" అని కూడా చెప్పాడు. "ఎందుకంటే అలా చెప్పడం యాదృచ్ఛికతను ఆరాధించడమే" అటువంటి ఉద్యమాలను రాజకీయ ఘర్షణలుగా మార్చే విప్లవపార్టీ యొక్క చైతన్యవంతమైన

పాత్రను పేర్కొంటూ "సంఘర్షణలో ఒక దశలో కర్తవ్యం ఇది ఒకటే. ఇది చెయ్యకపోతే ఆ సంఘర్షణ మరింత ఉన్నత దశకు చేరుకోదు. ఈనాడు సాయుధ పోరాట రాజకీయాలు తుపాకీల సేకరణలే ఆ ప్రముఖ కర్తవ్యం."(8)

చారుమజుందారు "అధికారం పట్టుకోవడం" అనే పదం విషయంలో రివిజనిస్టు అభిప్రాయాన్నుంచి విభేధించాడు. ఆర్థిక ఉద్యమాలను క్రమంగా విస్తరింపజేసి కేంద్రంలో అధికారం పట్టుకోవచ్చుననేది రివిజనిస్టుల అభిప్రాయంగా చారుమజుందారు పరిగణించాడు. దానికి ప్రతిగా "ప్రాంతీయ ప్రాతిపదికపై అధికారాన్ని చేపట్టడం" యొక్క అవసరాన్ని నొక్కి చెప్తూ ఈ సందర్భంలో ప్రపంచ విప్లవోద్యమాలలోని పూర్వ సంఘటనలను ఉదహరించాడు.(2) (8)

రష్యాలోని 1905లో విప్లవ కాలంలో లెనిన్ రాతల గురించి పార్టీ అనుయాయులకు గుర్తు చేసాడు.* మావోనాయకత్వంలో నడిచిన, అంచెల వారీగా దేశాన్ని విముక్తి చేసిన చైనా విప్లవ పంథాను వారి దృష్టికి తెచ్చాడు.**

సంవత్సరాల పాటు తిరుగుబాటుదార్ల ఆధీనంలో విముక్తి ప్రాంతాలుండడం గురించి కూడా చెప్పాడు. బీదజనం భూమిలేని రైతులు గ్రామ ప్రాంతాలలో ప్రాంతీయ ప్రాతిపదికపై అధికారం పట్టుకోవడం జరగాలి. ఈ ప్రాంతాలు క్రమంగా విస్తరిస్తూ

---

* *".... ఒకే పట్టణానికి పరిమితమై, అనేక నగరాలకు వ్యాపించనంత మాత్రాన ప్రభుత్వం, ప్రభుత్వం కాకపోదు ఒకే జిల్లాలో మాట అటుంచి, ఒక నగరంలో 'అధికారాన్ని పట్టుకోగానే' జైళ్ళను, పోలీసుల్ని, ప్రజా ప్రతినిధుల్ని ఏం చెయ్యాలనే సమస్యలు రావా? .... మనకు తగినన్ని బలాలు లేనప్పుడు, తిరుగుబాటు పూర్తిగా విజయం కానప్పుడు, విజయం అనిశ్చితమైనప్పుడు. వేరు వేరు ప్రాంతాలలో కాని, వేరు వేరు పట్టణాలలో కాని సాధారణ విప్లవ ప్రభుత్వాల స్థాపన జరగవచ్చు" – వి.ఐ. లెనిన్ 'ప్రజాస్వామిక విప్లవంలో సోషల్ ప్రజాస్వామ్యపు రెండు ఎత్తుగడలు' ఆగస్టు 1905 (Selected Works, Vol 1. 391వ పేజీ)*

** *పోరాటాలలో ఒకదాని తర్వాత ఒకటే జరిగి శత్రుబలాలను ఒకదాని తర్వాత ఒకటిగానే యుద్ధంలో నాశనం చెయ్యగలం. ఒకదాని తర్వాత ఒకటే కర్మాగారాలను నిర్మించగలం. ఒక పొలం తరవాత మరో పొలాన్ని రైతులు దున్నుతారు. భోం చెయ్యడం సులువు అని మనకు వ్యూహాత్మకంగా తెలుసు. దాన్ని పూర్తి చెయ్యగలమనీ తెలుసు. కాని నిజానికి మనం ఒక ముద్ద తరువాత మరో ముద్ద తింటాం. ఒక్క గుక్కలో మొత్తం భోజనాన్ని మింగలేం. దీన్నే 'సావధాన భోజన పరిష్కారం' (Piece-Meal Solution) అంటారు. మావో సేటుంగ్ కమ్యూనిస్టు కార్మిక పక్షాల మాస్కో సమావేశంలో ఉపన్యాసం నవంబరు 18, 1957 (From Chairman Mao-Tse-Tung Peking Edition 1967. పే. 80)*

పట్టణాలను చుట్టుముట్టాలి. భారతదేశంలో జన ప్రజాతంత్ర విప్లవ విజయానికి అదొక్కటే మార్గం.(8)

చైనాపట్ల సి.పి.ఎం. కేంద్రకమిటీ వైఖరి, చారుమజుందారు రివిజనిస్టు విరోధ దాడిలో రెండవ అంశం. 1986 జూన్‌లో సి.పి.ఎం. పార్టీ ప్రారంభించిన తరువాత తెనాలిలో జరిగిన మొట్టమొదటి కేంద్ర కమిటీ సంపూర్ణ సమావేశంలో భారత ప్రభుత్వం దాని విధానాల స్వరూప స్వభావాలను గురించి చైనా అంచనాలతో తమ విభేదాన్ని పార్టీ నాయకత్వం తెలిపింది. కేంద్ర కమిటీ చైనా పేరు పెట్టి చెప్పకుండా, పార్టీ కాంగ్రెసు తరువాత, గత 18 మాసాలలోనూ, "భారతదేశ పరిస్థితి గురించి వివిధ దేశాల మిత్ర కమ్యూనిస్టు పార్టీలు విభిన్నాభిప్రాయాలను వెలిబుచ్చాయి", అని పేర్కొంది. భారతదేశ పరిస్థితిని గురించి కేంద్రకమిటీ దృక్పథాన్ని సరియైనదిగా భావించింది. ఒకవేళ పార్టీ పత్రికలలో ప్రచురించిన వివిధ రష్యన్ వ్యతిరేక, చైనా అనుకూల వ్యాసాల వలన దురభిప్రాయాలేమైనా కలిగితే వాటిని పోగొట్టేందుకు. "సోషలిస్టు విధానంలో నమ్మకాన్ని వమ్ము చేసి అప్రతిష్టపాల్జేసేటటువంటి సమాచారాన్ని సాధ్యమైనంత వరకు ప్రకటించడం తప్పించుకునేలా జాగ్రత్తలు తీసుకోవాల"ని కేంద్ర కమిటీ హెచ్చరించింది.

నక్సల్బరీ సంఘటనల తరువాతి సంవత్సరంలో సి.పి.ఎం. మరింత నిశితమైన చైనా వ్యతిరేకవైఖరితో బయటపడింది. చారుమజుందారు, పార్టీ నాయకత్వం దిగజారడాన్ని అంతకుముందే పసికట్టాడు. సోవియట్ నాయకత్వం అమెరికన్ సామ్రాజ్యవాదంతో లాలూచీపడి రివిజనిజానికి లోనై పోయినందువల్ల విప్లవాన్ని నడిపే హక్కును కోల్పోయిందని భావించాడు. చైనా కమ్యూనిస్టు పార్టీ, దాని నాయకుడైన మావోసేటుంగు, ప్రస్తుతం ప్రపంచ విప్లవనాయకులు కాబట్టి, "భారతీయ పార్టీ నాయకత్వం చైనా పార్టీని వ్యతిరేకించడం వల్ల, మార్క్సిజం లెనినిజాన్ని, విప్లవ పంథాను కోల్పోయింది." "రివిజనిజంపై జరిపేదాడిలో ఈ పార్టీ నాయకులు మన కామ్రేడ్లు ఎంత మాత్రం కాదు సరికదా, మన సహాయకులు కూడా కారు."(6) అని హెచ్చరించాడు.

ఇతర రివిజనిస్టు ధోరణులు పొడసూపుతున్నాయనేందుకు ఉదాహరణగా జరగబోయే ఎన్నికల తరువాత కాంగ్రెసేతర ప్రభుత్వాలను నిర్మించాలనే సి.పి.ఎం. చేసిన వక్కాణింపును ఎత్తిచూపాడు. ఆ విధంగా ప్రజా బాహుళ్యం రాజ్యాంగ వాదపు అపోహలో కొనసాగించే ప్రభుత్వపు కుట్రకు తను లొంగిపోయి, అతివాద నినాదాలిచ్చే అలవాటుతో నిరాయుధులైన ప్రజలను ప్రభుత్వ దమనకాండకు బలిచేయడం, అప్పుడు

కూడా “విప్లవాత్మక ప్రతిఘటన” గురించిన ఎటువంటి ప్రస్తావనైనా “సాయుధ పోరాట దుందుడుకు విధానమని” చులకన చేయడం, ఇవన్నీ కూడా రివిజనిస్టు ధోరణులుగా భావించాడు. “ప్రస్తుత పార్టీ వ్యవస్థను దాని ప్రజాస్వామ్య చట్రాన్నీ నాశనం చేయడం ద్వారానే విప్లవపార్టీ ఏర్పడగలదని” చెప్పడం ద్వారా చీలికకు పచ్చదీపం చూపాడు.(6) కొత్త పార్టీ మాత్రం, మూడేళ్ల తరువాత పుట్టింది.

ప్రథమ దశలో సాయుధ నిరోధం, తరువాత దశలో సాయుధ దాడికి మారాలని ఎత్తుగడల విషయంలో తన అనుయాయులకు చెప్పాడు. శాంతియుత ప్రజా ఉద్యమం గురించి కలలు కనే సి.పి.ఎం. రివిజనిస్టు నాయకత్వాన్ని దుయ్యబట్టాడు. “శాంతియుత ప్రజా ఉద్యమాల్ని నేటి శకంలో నిర్వహించలేం. ఎందుకంటే పాలకవర్గాలు మనకు అటువంటి అవకాశాన్నివ్వవు. ప్రస్తుతం ఇవ్వడం లేదు.”(5) అని హెచ్చరించాడు. పోలీసు దమనకాండ నెదుర్కొంటూ, హింసాత్మక రూపాలు పొందిన అనేక సంఘర్షణలను గురించి చెపుతూ, “సామాన్య ప్రజలు తమంత తాముగా ఈ ఘర్షణలను మొదలు పెట్టారు. ఉద్దేశపూర్వకంగా ఈ సాయధ సంఘర్షణలను ఒక ప్రజా పునాదిపైన స్థిరం చేయడం మన రాజకీయాల ఆశయంగా ఉంటుంది.”(7) అన్నాడు. కార్యక్రమాన్ని స్పష్టంగా నిర్దేశించాడు. బీదజనులు భూమిలేని జనులు వ్యావసాయిక సంఘర్షణలకు నాయకులుగా ఉంటారు. ప్రతీ గ్రామంలోనూ సాయుధ దళాలను నిర్మించాలి. వర్గ శత్రువుల నుంచీ పోలీసుల నుంచీ ఆయుధాలను చేజిక్కించుకోడం ద్వారా వాళ్లు ఆయుధాలను సమీకరించాలి. పంటలను పట్టుకొని జాగ్రత్తగా దాచే ఏర్పాటు చేయాలి. సాయుధ పోరాట రాజకీయాల్ని నిరంతరం ప్రచారం చేయాలి.(5)

నగరాలలో ప్రజా ఉద్యమాల గురించిలా చెప్పాడు. ప్రభుత్వ భవనాలనూ, రవాణా వాహనాలనూ నాశనం చెయ్యడంలో వ్యర్థమైపోతున్న కోపోద్రిక్త ప్రజల గుడ్డి కోపాన్ని చండశాసనులైన ప్రభుత్వ కిరాయిదార్ల పైనా, కంటకులైన వర్గ శత్రువులపైనా చక్కగా ఆలోచించి పన్నిన దాడులుగా మార్చాలి. విప్లవకారులు ప్రజలకిలా చెప్పాలి. “కంటకులైన ప్రభుత్వాధికార్లను సైనికాధికార్లను ఎదిరించండి. దమనకాండకు కారణం పోలీసు స్టేషన్లు కాదు. వాటి అధికార్లు, రవాణా సాధనాలు ప్రభుత్వ కార్యాలయాలు దాడి జరపడం లేదు. ధనభూయిష్టమైన ప్రభుత్వ యంత్రాంగం దాడి జరుపుతుంది. ఆ మనుషులపై మన దాడులు జరపాలని ప్రజలకు బోధించాలి. ఏదో నామమాత్రం వాళ్లు దాడి జరపడం కాక, దాడి జరిపిన మనిషిని వాళ్ళు అంతం చెయ్యాలి. వాళ్ళు దాడిని ఊరికే చేస్తే దమన యంత్రాంగం ప్రతీకారం తలపెడుతుంది. వాళ్ళను కనక

చంపేస్తే ప్రభుత్వ యంత్రాంగంలో అందరూ భయభ్రాంతులౌతారు."(5) ఈ వాక్యాలు ఎర్రభీభత్సం గురించి సమర్థిస్తూ ట్రాట్స్కీ "అది వ్యక్తులను చంపుతుంది. వేలాది మందిని భయభ్రాంతుల్ని చేస్తుంది."[28] అన్న మాటలను గుర్తుకు తెస్తాయి.

సి.పి.యం. నాయకుల రివిజనిస్టు రాజకీయాలతో విసుగెత్తిన అనేక అసమ్మతి వర్గాల గ్రూపులు 1965 ప్రాంతంలో చారుమజుందారు అనుయాయులతో సంబంధం పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. చారుమజుందారు ఈ గ్రూపులతో ఐక్యతను స్థాపించుకునేందుకు ప్రాతిపదికగా కనీసపు అంగీకారం కుదరవలసిన అంశాలను నిర్దేశించాడు. ఒకటి : మావో సేటుంగుని ప్రపంచ విప్లవ నాయకునిగానూ, ప్రస్తుత శకంలో అతని ఆలోచనల్ని మార్క్సిజం – లెనినిజంగానూ ఒప్పుకోవాలి. రెండవది : ఇండియాలో అన్ని మూలాల విప్లవ పరిస్థితులు నెలకొని ఉన్నాయనే అభిప్రాయాన్ని నమ్మాలి. మూడవది : భారత విప్లవాన్ని ముందుకు తీసుకు పోయేందుకు ప్రాంతీయ ప్రాతిపదికపై అధికారాన్ని పట్టుకోవడమనే మార్గాన్ని అనుసరించాలి. నాలుగు: ఈ విప్లవపు అభివృద్ధి పురోగమనాలు గెరిల్లా యుద్ధ పద్ధతి ద్వారానే సాధ్యమౌతాయని నమ్మాలి.[29]

దీన్ని బట్టి 1967లో వచ్చిన నక్సల్బరీ పోరాటం యాంత్రికంగా వచ్చిన పోరాటపు వెల్లువ కాదని తెలుస్తుంది. సంవత్సరాల తరబడి సాగిన సిద్ధాంత పరమైన, వ్యూహపరమైన, సన్నాహాలు దాని వెనకాల ఉన్నాయి. సి.పి.ఐ. చెప్పినట్టుగా, అదేదో మామూలు వ్యావసాయిక సంఘర్షణగా మొదలై తరువాత "దాని జెండా చుట్టూ చేరిన గ్రూపు యొక్క ఊహలలోనే మార్పు చెందిన" విషయంగా చెప్పడం అసంబద్ధతకు పరాకాష్ట.[30] 1965–67 కాలంలో చారుమజుందారు సిద్ధాంతాల వృద్ధి తీరును పరిశీలిస్తే సి.పి.ఎం. నాయకులు చెప్పినట్టుగా, పశ్చిమ బెంగాలు రాష్ట్రకమిటీకి, డార్జిలింగ్ జిల్లా కమిటీకి మధ్య వచ్చిన "ముఠా ఘర్షణ"గా చెప్పే రెండో అభిప్రాయం కూడా నిజాయితీ లేనిదే అవుతుంది. 1966లో నక్సల్బరీలో అప్పటికింకా సి.పి.ఎం. సభ్యులుగా కొనసాగుతున్న కమ్యూనిస్టు విప్లవకారుల నాయకత్వంలో మొదలైన ఉద్యమ కార్యక్రమాంశాలలో "సాయుధ పోరాటం ద్వారా రాజ్యాధికారాన్ని పట్టుకోవడం" అప్పటికే ఉందని తెలుస్తుంది.

జూన్ 28, 1967న పెకింగ్ రేడియో తన ప్రసారంలో ఇలా చెప్పింది. "భారత కమ్యూనిస్టు పార్టీ యొక్క విప్లవకారులు సిలిగురి సబ్ డివిజన్‌లో సాయుధ పోరాటం ద్వారా అధికారాన్ని పట్టుకోవడాన్ని కోరుతున్నారు. వాళ్ళు ఆ నినాదాన్ని 1965లోనే లేవదీసి రైతులను సాయుధుల్ని చేసి గ్రామ ప్రాంతాలలో స్థావరాలను ఏర్పాటు చేసి

వాళ్ళను సన్నద్ధం చేశారు. సిలిగురి సబ్‌డివిజన్‌లోని పార్టీ కార్యకర్తలు తరువాతిలా చెప్పారు. "1965 నుంచీ నక్సల్బరీలో చిన్న ఉద్యమాల ద్వారా గౌరవ ప్రదమైన మా నాయకుడి (అంటే చారుమజుందారు) సలహాను అనుసరిస్తూ దాని ప్రకారం పనిచేస్తూ రైతు సంఘర్షణలను నిర్వహిస్తూ మా లోటుపాట్లను సరిదిద్దుకున్నాం. అందువల్లనే 1967లో పెద్ద పెట్టున రైతాంగ ఆందోళనను లేవదీశాం."[31]

ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని రూపొందించి అమలు పరిచే ప్రయత్నంలో చారుమజుందారు సి.పి.ఎం. నాయకుల అనుగ్రహాన్ని కోల్పోయాడు. నక్సల్బరీ తిరుగుబాటు యొక్క ముఖ్య నిర్వాహకులలో ఒకరైన కానుసన్యాలు తరువాతిలా చెప్పాడు. "మా ప్రియతమ నాయకుడు చారుమజుందారు 1965లో సుందరయ్య, రణదివే, నంబూద్రిపాదు, ప్రమోద్, జ్యోతీ అండ్ కంపెనీ నయా రివిజనిస్టు ముఠాపై తిరగబడి సి.పి.ఎం.లోని విప్లవ కారులను రైతు సాయుధ సంఘర్షణలను నిర్మించమని పిలుపునివ్వగానే అతనిని అతిహేయమైన తిట్లకు అపవాదులకు గురిచేశారు. అతణ్ణి పిచ్చివాడని మానసికంగా రోగ పీడితుడనీ, పోలీస్ ఏజంటనీ పిచ్చి కోపంతో ప్రమోద్‌బాబు, హరే కృష్ణబాబు వాగారు. పార్టీ లోపల ఫాసిస్టు వాతావరణం సృష్టించి చారుమజుందారు ఏం రాశాడో కామ్రేడ్లను చదవనీయకుండా, చారుబాబును కలుసుకోనీకుండా అడ్డగించారు."[32] సి.పి.ఎం. నాయకుల ప్రయత్నాలన్నీ వ్యర్థమయ్యాయని కానుసన్యాలు అన్నాడు. "చారుమజుందారు పిలుపు భారత దేశమంతటా కలకలాన్ని సృష్టించింది. చారుమజుందారు విశ్లేషణ డార్జిలింగ్ జిల్లా విప్లవకారుల్ని ఉత్తేజపరిచింది."*

1967 సార్వత్రిక ఎన్నికల తరువాత సి.పి.ఎం. అనుచరులలో అసమ్మతివర్గపు చప్పుళ్ళు, ప్రేలుడు ధ్వనులయ్యాయి. గతంలో చేసిన వాగ్దానానికి భిన్నంగా, నానాసంకీర్ణ ప్రభుత్వాల్ని ప్రజాఘర్షణలకు సాధనాలుగా వాడకుండా తమ నాయకులు కూడా మిగతా రివిజనిస్టు పార్లమెంటరీ నాయకుల లాగే ప్రవర్తించడం పట్ల వాళ్ళు నిరాశచెంది, సహజంగానే భారత దేశపు ఈశాన్య భాగంలోని సంఘటనలవైపు ఆశగా మొగ్గారు. తుఫానును కొనితెచ్చే మొదటి 'వసంత మేఘ గర్జన' అది.

---

* *కొన్ని సంవత్సరాల తరవాత చారుమజుందారుతో తన సంబంధాలను గురించి కానుసన్యాలు దీనికి పూర్తి వ్యతిరేక కథనాన్ని చెప్పాడు. చారుమజుందారుకూ తనకూ 1965 నాటికే అభిప్రాయ బేధాలు తలెత్తాయని వక్కాణించాడు. (చూ॥ పూర్వతరంగ, మే 1, 1974)*

# 4. నక్సల్బరీ

మావోసేటుంగు ప్రబోధాలనాదర్శంగా తీసుకుని ప్రజలు ప్రారంభించిన విప్లవాత్మక సాయుధ పోరాటపు పంజా.

– నక్సల్బరీ పోరాటంపై 1967 జూన్ 28వ తేదీనాటి పెకింగ్ రేడియో ప్రసారం.

భారత ప్రజల ప్రజాతంత్ర విప్లవానికి నక్సల్బరీ మార్గదర్శకం. ఇది నయా రివిజనిస్టుల అసలు స్వరూపం బయటపెట్టిన ఉద్యమం.

– నవంబరు, 1967. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) విప్లవకారుల ప్రకటన నుంచి.

## పశ్చిమ బెంగాలు ఐక్యసంఘటన ప్రభుత్వం

1967 మార్చి, 2వ తేదీన పశ్చిమ బెంగాలులో కాంగ్రెసేతర ఐక్య సంఘటన ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసింది. అంతకు ముందు జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో వామపక్షీయులు గెలిచారు. కాంగ్రెసు మైనారిటీలోకి వచ్చింది. మాస్కో – అనుకూల సి.పి.ఐ. సి.పి.ఎం.లు, కాంగ్రెసు నుంచి విడిపోయి మధ్యస్త భావాలు కల బంగ్లా కాంగ్రెసుల ఆధిపత్యంలోకి ప్రభుత్వం వచ్చింది.

దేశంలోని ఇతర రాష్ట్రాలలోలాగే, పశ్చిమ బెంగాలులో కూడా అసలు సమస్య భూమి. నాటికే చాలా కాలంగా జరగవలసిన భూసంస్కరణలను తెస్తానని ఐక్య సంఘటన ప్రభుత్వం వాగ్దానం చేసింది. వాటిని అమలు జరిపితే బీదజనానికీ భూమిలేని రైతులకూ సాగు చేసుకునేందుకో చిన్న పొలం అమరుతుంది. వెన్ను విరిగే రుణభారం నుంచి విముక్తి కలుగుతుంది.

కొత్త ఐక్య సంఘటన ప్రభుత్వంలోని భూమి శిస్తుల శాఖ మంత్రి హరే కృష్ణ కోనార్ కాకలు తీరిన సి.పి.ఎం. రైతు నాయకుడు కూడా. బీదవారికి భూమిలేని

వారికి త్వరలోనే భూమి పంచుతామనీ, కౌలుదార్ల తొలగింపును ఆపు చేస్తామనీ ప్రమాణ స్వీకారం జరిగిన వెంటనే ప్రకటించాడు. తన పార్టీ బెంగాలీ పత్రిక 'గణశక్తి' కిచ్చిన ఇంటర్వ్యూలో "గ్రామ పంచాయితీ సభ్యులతోనూ, కిసాన్ సభల ప్రతినిధులతోనూ సంప్రదించిన ప్రాతిపదికపై భూమిలేని రైతులకు భూమిని పంచడానికి" ప్రభుత్వం నిర్ణయించిందని మే నెలలో చెప్పాడు. "రైతాంగం చురుకుగా ముందుకు రావడం వల్ల సంఘటిత శక్తి ముందంజ వేస్తే ఇంతకంటే అభివృద్ధికి మార్గం ఏర్పడుతుంద"ని చెప్పడం ద్వారా రైతాంగం నుంచి మరింత వీరోచితమైన ఆసక్తిని ఆహ్వానించాడు. ఐక్య సంఘటన ప్రభుత్వావిర్భావంతో మరింత పెరిగిన బీద రైతాంగపు ఆశలు ఒకసారి కనక తెరుచుకు ముందుకు వస్తే నాయకుల అంచనాలను మించి చాలా దూరం పోతాయని కోనార్ బహుశః గుర్తించలేక పోయి ఉండవచ్చు.

ప్రభుత్వంలో ఉన్న మార్క్సిస్టులకు ఎంత మంచి ఆశయాలున్నా చుట్టూ ఇబ్బందులే. మొదలుగా, భూస్వాములచే అక్రమంగా మార్పిడి చేసిన భూమిని ఎలా తిరిగి సంపాయించాలో వాళ్ళకు అంతుపట్టలేదు. కాని భూమిని పంచుతామని మాత్రం వాగ్దానం చేసారు. "ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేక పోతోంది. రాజ్యాంగం, న్యాయస్థానం కాగితాలు పత్రాలు పెట్టిన ఆటంకాలు కోకొల్లలు" అని 'బినామీ' భూమి మార్పిడుల గురించి అదే ఇంటర్వ్యూలో కోనార్ చెప్పాడు.

రెండవది, న్యాయసూత్రాలను ఆసరాగా చేసుకుని గ్రామీణ భూస్వాములు తమ మిగులు భూమిని స్వాధీనం చెయ్యకుండా జాప్యం చెయ్యవచ్చు. అలా మిగులు భూమి పంపిణీ నిరవధికంగా వాయిదా పడి పోతుంది. ఈ విషయాలు మార్క్సిస్టుల అనుభవానికి వస్తున్నాయి. "బినామీ ట్రాన్స్‌ఫర్లకు తోడుగా, కోర్టు ఉత్తర్వుల వల్ల ప్రభుత్వం 1,21,000 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోలేకపోయింది." 1969లో ఐక్యసంఘటన ప్రభుత్వం రెండవసారి పదవిలోకి వచ్చేనాటికి ప్రభుత్వం అటువంటి కేసుల వల్ల స్వాధీనం చేసుకోలేని ఎకరాల సంఖ్య రెట్టింపయ్యింది. ఐక్యసంఘటన ప్రభుత్వపు నిస్సహాయత ఎలా ఉందో దీన్ని బట్టి తెలుస్తుంది. కోనార్ ఇందిరాగాంధీకి 1969 సెప్టెంబరు 9వ తేదీన రాసిన లేఖలో తన ఇబ్బందినిలా వివరించాడు. "అనేక సివిల్ రూల్సునీ, సివిల్ దావాలనీ ప్రభుత్వం ఎదుర్కోవలసి వస్తోంది. వివిధ న్యాయస్థానాలలోనూ నిలిచిపోయిన వేలాది కేసుల వల్ల రెండు లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఇరుకులో ఉంది". తన సంస్కరణలను అమలు పరిచే అధికార సముదాయం గురించి కోనార్ ఇలా వాపోయాడు. "ఇంతవరకూ వాళ్లు ఒక తరహా

పనికి అలవాటు పడ్డారు. ఇంకొక రకమైన పనికి వాళ్ళు సర్దుకోవాలి... ఆదేశాలు అమలు జరపని సందర్భాలు కూడా ఉన్నాయి".

సి.పి.ఎం. అవస్థ అలా తయారైంది. సాంప్రదాయిక వ్యవస్థలో అధికారాన్ని అంగీకరించడం వల్ల అధికార యంత్రాంగాన్ని లెక్క చేయక తప్పలేదు. సి.పి.ఎం. ప్రభుత్వం పనిచేయడానికి అంగీకరించవలసిన సాంప్రదాయాలలో న్యాయ వ్యవస్థ పట్ల గౌరవం ఒకటి. అందువల్ల ప్రభుత్వం కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించ లేకపోయింది. అయినా, గ్రామీణ ప్రాంతంలోని కొత్త ఆశలను చల్లబరచాలి. అసలు ప్రశ్న ఇది. ఆకలి గొన్న భూమిలేని రైతులను సమర్థించడంలో క్షవరమై పోవాలా, లేక న్యాయపద్ధతులను తుది మర్యాద వరకూ గౌరవించి ప్రభుత్వంలో తన స్థానాన్ని కాపాడుకోవాలా, అనేది సి.పి.ఎం.కు ఎదురైన సమస్య. రోజులు గడిచిన కొద్దీ సి.పి.ఎం. రెండవ పంథాలోకి జారిపోసాగింది. ప్రస్తుత పాలనా యంత్రాంగంలో కూరుకున్న అవసరాల వల్ల ఆ పార్టీ మంత్రివర్యులు అధికార యంత్రాంగంపై ఆధారపడవలసి వచ్చింది. చట్టపరమైన మార్గాల ద్వారా భూమిని ఆక్రమించేందుకు తమ తమ దరఖాస్తులను పెట్టుకోమని వాళ్ళు రైతులకు సలహా ఇచ్చారు.

ఈలోగా సిలిగురిలో చారుమజుందారు తన అనుయాయులకిలా నచ్చ చెప్పసాగాడు. హరే కృష్ణ కోనార్ ప్రకటించిన భూమి పంపిణీ చర్యలు భూమి లేని వారిని సంతృప్తి పరచలేవు. ఒకవేళ, అవి అమలు జరిగినట్లయితే భావి రైతాంగ ఉద్యమానికి ప్రమాదకరం కూడా కావచ్చు. చారుమజుందారు మూడు కారణాలపై కోనార్‌ను ఎదుర్కొన్నాడు. ఒకటి : రైతాంగం భూములను బలవంతంగా ఆక్రమించడానికి బలపరచడానికి బదులు, బ్యూరోక్రాట్లకు భూస్వామి వర్గాలకు లొంగిపోవడాన్ని చారుమజుందారు నిందించాడు. రెండు : న్యాయస్థానాలను దరఖాస్తుల ద్వారా భూమికై అభ్యర్థించగా, చట్ట సమ్మతమైన విధానాలలో భూమి పంపిణీ ప్రయత్నాలు జరిగాయనే అనుకుందాం. భూమిని బలవంతంగా ఆక్రమించిన రైతాంగానికీ, అదే భూముల్ని చట్టపరంగా పొందవలసిన రైతులకూ మధ్య తప్పక విభేధాలు తలెత్తుతాయి. మూడు : న్యాయ సహాయంలో భూమిని పొందిన బీద రైతులు పరిపాలన ద్వారా ఆక్రమణను పొందగలిగిన వెంటనే ప్రస్తుత వ్యవస్థలోకి చల్లగా కరిగిపోయి, మధ్య రైతుగా మారి, చట్టపు పరిధి బయట భూమిని సంపాదించేందుకు పోరాడే బీదవాళ్ళనూ, భూమిలేని రైతాంగాన్నీ చిన్న చూపు చూడసాగుతారనేది అనుభవంలోకి వచ్చిన విషయం.(8)

రైతులను రాజకీయ నిబద్ధం చేసే కార్యక్రమంలో ఆర్థికవాదపు సరిహద్దులను

దాటిపోవలసిన అవసరాన్ని చారుమజుందారు వక్కాణించాడు. "ఆర్థికవాదాన్ని నమ్మేవాళ్ళు ప్రతీ సంఘర్షణనూ ఎంత ధాన్యం పట్టుకున్నాం, ఎంత పరిమితి గల భూమి రైతుకు వచ్చింది అనే దృష్టితోనే అంచనా వేస్తారు. వాళ్లెప్పుడూ రైతాంగపు పోరాట చైతన్యపు స్థాయి ద్వారా అంచనా వేయరు. ...." రైతాంగపు పోరాట చైతన్యాన్ని భూస్వామివర్గం పైకి, ప్రభుత్వ యంత్రాంగం పైకి ఎక్కుపెట్టేలా చూడాలని కూడా చెప్పాడు. (ఆ రెండు వర్గాలను) అంతం చెయ్యందే భూసంస్కరణలు సాధ్యం కావు. కారణం ఆ రెండూ కూడా భూమి లేని రైతులు, బీదరైతుల ప్రయోజనాలకు వ్యతిరేకం కనుక. (8)

## నక్సల్బరీలో నాంది

ముందు చెప్పినట్టు చారుమజుందారు అనుయాయులు నాటికే ఉత్తర బెంగాలులో చురుకుగా పనిచేస్తున్నారు. ఐక్య సంఘటన ప్రభుత్వం పదవిలోకి వచ్చిన పదహారు రోజుల తరువాత, అంటే 1967 మార్చి 18వ తేదీన డార్జిలింగు జిల్లాలో సిలిగురి డివిజను సి.పి.ఎం. నాయకత్వపు ఆధ్వర్యంలో ఒక రైతు సమావేశం జరిగింది. ఆ సమావేశం ఇలా పిలుపు నిచ్చింది. భూమిపై భూస్వాముల గుత్తాధిపత్యానికి స్వస్తి చెప్పాలి. రైతు సంఘాల సంస్థల ఆధ్వర్యంలో భూమి పంపిణి జరగాలి. భూస్వాముల, గ్రామ ప్రగతి నిరోధకుల నిరోధాన్ని అంతం చెయ్యాలి. వాళ్లు (తలపెట్టే) ప్యూడలు వ్యతిరేక సంఘర్షణ, కేంద్ర ప్రభుత్వం, ఐక్యసంఘటన ప్రభుత్వాల కోపానికి గురౌతుందనీ, సుదీర్ఘమైన సాయుధ వ్యతిరేకతకు సంసిద్ధం కావాలనీ, ఆ సమావేశం భూమిలేని వారి నుద్దేశించి హెచ్చరించింది.[1]

ముప్ఫైఐదు సంవత్సరాల పైబడి వయసు గలిగి పట్టుదలకు ప్రతిరూపమైన కానూసన్యాల్ ఆ సమావేశపు సన్నాహకులలో ఒకడు. చాలా సంవత్సరాలుగా ఆదివాసి తెగల రైతాంగంలో పనిచేస్తూన్న అతను సి.పి.ఎం. డార్జిలింగు జిల్లా కార్యవర్గపు సభ్యుడు కూడా. కానూసన్యాల్ మధ్య తరగతి కుటుంబంలోంచి వచ్చాడు. అతని సహచరుడు జంగల్ సంతాలు. పార్టీలోని ఆదివాసి రైతాంగం నాయకుడు. సిలిగురి సబ్ డివిజను కృషిక్ సమితికి అధ్యక్షుడు. డార్జిలింగ్ జిల్లా ఫన్సిదేవా నియోజకవర్గం నుంచి 1967లో అసెంబ్లీకి పోటీచేసి ఓడిపోయాడు. కానుసన్యాలు, జంగల్ సంతాలు ఎన్నికల సమయంలో ప్రివెంటివ్ డిటెన్షను చట్టంకింద జైల్లో ఉన్నారు. తరువాత విడుదలయ్యారు.

చాలా సంవత్సరాల తరువాత 1974లో నక్సల్బరీ పోరాటపు పూర్వ చరిత్రను

కానూసన్యాలు వివరించాడు.

నీరసుడూ, హృద్రోగపీడితుడూ, ఉత్తర బెంగాలు సి.పి.యం. నాయకుడూ అయిన 49 సంవత్సరాల వయసు కల చారుమజుందారుతో నాడే విభేదాలు ప్రారంభమైనట్టు కూడా తెలిపాడు. భావిలో ఉద్యమానికి సైద్ధాంతిక చట్రాన్నిచ్చిన సి.పి.ఐ. (మా.లె.) నాయకుడుగా చారుమజుందారు కావలసి ఉంది. ఉత్తర బెంగాలు కమ్యూనిస్టులు నక్సల్బరీ రైతాంగ సంఘం ద్వారా 1951–54 సంవత్సరాల మధ్యకాలంలో జోతేదార్ల చిన్న చిన్న దమన చర్యల్ని ఎదుర్కొనడం ద్వారా పోరాటాన్ని ప్రారంభించారని కానుసన్యాలు పేర్కొన్నాడు. "ఈ ప్రారంభ దశలో కూడా రైతాంగపు వర్గ సంఘర్షణ శాంతియుత పంథాలో ముందుకు సాగలేదు." తరువాత 1955–57 మధ్యకాలంలో రైతులతో పాటు టీ తోటల కార్మికులను కూడా సంఘటితపరచి సమీకరించడం జరిగింది. "1955లో టీ తోటల కార్మికులు బోనసుకై నడిపిన పోరాటంలో వేలాది రైతులు టీతోటల కార్మికులు (కలసి) టీ తోటల యాజమాన్లనే కాకుండా పోలీసులను కూడా తిప్పికొట్టారు." 1958–62 సంవత్సరాలలో నక్సల్బరీ ఉద్యమం మరింత వీరోచిత స్థాయికి వచ్చింది. కమ్యూనిస్టుల నాయకత్వంలో స్థానిక రైతు సంఘాలు పంటల మాసూలుకు పిలుపిచ్చాయి. దున్నేవాళ్లే పంటను పోగు చేసుకున్నారు. పంటల రక్షణకు ఎర్రజెండాలను పొలాలలో ఎగరేసి, పోలీసుల నుంచి రక్షించుకునేందుకు సాయుధులయ్యారు.[2]

చారుమజుందారు గురించి కానుసన్యాలు ఇంకా ఇలా అన్నాడు. "1965లో సి.పి.ఎం. నాయకత్వం గురించీ భారత్‌లో ప్రజాతంత్ర విప్లవం గురించి చారుమజుందారు తన అభిప్రాయాలను వివరిస్తూ 6 పత్రాలను రాసి తన కామ్రేడ్లకు పంచాడు... సిలిగురి స్థానిక కమిటీ నాయకులు, (నక్సల్బరీ డార్జిలింగు జిల్లాలోని సిలిగురి సబ్–డివిజన్ కిందకు వస్తుంది) కార్యకర్తలు ఆయనతో చర్చలు జరిపి ఆయనతో కొన్ని విషయాలతో ఏకీభవించారు. మరికొన్ని విషయాలలో అంగీకారానికి రాలేకపోయారు. అంగీకారానికి వచ్చిన సమస్యలివి. భారతదేశ విమోచన చైనా మార్గం వల్లనే సాధ్యం. రైతాంగంలోనూ కార్మికవర్గంలోనూ వ్యవసాయిక విప్లవ రాజకీయాల ప్రచారం (చేయాలి). వాళ్ళను సన్నద్ధం చేసేందుకు రహస్య పార్టీ నిర్మాణం (జరగాలి). స్థానిక (సిలిగురి) కమిటీ ప్రముఖ కార్యకర్తలు మాత్రం రైతుల కార్మికుల, ప్రజా ఉద్యమాల సమీకరణ, అవసరాన్ని వక్కాణించారు. సి.పి.ఎం. లోపల సైద్ధాంతిక చర్చ జరపవలసిన అవసరం (వక్కాణించారు). రాజకీయ ప్రచారం, చర్యలు రెండూ ఉండాలనీ ఏ ఒక్క దానితోనూ సరిపడదని వక్కాణించారు. రాజకీయ కార్యక్రమానికి

ప్రాధాన్యం ఇవ్వకపోయినట్లయితే ఏ పోరాటానికైనా అర్థం ఉండదు. కాని ప్రజా ఉద్యమాల సంఘర్షణకు సంస్థల నిర్మాణాన్ని చారుబాబు అంగీకరించలేదు. మరోలా చెప్పాలంటే, మొదటి నుంచీ రెండు (తరహాల) విస్పష్టమైన భావాలున్నాయి. వాటిని రెండు రాజకీయ పంథాలుగా చెప్పుకోవచ్చు. ఈ పరిస్థితులలో ఒక రాజీ జరిగింది. (చారుమజుందారు, స్థానిక కమిటీలు ఇరువురూ) అంగీకరించిన ఎత్తుగడలు స్థానిక (సిలిగురీ) కమిటీ కార్యకర్తలు నక్సల్బరీ ప్రాంతంలో తమ అనుభవానుసారం అనుసరించేందుకు నిర్ణయించారు. నక్సల్బరీని అనుకుని ఉన్న పశ్చిమ దినాజ్‌పూర్‌లోని చేతర్వాట్, ఇస్లామ్‌పూర్ ప్రాంతాలలో ఎనిమిది పత్రాలలో చెప్పిన ప్రకారం పని ప్రారంభమైంది. బహుశః 1965లో రాసిన మొదటి 6 పత్రాలు కానుసన్యాలు మనసులో ఉండొచ్చు. రహస్యపోరాట ముఠాలు నిర్వహించారు. కొద్ది మోతాదులో రాజకీయ ప్రచారం జరిగింది. ఖతం చర్యలు మొదలయ్యాయి. జోతేదార్ల ఇళ్ళకు నిప్పంటించారు. రాత్రి సమయాల్లో పంటలు మాసూలు చేసారు. రైఫిళ్ళను పట్టుకునే ప్రయత్నాలు జరిగినా ఫలించలేదు. ప్రజాసంస్థలు, ప్రజా సంఘర్షణల మార్గాన్ని త్రోసి పుచ్చి రాజకీయాల ప్రాధాన్యతను అంగీకరించక ఖతం చర్యల మోహంలోనే పడిపోయినా త్వరలోనే పోరాట ముఠాలు సంచార ముఠాలుగా తయారయ్యాయి."[3]

తన పత్రాలలో నిర్దేశించిన ఎత్తుగడల ప్రకారం పని ప్రారంభించిన చారుమజుందార్ అతని అనుయాయులు మాత్రం కానుసన్యాలు అభిప్రాయం ప్రకారం. పశ్చిమ దినాజ్‌పూర్‌లో ఏమాత్రం ముందుకు పోలేదు. చారుమజుందారు సిద్ధాంతాలతో విభేదించిన సిలిగురి కమిటీ కార్యకర్తలు మాత్రం ప్రజా ఉద్యమాల సిద్ధాంత ప్రచారానికి కట్టుబడి ఉండడం వల్ల, నక్సల్బరీ ప్రాంతంలో పటిష్టమైన రహస్య యంత్రాంగాన్ని నిర్మించగలిగారు. నక్సల్బరీ ప్రాంతపు కార్యకర్తల విజయాల దృష్ట్యా చారుమజుందారు తన అభిప్రాయాలను మార్చుకుని ప్రజా సంఘర్షణల ట్రేడ్ యూనియన్ ఉద్యమాల అవసరాన్ని గుర్తించాడని కానుసన్యాల్ కథనం. "1966 సెప్టెంబరులో టీ తోటలలో (జరిగిన) 16 రోజుల సమ్మెకాలంలో రైతాంగ పోరాటానికి సన్నాహం జరిగింది. టీ తోటల కార్మికులు సారథ్యం వహించారు.... నక్సల్బరీ రైతాంగ పోరాట కాలంలో టీ తోటల కార్మికులు (రైతాంగానికి) మద్ధతుగా మూడుసార్లు సమ్మె చేశారు... ఈ పోరాటపు అనుభవంతో చారుబాబు తాత్కాలికంగా తన భావాలను మార్చుకున్నారు. ఆర్థిక కోర్కెలపై పోరాటాల అవసరాన్ని గుర్తించవలసి వచ్చింది. ఈ అనుభవం దృష్ట్యా తన ఏడవ, ఎనిమిదవ పత్రాలను రాసాడు."[4]

ముందుకు సాగేలోగా, ఈ దశలో నక్సల్బరీ ప్రాంతం గురించి ఒక అవగాహన

ఏర్పరచుకోవడం అవసరం. డార్జిలింగు జిల్లాలో 300 చదరపు మైళ్ళ వైశాల్యం కల నక్సల్బరీ, ఫన్సిదేవా, ఖరిచరి మూడు ముఖ్య స్థావరాలు. అక్కడి రైతులలో చాలా భాగం సంతాలులు, ఓరానులు, రాజ్ బంసీలు అనే ఆదిమ తెగలకు చెందినవాళ్ళు. 'ఆధియార్' పద్ధతి ద్వారా జోతేదార్లు వాళ్ళను పీడించేవారు. చాలా భాగం గుత్తపద్ధతిలో వాళ్ళను పనిలోకి తీసుకునేవారు. భూస్వాములు ఇచ్చిన విత్తనాలు, నాగళ్ళు, ఎద్దులు సాయంతో పొలాలను సాగుచేసి పంటలో కొంత భాగాన్ని తీసుకునేవారు. వాటాలను గురించిన వివాదాలలో వాళ్ళను తొలగించడం మామూలు. ఐక్యసంఘటన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇవి పెరిగాయి. హరేకృష్ణ కోనార్ మాటల్లో "ఐక్య సంఘటన ప్రభుత్వం రాగానే జోతెదార్లు ఇతర ప్రగతి నిరోధక వర్గాలు ఐక్యసంఘటన ప్రభుత్వం చిన్న రైతుల, మధ్యతరగతి రైతుల భూమిని లాక్కుంటుందనే అబద్ధాన్ని ప్రచారం చేశారు."[5] అటువంటి ప్రచారం వల్ల ప్రథమ చర్యగా చిన్నా పెద్దా రైతులందరూ తమ పొలాలలో పనిచేస్తున్న కౌలుదారుల్ని తమ భూములు స్వాధీనాన్ని అడగవచ్చనే భయంతో తొలగించారు. తద్వారా గ్రామాలలో అనేక మంది రైతులను పొలాలలోంచి వెళ్లువగా తప్పించడం మొదలైంది. ఐక్యసంఘటన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నక్సల్బరీలోనే బిగుల్‌కిషన్ అనే కౌలుదారుని, అతని పక్షంలో కోర్టు తీర్పు ఉన్నా కూడా భూస్వామి కౌలుభూమి నుంచి తొలగించాడు. భూస్వామి, అతని మనుషులూ బిగుల్ కిషన్‌పై దాడి చేశారు. వాళ్ళకేం కాలేదు. ఐక్య సంఘటన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెనువెంటనే జరిగిన ఈ సంఘటన సంకీర్ణ ప్రభుత్వాన్నించి ఏమి ఆశించవచ్చునో తెలిపి వాళ్ళ కళ్ళు తెరిపించింది.

టీ తోటల యజమానుల మిగులు భూమికి కౌలుదార్లుగా వ్యవహరిస్తున్న టీ తోటల కార్మికులు కూడా ఉన్నారు. వారిలో చాలా మంది ఆదిమ తెగలకు చెందిన వారు. వరిసాగు చేసే ఈ భూములను సీలింగు పరిధిలోంచి తప్పించేందుకు టీతోటలుగా చూపించారు. కౌలుదార్లైన ఈ టీ తోటల కార్మికులను అప్పుడప్పుడు పనిలోంచి, భూమినుంచి తొలగించి, వాళ్ళ ఇళ్ళనుంచి కూడా ఖాళీ చేయించడం మామూలు. సి.పి.ఎం.లోని అసమ్మతి వర్గీయులు వీళ్ళను రైతు సంఘర్షణలోనికి తీసుకోవాలనుకున్నారు. సాయుధులైన ఈ టీ తోటల కార్మికులు 1967 మే నుంచీ ప్రతీ ఘర్షణలోనూ పాల్గొన్నారని కానూసన్యాలు తరువాత అన్నాడు. "టీ తోటల కార్మికులు కార్మిక సంఘతత్వం, (Trade - Unionism) ఆర్థికవాదపు బురద నుంచి బయటపడేందుకు రైతాంగ పోరాటం సాయపడింది."[6]

నక్సల్బరీకి వ్యూహాత్మక ప్రాముఖ్యం కూడా ఉంది. పశ్చిమ బెంగాలు పటాన్ని పరిశీలిస్తే

నక్సల్బరీ సన్నటిమెడలా రాష్ట్రపు ఉత్తర దిశలో ఉండి, ఉత్తర కొసను మిగతా దేశంతో కలుపుతుంది. పడమట నేపాలు దేశం, తూర్పున తూర్పు పాకిస్తాను ఈ సన్నటి మెడకు ఉచ్చులా ఉన్నాయి. శీతాకాలంలో కాలి నడకతో దాటగలిగే 'మెచీ' నది నక్సల్బరీ నేపాలుల మధ్య ప్రవహిస్తోంది. ఈ భౌగోళిక పరిస్థితులు తిరుగుబాటు కార్యక్రమాలకు ఎంతో అనువైనవి. కొంతకాలం పాటు విముక్తి స్థావరం ఏర్పాటు సాధ్యపడుతుంది. అంతగా ప్రమాదం వస్తే విదేశాలకు పారిపోయే దారి కూడా ఉంది.[7]

## ముఖ్య సంఘటనలు

ఇంక అసలు కథకు వద్దాం. సిలిగురి సబ్ డివిజన్ రైతు సమావేశం ఘన విజయంగా ముగిసింది. ఇంతకు ముందు చేసిన వీరోచిత సంఘర్షణల వల్ల బలపడిన రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. జోతెదార్ల పొలాలలో ఎండనక వాననక ఎడతెరిపి లేని చాకిరీతో స్తబ్ధమైన వదనాలలో ఆశ అవగాహనల కాంతి వచ్చింది. మార్చి 1967 నుంచి ఏప్రిలు నెల వరకూ అన్ని గ్రామాలనూ సంఘటిత పరచారని కానుసన్యాలు తరవాత చెప్పాడు. 15,000 నుంచి 20,000 రైతుల దాకా పూర్తి కాలపు కార్యకర్తలుగా నమోదయ్యారు. ప్రతీ గ్రామంలోనూ రైతు కమిటీలు ఏర్పడ్డాక వాళ్లే సాయుధ గస్తీగా కూడా వ్యవహరించారు. తరువాత వాళ్ళు రైతు కమిటీల తరఫున భూమిని ఆక్రమించారు. "తమకు రావలసిన మొత్తాలను రాకుండా మోసగించేందుకుపయోగించిన" భూమి రికార్డులను తగులపెట్టారు. తణఖా, తాకట్టు రుణాల్ని రద్దు చేసారు. పీడించే భూస్వాములకు మరణశిక్ష విధించారు. భూస్వాముల నుంచి తుపాకులను లాక్కొని సాయుధ దళాలను ఏర్పరచుకున్నారు.[8]

1967 ఏప్రిలు 13వ తారీఖున చారుమజుందారు ఆ ప్రాంతపు పార్టీ కార్యకర్తల సమావేశంలో మధ్యమ రైతులు, ధనిక రైతుల పట్ల వైఖరిని వివరిస్తూ ఇలా చెప్పాడు. "మనం ఎవరి తరఫున ఉన్నామో ఎవరికి వ్యతిరేకంగా ఉన్నామో నిర్ణయించుకోవాలి. మనమెప్పుడూ బీదరైతుల భూమిలేని రైతుల పక్షాన్నే ఉన్నాం. మధ్యమరైతుకీ భూమిలేని రైతుకీ మధ్య గల విభేదాలలో మనం భూమిలేని రైతుపక్షాన్నే ఉంటాం. ధనిక రైతుతో మన సంబంధం ఘర్షణే. ధనిక రైతు ప్రభావాన్ని గ్రామంలో నాశనం చెయ్యందే బీదరైతుల భూమిలేని రైతుల నాయకత్వం ఏర్పడజాలదు. మధ్యమ రైతులను మనవైపుకు ఆకర్షించుకోలేం."[9]

ఆ సంవత్సరం మే నాటికి నక్సల్బరీ పోలీసు స్టేషనుకింద గల హటిగేషా, ఖారిబరీ పోలీసు స్టేషను కింద గల బురాగంజ్, ఫంసిదేవా పోలీసు స్టేషను కిందగల

చౌపుఖారియా వాళ్ళ పూర్తి ఆధీనంలోకి వచ్చాయి. వాళ్ళ అనుమతి లేనిదే బయటి వాళ్లెవరూ ఆ ప్రాంతంలోకి పోలేరు.

పరిస్థితి చెయ్యి దాటిపోతోందని గమనించిన హరే కృష్ణ కోనార్ సిలిగురి వచ్చి అసమ్మతివర్గపు నాయకులను కొందరిని కలుసుకున్నాడు. ''చట్టవ్యతిరేక కార్యకలాపాలను" విరమించాలనీ, ప్రభుత్వ భూమికై రైతులు అర్జీలు పెట్టుకోవాలనీ, అధికార సంస్థల ద్వారా స్థానిక రైతుసంస్థల సలహాపై భూమిని తిరిగి పంచడం జరుగుతుందనీ అంగీకారానికి వచ్చారు. పోలీసులు గాలిస్తూన్న కానుసన్యాలు, జంగల్ సంతాలులు లొంగిపోవాలని కూడా అంగీకరించారు. అటువంటి అంగీకారమేదీ లేదని ఉత్తర బెంగాలు అసమ్మతి వర్గీయుల వాదన, స్థానిక ఫ్యూడలు శక్తులతో లాలూచీ పడిన ప్రభుత్వ సంస్థల ద్వారానే భూమిని మళ్ళీ పంచాలని తంటాలు పడుతూ, బూజుపట్టిన వలస న్యాయసూత్రాలను గౌరవిస్తూ, అటువంటి న్యాయసూత్రాలను ఏమాత్రం ఉల్లంఘించినా "చట్ట వ్యతిరేక కార్యకలాపాలు"గా సి.పి.ఎం. మంత్రులు పేర్కొంటున్నారని నిందించారు. తిరుగుబాటుదార్ల మొండి వైఖరిని ఎదుర్కొన్న సి.పి.ఎం. తన నిస్సహాయతను వెలిబుచ్చింది. సి.పి.ఎం. పోలీసులపై కూడా పెత్తనాన్ని కోల్పోయినట్లగుపడింది. 1967 మే 30వ తేదీన పశ్చిమ బెంగాలు సి.పి.ఎం. రాష్ట్ర కార్యవర్గం ఒక ప్రకటనలో "హరే కృష్ణ కోనార్ కలకత్తాకు తిరిగివచ్చి జరిగిన ఒప్పందాన్ని అమలు పరిచేందుకు ప్రయత్నించక, పోలీసు స్థావరాన్ని ఎందుకు పెట్టవలసి వచ్చిందో" తమకు అర్థమవడం లేదంది.

ఈ పరిస్థితిలో చారుమజుందారు ప్రభుత్వం జరపనెంచిన దాడి గురించి తన కామ్రేడ్లను హెచ్చరించడం అవసరమని భావించాడు. పోలీసులపై అసహ్యాన్ని రగల్చవలసిన అవసరాన్ని ఒక కామ్రేడుకు రాసిన లేఖలో నొక్కి చెప్పాడు. "పోలీసులు ఆజ్ఞలను అనుసరించేవారే. వాళ్లు ఆజ్ఞలు రాగానే దాడి ప్రారంభిస్తారు. మనం వాళ్ళను ఎదుర్కొంటేనే వాళ్ళు భయపడతారు." ఇంకా ఇలా గుర్తు చేసాడు. "జొతేదార్లింకా గ్రామాల్లోనే ఉన్నారు. వాళ్ళు పోలీసులకు గ్రామాలలోకి దారి చూపించి విచక్షణ లేకుండా రైతులను చంపేస్తారు. కాబట్టి మనం ఈ వర్గశతృవులని గ్రామాలలోంచి తరిమెయ్యాలి. వాళ్లు రహస్యంగా పోలీసు ఠాణాలతో సంబంధం పెట్టుకున్నారు. వాళ్ళ సాయంతో పోలీసులు దాడి చేస్తారు." పోలీసు పార్టీలను చుట్టుముట్టి వాళ్ళ నుంచి తుపాకులను లాక్కునేందుకు సన్నాహాలు చేయమని చారుమజుందారు తన అనుచరులను కోరాడు.(11)

రైతులకూ ప్రభుత్వ యంత్రాంగానికీ మొట్టమొదటి తీవ్రఘర్షణ 1967 మే 23వ

తేదీన జరిగింది. కొంత మంది నాయకుల్ని అరెస్టు చేసేందుకు పోలీసు పార్టీ ఒక గ్రామానికి వెళ్ళింది. అక్కడ సాయుధులైన ఆదివాస తెగ ప్రజలతో జరిగిన పోరాటంలో సోనాంవంగ్దే అనే పోలీసు చచ్చిపోయాడు. ప్రతీకార చర్యగా పోలీసులు మే 25వ తేదీన నక్సల్బరీలోనే ప్రసాదోటేకు ఒక దళంగా వెళ్ళి గ్రామ ప్రజలపై కాల్పులు జరిపారు. తత్ఫలితంగా ఆరుగురు స్త్రీలు, ఇద్దరు పిల్లలతో సహా తొమ్మండుగురు చచ్చిపోయారు. స్త్రీలను పిల్లలనూ ముందువరసలో ఉంచి తిరుగుబాటు దారులు తమను ఎదుర్కొన్నారనీ, అందువల్ల తాము కాల్పులు జరపవలసి వచ్చిందని పోలీసుల కథనం, అసమ్మతివర్గ మార్క్సిస్టు నాయకులు, పోలీసులు కావాలనే స్త్రీలను పిల్లలను చంపారని ఆరోపించారు. తరువాత అనేక మంది రైతుల్ని అదుపులోకి తీసుకున్నారు. వాళ్ళ నాయకులెక్కడ దాక్కున్నారో, వాళ్ళెందుకు పోలీసుల్నెదిరిస్తున్నారో, గుచ్చిగుచ్చి అడిగినా ఆ రైతులు మాత్రం మొండిగా క్లుప్తంగా చెప్పిన సమాధానం ఒక్కటే. చల్లని గాలిని నిండుగా పీల్చుకునేందుకు.[10]

## పరిణామాలు

ఆ సంఘటన ఐక్యసంఘటన లోపలా వెలుపలా కూడా ఉద్రిక్తతలు కలుగజేసింది. పశ్చిమ బెంగాలు రాష్ట్ర సి.పి.ఎం. కార్యనిర్వాహక వర్గం మే 29వ తేదీన సమావేశమై, పోలీసు కాల్పులను ఖండిస్తూ, ఆ సంఘటనపై న్యాయ విచారణ (Judicial Enquiry) జరపాలని కోరింది. "నక్సల్బరీలోని రైతాంగపు అసంతృప్తికి వెనకాల, దొంగ భూమి మార్పులు తొలగింపులు మొదలుగా గల జోతేదార్ల, టీ తోటల యజమానుల, ప్రజావ్యతిరేక చర్యలు సాంఘిక వ్యాధిలా వ్యాపించాయి" అని చెప్పింది. మాజీ కాంగ్రెసువాది, ముఖ్యమంత్రి అజయ్‌ముఖర్జీ "శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసు చర్యలపైనే ఆధారపడుతున్నాడని" ఆరోపించింది. గత సంవత్సరం ప్రెసిడెన్సీ కాలేజీ విద్యార్థుల ఆందోళనకు రంగమైన కాలేజీ వీధినిండా తరువాత రోజున పోస్టర్లు వెలిసాయి. "నక్సల్బరీ మార్గమే రైతాంగ విప్లవ మార్గం!" "హంతకుడు అజయ్ ముఖర్జీ రాజీనామా చెయ్యాలి!" తన పార్లమెంటరీ నాయకుల పట్ల భ్రమలుపోయిన సి.పి.ఎం. విద్యార్థి లోకపు అసంతృప్తి వర్గాల పని ఇది అని బాహాటంగా తెలుస్తూనే ఉంది.

తిరుగుబాటు చేస్తూన్న రైతులకూ భూస్వాములకూ జరుగుతూన్న ఘర్షణల సమాచారం నక్సల్బరీ నుంచి అందుతూనే ఉంది. అధికార సమాచారం ప్రకారం జూన్ 8వ తేదీకి 10వ తేదీకి మధ్యలోనే 80 దాకా 'అరాచక' సంఘటనలు, 13

దోపిడీలు, రెండు హత్యలు, ఒక ఎత్తుకు పోవడం జరిగాయని తెలిసింది. సాయుధ దళాలు న్యాయపాలన చేస్తూ పన్నులు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. పశ్చిమ బెంగాలు ముఖ్యమంత్రి జూన్ 12న డార్జిలింగ్ (జిల్లా)లో 'భీభత్స పరిపాలన' (Reign of Terror) ఏర్పడిందని పత్రికల వారికి చెప్పాడు. వెంటనే కేంద్ర ప్రభుత్వం సంకేతం అందుకుంది. ఆ తరువాత రోజున యూనియన్ దేశీయాంగ మంత్రి వై.బి. చవాన్ లోక్‌సభలో ఆ ప్రాంతంలో 'తీవ్ర అరాచకం' కలిగిందని ప్రకటించాడు. అధికార సి.పి.ఎం. నాయకత్వం నుంచి వాళ్ళను వేరుచేస్తూ, ఆ ప్రాంతంలో "తీవ్రవాదులు" ప్రముఖ పాత్ర వహిస్తున్నట్టు ప్రభుత్వం అనుమానిస్తోందని చెప్పాడు. ఆ విధంగా మొత్తం అధికార యంత్రాంగం గూడు పుఠాణి జరుపుతోందని తెలుస్తోంది. పరాకాష్టగా ఉబికి వచ్చిన ప్రజా ప్రతీకారానికి నక్సల్బరీ సంకేతం. చివరకు ఐక్య సంఘటన ప్రభుత్వం నక్సల్బరీకి ఒక కాబినెట్ సంఘాన్ని పంపింది. అందులో హరే కృష్ణ కోనార్, అప్పటి నీటి పారుదల శాఖామంత్రి. సి.పి.ఐ. రైతు విభాగపు నాయకుడూ అయిన బిశ్వనాథ్ ముఖర్జీలు కూడా ఉన్నారు. హింసను విడనాడమని తిరుగుబాటు దార్లకు వాళ్ళు చేసిన విజ్ఞాపనల వల్ల ఫలితం లేకపోయింది.

జూన్ మాసాంతానికి నక్సల్బరీ తిరుగుబాటుదార్లను సి.పి.ఎం. బాహాటంగా ఖండించడం మొదలెట్టింది. సి.పి.ఎం.ను విమర్శించే లోపలా వెలుపలా ఉన్న కలకత్తాలోని గ్రూపులు సంఘటితమయ్యాయి. అలా రాజకీయ విభేదాలు ఒక కొలిక్కి రాసాగాయి. సి.పి.ఎం. అసమ్మతివాదులు కాలేజీ విద్యార్థుల నాయకత్వంలో కలకత్తాలోని రామ్మోహన్ లైబ్రరీ హాలులో సమావేశమై నక్సల్బరీ రైతాంగ పోరాట సహాయక కమిటీని ఏర్పరచుకున్నారు. భావిలో వేరే పార్టీకి అది మూలమైంది. ఈలోగా జూన్ 20వ తేదీన సి.పి.ఎం. పొలిట్ బ్యూరో సమావేశమై సంస్థా విషయాలపై తీర్మానంలో "ప్రత్యేకించి పశ్చిమ బెంగాలులో కొంతమంది పార్టీ సభ్యుల కలాపాలను" పేర్కొంటూ "పార్టీలో వాళ్ళు ఒక రాజకీయ ధోరణి ఏమాత్రం కాదు. వాళ్లు సామూహిక పంథాను, చర్యలనూ సమర్థించే వ్యతిరేక ముఠాగా తయారయ్యారు. వాళ్ళు కేంద్ర కమిటీ ఆమోదించిన పార్టీ కార్యక్రమాన్ని, తీర్మానాన్ని, అనుజ్ఞలను సవాలు చేస్తున్నారు." "రాష్ట్ర కార్యదర్శులు, ప్రత్యేకించి పశ్చిమ బెంగాలు రాష్ట్ర కార్యదర్శులు తక్షణం వాళ్ళను పార్టీ సభ్యత్వం నుంచి బహిష్కరించాలి."[11] నిర్ణయం ప్రకారం సి.పి.ఎం. నుంచి 19 మంది సభ్యుల్ని బహిష్కరించారు. తరువాత సి.పి.ఐ. (మా.లె.) పార్టీలో ప్రముఖ పాత్ర వహించిన (సి.పి.ఎం. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడైన) సుశీతల్ రాయ్ చౌధురీ వారిలో ఒకరు.

డార్జిలింగులో తిరుగుబాటు కార్యకలాపాలు జరుగుతూండగానే ఒక ముఖ్య పరిణామం జరిగింది. 1967 జూన్ 28వ తేదీన పెకింగు రేడియో తన ప్రసారంలో నక్సల్బరీ సంఘటనలను "భారత ప్రజలు మావోసేటుంగు మార్గదర్శకత్వంలో తలపెట్టిన సాయుధ సంఘర్షణల పంజా"గా వర్ణించింది. ప్రజలను మోసగించేందుకు భారత ప్రగతి నిరోధకుల సాధనం"గా ఐక్యసంఘటన ప్రభుత్వాన్ని పేర్కొంది. సి.పి.ఎం. పట్ల పెకింగు అసహ్యానికి తిరుగుబాటు దార్లకు మద్దతుకూ ఇది మొదటి సాక్ష్యం.

నక్సల్బరీలో తిరుగుబాటుదార్లనూ వాళ్ళ నాయకులనూ అదుపులోకి తీసుకునేందుకు 1967 జూలై 12వ తేదీన ఒక భారీస్థాయి పోలీసు చర్య మొదలైంది. ఆ చర్యను తలపెట్టేందుకు తీసుకున్న కాబినెట్ నిర్ణయానికి సి.పి.ఎం. కూడా భాగస్వామి అని అజయ్ ముఖర్జీ అన్నాడు. పశ్చిమ బెంగాలు రాష్ట్ర సెక్రటేరియట్ జూలై 19వ తేదీన పోలీసు చర్య నుంచి విడివడేందుకు ప్రయత్నించింది. "పై స్థాయి పోలీసు అధికార్లు ఆజ్ఞలనన్నిటినీ లెక్కచెయ్యక, రైతాంగంపై దమన చర్యను ఆరంభించారు." ముఖ్యమంత్రిని కూడా దుయ్యబట్టారు. "హోంశాఖను నిర్వహిస్తున్న ఐక్యసంఘటన మంత్రివర్గపు ముఖ్యమంత్రి కేంద్ర దేశీయాంగ శాఖ ఒత్తిడికి లొంగిపోయి నక్సల్బరీలో తలపెట్టిన దౌర్జన్య చర్యలకు బాధ్యుడు."

జూలై 20వ తేదీ నాటికి జంగల్ సంతాలు తదితర రైతాంగ నాయకుల్ని అదుపులోకి తీసుకున్నారు. కానుసన్యాల్ మాత్రం 1968 అక్టోబరు వరకూ అరెస్టు కాకుండా తప్పించుకున్నా, జూలై నెలాఖరుకు అనేక మంది అనుయాయులు లొంగిపోయారు. దాంతో నక్సల్బరీలో బహిరంగ ప్రశాంతత ఆవరించింది.

## అంచనాలు

చారుమజుందారు సిద్ధాంతాలను మొదటిసారిగా అమలు చేసే ప్రయత్నం అంత త్వరగా ఎందుకు వీగిపోయింది? నక్సల్బరీ ఉద్యమం పూర్తిగా విఫలమైందా? లేక ప్రచారపు జిలుగు వెలుగుల వెనుకదాగిన శాశ్వత విజయాలేవైనా ఉన్నాయా? ఆ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన వాళ్ళే దాన్నెలా భావించారో చూద్దం మంచిది.

'తెరాయ్ రైతు ఉద్యమం' గురించిన తన నివేదికలో కానూసన్యాల్ ఆత్మ విమర్శ ధోరణిలో ఆ చర్యల విధానాన్ని వివరిస్తూ, యాదృచ్ఛికతపై ఆధారపడే ధోరణి ఉండేదని వాపోయాడు. "రైతులందరూ ఆయుధాలు ధరించి జోతేదార్లు ఇతర శత్రువులు గ్రామాల్లోంచి పారిపోగానే స్థావర ప్రాంతం (base area) వచ్చేసిందని భావించాం. సాయుధ ప్రజలను సాయుధ సైన్యమని భావించాం... ఒకటి రెండు సందర్భాలలో

చిన్న దళాలుగా ఏర్పడి జోతెదార్ల నుంచే తుపాకీలను లాక్కున్నాం. కాని దీన్ని మేం ప్రధాన సంఘర్షణగా రూపొందించలేదు. దానికి బదులు ప్రజలు తమంత తామే ఒక గెరిల్లా దళాన్ని నిర్మించుకుంటారని భావించాం. తిరుగుబోతుల వీరోచిత ధోరణికి ముగ్ధులమైన మేము అనేక సందర్భాలలో సాయుధ దళాల నిర్మాణానికి వాళ్ళను నాయకులుగా చేశాం...”

భూస్వాములను తొలగించాక తిరిగి భూమిని పంచడంలో అలక్ష్యం జరిగిందని కూడా కానుసన్యాల్ భావించాడు. “వాడి భూమిని ఆక్రమించడానికి బదులు జోతెదారు ఇంటిపై దాడి చేయడం ముఖ్యాశయమైంది. ఈ సందర్భంలో “మధ్యమ రైతుకూ బీదరైతుకూ తిరిగి భూమిని పంచుకోవడంలో వచ్చిన తీవ్ర విభేదాలను'' ఉదహరించాడు. ఒక శక్తివంతమైన ప్రజా స్థావరం' ఏర్పాటు చేయకపోవడం ఒక ప్రధాన లోపంగా ఒప్పుకున్నాడు.

ఉద్యమంలో సైనికపరమైన లోపాలనిలా ఒప్పుకున్నాడు. “మొదటి దశలో శత్రువు బలాన్ని తక్కువగా అంచనా వేసి పాత పద్ధతిలోనే ఆలోచించాం... ఒక్కొక్కసారి ఐక్య సంఘటన ప్రభుత్వం అంతవరకూ పోదనీ, లేదా అంతవరకూ (మాపై) పోయేందుకు కష్టమవుతుందనీ ఆశించాం... శత్రుముఖంలో ప్రజలను సన్నద్ధుల్ని చెయ్యకుండా ఉంచాం. అంటే శత్రువు వాళ్ళపై జరిపే దమనకాండకు తగినంతగా వాళ్ళను సిద్ధం చెయ్యలేదు. మా ఉద్యమపు తాత్కాలిక పరాజయానికి సైనిక పరమైన పూర్తి అమాయకత్వం కారణం.”[12]

ఇంకా తరువాత, అంటే 1974లో, తనకూ చారుమజుందారుకూ తలెత్తిన దృక్పథాల అంతరంపై కొత్తగా సమాచారాన్ని బయటపెట్టాడు. నక్సల్బరీ ఉద్యమం గురించి కానూసన్యాలు 1974లో రాసిన వ్యాసంలో 1967 నాటి ఉత్తర బెంగాలు కమ్యూనిస్టుల మన స్థితిని ఇలా వివరించాడు. “డార్జిలింగ్‌లో కమ్యూనిస్టులు తిరుగుబాటు చేయడంతోనూ, సి.పి.ఎం. నాయకత్వానికి వ్యతిరేకంగా కలకత్తా కార్యకర్తలను నడపడం సరియైనదే. నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటుకు అండగా నిలిచి నిజమైన కమ్యూనిస్టు వైఖరినే ప్రదర్శించారు. సి.పి.ఎం. నాయకత్వపు రివిజనిస్టు వైఖరి విషయంలో అయోమయం ఉన్నప్పటికీ, విశాల అనుయాయ కార్యకర్తలలో మాత్రం తిరుగుబాటు చేసే ఇచ్ఛలేదు. ఇటువంటి బహుముఖ పరిస్థితిలో పెద్ద పెట్టున కష్టాలను కలుగజేయకుండా నక్సల్బరీ రైతు సంఘర్షణ నడిపి ఉండవచ్చు. ఆ పూర్తి గందరగోళ పరిస్థితి నుంచి క్రమబద్ధంగా సరియైన కార్యక్రమంతో, భావిలో నవోద్యమానికి ప్రయత్నించ గలగడం కూడా సంభవమయ్యేది.” కానుసన్యాల్ తీంకా

ఇలా అన్నాడు "ఈ దశలో (1967 తిరుగుబాటు కాలంలో) ఐక్య సంఘటన ప్రభుత్వంతో చర్చలు జరపాలనే ప్రతిపాదనను కార్యకర్తల ముందుంచాం. కాని చారుమజుందారు దానికి ఒప్పుకోలేదు. ఐక్య సంఘటన ప్రభుత్వంతో చర్చల గురించి మాట్లాడడం రివిజనిజంగా జమకట్టాడు. ఈ బహుముఖ పరిస్థితిలో భావపరమైన సన్నాహాలు లేక పోవడం వల్లా, ఎత్తుగడలలో లోపాల వల్లా, సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటూనే విధానపరంగా పట్టు విడుపులు లేకా, ఆ తిరుగుబాటును నిలదొక్కుకోలేక పోయాం."[13]

చారుమజుందారు రాజకీయాలను 1965 నాటి నుంచీ ప్రచారం చేస్తున్న అనుయాయులు తయారు చేసిన నివేదికలో కొద్ది మార్పులతో కూడిన అంచనా 'నక్సల్బరీ శిక్షా' అనే పుస్తకంలో మనకు దొరుకుతుంది.

'సైనిక పరిజ్ఞానం లేకపోవడాన్ని తాత్కాలికంగా పరాజయానికి కారణంగా పేర్కొనడం "రాజకీయాలపై సైనిక విషయాలకు ప్రాధాన్యత నివ్వడం" అవుతుందన్నారు. విప్లవాత్మక ఉద్యమాల ద్వారా సైనికానుభవం సంపాదించవచ్చున"ని వక్కాణించారు. "చిన్న విభాగాల నుంచి పెద్దవాటికి, అల్పమైన విభాగాల నుంచి బలమైన విభాగాలకూ, యుద్ధం ద్వారానూ, వ్యక్తిగత సంకల్పం ద్వారానూ, అభివృద్ధి చేయాలనే గెరిల్లా యుద్ధపు* ప్రాథమిక సూత్రాన్ని మరచి, దానికి ప్రతిగా మొదటి నుంచే పెద్ద ప్రజాసైన్యాన్ని నిర్మించాలనే రివిజనిస్టు భావానికి లోనయ్యాం." ఎనిమిది పత్రాల రాజకీయాలను ప్రచారం చేసేటప్పుడు చిన్న చిన్న ఔత్సాహికుల విభాగాలు ఉద్యమంలో పోటువల్ల ఎలా నీళ్లు కారిపోయిందీ వివరించారు. "ఇది సహజమే. పోరాటం ద్వారా వచ్చిన కొత్త కార్యకర్తలతో కొత్త కొత్త విభాగాలను, నిర్మించి ఉండవలసింది. చాలా కాలంగా వచ్చిన రివిజనిస్టు భావాల వల్ల గ్రూపుల నిర్మాణంలో ప్రాముఖ్యతను మేం గుర్తించలేదు. తత్ఫలితంగా (దానికి ముందుండి నడిపించడానికి బదులు) మేము ఒక సహజమైన ఉద్యమానికి తోకగా తయారయ్యాం." అనేక సందర్భాలలో రైతులపైనే ఆధారపడినట్టు వాళ్లు అంగీకరించారు. "…. మధ్యమ తరగతి రైతుల మాటలను ప్రజల కోర్కెలుగా చలామణి చెయ్యడంతో బీదరైతుల భూమిలేని రైతుల చైతన్యాన్ని మొద్దుపరిచాం…"

* *"గెరిల్లా యుద్ధాన్ని చేసే గెరిల్లా విభాగాలు సాధారణ సైన్యాలుగా మార్పు చెందాలంటే రెండు పరిస్థితులు అవసరం. రాశిలో పెరుగుదల, వాసిలో అభివృద్ధి" – మావో సేటుంగు జపాన్‌పై గెరిల్లా యుద్ధంలో వ్యూహపరమైన సమస్యలు. మే. 1938. (Selected Works, Vol. 2 పేజి 79).*

కానుసన్యాలు నివేదిక, నక్సల్బరీ శిక్షా రెండిటివల్లా తేలేదేమిటంటే, తిరుగుబాటుదార్ల మనసుల్లో గెరిల్లా యుద్ధం గురించి సరియైన అభిప్రాయం లేదని తెలుస్తుంది. తాత్కాలికంగానైనా స్థావర ప్రాంతం నిలబెట్టుకోలేక పోవడానికి కారణం ఈ లోపమే.

నక్సల్బరీ తిరుగుబాటు జరిగింది కొద్ది నెలల పాటైనా, దాని నాయకులు దాని ప్రాముఖ్యతను తక్కువగా చెప్పలేదు. తరువాత చారుమజుందారు చెప్పినట్టు "నక్సల్బరీ పోరాటం నుంచి మేం నేర్చుకున్న గుణపాఠాలు. 1. రైతులు భూమి గురించి పంట గురించీ పోరాడలేదు. రాజకీయాధికారానికి పోరాడారు. 2. ప్రభుత్వ యంత్రాంగపు విప్లవ ప్రతీఘాత సాయుధ దాడులపై రైతులు తమ సాయుధ పోరాటాన్ని నడిపారు. 3. సాయుధ దాడులు జరిపేందుకు రైతులు తమ ఆయుధాలనే నమ్ముకుని వాటి సాయంతోనే తుపాకుల్ని కొల్లగొట్టారు. 4. ఈ పోరాటాన్ని నడిపేందుకు రైతులు ఇతరులపై ఆధారపడకుండా తమంత తాముగా నిలబడ్డారు. 5. రివిజనిజాన్ని ఎదుర్కొనడం ద్వారానే ఈ పోరాటం అభివృద్ధి చెందింది. 6. ఛైర్మన్ మావో ఆలోచనా విధానంతోనూ, ఆ ఆలోచనలు రైతాంగ జనబాహుళ్యానికి అనుసంధించడం ద్వారా మాత్రమే రివిజనిజాన్ని ఎదుర్కోగలం."(28)

## ఫలితాలు

వ్యావసాయిక రంగంలో భారత దేశమంతటా నక్సల్బరీ ఉద్యమం శాశ్వతమైన ముద్రవేసింది. కావాలని నీటిలో రాయి వేసి అనేక తరంగాలను సృష్టించినట్టయింది. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో అది ఒక మైలురాయి. అధికారంలో ఉన్న వామపక్ష పార్లమెంటరీయుల రాజకీయ పరాజయాన్ని ఆ ఉద్యమం బహిరంగ పరచింది. తద్వారా కమ్యూనిస్టు వర్గాలలో ఒక పునరాలోచనకు దారి తీసింది.

విస్తృతంగా ప్రసిద్ధి చెందిన ఆ ఉద్యమం దేశంలోని ఎన్నో ప్రాంతాలలోని గ్రామీణ బీదజనాన్ని వీరోచిత సంఘర్షణలు జరిపేందుకు పురికొల్పింది. మొట్టమొదటగా దేశ సామాజిక ఆర్థిక జీవనంలో తెలివిగా మూతపెట్టిన ఆ మారుమూల ప్రపంచం, భూమిలేని కార్మికులు, – బీద రైతులు సత్వరంగా భూమిలేని కార్మికులుగా మారిపోయే ఆ ప్రపంచం, ఒక్క సారిగా పునరుజ్జీవం పొంది, గత 20 సంవత్సరాలుగా 'భూసంస్కరణలు' పేరుతో జరుగుతున్న పవిత్రమైన రొంపి వెనకాల వాళ్ళకు జరిగే అన్యాయాన్ని కొత్త కాంతిలో క్రొంగొత్త ధోరణిలో దేశం కళ్ళ ముందుకు నెట్టింది.

అవగాహన లేక కొంత మంది, కావాలని వాస్తవాలను చూడకపోవడం వల్ల మరికొంత మంది, అధికారం పట్టుకోవడమనే నక్సల్బరీ తిరుగుబాటుకు సానుభూతి

పరులు కూడా, ఆ పోరాటాన్ని భూమిని ఆక్రమించేందుకు జరిగిన పోరాటపు తీవ్రరూపంగానే చిత్రీకరించారు. ఐక్య సంఘటన ప్రభుత్వం ప్రతిపాదించిన రాయితీలను నక్సల్బరీ నాయకులు తిరస్కరించారు. (ఉదా॥ రైతు కమిటీల సలహాతో అధికార సంస్థల ద్వారా భూమిని తిరిగి పంపిణీ చేయిస్తామనే హరేకృష్ణ కోనార్ వాగ్దానం). ఆ రాయితీలను వాళ్ళలా తిరస్కరించడం వల్ల, ఏదో భూమిని తిరిగి పంపిణి చేయించడమే ఈ ఉద్యమానికి ముఖ్యాశయం కాదని ఆయా పత్రికలకూ సానుభూతిపరులకూ కూడా తెలియాలి. ఇంతకంటే ఉన్నతాశయమేదో వాళ్ళకు ఉండి తీరాలి. భూమి లేనివారు బలవంతంగా భూమిని ఆక్రమించుకునే ధోరణి నక్సల్బరీ సంఘటనల తరువాత దేశమంతటా దావానంలా వ్యాపించింది. (1966లో ఏవో చెదురు మదురు సంఘటనలు జరిగాయి.) కేంద్ర దేశీయాంగ శాఖ 1967 సెప్టెంబరు నుంచి 1969 మధ్య కాలం దాకా జరిగిన సంఘటనల వివరాలను తయారు చేసింది. భూమిని ఆక్రమించుకోవడం, భూమిలేని వారికి భూమిని ఇవ్వాలని కోరుతూ ప్రదర్శనలు జరపడం, తొలగించబడిన కౌలుదార్లు బలవంతంగా పంటను వసూలు చేసుకోవడం, హెచ్చు పన్నుల పట్ల నిరసన చర్యలు పెరిగాయని తెలుస్తూంది. ఆ కాలంలో అటువంటి సంఘటనలు అస్సాంలో ఐదు, ఆంధ్రప్రదేశ్‌లో ఎనిమిది, బీహారులో తొమ్మిది, కేరళలో ఏడు, మధ్యప్రదేశ్‌లో ఏడు, మహారాష్ట్రాలో ఐదు, పంజాబులో ఐదు, రాజస్థాన్‌లో మూడు, తమిళనాడులో మూడు, ఉత్తరప్రదేశ్‌లో ఐదు, మణిపూర్, త్రిపుర, గుజరాత్‌లలో ఒక్కొక్కటీ జరిగాయి.[14] కొన్ని మాత్రం, యాదృచ్ఛికంగా జరిగినా, వాటిలో చాలామట్టుకు సి.పి.ఎం., సి.పి.ఐ., సంయుక్త సోషలిస్టు పార్టీలు నిర్వహించాయి. ఒకానొక దశలో కేంద్ర దేశీయాంగ మంత్రి వై.బి. చవాన్ కూడా 'హరిత విప్లవం' చాలా కాలం పచ్చగానే ఉండకపోవచ్చని హెచ్చరించవలసి వచ్చిందంటే పరిస్థితిని ఊహించవచ్చు.[15]

బీదరైతులనూ, భూమిలేని రైతులనూ ప్రధానంగా నక్సల్బరీ నుంచి వచ్చిన సమాచారం – అదెంత వక్రీకరించబడినదైనా కావచ్చు – పురికొల్పడం వల్లనే 1967–69 మధ్య కాలంలో జరిగిన తీవ్ర సంఘర్షణలు వెల్లువలు జరిగాయనడానికి సందేహం లేదు. దేశంలో ఏదో మారుమూలనున్న పీడిత జనం తిరగబడి తమను పీడించే వాళ్ళను ఎదిరిస్తున్నారనే గాలివార్త బీదవారిలోనూ, బీదరైతులలోనూ నిద్రాణమై ఉన్న వీరత్వాన్ని పురికొల్పేందుకు సరిపోయింది. సి.పి.ఐ. సి.పి.ఎం. తదితర వామపక్ష పార్టీలు, ప్రభుత్వపు పరోక్ష దీవెనలతో కాని, మరేదైనా ఉద్దేశ్యంతో కాని, బీదరైతుల భూమి. ఆక్రమణ పోరాటాలకు నాయకత్వం వహించి ఉండవచ్చు. నక్సల్బరీలో జరుగుతున్న మరింత

మౌలికమైన పోరాటం గురించి వాళ్ళకు తెలియకుండా మభ్యపెట్టి, ఏవో కొన్ని పొలాలను మరిన్ని కుంచాల ధాన్యాన్ని వాళ్ళకు కట్టపెట్టేందుకే వాళ్ళాపని తలపెట్టారు.

నక్సల్బరీ పోరాటానికి ప్రతిగా అనేక ప్రాంతాలలో వెనువెంటనే పరిమితమైన ఆర్థిక కోర్కెలపై వీరోచిత రైతు సంఘర్షణలు సహజంగానే తలెత్తాయి. దానికంటే చాలాకాలం మనగలిగే ముందుగా రచించిన పరిణామం మరోటుంది. దేశంలో కొన్ని ప్రత్యేక ప్రాంతాలలో కమ్యూనిస్టు విప్లవకారులు అధికారాన్ని పట్టుకునే ప్రధానాశయంతో నిర్వహించిన క్రమబద్ధమైన సంఘర్షణలు జరిగాయి. నక్సల్బరీ తిరుగుబాటుదార్లు గురిపెట్టిన ఈ రాజకీయాశయ సాధనే దేశంలోని వామపక్షీయులకు సవాలుగా నిలిచింది. పశ్చిమ బెంగాలు సి.పి.ఎం. మంత్రులు ప్రస్తుత రాజకీయ పరిధిలోనే పరిష్కారాన్ని అంగీకరించమని అసమ్మతివాదులను బతిమాలడం గురించి ఇదివరకే చెప్పుకున్నాం. వాళ్ళు తమ కామ్రేడ్లపై నక్సల్బరీలో జరిగిన దారుణ పోలీసు దమనకాండను నిస్సహాయులుగా చూసే ప్రేక్షకుల పాత్ర వహించవలసి వచ్చింది. పోలీసు చర్యతో తమకు గల సంబంధాన్ని వదిలించుకునేందుకు కూడా తంటాలు పడ్డారు.

కాని దున్నబోతే దూడలలోకీ, మెయ్యబోతే ఎడ్లలోకీ పోవడం ఎల్లవేళలా సాగదు. నక్సల్బరీ తిరుగుబాటుదార్లకు నోటితో సానుభూతి తెలుపుతూ, అదే తిరుగుబాటు దార్లను వేటాడే ప్రభుత్వంలో కొనసాగడానికీ మధ్య, పొంతన కుదుర్చుకోవడంలో సి.పి.ఎం.కు ఇబ్బంది కలిగింది. అసమర్థతకు కోపం తోడైంది. అజయ్‌ముఖర్జీని ప్రభుత్వం నుంచి బహిష్కరించనూలేదు. తను ప్రభుత్వం నుంచి బయట పడనూలేదు. దానికి బదులూ, నక్సల్బరీ ఉద్యమ నాయకులనూ, కలకత్తాలో దానికి అండగా నిల్చిన వాళ్ళనూ తన పార్టీ నుంచి బహిష్కరించడమే మంచిదని తలచింది.

తమ వైఖరిని సమర్థించుకునేందుకు, సి.పి.ఎం. నాయకులు ఆ అసమ్మతి ఉద్యమానికి విప్లవ ప్రతీఘాతకోద్దేశ్యాలను అంటగట్టేందుకు కూడా వెనుకాడలేదు. 1967, జూన్ 20వ తేదీ పొలిట్ బ్యూరో తీర్మానం ఇలా చెపుతోంది. "…. ప్రగతి నిరోధక శక్తులకూ కేంద్ర ప్రభుత్వానికీ సహాయపడేందుకు…. ఈ గ్రూపుల పంథానూ, చర్యలనూ సాకు చేసుకుని కొంతమంది ఏజెంట్లు ఈ గ్రూపులలో చోటుచేసుకున్నారని నమ్మేందుకు కారణాలున్నాయి…." నాటి నుండీ, అన్ని రకాల తీవ్ర అసమ్మతి వాదుల పట్ల పార్టీ వైఖరికి ఇది పల్లవిగా తయారైంది. పశ్చిమ బెంగాలు సి.పి.ఎం. కార్యదర్శి ప్రమోద్ దాసుగుప్తా, ఒక ఘట్టంలో వాళ్ళను సి.ఐ.ఎ. ఏజెంట్లుగా కూడా జమకట్టాడు. ఆ విధంగా ముందు ముందు కూడా ఎటువంటి సామరస్యానికీ అవకాశం లేకుండా చేశారు. భూమిలేని వాళ్ళ సమస్యలను ప్రస్తుత పాలనా యంత్రాంగం పరిధిలో

తీర్చగలమనే అపోహలు సి.పి.ఎం.కు ఉన్నాయనీ కాదు. రాజ్యాంగపరమైన చట్టపరమైన అవరోధాలను పేర్కొంటూ హరేకృష్ణ కోనార్ చేసిన ప్రకటనలను చూస్తే అటువంటి నిష్ఫలతను గుర్తించినట్టే కనబడుతుంది.[16] అయినా సి.పి.ఎం. నాయకులు మాత్రం, తిరుగుబాటుదార్లు తమ మాటవినకుండా మొండిగా నిలబడగానే, ఐక్యసంఘటన ప్రభుత్వం ఏదో ఉదారంగా ఉన్నట్టూ, తిరుగుబాటుదార్లే విద్రోహకరమైన కృతఘ్నతను కనపరచినట్టూ ప్రవర్తించారు.

ప్రధాన రాజకీయాశయం పట్ల పెరుగుతున్న విబేధాలు బైటికి రాసాగాయి. సి.పి.ఎం. 'సంస్కరణాత్మక రాజకీయ మెరుపుదాడి'తో ప్రస్తుత వ్యవస్థ పరిధిలోనే అధికారం పట్టుకొని, బ్యూరోక్రసీ, పోలీసు శక్తుల సాయంతోనే దాన్ని కాపాడుకోవాలనుకుంది. కమ్యూనిస్టు విప్లవకారులు సరిగా అవే శక్తులను నాశనం చెయ్యాలని ఆశించారు.

సి.పి.ఎం. అనుచరులకూ అసమ్మతివాదులకూ మొట్టమొదటి బాహా బాహి ఘర్షణ 1967 జూన్ 28వ తేదీన కలకత్తాలో జరిగింది. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సోదర హత్యాకాండతో నిండిన అత్యంత రక్తసిక్తమైన అధ్యాయానికి ఇది నాంది పలికింది. కలకత్తాలోని ధర్మతలా వీధిలోని 'దేశ్‌హితైషి' (సి.పి.ఎం. బెంగాలీ వారపత్రిక) కార్యాలయాన్ని ఆక్రమించే ప్రయత్నంలో ఈ ఘర్షణ జరిగింది. ఆ పత్రిక నక్సల్బరీ పోరాటానికి అనుకూలంగా వ్యాసాలను ప్రచురిస్తూ, సుశీతల్‌రాయ్ చౌధురి ఆధీనంలో ఉంది. చౌధురి అతని అనుయాయులు, అధికార పార్టీ వైఖరిని సమర్థించే వాళ్ళకు ఆ పత్రికనూ దాని కార్యాలయాన్నీ స్వాధీనం చెయ్యడానికి నిరాకరించారు. సి.పి.ఎం. తన మనుషుల్ని పంపింది. ఇరువర్గాల వారూ ఘర్షణ పడ్డారు. సంఖ్యాబలంలోనూ, అంగబలంలోనూ కూడా మించి ఉన్న అధికార పార్టీవాదులు, అసమ్మతివాదుల్ని పత్రికా కార్యాలయం నుంచి తరిమి కొట్టారు.

నక్సల్బరీ పోరాటం ఆరంభమైనప్పుడు, ఆ సంఘటనలను "సాధారణ శాంతి భద్రతల సమస్యగా" తీసుకున్నందుకు సి.పి.ఎం. నాయకులు అజయ్ ముఖర్జీని దుయ్యబట్టారు. (చూ॥ పశ్చిమ బెంగాలు రాష్ట్ర సెక్రటరీయట్ ప్రకటన ది. మే 30). కాని తరువాత ఘట్టంలో తమ పాత మిత్రులను శిక్షించేందుకు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని తామూ అదే నేరానికి పాల్పడ్డారు.

ఆ విధంగా పార్టీ అధికార పత్రిక నుంచి తొలగించబడిన అసమ్మతివాదులు 'దేశవ్రతి' అనే ఒక కొత్త పత్రికను బెంగాలీలో వెలువరించసాగారు. అసమ్మతివాదులకూ సి.పి.ఎం. నాయకులకూ జరిగిన సైద్ధాంతిక యుద్ధంలో అది వాళ్ళ అభిప్రాయ

వేదికగా ఉండేది. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఏర్పడిన తరవాత అది ఆ పార్టీ అధికార పత్రికగా మారింది.

కొంతకాలం తరవాత సుశీతల్‌రాయ్ చౌధురి సంపాదకత్వంలోనే ఇంగ్లీషులో 'లిబరేషన్' (విమోచన) అనే మాసపత్రికను వెలువరించసాగారు.

చైనా కమ్యూనిస్టు పత్రికల నుంచి వ్యాసాలను పునర్ముద్రిస్తూ, పోరాటాల సమాచారాన్ని వెలువరిస్తూ ఈ రెండు పత్రికలూ విప్లవ సిద్ధాంత ప్రచారాన్ని కొనసాగించాయి.

ఈలోగా దేశంలోని మిగతా భాగాలలో కూడా నక్సల్బరీ ఉద్యమపు సైద్ధాంతిక ఒత్తిడి అనుభవానికి రాసాగింది. 1967 జూన్‌లో తమిళనాడులో స్పష్టమైన పెకింగ్ అనుకూల వైఖరితో 'ఎర్రజెండా ఉద్యమం' మొదలైనట్టు తెలిసింది. మాజీ కమ్యూనిస్టు అయిన కె. సునిదరం దానికి అధ్యక్షుడు కాగా. నెంజిల్ సెల్వం అనే మాజీ సైనికుడు దాని కార్యదర్శి. దాని సిద్ధాంతం చాలా క్లుప్తంగా ఉంది. హింసాయుత విప్లవంలో నమ్మకం ఉన్నవాళ్ళే నిజమైన మార్క్సిస్టులు. 'చెంగోడీ' (ఎర్రజెండా) అనే తమిళ వారపత్రికను కూడా అది వెలువరించింది.[17] ఆ కాలంలో అటువంటి గ్రూపులు పత్రికలు ఎన్నో మొలకెత్తాయి. వాటిలో చాలామటుకు అల్పాయువులైనా, ఇంకెన్నో అనుమానాస్పదంగా పుట్టినా వాటి ప్రాచుర్యం వల్ల నాడు దేశంలోని మధ్య తరగతి మేధావులను ఆవహించిన కొత్త భావస్థితి తెలుస్తుంది. సాయుధ విప్లవమే దేశ సమస్యల పరిష్కారానికి మార్గమనే నమ్మకం అంతటా వ్యాపించింది. అటువంటి విప్లవం త్వరలోనే సంభవమని నక్సల్బరీ తిరుగుబాటు సంకేతాన్నిచ్చింది.

## సి.పి.ఎం.లో కుమ్ములాటలు

సి.పి.ఎం.లోని అభిప్రాయ భేదాలు త్వరలోనే దేశస్థాయికి చేరుకున్నాయి. 'పీపుల్సు డైలీ' పత్రిక ద్వారానూ, పెకింగ్ రేడియో ద్వారానూ నిరంతరం నక్సల్బరీ పోరాటాన్ని పొగుడుతూ, సి.పి.ఎం.ను ఐక్య సంఘటన ప్రభుత్వాలలో పాల్గొన్నందుకు దుయ్యబడుతూ, చైనా కమ్యూనిస్టు పార్టీకీ, సి.పి.ఎం.కూ భారత పాలక వర్గాల సూత్రీకరణలో గల భేదాభిప్రాయాలను నొక్కి చెపుతూ, సాయుధ తిరుగుబాటుకు ప్రజలను తయారు చేసేందుకు విప్లవాత్మక కమ్యూనిస్టు పార్టీ నిర్మాణాన్ని వక్కాణిస్తూ చైనా చేసే వ్యాఖ్యానాలు ఇతర రాష్ట్రాలలోని అసమ్మతి వర్గీయుల్ని ప్రోత్సహించాయి.

తన వర్గాలలో పెరుగుతున్న తిరుగుబాటు దృష్ట్యా సి.పి.ఎం. 1967 ఆగస్టులో మధురైలో సమావేశమై భారతీయ పాలక వర్గాన్ని కాంప్రడార్ బ్యూరోక్రటిక్ వర్గంగా

భావించిన చైనా వైఖరితో విభేదిస్తూ, వాళ్ళ నుంచి సాయుధ ఘర్షణతో అధికారాన్ని పట్టుకోవాలనే చైనీయుల సలహాను తిరస్కరిస్తూ తీర్మానాలను ఆమోదించింది. భారత ప్రభుత్వాన్ని "బడా బూర్జువాల నాయకత్వంలో నున్న బూర్జువా – భూస్వామ్య ప్రభుత్వం"గా అభివర్ణించింది. కాని ఆ ప్రభుత్వం "తన సహాయానికై విదేశీ గుత్త పెట్టుబడిపై ఆధారపడుతూ, నమ్మకం పెంచుకుంటోంద"ని అంగీకరిస్తూ, "వర్గ సహకారం, రాజీ" ధోరణులు కల రాజకీయాలను ఎదుర్కొని ఓడించకపోతే "నయా–వలసవాద ప్రమాదం మనకు ఎదురు నిలుస్తుందని"ని హెచ్చరించింది. చైనా కమ్యూనిస్టుల ఎత్తుగడల పంథాయైన సాయుధ పోరాటంతో తన వ్యతిరేకతకు గల కారణాలను వివరిస్తూ సి.పి.ఎం. కేంద్ర కమిటీ "కార్మిక వర్గపు దారుణమైన తక్కువరాజకీయ స్థాయి, దాని వర్గచైతన్యం, మిగతా కష్టజీవులతో దానికి ఉండవలసిన ఐక్యత, ప్రత్యేకించి రైతాంగంతో ఉండవలసిన ఐక్యత లేకపోవడం, మొత్తం పరిస్థితిలో గల ఏకైక లోపం"గా పేర్కొంది. సంక్షోభం యొక్క లోతు, స్థాయి పరిపక్వతలను ఎక్కువగా ఉన్నాయని భావించవద్దని పార్టీ వర్గాలను హెచ్చరిస్తూ, ఇది వరకు ఆమోదించిన తీర్మానాలను ఊటంకిస్తూ, అటువంటి పని "ఒకవైపు వాళ్ళను కూడదీసుకునేందుకు గల వెసులుబాటుతో ప్రజా సంఘర్షణలను అణచేందుకు, విచ్ఛిన్నం చేసేందుకు ఏమైనా చేస్తూ, తమ వర్గాధిపత్యాన్ని కొనసాగించగల బడా–బూర్జువా భూస్వామ్య వర్గాల ఆధీనంలో ఉన్న అంతులేని శక్తులను మరీ తక్కువగా అంచనా వేయడానికి దారితీస్తుందని"[18] పేర్కొంది. అందువల్ల "జన ప్రజాతంత్రాన్ని, సోషలిస్టు పరిణామక్రమాన్ని స్థాపించడానికి శాంతియుత మార్గాల ద్వారానే సాధన" చేయాలనే తన నిర్ణయాన్ని పునరుద్ఘాటించింది. కాని పాలకవర్గాలు హింసకు దిగితే ఉత్పన్నమయ్యే ఎటువంటి పరిణామాలనైనా ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండవలసిన అవసరాన్ని మాత్రం వక్కాణించింది.[19]

క్లుప్తంగా చెప్పాలంటే, భారత రాజ్యాన్ని నయావలస రాజ్యంగా పరిగణించేందుకు సి.పి.ఎం. అంగీకరించకపోయినా ఆ దిశలో సాగుతూన్న ధోరణులున్నాయని అంగీకరించింది. రాజ్యాధీనంలో ఉన్న ఉత్తమ సైనిక బలం దాన్ని అణచివేస్తుందనే భయంతో ఆయుధాలను చేపట్టేందుకు సిద్ధంగా లేదు. మధ్యంతర చర్యగా పశ్చిమ బెంగాలు, కేరళ ఐక్య సంఘటన ప్రభుత్వాలలో కొనసాగడానికే నిర్ణయించుకుంది. భావిలో జరిగే జన ప్రజాస్వామ్య విప్లవానికి ప్రజలనీ మిత్రపక్షాలనూ సమీకరించేందుకు "పోరాటపు సాధనాలు"గా వాటిని ఉపయోగించాలనుకొంది. ఈ సందర్భంలో "పార్టీ కార్యక్రమాన్ని సవాలు చేస్తూ, పార్టీ యొక్క రాజకీయ – ఎత్తుగడల పంథాని వ్యతిరేకిస్తూ

బాలారిష్ట, వామపక్ష పోరాట రూపాలను ముందుకు తెస్తూ, పార్టీ సూత్రాలను, చర్చావేదికలను, దాని క్రమశిక్షణను ప్రజాస్వామ్య కేంద్రీయతను (democratic centralism) ఉల్లంఘించడం ద్వారా కొన్ని పార్టీ వర్గాలలో వెలిబుచ్చే ఒంటెత్తువాదం, పిడివాదం, దుందుడుకు ధోరణులని" మాత్రం నిర్దాక్షిణ్యంగా ఎదుర్కొంటానని వాగ్దానం చేసింది.[20]

ప్రస్తుత సమస్యలైనటువంటి చైనాపట్ల తన వైఖరి. ప్రభుత్వం యొక్క స్వభావం, అనుసరించవలసిన ఎత్తుగడల పంథా గురించిన అనేక విషయాలపై సి.పి.ఎం. అధికారి వైఖరి తెలియజేయడంలో మధురై తీర్మానం సాయపడింది. అధికారవైఖరికి ప్రతిగా తమ ప్రత్యామ్నాయ సూత్రీకరణతో బహిరంగంగా ప్రకటించేందుకు అసమ్మతి వాదులకు వీలుపడింది.

మధురై కేంద్రకమిటీ సమావేశం జరిగిన వెంటనే, అధికార పంథాను వ్యతిరేకించిన వారితో సి.పి.ఎం. ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యుడైన శివకుమార మిశ్రా ఒకడు. మధురై నుంచి తిరిగి వచ్చి 1967 సెప్టెంబరు 8వ తేదీన జారీ చేసిన సర్క్యులర్‌లో, నక్సల్బరీ రైతాంగ విప్లవకారుల్ని అణచివేసేందుకై పశ్చిమ బెంగాలు ప్రభుత్వం పాశవికమైన పోలీసు దమనకాండకు దిగిందని దుయ్యబడుతూ "పార్టీలోపలా, బయటా ఉన్న విప్లవకారుల్ని" నక్సల్బరీని పరిరక్షించుకునేందుకు ముందుకు రావలసిందని కోరాడు. మరో సర్క్యులర్‌లో పార్టీ యొక్క తప్పుడు, సంస్కరణ వాద నాయకత్వంపై తిరుగుబాటు చేయాలని రాష్ట్ర కమిటీలను కోరాడు. ఉత్తర ప్రదేశ్ నించే మరో ప్రముఖ నాయకుడూ రాష్ట్రకమిటీ సభ్యుడూ అయిన 'శ్రీ నారాయణ్ తివారీ' రాజీనామా చేస్తూ తన లేఖలో ఇలా రాసాడు. "ఈ పార్టీ ఉండడం నిరుపయోగం... పార్టీలోని అట్టడుగు వర్గాలు నాయకత్వపు రివిజనిస్టు వైఖరిపై ఎదురు తిరగడం చాలా సంతృప్తికరమైన విషయం". త్వరలోనే సి.పి.ఎం. మిశ్రానూ, తివారీనీ కూడా బహిష్కరించింది.

పంజాబ్, ఆంధ్రప్రదేశ్, జమ్మూ, కాశ్మీర్, బీహార్ మొదలైన రాష్ట్ర శాఖల నుంచి అసమ్మతిని తెలిపే సమాచారం కూడ వస్తోంది. అసమ్మతివాదులు భారత పాలకవర్గాన్ని గురించీ, భారత విప్లవ దశను గురించీ చారుమజుందారు భావాల సరసనకు జేరుతూ క్రమంగా ప్రత్యామ్నాయచర్యా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు.

ఈలోగా చారుమజుందారు సి.పి.ఎం. మధురై సమావేశాన్ని గర్హిస్తూ, ఒక విప్లవాత్మక పార్టీ నిర్మాణావసరాన్ని వక్కాణిస్తూ ఒక వ్యాసం వెలువరించాడు. సోవియట్ యూనియన్‌లోని పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించడాన్ని లెక్క చేయకుండా,

సి.పి.ఎం. కేంద్రకమిటీ దాన్ని సోషలిస్టు కూటమిలో సభ్యురాలిగా పరిగణిస్తోందన్నాడు. తద్వారా అంతర్జాతీయ సిద్ధాంత సంఘర్షణలో చైనాకు వ్యతిరేకంగా సి.పి.ఎం. తన్ను తాను నిలుపుకుంటూoదన్నాడు. కాంగ్రెసుకు ఇంకా తగినంత రాజకీయ ప్రభావం ఉన్నట్టుగా నటించి, భారతీయ ప్రగతి నిరోధక శక్తుల బలాన్ని ఎక్కువగా అంచనా వేస్తోందనీ, తద్వారా భారత ప్రజలను శాంతపరిచేందుకు ప్రయత్నిస్తోందనీ అన్నాడు. ఐక్యసంఘటన ప్రభుత్వాలలో కొనసాగాలనే తన నిర్ణయంతో సి.పి.ఎం. వ్యావసాయిక విప్లవ ప్రత్యర్థిగా నిలిచిందన్నాడు. నక్సల్బరీ వీరోచిత విప్లవకారుల పట్ల గల ప్రగాఢ ద్వేషభావం దాన్ని రుజువు చేసిందన్నాడు.(10)

## సమన్వయ సంఘం

అఖిల భారత కృషిక్ సంగ్రామ సహాయక్ సమితి ఆధ్వర్యంలో, నవంబరు నెల మధ్యలో కలకత్తాలో ఒక సమావేశం జరిగింది. నక్సల్బరీ రైతు సంఘర్షణ సహాయక కమిటీలోంచి వచ్చిన సంస్థ అది. అంతవరకు అది సి.పి.ఎం. లోపలా బయటా కల అనేక మావోయిస్టు గ్రూపుల మధ్య సంబంధాలను ఏర్పరిచే సంస్థగా పనిచేస్తోంది. పశ్చిమ బెంగాలు నుంచి చారుమజుందారు, బీహారు నుంచి సత్యనారాయణ సిన్హా ఉత్తర ప్రదేశ్ నించి శివకుమార్ మిశ్రా ఆ సమావేశానికి హాజరయ్యారు. సి.పి.ఎం. రివిజనిస్టు విధానాలే కాక. స్వేచ్ఛగా చర్చలు జరిగే వాతావరణం లేని బ్యూరోక్రటిక్ ధోరణి కూడా ఆ సమావేశం జరగడానికి కారణం. సాంస్కృతిక విప్లవ కాలంలో "కేంద్రాన్ని పేల్చేయాలని"* మావోసేటుంగు ఇచ్చిన నినాదాన్ని నాటి సి.పి.ఎం. బ్యూరోక్రసీపై ధ్వజమెత్తిన వాళ్ళు (అసమ్మతి వర్గీయులు) వాడుకున్నారు.

ఆ సమావేశం సి.పి.ఎం.లోని విప్లవకారుల అఖిల భారత సమన్వయ సంఘాన్ని (All-India Co-ordination Committee) ఏర్పరిచేందుకు నిర్ణయించింది. దేశంలోని విప్లవకారుల నందరినీ సమన్వయ పరచి స్థిరీకరించే ఈ సాధారణ సంఘం అంచెలంచెలుగా విప్లవపార్టీ ఏర్పాటుకు ప్రయత్నిస్తుంది. ఆ సమావేశం జారీ చేసిన ప్రకటనలో ఇలా వివరించబడింది. "దేశంలోని వివిధ ప్రాంతాలలో విప్లవాత్మక రైతాంగ ఉద్యమాలు జరగడం (కాని) లేదా జరగబోవడాన్ని కాని కామ్రేడ్లు గమనించే ఉంటారు. కార్మిక వర్గపు అగ్రగామిగా సాధ్యమైనంత వరకు ఈ పోరాటాలకు నాయకత్వం వహించడం మన ముందున్న విప్లవ కర్తవ్యం. ఆ ఆశయాన్ని దృష్టిలో

* Bombard the headquarters.

ఉంచుకుని పార్టీ లోపలా వెలుపలా ఉన్న విప్లవాత్మక శక్తులు దేశంలోని వివిధ ప్రాంతాలలోనూ వివిధ ప్రజా ఉద్యమాలలోనూ నేడు ఒంటరిగా పని చేస్తున్న వ్యక్తులు, మార్క్సిజం – లెనినిజం మావో ఆలోచనా విధానం ప్రాతిపదికలుగా గల విప్లవాత్మక పార్టీ నిర్మాణానికి తమ తమ కార్యకలాపాలను సమన్వయ పరచుకోవాలి. మధురైలో జరిగిన నిర్ణయాత్మకమైన, చిట్టచివరిదిగా దృష్ట్యా పరిస్థితి ఆలస్యానికి తావివదు. అందువల్ల సత్వరంగా సమన్వయం జరగాల్సిన అవసరం ఉంది."[21]

కలకత్తా సమావేశం అయిన వెంటనే, బీహార్ సి.పి.ఎం. శాఖ సమావేశమైంది. "సి.పి.ఎం.లోని విప్లవకారులైన కామ్రేడ్లను" అభ్యర్థిస్తూ "భారత దేశంలో విప్లవాత్మక రాజకీయ సంఘర్షణలను మొదలు పెట్టి గ్రామ స్థావర ప్రాంతాలను (rural base areas) అభివృద్ధి చేసేందుకు పరిపక్వమైన స్థితి ఉందని నక్సల్బరీ పోరాటపు ఆచరణలో రుజువు అయ్యింది. ఈ ఘర్షణలకు సరియైన నాయకత్వాన్నిచ్చేందుకు కావలసిన కమ్యూనిస్టు పార్టీ పునర్నిర్మాణానికి సి.పి.ఎం. లోపలా బయటా ఉన్న విప్లవకారులు తమ ప్రయత్నాలను సమన్వయం చేసి, ఐక్యపరచాలిసిన సమయం వచ్చిందని అది రుజువు చేసింది."[22] 1968 మార్చిలో తమిళనాడులో జరిగిన అదే తరహా సమావేశంలో 14లోనూ 9 జిల్లా కమిటీలు పాల్గొని రాష్ట్ర సమన్వయ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. "శ్రమజీవుల్ని అణచి పెట్టడానికి ఉపయోగపడుతున్న ప్రభుత్వ యంత్రాంగాన్ని నాశనం చేయందే బూర్జువా పాలకుల నుంచి రాజ్యాధికారం పట్టుకోగలమనుకోవడం కంటే వెర్రి ఊహ ఇంకోటి ఉండదు. వర్గపాలనకు సాధనంగా ఉన్న దీన్ని నాశనం చేయడానికి అడ్డదారి ఏదీ లేదు. మావో ఆలోచన మార్గదర్శకంగా గల నక్సల్బరీయే భారత విప్లవకారుల సాధారణ పంథాగా ఉంటుంది."[23]

నక్సల్బరీ పోరాటం విఫలమైన కొద్ది నెలల్లోనే తిరుగుబాటుదార్లు కొత్త పార్టీకి పునాది వేసారు. అది సైనికపరంగా పరాజయమే కావచ్చు. కాని దేశ సాంఘిక – ఆర్థిక సమస్యలపై అది ప్రసరింపజేసిన కొత్త వెలుగువల్లా, దాని వల్ల కమ్యూనిస్టు రాజకీయాలలో వచ్చిన కొత్త మలుపు వల్లా అది ప్రముఖంగా నిలిచిపోయింది. "... ఇండియాలో వందలాది నక్సల్బరీలు రాజుకుంటున్నాయి... నక్సల్బరీ అంతం కాలేదు. అదెన్నడూ అంతం కాదు"(9) అని 1978 శీతాకాలంలో చారుమజుందారు చెప్పినప్పుడు అతడు పగటి కలలు మాత్రం కనడం లేదు.

# 5. శ్రీకాకుళం

గత కాలపు పీడన తాలూకు జ్ఞాపకాలు నెమ్మదిగా సమసిపోతాయి....

– వెర్రియర్ ఎల్విన్

(మేరియామర్డర్ అండ్ సూయిసైడ్)

శ్రీకాకుళం – భారతదేశపు ఏనానా?

– చారుమజుందారు, మార్చి, 1969

## పూర్వరంగం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపు ఈశాన్య కొసలో గల పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతంలో లేవిడీ అనే చోట భూస్వాముల తొత్తులు ఇద్దరు గిరిజన రైతులను కాల్చి చంపారు. జాతపు, సవర గిరిజన ప్రజలు తమ పీడకులపై సాగిస్తున్న సుదీర్ఘ ఘర్షణలు ఈ సంఘటనతో తారాస్థాయికి వచ్చాయి. ఆ పోరాటపు భావి మార్గంలో ఆ సంఘటన ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

శ్రీకాకుళం జిల్లాలోని పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతం దాదాపు 300 చదరపు మైళ్ళుంటుంది. అడవులతో నిండిన ఆ కొండచరియలలో నివసించే ప్రజలలో చాలా భాగం 'సవర' జాతివారు. వాళ్ళనే గిరిజనులని కూడా పిలుస్తారు. వాళ్ళు 'పోడు' వ్యవసాయం చేస్తారు. ముందుగా అడవి నరికి దాన్ని అంటిస్తారు. తరువాత చేతిగునపంతో కాని చిన్న కొడవలితో గాని చిన్న చిన్న బొరియలు చేసి విత్తనాలు నాటుతారు. వానలు పడగానే అవి మొలకెత్తుతాయి. పంట పండాక కోసుకుంటారు. చాలాసార్లు అలావాడిన భూమిని తిరిగి సారవంతమయ్యే వరకు (సాగు చేయకుండా) వదిలేస్తారు. అలా ప్రతీ సంవత్సరం కొంత భూమిలో మళ్ళీ అడవి పెరుగుతుంది. దీన్నే 'పోడు' వ్యవసాయమంటారు. పండ్లు, వేళ్లు, ఆకులు కలప వంటి అడవి

సరుకుల మీద ఒకానొకప్పుడు ఈ సవరలు ఎన్నో హక్కులు లాంఛనాలను అనుభవించేవారు. కాని ఇటీవలి అటవీ రక్షణ నిబంధనల మూలంగా గృహోపయోగానికి చిన్న తరహా అడవి వస్తువులూ, అమ్ముకునేందుకు వంట చెరుకూ వాళ్ళకు కరువయ్యాయి.

దేశంలోని మిగతా గ్రామ ప్రాంతాలలో లాగానే, ఈ బీదగిరిజనులు కూడా వడ్డీ వ్యాపారుల క్రూరమైన ఉచ్చుల్లో చిక్కుకున్నారు. వాళ్ళలో చాలా మంది భూమిలేని కూలీలుగా మారిపోయారు. అడవులలో వాళ్ళకున్న హక్కులను కోల్పోయారు. గతిలేక తక్కువ కూలీకి ఒళ్ళు అమ్ముకుంటున్నారు. కొంత కాలం క్రితం జరిపిన సర్వేలో ఇలా తెలిసింది. "గిరిజనుల అమాయకత్వాన్ని ఎరిగిన భూస్వామియైన వడ్డీ వ్యాపారి, 5 ఎకరాల పొలంలో ఊడుపు (నాటడం) కోత, మాసూలు చేసి పంటను ఒక చోట చేర్చినందుకు 60 రూపాయిలను మాత్రమే ఇస్తాడు. మిగతా ప్రాంతాలలో 300 రూపాయలకు తక్కువ కాకుండా ఇచ్చుకోవాలి. అదీకాక కూలీ ధాన్యరూపంలో ఇస్తారు. ఇందులో కూడా దొంగ కొల్తలతో ఇవ్వవలసిన దానికంటే తక్కువ చెల్లిస్తారు... రోజంతా కష్టం చేసిన గిరిజన కార్మికుడికి తిండే కరువైంది."[1]

వాళ్ళ సాంఘిక జీవనాన్ని అస్తవ్యస్తం చేసి – తమ వంతు వంట చెరుకును అడవుల నుంచి దక్కనివ్వని అటవీ రక్షణ నిబంధనలను మాత్రం స్థానిక పరిపాలనా యంత్రాంగం తూచా తప్పకుండా అమలు పెడుతుంది. గిరిజన సంక్షేమానికి, రక్షణకు, కొంతవరకైనా ఉద్దేశించిన చట్టాలను అమలుపరిచేందుకు మాత్రం శ్రద్ధ చూపదు. ఒకానొక వ్యవస్థానుకూల వార్తాపత్రికా విలేకరి 1959లో ఇలా రాసాడు. "మైదానాల నుంచి వచ్చిన వడ్డీ వ్యాపారులకు గిరిజనులు బాకీ ఉన్న రుణాలను తీర్చేందుకు ప్రభుత్వం 1959లో రుణ విముక్తి చట్టాన్ని (Debt Relief Regulation) చేసింది. కాని గతవారం దాకా ప్రభుత్వం ఒక్క గిరిజనుడి అప్పును కూడా తీర్చలేదు." గిరిజనేతర భూస్వాములు అక్రమంగా ఆక్రమించిన భూమిని గిరిజనులకు పంచుతామనే ప్రభుత్వ వాగ్దానం గురించి చెపుతూ, "బంజరు భూమి పంపకం ఓ తలనెప్పి వ్యవహారం. రెవిన్యూ అధికారులకు రాజకీయ ఒత్తిడి ఎక్కువ. స్థానిక ప్రాపకాల వల్ల నిర్ణయాలు తొందరగా జరగవు." "ప్రభుత్వ వైఖరి గిరిజనులకు అనుకూలంగా ఉన్న సందర్భాలలో జిల్లా పాలనా యంత్రాంగంపై కొందరు భూస్వాములు రాజకీయ ఒత్తిడులు తెచ్చి మెల్లగా వ్యవహరించేలా చేస్తున్నారు."[2]

1950ల నాటి నుంచీ జాతపు, సవర గిరిజనుల్లో కొందరు కమ్యూనిస్టు ఉపాధ్యాయులు పనిచెయ్యసాగారు. ఈ ప్రాంతంలోని గిరిజనులు వీరోచిత పోరాటానికి

వారసులనే సంగతి ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి. శ్రీకాకుళం కొండల దాపునే ఉన్న విశాఖ పట్టణం ఏజెన్సీ ప్రాంతపు గిరిజనులు అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో 1922–24 కాలంలో బ్రిటిషువారితో యుద్ధం చేసారు.* పోలీసు అన్యాయానికి గురైన ఈ గిరిజనుల బాధలకు వ్యధ చెందిన ఆ యువకుడు ఆయుధాల్ని చేపట్టాడు. నిపుణుడైన వ్యూహరచనా సమర్థుడూ ఆరి తేరిన గెరిల్లా నాయకుడూ అయ్యాడు. చాలాకాలం పాటు పోలీసులకు చిక్కకుండా మెలిగాడు. చివరకు లొంగిపోగా పోలీసులు కాల్చి చంపారు.

భూస్వాముల అక్రమ వసూళ్ళ నెదిరిస్తూ, గిరిజనులను హెచ్చుకూలీకై సమీకరించిన కమ్యూనిస్టు ప్రబోధకుల నాయకుడు వెంపటావు సత్యనారాయణ. పొట్టివాడైన గట్టి శరీర సౌష్టవం గల సత్యనారాయణ సవర, జాతపు గిరిజన స్త్రీలను పెళ్ళాడి గిరిజనుల మధ్య స్థిరపడ్డాడు. గిరిజన ప్రజలకు ముఖ్య గురువుగా వ్యవహరించిన ఇతణ్ణి గిరిజనులు "గప్పగార"ని గౌరవంగా పిలిచేవారు. అతనికి గల పలుకుబడి, భూస్వామ్య వ్యతిరేకత యొక్క తీవ్రత వల్ల భూస్వామ్యశక్తులు అతన్ని 1960–1967 మధ్యకాలంలో చాలాసార్లు చంపాలని ప్రయత్నించారు. అతని నాయకత్వంలో గిరిజన కోర్కెల సాధనకు 'గిరిజన సంఘం' స్థాపించబడింది. దాని మొదటి సమావేశం 'మొండెంకల్'లో జరిగింది. శ్రీకాకుళంలో హెచ్చు కూలీకి ఆందోళనలు మొదలయ్యాయి. 'పైడీ'లనే బట్టలు నేసే స్థానిక ప్రజలు వీళ్ళకు తోడయ్యారు. గిరిజనేతర నేతగాళ్ళ వల్ల ఈ 'పైడీలు' తమ వృత్తిని కోల్పోయారు.

కూలీరేటు పెంపుదలకు, అటవీ అధికారుల పెత్తనాన్నెదిరించేందుకు మొదలైన ఈ ఉద్యమం, బంజరు భూములు సాగుచేసే హక్కును పొందే తీవ్ర సంఘర్షణకు దారి తీసింది. 1964 నాటి కమ్యూనిస్టు పార్టీ చీలిక కాలంలో సత్యనారాయణ తన సహచరుడూ ఉపాధ్యాయుడూ గిరిజన నాయకుడూ ఐన ఆదిభట్ల కైలాసంతో సహా వాళ్ళు సి.పి.ఎం. వైపుకు మొగ్గాడు. అదే సంవత్సరంలో అధికార నియమాలను ఉల్లంఘించి అడివి కలపను కొట్టుకునేందుకు గిరిజనులను ప్రోత్సహించారు.

పోలీసులు తొందరగానే బదులు చెప్పారు. వేలాది గిరిజనుల్ని అరెస్టు చేసి, మరెందరో అమాయకపు గిరిజనులపై కేసులు బనాయించారు. పోలీసులను, భూస్వాములను బలపరచే రాజకీయపక్షాల లాలూచీని ధృవీకరిస్తూ ఒక విలేకరి

---

* *అల్లూరి సీతారామరాజు భద్రాచలం, రంపచోడవరం తుని ఏజెన్సీ ప్రాంతాల్లో తిరుగుబాటు నడిపాడు. సుమంత బెనర్జి పొరబడ్డాడు. – అను*

ఇలా రాసాడు." .... (రాజకీయ పక్షాలు) గిరిజనుల్ని అదుపులో పెట్టేందుకు పోలీసుల్నే నమ్మారు. ఇంకా నమ్ముతూనే ఉన్నారు."[3]

భూస్వాముల జులుంకాని, పోలీసు బెదిరింపులు కాని, తీవ్రమౌతున్న గిరిజన పోరాటపు వెల్లువను ఆపలేక పోయాయి. భూస్వాములు 1967 నాటికి కూలీరేట్లను పెంచక తప్పలేదు. కౌలుదార్లకు మూడువంతుల పంటను వదలవలసి వచ్చింది. ఈ మార్పులు గిరిజన ప్రజల్లో రాజకీయంగా సంఘటితమవడంలో వాళ్ళ నమ్మకాన్ని మరింత బలపరచాయి.

పరిపాలనా యంత్రాంగం భయపడసాగింది. 1967 మే-జూన్ నాటి నక్సల్బరీ ఉద్యమం తరువాత పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతంలో కూడా అటువంటి ప్రమాదాన్నే శంకించి పోలీసు గస్తీని పెంచింది. పోలీసు రక్షణలో తిరిగి బలం పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్న భూస్వాములు గిరిజనులపై మళ్ళీ అత్యాచారాన్ని మొదలెట్టారు. అనేక ఘర్షణల మూలంగా 1967 జూలై 24వ తేదీ నుంచి ఆగస్టు 25వ తేదీలోగా 200 గ్రామాలలో 144వ సెక్షను విధించారు.

ఈ పరిస్థితుల్లోనే అక్టోబరు 31వ తేదీని లేవిడీ సంఘటన జరిగింది. ఆ రోజు మొండెంకల్‌లో గిరిజన సమావేశం జరుగుతోంది. దానికి హాజరయ్యేందుకు వెళ్ళే గిరిజనుల్ని లేవిడీ దగ్గర భూస్వాములు కొట్టారు. గిరిజనులకూ భూస్వాముల మనుషులకూ జరిగిన ఘర్షణలు పెరిగి, భూస్వాముల మనుషులు ఇద్దరు గిరిజన రైతుల్ని తుపాకీలతో కాల్చి చంపారు. ముందు ముందు ఆ ఉద్యమం తాను వ్యతిరేకించే దశకు చేరుతుందని తెలియని సి.పి.ఎం. పార్టీ గిరిజనులను బలపరుస్తూ ఆ కాల్పులను ఖండించింది. ఆ సంఘటన తరవాత సి.పి.ఎం. కేంద్ర కమిటీ సభ్యుడైన ఎన్. ప్రసాదరావు, తరువాత అసమ్మతివాదులతో చేరిన మరో సి.పి.ఎం. నాయకుడు కొల్లా వెంకయ్యతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించాడు. తన నివేదికలో గిరిజనేతర షాహుకార్లు అక్రమంగా ఆక్రమించుకున్న భూమిని తిరిగి పొందేందుకు గిరిజనోద్యమం సాగుతోందని, భూస్వామ్య శక్తులు దాన్ని అణిచేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పాడు. ఉద్యమం అహింసాత్మకంగా జరుగుతోందని చెప్పేందుకు యాతనపడ్డాడు. "వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా నిక్కర్చిగా నిలబడిన ఆ ఉద్యమం త్వరలోనే శాంతియుత ఆందోళనగా వృద్ధి చెందింది." గిరిజనులే హింసాయుతంగా ప్రవర్తిస్తున్నారన్న కాంగ్రెసును" ఈ గిరిజన ప్రాంతంలో ఒక్క గిరిజన సైనికుణ్ణి చూపించమని"[4] సవాలు చేసాడు.

గిరిజనుల్లో పనిచేస్తున్న కమ్యూనిస్టు విప్లవకారులు ఇంకా సి.పి.ఎం. సభ్యులుగానే

ఉన్నారు. పోలీసు దమనకాండను ఎదిరించి గెరిల్లా సంఘర్షణ మార్గాన్ని నడిపి, గిరిజనులను సాయుధుల్ని చేయలేక పోవడానికి ఆంధ్రప్రదేశ్ సి.పి.ఎం. నాయకత్వం యొక్క 'ద్రోహాన్ని' వాళ్లు కారణంగా పేర్కొన్నారు. శ్రీకాకుళం గురించిన నివేదికలో కమ్యూనిస్టు విప్లవకారులిలా తెలిపారు. "కొత్త అవసరానికి తగినట్టుగా, మా మీద అణచివేత మొదలయ్యే నాటికి సాయుధ పోరాటానికి పార్టీని సాయుధంగా చేసే ప్రయత్నంలో సంస్థాపరమైన చర్యలు పూర్తి అయి ఉండాల్సింది". అదే నివేదికలో లేవిడీ సంఘటన తరువాత రైతాంగపు మనస్థితినిలా వివరించారు. ".... పెద్ద పెట్టున శత్రువర్గాలపై గిరిజన రైతాంగం ఎంతో కోపంతో ఉంది. మన ఉద్యమంలో అదో కొత్త మలుపు. రైతాంగం భూస్వాముల ఆస్తుల్ని స్వాధీనం చేసుకుంటున్నారు. గ్రామాల్లో సమస్యల్ని గిరిజన సంఘం పరిష్కరిస్తోంది. ప్రజలు ఆయుధాలను ధరించి వీరోచితంగా తిరుగుతున్నారు."[5]

1968 ఆరంభానికి పోలీసు కార్యకలాపాలు ఎక్కువయ్యాయి. ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా పోలీసు కాంపుల్ని తెరిచారు. ఆ సంవత్సరం మార్చిలో వందలాది గ్రామాలపై దాడిచేసి అనేక మంది గిరిజన రైతుల్ని అరెస్టు చేసారు. సీతంపేట ఏజెన్సీలోని బుర్జగూడ గ్రామంలోని రైతుల్ని భూస్వాముల కిరాయితొత్తులు ఎదుర్కున్నారు. శివంపేట పోలీసు స్టేషను క్రిందున్న పెద్దకర్జలో పోలీసులు గిరిజనులపై కాల్పులు జరిపారు. ముందు చెప్పిన నివేదిక ప్రకారం "పెద్దకర్జలో ప్రజలు ఆయుధాల్ని పట్టారు. దాడి చేసే పోలీసుల్ని బాహాటంగా ఎదిరించారు. పోలీసులు మర తుపాకుల్ని కూడా ఉపయోగించారు. మన కామ్రేడ్లిద్దరు ఈ పోరాటంలో ప్రాణాలు కోల్పోయారు."[6]

1968 సెప్టెంబరులో లేవిడీ కేసుపై తీర్పు ఇచ్చారు. గిరిజనుల్ని చంపారని ఆరోపించబడ్డవారిని వదిలేసారు. పోలీసు దమనకాండకు ఈ తీర్పు తోడై గిరిజనుల్నీ వాళ్ళ కమ్యూనిస్టు నాయకుల వైఖరినీ మరింత మొండిగా చేసింది. ప్రస్తుత భూస్వామ్య వర్గ ప్రయోజనాలని పరిరక్షించే ప్రస్తుత సాంఘిక ఆర్థిక వ్యవస్థలో న్యాయవ్యవస్థ కూడా దానికి అనుగుణంగానే వ్యవహరిస్తుందని కమ్యూనిస్టు నాయకులు నచ్చచెప్పగలిగారు. తమ విముక్తిని సాధించుకోవాలంటే, భూస్వాములనీ, సాహుకార్లనీ వాళ్ళ కొమ్ముకాచే ప్రభుత్వ కార్యాలయాలనీ నాశనం చెయ్యాలి. "... ప్రజా సమస్యలపై నడిపే ఏ పోరాటాన్నైనా మనం రాజకీయాధికారం పట్టుకునే ఉన్నత స్థాయిలో నడిపితేనే మన పని కొనసాగించగలం."[7]

ఈ అవగాహన నుంచి మరో మెట్టు ముందుకు పోతే శ్రీకాకుళం కమ్యూనిస్టులు. నక్సల్బరీ కమ్యూనిస్టుల వ్యూహాన్ని అనుసరించడమే అవుతుంది. వాళ్లు అఖిల భారత

సమన్వయ సంఘంతో సంబంధాలు పెట్టుకోవాలనుకున్నారు.

## సిద్ధాంత రాద్ధాంతాలు

శ్రీకాకుళం నివేదికలో ముందు చెప్పిన 'సిద్ధాంత విభేదాల' గురించి ఇక్కడ చెప్పాలి. సి.పి.ఎం. కేంద్ర కమిటీకి ఆంధ్రరాష్ట్ర కమిటీకి మధ్య సిద్ధాంత విభేదాలు తలెత్తాయి.

ముందు చెప్పినట్టుగా పార్టీ కేంద్రకమిటీ 1967 ఆగస్టునాటి మదురై సమావేశంలో సిద్ధాంత చర్చకై ఒక నివేదిక ముసాయిదాను ఆమోదించింది. 1968లో జరుగనున్న ఆలిండియా ప్లీనం సమావేశంలో ఈ ముసాయిదాను ఆమోదించవలసి ఉంది. జనవరిలో ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాలోని పాలకొల్లులో జరిగిన సి.పి.ఎం. ఆంధ్రరాష్ట్ర కమిటీ ప్లీనం సమావేశానికై శ్రీయుతులు తరిమెల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చంద్ర పుల్లారెడ్డి మొదలైన సి.పి.ఎం. నాయకులు మదురై డాక్యుమెంటును వ్యతిరేకిస్తూ, రెండు ప్రత్యామ్నాయ ముసాయిదాలను తయారు చేసారు.

సిద్ధాంత చర్చకై తయారు చేసిన అధికార ముసాయిదాను (అంటే కేంద్ర కమిటీ ముసాయిదాను) ఆంధ్ర రాష్ట్ర ప్లీనం సమావేశం నిరాకరించింది. ఆంధ్ర అసమ్మతివాదుల వ్రతం ప్రకారం, దేశాన్ని పరిపాలిస్తున్న బడా బూర్జువా వర్గం కాంప్రడార్–బ్యూరోక్రటిక్ తత్వం కల వర్గం. ఈ సూత్రీకరణను అంగీకరించేందుకు సి.పి.ఎం. సిద్ధంగా లేదు. "దాని వర్తకతత్వంలో, పారిశ్రామికతత్వానికి తోడు ఈ కాంప్రడార్ లక్షణాలున్నాయి. ప్రభుత్వ యంత్రాంగంతో మనగలిగే తత్వంలో బ్యూరోక్రటిక్ లక్షణం కనపడుతుంది." అని ఆంధ్రాకమ్యూనిస్టుల అభిప్రాయం. మధురై పత్రంలో "సోషలిజంలోకి పరివర్తనకు రూపాలు" (On Forms of Transition to Socialism) అనే విభాగాన్ని ఆంధ్రా కమ్యూనిస్టులు ప్రత్యేకించి దుయ్యబట్టారు. పార్లమెంటరీ వ్యవస్థలో, పాలకవర్గ పార్టీల ఆధిపత్యంలోని మార్పుల వల్ల పాలకవర్గపు అధికారంలోనూ (శక్తిలోనూ) చెప్పుకోదగిన మార్పులు ఉండవని వాళ్లు భావించారు. సంకీర్ణ ప్రభుత్వాలలో పాల్గొనే సి.పి.ఎం. కేంద్రకమిటీ నిర్ణయాన్ని "శాంతియుత పార్లమెంటరీ పంథాను ప్రబోధించడం తప్ప మరేమీ కాద"నేందుకు సాక్ష్యమని ఆ ముసాయిదా దుయ్యబట్టింది. అంతర్జాతీయ స్థాయిలో సోవియట్ – చైనా సంఘటిత చర్య ప్రతిపాదించిన కేంద్ర కమిటీ వైఖరిని వాళ్లు నిరాకరించారు. సోవియటు యూనియన్ను రివిజనిస్టు శక్తిగా పేర్కొన్నారు.

1968 ఏప్రిలు బర్ద్వాన్‌లో జరిగిన సి.పి.ఎం. ప్లీనం సమావేశంలో ఆంధ్రా

అసమ్మతివాదులు మరీ నిర్మొహమాటంగా దాడి చేశారు. వారిలో ఒకరు ఇలా వాపోయారట. "కాంగ్రేసేతర ప్రభుత్వాలను పోరాటపు సాధనాలుగా ఉపయోగించు కోవడానికి బదులు, ఐక్యసంఘటన ప్రభుత్వాలను పరిరక్షించుకునేందుకు ప్రజా సంఘర్షణలను బలిపెట్టడం మన పనిలో ఆధిక్యతను పొందిందని ఆచరణలో తెలిసింది.... అణచివేతను ఎదుర్కొనేందుకు ప్రజలను సన్నద్ధం చేసే బదులు, ఈ అణచివేతను ఎదుర్కొనేందుకు పార్టీని సిద్ధాంతపరంగానూ, రాజకీయపరంగానూ, సంస్థాపరంగానూ ఆయత్తం చేయకుండా, పార్టీ చట్టబద్ధతను నిలుపుకునేందుకై ప్రజా సంఘర్షణ యొక్క తీవ్రతను, వ్యాప్తిని తగ్గించడానికే మనం ప్రయత్నించాం. భారత విప్లవ పథంలో (పెరుగుతూన్న ఈ ఉద్యమాలను పురస్కరించుకుని) నక్సల్బరీ రైతు పోరాటం ఒక ప్రతీకగా తన ప్రాముఖ్యతను సంతరించుకొంది." శ్రీకాకుళం, నల్గొండ, వరంగల్, ఖమ్మాలలో తమ సొంత అనుభవాన్ని గురించి చెప్తూ "ఈ అణచివేతను ఎదుర్కొనే సమస్యల వల్ల, ఎటువంటి రూపాలలో ఎదిరింపు జరగాలనే విషయం మనముందుకు వస్తుంది."[8] అని చెప్పాడు.

కాని ఆంధ్ర అసమ్మతివాదుల ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు బర్ద్వాన్ ప్లీనంలో 210 ప్రతికూలంగానూ 22 అనుకూలంగానూ గల ఓట్ల తేడాతో వీగిపోయాయి. కాని వాళ్లు తమ భావాలను ఆంధ్రప్రదేశ్‌లో ప్రచారం చేస్తూనే ఉన్నారు. దానికి బదులుగా సి.పి.ఎం. నాయకత్వం 1968 జూన్‌లో నాగిరెడ్డి, పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, కొల్లా వెంకయ్య ప్రభృతులను పార్టీ నుంచి బహిష్కరించింది. ఆ నాయకులు 1968 జూన్ 29, 30 తేదీలలో విజయవాడలో సమావేశమై తమని తాము కమ్యూనిస్టు విప్లవకారులుగా ప్రకటించుకుని, కొమ్మండుగురు సభ్యులతో, నాగిరెడ్డి సమన్వయకారుడుగా (కన్వీనర్) రాష్ట్ర సమన్వయ సంఘం ఏర్పడింది.

రాష్ట్ర సమన్వయ సంఘం జూలై నెల నాటికి తన కార్యక్రమాన్ని నిర్ణయించింది. మావో ఆలోచనల్ని ప్రస్తుత శకం యొక్క మార్క్సిజం - లెనినిజంగా పేర్కొంది. సి.పి.ఎం. నయా రివిజనిజంపై సిద్ధాంతపరమైన సంఘర్షణ అవసరమని వక్కాణించింది. 1948-57 నాటి తెలంగాణా పోరాటం మాదిరిలో త్వరలో మరో తెలంగాణా ఉద్యమాన్ని ప్రారంభిస్తామని ప్రకటించింది. 1968 ఆగస్టు 2వ తేదీన హైదరాబాదులో జరిగిన ఒక పత్రికా సమావేశంలో నాగిరెడ్డి ఈ అంశాలను వివరించాడు. ఈ విధానం దృష్ట్యా తెలంగాణా ప్రాంతంలోని వరంగల్ ఖమ్మం జిల్లాలను కార్యక్రమ ప్రాంతాలుగా ఎన్నుకొన్నారు.

ఈశాన్యంలో శ్రీకాకుళంలోనూ, తెలంగాణాలోనూ, ఆంధ్రప్రదేశ్‌లో రెండు

సాయుధ పోరాట కేంద్రాలు వృద్ధి పొందాయి. శ్రీకాకుళంలో సత్యనారాయణ నాయకత్వంలోనూ, తెలంగాణాలో నాగిరెడ్డి నాయకత్వంలోనూ సాయుధ పోరాటాలు నడుస్తున్నాయి. మొదటి నుంచీ రెండు వర్గాలకూ భేదాభిప్రాయాలున్నాయని తరువాత శ్రీకాకుళంపై వచ్చిన నివేదికల వల్ల తెలుస్తుంది. త్వరలోనే నాగిరెడ్డి రాష్ట్ర సమన్వయ సంఘాన్ని ఖాతరు చేయకుండా శ్రీకాకుళం కమ్యూనిస్టు విప్లవకారులు స్వతంత్రంగా నడుచుకోసాగారు.

## విభేదాలు

ప్రధానంగా ఎత్తుగడల విషయంలోని విభేదాలు వచ్చాయి. నాగిరెడ్డి, అతని అనుయాయులూ చట్టబద్ధంగానూ చట్టం వెలుపలా సంఘర్షణలు జరపాలనీ, ఆర్థిక పోరాటాల ద్వారా సుదీర్ఘమైన సన్నాహాలు చేసి పూర్తి స్థాయి పోరాటాన్ని మొదలెట్టాలని భావించాడు. నక్సల్బరీ సాయుధ పోరాటం వల్ల ప్రభావితులై, తమ సొంత జిల్లాలోని స్వానుభవం దృష్ట్యా శ్రీకాకుళం జిల్లా కమ్యూనిస్టు విప్లవకారులు వెంటనే ఆయుధాలను చేపట్టాలని భావించారు. రాష్ట్ర సమన్వయ కమిటీ నాయకుల గురించి 'శ్రీకాకుళపు నివేదిక' ఇలా పేర్కొంది. "వాళ్లు నయా రివిజనిస్టు సిద్ధాంతాలను వ్యతిరేకిస్తూ వాళ్ళతో తెగతెంపులు చేసుకునేందుకు మొహమాట పడ్డారు." వేరే పార్టీని ఏర్పాటు చేయడం వంటి దుందుడుకు పద్ధతులకు నాగిరెడ్డి అతని అనుయాయులు వ్యతిరేకించారు. కొంత కాలం పాటు ఓర్పుగా ప్రయత్నిస్తే సి.పి.ఎం.లోని చాలా మందిని తమ వైపుకు తిప్పుకోవచ్చునని వాళ్లు భావించారు.

శ్రీకాకుళం పోరాటం జరిపే విధానంలో కూడా భేదాభిప్రాయాలు వచ్చాయి. శ్రీకాకుళం నివేదిక ప్రకారం సమన్వయ కమిటీ నాయకులిలా భావించారు. "ప్రభుత్వపు అణచివేత కొంత తగ్గింది. కూలీరేట్లు, వ్యవసాయ కూలీలు, ఆహారం వంటి సమస్యలపై మనం ప్రజల ముందుకు వెళ్ళే అవకాశం ఉంది." దీనికి శ్రీకాకుళం కమ్యూనిస్టులు ఇలా సమాధానం చెప్పారు. "ఏదేనా పనిని చేపట్టాలంటే మనం పోలీసుల్ని ఎదుర్కొంటామా లేదా అనే ప్రశ్నతో ముడిపడి ఉంది. మనం ఏ సమస్యను చేపట్టినా అక్కడ పోలీసులు ఉంటారు. కనుక మన కార్యక్రమ విధానం పోలీసుల్ని ఎదుర్కొనేదిగా ఉండాలి."[9]

ఆ కాలంలో కమ్యూనిస్టు భావాలు కల యువకులైన మెడికలు ఇంజనీరింగు పట్టభద్రుల సహకారం వల్ల శ్రీకాకుళం కమ్యూనిస్టుల రాష్ట్ర వ్యవస్థ బలం పుంజుకుంది. ఈ యువకులు తీరప్రాంతంలో దక్షిణానకల గుంటూరులో ఒక కమిటీని స్థాపించారు.

20–30 సంవత్సరాల మధ్య వయసులు గల చురుకైన ఈ యువకులు 1966 నాటి విశాఖ ఉక్కు కర్మాగారపు ఆందోళన ద్వారా మార్క్సిజానికి జేరుకున్నారు. అవడానికి ప్రాంతీయతత్వపు కోర్కె ఐనా కాంగ్రెసు కూడా దీన్ని బలపరచింది. ఈ యువకులకు ఆ ఆందోళన ఒక శిక్షణావకాశంగా లభించింది. వాళ్ళప్పుడు విచ్ఛిన్నకర కార్యకలాపాలను (sabotage) ఆకళింపు చేసుకున్నారు. రోజుల తరబడి రాష్ట్ర పరిపాలనను స్థంభింప జేయగల ఆయా పద్ధతుల ప్రభావానికి ముగ్ధులయ్యారు. సి.పి.ఎం.లో సిద్ధాంత విభేదాలు, నక్సల్బరీ పోరాటం వాళ్ళని మరో అడుగు ముందుకు నెట్టింది సాంఘిక వాస్తవికత గురించిన రాజకీయావగాహన వాళ్ళకు ఏర్పడింది. క్రమంగా వాళ్ళు వ్యావసాయిక విప్లవరాజకీయాల వైపుకు మరలారు. కొందరు వైద్య విద్యార్థులు 1968లో గుంటూరులో 'నక్సల్బరీ సంఘీభావ కమిటీ'ని స్థాపించారు. డా॥ భాస్కరరావు లాంటి యువజన నాయకులు వెంపటావు సత్యనారాయణతో సంబంధాలు పెట్టుకున్నారు. గుంటూరు గ్రూపు మధ్య తరగతి యువకులను శ్రీకాకుళ ప్రాంతానికి పంపడం, విప్లవకారులకు ఆయుధాలు కొని పంపడం వంటి బాధ్యతలను సంఘీభావ కమిటీ చేపట్టింది.

రాష్ట్ర సమన్వయ కమిటీకి, శ్రీకాకుళం కమిటీకి విబేధాలు కొనసాగుతూనే ఉన్నాయి. త్వరలోనే శ్రీకాకుళం కమిటీ "పూర్తి స్వతంత్ర ధోరణి"లో ఆలోచించసాగింది. "మేం అఖిల భారత సమన్వయ సంఘంతో సంబంధాలను ఏర్పరచుకునేందుకు సాహసించాం."[10]

1968 అక్టోబరులో శ్రీకాకుళం కమ్యూనిస్టులు చారుమజుందారుతో సంభాషణలు జరిపేందుకు చౌదరి తేజేశ్వరరావును పంపారు. తేజేశ్వరరావు తిరిగి రాగానే అదే నెలలో కొత్తగా ఏర్పడిన శ్రీకాకుళం జిల్లా సమన్వయ సంఘం బొడ్డుపాడులో రహస్యంగా సమావేశమై, సాయుధ పోరాటాన్ని తక్షణం ప్రారంభించాలని తీర్మానించింది. ప్రస్తుత ప్రభుత్వాన్ని కూలదోసి, కార్మిక వర్గనాయకత్వంలో జనతా ప్రజాతంత్ర రాజ్యస్థాపన ఉద్దేశ్యంగా, అధికారం చేపట్టడం ప్రధానాశయంగా, శ్రీకాకుళం ఏజెన్సీలోనూ, కొండ ప్రాంతంలోనూ మైదానాలలోనూ కూడా గెరిల్లా దళాల (స్క్వాడ్లు) ఏర్పాటు జరిగింది.

## శ్రీకాకుళంలో గెరిల్లా పోరాటాలు

1968 నవంబరు 24వ తేదీన మైదాన ప్రాంతంలోని బొడ్డుపాడు దగ్గర గరుడభద్ర గ్రామంలోని ఒక ధనిక భూస్వామి పంటలను బలవంతంగా కోసుకోవడంతో గెరిల్లా

ఉద్యమానికి నాంది జరిగింది. చాలా గ్రామాల నుంచి వచ్చిన దాదాపు 250 మంది గిరిజనులు వెంపటావు సత్యనారాయణ నాయకత్వంలో విల్లంబులు, బల్లేలు ధరించి పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతంలోని పెద్ద గొట్టిలి గ్రామంలోని భూస్వామి తీగల నరసింహులు ఇంటిపై దాడి చేసారు. నిలవ ఉంచిన ధాన్యం, బియ్యం, ఇతర ధాన్యాలు మొదలుగా గల దాదాపు 20,000 ఆస్థి దాకా స్వాధీనం చేసుకున్నారు. ఎన్నో సంవత్సరాలుగా తమను ఆ భూస్వామికి కట్టి పారేసిన ప్రామిసరీ నోట్లను తదితర పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.

నవంబరు 25 చర్యకు ముందుగా వీరోచితమైన అనుయాయులతో గెరిల్లా దళాలను ఏర్పరిచారు. "తుపాకీ నుపయోగించడంలో శిక్షణ ఇచ్చేందుకు గెరిల్లా శిబిరాలను నిర్వహించాం. గ్రామాలలో ఓ వైపు శిక్షణ శిబిరాలూ మరోవైపు పోలీసు దాడులూ జరుగుతూనే ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయగలిగాం". శ్రీకాకుళ నాయకుల అభిప్రాయం ప్రకారం నవంబరు 25వ తేదీ చర్య "ఏజెన్సీ భూస్వాముల గుండెలలో గుబులు, ఆందోళన"లను కలుగజేసింది. ".... మరిన్ని ప్రత్యేక సాయుధ పోలీసు దళాలను ఏజెన్సీ ప్రాంతానికి పంపారు. అప్పటికే పెద్ద పెట్టున మొదలైన దమనకాండను మరింత తీవ్రం చేసారు. గెరిల్లా సంఘర్షణ విధానాలతో పోలీసు ముఠాలకు ఎదురు నిలచాం."[11]

ఏజెన్సీ ప్రాంతంలో అటువంటి చర్యలెన్నో జరిగాయి. ప్రత్యేకించి వాటిలోకెల్లా ముఖ్యమైన సంఘటన ఆవిరి ప్రాంతంలోని బలేరుగూడాలో జరిగింది. పోలీసులు 1968 డిశెంబరు 20 తేదీన ఆవిరి ప్రాంతంలో దాడి చెయ్యడానికి ప్రవేశించారు. శ్రీకాకుళం నివేదిక ఇలా వివరించింది. "ప్రజలు (చేసిన) ఈ తిరుగుబాటు కొండలనే కదిలించింది. ఆ రోజు ఉదయం పోలీసులు సంచరించడాన్ని ప్రజలు గమనించారు. వాళ్లు కొండల పైకెక్కి చుట్టుపక్కల గ్రామ ప్రజలని ఎలుగెత్తి పిలిచారు. దాదాపు 500 మంది ప్రజలు దాపునున్న బెలేరుగూడా వద్ద గుమిగూడారు. 200 మంది దాకా ప్రజలు విల్లంబుల్ని, నాటు తుపాకుల్నీ, కొండరాళ్ళనూ ఆయుధాలుగా ధరించి పోలీసుల్ని గ్రామంలోకి రానివ్వలేదు. పోలీసులు వెనుదిరిగారు. విల్లంబులతోనూ రాళ్ళతోనూ తరుముతూ ప్రజలు వాళ్ళపై దాడిచేసారు. పోలీసులు దిగిపోతుంటే ప్రజలు వాళ్ళపై కాల్పులు జరిపారు. కొండవాళ్ళను వాళ్ళ మీదకు తోసారు. ".... ఇద్దరు కానిస్టేబుళ్ళూ ఒక సర్కిలు ఇనస్పెక్టరూ ఆ యుద్ధంలో చచ్చారు."

ఆయుధపరంగా ఆధిక్యత గల పోలీసు దళాన్ని బహిరంగ యుద్ధంలో ఎదుర్కోవడం అంత క్షేమకరం కాదని. గెరిల్లా యుద్ధపు అవసరాన్ని కమ్యూనిస్టు నాయకులు తరవాత

ప్రజలకు నచ్చచెప్పారు. దాంతో 1968 డిశెంబరు 23వ తారీఖున పోలీసులు ఆవిరి ప్రాంతంలో మళ్ళీ ప్రవేశించినప్పుడు. "…. ప్రజలు దాక్కుని శత్రువు గురించి ఎదురు చూశారు. మన గెరిల్లాలో ఒకరు తుపాకీ పేల్చగానే ఒక కానిస్టేబులు నేలకొరిగాడు…" "దాంతో మా పోరాటం గెరిల్లా స్థాయికి జేరింది."[12] అని నాయకులు చెప్పారు. జిల్లాలోని ఏడెనిమిది వందల చదరపు మైళ్ళ ప్రాంతంలో గిరిజన పోరాటం వ్యాపించిందని, ఆ సంవత్సరం డిశెంబరులో 'లిబరేషన్' పత్రికలో 'శ్రీకాకుళం కామ్రేడ్లు' తయారు చేసిన వ్యాసంలో పేర్కొన్నారు.

వ్యవస్థానుకూల పత్రికలు కూడా తిరుగుబాటుదార్ల విజయాన్ని ధృవీకరించాయి. ఆ ప్రాంతాన్ని సందర్శించిన స్టేట్స్‌మన్ పత్రిక దక్షిణ భారత ప్రత్యేక విలేకరి ఇలా రాసాడు "ఈనాడు సుదూరమైన అనేక కొండ ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వపు అధికారం చెల్లడం లేదు. ఎందరో గిరిజనులు గెరిల్లా ఎత్తుగడలలోను, ఆయుధాల నుపయోగించడంలోనూ తరిఫీదు పొందుతున్నారు…. గత నెలలో గిరిజనులు మళ్లీ యుద్ధరంగంలోకి దిగి గిరిజన రిజర్వులోని వివిధ ప్రాంతాలలోని భూస్వాములపై నాలుగు దాడులు జరిపి దాదాపు రూ॥ 50,000 (విలువ కల) ఆస్తిని కొల్లగొట్టారని తెలుస్తూంది …. గత ఫిబ్రవరి నుంచీ ఉన్న ప్రత్యేక సాయుధ పోలీసులు (Special Armed Constabulary - అను) తిరుగుబాటును అణచడం మాట అటుంచి, గిరిజనులలో రాష్ట్ర ప్రభుత్వంపై మరింత శతృభావాన్ని మార్క్సిస్టులు పెంచేందుకు (వీలు కల్పించేలా) తమ కార్యకలాపాల (క్రూరత్వం) ద్వారా సాయపడ్డారు…. పోలీసులు ఎనిమిది నెలలుగా తీవ్రంగా వెదికినా ముఖ్య నాయకుల్ని పట్టుకోలేక పోవడాన్ని బట్టి (చూస్తే) గిరిజనుల్లో వాళ్లకు గల ప్రాబల్యం తెలుస్తుంది."[13]

ఆ కాలంలో తిరుగుబాటుదారులు అనుసరించిన దాడి విధానాలను మరో పత్రిక వర్ణించింది. ఆ సమాచారం ప్రకారం ఒక పోలీసు దళం పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతంలోని ఓ గ్రామంపై దాడి చేసేందుకు వెళుతూండగా పులిపట్టి కొండలలో వందలాది సాయుధ గిరిజనులు వాళ్లను చుట్టుముట్టారు. ఐదు కొండ శిఖరాలను ఆక్రమించి, బండరాళ్ళను తోసీ, రాళ్ళను బాణాలను వాళ్ళమీదకు విసురుతూ తుపాకీలతో పోలీసు పార్టీని ఎదుర్కొన్నారు. ఒక ఆఫీసరుతో సహా నలుగురు పోలీసులు చచ్చారు. ఆ చుట్టివేత నుంచి తప్పించుకునేందుకు పోలీసులు 19 రౌండ్లు కాల్చవలసి వచ్చింది.[14] 1969 జనవరి 6వ తేదీన హైదరాబాదు నుంచి పి.టి.ఐ.* పంపిన

* *ప్రెస్-ట్రస్టు ఆఫ్ ఇండియా - వార్తా సంస్థ - అను.*

మరో సమాచారం. అంతకు రెండు రోజుల ముందర ఏజెన్సీ గ్రామ ప్రాంతంలోని దక్షిణ గ్రామంలో జరిగిన సంఘటన గురించి వివరించింది. సాయుధ గిరిజనులు ఎన్నో ఇళ్ళకు నిప్పు పెట్టారు. వాటిలో పోలీసు స్థావరంగా ఉపయోగించిన స్కూలు కూడా ఉంది. తగలబడుతున్న ఇళ్ళనుంచి పారిపోతున్న పోలీసుల్ని గిరిజనులు తుపాకీలతో ఎదుర్కొన్నారు.

## ఒరిస్సాలోకి విస్తరణ

అదే గెరిల్లా ఉద్యమం త్వరలోనే పక్కనున్న ఒరిస్సా రాష్ట్రానికి కూడా వ్యాపించింది. శ్రీకాకుళం జిల్లా ఏజెన్సీకి సరిహద్దులోనే కోరాపుట్ జిల్లా అడవులున్నాయి. పూర్తిగా ఉత్తరాన కలహంది, రాయపూర్ జిల్లాలు, పశ్చిమాన మధ్యప్రదేశ్‌లోని బస్తర్ జిల్లా, దక్షిణాన ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం, తూర్పుగోదావరి, విశాఖ జిల్లాలు, సరిహద్దులతో కోరాపుట్ జిల్లా 'వై' ఆకారంలో ఉంది.

దట్టమైన కొండ అడవులు కమ్యూనిస్టు గెరిల్లాలకు చక్కటి రక్షణ ప్రాంతంగా పనిచేసాయి. ఆ ప్రాంతపు ఒక ఉన్నత పోలీసు అధికారి చెప్పినట్టు "నక్సలైటు పథకాలు అనుకూలిస్తే దాన్ని దుర్భేధ్యమైన కోటగా మార్చవచ్చు."[15]

శ్రీకాకుళ ప్రాంతాన్నించి పొడిగించిన విముక్తిప్రాంతంగా ఏర్పరిచేందుకై కమ్యూనిస్టు విప్లవకారులు తమ కార్యకలాపాలను కోరాపుట్ జిల్లాలోని గునుపూర్ సబ్‌డివిజనుకు పరిమితం చేసారు. గునుపూర్ కోర్టులోని న్యాయవాదులైన డి. భువన్‌మోహన పట్నాయక్, నాగభూషణ పట్నాయక్‌లు ఆ ప్రాంతపు సంస్థలోని ప్రధాన నాయకులు. గిరిజనుల తరపున కోర్టు వివాదాలలో ఫీజు లేకుండా వాదించిన వీళ్ళు ఆ ప్రాంతపు గిరిజన రైతాంగపు అభిమానాన్ని చూరగొన్నారు. గునుపూర్ సబ్ డివిజనులోని కపిలాపూర్‌లోని డి.బి.ఎం. పట్నాయక్ ఇంటిలో 1969 జనవరి 23వ తేదీన కార్యక్రమాన్ని రూపొందించేందుకై రహస్య సమావేశం జరిగింది. గునుపూర్ సబ్ డినిజనులోని ధనిక రైతులపై దాడులు ప్రారంభించాలని నిశ్చయించారు. ఆ ప్రాంతంలోని గ్రామాల్లో విప్లవ సిద్ధాంతాలను ప్రచారం చేసేందుకు జనవరి 24–28 తేదీల మధ్య రహస్య సమావేశాలు జరిపారు. తరతరాలుగా తమ రక్తాన్ని పీలుస్తున్న భూస్వాములూ, సాహుకార్లు రెండు కాళ్ళ బెబ్బులులనీ వాళ్ళు శిక్షార్హులనీ రైతులకు బోధించారు.

కాని ఒరిస్సా కమ్యూనిస్టు విప్లవకారుల మొదటి వ్యూహం విఫలమైంది. పోలీసులకు సమాచారం అంది వాళ్ళు జనవరి 28వ తేదీన ఒరిస్సా సైనిక పోలీసు దళంతో

గునుపూరు వచ్చారు. గాలింపు కార్యకలాపాల ద్వారా (combing operations), ఔత్సాహికుల గృహాలపై దాడి చేసి, ఆయుధాలనూ మందుగుండు సామాగ్రినీ పట్టుకున్నారు. దక్షిణాన గల కోరాపుట్ నుంచి గునుపూర్ దాకా, పశ్చిమ ఒరిస్సాలోని కొండ ప్రాంతాల ద్వారా పశ్చిమ బెంగాలు దాకా విమోచన ప్రాంతం (లోభాగంగా) ఏర్పాటు చేసే పథకం బయట పడిందని పోలీసులు జబ్బులు చరుచుకున్నారు.

మొదటి ప్రణాళిక అలా విఫలం కాగా, అసలు ఒరిస్సాకు చెందిన ఆంధ్రప్రదేశ్ విప్లవనాయకుడు, ప్రముఖ కవి, సుబ్బారావు పాణిగ్రాహి ఉద్యమాన్ని ఒరిస్సా సరిహద్దు గ్రామాలకు విస్తరించే బాధ్యతను స్వీకరించాడు.[16] ఒరిస్సా ముఖ్యమంత్రి ఆర్ఎస్. సింఘ్‌దేవ్ ఒరిస్సా శాసన సభలో 1969 ఫిబ్రవరి 28వ తేదీన, 32 చురుకైన "నక్సలైట్ తరహా సెల్సు" గునుపూర్ అటవీ ప్రాంతంలో పని చేస్తున్నాయని నివేదించాడు. గునుపూర్ టౌనులో గోడలపైన "మావో సేటుంగు వర్ధిల్లాలి!" "నక్సల్బరీ జిందాబాద్" వంటి నినాదాలు ఇంగ్లీషులోనూ ఒరియాలోనూ చోటు చేసుకున్నాయి. అంతేకాక తిరుగుబాటుదార్లు భూస్వాముల ఆస్తులను పట్టుకొంటున్నారు. పోలీసు పార్టీలపై దాడులు పెరిగాయి.

ఆంధ్రప్రదేశ్ ఈశాన్య ప్రాంతంలో అలా ఉద్యమం పుంజుకుంటూండగా, పశ్చిమాన తెలంగాణా ప్రాంతంలోని అసమ్మతి కమ్యూనిస్టుల రాజకీయ ధోరణులు మరో రూపాన్ని సంతరించుకుంటున్నాయి.

## నాగిరెడ్డి

నాగిరెడ్డి నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమన్వయ సంఘం తెలంగాణాలో కేంద్రీకరిస్తూ, అఖిల భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ సంఘానికి 1968 అక్టోబరులో అనుబంధం పొందింది. కాని ఇదివరలో చెప్పుకున్నట్లు ఒకవైపున నాగిరెడ్డి గ్రూపుకూ మరోకపక్క శ్రీకాకుళం జిల్లా సమన్వయం సంఘానికీ, AICCCR* (అఖిల భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ సంఘం)కూ సంబంధాలు ఒకరి మీద ఒకరికి అనుమానాలతో అపార్థాలతో ఉన్నాయి.

తెలంగాణా కమ్యూనిస్టు విప్లవకారులు. శ్రీకాకుళం కమ్యూనిస్టుల కంటే చాలా తర్వాత చారుమజుందారు రాజకీయావగాహనకు వచ్చారు. సి.పి.ఎం. కేంద్ర నాయకత్వం పశ్చిమ బెంగాలు కమ్యూనిస్టు విప్లవకారులను బహిష్కరిస్తుంటే, 1967

* *All India Co-ordination Committee of Communist Revolutionaries*

ఆగస్టు 8వ తేదీన పుల్లారెడ్డి కేంద్ర కమిటీకి రాసిన ఒక లేఖలో అధికార వైఖరిని సమర్ధిస్తూ ఇలా రాసాడు." ఈ సమస్యపై చైనా కమ్యూనిస్టు పార్టీ నుంచి మనల్ని మనం నిశితంగా వేరుపరుచుకోవాలి. ప్రత్యేకించి ప్రభుత్వ తత్వం గురించీ, ప్రస్తుత స్థితి యొక్క విశ్లేషణ గురించీ, కాంగ్రేసేతర ప్రభుత్వాలతో పాల్గొనడం గురించీ నక్సల్బరీ రైతాంగ పోరాటాలపై వాళ్ళ (చైనీయుల) యుక్తిలేని ప్రకటనల గురించీ, (మనం వాళ్లనుంచి) నిశితంగా వేరుపరచుకుంటూ, పార్టీ కార్యక్రమంపై స్థిరంగా నిలబడాలి."[17] నక్సల్బరీ పోరాటాన్నించి శ్రీకాకుళ పోరాటాన్ని వేర్పరిచే ప్రయత్నంలో నాగిరెడ్డి కొద్ది రోజుల తరువాత; "మరో నక్సల్బరీ పోరాటాన్ని మార్క్సిస్టు కమ్యూనిస్టులు ప్రారంభించనున్నారని ప్రజలను భయపెట్టేందుకు చేసే ప్రయత్నాలన్నీ కూడా శ్రీకాకుళం జిల్లా గిరిజనుల సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరలించలేవు"[18] అని హెచ్చరించాడు.

తరువాత తెలిసిన విషయాల ప్రకారం, శ్రీకాకుళం కమ్యూనిస్టులు సి.పి.ఎం. నుంచి చాలా ముందే తెగతెంపులు చేసుకుందామనుకున్నారు. నాగిరెడ్డి ఆధీనంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకత్వం, శ్రీకాకుళం గ్రూపు సిద్ధాంతాలనూ విధానాలనూ ఆమోదించినా సి.పి.ఎం.తో మాత్రం వెంటనే సంస్థాపరమైన తెగతెంపులు చేసుకునేందుకు సిద్ధంగా లేదు. ఇంకా సందిగ్ధంలో కొట్టుకుంటున్న కొంత మంది కామ్రేడ్లను తమ వైపుకు తిప్పుకునేందుకు చూస్తున్నారు.[19] నిజానికి చాలా తరవాత అంటే 1969 ఏప్రిలులో తెలంగాణా కమ్యూనిస్టులు సాయుధ పోరాటాన్ని ప్రారంభించారు. దీర్ఘకాలికమైన ప్రజా ఉద్యమాలు నిర్మించి తగిన సన్నాహం చేసాకనే సాయుధ చర్యలు ప్రారంభించాలనే అభిప్రాయం వాళ్లకుండడమే దానికి కారణం. శ్రీకాకుళం జిల్లా కమిటీకి నాగిరెడ్డి గురించి ఉన్న 'మినహాయింపులు' AICCCRకు కూడా ఉన్నాయి. AICCCR ఆదేశించిన వెంటనే నాగిరెడ్డి ఆంధ్రప్రదేశ్ విధాన సభనుంచి రాజీనామా చెయ్యలేదు. నాగిరెడ్డి యొక్క రాష్ట్ర సమన్వయ సంఘం చైనా కమ్యూనిస్టు పార్టీకి అనుకూలంగా లేదని AICCCR ఆరోపించింది.

శ్రీకాకుళం, తెలంగాణా పోరాటాలు నడిపే తీరును బట్టి కూడా ఎత్తుగడల విషయంలోనూ విభేధాలున్నాయని తెలుస్తుంది. ఎంతో కాలం పాటు అఖిల భారత సంఘానికీ (AICCCR) తెలంగాణా గ్రూపుకూ సంబంధాలు బాగా సాగలేదు. అఖిల భారత సంఘం 1969 ఫిబ్రవరి 7వ తేదీన ఆంధ్ర రాష్ట్ర సమన్వయ కమిటీ అనుబంధాన్ని తొలగించింది. కాని దాని సభ్యుల్ని "స్నేహితులు, కామ్రేడ్లు"గా అఖిల భారత సంఘం వెలుపల ఉంటారనీ, వారితో గల సంబంధాలు "విరోధాత్మకం

కానివి" (non-antagonistic)గా ఉంటాయనీ పేర్కొంది. వేరే పార్టీని ఏర్పాటు చేయాలని కూడా అఖిల భారత సంఘం తీర్మానించింది. ఆంధ్ర రాష్ట్ర సమన్వయ శాఖ మాత్రం వేరేగా ఉంటూ స్వతంత్ర కార్యక్రమాన్ని రూపొందించుకుంది. దీంతర్వాత శ్రీకాకుళం తెలంగాణ ఉద్యమాలు వేర్వేరు స్వతంత్ర మార్గాలు అనుసరించాయి. నిర్దాక్షిణ్యమైన పోలీసు దమనచర్యను ఎదుర్కొంటూ, విప్లవ స్థావరాలు ఏర్పాటులో కృతకృత్యు లయ్యాయి. రెండు ఉద్యమాలూ కూడా తమ తమ ఎత్తుగడల లాభనష్టాలను రుజువు చేసాయి.

ఈలోగా శ్రీకాకుళంలో ఉద్యమం ముందుకు సాగుతూనే ఉంది. 1969 ఫిబ్రవరి 'లిబరేషన్' సంచికలోని ఒక వ్యాసంలో 1968 డిసెంబరు 20వ తేదీకి 1969 జనవరి 30వ తేదీకి మధ్య "గిరిజన గెరిల్లాలు ఒక సబ్ ఇన్‌స్పెక్టరు, మరో సర్కిల్ ఇన్‌స్పెక్టరుతో సహా 29 మందికి తక్కువ కాకుండా ప్రగతి నిరోధక పోలీసులను చంపారు." అని పేర్కొంది. అదే వ్యాసంలో "ఫ్యూడలు భూస్వాముల నిలువ ధాన్యాన్ని ఇతర జీవితావసరాల్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడం, అప్పులనూ రుణాలను తిరిగి చెల్లించేందుకు నిరాకరించడం, ఫ్యూడలు భూస్వాములను స్థాన భ్రష్టులను చేసేందుకు ప్రయత్నించడం, సాయుధ విప్లవపోరాటపు తక్షణాశయాలు"గా పేర్కొంది.

దీన్ని బట్టి ఫ్యూడలు భూస్వాములూ షావుకార్లనూ గ్రామాల నుంచి తొలగించడం, వాళ్లలో చెడ్డవాళ్లను చంపడం, మిగతావాళ్లను లొంగదీసుకోవడం, లేదా వాళ్లను పరారీ అయ్యేలా చేసి, తరువాత భూమిని గిరిజన భూమిలేని రైతాంగానికి పంపిణీ చేసి, వాళ్ల పాత అప్పులను రద్దు చేసి గ్రామ జీవనాన్ని పునర్వ్యవస్థీకరించడం వాళ్ల మౌలిక కార్యక్రమమని తెలుస్తుంది.

## శ్రీకాకుళం విజయాలు

తమ ఆశయాలను సాధించడంలో తిరుగుబాటుదార్లు చాలా వరకు కృతకృత్యులయ్యారు. 1969 జూన్ నాటికి రాష్ట్ర ప్రభుత్వం పార్వతీపురం, పాతపట్నం, పాలకొండ ప్రాంతాలను 'కల్లోలిత ప్రాంతాలు'గా ప్రకటించింది. 'లిబరేషన్'లో ప్రచురించిన ఒక సమాచారం ప్రకారం 300 గ్రామాలలో 'అరుణ రాజకీయాధికారం" (Red Political Power) నిలదొక్కుకుంది. భూస్వాములు భయపడి పారిపోయారు. గెరిల్లా దళాలు. ఆత్మరక్షణ దళాలు, గ్రామరక్షణ చేసాయి. రైతాంగ సంగ్రామ సమితి గ్రామపాలన చేపట్టింది. త్వరలోనే సమితి భూస్వాముల నుంచి దక్కించుకున్న భూమిని పంచుతుందన్నారు.

కేంద్ర ప్రభుత్వం కూడా కలవరపడింది. కేంద్ర దేశీయాంగ శాఖ నివేదిక ప్రకారం శ్రీకాకుళ ప్రాంతంలో 1969 జనవరి నుంచి 1969 ఆగస్టు దాకా 86 'హింసాయుత సంఘటనలు' జరిగాయి. ఇంతవరకు గిరిజనులు "విల్లంబులు, బల్లేలు, సాధారణ మందుగుండు సామాగ్రి, మజిల్ లోడింగ్ తుపాకులు" ఆయుధాలుగా వాడినా, ఇప్పుడు వాళ్లు "మంచి తరహా ఆయుధాలను" సేకరించుకునే విషయం పట్ల ఆ నివేదిక ఆందోళన వెలిబుచ్చింది. ఇంకా ఇలా అంది. "శ్రీకాకుళం ప్రాంతంలోని తిరుగుబాటుదార్లు దాపునే ఉన్న ఒరిస్సా జిల్లాలోని తీవ్రవాదులతో మరింతగా సంబంధాలను ఏర్పరుచుకున్నారు."[20] కేంద్ర ప్రభుత్వ అధికారవర్గాలు గిరిజనులు విముక్తి చెందాలనే కోర్కెకూ, దాన్ని సాధించడానికీ మధ్య ఒక ముతక సరిహద్దు గీసి, వాళ్లు విముక్తి చెందాలనే తన లావాటి నివేదికల్లో గిరిజనుల కష్టాలను గుర్తించి కూడా తమ అవస్థకు కారకమైన వ్యవస్థను మార్చేందుకు గిరిజనులు ప్రయత్నిస్తే వాళ్లను తీవ్రంగా అణచివేసేందుకు నిశ్చయించింది.

1969 మార్చిలో ఆ ప్రాంతాన్ని చారుమజుందార్ సందర్శించడం, ఈ లోగా జరిగిన విశేషం. తెలంగాణాలోని నల్గొండ, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచీ, రాయలసీమ మొ॥ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కమ్యూనిస్టు విప్లవకారులు ఏర్పరచిన ఆ సమావేశానికి అతను హాజరయ్యాడు. వాళ్లు కొత్తగా కమ్యూనిస్టు విప్లవకారుల ఆంధ్రరాష్ట్ర సమన్వయ సంఘంగా ఏర్పడ్డారు. AICCCR పాత సమన్వయ సంఘానికి తన అనుబంధాన్ని ఏనాడో నిలిపివేసింది. హృదయాన్ని కదిల్చి వేసేలా రాసిన ఒక వ్యాసంలో చారుమజుందార్ ఆ సమావేశపు అనుభవాల్ని వివరించాడు. మావో ఆలోచన ఆధారంగా పార్టీని నిర్మించేందుకు, అవకాశవాదాన్ని ఎదుర్కొనేందుకు ఆంధ్ర విప్లవకారులు కృతనిశ్చయం గురించి (చారుమజుందారు ఆ వ్యాసంలో) పేర్కొన్నాడు. సమావేశానికి హాజరైన వాళ్లనిలా వర్ణించాడు. "వాళ్లు ప్రసిద్ధికెక్కినవాళ్లు కాని, అఖిల భారత స్థాయి కలవాళ్లు కాని కాకపోవచ్చు. కాని వాళ్లు యువకులు, కలలుకనే యువకులు. తరతరాలుగా పీడింపబడుతున్న ఆకలినుంచి, కర్కశ దారిద్ర్యం నుంచి, అజ్ఞానపుటంధకారపు లోతుల్లోంచి, కోట్లాది రైతుల్ని విముక్తి చేసేందుకు వాళ్లు కలలు కంటున్నారు.... వాళ్లు సోమరిగా కలలు కనే వాళ్లు మాత్రం కాదు. సులభంగా విజయం వరిస్తుందని వాళ్లనుకోవడం లేదు. ఎదురుదాడులు వస్తాయనీ వాళ్లకు తెలుసు. తాము తీవ్ర పరాజయాలను భరించవలసి వస్తుందనీ వాళ్లకు తెలుసు."

తిరుగుబాటుదార్ల కార్యదీక్ష, విప్లవోత్సాహం చారుమజుందారును ముగ్ధుణ్ణి

చేసాయి. ఆయనిలా అన్నాడు. "చాలా కాలం తరవాత తమ ఆస్తులనన్నిటీ అమ్మి వేసి పార్టీ నిధికి సమర్పిస్తామని ప్రతిజ్ఞ చేసిన కమ్యూనిస్టు విప్లవకారుల సమావేశానికి హాజరయ్యాను..." 'శ్రీకాకుళ పోరాటాన్ని బలపరచేందుకు మరెన్నో ప్రాంతాల్లో శ్రీకాకుళాన్ని నిర్మిద్దాం'. అనే నినాదం ఒక్కసారిగా సమావేశపు వాతావరణాన్ని మార్చింది. ఆ గదిలో గాలి కూడా ఉత్తేజం పొందిందనిపించింది. హాజరైన కామ్రేడ్లందరూ తెలంగాణాలోను, రాయలసీమలోని వివిధ జిల్లాల్లోనూ, ఆంధ్రదేశమంతటా శ్రీకాకుళాల్ని నిర్మిస్తామని ప్రకటించారు. ఆ మహోత్సాహ సమయంలో నాకు పదే పదే కలిగిన ఆలోచన ఒకటే. తెలంగాణా వీర విప్లవకారులు తమ జీవితాల్ని వృథాగా బలిచెయ్యలేదు. ఇక్కడే భారతదేశపు ఏనాన్ ఏర్పడుతుంది."(20)

తీవ్రతలోనూ, వైశాల్యంలోనూ నక్సల్బరీ ఉద్యమంకంటే శ్రీకాకుళం ఉద్యమం ఉన్నత స్థాయిలో ఉందని క్రమంగా తెలుస్తోంది. కమ్యూనిస్టు విప్లవోద్యమంలో ఎత్తుగడల పరిణామక్రమంలో సిద్ధాంతపరంగా ఒక ముఖ్య దశకు సంకేతంగా కూడా అది నిలిచింది. మొదటిసారిగా గెరిల్లా యుద్ధంలో చారుమజుందారు సిద్ధాంతాలలో అత్యంత వివాదాస్పదమైన "వర్గశత్రు నిర్మూలన" మొదట్లో శ్రీకాకుళంలో ప్రముఖ పాత్ర వహించింది.

## వర్గశత్రు నిర్మూలనం

శ్రీకాకుళోద్యమ కథనాన్ని ఇక్కడ కొంత సేపు ఆపి 'వర్గశత్రు నిర్మూలన'పు ఎత్తుగడలను గురించి వివరంగా చర్చించడం అవసరం. తెలియనివాళ్లు దీన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. చారుమజుందారు శత్రువులు దీన్ని వక్రీకరించి, ఒక వ్యక్తిని చంపడం – అదే ఆశయంగా భావించడం, అని భాష్యం చెప్పారు. ఆ ఎత్తుగడలు ఒక విస్తృత కార్యక్రమంలో అంతర్భాగంగా పోరాటపు తీరులో తయారయ్యాయని మనం ఈ సందర్భంలో జ్ఞాపకం ఉంచుకోవాలి. తన రాతలలో పరిస్థితి యొక్క అవసరాన్ని బట్టి చారుమజుందారు దీన్ని వక్కాణించడం, లేదా తగ్గుస్థాయిలో చెప్పడం జరిగింది.

మనకు లభించే అతని రాతలలో 'నిర్మూలన' (ఖతం) అనే మాట మొట్టమొదటిగా 5వ నెం. పత్రం ('1965లో ఎటువంటి అవకాశాలు కనిపిస్తున్నాయి'?)లో కనిపిస్తుంది. కమ్యూనిస్టు విప్లవకారులు కార్మిక వర్గానికీ, విప్లవ ప్రజలకూ ఇలా బోధించాలని అందులో కోరాడు. వాళ్లు "ఏదో ఎదుర్కొనేందుకు ఎదుర్కోకూడదు. వాళ్లు ఎవరిని

ఎదుర్కొంటారో వాళ్లను అంతం చేయాలి. ఏదో (తేలిక భావంతో) ఎదుర్కొంటే ప్రగతి నిరోధక యంత్రాంగం ప్రతీకారం తీసుకుంటుంది. కాని వాళ్లు నాశనం (ఖతం) తలపెడితే ప్రభుత్వ దమన యంత్రాంగం భయపడుతుంది." చారుమజుందారు 1969లో రాసిన మరో వ్యాసంలో నిర్మూలన (ఖతం)కు మరింత ధృవీకరించిన పాత్రనిస్తూ ఇలా చెప్పాడు. "ఉన్నతమైన ఆయుధాలను సంపాదించడం ద్వారానే మనం గెరిల్లా యుద్ధాన్ని చెయ్యలేదని అనుభవం తెలుపుతోంది. మావో సేటుంగు ఆలోచన ఆయుధంగా కల మనుషులను కూడా మనం తయారు చెయ్యాలి. ఆ ఆయుధాల్ని వాళ్లు చేపడతారు. అటువంటి మనుషుల్ని మనం తయారు చెయ్యందే అటువంటి ఆయుధాలు నిరుపయోగం. విప్లవాత్మక వర్గ సంఘర్షణ ద్వారా, వర్గశతృవులను నిర్మూలించడం ద్వారా మాత్రమే అటువంటి మనుషులు తయారౌతారు."(24)

అప్పటికే శ్రీకాకుళంలో ఒప్పుకున్న ఎత్తుగడలలో వర్గశతృవుల నిర్మూలనం ఒకటి. 1969 ఫిబ్రవరిలో రాసిన 'శ్రీకాకుళంపై నివేదిక' ఇలా పేర్కొంది. వర్గశత్రువులను నిర్మూలించడంలోనే ఇటీవల మన ప్రధాన ప్రయత్నాల్ని కేంద్రీకరించాం. 1969 ఫిబ్రవరి 6వ తేదీన వర్గ శతృవును ఖతం చెయ్యడంతో, పోలీసు ఏజెంటుపై చేసిన తీవ్రగాయంతో, శతృవులు విభ్రాంతులయ్యారు. ప్రజల ముఖాలపై ఉత్సాహం పెల్లుబుకుతోంది."[21]

అదే సంవత్సరం డిసెంబరులో రాసిన మరో వ్యాసంలో చారుమజుందారు 'నిర్మూలనం' లేదా 'ఖతం'గా వ్యవహరించిన దాని విపులమైన ప్రాముఖ్యతను వివరించాడు. గెరిల్లా యుద్ధాన్ని ఎలా ప్రారంభించాలో వివరిస్తూ "గ్రామ ప్రాంతంలో ఫ్యూడలు వర్గాలను నాశనం చెయ్యడం ద్వారానే దాన్ని ప్రారంభించగల"మని చెప్పాడు. "ఫ్యూడలు వర్గాల పెత్తనాన్ని నాశనం చేసి గ్రామ ప్రాంతంలో రైతాంగ రాజకీయాధికారాన్ని స్థాపించాలనే రాజకీయాలతో బీదరైతులనూ, భూమిలేని రైతులనూ ప్రభావితం చేయడం ద్వారా వర్గశతృనిర్మూలనానికి సంబంధించిన ప్రచారాన్ని మొదలు పెట్టగలం."(28) వర్గశతృవుల నిర్మూలనానికి సంబంధించిన ప్రచారంలో చారుమజుందారు భూమిలేని రైతుల పైనా బీదరైతుల పైనా ఆధారపడాలని కోరడం గమనార్హం. కారణం, "బీదరైతులూ భూమిలేని రైతులే ఫ్యూడలు వర్గాలంటే అత్యంత తీవ్రమైన అసహ్యతను కలిగి ఉంటారు." ఓపిక లేని విప్లవకారులు సాధారణంగా అనుసరించే విధానం – ఏదో ఒక పెటీ బూర్జువా విప్లవకారుడు తాను ఒక్కడుగా గ్రామ వర్గశతృవును చంపడాన్ని – చారుమజుందారు వ్యతిరేకించాడు.

గ్రామ భూస్వామి లేదా షావుకారు 'నాశనం' (ఖతం)లో చారుమజుందారు సాధారణ 'హత్యా' కాండను, పీడించబడే రైతు యొక్క ప్రతీకార జ్వాల తాత్కాలికంగా చల్లారడం మాత్రంగానే చూడలేదు. "వర్గశతృవు 'నాశనం'లో ఒక వ్యక్తి అంతరించడమే కాదు. వర్గశతృవు యొక్క రాజకీయ, ఆర్థిక, సాంఘికాధికారాన్ని కూడా 'ఖతం' – చేయడం అవుతుంది." అని చెప్పాడు. (28) ఆ విధంగా అది అనేక సంఘటనల పరంపరకు నాందీ పలుకుతుందని భావించాడు.

"ఒక ప్రాంతాన్ని వర్గశతృవు కోరల్లోంచి విముక్తి చేయగానే (కొంత మంది నాశనమవుతారు, మరికొంత మంది పరారీ అవుతారు). రాజ్య యంత్రాంగానికి కళ్లూ చెవులూ పోతాయి. ఎవరు గెరిల్లాయో, ఎవరు కాదో, ఎవరు తన భూమిని దున్నుకుంటున్నాడో ఎవరు జోతేదారు భూమిని సాగు చేస్తున్నాడో తెలుసుకోవడం అసంభవమై పోతుంది..."

"రాజకీయ యూనిట్లు గుసగుసల నినాదాలతో, విస్తృతమైన ఆర్థిక నినాదాన్ని లేవదీస్తాయి. 'వర్గశతృవు పంటలను కొల్లగొట్టండి' ఇది గ్రామాలలో ఇంద్రజాలంలా పనిచేస్తుంది. చాలా వెనుకబడిన రైతు (కూడా) పోరాటంలో చేరేందుకు ముందుకు వస్తాడు. అలా రాజకీయాధికారాన్ని పట్టుకునేందుకు కొందరు అగ్రగామి విభాగాలు ఆరంభించిన పోరాటం ప్రజల అద్భుతోత్సాహంతో, ప్రజాచర్యలతోనూ పెంపొందుతుంది."(29)

ప్రభుత్వం మాత్రం చూస్తూ కూర్చోదు. త్వరలోనే పోలీసులు గ్రామాన్ని దాడి చేస్తారు. దీనికి మరింత తీవ్రమైన గెరిల్లా వ్యూహం అవసరం "కొన్ని గెరిల్లా దళాలు వర్గశతృవులను నాశనం చేస్తాయి. ఇంకొందరు పోలీసు బలాన్ని ఎదుర్కొంటారు. నిర్మూలనోద్యమం వల్ల గెరిల్లా దళాలకు రాజ్య యంత్రాంగపు ఆధునికమైన తుపాకులు దొరుకుతాయి."(39) ఒక దశలో గెరిల్లా దళాలు విస్తరిస్తాయి. ప్రజా విమోచన సైన్యం ఏర్పడుతుంది.(50)

చారుమజుందారు "నిర్మూలన" (ఖతం) ఎత్తుగడలకు ఆశయం వేరే ఉందని భావించాడు. బంతిని దొర్లించేందుకు కొట్టే మొదటి దెబ్బ అది. అది దొర్లుతూ పెరుగుతుంది. కాని అది చాలా ముఖ్యమైన దెబ్బ. కారణం, అది రైతు యొక్క విప్లవ చైతన్యాన్ని విడుదల చేస్తుంది. ఒక దశలో అప్రమత్తుడై తన అనుయాయులకు చారుమజుందారు ఇలా చెప్పాడు. "రాజకీయాధికారాన్ని పట్టుకోవడం వర్గపోరాటం యొక్క ప్రధానాశయం. అంతేకాని 'నిర్మూలనం' కాదు. వర్గపోరాటం యొక్క ఉన్నత రూపం 'నిర్మూలనం' కావచ్చుగాక".(74)

## శ్రీకాకుళంలో పరిణామాలు

మళ్లీ శ్రీకాకుళోద్యమాన్ని పరిశీలిద్దాం. గెరిల్లాలు చేసిన దాడులలోనూ, 'ప్రజా శత్రువులకు' న్యాయనిర్ణయం చేసే ప్రజా న్యాయస్థానాలను ఏర్పాటు చేయడంలోనూ చారుమజుందారు చెప్పిన 'వర్గశత్రువుల నిర్మూలనం'పై ప్రాధాన్యత కనిపిస్తుంది. కొన్ని సందర్భాలలో ఎందరో గ్రామప్రజలు వెంటరాగా సాయుధ గెరిల్లా దళాలు దాడులు నిర్వహించారని ముఖ్యంగా గమనించాలి. ప్రముఖంగా భూస్వాములపైనా, సాహుకార్లపైనా, కొన్ని సందర్భాలలో పోలీసు స్థావరాలపైనా ఆ దాడులు జరిగాయి.

ఉద్యమ ప్రారంభ దశలో – అంటే 1968 చివర 1969 మొదట్లో – భూస్వాముల ఆస్తుల్ని మాత్రం లాక్కొని వాళ్లను వదిలేసేవారు. ప్రజాకోర్టులు విచారణకై తెచ్చిన ముద్దాయిల విషయంలో కూడా ఉదారంగా ఉండేవి. శ్రీకాకుళంలోని ప్రజాకోర్టులో ఒక సాహుకారు (హెచ్చు వడ్డీలతో పీడించేవాడు. Userer) గురించిన 1969 మే నెల 'లిబరేషన్' సంచికలో వర్ణించిన విచారణ. నాటి తిరుగుబాటుదార్ల మన స్థితిని తెలుపుతుంది. ఆ వ్యాపారస్తుడు డబ్బు అప్పుగా ఇచ్చి, చింతపండు రూపంలో బాకీలు వసూలు చేసుకునేవాడు. ఈసారి వాడు గ్రామానికి వసూళ్లకై వచ్చి రావలసిన దానికంటే ఎక్కువ వసూలు చేయాలనుకున్నాడు. వెంటనే రైతులు వాణ్ణి అదుపులోకి తీసుకుని 'స్థావరానికి' విచారణకు తీసుకెళ్లారు. ప్రజాకోర్టులో రైతులను పీడిస్తున్నట్టు వాడు ఒప్పుకున్నాడు. రైతు సంగ్రామ సమితి విధించిన నియమాలకు బద్ధుడనై ఉంటానని మాటిచ్చాడు. తన ఉంగరాన్ని సమితికిచ్చి రైతుల బాకీలన్నీ వదులుకున్నాడు.

అలాగే 1969 మే, 12వ తేదీన ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖకు చెందిన ఒక కానిస్టేబులు కాకితాడ గ్రామంలోని ప్రజలను బాధిస్తూండగా గ్రామరక్షణ దళం వాళ్లు పట్టుకున్నారు. వాడు తన నేరాలను ఒప్పుకుని ప్రజా న్యాయస్థానంలో క్షమాబిక్ష కోరాడు. పార్టీ నిధికి 20 రూపాయలు చందా తీసుకుని వాడిని న్యాయస్థానం వదిలేసింది.[22]

కాని నిర్దాక్షిణ్యమైన శత్రువు పట్ల అటువంటి ఔదార్యం వృధాగా చూపడం వల్ల నష్టం కలిగింది. చచ్చే పాముకు చికిత్స చేయడంలా తయారైంది. అది తరువాత ఎలాగూ కాటేస్తుంది. పారిస్ వీరోచిత కమ్యూనార్డ్స్ గురించి కార్ల్‌మార్క్సు చెప్పినట్టు "వాళ్ళు ఓడిపోయారంటే దానికి కారణం వాళ్ల మంచితనమే."[23] అలాగే అర్హతలేని శత్రువుపై అనవసరంగా చూపిన ఔదార్యానికి బదులుగా శ్రీకాకుళం విప్లవకారులు హెచ్చుమూల్యాన్నే చెల్లించవలసి వచ్చింది.

పంచాది కృష్ణమూర్తి అనే మేధావి. యువకమ్యూనిస్టు, శ్రీకాకుళం గెరిల్లా

ఉద్యమంలో చేరి సాయుధోద్యమాన్ని మైదాన ప్రాంతాలకు వ్యాపింపచేయాలని ప్రయత్నిస్తున్నాడు. 1969 మే 27వ తేదీన మరో ఆరుగురు గెరిల్లా సహచరులతో అతనిని సోంపేట రైల్వేస్టేషనులో పోలీసులు అరెస్టు చేసారు. ఆ సమయంలో వాళ్ల దగ్గర ఆయుధాలేవీ లేవు. అరెస్టయిన సహచరులిద్దరూ 18–20 సంవత్సరాలలోపు వయసువాళ్లే. పోలీసులు వాళ్ళను జలంతర కోట దగ్గరున్న ఒక ప్రదేశానికి తీసుకెళ్లి కాల్చి చంపారు.[24] తరువాత కాలంలో వాళ్లు కమ్యూనిస్టు విప్లవకారులతో ఇదే మాదిరిగా వ్యవహరించసాగారు. అటువంటి కాల్పులు జరిపి, హతులు ఎదురు కాల్పుల్లో (Encounters) చనిపోయినట్టుగా తరువాత ప్రచారం చేయడం పరిపాటై పోయింది.

విచారణ కూడా లేకుండా చేసిన నిర్దాక్షిణ్యమైన ఖూనీ తప్ప మరేమీ కాని ఈ సంఘటన శ్రీకాకుళం కమ్యూనిస్టు విప్లవకారులను పునరాలోచనకు పురికొల్పింది. 'నిర్మూలనపు' ఎత్తుగడలలో ముందువెనకలాడే పెట్టీ బూర్జువా నిర్వాహకులు వేచియుండేందుకు అవకాశం లేదని గుర్తించారు. శత్రువు దాడి చేసాకే పరిరక్షణ మొదలు పెట్టడం సరికాదని తెలుసుకున్నారు. అధికారం చేపట్టాలంటే మొదటి దెబ్బ మనమే కొట్టాలి. వర్గశత్రువుల నిర్మూలనమే మొదటి దెబ్బగా భావించారు. ఈ మహోన్నత వర్గ సంఘర్షణల్లో శత్రువు పట్ల దయాదాక్షిణ్యాలకు తావు లేదు. అటువంటి అవకాశాలు ఇవ్వరాదు." అని అన్నారు.[25]

నిజానికి కొంత కాలంగా పోలీసులు, పాలనాయంత్రాంగం తిరుగుబాటుదార్లను తుడిచిపెట్టేందుకు తమ బలాలను సమీకరిస్తున్నారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి, పోలీసు ఇన్‌స్పెక్టరు జనరలు (ఐ.జి.) రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాధికార్లు హాజరైన ఒక సమావేశం మే నెలలో జరిగింది. ఆ సమావేశంలో 'చుట్టుముట్టి అణచివేత (encirclement and suppression) అనే పథకాన్ని అమలు జరపాలని నిర్ణయించారు. ఆ దిశలో జరిగిన మొదటి చర్యగా మే 27వ తేదీ దాడి జరిగింది. రాష్ట్ర పాలనాయంత్రాంగానికి సాయంగా కేంద్ర ప్రభుత్వం కేంద్ర రిజర్వు పోలీసు దళాల్ని పంపింది. 1969 జూలై 30వ తేదీ విజయవాడ ఎడిషను 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్సు, పత్రిక ఇలా రాసింది. "గాలింపు కలాపాలలో (Combing operations) ఆంధ్ర పోలీసులతో ఒరిస్సా పోలీసులు సహకరిస్తున్నారు. పార్వతీపురం ఏజెన్సీ సరిహద్దు ప్రాంతంలో ఆంధ్ర, ఒరిస్సా పోలీసులు సంయుక్తంగా దాడులు జరుపుతున్నారు." అదే పత్రిక ఆగస్టు 12వ తేదీన ఇలా రాసింది. "సరిహద్దు ప్రాంతాలలో నక్సలైటు కార్యకలాపాలను సమర్థవంతంగా అదుపు చేసేందుకు రాష్ట్రాల మధ్య సన్నిహితావగాహన ఉండేందుకై

నేటి సాయంకాలం ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, రాష్ట్రాల ఉన్నత పోలీసు అధికార్ల అంతర రాష్ట్ర సమావేశం జరిగింది.”

వీటన్నిటివల్లా, కమ్యూనిస్టు విప్లవకారుల కార్యకలాపాలు ఒరిస్సాలోకి పెల్లుబుకడమే కాక, మరింత పడమటకు కూడా వ్యాపిస్తున్నాయని తెలుస్తూంది. సవరలు, మరియలు మొదలైన భూమి లేని ఆదివాసుల నివాసమైన అడవులతో నిండిన బస్తరు జిల్లా కొండ ప్రాంతాలు సరిహద్దులుగా గల తెలంగాణాలోని వరంగలు ఖమ్మం జిల్లాలలో పెరుగుతున్న గెరిల్లా చర్యల దృష్ట్యా మధ్యప్రదేశ్ పోలీసుల్ని పిలవవలసి వచ్చింది. 1969 మే ‘లిబరేషను’ సంచిక ఇలా రాసింది. “రైతాంగ గెరిల్లాలు కమ్యూనిస్టు విప్లవకారుల నాయకత్వంలో తెలంగాణాలోని ఖమ్మం జిల్లాలోని బూర్గంపహాడ్ తాలూకాలోని ఐదు గ్రామాల్లోని అనేక మంది భూస్వాముల ఇళ్ళపై ఏప్రిలు 17వ తేదీ రాత్రి దాడిచేసి వెండి బంగారు ఆభరణాల్ని ప్రేలుడు ఆయుధాల్నీ కొల్లగొట్టారు. కమ్యూనిస్టు విప్లవకారుల నాయకత్వంలో రైతాంగ గెరిల్లాలు ఖమ్మం జిల్లాలోని రెండు గ్రామాల్లోని భూస్వాముల ఇళ్ళపై ఏప్రిలు 23వ తేదీరాత్రి దాడి చేసి ఒక గ్రామం నుంచి లక్ష రూపాయల విలువ చేసే నగలనూ సొమ్మునూ పట్టుకుపోయారు.”

తెలంగాణాలో మాత్రం అన్ని చర్యలు AICCCRకు విధేయులైన కమ్యూనిస్టు విప్లవకారులే నిర్వహించలేదని గుర్తుంచుకోవాలి. ఈలోగా ఆ ప్రాంతంలో నాగిరెడ్డి గ్రూపు కూడా ఉద్యమాన్ని నిర్వహించగలిగింది.

## నాగిరెడ్డి ‘తక్షణ కార్యక్రమం’

AICCCR అనుబంధం తీసేసాక నాగిరెడ్డి గ్రూపు 1969 ఫిబ్రవరి మూడవ వారంలో విజయవాడలో సమావేశమైంది. AICCCR తమపై మోపిన అభియోగాన్ని వాళ్లు అంగీకరించలేదు. తమతో సంబంధం తెంచెయ్యాలనే AICCCR నిర్ణయం ప్రజా సంఘర్షణలకు హాని కలిగిస్తుందని భావించారు. దేశమంతటా చక్కగా సమన్వయమవుతున్న కమ్యూనిస్టు విప్లవకారుల కార్యకలాపాలను ఈ చర్య కుంటుపరుస్తుందని భావించారు. అటువంటి సమన్వయం ఈ సమయంలో ఎంతో అవసరం కదా.

1969 మార్చి 11వ తేదీన నాగిరెడ్డి అసెంబ్లీ నుంచి రాజీనామా చేసాడు. దీన్తరవాత విషయాలు చురుకుగా సాగాయి. 1969 ఏప్రిలు 10 నుంచి 12వ తేదీ దాక కృష్ణాజిల్లాలోని కంభంపాడు పంచాయితీ సరిహద్దుల్లో గల ఒక నిమ్మతోటలో,

నాగిరెడ్డి నాయకత్వంలోని కమ్యూనిస్టు విప్లవకారులు సమావేశమయ్యారని వినికిడి.* రహస్యంగా జరిగిన ఆ సమావేశంలో సాయుధ పోరాటం గురించిన ముసాయిదా తీర్మానాన్నొక దాన్ని ఆమోదించారు. దాన్నే 'తక్షణ కార్యక్రమం' (Immediate Programme) గా జారీ చేసారు. అది తెలుగులో 'తక్షణ కార్యక్రమం'గా పేరొందింది.

'తక్షణ కార్యక్రమం' భారత రాజ్యాన్ని బ్యూరోక్రటిక్ తత్వంకలదిగానూ, కాంప్రడార్ బూర్జువావర్గం ఆధీనంలో ఉందనీ వర్ణించింది. ప్రభుత్వాన్ని, ఫ్యూడలిజాన్నీ నిర్మూలించే అవసరాన్ని నొక్కిచెపుతూ, నూతన ప్రజాతంత్ర రాజ్యస్థాపనను ఆశించింది. దీనికి ఒక విప్లవాత్మక కమ్యూనిస్టు పార్టీని నిర్మించాలి. గ్రామాలను విముక్తి చేయాలి. పట్టణాలను చుట్టుముట్టి క్రమంగా నగర ప్రాంతాలను కూడా విముక్తి చేయాలి. ఆంధ్రప్రదేశ్ విషయంలో 'కార్యక్రమం' శ్రీకాకుళం జిల్లాలో "ప్రజా ఉద్యమం సాయుధ పోరాట స్థాయికి జేరుకుందని" ఒప్పుకుంది. "వరంగల్లు, ఖమ్మం జిల్లాల్లోని అడవి ప్రాంతాల్లో ప్రజా ఉద్యమం సాధారణ చట్ట పరిమితులను అధిగమించిందని" భావించింది. సత్వరసమస్యగా నున్న భూమిని పునఃపంపిణీ చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెపుతూ 'కార్యక్రమం' ఇలా హెచ్చరించింది. "మన కార్యక్రమాన్ని (అంటే భూమిని పునఃపంపిణీ చేసి వ్యవసాయక విప్లవాన్ని) అమలు జరపడం మొదలెట్టగానే, ప్రభుత్వ సాయుధ పోలీసుల నుంచి దాడులు మొదలవుతాయి. దాంతో మన నిరోధం కూడా అమలుపరచాలి."

ఇక్కడే నాగిరెడ్డి గ్రూపుకు, చారుమజుందారు గ్రూపుకు వ్యూహపరమైన విభేదం ఉంది. రాజకీయాధికారాన్ని పట్టుకోవడం ముఖ్యోద్దేశంగా, మొదటగా వర్గశత్రువును ఎదుర్కోవలసిన అవసరాన్ని చారుమజుందారు బలపరచాడు. అతని వ్యూహం ప్రకారం ముందు భూస్వాముల నిర్మూలన, తరవాత భూమిని పంచడం జరగాలి. నాగిరెడ్డి తక్షణ కార్యక్రమం ప్రకారం వ్యావసాయిక సంఘర్షణ లేక భూమి పంపిణీ ముందు జరగాలి. భూస్వాములనూ పోలీసులనూ తరువాత నిరోధించడం జరుగుతుంది. నాగిరెడ్డి ఒక విలేకరికి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పినట్టు, "మాకు నిరోధించడం ముఖ్యం. వాళ్ళకు (చారుమజుందారు అనుయాయులకు) ముందు దాడి చేయడం ముఖ్యం."[26]

'లిబరేషన్' పత్రిక కొంత కాలం తరవాత ప్రచురించిన 'తక్షణ కార్యక్రమ'పు విమర్శలో ఇలా ప్రశ్నించింది. "వర్గశత్రువు ఇంకా బావుండి తిరిగి వచ్చే శక్తి ఉండగా రైతు తనకు పంచిన భూమిని ఎంతకాలం నిలబెట్టుకోగలడు? అనతి కాలంలోనే ఆ

---

* *దీనినే వెంట్రప్రగడ నిమ్మతోట సమావేశంగా పార్టీ వర్గాలలో ఉదహరిస్తారు – అను*

భూమిని సాహుకారు, జోతేదారు చేతుల్లోకి కోల్పోతాడు.'' ''వర్గశత్రువును నిర్మూలించడం ద్వారా, పోలీసులకు వాళ్ళ 'కళ్లను' 'చెవుల్ని' లేకుండా చేయడం ద్వారా, స్థానిక చండశాసనుల పీడ వదలించుకోవడం ద్వారా గ్రామ ప్రాంతంలో విముక్తి ప్రాంతాలు ఏర్పరిచే''[27] అవసరాన్ని ప్రచారం చేయకపోవడం పట్ల నాగిరెడ్డిని అనుయాయుల్ని ఆ వ్యాసకర్త దుయ్యబట్టాడు.

'తక్షణ కార్యక్రమం' నగర కార్మిక వర్గానికి కూడా ఒక పాత్రనిచ్చింది. ''ఆచరణలో అడవి ప్రాంతాలు ప్రాముఖ్యత కలిగి ఉంటాయి. అయినా నగరాలను వదలిపెట్టడం సరికాదు. మనం నడిపే సాయుధ పోరాటానికి పట్టణ కార్మిక వర్గపు సాయం అవసరం. సరకుల సరఫరాకు, ఇతర సాంకేతిక సహాయానికి రవాణా కార్మికుల ఇతర కార్మికుల సాయం అవసరం'' అడవులు, కొండలు 'కీలక' ప్రాంతాలు. ఆ ప్రాంతాల్లో శత్రువు బలంగా లేడు. సుదీర్ఘ సాయుధ పోరాటం జరిపి, నిరోధం జరిపే గెరిల్లాలకు ఆ ప్రాంతాల భూభాగం చాలా అనుకూలం. తక్షణ కార్యక్రమం ''వేసవి ఆఖరు దాకా ప్రజలను భూస్వాములకు వ్యతిరేకంగా వీరోచితంగా సమీకరించాలని'' నిర్దేశించింది. వానలు మొదలవగానే భూమిని తిరిగి పంచాలి. దాన్ని గెరిల్లా సంఘర్షణతో సమన్వయ పరచాలి. ''వర్షాకాలం నిరోధోద్యమానికి అనుకూలమైన వాతావరణం.''

వ్యూహం, ఎత్తుగడల్లో ప్రకటించిన విభేదాలు తప్పితే, ఆచరణలో మాత్రం శ్రీకాకుళంలో జరుగుతున్నదానికి నాగిరెడ్డి అనుచరుల కార్యక్రమానికీ ఎటువంటి తేడా లేదు. ఏప్రిల్లో రాష్ట్ర సమావేశం జరిగిన వెంటనే వాళ్లలో కొందరు విజయవాడలో సమావేశమై ఖమ్మంలోని పగిడేరు, పాల్వంచ ప్రాంతాలలో కలాపాలను సాగించాలని నిశ్చయించారు. పోలీసుల సమాచారం ప్రకారం 1969 ఏప్రిలు 16వ తేదీన తిరుగుబాటు దార్లు పగిడేరులోని భూస్వాముల్ని ఎదుర్కొని నాలుగు తుపాకుల్ని లాక్కున్నారు. ములుగు ప్రాంతంలోని గుమ్మడి దొడ్డి గ్రామంలోని ఒక భూస్వామిపై దాడిచేసి, లక్ష రూపాయలు విలువ గల ఆస్తిని కొల్లగొట్టారు.[28]

త్వరలోనే వరంగల్, ఖమ్మం, కరీంనగర్, తూర్పుగోదావరి జిల్లాలో అనేక గెరిల్లా దళాలు ఏర్పడ్డాయి. దళాలలో ఏడెనిమిది మంది సభ్యులు, ఒక నాయకుడు, ఉపనాయకుడు, ఒక ప్రచారకుడూ ఉంటారు. మొత్తం కార్యకలాపాలు జరిగే ప్రాంతాన్ని మూడు ఏరియా కమిటీలుగా విభజించారు. ములుగు, ఖమ్మం, రంపచోడవరం ఏజెన్సీ ఏరియా కమిటీలే ఆ మూడు. మొదటి రెండు ఏరియా కమిటీలూ 1969 ఏప్రిలు 30, మే 1, వ తేదీలలో సమావేశమై ''అడవి ప్రాంతాల్లో పని చేస్తున్న ఫారెస్టు అధికారుల నందరినీ తరిమికొట్టాలి. వ్యవసాయానికి పనికి వచ్చే భూములను

ఆక్రమించాలి... ఈ కార్యక్రమాన్ని అమలు పరిచేందుకు పోలీసుల దమనకాండను నిరోధించాలి. సాధ్యమైన సందర్భాలలో పోలీసులను చుట్టుముట్టి దాడిచేయాలి. గ్రామాలకు సమాచారాన్ని సేకరించేందుకు వచ్చే సి.ఐ.డి.లను చంపాలి.[29] పై నిర్ణయం ప్రకారం వీళ్లు ఖమ్మం, కరీంనగరం, వరంగలు ప్రాంతాల్లో భూస్వాములనూ, సాహుకార్లనూ చంపారు. తిరుగుబాటుదార్లు పోలీసు స్టేషన్లపై దాడిచేసి ఆయుధాలను పట్టుకున్నారు. వీటితో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని భూములను ఆక్రమించారు. శ్రీకాకుళం ఉద్యమంలో ప్రస్ఫుటమైన లక్షణాలే (ధాన్యాలను కొల్లగొట్టడం, రికార్డులనూ పత్రాలనూ అంటించి వెయ్యడం) ఈ ప్రాంతపు తిరుగుబాటులో కూడా ముఖ్య ఘట్టాలు.

## కార్యకలాపాలు జరిగిన ప్రాంతం

ఈ దశలో నాగిరెడ్డి గ్రూపు పని చేసిన ప్రాంతాల తాలూకు భౌగోళిక సామాజిక ఆర్థిక పరిస్థితులను పేర్కొనడం అవసరం. ఆంధ్రప్రదేశ్ విప్లవ కమ్యూనిస్టు కమిటీ (RCC) పేరుతో వాళ్లు పని చేశారు.

ఉత్తరాన ఆంధ్రప్రదేశ్‌నూ మధ్యప్రదేశ్‌నూ వేరు చేసే గోదావరి, బస్తరు కొండలు, వరంగలు, ఖమ్మంజిల్లాలోని పొడవాటి అడవి ప్రాంతం అది. గోదావరి గట్టుపైన వరంగలు నుంచి (ములుగు తాలూకా) ఏటూరు నాగారం దాకా గల కంకర రోడ్డు మినహా ఆ ప్రాంతంలో ఆ కాలంలో చెప్పుకోతగ్గ రోడ్డు అంటూ ఏదీ లేదు. అడవుల కౌగలింతలో నిదురించే ఆ గ్రామాలు కోయలు గోండులు వంటి ఆదివాసులు నివాసాలు.

ఇండియాలోని మిగతా ప్రాంతాలలో లాగే ఇక్కడ కూడా ఆదివాస రైతాంగం సాహుకార్ల అప్పులు, రుణాల బంధాలతో కట్టుబడి పోయి ఆర్థిక విపత్తులతో సతమతమవుతున్నారు. అసలు ఆదివాస రైతుకు చెందిన భూమి, బయటివాళ్ళు వచ్చి చేరడంతో ఎలా అన్యాక్రాంతమైంది ఒక వ్యాఖ్యాత వర్ణించాడు. “లంచం తీసుకుని గ్రామాధికారి, వలస వచ్చిన కుటుంబానికి (భూమిని) కౌలుకు ఇమ్మని ఆదివాసిని ప్రోత్సహిస్తాడు... అసలే తక్కువ ధాన్యాన్ని తప్ప పండించలేని ఆదివాసి, తన మంచి భూమిని కౌలుకిచ్చినందువల్ల, సొంతంగా తక్కువ ధాన్యాన్ని పండిస్తాడు. ఒకటి రెండు సంవత్సరాలలో కౌలుదారుకు బాకీపడతాడు. గ్రామాధికార్లతో కుమ్మక్కయిన కౌలుదారు ఆదివాసి భూమిని చాలా తక్కువ ధరకు కొనగలుగుతారు. కౌలు కాగితం మీద సంతకం పెట్టించుకునే నెపంతో విక్రయ పత్రం మీద ఆదివాసి వేలిముద్ర

సంపాదించడం మరో పద్ధతి. ఆదివాసి వివాదం నడపనూ లేదు. మోసగాడు వస్తూంటే ఆపనూ లేదు. ఒకవేళ అడ్డగించినా వాణ్ణితంతారు. గ్రామాధికార్ల నోళ్లు, పోలీసుల నోళ్లు లంచాలతో మూతపడతాయి."[30] 1948 మధ్య ప్రాంతంలో భారత సైన్యం మైదానాలలోకి ప్రవేశించిన తరవాత, 1946–51 కమ్యూనిస్టు పోరాట సమయంలో కమ్యూనిస్టు తిరుగుబాటుదార్లకు ఈ ప్రాంతపు అడవులు తలదాచుకునేందుకు ఉపయోగపడ్డాయి. ఇక్కడి కోయ ప్రజలు కమ్యూనిస్టులకు సాయపడ్డారు. వాళ్ళు గెరిల్లా దళాలలో చేరి భారత సైన్యంతో పోరాడారు.[31]

ఆదిమ రైతాంగం యొక్క ప్రస్తుత ఆర్థిక నైరాశ్యం. గతంలోని వాళ్ళ వీరత్వం దృష్ట్యా RCC నాయకులు తమ కార్యకలాపాలను ఈ ప్రాంతంలోనే కేంద్రీకరించారు. RCC తన 'తక్షణ కార్యక్రమం'లో ఇలా పేర్కొంది. "తూర్పు గోదావరి జిల్లా ప్రాంతంలో ఏజెన్సీరైతులు, భూస్వాములు అక్రమంగా ఆక్రమించిన భూముల్ని స్వాధీనం చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు... అడవుల్లోనూ, కొండ ప్రాంతాల్లోనూ నివసించే గిరిజనులనూ, సామాన్య ప్రజలనూ భూస్వాములు, సాహుకార్లు, అటవీ శాఖాధికారులూ అనేక విధాల పీడిస్తున్నారు. పీడించే వర్గాలపైనా, ప్రభుత్వం పైనా ఈ ప్రాంతపు ప్రజలు కావలిసే తిరుగుబాటు చేస్తున్నారు." కాబట్టి ఇక్కడి ప్రజలు ఆయుధాలను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారని RCC భావించింది.

RCC కీ AICCCR కూ గల రాజకీయ విబేధాలతో పోలీసులకు పని లేకపోయింది. ఇరువురి అనుయాయులనూ వాళ్లు సమంగానే చూశారు. వాళ్లు రెండు గ్రూపులను నిర్దాక్షిణ్యంగానే వెంటాడారు. వాళ్ల చర్యల వల్ల వచ్చిన ఒకే తరహా ఫలితమే బహుశ దానికి కారణమై ఉండవచ్చు. ప్రభుత్వ దమన యంత్రాంగపు సభ్యుల్లోనూ గ్రామ ప్యూడలు వర్గాల్లోనూ పెంపొందిన భయమే వాళ్ళ చర్యల ఉమ్మడి ఫలితం. 1969 నాటికి RCC, AICCCR లు ఒకళ్ళనొకళ్ళు విమర్శించుకున్నా, వాళ్ళ మధ్య వైరుధ్యాలు మాత్రం 'విరోధాత్మకం కానివి' (non-antognostic) గానే ఉన్నాయి. తరువాత దశలో అవి రెండు గ్రూపులనూ చుట్టుముట్టిన తీవ్ర విరోధ స్థాయికి చేరుకున్నాయి.

RCC 'తక్షణ కార్యక్రమం' ఇలా చెప్పింది. "మనం శ్రీకాకుళం ఉద్యమం నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలి. ఆ ఉద్యమ పథంలో చేసిన తప్పులను మనం తిరిగి చెయ్యకుండా ఉండేలా చూసుకోవాలి... మనం శ్రీకాకుళ ఉద్యమాన్ని బలపరచడమే కాకా దాన్ని గురించి శత్రువర్గాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని కూడా ఎదుర్కోవాలి". AICCCR గ్రూపు కూడా RCC చర్యల్ని గుర్తించడానికి సిద్ధపడుతుండేది. 1969

జూలై నాటి 'లిబరేషన్' సంచికలోని ఒక సమాచారం ఇలా వివరించింది. "ఇంకా మన పార్టీకి చెందని విప్లవ కేడర్లు వరంగలు జిల్లాలోని ములుగు తాలూకాలో కొన్ని చర్యలు నిర్వహించారు. మన పార్టీ నాయకత్వంలోనూ, ఇతర విప్లవ కేడర్ల నాయకత్వంలోనూ, ఖమ్మం జిల్లాలోని భద్రాచలం, కొత్తగూడెం తాలూకాలలో అనేక గెరిల్లా చర్యలు జరిగాయి."

ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు విప్లవకారుల కార్యకలాపాలు 1969 చివరకు, 15 జిల్లాల్లోని (ప్రాంతాల్లో) వ్యాపించాయి. శ్రీకాకుళం, వరంగలు జిల్లాల్లోని తీవ్ర పరిస్థితి దృష్ట్యా ప్రభుత్వం వాటిని 'కల్లోలిత ప్రాంతాలు'గా ప్రకటించింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం కమ్యూనిస్టు విప్లవకారులు భూస్వాములు, వర్తకులు, సాహుకార్లు, అటవీ శాఖాధికారులు, పోలీసులతో సహా 48 మందిని చంపారు. పోలీసులపై 99 దాడులు జరిపారు. 15 మందిని ఎత్తుకు పోయారు. ఎత్తుకుని పోయిన వాళ్ళను 'ప్రజాకోర్టు'ల్లో విచారించి, మరణశిక్ష మొదలుకుని జరిమానా దాకా అనేక శిక్షలు విధించారు. తిరుగుబాటుదార్లు ఆయా దాడులలో అధిక సంఖ్యలో తుపాకులూ, మందుగుండు సామాగ్రి, ప్రేలుడు సామాగ్రి సంపాదించారు. 1968–69 కాలంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఈ ఉద్యమం, పటిష్టత, నిర్వహణ, అభివృద్ధిల దృష్ట్యా కొద్దికాలమే గర్జించిన నక్సల్బరీ ఉరుముకంటే మరింత చక్కగా ప్రతిధ్వనించిన భీకర నినాదంగా దాన్ని చెప్పుకోవచ్చు. భారత విప్లవ పథంలో మార్గ దర్శకంగా నక్సల్బరీ 'సాయుధ విప్లవా'న్ని సూచించింది. మరో మలుపును తెలుపుతూ శ్రీకాకుళం 'గెరిల్లా యుద్ధాన్ని' వివరించింది.

# 6. పార్టీ పుట్టుక

విప్లవం కావాలంటే విప్లవాత్మక పార్టీ ఉండి తీరాలి.

– మావోసేటుంగు 'ప్రపంచ విప్లవ శక్తులారా ఏకం కండి.
సామ్రాజ్యవాద దురాక్రమణను ఎదిరించండి' నవంబరు. 1948
Selected Works Vol IV పే. 284.

'భారత కమ్యూనిస్టు పార్టీ' (మార్క్సిస్టు–లెనినిస్టు)ని నిజమైన కమ్యూనిస్టు పార్టీని, మేము ఏర్పరచుకున్నామని ఈ రోజున ఈ సమావేశంలో చాలా గర్వంగా, చాలా సంతోషంగా ప్రకటిస్తున్నాను.

– కలకత్తా మైదాన్‌లో 1969 మే 1వ తేదీన కానుసన్యాలు ఉపన్యాసం

## సి.పి.ఐ. (మా.లె.) ప్రారంభానికి పూర్వం విప్లవ కార్యకలాపాలు

సాధారణంగా ప్రభుత్వంలో మార్పులు తెచ్చేందుకు, చెదురుమదురుగా హటాత్తుగా హింసాయుత సంఘటనలు జరగడం, ఆందోళనలు, ఎన్నికల వత్తిడులు, రాజ్యాంగ అర్థ–రాజ్యాంగ పద్ధతులను అవలంభించడం, 1947 నాటి నుంచీ మామూలు విషయమే. భారత పాలకవర్గాలపై వ్యతిరేకత 1967 నాటి నక్సల్బరీ తిరుగుబాటుతో, 1968–69 సంవత్సరాలలో శ్రీకాకుళం కమ్యూనిస్టు విప్లవకారుల విజయాలతో సాయుధ పోరాట నిర్వహణ స్థాయికి చేరుకుని ప్రభుత్వాన్ని పడగొట్టి అధికారాన్ని పట్టుకునే దశకు జేరుకుంది. గత 20 సంవత్సరాల్లో ఈ పద్ధతిలో జరిగిన ఒకే ఒక పోరాటంగా భారత కమ్యూనిస్టు పార్టీ 1948–51 కాలంలో జరిపిన స్వల్పకాలిక (తెలంగాణ సాయుధ) పోరాట దశను పేర్కొనవచ్చు.

నాలుగో అధ్యాయం చివర పేర్కొన్నట్టుగా, నక్సల్బరీ తరువాత పార్లమెంటరీ సి.పి.ఎం. నుంచి బహిష్కరించడం, లేదా, విడిపోవడం వంటి సైద్ధాంతిక చర్చల

పరిమితిలు దాటి, సాయుధ పోరాటాన్ని గురించి, గ్రామ స్థావరాల ఏర్పాటు గురించీ కమ్యూనిస్టు విప్లవకారులు ఆలోచించసాగారు. 1968లో దేశంలో వివిధ ప్రాంతాలలో అనేక కార్యకలాపాలలో సాయుధ పోరాటం పట్ల ప్రాధాన్యత పెరిగింది. కమ్యూనిస్టు నాయకత్వంలో, పోలీసులపైనా భూస్వాములపైనా జరిగిన రైతాంగపు సంఘటిత సాయుధ నిరోధం మొదలుకొని, రైతాంగాన్ని ఉత్తేజపరిచేందుకు తలపెట్టిన పెట్టీబూర్జువా చర్యల దాకా ఎన్నో చర్యలు జరిగాయి.

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అధికారంలోనున్న కాంగ్రెసు ఓడిపోగా, అనేక రాష్ట్రాలలో మిశ్రమ స్వభావం గల, సంకీర్ణ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన సమయంలో ఈ కార్యకలాపాలు జరగడం గమనించాలి. సి.పి.ఐ., సి.పి.ఎం. వంటి పార్లమెంటరీ సంస్కరణవాదులు, సంయుక్త సోషలిస్టు పార్టీవంటి సోషలు డెమోక్రాట్లు, భారతీయ క్రాంతిదళ్‌గా ఏర్పడిన మాజీ కాంగ్రెసువాదులు అధికారంలోకి వచ్చారు. దాంతో వాళ్లకు ఎక్కడలేని సంతృప్తి వచ్చేసింది. అందువల్ల సంఘపు అట్టడుగు భాగం దృష్ట్యా కావలసిన మార్పులు తీసుకు రావలసిన తక్షణావసరాన్ని వాళ్లు గుర్తించలేక మత్తులో పడ్డారు. సామాజిక వ్యవస్థలో అట్టడుగునున్న బీదజనులు భూమిలేని రైతాంగ సమూహాలు ఇంకేమాత్రం ఓర్చుకోలేక పోయారు. 1967 నాటి అధికార పంపిణీలో అనేక రాష్ట్రాలలో వచ్చిన హెచ్చుతగ్గుల యొక్క ప్రభావం బీద వారిపైనా భూమి లేని రైతుల పైనా కూడా పడింది. పశ్చిమ బెంగాలుకు తదితర కాంగ్రేసేతర రాష్ట్రాలకే ఈ ప్రభావం పరిమితం కాలేదు. ఈ కాలంలో కేంద్ర దేశీయాంగ శాఖ సేకరించిన గణాంకాలు సూచించినట్టు* భూమిని బలవంతంగా ఆక్రమించిన సంఘటనలు, పంటలను మాసూలుచేయడం, అధిక వేతనాలకు పోరాటం, భూస్వాములపై సాహుకార్లపై ప్రతీకార చర్యలు దేశంలో ఎక్కువయ్యాయి.

ఆంధ్రప్రదేశ్, బీహార్, పంజాబు, రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో గల కమ్యూనిస్టు విప్లవకారుల గ్రూపులు కొన్ని అధికారం చేపట్టే ధ్యేయంతో రైతాంగ పోరాట వైఖరిని రాజకీయ స్థాయికి తీసుకురాగలిగాయి. కలకత్తా కేంద్రంగా ఉండి, చారుమజుందారు నాయకత్వంలోని అఖిల భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ సంఘానికి (AICCCR) ఈ గ్రూపులన్నీ అనుబంధంగా ఉన్నాయి. AICCCR వెలుపలుండి చురుకుగా పనిచేస్తున్న ఇతర విప్లవాత్మక విభాగాలూ ఉన్నాయి.

1968 నవంబరు 24వ తేదీన కేరళలోని వైనాడులో ఒక సాయుధ ముఠా

---

* *చూ॥ నాలుగవ అధ్యయం*

ప్రమాదకరమైన ఆయుధాలతో మందుగుండు సామానుతో పూల్పల్లిలోని పోలీసు వైర్‌లెస్ స్టేషనుపైన దాడి చేసారు. అదే ప్రాంతంలోని తెల్లి చేరి పోలీసు స్టేషనుపై కూడా రెండు రోజులు ముందు అటువంటి దాడి జరిగింది. ఆ గ్రూపుకు చెందిన నాయకులు అక్కడి అడివిలో తలదాచుకున్నారు. వాళ్ళు డిసెంబరు నెల ఆరంభం దాకా పోలీసులకు పట్టుబడలేదు. అడవిలోని స్థావరంలో పోలీసులు 28 ఏళ్ళ అజితను, ఆమె తల్లి మందాకినీ నారాయణన్‌ను పట్టుకున్నారు. 'కురిచయన్' అనే ఆదిమ తెగకు చెందిన పూల్పల్లి ప్రాంతపు రైతాంగం తమ భూమిని బయటివాళ్ళ పరం చేసి భూమిలేని వారిగా మారి పోరాటాలకు, ఉద్యమానికి సమీకరించాలని తలపెట్టారు.

వైనాడు సంఘటనలు కున్నికల్ నారాయణన్, అతని కుటుంబ సభ్యుల, మధ్య తరగతి మేధావులైన అతని అనుచరుల వ్యక్తిగత వీరత్వంపై కొత్త వెలుగును ప్రసరింపజేసాయి. అంతేకాక సి.పి.ఎం. వర్గాల్లో నాయకులు అనుసరిస్తున్న పార్లమెంటరీ పంథాపట్ల మరింత విసుగుదల విప్లవ చర్యల పై గల ఆసక్తికి ఆ సంఘటనలు అద్దం పట్టాయి.

కున్నికల్ నారాయణన్ గ్రూపు ప్రత్యక్ష చర్యను సాధనంగా ఎన్నుకుంది. పరిష్కారానికై తడబడుతూ ఇతర దిశలో పోతూన్న ఇతర గ్రూపులున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని సి.పి.ఎం. వర్గాల్లో 40 శాతం దాకా నాగిరెడ్డి వైపుకో AICCCR వైపుకో తిరిగారు. పార్టీ ముఖ్య కార్యదర్శి 1968 నవంబరు 21న పాల్ఘాట్‌లో మాట్లాడుతూ 10,000 మంది దాకా పార్టీని వదిలి పెట్టారనీ అందులో, 7,000 మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారనీ చెప్పాడు. కేరళలో అనేక గ్రూపులు తమ తమ దార్లు ఎన్నుకున్నాయి. ఒక గ్రూపు తిరుచూరు, కాలికట్‌లలోనూ, తిరువనంతపురంలో నగర మాజీ మేయరు ఆధ్వర్యంలో మరొకటి, కె.పి.ఆర్. గోపాలన్ నాయకత్వంలో ఈ గ్రూపులన్నిటినీ సమన్వయపరచడానికి ప్రయత్నిస్తూన్న మూడవ గ్రూపుగా ఉన్నాయి. కాని ఈ కాలంలో వివిధ గ్రూపుల ముఖ్య కార్యక్రమాల్లో పత్రికా ప్రచురణ ఒకటి. తమిళనాడులోని తంజావూరు ప్రాంతంలో మాసూలు చేసిన పంటలో మరింత హెచ్చు భాగం రైతులకు చెందాలనీ, కూలీ రేట్లు పెంచాలనీ ఆందోళన జరిగింది. ఆ ప్రాంతంలో చాలా మంది వ్యవసాయ కార్మికులున్నారు. ఈ ఆందోళన మూలంగా 1968 నవంబరులో కార్మికులకూ పోలీసులకూ మధ్య ఘర్షణ జరిగింది. అనేక మంది రైతులు అరెస్టయ్యారు. అనతి కాలంలోనే బీహారులోని ముజఫర్‌పూర్‌లోని ముషాహరి బ్లాకులోనూ ఉత్తర ప్రదేశ్‌లోని లక్ష్మీపూర్ జిల్లాలోని పులియా ప్రాంతంలోనూ గల బీదరైతులూ భూమిలేని రైతులూ ఇటువంటి ఆర్థిక కోర్కెలకే

పరిమితమైన హద్దుల్ని దాటి AICCCR నాయకత్వం కింద సాయుధ పోరాటాలకు సిద్ధపడ్డారు.

## కమ్యూనిస్టు విప్లవకారుల సిద్ధాంత ప్రచారం

అంతకుముందు నాగిరెడ్డి గ్రూపుకు అనుబంధం తొలగిస్తూ 1969 ఫిబ్రవరి 8వ తేదీన AICCCR ఇలా తీర్మానించింది. "…. త్వరగా పెరిగే విప్లవ సంఘర్షణల రాజకీయపరమైన, సంస్థాపరమైన అవసరాలను సమన్వయసంఘం ఒక్కటే తీర్చలేదు. మరింత పటిష్టంగా ఈ సంఘర్షణల్ని సమన్వయ పరచాలి. ముందుకు తీసుకుపోవాలి… విప్లవాత్మక పోరాటాలను నిర్మించి కొనసాగిస్తున్న విప్లవకారులు వెంటనే ముఖ్యాంగంగా పార్టీని ఏర్పరచాలి" ఈ పార్టీలో చేరే వారి విషయంలో చారుమజుందారు సి.పి.ఎం. నుంచి వచ్చేవారి కంటె కొత్తవారికే ప్రాధాన్యతనిచ్చాడు. "మార్క్సిస్టు పార్టీలుగా పిలవబడే వాటిలో అత్యధిక భాగాన్ని మనవైపుకు ఆకర్షించుకోవడమే మన ముఖ్యాశయమనుకుంటూ, అలానే మనం విప్లవాత్మక పార్టీని నిర్మించగలమనుకునేవాళ్ళు, తెలిసో తెలియకో ఎన్నికల్లో పోరాడేందుకు మరో పార్టీని నిర్మించేందుకే ఆలోచిస్తున్నారు." సి.పి.ఎం. కాని అటువంటి పార్టీల మాజీ సభ్యులపై ఆధారపడడంలో గల ప్రమాదాన్నిలా వివరించాడు. "…. మార్క్సిస్టు పార్టీలుగా పిలవబడే ఈ పార్టీలోని సభ్యులు, వాళ్ళకింకా ఏవేనా విప్లవాత్మక లక్షణాలున్నా కూడా, కల్తీలేని రివిజనిజాన్ని ఆచరించడానికి వాళ్ళు అలవాటు పడినందువల్ల, చాలా మటుకు తమ విప్లవాత్మక లక్షణాలు కోల్పోయారు. పాత రాజకీయవర్గాలు, కేడర్లు ఆ పార్టీలలో ఉన్నా కొత్త ఆచరణకు అలవాటు పడితేనే మళ్లీ విప్లవకారులవుతారు" "కార్మికవర్గం, రైతాంగం, మధ్య తరగతి నవయువతతోను పార్టీని నిర్మించాలి. విప్లవాచరణ ద్వారా ఛైర్మన్ ఆలోచనావిధానంతో వాళ్ళకు పరిచయం కలిగించాలి."(13)

1968-69 కాలంలో జరిగిన రెండు ముఖ్య సంఘటనల సాయంతో అంతర్జాతీయ సమస్యలపై తమ వైఖరిని కమ్యూనిస్టు విప్లవకారులు విశదపరుచుకున్నారు.

మొదటి సంఘటన జెకోస్లోవాకియాలో జరిగింది. డుబెక్‌ను పదవీచ్యుతుణ్ణి చేసేందుకు 1968 ఆగస్టులో సోవియట్ యూనియన్ జెకొస్లొవాకియాలో సైనిక జోక్యం చేసుకుంది. 'దేశబ్రతి' ఆగస్టు 29వ తేదీ సంచికలో తన సంపాదకీయంలో సోవియట్ యూనియన్ తన సోషల్ సామ్రాజ్యవాద లక్షణాన్ని కనపరుచుకుంటూ తలపెట్టిన దురాక్రమణ చర్యగా దాన్ని గర్హించింది. అంతకుముందు చైనా కూడా

అదే అభిప్రాయాన్ని వెలిబుచ్చింది. AICCCR సభ్యుడైన పరిమళదాస్ గుప్తా 'దేశబ్రతి' సంపాదకీయంతో విభేదిస్తూ కొన్ని అంశాల్ని లేవనెత్తాడు. దానికి జవాబుగా చారుమజుందార్ తన వ్యాసంలో ఇలా వివరించాడు. "సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం అమెరికన్ సామ్రాజ్యవాదంతో కుమ్మక్కయి, ప్రపంచాధిపత్యానికి ప్రయత్నిస్తోంది." సోవియట్ దురాక్రమణ పట్ల ఎంత చిన్న నిరోధం వచ్చినా కమ్యూనిస్టులు దాన్ని తేలిక పరచడం, నీచంగా ఎంచడం సరికాదని భావించాడు. జెకోస్లోవోకియా పాలకవర్గాన్నిలా వివరించాడు. "జెకోస్లోవోకియాలో ఏనాడో పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించారు. సోవియట్ రివిజనిస్టులతో లాలూచీ అయి జెకొస్లొవోకియా ఆ పని చేసింది. సోషలిజాన్ని నాశనం చేసాక వాళ్ళలా చేసారు" "సోవియట్ దురాక్రమణ పట్ల వ్యతిరేకత జెకొస్లోవ్ ప్రజల ప్రధాన వైరుధ్యాన్ని తెలుపుతుంది."(22)

రెండో సంఘటన 1969లో పశ్చిమ బెంగాల్లో మధ్యంతర ఎన్నికలు జరుగుతాయని ప్రకటించడం. పశ్చిమ బెంగాల్లోని మొదటి ఐక్యసంఘటన ప్రభుత్వాన్ని 1967లో కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. పార్లమెంటరీ వామపక్షీయులు రానున్న మధ్యంతర ఎన్నికలకు 1968 నుంచీ తమ సన్నాహాలను మొదలెట్టారు. మధ్యంతర ఎన్నికల గురించిన తన తీర్మానంలో AICCCR ఇలా చెప్పింది ".... పార్లమెంటరీ పంథాపై, ఎన్నికలపై, మంత్రివర్గాలపై భ్రమలు త్వరగానే తొలగిపోతున్నాయి, ప్రజల విప్లవ చైతన్యం పెరుగుతోంది... విప్లవకారులూ, విప్లవాత్మక ప్రజలూ ముందుకు వచ్చి, ప్రగతి నిరోధక పాలకవర్గాల, వాళ్ళతొత్తుల, డాంగే ముఠా యొక్క నయా రివిజనిస్టుల యొక్క కుత్సిత, విప్లవ ప్రతీఘాత కుట్రల్ని విఫలం చేయాలని కోరుతున్నాం. దీన్ని (సాధించేందుకై) 'ఎన్నికలను బహిష్కరించండి' అనే నినాదాన్నివ్వాలి. కాని వట్టి వ్యతిరేక నినాదంతోనే మనం ముందుకు పోలేం. అనుకూల చర్యలు కూడా ఉండాలి. బహిష్కరణ నినాదానికి తోడుగా ఛైర్మన్ మావో ఆలోచనా విధానపు ధ్వజం క్రింద ప్రజలని సమీకరించి, సంఘటితపరచి, విప్లవ వర్గపోరాటాలతో నక్సల్బరీ మాదిరి ఉద్యమాన్ని జనతా ప్రజాతంత్ర విప్లవానికి దారితీసేదిగా నిర్మించాలి."[1]

## కమ్యూనిస్టు విప్లవకారుల కార్యక్రమాలు

ముందు వివరించినట్టుగా, 1968–69 కాలంలో AICCCR మార్గదర్శకత్వంలో కమ్యూనిస్టు విప్లవకారుల కార్యకలాపాలు వ్యాపించసాగాయి.

1967లో తిరుగుబాటుదార్లు ఓడిపోయాక నక్సల్బరీలో ఆవరించిన స్తబ్దత కూడా

క్రమంగా కరుగుతోంది. 1968 సెప్టెంబరు 8వ తేదీన, నక్సల్బరీ తిరుగుబాటుదార్ల నాయకుల్లోనొకడైన బాబూలాల్ విశ్వకర్మాకర్ నాలుగు గంటల పాటు (తుపాకులతో) పోలీసులతో పోరాడాక చిరిసింగ్జోట్ వద్ద హతుడయ్యాడు. ఖరిబారిలో ఒక జోతెదారు మరణశిక్షకు గురయ్యాడు. అదే సంవత్సరం అక్టోబరు 31వ తేదీన, ఐతిహాసనాయకుడూ, నక్సల్బరీ తిరుగుబాటు ప్రధాన నాయకుడూ ఐన కానూసన్యాల్ 'చిరిసింగ్జోట్'లోని తన స్థావరంలో అరెస్టయ్యాడు. లేతాకు పచ్చనిక్కరు, బుష్షర్టు ధరించిన 40 ఏళ్ల వయసున్న అతడు ప్రత్యేకంగా ఎటువంటి గడబిడ చెయ్యకుండానే లొంగిపోయాడు.

శ్రీకాకుళం, తెలంగాణాలలోనే కాక, బీహార్లోని ముషాహరి, ఉత్తర ప్రదేశ్‌లోని లక్ష్మిపూరుల్లో కూడా AICCCR కార్యకలాపాలు వ్యాపించాయి.

బీహార్ రాష్ట్ర కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ సంఘ ఆధిపత్యంలోని కిసాన్ సంగ్రామ సమితి నాందిగా ఆర్థిక సమస్యలపై తలపెట్టిన ఉద్యమంతో ముజఫర్‌పూర్ జిల్లాలోని ముషాహర్ రైతాంగ పోరాటం మొదలైంది. ఆ ప్రాంతంలోని గంగాపూర్ గ్రామరైతులు 1968 ఏప్రిలులో సమితి నాయకత్వంలో భూమిని ఆక్రమించడంతో మొదటి సంఘటన జరిగింది. నరసింఘపూర్‌కు చెందిన భూస్వామి రౌడీలతో రైతులనెదుర్కొన్నాడు. రైతులు ఆ ఘర్షణలో రౌడీల్ని తరిమికొట్టారు. ఆ సంఘటన వివరాలు దావానలంలా వ్యాపించాయి. కమ్యూనిస్టు విప్లవకారుల బీహారు రాష్ట్ర సమన్వయం సంఘనాయకుడు సత్యనారాయణ సింగు చెప్పినట్టుగా "పోరాడే రైతాంగానికి ప్రతీకగా గంగాపూరు నిలిచింది."[2]

పోరాటకారుల్ని ఏదో విధంగా చీకాకు పరిచేందుకు భూస్వాములు రైతులపై కేసులు పెట్టారు. కాని ఇదివరలోలా కాకుండా ఉద్యమనాయకులు ఈసారి అధికారులకు లొంగడానికి అంగీకరించక మాయమయ్యారు. కమ్యూనిస్టు విప్లవకారులు, కిసాన్ సంగ్రామ సమితి కలసి భావిలో సాయుధ సంఘర్షణలకై రైతాంగాన్ని తయారు చేసే తీవ్రమైన సన్నాహకదశ ప్రారంభమైంది. భూస్వాముల తరపున కలగజేసుకునే పోలీసు దళాలతో పోరాడాల్సిన అవసరం వస్తుందని రైతులకు బోధించారు.[3]

AICCCR ఇచ్చిన పిలుపును పురస్కరించుకుని, దేశమంతటా పంటలు పట్టుకునే కార్యక్రమంలో అంతర్భాగంగా 1968 ఆగస్టు 15వ తేదీన ముషాహరిలో రైతులు కూడా బాధై పంటలను* పట్టుకున్నారు. పోలీసులు, భూస్వాములు కిరాయితొత్తులు

* *మొదటి పంట, ఖరీఫ్, ఆంధ్ర ప్రాంతంలో సారవా అంటారు – అను*

తమపై పడగా తమ సాంప్రదాయిక ఆయుధాలతోనే రైతులు వాళ్ళనెదిరించారు. "భూస్వాముల్నీ ప్రభుత్వాన్నీ ఒకే తరహాగా ప్రజలు భావించారు. కష్టజీవులైన రైతాంగం మొత్తం తమను తాము రక్తసంబంధీకులైన కుటుంబీకులుగా భావించుకున్నారు."[4] వేలాది సాయుధ పోలీసులు ఆ ప్రాంతంలో పోలీసు స్థావరాలను నెలకొల్పి గ్రామాలపై పడగానే, పోరాడే రైతులకు ప్యూడలు భూస్వాములకూ, రాజ్య యంత్రాంగానికీ గల ఏకత్వం, బాగా తెలిసింది. ఆగస్టు 23వ తేదీన హర్కేష్ గ్రామంలో వేలాది రైతులు పోలీసులతో సంకుల సమరం చేసి అంతకు ముందు పోలీసులు అరెస్టు చేసిన తమ కామ్రేడును కాపాడుకున్నారు.

భూస్వాముల తొత్తుల్నీ, పోలీసుల్నీ రైతాంగం బాహాటంగా సంకుల సమరాల్లో ఎదుర్కొనే దశ అంతరించిందని ఉద్యమ నాయకులు భావించారు. రాజ్యాధికారపు దమన యంత్రాంగం ప్రత్యక్షంగా రంగంలోకి దిగగానే సరైన ఆయుధాలు లేని రైతాంగానికీ శత్రుబలానికి పోలిక లేకపోయింది. ఆ పరిస్థితుల్లో గెరిల్లా యుద్ధమే మార్గాంతరంగా కనిపించింది. "... డజన్ల కొద్దీ పార్టు టైమర్లుగా ఉన్న వీరోచిత కార్యకర్తలు స్థానిక పార్టీనాయకత్వంలో పూర్తి కాలపు గెరిల్లాలుగా జేరి ముషాహరి సంఘర్షణను ఉన్నత పోరాట దశకు, అంటే సాయుధ గెరిల్లా సంఘర్షణ స్థాయికి తీసుకున్నారు."[5]

ముషాహరి ఉద్యమపు తరువాతి తీరుతెన్నులు గమనించే ముందు మనం ఆ ప్రాంతపు ప్రత్యేక లక్షణాల్ని గమనించాలి. ఇక్కడున్న బీదరైతుల్లో చాలా భాగం తక్కువ కులపువారు. ఆర్థిక దోపిడికి తోడు అస్పృశ్యత వంటి సాంఘిక దురన్యాయాలకు కూడా వీళ్ళు గురవుతున్నారు. ఆదివాసులకు గల వీర సాంప్రదాయం స్వతంత్రత వాళ్ళకు లేవు. తమ ఉద్యమంలో, పంటలు పట్టుకోవడం భూస్వాములను తరమడం వంటి కొన్ని తాత్కాలిక విజయాల దృష్ట్యా కొత్త శక్తిని రుచి చూసారు. శ్రీకాకుళ ప్రాంతం వలె కాకుండా, ఇది మైదాన ప్రాంతం కావడం వల్ల ఉద్యమాన్ని నడపడంలో కొత్త ఎత్తుగడలు అవసరమయ్యాయి.

ముజఫర్‌పూర్ పరిసర ప్రాంతాల్లోని కమ్యూనిస్టు విప్లవకారుల కార్యకలాపాల పట్ల అధికారులు కలవరపడ్డారు. ఆ ప్రాంతం నేపాలుకు దగ్గరగా ఉండడం కూడా అందుకు ముఖ్యకారణం. ఆ కాలంలో నేపాల్లో కూడా కమ్యూనిస్టుల నాయకత్వంలో రైతాంగ పోరాటాలు జరుగుతున్నాయి. 1968 పూర్వ భాగంలో నక్సల్బరీకి ఎదురుగా నున్న నేపాల్లోని బధాపూర్‌లో రైతాంగ పోరాటాలు తీవ్రస్థాయికి చేరాయి. నేపాలు పోలీసు దళపు డిప్యూటీ ఇనస్పెక్టర్ జనరలు "బధాపూర్ మరో నక్సల్బరీ కావడాన్ని

సహించం”[6] అన్నాడు.

పాట్నా నుంచి వెలువడే 'ఇండియన్ నేషన్' పత్రిక ప్రత్యేక విలేఖరి 1968, ఏప్రిల్ 22వ తేదీన పంపిన సమాచారం ఇలా ఉంది. “ఇటీవల దొరికిన పటం (మ్యాప్) తదితర పత్రాల వల్ల బీహారు–నేపాలు సరిహద్దులో గెరిల్లా శిక్షణ కేంద్రాలు స్థాపించారని తెలుస్తోంది. వాటిలో కొన్ని చైనీయులు నిర్వహిస్తున్నారు....” 'తీవ్రవాదుల' (కమ్యూనిస్టు విప్లవకారుల్ని ఉదహరించేందుకు సామాన్యంగా వాడే పదం) గురించి పేర్కొంటూ వాళ్ళు బీహారు–నేపాలు సరిహద్దులోని దర్భంగా సహర్సాప్రాంతాలలో పని చేస్తున్నారని 1968 డిసెంబరు 10వ తేదీనాటి అమృతబజారు పత్రిక తెలిపింది.

అదే సమయంలో ముషాహరి ఉద్యమంతో పాటు ఉత్తర ప్రదేశ్‌లోని లక్ష్మీపూర్ జిల్లాలోని పలు ప్రాంతాలలోని అటువంటి రైతాంగ ఆందోళననే సాయుధ దాడిగా మార్చేందుకూ ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాంతం కూడా నేపాలుకు అనుకునే ఉంది. ఇక్కడ 'తెరై' భూముల్ని సాగు చేసేందుకు వచ్చిన రైతులు ప్రధానంగా తూర్పు – ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చినవారే. రెక్కలు ముక్కలు చేసుకుని ఆ ప్రాంతపు అడవులను సాగుకు తయారు చేసుకోగా ఏర్పడిన భూములను తరువాత వాళ్ళు పోగొట్టుకునేవారు. 1968 ఆరంభం దాకా శాంతియుత 'సత్యాగ్రహాలు' కాని ఇతరమైన హానిలేని ఆందోళనలు కాని మిగతా వామపక్ష పార్టీల నాయకత్వంలో జరుగుతూండేవి.

1968–జనవరి–ఫిబ్రవరి నాటికి రైతాంగ నాయకత్వం (ఆ ప్రాంతపు) AICCCR కేడర్లుగా మారారు. అదే సంవత్సరం మే–జూన్ మాసాలలో పిలిభిత్ తెరై, పాటియన్, ఘోలా, ఇబ్రహీంపూరు ప్రాంతాలలోని పొలాల్లో రైతులకూ, భూస్వాములకూ మధ్య ఘర్షణలు జరిగాయి. రైతులు ఆయుధాల్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ప్రభుత్వం ఉత్తరప్రదేశ్ రాష్ట్ర సాయుధ పోలీసు దళ సహాయం కోరింది. వాళ్ళు “గ్రామాలలో తమ స్థావరాలను నెలకొల్పారు. కొంతకాలం స్తబ్దత తరవాత లక్ష్మీపూర్ ఉద్యమ నాయకులు తమ పథకాలకు రూపకల్పన చేయసాగారు. వారిలో ఒకరు 1969 ఏప్రిలు నెలలో ఒక ఇంటర్వ్యూలో ఇలా చెప్పారు. “మా సంఘర్షణ నేటి వరకూ భూమి సమస్యకే పరిమితమై ఉంది.... మిగతా సమస్యల్ని కూడా చేపట్టాలనుకుంటున్నాం. భూస్వాములకూ ధనిక రైతులకూ అసలు పంటలో ఎట్టి భాగాన్నీ ఇవ్వనవసరం లేదని రైతులకు విజ్ఞప్తి చేయాలనుకున్నాం... భూమి కిరాయిని చెల్లించవద్దని ప్రజల్ని కోరతాం. ఉత్పత్తి ప్రాతిపదికలపై కొంత మదింపును విప్లవకమిటీ చందాగా తీసుకుంటుంది. వడ్డీ వ్యాపారస్తులకు పాత అప్పులను తీర్చవద్దని రైతుల్ని కోరతాం.”[7]

బీజరూపంలో నున్న ఈ పోరాటాలూ, బహుళంగా వృద్ధి చెందేందుకై వివిధ మావోయిస్టు గ్రూపుల మధ్య జరుగుతున్న సిద్ధాంత చర్చలూ, దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న సంఘటనలూ ఒకదానికి మరోటి తోడై ఒక కొత్త పార్టీ స్థాపనకై AICCCR ఆలోచిస్తూన్న చర్యలను మరింత త్వరపరచాయి. అదీకాక "..... ఒక కొత్త పార్టీ ఏర్పరచడంలోని ప్రాముఖ్యతను అంతర్జాతీయ నాయకత్వం పదే పదే గుర్తు చేస్తోంది."(21) అని చారుమజుందారు అన్నాడు. పార్టీని ఏర్పరచేందుకు AICCCR నిర్ణయం తీసుకునేందుకు కొద్ది మాసాల ముందుగా, ఆ కమిటీ కలకత్తా ప్రతినిధియైన విద్యార్థి నాయకుడు ఇంగ్లండులో కొంత మంది చైనా కమ్యూనిస్టు నాయకులను కలిసాడు.

## AICCCR లో విభేదాలు

కొత్త పార్టీని ఏర్పరచాలనే నిర్ణయం పట్ల అనేక మంది కమ్యూనిస్టు విప్లవకారులు తమ అయిష్టతను వెలిబుచ్చారు. అటువంటి చర్య తీసుకునేందుకు ఇంకా తగిన సమయం రాలేదని వాళ్ళ అభిప్రాయం. కృషిక్ సంగ్రామ సమితి అధ్యక్షుడు ప్రమోద్‌సేన్ గుప్తా, పరిమళ్‌దాస్ గుప్తా అనే కార్మిక సంఘ నాయకుడూ ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన వారిలో ఉన్నారు.

చారుమజుందారుకూ ఆయన విమర్శకులకూ మధ్య (పశ్చిమ బెంగాలులోను బయటా కూడా) కొంత కాలంగా కొన్ని మౌలిక సమస్యల పట్ల చూపవలసిన నాయకత్వంలోని 'ఆంధ్రా గ్రూపు' భారతదేశ పరిస్థితి గురించి మరో రకమైన విశ్లేషణ ఇచ్చింది. ఫ్యూడలిజానికీ రైతాంగానికి మధ్య గల వైరుధ్యాన్ని ప్రధాన వైరుధ్యంగా చూరుమజుందారు భావించాడు. నాగిరెడ్డి ఒక వైపు భారత ప్రజలకూ, మరోవైపు "అమెరికన్ సామ్రాజ్యవాదం, బ్రిటిషు సామ్రాజ్యవాదం, సోవియట్ రివిజనిజపు నయావలస వాదాల"కూ ఉండిన వైరుధ్యాన్ని ప్రధాన వైరుధ్యంగా భావించాడు.[8] దీన్నించి భారతదేశంలోని పోరాటం సామ్రాజ్యవాద వ్యతిరేకవిమోచన పోరాటంగా కొనసాగాలనీ, విస్తృత ప్రాతిపదికపై గల ఐక్య సంఘటన అటువంటి పోరాటానికి అవసరమనీ తేలుతుంది.

ఇదే 1968-69 కాలంలోనే చారుమంజుదారు విమర్శకులు అతను ప్రజా సంస్థలను, ప్రజా సంఘాలను నిర్లక్ష్యం చేసాడని ఆరోపించారు. కార్మికుల్లోనూ రైతుల మధ్యా ప్రచ్ఛన్న పార్టీ యూనిట్లను నిర్మించాలనే సూత్రాన్ని తన విమర్శకులకు జవాబుగా చారుమజుందారు వక్కాణించాడు. తన విమర్శకులు దీన్ని గుర్తించడం

లేదని కూడా ఆరోపించాడు. ఎత్తి పొడుపులు విపరీతం కాగా, ఆయన తన రాతల్లో ఇది వరకు అంగీకరించిన పోరాట రూపాలైన ఆర్థిక సంఘర్షణలు కార్మికోద్యమం వంటి వాటిని గుర్తించడం తగ్గించాడు. ప్రచ్ఛన్న పార్టీ యూనిట్ల నిర్మాణావసరాన్ని నొక్కి చెప్పడంలో విప్లవోద్యమంలో కావలసిన ఇతర పోరాట రూపాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడానికి అతనికి అన్ని సందర్భాలలోనూ బహుళ కాలం, చోటు, అవకాశం లేకపోయి ఉండవచ్చు. దీనివల్ల ప్రజా చర్యల్నించి వేరైన కుట్రతరహా చర్యలనే చారుమజుందారు సమర్థించాడనే అభిప్రాయాన్ని ప్రచారం చేసారు. (దీని గురించి తరువాత వివరంగా చెప్పాలి). చారుమజుందారుతో ప్రజాసంఘాల సమస్యపై విబేధించిన వారిలో పశ్చిమ బెంగాలు విద్యుచ్ఛక్తి కార్మికుల నాయకుడైన పరిమళ దాసుగుప్తా సమన్వయ సంఘ సభ్యులలో ఒకడు. నగరాల్లో కార్యక్రమాన్ని చిన్నచూపు చూస్తున్నారనీ, ప్రత్యేకించి పశ్చిమ బెంగాలు సమన్వయ సంఘం కార్మిక సంఘ కార్యకలాపాలలో పాల్గొనేందుకు నిరాకరించే ధోరణితో బాధపడుతోందని భావించాడు. ప్రజాసంస్థలను నిర్మించవలసిన అవసరాన్ని వక్కాణించాడు.

అతని విమర్శకు ప్రతిగా చారుమజుందారు ఇలా ప్రశ్నించాడు. ".... ప్రతీవాళ్ళూ ప్రజా సంఘాలనే నిర్మిస్తే ప్రచ్ఛన్న పార్టీ సంస్థలను ఎవరు నిర్మిస్తారు? ప్రజా సంఘాలు వ్యావసాయిక విప్లవాన్ని నిర్వహించాలని అనుకుంటున్నామా?" అటువంటి ప్రజాసంఘాల్ని గ్రామ ప్రాంతాల్లోనే కనక నిర్మించినట్టయితే "మనం చేసే అటువంటి ప్రయత్నం వల్ల ప్రజా సంస్థల ద్వారా మనల్ని బహిరంగ ఉద్యమాల్ని నిర్వహించే ధోరణి బలపడి, మరో తరహా రివిజనిస్టు ప్రజాసంఘాల నాయకులుగా" తయారు చేస్తుందని చెప్పాడు. ఇక కార్మిక సంఘాల విషయంలో "దేశంలో విప్లవానికి అనువైన స్థితిలేనప్పుడీ కార్మిక సంఘాలు కార్మిక సంఘాల విషయంలో "దేశంలో విప్లవానికి అనువైన స్థితిలేనప్పుడీ కార్మిక సంఘాలు కార్మిక వర్గానికి శిక్షణాలయాలుగా పనికి వస్తాయ"న్నాడు. కాని అతను మన దేశంలో విప్లవ పరిస్థితి ఉందని భావిస్తూ "మన బాధ్యత ప్రచ్ఛన్న పార్టీ వ్యవస్థ నిర్మాణమే కాని ప్రజా సంఘాల నిర్మాణం కాద"ని చెప్పాడు. కార్మికవర్గం నేతృత్వ పాత్రను వహించి, వ్యావసాయిక విప్లవాన్ని నడపాలంటే కార్మిక వర్గంలో పార్టీ వ్యవస్థను ఏర్పరచాలని భావించాడు.(22)

రైతాంగ ఉద్యమంలో AICCCR 'ఛేగువేరిజాన్ని' అనుసరిస్తోందనే పరిమళదాసు గుప్తా అభియోగాన్ని తిరస్కరిస్తూ అదే వ్యాసంలో ఇలా వివరించాడు. "ఈ గెరిల్లా యుద్ధంలో రైతాంగం మొత్తంగా పాల్గోదని తెలుస్తూంది. రైతాంగంలోని వర్గచైతన్యవంతమైన అగ్రగామి విభాగం గెరిల్లా యుద్ధాన్ని మొదలెడుతుంది. అందువల్ల,

ఆరంభ దశలో గెరిల్లా యుద్ధం కొద్ది మంది మనుషులు చేసే సంఘర్షణలా కనపడుతుంది.” అదీ కాక AICCCR నాయకత్వంలో జరుగుతున్న గెరిల్లా యుద్ధం కొన్ని రైతాంగ సమూహాలు కొనసాగిస్తున్న యుద్ధమే కాని పెట్టి బూర్జువా మేధావులు చేయడం లేదు. నవీనమైన మంచి రకం ఆయుధాలు లేకపోయినా వాళ్ళు దాన్ని సాగిస్తున్నారు. రైతాంగపు చొరవ ఆధారంగా, ఇంటిలో తయారైన ప్రాచీనపు ఆయుధాలపైన పూర్తిగా ఆధారపడి చేస్తున్న యుద్ధం అది. (అదే వ్యాసం)

ఈ లోగానే పరిమళ దాసు గుప్తా తన అనుయాయుల్తో మరో సమన్వయ సంఘాన్ని ఏర్పరచి వేరే మార్గాన్ని అనుసరించాడు. ఇంకా తరువాత 1969 మధ్యంతర ఎన్నికల్లో 'ఐక్యసంఘటన' మళ్ళీ అధికారంలోకి వచ్చింది. ఎన్నికల్ని బహిష్కరించాలని చారుమజుందారు ఇచ్చిన పిలుపులోని తెలివి తక్కువను ఎత్తి చూపుతూ అతనిపై ధ్వజమెత్తారు. ప్రమోద్‌సేన్ గుప్తా ఇలా ప్రశ్నించాడు. “మనం ఎన్నికలు బహిష్కరించమనే నినాదాన్నిచ్చాం. ప్రజలు మనమాట వినలేదు. అధిక సంఖ్యలో ఓట్లు వేసి కాంగ్రెసును తరిమారు. పరిస్థితిని మనం వాస్తవికంగా అంచనా వేశామా?”[9]

1968-69 కాలంలో AICCCR లో పార్టీని ఏర్పరచేందుకు సుముఖంగా ఉన్నవాళ్లు కూడా చారుమజుందారుతో పెడముఖంగానే ఉన్నారు. బీహారు రాష్ట్ర సమన్వయ సంఘానికి చెందిన సత్యనారాయణ సింగు తరవాత చెప్పిందాన్ని బట్టి 1969 ఫిబ్రవరి నాటి AICCCR సమావేశంలో భారత బూర్జువాజీ సూత్రీకరణను గురించి వివాదం వచ్చింది. మొత్తం బూర్జువా వర్గాన్ని కాంప్రడార్‌తత్వం కలదిగా చారుమజుందారు కొట్టి పారేసాడు. సత్యనారాయణసింగు తదితరులు మాత్రం, ఒక జాతీయ బూర్జువా విభాగాన్ని అందులో చూడాలని ఉవ్విళ్లూరారు. సత్యనారాయణసింగు ఇంకా ఇలా చెప్పాడు. “చారుమజుందారు, పశ్చిమ బెంగాలు కమిటీలు దేశంలో రైతాంగానికీ, జమీందార్లకూ ప్రధానమైన వైరుధ్యముందని భావించారు. బీహారు విప్లవకారులు దాన్ని ఫ్యూడలిజానికీ ప్రజలకూ మధ్య గల వైరుధ్యంగా పునర్నిర్వచించాలని కోరారు.”[10]

భావిలో ఈ విబేధాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. కాని 1969లో మటుకు, పార్టీ ఏర్పాటుకు వ్యతిరేకంచిన కొద్ది మంది మినహా మిగతా AICCCR సభ్యులందరూ తమని ఒక విప్లవాత్మక పార్టీగా సమీకరించుకునేందుకు నిశ్చయించి చారుమజుందారుతో ఏకీభవించారు.

## పార్టీ పుట్టుక

1969 ఫిబ్రవరిలో మళ్ళీ ఐక్య సంఘటన ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం మొదటి పనిగా 1967 నాటి నక్సల్బరీ తిరుగుబాటుకు చెందిన కానుసన్యాలు, జంగల్ సంతాలు తదితర నాయకుల్ని విడుదల చేసింది. మొత్తం మీద స్తబ్దతలో ఉన్న నక్సల్బరీ ఉద్యమం దృష్ట్యా, ఈ విడుదల పొందిన నాయకులు ఎటువంటి హాని తలపెట్టలేరని బహుశా ఐక్యసంఘటన ప్రభుత్వం భావించి ఉండాలి. వాళ్ళు నిర్బంధంలోనే ఉంటే, వాళ్ళు మహాత్ములనే భావన వాళ్ళ చుట్టూ పెరిగి, వాళ్ళ ప్రతిష్టను మరింత పెంచుతుంది. ఆ తిరుగుబాటుదార్ల పట్ల మొదటి ఐక్య సంఘటన ప్రభుత్వం చూపిన వైఖరికి దిగ్భ్రాంతి చెంది విమర్శించిన మిలిటెంటు వర్గపు సి.పి.ఎం. కేడర్లు సంతృప్తి చెందుతారని సి.పి.ఎం. నాయకులనుకున్నారు. తమ విద్యార్థి కేడర్లనుంచి, నక్సలైటు తరహా కమ్యూనిజం పట్ల ఆకర్షితులైన విద్యార్థి బృందాలు జారుకోవడం పట్ల పార్టీ నాయకులు కలత చెందారు. నక్సలైటు నాయకుల విడుదల తమ యువకేడర్లను సంతృప్తి పరచవచ్చునని సి.పి.ఎం. నాయకత్వం భావించింది.

తన విడుదల తరువాత 1969న కలకత్తాలోని మేడే రాలీలో కానుసన్యాలు తనెందుకు విడుదలయ్యాడో వివరించాడు. "జ్యోతిబాసు, హరే కృష్ణకోనార్ అండ్ కంపెనీ దయాపరులైనందువల్ల ఇది సాధ్యం కాలేదు. అదెంత మాత్రం కాదు. ఇది కొందరు మంత్రుల ఉదార చర్య అంతకంటే కాదు. తిరుగులేని చారిత్రక న్యాయం వల్ల ఇది సాధ్యపడింది."[11] నక్సల్బరీ నాయకుల పట్ల ఎంతో సానుభూతి ఉన్నా కూడా 1967, 1968 సంవత్సరాల్లో వాళ్ళ విడుదలను కోరుతూ సంఘటితమైన ప్రజాఉద్యమం ఎటువంటిదీ లేదని అంగీకరించాలి. కమ్యూనిస్టు విప్లవకారులకు సంఘటితమైన ప్రజా ప్రాతిపదిక లేదనడానికి కాని, ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించాలని నమ్మకం (వాళ్ళలో) లేదనడానికి కాని ఇదే నిదర్శనం.

ఏది ఏమైనా వాళ్ళు విడుదల కాగానే వచ్చిన లెనిన్ జయంతినాడు, 1969 ఏప్రిలు 22వ తేదీన, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) ఏర్పడింది. కలకత్తా మైదాన్‌లో జరిగిన మేడే రాలీ (ప్రజా ప్రదర్శన) వేదిక నుంచి కానూసన్యాల్ పార్టీ ఏర్పడిందని ప్రకటించాడు.

కొత్త పార్టీ తన రాజకీయ తీర్మానంలో ఈ క్రింది విషయాల్ని ఆమోదించింది. భారతీయ సంఘం అర్ధఫ్యూడలు అర్ధవలస స్వభావం కలిగి ఉంది. భారత ప్రభుత్వ (Indian State) పెద్ద భూస్వాముల, కాంప్రడార్ - బ్యూరోక్రటిక్ పెట్టుబడిదార్ల

ఆధీనంలో ఉంది. అమెరికన్ సామ్రాజ్యవాదానికీ, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదానికీ తొత్తుగా భారత ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రస్తుత దశలో భారత విప్లవం, జనతా ప్రజాతంత్ర విప్లవ దశకు చెంది ఉంది. వ్యావసాయిక విప్లవం, గ్రామీణ ప్రాంతంలో ఫ్యూడలిజాన్ని నాశనం చేయడం, దానిలో ముఖ్య భాగాలు. రైతాంగాన్ని సమీకరించడం, సాయుధ పోరాటం ద్వారా అధికారాన్ని పట్టుకునే దిశలో ముందుకు సాగడం కొత్త పార్టీ ప్రధాన బాధ్యతలు. గెరిల్లా యుద్ధం అటువంటి ప్రయత్నంలో మౌలిక విధానంగా ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ నాగిరెడ్డి గ్రూపుతో సహా కొన్ని గ్రూపులు వ్యక్తులు కొత్త పార్టీలో చేరదల్చుకోలేదు. సాయుధ సంఘర్షణ ప్రారంభించవలసిన అవసరాన్ని వాళ్ళు అంగీకరించినా, ప్రస్తుత పరిస్థితుల గురించీ, తక్షణం అనుసరించవలసిన ఎత్తుగడల్లోని కొన్ని అంశాలపై జరగవలసిన వక్కాణింపు గురించీ వాళ్ళు విబేధించారు. ఈ సమయంలో చారుమజుందారు సిద్ధాంత ప్రాతిపదికలపై పార్టీని ఏర్పాటు చేస్తే, ఇంతకు తీసిపోని గ్రూపుల్నీ వ్యక్తుల్నీ ఒంటిగా చేయడానికి అది దారి తీస్తుంది. ఈ గ్రూపుల విషయంలో కానూసన్యాల్ మేడే ప్రదర్శనలో ఇలా చెప్పాడు. "..... వ్యక్తులు గ్రూపులూ ప్రాతినిధ్యం వహిస్తున్న పెట్టీ బూర్జువా ధోరణులు ఉన్నాయి. వాళ్ళేం చేసినా ఒక విషయం మాత్రం నిజం. విప్లవపార్టీ అధికారాన్ని గుర్తించకపోవడం వల్ల (వాళ్ళు) విప్లవం సాధించడానికి అవసరమైన ముఖ్యావసరాన్ని లెక్క చెయ్యడం లేదు. అలా వాళ్లు తెలిసో, తెలియకో విప్లవ సంఘర్షణను ముందుకు తీసుకుపోవడానికి అడ్డుపుల్లలు వేస్తున్నారు, ఇది విప్లవోద్యమంలోనే (ఒక రకమైన) విప్లవ ప్రతీఘాత ధోరణి. ఈ ధోరణిని ఎదుర్కొంటూనే నిజమైన విప్లవకారులను పార్టీ పరిధిలోకి తీసుకు రావడానికి మనం ప్రయత్నించాలి..."[12]

చారుమజుందారు అనుయాయులకూ మిగతా గ్రూపులకూ మధ్య గల సంబంధాల విషయంలో పార్టీ ఏర్పాటుతో కొత్త మలుపు వచ్చింది. వాళ్ళను ఎంత మాత్రమూ "స్నేహితులు కామ్రేడ్లు"గా చూడకూడదు. ఇకముందు వాళ్ళతో సంబంధాలు "విరోధేతరం" (Non-antagonistic) గా (ఇంతకు ముందు AICCCR పేర్కొన్నట్టుగా) ఉండవు.

1969 జూలై 2వ తేదీన పెకింగ్ రేడియో తన ప్రసారంలో సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఏర్పాటును అభినందించింది. పార్టీకి చైనా ఆశీర్వాదం కూడా వచ్చినట్టే. ఆ ప్రసారంలో 1969 ఏప్రిలు 22వ తేదీన కొత్త పార్టీ ఏర్పాటును ప్రకటిస్తూ AICCCR చేసిన ప్రకటనలోని భాగాలను ఉటంకించింది.[13]

కొత్త పార్టీ స్థాపన వల్ల కమ్యూనిస్టు విప్లవకారుల్లో మాత్రం కొత్త విభేధాలకు క్రొంగొత్త బీజాలు నాటబడ్డాయి. AICCCR ను ఉత్సాహంగా సమర్థించినవాళ్లు, కార్యనిర్వాహక కర్తలు, అన్ని యూనిట్ల అభిప్రాయాలూ తీసుకోకుండా కొత్త పార్టీ ఏర్పాటు చేయాలనే నిర్ణయం ప్రజాస్వామ్య విరుద్ధంగా జరిగిందని భావించారు. సాయుధ పోరాటం మొదలైనంత మాత్రాన, విప్లవ పార్టీకి కావలసిన అన్ని హంగులూ సమకూరాయని అనుకోకూడదని, అసిత్‌సేన్ వంటి వాళ్లు భావించారు. (పార్టీని ఏర్పరిచామని ప్రకటించేదాకా ఆ విషయం ఆయనకూ తెలియదు) "విప్లవపార్టీ యొక్క ప్రధానాంగమైన కార్మికవర్గం ప్రస్తుత సాయుధ పోరాటం నుంచి నేటికీ పూర్తిగా విడిపోయే ఉంది" అన్నాడు.

## వివిధ పోరాట కేంద్రాలు

పార్టీ ఏర్పాటు తరువాత వివిధ పోరాట కేంద్రాల్లోని కమ్యూనిస్టు విప్లవకారుల ఎత్తుగడలలో ఒక విధమైన సమత్వం పదును కనిపించింది.

ముందు అధ్యాయంలో పేర్కొన్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాధికారుల సమావేశానంతరం, 1969 మేలో శ్రీకాకుళంలోని తిరుగుబాటుదార్ల విషయంలో "చుట్టుముట్టడం, అణచివేత" విధానాన్ని చేపట్టారు. స్థానిక పోలీసులకు తోడుగా కేంద్ర ప్రభుత్వ రిజర్వు పోలీసుల్ని (సి.ఆర్.పి.) పటాలాల్ని దించారు. పోలీసు ముఠాలు గ్రామాల్ని చుట్టుముట్టి గుడిసెలపై దాడిచేసి ప్రజల్ని అరెస్టు చేసాయి. రైతుల్ని భయపెట్టి బెదిరించేందుకు మొత్తం గ్రామాలకు గ్రామాల్నే తగలబెట్టసాగారు. కమ్యూనిస్టు నాయకుడి నెవరినైనా పట్టుకుంటే కాల్చిచంపడమే మందుగా తలచి హత్యాకాండకు పాలుపడ్డారు. 1969 మే 27వ తేదీన పట్టుబడ్డ పంచాది కృష్ణమూర్తినీ మరో ఆరుగురినీ అలాగే కాల్చి చంపారు.

కమ్యూనిస్టులు పోలీసుదాడులకు బదులుగా సహజంగానే 'ఖతం' కార్యక్రమాలను ఎక్కువ చేశారు. బహిరంగ ప్రజాదాడులకు బదులు ప్రచ్ఛన్న కలాపాల్నే బలపరచవలసి వచ్చింది. దాడుల పద్ధతి కూడా మారిపోయింది. ఇది వరలో వివిధ గ్రామాల నుంచీ గెరిల్లా దళాలు రహస్యంగా దాడులు చేయసాగాయి. బాహాటంగా ఎదుర్కోకుండా ప్రచ్ఛన్న పద్ధతుల్ని అవలంబించినారు. దాడిచేసి వెంటనే మాయమవసాగారు. 1969 అక్టోబరు నాటి 'లిబరేషన్' సంచికలోని సమాచారం ఇలా వివరించింది. ఆగస్టు 5వ తేదీన "బాంబులతోనూ మజిల్ లోడింగ్ తుపాకులతోనూ 10 మంది గెరిల్లాలు పార్వతీపురం ఏజెన్సీలోని తోమలపాడులో (దాదాపు 100 మంది సి.ఆర్.పి. పోలీసులు

గల) ఒక పెద్ద పోలీసు స్థావరాన్ని మూడు వైపుల్నించీ చుట్టుముట్టి ఒక పోలీసుని తీవ్రంగా గాయపరిచారు."

తిరుగుబాటుదార్ల "నిర్మూలనా కార్యక్రమంలో" పోలీసులేగాక భూస్వాములూ, సాహుకార్లు కూడా చంపదగిన మనుషులుగా గుర్తించబడుతూనే ఉన్నారు. శ్రీకాకుళంపై వచ్చిన సమాచారం ప్రకారం "సాహుకార్లు, భూస్వాములూ పెరుగుతున్న రైతాంగ విప్లవపోరాటపు వెల్లువకు తట్టుకోలేక ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారు". గెరిల్లా దళాల సంఖ్య కూడా పెరిగినట్టే కనిపించింది. 1969 సెప్టెంబరులో శ్రీకాకుళం సందర్శించిన ఒకాయన ఇలా చెప్పాడు. "800 మందికి పైగా గిరిజనుల్ని జైళ్ళలో కుక్కారు. వాళ్ళ కుటుంబ సభ్యులు గెరిల్లా దళాల్లోనూ గ్రామరక్షణ దళాల్లోనూ పనిచేస్తున్నారు."[15] "సాయుధ సంఘర్షణ మొదలయ్యాక ఇక్కడి ప్రజలు స్వేచ్ఛగానూ స్వతంత్రంగానూ మసులుతున్నారు".[15] అని ప్రజల మనస్థితిని వర్ణించారు.

1970 ఆరంభంలో చైనా నుంచి కూడా పొగడ్తల వర్షం కురిసింది. "కష్టాలకు ఆలవాలమైన భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విప్లవ ప్రాంతంగా, ఎర్రటి సంకేత దీపంలా ప్రకాశిస్తోంది." ఆ సంవత్సరం పెకింగ్ రివ్యూ నం. 1లో శ్రీకాకుళం గురించి వచ్చిన సుదీర్ఘ వ్యాసంలోని మొదటి వాక్యాలు అవి. మిగతా వ్యాసంలో శ్రీకాకుళంలో ఉద్యమచరిత్రను ఇలా వివరించారు. "సి.పి.ఐ. (మా.లె.) నాయకుడైన చారుమజుందారు శ్రీకాకుళ సాయుధపోరాటాన్ని స్వయంగా ఉజ్వలింపజేసాడు." నాటి పరిస్థితిని వివరిస్తూ ఆ వ్యాసం ఇంకా ఇలా పేర్కొంది. "ఈనాడు సి.పి.ఐ. (మా.లె.)కి 100కు పైబడి గెరిల్లా దళాలున్నాయి. కొండల నుంచి మైదానాలకూ తీర ప్రాంతాలకూ సాయుధ పోరాట ప్రాంతాలు వ్యాపిస్తున్నాయి. సాయుధ విప్లవ బలాలు 300 గ్రామాల్లో అరుణ ప్రాంతాన్ని (Red area) నిర్మించాయి. 'ప్రజల తిరుగుబాటు సంఘాల' ద్వారా ప్రజా రాజకీయ సంస్థలకు నాంది పలికారు. వాటి ద్వారా పరిపాలనను, ఉత్పత్తిని పర్యవేక్షిస్తున్నారు. భూమి పంపిణీకి సన్నాహాలు చేసారు. శత్రువుల్ని విచారించి శిక్షించేందుకై అన్ని గ్రామాల్లోనూ 'ప్రజా కోర్టుల్ని' స్థాపించారు."

పంచాది కృష్ణమూర్తి, మరో ఆరుగురి అమర సాహసాన్ని కూడా ఆ వ్యాసం పేర్కొంది. "నేలకొరిగిన ప్రతీ ఒక్క వీరునికి బదులుగా ఆ ఖాళీని పూరించేందుకు కొన్ని వేల సంఖ్యలో వీరులు పుడతారు." తరువాత సంపూర్ణను గురించి చెప్తూ ఆమెను "శ్రీకాకుళం కేంద్ర గెరిల్లా దళపు వీరవనిత"గా పేర్కొంది. ఆమె ముగ్గురు బిడ్డల తల్లి. పోలీసులామెను 1969 జూన్‌లో అరెస్టు చేసారు. శత్రువులామెను

హింసించారు. బతిమాలారు. పశ్చాత్తాపం తెచ్చుకుని ఇంటికి పొమ్మన్నారు. కాని సంపూర్ణ యొక్క సంపూర్ణ నిశ్చయాన్ని ఏ శక్తీ కదిలించలేకపోయింది. పోలీసులకు ఆమె చెప్పిన పదునైన జవాబును ఆ వ్యాసం ఉదహరించింది. "నేనీ కష్టాన్ని కొని తెచ్చుకోలేదు. కాని నా పిల్లల్ని పస్తులుంచడం వాళ్ళను పెంచడం అనే విషయాలకు పరిష్కారం రైతాంగాన్ని ఎదుర్కొనే సమస్యల్తో ముడిపడి ఉందని గ్రహించాను. మావోసేటుంగు ఆలోచన ఈ సమస్యను పరిష్కరించే దారిని సూచించింది." ఆ వ్యాసం ముగిస్తూ ఇలా అంది. "ఇంకా ఇంకా ఎన్నెన్నో శ్రీకాకుళం వంటి అరుణ విప్లవ ప్రాంతాలు సువిశాల భారతదేశ భూభాగంపై ఏర్పడుతున్నాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు – లెనినిస్టు) నాయకత్వంలో భారత ప్రజల విప్లవ పోరాటం ఒక విజయం వెంట మరో విజయాన్ని సంపాదించుకుంటుంది."

1970 ఆరంభంలో చారుమజుందారు కూడా ఇలా ప్రకటించాడు. "ఎర్ర రాజకీయాధికారం శ్రీకాకుళంలో బీజాత్మక స్థాయిలో ఏర్పడింది."(30)

మైదానాల్లో కూడా ఈ కాలంలో శ్రీకాకుళం ఉద్యమం వేళ్లూనుకొంటోంది. జీడిమామిడి తోటలతో నిండి ఇసుక ప్రాంతాలని, దట్టమైన ఆకులు, లావైన మానులు గల చెట్లు గెరిల్లాలకు శతృవు బారినుంచి దాక్కునేందుకు బాగా పనిచేస్తాయి. తత్ఫలితంగా మైదానాల్లో కూడా ప్రతీ గ్రామానికీ ఒక మైలు దూరంలో సి.ఆర్.పి. స్థావరాలు వెలిసాయి. గెరిల్లాలు తమ కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు.

1969 అక్టోబరు నెల 'లిబరేషన్' సంచిక ఇలా నివేదించింది. "పి.కె. (పంచాది కృష్ణమూర్తి)ని చంపిన పోలీసు సర్కిలు ఇన్‌స్పెక్టరుతో సహా దాదాపు 60 మంది సి.ఆర్.పి. పోలీసులు సోంపేట తాలూకాలోని కళింగనగరం పరిసర గ్రామాలపై దాడి చేసారు. నలుగురే ఉన్నా గెరిల్లాలు పోలీసు దళాన్ని ఎదిరించారు. ఒక పోలీసును చంపారు కూడా" అదే సమాచారం ఇంకా ఇలా వివరించింది. "సోంపేట తీర ప్రాంతంలో 10 గ్రామాలలో గల 16గురు సాహుకార్లు భయంతో పారిపోయారు. రూ.6,50,000 దాకా గల అప్పులు కొండెక్కాయి."

1969 సెప్టెంబరు నాటికి ఆ ప్రాంతంలోని సోంపేట, ఇచ్ఛాపురం, టెక్కలి తాలూకాల్ని రాష్ట్ర ప్రభుత్వం "కల్లోలిత ప్రాంతాలు"గా ప్రకటించింది. అదే సంవత్సరం జూన్‌లో ఏజెన్సీ ప్రాంతంలోని పార్వతీపురం, పాతపట్నం, పాలకొండ తాలూకాలు కూడా "కల్లోలిత ప్రాంతాలు"గా ప్రకటించబడ్డాయని గమనించాలి. 1969 సెప్టెంబరు 13వ తేదీన ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉన్నత పోలీసు అధికార్ల సమావేశం శ్రీకాకుళంలో జరిగింది. ఉభయ రాష్ట్రాల పోలీసులూ" గాలింపు కార్యకలాపాల్ని

(Combing operations) ఉధృతం చేసేందుకూ, ఉమ్మడిగా సమాచార సేకరణకూ" ఆ సమావేశం జరిగింది. ఒరిస్సాలోని బరంపురానికి చెందిన డి.ఐ.జి., ఆంధ్రప్రదేశ్‌లోని వాల్తేరు డి.ఐ.జి. హైదరాబాదు నేర పరిశోధక విభాగపు (సి.ఐ.డి.) డి.ఐ.జి. 17వ సి.ఆర్.పి. బెటాలియన్‌కు చెందిన ముఖ్య సైనికాధికారి కూడా ఆ సమావేశానికి హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో గల ఒరిస్సాలో కూడా కమ్యూనిస్టు కార్యకలాపాల దృష్ట్యా ఆ సమావేశానికి ప్రాముఖ్యత వచ్చింది.

తమ ప్రథమ పథకాలు తల్లకిందులైనా కూడా, నాగభూషణ పట్నాయక్ పోలీసులను తప్పించుకొంటూ కోరాపుట్ ప్రాంతంలో తన కార్యకలాపాలను సాగిస్తూనే ఉన్నాడు. 1969 జూలై 15వ తేదీన మరో పది మందితో సహా అతన్ని పోలీసులు విశాఖపట్నంలో అరెస్టు చేసారు. 1969 అక్టోబరు 3వ తేదీన అంటే మూడు నెల్ల తరవాత అరెస్టయిన వాళ్ళందరూ సాహసోపేతమైన జైలు నిర్బంధ విచ్ఛేధంతో విశాఖపట్టణం సెంట్రలు జైలు నుంచి తప్పించుకున్నారు.

ఈ లోగా ఆ సంవత్సరం ఆగస్టులో 'వర్గశత్రువుల నిర్మూలన' విధానాన్ని అమలు చేస్తూ ఒక సంఘటన జరిగింది. పార్వతీ పురానికి ఆనుకుని ఉన్న ఒరిస్సాలోని కోరాపుట్ జిల్లాలోని ఒక గ్రామంలో శ్రీకాకుళం ఉద్యమపు మొదటి దశ విధానాలను అనుసరించి, 200 మంది గ్రామ ప్రజలు తమ వెంట రాగా ఒక గెరిల్లా దళం ఒక భూస్వామిని చంపి "ఆ భూస్వామి శవాన్ని ముక్కలు ముక్కలుగా నరికేశారు."[16]

ఒరిస్సాలోని ఈ ప్రాంతపు సి.పి.ఐ. (మా.లె.) కేడర్లు భూభాగం అనుకూలత వల్ల ఒక స్థావర ప్రాంతాన్ని (Base area) స్థాపించగలిగారని తరువాతి సంఘటనల వల్ల తెలియవచ్చింది. పోలీసు దళాలు, ప్రత్యేకించి సి.ఆర్.పి. దళాలు తమ 'చుట్టుముట్టడం అణచివేత' కార్యక్రమాల్ని శ్రీకాకుళం కొండల్లో మొదలెట్టారు. వెంటనే వెంపటాపు సత్యనారాయణ కేంద్ర 'దళం' ఇంకా అనేక చిన్న చిన్న 'దళాలు' ఒరిస్సా వైపుకు తరల సాగాయి. పర్లాకిమిడి తాలూకాలోని ప్రాంతాల్లోనూ, రమణగూడా బ్లాకులోని తివాకొండల్లోనూ వాళ్ళు తలదాచుకున్నారు. పెరుగుతున్న పోలీసులకలాపాల మధ్య, ఉభయ రాష్ట్రాల మధ్య గల ఈ కొండ ప్రాంతాలు తలదాచుకుందుకు వాళ్ళకు బాగా ఉపయోగించాయి.

1969 సెప్టెంబరు నాటికి బీహారులోని ముషాహరిలో కూడా ప్రజా చర్యలకు గల ప్రాముఖ్యం గెరిల్లా చర్యలకు మారింది. అక్కడి నాయకుడు సత్యనారాయణ సింగు ఆ ఉద్యమ స్వభావాన్నిలా వివరించాడు. "ఒకటిన్నర మాసాల్లో మూడు దాడులు జరిపిన ముషాహరి గెరిల్లాలు ఐదుగురు వర్గ శత్రువుల్ని వాళ్ళ ఏజెంట్లనూ

చంపారు. 15 మందిని గాయపరిచారు. లక్ష రూపాయల దాకా విలువ చేసే భూమి పత్రాల్నీ దస్తావేజుల్నీ నాశనం చేసారు. భూస్వాముల ఆస్తులను కొల్లగొట్టారు..."[17]

ఇక్కడ కూడా నాయకులు రైతాంగానికి ప్రభుత్వం యొక్క పక్షపాత వైఖరిని తెలియజెప్పారు. సత్యానారాయణ సింగు అన్నాడు "మన ఆచరణ ఏమి నిరూపిస్తోంది? ఒక వర్గ శతృవును చంపాక ప్రభుత్వం మనపై పడుతుంది. అప్పుడు దాన్ని మనం గెరిల్లా పద్ధతుల్లో (అంటే మనం జయించగలిగే పోరాటాల్లో, ఎదుర్కొంటాం" రైతాంగ జనబాహుళ్యపు పాత్ర ఏమిటి? "ఆశ్రయం, ఆహారం, ఇవ్వడంలో వందలాది జనం పాల్గొంటారు. శతృవు గురించిన సమాచారాన్ని సేకరిస్తారు. ముందుకూ వెనక్కూ పోవడానికి మార్గాన్ని స్థిరపరుస్తారని" వాళ్ల పాత్రను ఉదహరించాడు.

ముషాహరి తిరుగుబాటుదార్లు 1969 జూన్ 30వ తేదీన నర్సింగపూర్ గ్రామంలోని భూస్వామిపై దాడి చేసారు. ముషాహరి ఉద్యమపు మొదటి దశలో రైతులతో ఘర్షణకు దిగిన మొట్టమొదటి భూస్వామి గురించి ముందు చెప్పుకున్నాం. భూస్వామి పారిపోయినా గెరిల్లాలు మాత్రం వాడి మద్ధతుదార్లను ముగ్గురిని చంపారు. 20,000 విలువ గల ఆస్తిని స్వాధీనం చేసుకుని భూమి పత్రాలను అంటించారు. కొంత కాలం తర్వాత సత్యానారయణ సింగు నిర్మూలనపు ఎత్తుగడలను నిరసించి ఉండవచ్చు. కాని 1969లో మాత్రం వాటిని సమర్ధించాడు. "ప్రస్తుత సాయుధ పోరాట దశయొక్క ఆశయం ఆధారపడదగిన విప్లవ స్థావర ప్రాంతాల్ని ఏర్పాటు చేయడం... "గ్రామాల్లోని భూస్వాములను వ్యక్తిగతంగా ఎదుర్కొంటూ, వాళ్లను నాశనం చేయకుండా ఇది సాధ్యమవుతుందా?"[18]

ముజఫర్‌పూర్ జిల్లాలోని, ఫారు, బురారాజ్ అనే మరో రెండు ప్రదేశాలపై కూడా తిరుగుబాటుదార్లు దాడులు చేసారు. జూన్ నెలనాటికి శ్రీకాకుళంలో మాదిరిగా పోలీసులు కూడా చుట్టుముట్టడి. అణచివేత విధానాన్ని అమలు చేయసాగారు. సత్యనారాయణ సింగు ఇలా చెప్పాడు. "ముజఫర్‌పూరు జిల్లాలోని ఏడు ఠాణా (ప్రాంతం)ల్లో గల 600 మంది ఇళ్ళపై పోలీసులు దాడి చేశారు. అదుపులోకి తీసుకున్న ఖైదీల నుంచి నాయకుల అడ్రస్‌లూ రక్షక స్థావరాలనూ తెలుసుకునేందుకు వాళ్ళను చిత్రహింసలు పెట్టి, ప్రశ్నల్తో వేధించారు." దాంతో నాయకత్వం తన ఎత్తుగడల్ని మార్చింది. "భద్రత, క్షేమాల దృష్ట్యా, గెరిల్లా దాడుల్లో విస్తృత ప్రజా బాహుళ్యం పాల్గోనడాన్ని తగ్గించాలనుకుంటున్నాం. దానివల్ల పోరాటంలోనూ, పారిపోవడంలోనూ చురుకుదల కూడా సాధ్యం... శతృవు పెద్ద పెట్టున పోలీసు గస్తీని ఏర్పరిచాడు. 'చుట్టు ముట్టడం అణచివేత' అనే కార్యక్రమాన్ని శతృవు

మొదలెట్టాడు. ఈ పరిస్థితుల్లో చిన్న గెరిల్లా దళాలే చురుకుగా సమర్థవంతంగా మనగలుగుతాయి. వాటిపైజుదృష్ట్యా పెద్ద గెరిల్లా యూనిట్లను శత్రువు తొందరగా గుర్తించవచ్చు.... ప్రజలే కొండలూ, అడవులుగా పనిచేసే మైదాన ప్రాంతాల్లో 3 లేక 5 లేక 7 గురు గెరిల్లాలు గల యూనిట్లు ఉండాలి."[19]

పోలీసు దాడుల దృష్ట్యా, గ్రామాల్లో స్థావర కేంద్ర పరిరక్షణావసరాల గురించి ముషాహరి నాయకత్వం ఆలోచించింది. "పెద్ద పెట్టున పోలీసు బలగం సమీకరించుకుంటున్న ఈ సమయంలో ప్రధాన గెరిల్లా దళం పొరుగు ప్రాంతాలకు తరలిపోయి. 'చుట్టుముట్టడాన్ని' తప్పించుకుంటుంది. కాని పోరాటాలు జరుగుతున్న ప్రాంతాల్లో మాత్రం రాజకీయ స్థావర ప్రాంతం ఏర్పరచాలంటే విప్లవ కార్యక్రమం కొనసాగించాలి... ముఖ్య గెరిల్లాదళం పారిపోయినా స్థానిక పార్టీనాయకత్వం, గెరిల్లా యూనిట్లు, కిసాన్ సంగ్రామ సమితి కొనసాగుతాయి." రాజకీయ ప్రచారాన్ని వ్యవస్థాపరమైన పనిని ఇవి కొనసాగిస్తాయి. సత్యనారాయణ సింగు మధ్య తరగతి రైతుల గురించి చెప్తూ వాళ్ల విషయంలో పార్టీ పని 'పైపైనే' అంతంత మాత్రంగా ఉందని భావించాడు. "మధ్య రైతుల పూర్తి మద్దతు లేకుండా విప్లవం విజయం పొందదని గుర్తించాలి. ఈ విషయంలో పాక్షికవాదాన్ని (Sectarianism) ఎదుర్కొనాలి. ఈ ఆశయానికై బలమైన ప్రయత్నాలు ఎంతో అవసరం."[20]

సి.పి.ఐ. (మా.లె.) పార్టీ తలపెట్టిన 'వ్యావసాయక విప్లవం రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవాలనే సమస్య "అంచెలంచెలపై కొంచెం కొంచెంగా" పరిష్కరించ బడుతుందని సింగ్ అన్నాడు "ముందు ఒకటి రెండు గ్రామాలలోనూ, తరువాత ఒకటి రెండు ప్రాంతాలలోనూ, అటు తరువాత ఒకటి రెండు భాగాలలోనూ తరువాత దేశమంతటానూ అధికారాన్ని పట్టుకోవడంతో సమస్య పరిష్కారమవుతుంది. దానికి కారణం ఈ విప్లవం సుదీర్ఘమైనది కావడమే" ఈ సందర్భంలోనే శత్రువులను 'ఖతం' చేసే అవసరానికి ప్రాముఖ్యత వస్తుంది. "ఫ్యూడలిజాన్ని నాశనం చేసి గ్రామాలలో రైతాంగాధికారాన్ని స్థాపించాలనే దృక్పథంతో దాన్ని అర్థం చేసుకోవాలన్నాడు."[21]

ఈలోగా పశ్చిమ బెంగాలు గ్రామ ప్రాంతాల్లో గ్రామీణ బీద జనపు మన స్థితిలో తీవ్రమైన మార్పు వచ్చింది. రెండో ఐక్య సంఘటన ప్రభుత్వం మిలిటెంటు భూమి ఆక్రమణ ఉద్యమాన్ని ప్రోత్సహించింది. దానికి కారణాలు ఎన్నో ఉన్నాయి. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో కొత్త కొత్త నక్సల్బరీలు తలెత్తే ప్రమాదాన్ని ఇది అరికడుతుంది. గ్రామీణ బీదజనం యొక్క పోరాటపటిమ ఏదోలా బయటకు పోతుంది. ఆ ఉద్యమం వాళ్ల పెరిగిన కోర్కెలకు ఆనకట్ట లేస్తుంది. దాదాపు అన్ని వామపక్ష పార్టీలు తమ

తమ పలుకుబడులున్న ప్రాంతాల్లో చట్ట పరిమితి దాటిన భూస్వాముల భూముల్ని ఆక్రమించేందుకు భూమిలేని బీదరైతుల్తో కూడిన ఊరేగింపులాంటి చర్యల్ని చేయసాగాయి.

ఆ ఉద్యమంలో అనుకూలమైనవీ ప్రతీకూలమైనవీ కూడా ఎన్నో అంశాలున్నాయి. తెలివైన భూస్వాములు ఆయా ప్రాంతాల్లో పలుకుబడి గల వామపక్షపార్టీ నాయకులకు రక్షణభరణం చెల్లించుకుని, తమ మిగులు భూమిని ఆకలిగొన్న రైతాంగం పాలబడకుండా కాపాడుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో గల మిగులుభూమి భూమిలేని వారికి కావలసిందాని కంటే చాలా తక్కువ కావడంతో, భూమికై జరిగిన తొక్కిసలాటలో పోటీలో, ఒక వామ పక్షానికి చెందిన రైతులూ, మరో (ప్రత్యర్థి) వామపక్షానికి చెందిన రైతులూ ఒకరితో ఒకరు పోరాడసాగారు.

ఇక ఇందులోని అనుకూలమైన అంశాల్ని చూద్దాం. నిద్రాణమైన రైతాంగపు తిరుగుబాటుతత్వాన్ని ఈ ఉద్యమం పురికొల్పింది. కొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా ప్రభుత్వ రక్షణలో ఐక్య సంఘటన ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రాంతాలలో ఈ ఉద్యమం జరిగినందున కనీసం ఆ ప్రాంతాల్లోనైనా పోలీసులు తటస్థులుగా ఉన్నారు. అందువల్ల పోలీసుల్ని ఎదుర్కొనే అవసరం రైతాంగానికి లేకపోయింది. రైతాంగం తమ సామూహిక బలాన్ని దీనివల్ల గుర్తించింది. వెదురు కర్రలు, గొడ్డళ్ళు బల్లేలు ధరించి భూస్వామిని ధిక్కరించేందుకు రైతులు ఊరేగింపుగా వెళ్లారు. సి.పి.ఎం. ఆధ్వర్యంలో జరుగుతున్న ఒక ఊరేగింపును చూసిన చారుమజుందారు తన అనుచరులకు దిగ్భ్రాంతి కలిగేలా ఇలా అన్నాడు సి.పి.ఎం. వాళ్ళను "తన పరిమిత లక్ష్యాలకే సాయుధుల్ని చేసినా ఒకసారి కనక రైతులు సాయుధులైతే వాళ్ళను ఎవ్వరూ నిరాయుధుల్ని చెయ్యలేరు."

వామపక్ష నాయకులు విధించిన హద్దుల్ని కొన్ని ప్రాంతాలలో రైతాంగ మిలిటెంటుతత్వం దాటింది. 1969 జూన్ 22వ తేదీన బర్ద్వాన్ జిల్లాలోని చేతన్‌పూర్‌లో రైతులు సి.పి.ఎం. ఆధ్వర్యంలో భూమిని స్వాధీనం చేసుకునేందుకు బయలుదేరారు. జ్ఞానేంద్రనాధ్ చౌధురి అనే భూస్వామి కిరాయితొత్తులు బల్లేల్తో రైతుల్ని ఎదిరించారు. కాల్పులు జరిపారు. ఉభయులకూ దాదాపు రెండు గంటల పాటు సాగిన సంకుల సమరంలో చాలా మంది గాయపడ్డారు. ఒక సంతాలు రైతు చనిపోయాడు. చౌధూరీల ఇంటి నుంచి ఐదు తుపాకుల్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ సంఘటన తరవాత చౌధురీలు గ్రామం వదిలి పారిపోయారు.

కాని రైతాంగపు ఆందోళన సహజంగానే మిలిటెంటుతత్వం కలది. ఐక్య

సంఘటనకారులు దాన్ని కేంద్రంలోని పాలకవర్గానికి, భూమి ఆక్రమించడానికే పరిమితం చేసి బంధించారు. రాజ్యాంగంపట్ల తమకు గల విధేయతను కేంద్రంలోని పాలక వర్గానికి పదే పదే ప్రకటించుకునే వామపక్షీయులు దాన్ని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. దాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిరక్షిస్తోంది. అందువల్ల వాళ్ళు ఎంతో కాలం దాన్ని కొనసాగించలేకపోయారు. ఒక రకమైన వేసవిగృహపు (Hot-House)* మొక్కలా దాన్ని పెరగనివ్వడం మొదలెట్టేసరికి అది దాని గాజుకప్పును భేదించుకుని బయటకు రావాలని ప్రయత్నించడం సహజం. 1970లో ఐక్యసంఘటన ప్రభుత్వాన్ని స్వార్థపర శక్తులు కూలద్రోశాయి. "ఇన్ని నెలలుగా వేచియున్న ప్యూడలు భూస్వాముల మద్దతుతో" కేంద్రం దమనకాండ ఆరంభించగానే రైతులకు దిక్కులేక పోయింది. తమ నాయకుల్లో చాలా మంది జైళ్ళలోనో పరారీలోనో ఉన్నారు. తాము ఆక్రమించిన కొద్ది భూభాగాల్ని వాళ్ళు కోల్పోయారు. – భారీస్థాయిలో జరిగిన సోదా చర్యల్లో తమ చిట్టచివరి రక్షణాయుధం, (సేద్యపు పనిముట్టు) కొడవలిని కూడా వాళ్ళు కోల్పోయారు. ఆక్రమించిన భూమిని తిరిగి దక్కించుకునేందుకు కోర్టులలో కేసులు పెట్టుకోమని వాళ్ళ నాయకులు సలహా చెప్పారు.

ఆ ప్రయోగం విఫలమయ్యాక ఒక ఇంటర్వ్యూలో హరే కృష్ణ కోనార్ ఇలా అన్నాడు. "చాలా కాలం పాటు నీడలో ఉండి సూర్యకాంతి తగలని పండు ఎలా సరిగా పండదో అలాగే రైతాంగ ఉద్యమం కూడా ప్రభుత్వ రక్షణ అనే నీడలో వృద్ధి పొందదు.[22] కాని కోనార్ మళ్ళీ పైపైనే చూస్తున్నాడు. ప్రస్తుత పరిపాలనా చట్రంలో ఎంతటి మిలిటెంటు భూ – ఆక్రమణ ఉద్యమాలైనా రాజ్యాధికారం పట్టుకోవాలనే ధ్యేయం కల దీర్ఘకాలిక దృక్పథం లేకపోతే దారిలేని గమ్యానికే వస్తాయి. ప్రభుత్వం తన దమనకాండ మొదలుపెట్టగానే, ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎదిరించే పథకం లేని రైతులు సహజంగానే గెరిల్లా చర్యలకు సన్నద్ధం కాకుండా ఉండిపోయారు.

పశ్చిమ బెంగాల్లో మరో మూల ప్రత్యామ్నాయ మార్గానికి దారివేయడం మొదలైంది.

పశ్చిమ బెంగాల్లో మిద్నపూరు జిల్లాలో దేబ్రా గోపీవల్లభపూర్‌లు రెండు పోలీసు స్టేషను (ప్రాంతాలు)లు. బీహార్ ఒరిస్సా సరిహద్దుల్లో నున్న ఆ ప్రాంతం అడవులమయం. అక్కడి ప్రజల్లో చాలా భాగం ఆదివాసులు.

---

* *ఫ్రాన్స్ మొదలైన శీతల ఐరోపా దేశాలలో (గాజుతొట్టెల్లో చేపలను పెంచినట్టుగానే) కొన్ని తరహా గాజుగదుల్లో మొక్కలు పెంచి కృత్రిమంగా వేడిమిని ఆ గదుల్లో తయారుచేసుకుని అనుభవించేవారు. మనం పొదరిళ్ళలో చల్లదనాన్ని అనుభవించడంతో పోల్చవచ్చు. ధనికుల ఇంటి ఆవరణల్లో ఈ వేసవి గృహాలుండేవి – అను.*

ఆ కాలంలో పశ్చిమ బెంగాల్లో రెండవ ఐక్య సంఘటన ప్రభుత్వం అధికారంలో ఉండడం చేత దేబ్రా – గోపీవల్లభపూర్‌లోని సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమానికి ప్రాముఖ్యత వచ్చింది. 1967 నాటి ఐక్యసంఘటన ప్రభుత్వం చేసిన విప్లవాత్మక భూమి పంపిణీ వాగ్దానాలకు అచ్చటి రైతులు తబ్బిబ్బయ్యారు. దేబ్రాలోని సి.పి.ఎం. కేడర్లు బ్లాకు మార్కెటుదార్లపై దాడులు జరిపారు. వ్యవసాయ కూలీలు హెచ్చు జీతాల్ని కోరారు. భూస్వాముల్తో వచ్చిన సంఘర్షణలో సి.పి.ఎం. నాయకత్వంలోని రైతులు సాయుధ ప్రదర్శన జరిపారు. పోలీసులు తమ స్థావరాన్ని నెలకొల్పి కొంత మంది స్థానిక సి.పి.ఎం. నాయకులపై అరెస్టు వారెంట్లను కూడా జారీచేసారు.

ఆ రోజుల్లో ఉద్యమం గురించి చెపుతూ ఆ ప్రాంతంలోని ఒకానొక ఉద్యమ నిర్వాహకుడిలా అన్నాడు. “1967 ఉద్యమం వర్గశత్రు నిర్మూలన, స్థావర ప్రాంతపు నిర్మాణం తప్పనిసరిగా పరిణమించిన ఒకానొక దశకు చేరుకుంది. కాని బహిరంగ ప్రచారం ఎన్నటికీ రహస్య పార్టీ యూనిట్‌కు ప్రాతిపదిక కాలేదు. అందువల్ల ప్రభుత్వం జోతేదార్లు కలిసి చేసిన దాడిని ఎదుర్కోవడంలో పార్టీ వ్యవస్థ నిస్సహాయురాలై పోయింది.” న్యాయ యంత్రాంగాన్ని ఒప్పుకొని దాని ద్వారా పోరాడాలనుకున్నప్పుడు తమ నెత్తిన పడ్డ సుదీర్ఘమైన ఖర్చుతో కూడిన న్యాయసంబంధమైన పోరాటాల్ని వారు ఉదహరించారు.[23]

వాళ్ళు చేసిన కొన్ని చర్యలవల్ల, మొదటి ఐక్యసంఘటన ప్రభుత్వం 1967లో రద్దయ్యాక కూడా, దేబ్రా – గోపీవల్లభపూర్‌లలోని రైతాంగం ఉద్రిక్తులుగానే ఉన్నారు. ఝూగ్రాంతో సహా ఆ రెండు పోలీసు స్టేషను ప్రాంతాల్లోనూ, “ప్రమాద కేంద్రాలుగా” పేర్కొన్న నివేదికలో రైతులు 2000 ఎకరాల దాకా బలవంతంగా ఆక్రమించారని పేర్కొన్నారు.[24] ఆ కాలంలో మార్గం గురించి సి.పి.ఎం. రైతాంగ నాయకులు కొట్టుమిట్టాడుతున్నారు. నక్సల్బరీ పోరాటపు సమాచారంతోనూ, ఆ సందర్భంలో జరుగుతన్న సిద్ధాంత వివాదాల వల్ల ఉత్తేజితులై “మిద్నపూర్ సమన్వయ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 1969 మార్చిలో AICCCRతో అనుబంధం పొందారు. మిద్నపూరు సమన్వయ సంఘంలోని అనేక గ్రూపులూ, వ్యక్తులూ, ఎత్తుగడల పంథాపట్ల తమకు గల అభిప్రాయ భేధాల వల్ల AICCCR నుంచి తొలగిపోయారు. ఆ సంవత్సరం మేలో సి.పి.ఐ.(మా.లె.) పార్టీ ఏర్పడగానే దేబ్రా–గోపీవల్లభపూరు విప్లవకారులు కొత్త పార్టీలో చేరారు. 1969 ఆగస్టు 29వ తేదీన షర్మిహిలో జరిగిన సమావేశంలో వాళ్ళు ‘వర్గ శత్రువుల నిర్మూలనా కార్యక్రమాన్ని’ తమ ప్రాంతంలో అమలుపరిచేందుకు నిర్ణయించారు. గోపీవల్లభపూర్ బహారోగొరా, దేబ్రాలనే జిల్లాలోని

మూడు ప్రాంతాల్ని తమ కార్యక్రమాన్ని అమలుపరిచేందుకు ఎన్నుకున్నారు.

ఆ సంవత్సరం సెప్టెంబరు, అక్టోబరు మధ్య కాలంలో 'గెరిల్లాలు అనేకమంది భూస్వాముల్ని చంపారు. తుపాకుల్ని పట్టుకున్నారు. భూస్వాముల ఆస్తుల్ని స్వాధీనం చేసుకున్నారు. వాటిని భూస్వాములకు తణఖాపెట్టిన సొంతదార్లకు ఆయా ఆస్తుల్ని తిరిగి ఇచ్చారు. అప్పు పత్రాలను అంటించేశారు. ఆ చర్యలకు సత్వరఫలితం కనబడింది. కంటకుడైన ఒక భూస్వామి లేక షాహుకారు ఖతం కావడంతో మిగతా గ్రామాల్లోని భూస్వాములూ సాహుకార్లూ పారిపోసాగారు. పారిపోనివాళ్ళు తిరుగుబాటుదార్లకు లొంగిపోయారు. దాంతో ఆ ప్రాంతంలో రాజ్యం చేసేవాళ్ళు లేకపోయి, అధికారపు ఖాళీ* ఏర్పడింది.

ఆ విధంగా ఏర్పడిన అధికారపు లోటుకు తోడు, రైతులకిచ్చిన రాజకీయ శిక్షణతో 1969 నవంబరులోని పంట మాసూలు కాలంలో మొదలైన చర్య తరువాత దశకి (పోరాటానికి) మార్గం ఏర్పడింది. రైతులు భూస్వాముల పొలాలకు చెందిన పంటను పట్టుకోసాగారు. ఆ ఉద్యమపు నివేదిక ఇలా పేర్కొంది. "చిన్న రైతుల, మధ్య రైతుల పట్ల సానుభూతిపరులైన ధనిక రైతుల పంటల్ని కొల్లగొట్టలేదు. వాళ్ళ పంటలకు హాని కలగకుండా చూశారు." తరువాత విప్లవకమిటీలు గ్రామాల్లో కొత్త న్యాయసూత్రాల్ని ఆదేశించారు. రైతు కూలీలకు రోజుకు 5 కె.జి.ల ధాన్యాన్ని కూలిగా నిర్ణయించారు. పెద్ద దుకాణాల్లోని నిత్యావసర వస్తువులకు ధరలు నిర్ణయించారు. వడ్డీ వ్యాపారస్తులకు రైతులు బాకీపడ్డఅప్పులన్నిటినీ రద్దు చేసారు.[25]

గతంలో శ్రీకాకుళం, నక్సల్బరీల్లో లాగే దేబ్రా–గోపీవల్లభపూరుల్లో కూడా ప్రజాకోర్టులు స్థాపించి భూస్వాములకూ సాహుకార్లకూ శిక్షలు విధించారు. 1970 జనవరి 'లిబరేషను' సంచిక ఇలా వివరించింది. "రైతాంగ జన సందోహపు పరిపాలన ఏర్పడినందుకు సందేహం లేదు. రైతు రాజ్యానికి అది బీజరూపం. అది ప్రాథమిక దశలోనే ఉన్న ఒక చిన్న బిందువు కావచ్చు. అది తాత్కాలికమైనదే అవ్వచ్చు."

సి.పి.ఐ. (మా.లె.) పార్టీ చెప్పిన ప్రజా బాహుళ్యపు ప్రోద్బలం ఉందని వ్యవస్థానుకూల పత్రికలు కూడా ధృవపరిచాయి. 1969 డిసెంబరు 13వ తేది 'స్టేట్సుమన్' పత్రిక దేబ్రాగోపీవల్లభపూరు కమ్యూనిస్టుల ఎత్తుగడల్ని ఇలా వర్ణించింది. "కొన్ని ప్రాంతాల్లో జోతెదార్లు రక్షణధనం ఇచ్చుకొని తమ పంటల్ని బలవంతపు మాసూలు నుంచి తప్పించుకున్నారు. ఈ డబ్బు ఇచ్చిన వెంటనే వాళ్లు ఒక విరిగిన

---

* *Power Vaccum*

చెట్టు కొమ్మను ఆ పొలంలో నాటేవారు. ఆ ధాన్యాన్ని వదిలిపెట్టాలని దాని సంకేతం, ఈ విషయంలో పొలాల్లో ఎన్నో దాఖలాలు చూశాం... బీహారు ఒరిస్సా సరిహద్దు అడవుల్లోని 20 గ్రామాలకు పైగా నక్సలైట్ల అధిపత్యంలో ఉన్నాయి. నక్సలైటు ఆధిపత్యంలో గల స్థావరాల చాయలకు సాయుధగస్తీ తోడు లేకుండా ఏ పోలీసువాడూ పోవడం లేదని మా పర్యటనలో తెలిసింది" అదే కాలంలో ఒక బెంగాలీ వార్తా పత్రికలో మరింత వివరమైన సమాచారం ఉంది. ".... ఇంతవరకు ఒక్కడు కూడా పోలీసుల్తో సహకరించేందుకు ముందుకు రాలేదు. అందుక్కారణం నక్సలైట్లంటే భయమేనని పోలీసులంటున్నారు. అది నక్సలైట్ల పట్ల భయమో ప్రేమో తేల్చడం కష్టం. కానీ పోలీసులు ఇంతవరకూ వాళ్ళ నాయకుల్ని పట్టుకోలేక పోయారనేది నిజం. దాదాపు అందరు నాయకులూ ఈ ప్రాంతంలోనే ఉన్నారనీ ప్రతీవాడికీ తెలుసు. కానివాళ్ళ సమాచారం ఎవరికీ తెలియదు.... దేబ్రాలోని కొన్ని గ్రామాల్లోకి చిన్న సంఖ్యలో అంటే ఇద్దరు ముగ్గురు పోలీసులు తుపాకుల్తో ప్రవేశించడానికి కూడా సాహసించరని స్థానిక ప్రజలు భావిస్తున్నారు.... అటువంటి గ్రామాలు దేబ్రా గోపీ వల్లభాపూరుల్లో 300 దాకా ఉన్నాయి."[26]

నగరవాసులైన విద్యార్థులు మిద్నపూరు ఉద్యమంలో ముఖ్యపాత్ర వహించారని ఈ సందర్భంలో చెప్పుకోవాలి. కలకత్తా నుంచీ ఇతర నగరాల నుంచీ అనేక మంది విద్యార్థులు తమ చదువుల్ని వదలిపెట్టి చుట్టుపక్కల గ్రామాలకు వెళ్ళారని ఇంతకు ముందు చెప్పుకున్నాం. అలా గ్రామాలకు వెళ్ళిన పెట్టీ బూర్జువా మేధావుల గురించి చారుమజుందారుకు విస్పష్టమైన అభిప్రాయాలున్నాయి. "మేధావి వర్గం నుంచి వచ్చిన పెట్టీ బూర్జువా కామ్రేడ్ల అవసరం మనకెంతో ఉంది. కాని వాళ్ళలో చాలా మంది విప్లవకారులుగా, ఉండరని మనం గుర్తుంచుకోవాలి." కాబట్టి, ఈ మేధావి వర్గం సభ్యుల్ని గ్రామ సంఘాల్లో వర్గవిశ్లేషణ చెయ్యవలసిందిగానూ (1) వర్గప్రాతిపదిక (2) పని చెయ్యాలనే కుతూహలం (3) పోరాడాలనే కుతూహలం ప్రాతిపదికగా గ్రామాల్లోని రైతాంగానికి వేర్వేరు వర్గాల్ని గుర్తించడం నేర్పమని కోరాడు. "ఈ విధంగా మనం రైతుల్ని కూడా నాయకులుగా మలచవచ్చు. అంటే మేధావి వర్గం నుంచి వచ్చే పెట్టీ బూర్జువా కామ్రేడ్ల కోర్కెల్ని ఆశయాల్ని భేదించుకుని రైతు ఉద్యమం స్వతంత్రం పొందుతుంది. దీనివల్ల మేధావివర్గం నుంచి వచ్చిన కామ్రేడ్ల సమైక్యత కూడా తొందరగా జరుగుతుంది."(19)

నాటి ఐక్య సంఘటన ప్రభుత్వం, ప్రత్యేకించి హోంశాఖను నిర్వహిస్తున్న సి.పి.ఎం. దేబ్రా–గోపీవల్లభపూర్ ఉద్యమం పట్ల విరోధ భావం వహించింది. ఆ ప్రాంతంలో

'ఖతం' కార్యక్రమాలు మొదలవగానే పోలీసు స్థావరాలు నెలకొల్పారు. కాని ప్రజా వెల్లువల ముందు స్థానిక పోలీసులు నిస్సహాయులయ్యారు. వేలాది రైతులు నవంబరులో బలవంతంగా పంటలను కోసుకునేందుకు వచ్చినపుడు పోలీసులా చాయల్లో కూడా లేకుండా పారిపోయారు.

ఆ తరువాత పశ్చిమ బెంగాల్లో సి.పి.ఎం. పార్టీ అత్యున్నత నాయకుడూ, రాష్ట్ర పోలీసుమంత్రి జ్యోతిబసు తూర్పు సరిహద్దు తుపాకీదళం (Eastern Frontier Rifles) అనే కేంద్ర (ప్రభుత్వ) దళాన్ని ఆ ఉద్యమాన్ని అణచేందుకు సాయపడాలని కోరాడు. జ్యోతిబసు చర్య సి.పి.ఎం. అవలంభించిన వ్యూహానికి తప్పనిసరిగా కలిగే పరిణామం తప్ప మరేమీకాదు. ఆ పార్టీ గ్రామ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికుల జీతాల హెచ్చింపు, భూమిలేని వాళ్ళకు భూమిని సంక్రమింపచేయడం వంటి చిన్న చిన్న ఆశయాల్ని సాధిస్తూ, హద్దులున్న హింసనే ప్రతిపాదించుకుంది. సి.పి.ఎం.కు కాని ఇతర పార్లమెంటరీ వామపక్ష పార్టీలక్కాని అప్పుడప్పుడు హింస సరిహద్దుల్ని స్పృశించే ఆందోళన ఇష్టమే. కాని ఆ ఆందోళన ఆ హద్దుల్ని మీరకుండా నాయకత్వం అదుపులో ఉండాలని ఆశిస్తారు. ప్రస్తుత వ్యవస్థను కూకటివేళ్ళతో పీకి రాజకీయాధికారం చేపట్టడానికి ఆ ఆందోళన ప్రయత్నించకూడదు. నానా జాతి సంకీర్ణ ప్రభుత్వంలో పాలుపంచుకుంటున్న సి.పి.ఎం. చాలా మందిని చాలా విధాలుగా నమ్మించవలసిన అవసరం తనపై మోపుకుంది. ప్రస్తుత వ్యవస్థను నాశనం చేసేందుకు తాము తయారుగా ఉన్నామనీ, విప్లవ ధ్వజాన్ని ముందుకు తీసుకుపోతున్నామనీ వాళ్లు రైతుల్నీ, భూమిలేనివాళ్ళనూ నమ్మించాలి. తాము ఎదుర్కొనే సాంఘిక ప్రమాదాన్నుంచి రక్షిస్తున్నామని మధ్య తరగతి వాళ్ళను నమ్మించాలి. రాజ్యాంగ బద్ధులమని కేంద్రాన్ని నమ్మించాలి.

పార్లమెంటరీ వ్యవస్థ పరిమితుల్లో అదుపుగల ఆందోళన జరపాలనే సి.పి.ఎం. ఎత్తుగడలకు తీవ్రమైన సవాలుగా పరిణమించే ఉద్యమాన్ని అనుమతించడం కంటే, ఆ పరిస్థితిలో, విశ్వాసపాత్రులైన రాజ్యాంగ భక్తులుగా కేంద్రానికి తమ పెద్ద మనిషి తరహాను రుజువు చేసేందుకు సి.పి.ఎం. ఆసక్తి కనబరచడం సహజమే. కేంద్రం ఎల్లవేళలా సి.పి.ఎం. కార్యకలాపాలను కనిపెడుతోంది. దేబ్రా–గోపివల్లభపూరుల్లో తూర్పున సరిహద్దు రైఫిలుదళాల రాకతో 'చుట్టుముట్టడం అణచివేత' విధానం ఆచరణలో మొదలైంది. 1969 డిశెంబరు 2వ తేదీ స్టేట్స్‌మన్ పత్రిక "కనబడితే కాల్చుమనే" (shoot at sight) ఆదేశాన్ని పోలీసులు పొందారని తెలిపింది. డిసెంబరు నాలుగో తేదీన ఆ పత్రిక ప్రచురించిన సమాచారంలో "నక్సలైటు మద్దతుదార్లనూ,

సానుభూతిపరుల్ని చుట్టుముట్టడానికి ఇప్పుడు అవలంభించే పథకంగా, తమకు ఎలా వచ్చిందో చెప్పలేని వాళ్ళ దగ్గర నుంచి ధాన్యాన్ని స్వాధీనం చేసుకుంటామని జిల్లా మెజిస్ట్రేటు శ్రీ బి.ఆర్. చక్రవర్తి నేడిక్కడ ఒక ఇంటర్వ్యూలో తెలిపాడు". గెరిల్లాల ఆంతరంగపు ఆహార సరఫరాల్ని నిలుపు చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని తెలుస్తూంది. అదే పత్రిక డిసెంబరు 9వ తేదీన ఇలా తెలిసింది. "లైట్ మెషిన్ గన్నులనూ, చేతి బాంబుల్నీ కూడా తుపాకులకు తోడుగా వాడేందుకు తూర్పు సరిహద్దు సైనక దళాలను (E.F.R.) అనుమతించారని తెలిసింది."

పశ్చిమ బెంగాలు, బీహారు, ఒరిస్సా పోలీసులు ఆ ప్రాంతంలోని తిరుగుబాటుదార్లను అణచేందుకు సంయుక్త కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఒక సి.పి.ఐ. (మా.లె.) పార్టీ నివేదిక పేర్కొంది. గోపీవల్లభపూర్‌లో 1200 మంది (E.F.R.) పోలీసులూ, 700 మంది దేబ్రాలోనూ, 400 మంది బీహారు సైనిక పోలీసు దళం వాళ్ళు బహారగోరాలోను విడిసారని ఆ నివేదిక పేర్కొంది. ఆ ప్రాంతంలోని ఉద్యమ నాయకులు కొంచెం ఇబ్బందిలో పడ్డారు. గెరిల్లాల్ని పోలీసులు పట్టుకోకపోయినా "గెరిల్లాల్ని పోలీసులు చుట్టుముట్టడంతో వాళ్ళు పూర్తి నైరాశ్యంలోకి జారుకున్నారు. క్రమంగా దూకుడుగా ఉండే మనస్థితి ఆత్మరక్షణకు కావలసిన పలాయన మనస్తత్వానికి మారింది." ఒకప్పుడు గెరిల్లాల తరపునున్న మధ్య రైతులూ ధనిక రైతులూ కూడా పోలీసు ఒత్తిడికి తట్టుకోలేక గెరిల్లాల్ని పట్టుకునేందుకు వాళ్ళు పన్నిన సోదాపథకాల్లో సహకరించక తప్పలేదు.[27]

చుట్టుముట్టడాన్ని ఛేదించుకుని (గెరిల్లా) నాయకులు తమ చలనాన్ని ఎందుకు పెంచుకోలేక పోయారు? గెరిల్లా కార్యకలాపాల్ని విస్తరించకపోవడం చేతా? లేక లేక గెరిల్లా దళాల సంఖ్యను పెంచలేక పోవడం చేతా? రైతుల్ని సమీకరించే సమస్యలో దేబ్రా–గోపీవల్లభపూరు పార్టీనాయకుల్లో అభిప్రాయ బేధాలున్నాయని తరువాత వెలువరించిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. 1966–67 సంవత్సరాలలో జరిగిన అదే మాదిరి ఉద్యమాల్నించి నేర్చిన గుణపాఠాల్ని పురస్కరించుకుని దేబ్రా కేడర్లు ప్రజా ఉద్యమాలనే కోరారు. కాని ఆ ఉద్యమానికి మార్గదర్శక సూత్రలను ఇచ్చేందుకు సరిహద్దు ప్రాంతీయ సంఘం (Border Regional Committee) మిగతా ఉద్యమ రూపాలకు ప్రాధాన్యమివ్వని విధంగా వర్గశతృవుల నిర్మూలనపు ఎత్తుగడలకే ప్రాధాన్యత నిచ్చింది. స్థావర ప్రాంతం లేకపోవడం చేత ఒంటెత్తుగా జరిగే ఖతం చర్యలు ఎక్కడకూ చేర్చవనీ, పార్టీ కలాపాల్ని విస్తరించే అవకాశాల్ని మరింత తగ్గిస్తాయనీ దేబ్రా కేడర్లు భావించారు. 1969 నవంబరు 1వ తేదీన సరిహద్దు ప్రాంతీయ సంఘ సమావేశంలో

రైతు సంఘాల్ని ఏర్పరచాలని దేబ్రాకేడర్లు ప్రతిపాదించారు. వాళ్ళ ప్రతిపాదన వీగిపోయింది. ప్రజాసమావేశాల్ని, ప్రజా ఉద్యమాల్ని నిర్వహించినందుకు విమర్శలకు గురయ్యారు. 1970 జనవరిలో ధిఘాలో జరిగిన మరో సమావేశంలో 'ఖతం చర్యల' ఎత్తుగడల్ని వ్యతిరేకించినందుకు ప్రాంతీయ సంఘం దేబ్రాకేడర్లను దుయ్యబట్టింది.[28]

ఇది జరిగాకే, చారుమజుందారు, దేబ్రా–గోపీవల్లభపూరుని సందర్శించాడు. పొరుగు ప్రాంతాలకు కూడా కార్యకలాపాల్ని విస్తరించమని తన అనుయాయుల్ని కోరాడు. పోలీసులు చుట్టుముట్టడాన్ని తప్పించుకునేందుకు విస్తరణ చాలా అవసరం. బయట ఏర్పరచుకున్న కొత్త స్థావరాల్తో శతృవు చుట్టుముట్టడాన్ని తిరిగి చుట్టుముట్టవచ్చు.

కాని పరిసర ప్రాంతాల్లో రాజకీయ ప్రచారం ద్వారా తగిన సన్నాహాలు జరగలేదు. విస్తరణ చెయ్యవలసిన అవసరం గుర్తించినా లాభం లేకపోయింది. ప్రచారం లేకపోవడం విస్తరణకు గొప్ప అడ్డుగా తయారైంది. గెరిల్లాలకు రక్షణ కల్పించేందుకు ముందుకు వచ్చి అవసరమైతే వాళ్ళతో చేరడానికి ప్రజలు తయారవడమే రాజకీయ శిక్షణ ఉందనుకునేందుకు సరియైన తార్కాణం, చారుమజుందారు సలహాపై పరిసర ప్రాంతాలలో కూడా కొన్ని ఖతం చర్యలు జరిగాయి. మిద్నపూర్‌లోని భకూలియా ఖర్గపూర్ ప్రాంతాల్లో వర్గశతృవుల ఖతంగా కనిపించే హత్యలు జరిగాయి. కాని అంతకుముందు అక్కడి ప్రజల్లో రాజకీయపరమైన పని జరగలేదు. అంచేత దేబ్రా – గోపీ వల్లభపూరుల్లోలాగ రైతాంగ జనబాహుళ్యంలో ఆ చర్యలు పెద్ద చలనం కలిగించలేదు.

దక్షిణాన 24 పరిగణాలలోనూ, ఉత్తరాన జల్పైగురీ, నక్సల్బరీల్లో (పశ్చిమ బెంగాల్లో) అటువంటి హత్యలే జరుగుతున్నాయి. పోలీసు గూఢచార్లు, భూస్వాములు, వడ్డీ వ్యాపారస్తులు అటువంటి హత్యలకు గురౌతున్నారు. ఒక సంఘటనలో జల్పైగురిలో నియమింపబడ్డ భారత సైన్యపు హవల్దారును చంపారు. 1970 ఆరంభానికి అస్సాం, త్రిపురల్లో కూడా అటువంటి సంఘటనలు జరుగుతున్నట్టు తెలిసింది. తూర్పు పాకిస్తాను సరిహద్దుల్లో ఉన్న ఈ రెండు రాష్ట్రాల భౌగోళిక ప్రాముఖ్యత దృష్ట్యా సి.పి.ఐ (మా.లె.) పార్టీ ఈ రెండు రాష్ట్రాల్లోని "సాయుధ విప్లవ పోరాటాన్ని భారత విప్లవం దృష్ట్యా ఎంతో ప్రాముఖ్యత కలిగినది"గా అభివర్ణిస్తూ ఆహ్వానించింది.[29] అస్సాం రెవిన్యూ మంత్రి ఎమ్.ఎమ్. చౌధురి షిల్లాంగ్‌లోని రాష్ట్ర శాసనసభలో 1970 ఏప్రిలు 6వ తేదీన రాష్ట్రంలో దాదాపు 200 మంది నక్సలైట్లు పని చేస్తున్నారని చెప్పాడు. అదే సంవత్సరం ఏప్రిలు 27వ తేదీన అస్సాం ప్రభుత్వం నక్సలైట్ల గురించి

రాష్ట్రస్థాయి హెచ్చరికను జారీ చేసింది. ఉత్తర భారతంలో, ఉత్తర ప్రదేశ్‌లోని లక్ష్మీపూరులోనే కాక పంజాబులోని కొన్ని ప్రదేశాలు కూడా పోరాటాలకు రంగాలయ్యాయి. పాటియాలా రాజ్యసైన్యంలో GOC-in-C గా రిటైరైన జనరలు బల్వంతసింగును సి.పి.ఐ. (మా.లె.) కేడర్లు 1969 ఆగస్టులో కాల్చి చంపారు.

1970 ఆరంభంలో సి.పి.ఐ. (మా.లె.) పార్టీ తన కార్యకలాపాల్ని సమీక్షించుకునే స్థాయికి చేరుకుంది. ఈ పరిస్థితి పార్టీనాయకత్వానికే కలికి తూరాయి. మరో విధంగా ఆలోచిస్తే అది ఎదుర్కోవలసిన సవాలు. పార్టీ అతి స్వల్పకాలంలోనే రైతాంగాన్ని మేల్కొలిపి సమీకరించగలిగింది. తొమ్మిది రాష్ట్రాల్లో* చిన్న చిన్న ప్రదేశాలకు పరిమితమైనా, సాయుధ పోరాటం గ్రామ ప్రాంతంలో 'యథాస్థితికి' (Status quo) గొడ్డలి పెట్టుగా తయారైంది. ప్రభుత్వం తన పూర్తి బలంతో ఉద్యమంపై దాడి చేయవలసినంత ప్రమాద స్థాయికి వచ్చినట్టు భావించసాగింది. నక్సల్బరీ ఒక ముట్టడి కాదు. భారతదేశంలో ప్రవేశపెట్టిన క్రొత్త తరహా విప్లవ పోరాటానికి జరిగిన మొదటి పోరాట రూపం. కొందరు కార్యదీక్షాపరులైన వ్యక్తులు దాన్ని అభిమానించారు. ఆ ఉద్యమంలో నిస్వార్థంగా పీడితజనుల తరపున నిలచిన శ్రీకాకుళం ప్రాంతంలోని ఉపాధ్యాయుడు, అసాధారణ ధైర్యశాలి, చతురుడు, స్ఫురద్రూపీ అయిన వెంపటాపు సత్యనారాయణ; గుంటూరులోని తన లాభసాటైన ప్రాక్టీసును వదులుకుని, శ్రీకాకుళ గెరిల్లాలో లీనమైపోయిన కంటివైద్య నిపుణుడు డాక్టరు భాస్కరరావు; కార్యశూరుడు, విప్లవ రచయితకు ప్రతీక, కలబోసిన గెరిల్లాల నేత, ప్రజలను తన పాటల్తో ఉద్రూతలూగించిన సుబ్బారావు పాణిగ్రాహి; గొప్ప నాయకుడు కాగలిగిన విద్యార్థి నాయకుడు ఆషీంచటర్జీ; బ్రిటీష్ పాలన కాలం నాటి రాయల్ ఇండియన్ ఏర్‌ఫోర్సులో విమానదళంలో పనిచేసిన నాటినుంచీ కమ్యూనిస్టుగానే ఉన్న, ముషాహరి వీరోచిత రైతాంగ పోరాటపు నాయకుడు సత్యనారాయణ సింగు మొదలైన వాళ్ళు అటువంటి ఎందరో నిస్వార్థ నాయకుల్లో కొందరు మాత్రమే. వాళ్ళల్లో చాలామంది చనిపోయి ఉండొచ్చు. మరికొందరు తరువాతి కాలంలో చారుమజుందారు నుంచి విడిపోయి ఉండొచ్చు. కాని 1969లో మాత్రం వాళ్ళు భారతీయ విప్లవ సుదర్శనాన్ని పాలకవర్గాల కళ్లు తిరిగేలా, గిరగిరా తిప్పారు. అదీకాక, సి.పి.ఐ. (మా.లె.) పార్టీ దృష్టిలో ప్రపంచ

* *"...... రైతాంగ సాయుధ పోరాట జ్వాలలు పశ్చిమ బెంగాలు, బీహారు, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, హిమాచల్, ఒరిస్సా, అస్సాం, త్రిపుర రాష్ట్రాలలోనూ, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లోనూ వ్యాపించాయి." – నవచైనా వార్తా సంస్థ 1970 మార్చి 27.*

విప్లవాధినేతగా గుర్తించబడిన చైనా కమ్యూనిస్టు పార్టీ, దాని విజయపరంపరను పొగిడింది కూడా.

మరోవైపు మాత్రం, రాజ్య యంత్రాంగం చేపట్టిన "చుట్టుముట్టి అణచివేత" విధానం వల్ల శ్రీకాకుళం, దేబ్రా, గోపీవల్లభపూరుల్లో అప్పుడే కళ్ళు తెరుస్తున్న విప్లవపు కనుగడ్డ, అరుణశక్తి ఇబ్బందులకు గురౌతోంది. ప్రత్యేకించి శ్రీకాకుళంలో జరిగిన అనేక దురదృష్టకర సంఘటనల్లో 1969 నవంబరు-డిసంబరు మాసాల్లో ఉద్యమంలో పనిచేస్తున్న ప్రముఖ నాయకులు పోలీసులకు పట్టుబడ్డారు. కొందరు పోలీసుల చేతుల్లో ప్రాణాలు పోగొట్టుకున్నారు. సోంపేట తాలూకాలోని మైదాన ప్రాంతాల్లో శత్రువు చాలా గెరిల్లా యూనిట్లను చుట్టుముట్టి డాక్టరు భాస్కరరావును చంపారు. తన భర్త చనిపోయిన తరవాత అతని స్థానాన్ని భర్తీ చేసిన పంచాది కృష్ణమూర్తి భార్య నిర్మలను పట్టుకుని నరికేశారు. ఆరంభం నుంచీ శ్రీకాకుళ సాయుధ పోరాటంతో సంబంధం కల యువమేధావి చౌదరి తేజేశ్వరరావు కూడా అరెస్టయ్యాడు.

శత్రు చర్యను ఎదుర్కొంటూ స్థావర ప్రాంతాన్ని నిలబెట్టుకోవడం ఎలా అనే సమస్య సి.పి.ఐ. (మా.లె.) పార్టీకి ఎదురైంది. ఆ సమస్య విషయంలో భావిలో ఎత్తుగడల్ని రూపొందించేందుకు, నాయకత్వం నుంచి దార్శనికమైన దృక్పథం రూపొందవలసి ఉంది.

# 7. మార్గాల కూడలిలో (మా.లె.) పార్టీ

అనుకూలావకాశాలు తప్పక వస్తాయని పోరాటాలు మొదలెడితే ప్రపంచ చరిత్ర తీరే ఎంతో సులువుగా ఉండేది.

– ఎల్. కుగలేమన్‌కు కార్ల్‌మార్క్సు రాసిన లేఖ

ఏప్రిలు 17, 1871

పోరాటంలో చేరే ముందు రివిజనిస్టులు ఖచ్చితంగా విజయం రావాలంటారు. విప్లవకారులు పోరాడేందుకు సాహసిస్తారు. రివిజనిజానికి విప్లవానికి ఇదే ముఖ్యమైన తేడా. విప్లవకారులు సాహసంతో విజయం పొందుతారు.

– పార్టీ పంథాపై రివిజనిస్టు దాడి గురించి' (వ్యాసం) అక్టోబరు 1970

– చారుమజుందార్

## యుద్ధచ్ఛాయలు

1969 శిశిరం తరువాత వచ్చిన 1970 నాటి వసంతం తెచ్చిన కొత్త సంవత్సరం ఒక సంచలనాత్మక దశాబ్దానికి నాంది పలికింది. దేశంలోని కమ్యూనిస్టు విప్లవకారులు తమ పోరాటాల్లో మునిగి ఉన్నారు. ఆసియాలోని మరో భాగంలో కామ్రేడ్లు భారీస్థాయి జ్వాలాతోరణంలో చిక్కుకున్నారు.

ఉస్సోరి నదిపై గడ్డకట్టిన మంచుపై నాట్యం చేసే నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ 1969 మార్చిలో కాల్పులు మొదలయ్యాయి. దాంతో చైనా – సోవియట్ యూనియన్ల మధ్య పదే పదే జరుగుతున్న సంఘర్షణలు తీవ్రమయ్యాయి. ఆ సంవత్సరం ఆగస్టులో ప్రావ్దా తన సంపాదకీయంలో చైనాపై సోవియటు అణుదాడి గురించి నర్మగర్భంగా బెదిరించింది. కొన్ని నెలల తర్వాత అక్టోబరు 1న జరిగే చైనా రిపబ్లిక్కు అవతరణ దినోత్సవంలో పెకింగ్ రాలీలో చైనా ఉపాధ్యక్షుడు (వైస్ ఛైర్మన్ లిన్‌పియావో మాట్లాడుతూ "తమ అప్రమత్తతను పెంచుకోవాలని, తమ పైకి వచ్చే శత్రుదాడుల్ని

తుడిచి పెట్టేందుకు సర్వకాలాల్లోనూ యుద్ధానికి మరింత సిద్ధంగా ఉండాలనీ" చెప్పాడు. ప్రపంచ ప్రజల్నుద్దేశించి కూడా ఇలా అన్నాడు." .... ఎలాంటి సామ్రాజ్య వాదం కాని సోషల్ సామ్రాజ్యవాదం కాని తలపెట్టిన ఎట్టి దురాక్రమణ యుద్ధాన్నైనా ఐక్యంగా ఎదిరించండి. ఆ యుద్ధంలో అణ్వాయుధాలే సాధనాలు. అటువంటి యుద్ధం కనక వస్తే ప్రపంచ ప్రజలు దురాక్రమణ యుద్ధాన్ని నిర్మూలించేందుకు విప్లవ యుద్ధాన్ని చేపట్టాలి. నేటి నుంచే సన్నాహాలు మొదలెట్టండి."[1]

రోజులు గడిచేకొద్దీ యుద్ధ ప్రమాదం మరింత ప్రబలమైంది. 1969లో 29 డివిజన్లున్న దూర ప్రాచ్య సైనిక విభాగంలోని తన బలాన్ని సోవియటు యూనియన్ 1970 నాటికి మరింత పెంచింది. మంగోలియాలో రెండు డివిజన్లూ, మిగతా సోవియటు సరిహద్దులో 34 డివిజన్లూ ఉన్నాయి.[2] చైనాకూ సోవియట్ యూనియనుకూ వివాదాస్పదమైన భాగం గురించి చర్చలు మొదలెట్టి 1970 ఫిబ్రవరి నాటికి ఐదు నెలలైనా చెప్పుకోదగ్గ ఫలితాలు కనిపించలేదు. ఉత్తర సరిహద్దుల్లో సోవియట్ ప్రమాదం ముంచుకొస్తోంది. దక్షిణ ప్రాంతంలో అమెరికా సాగిస్తున్న తన వియత్నాం యుద్ధాన్ని ఆ సంవత్సరం మార్చి నెలలో సంయుక్త పోరాటపు వ్యూహాన్ని ఆలోచించేందుకు ఏప్రిలు మాసాంతంలో చైనా లావోస్, కాంబోడియాల్లోకి విస్తరించింది. దక్షిణ వియత్నాం జాతీయ విముక్తి సంఘం, థెపట్ లావో, ప్రిన్సు షిహనౌకు అనుచరులతో కూడిన సమావేశాన్ని పెకింగ్‌లో నిర్వహించింది.

ఈ అంతర్జాతీయ పరిణామాల ప్రభావం సి.పి.ఐ. (మా.లె.) పార్టీపై పడింది.

## దేశీయ రంగం

సోవియట్, అమెరికన్ దాడులు జరుగుతున్న 1970 సంవత్సరారంభంలో, దేశంలోని కమ్యూనిస్టు విప్లవకారులపై పోలీసుల దమనకాండ హెచ్చింది. ఆ మార్చిలోనే పశ్చిమబెంగాల్లో ఐక్య సంఘటన ప్రభుత్వం పడిపోయింది. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో స్థానిక పోలీసులు, కేంద్ర రిజర్వు పోలీసులు (సి.ఆర్.పి.) తూర్పు సరిహద్దు దళ సైనికులూ (EFR) కలిసి దేబ్రా – గోపీవల్లభపూరుల్లోని సి.పి.ఐ. (మా.లె.) కేడర్లపై దాడిచేసారు. సి.పి.ఐ. (మా.లె.) అధికారం కొంతమట్టుకున్న గ్రామాలపై పోలీసులు దాడి చేసారు. రైతు కేడర్లూ, పార్టీ అనుయాయులూ జైళ్ల పాలయ్యారు. కలకత్తాలో 'లిబరేషన్', 'దేశబ్రతి' పత్రికా కార్యాలయాలపై కూడా పోలీసులు దాడి చేసారు. ఆ పత్రికలు రహస్య ప్రచురణ మొదలెట్టాయి.

పెట్టని కోటల్లాంటి స్థావరాల్లో పరాజయాలెదురౌతున్న, మరికొన్ని రాష్ట్రాలలో

తగ్గుస్థాయిలోనైనా కొత్త ప్రాంతాల్లో సి.పి.ఐ. (మా.లె.) కార్యకలాపాలు వ్యాపిస్తున్నాయి. దేశ రాజకీయాకాశంలో పార్టీ వేగుచుక్కలా ప్రకాశించింది. కేంద్ర దేశీయాంగమంత్రి వై.బి. చవాన్ 1970 ఏప్రిలు 9న లోక్‌సభలో అస్సాం, నాగాలాండ్, మిజో కొండల్లోకి 'నక్సలైట్' కార్యకలాపాలు వ్యాపించాయని చెప్పాడు. ఏప్రిలు 2న పెకింగ్ రేడియో తన ప్రసారంలో సి.పి.ఐ. (మా.లె) పార్టీ విజయాల్ని పేర్కొంటూ "ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ పశ్చిమ బెంగాలు, బీహారు, ఉత్తర ప్రదేశ్, పంజాబు, హిమాచల్‌ప్రదేశ్, ఒరిస్సా, అస్సాం, త్రిపురాలకు ప్రస్తుతం సాయుధ సంఘర్షణ జ్వాలలు వ్యాపించాయని" చెప్పింది. ఆ ప్రసారంలో "జ్వాలలు"గా పేర్కొన్నా అవి ఎంత తొందరగా వెలిగాయో అంత తొందరగానూ ఆరిన నిప్పు రవ్వలు మాత్రమే. సాయుధ పోరాటపు అవసరం గురించిన కరపత్రాలు, వాల్ పోస్టర్ల ద్వారా మావోయిస్టు భావాల ప్రచారం, భూస్వాముల్ని చంపి తుపాకుల్ని కొల్లగొట్టడం వంటి కార్యకలాపాలు ఎన్నో జరిగాయి. "కొన్ని అగ్రగామి విభాగాల" ప్రోద్బలంతో జరుగుతున్న దశలోనే ఆ కార్యకలాపాలింకా ఉన్నాయి. చారుమజుందారు "ప్రజలు, ప్రజాపోరాటాలు మహత్తర ప్రోద్బలం దోహదంగా కలిగిన" కార్యకలాపాల స్థాయికింకా చేరుకోలేదు(20) అవెంత చెదురు మదురుగా జరిగినా, ఎంత అల్పాయువులైనా, సాయుధపోరాటం ద్వారా అధికారాన్ని పట్టుకోవాలనే సిద్ధాంతాన్ని ఆ కార్యకలాపాలు ప్రచారం చేసాయి. ప్రజల్లో, ప్రత్యేకించి రైతాంగంలో, 1967 నుంచి నక్సల్బరీ పోరాటం తీవ్రస్థాయిలో జరిగిన భూమి ఆక్రమణోద్యమమనే దురభిప్రాయం తొలగిపోతోంది. ఆ పోరాటం, దాని తరవాత జరిగిన సంఘటనల్తో గెరిల్లా యుద్ధం ద్వారా రైతాంగం గ్రామ ప్రాంతంలో ప్రాంతీయ ప్రాతిపదికపై అధికారం పట్టుకోవడమనే. సిద్ధాంతం ఆధారంగా జరిగిన సంఘటనలుగా వాటిని గుర్తించసాగారు.

సిద్ధాంత ప్రచార ప్రభావాన్ని కేంద్రం కూడా గుర్తించింది. నాటి దేశీయాంగ శాఖ ఉపమంత్రి వి.సి. శుక్లా, వాళ్లు 'చంబల్ లోయలోని దోపిడీ దొంగలు మనకు పెట్టిన సమస్యకంటె ఎంతో తీవ్రమైన సమస్యను" తెచ్చి పెట్టారని 1970 ఏప్రిలు 20న రాజ్యసభలో అన్నాడు. సి.పి.ఐ. (మా.లె.) పార్టీలో ప్రధానాంశంగా యువతకున్న ప్రాముఖ్యతను గుర్తించి మంత్రి ఇలా అన్నాడు. "వాళ్లు సాధించాలనుకుంటున్నది... శాంతియుతంగానూ, అహింసాయుతంగానూ, రాజ్యాంగపరమైన న్యాయమార్గాల్లోనూ సాధించవచ్చని మన విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు భావించేలా చేసేందుకు మార్గాల్ని వెదకాలి." ఆ సమయంలో ఎట్టి ప్రాముఖ్యత లేనట్టు కనిపించే ఆ చర్యల దీర్ఘకాలిక పరమార్థాల్ని గుర్తించే దూరదృష్టి కేంద్ర ప్రభుత్వానికుంది. అందుచేత

'దానం-దండం' రెంటినీ ప్రయోగించాలని నిశ్చయించింది. 1970-71 కేంద్ర ప్రభుత్వపు బడ్జెటులో సన్నకారు రైతుల్నీ, వ్యవసాయ కూలీల్నీ బహుశ 'నక్సలైటు' ప్రభావాన్నించి తప్పించేందుకేమోననిపించేలా వారికోసం రూ. 6.5 కోట్లు కేటాయించింది. కాని 1961-62లో రూ. 18.6 కోట్లున్న పోలీసు శాఖ ఖర్చు మాత్రం 1970-71 నాటికి 88.84 కోట్లకు పెరిగింది.*

సి.పి.ఐ. (మా.లె.) పార్టీలో మరో సంక్షోభం రాజుకుంటోంది. పెరుగుతున్న పోలీసుదాడుల వల్ల కమ్యూనిస్టు స్థావరాలు ఒక్కొక్కటే చేజారి పోతున్నాయి. కొందరు నాయకులలో చారుమజుందారు 'ఖతం' ఎత్తుగడలపట్ల, సాంప్రదాయిక ఆయుధాలనే ఉపయోగించాలనే నియమం గురించీ అపోహలు మొదలయ్యాయి. ప్రాచీనాయుధాలే కల రైతులు, బలమైన సైనికదాడిని ఎలా ఎదుర్కొంటారని ప్రశ్నించాడు. 'ఒక ఇసుక రేణువులో ప్రపంచం'లాగ రైతు యొక్క చిన్న దాడుల్లో కూడా, విప్లవ శక్తులు నిబిడీకృతమై ఉన్నాయనే అభిప్రాయంతోనే చారుమజుందారు ఆలోచించాడు. 1969 నాటి విజయాలను గుర్తుచేస్తూ తమ విజయాల్ని కించపరచుకోవద్దని తన అనుయాయులను కోరాడు. "విశాలమైన విముక్త ప్రాంతాలూ, క్రమశిక్షణాయుతమైన ప్రజాసైన్యం సాధ్యమయ్యే సూచనల్తో 1970 సంవత్సరం వచ్చింది." 1970కి స్వాగతం పలుకుతూ "ఈ దశాబ్దాన్ని దేశంలోని పీడిత తాడిత జనవిమోచనా దశాబ్దంగా చేయండి!" అని ఉద్బోధించాడు.(30)

అరుణశక్తిని విచ్ఛిన్నం చేస్తూ, పటిష్టమైన విద్రోహపు విజయం కళ్ళముందు కనిపిస్తూంటే, సుదూర దిక్చక్రంలో మిణుగుమిణుగుమంటూ నానాటికీ అంతరించే విప్లవ విజయపు తీరుతెన్నుల్ని చూడడం అతని విమర్శకులకు సాధ్యపడలేదు. 1970 ఫిబ్రవరిలో పార్టీ పత్రికలో వ్యాసం "పార్టీ లోపల విమర్శల్ని" ప్రస్తావిస్తూ, "అన్ని స్థాయిల్లోనూ పార్టీలోనూ విప్లవంలోనూ కామ్రేడ్ చారుమజుందారు నాయకత్వాన్ని స్థిరంగా స్థాపించడమే నేటి మన కర్తవ్యం" అని వక్కాణించింది.

## విప్లవాధికారం

పార్టీలో చారు భక్తులు ఈ రోజుల్లోనే అతన్ని భారత విప్లవపు అత్యున్నతాధికారిగా నిలబెట్టేందుకు ప్రయత్నించారు. తరచు ఆ ప్రయత్నం తీవ్రస్థాయికి పోయింది. ఒకానొక

* *1980-81 నాటికి వ్యవసాయరంగంలో పంపిణీ అయిన మొత్తం పది సంవత్సరాలకు కలిసి రూ. 2,237 కోట్లు. పోలీసు శాఖ కేటాయింపు ఒక్క 1982-83 సంవత్సరానికే రూ. 351.30 కోట్లు. (చూ॥ హిందు 1-3-82 అను)*

దశలో తన భక్తుల్ని చారుమజుందారు తీవ్రంగా హెచ్చరించవలసి వచ్చింది.

అటువంటి సందర్భాల్లో సాధారణంగా జరిగినట్టుగానే అతన్ని ఒక పవిత్ర స్థానంలో నిలబెట్టారు. అతన్ని ప్రశ్నించిన వాళ్ళనందర్నీ విప్లవ విద్రోహులుగా చిత్రీకరించారు. వ్యక్తి పూజకూ, బ్యూరోక్రటిక్ ధోరణులకూ దారితీసే ఇలాంటి విషయాలు ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల చరిత్రల్లో మనకు చిరపరిచితమే. సాంస్కృతిక విప్లవం తారస్థాయికి వచ్చి మావో ఆరాధన కూడా ఈ కాలంలోనే మొదలైంది. అదే ధోరణిని ప్రతిబింబిస్తూ చారుమజుందారు కూడా "చైనా ఛైర్మన్ మన ఛైర్మన్" అనే నినాదాన్ని రూపొందించాడు. చారుమజుందారుకూ మరికొందరు కామ్రేడ్లకూ మధ్య ఏర్పడిన విబేధాలకు ఇది కూడా ఒక కారణమైంది. తరువాతి కాలంలో చైనా కూడా ఆ నినాదాన్ని లేవదీయడాన్ని గర్హించింది.

ఈలోగా ముషాహరి, లక్ష్మీపూర్, గోపీవల్లభపూరు, శ్రీకాకుళం మొ॥ చోట నుంచి వచ్చే పరాజయ సమాచార పరంపర చాలా మంది సి.పి.ఐ. (మా.లె.) నాయకుల ధైర్యాన్ని కూల్చివేసింది. వాస్తవ పరిస్థితులు చారుమజుందారు సిద్ధాంతాల్ని గేలి చేస్తున్నాయని భావించారు. దానికి బదులుగా అతని అనుచరులిలా ప్రశ్నించారు. అతని సిద్ధాంతాల్ని "పూర్తిగా" అనుసరించడం వల్ల ఆ పరాజయాలు వచ్చాయా, లేక వాటిని 'పూర్తిగా" అనుసరించకపోవడం వల్ల అవి వచ్చాయా?

## పార్టీ కాంగ్రెసు

సి.పి.ఐ. (మా.లె.) నాయకుల్లో కొందరు ఎదురు దెబ్బలు, సందేహాల్తో సతమతమౌతున్నారు. పాత కార్యక్రమాన్ని అమలు చేయాలనీ, తమ నాయకుణ్ణి అత్యున్నతాధికారిగా నిలబెట్టాలని మరికొందరు కోరుతున్నారు. ఈ ద్వైధీవాతావరణంలో సి.పి.ఐ. (మా.లె.) మొదటి సమావేశం కలకత్తాలో 1970 మేలో జరిగింది.

శ్రీకాకుళం నుంచి వెంపటావు సత్యనారాయణ, ఆదిభట్ల కైలాసం, మల్లికార్జునుడూ, బీహారు నుంచి సత్యనారాయణ సింగు ప్రభృతులూ, పోరాటం జరుగుతున్న ప్రాంతాల నుంచి మరెందరో అధినేతలుగా, ప్రతినిధులుగా ఆ సమావేశానికి వచ్చారు. సమగ్రంగా రూపొందించిన కార్యక్రమాన్ని ఆ కాంగ్రెసు ఆమోదించింది. దాని ప్రకారం నేటి 'ప్రధాన వైరుధ్యం' భారత ప్రజాబాహుళ్యానికి ఫ్యూడలిజానికీ మధ్య ఉంది. అది సమసిపోతే మిగతా వైరుధ్యాలు సమసిపోతాయి. భారత బూర్జువా వర్గపు కాంప్రడార్ లక్షణాల్ని పేర్కొంటూ, అది అమెరికను సామ్రాజ్యవాదానికీ, సోవియట్ సోషల్

సామ్రాజ్యవాదానికీ, లోబడి ఉందని భావించింది. నేటి భారత విప్లవదశను ప్రజాతంత్ర విప్లవ దశగా పేర్కొంది. "దాని సారాంశమే వ్యవసాయిక విప్లవం" ఫ్యూడలిజాన్నీ, కాంప్రడార్ బ్యూరోక్రటిక్ పెట్టుబడిదారీ విధానాన్నీ సోషల్ సామ్రాజ్య వాదాన్నీ కూలదోయడమే నేటి ప్రాథమిక కర్తవ్యం. విప్లవ సాధనకై కార్మికుల, రైతుల, పెటీ బూర్జువాల ప్రజాస్వామ్య సంఘటనను నిర్మించవలసిన అవసరాన్ని నొక్కి చెప్పింది. "కార్మికవర్గ నాయకత్వంలో చిన్న తరహా, మధ్యతరహా బూర్జువా వర్గాల్లో ఒక భాగాన్ని కూడా" అటువంటి ప్రజాస్వామిక సంఘటనల్లో చేర్చుకోవచ్చు. విప్లవానికి ప్రధాన శక్తిగా ఉండేది మాత్రం రైతాంగమే. కాని "దేశంలో కొన్ని ప్రాంతాల్లోనైనా సాయుధ పోరాటంతో అరుణ రాజకీయాధికారాన్ని స్థాపించాక వచ్చే కార్మిక కర్షక ఐక్యత ప్రాతిపదికగానే ఈ సంఘటన నిర్మాణం సాధ్యపడుతుంది."

ప్రజాతంత్ర విప్లవకాలమంతటా ఆచరణలో గెరిల్లా యుద్ధం ప్రధాన పోరాట రూపంగా ఉంటుంది. ".... గెరిల్లా యుద్ధం ద్వారానే చిన్న చిన్న సాయుధ పోరాటాలు పెద్దగా వ్యాపిస్తాయి. ప్రజాయుద్ధపు ఉజ్వల తరంగాల ద్వారా ఆ విస్తరణ జరుగుతుంది. దాని ద్వారా ప్రజాసైన్యం ఏర్పడుతుంది... అది నగరాల్ని చుట్టుముట్టి (వాటిని) పట్టుకుంటుంది." లిన్‌పియావో సూత్రీకరణను ఈ సందర్భంలో ఉదహరించింది. "శతృవులపై ప్రజల మొత్తం బలాన్ని సమీకరించి సంహరించేందుకు గెరిల్లా యుద్ధమొకటే మార్గం" మావో సేటుంగు నాయకత్వంలో జరుగుతున్న ప్రపంచ విప్లవంలో భారతవిప్లవాన్ని అంతర్భాగంగా భావించింది. "ప్రపంచ స్థాయిలో విజయం పొందేందుకు సోషలిజం ముందుకు పోతూండగా, సామ్రాజ్యవాదం పూర్తి దివాళాకు దిగిన మావోశకం"లో ఆ విప్లవం జరుగుతోంది.

రాజకీయ – సంస్థాపర నివేదికను కూడా ఆ సమావేశంలో ప్రవేశపెట్టారు. "మరింత నిర్మొహమాటంగా, ఐక్యతతో ఖతం కార్యక్రమాన్ని కొనసాగించవలసిన" అవసరాన్ని ఆ నివేదిక పునరుద్ఘాటించింది. బీద రైతుల, భూమిలేని రైతుల చొరవకు అనుగుణంగా సాంప్రదాయిక ఆయుధ సంపత్తిపైనే ఆధారపడాలని పేర్కొంది. వివిధ ప్రాంతాల్లో "పోరాటపు జ్వాలలు వ్యాపించడాన్ని" పేర్కొంటూ "వెల్లువ తరవాత వెల్లువగా సాయుధ రైతాంగ సంఘర్షణలు ప్రజా ఉద్యమాన్ని కలుగజేసే దశ ఆరంభించిందనీ, దేశమంతటా విప్లవ దావానల జ్వాలలు అలముకొంటాయనీ" పేర్కొంది. "దేశమంతటా విప్లవాన్ని విజయోన్ముఖానికి తెస్తూ ఈ మహోద్భృత విప్లవ తరంగ నాయకులుగా వ్యవహరించడం మన బాధ్యత." పార్టీపై ప్రభుత్వం మొదలెట్టిన దమనకాండ దృష్ట్యా. "మనం ప్రజల్లోకి ఎంత గాఢంగా చొచ్చుకుపోగలిగామనే

దాన్ని బట్టే మన ప్రధాన బలాల నాయకత్వపు పరిరక్షణ ఆధారపడి ఉంటుంద"ని భావించింది.

ఆ సమావేశం ఒక రాజ్యాంగాన్ని (నియమావళిని) కూడా ఆమోదించింది. "విమర్శ, ఆత్మవిమర్శల"తో పార్టీ నిర్మాణం, స్థిరీకరణలను అందులో పేర్కొన్నారు. పార్టీ నాయకత్వంలో, సాయుధపోరాటంలో ఉన్న అన్ని విప్లవ వర్గాల, గ్రూపుల, ఐక్యసంఘటన సమీకరించబడుతుంది. "భారత దేశంలోని విప్లవకారులందరకూ" పార్టీ తన ద్వారాల్ని తెరిచింది. "పీడించే వర్గాల" నుంచి వచ్చిన వారిని కూడా (తమ యావదాస్థినీ పార్టీకి ఇచ్చెయ్యాలనే నిబంధనతో) ఆహ్వానించింది. ఆ నియమావళి ప్రకారం ఉన్నతమైన విభాగాలు (superior units) సాధారణ వైఖరిని నిర్ణయిస్తాయి. క్రింది విభాగాలకు ఆయా విధానాల్ని పూర్తి చొరవతో అమలు పరిచేందుకు అవసరమైన ఎత్తుగడల విషయంలో స్వతంత్రం ఉంటుంది.

పార్టీ కాంగ్రెసు నాలుగు ప్రాంతీయ బ్యూరోలను ఏర్పరచింది. ఢిల్లీ, పంజాబు, జమ్మూ కాశ్మీరుల్ని కలుపుతూ పశ్చిమ ప్రాంతపు బ్యూరో ఆర్.పి. షరాఫ్ ఆధీనంలో ఉంటుంది. ఉత్తర ప్రదేశ్, బీహారులతో కూడిన మధ్య ప్రాంత బ్యూరో సత్యనారాయణ సింగు, ఎస్.కె. మిశ్రాల అజమాయిషీలో ఉంటుంది. పశ్చిమ బెంగాలు, అస్సాంలతో కూడిన తూర్పు ప్రాంతానికి సౌరీన్‌బోసు బాధ్యుడు. ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడులు భాగాలుగా గల దక్షిణ ప్రాంతపు సంచాలకులు తరవాత నిర్ణయించబడతారు. భావిలో పోలీసు దమనచర్యల కారణంగా ఎప్పుడైనా కేంద్ర నాయకత్వంతో సంబంధాలు కనక విచ్ఛిన్నమైతే ఈ బ్యూరోలు స్వతంత్రంగా పనిచేయాలనీ పార్టీ కాంగ్రెసు ఉద్దేశించింది.

## చారుమజుందార్ ఉపన్యాసం

చారుమజుందార్ సమర్పించిన రాజకీయ-వ్యవస్థాత్మక నివేదిక ఆ పార్టీ సమావేశపు రహస్యాంశాల్లో అత్యంత కుతూహలకరమైన అంశం. చారుమజుందారు తన ఉపన్యాసంలో తాను అనుసరించాలనుకొన్న ఎత్తుగడ(ల) పంథాను వివరించాడు.

"వర్గశతృవుల ఖతం" గురించి అతని సిద్ధాంతాన్ని పరాజయాలకు కారణంగా జోడించి ఎప్పుడూ దుయ్యబట్టే విమర్శలకు జవాబుగా ఏకపక్ష వైఖరిగా కనుపించే చిత్రమైన ఆత్మరక్షణా ధోరణిని చేపట్టాడు. మొత్తం ఉపన్యాసంలో "ఖతా"న్ని సమర్థించాడు. ఈ ఖతం కార్యక్రమం ద్వారానే నూతన మానవుడు తయారౌతాడని వక్కాణించాడు. "కొత్త మానవుడు చావును లెక్కపెట్టడు. స్వార్థచింతన అసలే ఉండదు".

"శత్రువు దగ్గరగా వెళ్ళాలంటే ఎటువంటి ఆత్మపరమైన ఆలోచననైనా జయించాలి" ఎంతో మంది అనవసరంగా చనిపోతున్నారని అతని విమర్శకులు (అమరజీవుల గురించి) భావించగా చారుమజుందారు "... అమరజీవుల రక్త తర్పణం ద్వారానే ఈ విజయం వస్తుంది. అమరువీరుల రక్తం ఇచ్చిన ఉత్సాహంతో యోధులు నవమానవులుగా మారతారు. అది వాళ్ల హృదయాల్ని వర్గద్వేషంతో నింపుతుంది. అమరవీరుల రక్తం వల్ల వాళ్లు ఉత్తేజం పొంది వట్టిచేతుల్తో వర్గ శత్రువుల్ని సమీపించి (వర్గ శత్రువుల) తుపాకుల్ని లాక్కుంటారు."

శ్రీకాకుళం గడ్డపై వర్గశత్రువులింకా జీవించే ఉన్నారని వాపోయాడు. వాళ్ళను తుడిచిపెడితే కాని నవచైతన్యం కొత్త నమ్మకం ఆవిర్భవించదు. దీన్నించి అతను ఒక్కసారిగా వర్గశత్రువుల ఖతాన్ని వ్యతిరేకించిన వాళ్ళందరూ "ప్రజా శత్రువులే" కాబట్టి వాళ్లతో ఎటువంటి ఐక్యతా సాధ్యపడదనే నిర్ణయానికి వచ్చేశాడు. అట్టి వ్యక్తులకు పార్టీలో చోటులేదు. సాంప్రదాయిక ఆయుధాల్నే ఉపయోగించాలనే నియమంపై గల విమర్శను ఎదుర్కొంటూ "బీదరైతులు, భూమిలేని రైతులు తుపాకుల్తో ముందుకు సాగాలనేది మన కలకాదా? అవును. అది మన కలే! కాని ఈ దశలో తుపాకుల నుపయోగించడం వల్ల వర్గశత్రువుల్ని చంపేందుకు రైతాంగ బాహుళ్యం చూపే ఉత్సాహానికి దోహదం చేయడం బదులు దాన్ని నిరోధిస్తుంది."

చారుమజుందార్ ఉపన్యాసంలో చాలావరకు ఆగ్నేయాసియాలో పరిణామాలకు కేటాయించాడు. కాంబోడియాలో అమెరికా దురాక్రమణను "తృతీయ ప్రపంచ యుద్ధపు ఆరంభం"గా అభివర్ణించాడు. (కొన్ని రోజుల తరువాత మే 20వ తేదీన "కొత్త ప్రపంచ యుద్ధపు ప్రమాదం" ఇంకా ఉందని మావోసేటుంగు అన్నాడు. మావో చారుమజుందార్ల అంచనాల్లో గల తేడాను ఎత్తిచూపుతూ మజుందారు విమర్శకులు తరువాత కాలంలో వాస్తవాన్ని కొండంతలు చేసి అనవసరమైన నిర్ణయానికి వచ్చే ఈ అలవాటును నిరసించారు) సి.పి.ఐ. (మా.లె.) పార్టీ పుట్టుక, అది మొదలెట్టిన రైతాంగ విప్లవపోరాటం భారత చరిత్ర యొక్క నిర్ణాయక శక్తిగా ఉండి దేశంలోని ఆంతరంగిక స్థితిని తారుమారు చేసింది అన్నాడు. 'లిబరేషను', 'దేశవ్రతి' పత్రికల్లో వర్ణించిన సమాచారాన్ని బట్టి పార్టీ కాంగ్రెసులో నిర్ణయాలను సాక్షిగా ఆమోదించినట్టనిపించినా, పార్టీ కాంగ్రెసుకు ముందుగా జరిగిన కేంద్ర కార్యనిర్వాహక సంఘపు (Central Organising Committee - C.O.C.) సమావేశంలోనూ, పార్టీ సమావేశంలోనూ కూడా దేశంలోని వివిధ ప్రాంతాల్లోని పార్టీ కార్యకర్తల్ని వేధించే అపోహలు, సందేహాలూ, పైకి వచ్చాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కమిటీ సి.వో.సి.

సమావేశంలో పార్టీ కార్యక్రమానికి సవరణ ప్రతిపాదించింది. బడా బూర్జువా వర్గానికి తప్ప, మొత్తం బూర్జువా వర్గానికి, కాంప్రదార్ తత్వం ఆపాదించకూడదనేది దాని సారాంశం. చట్టపరమైన పోరాటాల్ని, ప్రజా ఉద్యమాల్ని కూడా సాయుధ పోరాటానికి అనుబంధ పోరాటాలుగా ప్రకటించాలని వాళ్లు కోరారు. సి.వో.సి. అన్ని సవరణల్ని తోసి పుచ్చింది. విప్లవాధికార సమస్య కూడా పార్టీ సమావేశంలో తలెత్తింది. ఆ కాలంలో చారు భక్తుడూ, ఉత్తర బెంగాల్లో ప్రముఖ నాయకుడూ ఐన సౌరీన్ బోసు, చారుమజుందార్ని అత్యున్నతాధికారిగానూ, ఆయన ఆదేశాల్ని అనుసరించ దగినవిగానూ వర్ణిస్తూ, ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. చారుమజుందారు పట్ల తమ విశ్వాసాన్ని వెల్లడించుకునేందుకు ప్రత్యేకించి పశ్చిమ బెంగాలు ప్రతినిధులు పార్టీ సమావేశంలో ఎంతో పోటీపడ్డారని తరువాత వర్ణన బట్టి తెలిసింది. గోపీవల్లభపూర్‌లో ఉద్యమ బాధ్యతల్ని వహించిన అషీం చటర్జీ చారుమజుందారుకూ కేంద్రకమిటీకీ ఏవేనా తగాదాలు వస్తే తాను ఎప్పుడూ చారుమజుందారునే అనుసరిస్తానని పార్టీ సమావేశంలో చెప్పినట్టు తెలియవచ్చింది. 1967లో చైనాకు వెళ్ళిన మరో ఉత్తర బెంగాలు నాయకుడు ఖాకోన్‌మజుందారు, చారుమజుందార్ని చైనా బయట గల గొప్ప మార్క్సిస్టు - లెనినిస్టుగా మావోసేటుంగు పేర్కొన్నట్టు ప్రకటించాడు. కానూసన్యాలు, ఎంతో పశ్చాత్తాపాన్ని కనబరుస్తూ తన తెరై రైతు ఉద్యమ నివేదికలో చారుమజుందార్ అధికారాన్ని పేర్కొనక పోయినందుకు తన్ను విమర్శించాలని భావించాడు.[3]*

బీహారుకు చెందిన సత్యనారాయణసింగు, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన శివకుమార మిశ్రా ఆర్.ఎస్. ఉపాధ్యాయ్‌లు, తమిళనాడుకు చెందిన అప్పు వంటి ప్రతినిధులు అలా చారుమజుందారును ఆరాధించడాన్ని నిరసించారు. తరువాతి కాలపు పత్రం ఒకదానిలో ఇలా ఉంది. "చారు ముఠా (చారుముజందారు) సి.పి.ఐ. (మా.లె.) వ్యవస్థాపకుడు కాబట్టి, పార్టీకి, కేంద్ర కమిటీకి అతీతంగా చారుమజుందారును నిలబెట్టాలని పార్టీ సమావేశంలో కోరింది.... ఉత్తర ప్రదేశ్, తమిళనాడు, బీహారు, అస్సాం రాష్ట్ర సభ్యుల మార్క్సిస్టు వైఖరి వల్ల వాళ్ళ విశ్వప్రయత్నాలన్నీ విఫలమై ఆ తీర్మానాన్ని ఉపసంహరించుకోవలసి వచ్చింది."[4] వివాదగ్రస్తమైన ఆ తీర్మానంపై చారుమజుందారు మాట్లాడుతూ. (విప్లవాధికారాన్ని ఏర్పాటు చెయ్యకపోతే పార్టీ

---

* *కాని పార్టీ కాంగ్రెసు జరిగిన కొద్ది సంవత్సరాలలోగానే చారుమజుందార్ భక్తబృందంలో ప్రతి ఒక్కడూ అతనిని దుర్భరంగా విమర్శించడం ఆశ్చర్యకరమైన విషయం.*

బహుళ-కేంద్రత్వం, రివిజనిజం చోటు చేసుకుంటాయన్నాడు. కాని ఆ విషయాన్ని వోటు ద్వారా నిర్ణయించవద్దని ప్రతినిధుల్ని కోరాడు. (విప్లవా)ధికారాన్ని ఏర్పాటు చేయాలని భావించిన వారిని పార్టీలో రెండు పంథాల పోరాటాన్ని (two-line struggle) కొనసాగిస్తూ రివిజనిజం ఓడే దాకా ఓర్చుకోమన్నాడు.[5]

కాని ఆ తగాదా ఆ సమావేశంలో ముగిసిపోలేదు. కాంగ్రెసు ఐపోయాక కొత్తగా ఏర్పడ్డ కేంద్రకమిటీలో మళ్ళీ తలెత్తింది. (కేంద్ర కమిటీ సభ్యులు : పశ్చిమ బెంగాలు – చారుమజుందారు, కానుసన్యాలు, సుశీతలరాయ్ చౌధురీ, సరోజ్‌దత్తా, సౌరీస్‌బోసు, సునీతీ ఘోషు, అషీంచటర్జీ; బీహారు – సత్యనారాయణ సింగు, గురబక్షసింగు; ఆంధ్రప్రదేశ్ – డా॥ నాగభూషణ పట్నాయక్, అప్పలసూరి, వెంపటాపు సత్యనారాయణ, ఆదిభట్ల కైలాసం; తమిళనాడు – అప్పు, కోసుదయానం; కాశ్మీరు – ఆర్.పి. షరాఫ్; కేరళ – అంబడ్డీ, రెండు నెలల్లోనే అంబడ్డీ పార్టీని వదలి కాంగ్రెసు పార్టీలో చేరాడు.) సత్యనారాయణసింగు, శివకుమార్ మిశ్రా, అప్పు తదితరులు కేంద్రకమిటీ సమావేశంలో పార్టీ యూనిట్లను సంప్రదించకుండా విద్యార్థులపై తన సొంత వైఖరిని రుద్దినందుకు చారుమజుందారును విమర్శించారు. వాళ్ళలో పశ్చిమ బెంగాలుకు చెందిన సుశీతలరాయ్ చౌధురి కూడా ఉన్నాడు. చారుమజుందారు చివరకు లొంగుతు కేంద్రకమిటీ ముందుకు ప్రతీ తీర్మానాన్ని తెచ్చేందుకు ఒప్పుకున్నాడు.[6]

## పార్టీ సమావేశం తరువాత

శత్రువు తన కోరల్ని ముందుకు చాపాడు. కమ్యూనిస్టు విప్లవకారుల్ని నిర్దాక్షిణ్యంగా అణచేందుకు పోలీసులు నడుం కట్టారు. సి.ఆర్.పి. వంటి కేంద్ర సైనిక దళాలు శ్రీకాకుళం దమనకాండలో పాలుపంచుకున్నాయి. వీరోచిత జ్ఞాపకాల్ని భావితరాలకు మిగిల్చి ధైర్యంగా ఎంతో సాహసంతో పోరాడేవాళ్లు దమనకాండకు బలైపోయారు. అరుణ కేంద్ర పరిరక్షకులు సన్నగిల్లుతున్నారు. శ్రీకాకుళపు నాయకుల్లో అపోహలూ అనుమానాలూ పెరగసాగాయి.

ఆ కాలంలోనే శ్రీకాకుళం కొండ ప్రాంతాల నాయకులకూ, మైదానాల్లోని నాయకులకూ విభేధాలు తలెత్తాయి. కొండ ప్రాంతాల నాయకులు తమ పత్రంలో ఇలా వాపోయారు. “గత సెప్టెంబరు నుంచీ అరుణ ప్రాంతంలో ఉద్యమం మందకొడిగా నడుస్తోంది.... మావో ఆలోచనను మన పరిస్థితులకు అన్వయించేటప్పుడు కొండ ప్రాంతాలను స్థావరంగా వృద్ధిపరచేందుకు ప్రాముఖ్యతనిచ్చి అక్కడ నుంచి మైదానాలకు వ్యాపించాలి. ఈ అంశం యొక్క ప్రాధాన్యతను గుర్తించక, కొండ ప్రాంతాల్ని మరిచి,

పోరాటాన్ని మైదానాల్లోనే కేంద్రీకరించారు. దీనివల్ల ఇబ్బందులు కలిగాయి. అరుణ ప్రాంతపు దళాలు పట్టుకున్న డబ్బూ, బంగారమూ జిల్లా నాయకులు తీసుకున్నారు. అరుణ స్థావరపు అవసరాలను గుర్తించక, కొద్ది మొత్తాల్లోనే డబ్బు ఇచ్చారు. దీనివల్ల అరుణ స్థావరపు కామ్రేడ్లు ఇబ్బంది పడ్డారు. డబ్బు లేనందున స్వతంత్రంగా ఆయుధ సామాగ్రిని సంపాదించుకోలేక పోయారు. ఆయుధ సామాగ్రికి కొరత వచ్చింది."[7]

ఖతం ఎత్తుగడల్ని మైదాన ప్రాంతాలకు విస్తరించడం విషయంలో ప్రధానంగా బేధాభిప్రాయం వచ్చింది. (కొండల్లో వలె) మైదానాల్లో ప్రజా ఉద్యమాల పూర్వరంగం లేనందువల్ల, రైతుల్ని సన్నద్ధం చేసి గెరిల్లా యూనిట్లను తయారు చేసే అవకాశం తక్కువే. కాని ఖతం కార్యక్రమాన్ని సంఖ్యాపరంగా విస్తరింప చెయ్యాలనుకుని, ఎలా చూసినా "వర్గశతృవులు" కాని చిన్న కమతాల వాళ్లను కూడా విచక్షణ లేకుండా చంపారు. తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సి.పి.ఐ. (మా.లె.) కమిటీ ఓ పత్రంలో ఇలా ఒప్పుకుంది. "ఏజన్సీ ప్రాంతపు నాయకత్వానికీ పార్టీ నాయకత్వానికీ మధ్య వైరుధ్యాలు తలెత్తాయి. తరువాత పార్టీకి ఎంతో హాని కలిగించిన హేయమైన ముఠాతత్వానికి అది దారితీసింది."[8]

ఆ భీకర దృశ్యాల్ని ప్రజలకు జుగుప్స కలిగేలా చిత్రిస్తూ ఆ విబేధాల్ని పోలీసులు ఆసరాగా చేసుకున్నారు. మైదానాలపై గిరిజనులు దాడిచేస్తున్నారని ప్రచారం చేసారు. వర్గబేధాల్ని మరిపిస్తూ ప్రాంతీయ బేధాలకు ఆజ్యం పోశారు. ప్రజా ఉద్యమాల్ని విచ్ఛిన్నం చేసేందుకు పాలకవర్గం చేసే పాత గారడీయే. 'గప్పగారు'గా గిరిజనుల అభిమానం సంపాదించిన గిరిజన నాయకుడైన వెంపటాపు సత్యనారాయణను పార్వతీపురం తాలూకాలోని బోరికొండలలో 1970 జూలై నెలలో పోలీసులు కాల్చి చంపారు. దానితో శ్రీకాకుళం ఉద్యమానికి తీరని దెబ్బ తగిలింది. అతని మిత్రుడు ఆదిభట్ల కైలాసం కూడా అతనితో పోలీసు తుపాకీ గుళ్ళకు బలయ్యాడు.

ఆ తరవాత, నాటి రాష్ట్ర దేశీయాంగమంత్రి జలగం వెంగళరావు రాష్ట్రంలో సి.పి.ఐ. (మా.లె. ఉద్యమం అణచబడిందని ఎంతో నమ్మకంగా చెప్పుకున్నాడు. హైదరాబాదులో జరిగిన ఒక పత్రికా సమావేశంలో "ఎదురు కాల్పుల్లో" వాళ్లు చచ్చి పోయారని వెంగళరావు ప్రకటించినా, వాళ్ళను పోలీసులు అరెస్టు చేసాక చంపారనేది అందరికీ తెలిసిన సంగతే. సి.పి.ఐ. (మా.లె.) పార్టీపై ప్రభుత్వ దమనకాండను అలా చిత్రించడం మామూలే. ప్రముఖనాయకుల్ని కోల్పోయిన పోరాటదళాల్లో వైమనస్యం చోటు చేసుకుంది. పోలీసులు తేలికగా అరుణ ప్రాంతాన్ని చుట్టుముట్టి గిరిజనుల నుంచి గెరిల్లాల్ని వేరు చేయడానికి తలపెట్టారు. అలా సి.పి.ఐ. (మా.లె.) ప్రజా బలాన్ని ఛేదించాలనుకున్నారు. అధికార

వర్గాలు గ్రామాలకు గ్రామాల్నే తరలించే "కీలక గ్రామాల ఏర్పాటు" అనే వియత్నాం విధానాన్ని చేపట్టాయి. 1970 నవంబరు 22 నాటి ఒక యు.ఎన్.ఐ. వార్త ప్రకారం "600 మంది ప్రజలున్న 250 గిరిజన కుటుంబాల్ని వారి గ్రామాల నుంచి ఖాళీ చేయించి, రామభద్రపురం జమ్మివలస, పెద్దచాలిబండ గ్రామాల్లో వాళ్ళను పెట్టారు.... నక్సలైటు ఉద్యమం నుంచి గిరిజనుల్ని వేరు చేసేందుకై ప్రభుత్వం ఈ చర్య తలపెట్టింది." పోలీసు స్థావరాల రక్షణ కవచంలో తమ తమ లావాదేవీల్ని తిరిగి కొనసాగించేందుకు, వర్తకులూ వడ్డీ వ్యాపారస్తులూ 1970 చివరి నాటికి, మైదానాల నుంచి శ్రీకాకుళం ఏజెన్సీ కొండలకు తిరిగి వచ్చారు.*

అటువంటి 'కీలక గ్రామమైన' రామభద్రపురాన్ని నాలుగు సంవత్సరాల తరువాత సందర్శించిన ఒక పత్రికా విలేకరి గిరిజనుల ఇక్కట్లను వివరించింది "ఆ కేంద్రంలో నివాసపు నిబంధనలు చాలా ఖచ్చితంగా ఉన్నాయి. పొద్దుకుంకే వేళకు గిరిజనులు తిరిగి రావాలిసిందే. కర్ఫ్యూ గురించి హెచ్చరించే సైరన్లు లేవుకాని పోలీసు బాయ్‌నెట్లే వాళ్ళని కొండల మీంచి ఇళ్ళకి తోలుకొస్తాయి." రామభద్రపురానికి కొన్ని మైళ్ళ దూరంలోని పాతగ్రామాల్లో తమ తమ పొలాల్లో వాళ్ళు పనికి వెళ్లాలి. వాళ్ళు అక్కడ రాత్రికి (పోలీసు నిబంధనల వల్ల) ఉండడం కుదరదు. సాయంకాలానికల్లా కేంద్రానికి చేరుకోవాలి. కాపలా లేకుండా అంది వచ్చిన పంటను అడవిపందులు తదితర జంతువుల బారికి వదిలి రావలసి వచ్చేదని ఆమె (ఆ విలేకరి) గమనించింది. గిరిజనులు "అడవి సరుకును సాహుకార్లకు అమ్మి" ఇప్పుడు "మళ్ళీ వాళ్ళ ఆధీనంలోకి వచ్చారని" ఒక రెవిన్యూ అధికారి చెప్పినట్టు ఆమె ఉదహరించింది. తమ పాత ప్రాంతాలకు వెళ్ళే ఆదివాసులు తమ బిడ్డల్ని కేంద్రంలో ఖైదీలుగా (జమానత్) ఉంచేవారు. దాంతో తల్లిదండ్రులు పారిపోరు. "ఆదివాసులు కలత చెందుతున్నారని" స్పెషల్ డిప్యూటి కలెక్టర్ చెప్పినట్టు ఆ విలేకరి ఉదహరించింది.[9]

## శ్రీకాకుళం - 1970

1970 నాటికి ముఖ్యమైన నాయకులను కేడర్లను ఉద్యమం పోగొట్టుకుంది. నాయకత్వం నిర్దేశించిన ఎత్తుగడలపై అపోహలు మరింత పెరిగాయి. శత్రువు పన్నిన వల మరింత బలంగా అల్లుకుంది.

---

* *ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాధికారులు 1970 చివరలో హైదరాబాదులో తమ సంభాషణల్లో ఈ సంగతి బహిరంగంగా అంగీకరించారు.*

అప్పలసూరి, నాగభూషణ పట్నాయక్‌లు స్థానిక పార్టీ వ్యవస్థ మనోభావాలను చారుమజుందారుకు తెలియజేసేందుకు 1970 జూలైలో కలకత్తా వచ్చారు. చారుమజుందారు జవాబు తమ కామ్రేడ్లకు అందజేయకుండానే కలకత్తాలో అరెస్టయ్యారు.

తన శ్రీకాకుళపు కామ్రేడ్ల నుద్దేశించిన సందేశంలో చారుమజుందారు ఇలా అన్నాడు. "ప్రతీస్క్వాడుకూ ప్రజాస్వామిక హక్కులివ్వండి. తమ పథకాల్ని తాముగా వేసుకోండి. వాటిని విజయవంతంగా అమలు కానివ్వండి. చిన్న స్క్వాడ్లతో మొదలై ఆ ప్రాంతమంతా వ్యాపించండి. ప్రతీ రక్తం బొట్టునూ బదులు తీసుకునేందుకై అందర్నీ ఉత్తేజపరచండి. ప్రజల సహకారానికై చేతులు ముందుకు చాపండి..." వర్గశత్రువులపైనే దాడి చేయడంతో ఆగక, చిన్న గెరిల్లా స్క్వాడులు పోలీసుల్ని కూడా ఖతం చేసి వాళ్ళ తుపాకుల్ని లాక్కోవాలి. అలా శ్రీకాకుళమంతటా ప్రజాసైన్యాన్ని నిర్మించాలి "ఇతోధిక సహకారాన్ని కోరుతూ ప్రజల్ని సమీకరించండి. తప్పుడు సమాచారంతో శత్రువును తప్పుడు దోవ పట్టించడం మొదలుకొని విషం పెట్టి చంపడంతో సహా అన్ని రకాల ఎత్తుగడలనూ అవలంభించండి." అని ఉద్ఘాటించాడు.(39)

అధికారాన్ని పట్టుకోవడం గురించిన కలలతో ప్రజల్ని ఉత్సాహపరిచేందుకు "విప్లవ కమిటీలను" ఏర్పాటు చెయ్యమన్నాడు. అవి బీజరూపంలో ఉన్న ప్రజా ప్రభుత్వాలన్నమాట. "విప్లవ కమిటీల్ని ప్రతీ గ్రామంలోనూ ఏర్పరచండి. విప్లవకమిటీలే మన రాజ్యశక్తి. విప్లవ కమిటీల ప్రతీ ఆదేశాన్ని పాటించండి. అలా పాటించమని ఇతరులకు చెప్పండి." ఈ కమిటీలకు పార్టీతో ఉండవలసిన సంబంధాల్ని వివరిస్తూ "తీవ్రమైన పెడదారులు పడితే తప్ప, వీటి విషయాలలో పార్టీ కమిటీలు కలుగజేసుకో కూడదు. విప్లవకమిటీల రాజ్యశక్తిని స్థాపించడం, దాన్ని పెంపొందించడం ఈ విధంగానే వీలవుతుంది. విప్లవకమిటీ సభ్యుల్లో హెచ్చు భాగాన్ని పార్టీ బయట నుంచే తీసుకోవాలి. బీదరైతులనూ, భూమిలేని రైతులనూ, పార్టీ రాజకీయాల్ని నిజాయితీగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నించేవారినీ, ఈ కమిటీల్లోకి తీసుకోవాలి. విప్లవకమిటీ, పార్టీయూనిట్ రెండూ రెండు చేతుల్లాంటివి. వాటి మధ్య గల సంబంధాలు సన్నిహితంగానూ స్నేహపూర్వకంగానూ ఉండాలి. అందరూ దాని ఆదేశాల్ని పాటించాలి..." (అదే వ్యాసం)

కొన్ని నెలల తరువాత మరో వ్యాసంలో శత్రుసమీకరణను విచ్ఛేదించేందుకై మరిన్ని పోరాట ప్రాంతాల్ని ఏర్పరచుకోవాలని వక్కాణించాడు. భారతదేశంలో ప్రతీమూలా ఉన్న ప్రజ్వలించే పరిస్థితి వల్ల ఇది సాధ్యమేనని భావించాడు. "భారతదేశంలోని

ప్రతీమూలా ఈనాడు అంటుకునేందుకు సిద్ధంగా ఉంది. శ్రీకాకుళ సాయుధ పోరాటం శ్రీకాకుళానికే పరిమితమై ఉండదు.”

శ్రీకాకుళం కేడర్లు మాత్రం; కనీసం వాళ్లలో చాలా భాగం, చారుమజుందారు సలహాను పాటించే మన స్థితిలో లేరు. శ్రీకాకుళ ప్రాంతీయ సంఘం (మార్క్సిస్టు – లెనినిస్టు), 1970 నవంబరులో తయారు చేసిన ఒక పత్రంలో ఒక కొత్త కార్యక్రమాన్నే ఏర్పరచాలనుకున్నారు. “కొన్ని ఎత్తుగడల విషయంలో మనం పొరబడ్డాం. ఈ తప్పులను సవరించుకొనేందుకు ప్రయత్నిస్తున్నాం.” ఆర్థికపరమైన కోర్కెల్లో ప్రధానంగా పాల్గొనే ప్రజాబాహుళ్యపు చర్యలకే తమ ప్రాధాన్యతను బదలాయించారు. “అన్ని రకాల దోపిడీల విషయంలోనూ పోరాడేందుకై ప్రజల్ని సి.పి.ఐ. (మా.లె.) నాయకత్వం కింద సమీకరించాలనుకున్నాం. భూస్వాముల మిగులు భూమినీ, అక్రమంగా ఆక్రమించిన భూమినీ స్వాధీనపరుచుకోవడం, హెచ్చువడ్డీ అప్పుల మీద వడ్డీ చెల్లించకపోవడం. భూస్వాముల ధాన్యాల్ని స్వాధీనం చేసుకుని ఆ ధాన్యాన్ని సరసమైన ధరలకు అమ్మడం, వంటి కొన్ని సమస్యలపై ప్రజలు పోరాడాలి... ప్రస్తుతం పంటను చేజిక్కించుకునేందుకు కూడా ప్రజల్ని సమీకరించాలి” అని ఆ పత్రం పేర్కొంది.[10]

సి.పి.ఐ. (మా.లె.) ఆంధ్రా స్టేట్ కమిటీని తరువాత పునర్వ్యవస్థీకరించిన చారుమజుందారును (నిక్కచ్చిగా) అనుసరించే అనుచరులు. శ్రీకాకుళ జిల్లా సంఘం “ఒక అడుగు వెనక్కి వేసి ఆర్థిక సమస్యలపై ప్రజల్ని సమీకరించేందుకు” చేసిన ప్రయత్నాన్నీ దుయ్యబట్టారు.[11]

కాబట్టి 1970 అంతానికి శ్రీకాకుళంలో విప్లవోద్యమం నిర్ద్వంద్వంగా ఎదురు దెబ్బ తింది. ఉచ్చనీచాల్లేని శతృవు యుక్తిగా శ్రీకాకుళంలో లోతుగా పాతుకొని బలం పుంజుకున్నాడు. గిరిజనులు కోపాన్ని అణిచి ఉంచుకుని భయంగా మసులుకుంటున్నారు. పోలీసులు, బెదిరింపు దమనకాండల రాక్షస రాజ్యం మొదలెట్టారు. మూకుమ్మడిగా అరెస్టులు చేశారు. కుళ్ళు కంపుకొట్టే జైలుగదుల్లో ఆదివాసుల్ని నిర్దాక్షిణ్యంగా కుక్కారు. వాళ్ళకు సరిగా అన్నం నీళ్లు ఇవ్వకుండా నెలల తరబడి నిర్బంధించారు. అంతులేని రక్తదాహంతో ప్రభుత్వం (మంచినీటికి బదులుగా) మృత్యువును గిరిజన గ్రామాల్లో ప్రవేశపెట్టింది.

ఉన్నత స్థాయి నాయకత్వం నశించింది. శ్రీకాకుళం ఉద్యమంలో రెండవ తరహా నాయకులు రాజకీయ విబేధాలతోనూ పోలీసులు తమ కోసం నిర్విరామంగా గాలిస్తుంటే మానసికంగా కృంగిపోయారు.

## శ్రీకాకుళ పోరాటం – సమీక్ష

మహత్తరమైన ఆశలతో మొదలై, ఏదో విధమైన అరుణాధికారం ఏర్పాటు చేసిన శ్రీకాకుళం ఉద్యమం ఎందుకు వీగిపోయింది?

ఆ ఉద్యమంలో పాల్గొన్న వాళ్లు పూర్తి కథ చెపితేనే కాని పరాజయ కారణాలను విపులంగా పరిశీలించడం కుదరదు. ఈనాడు వారిలో చాలా మంది జైళ్ళలో మగ్గుతున్నారు. మనం కొన్ని ఊహగానాలను మాత్రమే చెయ్యగలం.

మొదట ఈ ఉద్యమానికి శత్రువైన పోలీసు యంత్రాంగం ఈ పరాజయాన్ని గురించి ఏమంటోందో విందాం. ఈ ఉద్యమాన్ని తుడిచిపెట్టే బాధ్యత స్వీకరించిన ఒక ఉన్నత పోలీసు అధికారి జరిపిన పరిశీలన ప్రకారం "…. నాయకులు ఒకదాని వెంట మరోటిగా అనేక తప్పుడు అంచనాలు చేసారు. ఒకసారి తిరుగుబాటును ప్రారంభించి, (కొన్ని) ఫలితాలు చూపగానే కొండలలోనున్న మొత్తం ఆదివాసులూ, మైదానాల్లోని బీదకూలీలూ, భూమిలేని కూలీలూ తమతో చేరతారని ఆశించారు. వాళ్లా విషయంలో దారుణంగా దగా పడ్డారు. రెండోది. 'విప్లవం' యొక్క సున్నితమైన సంగతులు గ్రహించే నాగరికత ఆదివాసులకు లేదు... ఉద్యమంలో జేరి 1000 మంది (దాకా ఉన్న) గిరిజనులు కూడా తాము గుడ్డిగా నమ్మిన వెంపటాపు సత్యనారాయణ ప్రభావం వల్ల జేరారు. ధృడమైన అభిప్రాయాల గల నక్సలైటు కార్యకర్తల నోటి నుంచి దడదడా వెలువడే పెద్ద పెద్ద సూత్రీకరణలు వాళ్ళకేమీ ఉపయోగించలేదు. మూడోది. నక్సలైట్లు పోలీసుల అధిక కాల్పుడు శక్తిని లెక్కపెట్టలేదు. నాటుబాంబులు, మజిల్ లోడర్లు, గొడ్డళ్ళు, బల్లేలు, బాణాలు–తుపాకీలతో సరితూగలేవు కదా. అధిక సంఖ్యలో పోలీసులు దాడిచేయగానే ఆదివాసులు దిక్కు లేకుండా పోయారు. తమ కలాపాలలో పోలీసులు నిర్దాక్షిణ్యంగానే వ్యవహరించారు. ఏమాత్రం అనుమానం కలిగినా కాల్పులు జరిపారు. దాంతో ఎంతో మంది అమాయకులు కూడా ప్రాణాలు కోల్పోయారు. నాలుగు : గిరిజనుల పరిస్థితి చాలా దయనీయంగా తయారైంది. వాళ్లొక విషవలయంలో చిక్కుకున్నారు. పోలీసులకు సాయపడితే నక్సలైట్లు కోప్పడతారు. అనుమానితులైన నక్సలైట్లకు ఆశ్రయం ఇస్తే, పోలీసులు గిరిజనుల బ్రతుకును దుర్భరం చేస్తారు.[12]

ప్రజల నుంచి విడివడిపోయిన పోలీసు శక్తి యొక్క చక్కని నిర్లిప్తతతో కూడిన అసహ్యతపై సమీక్ష అంతటా అక్కడక్కడ కనపడుతుంది. కాని పై అంచనా అసంకల్పితంగానైనా కొన్ని కారణాలను చెప్పకనే చెపుతోంది. తిరుగుబాటుదార్లు తమ ఉద్యమాన్ని మైదానాలను విస్తరింప చెయ్యలేకపోయారు. పోలీసులు ముందుగా

పథకం వేసుకునే నిర్దాక్షిణ్యంగా తమ దమనకాండను కొనసాగించారు. కమ్యూనిస్టు విప్లవకారులు మాత్రం రెండు తరహాల సమీక్షలు చేసారు. ఒక విభాగపు వాదన ప్రకారం వ్యూహపరంగానే కాకుండా ఎత్తుగడల పరంగా కూడా తిరుగుబాటుదార్లు శత్రువును తేలికగా తీసుకున్నారు. వాళ్ళ అవగాహన కొంత వరకు సరియైనదైనా కేంద్రనాయకత్వపు దుందుడుకు వాద వైఖరి వల్ల వాళ్ళు పరాజయాన్ని చవి చూశారు. వర్గశత్రువుల నిర్మూలన అనే తప్పుడు విధానం వల్ల వాళ్ళు శత్రువుల మధ్య ఉన్న వైరుధ్యాలను ఉపయోగించుకోలేకపోయారు. తమ ప్రజాతంత్ర విప్లవంలో భూస్వాముల్లో కొంత భాగం జేరతారనే సత్యాన్ని గుర్తించలేదు. వర్గశత్రువుల్ని నిర్మూలించడం, వాళ్ల ఆస్థుల్ని స్వాధీనం చేసుకోవడం ప్రజలు పాల్గొన్నప్పుడే చేయవలసింది. స్క్వాడు చర్యలపైనే ఆధారపడకుండా ఉండవలసింది. గతంలో తిరుగుబాటుదారులు ఆర్థిక పోరాటాలను నడపక పోవడం చేత, ఆయా ప్రాంతాల ప్రజలు తిరుగుబాటు చర్యల్లో పాల్గొనలేకపోయారు. ప్రజలు సంసిద్ధులవకుండా మైదాన ప్రాంతాల్లో సాయుధ పోరాటాలను మొదలెట్టడం తప్పు, నవీన ఆయుధాల్ని సంపాదించకుండా సాయుధ పోరాటాల్ని మొదలెట్టడం తప్పు.[13]

చారుమజుందారు అనుచరులు పై వాదనలను "రివిజనిస్టు అవగాహన"ను వెలిబుచ్చడంగా తీసిపారేసారు. తరువాతి కాలంలో మాత్రం స్క్వాడ్లు సకాలంలో శత్రువు నుంచి తుపాకులను స్వాధీనం చేసుకోలేదనీ, ఎర్ర సైన్యాన్ని నిర్మించేందుకు గట్టి ప్రయత్నాలేవీ జరగలేదనీ వాళ్ళ లోపాలను ఎత్తిచూపారు.[14]

ఉద్యమ వివరాలకు వస్తే ఆంధ్రరాష్ట్ర కమిటీ ఇలా అంగీకరించింది. "..... విమోచన స్థావరాన్ని నిర్మించేందుకు కొండలూ, అడవులూ చాలు అనే తప్పుడు అవగాహనతో ఉన్నాము.... ఒకే స్థావరంలో మనకున్న కామ్రేడ్లనందరినీ కేంద్రీకరించాం. దానికి కారణం భావిలో కొద్ది కాలంలో ఒకే విముక్తి ప్రాంతాన్ని నిర్మించవచ్చుననే స్వర్గతుల్యపు ఊహ నాయకత్వానికి ఉండడమే... మనం అన్ని చర్యలలోనూ అధిక సంఖ్యలో సమీకరించాం. (మైదాన ప్రాంతాల్లో అనేక చర్యల్లో స్క్వాడులోని సభ్యుల సంఖ్య 25 నుంచి 75 దాకా ఉండేవారు.)* .... మైదానాల్లో మన పోరాటాపు ఆశయాలను గురించి సరియైన స్పష్టత లేకపోవడం వల్ల తప్పుడు పోరాట పద్ధతులను అవలంబించాం.

* *అప్పుడప్పుడు అనేక మంది నాయకులు ఈ స్క్వాడ్లు కూడా వచ్చేవారు. అందువల్ల పోలీసులు సుబ్బారావు పాణిగ్రాహి, నిర్మలా కృష్ణమూర్తి వంటి చాలా మందిని ఒకేసారి పట్టుకోవడమే కాక వారిని చంపగలిగారు.*

నిర్ణాయక వర్గాలపై మనం పూర్తిగా ఆధారపడలేదు. మైదాన ప్రాంతాలకు మన పోరాటాన్ని వ్యాపింప చేయలేకపోవడానికివే కారణాలు...”

ఆ పత్రం శ్రీకాకుళంలోని పార్టీ వ్యవస్థ యొక్క వర్గ నిష్పత్తిని గురించి ఇలా పేర్కొంది. “మన పార్టీలో నేడు కూడా పెట్టీ బూర్జువాల ఆధిక్యత ఉంది. మన కేడర్లు కూడా ప్రధానంగా పెట్టీ బూర్జువాలే. నేటికీ మన కార్యకలాపాలకు బీద, భూమిలేని రైతుల గ్రామాలు కేంద్రం కాదు... గ్రామాల్లో కూడా నేటికీ మనం పెట్టీ బూర్జువా వర్గానికి చెందిన ఇళ్ళలో కాని, ధనిక రైతుల ఇళ్ళలోకాని ఆశ్రయం తీసుకుని, మనతో ఎవరైనా బీదరైతు ‘సహకరిస్తా’డేమోనని దర్యాప్తు చేస్తాం.” శ్రీకాకుళం తిరుగుబాటుదార్ల నుంచి తరచుగా తను వేరుపడిపోయినట్టు రాష్ట్ర సంఘం ఒప్పుకుంది. “... అనేక మంది కామ్రేడ్లను మైదానాల నుంచి శ్రీకాకుళానికి పంపబడ్డారు. కాని, వాళ్ళ చేరికపైకాని, హటాత్తుగా జరిగే వాళ్ళ తిరుగు ప్రయాణంపై కాని, పార్టీకి ఎటువంటి అదుపూ లేకపోయింది. శ్రీకాకుళానికి బయటి నుండి ఎటువంటి సహాయం, ఎంత మోతాదులో కావాలో, పార్టీకి ఒక అవగాహన లేకుండా పోయింది. ఎటువంటి తరహా కేడర్లు శ్రీకాకుళ పోరాటానికి కావాలో, సరియైన, స్పష్టమైన, ఊహలు లేకపోయాయి. దీనివల్ల మనం, ప్రణాళిక రచన, ముందు చూపు గురించిన ప్రాముఖ్యతను గుర్తించలేదని తెలుస్తోంది. (సన్నివేశాలకు ముందుండి నడిపించవలసిన మనం), సన్నివేశాల వెనకపోవలసి వచ్చింది. ఇటువంటి యాధృచ్ఛిక దృక్పథం వల్ల, ఆచరణలో మనం నష్టపోయాం.”

శ్రీకాకుళ ఉద్యమానికి విఘాతం గురించి పార్టీలో తలెత్తిన మరో కుతూహలకరమైన అంశం ఉంది. అందరు భూస్వాములపైనా దాడి చెయ్యాలా, లేదా వాళ్ళలో కొందరు క్రూరులపైనే దండెత్తాలా; అనే ప్రశ్న తలెత్తింది. ఉద్యమకాలంలో శ్రీకాకుళ ఉద్యమ నాయకత్వం వెలువరించిన ఒక కరపత్రంలో ఇలా ప్రకటించింది. “భూస్వాముల్లో ఒక విభాగం ప్రజాతంత్ర విప్లవంలో జేరుతుంది. వాళ్ళను మన విప్లవంలో చేరకుండా భూమ్మీదున్న ఏ శక్తీ ఆపలేదు.”[15] సి.పి.ఐ. (మా.లె.) రాజకీయాలతో పరిచయం కల్పించాక, కొంతమంది భూస్వాములను వదిలేసారు. భూస్వాముల్లో వైరుధ్యాలను కనుగొని, వాటివల్ల లాభం పొందే ప్రయత్నాలు జరిగాయి.[16]

ఆంధ్రరాష్ట్రా కమిటీ తరవాత ఈ ధోరణుల్ని నిశితంగా విమర్శిస్తూ, “భూస్వాములకు గ్రామాల్లో ఉండడం దుర్భరం చేసేందుకై అరుణభీభత్సాన్ని సృష్టించవలసిన అవసరాన్ని” వక్కాణించింది. ఈ వాదాన్ని సమర్థించే వారెవరూ ఏ భూస్వామిపైనా ఎటువంటి దయాదాక్షిణ్యాలూ చూపించడానికి సుముఖులు కారు. ఆ భూస్వామి ఉద్యమం పట్ల

ఎంతటి సానుభూతినైనా చూపించవచ్చు గాక. గ్రామాల్లో భూస్వాముల్ని ఖతం చేసో, తరిమివేసో, నిజమైన అర్థంలో 'విముక్త ప్రాంతాలను, ఏర్పాటు చేయాలని కృతనిశ్చయులై ఉన్నారు. బహుశ వాళ్ళకు మావోసేటుంగు సలహా మనసులో మెదులుతూ ఉండి ఉంటుంది. "ప్రగతి నిరోధకమైనదేదైనా ఒకటే. నువ్వు దాన్ని కొట్టకపోతే అది పడిపోదు. నేలను తుడవడం లాంటిది. చీపురు ఎక్కడకు పోదో, అక్కడి దుమ్ము అంతరించదు."[17]

పై అంచనాలన్నిటిలోనూ ఒకే నిజం కనబడుతుంది. మైదానాల్లో మాత్రం, విప్లవకారులు స్థిరంగా కాలూనుకోలేకపోయారు. భౌగోళికంగా తాత్కాలికంగా దుర్గమం కావడంతో, స్థావర ప్రాంతంగా, కొండప్రాంతాన్నే పరిరక్షించుకునేందుకు తాపత్రయపడే ధోరణి వాళ్ళలో కనపడింది. దీన్ని చారుమజుందారు ఒకానొక సందర్భంలో లోపంగా పేర్కొన్నాడు.

"... 1969 మధ్యలో స్థావర ప్రాంతాల నిర్మాణానికీ, ప్రజా విమోచన సైన్యపు ఏర్పాటుకూ శ్రీకాకుళంలో ఎలా పిలుపునిచ్చాయో, అనుభవంలో చూశాం. కాని ఈ పిలుపు వల్ల ఎటువంటి అనుకూలమైన ఫలితాలు కలగలేదు. విశాలమైన మైదాన ప్రాంతాల్లో ఎటువంటి గెరిల్లాస్క్వాడులూ లేకపోవడమే కారణం. మన బలాలన్నీ కేంద్రీకరించడంతో, శత్రువుకూడా (తన) దాడిని కేంద్రీకరించగలిగాడు. దాంతో మనం తీరని నష్టాన్ని పొందాం."(60)

## బీహారులో అసమ్మతి

శ్రీకాకుళంలో విప్లవకారులు సిద్ధాంతపరమైన అయోమయంతో సతమతమవుతున్నారు. అది సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఐక్యతకు కూడా ప్రమాదంగా తయారైంది. 1970 సెప్టెంబరు నాటి బీహారు రాష్ట్ర సంఘపు తీర్మానం, నాటికే పెరిగే విబేధాలకు మరింత దోహదం చేసింది. సత్యనారాయణసింగు పర్యవేక్షణలో రూపొందించిన ఆ తీర్మానం, పార్టీ కేంద్ర నాయకత్వాన్ని నిశితంగా విమర్శించింది. నేరుగా పేరు పెట్టి చెప్పకుండా, ఇటీవలి పరాజయాలకు చారుమజుందారును కారకుడుగా పేర్కొన్నారు. ఆంధ్రరాష్ట్ర సంఘంలో లాగానే బీహారు రాష్ట్ర సంఘం కూడా గ్రామీణ ధనిక వర్గంలో సానుభూతిపరులకూ, చెడ్డవాళ్ళకూ మధ్య వివక్షత చూపాలని భావించారు. మావోసేటుంగు ధనిక రైతుల గురించి చెప్పినదాన్ని బట్టి, నిర్మూలన చేపట్టకుండానే, గ్రామీణ ధనిక వర్గంలో చాలా మందిని తటస్థులుగా చేయగలిగామని ఆ తీర్మానం పేర్కొంది. గ్రామాలకూ నగరాలకూ వేరు వేరు కార్యక్రమాలుండాలని బీహారు కమిటీ

అభిప్రాయం. "గ్రామాల్లోనూ, నగరాల్లోనూ, మనం చేసే పనిలో ప్రస్తుత దశలో తేడా ఉంటుంది. నగరాల్లో పార్టీ చాలా కాలం రహస్యంగా పనిచేసి బలం సంపాదించి, ప్రజలను విప్లవం వైపుగా ఆకర్షించాకనే, సాయుధ రక్షణాత్మక చర్యను (పోరాటాన్ని) చేపట్టాలి. గ్రామ సాయుధ పోరాటానికి పట్టణ కార్యాచరణ తోడై నిలుస్తుంది." అని ఆ తీర్మానం పేర్కొంది. ఈ సందర్భంలో కమిటీ కేడర్లను పరిరక్షించుకోవాలనీ, అనవసరమైన త్యాగాన్ని చెయ్యకుండా ఉండడం కూడా అవసరమనీ స్పష్టం చేసింది."[18]

బీహారు సంఘం ప్రధానంగా, పార్టీ కేంద్రనాయకత్వపు కార్యాచరణ యొక్క తీరుతెన్నుల్ని విమర్శించింది. కేంద్ర నాయకత్వం 'అధికారతత్వం' ప్రదర్శిస్తోందని దుయ్యబట్టింది. మరోవైపు పార్టీ వ్యవస్థను వికేంద్రీకరించి, (పార్టీ కేంద్ర నాయకత్వం) కేంద్రీకృత కార్యాచరణావసరాన్ని గుర్తించ లేదని కూడా ఆరోపించింది. ఇందులో పరమార్థం స్పష్టంగానే ఉంది. చారుమజుందారును 'విప్లవాధికారంగా' అతని అనుచరులు నిలబెట్టడం, అతన్నే నిర్ద్వంద్వంగా అనుసరించడం, వీళ్ళకు నచ్చలేదు. ప్రజాస్వామిక హక్కులనివ్వాలనడం, వ్యక్తిగత చొరవను ప్రోత్సహించాలనడం, తమ నాయకులను (అంటే రాష్ట్ర కమిటీ, ప్రాంతీయ కమిటీలను) లెక్కచెయ్యనవసరం లేదని చారుమజుందారు కేడర్లను మరో విధంగా పురికొల్పడమేనని భావించారు.

ఈ విమర్శలకు చారుమజుందారు జవాబులూ ఉన్నాయి. పార్టీ "వామపక్ష అవకాశవాదాన్ని" ఎదిరించాలనే బీహారు రాష్ట్ర సంఘపు అభిప్రాయాన్ని నిరాకరించాడు. "పార్టీ సభ్యులనేక మందిలో రివిజనిజం ప్రధానమైన పెడధోరణిగా ఉంది. దీనివల్లనే పోరాటాన్ని మనం ముందుకు తీసుకుపోలేక పోతున్నామని" వక్కాణించాడు. గ్రామీణ ధనిక రైతులతో సంబంధాలనిలా వివరించాడు. ధనిక రైతులు ప్రధానంగా ఫ్యూడలు దోపిడీని కొనసాగిస్తున్నారు. కాబట్టి వాళ్ళతో సంఘర్షణ తప్పదు. వాళ్ళతో పోరాడకపోతే ఊగిసలాడే మధ్య రైతులను మన వైపుకు తిప్పుకోలేం. ఇక నిర్మూలన విషయంలో, అన్ని సందర్భాల్లోనూ మనం ఆలోచించవలసిన ప్రధానమైన విషయం, "(ఆయా భూస్వాములపై) బీదరైతులకూ, భూమిలేని రైతులకూ గల వర్గ ద్వేషం." "ఏదైనా సందర్భంలో బీదరైతులు, భూమిలేని రైతులు ధనిక రైతును ఖతం చెయ్యాలని పట్టుబడితే, అందుకు కారణం అతని వర్గప్రాతిపదిక ఒకటే కాకపోవచ్చు. అతని రాజకీయ దృక్పథం కూడా కావచ్చు. అప్పుడు వాడిని నిర్మూలించడం సరైనదే."(44)

"కేంద్రకమిటీ సమావేశం జరపలేమనే జోనలు బ్యూరోలను ఏర్పరిచాం. వాటిలో (ఆయా ప్రాంతాలకు చెందిన – అను) కేంద్రకమిటీ సభ్యులు కూడా ఉంటారు. ఏ

సభ్యుడినైనా ఆహ్వానించే హక్కును కూడా జోనలు బ్యూరోలకు ఇచ్చేం. దానివల్ల కేంద్రకమిటీలో గల ప్రతి సభ్యుడూ కేంద్రంపై అభిప్రాయాన్నీ విమర్శలను వెలిబుచ్చవచ్చు. కేంద్రానికి వ్యతిరేకంగా ఆమోదించిన ఏ తీర్మానాన్నైనా దేశవ్యాప్తంగా (పార్టీవర్గాలలో – అను) పంచిపెడతామని హామీ కూడా ఇచ్చాం. దానివల్ల మరింత అవగాహన పెరుగుతుంది." (అదే వ్యాసం)

మాటల్లో ఇదంతా ప్రజాస్వామికంగానే కనుపించినా, ఆచరణలోకి వచ్చేసరికి, చారుమజుందారు భక్తులు చాలా ప్రాంతాల్లో అతన్ని అత్యున్నతాధికారిగా నిలబెట్టాలని ప్రయత్నించారు. అతను ఏ సందర్భంలో ఏం చెప్పాడోనైనా ఆలోచించకుండా, అతని మాటల్ని గుడ్డిగా అనుసరించాలని భావించడం చేత, పార్టీ సమావేశాల్లో ప్రజాస్వామిక చర్చలకు గల అవకాశాలు సగమై, అవరోధాలు రెట్టింపయ్యాయి. అతిశయోక్తిగా కనిపించినా (చారుమజుందారు మాటల)ను వ్యతిరేకించే సాహసం చేస్తే, విప్లవోత్సాహం సరిగా లేదని తిట్లు తినే ప్రమాదం కూడా ఉండేది. శత్రువును సమర్థిస్తున్నారనే అపనిందకు పాల్పడవలసి వచ్చేది. ఒకానొక దశలో ఈ వాతావరణం ఏర్పడింది. భారతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనే కాక, ఇతర కమ్యూనిస్టు ఉద్యమాలలో కూడా ఈ పరిస్థితులు వచ్చాయి. మావోసేటుంగు 1956లో కూడా తన దేశంలో తలెత్తిన ఈ ధోరణులను గురించి హెచ్చరించాడు. "కుడి చాదస్తపు ధోరణి, అవకాశవాద ముద్రలు తమపై పడతాయనే భయంతో తాము వాస్తవికంగా ఉన్నామని చెప్పే సాహసం కూడా కొందరు కామ్రేడ్లకు లేకపోతోంది."[19]

1970లో ఇండియాలో మాత్రం అలాంటి ధోరణే ఉద్యమంపై తన దుష్ప్రభావాన్ని చూపించింది. దేబ్రా–గోపీవల్లభపూర్ ఉద్యమ వ్యవస్థాపకుల్లో నొకడైన అషీంచటర్జీ ఇలా అన్నాడు. 'వ్యావసాయిక విప్లవం' అనే మాట గత ఒకటిన్నర సంవత్సరాల నుంచీ దాదాపు అంతరించిపోయింది. ... ప్రజా ఉద్యమాలను నిర్వహించాలని (చేసే) ప్రతీ ప్రయత్నం 'రివిజనిస్టు' (ప్రయత్నంగా) ముద్రవేయబడింది..."[20]

చివరకు చారుమజుందారే స్వయంగా కలగజేసుకుని 1971 అక్టోబరులో తన అనుయాయులకిలా సలహా ఇచ్చాడు. "పార్టీలో రెండు వైఖరుల మధ్య సంఘర్షణ ఉంది. అది ఉంటుంది కూడా. ఆ సంఘర్షణ ఒక పద్ధతిలో జరగాలి. తమ అభిప్రాయాలనూ విమర్శలనూ'' నిర్మొహమాటంగా ''చెప్పేందుకు'' పార్టీ సభ్యులందరకూ "పూర్తి ప్రజాస్వామిక హక్కుల" నివ్వాలని వక్కాణించాడు.(64)

## మిడ్నాపూరులో అపోహలు

1970 నాటి పరిస్థితికి తిరిగివద్దాం. పోరాట ప్రాంతాల్లో పెరిగే నష్టాలతో పార్టీ నిర్వాహకుల హృదయాల్లో ఒక రకమైన అస్థిరత చోటుచేసుకుంది. ఒక వర్గశత్రువును చంపి ముగ్గురు గెరిల్లాలు తిరిగివస్తున్నారు. భూస్వాముల కిరాయితొత్తులు వాళ్ళను చంపారు. ఈ సంగతిని వివరిస్తూ అషించటర్జీ చారుమజుందారుకు రాసిన లేఖలో ఈ మనస్థితి (అస్థిరత) స్పష్టంగా కనుపిస్తుంది. "కేష్పూరు (విజయాల)ను స్థిరం చేసేందుకు తమ జీవితాలనే త్యాగం చెయ్యాలని ఆ కామ్రేడ్లను కోరాను. ఆ కామ్రేడ్లు తమ జీవితాలనే అర్పించారు. తమ జీవితాలనే త్యాగం చెయ్యమని ఇతరులను అడిగే బాధ్యత భరింపరానిది. మనం ఎక్కడ తప్పు చేస్తున్నామో తెలుసుకోవాలి"[21]

చారుమజుందారు తన జవాబులో తన కామ్రేడు వెలిబుచ్చిన విచారం, ఖేదం పట్ల సానుభూతిని వ్యక్తపరుస్తూ ఇలా గుర్తుచేసాడు. "మనపై చేసిన ప్రతీ గాయం మనల్ని ఎంతో బాధిస్తుంది. ఈ బాధనుంచే మరింత ఘనమైన త్యాగం చేసే బలం, శత్రువుల పట్ల ప్రగాఢ ద్వేషం పుడతాయి. ఛైర్మన్ మావో ఆలోచనతో ఈ రెంటినీ అనుసంధిస్తే, కొత్త మనిషి పుడతాడు..." తప్పులు (పొరపాట్లు) జరిగితే జరిగి ఉండవచ్చును. కాని పశ్చాత్తాప పడేందుకు సమయం కాదు, "జ్వలించే అగ్నిలా మనం ఎగిసిపోవాలి. రక్తానికి బదులుగా రక్తాన్ని తీసుకోవాలి." ఇతర పొరపాట్ల గురించి చెపుతూ "ఆదివాసులకూ ఇతరులకూ వచ్చిన విబేధాలు" ఆ లోపం కావచ్చుననే ఊహాగానాన్ని చేసేస్తూ, "వర్గశత్రువులు దాన్ని సాకుగా చేసుకుని ఐక్యం కాగలిగారు"(37) అని భావించాడు.

ఇంకా తరువాత, మరో ఉత్తరంలో, ఎదురు దెబ్బలూ, పరాజయాలూ అవసరమని మావో చెప్పాడని ఉదహరించాడు. "పోరాటాల ద్వారా, ప్రత్యేకించి పోరాటంలో ఎదురు దెబ్బల మూలంగా, ఏది సరైనదో, ఏవి కాదో, మరింత స్పష్టమౌతుంది."(42)

కాని ఆ ప్రాంతపు కేడర్లను ఆవరించిన అపనమ్మకం, బెదురుల వెల్లువలకు, అతని సలహాకాని, సానుభూతి కాని, అడ్డునిలవలేదు. ఒకరి వెంట ఒకరుగా కామ్రేడ్లు చనిపోతుంటే, కేంద్రం నిర్ణయించిన ఎత్తుగడల ఉపయోగాన్ని ఆ ప్రాంతపు నాయకులు ప్రశ్నించసాగారు. అషించటర్జీ ఇలా అన్నాడు. "మా ప్రాంతంలో సాయుధపోరాటం మధ్యలో మేం ఉన్నాం. ప్రతీక్షణం క్రూరమైన శత్రువును మేం ఎదుర్కోవాలి. ఇది మేధావులు హుందాగా జరిపే చర్చవంటిది కాని, బాగా రాసిన వ్యాసాల్లో (వివరించే) హాని లేని సమస్యవంటిది కాని కాదు. ఇది ఇక్కడి రాజకీయ సమస్య. రాజకీయంగా చేసే ఎలాంటి పొరపాటైనా (వెంటనే) రక్తంగా మారి, దుర్భరంగా మారిన మా

అనుంగు కామ్రేడ్ల మృతదేహాలు మా తప్పుల్ని వేలెట్టి చూపెడతాయి."[22] మిడ్నాపూర్ నాయకత్వానికీ కేంద్ర నాయకత్వానికి ప్రాణాలు కోల్పోవడం సమస్యపైనే కాక, రెండు వైఖరుల మధ్య పోరాటం విషయంలో మరింత మౌలికమైన విభేధాలు పైకి వస్తున్నాయి. 1970లో ఆ ప్రాంతపు పరిస్థితిని 1971లో సింహావలోకనం చేస్తూ, అషీంచటర్జీ ఇలా అన్నాడు. "భారత విప్లవతత్వం గురించిన చారుమజుందారు వైఖరితో మనం ఏకీభవించలేం. విప్లవం (విప్లవ పరిస్థితి) దేశంలో సమానంగా వృద్ధి చెందలేదనే వాదాన్ని మన పార్టీనాయకత్వం తిరస్కరించింది... ఏక కాలంలో సరిహద్దు ప్రాంతమంతటా పోరాటాన్ని నడపాలని మనం చేసిన ప్రయత్నం ప్రతీసారీ విఫలమవడం, సరిహద్దు ప్రాంతంలో మనకు గల కొద్ది అనుభవం ద్వారా గమనించాం... "ఒక సుస్థిరమైన స్థావర ప్రాంతాన్ని మిడ్నపూర్ విప్లవకారులు ఎంతగానో వాంఛించారు." ఇంతవరకూ 120 మంది వర్గశతృవులను చంపాం... ఇకముందు మరో 120 మందిని చంపడానికి సిద్ధంగా ఉన్నాం. స్థావర ప్రాంతాన్ని ఏర్పరచవలసిన అవసరాన్ని ప్రతి ఖతంచర్య తోనూ మరింతగా గుర్తిస్తున్నాం. లేకపోతే ప్రతీ ఖతం చర్య మాకు అనవసరమైన భారంగా తయారవుతోంది" అన్నాడు. ఇంకా ఇలా అన్నాడు. తత్ఫలితంగా "మా పార్టీలోనూ స్క్వాడ్లలోనూ సంచారక పోరాట దళపు రాజకీయాలు తలెత్తుతున్నాయి. మొత్తం విధానమే ఒక తిరుగుబోతుల విధానంగా తయారైంది."[23]

చాలా కాలం తరువాత చారుమజుందారు మిడ్నపూర్‌లో పరాజయానికి కారణాలనిలా వివరించాడు. "అక్కడి నాయకత్వం పెట్టి బూర్జువాల చేతుల్లో ఉండటమొకటే కారణం. బీద రైతుల భూమిలేని రైతుల నాయకత్వం ఏర్పడలేదు. బీదరైతులు మధ్య తరగతి రైతులు రాజకీయంగా ఉత్తేజితులు కాలేదు"(67). అషీంచటర్జీ కూడా దీన్ని ధృవపరిచాడు. పైన చెప్పిన 1971 జూలై నాటి పత్రంలో ఇలా పేర్కొన్నాడు. "ముందుగా మాతో వచ్చిన 40,000 మంది రైతాంగంలోనూ కొద్దిమంది తప్ప మిగతా వాళ్ళందరూ సాధారణ సానుభూతిపరులుగానే మిగిలిపోయారు... 120 మంది వర్గశతృవులను చంపినా, నిరంతర ప్రయత్నాలు చేసినా, మా గెరిల్లా దళంలో భూమిలేని రైతుల సంఖ్య బీదరైతుల సంఖ్యా మాత్రం పెరగలేదు." భూమిలేని రైతులతోనూ, బీదరైతులతోనూ, పెటీబూర్జువాలు సమైక్యం చెందలేకపోవడం దీనికి కారణంగా (అతడు) భావించలేదు. కేంద్రం నిర్దేశించిన పార్టీ వైఖరినే నిందించాడు. ".... విద్యార్థులనూ, యువతనూ, పెట్టీ బూర్జువాలనూ, లంపెన్ కార్మికవర్గాన్నీ, దోపిడీదార్లనూ, (మాత్రమే) ఈ వైఖరి ఆకర్షిస్తుంది. వాళ్ళ

సహజ ధోరణులకు అది దాదాపుగా అతికినట్లుగా సరిపోతుంది..."

స్థావర ప్రాంతాల (ఏర్పాటు) గురించీ, రైతాంగ సమీకరణల గురించీ పుట్టిన ఈ వాదనలు పెద్దవై, రెండు వైఖరులకూ మధ్య పోరాటంలో కీలకమై, (ఒక సంవత్సరం తరవాత) సి.పి.ఐ. (మా.లె.) పార్టీలో చీలికకు దారి తీసాయి.

## ఇతర విప్లవ గ్రూపులు

సి.పి.ఐ.(మా.లె.) పార్టీకి వెలుపల గల వివిధ గ్రూపులు వివిధ ఎత్తుగడలతో తమ తమ పంథాల్లో ముందుకు సాగిపోయాయి.

ముందు చెప్పినట్టు తెలంగాణాలో నాగిరెడ్డి నాయకత్వంలో విప్లవ కమ్యూనిస్టుల సంఘం (ఆర్.సి.సి.) "వర్గశత్రునిర్మూలనా" కార్యక్రమాన్ని అనుసరించక భూమిని ఆక్రమించి, దాన్ని పంచడం, ఆయుధాలతో ఆత్మపరిరక్షణ చేసుకోవడమే (ఎదిరింపు చర్యలకు బదులుగా), మేలని భావించింది. కాని ప్రభుత్వం మాత్రం, సి.పి.ఐ.(మా.లె.) ఉద్యమానికీ ఆర్.సి.సి. తలపెట్టిన ఆత్మరక్షణ చర్యలకూ, ఎటువంటి తేడానూ గమనించలేదు. శ్రీకాకుళంలో వలెనే, తెలంగాణాలో కూడా ఆర్.సి.సి. కేంద్రాలైన గ్రామాల్ని చుట్టుముట్టి సోదాచేసి అంటించారు. గ్రామస్తులను చితకతన్నారు. వాళ్ళ నాయకులు పట్టుబడితే పోలీసులు ఎలాంటి విచారణ లేకుండా కాల్చి చంపారు. ఖమ్మం ప్రాంతంలో గెరిల్లా కార్యకలాపాలకు బాధ్యుడైన బత్తుల వెంకటేశ్వరరావును, ఖమ్మం జిల్లాలోని మరో ఇద్దరితో సహా పోలీసులు పట్టుకుని రెండు రోజులు చిత్రహింసలు పెట్టగా, అపస్మారక స్థితిలో ఉన్న వాళ్ళను అశ్వారావుపేట దగ్గర గుట్టలోకి తీసుకుపోయి కాల్చి చంపారు.[24] (1969 డిసెంబరులో పోలీసులు చంపినట్టు చెప్పిన లా గ్రాడ్యుయేటు, ఆంధ్రప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడూ అయిన ఖమ్మానికి చెందిన బత్తుల వెంకటేశ్వర్లు ఇతడేనా.)

1969 సంవత్సరం డిసెంబరు 19వ తేదీ తెల్లవారు ఝామున మద్రాసులో ఒక ఇంట్లో రహస్య సమావేశంలో మునిగి ఉన్న ఆర్.సి.సి. ప్రధాన నాయకత్వాన్ని మద్రాసు పోలీసులు పట్టుకున్నారు. ఆ సమావేశంలో పాల్గొంటూండగా పట్టుబడిన నాగిరెడ్డి: 1946–51 సంవత్సరాల్లో తెలంగాణా పోరాటంలో కాకలు తీరిన యోధుడు, దేవులపల్లి వెంకటేశ్వరరావునూ, మరో నలుగురు సభ్యులనూ వాళ్ళు పట్టుకున్నారు. తరువాత కాలంలో ఆ గ్రూపు యొక్క సిద్ధాంత చర్చలో ప్రముఖ పాత్ర వహించిన చంద్ర పుల్లారెడ్డి అరెస్టు కాకుండా తప్పించుకున్నాడు. అతని ప్రధాన నాయకత్వంలో కొత్త రాష్ట్ర కమిటీ 1970 జూన్ నెలలో ఏర్పడింది. కాని త్వరలోనే జైల్లోని

నాయకులకూ రాష్ట్ర కమిటీకి మధ్య విబేధాలు వచ్చాయి. అదివరకే నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావూ కలిసి, చంద్రపుల్లారెడ్డిని చారుమజుందారు ఎత్తుగడలను అనుసరిస్తున్నాడని ఆరోపించారట. అతనిపై చర్య తీసుకోవాలనుకున్నారు కూడా.

ఈ విబేధాలన్నీ ఎత్తుగడలకు సంబంధించినవే. భూమిని ఆక్రమించి, తరవాత ఆ భూమిని రైతాంగానికి పంపిణీ చేయాలని కమిటీ వాంఛించింది. కాని పుల్లారెడ్డి గ్రూపు మాత్రం ఆర్థిక కోర్కెలకై జరిగే సంఘర్షణల్లో పాల్గొనే కేడర్లను ఆత్మరక్షణకై సాయుధుల్ని చేయాలనుకొంది. భూమిని ఆక్రమించడం, దాన్ని పంచడం విషయాల్లో 'తక్షణ కార్యక్రమం'లో చెప్పిన వక్కాణింపుపై పుల్లారెడ్డి గ్రూపు ఇలా వ్యాఖ్యానించింది. "చాలా ప్రాంతాల్లో ప్రజలు పెద్ద పెట్టున భూస్వాముల భూముల్ని ఆక్రమించడం అనేది. ప్రత్యక్షంగా సాయుధపోరాటంలో పాల్గొనేందుకు ప్రజలకున్న సంసిద్ధతపైనే పూర్తిగా ఆధారపడి ఉంటుంది. ప్రజలు చైతన్యవంతులై; మనస్ఫూర్వడ్లు ఆయుధాలతో ప్రభుత్వ సాయుధ దళాలను ఎదుర్కొనేందుకు తగిన సాయుధబలం కలవాళ్ళనే నమ్మకం కలిగి(ననాడు); ఆ భూముల్ని తాము పరిరక్షించుకోగలమనే నమ్మకం, కృత నిశ్చయం ఉన్ననాడు; అనేక ప్రాంతాల్లో ప్రజలు భూస్వాముల భూముల్ని తప్పక ఆక్రమించుకుంటారు."[25]

ఆంధ్రప్రదేశ్ విప్లవకమిటీ 1970 మధ్య కాలానికి తెలంగాణాలో ఐదారు లక్షల జనాభా కల ఏడెనిమిది వేల చదరపు మైళ్ళ ప్రాంతాన్ని గెరిల్లాలు 'విముక్తి' చేసారని ప్రకటించింది. కాని విప్లవకారులు ఆ ప్రాంతాన్ని మరింత విస్తరించలేకపోయారు. 1971 మార్చిలో కేంద్ర ప్రభుత్వం 10,444 మంది పారామిలటరీ దళాలను ఆయుధాలతో, ఆయుధ సామాగ్రితో దించింది. వాళ్ళు ఎందరో నాయకుల్ని అరెస్టు చేసి, వరంగలు, ఖమ్మం, కరీంనగర్లో కల 'ఎర్రస్థావరాల్ని' తుడిచి పెట్టారు. శ్రీకాకుళంలో లాగే ఇక్కడ కూడా గ్రామాల్లోని మొత్తం జనాభాను 'కీలక గ్రామా'ల్లోకి తరలించారు.

పారిపోయి, ఒంటరిగా మిగిలిన సాయుధ గెరిల్లాలు, గెరిల్లా గ్రూపులు మాత్రం తెలంగాణలోని కొండల్లోనూ, అడవుల్లోనూ తిరుగుతూ, 1973-74 సంవత్సర కాలంలో (కూడా) భూస్వాముల్ని బెదిరించి రక్షణ ధనాన్ని (Protection Money) వసూలు చేసుకోసాగారు.

1970 మే నెల్లో అటువంటి విప్లవకారుల గ్రూపు దేశంలోని వార్తా పత్రికల్లో పతాక శీర్షికల నలంకరించింది. కొందరు స్త్రీలతో సహా దాదాపు 60 మంది బీహారులోని జంషెడ్‌పూర్ జిల్లాలోని రామ్ ప్రాంతంలోని ఒక పోలీసు స్టేషనుపై

దాడి చేసారని పోలీసులు ఆరోపించారు. వారం రోజుల పాటు దుర్గమమైన జాడూగూడా అడవిని హెలికాప్టర్ల సాయంతో గాలించి వాళ్ళను పట్టుకున్నారు. జాడూగూడా కుట్రకేసుగా ప్రసిద్ధికెక్కిన ఆ కేసులో 26 సంవత్సరాల బ్రిటిషు యువతి మేరీటైలర్ కూడా నిందితురాలు. తమ కరపత్రాల్లో వాళ్లు తమ గ్రూపును మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనలననుసరించే భారత విప్లవ కమ్యూనిస్టు సమాఖ్య (Revolutionary Communist Council of India) గా పేర్కొన్నారు.

## కూడలిలో సి.పి.ఐ. (మా.లె.) పార్టీ

1969 నుంచీ వచ్చిన ఈ అవాంతరాలన్నిటి మధ్య, చారుమజుందారు మాత్రం తన భావాలపై నిక్కచ్చిగా నిలబడ్డాడు. వ్యాసాలు, సందేశాలు, ఉపన్యాసాల (పాఠాల) ద్వారా తన అభిప్రాయాల్ని (తన రహస్య స్థావరం నుంచి) వివరిస్తూ, విమర్శల్ని ఖండించాడు.

చారుమజుందారు ఇదివరకటి తన భావాలనే పదే పదే చెప్పసాగాడు. బీద, భూమిలేని రైతుల్ని నాయకులుగా చెయ్యాలి. నిర్మూలన కార్యక్రమాలను విస్తరింపజేయాలి. విప్లవ కమిటీలు ఏర్పాటు చెయ్యాలి. ఆనాడు అతనికి సమస్యల పట్ల గల వైఖరి, కొన్ని రచనల్ని బట్టి చూస్తే, కొంతవరకు ఏకపక్ష ధోరణి (ఒంటెత్తువాదం) గా కనబడుతుంది. ముందు తను అంగీకరించిన ప్రజా ఉద్యమాల వంటి పోరాట రూపాల్ని వదిలేసి, నిర్మూలనపు ఎత్తుగడలకే అతను తరచు ప్రాధాన్యతనిచ్చినట్టు కనబడుతుంది.

చారుమజుందారు ఆలోచనల్లో నిర్మూలనపు ఎత్తుగడలు ఎందుకంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి? అతని విమర్శకులు వాటిని ఎంతగా దుయ్యబడితే, అతను వాటిని అంతగా పునరుద్ఘాటించాడు. ఆ కాలంలోనే వైట్ టెర్రర్ (White Terror) (పాలక వర్గహింస) జరుగుతోంది. ఎత్తుగడలు ఏమాత్రం సడలించినా, అది సాయుధ పోరాట విరమణకి దారితీయవచ్చునని భావించాడేమో. ఆర్థికపరమైన కోర్కెలపై ప్రజా ఉద్యమాలు నిర్మించడం గురించి ఎలాంటి ప్రస్తావన చేసినా, పెద్ద పెట్టున జరిగే అణచివేతల దృష్ట్యా, తిరుగుబాటుదార్లు నిరపాయకరమైన ఆర్థికవాదపు పోరాట రూపాలకు, మార్గాలకు జారుకుంటారని కూడా భావించి ఉండవచ్చు.

ఉద్దేశ్యం ఏదైనా, నిర్మూలనానికే ఎక్కువ ప్రాధాన్యత నివ్వడంతో, సిద్ధాంతాన్ని వ్యాఖ్యానించడం ఎంతో సులువై పోయింది. భూస్వాముల్ని పోలీసుల్ని ఏరి చంపడం, అలాంటి చర్యలకు ముందో, వెనుకో, అధికారం పట్టుకొనేందుకు కావలసిన

ప్రజాసమీకరణ చేసేందుకు అవసరమైన గట్టి ప్రయత్నాలేవీ చేయనక్కర్లేదనుకునే స్థితికి మొత్తం సిద్ధాంతాన్ని (అతని అనుచరులు) తీసుకొచ్చారు. అందువల్లనే పార్టీ కాంగ్రెసు తరువాత, 1970 సంవత్సరపు తరువాతి కాలంలో, అనేక రాష్ట్రాల్లో చర్చలు జరిగినా, దేబ్రా గోపీవల్లభపూరు, శ్రీకాకుళాల్లో తప్పిస్తే మరెక్కడా ప్రజాధికారపు ఛాయా రూపాలు కూడా ఏర్పడలేదు. (1970 అక్టోబరు నాటికి ఒక్క పశ్చిమ బెంగాల్లోనే దాదాపు 150 మంది వర్గశత్రువులు ఖతం అయ్యారు.) హృదయ పూర్వకంగానే అతని అనుయాయులు అతని పిలుపుని అనుసరించారు. "వర్గశత్రువుల నిర్మూలనకై మీ పోరాటాన్ని ముందుకు సాగించాలి."(36) కాని అతని ఉప(వి)న్యాసాన్ని వాళ్ళు లెక్కపెట్టలేదు. "ప్రజలకు రాజకీయాలతో పరిచయం కలుగజేయాలి. వేలాది సంవత్సరాలుగా దోపిడీకి, పీడనకు గురైన మానవుడు నేడు స్వేచ్ఛను, విప్లవాన్ని కోరుకుంటాడు. అధికారాన్ని పట్టుకోవాలనే రాజకీయాపుటాలోచనలే అతని ఆలోచనా ప్రపంచంలో సంచలనాన్ని కలిగిస్తాయి..."(38)

కాని పార్టీలోని చారుమజుందారు విమర్శకులు మాత్రం అతని ఆశలు తీరేవేనా అని సందేహించారు. పోలీసు అణచివేత మొదలయ్యాక పోరాటపు యంత్రాంగపు లోపాలు స్పష్టంగా కనిపించాయి. దేబ్రా–గోపీవల్లభపూరు తదితర ఉద్యమ ప్రాంతాల నాయకులు అరెస్టయ్యారు. దాంతో ఉద్యమం యాదృచ్ఛికమైపోయింది. ఖతంచర్యలు ఇతర ప్రాంతాలకు వ్యాపించినా, వాటిలో ప్రజ్యాధికారాన్ని స్థాపించే దశకు తీసుకుపోదగిన నిరంతరత, పరిపూర్ణత లోపించాయి. తన ఎత్తుగడలనే పదే పదే పునరుద్ఘాటిస్తూ త్వరలోనే విజయం వస్తుందని అర్రులు చాచే చారుమజుందారు నిప్పుకోడి తలను భూమిలో పెట్టి నిజాలను చూడనట్టు, ఈ వాస్తవాలను దాటవేస్తున్నాడనీ, వాటిని అంగీకరించనంత మాత్రాన అవి లేకుండా పోవనీ, ఆ విధంగా జాగ్రత్త లేని ఖతంచర్యల్ని ప్రోత్సహిస్తున్నాడని భావించారు.

'లిబరేషన్' సంపాదకుడూ, పార్టీ పశ్చిమ బెంగాలు కమిటీ కార్యదర్శి, ముందు ముందు చారుదాసు విమర్శించిన సుశీతల్‌రాయ్‌చౌధురి తరవాతిలా అన్నాడు. "... దీర్ఘకాలిక యుద్ధాన్ని కొనసాగించనక్కరలేదనే అభిప్రాయాన్ని ప్రచారం చేసారు. 1975 నాటికే విజయం పొందుతామనే జ్యోస్యం కూడా చెప్పారు. తరువాతి కాలంలో మన పనితీరులో అట్టి అభిప్రాయాల ప్రభావం కనపడింది. వాటిలో తొందరపాటు తప్ప మరేదీ లేదనేందుకు సందేహం లేదు."[26] అషీంచటర్జీ ఇలా వాపోయాడు. "... 1975 నాటికి విప్లవం పూర్తవుతుందనే అనవసరపు జ్యోస్యాలతో సులువైన విజయమనే మధ్య తరగతి ఆలోచనను వ్యాపింప చేయడం మంచిది కాదు."[27] ఈ విమర్శకుల

మాటలు బహుశః మావోసేటుంగు మాటల దృష్ట్యా చెప్పినవి కావచ్చు. "మార్క్సిస్టులు జ్యోతిష్యకులు కారు. భావిపరిణామాల సాధారణ దిశనే వాళ్ళు సూచిస్తారు. యాంత్రికంగా, రోజునూ, గంటనూ మాత్రం, నిర్ణయించలేరు. నిర్ణయించకూడదు."[28]

పార్టీలో చారుమజుందారుపై విమర్శలు పెరగసాగాయి. అతని ఎత్తుగడలకు బయటి నుంచి లభించే ప్రోత్సాహం కూడా హఠాత్తుగా ఆగిపోయింది. 1970 మధ్యకాలం నుంచీ చైనా సి.పి.ఐ. (మా.లె.) విజయాలను ప్రచారం చెయ్యడం మానింది. శ్రీకాకుళం దురవస్థపై పెకింగ్ రేడియో (జాగరూకత నిండిన) మౌనాన్ని వహించింది. చైనా తన మౌనాన్ని ఆ సంవత్సరాంతంలో విరమించింది. కాని 1970 వేసవినాటి గడ్డు మాసాల్లో మాత్రం చైనా తటస్థ వైఖరి సి.పి.ఐ. (మా.లె.) పార్టీలోని నిరాశావాదుల్ని చాలా తికమక పెట్టింది. ఎక్కడో ఏదో తప్పు జరిగిందని వాళ్ళనుకున్నారు. సరిగా వేలాడగట్టని చిత్రంలో కనిపించే అవకతవకలా, ఛాయామాత్రంగా ఉండి నిరంతరం వేధించే అయోమయం, అసంతృప్తి, వాళ్ళను అవహించాయి.

చివరకు భారత విప్లవకారులు తమ సమస్యను "ప్రపంచ నాయకత్వానికి" నివేదించేందుకై దూతను పంపాలని నిశ్చయించారు. నక్సల్బరీ పోరాటపు ఉత్తర బెంగాలు నాయకుడు, సౌరీన్‌బోసును దూతగా ఎన్నుకున్నారు. బినామీ పేరుతో పాస్‌పోర్టు సంపాదించి సౌరన్‌బోసు పోలీసులకు అనుమానం కలగకుండా లండన్, తిరానా, కరాచీల ద్వారా పెకింగ్ చేరాడు.

ఒక భారత మావోయిస్టు చైనా వెళ్లడం ఇదే మొదటిసారి కాదు. నక్సల్బరీ ఉద్యమపు మొదటి వెల్లువ కాలంలో అంటే 1967 సెప్టెంబరులో 12 మంది మావోయిస్టులు చైనా కమ్యూనిస్టు పార్టీ నుంచి రాజకీయ సైనిక శిక్షణకై చైనా వెళ్లారు. సౌరన్ బోసే కాక, కానూసన్యాలు, జంగలుసంతాలు, దీపక్ విశ్వాస్, కదంమల్లిక్, ఖోదన్ మల్లిక్, కేషవ్ సర్కార్ మొదలగు ప్రముఖ నక్సల్బరీ ఉద్యమ నాయకులు ఆ 12 మందిలో ఉన్నారు. వాళ్లనేక మంది చైనా నాయకుల్నీ, మావోనూ, కాంగ్‌షెన్‌నూ కలిసారు. ప్రాథమిక సైనిక శిక్షణా, పెకింగ్ పత్రికలు రేడియో తరచు ఇచ్చే నైతిక ప్రోద్బలం మినహా, చైనా నుంచి సి.పి.ఐ. (మా.లె.) పార్టీకి ప్రత్యక్ష సాయం ఏమీ అందలేదు.

పార్టీలో సిద్ధాంత వివాదాలు ఒక మూల రగులుతున్నా, మొత్తం మీద సి.పి.ఐ. (మా.లె.) కార్యకలాపాల్లో ఎటువంటి మందకొడి ధోరణీ కనుపించలేదు. శ్రీకాకుళం, ముషాహరి, దేబ్రా–గోపీవల్లభపూరుల్లోని గ్రామ స్థావరాలు దొలుచుకుపోతున్నాయి. కాని ఇతర రాష్ట్రాల్లో భూస్వాములూ, షావుకార్లు, పోలీసులూ ఖతం అవుతూనే

ఉన్నారు. అంతేకాక దేశంలో మరోమూల చాలా ముఖ్యమైన పరిణామాలు కలుగుతున్నాయి. మున్నెన్నడూ ఎరుగనంత తీవ్రంగా ఒక సాంఘిక రాజకీయ సంక్షోభాన్ని ప్రజ్వలించజాలిన ఇంధన శక్తితో మొదలైన యువజనోద్యమానికి అగ్రభాగంలో (కలకత్తాలోనూ, పరిసర పట్టణాల్లోనూ) సి.పి.ఐ. (మా.లె.) పార్టీ నిలచింది.

# 8. యువజనోద్యమం

ఈ ప్రపంచం మీది మాది కూడా. చివరకు అది మీదే. వికసించిన పద్మంలాంటిది మీ జీవితం. ఉదయభానుడి సత్తువ, బలం, తేజస్సు, మీలో నిండి ఉంటాయి.

– మావో సూక్తి

ఛైర్మన్ మావో కొటేషన్లు పే.288

వాళ్ళ పెద్దల్ని వెన్నాడినట్టు రివిజనిస్టు గతం వాళ్లను వెన్నాడటం లేదు. గతంతో సంబంధాలు తెంచుకోవలసిన క్లిష్టపరీక్ష వాళ్ళకు అవసరం లేదు... వాళ్ల చూపు పాత నమ్మకాలతో మసకలు కమ్మలేదు–

– సరోజ్‌దత్తా

'విగ్రహ నిర్మూలనపై సమర్థన'

దేశ బ్రతి 1970

## కలకత్తా '70

1970 ప్రాంతంలో గ్రామీణ ప్రాంతం సంక్షోభంతో కుతకుతలాడుతోంది. కలకత్తా నగరం మాత్రం మామూలుగానే ఉంది. దినచర్యలో మార్పేమీ లేదు. బస్సుల రణగొణ ధ్వని, మోటారు హారన్ల చప్పుళ్లు, డొక్కు ట్రాముల డబడబలు, చిల్లర అమ్మకం బళ్ళవాళ్ళ కేకలతో భారతదేశంలో అంత గందరగోళమైన చోటు మరోటి లేదేమోననిపిస్తుంది.

పార్క్‌స్ట్రీట్, చౌరంఘి వంటి సంపన్న ప్రాంతాల్లో డబ్బూ, చిలిపితనం మజా చేసుకుంటున్నాయి. వ్యాపార సంస్థల్లో పనిచేసే నవనవలాడే ఉన్నతోద్యోగులూ, పైకొచ్చేందుకు తంటాలు పడే పాత్రికేయులూ, సినీతారలూ, కళా విమర్శకులూ, హై సోసైటీ సుందరాంగులూ, దొంగ రవాణాదార్లూ, తార్పుడుగాళ్లూ, జెట్‌యుగపు తరుణవయస్కులూ, బార్లలో, నాట్యశాలల్లో, మామూలుగానే తిరుగుతున్నారు.

అత్యంత మృదువైన పెద్దమనిషి తరహానుంచి, హిప్పీ మత్తు సమావేశాల దాకా నడిచే ఈ విలక్షణ వర్గాల్లో 'నక్సలైటు', అనే మాట, ఒక విధంగా, అద్భుతమైన ప్రాచుర్యం సంపాదించుకుంది. ఎటువంటి ఆశ్చర్యకరమైన వార్తనైనా నాటకీయంగా మార్చేందుకే ఆ పదం ఉపయోగిస్తోంది. ఇలాంటి వర్గాల్లో గ్రామీణ సాయుధ పోరాట ప్రసక్తి తేవడం సభ్యత లేకపోవడంగానే పరిగణిస్తారు.

శ్యాం బజారు, కాలేజీస్ట్రీట్, భవానీపూరు టీ దుకాణాల్లో తారాడేవారికి మాత్రం గ్రామీణ ఆందోళన సుపరిచితమే. రొట్టె తింటూ, టీ తాగుతూ వార్తాపత్రికల్ని తిరగేస్తూ, సాయంకాలపు వార్తల్ని వాళ్లు చర్చించేవారు. "జ్యోతిబసు పదవిలో ఉంటాడంటావా? ఇంతకీ గోపీవల్లభపూరులో ఏం జరుగుతోంది?" తరవాత నిన్నటి సినిమా గురించో, నేటి తాజా పుకారు గురించో, ఆడవాళ్లమీదికో, వాళ్ళ సంభాషణ మరలేది.

కాని ఇది ఎంతో కాలం సాగలేదు. 1970లను 'విమోచన దశాబ్దం'గా చెయ్యమని ప్రజల్ని ఉద్బోధిస్తూ కలకత్తా తెల్లని గోడలపై నల్లని తారుతో రాసిన నల్లటి నినాదాలు చోటుచేసుకోసాగాయి. ఆగ్రహావేశాల్తో రైతులు 'జోతేదార్లకుత్తుకల'ను చీలుస్తున్నారని చాటాయి. 1971 నాటికి పశ్చిమ బెంగాలు అంతటా ప్రజావిమోచన సైన్యం కలయ దిరుగుతుందని నమ్మబలికాయి.* రానున్న మేఘగర్జనను సూచించే మర్మర ధ్వనులు వినబడసాగాయి.

"18 నుంచి 24 సంవత్సరాల వయసులో మనిషి (తన) జీవితంలో చాలా కష్టించి పని చేస్తాడు. చాలా ధైర్యాన్ని శక్తిని కలిగి, తన భావాలపై తాను ఎంతో నమ్మకం కలిగి ఉంటాడు." కాని ఈ వయసు విద్యార్థులు దేశంలో "చదువులు, పరీక్షలు పాసవడం మొ॥ ప్రజావ్యతిరేక మార్గాల్లో (కాలం) గడిపేస్తున్నారు." 1970 ఆరంభంలో, యువకుల్ని విద్యార్థుల్ని ఉద్దేశించి చేసిన విజ్ఞప్తిలో చారుమజుందారు ఇలా అన్నాడు. "పరీక్షలు పాసవడంలో మీ శక్తి సామర్థ్యాలను వృధా చేయక తక్షణం ఇప్పటికిప్పుడే విప్లవ పోరాటంలో దిగితే నాకు చాలా సంతోషం" రైతాంగంతో సమైక్యం చెందాలని గుర్తు చేసాడు. ఆ సమైక్యతకు ప్రథమ సోపానంగా విద్యార్థుల్ని గ్రామాలకు తరలి పొమ్మన్నాడు.(32) చారుమజుందారు విమర్శించిన "ప్రజా వ్యతిరేక పాఠ్య విధానాల"పై ద్వేషంతో అతని భావాల ద్వారా ఉత్తేజితులైన పశ్చిమ బెంగాలు నగరాల విద్యార్థులు చిన్న తరహా సాంస్కృతిక విప్లవాన్ని ప్రారంభించారు కూడా. 1970 మధ్యకాలానికి కలకత్తాలో కూడా చాలా చురుగ్గా పనిచేయసాగారు.

---

* *"1970-71 నాటికి పశ్చిమ బెంగాలు సువిశాల ప్రాంతాల్లో ప్రజా విముక్తి సైన్యాలు కవాతు చేస్తాయని నేను అనడం పగటి కలలు కనడం ఎంత మాత్రమూ కాదు."*

సి.పి.ఐ. (మా.లె.) నగర ఉద్యమంలో మూడు అంశాలున్నాయి. సాంస్కృతిక పరంగా భారతీయ మేధో సాంప్రదాయం, ప్రత్యేకించి బెంగాలీ మధ్య తరగతి సాంప్రదాయ దివాళాకోరుతునాన్ని నిరూపించేందుకై చేపట్టిన సంఘటిత ప్రయత్నం వాటిలో మొదటిది. నగరాల్లో అమలుపరిచేందుకై చేపట్టిన వర్గశతృ నిర్మూలనా కార్యక్రమం. రెండోది, పోలీసు యంత్రాంగపు సభ్యుల్ని రాజకీయ ప్రత్యర్థుల్ని, తాబేదారుల్నీ తమ శతృవులుగా తలచారు. పెద్ద పెట్టున ఆయుధాలను పట్టుకుని తమ ఆయుధ సంపత్తిని నిర్మించాలనుకోవడం మూడో అంశం.

తమ సాంస్కృతిక దాడిలో భాగంగా జాతీయ నాయకుల విగ్రహాల్ని ధ్వంసం చేసారు. విద్యాలయాల్నీ విద్యాలయ కార్యక్రమాల్నీ విచ్ఛిన్నం చేయసాగారు. రెండో అధ్యాయంలో చెప్పినట్టు మొత్తం విద్యావిధానంలో ఏర్పడిన సంక్షోభం వల్ల పై కార్యక్రమం మరింత సులువైంది.

## మధ్య తరగతి బెంగాలీ సంస్కృతి చరిత్ర

బెంగాలీ మధ్య తరగతి విద్యా గంధపు స్వరూప స్వభావాలు తెలుసుకుంటే కాని మధ్య తరగతి సాంప్రదాయాలపై నిరసన, వాటి సాంస్కృతిక ప్రతీకల్ని ధ్వంసం చెయ్యడం వంటి కార్యక్రమాలు అర్థం కావు. అట్టడుగునున్న ప్రజాబాహుళ్యం, పైనున్న కొద్దిమంది విద్యాధికులు, ఈ రెండు వర్గాల మధ్య అంతులేని దూరమే, ఈ సాంప్రదాయానికి పునాది. బ్రిటిషు వలస రాజ్యపు వారసత్వంగా వచ్చిన సాంప్రదాయం అది. 1835లో మెకాలే దేశ విద్యా విధానానికి రూపకల్పన చేసాడు. "మనం పాలించే కోట్లాది ప్రజలకూ, మనకూ దుబాసీలుగా ఉండే వర్గాన్ని తయారు చేయాలి. రక్తంలో రంగులో భారతీయులైనా, వాళ్ళ అభిరుచులు, అభిప్రాయాలు, నైతిక ప్రవర్తన, మేధస్సుల విషయాల్లో ఆంగ్లేయులుగా ఉండాలి."[1]

ఆ కారణంగానే 19వ శతాబ్దంలో భారతీయ గ్రామ ప్రాంతాల్ని రైతాంగ తిరుగుబాట్లు ఒకవైపు ఉగ్రూతలూగిస్తుంటే, విద్యాధిక భారతీయ మధ్యతరగతి వర్గం మాత్రం, "రక్తంలో రంగులో, భారతీయులై, అభిరుచులు, అభిప్రాయాలూ, నైతిక ప్రవర్తన, మేధోచింతనల్లో ఆంగ్లేయులే" కావడంతో, ఆ తిరుగుబాట్ల ప్రాముఖ్యతను గుర్తించక, వాటిని వ్యతిరేకించారు. ఓ ఆధునిక వంగ శాస్త్రజ్ఞుడు పరిస్థితిని ఇలా వర్ణించాడు. "1855-1856 సంవత్సరాల్లో సంతాలు తిరుగుబాటు కాలంలో దేశీ విదేశీ దోపిడీదార్లు భయభ్రాంతులయ్యారు... సంతాలు తిరుగుబాటుదార్లు ఉరికంబాల కెక్కుతున్నారు... కొత్త రైల్వేదొరలు, దొరబాబులు, వాళ్ళ కూలీలోనూ, కూట్లోనూ,

దుమ్ముకొట్టి సంతాలు స్త్రీలను విచ్చలవిడిగా చెరుస్తున్నారు... అదే సమయంలో కొద్ది దూరంలోనే, కలకత్తాలో, విద్యాధికులు, మధ్య తరగతి బెంగాలీ బాబులు, బన్సీలు మొదలు ఏజెంట్లవరకూ, నవ చైతన్యం, 'సాంస్కృతిక పునరుజ్జీవన'పు వెల్లువలపై తేలియాడే నూతన సంఘ సంస్కర్తల దాకా, (అందరూ కూడా) తమ చావళ్లలో ఆటలాడుతూ, విధవాపునర్వివాహం గురించో, గుర్రప్పందాల గురించో చర్చిస్తూ, దుర్గాపూజకు యూరోపియన్ వంటకాల్ని, హిందూస్తానీ భోగం మేళాన్ని ఏర్పాటు చేసుకుంటూ... విధవా వివాహానికి ప్రతిగానో, పూర్వపక్షంగానో ఉదహరించేందుకు బూజుపట్టిన పాత గ్రంథాలను తిరగేస్తూ, కాలం గడుపుతున్నారు. అదే సమయంలో వందలాది సంతాలు, హోదీ, మచ్చీ, దోం తిరుగుబాటుదార్లకు సంకెళ్లు తగిలించి (వలస పాలకులు, వాళ్ళ దేశ తాబేదార్లు) జైళ్ళకు లాక్కుపోతున్నారు. విధవా పునర్వివాహాలు, స్త్రీ విద్యా విలాసాలూ నగరాల్లో (జరుగుతుంటే), ఒకే రోజున, ఒకే సమయంలో, గ్రామాల్లో సువిస్తరమైన తిరుగుబాట్లు (సాంఘిక రంగంలో) కూడా జరిగాయి. ప్రపంచంలో మున్నెన్నడూ, అలాంటి గొప్ప వింత జరగలేదు. కాని అది మనదేశంలో జరిగింది. వాటిని వేరుపరిచిన భౌగోళిక దూరం తక్కువైనా, దానికి ఎన్నో రెట్లనిపించే గ్రామానికి నగరానికీ మధ్య గల అంతరం మరెక్కడా కనబడదు."[2]

ఇంగ్లీషు విద్య ద్వారా ప్రభావితులైన మధ్య తరగతి నాయకత్వంలో నగర ప్రాంతపు సాంఘిక సాహిత్యోద్యమాలూ; గ్రామీణ రైతాంగోద్యమాలూ ఎక్కడా కలవకుండా 19వ శతాబ్దకాలమంతటా, సమానాంతరంగా నడిపించాయి. కాని ఆయా సాంఘిక సాహిత్యోద్యమాల్లో అయోమయంగా కనిపించే ఈ విపరీత ధోరణి, మధ్యతరగతి ఉద్యమంలోంచి ఒక్కొక్కప్పుడు అడ్డగోలుగా దూసుకొచ్చి గ్రామాల్లోని ఆందోళన పరిధిలోకి (దగ్గరగా) వచ్చేది.... హిందూ కాలేజి యూరేసియన్ ఉపాధ్యాయుడు లూయిస్ విలియాన్ డిరాజియో శిష్యుల్నీ, వారు నడిపిన యంగ్ బెంగాలు ఉద్యమాన్నీ, 1970 కలకత్తా విద్యార్థుల తిరుగుబాటుకు పూర్వీకులుగా భావించవచ్చు. సామ్రాజ్యవాద పరిపాలనా నిర్వహణావసరాలను తీర్చే మెకాలే విద్యా విధానం, మరోవైపు ప్రజాస్వామ్యం ఉదారవాదం వంటి సమకాలీన పాశ్చాత్య భావాల్ని కూడా భారతీయ విద్యార్థులకు చవి చూపింది. ఈ భావాల ప్రభావంతో డీరాజో యువశిష్యులు, తమ మతాన్నీ, సాంఘికాచారాల్నీ మొత్తం సాంప్రదాయాల్నీ, నిర్దాక్షిణ్యంగా విమర్శించారు. బెంగాలీ యువత తమ మేధోసాంప్రదాయాన్నీ, వాటి సాంఘిక పుట్టుపూర్వోత్తరాల్నీ, 150 సంవత్సరాల తరవాత, మళ్ళీ అదే విధంగా బోనెక్కించారు. సమకాలీన విలువల్ని ప్రశ్నించే ఆ ఉద్రేకంలో, సమానత్వం సౌభ్రాతృత్వం వంటి

ఆదర్శాలపై కల ఉత్సాహంతో, వారిలో కొందరు బ్రిటిషువాళ్ళు తమను పాలించే హక్కునే ప్రశ్నించారు. వాళ్ళా విధంగా సమకాలీన గ్రామీణ సంక్షోభపు సెగలకు దాపుగా ప్రమాదకరంగా నిలబడ్డారు. యువ డెరాజియన్లలో ఒకడైన రాధానాధ షిక్దార్ (1813-70) భారతీయ సర్వేకూలీల చేత వెట్టిచాకిరీ చేయించుకోడాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వాధికార్లపై ధ్వజమెత్తాడు.

బెంగాల్లో 19వ శతాబ్దపు రైతాంగ తిరుగుబాటుకు సాయం చేసిన నేరానికి వేటాడి చంపబడినవాళ్లు మరికొందరున్నారు. వాళ్ళలో 'హిందూ పేట్రియాట్' సంపాదకుడైన హరీష్ ముఖర్జీ ఒకడు. తన పత్రిక ద్వారా నీలిమందు తోటల యజమాన్ల అమానుష చర్యల్ని అలుపులేకుండా దుయ్యబట్టాడు. తోట యాజమాన్లకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన రైతాంగాన్ని బలపరచాడు. రైతుల్ని వేధించే సమస్యల పరిష్కారానికి తోడ్పాటుగా తన సర్వస్వాన్ని ఖర్చు పెట్టాడు. చివరికి కలకత్తాలోని తన ఇంటినే తిరుగుబాటు నాయకుల ఆశ్రయ శిబిరం చేసాడు. 1861 సంవత్సరంలో 37 సంవత్సరాల వయసులో, స్నేహితులు బంధువులు ఒకవైపు నిరసించగా, మరోవైపు పోలీసులు మోపిన వివాదాలు వేధిస్తోంటే, హరీష్ ముఖర్జీ శాశ్వతంగా కన్నుముశాడు.[3]

అలాంటి నిబద్ధులైన కొందరు మేధావుల్ని మినహాయిస్తే, 20వ శతాబ్దపు రాజకీయోద్యమ నాయకత్వంలో అధికంగా ఉన్న మెకాలే విద్యావిధానపు ముద్దుబిడ్డలే చాలా మంది తమ వర్గ ప్రయోజనాల్ని పరిరక్షించుకుంటూ, మెరుగుపరుచుకున్నారే కాని, అణగారిన ప్రజల గురించి ఎప్పుడూ పోరాడలేదు. ప్రజా తిరుగుబాట్లను తమ వర్గ ప్రయోజనాలకు అనుగుణంగా బాగా ఉపయోగించుకున్నారు. రైతాంగ ప్రయోజనాల్ని సాధించే స్థితికి ఆయా ఉద్యమాలు వచ్చినప్పుడో, లేక తీవ్రవాదులు విద్యాధిక మధ్యతరగతి నాయకత్వానికి ఎసరు పెట్టినప్పుడో, వాళ్లు ఆయా ఉద్యమాల కళ్ళేలను వెనక్కి లాగి, అదుపులో పెట్టుకున్నారు. సహాయ నిరాకరణోద్యమంలో గాంధీ రైతాంగానికిచ్చిన సలహా, 1947కు పూర్వపు కాంగ్రెసు మంత్రివర్గాల కాలంలో నెహ్రూ రైతాంగంపై చూపిన చికాకు, భారత నౌకాదళ తిరుగుబాటు సైనికులకు సర్దార్ పటేల్ చేసిన ద్రోహం; మొదలైనవన్నీ ఆంగ్ల విద్యాసంకరులైన భారతీయ మధ్య తరగతికి గల రైతాంగ - వ్యతిరేక, తీవ్రవాద-వ్యతిరేక, సాంప్రదాయపు ధోరణిలో కనపరచిన వైఖరులే! తమను బలపరచమని ముసలి కాంగ్రెసు నాయకులకు విన్నవించుకునేందుకు 1928 కలకత్తా కాంగ్రెసు సమావేశానికి సమ్మె చేస్తున్న కార్మికులు ఊరేగింపుగా రాగా, వాళ్ళను చితకతన్నమని తన వాలంటీర్లను ఆదేశించడానికి (కాంగ్రెసులో 'తీవ్రవాది'గా ఊరేగి చెల్లుబడైన) సుభాష్‌బోసు కూడా

ఏమీ వెనుకాడలేదు.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో పరిపక్వం చెంది, కాంగ్రెసు నాయకత్వంలో బయటపడ్డ వైరుధ్యాలున్నాయి. సి.పి.ఐ. (మా.లె.) దృష్టిలో ఆ వైరుధ్యాలు ప్రపంచ సామ్రాజ్యవాద సంఘర్షణలకు ప్రతిబింబాలు మాత్రమే. సుభాష్‌బోస్–గాంధీ తగాదాపై సి.పి.ఐ. (మా.లె.) సిద్ధాంతకర్త సరోజ్‌దత్తా ఇలా అన్నాడు. "గాంధీ బ్రిటిషు సామ్రాజ్యవాదపు ఏజెంటుగా వ్యవహరించే బూర్జువా గ్రూపుకు నాయకుడూ, ప్రతినిధీ. బలపడుతున్న జర్మన్–జపాన్ – ఇటలీ సామ్రాజ్యవాద గూడుపుఠాణీకి ఏజెంట్ల గ్యాంగుకు సుభాష్ నాయకుడు". గాంధీ – నెహ్రూ వివాదానికి సరోజ్‌దత్తా వ్యాఖ్యానం – రెండవ ప్రపంచ యుద్ధపు మొదటి దశలో హిట్లరు ముందుకు రాగా, బ్రిటను ఓడిపోతుందని గాంధీ భావించాడు. తెల్లారేసరికి 1942లో బ్రిటిషు వ్యతిరేక తిరుగుబాటు దారుగా మారిపోయి, 'క్విట్ ఇండియా' ఉద్యమానికి పిలుపిచ్చాడు మరో ప్రక్క నెహ్రూమాత్రం, బ్రిటన్, అమెరికా, సోవియట్ యూనియన్ల సమిష్టిశక్తితో చివరకు అక్షరాజ్యాల్ని (Axis Powers) ఓడిస్తారని తలచి బ్రిటన్ను ఓడించడం తెలివి తక్కువగా పరిగణించి, ఫాసిస్టు వ్యతిరేక ధోరణిని చేపట్టాడు. ".... 'ఎవరు నెగ్గుతారో వాళ్ళతో ఉండాలని' అందరూ ఆశించారు. వివాదమంతా ఎవరు నెగ్గుతారు. అనే సమస్యపైనే..." అని సరోజ్‌దత్తా ఆ తగాదాను సమీక్షించాడు. అదే నిర్మొహమాటంతో సుభాష్‌బోసునూ అతని సైన్యాన్ని కూడా సరోజ్‌దత్తా వర్గీకరించాడు. "ఓడిపోయి పట్టుబడ్డ ఒక సామ్రాజ్యవాద దేశపు కిరాయి సైనికుల్ని మరో సామ్రాజ్యవాద దేశపు తొత్తుసైన్యంగా సమీకరించి, 'ఆజాద్ హిందు ఫౌజు' అనే బడాయి పేరును తగిలించుకుంద"ని ఆ సైన్యాన్ని వర్ణించాడు. బ్రిటిషు వారిని తరిమికొట్టేందుకు తమదైన సైన్యం కావాలని ఉవ్విళ్ళూరే భారత ప్రజల ఆశల్ని సాకుగా చేసుకున్న బూర్జువా నాయకులు ఈ తుక్కునుంచి "నేతాజీ"ని రూపకల్పన చేశారు. సాయుధ పోరాటానికై ప్రత్యామ్నాయ కమ్యూనిస్టు సన్నాహాలు లేనందున ప్రజల్లో సుభాష్ పట్ల భ్రమలూ, గౌరవం పెరిగేందుకు దోహదం చేసారు.[4]

## విద్యావిధానంలో సంక్షోభం

1947 అధికార మార్పిడి తరవాత కూడా విద్యావిధానంలో మౌలికమైన మార్పులేమి జరగలేదు. ఇంగ్లీషు పరిజ్ఞానమే వ్యక్తికి గల అర్హతలకు కొలమానంగా చెలామణీ ఔతోంది. ఉన్నత విద్య ఇంగ్లీషు ఆధిపత్యంలోనే ఉంది. ప్రభుత్వం తదితర రంగాలలో ఉన్నత హోదాలకు కావలసిన అర్హతలను కట్టబెడుతోంది.

దేశంలోని మొత్తం జనాభాతో పోల్చితే 1947 తరువాతి కాలంలో జరిగిన ఉన్నత విద్యాభివృద్ధి పైనున్న వర్గాల వరకే పరిమితమైందని తెలుస్తుంది. దేశంలో 70 శాతం – అంటే దాదాపు 349 మిలియన్ల ప్రజలు – 1968–69 సంవత్సరాల నాటికి విద్యామంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం నిరక్షరాస్యులే.[5] మరో లెక్క ప్రకారం, తమ సంతకాలను మాత్రమే చెయ్యగలిగిన వారితో సహా మిగతా 30 శాతంలోనూ 8.2 మిలియన్ల మంది ఇంగ్లీషు విద్యనభ్యసించారు.[6] ఇంగ్లీషు విద్య వచ్చి వాళ్లు దేశ జనాభాలో 2 శాతం లోపులోనే ఉన్నారని దీన్ని బట్టి తెలుస్తూంది.

మెకాలే – పెంపుడు కొడుకులైన ఈ 'అనువాదక వర్గం' దేశ పాలనలో వివిధ వృత్తులూ సర్వీసులలో, పబ్లికు ప్రైవేట్ రంగాలలో, నేటికీ సారథ్యం నెరపుతూ, ఒకటిన్నర శతాబ్దం నాడు, ప్రజలకు సాంస్కృతికంగానూ భావపరంగానూ ఎంత దూరంలో ఉన్నారో, ఇప్పుడూ అంతే దూరంలో ఉన్నారు. 60ల చివర గల పరిస్థితిని వర్ణించిన గున్నార్ మిర్డల్, విద్యా వ్యవస్థ "బాగా విద్యాధికులైన వర్గానికి అనుబంధంగా ఉన్న ఉపవర్గంగా గల సాంకేతిక సిబ్బంది కలిగి, మిగిలిన ప్రజలను అజ్ఞానపు లోతుల్లో ఉంచే వలస (విద్యా) విధానానికి దగ్గరగా" ఉందన్నాడు.[7]

విద్యాబోధనా విధానంలోనే కాక, దాని సారాంశం దృష్ట్యా కూడా, దాంట్లో పెత్తందార్ల యొక్క వర్గ స్వభావం ప్రతిబింబిస్తోంది. సామ్రాజ్యవాద వ్యతిరే కోద్యమాలలోని అహింసాయుత లక్షణానికే చరిత్ర పుస్తకాలలో ప్రాధాన్యతనిచ్చారు. పాశ్చాత్య పెట్టుబడిదారీ అభివృద్ధి సిద్ధాంతాలే ఆర్థిక రాజకీయ శాస్త్రాలలో చోటు చేసుకున్నాయి. మరీ పెద్దది కావడం వల్ల 'సిపాయిల ఉద్యమాన్ని' దాటవేయలేక పోయారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా దాన్ని కొనియాడారు. కాని సమకాలీన సంఘ సంస్కర్తలు, మేధావులు, ప్రదర్శించిన బ్రిటిషు అనుకూల వైఖరిని మాత్రం చరిత్ర పుస్తకాలలో ప్రస్తావించలేదు. ఆ తిరుగుబాటుకు ముందూ, వెనకా, జరిగిన వందలాది రైతాంగ తిరుగుబాటు నేటికీ చరిత్ర పుస్తకాల పుటలలో చోటు చేసుకోలేదు.

సహజంగానే ఈ విద్యా విధానం సంక్షోభపు బీజాలను కూడా తనలో ఇముడ్చుకుంది. ఆర్థికాభివృద్ధి కుంటుపడడంతో, మధ్య తరగతి కోర్కెలకనుగుణంగా పెరిగిన ఈ ఉన్నత విద్య మూలంగా కాలేజీల, విశ్వవిద్యాలయ విద్యార్థుల ఉపాధి అవకాశాలను సంకుచితపరచింది. 1953లో 1,63,000 లున్న నిరుద్యోగులైన విద్యావంతుల సంఖ్య 1966 చివరకు 9,17,000కు పెరిగింది. ఎక్స్చేంజీలలో నమోదైనంత మాత్రాన ఉద్యోగాలు వస్తాయనే ఆశ కూడా లేక తమ పేరును కూడా నమోదు చేయించుకోని నిరుద్యోగులు వేలాదిగా ఉన్నారు. ఇంజనీరింగు సంస్థల

నుంచి వచ్చిన వేలాది ఇంజనీర్ల ఉద్యోగావకాశాలపై 1966–67 పారిశ్రామిక సంక్షోభం గొడ్డలిపెట్టుగా తయారైంది.*

ఆ విధంగా 60ల చివరి కాలానికి విద్యార్థులు తిరుగుబాటు చేసేందుకు పరిపక్వమైన స్థాయికి చేరుకున్నారు. ఇరుకు కొంపల్లో నివసిస్తూ, 1:200 దాకా ఉన్న టీచరు విద్యార్థి నిష్పత్తిలో చదువుకొనే ఈ విద్యార్థులు, కోపం, నిస్సహాయతలతో ఉద్రిక్తులయ్యారు. ఆ కోపం చాలా విధాలుగా బయటపడసాగింది. పాత పడికట్లకు నిరసనగా, ప్రస్తుతాధికారంపై అగౌరవాన్ని ప్రదర్శిస్తూ, స్నాతకోత్సవాలలో డిప్లమోలను చించసాగారు. 'మాకు డిగ్రీలు కాదు, ఉద్యోగాలు కావాలి' అని నినాదాలిస్తూ, స్నాతకోపన్యాసాలలో రంగరించే తేనెపలుకుల్ని గేలిచేయసాగారు. మొత్తం విధానాన్నే తమాషాగా జమకట్టి పరీక్షల్లో సామూహికంగా కాపీకొట్టడం మొదలైన చర్యలను తలపెట్టసాగారు. అధికారంలో ఉన్నవాళ్ళ అంతరించిన కలల సాధనలో సహకరించడానికి వాళ్లు నిరాకరించారు. ఆ అధికారంలో ఉన్నవాళ్లు పార్లమెంటరీ వామపక్షీయులా, కాంగ్రెసువాళ్లా, అనే వివక్షత కూడా వాళ్లు చూపలేదు. ఈ నాయకత్వ వర్గాలలో పేరుకున్న అవినీతిని చూసీ, 1947 అధికార మార్పిడి తరవాత ప్రాచుర్యం పొందిన వెర్రిభ్రమలు మటుమాయం కాగా, అది వరకు నిత్య సత్యాలనిపించే సిద్ధాంతాల పట్ల యువతకు భ్రమలు తొలిగి, తీవ్రమైన వ్యతిరేకతకు దారితీసాయి.

హటాత్తుగా కట్టలు తెంచుకుని బయల్పడే కలకత్తా విద్యార్థుల కోపోద్రేకాలకు సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఒక రాజకీయ నిర్గమనాన్ని నిర్దేశించింది. అది యువతలో వచ్చే ఉద్రేకాన్ని సరియైన మార్గంలోకి తిప్పసాగింది.

నగరోద్యమంలో 1968 అంతటానూ, 1969 మేలో సి.పి.ఐ.(మా.లె) పార్టీ అవతరణ జరిగే దాకా జరిగిన సాయుధ రైతాంగ పోరాటాన్ని బలపరుస్తూ విప్లవ కమ్యూనిస్టు విద్యార్థులు కలకత్తాలో ఎన్నో ప్రదర్శనలు జరిపారు.[8] తరచు ఆహార వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ కూడా ప్రదర్శనలు జరిపారు. 1969 ఫిబ్రవరి 20వ తేదీ 'దేశబ్రతి' సంచికలో ప్రచురించిన విప్లవ విద్యార్థి కార్యక్రమం "ఆహారం, ఉపాధి, విద్య, సంస్కృతి"లకై జరిపే సంఘర్షణల అవసరాన్ని నొక్కి చెపుతూ, విరివిగా విద్యార్థులను ఉద్యమంలోకి ఆకర్షించాలని ఉద్ఘాటించింది. ఈ

* *1979 చివరకు నిరుద్యోగుల సంఖ్య మన రాష్ట్రంలోనే (ఆం.ప్ర.) 10,00,000 సంఖ్యను దాటింది. దీన్నిబట్టి మొత్తం దేశంలోని నిరుద్యోగం ఎంత ఉందో తేలికగానే ఊహించవచ్చు – అను.*

కమ్యూనిస్టు విప్లవ(కారుల) విద్యార్థుల ఆలోచనల్లో ఇంకా సాంప్రదాయ విద్యార్థి ఆందోళనా పద్ధతులే కాపురం చేస్తున్నాయి. ఈ విద్యార్థులు సి.పి.ఎం. నుంచి విడిపోయాక కూడా 1968లో ఇంకా ఎన్నికలలో పాల్గొంటూ, పశ్చిమబెంగాలు కాలేజీల విద్యార్థి సంఘాల అధిపత్యాన్ని పొందడంలోనే మునిగి ఉన్నారు.

1969 ఆగస్టులో చారుమజుందారు యువతకు విద్యార్థులకూ సందేశమిస్తూ, "వాళ్ల విప్లవ సమర్థతలను నాశనం చేసేందుకై ప్రగతి నిరోధక పాలక వర్గాలు విద్యార్థులకి" ఎరచూపే విద్యార్థి సంఘాలు "విద్యార్థి సమస్యలు వేటినీ పరిష్కరించ"వని తెలిపాడు. "నేటి విద్యావ్యవస్థపై విద్యార్థులు చేసే తిరుగుబాటుకు కాలేజీ సంఘాలు నాయకత్వాన్ని వహించలేవనీ..." చెప్పాడు. అవకాశవాదపు బురదలో కూరుకుపోయిన విద్యార్థి నాయికులలో వృత్తి మనస్తత్వాన్ని పెంచుతూ, పదవిలో నిలదొక్కుకోవాలనే తాపత్రయంతో అన్ని రకాల అవకాశవాద మిత్రత్వాలను ఏర్పరచుకోవడంతో, విద్యార్థి (నాయకుల) విప్లవ సంస్కారాన్ని విద్యార్థి సంఘాలు ఎలా నాశనం చేస్తున్నాయో గుర్తు చేశాడు. "లొంగుబాటు పంథాను తిరస్కరించి" బీద రైతుల వద్దకూ, భూమిలేని రైతుల వద్దకూ, కార్మికుల వద్దకూ పోయి, ఆయా వర్గాలతో మమేకం కావలసిందిగా యువతకు, విద్యార్థులకు, ఉద్బోధించాడు.(23)

ఆ అభ్యర్థనను పురస్కరించుకుని ఎందరో విద్యార్థులు తమ చదువులు వదిలి గ్రామాలకు వెళ్ళారు. 1966 నాటి ప్రెసిడెన్సీ కాలేజీ ఆందోళనలో తాను సమీకరించిన విద్యార్థులతో బాటు అషీం చటర్జీ కూడా అలా వెళ్ళినవాడే. తరచుగా నాటికే తీవ్రమైన ఆందోళనలను నడిపే విద్యార్థి జనసందోహాల విప్లవోత్సాహానికి చుక్కానిగా వ్యవహరిస్తూ, మరికొందరు విద్యార్థులు నగరాలలో ఉన్నారు. తిరుగుబాటుకు సిద్ధమై, బద్దలవడానికి తయారుగా ఉన్న విద్యార్థులపైనే పార్టీ తన దృష్టిని కేంద్రీకరించి, నగర కార్మికవర్గాన్ని పట్టించుకోనందు వల్ల భావిలో ఒకానొక దశలో, ఉద్యమానికి హాని కలిగింది.

ప్రశ్నలు కఠినంగా ఉన్నాయనే సాకుతో కొందరు దుడుకు విద్యార్థులు పశ్చిమబెంగాలులో కొంత కాలంగా పరీక్షలను విచ్ఛిన్నం చెయ్యడం మామూలైంది. ఈ తక్షణ తిరుగుబాట్లను స్కూళ్ళు, కాలేజీలు, యూనివర్సిటీలపై తిరుగుబాట్లుగా మలచాలని సి.పి.ఐ. (మా.లె.) కార్యకర్తలు ప్రయత్నించారు. పథకం ప్రకారం ఈ సంస్థలపై భారీస్థాయిలో దాడులు 1970 ఆగస్టు నుంచీ మొదలయ్యాయి. ఈ సంస్థలను 'అర్థవలస' సంస్థలుగా పేర్కొన్న సి.పి.ఐ. (మా.లె.) కరపత్రాలు వాటిని నాశనం చెయ్యతగినవిగా ప్రకటించాయి. కలకత్తా యూనివర్సిటీ పార్టీ శాఖ

రహస్యంగా పంచిన ఒక కరపత్రం ఇలా వివరించింది. "విద్రోహ పాలకవర్గాలు స్థాపించిన ఈ విద్యావ్యవస్థ ప్రధానంగా 'వలసా'త్మకమైనది... బ్రిటిషువాళ్లు తమ తార్పుడుగాళ్ళనూ, బానిసలనూ, తయారుచేసుకునేందుకు దీన్ని మన దేశంలో ప్రవేశపెట్టారు.... దీని తరవాతే 47 భాగోతం జరిగింది. విద్రోహుల ఆధ్వర్యంలో సామ్రాజ్యవాదులతో జరిగిన రాజీ ద్వారా 'స్వాతంత్ర్యం' సంపాదించుకున్న దేశం నిజమైన దేశభక్తి గల తీవ్రమైన వలస వ్యతిరేక వ్యవస్థను ఎన్నటికీ పొందలేదు. మన దేశంలో సరిగ్గా ఇదే జరిగింది. అదే బానిసత్వ విద్యా విధానానికి ఈ దేశపు దళారీ పాలకులు జీవం పోసి నిలబెట్టారు. ".... ఈ వ్యవస్థ 22 సంవత్సరాల పాటు విద్యార్థులకూ యువతకూ వృత్తివాదపు (careerism) నల్లమందు మత్తును పంచిపెట్టింది. వర్గ పోరాటాలను వ్యతిరేకించడం వాళ్ళకు నేర్పింది. బీదరైతులకూ కార్మికులకూ వ్యతిరేకంగా నిలబెట్టి వాళ్ళను విప్లవయుద్ధంలో పాల్గొనకుండా తయారు చేసింది. ఈ వ్యవస్థను ఎదిరిస్తూ వాళ్లు వీధుల్లో పోలీసులతో తలపడినా, ఆ పోరాటాలు యూనియన్ల సంస్కరణవాదపు బూడిదలో పోసిన పన్నీరుగా తయారయ్యాయి. సి.పి.ఐ.(మా.లె.) నాయకత్వంలో నక్సల్బరీతో ప్రారంభమైన రైతాంగ విమోచనోద్యమం సంఘపు కూకటివేళ్ళను పెకిలించగా ఊగిసలాడిన వ్యవస్థలోని దివాళాకోరుతనం తన కళ్ళముందు కదలాడగా, విప్లవాత్మక విద్యార్థి యువజనమార్గం వాళ్ళకు చక్కగా కనిపించింది."

"తుపాకీ గొట్టంలోంచి రాజకీయాధికారం వస్తుందని" ఎలుగెత్తి చాటే నినాదాలు స్కూలుగోడలపై, కాలేజీగోడలపై, ఉత్తేజ పరచగా ఆ గోడలపై చిత్రించిన మావో ప్రశంసాత్మకంగా చూస్తూంటే, కాలిపోయే ఫైళ్ళు, రికార్డులు, ప్రశ్నా పత్రాలు, ఆన్సరు పత్రాలు, కుర్చీలు బల్లలు రగిలించిన జ్వాలల్లోంచి యువజన విప్లవోత్సాహం వెల్లివిరిసింది.

## విగ్రహాల విధ్వంసం

19వ శతాబ్దపు సంఘసంస్కర్తల విగ్రహాలపైనా, భారతీయ బూర్జువా రాజకీయ నాయకుల విగ్రహాలపైనా దాడులు మొదలయ్యాయి. మొదట్లో విగ్రహాలపై జరిగిన దాడులు మాత్రం యాదృశ్చికమైనవే. ఒకానొక భావావేశంలో, స్కూళ్ళనూ, కాలేజీలనూ అలంకరించిన ఈ నాయకుల విగ్రహాలూ, చిత్రపటాలూ ఈ యువ తిరుగుబాటుదార్ల కోపానికి గురయ్యాయి. సి.పి.ఐ. (మా.లె.) సిద్ధాంతకర్త సరోజదత్తా కూడా దీనికి యాధృచ్ఛికతనే ఆపాదించాడు. "విగ్రహాలను నాశనం చేసే వాళ్ళందరూ సి.పి.ఐ.

(మా.లె.) సభ్యులు కాదు. సి.పి.ఐ. (మా.లె.) ఆదేశాల ప్రకారం వాళ్ళలా చేస్తున్నారని అనుకోరాదు.... ప్రజల మన స్థితికి, కేంద్రరాజకీయ వైఖరికి అనుగుణంగా కేంద్రనాయకత్వం నుంచి ఆదేశాల కోసం చూడకుండానే పార్టీలోని యువత, విద్యార్థులు మొదలెట్టిన ఈ ఉద్యమం; కొద్ది రోజులలోనే మహత్తరమైన యువజనోద్యమ స్థాయిని అందుకొంది" దానికి సరోజ్‌దత్తా సిద్ధాంతాశయాన్ని ఆపాదించాడు. "ఇది ప్రతికూలాత్మక చర్య కాదు. కొత్త విగ్రహాలను స్థాపించేందుకే పాత వాటిని నాశనం చేస్తున్నారు. వాళ్లు ఝాన్సీరాణి* విగ్రహాన్ని స్థాపించేందుకు గాంధి విగ్రహాన్ని నాశనం చేస్తున్నారు. మంగళ్ ఘట్టాన్ని నిర్మించేందుకు గాంధీ ఘట్టాన్ని నాశనం చేస్తున్నారు. (1857 తిరుగుబాటు నాయకుడు మంగళ్‌పాండే)" యువత మనస్థితిలోకి తొంగి చూసినట్టుగా ఇలా చెప్పాడు "రాజకీయ పరిణామాలకు పరమార్థాలను నిజంగా తెలిసే యువకులిలా చేస్తున్నారా? అని అడగొచ్చు. విప్లవ ప్రజలు అన్ని సందర్భాలలోనూ అన్ని పరమార్థాలను తెలుసుకునే విప్లవ చర్యలకు తలపడరు. తాము ధ్వంసం చేసే విగ్రహాల వ్యక్తుల చరిత్రను, కార్యకలాపాలను విమర్శించు కున్నారా? లేదు! అయినా వాళ్లు మంచి పనే చేస్తున్నారు. విప్లవం విజయం పొందుతున్న శకంలో పుట్టి పెరిగే వాళ్లు; తమ పెద్దల మాదిరి, తమ భుజాలపై రివిజనిస్టు గతాన్ని మోసుకోవడం లేదు. గతకాలపు వాసనలతో తెగతెంపులు చేసుకొనే కష్టతరమైన పద్ధతి వాళ్ళకవసరం లేదు. నేటి యువత ఆ విగ్రహాలను ఒక్కసారిగానే పట్టుకోవచ్చు. పాతకాలపు మూఢనమ్మకాలతో వాళ్ళ చూపు మసకలు కమ్మలేదు." నగర తిరుగుబాటుకు మూలకారణాలను వివరించాడు. "నగరాలలో పెనుతుఫాను

---

* *ఝాన్సీరాణి అయిన లక్ష్మీబాయి తన ఇష్టానికి వ్యతిరేకంగా తిరుగుబాటుదార్లకు నాయకత్వం వహించవలసి వచ్చింది. అంతేకాని బూర్జువా చరిత్రకారులు వర్ణించినట్టు ఐచ్ఛికంగా 1857 తిరుగుబాటును సమర్థించలేదు. అనుకోకుండా సరోజ్‌దత్తా కూడా ఇదే భ్రమలో పడ్డాడు. రమేష్ మజుందార్ ఇలా రాసాడు. "ఎర్‌స్కైన్ రాణీయే రాసిన లేఖలో ఇలా పేర్కొంది... 'తనపైనే హింసాత్మకంగా ప్రవర్తించిన సిపాయిల' కోర్కెల ప్రకారం వాళ్ళను తప్పనిసరిగా అనుసరించవలసి వచ్చింది. అలా చేయకపోతే రాజభవనాన్నే తుపాకులతో పేల్చేస్తామని బెదిరించారు." కోటలోని సిపాయిలు కెప్టెన్ గోర్డన్‌ను చుట్టుముట్టగా, 'రాణి వద్దకు వెళ్ళగా, ఏభై అరవై మంది గల తన సిపాయిలను ఆమె తుపాకీలతోనూ మందుగుండు సామాన్లతో మాకు సాయం చేసేందుకు పంపింది.' **G.W. Forrest, Selections from Letters, Despatches and other State Papers-preserved in the Military Dept of G.O.I. 1857-58 P. xiii)***

వీస్తోంది. దాని కేంద్రం గ్రామాలలోని రైతాంగపు బాహుళ్యంలో ఉంది. సి.పి.ఐ. (మా.లె.) నాయకత్వంలో అక్కడ జరిగే రైతాంగ గెరిల్లా పోరాటాల వల్ల ఏర్పడిన పీడనం ద్వారా ఆ తుఫాను వచ్చింది."[9]

ఈ యువ తిరుగుబాటుదార్లు కలకత్తాలోనూ తదితర పట్టణాలలోనూ, బహిరంగ ప్రదేశాలలోనూ గల గాంధీ, రామ్మోహనరాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, వివేకనంద తదితర బూర్జువా రాజకీయనాయకులు, సంఘ సంస్కర్తల విగ్రహాల్ని తమ తమ లక్ష్యాలుగా చేసి ధ్వసం చేయసాగారు. వాళ్ళ పాత్రలను పొగుడుతూ అధికారిక చరిత్రకారులు చేసే స్తోత్రపాఠాల మూలంగా, ఈ విగ్రహాలు ప్రజల దృష్టిలో దేవతా విగ్రహాలుగా తయారయ్యాయి. వాళ్ళ సందేశాల్ని, ప్రత్యేకించి గాంధీ సందేశాల్ని, ఒకరకమైన 'పవిత్ర శాసనాలు'గా ప్రజలపై రుద్దారు.

పశ్చిమ బెంగాలు నగరాలలో నానాటికీ పెరిగే విగ్రహ విధ్వంసం తీవ్ర పరిణామాలకు దారి తీస్తోంది. గతంలో ఈ నాయకులకు గల ప్రజాదరణను సాకు చేసుకుని, హింస గురించి వాళ్ళ సూక్తుల్ని రాష్ట్ర ప్రభుత్వం పోస్టర్లు, సైన్‌బోర్డుల ద్వారా నగరాలలో ప్రచారం చేయసాగింది. సూటిగా వ్యవస్థపై జరిగే దాడిని నిరోధించి, నేటి సంఘంలో లాభసాటిగా గడిపేసే మధ్య తరగతి ప్రజల్లో సి.పి.ఐ. (మా.లె.) పార్టీపై ద్వేషాన్ని రెచ్చగొట్టడమే, హింసపై ప్రచారం చేసిన నైతిక విమర్శలోని ప్రధానాశయంగా తోస్తుంది. గతకాలపు విగ్రహాల చుట్టూ అహింసా వలయపు గౌరవ ప్రతిష్టలను రూపొందించడంలో అధికార యంత్రాంగపు ప్రయత్నాలను గుర్తించిన సి.పి.ఐ.(మా.లె.) నాయకులు ఒక కరపత్రంలో ఇలా పెర్కొన్నారు. "(గత కాలపు ఈ బూర్జువా నాయకుల) సందేశాలను సిగ్గులేని పాలకవర్గం గోడల మీదా ట్రాముల మీద బస్సులమీదా రాస్తోంది. రేడియోలో, సినిమాలలో, పత్రికలలో ప్రచారం చేస్తున్నారు. ఆ విధంగా సి.పి.ఐ. (మా.లె.) పైనా, వర్గపోరాటాలపైనా, ప్రజా హృదయాలలో ద్వేషాన్ని రగిలించ జూస్తున్నారు కనక మనం ఈ నాయకులపై, వాళ్ళ సందేశాలపై, వర్గద్వేషాన్ని కనపరచడం సహజమే."[10]

కాని 19వ శతాబ్దపు సాహిత్యకారులపై చేసిన ఆ యువకుల దాడిలో వివక్షత లోపించింది. సామ్రాజ్యవాదంపై, ఫ్యూడలిజంపై చేసే తమ తిరుగుబాటులో ఆయా సాహిత్యకారులలో కొద్దిమంది సేవలనైనా ఉపయోగించుకునే నేర్పు వాళ్ళలో కొంచెమైనా లేకపోయింది. పాత వ్యవస్థపై చేసే తమ తిరుగుబాటులో కొంత వరకూ మార్క్సిస్టు దృక్పథానికీ భిన్నమార్గంలో ఉన్న టాగోర్ బూర్జువా మానవతావాదం,

సామ్రాజ్యవాద వ్యతిరేకత సి.పి.ఐ. (మా.లె.) కేడర్లకు కొంతవరకైనా ఉపయోగకరంగా ఉండేవి.* అటువంటి విమర్శ జరిపేందుకు యువకేడర్లకు తగిన ఓర్పూ ఆసక్తీ కూడా లేవు. అందుకు వాళ్ళ నాయకులు కూడా సాయపడలేదు. బహుశః గతకాలపు నాయకుల గురించి పండితపరమైన అంచనా జరిపే వ్యవధి కూడా లేదేమో.

సున్నిత భావాలు కల కొందరు సి.పి.ఐ. (మా.లె.) నాయకులు మరింత సహన దృష్టిని చూపవలసి ఉండాలనే భావాన్ని తరచు వ్యక్తపరిచారు కూడా. పైన పేర్కొన్న కరపత్రం, "విప్లవ యువకులూ, విద్యార్థులూ, ధ్వంసం చేసే విగ్రహాల తాలూకు నాయకులు వ్యక్తులుగా చాలా గొప్పవారై ఉండొచ్చు. విదేశీ ప్రయోజనాలకు అనుకూలురే కావచ్చు. భారత దేశ జాతీయ సంస్కృతి నాగరికతల చరిత్రలో వాళ్ళకు కొంతైనా పాత్ర ఉంది. కాని ఆయా వ్యక్తుల వర్గ స్వభాలను విశ్లేషించి వాళ్ళను విమర్శించే సమయం ఇంకా రాలేదు. అందువల్ల వాళ్ళ వ్యక్తిగతపు సమీక్షలను చేయడం కుదరదు" అని పేర్కొంది.

విగ్రహ విధ్వంసం, చిత్రపటాలను విద్యాలయాలను ఆహుతి చేయడం, వంటి చర్యలు పెరిగే కొలది, తమ లక్ష్యాలను ఎన్నుకోవడంలో విద్యార్థులలో వివక్షత లోపిస్తోందని, అతిగా పోతున్నారని, నాయకత్వం భావించసాగింది.

1970 శిశిరంలో కాబోలు, సుశీతల్‌రాయ్ చౌధురి గాంధీ తదితర కాంగ్రెసు నాయకులకూ, రామ్మోహన్, విద్యాసాగర్, రవీంద్రనాథ్ వంటి రచయితలకూ సంఘ సంస్కర్తలకూ మధ్య కొంత వివక్షత చూపాలని ఒక కరపత్రంలో కోరాడు. గాంధీ మొదలైన కాంగ్రెసు నాయకులపై దాడిని బలపరచాడు. కాని 'బూర్జువా ప్రజాస్వామ్య విప్లవ' యుగపు బూర్జువా మేధావులను క్షమించాలని భావించాడు. దీనికి జవాబుగా చారుమజుందారు ప్రశ్న : "సరే! కాని ఈ మేధావులు బూర్జువా ప్రజాస్వామ్య విప్లవ మేధావులేనా అనేది నిర్ణయించాలి. వలసదేశమైన భారతదేశంలో బూర్జువా ప్రజాస్వామ్యం ఉండాలంటే కావలసిన మొదటి లక్షణం, జాతీయ స్వాతంత్ర్యం.

---

* *ఇక్కడ సుమంతా బెనర్జీ కూడా ఝాన్సీరాణి విషయంలో సరోజ్‌దత్తా పడిన భ్రమలలోనే ఠాగోర్ విషయంలో తనూ పడ్డాడు. ఠాగోర్ రైతాంగ వ్యతిరేకతను, భూస్వామ్యతత్వాన్ని వివరిస్తూ, "ఠాగోర్ ఎవరి మనిషి?" అని హితేంద్రమిత్రా మే, 5, 1979 తేదీ ఫ్రాంటియర్ పత్రికలో రాసిన వ్యాసంలో ఇలా అన్నాడు. "అప్పుడు కవికి 12 సంవత్సరాల వయసు. తన స్వీయచరిత్రలో తన తండ్రితో నాడు హిమాలయాలకు వెళ్ళిన ప్రయాణాన్ని వివరంగా వర్ణించగలిగాడు." (పబ్నా జిల్లాలో ఠాగోర్ కుటుంబంపై రైతు తిరుగుబాటువంటి) "తన కుటుంబపు ఆర్థిక పునాదులను కదిలించిన తీవ్ర సంఘటనను మాత్రం మరచిపోగలిగాడు" – అను*

కామ్రేడ్ పూర్ణ (సుశీతల్‌రాయ్ చౌధురికి మారు పేరు) బూర్జువా ప్రజాస్వామ్య మేధావులుగా ప్రశంసించే వీళ్ళు ఎప్పుడైనా బ్రిటిషువాళ్ళను దేశం నుంచి తరమడం గురించి ప్రస్తావించారా? వాళ్ళు 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామాన్ని సమర్థించలేదు సరిగదా, దాన్ని వ్యతిరేకించారు కూడా. బ్రిటిషు వ్యతిరేక పోరాటాన్నుంచి ప్రజల దృష్టిని మరలించేందుకు వాళ్ళు సంస్కరణోద్యమాన్ని తలపెట్టారు" – పార్టీ సమావేశంలో ఆమోదించిన సి.పి.ఐ. (మా.లె.) కార్యక్రమంలో, ఆది నుంచీ భారతీయ బూర్జువా వర్గం దళారీ లక్షణాలనే కలిగి ఉందని చెప్పుకున్న సంగతిని సుశీతలరాయ్ చౌధురికి గుర్తు చేశాడు. వాళ్ళలో బూర్జువా ప్రజాస్వామ్య వాదులను చూడడానికి చేసే ఎలాంటి ప్రయత్నమైనా పార్టీ కార్యక్రమానికి వ్యతిరేకమే.(40)

రికార్డులూ, ఫర్నీచరూ తగులబెట్టే నాశనకర చర్యలకు బదులు సాహిత్య ప్రపంచాన్ని విద్యా వ్యవస్థనూ సంస్కరించే ఉద్యమాన్నేదైనా విద్యార్థులు చేపడితే మంచిదని కూడా సుశీతలరాయ్ చౌధురి భావించాడు. చారుమజుందారు సమాధానం. "మన దేశపు వలస విద్యావిధానం, సామాన్య ప్రజలనూ, మన దేశాన్నీ ద్వేషించమని బోధిస్తోంది... మావో ఆలోచనా విధానంలోనూ, విప్లవ సిద్ధాంతంలోనూ, నమ్మకం ఉన్న ప్రతీ ఒక్కడూ, ఈ విద్యావ్యవస్థపై ద్వేషాన్ని రగిలించడం తన పవిత్ర బాధ్యతగా భావించాలి. విద్యార్థులు ఈ వ్యవస్థపై ద్వేషంతో కుర్చీలు బల్లలు విరక్కొడతారు. రికార్డులను అంటిస్తారు. వాటిని కాదనే హక్కు ఏ విప్లవకారునికీ లేదు" (అదే వ్యాసం)

వాళ్ళ ఉద్యమాన్ని పొగడినా, చారుమజుందారు వాళ్ళనిలా హెచ్చరించాడు. "కార్మికులు, బీదరైతులు భూమిలేని రైతులతో వాళ్లు సమైక్యత చెందకపోతే తమ విప్లవ స్వరూపంలోని జీవాన్ని కాపాడుకోలేరు"(41) కలకత్తా మధ్య తరగతి ప్రాంతాలలో బాంబులు విసరడం, విగ్రహ విధ్వంసం వంటి భావోద్వేగ సంరంభంలో ఆ సలహాను ఎవరూ పాటించలేదు.

ఒక పక్కన విగ్రహ విధ్వంసం, స్కూళ్ళు, కాలేజీల, దహనాలు జరుగుతూండగానే, గతించిన వాళ్ళ కంటే బ్రతికున్నవాళ్ళే మరింత ప్రమాదకరమైన శత్రువులని సి.పి.ఐ.(మా.లె.) పార్టీ గుర్తించసాగింది. శ్రీకాకుళం, ముషాహరి, దేబ్రా–గోపీ వల్లభపూరులలో విప్లవకారులను పొట్టనబెట్టుకుంటున్న వార్తలు వస్తున్నాయి. అరెస్టయిన కామ్రేడ్లను పోలీసులు చిత్రహింసలు పెడుతున్నారు. ప్రభుత్వ దమన యంత్రాంగానికీ వార్తలు కలవరపాటును కలిగిస్తాయి. గ్రామీణ గెరిల్లాల చావుకు ప్రతీకారంగా నగరాలలో పోలీసులపై దాడికి సన్నద్ధం చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు.

## పోలీసులపై దాడి

పట్టపగలే పోలీసులను చంపడం పశ్చిమ బెంగాలు నగరాలలో సి.పి.ఐ. (మా.లె.) పార్టీ చర్యలలో నూతనాంశం. నగరాలలో ఫాసిస్టు దాడిని ఎదుర్కొనేందుకు రెడ్ గార్డులు సిద్ధంగా ఉండాలని 1970లో చారుమజుందారు హెచ్చరించాడు. పాసిస్టు రౌడీలు మనల్ని ఎదుర్కొనే సాహసం చేస్తే మెల్లగా, త్వరగా ప్రతిదాడులు జరిపి ఫాసిస్టు రౌడీలను బెంబేలెత్తించాలి.

ట్రాఫిక్ కానిస్టేబుళ్లు, మఫ్టిపోలీసులు, పోలీసు అధికారులు, సరిహద్దు సైనికదళం, (బి.ఎస్.ఎఫ్) కేంద్ర రిజర్వు పోలీసులు మొ॥ వారిపై దాడికై 'నిర్మూలన కార్యక్రమం' రూపొందించబడింది. రాక్షసప్రాయమైన హింస, ప్రతిహింసల పునరావృత దినచర్యకు అది నాంది అయింది. పక్షపాతం లేని ఏ విమర్శ ఐనా, మొహమాటంగా అక్కడే ఆగక మరింత లోతుగా తరచి చూడాలి. సంవత్సరాల తరబడి పోలీసులు చేసే భీభత్సాన్ని మరచి పోలీసులను హత్య చేస్తుంటే జుగుప్సను కనబరచడం పక్షపాతమైన వైఖరే కాని మరేమీ కాదు. సి.పి.ఐ.(మా.లె.) పార్టీ పోరాటాలు, సాంఘిక వ్యవస్థలోని దమనాత్మక చర్యలకు ఒక విధమైన జవాబు మాత్రమే. ప్రజల హృదయాలలో పోలీసులపై గల అసహ్యతకు క్రమబద్ధంగా వెలువడిన స్పందనకు ఈ ప్రత్యక్షచర్యలే నిదర్శనాలయ్యాయి.

బ్రిటిషు వలస పాలనా కాలం నాటి నుంచీ కూడా, పోలీసులు ప్రభుత్వపు దయలేని వాడి కోరలుగానే పనిచేస్తున్నారు. అకారణంగా సామాన్యుల్ని హింసించడం వీళ్ళకు చాలా సంతోషం. అవినీతికి వీళ్ళు పుట్టిల్లు. ఈ సందర్భంలో ఉత్తర్‌ప్రదేశ్ హైకోర్టు జడ్జి వ్యాఖ్యానం గమనార్హం "ఒక సంఘటిత సంస్థగా ఇండియన్ పోలీసు దళాన్ని నేర చరిత్రలో మించగల మరో అరాచకపు దళం మొత్తం దేశంలో లేదు."[11]

ఉన్నత పోలీసు అధికారులు సాధారణ విధానాన్ని నిర్ణయిస్తారు. సబ్-ఇన్‌స్పెక్టర్లు తదితర పోలీసులు దాన్ని అమలు పరుస్తారు. లంచాలు పట్టేందుకూ, హింసకు, దమనకాండకూ వాళ్ళు ప్రసిద్ధులు. కలకత్తాలో పేవ్‌మెంటు వర్తకులూ, దుకాణదారులూ, వాళ్ళ అత్యాచారాలకు నిత్య బానిసలు. ఏదో వంకన ప్రజలను అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టి వికలాంగుల్ని చేసి వదలడం వీళ్ళకు మామూలు విషయం. పోలీసులను దుయ్యబడుతూ చారుమజుందారు ఇలా అన్నాడు. "విదేశీయుల శిక్షణలో, హత్యకూ అణచివేతకూ భారత ప్రజలపై ప్రత్యేక ఆయుధంగా పోలీసులు మన దేశంలో వ్యవహరించారు. ప్రత్యక్షంగా బ్రిటిషు పాలన అంతరించినప్పటికీ

(నేటికీ) ఈ పోలీసుదళపు ఉన్నతాధికారుల స్కాట్లండుయార్డు*లోనే శిక్షణ పొందుతుంటారు. అంటే వలసరాజ్యాన్ని పరిరక్షించేందుకు చిట్కాలు తెలుసుకు వస్తున్నారన్నమాట. హత్యలు వాళ్లు కొత్తగా చెయ్యడం లేదు. అమాయక భారత ప్రజల్ని వాళ్లు కాల్చి చంపని సంవత్సరం లేదు. 1959లో గ్రామీణ ప్రజలు మంత్రులకు మహజర్లు నివేదించుకునేందుకు రాగా, ఒక్క రోజులో 80 మంది నిరాయుధులైన రైతుల్ని చంపారు. ఈ ఖూనీకోరు ముఠాలు ఆట స్థలాలలోనూ తయారౌతారు. క్రికెట్ పోటీలు జరుగుతూంటే ప్రేక్షకులను వీళ్లే చావబాదుతారు.** ప్రజల్ని చంపడమే వాళ్లు ప్రాక్టీసుగా పెట్టుకున్నారు. మనదేశంలోని వలస ప్రభుత్వాన్ని పరిరక్షించేందుకు సామ్రాజ్యవాదుల ఆయుధమే ఈ పోలీసులు. వాళ్ళు భారతీయులు కారు. వాళ్ళు భారతదేశానికి ఏమీకారు."(45)

పోలీసులపై పేరుకున్న అసహ్యతవల్ల, సి.పి.ఐ.(మా.లె.) కార్యకర్తలు కలకత్తాలో పట్టపగలు పోలీసులపై దాడిచేసి కూడా పారిపోగలిగారు. పోలీసులను రక్షించేందుకు, హంతకులను పట్టుకునేందుకు ఎవరూ ప్రయత్నించలేదు. సి.పి.ఎం. ఆధ్వర్యంలో రెండవ ఐక్యసంఘటన ప్రభుత్వకాలంలోని దేశీయాంగశాఖ కలకత్తా పోలీసుల సంస్కరణను తలపెట్టింది. చిన్నదైనా, కీలకమైన ఈ రక్షకయంత్రాంగంలోకి చొరబడి విచ్ఛిన్నం చేసి మెరుపుదాడి చెయ్యాలనే వ్యూహం ప్రకారం, సి.పి.ఎం. తన మనుషులను ఆ శాఖలోకి ప్రవేశపెట్టింది. విశ్వాసపాత్రంగా తయారయ్యే ఆ యంత్రాంగం యధాస్థితిని (Status quo) పరిరక్షిస్తుందని వాళ్ళాశించారు. పోలీసు దళంలోని సి.పి.ఎం. అనుయాయులు కలకత్తా పోలీసు సంఘాన్ని ఏర్పరిచారు. అనేక మంది ఉన్నత పోలీసు అధికారులు సి.పి.ఎం. మంత్రుల పక్షానికి తాత్కాలికంగా ప్లేటు ఫిరాయించారు. దీంతో ఆ రోజుల్లో పోలీసు దళంలో అసంతృప్తి చోటు చేసుకుంది. ప్రత్యేకించి సంవత్సరాల తరబడి కృషివల్ల ఏర్పడ్డ నేరపరిశోధక విభాగం దెబ్బతింది. బ్రిటిషు రాజ్యకాలంలో తీవ్రవాద జాతీయ నాయకులను వేటాడడంలోనూ, 1947 తరవాత వామపక్షవాదులను వేటాడటంలోనూ, ఆరితేరిన ఈ విభాగం ఒక్కసారిగా మొద్దుబారింది. ఎందరో అతిరథులు కదల్చబడ్డారు. ఆ శాఖను నిర్వహించేందుకు

---

* *ఇంగ్లండులోని రహస్య పోలీసు దళ శిక్షణా సంస్థ. వామపక్షపార్టీలు కలకత్తాలో నాటి కాంగ్రెసు ప్రభుత్వ ఆహార విధానానికి నిరసనగా నిర్వహించిన బ్రహ్మాండమైన రైతు ప్రదర్శనలో పోలీసులు కాల్పులు జరిపారు.*

** *1967లో ఈడెన్ గార్డెన్‌లో క్రికెట్ మాచ్ జరిగినప్పుడు ప్రేక్షకులపై పోలీసులు కాల్పులు జరిపారు.*

కొత్త వాళ్ళను నియమించారు. రెండవ ఐక్యసంఘటన ప్రభుత్వం పతనమైన కొద్ది రోజులకే 1970 మార్చి–ఏప్రిలు మాసాలలో సి.పి.ఐ. (మా.లె.) పార్టీ జరిపిన దాడులతో వాళ్లు మేల్కొన్నారు. వాళ్ళసలే అంతరంగికంగా అసంతృప్తితో, అయోమయంలో ఉన్నారు. మొదటి దశలో సి.పి.ఐ. (మా.లె.) నగర గెరిల్లాల సవాలుకు వాళ్లు సరితూగలేకపోయారు. 1970 అక్టోబరు చివరకు ఈ దాడులలో 25 మంది పోలీసులు చనిపోయారు. 350 మంది గాయపడ్డారు.

ఎన్నడూ ఎదురులేని తమ దండం ఒక్కసారిగా పనిచెయ్యకపోగానే పోలీసులు విభ్రాంతి చెందారు. ఇన్నాళ్ళుగా పట్టుబడక విజయవిహారం చేసిన పోలీసు తాబేదారులను చంపడం, మెరుపుదాడి చేసి పోలీసు అధికారులను చంపడం, నాటుబాంబులతో పోలీసు వాహనాల్ని ధ్వంసం చెయ్యడంలాంటి చర్యలు పోలీసులలో సంచలనాన్ని కలగజేసాయి. ఒంటిగా యూనిఫారంలో తిరగడానికి కూడా భయపడసాగారు. పోలీసు అధిష్టాన వర్గం పరిస్థితి విషమించిందని ఒప్పుకుంది. తాల్తాలాలో 1970 జూన్ 15వ తేదీన జరిగిన మఫ్టీపోలీసు హత్యా సమాచారాన్ని పత్రికల వారికి వివరించిన పోలీసు కమీషనర్ పి.కే. సేన్, "అటువంటిదాడులు పోలీసుదళపు ధైర్యానికి హానికరం" అంటూ వాపోయాడు. పట్టపగలు హత్యలు జరుగుతున్నా కూడా సామాన్య ప్రజలు పట్టించుకోలేదని విచారించాడు. ఆ ప్రాంతంలోని వాళ్లు ఆ సంఘటనను చూసే ఉండాలి. ఆ తరవాత హంతకులను పట్టుకోవడంలో కూడా పోలీసులతో సహకరించేందుకు ఎవరూ ముందుకు రాలేదని వాపోయాడు.[12]

సి.పి.ఐ. (మా.లె.) పార్టీ దాడుల పట్ల స్థానిక పోలీసులు నిస్సహాయులయ్యారు. నాటి జూలైలో కేంద్రదేశీయాంగ కార్యదర్శి ఎల్.పి. సింగ్ కలకత్తా వచ్చి పోలీసు అధికార్లతో మంతనాలు జరిపాడు. "నక్సలైటు ప్రమాదాన్ని ఎదుర్కోవడంలో స్థానిక పోలీసుల విజయాలేవీ చెప్పుకోదగ్గవి కావని" అంగీకరించారు. కాబట్టి సరిహద్దు భద్రతా దళాన్ని (Border Security Force) కేంద్ర రిజర్వుదళాన్ని (C.R.P.) మరింతగా ఉపయోగించుకోవాలనుకున్నారు.[13]

రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో మిగతా విభాగాల వారు కూడా సహనాన్ని కోల్పోయారు. తరువాత విధించిన రాష్ట్రపతి పాలన కాని, ఐదుగురు సలహాదారులను గవర్నరుకు సాయపడేందుకు నియమించినందువల్ల కాని పరిపాలన మెరుగుపడలేదు. జగల్పురి ప్రభుత్వ ఇంజనీరింగు కళాశాల భవనంపై ఎగిరిన ఎర్రజెండా ఉదంతం దీనికి చక్కటి ఉదాహరణ. ఆ జెండాను కిందకు దించవలసింది ఎవరు, అని జగల్పురి

జిల్లా పరిపాలక యంత్రాంగం 15 రోజుల పాటు తర్జనభర్జనలు జరిపింది. కొన్ని సందర్భాలలో పోలీసు యంత్రాంగం, పౌర పరిపాలనాయంత్రాంగం వ్యతిరేక దిశలలో పనిచేసాయి. పశ్చిమ బెంగాలు ఐ.జి., గోడల మీది మావోయిస్టు నినాదాలను చెరపాల్సిందిగా జారీచేసిన ఆదేశాన్ని, ముర్షిదాబాదు జిల్లా మెజిస్ట్రేటు, "హాస్యాస్పదంగా" ఉందని పేర్కొంటూ దాన్ని కొట్టిపారేసాడు.[14]

పాత వ్యవస్థకు పోలీసులూ, పరిపాలనా యంత్రాంగం, రెండూ, రెండు చేతుల్లాంటివి. 1970 మధ్య కాలానికి దేశంలో మిగతా ప్రాంతాలలో లాగే పశ్చిమ బెంగాలులో కూడా ఆ చేతులు రెండూ అస్తవ్యస్తంగ ఉన్నాయి. రాజ్యాంగసౌధం తుదివరకూ కూలిపోయేలా చేసేందుకు, ప్రజలలో బూర్జువా రాజ్యాంగ యంత్రాంగంపై గల భయాన్నీ నమ్మకాన్నీ తుడిచిపెట్టేందుకు బహుశః తలపెట్టిన ఆ చర్యలో సి.పి.ఐ.(మా.లె.) పార్టీ తమ అంచనాలను మించి సాధించింది. సి.పి.ఐ.(మా.లె.) పార్టీ 1970 నవంబరులో పోలీసులనుద్దేశించి ఒక ప్రకటనను చేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకుంది.

తాము కూడా (అంటే పోలీసులు) పెట్టీ బూర్జువా వర్గాల నుంచి, రైతుల నుంచీ, కార్మికుల నుంచీ వచ్చారనే సంగతిని గుర్తు చేసి, "తమ తుపాకులను తమ అధికార్లపై తిప్పి, వ్యావసాయిక విప్లవంలో చేరాల్సిందని" పోలీసు జవాన్లనూ ఇతర దిగువ స్థాయి సిబ్బందిని కోరింది. విప్లవకారులకు వ్యతిరేకంగానే నిలబడదల్చుకుంటే తమ కామ్రేడ్లపై జరిపే ప్రతీహత్యకూ ప్రతీకారంగా వాళ్ళను చంపాల్సి వస్తుందని హెచ్చరించింది.

## ఆయుధాల సేకరణ – నిల్వ

ఈలోగా ఆ సంవత్సరం అక్టోబరులో నక్సల్బరీకి ఎదురుగా గల మగర్జాన్‌లో ఒక అద్భుతమైన సంఘటన జరిగింది. బీహార్‌లోని పూర్నియా పశ్చిమ బెంగాలులోని డార్జిలింగ్, పశ్చిమ దినాజ్‌పూర్‌లు కలిసే ప్రాంతంలో గల ముక్కోణ ప్రదేశం అది. బీదరైతులు, భూమిలేని రైతులతో ఏర్పడిన ఒక గెరిల్లా దళం మరో పోలీసుదళాన్ని ఎదుర్కొని వాళ్ళ తుపాకులను లాక్కున్నారు. చారుమజుందారు ఆ సంఘటనకు ఎంతో ప్రాముఖ్యత నిచ్చాడు. "బెంగాలు రైతుల యొక్క ప్రజావిమోచన సైన్యపు పుట్టుకగా" దాన్ని కొనియాడాడు.(47)

నక్సల్బరీ ప్రాంతపు బీదరైతులూ, భూమిలేని రైతులే ఈ దాడి చేసిన దళంలో ఉండడం ఈ సందర్భంలో గమనించాలి. ఈ సంఘటన నక్సల్బరీలో గల పాత

నాయకులందరూ చాలా మంది అరెస్టయ్యాక జరిగింది. 1969లో విడుదలై మళ్ళీ సమీకరణ మొదలెట్టిన కానుసన్యాలు 1970 ఆగస్టులో అరెస్టయ్యాడు. సెప్టెంబరులో జంగల్ సంతాలును కూడా పట్టుకున్నారు. 11 మంది కార్యకర్తలు మాత్రం మిగిలారు. "జోతేదార్లను చంపడం వల్లనే మన ప్రభావాన్ని వ్యాపింపచెయ్యలేం. ఇంకా గొప్ప పనినే చేపట్టాలి. తుపాకులను లాక్కుంటే మంచిది" అని వాళ్ళనుకున్నారు. తరువాత పోలీసు చుట్టివేతను అధిగమించి బీహారులోని మగర్జున ప్రాంతపు కామ్రేడ్లతో సంబంధాలు ఏర్పర్చుకున్నారు. అక్టోబరు 27వ తేదీ సాయంకాలం మగర్జున వైపు నుంచి పోలీసులను ఎదిరించారు. తాము సంగ్రహించిన తుపాకులతో "మావో సేటుంగు వర్ధిల్లాలి! చారమజుందారు వర్ధిల్లాలి! అంటూ నినాదాలు చేస్తూ గ్రామంలోకి వచ్చారు. రైతుల నుద్దేశించి ఇలా అన్నారు. "మన కామ్రేడ్లను అరెస్టు చేసినా ప్రభుత్వం మన పోరాటాన్ని ఆపలేకపోయింది. మేం తుపాకులను కొల్లగొట్టి వచ్చాం! చూడండి!"[15] పోలీసు చుట్టివేతను విచ్ఛిన్నం చేసి శత్రువలయాన్ని బయట నుంచి ఎదిరించడం వంటి వ్యూహం 'మగర్జున దాడి' పద్ధతిలో చూచాయగా రూపొందించ బడింది.

ఆ తరువాత నగరాలలోనూ, గ్రామాలలోనూ సి.పి.ఐ. (మా.లె.) కేడర్లకు తుపాకీలను లాక్కుపోవడం ప్రధాన లక్ష్యమైంది. కొందరు కలకత్తా యువకులు ఏమరుపాటుగానున్న పోలీసులపై దాడిచేసి ఎంతో సాహసంగా వాళ్ళ తుపాకీలను లాక్కొనేవారు. ప్రతీ ఒక్క విజయంతో గెరిల్లాల సాహసం మరింతగా పెరిగింది. ఒకానొక దశలో కలకత్తాలోనూ దాని చుట్టుపక్కలా పోలీసుల తుపాకీలను సంగ్రహించడం నిత్యవినోదమైంది. తోలు బెల్టులకు ఇనుపగొలుసులతో రైఫిళ్ళను కట్టుకోవలసిందని పై అధికారులు పోలీసులనాదేశించారు. అలా తమ రైఫిళ్ళను కట్టుకున్న సి.ఆర్.పి. పోలీసులు 1970–71 సంవత్సరాలలో హాస్యాస్పదంగా కనిపిస్తూ తిరిగేవారు. 1970 ఏప్రిలు 1వ తేదీ నుంచి నవంబరు 12వ తేదీల మధ్యలో, ప్రభుత్వ సమాచారం ప్రకారం, సి.పి.ఐ. (మా.లె.) పార్టీ దాడులలో 36 మంది పోలీసులు చనిపోగా, మరో 400 మంది గాయపడ్డారు.

పదివేల నుంచి ఇరవై వేల దాకా గల పశ్చిమ బెంగాలు సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కార్యకర్తలలో సగం మంది తమ కార్యకలాపాలను విశాల కలకత్తా ప్రాంతంలోనే (1970) నవంబరు నాటికి కేంద్రీకరించారని పోలీసుల అంచనా. సాధారణ పౌరుల సానుభూతి సంపాదించే ప్రజాహిత చర్యలను కూడా ఈ యువవిప్లవకారులు తమ ఏలుబడిలోని ప్రాంతాలలో చేపట్టారు. ఉత్తర కలకత్తాలోనూ, కేంద్ర కలకత్తాలోనూ గల సంఘ విద్రోహశక్తులను హెచ్చరిస్తూ కొంతమందిని చంపారు. డాక్టర్లనూ

స్పెషలిస్టులనూ హెచ్చు ఫీజులు గుంజవద్దని బెదిరింపుగా లేఖలు రాశారు. కొంతకాలం పాటైనా తమ ఆశయాలను సాధించారు.

## ప్రతిదాడి

మరోవైపు ప్రభుత్వం కూడా, తన కండల్ని పెంచుకుని, తిరగబడేందుకు తగిన అవకాశం కోసం చూస్తోంది.

సి.పి.ఐ. (మా.లె.) నగర చర్యలకు ప్రతిగా ప్రభుత్వం అనేక దిశలలో చర్యలు తీసుకుంది. ఆగ్నేయాసియా దేశాలలో ప్రభుత్వ ప్రతీకార చర్యల మూసలోనే అవి కూడా ఉన్నాయి. స్థానిక పోలీసుల వల్ల ప్రయోజనం లేనందున సి.ఆర్.పి. దళాల్ని దించింది. అంతులేని సి.పి.ఐ. (మా.లె.) చర్యల దృష్ట్యా, ఒకానొక దశలో పశ్చిమ బెంగాలులోని నాడియా జిల్లాలోని క్రిష్ణనగర్ మొత్తం పట్టణాన్ని మిలిటరీపరం చేసారు.

పోలీసు దమనకాండకు చట్టపరమైన పవిత్రతను సంక్రమింపజేసేందుకు ఎన్నో రాక్షస చట్టాలను అమలుచేస్తారు. బ్రిటిషువలస రాజ్యకాలంలో భారత విప్లవకారులపై ప్రయోగించిన దుష్టచట్టం, బెంగాల్ టెర్రరిస్టుల అత్యాచారాల అణచివేతచట్ట (1936)పు Bengal Suppression of Terrorists Outrages Act (1936) అధికరణాలు వెంటనే అమలుకు వచ్చినట్టు 1970 సెప్టెంబరు 10వ తేదీన పశ్చిమ బెంగాలు ప్రభుత్వం ప్రకటించింది. 1947 తరువాత ఆ చట్టాన్ని మొదటిసారిగా ఉపయోగించారు. అనుమానితులైన ఎవరినైనా 24 గంటల పాటు పోలీసులు నిర్బంధించే వీలును ఈ చట్టం కల్పిస్తుంది. తీవ్రచర్యలకు ఉపయోగించ వచ్చుననే అనుమానంపై నివాసాలను, ఆయుధాలను స్వాధీనం చేసుకోవచ్చు. అటువంటి భావాలను ప్రచారం చేసే సాహిత్యాన్ని స్వాధీనం చేసుకోవచ్చు.

సి.పి.ఐ. (మా.లె.) పార్టీ నగర గెరిల్లాలపై పోలీసుల ప్రతీకార చర్య, 1970 చివరి భాగం నుంచీ వేగం పుంజుకుంది. కేంద్రం సైన్యాన్ని, పారామిలటరీ దళాల్ని దించి వాళ్ళను అణచసాగారు. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కేడరుగాని, మద్దతుగాని పట్టుబడితే నిర్దయగా వ్యవహరించేవారు. 1970 సెప్టెంబరు 25వ తేదీన జరిగిన సంఘటన దానికో ఉదాహరణ. పోలీసులు కొద్ది గంటలలోగా, నలుగురు యువకులను కాలేజీ వీధి ప్రాంతంలో కాల్చి చంపారు. ఆ నలుగురిలోనూ ఒకరు చంపబడ్డ సమయానికి అరెస్టులో ఉన్నాడు. సి.పి.ఐ. (మా.లె.) రహస్య స్థావరాలనే వాటిని తమకు చూపమని పోలీసులు ఆ యువకుడిని నిర్బందించి, భవానీదత్తు వీధికి తీసుకువెళ్ళి అతన్ని చంపేశారు. నాలుగో వ్యక్తికి సి.పి.ఐ. (మా.లె.) పార్టీతో ఎలాంటి

సంబంధమూ లేదు. చేతులెత్తి (లొంగుబాటు సూచకంగా) కాలేజీ గేటులోంచి తన క్లాసుకు వెళ్లే అతనిని పాయింట్ బ్లాంకురేంజిలో కాల్చి చంపారు. ఈ సంఘటనపై వ్యాఖ్యానించిన ఒక బెంగాలీ పత్రిక తన సంపాదకీయంలో ఇలా రాసింది.

"తమ రాష్ట్ర ప్రజలూ, నగర ప్రజలూ తమ వేటకై ఉన్న జంతువులు కారని పశ్చిమ బెంగాలు పోలీసు అధికార్లు, కలకత్తా పోలీసులు గుర్తించడం మంచిది... నిజానిజాలేవైనా నిందితులూ అమాయకులూ కూడా బాధ్యతారహితమైన పోలీసుల తుపాకీగుళ్ళకు బలై పోతున్నారు."[16]

ఆ కాలంలో ధైర్యం తగ్గి, భయం పెరగగా, పెచ్చురిల్లిన బహుముఖమైన పోలీసు నిర్దాక్షిణ్యాన్ని, నాటి బూర్జువా పత్రికలు చేసిన బూర్జువా రాజ్యపు వర్ణనలు చూడండి. "... (ఉత్తర కలకత్తాలోని) మస్జీద్‌బారీ వీధిలోని కాళీపూజా ఉత్సవాలను తిలకిస్తున్న ప్రముఖ నక్సలైటు నాయకుడు బీరేంద్ర దేవనాథ్ అనే 22 సంవత్సరాల యువకుడిని బుధవారం నాడు రాత్రి పోలీసులు కాల్చిచంపారు. ఈ సంఘటనను స్వయంగా చూసిన వాళ్ళు పత్రికల వారికిలా చెప్పారు. దేవనాథ్ కుర్చీలో కూర్చొని ఉత్సవాలను చూస్తున్నాడు. మైకులో ఏదో ప్రకటన చేస్తున్నారు. పోలీసులు పందిట్లోకి వచ్చి దేవనాథ్‌ను పాయింటు బ్లాంకురేంజిలో కాల్చారు. అతను కుర్చీలోనే కుప్పకూలి పోయాడు."[17] "బెలియాఘాటాలోని సి.ఐ.టి. భవనాల్ని నవంబరు 17వ తేదీ అర్ధరాత్రి ఒక పెద్ద సాయుధ పోలీసు దళం చుట్టుముట్టి అక్కడి 556 ఫ్లాటులన్నీ సోదా చేసి దాదాపు 1000 మందిని అరెస్టు చేసారు వారిలో నలుగురిని ఒక స్క్వేర్‌లో వరసగా నిలబెట్టారు. తుపాకీగుళ్ళతో వాళ్ళ శరీరాలను తూట్లు చేసి చంపారు. ఎదురు కాల్పులు జరిగిన ఛాయలేమీ లేవు..."[18]

ఆ రోజుల్లో పశ్చిమబెంగాలు ఎలాంటి పౌరసూత్రాలు అమలులో లేని యుద్ధభూమిగా మారిందని చెప్పొచ్చు. శత్రువును చంపడమే ముఖ్య ధ్యేయం. అరెస్టులు, విచారణలు వంటి న్యాయతతంగాలకు కాలం తీరిపోయింది. చారుమజుందార్ దాన్ని ఒక "అంతర్యుద్ధకాలం"గా వర్ణించాడంటే పొరపాటు కాదు.

రెండవ దుష్టచట్టాన్ని 1970 నవంబరులో అమలుపరిచారు. రాష్ట్రపతి వి.వి.గిరి పశ్చిమబెంగాలు హింసాయుత చర్యల నిరోధచట్టంపై. (West Bengal Prevention of Violent Activities Bill) ఆమోదముద్ర వేశాడు. వారంటు లేకుండా అరెస్టు చేయడంతో సహా ఎన్నో విస్తృతాధికారాల్ని ఆ చట్టం పోలీసులకు దత్తం చేసింది. కొన్ని మాసాలుగా వాళ్లు నెరపే ఘాతుకాలకు ఆమోదం వచ్చింది. బహుశా న్యాయపరమైన మర్యాదలను పాటించటం లేదని ప్రభుత్వాన్ని విమర్శించేవాళ్ళను

మభ్యపరిచేందుకు దాన్ని రూపొందించి ఉండొచ్చు; వ్యవస్థానుకూల పత్రికల సంపాదకీయాలను బట్టి వాళ్ళకు 'నక్సలైట్ల'ను చంపడం పట్ల ఏమీ అభ్యంతరం లేదనీ, ఎటొచ్చీ వాళ్ళ విషయంలో అనుసరించే పద్ధతుల గురించే వాళ్ళకు అభ్యంతరాలున్నాయనీ తెలుస్తుంది. ఆ పత్రికల దృక్పథం ప్రకారం తన వ్యతిరేకులను చంపేటప్పుడు కూడా, ప్రభుత్వం అనేక తతంగాలనూ నిబంధనలనూ నిర్మించి మరీ చంపాలి. 'శాంతి భద్రతలను' పరిరక్షించేందుకైనా ఇది అవసరమే.

వాగాడంబరంతో విలసిల్లే చట్టసముదాయం సాయంగా, నిండు సరంజామాకల సైనికదళం మద్దతుతో, పోలీసులు తమ విధ్వంసాన్ని ఆరంభించారు. రాజకీయంగా అనుమానించిన వాళ్ళను స్పృహ పోయేలా కొట్టి, లాకప్ నుంచి బయటకీడ్చి, తూటాలతో శరీరాన్ని తూట్లు చేసి, శవాలను వీధుల్లోకి విసిరేసేవారు. తీవ్ర శిక్షలు అమలు జరిపి ప్రజలను భయభ్రాంతులను చేసేందుకు శవాలను రోజుల తరబడి చెట్లకు వేలాడదీయడం ప్రదర్శనకై తలను వేలాడదీయడం వంటి మధ్యయుగపు పాశవికచర్యల నవీనరూపం అది. దాదాపు హతులందరూ తమ తమ ఇళ్ళ నుంచి అరెస్టయి, ఆయుధాలు లేకుండా సోదా చేయబడినవారే కావడం వల్ల, పోలీసు కథనాలని ఆయా హతుల బంధువులు సవాలు చెయ్యసాగారు.

1970 నవంబరు నెలలో ఒక రోజు ఉదయం, కలకత్తా పరిసరాలలోని బరాసత్ రోడ్డుపై చేతులు వెనక్కు విరిచి కట్టిన 11 మంది యువకుల శవాలు కనిపించాయి. "ప్రజల నుంచి విడిపోయిన ఈ పాశవికమైన కసాయి పోలీసులు ప్రజలకు ఎంత దూరమయ్యారో తెలిపే" "ప్రబల నిదర్శనం"గా ఈ హత్యల్ని చారుమజుందారు వర్ణించాడు. "ప్రతీ విప్లవకారుడూ" ఈ "వీరుల ప్రతీ హత్యకూ ప్రతీకారాన్ని" తీసుకుంటానని ప్రతిన పూనాలన్నాడు.(46)

శత్రువు తన 'కార్యక్రమాన్ని' ప్రారంభించగానే సి.పి.ఐ. (మా.లె.) విప్లవకారులు ఒక నిర్దాక్షిణ్యమైన తీవ్ర సంఘర్షణ స్థాయికి తాము చేరుకున్నట్టు గ్రహించారు. అత్యాశ్చర్యకరమైన నిర్భీతినీ, పెచ్చురిల్లిన ప్రభుత్వ ధిక్కారాన్నీ, దాని దారుణ అరాచకత్వంపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. ఆ యుద్ధం కంటికి కన్నూ, పంటికి పన్నూ (tit-for-tat) పద్ధతిలో సాగింది. పోరాటం ప్రజ్వరిల్లింది. పశ్చిమ బెంగాలులో గల జిల్లాలన్నిటిలోనూ గెరిల్లా చర్యలు మొదలయ్యాయి. పోలీసు యంత్రాంగం, పౌర పరిపాలన సంక్షోభంలో పడ్డాయి. పశ్చిమ బెంగాలు ఇనస్పెక్టరు జనరలు, పరిస్థితిని, ధైర్యంగా, క్రమశిక్షణతో ఎదుర్కోవాలని ఒక సర్క్యులర్‌లో పోలీసులను కోరాడు. యుద్ధంలో ప్రత్యర్థులను ఎదుర్కొనేటప్పుడు వచ్చే మాదిరి ప్రమాదాలను ఎదుర్కోడానికి

సిద్ధంగా ఉండాలన్నాడు. నాగాలాండ్, మిజోకొండలు, ఇండో-టిబెటన్ వంటి సరిహద్దు ప్రాంతాల పరిస్థితులతో దీన్ని పోల్చాడు.

సర్ రాబర్టు థాంప్సన్ కమ్యూనిస్టుదాడుల నిరోధం-ఎత్తుగడలపై రాసిన పుస్తకంలోని కొన్ని ఏర్చికూర్చిన భాగాల ప్రతులను పి.కె.సేన్ తరవాత కలకత్తా పోలీసు కమీషనర్‌గా వచ్చిన రంజిత్‌గుప్తా తన సిబ్బందికి పంచాడు. 19 సర్ రాబర్టు 1961 నుంచి 1965 దాకా వియత్నాంలో బ్రిటిషు కలకత్తా పోలీసులకు తిరుగుబాటు నిరోధక పద్ధతులలో శిక్షణ ఇవ్వవలసి వచ్చిందంటే, పరోక్షంగానైనా సి.పి.ఐ. (మా.లె.) పట్టణ గెరిల్లాలను గణనీయమైన శక్తిగా భావించినట్టే కదా?

నగర చర్యలు మరింతగా వ్యాపిస్తున్నాయి. కేంద్ర రిజర్వు పోలీసులు (సి.ఆర్.పి.), తూర్పు సరిహద్దుదళం (Eastern Frontier Rifles), సరిహద్దు భద్రతాదళం, (BSF) వంటి అర్ధసైనిక దళాల నిర్దాక్షిణ్యభీభత్సం కొనసాగుతున్నప్పటికీ, 1970 చివర నుంచి 1971 రెండవ పాదం దాకా పశ్చిమ బెంగాలు జిల్లాలన్నిటా పోలీసులు (కార్యకర్తల చేతుల్లో) చస్తూనే ఉన్నారు. మందుగుండునూ, ఆయుధ సామాగ్రినీ, పట్టుకుంటూనే ఉన్నారు, స్థానిక గూండాలకూ, దుష్ట కాంగ్రెసువాదులనూ, గెరిల్లాలు చంపుతూనే ఉన్నారు. బర్ద్వాన్ జిల్లాలోని పారిశ్రామిక నగరాలలోని కార్మిక వర్గాల విప్లవ విభాగాలను సమీకరించడంలో సి.పి.ఐ. (మా.లె.) విజయాన్ని సాధించింది. ఒక్క దుర్గాపూర్‌లోని కార్మిక స్క్వాడ్లు అక్టోబరు ఆఖరుకూ, నవంబరు ఆఖరుకూ మధ్య తొమ్మిది మంది పోలీసులను చంపారు. గెరిల్లాలు అసన్‌సోల్‌లో ఒక సి.ఆర్.పి. వాహనంపై దాడిచేసి ఒక పోలీసును చంపారు. అసన్‌సోల్, బర్నాపూర్ బొగ్గు గనుల ప్రాంతాలలో గల పోలీసు గూఢచార్లు, సి.ఆర్.పి. సిబ్బంది, దొంగ వెధవలు, వడ్డీలను పీల్చే జలగవెధవలు, గెరిల్లాల తుపాకులకు బలవుతున్నారు. అటువంటి స్క్వాడు ఒకటి 1970 నవంబరులో బర్ద్వాన్ జిల్లాలోని బర్హాటా పోలీసు పోస్టుపై దాడి చేసింది. సి.పి.ఐ. (మా.లె.) నగర గెరిల్లాలు కూడా ఇదే కాలంలో పశ్చిమ బెంగాలు నగరాలలో ప్రభుత్వాధికారులపైనా, ధనిక వ్యాపారులపైనా దాడి చేసారు. నాడియా, బీర్భుం, 24-పరగణాలు, హౌరా, మిద్నపూరు జిల్లాలలో అటువంటి వాళ్ళను ఎంతో మందిని గెరిల్లాలు చంపారు.

పోలీసులు తమ చర్యలను కలకత్తాలో కేంద్రీకరించినప్పటికీ నగర గెరిల్లా చర్యలు సాగుతూనే ఉన్నాయి.

బెహలా ఏర్‌స్ట్రిప్పు (చిన్న విమానాశ్రయం) వద్ద గెరిల్లాస్క్వాడు 1971, ఫిబ్రవరి 21వ తేదీన ఒక పోలీసు స్థావరంపై దాడి చేసి 9 తుఫాకులను 300 రౌండ్లు

మందు గుండు సామాగ్రినీ స్వాధీనం చేసుకున్నారు. మరునాడే మరో పోలీసు స్థావరంపై దాడిచేసి తుపాకులను సంగ్రహించారు. పోలీసు పికెట్లపైనా, సైనిక గస్తీ దళాలపైనా మెరుపుదాడులు చెయ్యడం ఆ రోజుల్లో మామూలైంది. 1971 మార్చి 9 తేదీన కలకత్తా దగ్గరున్న సంతోష్‌పూర్ రైల్వే భద్రతా దళాన్ని ఒక దళం కత్తులతో చాకులతో ఎదుర్కొని, ఇద్దరిని చంపి, ఒకరిని గాయపరిచింది. మూడు తుపాకులు, మరికొన్ని తుపాకీగుండ్లనూ పట్టుకు పారిపోయారు. దగ్గరలోని సరిహద్దు భద్రతా దళ సిబ్బంది వాళ్ళను చుట్టుముట్టాలనుకోగా గెరిల్లాలు వారిపై కాల్పులు జరిపి పారిపోయారు.

నగర చర్యలకు తోడుగా గ్రామాలలో కూడా భూస్వాములనూ పోలీసులనూ కూడా చంపుతూనే ఉన్నారు. ఈ అధ్యాయంలోనే ముందు వర్ణించిన 1970 అక్టోబరు నాటి మగర్జునా సాహసచర్య, స్తబ్దమైన స్క్వాడ్లను ఉత్తేజపరచింది. అంతవరకూ పోలీసు "చుట్టుముట్టును" సహించిన దేబ్రా-గోపీవల్లభపూరులోని గెరిల్లాలు 1970 మార్చిలో తిరిగి తమ చర్యలు మొదలెట్టారు. మార్చి 19వ తేదీన చుట్టివేతను (encirclement) ఛేదించి పశ్చిమ బెంగాలు బీహారు సరిహద్దులో గల బహరా గోరా ప్రాంతంలోని రూపాస్కండీ పోలీసు స్థావరంపై గెరిల్లా స్క్వాడు దాడి చేసింది. లెక్కలేనన్ని తుపాకీగుండ్లనూ, 9 తుపాకీలనూ పట్టుకున్నారు. ముగ్గురు సాయుధ పోలీసులన్ని చంపారు. పశ్చిమ బెంగాలు బీహారు ప్రభుత్వాలు సంయుక్తంగా గెరిల్లాలనూ తుపాకులనూ పట్టుకునేందుకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. గెరిల్లాలు తమ స్థావరాలకు జేరుకున్నారు. ఈ ఆయుధాలతోనే వాళ్ళు మార్చి 15వ తేదీ దాడిలో గోపీవల్లభపూర్ ప్రాంతపు బాషోరా గ్రామానికి చెందిన 'అంచల్ ప్రధాని'*ని, అతని సోదరుణ్ణీ, వాడి ఇద్దరు కొడుకులనూ చంపారు. హతులు గతంలో ఒక సి.పి.ఐ. (మా.లె.) కేడరును చంపారు. ఆయా గ్రామాలలో జరిగిన పోలీసు బీభత్సకలాపాలకు గతంలో వాళ్ళు సారథ్యం వహించారు.

విస్తృతంగా జరిగిన ఇటువంటి సి.పి.ఐ. (మా.లె.) చర్యలతో పోలీసుల్ని 'నక్సల్ భయం' ఆవహించింది. ఆ భయంతో, పిరికి తనంతో వాళ్ళు నిస్సహాయులూ, నిరాయుధులూ, ఐన జైళ్ళలోని ఖైదీలను కాల్చి చంపారు.

1970 డిసెంబరు 17న దేబ్రా-గోపీవల్లభపూర్ విప్లవకారులను నిర్బంధించిన మిద్నపూరు సెంట్రల్‌జైల్లో ఖైదీలపై కాల్పులు జరిపారు. దాదాపు ఎనమండుగురు

---

* *పంచాయితీ సమితి ప్రెసిడెంటు – అను*

నిరాయుధులైన ఖైదీలు చనిపోయారు. మరో 60 మంది గాయపడ్డారు. తరువాతి సంవత్సరపు ఫిబ్రవరి 4న పోలీసులు అదే జైలులో జరిపిన కాల్పుల్లో మరో ఇద్దరు చనిపోయారు. అరవై మంది గాయపడ్డారు. అదే రోజున ప్రెసిడెన్సీ జైలులోని కాల్పులలో 24 మంది గాయపడ్డారు. ఫిబ్రవరి 21న బెర్హంపూరు జైలులోని పోలీసు కాల్పులలో 10 మంది చనిపోయారు. 62 మంది గాయపడ్డారు.

మిద్నపూరులోని హిజ్లి జైలులో, సామ్రాజ్యవాదులు 1920లలో కూడా అలాగే ఖైదీలను కాల్చి చంపారు. 1949లో నెహ్రూ ప్రభుత్వం కూడా డమ్ డమ్ జైలులోనూ ప్రెసిడెన్సీ జైలులోనూ అలాగే కాల్పుల్ని జరిపింది. ఈ జైలులో జరిగిన సామూహిక హత్యాకాండ కూడా ఆ వరవడిలోనిదేనని చారుమజుందారు అన్నాడు. ఆ హత్యాకాండ ప్రజల యొక్క విప్లవచైతన్యాన్ని మరింతగా ప్రజ్వలింపజేస్తుందన్నాడు. ప్రతి హత్యకూ, ప్రతీకారాన్ని తీర్చుకోమని అనుయాయులను కోరాడు (49). ఈ దమనకాండకు తగిన ప్రతీకారం తీర్చుకోవాలనే కేడర్లు కూడా భావించారు. వాళ్ళు జైళ్ళలోనే గెరిల్లా స్క్వాడ్లుగా ఏర్పడి, అవకాశం రాగానే కాపలాదళాలపై దాడిచేసి, జైళ్ళ నుంచి తప్పించుకున్నారు.

## జైళ్ల నుంచి పరారీలు

అనతి కాలంలోనే నగర చర్యలకు గ్రామీణ చర్యలకు తోడు జైలు పరారీలు కూడా సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమంలో భాగమయ్యాయి. 1970 డిసెంబరు 20న ఒక సి.పి.ఐ. (మా.లె.) ఖైదీని కోర్టుకు తీసుకుపోయే పోలీసువ్యానుపై (పశ్చిమ దినాజ్‌పూర్‌లో) ఒక స్క్వాడు దాడిచేసి, ఆ ఖైదీని విడిపించారు. 1971 జనవరి 30వ తేదీన ముగ్గురు సి.పి.ఐ. (మా.లె.) ఖైదీలు డార్జిలింగ్ జిల్లాలోని కర్సియాంగు జైలు నుంచి తప్పించుకున్నారు. ఆలీపూరు సెంట్రలు జైలు నుండి బరాసత్ కోర్టుకు కొనిపోబడుతున్న 5గురు ఖైదీలు సంకెళ్ళతో సహా విడిపించుకు పారిపోయారు. 24 – పరగణాలలోని రాజర్హాట్‌కు చెందిన సి.పి.ఐ. (మా.లె.) కేడర్లు 1971 జనవరి 28న ఒక సాహసం చేసారు. వాళ్ళను పోలీసులు డమ్‌డమ్ సెంట్రలు జైలు నుంచి బరాసత్ కోర్టుకు తీసుకుపోతున్నారు. వ్యాన్‌లోని సాయుధ కాపలా పోలీసుల్ని ఆ ఖైదీలు ఎదుర్కొన్నారు. వాళ్ళనుంచి రెండు తుపాకులను లాక్కుని పోలీసు అధికారిపై ఎక్కుపెట్టారు. ఏడుగురు ఖైదీలు వ్యాన్ నడుస్తూండగానే దూకేశారు. పోలీసులు వారిలో ఇద్దర్ని పట్టుకోగలిగారు. 5గురు పారిపోయారు.

వీటికి పరాకాష్టగా 1971 ఫిబ్రవరి 21వ తేదీన సిలిగురి సెంట్రలు జైలు

సంఘటనను పేర్కొనవచ్చు. పార్టీ ప్రముఖ కేడర్లతో సహా 11 మంది విప్లవకారులు ఆ జైల్లోంచి పారిపోయారు. ఎంతో జాగ్రత్తగా పథకం వేశారు. బయట గల కామ్రేడ్లు గేటు కాపలాదార్లను ఎదుర్కొని తాళాలను లాక్కొని గేట్లు తెరిచారు. పోలీసులను మభ్యపెట్టి పట్టపగలు సిలిగురి వీధుల్లోకి మాయమయ్యారు. పారిపోయినవాళ్లు తరువాత పార్టీకి సమర్పించిన నివేదికలలోని కొన్ని భాగాలు గమనార్హం. విప్లవకారుల వ్యక్తిగత శౌర్యానికి తోడు, ఆ సంఘటనలు అరెస్టయిన సి.పి.ఐ. (మా.లె.) సభ్యుల విషయంలో, సి.పి.ఐ. (మా.లె.) పార్టీ వైఖరిని కూడా తెలుపుతాయి. "మమ్మల్ని కటకటాల వెనక తోయగానే ఎదురైన ప్రశ్న: ఈ విద్రోహకర ప్రభుత్వం తయారు చేసిన చట్టాల సాయంగానే మనం పోరాడాలా? తరగతి*ని కోరాలా, అనే సమస్యపైనే జైలులో ఘర్షణ మొదలైంది. న్యాయవాదుల సాయం కోరాలా, వద్దా అనే సమస్య కూడా వచ్చింది... చర్చల తరవాత ఇలా నిర్ణయించుకున్నాం. జైలు బయట గల మన కామ్రేడ్లు ప్రాణాల్ని కూడా లెక్క చెయ్యకుండా పోరాటాన్ని ముందుకు తీసుకుపోతున్నారు. జైళ్ళలో ప్రాణరక్షణ మార్గాన్ని ఎలా చేపడతాం? తరగతి కోసం ఘర్షణను మొదలెడితే, భారత ప్రజల కష్టాలను మరచి మనగురించి మనం పోరాడుతున్నట్టే అవుతుంది... ఈ దృక్పథంతో రివిజనిస్టు వ్యతిరేక పోరాటం చేస్తూ, జైలులో పోరాటాన్ని తీవ్రతరం చేసాం. నినాదాలు రాయసాగాం. 'మావోసేటుంగ్ వర్ధిల్లాలి! చారుమజుందారు వర్ధిల్లాలి!' అని గోడల మీదా, గిన్నెల మీదా, ఎక్కడపడితే అక్కడ రాశాం. జైలు అధికారులు దీనికి అడ్డుపడ్డారు. మా మొండి పట్టుదల ముందు వాళ్ళు నిలవలేకపోయారు. తిండి మొదలగు విషయాలలో ఎలాంటి పోరాటాన్ని ప్రోత్సహించలేదు. అమలులో గల జైలు నిబంధనలకు వ్యతిరేకంగా పోరాటాన్ని సాగించాం..."[20]

1970 మధ్య కాలం నుంచీ భారీస్థాయిలో జరిగే కమ్యూనిస్టు విప్లవకారుల అరెస్టులతో జైళ్లు నిండిపోయాయి. సి.పి.ఐ. (మా.లె.) నాయకత్వం జైళ్ళలో గల కామ్రేడ్ల పట్ల తన వైఖరిని రూపొందించుకోవలసి వచ్చింది. చారుమజుందారు 1970 సెప్టెంబరులో ఇలా అన్నాడు. "జైళ్ళలో అనుసరించే విధానం పోరాటం ద్వారానే నిర్ణయమౌతుంది"(42)

అదే సంవత్సరంలో జైళ్ళలో గల కామ్రేడ్లనుద్దేశించి రాసిన లేఖలో సరోజ్‌దత్తా,

---

* *సామాన్యంగా రాజకీయ ఖైదూలు ఒకటో డివిజనుకు అర్హులు. వాళ్లకు మిగతా ఖైదీలకంటే బాగా సదుపాయాలు ఉంటాయి.*

జైళ్ళలో సంఘర్షణల గురించి మార్గదర్శక సూత్రాలను పేర్కొన్నాడు. "మనం జైళ్ళలో కూడా కమ్యూనిస్టు విప్లవకారులు గానే మన స్వేచ్ఛాగౌరవాలకై పోరాడాలి. అదే మన పార్టీ ప్రధాన సూత్రం. జైలు అధికారులు మన వర్గ శత్రువులకు ప్రతినిధులు. మనల్ని నిర్బంధించడమే మనపై వాళ్లు తలపెట్టిన శత్రుచర్య. మనం ప్రతిచర్యలను జరుపుతూనే ఉండాలి. వాళ్ళు మనల్ని చిత్రహింసలు పెడతారు. అంతేకాక మన పోరాట పటిమను విచ్ఛిన్నం చేసేందుకు అనేకమైన మెత్తటి మార్గాలను అనుసరిస్తారు. ఇతరులకంటే మంచి ఆహారం, బట్టలు ఇవ్వడం, మనతోటి మాట్లాడుతుంటే చిరునవ్వులు చిందిస్తారు. తరగతి ఇవ్వడం కూడా ఆ పద్ధతిలో అంతర్భాగమే. వాళ్లు అందరికీ సమానమైన సాంఘిక గౌరవాన్ని చూపరు. సమానగౌరవం చూపాలని వాళ్ళపై ఒత్తిడి చేస్తాం. అలా ఒత్తిడి చేసేటప్పుడు మనం కమ్యూనిస్టులుగానే ఉంటాం. ఈ పార్టీ యొక్క వైఖరిని ఎలా అమలు చేయాలనే విషయం మీకే వదులుతున్నాం." "జైలు బైటనున్న కామ్రేడ్లు జైల్లోని కామ్రేడ్లు ఎప్పుడు బైటకు వస్తారా అని ఎదురు చూస్తున్నారు. మేజిస్ట్రేటులు ఇచ్చే బెయిళ్లు, విడుదలతో కాదు. ఇతర పద్ధతుల ద్వారా, అంటే అంతర్యుద్ధ కాలంలో విప్లవకారులు జైళ్ళనుంచి వచ్చే మార్గాలలో..."[21]

న్యాయసహాయం, బెయిలు వగైరాలు నిరాకరిస్తూ, ఖైదీలు మొండిగా ప్రవర్తిస్తున్నారని పార్టీలో కొందరు భావించారు. పాలకవర్గాలు నిర్మించిన చట్టాలలోని లోపాలు వినియోగించుకోకపోవడం తెలివితక్కువ. ఆ లోపాలు విద్రోహకర వ్యవస్థ బొడ్డుకింద నున్న మెత్తటి భాగాలుగా పేర్కొన్నారు. ఒక సంవత్సరం తరువాత పెరిగిన సిద్ధాంత వివాదాలలో పార్టీ యొక్క జైలు వైఖరిలో విబేధాలు కూడా ఒక అంశమైంది. పార్టీలో చీలిక వచ్చాక చారుమజుందారు ప్రతి కక్షులు న్యాయపరమైన ప్రతివాదానికై లాయర్లను నియమించుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ, పశ్చిమబెంగాలులోనూ లీగల్ ఎయిడ్ కమిటీలను (Legal Aid Committees) ఏర్పరచి డిటెన్యూలకు న్యాయ సహాయాన్ని కలగజేసారు.

సరోజ్‌దత్తా బెయిలు నిరాకరించాలనీ, తరగతినీ, న్యాయ ప్రతివాదాన్ని నిరసించాలని, 1970-71లో ప్రతిపాదించినప్పుడు, పవిత్రతావాదిగానే కనిపించి ఉండవచ్చు. కాంగ్రెసులోనూ, వామపక్ష రాజకీయాలలోనూ గల, పెట్టీ బూర్జువా అవకాశవాదపు సుదీర్ఘ చరిత్రదృష్ట్యా, ఈ విధమైన తీవ్ర పవిత్రతా వైఖరి అవసరమనే అనిపిస్తుంది. బ్రిటిషు వలస పాలనలో విప్లవకారులు ఖైదీలుగా చిత్రహింస లనుభవించారు. ప్రభుత్వం వాళ్ళను నిర్దాక్షిణ్యంగా చంపింది. వాళ్లు తమ కోర్కెల సాధనకై నిరాహార దీక్షలు చేసారు. కాంగ్రెసు ఖైదీలు రాచమర్యాదలు పొందారు.

1947 తరువాత వామపక్ష పార్టీ నాయకులు కూడా అహింసాయుత 'సత్యాగ్రహో'ద్యమాలలో అరెస్టయి అదే రాచమర్యాదలను పొందారు. వారిలో కొందరికి తమ ఇళ్ళకంటే జైళ్ళే ఎంతో సదుపాయంగా ఉండేవి. కొన్ని సందర్భాలలో పెట్టీబూర్జువా నాయకులకు మొదటి తరగతినిచ్చి, వాళ్ళతోటే అరెస్టయిన రైతాంగ కార్మిక కేడర్లను సాధారణ ఖైదీలుగా పరిగణించారు. పెట్టీబూర్జువా నాయకుల కేసుల్ని పోరాడేందుకూ, బెయిలుకూ, డబ్బున్న పెట్టీబూర్జువా నాయకుల బంధుమిత్రులు ముందుకు వచ్చేవారు. వామపక్ష పార్టీల బీదవర్గాలే దగాపడిపోయేవారు, సి.పి.ఐ.(మా.లె.) పార్టీనాయకత్వం తమ పార్టీకి ఒక ప్రత్యేక రూపాన్నిచ్చేందుకు ఎందుకు ప్రయత్నించిందో దీనివల్ల మనకు అర్థమౌతుంది. శత్రువు ఎర చూపిన సదుపాయాలతో రాజీ పడిపోవడానికి ఒప్పుకోకపోవడంతో, అరెస్టయిన పార్టీ సభ్యులు పొంతనగల విప్లవకారులుగా తమను తాము ప్రజల ముందు నిలబెట్టుకుని, నిజాయితీగా పీడిత ప్రజలతో తాదాత్మ్యం చెందిన పార్టీగా, సి.పి.ఐ. (మా.లె.) పార్టీని నిరూపించేందుకు పూనుకున్నారు.

జైల్ల నుంచి తప్పించుకుని బయటకు రావాలనడం కూడా, బహుశః ఒక విప్లవ పార్టీ పలుకుబడి పెరిగేందుకు అవసరమే. ఈ అర్థవలస పాలక వర్గం రూపొందించిన న్యాయసూత్రాలతో తమను రక్షించుకొని, అదే న్యాయవ్యవస్థను కొనసాగించేందుకు కుమ్మక్కయ్యే 'రివిజనిస్టుల'కూ, దాన్ని కూలదోయడానికి పూనుకున్న విప్లవకారులకూ, మధ్య గల తేడాను నిరూపించుకునేందుకు కూడా, ఈ వైఖరి అవసరమైంది.

## ప్రమాద సంకేతాలు

సి.పి.ఐ. (మా.లె.) పార్టీని అంతమొందించేందుకు జరిగే శత్రు చర్యలకు బదులుగా, ఒకవైపు వీరోచిత చర్యలు జరుగుతూండగానే, నగర యువజనోద్యమంలో అవాంఛనీయ చిహ్నాలు కూడా పొడసూపాయి.

గ్రామ ప్రజల గురించి వర్గవిశ్లేషణ జరిగినట్టు, పట్టణ ప్రజల వర్గ విశ్లేషణ జరగలేదు. వాళ్ళ పట్ల స్పష్టమైన (వర్గ) విధానం లేని నగర గెరిల్లాలు విద్యా సంస్థలనూ, పోలీసులనూ, పాలనాధికారులనేకాక చిన్న వ్యాపారస్థులను కూడా ఎదుర్కోసాగారు. దీంతో అది వరకు నగర మధ్య (తరగతి) బూర్జువాలలో గల సానుభూతిని, చాలా వరకు కోల్పోయారు.

చారుమజుందారు కూడా, ఒక దశలో, అట్టి చర్యల పట్ల, ఆగ్రహావేశులైన కేడర్లను హెచ్చరించాడు. వ్యాపారస్థులపై దాడులనుదహరిస్తూ రాసిన లేఖలో, "వ్యాపారస్థ

లందరూ శతృవులు కారని గుర్తించుకోవాలి. విముక్త ప్రాంతం ఏర్పడగానే తమ ప్రయోజనాల దృష్ట్యా, మనతో సంబంధాలు ఏర్పరచుకొంటారు.” కార్మికులు, రైతాంగం, పెట్టీబూర్జువావర్గం, వ్యాపారవర్గంతో నిర్మించిన ఐక్యసంఘటన గురించి మావోచేసిన వక్కాణింపునుదహరించాడు. “ఓ విధంగా, వ్యాపార వర్గంలో చాలా మంది మనతో కలిసి వస్తారు. వాళ్లే జాతీయ బూర్జువా వర్గంలో ప్రధాన భాగం.” విప్లవకారులకు హాని చెయ్యాలనే దళీరీ బూర్జువాల గురించి చారుమజుందారు. “.... ఒకటి రెండు ఖతం చర్యలు అవసరమవ్వచ్చు”(48) అని భావించాడు.

ఆందోళనలో అంతర్భాగమైన పశ్చిమ బెంగాలు ప్రాచీన (వంగ) సంఘ సాంస్కృతిక వ్యవస్థపై జరిగే దాడివల్ల కూడా ప్రమాదం ఏర్పడసాగింది.

సమాజపు అట్టడుగు పొరల కిందున్న, కుళ్లు కంపు కొట్టే కల్మషమే, నగరలంపెన్ కార్మిక వర్గం. దానికి చెందిన వాగన్ దోపిడిదార్లు, స్మగ్లర్లు, వృత్తిరీత్యా హంతకులు, దొంగలు, మొ॥ దోపిడీదార్లు కూడా సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమంలో దూరసాగారు. పాత కక్షలను తీర్చుకునే ప్రతీకారాలు కూడా ‘నక్సలైట్’ గెరిల్లా చర్యలుగా చలామణి కాసాగాయి. నక్సలైట్లను అప్రతిష్ట పాల్జేసేందుకు, ఎలాంటి హింసాత్మక సంఘటననైనా పోలీసులు సి.పి.ఐ. (మా.లె.) పార్టీకి ఆపాదించేవారు. బహుశః తాము చంపిన ‘వర్గ శతృవుల’ జాబితాను పెంచుకునేందుకేమో; అలాంటి రాజకీయేతర చర్యల్ని కూడా తమవిగానే ప్రకటించుకున్నారు. ఆ విధంగా, ఉద్యమ ద్వారాలు చీకటి ప్రపంచపు అంధ శక్తులకు (ఏమరపాటుగా) తెరుచుకున్నాయి. అది దుష్ఫలితాలకు నాంది పలికింది. తగిన సమయం రాగానే పోలీసులు దీన్ని తమకనుకూలంగా ఉపయోగించుకున్నారు.

## సి.పి.ఐ. (మా.లె.) – సి.పి.ఎం.

విప్లవకారుల తీవ్రత వ్యర్థమయే మరో కొత్త పరిణామం వచ్చింది. 1971 (నూతన) సంవత్సరారంభంలో రాబోయే ఎన్నికల కారుమేఘాల భయానకచ్ఛాయలు పశ్చిమబెంగాలు రాజకీయాకాశంలో అలముకోసాగాయి.

సి.పి.ఎం. – సి.పి.ఐ. (మా.లె.) కేడర్ల మధ్యగల పాత కావేషాలు మరింత తీవ్రమయ్యాయి. పరస్పర విరోధం, అనుమానం ప్రాతిపదికలుగా ఆయా పార్టీల నాయకులు, అనుచర వర్గాలలో, విరోధ భావాన్ని పెంచసాగారు. పార్లమెంటరీ అధికారాన్ని దక్కించుకోవాలనే తమ కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేసేందుకే, కాంగ్రెసుతో చేతులు కలిపిన విద్రోహకూటమిగా, సి.పి.ఐ.(మా.లె.) పార్టీని సి.పి.ఎం. తలచింది.

సి.పి.ఐ.(మా.లె.) పార్టీ సి.పి.ఎం.ను, ప్రజాపోరాటాన్ని పెడదోవపట్టించే నయా రివిజనిస్టుల పార్టీగా భావించింది. రెండు పార్టీల అనుచరుల మధ్య ఘర్షణలు ఎక్కువయ్యాయి.

1970ల చివర నుంచీ మధ్యంతర ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. 1969లో ఇచ్చినట్టే ఈసారి కూడా సి.పి.ఐ.(మా.లె.) ఎన్నికలు బహిష్కరించాలని పిలుపునిచ్చింది. ఆ పిలుపును అమలుపరిచేందుకు నగర గెరిల్లాలు చురుకైన చర్యలతో ఎన్నికలను ఆటంకపరచేందుకు ప్రయత్నించారు. 'చావేశరణ' మంటూ అభ్యర్థులను బెదిరించారు. 'బోత్ దిలే పార్బేలాష్' (నువ్వు ఓటు చేస్తే నీ శవం వీధిలో ఉంటుంది), అని ఓటర్లను బెదిరించారు. తరువాత పార్టీ నాయకత్వం అలాంటి నినాదాలను గర్హిస్తూ జారీచేసిన అంతరంగిక ఆదేశాల మాటెలా ఉన్నా కలకత్తాలో, పశ్చిమ బెంగాలులో గోడలన్నీ అలాంటి నినాదాలతో నిండిపోయాయి. సామాన్య పౌరులను బెదిరించి, భయపెట్టి, తమ ఆశయాలను సాధించాలనుకున్న సి.పి.ఐ. (మా.లె.) పట్ల పట్టణ మధ్య తరగతి వర్గాలలో గల పలుకుబడి చెడిపోయింది. పార్టీ శతృవులు, ప్రత్యేకించి కాంగ్రెసు పార్టీ (వర్గాలు) తమ రాజకీయ ప్రత్యర్థులపై నెరపిన దాడులను 'నక్సలైటు చర్యలు'గా చలామణీ చేసారు.

సి.పి.ఎం. నాయకుడు, పి.సుందరయ్య తరువాత చేసిన ప్రకటనలో తమ సభ్యులు, అనుయాయులు, నాయకులతో సహా 206 మందిని 'నక్సలైట్లు' చంపారని పేర్కొన్నాడు.[22] కాని, చాలా మటుకు ఈ హత్యల్ని కాంగ్రెసు నుంచి లంచాలు మేసిన దుండగీడులే చేసారు. 'నక్సలైట్లు'గా చెప్పుకుని వాళ్లు ఈ తప్పుల్ని కాంగ్రెసుకు అంటకట్టక, సి.పి.ఐ. (మా.లె.) పార్టీకి ఆపాదించారనేందుకు కారణాలున్నాయి. సి.పి.ఐ. (మా.లె.) కేడర్లు, కొన్ని ప్రాంతాలలో మాత్రం సి.పి.ఐ. సభ్యులనూ, అనుచరులనూ, చంపారు. 1971 జనవరి – మార్చి 'లిబరేషన్' సంచికలోని సమాచారాన్ని బట్టి, అసన్‌సోల్‌లో, "పోలీసు తాబేదారుగా పనిచేసే, సి.పి.యం. ప్రముఖ కార్యకర్త చంపబడ్డాడు... ఒక వారంలో నవద్వీపంలో ఇద్దరు సి.పి.యం. కార్యకర్తలను చంపాం... భూస్వాముల ఏజెంటు, దుష్టవడ్డీ వ్యాపారస్తుడు, స్థానిక సి.పి.యం. ముఖ్యుడు; గోపాల్‌దాస్ ఠాకూర్‌ను గెరిల్లా కామ్రేడ్లు, టేకి వద్ద చంపారు... చండీతాలా పోలీసు స్టేషను ప్రాంతంలో, గెరిల్లాస్క్వాడు, పోలీసు ఏజెంటు, దుష్టశక్తి, సి.పి.యం. మద్దతుదారుడు; 'కానాతాపి'ని ఖతం చేస్తారు... "వర్గశతృవులు పోలీసు ఏజెంట్లు, అధికార్లేకాక కలకత్తాలో "పోలీసు రహస్య తాబేదారులుగా పనిచేసే సి.పి.యం. గూండాలుకూడా చస్తున్నారు"

కాని, 1971 ఆగస్టులో, సి.పి.ఐ. (మా.లె.) పార్టీ సభ్యులనూ, సానుభూతిపరులనూ వేటాడి, నరికిచంపిన సంఘటనలలో సి.పి.యం పార్టీ చరుకైన కార్యకర్తలు పోలీసులతో సహకరించారనే అభియోగాలున్నాయి.

సి.పి.యం. మరొకందుకుకూడా భయపడసాగింది. 1971 మార్చిలో జరగబోయే ఎన్నికలకు అది సిద్ధమౌతోంది. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ నగర చర్యలు యథాస్థితిని విచ్ఛిన్నపరచి, ఎన్నికలపథకాలను తలక్రిందులు చేస్తాయేమో! ఎన్నికలతేదీలు దగ్గిరపడుతూంటే ఘర్షణలుకూడా పెరిగాయి. తన మద్దతుదారులు సులువుగా ఓటు వేసేందుకై 'నక్సలైటు శక్తుల' ఆయువుపట్టుగానున్న ప్రాంతాలను నిష్కంటకం చేయబూనుకుంది. కలకత్తాలోనూ దానిపరిసరాలలోనూ గల తమ తమ పలుకుబడి, ఆధీనంలో గల ప్రాంతాలను వేరుపరుచుకున్నారు. ఒక పార్టీ వ్యక్తులు, మరోపార్టీకి చెందిన ప్రాంతంలోకి వెళితే, వాళ్ళను ఆ పార్టీవాళ్లు చంపేశేవారు. ఆ విధంగా ; అంతులేని దాడులు, ప్రతిదాడులు, హత్యలు, ప్రతీకారాలతోనిండిన క్రూర చక్రపు కదలికలకు నాంది జరిగింది. పరస్పరంకొట్టుకొని, చంపుకొని, రెండు పార్టీల కార్యకర్తలలో చాలా భాగం నశించిపోగా, పోలీసులకు మంచి అవకాశం వచ్చింది. పెట్టీబూర్జువా నాయకుల దిగజారిన మోసపూరితమైన విలువల దృక్పథంతో, చీకటి ప్రపంచపు క్రూరసాంప్రదాయాల ప్రాతిపదికగా గల అర్థరహితద్వేషం, క్రూరమైన చిత్రహింసలతో నిండిన బుద్ధిలేని హత్యాకాండ విలయతాండవం చేసింది. కాని, సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కాంగ్రెసుతో చేతులు కలిపిందనే, సి.పి.ఎం. చేసిన అభియోగం ఎంత మాత్రం నమ్మదగింది కాదు.

1971లో పశ్చిమబెంగాలులో, దేశమంతటా; గ్రామాలలోనూ, పట్టణాలలోనూ పోలీసులూ, గూండాలూ, సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కేడర్లను ఏరి చంపుతున్న పచ్చి నిజాన్ని గుర్తించాలి. సి.పి.ఐ. (మా.లె.) పార్టీయే నేటి ప్రభుత్వపు ప్రధానశతృవు. ఎన్నికలలో మెజారిటీని మాత్రమే సంపాదించే పరిమితాశయం, సామర్థ్యంకల సి.పి.యం. పై ప్రభుత్వానికి సామాన్యంగా అలాంటి ప్రతిపక్షంపై ఉండే తాత్కాలికమైన కోపమే ఉంటుందనే సంగతిని, తరువాతి సంఘటనలు కూడా రుజువు చేసాయి.

## కలకత్తాలో పోలీసు కార్యకలాపాలు

సి.పి.ఐ. (మా.లె.) పార్టీలో లంపెన్ కార్మికవర్గాలు చొచ్చుకుపోయాయి. సి.పి.యం.కూ దానికీ గల పోరుతో, మధ్యతరగతి ప్రజల్లో జుగుప్స ఏర్పడ్డది. సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమంలో తలెత్తిన ఈ లోపాలను కలకత్తా పోలీసులు తమకనువుగా

మలచుకున్నారు. ఒక యుద్ధ నిపుణుడిలా అన్నాడు. "శైశవదశలో ఉండే ఉద్యమం అనుభవరహితంగానే ఉంటుంది. దాన్ని విచ్ఛిన్నంచేసేందుకు అందులోకి మనుషుల్ని పంపడం చాలా సులువు. అలా దాన్ని తప్పుదారి పట్టించొచ్చు." విచక్షణలేని, విస్తృతమైన పోలీసు భీభత్సం పనికి రాలేదు. దానితో కలకత్తా పోలీసులు మరింత శాస్త్రీయమైన, నికార్సయిన పద్ధతులను చేపట్టారు. సర్వసంయుతమైన, విచ్ఛిన్నకరమైన ఏజెంట్లను, గూఢచార్లను, గూండాలను కీలకస్థానాలలోకి చొప్పించారు.

1970 చివరలో, పోలీసులు సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కేడర్లను అనుచరులను, మూడు గ్రూపులుగా విభజించారు. మొదటిది : పూర్తైన నేరస్తులైన లంపెన్ కార్మికవర్గం. తమాషాగానో, నైరాశ్యంచేతనో, ఎలాంటి రాజకీయాలు లేకుండా జేరిన విద్యార్థులు. నిజమైన ప్రమాదంగా తయారై, సైద్ధాంతికంగా నిబద్ధులూ, నిమగ్నులూ అయిన విద్యార్థులు మూడవ తరహాలోకి వస్తారు.

నగర గెరిల్లాల ఉద్యమరంగం, పోలీసుల కార్యాచరణ రంగం ఐన కలకత్తాను కూడా వాళ్లు నాలుగు ప్రాంతాలుగా విభజించారు. 18, 19 శతాబ్దాల చాయల్ని నేటికీ కొనసాగించుకునే ఉత్తర కలకత్తా కేంద్రప్రాంతాలు, మొదటివి. ఈ ప్రదేశమంతా సందుగొందులమయం. గెరిల్లాలు అవలంభించే 'కొట్టి పారిపోవడం' (Hit and Run) ఎత్తుగడలిక్కడ బాగా పనిచేస్తాయి. వంకరటింకరగా ఉండే ఆ సందుల్లోకి పారిపోయి పోలీసుల్నించి తప్పించుకునేవారు. లేదా దారి మూసుకుపోయిన సందుల్లోకి వాళ్ళను రానిచ్చి, చితకతన్నడమో, చంపడమో చేసేవారు. అలా కొంతకాలం పాటు, కొన్ని ప్రాంతాల్లో శత్రువు చొరలేకుండా చేసేవారు. ఆ ప్రాంతాలను, 'ముక్తాంచల్' లేదా 'విముక్తి ప్రాంతాలు'గా వ్యవహరించేవారు. రెండోతరహా ప్రాంతాలున్నాయి. రైలుమార్గాల వెంబడి, కాలవగట్లమీదా, ఆ ప్రాంతాలున్నాయి. దొంగరవాణా, వాగన్లదోపిడీ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలలో రాటుదేరిన ఈ ప్రాంతం గెరిల్లాలపాలిటి స్వర్గంలా ఉండేది. బాగా ఉత్తరానగల పారిశ్రామిక ప్రాంతంలో కార్మికవర్గపు మురికివాడలున్నాయి. ఈ ప్రాంతం నుంచి పాలనా యంత్రాంగానికి ఎలాంటి ప్రమాదమూ లేదు. నగరపుదక్షిణపు కొసలో కాందిశీకుల (Refugees) కాలనీలున్నాయి. తూర్పు బెంగాలు (బంగ్లాదేశ్)లో తమ నివాసాలు వదిలివచ్చిన వీరిలో చాలామంది నిరుద్యోగులుగానే ఉన్నారు తీవ్రమైన రాజకీయచర్యలకు ఎప్పుడూ సిద్ధంగానే ఉండే వీళ్లు నిశితంగానూ, చురుగ్గానూ ఉండేవారు. ఈ ప్రాంతంలోనే సి.పి.ఎం. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఘర్షణలు తారస్థాయికి చేరుకున్నాయి. ఒకానొకదశలో, ఈ ప్రాంతంలోగల జాదవపూరు విశ్వవిద్యాలయం, ఈ రెండు పార్టీలకు

నిత్యరణరంగంగా ఉండి, దాని వైస్‌ఛాన్సలర్ గోపాల్‌సేన్ హత్యతో అవి పరాకాష్టకు చేరుకున్నాయి.

అలా నగరాన్ని నాలుగు ప్రాంతాలుగా విభజించుకుని, పోలీసులు తమ కార్యక్రమాన్ని, ఆరభించారు. మరోపేరుతో, ఈ విధంగా 'చుట్టుముట్టి – అణచివేత' (Encirclement and Suppression) కార్యక్రమాన్ని అమలుపరిచారు. దాన్ని 'ఏరివేత' (Combing)గా కూడా వ్యవహరించేవారు.

పోలీసులు ఒక ప్రాంతాన్ని తమ సైన్యంతో చుట్టుముట్టి ఇళ్ళన్నీ సోదాచేసి కనపడ్డ ప్రతీ యువకుణ్ణీ అరెస్టుచేసి, వారిలోని సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కేడర్లను ఏరి చంపేవారు, అలాంటి దాడులు జరుగుతుంటే బయటివారిని లోపలకూ, లోపలివారిని బయటకూ రానివ్వకుండా, 'ముట్టడి' పద్దతిలో జరిపేవారు. ఆ దాడులు ఒక్కొక్కప్పుడు 24 గంటలపాటు కూడా జరిగేవి. అప్పుడా బస్తీలో వాళ్ళందరూ బందీలే. ఆ సమయంలో బయటి ప్రపంచంతో వాళ్ళకెలాంటి సంబంధం ఉండేదికాదు. పట్టుబడ్డ సి.పి.ఐ. (మా.లె.) కేడర్లను వీలైనంతవరకు చంపేసేవారు. 1971 ఫిబ్రవరిలో, తూర్పు కలకత్తాలోని బాలియాఘటాలో, వారి నివాసాలనుంచి పట్టుకున్న పిల్లలను ఐదుగుర్ని వాళ్ళ తలిదండ్రుల ఎదుటే పోలీసులు కాల్చిచంపారు. ముట్టడిచేసిన ప్రాంతాల వెలుపల బాంబులేవైనా పేలితే, పోలీసులు ఆఘమేఘాలమీద అక్కడకు వచ్చేవారు. ఈ పరిస్థితులకు అలవాటుపడ్డ సామాన్య పౌరులు వీధులుదాటే సమయంలో చేతులు పైకిత్తి (లొంగుబాటుకు సూచనగా) మరీ వెళ్లేవారు. ఎందరో పార్టీ అనుచరులుగా ఉండే యువకుల్ని పోలీసులు లాకప్పులోపెట్టి చిత్రహింసలు పెట్టి వికలాంగుల్నిచేసి, లేదా హెచ్చరించి వదిలేవారు.

పోలీసులు లంపెన్ కార్మికవర్గాన్ని రెండు విధాలా ఉపయోగించుకున్నారు. కొందర్ని రెచ్చకొట్టే ఏజెంట్లు (Agent Provacateurs)గా ఉపయోగించుకునేవారు. వాళ్ళు ప్రేరేపించిన హింసాత్మక చర్యలతో, హటాత్తుగా జరిగే పోలీసుదాడుల్లో సి.పి.ఐ.(మా.లె.) కేడర్లను బహిరంగపరచేవారు. ఆ సంఘటనలు పోలీసులకు కావలసిన వారిని ఏరుకోగల 'విందు'లే. లంపెన్ కార్మికవర్గపు రెండో విభాగాన్ని మరోలా వాడుకున్నారు. నెలకు రూ 105 జీతంపై, ఒక విధమైన అనధికార హోంగార్డులుగా నియమించి, వాళ్ళను సి.పి.ఐ. (మా.లె.) పార్టీకేడర్లపైనా. నాయకులపైనా నిఘావేసి ఉంచేందుకు పయోగించుకున్నారు. వాళ్ళ అత్యాచారాలన్నీ 'నక్సలైట్ అత్యాచారాలకు ప్రజల వ్యతిరేకత'గా చెలామణీ అయ్యేవి. స్థానికులవడంచేత, వాళ్ళు తమ బస్తీలలోని సి.పి.ఐ. (మా.లె.) పార్టీ రహస్య స్థావరాలను (Hide-

outs)ను పట్టివేసేవారు. పార్టీలోని యువకేడర్లనూ, విద్యార్థులలోని నిజమైన రాజకీయవాదులనూ వీళ్లు గుర్తించేవారు. వాళ్లు పోలీసు ఆశయాల్ని అద్భుతంగా నెరవేర్చారు. ప్రత్యేకించి, 'విముక్తి ప్రాంతాలను' ఏర్పరచుకున్న ఉత్తర, మధ్య, కలకత్తా ప్రాంతాలలో వీళ్ళు పోలీసులకు ఎంతో సాయపడ్డారు. ఈ స్థానిక గూండాల సాయమే లేకుంటే, C.R.P. సైన్యాలకి ఈ ప్రాంతాలెప్పటికీ దుర్భేధ్యంగానే ఉండేవి.

సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమపు నగర కార్యకలాపాలు హింసావలయానికి మరో తొడుగును చేర్చాయి. ఈ కార్యకలాపాలను అణచడంలో పాలకవర్గపు దమననీతి పూర్తి పాశవికత్వంతో తన నిజరూపాన్ని కనపరచుకుంది. దాని దాడులు రాజకీయంగా నిబద్ధులైన కమ్యూనిస్టు విప్లవకారులకే పరిమితంకాలేదు. తన దమనకాండ పశ్చిమ బెంగాలు ప్రజలందరిపైనా సాగించి, వాళ్ళను నిలువెల్లా భయభ్రాంతుల్ని చేసింది. అట్టిసార్వత్రిక దమనకాండ సామాన్యుల కళ్ళలో వెలిగే మిరుమిట్లను తొలగిస్తుందని చారుమజుందారు ఆశించాడు. "ఈ దాడులు ప్రతీవ్యక్తీ తనచుట్టూ అల్లుకున్న పరిధుల్ని తుడిచివేస్తాయి, వాళ్ళందర్నీ ఏకంచేస్తాయి. ప్రజావళి, ఏకైక విప్లవాశయంతో మేల్కొంటుంది." (49) అని రాసాడు.

## 1971 మధ్యంతర ఎన్నికలు

మధ్యంతర ఎన్నికల తేదీలు దగ్గరయేకొద్దీ, మొత్తం పశ్చిమబెంగాలు రాజకీయ వ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని తేటతెల్లమైంది. ఈ సంక్షోభం కలకత్తాలో ప్రత్యేకంగా కనిపించింది. రాజకీయ నిబద్ధులైన ఒక మైనారిటీవర్గం ఓటర్లను భయపెట్టి, అభ్యర్థులనూ ప్రచారకులనూ ఖతం చేసి, పోలింగ్ అధికార్లను బెదిరించి, ఎన్నికల యంత్రాంగాన్ని స్తంభింపజేసి, మొత్తం ఎన్నికలనే ఆపుచేయడం, సాధ్యమేననిపించింది.

ఈ పరిస్థితులలో రాష్ట్రంలో ఎన్నికలంటూ జరిగితే, అవి ఒకతంతుగానే తయారౌతాయని పత్రికలు విలపించాయి. కాని, భారతదేశ ప్రజానీకంలో చాలామందికి ఎన్నికలనేవి ఒక తంతుగానే ఉన్నాయని బహుశః వాటి సంపాదకీయాన్ని విరచించిన పాత్రికేయులు మరిచారేమో! గ్రామ ప్రాంతాల షెడ్యూల్డుకులాల ఓటర్లపైనా, మైనారిటితెగల ఓటర్లపైనా ఒత్తిడి తేవడం మామూలే. ప్రత్యేకించి సాంఘికంగా వెలివేయబడిన ఈ జాతుల ప్రజలను దాచివేయడం, హింసించడం ప్రతి ఎన్నికలలోనూ జరుగుతూనే ఉంది. పలుకుబడి గల అభ్యర్థికి ఓటుచేయరనే అనుమానంతో ఓటర్లను హత్యచేయడం మొ॥ బీద గ్రామీణ ప్రజాజీవితాలలో నిత్యకృత్యంగా జరిగేవే. 1971

ఎన్నికలలోనే ఉత్తర భారతదేశంలో కొన్ని నియోజకవర్గాలలో వేధింపులకు గురయ్యే ప్రజలకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలనుకూడా, ఎన్నికల కమిషనర్ ఏర్పరచాడు. కాని పశ్చిమబెంగాలులో మాత్రం, పత్రికలు గందర గోళం చేసాయి. ప్రస్తుత వ్యవస్థలోని సభ్యులూ, చదువుకున్న పెట్టీ బూర్జువాలూ మొదటిసారిగా బెదిరింపులకు గురికావడమే దానికి కారణం.

ప్రభుత్వం చాలా వివరంగానే జవాబిచ్చింది. రాష్ట్ర స్థానిక పోలీసులకు తోడుగా సైన్యాన్నిదించారు. 1971 మార్చి నాలుగోతేదీన, ప్రజలను పోలింగ్‌లో పాల్గొన వలసిందిగా విజ్ఞప్తి చేస్తూ నాటి గవర్నర్ S.S. ధవన్ చేసిన ప్రసంగాన్ని బట్టి ఎన్నికలకు ముందున్న ఉద్రిక్త పరిస్థితి తెలుస్తుంది. “అల్లర్లు చేయదల్చుకున్నవాళ్ళ ఆటకట్టేందుకు గట్టిచర్యలను” ప్రభుత్వం తీసుకుందని హామీ ఇచ్చాడు. వాటిని వివరించాడు కూడా. “తగురీతిలో అల్లరి తలపెట్టేవారిని అదుపులో ఉంచేందుకై ముఖ్య ప్రదేశాలలో సాయుధ పోలీసు దళాలను ఏర్పరిచాం. అవసరమైతే కాల్చిపారేసేందుకు ఈపికెట్లకు ఆజ్ఞలిచ్చాం. 20,000 మందికల, 200 C.R.P. కంపెనీలు, పోలీసులకు ఇందుకు సాయపడతారు. దీనికితోడు, ఠాణాస్థాయి దాకా, రాష్ట్రమంతటా సైనికదళాలను ఏర్పరుస్తాం” పెద్ద పెద్ద సైనికవిభాగాలు నెరపిన ‘సోదా చర్యలను’ గురించివివరిస్తూ, “ఈ చర్యలకై సమీకరించిన సైన్యాల ఖచ్చితమైన సంఖ్యను నేను చెప్పలేను కాని, 1965 పాకిస్తాను దురాక్రమణలో యుద్ధరంగంలోని ఏ ఒక్క విభాగపు సైన్యాలకన్నా, ఈ సైన్యాల సంఖ్య ఎక్కువేనని చెప్పగలను,” ఓటర్లను రక్షించేందుకు ఇలాంటి స్థాయిలో పోలీసుల్ని సైన్యాన్ని సమీకరించిన సందర్భం మొత్తం పార్లమెంటరీ ప్రజాస్వామ్యచరిత్రలోనే లేదు.

1971 ఎన్నికల ఫలితాలు పశ్చిమబెంగాలు జనాభా రాజకీయధోరణిపై గల అంచనాలను తారుమారుచేసాయి. 1967, 1969 ఎన్నికలకంటే మెరుగుపడి, కాంగ్రెసు 105 స్థానాలను గెల్చుకుంది. సి.పి.యం నాయకత్వపు ఐక్యసంఘటన, 124 స్థానాలను గెల్చుకొన్నాకూడా ప్రయోజనంలేక పోయింది. మిగతావామ పక్షపార్టీలు, మధ్యమపార్టీలు, కాంగ్రెసుమద్దతుతో దాన్ని వ్యతిరేకించడంతో, ప్రభుత్వాన్ని ఏర్పరచలేకపోయింది. ‘అరుణనగరం’గా ప్రసిద్ధి చెందిన కలకత్తాలో సి.పి.ఐ. సి.పి.యం రెండు పార్టీలకూ పలుకుబడి పోయింది. సి.పి.ఐ. (మా.లె.) పార్టీనగర కార్యకలాపాలు, సి.పి.యం. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కార్యకర్తల మధ్య సోదర హత్యాకాండలు, అందుమూలాన వచ్చిన భారీస్థాయి పోలీసు దమనకాండలు, వాటి మూలంగా సాంఘిక జీవనంలో వచ్చిన సంక్షోభం, మొ॥ వాటితో, యధాస్థితినే

(Status Quo) కోరుకునే వర్గలక్షణం కల మధ్య తరగతి ప్రజలలో విసుగు, నిరాశ అలముకోగా, తాము గతంలో సానుభూతి చూపిన వామపక్ష భావాలకే దూరమై పోయారు. సి.పి.ఐ (మా.లె) పార్టీకి ఎన్నికల్లో నమ్మకం లేకపోవచ్చు. కాని, 1971 ఎన్నికలఫలితాలు మాత్రం, నగర మధ్యతరగతి ప్రజలలో వచ్చిన రాజకీయ (సం)చలనాన్ని, వాళ్ళలో వీచే (కొత్త) రాజకీయ ప్రభంజనాన్ని సూచించాయి. అదివరకు, సి.పి.ఐ (మా.లె) నగరచర్యలు జరిగిన అల్పకాలంలో, వాళ్లు తటస్థులుగానో, సానుభూతిపరులుగానో ఉన్నారు. ఉదారభావాలున్న ఉపాధ్యాయులు, అనిశ్చితంగానైనా, విగ్రహవిధ్వంసం, విద్యాసంస్థలపై దాడులు వంటి విషయాలలో తరచు ఉదారంగానే ఉండేవాడు. (కార్యకర్తలు) పోలీసుల్ని చంపుతూండగా చూసిన పౌరులెవరూ పట్టించుకునేవారు కారు, వేటాడబడే 'నక్సలైట్ల'కు ఆశ్రయమిచ్చేవారు. తీవ్రమైన పోలీసు దమనకాండతో, వీళ్ళు తటస్థులుగానో, (కొన్ని సందర్భాలలో) విరోధులుగానో మారారు.

పోలీసుగాలింపులు పెరిగాయి. సి.పి.ఐ (మా.లె) పార్టీ నగరగెరిల్లాలు, ఉత్తర మధ్య కలకత్తాలలో గజిబిజిగా అల్లుకున్న, సందులలోని, దుర్భేధ్యమైన స్థావరాలను పోగొట్టుకున్నారు. తమ సాహసచర్యలను కొనసాగించి, తమకు పరిచయంలేని స్థలాలలో తలదాచుకునేవారు. ఇష్టంలేని కుటుంబాల నెత్తినకూర్చుని ఆశ్రయం పొందేవారు. ఎలాగైనా ఆశ్రయం పొందాలనే సి.పి.ఐ (మా.లె) పార్టీకేడర్లకూ, వాళ్ళరక్తం కళ్ళచూడాలని తిరిగే పోలీసులకూ మధ్య, మధ్యతరగతి పౌరులు నలిగిపోయారు. అలా పారిపోయిన వారికి, (పోలీసులనుంచి) ఎదుర్కొనేందుకు సిద్ధపడే వారికి ఆశ్రయమివ్వవలసి వచ్చేది. డాక్టర్ల పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. గాయపడ్డ కామ్రేడ్లు బలవంతాన చికిత్సపొందగానే, సి.పి.యం వాళ్ళో, పోలీసులో వచ్చి బెదిరించడం కాని వివరాలకై వేధించడం కాని, చేసేవారు.

ఒక పార్టీ పలుకుబడి ప్రాంతపు ప్రజలను, రెండో పార్టీ (సి.పి.యం) వాళ్ళు అనుమానితులుగా తలచడం, రెండుపార్టీలకూ పరిపాటైంది. ప్రత్యర్థిపార్టీ కార్యకర్తల ఇళ్ళపై దాడిచేసి, వాళ్ళు చిక్కకపోతే రాజకీయాలతో సంబంధంలేని కుటుంబ సభ్యులను కొట్టడం, లేదా ఎత్తుకుపోవడం, చేసేవారు. తరచుగా చిన్నవ్యాపారస్తులూ, దుకాణదారులు కూడా దాడులకు గురికావడానికితోడు, సాంఘికజీవనంలో కలిగిన అంతరాయం మూలంగా వాళ్ళ ప్రయోజనాలు బాగా దెబ్బతిన్నాయి. వీటన్నిటితో సాధారణ ప్రజలు విసిగివేసారి, వామపక్షతత్వాన్నే (Leftism) అసహ్యించుకోసాగారు. పోలీసు పగసాధింపుచర్యల పట్ల విభ్రాంతి చెంది, భయంతో మూగపోయిన వాళ్ళు

భద్రతను కోరుకున్నారు. 1971 ఎన్నికల ఫలితాలు వాళ్ళ భయాల. ఆశల, గత (కాలపు) యథాస్థితి – జీవనపు మధుర స్మృతులను ప్రతిబింబించాయి.

పట్టణ వర్గపు మధ్యతరగతి ప్రజానీకపు సానుభూతితో, పాలకవర్గపు సి.పి.ఐ (మా.లె) పార్టీ నిరోధచర్యలు, మరింత బలపడ్డాయి. ఎన్నికలయ్యాక పశ్చిమ బెంగాలులో కాంగ్రెసు పార్టీ, తదితర సోషల్ డెమోక్రటిక్ పార్టీకలయికతో ఏర్పడ్డ 'ప్రజాస్వామ్య సంఘటన ప్రభుత్వం' ప్రజాస్వామ్యపు సాంఘిక నాటకరంగంపై జలతారు తెరలను సమకూర్చింది. మధ్యతరగతి పౌరుల నీతిసూత్రాలకనుగుణంగా కన్పించి, వాళ్ళను తృప్తిపరచింది. జరగబోయే సి.పి.ఐ (మా.లె) పార్టీవ్యతిరేక కలాపాలన్నిటిపై ప్రజామోదమనే ముద్రను ఎన్నికల ద్వారా సంతరించుకుని, తరువాతి కాలంలో అవే దమన చర్యలను మరింత నిర్ద్వంద్వంగా, అమలు జరిపారు.

## సి.పి.ఐ. (మా.లె.) పార్టీలో రెండు ధోరణుల మధ్య సంఘర్షణ

పార్టీలోని చారుమజుందారు విమర్శకులు, అప్పటికే అతను గ్రామ ప్రాంతాలకు నిర్దేశించిన ఎత్తుగడలను దుయ్యబడుతున్నారు. కలకత్తా, దాని పరిసరాలలోనూ పోలీసు దమనచర్యల మూలంగా కలిగిన నష్టాలదృష్ట్యా, ఆ విమర్శకులు మరింత బలపడ్డారు. పార్టీ నెరపిన 'అరుణభీభత్సానికి' చాలా రెట్లున్న పాలకవర్గపు తెల్లభీభత్సాని (White Terror)దే పైచేయి ఐందన్నారు. నగరచర్యల్లో చాలామట్టుకు సరైన పంథాల్లో జరగలేదనీ, పార్టీ సాధారణ పంధాకూడా, లంపెన్ కార్మికవర్గాలను ఆకర్షించేదిగానే రూపొందిందనీ వాళ్ళు భావించారు.

1971 ఎన్నికలముందు చిన్న వ్యాపారస్తులను ఖతంచేసే ధోరణిని నిరసిస్తూ, సుశీతల్‌రాయ్ చౌధురి ఇలా రాశాడు. "......మన కార్యకలాపాలలో మిత్రవర్గాలపట్ల అనుసరించే వైఖరి ఎట్టిది? 'వాళ్లు మన దగ్గరకు తప్పక వస్తారు. ఆ విషయమై మనం ఎలాంటి దిగులు పెట్టుకోనక్కరలేదు' విచక్షణ లేకుండా మిత్రవర్గాలపై దాడులు చేయడంతో మనం అలాంటి విధానాన్నే చేపట్టాము. ఉదా॥ వ్యాపారస్తులు, ఉపాధ్యాయులు మొదలగు వారిని నిర్మూలించారు" నగర చర్యలనుగురించి సుశీతల్‌రాయ్ ఇలా అన్నాడు. "........మన దేశంలో నగరాల విషయమై చైనాలోవలె చాలాకాలం వేచియుండక్కర్లేదనే అభిప్రాయాన్ని ప్రచారం చేసారు. నగరాలలోకూడా అరుణభీభత్సాన్ని నెలకొల్పగలం. ఈ విషయంలో తక్షణం గెరిల్లా పద్ధతుల్లో వర్గశత్రువును నిర్మూలించడం, ప్రభుత్వ యంత్రాంగంపై దాడిచేయడం చాలా అవసరం. విప్లవపరిస్థితుల వృద్ధిలో (గల) అసమానతను గుర్తించకుండా నూతనంగా ఏర్పడ్డ

జాతీయ అంతర్జాతీయ పరిస్థితుల పేరుతో ఇదంతా జరిగింది. ప్రజాసామ్య సోషలిస్టు విప్లవాలను ఏకకాలంలో నిర్వహించేందుకై, ఆవేశపూరితులైన విద్యార్థులను నియమించారు. విద్యావ్యవస్థను నాశనం చెయ్యడం వంటి కార్యకలాపాలను నిర్దేశించారు. ఈ కార్యక్రమాలను చేపట్టేముందు, పార్టీ కేంద్రకమిటీలో ఎలాంటి చర్చలూ జరగలేదని చెబితే చాలు"[25]

విద్యార్థులు యాంత్రికంగా జరిపిన వినాశన చర్యలన్నిటికీ సి.పి.ఐ. (మా.లె.) నగర కార్యక్రమంలో ప్రోద్బలం జరిగి, అందులో చేర్చుకున్నారని ఈ అధ్యాయంలో చేసిన సమీక్ష, దీనితో రుజువైంది. 1971 జూలైలో అషీంచటర్జీ పార్టీవైఖరి గురించి ఇలా అన్నాడు. "కార్మికవర్గంలో చాలా భాగం దాన్ని నిరాకరించగా, యువకులు, విద్యార్థులు, పెట్టీబూర్జువాలే దాన్ని ఆమోదించారు." 1970 మొదట్లో చూచాయగా అలముకొన్న అపోహలు, 1971 ఆరంభానికి విభేదానికి అనువైన దృక్పథాలుగా స్థిరపడ్డాయి. గ్రామ, నగర ప్రాంతాలలో చేపట్టిన చర్యల గురించి అసలు సమస్యలపై వచ్చిన విభేదాలు, చారుమజుందారుకూ అతని విమర్శకులకూ మధ్య విభేదాలుగా రూపొందాయి. గత సంవత్సరంలో వచ్చిన నష్టాలలో, ప్రాణనష్టం చర్చనీయాంశమైంది. 'అమరవీరుల రక్తాన్నించి కొత్తమనిషిని రూపొందించాల'ని చారుమజుందారు పట్టుదల. చావును లెక్కచేయక, శతృవును వట్టిచేతులతో ఎదిరించి వాడి తుపాకిని లాక్కోవాలన్నాడు. విప్లవకారులపై నెరపిన ప్రతి హత్యకూ ప్రతీకారంగా ఖతంచర్యలు చేయాలన్నాడు. కేడర్లను పరిరక్షించుకోవాలనే ప్రస్తావన ఏమాత్రం జరిగినా, "ఇది ఆత్మత్యాగశకం కనక (అలాంటి భావాలను) రివిజనిస్టు భావనలు"గా కొట్టిపారేశాడు. 1970లో, పశ్చిమబెంగాలులోనే, ఖతంహత్యలు 200 దాటాయి. కాని, విప్లవకారుల 'మృతవీరుల' సంఖ్య దానికంటే ఎక్కువే. ప్రభుత్వం వెలువరించిన సామూహిక దమనకాండతో పోల్చితే చెదురుమదురుగా జరిగిన ఖతంచర్యలు ఎంతో పేలవంగా కనిపించాయి. అతని పిలుపుననుసరించిన ఖైదీలు ఎంతో సాహసంతో జైళ్ళనుంచి పారిపోయి తప్పించుకున్నారు. కాని, వాళ్ళకంటే, జైళ్ళలో క్రూరంగా పోలీసుల చేతుల్లో చనిపోయిన ఖైదీలసంఖ్యే ఎక్కువ. వీటన్నిటిలోనూ (ప్రజలలోనూ, పరిస్థితులలోనూ) చారుమజుందారు గుణాత్మకమైన మార్పునే సూచించాడు. అతని విమర్శకులు మాత్రం రాసిలో తరుగును గురించి కలవరపడ్డారు. చాలా కలతచెంది. అషీంచటర్జీ ఇలా అన్నాడు. "మనుషులు యుద్ధాలలో బలికాక తప్పలేదు. కలకత్తా వీరుల జీవితాలనన్నిటినీ బలిచెయ్యాలా అని ప్రశ్నించే ధైర్యం మనకెందుకు లేదు?.....

రెండోది దేశమంతటా ఒకే రకమైన విప్లవ పరిస్థితి ఉందా లేదా అనే

విషయమైకూడా భేదాభిప్రాయాలు వచ్చాయి. 'భారతదేశం నలుమూలలా బద్దలయేందుకు సిద్దంగా ఉంది' అని చారుమజుందారు అభిప్రాయం. బీద రైతులు, భూమిలేని రైతులూ, దేశమంతటా ఒకే స్థితిలో ఉన్నారు. కాబట్టి నిద్రాణమైన వాళ్ళ తిరుగుబాటుతత్వాన్ని రెచ్చగొట్టి, దేశమంతటా సాయుధపోరాట ప్రాంతాలను ఏర్పరచ వచ్చని తలచాడు. ఆంధ్రప్రదేశ్, దేబ్రా–గోపివల్లభపూరులలో (పనిచేస్తున్న) అతని విమర్శకుల అభిప్రాయం ప్రకారం దేశంలోని రైతాంగపు రాజకీయచైతన్యం, (పోరాట) సంసిద్ధత సమంగా లేవు. కాబట్టి ఎత్తుగడలు కూడా ప్రాంతాన్నిబట్టి వేరుగానే ఉండాలన్నారు. కొండలూ, మైదాన ప్రాంతాలకు కూడా (ఇటువంటి) తేడాయే ఉంటుందన్నారు.

దీనివల్ల వచ్చే అభిప్రాయ బేధాలలో మూడోది : గెరిల్లా యుద్ధాన్ని ఎలా నిర్వహించాలనే సమస్య. చిన్నస్క్వాడ్లు వర్గశతృవులను నిర్మూలించాలనే ఎత్తుగడ పార్టీ కాంగ్రెసులో విమర్శకు గురైంది. ఎత్తుగడల అవసరాన్ని చారుమజుందారు పునరుద్ఘాటిస్తూ, దాన్ని వ్యతిరేకించే వారెవరికీ పార్టీలో చోటులేదని ప్రకటించినా, ఇంకా సందేహాలు కొనసాగాయి. తరువాత సత్యనారాయణసింగు ఇలా అన్నాడు. "... వర్గశతృవుల నిర్మూలనావిధానం ఆత్మహత్యాసదృశమని గుర్తించాం. కొంతకాలం పాటు దాన్ని అనుసరించాకనే 1970 డిశెంబరులో ఆ సంగతిని గుర్తించాం. వ్యక్తిగత శతృవులను నిర్మూలించడం, వ్యక్తి, లేదా స్క్వాడు హింసావాదానికీ, మార్క్సిజం లెనినిజానికీ, ఏమీ సంబంధం లేదు. అది ప్రజలను మూగ ప్రేక్షకులుగా చేసి, విప్లవానికి (కావలసిన) ప్రజాబలాన్నివ్వదు"

నక్సల్బరీ రోజులనుంచి (కూడా) రానురాను ఎలా ప్రాధాన్యత మారుతూవచ్చిందీ. సుశీతల్‌రాయ్ చౌధురి ఇలా వివరించాడు. ".......గతంలో దీర్ఘకాలికప్రచారం నిర్వహించక, వర్గపోరాటపు నిర్మాణాన్ని చేపట్టాలని (చెప్పిందానికి) బదులుగా, 'ప్రచారానికి ప్రాధాన్యతనివ్వడం తప్పు' అని చెబుతున్నారు," ప్రజాసంస్థలు, ప్రజాఉద్యమాలు, గెరిల్లా యుద్ధానికి "అత్యవసరం" అనే అభిప్రాయాన్ని చారుమజుందారు ఆమోదించలేదు.(28) అషీంచటర్జీమాత్రం, గ్రామప్రాంతాలలో "ప్రజాఉద్యమాలను సాయుధపోరాటాలుగా రూపొందేలా వృద్ధిచేయవచ్చు......" ననీ, నగర ప్రాంతాలలో "పోరాటాలద్వారానే కార్మికవర్గాన్ని సమీకరించలేం. వాళ్ళ ప్రజాసంస్థలనూ, ప్రజా ఉద్యమాలనూ కూడా నిర్వహించాలి..." అని భావించాడు.

పార్టీలో విభేదాలకు కారణమైన నాలుగో అంశం; ఎన్నదగిన మిత్రులు, శతృవులపట్ల చేపట్టవలసిన వైఖరి గురించిన సమస్య. భూస్వాములను

అంతమొందించాలనీ, లేదా తరిమికొట్టాలనీ చారుమజుందారు భావించాడు. అన్ని సందర్భాలలోనూ నిర్మూలననే అనుసరించకుండా, సానుభూతిపరులైన రైతులను తటస్థులుగా చేయాలనీ, ఆంధ్రప్రదేశ్ విప్లవకారులూ, సత్యనారాయణ సింగు భావించారు. చారుమజుందారుకు విశ్వాసపాత్రుడైన సరోజ్‌దత్తా నగర పెట్టీబూర్జువాలను 'విప్లవానికి మిత్రులుగా'గా భావించి, ఇలా అన్నాడు. "హటాత్సంఘటనలతో వాళ్లు విప్లవంలో చేరతారు. కొడితేకాని స్నేహితుడు, స్నేహితుడు కాలేడు. మానవ హృదయాన్ని మాటలతోనే మార్చలేం. విప్లవస్థితిద్వారానే మనసు మారుతుంది" ఇదివరలో చెప్పుకున్నట్టు. ఈ భావాలను వ్యతిరేకించి, విచక్షణలేని దాడులు చేసి పార్టీ పెట్టీబూర్జువాలకు దూరమైందని సుశీతల్‌రాయ్ చౌధరి నాయకత్వాన్ని విమర్శించాడు.

## చైనా సందేశం

సి.పి.ఐ. (మా.లె) పార్టీ దూతగా చైనా వెళ్లిన సౌరీన్‌బోసు ఈలోగా తిరిగివచ్చాడు. భారతీయపార్టీ ఎత్తుగడలపై చైనా కమ్యూనిస్టుపార్టీ అభిప్రాయాలను చారుమజుందారుకు నివేదించాడు.

సౌరీన్‌బోసు 1970-అక్టోబరు 20వ తేదీన చౌ-ఎన్-లై, కాంగ్‌షెంగ్‌లతో పెకింగ్‌లో సుదీర్ఘంగా చర్చించారు. నవంబరులో ఇండియాకు తిరిగి వచ్చాడు. పార్టీ నాయకత్వానికి తన నివేదికను సమర్పించాడు. గతంలో సాంప్రదాయాల ప్రకారం, ఇలాంటి విషయాలలో చైనా నాయకులు, భారతీయపార్టీకి ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. కాని చర్చల మధ్యలో మాత్రం, కొన్ని రంగాలలో భారతీయ పార్టీ వైఖరిపై విమర్శనాత్మకమైన అర్థం వచ్చేలా వ్యాఖ్యానించారు. తరచుగా, చర్చలమధ్యలో పార్టీ పంథాలో మార్పు అవసరమని సూచన ప్రాయంగా అన్నారు. ఒక కథనం ప్రకారం చౌ-ఎన్-లై ఇలా అన్నాడట. "ఒక దేశానికీ మరో దేశానికీ పరిస్థితులలో తేడా ఉంటుంది. కనుక ప్రతిపార్టీ వాస్తవానికనుకూలంగా మార్క్సిజం-లెనినిజాన్ని అనువదించుకోవాలి... మన పార్టీల మధ్య సుహృద్భావపూరిత స్నేహమే ఉంటుంది. పరస్పరం అభిప్రాయాలను తెలుపుకొనే సంబంధమే మనది. ఈ హద్దును మీరడం మావో అలోచనకు విరుద్ధం"

ప్రత్యేకంగా 'చైనా ఛైర్మనే మన ఛైర్మను' అనే నినాదంపట్ల చైనానాయకులు అభ్యంతరాన్ని వెలిబుచ్చారు. చౌ-ఎన్-లై ఇలా అన్నాడు. "ఒక దేశపు నాయకుణ్ణి మరో (దేశపు) పార్టీనాయకుడిగా చెప్పడం, జాతీయతా భావానికే విరుద్ధం.కార్మికవర్గం

దాన్ని అంగీకరించడం కష్టం"

భారతీయపార్టీని చీలదీస్తున్న అంశాలన్నిటినీ ఆ చర్చలో స్పృశించారు. నిర్మూలనపు ఎత్తుగడలు, ప్రజాసంస్థల పట్ల ప్రజా ఉద్యమాలపట్ల వైఖరి, ఆత్మత్యాగ సమస్యలు మొ॥ చర్చించారు. చైనాకమ్యూనిస్టుల అనుభవాలను వివరిస్తూ, 1927నాటి కమ్యూనిస్టుల అణచివేత తరవాత, విద్రోహులైన పోలీసు అధికార్లను అంతం చేసేందుకై, చిన్న గ్రూపులను ఏర్పరచామని చౌ-ఎన్-లై అన్నాడట. కాని 'ఇది కొంతకాలం పాటే జరగాలి, గ్రామప్రాంతాలలో రైతుల్ని సమీకరించాం. "వాళ్లు తుపాకీలను పట్టుకున్నారు. కాని ఎప్పుడూ ప్రజాబాహుళ్యం పైననే ఆధారపడేవారు. సందర్భానుసారంగా ప్రజాకోర్టుల్లో విచారణ జరిగాకే, మరీ కంటకులైన భూస్వాములను చంపేవారు. 1970 జూలై 'లిబరేషన్' సంచిక అందేదాకా భారతీయపార్టీ 'నిర్మూలన విధానం' (Annhilation Policy) యొక్క అసలు రూపం తమకు బోధపడలేదని కాంగెషెంగ్ సౌరీన్‌బోసుతో అన్నాడట. "చిన్నగ్రూపులు గ్రామాలలో చేసే రహస్యహత్య"గా తరువాత వాళ్లు దాన్ని అర్థం చేసుకున్నారు. 1927లో కమ్యూనిస్టులు ఓడిపోయాక, (కొందరు) వామపక్ష దుందుడుకువాదులు అనుసరించిన పద్ధతులతో కాంగ్‌షెంగ్ దాన్ని పోల్చాడు. "మొత్తం ప్రజాబలాన్ని శత్రువుపై సమీకరించి ప్రయోగించేందుకు గెరిల్లా యుద్దమొకటే మార్గం" అనే లిన్-పియా వో సూత్రీకరణను భారతీయపార్టీ అనుసరించడం సందర్భోచితంగా లేదని తలచాడు. లిన్ పియా వో జపాన్ - వ్యతిరేక యుద్ధకాలంలో ఆ సూత్రీకరణను ప్రతిపాదించాడు. *

కార్మిక సంఘాలవంటి ప్రజాసంస్థల గురించీ, ఐక్యసంఘటనల సిద్ధాంతాల

---

* *కాంగ్‌షింగ్ చెప్పింది సరిగానే కనక ఉదహరించబడితే, అతని వాదనలో ఒక ధ్వని ఉంది. 1965లో లిన్‌పియావో రాసిన 'ప్రజా యుద్ధపు విజయం చిరకాలం వర్ధిల్లాలి!' అనే వ్యాసంలో జపాన్ - వ్యతిరేక సంఘర్షణను వర్ణిస్తూ, గెరిల్లా పోరాటాన్ని గురించిన (ఆ) వివాదాస్పదమైన వాక్యాలనురాసాడు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో నడుస్తూన్న జాతీయ విమోచనోద్యమాలలో, (పై) గెరిల్లాయుద్ధపు సూత్రీకరణను ఆచరించాలని ఆదే వ్యాసంలో చెప్పాడు. అంతేకాక, 1970 ఆరంభంలో చైనాపార్టీ, ఆ సూత్రీకరణను ప్రయోగించడాన్ని ఆమోదించింది ఆ సంవత్సరం 'పెకింగ్ రివ్యూ' నం. 1లో 'ప్రజాయుద్ధవిజయం వర్ధిల్లాలి! అనే వ్యాసంలో కామ్రేడ్ లిన్ పియా వో సరైన సూత్రీకరణను "చారుమజుందారు శ్రీకాకుళానికి అనువదించాడు" అని ప్రశంసించింది. "ప్రజల మొత్తం శక్తిని శత్రువుపై కేంద్రీకరినిచి ప్రయోగించేందుకు గెరిల్లా పోరాటమొకటే మార్గం." అనే లిన్‌పియావో సూత్రీకరణను కాంగ్‌షేంగ్ 1970 అక్టోబరులో కొట్టిపారవేయడం, తరువాతి సందర్భంలో మొదలైన లిన్ వ్యతిరేకోద్యమానికి సంకేతమా?*

గురించీ చౌ-ఎన్-లై చైనా అనుభవాన్ని వివరించాడు.

"పీడించే వర్గాలలాగే, విప్లవాత్మక వర్గాలు కూడా ఐక్యసంఘటనలో ఉంటాయి. కార్మికవర్గానికీ, రైతాంగానికీ, మధ్యకల మిత్రత్వమే ధృఢమైన ప్రాతిపదిక. కాని, కార్మికవర్గం; అగ్రగామి, మధ్యమ, వెనుకబడిన భాగాలుగా చీలి ఉంటుంది. కార్మిక సంఘాలనేవి, అగ్రగామి విభాగాలతో వెనుకబడిన విభాగాలు నెరపే ఐక్యసంఘటన" "అవకాశవాద పంథావల్ల" చైనా కమ్యూనిస్టులు "నగరాలలో పొందిన గొప్పనష్టాలనూ, ప్రజలనాకర్షించలేక, వృద్ధిచెందక, బయటపడి, ప్రాణాలుపోగొట్టుకుని, గ్రామ ప్రాంతాలకు తరలిపోయి, ఎలా ప్రశాంతంగా తయారైపోయారో" వివరించాడు. 'చైనా ధైర్యమే మన ధైర్యము, చైనాపంథాయే మన పంథా' అనే వ్యాసంలో, చిన్న మధ్య బూర్జువావర్గంతోసహా, అన్నివర్గాల ప్రజాస్వామిక ఐక్యసంఘటన "దేశంలోని వివిధ ప్రాంతాలలోనూ కార్మికరైతాంగాధికారం ఏర్పడినప్పుడే" కార్మికవర్గపు నాయకత్వంలో ఏర్పరచవచ్చునని రాయడం, 'సరికాద'నీ కాంగ్‌షెంగ్ కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు.

ఆత్మత్యాగం గురించి సి.పి.ఐ. (మా.లె.) పార్టీ వక్కాణింపుల దృష్ట్యా చౌ-ఎన్-లై ఇలా అన్నాడు. "ప్రజలతో కష్టాలను పంచుకోండి. అంతేకాని వారినుండి విడిపోయి కాదు" అతను "సాహసంతో చేసేత్యాగాన్ని" వ్యతిరేకించాడు. "రహస్యంగా పోలీసులను చంపడం ఆరాచక ధోరణి. అది ప్రజలనుంచి (విప్లవకారులను) వేరుచేస్తుంది. కలకాలం నిలవదు. చైనా నాయకులు మరో అంశాన్ని కూడా వివరించారు. వ్యవసాయ సంస్కరణలపై సి.పి.ఐ. (మా.లె) పార్టీవైఖరి (గురించి సలహానిస్తూ), "ప్రసుత్తం స్పష్టమైన వ్యావసాయిక విధానం ఉండాలని" కాంగ్‌షెంగ్ అన్నాడు, "ఒక వ్యావసాయిక విధానం ఉండి, దాని ద్వారా ప్రజలను సమీకరించి, తద్వారా అధికారాన్ని పట్టుకునేందుకు పోరాటాన్ని" చైనా కమ్యూనిస్టులెలా సాగించారో వివరించాడు. కార్మికసంఘాల పట్ల భారతీయపార్టీ వైఖరి "సరిగాలేద"ని వాపోయాడు. చౌ-ఎన్-లై చెప్పినట్టు, "సామ్రాజ్యవాదాన్ని, రివిజనిజాన్ని, విద్రోహాన్ని ఎదుర్కొంటూ పుట్టిన" సి.పి.ఐ. (మా.లె) పార్టీ ఏర్పాటును మాత్రం చైనానాయకులు అభినందించారు. కాంగ్‌షెంగ్ ఇలా అన్నాడు. "మీ సార్వత్రికమార్గం సరైనదే. కొన్ని విధానాలు మాత్రమే మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనలకనుగుణంగా లేవు...... మీకు అనుభవం తక్కువ. క్రమేణా మీ సమస్యలను మీరే పరిష్కరించుకోగలుగుతారు. సాధారణపంథాలో పట్టుదలతో ముందకుపోగా పోగా, ప్రత్యేకమైన విధానాల విషయంలో జవాబులు వాటంతటవే దొరుకుతాయి" అని కాంగ్‌షెంగ్ అన్నాడు.

గతకాలపు పొరపాట్లను సరిదిద్దడం గురించి భారతీయపార్టీకి కాంగ్‌షెంగ్ సలహా: "... క్రమక్రమంగా సవరించుకోవాలి. ప్రజలభావాలనూ, ఉత్సాహాన్నీ భంగపరచ కూడదు.... ప్రజలతో సంప్రదించండి. వాళ్ళ అనుభవాన్ని సమీక్షించుకోండి. రహస్య స్థావరాలను తొలగిస్తూ, క్రమక్రమంగా సాయుధసైన్యాన్ని నిర్మించండి" కాంగ్‌షెంగ్ ఇంకా ఇలా అన్నాడు. "చారుమజుందారు నాయకత్వంలో మీకు మంచి భవిష్యత్తు ఉంటుందని నమ్ముతున్నాం" చైనా పార్టీ చారుమజుందారు రాసిన 'చైనా ఛైర్మనే మన ఛైర్మను, చైనా మార్గమే మన మార్గం' 'ఇండియాలో విప్లవాత్మక రైతాంగ పోరాటాలను భావాలను సమీకరించి ముందుకు సాగండి!' అనే రెండు వ్యాసాలను చైనా పత్రికలలో ప్రచురించలేనందుకు విచారించారు. మొదటి వ్యాసంలో "ఎన్నోసరైన విషయాలే ఉన్నా, దానిశీర్షిక" వల్ల ప్రచురించలేక పోయామన్నారు. రెండవ దానిలో, నక్సల్బరీ రైతాంగం "భూమి గురించీ, పంటగురించీ పోరాడలేదు. కాని రాజకీయాధికారం గురించి" పోరాడారనే 'తప్పుడు' అభిప్రాయం కారణంగానూ, అలాంటివే మరికొన్ని అభిప్రాయాల మూలంగానూ, రెండోదాన్ని ప్రచురించలేదన్నారు.

చైనానాయకులకూ సౌరీన్‌బోస్‌కూ మధ్య జరిగిన చర్చల సంక్షిప్త నివేదిక (గురించిన పాఠం) 1972 నవంబరు 21వ తేదీ 'మెయిన్ స్ట్రీమ్' (ఢిల్లీ నుంచి వెలువడే) సి.పి.ఐ. పత్రికలో ప్రచురించిన లేఖలోఉంది. దాంట్లో మరోరెండు విషయాలున్నాయి. మొదటిది: "అధికారాన్ని పట్టుకునేందుకు జరిగిన సంఘర్షణగానే చైనాకమ్యూనిస్టుపార్టీ నక్సల్బరీ పోరాటాన్ని బలపరచలేదు...." భారతీయ కమ్యూనిస్టుపార్టీ, భూమి సమస్యకు బదులుగా, రాజ్యాధికారాన్ని పట్టుకోవడమనే నినాదాన్ని ముందుంచుతోందని చైనా నాయకులు వాపోయారని ఈ లేఖద్వారా తెలిసింది. "విప్లవాధికారం"గా చారుమజుందారు. అనే వివాదాస్పదమైన విషయం ఆ లేఖలోని రెండో సంగతి. చైనా నాయకులిలా అన్నారట. "ఒక నాయకుడి అధికారం, పలుకుబడిని సృష్టించలేం. కాని అది ఎదుగుతుంది. వృద్ధిచెందుతుంది." సౌరీన్‌బోస్ కూడా ఈ లేఖపై సంతకం చేసిన వారిలో ఒకడైనందున, ఆ వార్త నిజమైనదేనని అనుకోవాలి.

పార్టీలోని చారుమజుందారు విమర్శకుల అభిప్రాయాలు కూడా చైనా నాయకుల అభిప్రాయాలతో అతికేలా ఉండడం గమనార్హం. 1970 నవంబరు నాటికే చైనా అభిప్రాయాలు చారుమజుందారుకు తెలిసినా. నాయకులకు, రాష్ట్రశాఖలకు కూడా వాటిని తెలియపరచలేదు. 1970–71 అంతటా సత్యనారాయణసింగు, సుశీతల్‌రాయ్ చౌధరి, అషీంచటర్జీ అవే విమర్శలు చేసినా, వారు చైనానాయకులకు తెలియబరచలేదని దీన్ని బట్టి తెలుస్తోంది. పైన ఉదహరించిన లేఖలో ఇలా ఫిర్యాదు చేశారు. "అతని

(చారుమజుందారు) అభిప్రాయంలో, మరో స్నేహపూర్వక పార్టీ అభిప్రాయాలను చర్చించేందుకై అన్ని పార్టీశాఖలకు తెలియబరచవలసింది. అలా చేయనందున పార్టీలో సందేహాలు, బేధాభిప్రాయాలు తలెత్తాయి"

చాలా కాలం తరువాత అంటే 1972 జూలైలో అతను అరెస్టయ్యాక పాలకవర్గాల చేతుల్లో దారుణంగా చనిపోతాననగా కొద్దిరోజుల ముందు. చారుమజుందారు చైనీయుల అభిప్రాయాలను వివిధ రాష్ట్రకమిటీ ప్రతినిధుల సమావేశం ముందుంచాడు. సన్నిహితులైన కామ్రేడ్ల కథనం ప్రకారం అతను "చైనా ఛైర్మనే మన ఛైర్మను" నినాదాన్ని ఉపసంహరించాలని వాంఛించాడట.

చారుమజుందారు అరెస్టుకు 20 రోజుల ముందు. తూర్పు పాకిస్తాను (బంగ్లాదేశ్) కమ్యూనిస్టు పార్టీ (మా.లె.) ప్రతినిధుల బృందం చారుమజుందారును కలిసింది. చైనా నాయకుల అభిప్రాయాలను వాళ్ళకు వివరించాడు. "చైనా ఛైర్మనే మన ఛైర్మను" వంటి నినాదం నాల్గవ కమ్యూనిస్టు ఇంటర్నేషన్‌లు ఆరంభం కాబోతోందనే అపోహకు దారితీయవచ్చు. సి.పి.ఐ. (మా.లె) పార్టీకి మావోపట్ల గల విశ్వాసానికి చైనా తప్పకుండా కృతజ్ఞతగా ఉంటుంది. కాని ఆ నినాదం కార్మికవర్గభావాలను గాయపరుస్తుంది. భారతకమ్యూనిస్టుపార్టీ త్వరగా (సాయుధ) సైన్యాన్ని ఏర్పరచు కోవాలని చైనాపార్టీ (నాయకులు) చెప్పినట్లు కూడా చారుమజుందారు అన్నాడు. ఈ రెండు అంశాలు. అంటే నినాదం గురించీ, సైన్యం ఏర్పాటు మినహా, చైనాపార్టీ, భారతీయ పార్టీ కార్యకలాపాల గురించి ఎటువంటి సమస్యలనూ లేవనెత్తలేదని వారితో అన్నాడట.

చౌ-ఎన్-లై కాంగ్‌షెంగ్‌లు లేవదీసిన అంశాలను త్రోసిపుచ్చి, రెండు అంశాలనే గుర్తించి, చైనీయుల అభిప్రాయాలను బహిరంగపరచడానికి చారుమజుందారు ఇష్టపడకపోవడాన్ని బట్టి అతని మనోవైఖరి తెలుస్తోంది. చైనా పార్టీ వెలిబుచ్చిన అభిప్రాయాలన్నిటితోనూ అతను ఏకీభవించలేదన్నమాట.

చాలా కాలం తరువాత, అంటే 1972 జూన్ - జూలై నాటికి, చైనా సూచనల దృష్ట్యా, చారుమజుందారు ఆత్మవిమర్శ చేసుకోవాలనుకున్నాడట. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కె.సి. సత్యమూర్తి* రావూఫ్‌లు, పంజాబుకు చెందిన సోహ్, అతనిని కలుసుకున్నప్పుడు చారుమజుందారు చైనా విమర్శను గురించి చర్చించాడట. పార్టీవర్గాలలో అయోమయాన్ని కలిగించి, అపార్థాలకు దారితీయవచ్చుననే చైనా సలహా దృష్ట్యానే, అభిప్రాయాలను

* *మూలంలో కె.సి. సత్యమూర్తి అని ఉంది. బహుశః అచ్చు తప్పు కావచ్చు - అను.*

వెంటనే తెలియబరచలేదన్నాడట. కాని 1972 జూన్ – జూలైలో ఆంధ్రప్రదేశ్, పంజాబ్ కామ్రేడ్లు ఆత్మవిమర్శకు (Self-Criticism) ఒప్పుకోలేదు. కొందరు అతని పంథాయే సరైనదనీ, చైనాసలహాలు భారతీయపరిస్థితులకు వర్తించవని తలచారు. సి.పి.ఐ. (మా.లె) పార్టీలో వామపక్ష ఒంటెత్తు విధానం, ఉద్యమం కొనఊపిరితో కొట్టుకుంటున్న దశలో కూడా ఎంతగా వేళ్లూనుకుని ఉందో, దీన్నిబట్టి తెలుస్తోంది.

## ఎన్నికల తరువాత పరిస్థితి

ఈలోగా, ప్రతీఘాత విప్లవ వెల్లువ వరదలా ముంచెత్తుతోంది. 1971 ఎన్నికల తరవాత పశ్చిమబెంగాలులో అడ్డూదాపులేని పోలీసు దమనకాండ సాగుతోంది. సి.పి.ఐ (మా.లె) పార్టీ అనుచరుల్నికాని, అలా అనుమానితులైన వారిని కాని, పోలీసులు, "ఊచకోతగా చంపుతున్నారు. 1971 మార్చి – ఆగస్టు నెలలో: కలకత్తా నగరం దాని పరిసర ప్రాంతాలలోనే, 1,783 సి.పి.ఐ. (మా.లె) పార్టీ అనుయాయులనూ, సభ్యులనూ చంపినట్టుగా పోలీసులే చెప్పుకున్నారు. అసలు సంఖ్య దానికి రెట్టింపు ఉండొచ్చని అనధికారవర్గాలవారు భావించారు. ప్రత్యేకించి విద్యార్థులు పోలీసు అణచివేతకు క్రూరంగా బలైపోయారు. ఈ సంఖ్యలోంచి జైళ్ళలోనే చంపబడిన వాళ్ళను మినహాయించాలి. 1971 మే – డిశెంబరు మాసాలలో, పశ్చిమబెంగాలులో దాదాపు ఆరుజైళ్ళలో నిరాయుధులైన ఖైదీలపై కాల్పులు జరిపారు.

1971 నాటి ఆ గడ్డునెలలు కలకత్తావాసుల మనసుల్లో శాశ్వతముద్రలు వేశాయి. పోలీసులు, గూండాలు, సైనికులే సాంఘికరంగంలో సర్వాధికారులయ్యారు. బలిసిన పాశవికమైన ముఖాలలో, వేటకుక్కల క్రూరత్వం తొణికిసలాడగా, విద్రోహపు తొత్తుదనం మూర్తీభవించిన పిల్లికళ్ళతో, ఉబికిన పిర్రలపై తొంగిచూచే పిడిబాకులతో, రివాల్వర్లతో, వేటకై అర్రులుచాస్తూ తిరిగేవారు. ప్రైవేటు ఆస్తికి కాపలాకుక్కలుగా ఉండే పోలీసు గూఢచార్లు, దొంగవెధవలు, కిరాయిహంతకులు ఆ కుళ్ళులోంచి మొలుచుకొచ్చారు. తుపాకీగుళ్ళతో తూట్లుపడ్డ గుర్తు తెలియని యువకుల శవాలతో వీధులునిండాయి.

ప్రతీహత్యకూ ప్రతీకారాన్ని తీర్చుకోమని తన అనుచరులను ఆదేశించిన చారుమజుందారు కూడా ఈ జోడుకుదరని యుద్ధాన్ని కొనసాగించడంలోని ఇబ్బందులను గుర్తించసాగాడు "నగర ప్రాంతాలలో నిరంతర ఘర్షణలను కొనసాగించడం సాధ్యంకాదు" అని ఒక కామ్రేడుకు రాసిన లేఖలో అంగీకరించాడు. ప్రాథమిక బాధ్యతగా, కార్మికవర్గంలో పార్టీయూనిట్లను నిర్మిచవలసిన అవసరాన్ని

నొక్కిచెపుతూ దానివల్ల చర్యలు తగ్గినా పరవాలేదు" (55) అన్నాడు. ఆ సంవత్సరాంతంలో కేడర్లను ఇలా హెచ్చరించాడు. "పోరాటంలోవచ్చే కష్టనష్టాలివి. పోరాటానికి ఎదురుదెబ్బ తగలగానే, (సహజంగానే) ఎన్నో గందరగోళాలు మొదలవుతాయి. ఆ అయోమయం నగరకార్యకర్తల్లో మరింత ఎక్కువగా ఉండొచ్చు"(66)

1971 చివరకు నగర ప్రాంతాలలో పోరాటంలో 'అఘాతం' కలిగిందని తెలుస్తూనే ఉంది. పోలీసులు తమ విధ్వంసాన్ని నిర్దాక్షిణ్యంగా కొనసాగించారు. గతంలో సానుభూతి చూపిన మధ్యతరగతి ప్రజల్లో భయం, అసహ్యం చోటుచేసుకున్నాయి. వీటి మూలంగా యువజనోద్యమం సన్నగిల్లిన మాటనిజమే. కాని దేశ సాంఘిక రాజకీయజీవితంలో నెలకొన్న జడత్వాన్ని ఆ ఉద్యమం ఒక్కసారి పట్టికుదిపింది. పశ్చిమబెంగాలులో 1970–71 తరవాత ఏదీ మునుపటిలాలేదు.

## నగర యువజనోద్యమ సమీక్ష

నగర చర్యలలో పాల్గొన్న యువకులొక విధంగా, ద్విపాత్రాభినయం చేసారు. తిరుగుబాటుకు, నిరసనకు కావలసిన విలువైన శక్తిని వాళ్ళు సమకూర్చారు. వీళ్ళ చర్యలు తరచు నిహిలిజానికి* నైతిక అయోమయాన్ని పెంచగా, ఉదారవాద విలువలకు భంగంవచ్చి, ఎదురుదెబ్బలు తగిలాయి. దానంతటదే (Sponteneous) పెల్లుబుకడమే యువజనోద్యమపు ముఖ్యలోపం. గతంలో రైతాంగపు యాదృచ్ఛిక (Sponteneous) చర్యలను ఆకాశానికెత్తినట్టే, సి.పి.ఐ (మా.లె) పార్టీ, నగరాలలో దానంతటగా ఉబికి వచ్చిన యువజనోత్సాహపు వెల్లువలనూ అలాగే పొగిడింది. కాని, రైతాంగ జనబాహుళ్యపు అనియంత్రిత నాశన శక్తికి, నగర మధ్యతరగతి యువకుల ఆవేశాత్మక విధ్వంసకత్వం ఒకే తరహాకు చెందవు.

"ఈ వేళ్ళతో మా డబ్బును లెక్కపెట్టావు. ఈ చేతులతోనే మా తిండిని కొల్లగొట్టావు!"** అని నినదించి గతంలోని సంతాలు తిరుగుబాటు దారుడు పరమదుర్మార్గుడైన వడ్డీ వ్యాపారస్తుడి అంగాంగాలను నరికాడు. నేడు శ్రీకాకుళపు రైతు దుష్టుడైన జోతేదారు గొంతు కోసి, ఆ రక్తంలో తన వేళ్ళను ముంచి వాడి

---

* *నిహిలిజం – అరాచకత్వాన్ని సృష్టించి, అన్ని సంస్థలనూ నాశనం చేసి నవ నిర్మాణాన్ని చేయలని భావిస్తూ రష్యన్ జారుల పాలనలో పనిచేసిన టెర్రరిస్టుల మతావాదం – అను.*

** *కె.కె. దత్తా 'సంతాలు తిరుగుబాటు' పుస్తకంలో 1855–57 సంవత్సరాలలో జరిగిన సంతాలు తిరుగుబాటును వర్ణిస్తూ ఉదాహరించిన సంఘటన – పే. 34.*

ఇంటిగోడలపై విప్లవ నినాదాలను రాసాడు. సంవత్సరాల తరబడివాళ్లు భరించిన అవమానం, దోపిడీలు, ఈ దారుణకాండ వెనకాల మనకు కనపడతాయి. చిన్నప్పటినుంచీ తమవర్గాన్ని చిత్రహింసలకు గురి చేస్తుంటే చూసేందుకే అలవాటుపడ్డారు. యుద్ధ రహస్యాన్ని ఒక్కసారిగా ఆకళింపు చేసుకున్న వాళ్ళకు తమ పీడకులపై హద్దులులేని వర్గద్వేషం ఏర్పడడం సహజమే. ఈ కారణంగానే 'అతిగా పోయింద'నే విమర్శలకు గురైన హూనాన్ రైతాంగపు తీవ్ర ప్రతీకారాన్ని సమర్థించిన మావో ఇలా అన్నాడు. "...... ఆ పరిస్థితికి రైతాంగం వచ్చారంటే; పెత్తందార్ల దుర్మార్గం, భూస్వాముల అరాచకత్వం, స్థానికుల కంటకత్వమే దానికి కారణం–స్థానిక కంటకులు, దుర్మార్గపు పెత్తందార్లు. అరాచక భూస్వాములు, పాశవికమైన దుర్మార్గాలను నెరపిన ప్రాంతాలలోనే, చాలా తీవ్రమైన తిరుగుబాట్లూ, ఎంతో తీవ్రమైన గందరగోళాలు జరిగాయి.... వేలాది సంవత్సరాలుగా స్థిరపడి వేళ్లూనుకున్న భూస్వాముల అధికారాన్ని, బహుశః ఎంతో శక్తినుపయోగించి కాని రైతులు కూలదోయలేక పోయేవారు......"

సంవత్సరాల తరబడి పేరుకొన్న గాఢమైన ద్వేషం, వర్గద్వేషం మూలాన్నే రైతాంగం లాగానే. 1971 నాటి కలకత్తానగరపు చాలాభాగం యువవిధ్వంసకులు కూడా రాజకీయ సాంఘిక ఆర్థిక దోపిడీకి పత్రికలపై తమ దాడిని చేసారనుకోవాలా? లేక, తాము ఇదే సంఘం (వ్యవస్థ)లో పైకి పోలేకపోవడం వల్ల కలిగిన నైరాశ్యం, చాలినన్ని ఉద్యోగావకాశాలు లేకపోవడం, యూనివర్సిటీ డిగ్రీల నిరుపయోగం కారణంగా, అందుబాటుగా ఉన్న స్కూళ్ళపై, కాలేజీలపై పరీక్షలపై దాడిచేసారా?

పార్కుస్ట్రీటు, లోవర్ సర్కులర్‌రోడ్, సినీమా రోడ్డువంటి రాజవీధులలోని స్కూళ్ళు బ్రిటిషు పబ్లిక్ స్కూలు విధానానికి నకిలీనమూనాలే. ఉన్నత వర్గాలకుచెందిన పిల్లలుచదివే ఈ ఖరీదైన స్కూళ్ళపై, యువజనోద్యమం తారస్థాయినందుకొన్న 1970–71 సంవత్సరాలలో కూడా, వాటిలో నొక్కదానిపై ఎప్పుడూ ఎలాంటి దాడులూ జరగకపోవడం చిత్రమైనసంగతి. ఈ సంస్థలేకదా సిగ్గులేని అర్థవలస విద్యావిధానానికి ప్రతీకలుగా నిలిచేది. "రైతాంగాన్ని కార్మికసమూహాన్ని కించపరిచేలా చూడాలని, సామ్రాజ్యవాద శక్తులకుచెందిన విషయమేదైనా గౌరవప్రదంగా (భావించాలనీ) ఈ శక్తులకు తొత్తులుగా దళారీలుగా తయారవమనీ"(32) భారతీయులకు పాఠాలుచెప్పే పాఠశాలలివే. ఇలాంటి 'తొత్తులు' నిత్యం గుమిగూడే పార్కుస్ట్రీటు, చౌరంఘీలలోని అధునాతమైన క్లబ్బులపైనా, బార్లపైనా, ఫలహారశాలలపైనా, నాట్యశాలలపైనా ఎలాంటిదాడులూ జరగలేదు. ఈ వర్గపు సంపదపై పెంచుకున్న పెట్టీబూర్జువా

అసూయవల్లకాని, లేక తాము ముందు ముందు వాళ్ల పరిధిలోకి ప్రవేశించాలనే (మధురమైన) నిగూఢమైన కోరికతో, వాళ్ళపై పెంచుకున్న మమకారంతోకాని, విగ్రహ విధ్వంసకులు ఆయా ప్రాంతాల పై తమ దృష్టిని సారించలేదా?

పోలీసుల్ని తమ లక్ష్యాలుగా చేసుకున్న యువగెరిల్లాలు సాహసికమైన దాడులే చేసారు. కాని, సురక్షితులైన కమీషనరు, డిప్యూటీ కమీషనరు, డిప్యూటీ ఇనస్పెక్టరు జనరలు స్థాయిలలో ఒక్క పోలీసు అధికారిపై కూడా వాళ్ళు చేయి చేసుకోలేదు. ప్రజలపై నిశితంగా పన్నుగడవేసి అమలుజరిపిన అణచివేతకు ఈ ఉన్నతాధికారులే బాధ్యులు, ఈ పొరపాట్లు తొందరపాటు మూలాన్నే జరిగాయా? లేక, తేలికగా అందిన మార్గాలలో సత్వర విజయాన్ని పొందాలనే పెట్టీబూర్జువా అవకాశవాదం (దానికి) కారణమా? తమలక్ష్యాలను ఎన్నుకోవడంలో వాళ్ళు ఇలాంటి పొరపాటు ఎందుకు చేసారు?

నగర ప్రాంతాలలో, ఈ ఉద్యమంలోకి చొరబడ్డ రాజకీయ నిబద్ధులు కాని యువకులలో చాలాభాగం, పరిమితమైన తక్షణాశయంతోనే ఇందులో చేరారని భావించాలి. వాళ్ళలో నిరాశ, కోపం పేరుకోగా, ఈఉద్యమం దానికి ఒక నిర్గమ నాన్నిచ్చింది. తమకు అందుబాటులో దొరికిన లక్ష్యాలపై దాడి చేసి, కనబడ్డ వాళ్ళను చంపి, కసితీర్చుకున్నారు.

1971 చివరలో, ఒకవైపు అణచివేత కార్యక్రమం నిరాటంకంగా కొనసాగిస్తూనే, ప్రభుత్వం యువకులకు రాయితీలనే ఎంగిలిమెతుకుల్ని విసరసాగింది. బహుశః ఇందువల్లనే చాలా సంస్థలలో వాళ్ళకు తాత్కాలికంగా ఉద్యోగాలిచ్చి, ధనార్జనా వకాశాలను కల్పించారు. ఎందరో మాజీ 'నక్సలైట్లు' ముందుకొచ్చి వాటిని ఆనందంగా స్వీకరించారు.

1972 మొదలయ్యేసరికి ఒకప్పుడు జనాదరణీయమైన "చారుమజుందారు యుగ్ యుగ్ జియో" నినాదానికి మారుగా, "ఇందిరా గాంధి యుగ్ యుగ్ జియో" (ఇందిరా గాంధీ చిరకాలం వర్థిల్లాలి) చోటు చేసుకుంది. భూమిలేని రైతులు, బీదరైతులు మాత్రం, వర్గద్వేషం నిండగా ఇంకా మొండిగా నిలిచారు. ప్రభుత్వం (state) వేలాది మందిని కొనలేదుకదా! తక్కువ సంఖ్యలో ఉండే నగర విద్యార్థులను లొంగదీసుకోవడం సులువైన పని. బతిమాలో భయపెట్టో, వ్యవస్థాచట్రంలోకి ఇరికించవచ్చు. యువకులైనందున వాళ్లు భావాలశాఖలమీదుగా అలవోకగా శాఖాచంక్రమణం చేసారు. కొనేముందు సరిపోతుందో లేదో బట్టలజతను చూసుకుని ఎంచుకున్నట్టే సిద్ధాంతాలను కూడా ఎంచుకున్నారు. రాజకీయాలలో దుస్తులు మారిస్తే పణంగా పెట్టాల్సింది

వ్యక్తిత్వమే! 'నక్సలిజం' కాని 'ఇందిరావాదం' కాని పోజు కొట్టేందుకు కొన్న క్రికెట్ బాట్లుగానే తోచాయికాని పోరాడేందుకు ఎంచుకున్న ఆయుధాలుగా కనిపించలేదు.

ఇది కొత్తకాదు. ఎన్నో సంవత్సరాల క్రితం లెనిన్ అన్నాడు. "పెట్టుబడిదారుల పట్ల 'కోపోద్రిక్తులైన' పెట్టీబూర్జువావర్గం, (అరాచకవాదంలాగే) పెట్టుబడిదారీ దేశాలలో ఒక లక్షణంగా కనిపించే సాంఘిక విశేషం. అటువంటి విప్లవపు అస్థిరత్వం, దాని దివాళాకోరుతనం, అసహ్యత, కాల్పనికత్వం, 'ఇది కాకపోతే మరోటి', అనే బూర్జువా 'పటాటోపాల'పై ఉండే 'ఉద్రేక పూరితమైన' గుడ్డిప్రేమ– ఇదంతా అందరూ ఎరిగిన సంగతే!...."

విప్లవకారులలో రాజకీయ నిబద్ధులైన (యువకులలో) కొందరు నిబద్ధులైన సి.పి.ఐ. (మా.లె) కార్యకర్తలే ఒక ఉత్తేజపూరితమైన కమ్యూనిస్టు విప్లవేతిహాసాన్ని విరచించారు. 1970–71 సంవత్సరాలలో కలకత్తాలోనూ దాని పరిసరాలలోనూ జరిగిన పోరాటాలలో వాళ్లు చిందించిన రక్తం, వాళ్ళశౌర్యం ఉద్యమానికే ఒక విప్లవతేజస్సు నిచ్చాయి. వాళ్ళచుట్టూ అల్లుకొన్న అమరత్వంతో వాళ్ల నివాసప్రాంతాలలో వాళ్ల పేరు ఇంటింటా మార్మోగాయి. (భావిలో) భారత విప్లవకారులకు వారిపేర్లే ఉత్తేజాన్నిస్తాయి. వాళ్ళకున్న ఆశ, ఆశయం, ఆలోచన అన్నీ విప్లవమే.....ఎన్నో ఖతం చర్యలతో పాలకుల్ని భయపెట్టి, పరిపాలనను స్థంబింపజేసి, విప్లవాన్ని సాధించాలని వాళ్ల గాఢంగా నమ్మారు. పోలీసులు వక్రంగా చిత్రించినట్టు, వాళ్లు మామూలు నేరస్థులుకారు. ఒక తీవ్రమైన ఆశయసాధనకై కలలు కనే మహాదార్శనికులు వాళ్లు. తన నవలల్లో సృష్టించేందుకు దాస్తవిస్కీ కూడా ఎంతో సంతోషించే, మహత్తర, బృహత్తర పాత్రధారులు. వారి కార్యకలాపాలలో కాని. మాటల్లోకాని, జీరపోయిన సంగతులేవైనా ఉంటే వాటికి వాళ్లే భాద్యులుకారు. రోజురోజుకూ చెముడు ముదురుతున్న (నేటి వ్యవస్థలోని) వారితో గొంతు పెంచే మట్లాడాలి. వాళ్ళ దూషణలు, నినాదాలు విన్నవారి పైనే పని చేసాయి. శతృవు తుడిచి వేస్తే వాళ్లు తుడిచిపెట్టుకుపోయి ఉండొచ్చు. వాళ్లు పెద్దలకూ, భావితరానికీ కూడా మార్పు (తెచ్చేందు) కై దోహద కారులయ్యారు. తరచు అతిగానే కనిపించిన, గతకాలపు పవిత్ర చిహ్నాలకై వాళ్ళు చేసినదాడితే, 19వ శతాబ్దపునాటి వంగదేశ సాంఘిక సాంస్కృతికోద్యమం పట్ల గౌరవం కల బెంగాలీ మేధావులలో కొందరైనా తమనుతాము సంస్కరించుకునేలా చేశారు. అలాటివారిలో ఒకడైన వినయ్ ఘోష్ నిజాయితీగా అంగీకరించాడు. "19వ శతాబ్దపు బెంగాలీ సాంస్కృతిక సామాజిక పునరుజ్జీవనం పై 20 సంవత్సరాల పాటు చారిత్రక సమాచార సేకరణ వ్యాఖ్యానాల పై శ్రమించిన నాకు ఇప్పుడు నా

పనిలోని లోపం తెలిసింది" ఆ 'పునరుజ్జీవనా'నికి గల సామ్రాజ్యవాదానుకూల ధోరణులను విశ్లేషించాక తను ఈ నిర్ణయానికి వచ్చాడు. "మనం చెప్పుకునే 'బెంగాల్ పునరుజ్జీవనం' 19వ శతాబ్దం చివరకు ఒక చారిత్రిక మోసంతప్ప మరేమీకాదని తేలింది" ఎలాంటి వేళ్లూనుకున్న వ్యవస్థపైనైనా, తీవ్రమైన తిరుగుబాటు చేసే సాంప్రదాయాన్ని, సి.పి.ఐ. (మా.లె) పార్టీ నగర గెరిల్లాలు యువతరంలో నెలకొల్పారు. పశ్చిమబెంగాలులో ఆనాడు గతంపై నిరసన, వర్తమానం నిర్లక్ష్యం ప్రధానం (ధోరణులు)గా కనిపించాయి. యధాస్థితి విలువలపై ఎటువంటి నమ్మకం లేకుండా పెరిగిన తీవ్రవాదుల (యువ) తరం ఫాసిస్టు ప్రతీఘాత విప్లవ ప్రస్తుత ప్రలోభానికీ, కమ్యూనిస్టు విప్లవపు (కమ్మని) కలలకూ మధ్య ఊగిసలాడారు.

సి.పి.ఐ. (మా.లె) పార్టీకేడర్ల కలకత్తానగరం, దాని పరిసరాల్లో 1970లో నెరపిన విప్లవకార్యక్రమాలను సమీక్షిస్తే, ఈ యువవీరులు నిజంగానే విప్లవపరిస్థితిని సృష్టించారని ఒప్పుకోవాలి.

కలకత్తా పోలీసులు ప్రత్యేకవిభాగంవారు, విచారణకు సిద్ధంగా ఉన్న 300 మంది సి.పి.ఐ (మా.లె) పార్టీకేడర్లతో 1970 అక్టోబరులో జరిపిన ఒక సాంపిలుసర్వే (Sample Survey)ను బట్టి వాటినగరపు గెరిల్లాదళాల స్వభావం తెలుస్తుంది. 250 మందిలో, దాదాపు సమాన నిష్పత్తిలో 15-19 సంవత్సరాల మధ్య, 20-25 సంవత్సరాల మధ్యగల యువకులే ప్రముఖంగా ఉన్నారు. 7.5 మందిలో ప్రతీ ఒక్కరు మార్క్సును నిశితంగానే చదివారు. 6గురిలో ఒకరికి మావో రచనలతో మంచి పరిచయమే ఉంది. దాన్నిబట్టి ఉద్యమంలో చేరిన యువత యొక్క దృఢమైన చావ, దాని స్థాయి తెలుస్తూంది. వారిలో పదోవంతు గ్రాడ్యుయేట్లు. మొత్తంలో 238 మందికి (మాత్రం) ఈ ఉద్యమంలో చేరకముందు రాజకీయాలతో ఎట్టి పరిచయమూ లేదు.

ఈ కొత్తవంగడపు విప్లవకారులకు పూర్వపు రాజకీయ చరిత్రపై ఎలాంటి నివేదికలు లేనందున వాళ్ళను పట్టుకోవడంలో పోలిసులు ఇబ్బందులు పడ్డారు. ఈ విప్లవకారులే ఉద్యమానికి కొత్త రక్తాన్నిచ్చి జీవం పోశారు. నగర చర్యల ఆరంభదశలో, ఈ గెరిల్లాలు పరిపాలనా వ్యవస్థను అస్తవ్యస్తం చేసి, శాంతిభద్రతలనే ఒక తమాషాగా చేయగల్గారు. పశ్చిమ బెంగాలులో సామాన్య పౌరులు చాలావరకు వీళ్ళను నిరోధించేందుకు ఏమాత్రం సుముఖత చూపలేదు. యధాస్థితిని కోరుకుని వేలెత్తి చూపడం మినహా ఏమీ చేయడానికి ముందుకురాని సమయంలో, ప్రజాస్వామిక తతంగం కకావికలయింది. మౌనమే అర్ధాంగీకారంగా తెలిసిన ప్రజాబాహుళ్యం మొత్తం

కొద్దిమంది విప్లవకారులకు నిగూఢమైన మిత్రశక్తిగా ఏర్పడ్డారు.

కాని అదే దశలో, నగరగెరిల్లాలు పారిశ్రామిక కార్మికవర్గంతో మిత్రత్వం నెరపలేక పోయారు. నగరాలు చుట్టూ ఏర్పడ్డ గ్రామస్థావరాలతో చేసే సంయుక్తపుదాడి (Joint and Simalteneous Action) తీరని కలగా మిగిలిపోయింది.

## నగర కార్మికవర్గం

1970 మార్చిలో చారుమజుందారు కార్మికవర్గానికి సందేశమిస్తూ గ్రామప్రాంతపు సాయుధ పోరాటానికి సారథ్యం వహించమనీ, విప్లవానికి అగ్రగామిగా నిలిచేందుకు ముందుకువచ్చి, సి.పి.ఐ. (మా.లె) పార్టీ సరసన నిలవమని కోరాడు. (84) ఆ నెలలోనే కార్మికవర్గాలలో పనిచేసే పార్టీకార్యకర్తల నుద్దేశించి రాసిన వ్యాసంలో, "కార్మికులలో రహస్యపార్టీ సంస్థలను నిర్మించ" వలసిన అవసరాన్ని వక్కాణించాడు. కార్మికసంఘాలను నిర్వహించడం పార్టీ ధ్యేయం కాదని చెపుతూ. "వాళ్ళు తలపెట్టే ఏ పోరాటాన్నైనా పార్టీ బలపరచాల"ని భావించాడు. "సుసంఘటితమైన పెట్టుబడిదారీ వర్గం చేసే (లాకౌట్లు, మూసివేతలు, పని నిలుపుదలలు వంటి) దాడులవల్ల ప్రస్తుత పరిస్థితులలో సమ్మెలు, హర్తాళ్లు వంటి ఆయుధాలు మొద్దుబారాయని వాళ్లకు నిరంతరం బోధించాలని" ఆశించాడు, "ఈనాడు పోరాటాలు రక్తపాతం లేకుండా, శాంతియుతంగా వృద్ధిచెందవు. అవి వృద్ధి చెందాలంటే సంఘర్షణలు, ఘెరావో, పెట్టుబడిదార్లతోనూ, పోలీసులతోనూ ఘర్షణలు, బారికేడ్లలో పోరాటాలు, వర్గశతృవులను వాళ్ల ఏజెంట్లను నిర్మూలించటం వంటి పోరాటరూపాలు అవసరం. కార్మికులలో (వారి) ఆత్మగౌరవాన్ని పెంపొందించుకునేందుకు పనిచేయాలని చారుమజుందారు తన అనుయాయులను కోరాడు. సంవత్సరాలుగా వాళ్లు బానిస బ్రతుకులను వెళ్లదీస్తున్నారన్నాడు. రాజకీయ ప్రచారంతో వాళ్ల చర్యల చొరవను పెంచి, వాళ్లలో ఒక గౌరవ భావాన్ని ప్రజ్వలింపజేస్తే. వీరోచితమైన విప్లవకారులుగా తయారయే వీలుందన్నాడు. చారుమజుందారు దాన్నే ఆశించాడు. (33)

మందకొడిగా నడిచే చరిత్ర గతిపట్ల విభ్రాంతి చెందిన యువవిద్యార్థులోకవైపు ఒత్తిడి చేస్తున్నారు. కాళ్లకిందుగా నిలకడలేకుండా యువజనోత్సాహపు వెల్లువ దొలుస్తోంది. విద్యార్థులు త్వరత్వరగా ఎన్నెన్నో ఫలితాలను కోరుతున్నారు. ఈ గందరగోళంలో కార్మికులలో స్థావరాలను పెంపొందించే అవకాశం, సమయం సి.పి.ఐ. (మా.లె) పార్టీ నాయకత్వానికి లేకపోయాయి.

ఇదే సమయంలో, కనీసం రెండు సందర్భాలలో, ఆర్థికవ్యవస్థను స్తంభింపజేసి,

రాజ్యవ్యవస్థకు విప్లవ ప్రమాదాన్ని తెచ్చిపెట్టే సమర్థత కార్మిక వర్గానికుందని రుజువైంది. ఈ రెండు సందర్భాల్లోనూ, సి.పి.ఐ. (మా.లె) పార్టీ ఎలాంటి పాత్రను నిర్వహించకపోవడం గమనార్హం. 1970 ఫిబ్రవరిలో విచ్ఛిన్నకర చర్యలతో, మెరుపు సమ్మెలతో ఆగ్నేయ రైల్వేలో అంతరాయం ఏర్పడింది. "ఆగ్నేయ రైల్వేలో కొందరు తీవ్రవాదులైన ఉద్యోగ వర్గాలు, ప్రత్యేకించి జంషెడ్‌పూర్–రాంచీ రైల్వే కార్యకలాపాలకు అంతరాయం కలగజేస్తున్నారనే భావం ప్రబలమౌతోంద"[40]ని ఓ వార్తా పత్రిక పేర్కొంది. అట్టి అంతరాయం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు ఏర్పడే ముప్పును గుర్తించిన అధికార వర్గాలు ప్రాంతీయ సైన్యాన్ని (Territoria Army) దించి రైళ్ళను నడిపారు. ఈ రెండు రైల్వేలలో పాసెంజరు గూడ్సు రైళ్ళ రాకపోకలలో ఎలాంటి అంతరాయం కలిగినా, మొత్తం దేశాన్నే సంక్షోభంలోకి దిగజారుస్తుంది. మొత్తం దేశమంతటా రవాణా అయ్యే సరుకులో 60 శాతం ఈ రైల్వేల ద్వారానే జరుగుతుంది. అంచేత దేశమంతటా, ప్రత్యేకించి, తూర్పు ప్రాంతపు నగర కేంద్రాలైన కలకత్తా, దుర్గాపూర్, అసన్‌సోల్, జంషెడ్‌పూర్‌లకు సరుకులు సేవల సరఫరాలు స్తంభించే ప్రమాదం వచ్చింది. ఈ రెండు పరిస్థితులూ కలిస్తే – (అంటే నగర గెరిల్లా చర్యల వల్ల కూలిన పాలనా వ్యవస్థ, సమ్మెలు, విచ్ఛిన్నం వల్ల స్థంభించిన రవాణా విభాగం), చక్కగా నెలకొల్పిన గ్రామస్థావరాలు నగరాలను చుట్టి ఉంటే, నగర(మే) కీలకంగా గల పాలనా యంత్రాంగం కూలిపోయేది.

చాలా కాలం తరువాత చారుమజుందారు, యువజనోద్యమ ప్రభావం కార్మికవర్గంపై పడగా వచ్చిన ఫలితంగా వర్ణించి ఆ రైల్వే సమ్మెను కొనియాడాడు. "…. ఈశాన్య ఆగ్నేయ రైల్వేలలో సమ్మె కార్మిక వర్గపు పోరాటంలో కొత్త శకానికి నాంది పలికింది. ఎటువంటి ఆర్థికపరమైన కోర్కెతోనూ వాళ్ళా సమ్మెను చెయ్యలేదు. (తమ) ఆత్మగౌరవాన్ని నిలుపుకునేందుకే వాళ్ళా సమ్మె చేసారు…"[(41)] అంతకుమించి, ఆ పోరాటాన్ని వ్యావసాయిక గెరిల్లా పోరాటంతో కాని, నగర యువజనోద్యమంతో కాని, అనుసంధించే ప్రయత్నాలేవీ జరగలేదు. కొంతకాలమయ్యాక ఆ సమ్మె అంతరించి పోయింది.

రెండో సందర్భం : 1970–71లో పశ్చిమబెంగాలు, బీహారు దామోదరు లోయ కార్పొరేషన్ విద్యుచ్ఛక్తి బోర్డులలో జరిగిన సమ్మెల పరంపర. నాలుగు సమ్మెలలో మాత్రం విద్యుచ్ఛక్తి యంత్రాంగాన్నీ, సరఫరా లైన్లనూ భారీ స్థాయిలో విచ్ఛిన్నం చేసారు. ఒక పోలీసు అధికారి పరిస్థితినిలా వర్ణించాడు. "కార్మికులు సువిశాల ప్రాంతాలను చిమ్మచీకట్లో ముంచెత్తారు. నగరాలలో, పట్టణాలలో, రోజులతరబడి

ప్రజా జీవనం స్థంభించింది. గ్రామాల్లో వేలాది గొట్టపుబావులను పంపుసెట్లనూ స్థంభింపజేసారు. తాత్కాలికంగా ఫ్యాక్టరీలు మూతపడ్డాయి." ఇంకా ఇలా అన్నాడు. "ఈ కార్యకలాపాలలో అతివాద సిద్ధాంతజాలం ప్రముఖ పాత్ర వహించింది." ఆ కాలపు సి.పి.ఐ. (మా.లె.) పార్టీ పత్రికల (సంచికల)లో ఈ సంఘటనలను ఉదహరించనైనా లేదు. దీన్నిబట్టి పార్టీ ఇక్కడ కూడా ఎలాంటి ప్రముఖ పాత్రనూ నిర్వహించలేదనే తెలుస్తుంది. దాని సిద్ధాంతం వల్ల ప్రభావితులైన వారెవరైన తమంత తాముగా అందులో పాల్గొని ఉండొచ్చు.

1970-71 సంవత్సరాలలో దుర్గాపూర్, అసన్‌సోల్ వంటి ప్రాంతాలలో పారిశ్రామిక కార్మికులతో గెరిల్లా స్క్వాడ్లు ఏర్పరిచారు. వాళ్లు ఖతం చర్యల్ని చేసారు. తుపాకీలను కొల్లగొట్టారు. కర్మాగారాలపై ఎర్ర జెండాలు ఎగరేసారు. వ్యవసాయిక గెరిల్లా పోరాట ప్రాంతాలకు సైన్యాలను తరలించ(నీ)కుండా, వియత్నాం కమ్యూనిస్టులు చేసినట్టుగా, భారీ స్థాయిలో రవాణా సౌకర్యాలను స్థంబింపజేసే పథకాలను సి.పి.ఐ. (మా.లె.) పార్టీ తన కార్యక్రమావళిలో చేర్చుకోలేదు.

పూర్తిగా పెట్టీ బూర్జువా యువకులపైనే ఆధారపడుతు నగర ఉద్యమం ఎంతో కాలం నిలదొక్కుకోలేదని, 1970 చివరకు చారుమజుందారు క్రమంగా గుర్తించాడు. ఒక కామ్రేడుకు రాసిన లేఖలో "... కార్మిక వర్గమొకటే మనలను రక్షించాల్సిన స్థితి మనకు త్వరలో పట్టబోతుంది. పెట్టీ బూర్జువా వర్గం భయపడదని భావించడం సరికాదు." కాబట్టి "కార్మిక వర్గంలో పార్టీ యూనిట్ల సంఖ్యను పెంచమని" తన అనుచరులను కోరాడు. "యువకులూ విద్యార్థులూ, చేసేదేదో చెయ్యనివ్వండి. మన పార్టీ (తన) దృష్టినీ, కలాపాలనూ కార్మిక వర్గంలో కేంద్రీకరించే విషయంలో ప్రాధాన్యత చూపాల"న్నాడు.(48)

విద్యార్థి యువజన కార్యకర్తలు, 1970-71 సంవత్సరాలలో ఉత్సాహంగా కలకత్తాలోనూ దాని పరిసర ప్రాంతాలలోనూ "విముక్త ప్రాంతాలను ఏర్పరచాలని చూశారు. 'ప్రాంతీయ ప్రాతిపదికపై అధికారాన్ని పట్టుకోవడమనే' కార్యక్రమాన్ని నగరాలలో అనువదించడానికి పూనుకున్నారు. కాని వాటిని నిలదొక్కుకునేందుకు ఆయా 'విముక్తి ప్రాంతాల'లో దైనందిన అవసరాలను తీర్చుకునేందుకు (తగిన ఏర్పాట్లు), వాళ్లను పగ సాధింపు చర్యల బారి నుంచి రక్షించేందుకు తగిన సమర్థత, కలిగి ఉండాలి. స్వయంపోషక ఆర్థిక వ్యవస్థలు శ్రీకాకుళం, గోపీ-వల్లభపూర్ గ్రామ సముదాయాలలో ఆయా ప్రాంతాలు శతృవులు చొర రాకుండా ఉన్నంత కాలం కొంత వరకూ ఈ ఆశయాలు నెరవేరాయి. కాని నగరాల సంగతి వేరు. మధ్య

తరగతి ప్రాంతాలకే పరిమితమైన ధోరణుల మూలంగా కేడర్లు శత్రువులకు దొరికిపోయారు. 'నక్సలైటు వ్యతిరేకస్క్వాడ్లు' (Anti-Naxalite Squads)గా ఉన్న లంపెన్ కార్మికులు సైన్యం, పోలీసులు సాయంతో ఈ ప్రాంతాలలో సోదా చేయగా వాళ్లు తేలికగానే దొరికిపోయారు.

1971 సంవత్సరాంతంలో చారుమజుందారు ఇలా హెచ్చరించాడు. "ఇప్పుడే కలకత్తానూ ఇతర పట్టణాలనూ మనం ఆక్రమించలేం. అది సాధ్యం కాదు కూడా..." కార్మిక వర్గపు పోరాటాల నుండి విడివడిపోయినందున వచ్చిన దురదృష్టకర పరిణామాలనిలా వివరించాడు. "కార్మికవర్గంలో పార్టీ యూనిట్లను ఏర్పరచడం మన ఆశయం కార్మికుల్లోంచి పార్టీ నిర్వాహకులు పెంపొందేందుకు సాయపడడం: మనం ఎప్పుడూ కార్మికులనే బలపరిచాం వాళ్ల పోరాటాలలో సహకరిస్తాం.... కార్మికవర్గం, చిన్నా పెద్దా పోరాటాలను నిర్వహిస్తూనే ఉంది. మన రాజకీయ కార్యక్రమం ఆ పోరాటాల విషయంలో వారికి సాయపడుతుంది. కార్మిక వర్గ ప్రజాబాహుళ్యాన్ని మన రాజకీయ పరిధిలోకి ఆకర్షించుకోవచ్చు"(66)

కాని అప్పటికే సమయం మించి పోయింది. ఒక వైపు యువజనోద్యమం సన్నగిల్ల సాగింది. కార్మికులు నెరపే పారిశ్రామిక విచ్ఛిన్న నగర గెరిల్లా చర్యలను అనుసంధించే అవకాశాన్ని సి.పి.ఐ. (మా.లె.) పార్టీ పోగొట్టుకుంది.

# 9. ఒక దశ ముగిసింది

ఒకానొక దశకు చేరుకున్న సాయుధ పోరాటంలో మనం ఎదురుదెబ్బ తిన్నాం.
– చారుమజుందార్

ప్రజల క్షేమమే పార్టీ క్షేమం – జూన్ 9, 1972

మన లోపాన్ని చర్చించే ముందు దానిక్కారణమైన కష్టకాలం గురించి కూడా కొంచెం ఆలోచించు.

– బెర్టోల్ట్ బ్రిచ్ – 'భావితరానికి'

## 1970–71లో గ్రామప్రాంతం

1970–71 కాలం నాటికి కూడా, ఇంకా భారతదేశ గ్రామ ప్రాంతమే సి.పి.ఐ. (మా.లె.) పార్టీ పోరాటాలకు ప్రధాన రంగం. నగరాల ఆందోళనలు, ప్రదర్శనలు ఈ విషయాన్ని కొంత వరకు మరుగుపరచాయి.

భూస్వాములనూ, వడ్డీ వ్యాపారస్తులనూ నిర్మూలించిన ఖతం చర్యలు చాలా జరిగాయి. పోలీసులపైనా, సైనికులపైనా దాడిచేసి తుపాకులు మొదలగు ఆయుధ సామాగ్రిని కొల్లగొట్టారు. ఆ కాలంలో గ్రామీణ గెరిల్లాల సాయుధ శక్తితో ఆయుధాల్ని పట్టుకున్నారు. అలా ప్రాచీన ఆయుధాలతో పోరాడుతూ, ప్రాథమిక పోరాట స్థాయి నుంచి ప్రజా విమోచనా సైన్యాన్ని ఏర్పరచుకునే స్థాయికి వచ్చేందుకు కృషి చేసారు. బీజాత్మకంగా సమానాంతర పరిపాలనా యంత్రాంగాన్ని విప్లవ కమిటీల ద్వారా ఏర్పరిచే విషయాన్ని కార్యక్రమాలలో అంశంగా చేర్చుకుని అనేక ప్రాంతాలలో రైతాంగాన్ని అధికారపు భావనతో ఉత్తేజపరచారు.

1970 వేసవి నుంచి 1971 ఆఖరు దాకా ప్రత్యేకించి పంజాబులో ఉద్యమం కొంత వరకూ ఫలించి ముందుకు పోయింది. తమ నాయకులను నిర్మూలించినందు వల్ల కలిగిన ఎదురు దెబ్బలను కొంతవరకూ తట్టుకొన్న ఆంధ్రప్రదేశ్ గెరిల్లాలు

1971 చివరకు శ్రీకాకుళంలోనూ తెలంగాణ ప్రాంతంలోనూ కొన్ని (ఖతం) చర్యలను చేయగలిగారు. ముషాహరి ప్రాంతం పోయినప్పటికే, బీహారులో ఉద్యమం ఆదిమ ప్రజలలో వేళ్లూనుకుని రాంచీ ప్రాంతం దాకా వ్యాపించింది.

సి.పి.ఐ. (మా.లె.) పార్టీ రైతాంగ రాజకీయాధికారాన్ని 1971 చివర దాకా నిలబెట్టుకుంటూ వచ్చిన పశ్చిమ బెంగాలులోని బీర్భం గ్రామాలలో ఉద్యమం తారస్థాయికి జేరుకుంది.

## పంజాబ్

సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమం పంజాబుకు వ్యాపించి అక్కడి రైతాంగంలో వేళ్లూనుకుంది. ఇది సి.పి.ఐ. (మా.లె.) పార్టీకి రాజకీయంగా ఎంతో ముఖ్యమైన విషయం.

చాలా సంపన్నమైన, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా పంజాబుకు పేరుంది. 'హరిత విప్లవం' ద్వారా బీదరైతుల స్థితి ఎంతో మెరుగైందనీ, అందుచేత వాళ్లు 'ఎర్రవిప్లవం'లో చేరేందుకు ఎన్నటికీ ఒప్పుకోరనే తప్పుడు ప్రచారం చేసారు. పంజాబు రైతాంగం కూడా బీదవారే. కాని దేశంలోని మిగతా రైతాంగంలాగే బీదతనంతో పాటు తీవ్రమైన ఆత్మగౌరవమూ ఉంది. 'హరిత విప్లవం' వల్ల కొన్ని ప్రాంతాలలో కూలీరేట్లు కొద్దిగా పెరిగాయి. తక్కువ కులస్థులైన బీదరైతులు మాత్రం సాంఘిక పీడన అవమానాల పాలౌతున్నారు. చిన్నప్పటి నుంచి కుతకుతలాడుతున్న అవమాన భారంతో వాళ్ళ అంతరంగంలో వర్గద్వేషం నిండి సి.పి.ఐ. (మా.లె.) పార్టీ పిలుపుకు ఉత్తేజితులై, పోరాటానికి సిద్ధపడ్డారు.

పంజాబు రైతాంగపు దరిద్రస్థితిని 1973 జూన్ 1వ తేదీ నాటి 'టైమ్స్ ఆఫ్ ఇండియా' దినపత్రిక ప్రచురించిన సమాచారం 70ల ఆరంభంలోని అక్కడి పరిస్థితిని కళ్ళకు కట్టినట్టు చూపింది. "చాలా ఎక్కువ తలసరి ఆదాయంతో చాలా సంపన్నమైన రాష్ట్రంగా పేరొందిన పంజాబులో 43.5 శాతం జనాభా దారిద్ర్య రేఖ దిగువనే (ఉండి) గ్రామ ప్రాంతాలలో బతుకుతున్నారు... వారిలో చాలా భాగం హరిజనులైన వ్యవసాయ కార్మికులే. వ్యవసాయరంగంలోని పనివారిలో 20 శాతం దాకా వాళ్ళే... కొత్త సాంకేతిక జ్ఞానపు పూర్తి ప్రయోజనాన్ని, బాగా వనరులున్న ధనికరైతులే పొందారు. తగిన వనరులు లేక ఎంతో మంది చిన్న రైతులూ, సన్నకారు రైతులూ గొట్టపు బావులను తవ్వుకోలేదు. కొత్త పద్ధతులను అనుసరించలేదు. నిజానికి వాళ్ళలో చాలా మందికి కడుపునిండా తిండి తినేందుకే వీలు లేదు. 'హరిత విప్లవం' వల్ల ఆదాయాలలో

అసమానతలు మరింత పెరిగాయి. చిన్న చిన్న పొలాలున్న చాలా మంది చిన్న రైతులు, సన్నకారు రైతులు దుర్భర దారిద్ర్యంలోనే మగ్గుతున్నారు. మరింత పని ఏర్పడి ఆదాయం కొంత పెరిగినా, ఎందరో వ్యవసాయ కార్మికులు తమకు వచ్చే స్వల్ప ఆదాయాలతో కనీసావసరాల్ని కూడా తీర్చుకోలేక నిరంతర ఋణభారంతో జీవిస్తున్నారు." అందువల్ల పంజాబులోని సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమపు ఆరంభ దశలలో పాటియాల, ఫిరోజ్‌పూరు, సంగ్రూరు, ప్రాంతపు గ్రామాలలోని పెద్ద భూస్వాములు, సాహుఖార్లూ నిర్మూలనకు లక్ష్యాలయ్యారంటే ఆశ్చర్యం లేదు.

1970 వేసవి నాటికి, ఆ రాష్ట్ర మొత్తంలో పెద్ద పారిశ్రామిక కేంద్రమైన లూధియానాలో 'అధ్యయన కేంద్రాలు' (Study circles) పేరుతో పార్టీ 'సెల్సు' పని చేయసాగాయని పోలీసు నివేదికలు పేర్కొన్నాయి. 1970 ఆగస్టు నెలలో బసంత్ సింగ్ అనే స్వతంత్ర పార్టీ ఎం.ఎల్.ఎ.ను గెరిల్లాలు చంపారు. చర్య వెనక ఉన్నట్టు అనుమానితులైన రాష్ట్రంలోని 20 మంది సి.పి.ఐ. (మా.లె.) పార్టీ నాయకులను పట్టుకునేందుకు పోలీసులు 5000 రూపాయిలు బహుమతిగా ప్రకటించారు. ఆగస్టు 9వ తేదీన వాళ్ళలో ఇద్దరిని పోలీసులు చంపారు. పోలీసులు ఆగస్టు 19వ తేదీన హర్బజన్‌సింగ్ అనే వ్యక్తిని ఫిరోజ్‌పూర్ జిల్లాలో అరెస్టు చేసారు. దీనితో సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కార్యకర్తలు నిరుత్సాహపడలేదు. 1970 అక్టోబరు 1971 జనవరి మధ్యలో లూధియానా, పాటియాలా, సంగ్రూర్, జలంధర్, హోషియార్‌పూర్, భటిండా జిల్లాలలోని గ్రామాలలో భూస్వాములనూ సాహుకార్లను ఎందరినో చంపారు. డిశంబరు మూడవ వారంలో కపూర్‌తలా వద్ద పోలీసులతో జరిగిన ఘర్షణలో వాళ్ళ ఆధీనంలో తమ కామ్రేడును విడిపించుకున్నారు. ఆ పోరాటంలో గెరిల్లాలు ఒక పోలీసుని కాల్చి చంపారు.[1] ఫిరోజ్‌పూర్ జిల్లాలోని 'కోట్క్రీకలన్' గ్రామంలో అకాలీదళనాయకుడూ, భూస్వామి, (బ్లాకు) సమితి ప్రెసిడెంటూ అయిన వ్యక్తిని 1971 జనవరి 25వ తేదీన చంపారు. (1931లో ఉరితీయబడిన విప్లవకారుడు) భగత్‌సింగుకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇచ్చిన ఇతనికి బ్రిటిషు పాలకులు జాగీరులను బహూకరించారు. పంజాబు తమ విజయాలపై రాష్ట్ర సి.పి.ఐ. (మా.లె.) పార్టీ నాయకులిలా వ్యాఖ్యానించారు. "మిగతా రాష్ట్రాలతో పోలిస్తే పంజాబు ఆర్థికంగా సంపన్నమైందనీ 'హరిత విప్లవం' చోటు చేసుకున్న ఈ ప్రాంతంలో వర్గశత్రువుల నిర్మూలన పంథా విజయవంతం కాదని భావించిన వారి నమ్మకాలను, త్వరలోనే అభివృద్ధి చెందిన సాయుధ పోరాటం తుడిచిపెట్టింది."[2]

గ్రామాలలో నిర్మూలనోద్యమం జరుగుతూండగానే సి.పి.ఐ. (మా.లె.) పార్టీ పట్టణ

ప్రాంతపు విద్యార్థులను కూడా ఆకర్షించసాగింది. 1970 చివరకు పంజాబు కాలేజీల గోడల మీద మావో నినాదాలు కనిపించసాగాయి. కొన్ని చోట్ల భవనాలపై ఎర్రజెండాలను కూడా ఎగరేసారు. మరి కొన్నిచోట్ల పరీక్షలకు అంతరాయం కలిగింది. అప్పటికే ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్సు కళాశాల విద్యార్థులు ఎందరో పంజాబు, హర్యానా రాష్ట్ర గ్రామాలలో పనిచేస్తున్నారు. 1970 చివర నుంచి పోలీసులు విద్యార్థి కార్యకర్తలపై దాడులు మొదలెట్టారు. విద్యార్థి సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కార్యకర్తలను అరెస్టు చేయగా అనేక జిల్లాలో కాలేజీలలో సమ్మెలు జరిగాయి.

పంజాబు పార్టీ నాయకులు 1971 మొదట్లో చారుమజుందారును కలిశారు. నాటి నుంచి బీద రైతులు భూమిలేని రైతులతో గెరిల్లా స్క్వాడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత నివ్వసాగారు. తుపాకులను పట్టుకోవడంలోనూ, విప్లవ కమిటీల ఏర్పాటుకూ కూడా ప్రాధాన్యతనివ్వసాగారు.

సంగ్రూర్ జిల్లాలోని 'దాధహూర్' గ్రామం వద్ద గల పోలీసు పోస్టుపై సెప్టెంబరు 23న దాడి చేసారు. దానిని 1971లో జరిగిన అద్భుత చర్యగా పేర్కొనవచ్చు. ఆ చర్య నడిపిన గెరిల్లా స్క్వాడులో ఆరుగురు బీదవారైన భూమిలేని రైతులున్నారు. అక్కడి సాయుధ పోలీసులు గెరిల్లాలకు లొంగిపోయారు. పోలీసు పోస్టు అధిపతియైన హవల్దారు మాత్రం కాల్పులు కొనసాగించాడు. గెరిల్లాలు వాణ్ణి చంపారు. నాలుగు, 308 రైఫిళ్లను 200 రౌండ్ల తూటాలను వశపరచుకున్నారు. "వ్యవసాయ విప్లవం వర్థిల్లాలి! కామ్రేడ్ చారుమజుందారు వర్థిల్లాలి!" 'మావో సేటుంగు వర్థిల్లాలి!' అని పారిపోయే ముందు ఆ స్క్వాడు సభ్యులు నినాదాలు చేసారు. పంజాబు రాష్ట్ర పార్టీ శాఖ బాధహూర్‌ను 'పంజాబు యొక్క మగర్జున'గా అభివర్ణించింది.

అంతకు ముందు పాటియాలా జిల్లాలోని సి.పి.ఐ. (మా.లె.) పార్టీ గెరిల్లాలు, ఆ ప్రాంతపు పోలీసు డిప్యూటీ సూపరింటెండెంటును (డి.ఎస్.పి.) ఆగస్టు 2వ తేదీన చంపారు. సంచాతా గ్రామంలో ఒక భూస్వామి ఏజెంటు నుంచి తుపాకీని లాక్కొన్నారు. ఆ గ్రామంలోని రైతులు అంతకు పూర్వం తమ బాకీలకు సంబంధించిన అప్పు పత్రాలను నాశనం చేసేలా సాహుకార్లపై బలప్రయోగం చేసి ఒత్తిడి తెచ్చారు. చారుమజుందారు 1971 ఏప్రిల్ నెలలో పంజాబు కామ్రేడ్లకు రాసిన లేఖలో ఇలా అన్నాడు." మీ పోరాటం దేశమంతటా ప్రశంసలందుకుంటోంది. మా పోరాటాన్ని కొనసాగించేందుకు ఉత్సాహాన్నిస్తోంది. బీదరైతుల పైనా భూమిలేని రైతులపైనా ఆధారపడండి. వాళ్ల చొరవను బయటకు రానివ్వాలి. అప్పుడే అన్ని ఆటంకాలు తొలగిపోతాయి. మౌలికమైన ప్రజాబలమే మన విజయానికి మూలం. కారణం

ప్రజలు అనేక విధాలుగా పాత్ర వహిస్తారు. వాళ్ళ చురుకైన తెలివి తేటలు అసంభవాన్ని సంభవం చేస్తాయి."(54)

పంజాబులో తమకు పలుకుబడి గల ప్రాంతాలలో గెరిల్లాలొకవైపు విప్లవ కమిటీలను ఏర్పరుస్తున్నారు. ఒక నివేదిక ప్రకారం "ఈ కమిటీలు శతృవు కార్యకలాపాల గురించి గెరిల్లాలకు విలువైన సమాచారం అందిస్తాయి. అదే నివేదికలో ఈ కమిటీలు ధనికులను, వడ్డీ వ్యాపారస్తులను ఇలా కోరాయి. "(1) రైతాంగ సాయుధపోరాటాన్ని వ్యతిరేకించకూడదు. (2) లెవీలను చెల్లించాలి. (3) కౌలు (గా చెల్లించవలసిన) పంటను తగ్గించాలి."[3] భటిండా–సంగ్రూరు ప్రాంతం ఒక జోనుగా అభివృద్ధి చెందింది. విప్లవకారులు ఆ ప్రాంతంలో తగినంత పలుకుబడిని సంపాదించుకున్నారు. ఆ ప్రాంతంలో 1971 చివరలో గల పరిస్థితిని ఒక నివేదిక ఇలా వర్ణించింది. "ఒక డి.ఎస్.పి.ని ఖతం చెయ్యడం, దాధహూర్ పోలీసు పోస్టుపై దాడి, ఒక పోలీసుతొత్తు నుంచి తుపాకీ లాక్కోవడం, (వీటన్నిటి) మూలంగా ఈ ప్రాంతంలో భయం నెలకొంది. శతృవు గ్రామాలలోని చిన్న పోలీసు పికెట్లను రద్దు చేసాడు. ఐదారుగురు పోలీసులు చిన్న గుంపులుగా గ్రామాలకు వెళ్ళడం మానారు. పెద్ద సంఖ్యలో ఉంటేనే వాళ్లు గ్రామాలలో ప్రవేశిస్తున్నారు. పోలీసులు వాళ్ళ ఏజంట్లను తుపాకులు తిరిగి ఇచ్చివేయమని ఆదేశించారు. కారణం వాళ్ళను 'నక్సలైట్ల' నుంచి పరిరక్షించడం కుదరదు. చిన్న తరహా వర్గశతృవులూ, దుష్టపెత్తందారీ వర్గపు సభ్యులూ విప్లవకమిటీలతో రాజీపడక తప్పలేదు... ఈ ప్రాంతంలో అనేక గ్రామాలలో వర్గ శతృవులూ, పోలీసు ఏజెంట్లూ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయారు. పెత్తందారీ వర్గ రాజకీయాధికారం పతనమైంది... ఇన్నాళ్లూ ప్రజలను దోచుకున్న వర్గశతృవులు ఈ ప్రాంతం నుంచి పారిపోతున్నారు."[4]

పోలీసులు తొందరగానే రంగంలోకి దిగారు. భూస్వాముల తొత్తులతో 'నక్సలు వ్యతిరేక' స్క్వాడులను ఏర్పరిచారు. తుపాకులను సరఫరా చేశారు పరిస్థితిని చక్కబరిచేందుకు భటిండా–సంగ్రూరు ప్రాంతంలో పంజాబు రాష్ట్ర పోలీసు శాఖకు చెందిన ఆరు బెటాలియన్లను దించారు. ప్రభుత్వం సి.పి.ఐ.(మా.లె.) పార్టీ కార్యకర్తల ఇళ్లను స్వాధీనం చేసుకుంది. గెరిల్లాలు పారిపోవడానికి వీలులేకుండా రాష్ట్ర సరిహద్దులను మూసివేసారు. 1971–72 సంవత్సరాల శీతాకాలానికి పోలీసులు ఇతోధికమైన సాయుధబలంతో గెరిల్లా ప్రాంతాలలో ప్రవేశించారు. గెరిల్లాలను పట్టుకున్నారు. చంపారు. తరిమికొట్టారు. 1972 ఆగస్టు 10వ తేదీనాటి 'లిబరేషను' సంచికలోని నివేదిక ఇలా వివరించింది. "గత శీతాకాలంలో పోరాటంలో అంతరాయం

కలిగింది.” సంగ్రూర్ జిల్లా సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కమిటీ సమీక్షలో “వందలాది గ్రామాలలోని రైతులపై కాంగ్రెసు ప్రభుత్వం నగ్నంగా క్రూరంగా జరుపుతున్న దమనకాండ, పోలీసులు చంపిన గెరిల్లా కామ్రేడులకు బదులుగా రైతాంగం తీసుకున్న విప్లవ ప్రతీకారాన్ని” ఉదహరించింది. పార్టీచేసిన పొరపాట్లను పరిశీలిస్తూ “త్యాగపు రాజకీయాలే విప్లవ రాజకీయాలని” అర్థం చేసుకోవడంలో విఫలమైందని ఆ కమిటీ భావించింది. పార్టీ యంత్రాంగం బీదరైతుల, భూమిలేని రైతుల ఆధిపత్యంలో ఎల్లప్పుడూ లేదని ఆ సమీక్ష ఒప్పుకుంది. ప్రజలు పాల్గొన్న స్థాయి తగినంతగా లేదని పేర్కొంది. రహస్య స్థావరాలను, యంత్రాంగాన్ని రక్షించడంలో పార్టీ వైఫల్యానికి గల కారణాలను పేర్కొంటూ “బహిరంగంగా పనిచేయడానికి ఇష్టపడడం. రహస్యంగా ఉండలేకపోవడం” ఒకటిగా కమిటీ ఆరోపించింది.

పంజాబులో ఉద్యమం ఆ తరువాత ఏవో కొన్ని గ్రామాలలో భూస్వాములనూ సాహుకార్లనూ ‘ఖతం’ చేసే స్థాయికి దిగజారిపోయింది.

## ఆంధ్రప్రదేశ్

1971 ఆఖరి పాదం నుంచీ శ్రీకాకుళంలో చర్యల సమాచారం మళ్లీ వినబడ సాగింది. పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతపు గెరిల్లాలు 15 మంది భూస్వాములూ, పోలీసు ఏజెంట్లనూ చంపారు. స్క్వాడు సభ్యులు టెక్కలి సోంపేట మైదాన ప్రాంతాలలో ముగ్గురు భూస్వాములనూ ఇద్దరు పోలీసు ఏజెంట్లనూ చంపారు.

1969–70 నాటి మహత్తర రైతాంగ పోరాట కాలంలో భూస్వాములు గ్రామాల నుంచి పారిపోయారు. పోలీసులు గెరిల్లాలపై దమనకాండను ఇప్పుడు ప్రారంభించాక కూడా తిరిగి రావడానికి ధైర్యం పుంజుకోలేకపోయారు. ఆ ప్రాంతంలోని సి.పి.ఐ. (మా.లె.) పార్టీసభ్యులు 1972 మధ్యలో (ప్రచురించిన) నివేదిక ప్రకారం. ఈ కాందిశీకులైన భూస్వాముల భూములు ప్రజాపరమయ్యాయి.[5] ఈ ప్రాంతంలోని సి.పి.ఐ. (మా.లె.) చర్యల తత్వానికి సోంపేట ప్రాంతంలోని బొడ్డపాడులోని సంఘటన ఉదాహరణగా చెప్పుకోవచ్చు. (ఒకానొక కాలంలో ఈ సోంపేట పంచాది కృష్ణమూర్తి, సుబ్బారావు పాణిగ్రాహిల కార్యకలాపాలకు కేంద్రంగా ఉండేది.) ఒక స్థానిక భూస్వామి గ్రామం నుంచి పారిపోగా “ఆ భూమిని గ్రామ పంచాయితీ ప్రెసిడెంటు సాగు చేయాలనుకున్నాడు. బీదరైతులు, భూమిలేని రైతులు అతన్ని చుట్టుముట్టి, పోరాటం ద్వారా లభించిన ఆ భూమి ప్రజలకే చెందాలన్నారు. అతను ఆ భూమిని సాగు చేయడానికి వీల్లేదన్నారు. దగ్గరలోనున్న పోలీసు క్యాంపు నుంచి పోలీసులను తీసుకు

వచ్చి ఆ పంచాయితీ ప్రెసిడెంటు ప్రజలను వేధించాడు. గెరిల్లా స్క్వాడు ప్రజల సాయంతో పంచాయితీ ప్రెసిడెంటునూ అతని తాబేదారునూ చంపారు...”[6]

వాళ్ల కలాపాలు తెలంగాణాకు కూడా వ్యాపించాయి. వరంగలు ఖమ్మం జిల్లాల సరిహద్దులలోనున్న ‘గార్ల’ వద్ద ఒక బీదరైతుల, భూమిలేని రైతుల స్క్వాడు రైల్వే సెంట్రీని చంపి అతని తుపాకీని లాక్కొన్నారు. పెద్ద మొత్తంలో డబ్బును వశపరుచుకున్నారు. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఆంధ్ర కమిటీ ప్రకారం “ఆంధ్ర (రాష్ట్రం)లో మొదటిసారిగా అటువంటి చర్య జరిగింది.”[7] ఇదేకాక రాయలసీమ, వరంగలు, గుంటూరు జిల్లాలలో అనేక సందర్భాలలో భూస్వాములు ‘ఖతం’ అయ్యారు.

కాని ఆంధ్రప్రదేశ్‌లో ‘ఉద్యమం’ మళ్లీ మొదటికే, అంటే నిర్మూలనా కార్యక్రమ స్థాయికే వచ్చింది. 1969-70 కాలంలో శ్రీకాకుళం ఏర్పడినట్టుగా అరుణ రాజకీయాధికారాన్నేర్పరిచే ప్రయత్నాలు లేకపోయాయి.

పోలీసుల మీద కాని, సైనికుల మీదకాని విస్తృతమైన గెరిల్లాదాడులు జరగలేదు. తుపాకులు పట్టుకొని సైనికులను నిర్మూలించడమూ జరగలేదు.

## బీహారు

1970 అక్టోబరు నెల మొదట్లో పోలీసులు బీహారులోని రాంచీ జిల్లాలో దాడి మొదలెట్టారు. ‘నక్సలైట్లు’ ఆ ప్రాంతపు ఆదివాస ప్రజలలో చొచ్చుకుపోయారని వీరి ఆరోపణ.

ఇదే ప్రదేశంలో 19వ శతాబ్దంలో బ్రిటీషు సైన్యాన్నీ భూస్వాములనూ ఎదిరిస్తూ జరిగిన తిరుగుబాటులో అనేక భీకర పోరాటాలు సాగాయనే సంగతి మనం మరువకూడదు. ఆ గ్రామాలలో మొత్తం ఎనమండుగురు చచ్చారని, అందులో ఆరుగురు భూస్వాములనీ వచ్చిన వార్తల దృష్ట్యా, 1970 అక్టోబరులో పోలీసులు రంగంలోకి వచ్చారు.

అదే సంవత్సరం నవంబరు నాలుగో తారీఖున బీహారులోని మాంఘీరు జిల్లాలో నాలుగు వందల మంది మిలటరీ పోలీసులు మరో దాడి మొదలెట్టారు. గెరిల్లాలు అంతకు ముందే అక్కడ గల ఏడుగురు బడా భూస్వాములనూ వడ్డీ వ్యాపారస్తులనూ చంపారు. భారీస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టులు మొదలయ్యాయి. 1971 జనవరి 1వ తేదీకి సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కార్యకర్తలు లేదా సానుభూతిపరులుగా అనుమానించిన దాదాపు 1500 మందిని పోలీసులు జైళ్లలో కుక్కారు. వారిలో 200 మంది జంషెడ్‌పూరులోనే అరెస్టయ్యారు. ఆ ఉక్కు నగరపు కార్మికులలో

యూనిట్లను నిర్మించేందుకు పార్టీ ప్రయత్నించింది.

తూర్పు దిశలో బీహారు కావల గల నక్సల్బరీ ప్రాంతంలో ఈ కాలంలోనే సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఉత్తర బెంగాలు – బీహారు ప్రాంతీయ సరిహద్దు కమిటీ చురుకుగా పనిచేస్తోంది. దాని కలాపాలు. అప్పుడప్పుడు బీహారులోని పూర్నియాలోకి కూడా చొచ్చుకుపోసాగాయి.

## నక్సల్బరీ

1970 అక్టోబరులో నక్సల్బరీ గెరిల్లాలు పూర్నియా (జిల్లా)లోని 'మగర్జున' పోలీసు స్థావరంపై జరిపిన దాడిని ఉద్యమ చరిత్రలోనే ఒక మైలురాయిగా సి.పి.ఐ. (మా.లె.) పార్టీ భావించింది. దాంతోనే పశ్చిమ బెంగాలులో తుపాకులు మొదలైన ఆయుధాలు పట్టుకునే కార్యక్రమం మొదలైంది.

మగర్జునదాడి తరువాత విప్లవకారులు ఆయుధ సంపత్తిని పెంచుకునే ప్రయత్నంలో నక్సల్బరీ ప్రాంతంలో కూడా ఏమీ ముందుకు పోలేకపోయారు. పార్టీలోని ఒక ప్రముఖ కార్యకర్త 1971 సెప్టెంబరులో ఇలా ప్రశ్నించాడు. "మగర్జున సంఘటన తరువాత మరిన్ని తుపాకులు పట్టుకోవడం ఎందుకు సాధ్యపడలేదు?" నాయకత్వంలోని మార్పును దానికి కారణంగా పేర్కొన్నాడు. "... మగర్జున సంఘటన తరువాత మధ్య రైతులు బీదరైతుల, భూమిలేని రైతుల నాయకత్వాన్ని ఎంత మాత్రమూ అంగీకరించలేదు. దాని వ్యతిరేకమే జరిగింది. బీదరైతులు, భూమిలేని రైతుల నాయకత్వాన్ని అనుసరించసాగారు."[8]

నక్సల్బరీ గెరిల్లాలకు 1971 జనవరి నాటికి పరిస్థితులు మెరుగుపడ్డాయి. "చాలా భాగంలో దాదాపు వర్గ శత్రువులు నశించారు. గెరిల్లాలు తమ కార్యకలాపాలను విస్తృత ప్రాంతంలో సాగిస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో వర్గ శత్రువుల పంటలను పట్టుకున్నారు..."[9]

## బీర్భం

ఘనత వహించిన 1855–57 నాటి సంతాలు తిరుగుబాటును తలపుకు తెస్తూ సి.పి.ఐ. (మా.లె.) పార్టీ గెరిల్లాలకూ వారి శత్రువులకూ బీర్భం గ్రామాలలో భీకర యుద్ధం జరిగింది. ఆ జిల్లా పశ్చిమ బెంగాలులో, బీహారు సరిహద్దుకు ఆనుకుని ఉంది.

మొదట్లో బీర్భం జిల్లాలో గల పట్టణాల కాలేజీ విద్యార్థులు సి.పి.ఐ. (మా.లె.)

పార్టీ సానుభూతి పరులయ్యారు. బోల్పూర్‌లోని శ్రీనికేతన్ అగ్రికల్చరల్ కాలేజీ కేడర్లు 'వృద్ధి చెందే ప్రాంతం' కాగా, వాళ్ళు పక్కనున్న సరుల్ గ్రామాన్ని తమ కార్యకలాపాలకు కేంద్రంగా చేసుకున్నారు. మొదటి దాడి 1969లో దుబ్రాజ్‌పూర్ పోలీసుస్టేషను ప్రాంతంలో వర్గశత్రువుపై జరిగింది. పార్టీ కార్యకర్తలు తమ నివేదికలో ఇలా తెలిపారు. "ఆ చర్య ఫలించలేదు. స్క్వాడులో మధ్య తరగతి రైతులుండడం దానికి కారణం. మేధావి కామ్రేడ్ల చొరవ వల్లనే ఆ చర్య జరగడం కూడా కారణమే."[10]

దీని తరువాత భూమి లేని రైతులు, బీద రైతులతోనే గెరిల్లా స్క్వాడ్లు ఏర్పాటు చేసారు. బోల్పూరు, సూరి, సంతాల్ పరగణాలలో గెరిల్లాల 'ఖతం' కార్యక్రమం మొదలైంది. "జిల్లాలోని మూడు ప్రాంతాలలో పోరాటం మొదలవడం చేత వాటి మధ్య గల ప్రాంతాలు కూడా వాటిలో నిమగ్నమయ్యాయి. ఈ పోరాటం రాపూర్హాట్, మయూరేశ్వర్, అహమ్మద్‌పూరు నుంచి రాజ్‌నగర్ దాకా విస్తరించింది."[11] పశ్చిమ బెంగాలు – బీహారు సరిహద్దులలోనే ఈ ప్రాంతాలున్నాయని గమనించాలి.

పశ్చిమ బెంగాలు – బీహారు సరిహద్దు రీజినల్ కమిటీ ఉద్యమం మొదటి దశలో ప్రజల మనస్థితినిలా వర్ణించింది. "గ్రామ విద్రోహులలో, అత్యంత క్రూరమైన, పీడించే నాయకుల్ని ఎన్నిక చేసి వాళ్ళను ఖతం చేసారు" బీర్భం కేడర్లు ఆ కాలంలో స్థానిక బీదరైతుల భూమిలేని రైతుల చొరవపైనా నిర్ణయాలపైనా ప్రధానంగా ఆధారపడ్డారు. "నిర్మూలనా కార్యక్రమంలో మా లక్ష్యాన్ని నిర్ణయించేందుకు వాడి (వర్గశత్రువుకు) కున్న భూమి విస్తీర్ణం కాని, సంపద మొత్తం కాని ముఖ్యం కాదు. వర్గశత్రువులో ఎంత మట్టుకు విద్రోహకరతత్వం, క్రూరత్వం (నిండి) ఉన్నాయనేదే ముఖ్యం. బీదరైతులు, భూమి లేని రైతులు ఆ శత్రువు పట్ల ఎంతగా వర్గద్వేషం నింపుకుని ఉన్నారనేదే ప్రధానమైన విషయం. ఈ విషయంలో భూమిలేని రైతాంగపు, బీద రైతాంగపు, బీద రైతాంగ జనబాహుళ్యపు వర్గద్వేషంపైనే పూర్తిగా ఆధారపడ్డాం."[12]

నిర్మూలనా కార్యక్రమంలో ప్రజాబాహుళ్యం పాల్గొనేలా చేసేందుకు ఉద్దేశపూర్వకంగా జరిగిన ప్రయత్నాల గురించి నొక్కి చెపుతూ, "అందరి సమక్షంలోనూ బహిరంగ విచారణ జరిపి మరణశిక్ష విధించడం" వీలుకాని సందర్భాలలో జరిగే నిర్మూలన చర్యలకు ముందు "ప్రజా బాహుళ్యంలో వివరమైన దర్యాప్తు' చేయడం గురించి ఆ నివేదిక ఉదహరించింది. మిగతా సందర్భాలలో బహిరంగ విచారణలు జరిగేవి. "లాంబజార్ ఠాణాకు చెందిన సుల్తాన్‌పూర్‌లోని పంచానన్ చటర్జీ అనే జోతేదారు గుమిగూడిన ప్రజా బాహుళ్యపు తీర్పు ప్రకారమే చంపబడ్డాడు. ఇటాండాకు చెందిన జోతేదార్ జితేన్‌హాల్దార్‌పై బోల్పూరు ప్రాంతపు ప్రజాకోర్టు మరణ శిక్ష

విధించనక్కరలేదని తీర్పు ఇచ్చింది. ప్రజాకోర్టు తీర్పు ప్రకారం గ్రామం విడిచి పెట్టి పోవలసిందని అతనిని రైతాంగ గెరిల్లాలు ఆజ్ఞాపించారు. బోల్పూరులోని ప్రజాబాహుళ్యం అమలేందుపైన్ అనే కంటకుడైన వర్గ శత్రువును చంపవలసిందిగా ఒక గెరిల్లా స్క్వాడును కోరింది. గెరిల్లా స్క్వాడ్ ప్రజల ఆజ్ఞను అమలుపరచింది. దుబ్రాజ్‌పూరు జిల్లాలోని ఘోష్‌నగర్ వద్ద రైతాంగ ప్రజా వర్గ శత్రువులలో ఒకనిని మాత్రం చంపాలని, మిగిలిన వారిని వదిలెయ్యాలనీ తీర్పు నిచ్చారు. ప్రజలు తీర్పు అమలు జరిగింది."[13]

గ్రామ ప్రాంతాలు – పట్టణ ప్రాంతాల మధ్య సన్నిహిత సమన్వయత్వం కలిగి బీర్భంలో పోరాటం కొనసాగుతోంది. ఆ జిల్లాలోని బోల్పూరు, హేతంపూర్, సూరి, రాంపూర్హాట్ నల్హాతీ మొదలైన పట్టణాలన్నీ చుట్టుపక్కల గ్రామాల ద్వారా వృద్ధి చెందిన వడ్డీవ్యాపారం, ధాన్యం మిల్లులు, చిన్న వర్తకాల ద్వారానే వృద్ధి చెందాయి. 1970 మే–జూన్ నెలల్లో సూరి, రాంపూర్హాట్ తదితర పట్టణ ప్రాంతాలలోని గోడలపై మొట్ట మొదటగా మావోయిస్టు నినాదాలు వెలిసాయి. ఆ సంవత్సరం అక్టోబరు–నవంబరు మాసాలలో స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలపై దహనకాండ మొదలైంది. గ్రామాలలో నిర్మూలనా కార్యక్రమం సాగుతోంది. అలాగే సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కేడర్లు పట్టణ వర్గశత్రువులపై దాడులు చేస్తున్నారు. ఒక WBBRC నివేదిక ఇలా పేర్కొంది. "(మన) ఆశయాలలో మొదటిది. శ్రామిక జన సమీరణ. (ఈ శ్రామికులలో చాలా మందికి గ్రామాలలో బంధువులున్నారు. అందువల్ల సహజంగానే పట్టణాలలో పోరాటపు ప్రభావం పల్లెలలోనూ ఉంటుంది.) రెండవది, నగరాలలో కొంతవరకు అరుణభీభత్సం కలిగించి శ్రామిక జనులపై వర్గశత్రువుల పీడనను తగ్గించడం. మూడు, నగర యువకులను విద్యార్థులను గెరిల్లాయోధులుగా మలచడం. నాలుగు, గ్రామాలలోనే కాక పట్టణాలలో కూడా ప్రభుత్వ యంత్రాంగాన్ని వేధించడం. ఆ విధంగా విద్రోహకర దుష్టశక్తులను అన్ని వైపుల నుంచీ ఎదుర్కొని, చేతుల మీద, కాళ్ళ మీదా, తలమీదా కూడా కొట్టాలి". "గ్రామాలలో పోరాటానికి అనుబంధంగా"[14] పట్టణ పోరాటాన్ని చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. దీన్ని బట్టి బీర్భంనగర గెరిల్లాలకూ, కలకత్తా నగర గెరిల్లాలకూ వైఖరిలో గల విభేదం తెలుస్తుంది. కలకత్తా నగర గెరిల్లాలు గ్రామచర్యల నుంచి విడిగా ఉంటూనే 'విముక్తి ప్రాంతాలను' నిర్మించాలని ఆశించారు.

గెరిల్లాలు 1971 మొదటి నుంచీ భూస్వాములు, పోలీసులు మొదలైన వారి నుంచి రైఫిళ్లు తదితర ఆయుధాలను పట్టుకోవడంలో ప్రాధాన్యత చూపారు.

1971 మార్చి 1వ తేదీ నుంచి జూన్ 5వ తేదీలోగా గెరిల్లాలు పశ్చిమ బెంగాలు రాష్ట్రమంతటా మొత్తం 299 ఆయుధాలను పట్టుకున్నారు. జిల్లాలవారీ అంకెలు, బీర్భం–109, 24–పరగణాలు 51, హౌరా–40, బర్ద్వాన్–26, నాడియా–19, హుగ్లీ–16, కలకత్తా–12, మూర్షిదాబాద్–12, ఇతర జిల్లాలు–15[15] మొత్తంలో మూడవ భాగం బీర్భం జిల్లాలోనే పట్టుకున్నారని గమనించాలి. 1971 మార్చి నెల మధ్యలో బీర్భంలోని రాంపూర్హాట్ ప్రాంతంలో మొదటి రైఫిలును పట్టుకున్నారు. పోలీసుల నుంచి దాన్ని లాక్కున్నారు. భూస్వాముల నుంచీ, పోలీసుల నుంచీ ఆయుధాలు పట్టుకుని వాటితో రైతాంగ స్క్వాడ్లను సాయుధం చేసే కార్యక్రమానికి ఇది నాందీ పలికింది. WBBRC* నివేదిక ఇలా పేర్కొంది. "రోజుకి సరాసరి 10 తుపాకులు పార్టీకి లభించాయి. మాకు వాటిని లెక్కించడం కష్టమైంది"[16] ఆ నివేదికలో వివరించిన తుపాకులు లాక్కొన్న కథనాల వల్ల గెరిల్లాల కలాపాల తీరు తెలుస్తోంది. బోల్పూరులోని శ్రీనికేతన్‌లోని వినయ్‌భవన్ వద్ద గల సాయుధ గస్తీ దళంపై గెరిల్లాలు దాడి చేయాలనుకున్నారు. అక్కడకు వెళ్ళక మునుపు వాళ్ళు అక్కడ ఇద్దరు గార్డులు డ్యూటీలో ఉన్నారనుకున్నారు. "సాయంకాలం (వాళ్ళు) సాంప్రదాయిక ఆయుధాలతో 11 మంది గెరిల్లా కామ్రేడులు బయలుదేరారు. చివరగా చేసిన దర్యాప్తు వల్ల డ్యూటీలో ఇద్దరు కాక నలుగురు గార్డులున్నారని తెలిసింది. ప్రతీవాడి దగ్గరా ఒక రైఫిలుంది. ఈ పరిస్థితులలో గెరిల్లాలు దాడి జరపకుండానే తిరిగిపోవాలా అనే ప్రశ్నపై గెరిల్లా నాయకుడిలా అన్నాడు. "దాడి చెయ్యకుండా తిరిగిపోయే ప్రసక్తి లేదు. వారిపై దూకండి" కామ్రేడులు సాంప్రదాయిక ఆయుధాలతోనే గార్డులపై దాడి చేసారు. రెండో వైపు నుంచి కాల్పులు మొదలయ్యాయి. తరువాత బాహాబాహి రైఫిళ్ళ పోరాటం కొనసాగింది. గార్డులు తూటాలను కురిపించసాగారు. కాని ఎదురులేని గెరిల్లాలు, అత్యంత ధైర్యసాహసాలతో, నిర్లక్ష్యవైఖరితో రైఫిళ్ళను లాక్కునే నిశ్చయంతో ఉన్నారు. చివరకు వాళ్లు గార్డులను చంపి మూడు తుపాకీలను లాక్కున్నారు. ఒక గార్డు పారిపోయాడు."[17]

బీర్భంలో సి.పి.ఐ.(మా.లె.) గెరిల్లాల విజయాలను 1971 మే 13వ తేదీ నాటి 'స్టేట్సుమన్' పత్రిక వివరంగా వర్ణించింది. ఆ పత్రిక యొక్క సూరిపట్టణపు విలేకరి (జిల్లా కేంద్రం) ఇలా రాశాడు. "నక్సలైట్లని భావించిన 500 మందిని అరెస్టు చేసేక,

---

* *West Bengal-Bihar Boarder Regional Committee* *పశ్చిమ బెంగాలు – బీహారు సరిహద్దు ప్రాంతీయ కమిటీ – అను.*

ఒక సైన్యానికి చెందిన వ్యక్తిని ఒక రాష్ట్ర ప్రభుత్వోద్యోగినీ పట్టుకున్నాక కూడా, అన్ని ప్రయత్నాలు చేసాక కూడా, ఇంతవరకూ అధికారులు ఐదు తుపాకులు ఒక రివాల్వరు మించి పట్టుకోలేదు... చాలా సందర్భాలలో చిన్న చిన్న గుంపులుగా దాడి చేసి తమ తమ ఆయుధాలను ఇవ్వమని ప్రజలను అడుగుతున్నారని అధికారులు అంటున్నారు. చాలా సందర్భాలలో తుపాకీల యజమానులు ఎటువంటి నిరోధం చేయకుండా తుపాకీని, రివాల్వరునూ కాని ఇచ్చేసేవారు. విప్పిన తుపాకులను కూడా పట్టుకు పోయారు." జిల్లా పాలకయంత్రాంగం నిస్సహాయులై తమ తమ తుపాకీలను పోలీసు స్టేషనులో దాచుకోవలసిందని ఒకానొక దశలో తుపాకుల యజమానులను కోరింది. దీనివల్ల పట్టణ గ్రామీణ ఉన్నత వర్గాల సభ్యులు ఆత్మ రక్షణాయుధాలు లేకపోవడంతో దోపిడీ దొంగల దయాదాక్షిణ్యాలకు పూర్తిగా బానిసలయ్యారు. ఆ కాలంలో బీర్భంలోని కొన్ని ప్రాంతాలలో దోపిడి దొంగలు కూడా చురుకుగానే ఉన్నారు.

బీర్భం గ్రామీణ గెరిల్లాలు ఆయుధాలనలా సంపాదించుకున్నాక ప్యూడలు వర్గాలపై దాడులు మొదలెట్టారు. భూస్వాముల తరువాత వడ్డీ వ్యాపారస్తులు, తాకట్టుదారులను ప్రధాన లక్ష్యాలుగా ఎన్నుకున్నారు. భూమిలేని రైతుల, చిన్న రైతుల దారిద్ర్యం ఆధారంగా వడ్డీ వ్యాపారస్తులు తాకట్టుదారులు పైకి వచ్చారు. తాకట్టు వస్తువులను సొంతదార్లకు ఇవ్వమని గెరిల్లాలు వత్తిడి చేసారు. వారిలో చాలా మంది మరింత సురక్షిత ప్రాంతాలకు పారిపోయారు. అలా తిరిగి ఇవ్వడానికి ఒప్పుకోని వాళ్ళను గెరిల్లాలు చంపివేశారు. ప్యూడలు భూస్వాములపై సి.పి.ఐ. (మా.లె.) చర్యను పార్టీకి చెందని ఒక పరిశీలకుడు ఇలా వివరించాడు. "బోల్పూరు పోలీసు స్టేషనుకు చెందిన ఇటాండా గ్రామంలోకి జూన్ 19వ తేదీనాడు 200 మందికి పైగా ప్రవేశించారు. వాళ్ళ వద్ద 25 రైఫిళ్లు, ఆరు, ఏడు రివాల్వర్లు, బాంబులు, బల్లేలు ఉన్నాయి. గ్రామంలోని భూస్వామి కుటుంబమైన పైన్సు ఇంటిని చుట్టుముట్టారు. కుటుంబ పెద్దను వాడి గదిలోంచి బయటకీడ్చారు. ఒక పెద్దమామిడి చెట్టుకు కట్టినిలబెట్టి కత్తితో చంపారు. ఆ దాడిలో పాల్గొన్న సంతాల్‌లు సి.పి.ఐ. (మా.లె.) పార్టీకి ప్రియమైన నినాదాలు చేస్తున్నారు. చాలా మంది గ్రామస్తులు మూగ ప్రేక్షకులుగా గుమిగూడారు. వారిలో ఒక్కడూ నోరు మెదిపేందుకు సాహసించలేదు."[18]

అదే సమాచారం మరో సంఘటనను వర్ణించింది. "... అదే రోజున (అంటే జూన్ 19వ తేదీన) మరో 500 మంది రైఫిళ్లు, మస్కెట్లు, పైపు గన్నులు, పిస్టళ్ళు, బాంబులు బల్లేలుతో మాధవపూర్ గ్రామంలో దాడిచేసి తారాపధాదక్తార్ అనే ఎల్.ఎం.ఎఫ్. డాక్టరు ఇంటిని ముట్టడించారు. అతడు కంటకుడైన భూస్వామి కూడా.

సంతాల్ యువకులు నినాదాలు చేస్తున్నారు. 'చంపండి! చంపండి! తార్పడాను చంపండి!' అని అరుస్తూ తార్పడా ఇంటి గదుల్లో చొరబడి వాడిని బయటకు ఈడ్చుకొచ్చారు. ఇంటి ముందున్న మామిడిచెట్టుకు కట్టారు.... ఈ లోగా దాదాపు గ్రామంలోని ప్రజలందరూ అక్కడ గుమిగూడారు. ఒక నాయకుడు తార్పడ దుర్మార్గాలను క్లుప్తంగా వివరించాడు. తరువాత ఇలా అన్నాడు. 'ఇతనికి ఏం శిక్ష వెయ్యాలో చెప్పండి? వీడు బతికుండి సంఘాన్నింకా పాడు చెయ్యాలంటారా? చెప్పండి?' ప్రజలందరూ ప్రత్యేకించి సంతాలులు, 'చావే! చావే! చావుకు తప్ప వీడు మరి దేనికీ అర్హుడు కాదు' అని అరిచారు. 'అయితే తార్పడా చస్తాడని' నాయకుడు ప్రకటించాడు. ఒక సంతాలుకు రైఫిలు ఇచ్చి తార్పడాను చంపమన్నాడు. సంతాల్ డాక్టరు తలకు గురిపెట్టి పేల్చాడుకాని గురి తప్పింది. వాడు చావలేదు. తరువాత ఆ నాయకుడు ఒక యువకుడికి రైఫిలు ఇచ్చి కాల్చమన్నాడు. ఒక రౌండు కాల్చగా గుండు ఛాతిలోంచి దూసుకుపోయింది. వాడు అక్కడికక్కడే చచ్చాడు. తార్పాడును చంపేందుకు ప్రయోగించిన ఆ రైఫిలు వాడికి ప్రియతమ స్నేహితుడైన మరో భూస్వామి నుంచి లాక్కున్నదే."[19]

బీర్భం అంతటా జరిగిన అటువంటి చాలా సంఘటనలను WBBRC నివేదికలో వర్ణించింది. ఆ చర్యలన్నిటిలోనూ గ్రామ ప్రజలు చురుకుగా సహకరించారు. నిర్మూలించిన భూస్వాముల ఆస్తిని, భూమిలేని రైతులకూ బీదరైతులకూ పంచారు. అప్పు పత్రాలను కాల్చివేశారు. భూస్వాముల ఇళ్ళ నుంచి తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. ఆ నివేదిక ఇలా పేర్కొంది. ".... మే జూన్ మాసాలలో మహత్తరమైన రైతాంగ విప్లవపు పెను తుఫాను ఆ ప్రాంతమంతటినీ కలచి వేసింది."[20] నిజానికి జూన్ నెలనాటికి బీర్భంలోని రాజ్నగర్, ఖైరసోల్, బోల్పూరు మూడు పోలీసు స్టేషనుల ప్రాంతాన్ని జిల్లా పాలనాయంత్రాంగం 'అత్యంత రక్షణ లేనిది'గా భావించింది. రాష్ట్రాంతర, జిల్లాంతర సరిహద్దులో ఈ మూడూ ఉన్నాయి రాజ్నగర్ ఖైరసోల్‌లు దాటితే బీహారు రాష్ట్రపు దుంకా అడవి ఉంది. ఇది గెరిల్లాలకు అనువైన ఆశ్రయంగా ఉండేది. బోల్పూరుకు ఎదురుగా పశ్చిమ బెంగాలులోని బుర్ద్వాన్ జిల్లా ఉంది.

బీర్భంలోని సి.పి.ఐ. (మా.లె.) కార్యకలాపాలతో స్థానిక పోలీసుదళం ఎటూ కదలలేక పోయింది. సి.పి.ఐ. (మా.లె.) ఇలా వివరించింది. "సాయుధ రైతాంగ పోరాటపు ప్రాబల్యం వల్ల జిల్లాలోని మొత్తం పోలీసు దళం కదలలేకపోయింది. ఆరేడు ప్రదేశాలలో పోలీసులనెదిరించి వాళ్ళ రైఫిళ్లను లాక్కోవడంతో పోలీసు దళాలు ఎంతో భయపడిపోయాయి. పార్టీ నాయకత్వంలో తుపాకులు పట్టుకొనే కార్యక్రమం

నిర్విఘ్నంగా కొనసాగుతోంది."[21]

పోలీసు దళాల కదలలేని స్థితి (immobility) 'హిందూస్తాన్ స్టాండర్డు' విలేకరి ధృవపరుస్తూ, 1971 జూన్ 28వ తేదీ పత్రికలో మరో రకంగా వ్యాఖ్యానించాడు. "... (పోలీసులలో) దాదాపు 90 శాతం బీర్భంకు చెందినవాళ్ళే. మిగిలిన 10 శాతం కూడా దాదాపు గత ఇరవై సంవత్సరాలుగా ఆ జిల్లాలోనే పనిచేస్తున్నారు. దానివల్ల కొందరు వ్యక్తులపై చర్య తీసుకోమని ఇచ్చిన ఆదేశాలు సరిగా అమలు జరగడం లేదు. నేరస్తులు ప్రత్యక్షంగానో పరోక్షంగానో పోలీసులతో సంబంధం కలిగి ఉండడమే కారణం... కొన్ని ఠాణాలలోని పోలీసు అధికారుల కొడుకులకో తదితర బంధువులకో నక్సలైట్లతో సంబంధాలు ఉన్నాయి. ఆ విలేకరి స్వానుభవాన్ని కూడా వివరించాడు." నేను జిల్లా మెజిస్ట్రేటుతో మాట్లాడుతూండగా, ఒక బాధ్యతాయుతమైన వ్యక్తి వచ్చి ఒకానొక ఠాణా అధికారి (Officer-in-charge) ముందుగానే దాడి జరుగుతుందనీ ముందు జాగ్రత్త తీసుకోమని హెచ్చరిక పంపాడని చెప్పాడు. సబ్ డివిజనల్ ఆఫీసరు కార్యక్రమం ప్రకారం దాడి జరిపాడు. ఎవ్వరూ పట్టుబడలేదు."

స్థానిక పోలీసులు సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కార్యకలాపాలను అణచలేకపోయారు. అందువల్ల పాలకవర్గం సైనిక సహాయాన్ని కోరింది.

## బీర్భంజిల్లాకు సైన్యం రాక

ఉన్నత ప్రభుత్వ కార్యదర్శులు, పోలీసు అధికారులు జూలై నాలుగో తేదీన కలకత్తాలో జరిపిన సమావేశంలో సైన్యాన్ని దించాలని నిర్ణయించారు. పశ్చిమ బెంగాలు వ్యవహారాలను పర్యవేక్షిస్తూన్న నాటి కేంద్రమంత్రి సిద్ధార్థ శంకరరే ఆ సమావేశానికి అధ్యక్షత వహించాడు. 1971లో అధికారానికి వచ్చిన ప్రజాస్వామ్య సంఘటన (Democratic Front) తాలూకు సంకీర్ణ ప్రభుత్వం అంతరంగిక విభేదాల వల్ల కూలిపోయింది. జూన్ నెలాఖరున రాష్ట్రపతి పాలన విధించబడింది. కమ్యూనిస్టు విప్లవకారులను అణచే బాధ్యతను నేరుగా కేంద్ర ప్రభుత్వమే చేపట్టింది.

1971 జూలై 5వ తేదీ స్టేట్సుమన్ పత్రిక కలకత్తా సమావేశాన్నిలా నివేదించింది. "కొన్ని ప్రాంతాలలో, ప్రత్యేకించి బీర్భంలో, పోలీసులు ఎంతగా భయపడ్డారంటే వాళ్ళు, తీవ్రవాద వర్గాలతో ఒక ఒప్పందానికి కూడా వచ్చారని సమావేశంలో తెలిసింది. అధికార్లు వెంటనే ఠాణా అధికార్లను మార్చాలని భావించారు. కారణం ధైర్యం లేని అధికారులు ముందు తీసుకోబోయే చర్యలకు కూడా అడ్డుగా నిలుస్తారు తక్షణం ఠాణా అధికార్లను బదిలీ చేయడానికి బదులుగా; సైన్యం పోలీసులు సంయుక్తంగా

ఏరివేత కార్యక్రమాన్ని మొదలెట్టాలని నిర్ణయించారు. "దీని తరువాతే బోల్పూరులో సైన్యం ప్రవేశించింది. ప్రజలకూ – పోలీసులకూ మధ్య గల "సమాచారపు అంతరం' (information gap) సైన్యపు ప్రయత్నాలకు ఎల్లవేళలా అడ్డుపడుతోంది." 1971 జూలై 12వ తేదీన అదే వార్తా పత్రికలోని వార్త ప్రకారం "గాలింపు కార్యక్రమాలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని సైనికాధికారవర్గం నిరాశను వెలిబుచ్చింది. అసలు సమాచారం ఏమీ లేకపోవడం గురించి (కూడా) వాళ్ళు విచారాన్ని వెలిబుచ్చారు." స్థానిక పోలీసులు సి.పి.ఐ. (మా.లె.) కేడర్ల రహస్య స్థావరాలకు సైన్యాన్ని తీసుకు వెళ్ళలేక పోయారని దీనివల్ల తెలుస్తూంది. WBBRC నివేదిక కూడా ఇలా తెలిపింది. "రైతాంగ పోరాటం వృద్ధి చెందడంతో విద్రోహకర సాయుధ శక్తుల మధ్య గల అంతరంగిక వైరుధ్యాలు (కూడా) పెరుగుతున్నాయి. పోలీసులు, సి.ఆర్.పి. సైన్యాల మధ్యలో తమ తమ పరిధులు, హక్కులు (మొదలైన వాటికి) సంబంధించిన వైరుధ్యాలు కుమ్ములాటలు మొదలయ్యాయి."[22] ఆ సంవత్సరం సెప్టెంబరులో కమిటీ ఇలా పేర్కొంది. "జిల్లాలో వేలాదిసాయుధ సైనికులను దించారు. కాని వాళ్ళు గ్రామాలలో ఎక్కడా బసచెయ్యడం లేదు. 'చుట్టుముట్టి అణచివేసే' (encirclement and Suppresion) కార్యక్రమంలో బోల్పూరులోని ఒక ప్రాంతంలో 97 పోలీసు వాహనాలనూ 7,500 మంది సైనికులనూ నియమించారు. వేలాది రైతులు మరింత దృఢంగా పార్టీలో జేరుతున్నారు. సైనికుల దారుణమైన దమనకాండే దీనికి కారణం. పార్టీని రైతులిలా కోరారు. మీరు జోతేదార్లను చంపారు. ఇప్పుడు సైన్యాన్ని కూడా మీరే నిర్మూలించండి!"[23]

సైన్యం చుట్టుముట్టినప్పటికీ, గెరిల్లాలు "వర్గశత్రువులపైనా, పోలీసుల పైనా, రెండు సందర్భాలలో సైన్యం పైనా" దాడులు నిర్వహించారు. ఆ దాడులు బీర్భంలోని రాజ్నగర్, సూరి, బోల్పూర్, నానూర్, మయూరేశ్వర్, రాంపూర్హాట్ ఠాణాలలో జరిగాయి. అహమద్పూర్లోని పోలీసు ఔటుపోస్టు (Outpost) పై రైతులు దాడిచేసారు. నానూర్ పోలీసు పికెట్లపై దాడిచేసి రైఫిళ్ళను పట్టుకున్నారు. ఈ సంఘటనలను 'బీర్భంలోని పోరాటంలో కొత్త అధ్యాయానికి ఆరంభం'గా కమిటీ భావించింది.[24]

ఈ కాలంలో భీర్భం కామ్రేడ్ల నుద్దేశించి రాసిన లేఖలో చారుమజుందారు ఇలా అన్నాడు. "పోరాటం ఒక పెద్ద అడుగులేసే స్థాయికి చేరుకుంది. పార్టీ యంత్రాంగాన్ని పటిష్టం చేయడానికి తగిన అవసరం, సమయం వచ్చింది." "సైన్యం తలపెట్టిన 'చుట్టుముట్టి అణచివేత' కార్యక్రమం పురిట్లోనే సంధి కొట్టిందని" చెపుతూ, "ప్రతీదీ

మనం చొరవ తీసుకోగలగడం పైనే ఆధారపడి ఉంటుందని" హెచ్చరించాడు. "పాలక వర్గాలకు బీర్భం సింహస్వప్నంగా తయారైంద"న్నాడు. కార్యకలాపాల తీరును గురించి కూడా సలహా ఇచ్చాడు. "బీదరైతుల భూమిలేని రైతుల స్క్వాడ్ల చొరవకు ప్రాధాన్యం ఇవ్వాలి. వాళ్ళనుంచే ఎన్నుకున్న సైన్యాధికారుల చొరవకు ప్రాధాన్యం ఇవ్వాలి. మేధావి కామ్రేడులు ఛైర్మన్ మిలటరీ రచనలు చదవాలి. ఛైర్మన్ ప్రతిపాదించిన గెరిల్లా పోరాటపు నాలుగు సూత్రాలనూ* అన్ని స్థాయిలలోనూ చర్చించాలి"(63)

కాని ముందంజపడలేదు. సైన్యానికీ భారీ స్థాయిలోకాని, సుదీర్ఘమైనది కాని, గెరిల్లా పోరాటాన్ని ఎదుర్కోవలసిన అవసరం రాలేదు. సైన్యం క్రమంగా గ్రామాలలోకి చొచ్చుకుపోయింది. పార్టీకేడర్లు సంతాల్ పరగణాలలోని అడవుల్లోనూ కొండల్లోనూ తలదాచుకున్నారు. తరవాత తిరుగుబాటుదార్లను పట్టుకోవడం చంపడం సైన్యానికి సులువైంది. వేలాది సంతాల్ రైతులను జైళ్ళలోకి తోసారు. పెట్టీ బూర్జువా నాయకులు అరెస్టవడమో, చావడమో జరిగింది. కొందరు పారిపోయారు. శ్రీకాకుళం గోపీ–వల్లభపూర్లలోని కథే బీర్భంలోనూ జరిగింది.

---

* *"మనవి గెరిల్లా ఎత్తుగడలు. అవి ప్రధానంగా ఈ కింది అంశాలను కలిగి ఉంటాయి.*

1. *'ప్రజలనుత్తేజపరచేందుకు సైన్యాన్ని విభజించాలి. శత్రువుపై పోరాడేందుకు సైన్యాన్ని కేంద్రీకరించాలి' 'శత్రువు ముందుకొస్తే మనం వెనక్కి తగ్గాలి. శత్రువు ఆగితే మనం వేధించాలి. శత్రువు అలసిపోతే మనం ఎదుర్కోవాలి. శత్రువు పారిపోతే మనం తరమాలి'.*
2. *'స్థిరమైన స్థావర ప్రాంతాలను ఏర్పరిచేందుకు వెల్లువలా ముందుకు పోయే విధానం అనుసరించాలి. శక్తిమంతుడైన శత్రువు తరుముతూంటే చుట్టూ తిరిగే విధానం అనుసరించాలి.'*
3. *'అత్యంత సులువైన మార్గాలతో అతి తక్కువ కాలంలో చాలా ఎక్కువ మంది ప్రజలను రెచ్చగొట్టాలి'.*
4. *ఈ ఎత్తుగడలన్నీ వలను విసరడం వంటివి. మనం ఎప్పుడైనా దాన్ని (వలను) విసరగలగాలి. తిరిగి తీసుకోగలగాలి. ప్రజలను ఆకర్షించేందుకు దాన్ని విశాలంగా విసురుతాం. శత్రువుతో వ్యవహరించేందుకు దాన్ని దగ్గరకు తీసుకుంటాం. గత మూడేళ్లలోనూ మనం అనుసరించిన ఎత్తుగడలివి. మావో సేటుంగ్; 'ఒక చిన్న నిప్పురవ్వ ప్రయరీ✠ మంటను లేపుతుంది– జనవరి 30, 1930. Selected Works. Vol. II P. 124.*

✠ *గడ్డి బీడు, ఉత్తర అమెరికా సమప్రకృతి గడ్డి మైదానములకు భౌగోళిక నామం – అను.*

## జయాపజయాలు

బీర్భంలో ఉద్యమపు తీరుతెన్నులు చాలా వరకు చారుమజుందారు ఆశించిన దిశలోనే నడిచాయి. వర్గశత్రువులను నిర్మూలించి పంటలను పట్టుకున్నారు. అటువంటి సాధారణ ఆర్థిక కోర్కెలపై రైతాంగాన్ని సమీకరించారు. వర్గశత్రువులపైనా పోలీసులపైనా రైతాంగ గెరిల్లా స్క్వాడులు దాడి చేసారు. అలా ఆయుధాలను సేకరించారు. ప్రజా విమోచన సైన్యం (పి.ఎల్.ఎ.) ఏర్పాటు కూడా మొదలైంది. అయినా శత్రువు యొక్క ఉన్నత స్థాయి ఎత్తుగడలే పై చేయిగా గెలుపొందాయి దానికి కారణాలేమిటి?

బీర్భంలోని 'ఎర్ర గ్రామాలు' ఇంకా తిరుగుబాటుదార్ల ఆధీనంలోనే ఉన్న కాలంలో 1971 సెప్టెంబరులో WBBRC ఇలా వివరించింది.

బీద గ్రామ ప్రజలతో కూడిన గెరిల్లా స్క్వాడులు ఏర్పాటయ్యాయి. కాని పార్టీ "బీదరైతులు, భూమిలేని రైతు కేడర్లనుంచి, గెరిల్లా పోరాటకారుల నుంచి ఎక్కువ సంఖ్యలో నిర్వాహకులను, రాజకీయ నాయకులనూ తయారు చేయలేకపోయింది." వర్గ శత్రువునిర్మూలనా కార్యక్రమం ద్వారా ప్రజలను సమీకరించడం కూడా జరిగింది. కాని విప్లవ కమిటీల ద్వారా కాని, వాటి క్రిందగల గ్రామీణ ఆత్మరక్షణ దళాల ద్వారా కాని, వారిని సరైన దిశలో స్థిరీకరించలేకపోయిందని ఆ కమిటీ (WBBRC) పేర్కొంది.

బీర్భం పోరాటాన్ని నిర్వహించే నాయకులిలా అడిగారు. "రైతాంగ బాహుళ్యపు రాజకీయ హక్కులు సాధించే కార్యక్రమం చేపట్టకుండా, వాళ్లను విప్లవ రైతాంగ కమిటీల కార్యకలాపాలలో పాల్గొనేలా రాజకీయ సమీకరణ చెయ్యకుండా, మనం ప్రజాసైన్యాలను గ్రామాలలో ఏర్పరచడం ఎలా కుదురుతుంది? పోరాటాన్ని వ్యాపింపచెయ్యడం పైనే దృష్టి కేంద్రీకరిస్తే, పని జరగకపోవడం వల్ల గ్రామ ప్రాంతాలలో పార్టీ అస్తిత్వానికే ముప్పు రాదా? ఇప్పటికే మనకు అటువంటి అనుభవం జరగలేదా?" ".... మనం విప్లవ కమిటీలను ఏర్పాటు చెయ్యవలసిన అవసరాన్ని గుర్తించలేదు... విప్లవ రైతాంగ కమిటీల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులున్నా కూడా వాటిని మనం ఉపయోగించుకోలేదు"[25] అని అంగీకరించారు.

ఏర్పాటు కానున్న విప్లవకమిటీల బాధ్యతల గురించి చారుమజుందారు చెప్పిందాన్ని గుర్తు చేస్తూ ఇలా వివరించారు. "1. పారిపోయిన భూస్వాముల భూములను స్వాధీనం చేసుకుని పంచాలి. 2. వర్గశత్రువులనూ వాళ్ళ ఏజెంట్లనూ విచారించి శిక్షించాలి. 3. రైతాంగ ప్రజలలో తలెత్తే వైరుధ్యాలను పరిష్కరించాలి. 4. గ్రామ ఆత్మరక్షణ

దళపు ఏర్పాటు, ఉత్పత్తి పెంచడం". వీటిలో మొదటిదాన్ని ప్రాథమికమైనదని భావించారు. ఈ భూసంస్కరణలకూ సాధారణంగా వాడుకలోనున్న ఆర్థికవాద భూసంస్కరణలకు తేడా ఉంది. అందువల్ల వాటిని ఆర్థిక దృక్పథంతో చూడకూడదు. రాజకీయంగానే వాటిని ఆలోచించాలి. గ్రామాలు విముక్తి పొందితేనే తప్ప భూసంస్కరణలను అమలు జరపలేం. విముక్తి చెందిన గ్రామాలలో భూసంస్కరణలను అమలు జరపడం అంటే అక్కడి రాజకీయాధికారాన్ని ఏర్పరచడమే అవుతుంది. విప్లవ కమిటీల తాలూకు మరో లక్షణాన్ని కూడా బీర్భుం నాయకులు గుర్తించారు. "గ్రామ రక్షణ దళాన్ని, సైనిక బలగాన్ని ఏర్పరచడం పట్ల విప్లవ కమిటీలు శ్రద్ధ వహిస్తే, గ్రామాలలో న్యాయపరిపాలన జరిగేందుకు ప్రజావిమోచన సైన్యంపై ఆధారపడే బదులు, తమ ఆధీనంలో ఉన్న గ్రామరక్షణ దళంపైనే ఈ విప్లవ కమిటీలు ఆధారపడతాయి. దీనివల్ల ప్రజలను సాయుధులను చేసే ఆశయం నెరవేరుతుంది."[26] సైనిక పటాలాలు గ్రామాలలో చొరబడినప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు గ్రామీణ సైన్యం కాని గ్రామ ఆత్మరక్షణ స్క్వాడ్లు కాని లేకుండా పోయినందున గ్రామస్తులు సైన్యాన్ని ఎదిరించలేకపోయారు. రాజకీయ కొమిసార్లు సైన్యం వెంటబడడంతో గెరిల్లాలు గ్రామాలనుంచి పారిపోయారు. సైనికపరంగానూ, రాజకీయపరంగానూ, ఆచ్ఛాదనలేని గ్రామస్థులు వ్యవస్థాత్మకంగా శత్రువును ఎదుర్కోలేకపోయారు.

సైనికులు వెంట తరుమగా, పార్టీ నిర్వాహకులూ, గెరిల్లాలు కొండల్లోకీ కోనల్లోకీ పారిపోయారు. అక్కడి నుంచి ప్రతిదాడిని చెయ్యాలనుకున్నారు. కాని మైదానాలలోని రైతాంగ జనబాహుళ్యం నుంచి వేరుపడిపోవడంతో, ఒక భారీస్థాయి సైనికదళానికి ఎదురొడ్డిన గుప్పెడు మంది తిరుగుబాటుదార్లు(గా) వాళ్ళు ఎంతోకాలం నిలవలేకపోయారు.

బీర్భంలోని (మా.లె.) పార్టీ కేడర్లు తమ పోరాట కాలంలో కొన్ని ప్రాంతాలలో విప్లవకమిటీలను ఏర్పాటు చేసారు. ఈ విషయంలో వాళ్ళ అనుభవం ఆసక్తిజనకంగా ఉంది. సూరి(నగర) ప్రాంతాలలో పెట్టీబూర్జువా కార్యకర్తల చొరవవల్ల అటువంటి కమిటీలు ఏర్పడ్డాయి. WBBRC దైనందిన అనుభవాన్నిలా వివరించింది. "ఏదైనా సమస్యనెదుర్కొన్న రైతు (పెట్టీబూర్జువా) నిర్వాహకుడి దగ్గరకు వచ్చేవాడు. అనేక సందర్భాలలో ఈ మేధావి కామ్రేడ్ అనుకోకుండా కమిటీపై తన నాయకత్వాన్నే రుద్దడం జరిగేది. దాంతో ఈ మేధావి కామ్రేడ్ లేకపోతే విప్లవకమిటీ పని స్తంభించేది." కొన్ని గ్రామాలలోని విప్లవ కమిటీలు రైతాంగం నమ్మకాన్ని చూరగొన్నాయి. అటువంటి గ్రామాన్ని బీర్భంనాయకులు వర్ణించారు. "..... పారిపోయిన జోతేదారు తాలూకు

70 భిగాలు (దాదాపు 24 ఎకరాలు) భూమిని ఆక్రమించి రైతులిలా ప్రకటించారు. భూమిని పంచనవసరం లేదు. ఈ భూమిలో పండిన పంటను విప్లవకమిటీ మార్గదర్శకత్వంలో అనుభవిద్దాం."[27]

బీర్భం విప్లవకారులు పోరాటకాలంలో మరో పరిణామాన్ని కూడా ఎదుర్కొన్నారు. ఆ సమయంలో దోపిడీలు కూడా ఎక్కువయ్యాయి. సి.పి.ఐ. (మా.లె.) పార్టీకో, జిల్లా అధికార్లకో తుపాకులను ఇచ్చేసారని తెలిసి దోపిడీ దొంగల మూఠాలు ధనికుల ఇళ్లపై దాడిచేయడం సులువైంది. కలకత్తా నగర గెరిల్లాలు మామూలు నేరస్థుల కార్యకలాపాలను 'పార్టీ చర్యలుగా' ప్రకటించుకున్నారు. బీర్భం సి.పి.ఐ. (మా.లె.) కేడర్లు మాత్రం అందుకు భిన్నంగా ఈ సాధారణ హత్యలతో దోపిడీలతో తమకెటువంటి సంబంధం లేదని కరపత్రాల ద్వారా ప్రకటించుకున్నారు. ఆత్మవిమర్శనా ధోరణిలో ఈ పరిణామాన్ని గురించి WBBRC ఇలా అంది. "..... విప్లవ కమిటీలను ఏర్పరిచే పనిని సమీకరించలేకపోయాం. మొత్తం గ్రామాలు విముక్తి ప్రాంతంగా రూపొందగానే రైతాంగ ప్రజలను సాయుధుల్ని చెయ్యలేదు. గ్రామపరిపాలనా వ్యవస్థలో శూన్యత ఏర్పడింది. దొంగలు, దోపిడీముఠాలు దాన్ని సాకు చేసుకున్నారు. దోపిడీలు, దొంగతనాలు పెరిగాయి. దొంగలపైనా, దోపిడీదార్లపైనా పోరాటాన్ని సాగించవలసి వచ్చింది. ఈ విషయంలో కూడా పార్టీ తన వర్గ విధానాన్ని ప్రతిపాదించింది. "దరిద్ర్య బాధతో దోపిడీలను చేపట్టి వాళ్లకూ, 'విద్రోహుల' ఆధ్వర్యంలోని సమర్థవంతులైన దోపిడీ ముఠాలకూ, మధ్య పార్టీ వివక్షత చూపింది. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ పేరుతో దోపిడీలు జరిపినప్పుడు "దొంగల దోపిడిదార్ల నాయకులను పార్టీ యూనిట్లు హెచ్చరించాయి. దానివల్ల ఫలితం లేకపోయింది. ఇద్దరు దోపిడీనాయకులనూ, ఒక దొంగల నాయకుణ్ణి ఖతం చేసారు."[28]

కొన్ని ప్రాంతాలలో విప్లవకమిటీలు ప్రజల మధ్య తలెత్తే వైరుధ్యాలను పరిష్కరించి, పార్టీ వర్గవిధానాన్ని అమలుపరిచేందుకు ప్రయత్నించాయి. "నల్హతీ ప్రాంతంలోని చిన్న రైతుల భూములను ముందు స్వాధీనం చేసుకున్నా విప్లవ రైతాంగ కమిటీ వాటిని ఆయా భూముల సొంతదార్లకు తిరిగి ఇచ్చి వేసింది. ఆ ప్రాంతపు వర్గశతృవుపై రైతాంగ జనబాహుళ్యం తమ దాడిని నిర్మించుకోవడంలో, ఆ విధంగా, చిన్న భూస్వాముల మద్దతును పొందారు."[29] కాని అన్నిచోట్లా అట్టి ఉదారవైఖరి చూపలేదు. ప్రత్యేకించి నగర ప్రాంతాల విప్లవకమిటీలకు ఆ వైఖరి అసలు లేనేలేదు. ఒక పార్టీ పరిశీలకుడు చిన్న వ్యాపారస్తుల గురించి ఇలా అన్నాడు. "సలారి, రాంపుర్హాట్, బోల్పూరులలో చాలా మంది చిన్న వ్యాపారస్తులను బెదిరించారు. తమనలా

బెదిరింపుకు గురి చేయటానికి తమ నేరమేమిటో తెలియక వాళ్ళు తికమక చెందారు. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ తన శత్రువులపై బహిరంగ విచారణ ఎందుకు జరపదని కొందరు ప్రశ్నించారు. ఇది వాళ్ళ వ్యవస్థాత్మకమైన లోపాన్నే నిరూపిస్తుంది."[30]

పార్టీకి చెందని మరో పరిశీలకుడి దృష్టిలో సైనిక కార్యకలాపాల వల్ల బీర్భం పోరాటం కూలిపోవడానికి కారణం; అక్కడి రహస్యపార్టీ యంత్రాంగం "మిగతా ప్రాంతాలలోలా పరిపక్వంగా లేనందువల్లనే" అని భావించాడు. "కార్యకర్తలు సాహసవంతులైనా, అన్ని సందర్భాలలోనూ యుక్తిని ప్రదర్శించలేద"ని పేర్కొన్నాడు. కాని సి.పి.ఐ. (మా.లె.) చర్యల వెనకాల తగినంత ప్రజల మద్దతు ఉందని అంగీకరించాడు. "నిజానికి బీర్భంలో మాత్రం పార్టీ కార్యక్రమాలు, (మరెక్కడా లేనంతగా) దాని అనుయాయుల ఇష్టాయిష్టాల ప్రభావంతోనే రూపొందాయి."[31] బహిరంగ కార్యక్రమాలకూ, రహస్య కలాపాలకూ ఉండే తేడా కూడా తరచు లేకపోయేది. తరచు ప్రజాసమీకరణ, గెరిల్లా చర్యలు ఒకదానితో ఒకటి కలసిపోయేవి. WBBRC ఇలా వాపోయింది. "కొన్ని ప్రాంతాలలో గెరిల్లా పోరాట రూపాన్ని అలక్ష్యం చేసారు. గెరిల్లాలు పెద్ద ప్రజాసమూహాలతో గంటల తరబడి వర్గ శత్రువుల విచారణ, ఖతం, ఆస్తులను స్వాధీనం చేసుకోవడంలో తమ శక్తిని ఖర్చు చేసారు. "సాధారణంగా ఇటువంటి బాధ్యతలు విప్లవకమిటీలు కాని, గ్రామరక్షణ దళాలు కాని చేపట్టాలి. చాలా మంది ఈ గుంపులలో తమాషాగా చేరి అయోమయాన్ని సృష్టించారు. కార్యక్రమంలోని గుట్టురట్టయ్యింది."[32]

శ్రీకాకుళం, దేబ్రా–గోపీవల్లభపూరులతో పోలిస్తే, బీర్భం పోరాటం (కాలం)లో, రాజకీయాధికారాన్ని ఏర్పరచే ప్రయత్నం ఒక మెట్టు ఎక్కువేనని చెప్పాలి. మిగతా ప్రాంతాలకంటే, బీర్భంలో బీదరైతులూ, భూమిలేని రైతులూ, మరింత ప్రత్యక్షంగానే, గెరిల్లా చర్యలలోనూ, భూసంస్కరణలలోనూ కూడా పాల్గొన్నారు. అక్కడి సంఘటనల తాలూకూ వాస్తవ పరిణామాలు, నిర్వాహకులను ప్రజాధికారపు ఏర్పాటుకు చెందిన సమస్యలకు దగ్గర చేసాయి. విప్లవ కమిటీలు, ప్రజాసైన్యాలు, భూసంస్కరణలు వంటి సమస్యలతో తలమునకలయ్యారు.

బీర్భం ఉద్యమస్థాయిని మరో విధంగా కూడా అంచనా వెయ్యవచ్చు. 1967 నాటి నక్సల్బరీ పోరాటాన్ని పోలీసులు తాత్కాలికంగానైనా అణచివేసారు. 1970లో దేబ్రా – గోపీవల్లభపూరు ఉద్యమాన్ని పోలీసులు పారామిలటరీ దళాలు కలిసి కాని అణచలేకపోయారు. 1971లో బీర్భం ఉద్యమాన్ని అణిచేందుకై చివరకు సైన్యాన్నే దించవలసి వచ్చింది. ఉద్యమ పరిపక్వాన్ని బట్టే ప్రభుత్వ దమనచర్యల స్థాయి కూడా

పెరిగింది. బీర్భంలోని 'ఎర్రస్థావరాలు' సైనిక జోక్యంలో విచ్ఛిన్నమయ్యాయి. సి.పి.ఐ. (మా.లె.) పార్టీలో స్థావర ప్రాంతాలు, పి.ఎల్.ఎ. సైన్యం, ప్రతిదాడి (Counter-attack) మొదలైన వాటి గురించి చర్చలు మొదలయ్యాయి.

## స్థావర ప్రాంతం

'స్థావర ప్రాంతం' (Bare Area) గురించి నినాదం 1970 నాటి నుంచీ పార్టీ వర్గాలలో జరుగుతోంది. శ్రీకాకుళ కమ్యూనిస్టు విప్లవకారులు కొందరు మాత్రం మైదాన ప్రాంతంకంటే, తాత్కాలికంగా దుర్గమమైన కొండ ప్రాంతాలలోనే అటువంటి స్థావర ప్రాంతాన్ని ఏర్పరచడం మంచిదని తలచారు.

దేబ్రా–గోపీవల్లభపూర్ ఉద్యమం విఫలమయ్యాక, 1971 జూలైలో అషించటర్జీ కూడా అదే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. ఆ నెలలో బెంగాలు, బీహారు – ఒరిస్సా ప్రాంతీయ సరిహద్దు కమిటీ తయారు చేసిన "ఎర్రచింగ్ కాంగ్ వేసిన వెలుగుబాటయే భారత ప్రజల విమోచనా మార్గం" అనే పత్రంలో మావో సేటుంగు 1927లో తన మొదటి స్థావరాన్ని చింగ్‌కాంగ్ పర్వతాలలో నిర్మించాడనీ, అదే మాదిరిగా భారత విప్లవకారులు కూడా కొండ కోనల ప్రాంతాలనే స్థావర ప్రాంతాల ఏర్పాటుకు అనుకూల ప్రదేశాలుగా భావిస్తారని పేర్కొంది.

బీర్భం ఉద్యమంలో ఒకానొక దశలో, సైన్యం వెంట తరిమితే సంతాల్ పరగణాలలోని కొండలూ, అడవులూ అనువైన స్థావరంగా పనిచేస్తాయని గెరిల్లాలు ఆశించారు. కాని WBBRC ఆ అభిప్రాయలను వ్యతిరేకించింది. "మనక్కావలసింది స్థావర ప్రాంతం. కాని మనం దాన్ని ఎక్కడ ఏర్పరచగలం? ఎలా ఏర్పరచాలి? ప్రజలను వదిలేసి దీని గురించి కొండల్లో, అడవుల్లోనూ వెదకాలా?... 1924–27 మధ్యకాలంలో చైనాలోని మొదటి విప్లవ అంతర్యుద్ధ కాలంలో ఛైర్మన్ మావో, కామ్రేడ్ చౌ–ఎన్–లై, కామ్రేడ్ చూటేలు మొదటగా చింగ్‌కాంగ్ పర్వత శ్రేణులలో చైనా కమ్యూనిస్టు పార్టీ యొక్క శక్తివంతమైన ప్రజా సైన్యసమీకరణ జరిగింది. చైనా దేశపు ప్రజా సైన్యం (ఆ విధంగా) ఏర్పడింది. అటువంటి బలమైన ప్రజాసైన్యం ఈనాడు మనకు ఉందా? విస్తృత మైదాన ప్రాంతాలలో పోరాటాన్ని నిరంతరం విస్తరించడం వల్ల కొత్త కొత్తగా గెరిల్లా స్క్వాడ్లను నిర్మించవలసిన బాధ్యత మనకు కలగలేదా? ప్రజా సైన్యాన్ని పటిష్ఠం చేయవలసిన అవసరము కూడా మనకు కలుగుతోంది. 'కొండ–అడివి సిద్ధాంతాన్ని' (Hill-Forest Theory) ఈ దశలో ప్రతిపాదించడం ద్వారా ఆయా బాధ్యతలను వదిలెయ్యాలని చెప్పడం కాదా? ఆ వాదన ద్వారా

ప్రస్తుతం పశ్చిమ బెంగాలులో పంజాబులో జరిగే పోరాటాన్ని కాదనడమే కదా?"33

స్థావర ప్రాంతపు ఏర్పాటుకు అవసరమైన మూడు ప్రధాన లక్షణాలను ఆ నివేదిక పేర్కొంది. "1) బహుళమైన ప్రగాఢమైన ప్రజా ప్రాతిపదిక, 2) తగిన బలం కల ప్రజా సైన్యం, 3) స్థిరమైన పటిష్టవంతమైన పార్టీ వ్యవస్థ.

1. గ్రామప్రాంతంలో రైతాంగ రాజకీయాధికారం ఏర్పరిచాక ఎంత తక్కువగా ఎర్ర ప్రాంతాన్ని (Ref area) విస్తరించగలిగితే మన ప్రజా ప్రాతిపదిక అంత ప్రగాఢమౌతుంది.

2. బీదరైతులు భూమిలేని రైతులతో నిర్మించిన గెరిల్లా దళాల ఆధారంగా సాయుధ రైతాంగ విమోచన పోరాటాన్ని విశాల భూభాగంలో ఎంత ఎక్కువగా వ్యాపింప చేస్తే మన ప్రజాసైన్యం అంత బలంగానూ ఉంటుంది. శత్రువు తన బలాలను విభజించవలసి వస్తుంది. తన పది వేళ్ళను పది దిశలలో చాపవలసిన నిస్సహాయస్థితిలో పడతాడు."[34] (వక్కాణింపు చేర్చబడింది – అను)

అషీం చటర్జీకి జవాబుగా చారుమజుందారు ప్రత్యేకించి ప్రాదేశిక పరిస్థితుల గురించి (terrain) వివరించాడు. సాయుధ సైన్యం, రాజకీయంగా చైతన్యవంతమైన ప్రజలు, స్థావర ప్రాంతపు ఏర్పాటుకు ప్రధాన పాత్రిపదికలుగా పేర్కొన్నాడు. "ముందు ఈ రెండు షరతులూ అమలు పరిస్తే, ఆ తరవాత భూభాగం (terrain) సంగతి వస్తుంది. కొండలలో తలదాచుకునే పరిస్థితి ఏర్పడిందంటే ప్రజాబాహుళ్యం నుంచి వేరుపడే అవకాశం ఏర్పడిందన్నమాట... కొండలలో స్థావరాలను కనుక నిర్మిస్తే, మైదానాలలోకి సాయుధ ప్రచారక స్క్వాడ్లను పంపే బాధ్యతను చేపట్టాలి. రైతాంగ ప్రజలనూ, రాజకీయంగా చైతన్యవంతం చెయ్యాలి. యూనిట్లను ఏర్పరచి, శత్రువును గెరిల్లా ఎత్తుగడలతో వేధించాలి. ఈ పని చాలా ముఖ్యమైనది. శత్రువు తలపెట్టిన 'చుట్టుముట్టి అణచివేత కార్యక్రమా (encirclement and suppression)న్ని కొండ ప్రాంతాలలో సులువుగా అమలు పరచగలడు." "చారుమజుందారు ఈ విషయంలో అషీంచటర్జీ సలహాను త్రోసి పుచ్చాడు. "పశ్చిమ బెంగాలు (ఉద్యమం)లో కొండలలో స్థావరాలు ఏర్పరచడం అంటే రైతులను శ్రామిక జనబాహుళ్యాన్ని వదిలేయడమే. సాయుధ పోరాటపు జ్వాలలపై నీళ్ళు చల్లడమే."(60) గ్రామాలలో బీదరైతుల, భూమిలేని రైతుల నాయకత్వంలో విప్లవ కమిటీలను ఏర్పరచాలనీ, వాటి చుట్టూ రైతాంగ ప్రజా బాహుళ్యాలను సమీకరించడం స్థావర ప్రాంతాల ఏర్పాటుకు ఎంతో అవసరమని, చారుమజుందారు పునరుద్ఘాటించాడు. (అదే వ్యాసం) గెరిల్లాలు కాని, ప్రజా విముక్తి సైన్యంకాని, శత్రుదాడివల్ల గ్రామాల నుంచి పారిపోవలసి వచ్చినా కూడా, ఆ పరిస్థితిలో

విప్లవకమిటీలు రహస్యంగా రాజకీయ ప్రచారాన్ని కొనసాగించవచ్చునని భావించాడు. ఈ కమిటీలు విస్తృత రైతాంగ ప్రజల నుంచి ఏర్పడతాయి కాబట్టి, ("..... పార్టీ వెలుపలి నుంచే విప్లవకమిటీ సభ్యులను అధిక సంఖ్యలో ఎన్నుకోవాలి..."(39)) వాటికి శతృబలాలకు సంబంధించిన అనుపానులు తెలుసుకోవడం మరింత సుళువుగా ఉంటుంది. ఒక స్థావరం (camp)లో ఎంతమంది సైనికులున్నారు. ఎలా నియమించబడ్డారనే వివరాలు సేకరిస్తాయి. "శతృవు తప్పుడు సమాచారంతో పెడదారి పట్టించడం నుంచి, విషమిచ్చి శతృవును చంపడం వరకూ." అన్ని రకాల ఎత్తుగడలనూ అనుసరించడం సాధ్యపడుతుంది. బీర్భంలో సైన్యం ప్రవేశించినప్పుడు శతృవును మభ్యపరిచేందుకు గ్రామీణులు అన్ని రకాల కథలనూ ప్రచారం చేసారు. "ఒక శతృవు ఖతమయ్యాక ఆ ప్రాంతానికి సైన్యం రాగానే ప్రజలు ఇలా అన్నారు. 'ఆ హత్యను నిక్కర్లు చొక్కాలు తొడుక్కుని టోపీలు పెట్టుకున్న బయటివాళ్లెవరో చేసారు.' గెరిల్లాలు రైఫిళ్ళతో వచ్చారు. వాళ్లు 20 నుంచి 25 రైఫిళ్ళ దాకా పట్టుకుని సంచుల కొద్దీ బాంబులు వెంట తీసుకు వచ్చారనే కథను ప్రజలు ప్రచారం చేసారు."[35]

సాధారణ ప్రజలకున్న ఈ చాకచక్యాన్ని దృష్టిలో ఉంచుకున్న చారుమజుందారు గ్రామీణ కేడర్లను ఇలా కోరాడు. "పిల్లలు, స్త్రీల విషయంలో మనం ప్రాధాన్యత చూపాలి. మనం వాళ్ళ పరిస్థితిని వాళ్ళే అర్థం చేసుకోగలిగేలా పిల్లలతో వ్యవహరించాలి. ఛైర్మన్ ఆలోచనను వాళ్ళకు బోధించాలి..."(30)

స్థావర ప్రాంతాల స్థిరత్వం గురించి చెపుతూ, ఒక ప్రాంతంలోని మొత్తం ప్రజలను సాయుధుల్ని చేయడంపైనే ఇది ఆధారపడుతుందన్నాడు.(60) ఈ సందర్భంలో, మావో సేటుంగు మాటలను తన అనుయాయులకు గుర్తు చేసాడు. "నిజానికి స్థావర ప్రాంతపు ప్రజల గురించి సైనకపరంగా చెప్పుకునేటప్పుడు సాయుధులైన ప్రజలున్నారనుకునే మనం చర్చిస్తున్నామన్న మాట. శతృవు మన స్థావర ప్రాంతంపై కన్నెత్తి చూడలేక పోవడానికి అదే ముఖ్యకారణం."[36] ప్రజా సైన్యాలను నిర్మించి, బీర్భం ప్రజలను సాయుధుల్ని చేయకపోవడం చేత, పార్టీ ప్రజాసమీకరణను విస్తృతంగా చేసినప్పటికీ, సైన్యం బీర్భంలో నిరాటంకంగా ప్రవేశించింది.

కాని ఈ పరిస్థితులన్నీ - అంటే సుసన్నద్ధమైన సైన్యం, రైతాంగం మొత్తం సాయుధులు అవడం, విప్లవకమిటీ ఆధ్వర్యంలో ప్రజల రాజకీయ సమీకరణ - ఉన్నా కూడా, మన దేశంలో నిశ్చలమైన స్థావర ప్రాంతం మనగలుగుతుందా? లేక అటువంటి ప్రాంతాన్ని దుర్గమమైన చంబల్ లోయలో కాని విదేశీ సరిహద్దులు కల నాగాలాండ్ వంటి ప్రాంతాలలోనే నిర్మించాలా?

చలనాత్మక స్థావర ప్రాంతాల (mobile base areas) గురించి మావో సేటుంగ్ వైఖరి గమనార్హం. చైనాలోని రెండవ విప్లవం అంతర్యుద్ధ కాలంలో, నిరంతరం మారిపోయే ఎర్రసైన్యపు యుద్ధరంగాల గురించి చెపుతూ మావో 1936 డిశెంబరులో ఇలా అన్నాడు. "యుద్ధ రంగాలలో చలనం వల్ల మన స్థావర ప్రాంతాల విస్తీర్ణంలోనూ చలనం ఉంటుంది. మన స్థావర ప్రాంతాలు కూడా. తరచుగా ఒక స్థావర ప్రాంతం కూలిపోయి మరో స్థావర ప్రాంతం ఏర్పడుతూ ఉంటుంది." తన కామ్రేడ్లకు ఇలా హామీనిచ్చాడు. "మనం నేడు చలనాత్మక ధోరణిలో వ్యవహరిస్తే, రేపు సాపేక్షికంగా స్థిరత్వాన్ని సాధించుకుని చివరకు పూర్తి స్థిరత్వాన్ని సాధిస్తాం"[37] పదకొండు సంవత్సరాల తరువాత, జపాను, యుద్ధకాలంలో, మళ్ళీ తన అనుయాయులకిలా సలహా ఇచ్చాడు. "శత్రువు మూలబలాన్ని తుడిచిపెట్టడం మన ప్రధానాశయంగా భావించండి. ఒక పట్టణాన్ని కాని ప్రదేశాన్ని కాని పట్టుకోవడం ప్రధానాశయంగా భావించవద్దు. ఒక పట్టణాన్నో ప్రదేశాన్నో శత్రువు మూలబలాన్ని తుడిచిపెట్టడం ద్వారానే పట్టుకోవాలి. అనేక సార్లు చేతులు మారిన తరవాతే ఒక పట్టణాన్ని కాని ప్రదేశాన్ని కాని పట్టుకోవడం మంచిది."[38]

దాడి చేసి కాని, స్థావర ప్రాంతాన్ని పరిరక్షించుకునేటప్పుడు కాని, 'శత్రువు మూలబలాన్ని' తుడిచిపెట్టడానికి (కావలసిన) ప్రజాసైన్యం ఏర్పడే ఉండాలి. సరిగా ఈ కారణం చేతనే, 1971 మొదటి నుంచీ చారుముజుందారు రాతలలో ప్రజావిమోచన సైన్యపు ఏర్పాటు విషయంలో కనపరచిన వక్కాణింపు ప్రాధాన్యతను సంతరించుకుంది. అప్పటికి శత్రువు శ్రీకాకుళం దేబ్రా–గోపీవల్లభపూరులలోని స్థావర ప్రాంతాలను నిర్మూలించాడు. విప్లవకారులలో చాలా మందిని పొట్టన పెట్టుకున్నాడు. శత్రువుకు కలిగిన నష్టం స్వల్పమే. దీనితో సాయుధులైన ప్రజాసైన్యం ఏర్పరచవలసిన అవసరం మరీ బలపడింది. బీర్భం విప్లవకారులు కొన్ని ప్రదేశాలలో తమ పలుకుబడిని నిర్మించుకున్నారు. ప్రజాబలం ఉంది. కానీ గెరిల్లాలు కొండలలోకి పారిపోయారు. తగినన్ని గెరిల్లా దళాలు లేనందున 'శత్రువు మూలబలంపై' దెబ్బ తీయలేకపోయారు. గెరిల్లా దళాలను సాయుధ సైన్యంగా మలచలేదు. ప్రజలను సాయుధుల్ని చేయలేదు. ఈ కారణాల చేత, సైన్యాలు తరలిరాగానే, ప్రతిగా, గెరిల్లాలు వాటిని చుట్టుముట్ట లేకపోయారు.

ప్రజావిమోచన సైన్యపు ఏర్పాటును గురించి 1972 ఆరంభానికి చారుమజుందారు అభిప్రాయాలు మరింత స్పష్టమయ్యాయి. శ్రీకాకుళం, దేబ్రా–వల్లభపూరు, బీర్భంలోని వాస్తవిక అనుభవాలు, సంఘటనల తాలూకు వాస్తవ పరిణామాలతో అవి

స్పష్టమయ్యాయి. గతంలో ఊహాత్మకంగా, పదజాలంలో విషయాలు, పొంతనతో ఖచ్చితమైన రూపాన్ని సంతరించుకున్నాయి. త్రిపుర చెప్పిన కామ్రేడ్లకు రాసిన లేఖలో ఇలా చెప్పాడు. "తమ ఇళ్లను వదిలి ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నవాళ్లతో పార్టీ నాయకత్వంలో మామూలు సైన్యం ఏర్పడుతుంది. తరువాత దశలో ప్రజా బాహుళ్యాన్ని విస్తృతంగా సాయుధం చేయడం ద్వారా ప్రజా సైన్యం ఏర్పడుతుంది. తమ ఇళ్లను వదలలేకపోయినా స్థానిక పోరాటాలలో పాల్గొనేవాళ్లతో విప్లవ కమిటీల నాయకత్వంలో స్థానిక దళం ఏర్పడుతుంది. ఈ మూడు విధాల సైనిక బలాలూ, మన ప్రజా యుద్ధంలో మూడు మూల స్తంభాలుగా ఉంటాయి."(72)

ప్రజాయుద్ధం చేసేందుకు ప్రజావిమోచన సైన్యం ఏర్పాటుతో పాటు, రైతాంగాన్ని సమీకరించేందుకు ప్రజా ఉద్యమాలను నిర్వహించవలసిన అవసరం కూడా, ఈ కాలంలో మరింత గుర్తింపు పొందింది. చారుమజుందారు 1971 నవంబరులో పంట మాసూలుకు ఇచ్చిన పిలుపులో ఇది ప్రతిబింబించింది. "సాయుధ పోరాటాన్ని మొదలెట్టాక, ప్రజా ఉద్యమానికి మనం నాయకత్వం వహించడం ఇదే మొదటిసారి. మన పోరాటంలో వెనుకబడిన రైతులు కూడా పాల్గొనేలా చేయడమే ఈ ఉద్యమ ఆశయం. ఈ ప్రజా ఉద్యమాన్ని నిర్వహించకుండా మరోలా మన ఆశయాన్ని సాధించలేం." ఉద్యమంలో శత్రువులు, మిత్రుల గురించి ఇలా వివరించాడు. "వర్గశత్రువు నెదుర్కొనేందుకు ఈ ఉద్యమం నడుస్తుంది. వర్గశత్రువులంటే జోతెదారు వర్గం. పోలీసులతో చురుకుగా సహకరించే ధనిక రైతులపై కూడా ఈ పోరాటం జరగవచ్చు. ఈ పోరాటంలో మిగతా వర్గాలన్నీ మన మిత్రులు."(65) పోరాటాన్ని విప్లవ కమిటీల ద్వారా నడపాలని పార్టీని ఆదేశించాడు. "గెరిల్లా దళాలు అన్ని వేళలా విప్లవ కమిటీలకు సాయపడతాయి."

ప్రజా ఉద్యమాలపై అతని వక్కాణింపు, "పోలీసులతో చురుకుగా సహకరిస్తున్న ధనిక రైతుల"ను ఇతర విభాగాల నుంచి వేరుపరచి పేర్కోవడం వంటివి కొంతవరకూ అతనికీ, అతని విమర్శకులైన అషీం చటర్జీకి సత్యనారాయణ సింగుకూ గల విబేధాలను తగ్గించాయి. నిజానికి అషీంచటర్జీ జూలై 1971 నాటి పత్రంలో ప్రతిపాదించిన 'రైతాంగ కమిటీలకూ' ఈ దశలో చారుమజుందారు రూపొందించిన 'విప్లవ కమిటీలకూ' పెద్ద తేడా ఏమీ లేదు. "ప్రజల రాజకీయాధికారపు ప్రధాన సాధనాలుగా, "రైతాంగ కమిటీలను పేర్కొంటూ, అషీంచటర్జీ వాటి కార్యక్రమాన్ని వివరించాడు. "(1) పంటల మాసూలు భూమి ఆక్రమణ, ప్రజల ఆస్తులను తిరిగి తీసుకోవడం వంటి ప్రజా కోర్కెలపై వివిధ ప్రజా ఉద్యమాల నిర్వహణ, (2) పోలీసు వేటకాలంలో

కూడా ఉత్పత్తిని కొనసాగించడం, (3) ప్రజాశత్రువును గుర్తించి (గెరిల్లా) దళం సాయంతో శిక్షించడం, (4) పోలీసు దళాన్ని ఎదిరించడం, (5) వీలైనంతవరకు (గెరిల్లా) స్క్వాడు సభ్యుల బంధువులను కాపాడడం."[39]

కాని ఈలోగా దేశ సరిహద్దుకావల జరిగిన కొన్ని ప్రధాన పరిణామాలు తమతో మరో సిద్ధాంతపరమైన వివాదాన్ని మోసుకొచ్చాయి. సి.పి.ఐ. (మా.లె.) పార్టీలో మరో చీలికకు దారి తీసింది.

## తూర్పు పాకిస్తాన్ – 1971

పాకిస్తానులో సైనిక పాలన విధించారు. 1971 మార్చిలో తూర్పు పాకిస్తానులో 'విముక్తి పోరాటం' (Liberation Struggle) మొదలైంది. 1970లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో షేక్‌ముజిబుర్ రహమాన్ పార్టీ 'అవామీలీగ్' విజయం సాధించింది.

అవామీలీగ్‌లో ప్రధానంగా, గ్రామీణ భూస్వాములు పెత్తందారీ వర్గం, బెంగాలి నగర పెట్టీబూర్జువా వర్గాలు, సభ్యులు, షేక్‌కు, అతని మిత్రులలో చాలా మందికీ కూడా ఒకప్పుడు గాఢమైన అమెరికా – అనుకూల భావాలుండేవి. పాకిస్తాను, సైనిక ఒప్పందాలతో అమెరికాకు కట్టుబడి ఉండాలా, వద్దా, అనే సమస్యపై అవామీలీగులో 1956లో చీలిక వచ్చింది. హెచ్.ఎస్. సురావర్ది అనుసరించిన అమెరికా అనుకూల వైఖరిని సమర్థిస్తూ షేక్ అవామీలీగులోనే ఉండిపోయాడు. మౌలానాచాషామీ బయటకొచ్చి తన అనుచరులతో వామపక్షాత్మకమైన అవామీ పార్టీని స్థాపించాడు. కాని షేక్ ఆధ్వర్యంలోని అవామీ పార్టీ మాత్రం, గ్రామాలలో, నగరాలలో గల బెంగాలీ మధ్య తరగతి వర్గాలలో పలుకుబడిని సంపాదించుకుంది. పాకిస్తానీ సైనిక పరిపాలనకు వ్యతిరేకంగా వాళ్లని సమీకరించింది. వాళ్ళ కష్టాలకు ప్రాతినిధ్యం వహించింది. తూర్పు పాకిస్తానును వలస రాజ్యంగా భావిస్తూ, (పశ్చిమ) పాకిస్తాను పాలకులు జరిపే పీడనకు ఎదురు నిలిచింది. దానివల్ల 1970 ఎన్నికలలో అవామీలీగు ఘన విజయం సాధించింది.

అవామీలీగు రాజ్యాంగపరమైన సాంప్రదాయికబద్ధమైన పార్టీ. అది బెంగాలీ ఉన్నత వర్గాల, మధ్య తరగతి వర్గాల క్షేమాన్నే ఆకాంక్షిస్తుంది. అందుచేత మొదటగా అది తూర్పు పాకిస్తానుకు స్వయం ప్రతిపత్తిని (పాకిస్తానులో) కోరింది. కాని భుట్టో మొండివైఖరి అవలంభించి, తూర్పు పాకిస్తానును బల ప్రయోగంతో లొంగ దీసుకోవచ్చునని, యాహ్యాఖాను ద్వారా జరిపించిన సైనిక దమనకాండతో, షేక్ అతని అనుచరులు వేర్పాటు ఉద్యమాన్ని లేవదీశారు. అవామీలీగ్ తన అనుచరులను

ప్రజా బాహుళ్యాన్నీ సాయుధ తిరుగుబాటుకు సన్నద్ధపరచలేకపోయింది. అందుకు కారణం దాని రాజ్యాంగపరమైన రాజకీయాలే. అందుచేతనే 1971 మార్చి 21వ తేదీన ప్రారంభమైన సైనిక దమనకాండను తిరుగుబాటు చేసిన బెంగాలీ సైనికులు, విద్యార్థి వాలంటీర్లు సాయుధంగా ఎదిరించడం కేవలం యాధృచ్ఛికమే. ఎలా చూసినా అది ప్రజా విప్లవం అనిపించుకోదు. తూర్పు బెంగాలులోని రైతాంగ జనబాహుళ్యం తమవైన ఆర్థిక రాజకీయ కోర్కెలకై, చురుకుగానూ స్వతంత్రంగానూ మరే విధంగానూ (పోరాటంలోకి) ముందుకు రాలేదు.

భారతీయ పాలక పార్టీయైన భారత జాతీయ కాంగ్రెసుకు రాజకీయంగా సన్నిహితమైన అవామీలీగ్ నాయకులు ఇండియాకు పారిపోయారు. భారత ప్రభుత్వ సహాయ సహకారాలతో అక్కడ సాధారణ ప్రభుత్వాన్నీ ఏర్పరచుకున్నారు. తూర్పు బెంగాలు ఉద్యమం దిక్కు తోచకుండా నడుస్తోంది. కొన్ని ప్రాంతాలలో చెదురుమదురుగా దూసుకొచ్చిన గెరిల్లా చర్యలకు, సరైన రాజకీయ నాయకత్వం లేకపోయింది. అందువల్ల అటువంటి చర్యల వల్ల ఎట్టి ఫలితం లేకపోయింది. ఈలోగా పెద్ద పెట్టున జరిగిన పాకిస్తానీ సైనిక దమనకాండతో వేలాది సంఖ్యలో తూర్పు పాకిస్తానీయులు పశ్చిమ బెంగాలు, అస్సాం, బీహారు త్రిపుర రాష్ట్రాలలో శరణార్థులుగా తలదాచుకోసాగారు.

## చైనా వైఖరి

చైనా యాహ్యాఖానునే బలపరిచింది. తూర్పు పాకిస్తానులో ఏర్పడిన సంక్షోభానికి కారణంగా 'పాకిస్తాను అంతరంగిక వ్యవహారాలలో' భారతదేశపు జోక్యాన్ని పేర్కొంది. "పాకిస్తాను వ్యతిరేక ప్రాంతీయ ధోరణులను రెచ్చకొడుతూ మొత్తం తమ ప్రచార యంత్రాంగాన్ని భారతీయ అభివృద్ధి నిరోధకులు ఎక్కుపెట్టారని" పేర్కొంది. సైనిక నియంతృత్వం అక్కడ జరుపుతున్న దమనకాండను "ప్రస్తుత పరిస్థితులలో పాకిస్తాను అధ్యక్షుడు యాహ్యాఖాను తీసుకున్న చర్యలు, పాకిస్తాను అంతరంగిక వ్యవహారాలు..."[40] అంటూ తటస్థంగా వ్యాఖ్యానించింది.

కాని ఆ ప్రకటనలోనే చైనా తూర్పు బెంగాల్ సంఘటనల వెనకాల అమెరికా సోవియటు యూనియనుల కుట్రలున్నాయని పేర్కొనడం గమనించాలి. ఆ రెండు "అగ్రరాజ్యాలు" "భారతీయ విద్రోహులతో సన్నిహిత సమన్వయంతో పనిచేస్తున్నాయని" ఆరోపించింది. పాకిస్తాను అంతరంగిక వ్యవహారాలతో వాళ్ళు మొరటుగా జోక్యం చేసుకున్నారని నిందించింది. దీనివల్ల తూర్పు బెంగాలు సంఘటనలపట్ల చైనా

వైఖరిలోనే ఆంతర్యం తెలుస్తుంది. పాకిస్తాను ఈశాన్యంలో రష్యా ప్రమాదాన్నీ, ఆగ్నేయంలో అమెరికా ప్రమాదాన్నీ ఎదుర్కొంటోంది. రెండు అగ్రరాజ్యాల ప్రోద్బలంతో పాకిస్తానుపై విరోధం పెంచుకున్న భారతదేశం దక్షిణాన ఉంది. బడుగు దేశమైన పాకిస్తాను కూడా విచ్ఛిన్నమై పోతే, భారత ఉపఖండం మొత్తం దక్షిణ దిశగా ఒత్తిడినిచ్చే దుష్టప్రదేశంగా తయారయ్యే ప్రమాదాన్ని చైనా పసికట్టింది. ఈ ప్రాంతంలో ఎట్టి అస్థిరత కలిగినా, చైనా కలవరపడసాగింది. మూడేళ్ళ తరువాత భారతదేశం సిక్కిం హోదాలో మార్పు చేసినప్పుడు కూడా అలాగే కలవరపడింది. హిందూ మహా సముద్రాన్ని చేరాలంటే పశ్చిమ పాకిస్తాను ఒకటే చైనాకు మార్గం. పాకిస్తాను తూర్పు భాగం కనక విడిపోతే తూర్పు పాకిస్తాను వనరులతో నిలబడుతున్న పశ్చిమ పాకిస్తాను కూడా కూలిపోవచ్చని చైనా భయపడింది. ఇన్ని సంవత్సరాలుగా ఎంతో శ్రద్ధగా పాకిస్తానుతో పెంపొందించిన మైత్రి బూడిద పాలవుతుంది.

కాని ఉచ్చనీచాలు లేని సైనిక నియంతృత్వంపై పెద్దగా ఆశలు పెంచుకోవడం వల్ల కొన్ని సందర్భాలలో చిక్కులకు దారితీయవచ్చు. ఒకవైపు చైనా పాకిస్తాను విజయాలను మెచ్చుకుంటున్న కాలంలోనే, లండన్‌లో 'సీటో' (South-East Asia Treaty Organisation SEATO) మండలి సమావేశం జరిగింది. చైనాకు ఇష్టుడూ, నాటి విదేశాంగమంత్రిగా నున్న జెడ్.ఎ. భుట్టో, "దక్షిణ వియత్నాంపై దాడి జరుపుతున్నాడని" హోచిమిన్‌ను గర్హిస్తూ జారీ చేసిన ఒక ప్రకటనపై చల్లగా సంతకం చేశాడు. 1971 మార్చిలో కూడా పాకిస్తాను సైనికులు తూర్పు బెంగాలీలను ఊచకోతగా చంపుతున్నారు. చైనా మరోవైపు "జాతీయ స్వాతంత్ర్యాన్ని, దేశ సర్వం సహాధికారాన్ని, పరిరక్షించుకునేందుకు "పాకిస్తానుకు ఆయుధాలని సరఫరా చేస్తోంది. ఇలా చేయడంతో ప్రపంచ శ్రామిక జనుల స్నేహితుడిగా చైనాకున్న పలుకుబడి దెబ్బతింది. చౌ-ఎన్-లై ఒక సందేశంలో యాహ్యాఖానుకిలా సలహా ఇచ్చాడు. "పాకిస్తాను ఐక్యతను విచ్ఛిన్నం చేయాలనే కొద్దిమంది వ్యక్తులకూ, విస్తృతమైన ప్రజలకూ తేడా చూపడం అవసరం."[41]

1971 నాటి తూర్పు బెంగాలు దారుణ సంఘటనలు జరిగే కాలంలో పాకిస్తానుకు చైనా ఇచ్చిన నిరంతర ప్రోద్బలం, తూర్పు బెంగాలీలను మూకుమ్మడిగా చంపుతూంటే చైనా వహించిన మౌనం, సి.పి.ఐ. (మా.లె.) పార్టీలోని చీలికను మరింత పెంచాయి. ఇండో-పాక్ ఉపఖండంలో మహత్తర వేగంతో భ్రమించే సంఘటనలపై కాలానుగుణంగా చైనా వెలువరించిన ప్రకటనల నుంచి. చారుమజుందారు అనుచరులొకలాగ, అతని విమర్శకులు మరోలాగ, రెండు రకాల నిర్ణయాలకు వచ్చి

అభిప్రాయాలు ఏర్పరుచుకున్నారు. ఈ దశలో సి.పి.ఐ. (మా.లె.) పార్టీలో అంతరంగిక ఘర్షణ గురించి చర్చించే ముందు, తూర్పు పాకిస్తానులో రహస్యంగా పనిచేస్తున్న మావోయిస్టులను గురించి కూడా తెలుసుకోవాలి.

## తూర్పు పాకిస్తాను కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)

1970లో తూర్పు పాకిస్తాను కమ్యూనిస్టు పార్టీ (మా.లె.) ఏర్పడింది. మౌలనా భాషామీ నేషనల్ అవామీ పార్టీకి జనరల్ సెక్రటరీగా నున్న మహమ్మద్‌తోషా దానికి నాయకుడు. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ప్రత్యక్ష ప్రోద్బలంతో, ప్రత్యేకించి చారుమజుందారు ప్రోద్బలం వల్లనే ఆ పార్టీ ఏర్పడి ఉండొచ్చు. తూ.పా.క.పా. (మా.లె.) ఏర్పడిన వెంటనే పరస్పరం రాసుకున్న అభినందన లేఖల వల్ల ఇది తెలుస్తుంది.[42]

గతంలో తూర్పు పాకిస్తానులో మావోయిస్టుల చర్యలు, మే 1970 నాటి ఢాకా బాంబు ప్రేలుడు వంటి కొద్ది సంఘటనలకే పరిమితమై ఉండేవి. మే 12వ తేదీన ఢక్కాలోని అమెరికన్ సమాచార శాఖ కేంద్రంలో ఒక నాటు బాంబు పేలింది. ఒక ఆకాశరామన్న సందేశం ఇలా చెప్పుకుంది. "మావో సేటుంగ్‌ను అనుసరించే విప్లవకారులు కాంబోడియాలో అమెరికా చేస్తున్న పనులకు గుణపాఠం చెప్పేందుకు చేసిన పని ఇది." పార్టీ ఏర్పాటుతో వాళ్ళ కార్యకలాపాలు గ్రామ ప్రాంతాలకు బదిలీ అయ్యాయి. తరువాత పార్టీ ఒక పత్రాన్ని వెలువరించింది. దానిలో తన నాయకత్వంలో, "తూర్పు పాకిస్తానులో 1970 అక్టోబరు నాటికి సాయుధ రైతాంగ పోరాటం ప్రారంభమైందనీ పార్టీ నాయకత్వంలోని గెరిల్లా యూనిట్లు వర్గశత్రువుల నిర్మూలనా యుద్ధం మొదలెట్టారని... గ్రామ ప్రాంతాలలోని బీదరైతులనూ భూమిలేని రైతులనూ ఛైర్మన్ మావో బోధనలతో ప్రబోధించేందుకు వందలాది యువకులు గ్రామ ప్రాంతాలకు తరలివెళ్ళారనీ..." ఆ పత్రం పేర్కొంది.[43]

తూర్పు పాకిస్తానులో తూ.పా.క.పా. (మా.లె.) పార్టీ కార్యకలాపాలకు చారుమజుందారు చాలా ప్రాధాన్యతనిచ్చాడు. 1970 నవంబరులో తాను పంపిన సందేశంలో రైతాంగ సాయుధ పోరాటాన్ని మొదలుపెట్టినందుకు పార్టీని అభినందించాడు. "చాలా ప్రతికూల పరిస్థితులలో పోరాటాన్ని" ప్రారంభించిందని గుర్తించారు. ధ్వనిగా చెపుతూనే ముఖ్యమైన సూచనను కూడా చేసాడు. "దమన చర్యకు ఎదురొడ్డి, బూర్జువా సంకుచితత్వాన్ని ఎదిరిస్తూ కూడా మీ పోరాటాన్ని మొదలెట్టారు."(45)

ఉన్నత మధ్య తరగతి బెంగాలీ వర్గాల తరఫున సైనిక పాలకుల నుంచి బెంగాలీ జాతీయతత్వం పేరుతో, రాయితీలనూ లాంఛనాలను పిండుకునేందుకు, షేక్‌ముజీబ్ రూపొందించే పథకాలను తూర్పు పాకిస్తాను మావోయిస్టులు మొదటి నుంచీ నిరసిస్తూనే ఉన్నారు. సి.పి.ఐ.(మా.లె.) పార్టీ ఇలా పేర్కొంది. "కార్మికులకు మరింత జీతాలు కావాలని కాని, రైతాంగానికి భూమిని పంచడం గురించి కాని. పాకిస్తానులో సామ్రాజ్యవాద పెట్టుబడుల గురించి కాని ముజీబు ముతా ఏమీ మాట్లాడదని గుర్తించాలి..."[44] ఆరు సూత్రాలు ప్రాతిపదికగా ఎన్నికలలో పాల్గొన్న అవామీలీగు రైతుల కోర్కెలనుగాని, కార్మికుల కోర్కెలను కాని, అందులో చేర్చనేలేదు. తూ.పా.క.పా.(మా.లె.) పార్టీ ఏర్పడగానే ముజీబ్ తన పథకాలకు ముప్పు వస్తోందని గుర్తించాడు. తూర్పు బెంగాలు జనాభాలో ప్రధాన భాగమైన బీదరైతులను భూమిలేని రైతులను సమీకరించేందుకు గ్రామాలకు వెళ్ళాడు. ఎన్నికలలో అవామీలీగ్ నెగ్గిన తరువాత 1971 జనవరి 1వ తేదీన జరిగిన విజయోత్సవంలో షేక్ ప్రసంగిస్తూ, కమ్యూనిస్టు విప్లవకారుల కార్యకలాపాలను గురించి శ్రోతలను హెచ్చరించాడు. ఏదో కొందరు వ్యక్తులను చంపి ఎవరూ విప్లవాన్ని సాధించలేరని ఉద్ఘాటించాడు.[45] తూ.పా.క.పా.(మా.లె.) గ్రామ ప్రాంతాలలో జరుపుతున్న కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని చెప్పిన మాటలు అవి.

అవామీలీగు ఘనవిజయంతో, తూర్పు పాకిస్తానులోని బెంగాలీ మధ్య తరగతి ప్రజలు తబ్బిబ్బైపోయి వేర్పాటు ఉద్యమపు పెనుతుఫానులో చిక్కుకుపోయారు. ఆ రాష్ట్రంలో కమ్యూనిస్టు విప్లవకారులు మాత్రం ఆ విజయంలో, "ప్రజా చైనాపైన దాడి జరిపేందుకు, ఇండియా, బర్మా, ఆగ్నేయాసియా దేశాలలో జరుగుతున్న విమోచనోద్యమాలపై దాడులు జరిపేందుకై, తూరు బెంగాలు స్థావరంగా పనిచేసే ప్రమాదాన్ని..."[46] గుర్తించారు. చారుమజుందారు ఆ సంవత్సరం ఫిబ్రవరిలో ఇలా రాసాడు. "పశ్చిమ బెంగాలులో జరిగే పోరాటం అనతికాలంలోనే తూర్పు పాకిస్తానులోకి వ్యాపిస్తుందని సామ్రాజ్య వాదులకూ, సోషల్ సామ్రాజ్యవాదులకూ తెలుసు. ఈ విమోచన పోరాటపు ప్రవాహాన్ని అప్పుడు ఎవరూ ఆపలేరు. ఇండో-చైనాలో (ఉద్యమం) మూడు దేశాలకూ వ్యాపించినట్టుగానే అనతి కాలంలో ఈ రెండు పోరాటాలు ఒకటైపోతాయి...."(50) అని తూర్పు పాకిస్తానులో తూ.పా.క.పా. (మా.లె.) నాయకత్వంలో జరుగుతున్న రైతాంగ సాయధ పోరాటం గురించి పేర్కొన్నాడు.

1971 సంక్షోభపు మాసాలలో చారుమజుందారు ఆలోచనలలో ఉభయ

బెంగాలులో పోరాటం ఏకమవడం గురించిన అభిప్రాయమే బాగా చోటు చేసుకుంది. ఆ భావం తరచుగా అతని రాతలలో పునరుద్ఘాటించబడింది పార్టీలోని విమర్శకులకు అది మరో సాకుగా తయారైంది.

కాని 1971 ఆరంభంలోని పరిస్థితి, ఉభయ బెంగాలులోని కమ్యూనిస్టు విప్లవకారుల సంయుక్త కార్యాచరణకు చాలా అనుకూలంగా ఉంది. మూకుమ్మడి హత్యాకాండ నుంచి తప్పించుకుంటున్న బెంగాలీ శరణార్థులకు భారతదేశం తన సరిహద్దు ద్వారాలను తెరిచింది. అలాగే తన ఏజంట్లను తూర్పు పాకిస్తానులోకి చొప్పించుకునే వీలు కలిగించుకుంది. దీనివల్ల కమ్యూనిస్టు విప్లవకారులు కూడా తూర్పు, పశ్చిమ బెంగాలుల మధ్య బాహాటంగా తిరగసాగారు. తూర్పు బెంగాలులో పాకిస్తానీ సైనిక దుశ్చర్యకు ముందు కూడా, అంటే 1971 ఫిబ్రవరి నాటికే, పాకిస్తానీ సైనికాధికారులు రెండు బెంగాలుల మధ్య నక్సలైటులు తిరగడం గురించి కలత చెందారు. ధక్కాలోని పాకిస్తాను డివిజనల్ కేంద్రాలయం సరిహద్దు ప్రాంతంలో పశ్చిమ బెంగాలు లోపల ఫిబ్రవరి 26వ తేదీన జరిన సంఘటన గురించి, 1971 మార్చి 2, 3 తేదీలలో రావల్పిండికి తెలియజేసింది. సి.పి.ఐ.(మా.లె.) పార్టీ ద్వారా గెరిల్లా శిక్షణ పొందేందుకు రఫీకుల్ ఇస్లాం అనే వ్యక్తిని తూ.పా.క.పా. (మా.లె.) పార్టీ పశ్చిమ బెంగాలుకు పంపింది. పశ్చిమ బెంగాలులో పోలీసులతో జరిగిన ఘర్షణలో ఇస్లాం చనిపోయాడు.[47] సైనికాధికారులు 1971 మార్చి నెల అంతటా 'నక్సలైటు' సంచారాలను అరికట్టాలని తూర్పు పాకిస్తాను రైఫిలు దళాలనూ, సరిహద్దు కాపలాదళాలనూ, హెచ్చరిస్తూనే ఉన్నారు. భారత పోలీసుల సాధింపు చర్యల నుంచి తప్పించుకునేందుకు పశ్చిమ బెంగాలు గెరిల్లాలు తూర్పు బెంగాలుకు దాటుకు పోతున్నారనీ, లేదా తూర్పు బెంగాలు కమ్యూనిస్టు విప్లవకారులు, ఆయుధాలతో మందుగుండు సామాగ్రితో సహా పశ్చిమ బెంగాలులోకి తరలిపోయేవారని దీనివల్ల తెలుస్తోంది.[48]

ఆ పరిస్థితులలో, సహజంగానే ఉభయ బెంగాలులోని రైతాంగాన్ని సంయుక్త సాయుధ పోరాటానికి సమీకరించి ప్రోత్సహిస్తే, అటువంటి సంయుక్తమైన తిరుగుబాటు పాలక వర్గాలకు తీవ్రమైన ప్రమాదంగా రూపొందుతుందని సి.పి.ఐ.(మా.లె.) పార్టీ ఆశించింది. 1971 మార్చి 20 తేదీ నాటి 'దేశబ్రతి' సంపాదకీయం ఇలా పేర్కొంది. "తూర్పు బెంగాలులో కూడా పశ్చిమ బెంగాలులో వలెనే అచ్చుట గల మాలె కమ్యూనిస్టు పార్టీ (నాయకత్వంలో) సాయుధ రైతాంగ పోరాటాలు మొదలయ్యాయి. మళ్ళీ రెండు బెంగాలులూ ఏకమయ్యే అవకాశం కనపడుతోంది. ఈ ధోరణిని వ్యతిరేకించేందుకై,

సామ్రాజ్యవాద ప్రయోజనాలను (పరిరక్షించేందుకై) రెండు బెంగాలులనూ సామ్రాజ్యవాద పద్ధతిలో ఐక్యం చేయడానికి ముజీబూ అతని అవామీలీగు ప్రయత్నిస్తున్నాయి.”

రోజులు గడిచేకొద్దీ, సంయుక్త కార్యాచరణకు పరిస్థితి సానుకూలపడుతోంది. ఒక వ్యాఖ్యాత 1971 మే నెలలో ఇలా అన్నాడు. “తీవ్రవామక్షవాదులు నాయకత్వాన్ని చేపట్టగలరో లేదోకాని, తూర్పు బెంగాలులోనే కాక పశ్చిమ బెంగాలులో కూడా గెరిల్లా చర్యలకు పరిస్థితులు మరింత అనుకూలమౌతాయనేందుకు సందేహం లేదు. నిజానికి నేటినుంచీ గెరిల్లాలందరికీ సరిహద్దు ఎంతో సదుపాయంగా ఉంటుంది... బంగ్లాదేశ్‌లోని ఆక్రమణ సైన్యం, భారత సైన్యానికి వ్యతిరేకం. ఈ రెండు సైన్యాలూ తమ తమ గెరిల్లాలను వేటాడేందుకు పూర్తి స్థాయిలో ఏకం కాలేవు. కాని గెరిల్లాలు మాత్రం (కలిసి) తమలో తాము పూర్తిగా సహకరించుకునే అవకాశం ఎంతో ఉంది.”[49]

కాని అలాంటి పరిస్థితి ఏర్పడేలా చూసేంత తెలివితక్కువ ప్రభుత్వం ఏలుబడిలో భారతదేశం లేదు. భారతదేశం నడివాకిట్లో మరో వియత్నాం ఏర్పాటును ఇందిరాగాంధి ఎట్టి పరిస్థితిలోను ఆమోదించదు.

## భారత ప్రభుత్వ విధానం

తూర్పు బెంగాలులోని పరిస్థితిని పూర్తిగా ఉపయోగించుకునేందుకు, భారతదేశం పన్నాగం పన్నింది. సరిహద్దు భద్రతాదళం, సైన్య సమాచార విభాగాల మనుష్యుల్ని, అక్కడి ముజీబ్ తిరుగుబాటుదార్లతో సంబంధం పెట్టుకునేందుకు, 1971 మార్చి-ఏప్రిలు నెలల నుంచి తూర్పు బెంగాలుకు పంపసాగింది. పాకిస్తానీ సైనికదళాలపై మెరుపుదాడులు సాగించేందుకు, అనధికారపూర్వకంగా, తూర్పుబెంగాలు సైనికులకు భారత భూభాగంలో తర్ఫీదునివ్వసాగింది. ఈ చర్యలతో తూర్పు బెంగాలు పోరాటంలో భారత ప్రభుత్వం సారథ్యం వహించే వీలు కలిగింది. దానివల్ల ప్రవాసంలోని అవామీలీగు ప్రభుత్వపు కృతజ్ఞతను కూడా సంపాదించుకుంది. తూర్పు బెంగాలులో భారత ప్రభుత్వ వైఖరికి అనుకూలమైన ప్రపంచ ప్రజాభిప్రాయానికి అది దోహదం చేసింది.

కాందిశీకులపై పెల్లుబికే మానవతావాదంతో భారతదేశం తూర్పు బెంగాలులో జోక్యం చేసుకోలేదు. పొరుగు దేశపు పీడిత జనుల పట్ల కలిగిన అంతర్జాతీయ ఐక్యతాదృక్పథం అంతకంటే కాదు. ఆ దేశం, వ్యూహాత్మకంగా భారతదేశానికి చాలా ముఖ్యమైన దేశం. పాకిస్తాను విచ్ఛిన్నం అయి తూర్పు బెంగాలులో మిత్ర ప్రభుత్వం

ఏర్పడితే (అంతమట్టుకు) తూర్పు సరిహద్దుల రక్షణ విషయంగా భారతదేశానికి ఇబ్బందులు తగ్గుతాయి. పశ్చిమ బెంగాలు కమ్యూనిస్టు విప్లవకారులు కూడా తూర్పు పాకిస్తాను విచ్ఛిన్నం అయి తూర్పు బెంగాలులో మిత్ర ప్రభుత్వం ఏర్పడితే (అంతమట్టుకు) తూర్పు సరిహద్దుల రక్షణ విషయంగా భారతదేశానికి ఇబ్బందులు తగ్గుతాయి. పశ్చిమ బెంగాలు కమ్యూనిస్టు విప్లవకారులు కూడా తూర్పు పాకిస్తాను శత్రు భూభాగంలో తలదాచుకుంటూ శాశ్వతంగా పెట్టే ఇబ్బంది కూడా తొలుగుతుంది. తూర్పు బెంగాలు నుంచి జనుము చల్లగా రవాణా అవుతుంది. భారతదేశానికి ఆ దేశంలో ముందు ముందు పెట్టుబడి పెట్టే అవకాశాలుంటాయి. తూర్పు బెంగాలులో భారత దేశం జోక్యం చేసుకోవాలనుకున్న రాజకీయ నిర్ణయం వెనకాల ఈ ఆర్థిక కారణాలు కూడా ఉన్నాయి.

భారత ఉపఖండంలో అగ్రరాజ్యాల ప్రయోజనాలున్న అయోమయపు పరిస్థితిలో, తూర్పు బెంగాలును చైనా ప్రాబల్యం నుంచి దూరంగా ఉంచగలనని రెండు అగ్రరాజ్యాలనూ నమ్మించవచ్చునని భారతదేశం భావించింది. తూర్పు బెంగాలులో అస్థిర పరిస్థితులకు అగ్రరాజ్యాల ప్రయోజనాలే ప్రత్యక్ష కారణమని చారుమజుందారు భావించాడు. 1971 మార్చిలో ఇలా అన్నాడు. “తమ చైనా వ్యతిరేక యుద్ధానికి వాళ్ళకు తూర్పు బెంగాలు అవసరం. అందుకనే తూర్పు బెంగాలుతో ఈ జూదాన్ని మొదలెట్టారు.”(53)

అగ్రరాజ్యాల ప్రయోజనాల మాటలిలా ఉంచి ఒక రకంగా చూస్తే తూర్పు బెంగాలులోని పరిస్థితి భారతదేశానికి వడ్డించిన విస్తరిలా ఉందనేందుకు ఏమీ సందేహం లేదు. (ఇది చాలామటుకు భారతదేశం కుట్రపన్ని తయారు చేసుకుంది)

మార్చి 15, 1971న ఢక్కాలో సైనిక అత్యాచారం జరిగింది. మార్చి 31వ తేదిన ఇందిరాగాంధి తూర్పు బెంగాలు ప్రజలకు సంభవించిన ఈ ఆపదపట్ల. “వాళ్ల కష్టాలకు విచారం వ్యక్తం చేయడంలో, వాళ్ల సుందర దేశాన్ని సర్వనాశనం చేయడం పట్ల, వాళ్ల భావి గురించి ఆత్రుత వ్యక్తం చేయడంలో,” భారతీయులనందరినీ ఐక్యం చేసిందని పార్లమెంటులో విలపించింది. ‘నక్సలిజాన్ని’ అరికట్టే పేరుతో తన సొంత పోలీసులు, సైనికబలాలు కలసి సరిగ్గా ఆ సమయంలోనే జరిపే అత్యాచారాల పట్ల ఆమెకు (అటువంటి) విచారం లేదు. తూర్పు బెంగాలులో పాకిస్తాను సైన్యపు క్రౌర్యానికి అవి ఏ మాత్రమూ తీసిపోవు.

తూర్పు బెంగాలు సైనిక దుశ్చర్యకు ముందు కలకత్తా దగ్గరనున్న అశోక్ నగర్‌లో భారతీయ సైనికులు అసిత్‌పాల్ అనే కుర్రవాణ్ణి చంపారు. ఆ కుర్రవాడి తండ్రి ఆ

సంఘటనపై వాగ్మూలం ఇచ్చిన మరికొన్ని రోజులలో ఢక్కాలో అనేక బెంగాలీ కుటుంబాలకు పట్టనున్న దుర్గతికి ఎంతో దగ్గరగా కనబడుతుంది. "ఆ సంఘటన జరిగిన నాటి రాత్రి (మార్చి 1న) పిల్లలకు పాఠాలు చెపుతున్నాను. (ఒంట్లో బాగోక) అసిత్ రేడియోలో సాయంత్రపు వార్తలు వింటున్నాడు. హఠాత్తుగా బాంబు పేలింది... నిశ్శబ్దంగా కూర్చున్నాం. ఎనిమిది గంటల ప్రాంతంలో తలుపు పై దబదబ చప్పుడు కాగా తలుపు తీసేందుకు వెళ్ళాను. తలుపు తీయగానే ఏడెనిమిది మంది సైనికులు గదిలోకి వచ్చి మమ్మల్నందర్నీ ఈడ్చి పారేశారు. మా గదుల్ని సోదా చేసారు. సైన్యంపై బాంబులు విసిరామని కోప్పడ్డారు. నా భార్య, చిన్నకొడుకు, మరి ఇద్దరు కుమార్తెలు కూడా వాళ్ల దుర్మార్గ బారినుంచి తప్పించుకోలేక పోయారు...... అనారోగ్యంగా ఉన్న నాకొడుకుని ఈడ్చి గుండెలమీద తమ తుపాకులతో గుచ్చారు..... దుర్భాషలాడారు. ప్రశ్నలువేశారు మా అభ్యర్థనలను త్రోసిపుచ్చి అసిత్‌ను లాక్కుపోయారు.... అలా అరెస్టు చేసిన కుర్రవాళ్లను మధ్యలోబెట్టి చుట్టూసైనికులు నిలబడ్డారు. అసిత్‌లుంగీ చొక్కాతోనే ఉన్నాడు. కొంతసేపయ్యాక 'అమ్మా!నాన్నా!' అంటూ కేకలు విన్నాం...... తుపాకీగుళ్ళు పేలిన శబ్దాలుకూడా విన్నాం. మరునాడుదయం ఆముసలి తండ్రి తుపాకితో తూట్లుపడిన కొడుకు శవాన్ని బరాసత్‌లోని ఆసుపత్రిలో కనుగొన్నాడు. మరో దఫా వేదించి అతనికి శవాన్నిచ్చారు. ఆ తండ్రి వాఙ్మూలాన్ని ముగించాడు. "ఇదా మన స్వతంత్రం?– ఒక అమాయకపు పిల్లవాడిని, వాడి నేరాన్ని నిరూపించకుండా చచ్చేలా కొట్టి తుపాకితో కాల్చడంవంటి ప్రభుత్వ హక్కేనా స్వతంత్రం అంటే?

కాని పశ్చిమబెంగాలులో 1971 సంవత్సరమంతా విచారణ లేకుండా ప్రజలను కాల్చిచంపడం, చాలా మామూలైపోయింది. భారత ప్రభుత్వం కూడా సామూహిక హత్యాకాండ జరపడంలో పాకిస్తానీ ప్రభత్వంతో సరితూగుతూనే ఉంది. తూర్పుబెంగాలీలను పాకిస్తానీ సైనికులు జైళ్లలో పెట్టి చిత్రహింలకు గురిచేసారు. భారత పోలీసులు మరో అడుగు ముందు కెళ్లారు. సి.పి.ఐ. (మా.లె) పార్టీ ఖైదీలను పశ్చిమబెంగాలు జైళ్లలోనే, నేరుగా చంపసాగారు. పాకిస్తానీ పాలకులు చంపాల్సిన తూర్పుబెంగాలీ మేధావుల జాబితాలను తయారుచేస్తున్నారు. 1971 4, 5 తేదీల మధ్య అర్ధరాత్రి పశ్చిమబెంగాలు పోలీసులు సరోజ్ దత్తాను అరెస్టుచేసిన అదే రాత్రి కలకత్తా మైదాన్‌లోని చీకటి ప్రదేశంలో చంపి పాకిస్తానీ పాలకులకు మార్గదర్శకులు అయ్యారు. 1971 ఆగష్టు 12వ తేదీన తూర్పుబెంగాలు మూకుమ్మడి హత్యాకాండకు దీటుగా, ఒకే ప్రాంతంలో దాదాపు 100 మంది యువకుల్ని ఒకే దెబ్బతో పోలీసులు

(భారీస్థాయిలో) చంపారు ఆసంఘటన కలకత్తా దగ్గర గల బారా నగర ప్రాంతంలో జరిగింది. పోలీసులు, కిరాయి గూండాల సాయంతో 2 చదరపు మైళ్ల ప్రాంతంలో నానా అల్లరి చేసారు. ఇళ్ళన్నిటిపై దాడిచేసి సి.పి.ఐ. (మా.లె.) భావాలున్నాయనుకున్న కుర్రవాళ్ళందరినీ చంపేందుకు బయట కీడ్చుకొచ్చారు. ప్రతీ సందునూ కాపలాకాసి పారిపోయేదారులను మూసేసారు. మారణకాండలో మృతులైన వారి శవాలను దాపునే ఉన్న కాలవలో పారేసారు. 1971లో సి.పి.ఐ. (మా.లె.) పార్టీ రెండు బెంగాలులనూ సమానంగా భావించడం సరైనదే. ఎన్నో విషయాలలో రెండు రాష్ట్రాల పరిస్థితికీ సామ్యం ఉంది. ప్రజల అసంతృప్తి సాయుధ రైతాంగ పోరాటాల్లోనే కాక, పాలకవర్గాల, ప్రతీఘాతక చర్యలలో కూడా ఒకే తీరులో నడిచాయి.

## సి.పి.ఐ. (మా.లె.) పార్టీ లోపలి విభేదాలు

ముందే సూచించినట్టు తూర్పుబెంగాలులో పరిణామాలు నాటికే సి.పి.ఐ. (మా.లె.) పార్టీలో పెరిగే చీలికలను మరింత విస్తృతం చేసాయి.

పాకిస్తాను ఆంతరంగిక వ్యవహారాలలో కలగజేసుకుంటోందని చైనా భారతదేశాన్ని గర్హించింది. చారమజుందారు దాన్ని బలపరచాడు.(53) "ఆవామీలీగ్ యొక్క బూర్జువాసంకుచిత కార్యకలాపాలను" నిరసించాడు. "విపత్కర పరిస్థితులలో దృఢంగా వర్గపోరాటాన్ని నిర్వహించే తూ.పా.క.పా.(మా.లె.) ప్రయత్నాన్ని" కొనియాడాడు. కాని యాహ్యాఖానును మాత్రం క్షమించలేదు. అతణ్ణి "విద్రోహి" (56)గా అభివర్ణించాడు.

పార్టీలో ఈ విషయంపైనే తీవ్రవాదోపవాదాలు చెలరేగాయి. పార్టీ యొక్క అధికారపత్రికలైన 'దేశబ్రతి, లిబరేషన్'లు చారుమజుందారు భావాలను విశ్వాసపాత్రంగా ప్రతిబింబించాయి. పశ్చిమబెంగాలు రాష్ట్ర కమిటీలో కొన్ని ప్రాంతీయశాఖలు మాత్రం వాటికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాయి. అషీంచటర్జీ నాయకత్వంలోని బెంగాల్ - బీహార్ - ఒరిస్సా సరిహద్దు ప్రాంతీయ కమిటీ, నాడియా జిల్లాకమిటీ వాటిలో ముఖ్యమైనవి.

అధికార వైఖరిని విమర్శించినవాళ్లు పాకిస్తాన్ బూర్జువా ప్రతినిధిగా యాహ్యాఖానును భావించారు. కాంబోడియాలోని నరదోంషిహనౌక్ లాగా సామ్రాజ్యవాదాన్ని ఎదిరిస్తున్నాడన్నారు. కాబట్టి ఉభయబెంగాలులలోని కమ్యూనిస్టు విప్లవకారులూ, యాహ్యాఖానును బలపరచాలన్నారు. పశ్చిమబెంగాలు రాష్ట్రకమిటీ నాడియా జిల్లాకమిటీనుంచి వచ్చిన సుదీర్ఘమైన లేఖకు సమాధానంగా పాకిస్తానులోని

పరిస్థితిని సుఖస్తరంగా వర్ణిస్తూ జవాబునిచ్చింది "..... భారతదేశంలాగే పాకిస్తాను కూడా, అర్థభ్యూడలు అర్థవలస దేశంగానే ఆవిర్భవించింది" అసమ్మతివాదులు జాతీయ బూర్జువారాజ్యంగా చేసిన వర్ణనలను పేర్కొంటూ, "కమ్యూనిస్టుపార్టీ కార్మికవర్గాల నాయకత్వం లేకుండానే ఈనాడు కనుక అది జాతీయ బూర్జువా రాజ్యంగా మారి ఉంటే; బూర్జువా విప్లవం జరిగిఉంటే; వలసదేశాలలోనూ అర్థవలసదేశాలలోనూ సోషలిస్టు ప్రపంచం, సిద్ధాంతపు ప్రభావాలమీదే జాతీయబూర్జువావర్గం అధికారంలోకి రావచ్చుననే కృశ్చేవ్‌సిద్ధాంతాన్ని మనం అంగీకరించవలసివస్తుంది" అన్నాడు, ఇండియాలోను పాకిస్తానులోనూకూడా బడాభూస్వాములూ, కాంప్రడార్ బూర్జువా వర్గమూ అధికారంలో ఉన్నారని రాష్ట్రకమిటీ వక్కాణించింది. భారతకాంప్రడార్ బూర్జువావర్గం, పాకిస్తానులో అదేవర్గంకంటే మరింత శక్తివంతమైందీ సంఘటితమైనదీ కావడంచేత, అమెరికా చైనాపై పన్నిన తన ప్రపంచవ్యూహంలో తన ప్రధానస్థావరంగా ఇండియానే ఎన్నుకుంది. సామ్రాజ్య వాదంలో అన్నివిధాల కట్టుబడిపోయిన పాకిస్తానీ పాలకవర్గాలు, ఆత్మరక్షణావసరాలు కారణంగా చైనాతో మిత్రత్వం నెరపుతున్నారు. "భారతీయ దురాక్రమణదారులపై" యాహ్యాఖాను నడుపుతున్న 'న్యాయ' యుద్ధంలో తూర్పుబెంగాలు విప్లవకారులు యాహ్యాఖానును బలపరచవలసిన అవసరాన్ని వక్కాణిస్తూ, యాహ్యాఖానుతో ఎటువంటి ఐక్యసంఘటనను మాత్రం వాంఛించలేదు[51] ఈ అంశంపై కొన్నాళ్ళయ్యాక చారుమజుందారు తూర్పుపాకిస్తాను కమ్యూనిస్టులకు మరింత స్పష్టంగా సలహానిచ్చాడు. అషీంచటర్జీ అతని అనుయాయులు తయారుచేసిన పత్రానికి సమాధానంగా ఇలా అన్నాడు. "విదేశీ దురాక్రమణ మొదలైనా కూడా యాహ్యాఖానును బలపరచడం కమ్యూనిస్టుపార్టీ బాధ్యత కాదు. వర్గపోరాటాలద్వారా రైతాంగ జనబాహుళ్యాన్ని మేల్కొల్పడమే కమ్యూనిస్టుపార్టీ బాధ్యత. తరువాత యాహ్యాఖానుతో మైత్రికి పిలుపునివ్వాలి. ఈ మిత్రత్వంలోకూడా నాయకత్వం కమ్యూనిస్టు పార్టీచేతుల్లోనే గుర్తించుకోవాలి. మరోలా చెప్పాలంటే ఆ మైత్రి విశాల ప్రజాశ్రేయస్సుకోసం ఏర్పడాలి." ప్రజలను సమీకరించి,

"స్వతంత్రంగా, తమ స్వయంకృషితో" సైన్యాన్ని నిర్మించుకోమని తూర్పు పాకిస్తాను కమ్యూనిస్టులకు పిలుపునిచ్చింది. 1931లో జపాన్ వ్యతిరేక యుద్ధంలో చైనా కమ్యూనిస్టుల కర్తవ్యాలలో వాళ్ళ కర్తవ్యాలను పోలుస్తూ, ఇలా అన్నారు "....... ఒకవైపున విదేశీదురాక్రమణ, మరోవైపున ఎదురు దెబ్బలతో, కమ్యూనిస్టు పార్టీ రెండుదిశలలో పోరాడవలసి వస్తోంది" ప్రస్తుత కాలంలో మధ్య ప్రాచ్యపు పరిస్థితి వివరించారు. అక్కడ "పాలస్తీనియన్ విమోచన సంఘటన దళాలు ఒకవైపు ఇజ్రాయిల్

పైన యుద్ధంచేస్తూ, జోర్డాన్ విద్రోహులతోకూడా పోరాడవలసి వస్తోంది. బోర్డాన్ భూభాగం ఇజ్రాయిల్ ఆక్రమణలో ఉన్నప్పటికీ," పరిస్థితి అలా ఉంది. యాహ్యాఖానును నరదోంషిహనౌక్‌నూ ఒకే త్రాటినకట్టే అషీంచటర్జీ ప్రతిపాదన పై జరుగుతున్న పోరాటం, లోన్‌నాల్‌పై జరుగుతున్న పోరాటం కూడా, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోనే జరుగుతున్నాయి. ఆ పోరాటాన్ని షిహనౌక్ నిర్ద్వంద్వంగా బలపరుస్తున్నారు. కాంప్రడార్‌వర్గాలు. భూస్వామ్యవర్గాలు దేశానికి శతృవులనీ వారిపై పోరాటాలు జరపాలనీ షిహనౌకు ప్రకటించాడు. ప్రజలకు కమ్యూనిజమే విముక్తిని ప్రసాదించగలదనికూడా చెప్పాడు. యాహ్యాఖాన్ కమ్యూనిస్టుపార్టీని నిషేదించాడు. అంతేకాక భూస్వామ్యవర్గం ఆధారంగా తన అధికారాన్ని స్థిరపరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. మతోన్మాదమే అతని ఆయుధం. ఓవైపు ఆత్మరక్షణకోసం అమెరికన్లను ఎదిరిస్తున్నాడు. మరోవైపు మధ్యవర్తులతో అమెరికలన్లకు దరఖాస్తులు పంపుకుంటున్నాడు. అందువల్ల ఆ ఇద్దరూ (యాహ్యాఖాను, షిహనౌకులు) ఒకేలా లేరు"(57)

భారత ప్రభుత్వపు "విస్తరణో"ద్దేశాలను కూడా చారుమజుందారు గుర్తించాడు. 1971 మార్చి 4వ తేదీకే చారుమజుందారు తూర్పుబెంగాలు ప్రజలపై సామాన్య ప్రజలకుగల సానుభూతిని ఆసరాచేసుకుని భారతప్రభుత్వం చైనా వ్యతిరేక ప్రచారాన్ని మొదలెడుతుందని హెచ్చరించాడు.(53) తరువాత జూన్‌లో ఇలా రాస్తాడు. "పాకిస్తాను ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం, విచ్ఛిన్నంచేయడం తప్ప భారతప్రభుత్వం కార్యకలాపాలు మరోటికాదు."(57) కాని చైనా యాహ్యాఖానును బలపరచినంత మాత్రాన, పాకిస్తాను సైనిక నియంతృత్వం యొక్క 'విద్రోహకర' తత్వాన్ని గుర్తించకమాననూలేదు. "ఒక బూర్జువారాజ్యం ధర్మయుద్ధాన్ని చేస్తుంటే దాన్ని చైనాప్రభుత్వం చైనాపార్టీ తప్పక బలపరుస్తాయి. కాని ఈ తోడ్పాటు దృష్ట్యా మనం ఆ దేశంలోని బూర్జువావర్గానికి తోకలా వ్యవహరించాలని ఎక్కడా లేదు."(58)

చారుమజుందారు ఈ దృక్పంథంతోటే తూర్పుబెంగాలు కమ్యూనిస్టులను భారతీయ దురాక్రమణనూ ఆంతరంగిక విద్రోహాన్నీ, రెండింటినీ ఎదుర్కొంటూ తమ స్వయంకృషితో స్వతంత్ర్యచర్యలను తలపెట్టమని కోరాడు. తూర్పుబెంగాలు విప్లవకారుల స్వతంత్రపాత్రకు చాలా ప్రాధాన్యతనిచ్చాడు. ఉభయ(మా.లె.) పార్టీల నాయకత్వంలో రెండు ప్రాంతాలలోనూ జరిగే సాయుధ రైతాంగపోరాటాలను సమన్వయపరచి పాకిస్తాను భారతీయ బూర్జువాల మధ్య విభేదాన్ని రెండుదేశాల కాంప్రడార్ భూస్వాములకూ, కార్మిక రైతాంగ వర్గాలకూమధ్య జరిగే విస్తృతమైన

వర్గపోరాటంగా పరిణమించాలని ఆశించాడు "బెంగాలీ జాతీయతావాదా"నికీ "పశ్చిమపాకిస్తానీ వలసవాదానికీ" జరిగే యుద్ధంలో మసకలుపట్టిన వర్గభేదాలను అలా పైకి తీసుకొచ్చి విప్లవమౌలికతత్వాన్ని పునరుద్ధరించవచ్చని ఆశించాడు.

(రెండు నెలల తరువాత) సైనిక దమనకాండ వల్ల భారతదేశానికి పారిపోయివచ్చిన తూర్పుబెంగాలు శరణార్థులకు విజ్ఞప్తి చేస్తూ ఇలా అన్నాడు "ఉభయబెంగాలు ప్రజలమైన మనం 110 మిలియన్ల దాకా ఉన్నాం. మన దేశాల విద్రోహులను ఓడించేందుకు, మన కష్టాలకు గట్టెక్కించుకునేందుకు, మనుష్యులుగా మన గౌరవాన్ని సంపాదించు కునేందుకు మనం ఎందుకు పోరాడలేం?.....రెండు దేశాల విద్రోహులూ నీరసంగా ఉన్నారు. వాళ్లకు మన తిరుగుబాటును అణిచే శక్తిలేదు.... తూర్పుబెంగాలు బీదప్రజలు పశ్చిమబెంగాలు బీదప్రజలు కలసి స్వర్ణమయమైన బెంగాలునూ (సోనార్‌బెంగాలు)* నిర్మిస్తారు....."(62)

పార్టీలోని విమర్శకులకు ఇది మరో అవకాశాన్నిచ్చింది. ఉభయ బెంగాలుల ప్రజలను ఏకంగా చూడడాన్ని అషీంచటర్జీ "బెంగాలీ సంకుచితత్వం"గా గర్హించాడు. బీహారు సి.పి.ఐ. (మా.లె.) నాయకుడు, సత్యనారాయణసింగు కూడా అషీంచటర్జీని సమర్థించాడు. "భారతప్రభుత్వం తూర్పు పాకిస్తానులో జరుగుతున్న సంఘటనలను కేంద్రంగాచేసుకని, 1971 మార్చి ఏప్రిలు మాసాలలో రెండు అగ్రరాజ్యాలతో సన్నిహితంగా లాలూచీపడి సంకుచిత వాతావరణాన్ని ప్రత్యేకించి బెంగాలీ సంకుచిత వాదాన్ని సృష్టించింది. పాకిస్తాను వ్యవహారాలలో బాహాటంగా జోక్యంచేసుకుంది. పాకిస్తానులోకి సాయుధఏజంట్లను ప్రవేశపెడుతూ (దాని) జాతీయస్వాతంత్ర్యాన్ని భంగపరచింది. ఒక పొరుగుదేశపు భౌగోళిక సమగ్రతనూ, సర్వంసహాధికారాన్నీ చెరచింది. భారతీయ ప్రజలను పాకిస్తానుపై యుద్ధానికి నియమించింది. ఈ సమయంలో పార్టీలో అత్యున్నత స్థానాన్ని అలంకరించిన అధికారాత్మవ్యక్తి మాత్రం పాకిస్తానీ ప్రజలన్యాయమైన పోరాటాన్ని సమర్థించడానికి నిరాకరించి "రెండు బెంగాలులనూ ఏకం చేయండి" "సువర్ణ బెంగాలును" సృష్టించండి అని నినాదా లిస్తున్నాడు.[53]

ఈ విమర్శకులు భారతదేశ దురాక్రమణకు, దాన్ని ఎదుర్కొనేందుకు పాకిస్తానీ ప్రభుత్వం యొక్క ప్రయత్నాలకే ఎక్కువగా ప్రాధాన్యతనిచ్చారు. పాకిస్తానులోపల

---

* *'సోనార్ బెంగాల్' ---- నినాదాన్ని సంకుచిత నినాదంగా వర్ణించి అషీంచటర్జీ చారుమజుందారును దుయ్యబట్టాడు. సందర్భయుతంగా నైనా భారతీయ ప్రజల విప్లవం గురించి తలవకపోవడం ఈ అభియోగానికి కొంత బలం కలిగిస్తుందేమో - అను.*

యాహ్యాఖాను దమనాత్మకపాత్రను గుర్తించలేదు. అషీంచటర్జీ ఇలా అన్నాడు. "ప్రజలు ప్రతీయుద్ధంలోనూ కష్టాలుపడడం సహజం. అక్రమయుద్ధంలో ఉన్న ప్రజాశత్రువులే దానికి బాధ్యులు. తూర్పుపాకిస్తాను ప్రజలపై జరుగుతున్న దమనకాండకు ఇందిరా, ముజీబ్, వాళ్ళ యజమానులు బాధ్యులు. సామ్రాజ్యవాదులూ, సోషల్ సామ్రాజ్యవాదులూ, ఊహాజనితమైన బూర్జువామానవతావాద దృక్పథంతో ఘాతుకచర్యల గురించిన ఆందోళన లేవదీసి, ఈ నేరంపట్ల తమ బాధ్యతనుంచి ఎన్నటికీ తప్పించుకోలేరు"[54]

అషీంచటర్జీ పాకిస్తానులోని భూట్టోనూ తదితరులనూ, "సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయబూర్జువా వర్గం" గా ఆకాశానికెత్తేందుకు ప్రయత్నించడం చాలా విచారకరం. పాకిస్తానులోని భుట్టో నాయకత్వంలో ఉన్న చిన్న మధ్యతరగతి బూర్జువాలు, సామ్రాజ్యవాదుల నెదిరిస్తూ, రాజ్యాధికారాన్ని చేపట్టేందుకు కాంప్రడార్ బడాబూర్జువా వర్గాలనూ, భూస్వామ్యవర్గాలనెదిరిస్తూ దేశంలోని జాతీయ బూర్జువావర్గంగా ఏర్పడతారని అతని అభిప్రాయం.[55] ఒక గుడ్డి ప్రేమికుడు తన ప్రియురాలిలోలేని లక్షణాలను చూసేందుకుచేసే ప్రయత్నంలాంటిదిది. దుష్టవ్యాఖ్యానాలవల్ల వచ్చిన పదజాలం, చర్చలు, వైఖరులుతో కూడిన లోపభూయిష్టమైన అల్లికపై నిర్మించిన కాల్పనికవాదం అది. అషీంచటర్జీ, అతని అనుచరులూ అవలంబించిన అటువంటి దృక్పథానికి గల ప్రబల కారణం నాడు పాకిస్తానీ పాలకులపట్ల (ప్రదర్శిస్తూందనుకున్న) చైనా వైఖరి. పాకిస్తాను ప్రభుత్వాన్ని చైనా బలపరుస్తోందని అషించటర్జీ చెపుతూ, "ఈ విషయంలో చర్చలకు ఆస్కారం ఏమీలేదే!"[56] అని ఆశ్చర్యపోయాడు.

క్రమంగా చారువిమర్శకులు అతన్నించీ, పార్టీ అధికారవైఖరినుంచీ నానాటికీ దూరమయ్యారు. ఇంక తిరిగివచ్చే ప్రశ్నలేనిస్థాయికి పోయారు. ఈలోగా చైనాలోకూడా మరింత ముఖ్యమైన మార్పులు జరిగాయి. వాటివల్ల చైనాకు అగ్రరాజ్యాలపట్లగల సంబంధాలలోనూ, తృతీయప్రపంచ దేశాలలో ప్రజా ఉద్యమాలపట్ల అవలంబించిన వైఖరులలోనూ తీవ్రమైన మార్పులు వచ్చాయి.

## చైనా–అమెరికాల మైత్రి

1970 మధ్య కాలం నుంచీ కూడా బయట నుంచి ప్రమాదాలు వచ్చే సూచనలు చైనాకు కనిపించాయి. దానివల్ల ఇతర విషయాలలో దాని స్వతంత్ర వైఖరికి భంగం కలిగింది. ఉస్సోరీ సంఘటన తరువాత, దాని సరిహద్దులలో రష్యా తన సైన్యాన్ని సమీకరించింది. అమెరికా ఇండో చైనా యుద్ధాన్ని లావోస్‌లోకి విస్తరింపజేయడంతో,

ముంగిట్లోకే ప్రమాదం వచ్చి పడింది. వాటి దృష్ట్యా చైనా ఆసియాలో తన ఎత్తుగడలలో మార్పు చేసుకుంది. దశాబ్దాల పాటు ఆసియాలో సాధించుకున్న కమ్యూనిస్టు విజయాలను సోవియట్ యూనియన్ - అమెరికాలు విచ్ఛిన్నం చేయవచ్చునని తలచింది. అదీ కాక చైనాలో అప్పటికే సాధించుకున్న విజయాలకే ముప్పు తేవచ్చునని కూడా అనుకుని ఉండాలి. ఆసియాలో అమెరికా ప్రాబల్యం తగ్గించేందుకు చేసే ప్రయత్నాలూ, ఒకదానితో మరొకటి ఘర్షించాయి. రెండు అగ్రరాజ్యాలలోనూ ఒక దానితో (నైనా) అవగాహనకు రావడం చైనాకు అవసరం అనిపించింది. అటువంటి అవగాహన ఏ అగ్రరాజ్యంతో తెచ్చుకోవాలి?

చైనా సోవియట్ యూనియన్‌లకు సత్సంబంధాలు కొనసాగేందుకు సరిహద్దు సమస్య ప్రధానమైన అడ్డుగా నిలిచింది. "పంచసూత్రాల ప్రాతిపదికపై శాంతియుత సహజీవనానికై, రెండు దేశాలకూ మధ్య సంబంధాలలో మామూలు పరిస్థితి నెలకొనేందుకు సూత్రపరంగా చైనా-సోవియట్ వివాదం అడ్డు రాకూడదు."[57] అని చౌ-ఎన్-లై తరువాత చెప్పడం వేరే సంగతి. ఈ సమస్యపై సోవియట్ యూనియనే మొండిగా ప్రవర్తిస్తోందని చైనా వాదన. చౌ-ఎన్-లై ఇలా అన్నాడు. "ప్రపంచంలో ఉద్రిక్తతను సడలించేందుకు చైనా సోవియటు సంబంధాలను మెరుగుపరిచేందుకు మేం సుముఖంగానే ఉన్నామని చెప్పుకునేందుకు చైనా గ్రేట్‌వాల్ (Great Wall)* కు ఉత్తరాన గల మొత్తం భూభాగాన్ని సోవియట్ రివిజనిస్టులకు ఇచ్చుకోవాలా?"[58] కనుక చైనాపరంగా, సోవియటు యూనియన్‌తో సంబంధాలు మెరుగుపడే అవకాశం సుదూర భవిష్యత్తులో లేదు.

1969 నుంచి అమెరికా-చైనాకు శాంతి ప్రతిపాదనలు చేస్తోంది. ఆ సంవత్సరం జూలైలోనే అమెరికా చైనాతో పర్యటన, వర్తకాలకు సంబంధించిన నిబంధనలను సడలించింది. ఆ డిసెంబరులోనే ప్రెసిడెంటు నిక్సను చైనాతో వ్యాపారంపై కంట్రోళ్లను సడలించారు. ఇన్నీ మరో పరమార్థంతో జరిగాయి. వియత్నాం ఎదురు దెబ్బలకు విసిగి, తన విదేశాంగ విధానాన్ని తీవ్రంగా విమర్శిస్తున్న ప్రత్యర్థుల బెడదవల్ల, నిక్సన్ తన ప్రతిష్ఠను పరిరక్షించుకోవాలని ఆశించాడు. అమెరికన్ రాజకీయ వాదులలోని ఒక బలమైన వర్గం చైనాతో మిత్రత్వాన్ని కోరుతోంది. 1972 ఎన్నికలలో అది చర్చనీయాంశం కావచ్చు. నిక్సను మళ్లీ అధ్యక్ష పదవికి పోటీ చెయ్యదల్చుకున్నాడు.

* *మింగ్ చక్రవర్తుల రోజులలో చైనా చుట్టూ కట్టిన గోడ. ప్రపంచంలోని ఏడు వింతలలోనూ ఒకటి.*

చైనా తొందరగానే జవాబిచ్చింది. చైనాతో సంబంధాలను మెరుగుపరుచుకోవాలనే కోరికను అమెరికా మరింత సానుకూల పద్ధతులతో తెలియబరిచింది. నాడు రెండు దేశాలకూ మధ్యవర్తిగా ఉన్న జార్జిరాడెల్కూ (రుమేనియా ఉపప్రధాని) చౌ-ఎన్-లైకు ఆ సంగతి తెలిపాడు. మావోసేటుంగ్ అమెరికన్ పాత్రికేయుడైన ఎడ్గార్‌స్నోతో 1970 డిసెంబరులో (జరిగిన సంభాషణలో) నిక్సనును కలుసుకునేందుకు అంగీకరించాడు తరువాత కొద్ది రోజులకే తెరమరుగున తీవ్రంగా సన్నాహాలు జరిగాయి. వాటికి పరాకాష్టగా, నిక్సను అంతరంగిక రాయబారి, హెన్రీకిస్సింగర్ 1971 జూలైలో రహస్యంగా పెకింగ్ వెళ్లాడు. మూడు రోజుల పాటు చౌ-ఎన్-లైతో రహస్యంగా జరిపిన సంప్రదింపులతో నిక్సన్ రాకకు సన్నాహాలు పూర్తయ్యాయి. చివరకు ఆ సంవత్సరం జూలై 15వ తేదీన 1972 మే లోగా చైనా సందర్శించాలనే కోరికను నిక్సను ప్రకటించాడు. అంటే అధ్యక్ష ఎన్నికలకు ముందేనన్నమాట.

అదే రోజుల్లో చైనాలో కమ్యూనిస్టు పార్టీలోనూ మార్పులొచ్చాయి. పాశ్చాత్య పరిశీలకుల కథనం ప్రకారం, చైనా కమ్యూనిస్టు పార్టీ ఉపాధ్యక్షుడు మావో వారసుడుగా పార్టీ రాజ్యాంగంలో పేర్కొనబడిన మార్షలు లిన్‌పియావో, అమెరికాతో మైత్రిని వ్యతిరేకించాడు. 1970 ఆగస్టులో కేంద్ర కమిటీ సమావేశంలో తన అభిప్రాయాలను తెలిపాడు. “1970 ఆగస్టులో జరిగిన తొమ్మిదవ కేంద్ర కమిటీ యొక్క రెండవ ప్లీనరీ సమావేశంలో విఫలమైన విప్లవ ప్రతీఘాతక మెరుపుదాడిని” లిన్-పియావో జరిపినట్లు తరువాత చౌ-ఎన్ లై చేసిన ఆరోపణతో ఇది ధృవపడింది. “లిన్-పియావో అతని కొద్దిమంది ప్రగాఢనుచరులూ” అంతర్జాతీయ స్థాయిలో “చైనాని, కమ్యూనిజాన్ని విప్లవాన్ని వ్యతిరేకించేందుకు; సోవియట్ రివిజనిస్టు సోషల్ సామ్రాజ్యవాదానికి లొంగిపోయేందుకూ”59 వాంఛించారని చౌ-ఎన్-లై ఆరోపించాడు. ఆ “విప్లవ ప్రతీఘాతపు మెరుపుదాడి” వెనక గల రాజకీయాలివి. చౌ-ఎన్-లౌ చెప్పింది నమ్మితే “తను పన్నిన కుట్ర విఫలమయ్యాక, దేశానికి పార్టీకి ద్రోహాన్ని తలపెట్టి, సోవియట్ రివిజనిస్టుల పక్షానికి ప్లేటు ఫిరాయించే ప్రయత్నంలో సెప్టెంబరు 13 (1971) తేదీన దొంగతనంగా విమానంలో పారిపోతూంటే మంగోలియా ప్రజా రిపబ్లిక్‌లోని ఉందర్‌ఖాన్ అనే ప్రాంతంలో అది కూలి మరణించాడు.” అమెరికాతో కంటే సోవియట్ యూనియ్‌తోనే సంబంధాలు సానుకూలం చేసుకోవడాన్ని లిన్‌పియావో సమర్థించినట్టు కనబడుతుంది. ఈ విషయంలో నిజా నిజాలేవైనా అమెరికా చైనా వ్యవహారాలలోని ప్రతిష్ఠంభన - 1971 మధ్య కాలానికి సౌహార్ద స్థాయికి రావడం మొదలవగానే లిన్‌పియావో కూడా తెరమరుగుకు పోయాడు.

లిన్‌పియావో పరాజయం తరువాత పెట్టుబడిదారీ దేశాల పట్ల చైనా వైఖరిలోనూ, ఆసియా, ఆఫ్రికా లాటిన్ అమెరికా దేశాలలో విప్లవ పోరాటాలు సాగించే తీరులోనూ ప్రముఖమైన మార్పులు వచ్చాయి. "ప్రజాయుద్ధపు విజయం వర్ధిల్లాలి" అనే వ్యాసంలో 1965లో లిన్ పట్టణాలను చుట్టుముట్టే గ్రామాల విషయమై మావో సేటుంగ్ సూత్రీకరణ అంతర్జాతీయ స్థాయికి అనువదించి, "మొత్తం భూగోళంలో ఉత్తర అమెరికా పశ్చిమ యూరపులు, 'ప్రపంచ నగరాలు'గా తీసుకుంటే ఆసియా ఆఫ్రికా లాటిన్ అమెరికాలు. 'ప్రపంచ గ్రామ ప్రాంతాలు'గా ఉంటాయని" పేర్కొన్నాడు. "ఒక విధంగా సమకాలీన ప్రపంచ విప్లవం కూడా గ్రామ ప్రాంతాల చుట్టూ ఉన్న నగరాలుగా కనబడుతుంది. సూక్ష్మంగా ఆలోచిస్తే ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ప్రజల విప్లవ పోరాటాలపై ప్రపంచ విప్లవపు భవితవ్యం తీరుతెన్నులు ప్రధానంగా ఆధారపడి ఉంటాయి..." ఉత్తర అమెరికా పశ్చిమ యూరపులలోని పెట్టుబడిదారీ పాలకవర్గాలు, విప్లవ దాడులకు ప్రధాన లక్ష్యాలుగా ఉంటాయి. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల విప్లవపోరాటాల ఉచ్చులలో చిక్కుకుని అవి నాశనమౌతాయి.

లిన్‌పియావో క్రమంగా అంతరించాడు. పశ్చిమ యూరపు ఆసియాల పెట్టుబడిదారీ దేశాలకూ, రెండు అగ్రరాజ్యాలైన అమెరికా - రష్యాలకూ మధ్య చైనా కమ్యూనిస్టు పార్టీ వివక్షత చూపసాగింది. అమెరికా-రష్యాలు రెండూ ప్రధాన శతృవులే కాని ప్రత్యేకించి రష్యాను మరీ ప్రమాదకరమైన శతృవుగా చైనా భావించింది. 1972-73లలో చాలా దేశాలతో సంధిచర్యలు జరిగాయి. 22 ఏళ్ళ తరువాత, 1972 మార్చిలో బ్రిటనుతో మళ్లీ దౌత్య సంబంధాలు నెలకొన్నాయి. 10వ కాంగ్రెసులో చౌ-ఎన్-లౌ ఇలా అన్నాడు. "అమెరికా-సోవియటు యూనియన్లు మధ్య ప్రపంచాధిపత్యానికి (జరిగే) పోటీయే ప్రపంచంలో అశాంతికి కారణం.... తృతీయ ప్రపంచం దీన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. జపాన్ తదితర పశ్చిమ యూరపు దేశాలలో ఇది నిరసన కలిగించింది." 1973 సెప్టెంబరు 11-17వ తేదీలలో ఫ్రెంచి ప్రధాని పాంపెదూ పర్యటనకు స్వాగతం చెపుతూ చౌ-ఎన్-లౌ అదే పాటపాడాడు. "ప్రపంచ వ్యవహారాలపై గుత్తాధిపత్యం (లేదా) ఒకటి రెండు అగ్ర రాజ్యాలు గుత్తాధిపత్యం (Hegimony) వహించడాన్ని మన రెండు దేశాలూ వ్యతిరేకిస్తాయి" తృతీయ ప్రపంచపు విప్లవకారులకు ప్రధానమైన సంగతి తమ తమ దేశాలలోని పోరాటాలపై చైనా కమ్యూనిస్టు పార్టీ వైఖరిలో వచ్చిన మార్పులచాయలు. లిన్‌పియావో 'ప్రజాయుద్ధం వర్ధిల్లాలి' అనే వ్యాసంలో ప్రతిపాదించిన సిద్ధాంతాని కనుగుణంగానే చైనా కమ్యూనిస్టు పార్టీ తొమ్మిదవ సమావేశంలో, "లావోస్, థాయ్‌లాండు, బర్మా, మలయాసియా,

ఇండోనేషియా, ఇండియా, పాలెస్తీనా, తదితర దేశాలలోనూ; ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలోని వివిధ ప్రాంతాలలోని ప్రజల విప్లవపోరాటాలకు;" చైనా పూర్తి మద్ధతును ప్రకటించాడు. కాని, తరువాత రోజుల్లో చైనా పార్టీ ఈ మూడు ఖండాలలోని పోరాటాల స్వభావంలో తేడాలు చూపి ప్రతీ పోరాటాన్నీ ప్రోత్సహించడం మానుకున్నట్టనిపించింది.

1971 మధ్యలో సిలోన్‌లోని తీవ్ర వామపక్ష ప్రోత్సాహంతో, బహుళ వ్యాప్తమైన తిరుగుబాటు జరిగింది. చైనా కొత్త వైఖరి అప్పుడు వెల్లడైంది. సిలోన్ ప్రధాని సిరిమావో బండారునాయకే, వివిధ స్థాయిలలో సోవియట్, అమెరికను, భారతీయ పాకిస్తానీ సైనిక సహాయాలతో వేలాది యువకులకు మూకుమ్మడిగా చంపి ఆ తిరుగుబాటును అణచింది. "ఒక మూడవ దేశం సాయంతో, తమ్ము తాము ఛేగువేరిస్టులుగా భావించుకునే వాళ్లు సిలోన్‌లో అల్లకల్లోలం సృష్టించేందుకు,"[60] మొదలెట్టిన, "చట్టవిరుద్ధమైన తిరుగుబాటును అణచివేసినందుకు," చౌ–ఎన్–లౌ ఆమెను అభినందించాడు. అదే సంవత్సరం జూలైలో వామపక్ష సైనికాధికారుల నాయకత్వంలో సూడాన్‌లో తిరుగుబాటు జరిగింది. మేజర్ జనరల్ నైమేరీ తలపెట్టిన ప్రతీఘాత తిరుగుబాటు తరువాత చాలా మంది కమ్యూనిస్టులను చంపారు. 1965లో, (ఆరు సంవత్సరాల ముందు) ఇండోనేషియాలో కమ్యూనిస్టులకు జరిగిన 'ప్రోగ్రాం' (Program) విషయంలో చైనా ప్రవర్తనకూ, ఇప్పటికీ తేడా వచ్చింది. నై మేరీ విజయాన్ని అభినందిస్తూ, చైనా, "శుభాకాంక్షా సందేశాన్ని" పంపింది.

వియత్నాం లావోస్ కాంబోడియాల ప్రజలకు "జాతీయ విముక్తికి అమెరికన్ దురాక్రమణపై జరుపుతున్న యుద్ధంలో"[61] తన సహాయ సహకారాలందివ్వడంలో చైనా పార్టీ సంబద్ధంగానే ఉంది. దీని వెనకాల ఎన్నో కారణాలున్నాయి; అనేక సంవత్సరాలుగా చైనా సహాయాన్ని పొందుతున్న వియత్నాం జాతీయ విముక్తి పోరాటం పొడిగింపబడి కాంబోడియా లావోస్‌ల యుద్ధంగా కొనసాగుతోంది. చైనాతో స్నేహపూర్వకంగా ఉన్న కమ్యూనిస్టుల నాయకత్వంలోని ఈ దేశాల్లో పోరాటాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతం అంతా చైనా సరిహద్దులో ఉంది. ఆ విప్లవ పోరాటాలు దెబ్బతింటే చైనాకు ప్రమాదం వస్తుంది.

లిన్ వ్యతిరేక పోరాటంలో తుడిచిపెట్టుకుపోయిన లిన్ సూత్రీకరణలో, రెండవ ప్రధాన భాగంగా గెరిల్లా యుద్ధమే "ప్రజల మొత్తం బలాన్ని శత్రువుపై సమీకరించి ప్రయోగించేందుకు"[62] గల ఒకే మార్గంగా లిన్ చేసిన వక్కాణింపు కూడా ఉంది. 1970 అక్టోబరులో ప్రస్తుత పరిస్థితిలో లిన్ సూత్రీకరణ వర్తించదని కాంగ్‌షెన్,

చౌ–ఎన్–లైలు సి.పి.ఐ. (మా.లె.) పార్టీ దూత సౌరీన్ బోసుతో అన్నట్టు ఇది వరలో చూశాం గెరిల్లా పోరాటానికి భిన్నమైన ఇతర పోరాట విధానాలు బూజుపట్టినవిగా లిన్ సూత్రీకరించాడు. చౌ–ఎన్–లై అతని అనుయాయులూ, ఇతర పోరాట రూపాలను కూడా గుర్తించినట్టు కనపడుతుంది. చైనా కమ్యూనిస్టు పార్టీ పదవ కాంగ్రెసు సమావేశంలో, తన నివేదికలో చౌ–ఎన్–లై "తమ పితృభూమిని స్వతంత్రంగా శాంతియుతంగా ఐక్యపరచుకునేందుకు జరిపే కొరియన్ ప్రజల పోరాటాన్ని," బలపరచాడు. "రెండు వందల నాటికల్ (నౌకాయానపు) మైళ్ళ సముద్ర తీరప్రాంతాన్ని ఆర్థిక ప్రాంతాలనూ పరిరక్షించుకునేందుకు లాటిన్ అమెరికన్ ప్రజల పోరాటాలను" సమర్థించాడు. ఈ రెండు పోరాటాలూ దౌత్యపరమైనవే.

లిన్‌పియావో పరాజయం, అతని సూత్రీకరణ నిరాకరించడం జరిగాక, 1974లో సి.పి.ఐ. (మా.లె.)లో మరో చీలిక ఏర్పడింది. ఈసారి ఆ చీలిక చారుమజుందారు అనుచరులలోనే వచ్చింది. వాళ్ళలో ఒక వర్గం విప్లవ పోరాటాలను నడిపేందుకు గెరిల్లా పోరాటాన్నే 'ఏకైక' సాధనంగా భావించారు, మరో వర్గం గెరిల్లా పోరాటాన్ని 'ప్రధాన' రూపంగా ఒప్పుకుంటూ, ప్రజా పోరాటాలూ, ట్రేడ్ యూనియను ఉద్యమాలతో దాన్ని సమన్వయపరచే అవకాశం కూడా ఉందన్నారు. కాని 1971లో ఇండో–పాక్ ఉపఖండపు విప్లవకారులకు ఇంకా లిన్ అతీగతీ ఏమీ తెలియలేదు. చైనా విదేశాంగ విధానంలో వచ్చిన మార్పు మాత్రం వాళ్ళను చికాకు పెట్టింది. పాకిస్తానీ పాలకవర్గం పట్ల దాని వైఖరి కూడా వాళ్ళను తికమకపెట్టింది. దాన్ని వ్యాఖ్యానించుకోవడంలో పార్టీలో చారుమజుందారుకూ, అతని ప్రత్యర్థులకూ గల విబేధం ఎంతో విస్తరించిందని వెనుకటి పేజీలలో చూశాం.

సి.పి.ఐ. (మా.లె.) పార్టీ అధికార నాయకత్వం చైనా అమెరికన్ మైత్రిని ఎలా భావించింది? తన అరెస్టుకు ముందు రోజున సరోజ్‌దత్తా, తన వ్యాసంలో చైనాకు అమెరికాకు మధ్యగల సంప్రదింపుల గురించి రాస్తూ మావో సలహాను ఉదహరించాడు "... అటువంటి రాజీలు జరిగాయని పెట్టుబడిదారీ ప్రపంచంలోని వివిధ దేశాల ప్రజలూ తమ తమ దేశాలలో కూడా రాజీలు పడక్కరలేదు. విభిన్న పరిస్థితుల కనుగుణంగా, ఆయా దేశాల ప్రజలు విభిన్న పోరాటాలను జరుపుతూనే ఉంటారు"[63] తన పాఠకులకు ఇలా గుర్తు చేసాడు. కాంప్‌డేవిడ్ వాతావరణంలో "కృశ్చేవ్ కెన్నెడీ దగ్గరకు పరిగెత్తవలసి వచ్చింది. ఇప్పుడు నిక్సను మావో సేటుంగు దగ్గరకు పరిగెడుతున్నాడు. గతానికి ఈ పరిస్థితి పూర్తిగా విరుద్ధం." చైనా సాంస్కృతిక విప్లవపు విజయం, ఇండో–చైనా విమోచనా యుద్ధ విజయం. మిగతా ప్రపంచంలో విప్లవ

పోరాటాల పురోగమనం, అమెరికన్ సామ్రాజ్య వాదపు అంతర్గత వైరుధ్యాలు మొదలైన వాటిని ఈ పరిస్థితికి కారణాలుగా వివరించాడు.[64]

పార్టీ వెలుపలా లోపలా గల 'రివిజనిస్టుల'ను వ్యంగ్యంగా పేర్కొంటూ, వాళ్లు చైనా–అమెరికా సంప్రదింపులను సాకుగా చేసుకుంటారని హెచ్చరించాడు. "ఆయా దేశాలలో రాజీ వాతావరణాన్ని, వర్గ సహకార వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నించి, విప్లవకారులలో ఆత్మ–నిర్లక్ష్యం, సడలింపు భావాన్ని కలిగిస్తారు. పాలకులకూ పాలితులకూ మధ్య 'సంప్రదింపులు, మొదలు పెట్టి గుండ్రనిబల్ల సమావేశాలను ఏర్పాటు చెయ్యాలని చూస్తారు. సాయుధ (ప్రజా) పోరాటాలను శాంతియుత ఉద్యమాలుగా దిగజారుస్తారు. సాయుధ పార్టీల చేత, ప్రజల చేత, ఆయుధ విసర్జనను చేయిస్తారు. సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్య సంఘటనల ఏర్పాటు పేరుతో, కార్మిక వర్గాన్ని, దాని పార్టీని, వర్గ వైఖరినీ, వర్గ పోరాటాన్నీ, వదిలేలా చేసి, ఆత్మ నాశనకరమైన జారుడు బల్లపైకి తోస్తారు."[65] తూర్పు పాకిస్తాను ఉద్యమంపై అషీంచటర్జీ ప్రతిపాదన పట్ల ఎత్తిపొడుపు ఆఖరి వాక్యంలో బాగా కనిపిస్తుంది.

## సి.పి.ఐ. (మా.లె.) పార్టీలో చీలికలు

తూర్పు పాకిస్తాను సంఘటనలపై జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం రోజులు గడిచేకొద్దీ, పార్టీ వర్గాలలో తేలియాడే విభేదాలు రెండు ప్రత్యామ్నాయ సిద్ధాంతాలుగా రూపొందే స్థాయికి చేరుకున్నాయి.

ఒకవైపు అషీంచటర్జీ, సత్యనారాయణ సింగు, వారి అనుచరులు చారుమజుందారు; అంతరంగిక సమస్యలలో, 'వామపక్ష ఒంటెత్తువాద' (Left Sectarian) పొరపాట్లను చేసాడనీ, తూర్పు పాకిస్తాను విషయంలో 'బూర్జువా సంకుచితత్వాన్ని' (bourgeois chauvinism) అవలంభించాడనీ ఆరోపించారు. ప్రజా ఉద్యమాలలోనూ ప్రజా సంస్థలలోనూ, పని చేయడం ద్వారా, మొదటి తప్పును సవరించాలన్నారు. పాకిస్తానులోని యాహ్యాఖానుతో ఐక్యం చెంది, రెండవ తప్పును సవరించాలన్నారు. చారుమజుందారు, సరోజ్‌దత్తా, వాళ్ళ అనుయాయులు మాత్రం; బీదరైతులు, భూమిలేని రైతులతో గెరిల్లా పోరాటాలను ఆరంభించాలనీ, తరువాత వాటిని క్రమంగా, విస్తృత స్థాయి ప్రజా ఉద్యమాలుగా మార్చాలనే తమ సూత్రీకరణనే సమర్థించుకున్నారు. తూర్పు పాకిస్తానులో (విప్లవకారులు) యాహ్యాఖానును స్థానిక భూస్వాములనూ కూడా ఎదిరించి పోరాడాలన్నారు.

ఈలోగా 1971 నవంబరు 3వ తేదీన బీహారులోని 'దేక్‌ఘర్'లోని హోటలులో

అషీంచటర్జీ అరెస్టయ్యాడు. సత్యనారాయణసింగు పిలిచిన సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కేంద్రకమిటీ సమావేశానికి హాజరయ్యేందుకు వెడుతూండగా మధ్య దారిలో అరెస్టయ్యాడట.

బీహారులో ఎక్కడో నవంబరు 7వ తేదీన జరిగన ఆ సమావేశం చీలికకు (ఇచ్చిన) బహిరంగపు పిలుపు కిందే లెక్క. కేంద్ర కమిటీ ప్రముఖ సభ్యులైన చారుమజుందారు, సునీతీఘోష్‌లు దానికి హాజరవలేదు. (అప్పటికే పోలీసులు సరోజ్‌దత్తాను అరెస్టు చేసి చంపేశారు.) వాళ్ళిద్దరినీ ఆ సమావేశంలో బహిష్కరించారు. సత్యనారాయణ సింగును పార్టీ ప్రధాన కార్యదర్శి (General Secretary)గా ఎన్నుకున్నారు. దేబ్రా–గోపీవల్లభపూరు నాయకుడైన సంతోష్ రాణా, అషీంచటర్జీ వర్గానికి ప్రాతినిధ్యం వహించాడు. అతను సత్యనారాయణ సింగును బలపరిచాడు.

ఆ సమావేశంలో ఆమోదించిన తీర్మానంలో, "భారతదేశంలోని మొత్తం బూర్జువా వర్గాన్ని కాంప్రడా వర్గంగానూ, మొత్తం ధనిక రైతాంగాన్ని ఫ్యూడలు(వర్గం)గానూ," పేర్కొని చారుమితా ప్రతిపాదించిన సూత్రీకరణను తిరస్కరించారు. "అసమానమైన రాజకీయాభివృద్ధి వల్ల ఇండియాలో ఒక నీరసమైన పెట్టుబడిదారీ వ్యవస్థ, శక్తివంతమైన అర్థ భూస్వామ్య వ్యవస్థ కలసి కాపురం చేస్తున్నాయని," కేంద్ర కమిటీ పేర్కొంది. 1970 పార్టీ కాంగ్రెసులో సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఆమోదించిన సూత్రీకరణల నుంచి, కార్యక్రమం నుంచి, నేటి సత్యనారాయణ సింగు సి.పి.ఐ. (మా.లె.) పార్టీ సెలవు తీసుకుంది. 1975 నాటికి భారత దేశాన్ని విముక్తి చెయ్యాలనే చారుమజుందారు కలను కూడా ఆ తీర్మానంలో దుయ్యబట్టారు. "1971 లోగానే సామ్రాజ్యవాదులూ, సోషల్ సామ్రాజ్యవాదులూ సోషలిస్టు చైనాపై దాడి జరిపేందుకు తమ యుద్ధ స్థావరంగా ఇండియాను వాడుకుంటారనీ అటువంటి యుద్ధం వల్ల వచ్చిన భయంకర పీడన అణచివేతల భారం కోట్లాది భారతీయ శ్రామికజనులపై పడుతుందనే..." నమ్మకం ప్రాతిపదికగా వేసుకున్న అంచనాగా దాన్ని కొట్టివేసారు. ఆత్మ రక్షణావసరాలను గుర్తించక, నిరంతర పోరాటానికే ప్రాముఖ్యతనిచ్చిన చారుమజుందారు అభిప్రాయాలను కూడా ఆ సమావేశం త్రోసి పుచ్చింది. స్కూళ్లు కాలేజీలపై దాడులు, నగరాలలో చిన్న వ్యాపారస్తులనూ వర్తకులనూ నిర్మూలించడం కూడా ఆ సమావేశం తిరస్కరించింది.

'వామపక్ష అవకాశవాద పెడధోరణుల'ను సవరించుకోవలసిందిగా ఆ సమావేశం మొత్తం పార్టీకే పిలుపు నిచ్చింది. దీని తరువాత సత్యనారాయణ సింగు నాయకత్వంలోని సి.పి.ఐ.(మా.లె.) పార్టీ 'దేశవ్రతి' 'లిబరేషన్' పత్రికలను సమాంతరంగా

ప్రచురించసాగింది. జాతీయ అంతర్జాతీయ వైఖరుల పై తన భావాలను వాటిలో వివరించసాగింది.

విప్లవానికి ప్రత్యామ్నాయ ప్రణాళికను వేసేందుకు ఆ గ్రూపు ప్రయత్నించింది. ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించాలంది. పోలీసు అణచివేతకు వ్యతిరేకంగా సాయుధ నిరోధానికి నగర ప్రజలను సమీకరించాలంది. భూములనాక్రమించి పంటలను పట్టుకునేందుకు రైతాంగాన్ని ప్రోత్సహించాలంది. సమ్మెల ద్వారా కార్మిక వర్గానికి నాయకత్వం వహించి వాళ్ళను సమీకరించాలంది. వాటన్నిటినీ చారుమజుందారు నిర్లక్ష్యం చేసాడని వాళ్ల అభియోగం. కాని తమ వాగ్దానాలను దేశంలో ఏమూలైనా అమలు పరచిన చాయలు కానరాలేదు. 1971 చివరి భాగంలో 1972లోనూ మిగతా అసమ్మతి వర్గీయులను సమీకరించడంలోనే వాళ్లు కాలం గడిపేశారు. తమ కార్యక్రమాలను అమలు పరిచే తీవ్ర ప్రయత్నాలేవీ వాళ్లు చెయ్యలేదు. దాంతో రాజకీయ పరిశీలకులుగాని ప్రజలకు గాని ఆ పార్టీ ప్రతిపాదించిన కార్యకలాపాల తీరు (strategy) వల్ల చారుమజుందారు (ప్రతిపాదించిన) తీరుకంటే మేలైన ఫలితాలను ఇస్తుందో లేదో చూసే అవకాశం లేకపోయింది.

## ఇండో-పాక్ యుద్ధం

ఈలోగా ఇండోపాక్ ఉపఖండంలో పరిస్థితి ఉద్రిక్తమయ్యింది. అది ఇండియా పాకిస్తానులకే పరిమితం కాలేదు. అగ్రరాజ్యాలు కూడా గోదాలోకి దూకాయి. 1971 ఆగస్టులో ఇండియా సోవియటు యూనియన్‌తో 20 సంవత్సరాల ఒప్పందం 'ఇండో సోవియట్ మైత్రీ సంధి' (Indo-Soviet Friendship Treaty) చేసుకుంది. ఒకవేళ వాళ్ళపై ఏదైనా దాడి జరిగితే "తమ తమ దేశాలలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు తగిన గట్టి చర్యలను" తీసుకునేందుకు వీలును ఆ ఒప్పందం కల్పించింది. ఇండియాకు పాకిస్తానుతో వచ్చిన తగాదాలో ఈ విధంగా రష్యా ప్రోద్బలం లభించే వీలు కలిగింది. సైనికంగానూ నైతికంగానూ, అమెరికా పాకిస్తానుకు సహాయం చేస్తూనే ఉంది. ఇండో-సోవియట్ ఒప్పందాన్ని, "సైనిక ఒప్పందం"గా చైనా వర్ణించింది. తూర్పు పాకిస్తానులో "భారతీయ విద్రోహులు విచ్ఛిన్నకర కార్యకలాపాలను నిర్వహించేందుకు సోషల్ సామ్రాజ్య వాదులిచ్చిన" ప్రోత్సాహంగా దాన్ని భావించింది."[66]

పాకిస్తానీ సైనికులు తూర్పు బెంగాలులో ఎడతెరిపి లేని విధ్వంసకాండ సాగిస్తున్నారు. వేలాది కాందిశీకులు ఇండియాకు పారి పోయివచ్చారు. గతంలో

భారతదేశ ప్రభుత్వ శిక్షణ పొందిన తూర్పు బెంగాలీ యువవీరులు గల 'ముక్తివాహిని' జరిపిన మెరుపుదాడులే దోపిడి దారులు ఎదుర్కొన్న ఏకైక నిరోధం.

తూ.పా.క.పా. (మా.లె.) పార్టీ కూడా సందిగ్ధంలో పడింది. ఆవామీలీగుకు పునాదిగా ఉన్న ఫ్యూడలు భూస్వాములను బలపరచాలా లేకపోతే పశ్చిమ పాకిస్తాను సైన్యాలను నిరోధించే వివిధ నిరోధయోధులతో చేతులు కలపాలఅనే సమస్య కలిగింది. 1973 మొదట్లో ఇండియాకు వచ్చిన తూ.పా.క.పా. (మా.లె.) పార్టీ ప్రతినిధులు చెప్పిన దాన్ని బట్టి 1971 మార్చి సంఘటనల తరువాత పార్టీ కేంద్రకమిటీ "వాస్తవానికి రెండుగా చీలిపోయింద"ట. "పార్టీ నాయకులలో జాతీయ సంకుచిత వాదానికీ, అంతర్జాతీయ వాదానికీ సంఘర్షణ మొదలైంది."[67]

పార్టీ నాయకులలో పరిస్థితుల ప్రభావం విభేదాలు వచ్చాయి. వివిధ గెరిల్లా శాఖల మధ్య సంబంధాలు తెగిపోయాయి. అయినా తూ.పా.క.పా. (మా.లె.) పార్టీలో ఏకాకిగా ఐపోయిన గెరిల్లా సమూహాలు స్థానిక ఫ్యూడలు భూస్వాములపైనా, పాకిస్తాను సైనికులపైనా కూడా దాడులు జరపసాగారు. జెస్సోర్, ఖుల్నా. నౌఖాలీ జిల్లాలలో పెద్ద ప్రాంతాలను విముక్తి చేసారు. 1972 మొదట్లో తూ.పా.క.పా. (మా.లె.) పార్టీ భారతీయ (మా.లె.) పార్టీకి పంపిన ఒక నివేదికలో, "1971 ఏప్రిలు-అక్టోబరు మాసాలలో సాయుధ రైతాంగ పోరాటం స్థానికంగా అధికారాన్ని పట్టుకునేందుకు వేగంగా అభివృద్ధి చెందింద"ని పేర్కొంది. ఆ నివేదికను బట్టి పైన చెప్పిన మూడు జిల్లాల్లోను, "ఒకవైపు, 'ముక్తిబాహిని' కిరాయి తొొత్తులతోనూ" కూడా గెరిల్లాలు పోరాడసాగారు. ఆ మూడు జిల్లాల్లోను, "ప్రజా విమోచన సైన్యం (పి.ఎల్.ఎ.) ఏర్పడింది. అధికార కేంద్రాలుగా విప్లవ కేంద్రాలు నెలకొల్పారు. వర్గశతృవుల భూమిని ఆక్రమించి పంచిపెట్టారని", ఆ నివేదిక తెలిపింది. "కాని అక్టోబరు, విద్రోహకర దాడుల వల్ల జెస్సోర్, ఖుల్నాలోని తాత్కాలిక స్థావర ప్రాంతాలు పడిపోయాయి. డిసెంబరు 16 తరువాత నౌఖాలీలో ప్రజలు పరాజయం పొందారు"[68] 'ముక్తిబాహిని' కమేండోలను కాని, కాందిశీకులను కాని, తరుముకుంటూ వచ్చే పాకిస్తానీ సైనికులు భారత సరిహద్దును కూడా దాటడంతో, వాళ్ల భీభత్సం తరచు భారతదేశంలోకి కూడా పొర్లింది. అప్పటికే సరిహద్దులో మోహరించియున్న' భారతీయ సైనికులతో ఘర్షణలు జరిగేవి. సెప్టెంబరు, అక్టోబరు నాటికి రానున్న యుద్ధానికి సంకేతాలు కనపడసాగాయి.

చివరకు డిసెంబరు మొదట్లో యుద్ధం వచ్చింది. రెండు దేశాల తూర్పు పశ్చిమ రంగాలలోనూ యుద్ధం సాగింది. భారత సైన్యాలు తూర్పు బెంగాలులోకి

ప్రవేశించాయి. భారత ప్రభుత్వం 'బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని' గుర్తించింది. డిసెంబరు 16న పాకిస్తానీ సైన్యం లొంగిపోయింది.

యుద్ధకాలంలో ఐక్యరాజ్య సమితి, భద్రతామండలి సమావేశంలో; బంగ్లాదేశ్ నుంచి సైన్యాలను ఉపసంహరించుకోవాలనే తీర్మానంపై సోవియట్ యూనియన్ వీటో చేసి భారత దేశానికి సాయపడింది. అమెరికా భారత దేశానికి అందజేయవలసిన 87.6 మిలియన్ల సహాయాన్ని నిలుపు చేసినట్టు ప్రకటించింది.

భారత సైన్యం తూర్పు బెంగాలులోని అన్ని జిల్లాలలోనూ పాకిస్తానీ నిరోధాన్ని అణచివేసింది. టోంకిన్ అఖాతంలోని అమెరికన్ సప్తమ నౌకా దళానికి చెందిన 'ఎంటర్‌ప్రైస్' అనే అణుశక్తి చోధిత యుద్ధనౌకనూ, 800 మెరైన్లూ, ఏడు డిస్ట్రాయర్లు, ఫ్రిగేట్లతో ఉన్న, హెలీకాప్టరును తీసుకుపోగల 'ట్రిపోలీ' యుద్ధనౌకనూ బంగాళాఖాతంలోకి పోవలసిందని ప్రెసిడెంటు నిక్సను 1971 డిసెంబరు 13వ తేదీన ఆదేశించాడు. ఓ పెంటగాన్ ప్రతినిధి చెప్పిందాన్ని బట్టి, ఢక్కాలోని అమెరికన్ పౌరులను రక్షించి తీసుకురావడం, "ఆ ప్రాంతంలో అమెరికా ఉందని" నిరూపించడమే ఆ చర్యలోని ఉద్దేశం. కాని డిసెంబరు 13వ తేదీన ప్రెసిడెంటు నిక్సను ఆ నౌకాదళాన్ని బంగాళాఖాతం నుంచి ఉపసంహరించుకున్నాడు. తూర్పు బెంగాలులో 'సెవెంత్ ఫ్లీటు' (సప్తమ నౌకాదళం) జోక్యాన్ని సహించనని సోవియట్ యూనియన్ ఇండియాకు హామీ ఇచ్చిందని సి.ఐ.ఎ. (Central Intelligence Agency అమెరికన్ గూఢచారి సంస్థ – అను) ఇచ్చిన సమాచారంపై ఆధారపడి, బహుశ అలా ఉపసంహరించుకుని ఉండొచ్చు.[69]

తూర్పు బెంగాలు విషయంలో రెండు అగ్రరాజ్యాలూ కూడా ఎటువంటి ప్రత్యక్ష పోటీకీ దిగేందుకు సిద్ధంగా లేవని తెలుస్తోంది. తమ మిత్ర దేశాలకు రాజకీయ, సైనిక సహాయాలను చేసేందుకే సిద్ధంగా ఉన్నాయి. వియత్నాంలో వలె నేరుగా జోక్యం చేసుకునేందుకు అమెరికా సుముఖంగా లేదు. బహుశా భారత దేశంలోని తన ప్రయోజనాలను కూడా పూర్తిగా వదులుకోదల్చుకోలేదేమో! అమెరికన్ పాత్రికేయుడు ఆండర్సన్ కథనం ప్రకారం, అమెరికా తీవ్ర పాకిస్తానీ అనుకూల వైఖరికి కారకుడైన హెన్రీకిస్సింగర్ ఇలా అన్నాడట. ఇందిరాగాంధీ "చాలా క్రూరమైనది. పట్టుదలగల వ్యక్తి. అందుచేత, ఏదో చిన్న విభేదం వల్ల (తన) దేశాన్ని సోవియట్ ఉపగ్రహంగా మార్చదు." తూర్పు బెంగాలు యుద్ధ చర్యల తరువాత, ఇందిరాగాంధీ అమెరికాతో సామరస్యాన్ని కోరి, ఆర్థిక సహాయాన్ని కూడా కోరడంతో కిస్సింగర్ చెప్పింది నిజమేనని ఋజువైంది. అధికార స్థాయిలో అమెరికా పాకిస్తానును

బలపరచినా, స్వయం ప్రతిపత్తి గల అమెరికన్ సంస్థలెన్నో (వ్యక్తులు కూడా) తూర్పు బెంగాలు నుంచి ఇండియాకు వచ్చి శరణార్థుల పునరావాస కార్యక్రమాలకు సాయపడ్డారు.

యుద్ధం మొదలవగానే చైనా తన కొత్త మిత్రత్వ వైఖరితో, ఆ ప్రాంతంలో (పెరుగుతూన్న) సోవియటు ఆధిపత్యం పట్లనే ఎక్కువ కలవరపడింది. మొదట్లోనే, అంటే 1971 ఏప్రిలు మాసంలో, తూర్పు బెంగాలు పరిణామాలను వ్యాఖ్యానిస్తూ, "భారతీయ విద్రోహంతో సన్నిహితంగా పనిచేస్తూన్న రెండు అగ్రరాజ్యాలూ పాకిస్తాను అంతరంగిక వ్యవహారాలలో మొరటుగా జోక్యం చేసుకుంటున్నాయని"[70] ఆరోపించింది. డిశంబరులో యుద్ధం మొదలయ్యాక, "పాకిస్తానుపై దురాక్రమణను అనుమతించి బలపరుస్తూ ప్రోత్సాహమిస్తోంద"[71]ని ప్రధానంగా సోవియటు యూనియనునే నిందించింది. "ఇండియా తాను పండించుకున్న విషఫలాన్ని తానే తింటుంది. ఇక ఉపఖండంలో శాంతి కరువౌతుంది"[72] అని చౌ–ఎన్–లై భావించాడు. ఒక సంవత్సరంలోనే అతని మాటలు తూ॥చ తప్పకుండా నిజమయ్యాయి. భారతసైన్యం తూర్పు బెంగాలు 'విమోచన' జరిపి 'బంగ్లాదేశ్' ప్రభుత్వం ఏర్పరిచాక ఏడాది తిరగకుండానే, గతంలో ఇండో–సోవియట్ ఒప్పందానికి సారథ్యం నెరపిన ఇందిరాగాంధీ ప్రత్యేక దూత డి.పి. ధార్ 1971లో ఢక్కాను సందర్శించినప్పుడు భారత్–వ్యతిరేక ప్రదర్శనలు చెలరేగాయి.

భారతదేశంలోని పార్టీలలో సి.పి.ఐ. (మా.లె.) ఒక్కటే యుద్ధాన్ని వ్యతిరేకించింది. "ఒక పొరుగు దేశపు జాతీయ స్వాతంత్ర్యాన్ని, దేశ సమగ్రతనూ కొల్లగొట్టిందని"[73] సత్యనారాయణసింగు గ్రూపు ఆరోపించింది. "సోవియటు యూనియనుతో లాలూచీపడి, పాకిస్తానుపై దాడిచేసి, తూర్పు పాకిస్తానును ఆక్రమించి దానిని భారత ప్రభుత్వం అర్థ వలస రాజ్యంగా మార్చిందని". చారుమజుందారు 1970 డిశంబరు 20వ తేదీన రాసిన వ్యాసంలో పేర్కొన్నాడు. భారతదేశాన్ని ఇండో సోవియట్ ఒప్పందం. "సోవియటు సోషలు సామ్రాజ్యవాదపు ఉపగ్రహంగా" మార్చిందన్నాడు. "భారత్–సోవియటు మైత్రి తూర్పు బెంగాలు ప్రజల ప్రధాన శత్రువుగా తయారైంది. ఒకే శత్రువుకు వ్యతిరేకంగా తూర్పు బెంగాలులోనూ భారత దేశంలోనూ కూడా పోరాటాన్ని ఎక్కుపెట్టవలసి ఉంటుంది" అని భావించాడు. "కొన్ని ప్రదేశాలలో తాత్కాలికంగా మనం వైదొలగవలసి వచ్చినా" పార్టీ కనక ఉంటే "పోరాటం తప్పక ఉన్నత స్థాయికి చేరుకుంటుంది." మరో ముఖ్యమైన వ్యాఖ్య కూడా ఆ వ్యాసంలో ఉంది. "భారత ప్రభుత్వం సైనికపరంగా పొరుగు దేశాలపై ఒత్తిడి తేవలసిన అవసరం

కలుగుతుంది. అదే సంకుచితవాదపు లక్షణం."(68)

అతని మాటలు నిజమయ్యాయి. 1973 సిక్కింలో ప్రజా ప్రతినిధులకు మరిన్ని అధికారాల కోసం ఆందోళన జరిగింది. తరువాత సిక్కిం కాంగ్రెసుగా ఏర్పడిన వ్యక్తుల నాయకత్వంలో ఆ ఆందోళన జరిగింది. ఆ పార్టీ కూడా ఆవామీలీగులాగే భారత జాతీయ కాంగ్రెసుకూ, భారత ప్రభుత్వానికే గులాము. 2,00,000 సిక్కిం ప్రజల భావాలను కోర్కెలను ప్రతిబింబిస్తున్నట్టు చెప్పుకుంది.

భారత ప్రభుత్వం 'శాంతి భద్రత'లను పరిరక్షించేందుకు సిక్కింలోకి తన సైన్యాన్ని పంపింది. ఉత్తరాన చైనా, పశ్చిమాన నేపాలు, తూర్పున భూటాను, దక్షిణాన పశ్చిమ బెంగాలులోని డార్జిలింగ్ జిల్లా సరిహద్దుల మధ్యనున్న కీలక ప్రాంతంలోని ఈ చిన్నరాచరిక (పాలిత) దేశం భారత దేశపు రక్షణలో రక్షిత దేశం (Protectorate) గా ఉండేది. 1974 భారత రాజ్యాంగ సవరణతో సిక్కింకు అనుబంధ ప్రతిపత్తి (Associate Status) నిచ్చి తన ప్రతినిధులను భారత పార్లమెంటుకు పంపే ఏర్పాటు జరిగింది సిక్కింలోని ఫ్యూడలు రాచరికాన్ని అంతం చేసి పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించే సాకుతో భారతదేశం ఒక స్వతంత్ర దేశాన్ని కబళించింది. *

1971-72 శీతాకాలంలో మాత్రం జాతిని ఆవహించిన యుద్ధోన్మాదానికి పాడే వంతలో శృతి కలపకుండా మరో (విప్లవాత్మక దృక్పథంతో కూడిన – అను) విపరీత శృతిని చారుమజుందారు సి.పి.ఐ. (మా.లె.) పార్టీ మాత్రమే ధ్వనింపజేసారు. పాకిస్తానులో జోక్యాన్ని బలపరుస్తూ, విసుగెత్తించే సమర్థింపులను వాదనలుగా చెలామణీ చేస్తూ, సారంలేని నీతి సారపు మత్తులో మేధావి వర్గం మునిగిపోయింది. 'తూర్పు బెంగాలును సైనిక నియంతృత్వాన్నించి పరిరక్షించండి', 'తూర్పు బెంగాలులో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని స్థాపించి సోషలిజాన్ని నిర్మించండి' అనే నినాదాలతో దేశవిదేశాలలోని పెట్టీ బూర్జువా మేధావులను భారత ప్రభుత్వపు తాబేదార్లు ఆకట్టుకోసాగారు. భారత ప్రభుత్వం ఎటువంటి పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని సోషలిజాన్ని వాంఛిస్తోందని వాళ్లు ఒక్క క్షణం కూడా ఎప్పుడూ ఆలోచించిన పాపాన పోలేదు. గత 24 సంవత్సరాలుగా దేశంలోని భారతీయ తరహా ప్రజాస్వామ్యపు సోషలిజపు భయంకర పరిణామాలేవీ వాళ్ల కళ్లకు కనిపించలేదు. వాళ్లు 'తాత్కాలికంగా అపనమ్మకాన్ని పక్కకు పెట్టి' ఇందిరాగాంధీ ప్రకటనలను గుడ్డిగా నమ్మారు. మిగతా

* *తరువాత భారతదేశం సిక్కింను ఒక రాష్ట్రంగా మార్చేందుకు అవసరమైన రాజకీయ చర్యలన్నిటినీ తీసుకుంది – అను*

దేశానికి అటువంటి వాగాడంబరంతో పనిలేదు. 'పాకిస్తానును అణగద్రొక్కండి' అనేది సాధారణ నినాదంగా మారింది. పత్రికలనూ, ఉపన్యాస వేదికలనూ, విద్యాలయాల్నీ బజార్లనీ, చివరకు 'మైదాన్'నీ పాశవికసంకుచితవాదం ఆవహించింది. పాలకవర్గపు సామ్రాజ్య విస్తరణ వాదానికి కళ్ళాలు వదులు చేసిన కాంగ్రెసు నాయకులు నీతినియమాలను వదిలేసి సంచరించారు. "ఆసియా విమోచనకై అవతరించిన అరుణబాంధవి ఇందిరాగాంధీ" వంటి నినాదాలు కలకత్తా గోడలపై చోటు చేసుకున్నాయి.

భవిష్యత్తులో మాటెలా ఉన్నా; 1971-72 నాటి ఇందిరాగాంధీ దేశం లోపలా బయటా కూడా విజయేందిరే అయ్యింది. చైనాతో స్నేహం నెరపుతూ నిరంతరం వేధించే (తూర్పు బెంగాలులో) పాకిస్తానీ పాలకవర్గం ఇక ఉండదు. మిజో తిరుగుబాటుదార్లకు శిక్షణ, సి.పి.ఐ. (మా.లె.) గెరిల్లాలకు రక్షణ ఉండవు. కొత్త పెట్టుబడులకు బంగ్లాదేశ్ చక్కని క్షేత్రం. దౌర్జన్యం న్యాయంగా చెలామణీ అయ్యే ప్రపంచంలో, ఇండియా కూడా ఒక సైనిక రాజ్యంగా కీర్తికెక్కడం ఇందిర అహానికి ఎంతో తృప్తినిచ్చింది. తూర్పు బెంగాలులో జరిగిన మొత్తం తతంగం అంతా సోవియట్ సైనిక పర్యవేక్షణలో, దాని దౌత్య నీతి గొడుగు నీడలో జరగడం వేరే సంగతి.

విదేశాలలో విజయానికీ, స్వదేశంలో విజయపరంపర తోడైంది. పార్లమెంటరీ ప్రతిపక్షాలు దిక్కుతోచకుండా పోయాయి. 1967 ఎన్నికల తరవాత ఏర్పడిన కాంగ్రెసేతర సంకీర్ణ ప్రభుత్వాలతో చాలా రాష్ట్రాల ప్రజలు విసిగిపోయారు. సోషలిస్టు నినాదాల (మేలిముసుగు)లో ఇందిరాగాంధి 1969లో కాంగ్రెసులో తెచ్చిన చీలిక వల్ల చాలా మంది కాంగ్రెసు వాదుల విరోధానికి కారకులైన ఎస్.కె. పాటిల్, అతుల్యఘోష్‌ల వంటి (పాత కాంగ్రెసు నాయకుల) మచ్చలు కాంగ్రెసు నుంచి తుడిచివేయబడ్డాయి.

పార్టీలోపల విబేధాల వల్లనూ, సైనికులు పోలీసులు జరుపుతున్న పాశవిక దమన కాండవల్లనూ, సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కూడా సంక్షోభంలో కొట్టుకుపోసాగింది. 1972 జూన్‌లో చారుమజుందారు ఇలా అన్నాడు "సాయుధ పోరాటం మన దేశంలో ఒక స్థాయికి వచ్చాక, మనం ఎదురు దెబ్బ తిన్నాం."(73)

## 1972 ఎన్నికలు

ఈ పరిస్థితులలో 1972లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెసుకు ప్రధాన ప్రతిపక్షంగా సి.పి.ఎం. వ్యవహరించిన పశ్చిమ బెంగాలులో అత్యంత

ఆసక్తికరమైన పోటీ జరిగింది. ముందు చెప్పినట్టు సి.పి.ఎం. 1971 ఎన్నికలలో, మధ్యతరగతి ప్రజలలో పలుకుబడిని పోగొట్టుకుంది. ఆ తరువాత కేంద్ర ప్రభుత్వం, గ్రామీణ రైతాంగంలోనూ పట్టణ కార్మిక వర్గంలోనూ కూడా, సి.పి.ఎం.కు ఉన్న పునాదిని దెబ్బ తీసేందుకు ప్రయత్నించింది. అప్పటికే ఎందరో కార్యకర్తలు చంపబడ్డారు. మరికొందరు జైలు పాలయ్యారు. 1970 మార్చి 17వ తేదీ నుంచి 1971 ఏప్రిలు 24వ తేదీలోగా, పశ్చిమ బెనిగాలులో 263 మంది పార్టీ అనుయాయులను చంపారని, సి.పి.ఐ.(మా) నాయకుడు జ్యోతిబాసు చెప్పాడు. ఇదివరలో సి.పి.ఐ. (మా.లె.) కేడర్ల విషయంలో అనుసరించిన పద్ధతులనే 1971 మధ్యకాలం నుంచి సి.పి.ఎం. అనుయాయులను అరెస్టు చేసేందుకు పోలీసులు, ఆయా గ్రామాలలోని గుడిసెలపై దాడి చేసారు. ఐక్య సంఘటన ప్రభుత్వ కాలంలో ఏదో కొంత మిగులు భూమిని పంపిణీ చేస్తే వచ్చిన పొలాలను రైతుల నుంచి లాక్కున్నారు.

తన అనుచరులపై జరుగుతున్న దమనకాండవల్ల సి.పి.ఎం. నాయకత్వం దయనీయమైన నిస్సహాయత కనబరచింది. పాలకవర్గపు దాడి యొక్క తీవ్రతను అది ఊహించలేదు. అటువంటి సవాలును ఎదుర్కొనేందుకు కావలసిన ప్రతీకార సంసిద్ధత దానికి లేదు. ప్రధానికీ, రాష్ట్రపతికీ తరచు ఫిర్యాదులు చెయ్యడమే వాళ్ళా రోజులలో చేసిన పని. పోలీసు ఘాతుకాలకు నిరసనగా రాష్ట్రంలో ఎటువంటి ప్రజా ఉద్యమం లేకపోయింది.. రాజ్య శక్తిని ఎదుర్కోవడంలో బలప్రయోగం ఉండాలా, వద్దా అనే విషయంలో ఎటూ తేల్చుకోలేని వైఖరి, ప్రస్తుత సి.పి.ఐ. (మా) సందిగ్ధ పరిస్థితికి కారణం. 1971-72 కాలంలో రక్తపాతం జరుగుతుందనీ, మరో వియత్నాంను సృష్టిస్తామనీ, తరచు పాలకవర్గాలను బెదిరించిన తన అనుచరులను పాలకవర్గపు ఎదురుదాడిని ఎదుర్కొనేందుకు సన్నద్ధం చెయ్యలేదు. ఒకవేళ నిజంగా పోరాటాన్నే వాంఛించి ఉంటే. అటువంటి పోరాటాన్ని జరిపే ఆయుధాల గురించిన ఆలోచన చెయ్యకపోవడం నిజంగా గొప్ప ఎత్తుగడే. కేడర్లను మభ్యపరిచేందుకూ, ప్రత్యర్థిని బెదిరించేందుకే, అటువంటి విప్లవాత్మక సవాళ్ళను సి.పి.ఎం. నాయకులు చేసి ఉంటారనిపిస్తుంది.

స్థావరాలు పరిమితంగా ఉండడం అవైనా ఒంటిగా ఉండడం చేత 1971-72లో భారీస్థాయిలో జరిగిన పాలకవర్గాల ప్రతీఘాత దాడికి సి.పి.ఐ. (మా.లె.) పార్టీ తట్టుకోలేకపోగా పశ్చిమ బెంగాలులో విస్తృతంగా ఉన్న ప్రజా బలాన్ని సాయుధ ప్రతిఘటనకు తయారుచేయడానికి ఒప్పుకోనందున సి.పి.ఎం. ఓడిపోయింది.

తన ఆచరణలో సి.పి.ఎం. ప్రధానంగా పార్లమెంటరీ పార్టీగానే ఉన్నప్పటికీ పాలకవర్గాలు తమ దాడిని మొదలెట్టినప్పుడు, సి.పి.ఐ. (మా.లె.) పార్టీకీ దీనికీ ఎటువంటి తేడా చూసుకోకపోవడం గమనార్హం. కాంగ్రెసు ఎటువంటి అజాగ్రత్తనూ చూపదల్చుకోలేదనీ, రాజ్యాంగానికి విశ్వాసపాత్రులైన వామపక్షవాదులను కూడా నమ్మదల్చుకోలేదనీ తెలుస్తుంది.

ఎలక్షన్ జరిగే కాలానికి ప్రభుత్వం అనేక మంది సి.పి.ఎం. కార్యకర్తలను జైళ్లలోకి తోసింది. మిగిలినవాళ్ళను వాళ్ళకు పలుకుబడిగల ప్రాంతాలలోంచి బయటికి తరిమింది. ఆ విధంగా ప్రధాన ప్రత్యర్థిని నిర్వీర్యంచేసింది. ఇండో–పాక్ యుద్ధపు విజయోత్సాహంలో తేలియాడుతున్నా కూడా కాంగ్రెసుపార్టీ పశ్చిమబెంగాలులో తన గెలుపుపై పూర్తి నమ్మకంతో లేదు. 1972 ఎన్నికలలో ఈ విషయం ఋజువైంది. పరిపాలనా యంత్రాంగపు అండదండలతో పాలకపార్టీ భారీస్థాయిలో ఓటర్ల బెదిరింపును మొదలెట్టింది. వాళ్ళు పోలింగ్ కేంద్రాలకు రాకుండా అడ్డుపడింది. ప్రతిపక్షాన్ని సమూలంగా తుడిచిపెట్టి తనకు అత్యధిక మెజారిటీ వచ్చేలా ఎన్నికలను మలచుకుంది. 1972లో పశ్చిమబెంగాలు ఎన్నికలు జరిపిన పద్ధతి. భారతదేశంలోని ప్రజాస్వామ్యపు తీరుకు చక్కటి ఉదాహరణ. ఇందిరాగాంధేయులు ఆసియా అంతటకీ కావాలంటున్న పద్ధతి ఇదే!

దీనివల్ల సి.పి.యం. కేడర్లు విభ్రాంతి చెందారు. ప్రభుత్వాన్ని ఏర్పరుచుకుంటామనే వ్యామోహం పై ఇన్ని సంవత్సరాలుగా బతుకుతున్న వాళ్ళ ఒకేఒక్క ఆశ అలా తగలబడిపోయింది. వాళ్లు బ్రతుకుతున్న వేటపశువులకన్నా అధ్వాన్నమై పోయారు. వారినాయకులు వాళ్ళకు ఎటువంటి కార్యక్రమాన్ని నిర్దేశించలేకపోయారు. సరిగ్గా ఈ సమయంలోనే సత్యనారాయణసింగు నాయకత్వంలోని సి.పి.ఐ. (మా.లె.) పార్టీ, "సి.పి.యం. పార్టీలోని విప్లవాత్మక విభాగానికి" ఒక విజ్ఞప్తిచేసింది. ఈ వర్గపు కమ్యూనిస్టు విప్లవకారులలో వచ్చినమార్పును ఈ విజ్ఞప్తిలోని పదజాలం తెలియజేస్తుంది. ఆ గ్రూపు యొక్క రహస్య పార్టీపత్రికలో, "బహిరంగ లేఖ" రూపంలో ఆ విజ్ఞప్తి చేసారు. "విద్రోహకరమైన రాజ్యయంత్రాంగం సి.పి.ఐ. (మా.లె.) కేడర్లుపై ప్రయోగించిన పాశవిక పద్ధతులే మీ (పార్టీ) వీరోచితమైన కేడర్లపైనా ఉపయోగించారు" 1971 నవంబరులోనే, "అత్యల్పమైన వ్యతిరేకత కూడా సహించలేని అంధకార యుగాన్ని తీసుకువచ్చే ప్రయత్నాన్ని ఇందిరచేస్తోందని హెచ్చరించాం" "రాతియుగానికి ముందున్న జంతువుల మృతస్థాయికి" దేశంలోని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం చేరుకుందని చెపుతూ, ఇలా హెచ్చరించింది. "ప్రస్తుతపరిస్థితికి అర్థం ఒకటే.

ఇందిరాపాలనపు ఫాసిస్టు బీభత్సానికి లొంగిపోవడమో; లేక, తుపాకీపట్టుకుని సాయుధ విప్లవపోరాటంలోనో పాల్గొనాలి. అంతేకాని మూడో మార్గంలేదు" "మీ సంగతి మాకు తెలుసు, సి.పి.యం. కేడర్లలో చాలాభాగం, ఇందిరపాలనకు లొంగే కంటె చావునే కోరుకుంటారని తెలుసు"

పార్టీలోని మిలిటెంటు కేడర్లను తప్పుదుదోవపట్టించిన సి.పి.యం. "రివిజనిస్టు" దుర్మార్గాలను విజ్ఞప్తిలోని మిగిలినభాగం తెలిపింది. చారుమజుందారు సి.పి.ఐ. (మా.లె.) గ్రూపునుండి తమనుతాము ఆ లేఖలో ఇలా వేరుపరుచుకున్నారు "నయా ట్రాట్స్కీ వాద చారుముతా ప్రాబల్యంలో, మేమూ తీవ్రమైన పొరపాట్లను చేసామని మీకుతెలుసు..... ఆర్థిక కోర్కెల ప్రాతిపదికపై ప్రజాపోరాటాలను నిర్వహించడం రివిజనిజంగా భావించి మేం వదిలిపెట్టాం. కార్మికులు, రైతులు, యువకులు విద్యార్థులకు సంబంధించిన ప్రజాసంస్థలలో పనిని ఆపివేశాం..... మా అసహనం వల్ల స్నేహితులను శత్రువులుగా భావించాం" మన ప్రజల విప్లవపోరాటానుభవం దృష్ట్యా, మీ అనుభవాన్ని పురస్కరించుకుని, మీ నాయకత్వపు సిద్ధాంతరాజకీయ వైఖరుల గురించి "పునరాలోచించ" మని సి.పి.యం. లోని, "విప్లవాత్మక విభాగాన్ని" కోరింది. "భారతదేశంలోని విప్లవశక్తులను చీలదీసే నయాట్రాట్స్కీవాదుల నయారివిజనిస్టుల కుట్రను విచ్ఛిన్నం చేసేందుకు మాతో కలిసి పనిచెయ్యమని హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నాం"

ఆ విజ్ఞప్తివల్ల సి.పి.యం. వర్గాలలో వెంటనే మార్పేమీ కలగలేదు. కాని 1974 మధ్యలో చాలామంది. సి.పి.యం. కేడర్లు, జిల్లా శాఖలనాయకులు; పార్టీరాజకీయ విధానం, ఎత్తుగడల గురించి వివాదాలు లేవదీశారు వారిలో కొందరు రహస్యంగా సాయుధ పోరాటానికి సిద్ధం కావలసిన అవసరాన్ని కూడా సూచించారు. వారిలో చాలామందిని పార్టీ బహిష్కరించింది. అలా బహిష్కరించబడిన వాళ్ళు; పశ్చిమబెంగాలు బీహారులలో గల అషీంచటర్జీ – సత్యనారాయణసింగు అనుచరులతో ఏదో విధమైన అవగాహన కలగజేసుకోవాలనే భావాన్ని వ్యక్తిగత సంభాషణలలో వ్యక్తపరిచారు.

## పరాజయకాలంలో చారుమజుందారు

1971 నుంచి 1972 దాకా భారతదేశంలోని ప్రతీఘాత విప్లవం ఒక ఘనవిజయం తరువాత మరో ఘనవిజయాన్ని సంతరించుకుంటోంది. తీవ్రదమనచర్యలను నెరపి కమ్యూనిస్టు విప్లవకారులలో తీవ్రమైన లోటుతెచ్చి పెట్టింది. దౌర్జన్యకాండతో,

కంటకప్రాయమైన చట్టసముదాయంతో, ప్రజలను బంగ్లాదేశ్‌గా మార్చింది. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కృశించి పోయింది. చీలిపోయింది. విప్లవం తగ్గుస్థాయిలోకి పోయింది. భీభత్సం రాజ్యం చేస్తోంది.

1971 చివరనుంచి, 1972 మధ్యకాలం వరకూ – అంటే జూలై నెలలో తన అరెస్టు – చావూ జరగక పూర్వం – చారుమజుందారు (కొన్ని ప్రధాన సమస్యలపట్ల) సింహావలోకనం చేసుకుంటూనే ఉన్నాడు. భావిలోవిప్లవపు తీరుతెన్నులు వివరించేందుకు జరుగుతున్న సంఘటనల అంతరార్థాన్ని గ్రహించే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. పరాజయం పరిహాసిస్తూన్నాకూడా. అతను విప్లవంకోసం కన్నతీపికల మరుగునపడిపోవడానికి ఒప్పుకోలేదు.

1975లోగా దేశం విముక్తి పొందుతుందని ముందుచెప్పిన జోస్యం గురించి, 1971 డిశెంబరులో రాసిన వ్యాసంలో ఇలా వివరించాడు. గతంలో ఈ నినాదం అతని విమర్శకుల దాడికి గురయ్యింది. "నా దేశం 1975లో విముక్తి పొందుతుందని అన్నాను. అంటే దాని అర్థం 1975 తరువాత మనం పోరాడక్కరలేదని కాదు. అది పిడివాద ఆలోచనాధోరణి అవుతుంది. నా ఉద్దేశ్యం మనం 1975లోగా ఆధిక్యతను సంపాదించుకుంటామనే. ఇది రాజకీయ ప్రకటన మాత్రం కాదు. దానిని నేను పిడివాదపద్ధతిలో చెప్పలేదు." "......ఆ సంవత్సరం (1975)లోగా మన పోరాటం ఒక నిర్ణాయకస్థితిని చేరకుంటుంది. మనం కూడా నిర్ణాయకశక్తిగా అవతరిస్తాం."* అన్నాడు అదేవ్యాసంలో "1970 నాటి ప్రజా వెల్లువ" కానరావటం లేదని అంగీకరించాడు. నగరాలలో కూడా విద్యార్థులు, యువకులూ నడిపేపోరాటాల వెల్లువలు లేవని గుర్తించాడు కాని గ్రామ ప్రాంతంలో బీదరైతులూ, భూమిలేని రైతులూ నాయకులుగా తయారయ్యారనే సంగతి దృష్ట్యా స్వాంతనపొందాడు. "ఈ తరుణంలో వాళ్ళ రాజకీయ చైతన్యం తక్కువ స్థాయిలోనే ఉన్నా, (వాళ్ళు నాయకత్వంలోకి రావడం) యొక్క ప్రాముఖ్యత మాత్రం గొప్పది" (69)

ఇంతకు ముందు తొందరగా విజయం గురించి చారుమజుందారు అన్న మాటలు కలిగించిన అపోహలు ఇప్పుడు సవరించే ప్రయత్నం జరిగింది.

"వర్గశత్రువులను నిర్మూలించడమ"నే వివాదాస్పదమైన ఎత్తుగడ విషయంలో కూడా చారుమజుందారు ఆ కాలంలో తన అభిప్రాయాన్ని సవరించుకున్నాడు. ఈ ఎత్తుగడల

---

* *చారుమజుందారు పైన చెప్పిన వాక్యాలు 'ప్రతికూల దిశలో' (negative aspect) నిజాలయ్యాయి. పెరుగుతున్న విప్లవ పోరాటాలు సంక్షోభం వల్ల ఎమర్జెన్సీ 1975లోనే రావడం గమనించాలి అను.*

విషయంలో 1970లో దాన్ని "అత్యున్నతమైన పోరాటరూపం" గానే గుర్తించాడు. అంటే మిగిలిన పోరటరూపాలుకూడా ప్రత్యేకించి చెప్పకుండానే అంగీకరించారు. కాని 1970 పార్టీ కాంగ్రెసులో "అన్ని సమస్యలూ పరిష్కరించగల" ఒకే పోరాట రూపంగా దాన్ని చిత్రీకరించారు.

చారుమజుందారు ఆలోచనాధోరణి 1971 చివరనుంచి మారింది. ఈ కాలంలో రాసిన ఒక అముద్రిత పత్రంలో ఇలా రాసాడు. "ఈనాడు మనం భూమిలేని రైతుకూ, బీదరైతుకూ రాజ్యయంత్రాంగాన్ని ఎదిరించే అవసరాన్ని వివరించాలి. మన పూర్తి రాజకీయాలు, మగర్జున గురించి చెప్పాలి. అప్పుడు వర్గశతృవును నిర్మూలించాలో, లేక, ఆయుధాలనే లాక్కుంటారో; భూమిలేని రైతులు బీదరైతులు నిర్ణయిస్తారు.... వర్గశతృ నిర్మూలనం గురించే వాళ్ళకు చెప్పడం ఆర్థికవాదం అవుతుంది" ఇంకా తరువాత మరో అముద్రిత పత్రంలో ఇలా రాసాడు. "కార్యకర్తలు తుపాకులను లాక్కుని వాటిని రైతులకిచ్చాక వాళ్ళు ఒక్క వర్గశతృవునైనా నిర్మూలించకపోయిన పరవాలేదు. వాళ్ళు తుపాకులను తీసుకుని ఉపయోగిస్తారు. దేశం మొత్తంలో మారిన పోరాటపు స్థాయివల్ల అది జరుగుతుంది...... సాయుధపోరాటమే నేటి లక్షణం" ఈ విషయంలో తన భావాలను మరోపత్రంలో మరింత వివరించాడు. "రైతుల రాజకీయాధికార స్థాపనలో అడ్డుగానిల్చిన వాళ్లనే మనం నిర్మూలిస్తాం. వాళ్ళేవర్గానికి చెందిన వారైనా కావచ్చు. మరోలా చెప్పాలంటే అధికారాన్ని పట్టుకునేందుకు ఈ నిర్మూలనలు జరుగుతాయి" "మొత్తం వర్గాన్ని ఎప్పుడూ నిర్మూలించలేం. పోరాటాన్ని నిర్మూలననూ ఒకటిగా భావించకూడదు. ఇది సరికాదు....." అని హెచ్చరించాడు. వర్గపోరాటంలో రాజ్యాధికారాన్ని పట్టుకోవడం ముఖ్యమైన అంశం. అంతేకాని నిర్మూలన కాదు"(74) నిర్మూలనపై పెడధోరణిపై వచ్చిన వక్కాణింపును సవరించడం ద్వారా ఎత్తుగడలను వ్యూహంగా భావించే ధోరణిని గురించి హెచ్చరిస్తూ; ఒకానొక దశలో విప్లవపోరాటంలో అవసరమయ్యే ఎత్తుగడలుగా, 'వర్గశతృవుల నిర్మూలన' సమస్యను సరియైన పంథాకు తీసుకువచ్చే ప్రయత్నం చేసాడు. 1971-72 కాలంనాటి చారుమజుందారు అభిప్రాయాలలో, నిర్మూలనపు ఎత్తుగడలలో కూరుకుపోయేబదులు; తుపాకీలను పట్టుకోవడం, గెరిల్లా స్క్వాడ్లనూ సాయుధుల్ని చేయడం, ప్రధానమైన ఎత్తుగడలుగా అవలంభించాలి. "సాయుధ పోరాటం ప్రధాన లక్షణంగా" ఉండే స్థాయి వచ్చిందని భావించాడు.

1971-72 సంవత్సరాల నూతన పరిస్థితులలో, సాంప్రదాయిక పోరాట రూపాలైన సమ్మెలు మొదలైనవాటి విషయంలోకూడా చారుమజుందారు తన అభిప్రాయాలను

సవరించుకున్నట్టనిపిస్తుంది. (వాటిని గతంలో కాలం చెల్లిపోయినవిగా భావించేవాడు) కాని వర్గ చైతన్యవంతులైన రైతులు అట్టి పోరాటాలను తమంతతాముగా అనుసరించాలన్నాడు. బీహారు రాష్ట్రంలోని పాట్నా జిల్లాలోని పూన్‌పూన్ ప్రాంతంలో భూమిలేని రైతుల (తో కూడిన) గెరిల్లా స్క్వాడ్లు ఇద్దరు భూస్వాములను చంపివేశారు. దీని తరువాత "ఇద్దరు ముగ్గురు భూమిలేని రైతులు..... తమంతతాముగా ఐదు గ్రామాలలోని భూస్వాములపై ఒక హర్తాలును జరిపారు" ఒక సి.పి.ఐ. (మా.లె.) నిర్వాహకుడు ఈ హర్తాలునిలా వర్ణించాడు. "డెబ్బైమంది భూమిలేని రైతులను ఐక్యపరచిన ఈ హర్తాలుకు మధ్యరైతుల ప్రోత్సాహం కూడా లభించింది....... స్థానిక సి.పి.ఐ. కార్యదర్శి నేమా గ్రామంలోని దుర్మార్గుడైన భూస్వామి స్థానిక సి.పి.ఐ. కార్యదర్శికూడా. ఇద్దరు భూమిలేని రైతులను సుదూర ప్రాంతాలనుంచి తన భూమిని దున్నడానికై పనిలోకి పిలిచాడు. లాఠీలతో స్థానిక భూమిలేనిరైతులు అక్కడకు వచ్చి వాళ్ళతో ఇలా అన్నారు. 'మీకు మా హర్తాలు సంగతి తెలియదా? ఇది రైతాంగ పోరాటం, మీరు మా సోదరులతో సమానం. మీ సోదరులకు వాళ్ళ పోరాటంలో సాయపడేందుకు మీరు తయారవ్వాలి' పరిస్థితిని గమనించిన ఆ ఇరువురు భూమిలేనిరైతులూ, మెల్లిగా జారుకున్నారు. అనేకసార్లు భూస్వామి బతిమాలినా, ఆ ఇద్దరు భూమిలేని రైతులూ పొలంలో వదిలేసిన నాగలిని భూస్వామి ఇంటికి చేర్చేందుకు (వాళ్లు) ఒప్పుకోలేదు"[75]

బీహారులో 1972 జూలై 13వ తేదీన జరిగిన సి.పి.ఐ. (మా.లె.) కేడర్ల సమావేశంలో పూన్‌పూన్‌లో హర్తాలు నిర్వహించిన రైతులతో విప్లవకమిటీ నేర్పాటు చేయమని కోరాడు. ఆ హర్తాలును 'ఒక ప్రజాతిరుగుబాటు'గా పేర్కొన్నాడు. 70 మంది భూమిలేనిరైతులు సమావేశమై సమ్మెచెయ్యాలని నిర్ణయించడంతోనే విప్లవకమిటీ ఏర్పడిందన్నాడు* మధ్య రైతులపై ధనిక రైతులపై తనకుగల వైఖరికి అనుగుణంగా, "మిగతా వర్గాల ప్రజలను కూడా సమీకరించాలని నేడు మనం బీదరైతులకు నచ్చచెప్పాలి. లేకపోతే విప్లవం విజయవంతంకాదు. మధ్యతరగతి రైతులలో బలమైన ఐక్యత ఉంటుంది. వాళ్ళు ఒక విప్లవ వర్గమే"

ఈకాలంలో కూడా, సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ప్రభావం ఉన్న ప్రాంతాలలో సాధారణ ఆర్థిక సమస్యలపై ప్రజాఉద్యమాలు నిర్వహించవలసిన అవసరాన్ని పదేపదే

---

* *అనియంత్రితత్వాన్ని విప్లవ పరిణామంగా చిత్రించడానికిది ఒక ఉదాహరణ. దీన్ని బట్టే ఉద్దేశ్యపూర్వకమైన ప్రయత్నాన్ని వదిలి అదే జరుగుతుందని ఆశించడం కూడా జరుగుతుంది – అను.*

వక్కాణించాడు. త్రిపుర కామ్రేడ్లకు రాసినలేఖలో ఇలా వివరించాడు. "వర్గశత్రువు పంటలను పట్టుకోవాలనే నినాదం మనం తప్పకుండా ప్రతిపాదించగలం. రైతాంగ జనబాహుళ్యాన్ని ఈ నినాదం పోరాటపు పరిధిలోకి తీసుకువస్తుంది. వెనుకబడిన రైతాంగవిభాగంకూడా విమోచనాయుద్ధంలో పాల్గొంటారు....." సంస్థాపర నిర్మాణాన్ని చేపట్టాలనీ, భావిలో ఎదురయ్యే ఎదురు దెబ్బను తట్టుకునే సన్నాహాలను చేయాలని చెపుతూ, "పంటలను పుట్టకోవడంవంటి సాధారణ ఆర్థిక నినాదాలపై మనం రైతులను సమీకరించగలిగితే ఈ రెండు ఆశయాలుకూడా నెరవేరుతాయి"(72)

సి.పి.యం సభ్యుల విషయంలో ప్రత్యేకవిధానాన్ని కూడా ఇప్పుడు రూపొందించారు. "ఈనాడు సి.పి.యం ప్రభావంలో ఉన్న రైతులుకూడా మనతో చేరతారు. రైతులూ కార్మికులూ రివిజనిస్టుల సొత్తేమికాదు. వాళ్లు మనవాళ్ళు" "(సి.పి.ఐ.(మా)లోని రైతులను కార్మికులను ఆకర్షించడమనే) విషయం మనం పూర్తిగా సాధించకపోవడం మనలోపం. వ్యతిరేకభావాలున్న వ్యక్తులతో చర్చించాలి. మనం వాళ్లతో పనిచెయ్యగలగాలి" "వాళ్ళ స్నేహం సంపాదించేందుకు మనం రివిజనిస్టు సంస్థలలో జేరాలని దీని అర్థం కాదు....."(74)

పార్టీలోని రెండువైఖరుల పోరాటం (two line struggle) నెరపడంలో కూడా ఇదే ఓర్పు కనపడుతుంది. ఎత్తుగడల విషయంలోనూ, మరెన్నో ఇతర విషయాలలోనూ వచ్చిన విభేదాలు ఈ కాలంలోనే తీవ్రస్థాయికి చేరుకున్నాయని గుర్తించాలి. ఈ విభేదాలమూలంగా గతంలో స్నేహితులుగా ఉన్న కామ్రేడ్లు బహిరంగంగా కొట్టుకునే స్థాయికి దిగజారారు. 1967లో విప్లవకమ్యూనిస్టులను ఒక సమిష్టి ఆశయంతో, సమిష్టి వ్యక్తిత్వంతో ఏకంచేసిన నక్సల్బరీ నినాదం, 1971-72లో మున్నెన్నడూ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో లేనంత తీవ్రవిభేదాల్ని సృష్టించింది. చారుమంజుదారు కళ్లముందే, అతను తయారు చేసిన సంస్థను భయం, ద్వేషం, వెల్లువలుగా చుట్టుముట్టి చిన్నాభిన్నాం చేస్తున్నాయి. పార్టీసభ్యులలో అపోహలు, అనుమానాలు, తలెత్తుతున్నాయి. చారుమజుందారు భక్తులు ఓర్పును, సహనాన్ని కోల్పోయి, ఎటువంటి ప్రశ్నించడాన్నైనా, 'విప్లవ-ప్రతీఘాతకత్వం'గా చిత్రీకరిస్తున్నారు. చారుమజుందారు వాళ్లను హెచ్చరించవలసి వచ్చిందికూడా. ''ఒక ఆదేశాన్ని పూర్తిగా అర్థంచేసుకునేందుకు 'ఎందుకు' అనే ప్రశ్న వస్తుంది. అది ఆ ఆదేశం యొక్క లోతుపాతుల్ని అర్థంచేసుకునేందుకు అవసరమౌతుంది. ఒక ఆదేశం యొక్క పరమార్థం తెలియకుండా దాన్ననుసరించి పనిచెయ్యడం బానిసత్వం అవుతుంది" ఎవళ్లయితే ప్రశ్నిస్తున్నారో, వాళ్ళు ఆ ఆదేశం తప్పొ రైటా అన్నీ సమయాలలోనూ ప్రశ్నించడంలేదని

గుర్తుజేసాడు. ఆ ప్రశ్న "నమ్మకం లేకపోవడంవల్ల" పుట్టడంలేదన్నాడు. (అదేవ్యాసం) త్రిపురకామ్రేడ్లకు రాసినలేఖలో ఇలా పునరుద్ఘాటించాడు. "రెండువైఖరుల మధ్యాపోరాటాన్ని నెరపేందుకు ఓర్పుకావాలి. రివిజనిస్టు (తరహా) పోరాటం కోరుకునే వాళ్ళు చాలామంది నిజాయితీ కలవాళ్లే (తిరిగి) నేర్చుకునేందుకు వాళ్ళకు అవకాశం ఇవ్వాలి" (72)

'విప్లవాధికారం' గురించిన పాత తగాదా పార్టీలో విబేధాలను మళ్ళీ తీవ్రంచేసింది. చారుమజుందారు అనుయాయులు తుపాకులతోనైనాసరే అతని అధికారం నిలబెట్టాలనేంతవరకూ వెళ్లారు. దక్షిణ కలకత్తా ప్రాంతానికి చెందిన ప్రముఖ పార్టీసభ్యులు, కమల్ సన్యాలు, అగ్నిరేలను ఖతంచేసారు. వాళ్ళు విప్లవాధికారాన్ని ఏర్పరిచే పద్ధతిని ప్రశ్నించే సాహసానికి తలపడ్డారు. వాళ్ళను పోలీసుఏజెంట్లుగా అనుమానించి చంపేశారు. అధికారం విషయంలో అటువంటి ఒత్తిడిని గర్హిస్తూ, చారుమజుందారు ఇలా హెచ్చరించాడు. "ఎటువంటి విభేదాలు వచ్చినా కాని ముందు అధికారసమస్యను ముందుకు తేవడం సరియైన పనికాదు. అది రాజకీయాలను వెనక్కునెట్టుతుంది. కామ్రేడ్ల అవగాహన (దానివల్ల) పెరగదు. 'నువ్వు ఒప్పుకుంటావా? లేదా?' అనే ప్రశ్న ముఖ్యమైపోతుంది. శాసించే పద్ధతిలో ఎప్పుడూ మనం అధికారాన్ని నిలబెట్టలేం. కామ్రేడ్ల అవగాహన అనుభవం రాజకీయచర్చల ద్వారానే క్రమంగా పెరుగుతుంది. గుడ్డిగా అనుసరించడం (ఎప్పుడూ) ప్రమాదమే. నీ నిర్ణయశక్తిని పోగొట్టుకున్నాక కమ్యూనిస్టువు ఎలా అవుతావు? తన అవగాహనతో (పాటు) నమ్మకం (కూడా) పెరుగుతుంది. నమ్మకంతో (పాటు) ధృఢనిశ్చయం (కూడా) పెరుగుతుంది" (అదే వ్యాసం)

గతాన్ని సమీక్షించడం, వైఖరిలో మార్పు. రేపటిసంగతి ఆలోచించడం, మొదలైన వాటిలో కనిపించే అతని ఆలోచనావిధానంలో వచ్చిన మార్పు, అతని చివరి వ్యాసంలో మరింత పరిపూర్ణంగా కనపడుతుంది. 1972 జూన్ 9వ తేదీన, 'ప్రజల ప్రయోజనం' అనే వ్యాసాన్ని రాశాడు. అదే అతని అంతిమ వ్యాసం. బహిర్గతమైన అంతిమ రాజకీయ ని(వి)శ్వాసం కూడా.

## చారుమజుందారు అంతిమవ్యాసం

మనదేశంలో "సాయుధపోరాటం ఒక దశకు చేరుకన్నాక, ఎదురుదెబ్బతిన్నాం" ప్రస్తుతం సంక్షోభంలో పార్టీని జీవంతో నిలిపేందుకు, "మనం కార్మిక రైతాంగ ప్రజాబాహుళ్యంలో పార్టీని పటిష్టం చేయాలి" నిరాశతో నిండిన 1972 నాటి వేసవిలో,

భారతప్రజల పాలకవర్గ వ్యతిరేక ఛ్చాయలు కూడా మోడు వారి పోయాయి. ప్రభుత్వం విజయోత్సాహంతో చిందులేస్తోంది. చారుమంజుదారు మాత్రం. రానున్న కొద్దికాలంలోనే, "దేశ వ్యాప్తమైన తిరుగుబాటు" వస్తుందని భావించాడు, ఒక ఓడిపోయిన సాహసాన్ని సమర్థించు కుంటున్నాడని నిరాశావాదులు భావిస్తూంటే, అతను నమ్మకంగా ఇలా వక్కాణించాడు. "మనదేశంలో రానున్న కొద్దికాలంలోనే, ఒక ఉద్యమం వెల్లివిరుస్తుంది. అది జాతీయోద్యమ స్థాయిలో ఉంటుంది" రానున్న కాలంలో పాలకవర్గాలు పరిష్కరించలేని ఆర్థిక సమస్యలు తెచ్చిపెట్టే సంక్షోభాన్ని ఆనందోత్సాహపు మహావెల్లువలోంచి గుచ్చి చూడగలిగాడు. ప్రజల్లో పెల్లుబికే అసంతృప్తిని పేర్కొంటూ, అది "వివిధ ప్రాంతాలలో సంక్షోభ భావాలను దానంతటదే" కలిగిస్తుందన్నాడు. ఈ మాటలు అతని చావు తరవాత, 1973-74 కాలంలో జేగంటలుగా ప్రతిధ్వనించాయి. ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర మొదలైన అనేక ప్రాంతాలలో ఆందోళనలు తలెత్తాయి. 1973-74 కాలంలో, భారత ప్రజలలో తొందరగా తగ్గుముఖం పడుతున్న ఇందిరావ్యామోహం, "పోరాటాల వృద్ధి పరిణామంగా ఉండదు" "విప్లవాత్మకంగా ఉంటుంది" అనే చారుమజుందారు నమ్మకాన్నే ధృవపరిచింది. రానున్నకాలంలో మరింత త్వరగా వృద్ధిపొందే. ప్రజా ఉద్యమాలకు అనుగుణంగా పార్టీ పెరగక పోవచ్చునని భావించాడు. "మనపార్టీ నాయకత్వంలో పెరుగుతున్న పోరాటపు తీరును చూస్తుంటే మనదేశం 2001కి కూడా విముక్తి చెందదేమోననిపిస్తోంది. ఇంక 1975లో విముక్తి చెందే ప్రశ్నేలేదు!"

త్వరలో తప్పకుండా రానున్న స్వయంచోదిత (Sponteneous) ప్రజాఉద్యమాన్ని ఆసరాగా తీసుకుని దాన్ని క్రమబద్ధం చెయ్యాలనుకున్నాడు. చెదురుమదురు సంఘటనలకు పరిమితమైనపార్టీ కార్యకలాపాలను విస్తృతం చెయ్యాలనుకున్నాడు. "రానున్న ఉద్యమంలో మనం ప్రతీచోటా నాయకత్వం వహించగలమా? వహించలేం" ఆ ఉద్యమాలను విప్లవకారులకు ఉపయోగపడేలా ఎలా మలచుకోవాలో వివరించాడు. "చైతన్యవంతమైన నాయకత్వంలో జరిగేపోరాటాలు, అటువంటి (చైతన్యవంతమైన) నాయకత్వం లేని పోరాటాలకు (అందుకోదగిన) ఉదాహరణలుగా ఉంటాయి. ఈనాడు మనం కొన్ని భూసంస్కరణలు చేస్తే, ఆ విప్లవోద్యమంలో మరిన్ని భూసంస్కరణలు స్వయంచోదితంగా జరగవచ్చు. మనచైతన్యవంతమైన నాయకత్వపు అవతరణతో, సాయుధ విప్లవోద్యమం (కూడా) పుడుతుంది. ఈ సాయుధవిప్లవోద్యమం ద్వారానే, మన నాయకత్వం నలుమూలలా వ్యాపిస్తుంది. "పోరాటం ప్రాతిపదికగా విస్తృత ప్రజాబాహుళ్యంతో ఐక్యసంఘటనలు'' ఏర్పరుచుకోవలసిన అవసరాన్ని

పునరుద్ఘాటించాడు. పార్లమెంటరీ వామపక్షాల పక్షపాతాన్నిలా వివరించాడు. "ఈ పార్టీలో ఉన్న కార్మికులు రైతులు శ్రామికప్రజలు ఆయా నాయకత్వాలపై అసహ్యం కలిగి ఉన్నారు. సంయుక్తపోరాటం ప్రాతిపదికగా మనం వాళ్ళతో కలిసిపని చేసేందుకు ప్రయత్నించాలి. ఇదివరలో మనతో విరోధం పెంచుకున్నవాళ్ళు కూడా ప్రత్యేక పరిస్థితులలో మనతో కలసిరావచ్చు. అటువంటి శక్తులన్నిటితోనూ కలసే హృదయవైశాల్యం మనకు ఉండాలి" సి.పి.యం. తదితర వామపక్ష పార్టీ అనుచర వర్గాలపై పెంచుకున్న సంకుచితవాద విద్వేషాన్ని ఛేదించేందుకు ప్రయత్నించాడు. ప్రత్యేకించి అషీంచటర్జీ సత్యనారాయణసింగుల అనుచరుల విషయంలో ఈ ద్వేషాన్ని తగ్గించుకోవాలని కూడా కోరాడు. "హృదయవైశాల్యం కమ్యూనిస్టుల (ముఖ్య) లక్షణం. ప్రజలు ఈనాడు ఐక్యపోరాటాన్ని కోరుకుంటున్నారు. ప్రజాప్రయోజనమే పార్టీ ప్రయోజనం" (73)

పాతవైఖరులను పునరుద్ఘాటించేందుకు కాకుండా, నిజాయితీతో పునర్విమర్శించు కునే ఆత్మవిమర్శనా వాంఛతోనే, ఈ వ్యాసం రాసినట్టు కనిపిస్తుంది. ప్రస్తుత పరిస్థితి యొక్క వాస్తవికావసరాలదృష్ట్యా, సాయుధపోరాటాలలో నమ్మకమున్న మిలిటెంటు గ్రూపులను సమీకరించేందుకు, తన పూర్వపువైఖరులనెన్నిటినో పునరాలోచించేందుకు తయారయ్యాడు. ఈ విషయం ఆ కాలంలో రాసిన అనేక అముద్రిత పత్రాలనుంచి తెలుస్తోంది. ఆ కాలంలో అతనికి దగ్గరగానున్న కామ్రేడ్లు కూడా దానిని ధృవీకరించారు. (ఇవన్నీ కూడా 'ప్రజాప్రయోజనమే పార్టీ ప్రయోజనం' వ్యాసంలో వెలిబుచ్చిన భావాలను బలపరుస్తున్నాయి)

అతను చనిపోయాక చాలాకాలం తరువాత, అంటే 1973 మొదలులో, జైలులోని ప్రముఖ సి.పి.ఐ. (మా.లె.) నాయకులు ఒక లేఖలో ఇలా వివరించారు. "మన పార్టీ విధానంలో ఒంటెత్తువాద పెడధోరణులున్నాయనే (సంగతి)ని కామ్రేడు చారుమజుందారు గుర్తించాడు. అలా మాకు చెప్పాడు కూడా. కామ్రేడ్ చారుమజుందారు రాజకీయ (పరమైన) ఆత్మవిమర్శచేసుకోవాలనుకున్నాడు. మరో విషయంకూడా ఈ సందర్భంలో చెప్పాలి. అతను అన్ని గ్రూపులతోనూ ఐక్యతను సాధించాలనుకున్నాడు. (అంటే ఉద్యమపు వివిధ స్థాయిలలోనూ సంబంధాలను తెగతెంపులు చేసుకున్న అన్ని గ్రూపులతోనూ) ఆఖరున కొన్ని నెలుగా చారుమజుందారు పశ్చాత్తాపాన్ని వివిధ స్థాయిలలోగల పార్టీలోని ప్రముఖ కేడర్లముందుంచుతూ, 1970 నవంబరు నెలలో సౌరీన్ బోసుద్వారా అందుకున్న చైనా కమ్యూనిస్టుపార్టీ సలహాలను కూడా తెలపాలనుకున్నాడు. "చైనా ఛైర్మనే మన ఛైర్మను' అనే నినాదాన్ని

చారుమజుందారు ఉపసంహరించాలనుకున్న సంగతికూడా చాలా మందికి తెలుసు"

దీన్ని బట్టి చారుమజుందారు ఇంకా తన ఆఖరుమాటను చెప్పలేదని, ఇంకాదానికి ముందుండే మాటనైనా చెప్పలేదని, ఒక - (నూతన) దిశలో కొన్ని తూచివేసిన ఆలోచనాపూర్వకమైన అడుగులే (పైవ్యాసంలోని భావపరంపర) అనీ తెలుస్తోంది. ఈలోగా పోలీసులు చారుమజుందారును పోరాట పథంలోంచి తొలిగించారు.

## చారుమజుందారు అరెస్టు - (దు)ర్మరణం

కలకత్తాలోని ఎంటల్లీలోని ఒక ఇంటినుండి పోలీసులు చారుమజుందారును 1972 జూలై 16వ తేదీన అరెస్టుచేసారు. ఈ పట్టుదొరకని విప్లవ కారుడి గురించి పోలీసులు రెండు సంవత్సరాలుగా నిర్విరామంగా వెతుకుతూనే ఉన్నారు.

ఒక కామ్రేడును చిత్రహింసలకు గురిచేయగా తెలిసిన సమాచారంతో ఈ అరెస్టు చేసారు. ఆకామ్రేడు నోటినుంచి ఆ రహస్యస్థావరాన్ని చెప్పించే సరికి, అతను (చిత్రహింసలతో) మానసికంగానూ భౌతికంగానూకూడా చచ్చుపడిపోయాడు. అరెస్టయిన చారుమజుందారును పాలకవర్గ ప్రతీకారానికి ఆహుతి చెయ్యడానికి ఏనాడో నిర్ణయించారు. అతను అరెస్టయ్యాక 12 రోజులే బతికాడు. 1972 జూలై 28వ తేదీన పోలీసుల ఆధీనంలో ఉండగానే అతను "మరణించినట్లు" ప్రకటించారు.

అరెస్టయ్యేనాటికి చారమజుందారు హృద్రోగ వ్యాధిపీడితుడు. ఇన్నేళ్లుగా గడుపుతున్న రహస్య జీవనపు కష్టనష్టాలు అతనిని (ఆరోగ్యపరంగా) దెబ్బతీసాయి. ఒక చోటునుంచి మరోచోటుకు సంచారంలో బాధనుంచి తాత్కాలిక విముక్తి పొందేందుకు 'పెథిడీన్'* ఇన్నాళ్ళూ అతనికి తోడుగా నిలిచింది. పోలీసు లాకప్పులో అతనిని నిర్విరామంగా ప్రశ్నలకు గురిచేసారు. అప్పటికే ఆరోగ్యం క్షీణించడంవల్ల ఆ శ్రమకు తట్టుకోలేక పోయాడు. జూలై 27వ తేదీన ఆసుప్రతికి తరలించవలసి వచ్చింది. సకాలంలో తగిన వైద్యసహాయం అందక మరునాడు చనిపోయాడు.

అతని అరెస్టు చావుల తరువాత వెంటనే పార్టీ పత్రిక 'లిబరేషన్' ఇలా వ్యాఖ్యానించింది. "మా తప్పులు పెద్దవేకావచ్చు. నిరంతరవ్యాధితో బాధపడే మా ప్రియతమ నాయకుణ్ణి మేం అత్యంత శ్రద్ధతో కాపాడుకున్నాం. గత మూడు నాలుగు

---

* *రోగులకు బాధ తెలియకుండా ప్రశాంతంగా నిద్రపట్టేందుకు డాక్టర్లు ఇచ్చే మత్తు మందు. ఇంజెక్షన్ టాబ్లెట్ల రూపంలో దొరుకుతుంది. ఇతర మత్తు ద్రవ్యాలలాగే అలవాటుకు దారితీస్తుంది - అను.*

సంవత్సరాలుగా విప్లవప్రజలు అతనిని సాకుతున్నారు. విద్రోహ పోలీసుల కళ్ళలో దుమ్ముకొట్టి జీవించగలిగాడు. కాని గత 12 రోజుల పోలీసు నిర్బంధంలో, అతని వైద్యానికి 'ప్రత్యేక ఏర్పాట్లు' జరిపామని బూర్జువా పత్రికలలో చాటుకున్న పోలీసులు, రోజూ ఐదారు గంటలపాటు నిర్విరామంగా వేధించి, అనూహ్యామైన మానసిక భౌతికచిత్రహింసలకు గురిచేసారు. జూలై 27–28 అర్ధరాత్రిన, భారతవిప్లవ మహానాయకుడు, చారుమజుందారును పోలీసులు హత్యచేసారు" అని ఆరోపించింది.

పాలకవర్గాలు చారుమజుందారు చావుతో స్వేచ్ఛగా ఊపిరిపీల్చుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, పశ్చిమబెంగాలు తదితర ప్రాంతాలలో ప్రభుత్వం మోపిన కుట్రకేసులలో అతను ప్రధాననిందితుడు. తన అనుచరులను ఆచరణకు పురికొల్పగలిగే అంతర్జ్వాల్య మానమైన విప్లవభావజాలాన్ని నిరంతరం చిందించే అతను; పార్టీలో వచ్చిన చీలికలూ, విభేదాలు ఒకవైపు ఉన్నా కూడా, ఉద్యమానికి కీలకమైన సైద్ధాంతిక చోదకుడిగానే ఉన్నాడు. పాలకవర్గం అతని చావుతోఉద్యమ మహోజ్వలనాటకానికి తెరపడిపోయిందని భావించింది.

వేలాది మంది సి.పి.ఐ. (మా.లె.) కార్యకర్తలు చంపబడ్డారు. లేదా జైళ్ళలో మగ్గుతున్నారు. గ్రామాలలో, నగరాలలో వాళ్ళ స్థావరాలు నాశనమయ్యాయి. చారుమజుందారు కూడా చనిపోయాడు. మిగిలిన నాయకులు, తరువాత దశకు చేరుకునేందుకు, ఉద్యమాన్ని కూడ దీసుకుంటున్నారు. ఉద్యమంలో మరో దశ నిర్ద్వంద్వంగా ముగిసింది.

## తరువాత కథ

ప్రభుత్వమూ పాలకవర్గమూ శాశ్వతంగా ఉద్యమాన్ని అణచాలనుకున్నారు. అందుకు ఇంకా మిగిలిన విప్లవకారులకు గట్టి శిక్షలు విధించాలి. అత్యంత సాహసికులైన విప్లవకారులు కూడా విప్లవం మాట కూడా, ముందు ముందు ఎత్తకుండా చేయాలి. ఈ విప్లవకారులనుభవించిన శిక్షలను తలచుకున్న ముందు తరాల వారికి కూడా ఒళ్లు జివ్వుమనేలా చేయాలి. ప్రస్తుత వ్యవస్థపై నడిపే ఎటువంటి హింసాయుత ఆందోళనలైనా, ఎప్పుడూ ఓడిపోతాయనే గుణపాఠాన్ని చెప్పాలి.

భారతదేశంలో జైళ్లన్నిటిలోనూ, 1973 నాటికి 32,000 మంది సి.పి.ఐ.(మా.లె.) పార్టీ కార్యకర్తలనూ, సానుభూతిపరులనూ కుక్కారు. ప్రభుత్వం వారిపై కుట్రకేసులను బనాయించింది. అటువంటి ఖైదీలు ఒక్క పశ్చిమ బెంగాలులోనే 17,787 దాకా ఉన్నారు. వారిలో 12,016 మంది యువకులు. 1,399 మందికి 18 ఏళ్ళ వయసు

కూడా నిండలేదు. 79 వారిలో చాలా మంది గత మూడు సంవత్సరాలుగా ఎటువంటి విచారణ లేకుండా మగ్గుతున్నారు. అటువంటి ఖైదీలు ఆంధ్రప్రదేశ్‌లో 738 మంది ఉన్నారు. ఉరిశిక్ష విధించబడ్డ నాగభూషణపట్నాయక్ వారిలో ఒకడు. అతను భారత రాష్ట్రపతి క్షమాభిక్షను అర్థిస్తూ దరఖాస్తు (Mercy petition) పంపుకునేందుకు నిరాకరించాడు. *

ఖైదీల పరిస్థితుల మాటేమిటి? 1973 ఏప్రిలు 20 నుండి 21వ తేదీ దాకా నక్సలైటు ఖైదీల డిఫెన్సు, విడుదల గురించి చర్చించుకునేందుకు ఢిల్లీలో జరిగిన జాతీయ సదస్సులో సమర్పించిన సమాచారాలను బట్టి, ఆంధ్రప్రదేశ్ జైళ్లలో వైద్య సహాయం లేక 13 మంది ఖైదీలు చనిపోయారు. సి.పి.ఐ. (మా.లె.) కార్యకర్తలను పోలీసులు చిత్రహింసలు పాల్జేయడం నిత్యకృత్యమైపోయింది. పశ్చిమబెంగాలు జైళ్లలో అనేక మంది కుర్రవాళ్ళను అంగవికలులుగా చేసారు. మరికొందరిని నిర్దాక్షిణ్యంగా చంపారు. ఇటువంటి గగుర్పొడిచే సన్నివేశాలెన్నో కలకత్తా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంఘం (Association for Protection of Democratic Rights) APDR సేకరించిన సమాచారాలలో తెలిసాయి. అటువంటి సంఘటనల కథనాలలోని కొన్ని భాగాలు చూడండి.

"అజీజుల్ హక్" : ప్రెసిడెన్సీ జైలు, సెల్ నం. 1/72. మూడేళ్లుగా నిర్బంధంలో ఉన్నాడు. వయసు 30 పైనే. అరెస్టయ్యాక అతన్ని బనియాపూరు పోలీసు లాకప్పులో నిర్దాక్షిణ్యంగా కొట్టారు... అదే జైలులో '70లో 'సత్యాటా' అనే వార్డులో ఉండగా ప్రెసిడెన్సీ జైలు గంట మోగింది. మిగతా ఖైదీలతో పాటు హక్‌ను కూడా బయటికీడ్చారు. వారందరిపై లాఠి దెబ్బల వర్షాన్ని కురిపించారు. దాంతో అప్పటికే విరిగిన అతని చెయ్యి పచ్చడిగా తయారైంది. జైల్లోగల వైద్యసదుపాయాలు అటువంటి తీవ్రగాయానికి ఏవిధంగానూ పనికి రావు... ప్రస్తుతం... అతని చేతుల్లోని రక్తనాళాలు క్రమంగా ఎండిపోతున్నాయి."

"రామల్ రాయ్ చౌదురి" : ప్రెసిడెన్సీ జైలు '70 అక్టోబరులో అరెస్టయ్యాడు... అరెస్టయ్యాక తన వంతు చిత్రహింసల ననుభవించాడు. అతని ఎడమ చెయ్యికి తలకు తీవ్రమయిన గాయాలు తగిలాయి. తలలో తీవ్రమైన పోటు మొదలైంది... అతను జైలు ఆస్పత్రిలో చావు బతుకులలో ఉండగా, కారణం లేకుండా అతన్ని

* *1981 మార్చిలో అతనిని వైద్యచికిత్సకై AIMS ఢిల్లీకి తరలించారు. తరువాత యావజ్జీవిత ఖైదు అనుభవిస్తున్న అతనిని విడుదల చేయమని సుప్రీంకోర్టు ఆదేశించింది.*

హటాత్తుగా విడుదల చేసారు. తరువాత రోజున అతను చనిపోయాడు."

చిత్రవధను లలితకళగా అభ్యసించి, ఆనందించుతూ నాజీ పూర్వీకులను తలదన్నే పశుప్రాయులైన పోలీసులు సి.పి.ఐ.(మా.లె.) పార్టీకి చెందిన స్త్రీ ఖైదీలపై ప్రత్యేకమైన శ్రద్ధతో క్రూరమైన ఆనందంతో జుగుప్సాకరమైన చిత్రవధలు చేసారు. రాజకీయంగా ఏ పార్టీకి చెందని అఖిల భారత మహిళా సంఘపు సభ్యులను అధిక ధరలకు వ్యతిరేకంగా జరిపిన ప్రదర్శన సందర్భంలో అరెస్టు చేసి 1974 మే 3వ తేదీన ప్రెసిడెన్సీ జైలుకు తీసుకువచ్చారు. సి.పి.ఐ. (మా.లె.) యువతులను నిర్బంధించిన సెల్‌కు దగ్గరలోనే వాళ్ళను పెట్టారు. వాళ్లావిధంగా ఆ యువతులను పెడుతున్న చిత్రహింసలను ప్రత్యక్షంగా చూశారు. తరువాత వాళ్లు పత్రికల వారికి ఒక నివేదికను అందించారు. సి.పి.ఐ.(మా.లె) యువతులను ''నగ్నంగా నిలబెట్టి'' వాళ్ళ శరీరమంతటా "మెడ, స్తనాలు, కడుపు తదితర మర్మాయవాలతో సహా," సిగరెట్టు నిప్పుతో కాల్చి, "అనూహ్యమైన" దుశ్చర్యలను కూడా జరిపారని ఆ సమాచారంలో వివరించారు. అటువంటి పనుల వల్ల మర్మావయవాలు గాయపడ్డాయి. "దీని తరవాత స్పృహ కోల్పోయిన ఆ యువతులను పోలీసు వానులో తిరిగి జైలుకు తీసుకువచ్చేవారు. మరో 20, 22 రోజుల తరువాత వాళ్లు కోలుకొన్నాక, మళ్లీ లాల్ బజార్ (కలకత్తా పోలీసు కేంద్రకార్యాలయం)కు తీసుకుపోయి అదే చిత్రహింసలకు గురిచేసేవారు.[80]

సి.పి.ఐ.(మా.లె.) ఉద్యమానికి చెందిన ప్రముఖ నాయకులనూ, సభ్యులనూ మరింత కసిగా హింసించేవారు. దేబ్రా–గోపీవల్లభపూరు నాయకుడైన అషీంచటర్జీని 1971లో అరెస్టయిన నాటి నుంచి 'దండాచేరీలు' (సంకెళ్ళు) తగిలించి వాటితో రాత్రింబవళ్ళు అలాగే ఉంచారని 1973 మధ్య కాలంలో తెలియవచ్చింది.

భారతీయ జైళ్లలో సి.పి.ఐ. (మా.లె.) ఖైదీల పట్ల జరుగుతున్న చిత్రహింసలు. 1974 నాటికి అంతర్జాతీయ దృష్టికి కూడా వచ్చాయి. దేశానికే అపకీర్తిని తెచ్చిపెట్టిన ఈ చిత్రహింసల పట్ల ప్రభుత్వమూ, పత్రికలూ కూడా మౌనం వహించాయి. నామ్ చోమ్స్కీ, సైమన్‌డిబవార్ వంటి 300 పైగా విద్యాధికులు తమ సంతకాలు చేసిన ఒక నిరసన పత్రాన్ని 1974 ఆగస్టు 15వ తేదీన భారత ప్రభుత్వానికి సమర్పించారు. అంతర్జాతీయ క్షమా సంస్థ (Amnesty International) అటువంటి అక్రమ నిర్బంధాలు చిత్రహింసలను గురించి సేకరించిన సమాచారాన్ని ఒక నివేదిక రూపంగా ప్రధాన మంత్రి ఇందిరాగాంధీకి పశ్చిమ బెంగాలు ముఖ్యమంత్రి సిద్ధార్థ శంకర రేకు సమర్పించింది. ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి మార్టిన్ ఎన్నాల్స్ ఆ నివేదికను వెలువరిస్తూ, పత్రికా సమావేశంలో ఇలా చెప్పాడు. "ఇవన్నీ పచ్చి నిజాలనే నమ్మకం

మాకుంది కనకనే ఈ నివేదికను ప్రజల ముందు పెడుతున్నాం. మేం సేకరించిన సమాచారం సరియైనదనే నమ్ముతున్నాం."[82]

సి.పి.ఐ. (మా.లె.) ఖైదీలు ఒక వింత మానవులనీ, మామూలు మర్యాదలకు వాళ్లు తగరనే అర్థం వచ్చేలా, ప్రభుత్వంలోని, కొందరన్నారు. పశ్చిమ బెంగాలు జైళ్ల శాఖామాత్యుడు గ్యాన్‌సింగ్ సోహన్‌పాల్, వారిని 'ఉన్మాదులు'గా చిత్రించాడు. 'వాళ్ల మానసికమైన వెర్రిని వదలగొట్టేందుకు మానసిక చికిత్స అవసరమ'న్నాడు.[83] సోవియట్ నాయకులు రష్యాలోని రాజకీయ అసమ్మతివాదుల్ని 'ఉన్మాదులు'గా చిత్రించి, 'పిచ్చాసుపత్రులలో' పారేసి హింసించడం మామూలే, భారత ప్రభుత్వంవారు ఈ వైఖరిని తమ గురువుల నుంచి పుణికి పుచ్చుకున్నారా? సి.పి.ఐ. (మా.లె.) ఖైదీల కుటుంబాలు కూడా పోలీసుల చిత్రహింసలకు గురయ్యాయి. శ్రీకాకుళ గిరిజన రైతాంగాన్ని 'కీలక గ్రామాల'లో వాళ్లెలా బందీలు చేసారనేది ముందు అధ్యాయాలలో చూశాం.

ఇదంతా జరుగుతున్నా 'స్వేచ్ఛా పత్రికా సముదాయం (the so called free-Press) సాంఘిక రాజకీయ నాయకులు కూడా తమకేమీ పట్టనట్టుగా చూస్తూ ఊరుకున్నారు. ఇదే 'పత్రికా ప్రపంచం' ఇదే నాయకులు, భవనాల విధ్వంసం పట్ల, విగ్రహాలను అవమానించారని అసహ్యంతో కోపంతో చిందు లేసారు. ఒక తరం యువకులందరూ, పోలీసు కసాయి చర్యలకు బలై, చావునూ, అంగవైకల్యాన్ని పొందారు. గతంలో కూడా ప్రభుత్వం ప్రజాందోళనల పట్ల క్రూరంగానే ప్రవర్తించింది. కాని విప్లవాలకు దారితీసే తరతరాలుగా సాగే పీడన, అవమానాల సుదీర్ఘ చరిత్రను చూడ నిరాకరించింది. కారల్ మార్క్స్ చెప్పినట్లుగా "గతకాలపు భూస్వామి తన చేతిలో నున్న ప్రతి ఆయుధమూ సమంజసమైనదనీ, సామాన్యుని చేతిలో ఉన్న ఎటువంటి ఆయుధమైనా కానీ, అసలు అటువంటి ఆయుధాన్ని ఉంచుకోవడమనే సంగతే ఒక నేరంగా భావించినట్టు", గానే భారత ప్రభుత్వమూ భావించింది.[84]

# 10. భావిలో అవకాశాలు

పోరాటం మరింత హెచ్చు స్థాయిలో మళ్లీ మళ్లీ రాజుకుంటుంది. చివరకు ఎవరు నెగ్గుతారనే మాటకొస్తే దోపిడి చేసే అల్పసంఖ్యాకులా, అనంతమైన కార్మికులా అంటే అనంతమైన కార్మికవర్గమే గెలుస్తుంది అనేందుకు ఏమీ సందేహం లేదు.

– కార్ల్‌మార్క్స్ 'ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం'
మే 30, 1871

విప్లవం దేశవ్యాప్తంగా వస్తోంది...
–చారుమజుందారు 'ప్రజల క్షేమమే పార్టీ క్షేమం'
జూన్ 9, 1972

## ఉద్యమ సమీక్ష

1972లో ఆఖరైన సి.పి.ఐ. (మా.లె.) ఉద్యమ దశను సమీక్షిస్తే సాయుధ గెరిల్లా యుద్ధం ద్వారా బీదరైతులు భూమిలేని రైతులు అర్ధవలస అర్ధ భూస్వామ్య పాలక వర్గాల నుంచి ప్రాంతీయ ప్రాతిపదికపై అధికారాన్ని పట్టుకోవాలనే సిద్ధాంతాన్ని నిలబెట్టిన దశ అది. 1967–72 సంవత్సరాల మధ్య కాలంలో దేశంలోని రైతాంగం గెరిల్లా చర్యలలో పాల్గొనేందుకు ముందుకు వచ్చారు. బీజాత్మకంగా 'ప్రజాశక్తి' రూపాలను స్థాపించారు. ప్రస్తుత సమాజాన్ని పట్టి నిలబెట్టే భావాలపైనా, సంస్థలపైనా నగర ప్రాంతాలలో తిరుగుబాటు చేసిన యువత గ్రామచర్యలకు తోడ్పాటుగా నిలిచింది.

భారతదేశంలో ప్రాంతీయ ప్రాతిపదికపైన అధికారాన్ని పట్టుకొని విముక్తి ప్రాంతాన్ని నిలబెట్టుకోవాలంటే రెండు మార్గాలున్నాయి. ఏర్పరచదలుచుకున్న విముక్తి ప్రాంతానికి వెనుకగా అండగా విదేశీ భూభాగం ఉంటే అటువంటి విముక్తి ప్రాంతాన్నేర్పరచడం దేశంలో ఏ మూలైన సాధ్యపడుతుంది. (దేశానికి తూర్పున నాగాలు, మిజో జాతీయవాద తిరుగుబాటుదార్లు అదే ప్రాతిపదికపై, చాలా

సంవత్సరాలుగా భారత ప్రభుత్వంపై పోరాడుతున్నారు) లేక అలా వెనకాలున్న విదేశీ భూభాగం స్నేహపూర్వకంగా ఉండవచ్చు. (అలాగే చైనాలో మొదటగా యేనాన్‌లో ఏర్పడిన 'అరుణ స్థావరానికి' వెనకాల సోవియట్ భూభాగం ఉంది) అటువంటి విదేశం తిరుగుబాటుదార్ల విషయంలో తటస్థంగా ఉన్నా ఫరవాలేదు. లేక అటువంటి ప్రదేశం ప్రయాణ సౌకర్యాలు లేక, పరిపాలనా యంత్రాంగం అమలుకాలేని దూరంలో (అడవులు, నదులు, కొండలు వంటి ఆటంకాలతో) దేశం నడిబొడ్డున ఉన్నా అధికారాన్ని నిలబెట్టుకోవచ్చు. (మధ్య ప్రదేశ్‌లోని చంబలులోయలు దోపిడీ దొంగల నిలయంగా ఉండి వాళ్లకు ఆశ్రయమిచ్చాయి. లోయలు వాళ్ల సామ్రాజ్యంగా చెప్పొచ్చు.)

అనేక గ్రామస్థావరాలను ఏక కాలంలో కొండలలోనూ మైదానాలలోనూ కూడా నిర్మించుకోవడం రెండో మార్గం. అటువంటి స్థావరాలు శతృబలాలు చెల్లాచెదురుగా నియమించాల్సిన అవసరం కలిగేంత విస్తృతంగానూ దూరంగానూ కూడా ఉండాలి. వాటికి తోడుగా నగర కార్మిక వర్గ చర్యలు జరగాలి. అలా చెల్లాచెదురుగా ఉన్న స్థావరాలు నిశ్చలంగా ఉండవు. *

అలా ఏర్పరచిన స్థావరాల విషయంలో ఏర్పాటు, నాశనం, ముఖ్యాంశాలు కాదు. అవి అంచెలంచెలుగా శత్రువుపై తీవ్రమైన దెబ్బ తీయగలిగి ఉండడమే ముఖ్యం. ఆ విధంగా అవి శతృబలాలను గాయపరుస్తాయి. క్రమంగా బలాబలాలలో తేడాలు పెరుగుతాయి. అటువంటి తేడాలు సుస్థిరమైన విముక్తి ప్రాంతాలు ఏర్పాటుకు దారి తీస్తాయి.

రెండు ఎత్తుగడలలోనూ కూడా విముక్తి ప్రాంతాల రక్షణకూ విస్తరణకూ ఒక పరిపక్వం చెందిన సంపూర్ణ సైనికబలం ఉండడం ముఖ్యం.

సి.పి.ఐ. (మా.లె.) రెండో మార్గాన్ని ఎన్నుకుంది. దేశం ప్రతి మూలా రైతాంగ తిరుగుబాట్లు రగులుకుంటాయని భావించింది. సైనికపరంగా ప్రాదేశిక స్థితి (Terrain) అనుకూలంగా ఉన్నా, లేకున్నా, అలా రగులుకున్న తిరుగుబాట్లు గ్రామ గ్రామాల పాకిపోయి, ఒక మహా వెల్లువగా పెరిగి, చివరకు పాలనా కేంద్రాలై నగరాలకు చేరుకుంటాయని ఊహించింది. సి.పి.ఐ. (మా.లె.) కార్యకర్తలకు తిరుగులేని ధైర్యం, అత్యంత శ్రద్ధాశక్తులు ఉన్నాయి. అయినా, పార్టీ చాలా దిశలలో ఓడిపోయింది.

---

* *అంటే నిరంతరం శత్రువు మధ్య పోరాటదార్ల మధ్యా చేతులు మారుతూ, ఎప్పుడు పడితే అప్పుడు పోరాటదార్ల చేతుల్లోకి వచ్చేలా ఉండాలి. పోరాటదార్ల రహస్య ప్రాబల్యంలో ఆ ప్రాంతాలు సహజంగా ఉండాలి. ఉదా॥ తెలంగాణా పోరాట కాలంలో చాలా గ్రామాలు కమ్యూనిస్టుల ప్రాబల్యంలో రహస్యంగా కూడా ఉండేవి. చూ॥ అధ్యాయం. 1 పే – అను.*

రెండవ తరహా ఎత్తుగడలు ఫలించాలంటే, ముఖ్యంగా గ్రామస్థావరాలు త్వరగా విస్తరించాలి. విప్లవకారుల పోరాట దళాలు కూడా పెరగాలి. ఏమైనా సి.పి.ఐ. (మా.లె.) పార్టీ పోరాటపు ప్రాథమిక దశలను దాటలేదు. వర్గశత్రువులను "ఖతం చెయ్యడం" ఆయుధాలను పట్టుకోవడం, గెరిల్లా స్క్వాడ్ల నిర్మాణం, విప్లవ కమిటీల ఆధ్వర్యంలో ఆర్థిక కోర్కెలకై రైతాంగ ప్రజానీకాన్ని సమీకరించడం వంటి దశలలోనే అది నిలిచిపోయింది. ఇవి కూడా పార్టీ బాగా వేళ్ళూనుకున్న ప్రాంతాలలోనే జరిగాయి.

(1) గెరిల్లా యూనిట్లను విస్తృతం చేసి ప్రజా విముక్తి సైన్యాలుగా రూపొందించడం: పోరాడే రైతాంగానికి తోడుగా నిలిచి నాయకత్వం నెరపేందుకు నగర కార్మికవర్గ సమీకరణ; గ్రామీణులను సాయుధుల్ని చేసి, వారిని ప్రజా సైన్యాలుగా ఏర్పరచడం; శత్రువు బలాన్ని విచ్ఛిన్నం చేసేందుకు పటిష్టమైన దాడులు నిర్వహించడం. మొదలగు ఉన్నత దశలను పార్టీ ప్రణాళికలో చెప్పుకోవడమే జరిగింది కాని, పై వాటిలో ఏ ఒక్కటీ ఆచరణలో సాధించలేక పోయారు.

(2) తాము ప్రాథమిక దశలలో నిర్దేశించుకున్న ఆశయాల సాధనలో కూడా కొన్ని పెద్ద పొరపాట్లు జరగడం వల్ల, సి.పి.ఐ. (మా.లె.) పార్టీ వర్గాలలో ఐకమత్యానికి హాని కలిగింది. దానివల్ల వాళ్ళు ఒంటరిగాళ్ళయి పోయి ప్రజలకు దూరమయ్యారు. చాలా మంది కేడర్లు నిర్వీర్యులయ్యారు. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ నాయకత్వం, నాటి సాంఘిక-సామాజిక ప్రభావానికిలోనై, దాని తీరుతెన్నులు, ప్రత్యేకించి చారుమజుందారు ప్రవర్తన, ఈ లోపాలకు ఎంతో బాధ్యులని చెప్పాలి.

(3) ఉద్యమం యొక్క సైనికావసరాలను నాయకత్వం గుర్తించలేదు. దానితో ఎత్తుగడలలోని ముఖ్యాంశం - విప్లవకారులకూ శత్రుబలాలకూ మధ్య గల అంతరాన్ని (తమకు అనుకూలంగా సైనిక చర్యల ద్వారా) మలచుకునే ఆశయం, (ఆచరణలో) విఫలమైంది. భారతదేశంలో మౌలికంగా వర్థిల్లే సాంఘిక - రాజకీయవ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పును తేవాలనుకున్న సి.పి.ఐ.(మా.లె.) పార్టీ యొక్క ప్రధానాశయాన్ని విఫలం చేసిన పై మూడు కారణాలనూ ఇప్పుడు మరింత విపులంగా పరిశీలిద్దాం.

## సాయుధ పోరాటంలో ఉన్నత దశకు చేరుకోవడంలో వైఫల్యం

శ్రీకాకుళం, బీర్భం మొదలైన అనేక పోరాట ప్రాంతాల నుంచి విప్లవకారులు పంపిన నివేదికలలో సాయుధ పోరాట స్థాయిని పెంచలేకపోతున్నామని వాపోయారు. చారుమజుందారు కూడా ఉద్యమపు చివరి దశలో ప్రజా విముక్తి సైన్యపు (పి.ఎల్.ఎ.)

ఏర్పాటు గురించి నొక్కి చెప్పడం మనకు తెలుసు.

విప్లవ కమిటీలను నేర్పాటు చేయాలనీ, చలనంలో ఉన్న శత్రుసైన్యాలపై దాడులు జరపాలనీ అన్నాడు.

దాదాపు అన్ని ప్రాంతాల సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కేడర్లు కూడా అధిక సంఖ్యలో బీదరైతులనూ భూమిలేని రైతులనూ సమీకరించలేకపోయారు. దానివల్ల గ్రామీణ బీద ప్రజానీకంతో ఏర్పాటు చేసిన చాలా గెరిల్లా స్క్వాడ్లు ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోయాయి. గ్రామంలోని వడ్డీ వ్యాపారస్తులనూ, కొద్దిమంది భూస్వాములనూ, 'ఖతం' చెయ్యడం మించి, స్క్వాడ్ల కార్యకలాపాలు ఎదగలేదు. సైన్యాలమీద పోలీసుల మీదా భారీస్థాయి దాడులు జరపడం కుదరలేదు. ప్రజావిముక్తి సైన్యం కలగానే నిలచిపోయింది.

పోరాటపు ప్రాంతాల నుంచి అందిన నివేదికలలో ఈ విషయాన్ని గుర్తించారు. ఆంధ్ర రాష్ట్ర కమిటీ శ్రీకాకుళాన్ని గురించి 1971 మార్చిలో ఇలా వివరించింది. "మన కేడర్లు ప్రధానంగా పెట్టీ బూర్జువా వర్గానికి చెందినవారు. బీదరైతులు, భూమి లేని రైతుల గ్రామాలు, ఈనాటికీ మన కార్యకలాపాలకు కేంద్రంగా లేవు. నాయకత్వం ఈ మౌలిక వర్గాల నుంచి రావడం లేదు... ఇదే మన ప్రధాన లోపం."[1]

తమ ఆశయాలను కొంతైనా సాధించుకున్న బీర్భంలో కూడా, ఇందువల్లనే పోరాటం కుంటుపడింది. పశ్చిమ బెంగాలు–బీహారు సరిహద్దు ప్రాంతీయ సరిహద్దు కమిటీ సెప్టెంబరు 1971లో ఇలా చెప్పుకుంది. "రైతాంగ గెరిల్లాలలో రాజకీయ సైద్ధాంతిక కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసాం. ప్రజలను సంఘటితపరచడం విషయంలో వాళ్ళకు (ప్రజలకు) ఉన్నత బాధ్యతల నివ్వలేదు. వారి వాస్తవానుభవాలను క్రోడీకరించుకోవడంలో మేం సాయపడలేదు. అందుచేత భూమిలేని రైతాంగ కేడర్ల నుంచీ, బీదగెరిల్లాల నుంచీ హెచ్చు సంఖ్యలో రాజకీయ కార్యకర్తలను ప్రజా సంఘటన కార్యదర్శులను తయారుచేయలేక పోయాం... తుపాకులను పట్టుకునే కార్యక్రమంలో, బీదరైతుల భూమిలేని రైతుల నాయకత్వాన్ని పూర్తిగా ఏర్పరచలేకపోయాం..."[2]

పార్టీ నివేదికలిలా వివరించాయి. ఏదో గ్రామంలో రాజకీయ పరిచయం గల కొద్ది మంది గెరిల్లాలు ఒక భూస్వామిని కాని అందరి ద్వేషాన్ని పొందిన వడ్డీ వ్యాపారిని కాని చంపారనుకుందాం. దానితో మిగతా భూస్వాములు గ్రామం వదిలి పారిపోయారు. బీదరైతులు భూమిలేని రైతులు చాలా సంతోషించేవారు. కాని తరువాత పనిగా రైతాంగాన్ని సమీకరించి, పంటలు మాసూలు చేసుకుని స్వాధీనం చేసుకోవడంలో, 1970 సంవత్సరమంతటా విఫలమయ్యారు. (ఆ సంవత్సరంలోనే

అత్యధిక సంఖ్యలో ఖతం చర్యలు జరిగాయి) రైతాంగం మూగ ప్రేక్షకులుగానే మిగిలిపోయారు. 1971 జూలైలో అషీం చటర్జీ ఇలా తెలిపాడు. "120 మంది వర్గ శత్రువులను చంపాక కూడా ఎడతెగని ప్రయత్నాలెన్నో చేసినా, మా గెరిల్లా దళంలోని భూమి లేని రైతుల బీదరైతుల సంఖ్య పెరగనేలేదు. మొదట్లో అత్యధిక సంఖ్యలో ముందుకు వచ్చిన రైతాంగ ప్రజలు, మామూలు సానుభూతిపరులుగానే మిగిలిపోయారు."[3]

కాని ఈ విషయంలో నిజానికీ కేడర్లను మాత్రమే తప్పు పట్టలేం. ఈ పొరపాటులలో నాయకత్వానికీ భాగముంది. 1970 సంవత్సరంలోనూ, 1971 సంవత్సరం సగం వరకూ కూడా, "వర్గశత్రువుల నిర్మూలనే" పార్టీ ప్రధానాశయంగా, నాయకత్వం చిత్రీకరించింది. "అన్ని సమస్యలూ" దాని ద్వారానే "పరిష్కరింపబడతాయ"ని ఆశించింది. "వర్గశత్రువుల నిర్మూలనకు" తరువాతి చర్యగా, ప్రజా ఉద్యమాల అవసరాన్ని గుర్తించమని తన కామ్రేడులను కోరిన (29) చారుమజుందారు కూడా, తరువాత వాటి అవసరాన్ని అంతగా లెక్క చెయ్యనట్టు కన్పించాడు. ఆ పరిస్థితులలో సహజంగానే కేడర్లు తమ ప్రయత్నాలన్నీ 'ఖతం' చర్యలమీదే కేంద్రీకరించారు. ఆర్థిక ఉద్యమాల ద్వారా రైతాంగాన్ని సమీకరించే తరువాతి దశకు చేరుకునే ప్రయత్నాలేమీ చెయ్యలేదు. పార్టీ పత్రికలలో ప్రత్యేకించి 'దేశవ్రతి'లో అటువంటి చర్యలకు ఇస్తున్న ప్రచారపు తీరు వారి వైఖరికి మరింత దోహదం చేసింది. ఎక్కడైనా ఒక్క 'ఖతం' చర్య జరిగినా, ఆ ప్రాంతాన్ని దేశవ్రతి "సాయుధ పోరాట జ్వాలలు" రగులుకున్న ప్రదేశాల పట్టికలో చేర్చింది.

దేబ్రా గోపీవల్లభపూర్, బీర్భంలలో జరిగిన పోలీసు దమన చర్యలు, రైతాంగ జనబాహుళ్యపు సమీకరణ, సంఘటన స్థాయిలో గల లోపాలను బయటపెట్టాయి. విప్లవాధికారుల ఆయుధ శక్తి కూడా చాలదని తేలిపోయింది. అప్పుడు కాని, నాయకత్వం హెచ్చు సంఖ్యలో, రైతాంగాన్ని సమీకరించేందుకు కావలసిన ఆర్థిక ఉద్యమాలు నిర్మించే అవసరాన్ని గుర్తించలేదు. అపజయాలను సమీక్షించిన చారుమజుందారు, ఆర్థిక కోర్కెల ప్రాతిపదికగా, మొత్తం రైతాంగాన్ని సమీకరించి; వాళ్ళను సాయుధ యోధులుగా తయారు చేయడానికీ; గల సంబంధాన్ని అప్పుడు గుర్తించాడు. 1971 చివరనుంచి, 1972 జూలైలో తను అరెస్టయ్యే దాకా, చారుమజుందారు తన రాతలలో గెరిల్లా యుద్ధానికి తోడుగా ఆర్థిక ప్రాతిపదికలపై ప్రజా ఉద్యమాలను నిర్వహించాలనే విషయాన్ని నొక్కి చెప్పసాగాడు. 1968–69 నాటి రాతలలో ఈ ఉద్దేశం సూచన ప్రాయంగానే కనుపించేది. 1970లో దీనికి

ముందు పీట లభించలేదు. 1971 చివరకు మళ్ళీ చోటు చేసుకోసాగింది.

కాని అప్పటికే సమయం మించిపోయింది. ప్రభుత్వం తలపెట్టిన భారీస్థాయి దాడిని తట్టుకునేందుకు అనువైన యోధులుగా రైతాంగాన్ని సమీకరించడం ఒక రోజులో అయ్యేది కాదు.

ఉద్యమాన్ని 'ఉన్నత దశలలోకి' తీసుకుపోవలసిన అవసరాన్ని పార్టీ నాయకత్వం గుర్తించినట్టే కనపడుతుంది. ప్రజా విమోచన సైన్యాన్ని నిర్మించి సైన్యంపై దాడి చెయ్యాలని ఆశించింది. కాని ఉద్యమం దానంతటదే ఉన్నత దశలకు చేరుకుంటుందనే వెర్రిభ్రమలకు కూడా లోనైంది. రైతాంగ జనబాహుళ్యాలను సమీకరించి చిన్న గెరిల్లా యూనిట్లను సైన్యంగా మార్చేందుకు కాని, సానుభూతిపరులను సైనికులుగా మార్చేందుకు కాని సాధనంగా ఉండే ప్రజా ఉద్యమాల నిర్వహణలో, (1970 సంవత్సరంలోనూ 1971 మొదట్లోనూ కూడా) పార్టీ నాయకత్వం, ఎట్టి పాత్రనూ ధరించలేదనే చెప్పాలి. మగర్జున సంఘటన తరువాత పశ్చిమ బెంగాలులో ప్రజావిమోచన సైన్యం ఏర్పడి పోయిందనే చారుమజుందారు ప్రకటించాడు. ఆ ప్రకటన, చిన్న గెరిల్లా యూనిట్లు కూడా, ప్రజా విమోచన సైన్యమనే ఘనమైన పేరుకు తగినవే అనే నమ్మకాన్ని ప్రోత్సహించింది. శతృవు చేస్తున్న మౌలికమైన దాడిని ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయి సైన్యం అవసరం. ఆ ప్రచారం ఈ మౌలిక సమస్యను ఎంత మాత్రమూ పరిష్కరించలేదు.

నగర కార్మిక వర్గం విషయంలో కూడా, అటువంటి యాదృచ్ఛికత్వం పైనే పార్టీ నాయకత్వం భ్రమలు పెట్టుకుంది. చైనాలో 20లలోనూ 30లలోనూ కల కార్మిక వర్గం కంటే భారతదేశంలోని కార్మికవర్గం ఎన్నో రెట్లు ఎక్కువ. గ్రామీణ సాయుధ సంఘర్షణకు తోడు నిలవడంలో దానికి ఎంతో ముఖ్యపాత్ర ఉంది. రైతాంగ పోరాటానికి కార్మికవర్గం నాయకత్వం వహిస్తుందని పార్టీ అంగీకరించింది. కాని 1968-69 కాలంలో, కార్మిక వర్గానికై ప్రత్యేకించి స్పష్టమైన కార్యక్రమాన్ని పార్టీ నిర్దేశించలేదు. చారుమజుందారు 1970 మార్చిలో మాత్రం రెండు వ్యాసాలు రాసాడు. ఒకటి 'కార్మిక వర్గానికి' అనే వ్యాసం; రెండోది 'కార్మికులలో మన పార్టీ బాధ్యులు'.

పార్టీకి గల కార్మిక వైఖరి ఏమిటీ? పై రెండు వ్యాసాలలో చారుమజుందారు ఇలా వివరించాడు. రహస్య పార్టీ యూనిట్లను నిర్మించి, కార్మికులను జాగృతం చేసి, అక్కడి పోరాటానికి నాయకత్వాన్నిచ్చేందుకు ప్రోత్సహిస్తూ; పట్టణ కార్మికులలో గ్రామీణ పోరాట రాజకీయాలను ప్రచారం చేయాలి. "నగరంలో కార్మికులు విప్లవ రాజకీయాలలో ఉత్తేజితులై, వాళ్ళు మరింత తీవ్రంగా మారి, తమ తమ పారిశ్రామిక

ప్రాంతాలలో వీరోచిత పోరాటాలకు నాందీ పలుకుతారు. వర్గ శత్రువులనూ, వాళ్ళ తొత్తులనూ, చంపడానికి కూడా ముందుకు వస్తారు. గ్రామ ప్రాంతంలో శత్రువు నీరసంగా ఉన్నాడు. అటువంటి చోట రాజకీయాధికారాన్ని పట్టుకునేందుకు పోరాడుతున్నారనే మావో ఆలోచన వాళ్ళకు తెలుస్తుంది. ఆ పోరాటంలో పాల్గొనేందుకై నగర కార్మికుడు గ్రామసీమకు తరలిపోతారు." "మన పార్టీ వ్యవస్థ ఈ పంథాలో పోరాటాలను ఆరంభించి పెంపు చేయాలని," చారుమజుందారు పారిశ్రామిక కార్మికులకు కర్తవ్యాలను సూచించాడు. కనుక, కార్మిక పోరాటానికి గ్రామసీమలే తుది రంగం అన్నమాట. తమను తాము పోరాటానికి తయారు చేసుకునేందుకే నగర కార్మికుల కర్తవ్యాలు నిర్దేశించబడ్డాయి. కాని గ్రామీణ సంఘర్షణకు తోడ్పాటుగా అవి ఉండవు.

కార్మికులు గ్రామాలకు తరలి వెళ్ళాలనే సాధారణ ఆదేశం తప్పిస్తే, నగరాలలో నడుస్తున్న కార్మిక వర్గాల సంఘర్షణను గ్రామీణ పోరాటాలతో సమన్వయపరిచేందుకు. 1972 ఏప్రిలు నెలనాటికి కూడా ఎటువంటి స్పష్టమైన ప్రణాళికా లేదు. ఆ సంవత్సరం మేడే నాడు కార్మికులకు సందేశమిస్తూ, చారుమజుందారు రైతాంగ సాయుధ పోరాటాన్ని కార్మికుల దృష్టికి తెచ్చాడు. దానిని "బలపరచి, అందులో పాల్గొని, దానికి నాయకత్వం"(71) వహించమన్నాడు.

కాని 1970–71 సంవత్సరాలలో రెండు సార్లు జరిగిన కార్మికవర్గ సమ్మెలు రవాణా సంబంధాలను విచ్ఛిన్నం చేసాయి. రాజ్యశక్తికే ముప్పు తెచ్చాయి. అవి సి.పి.ఐ. (మా.లె.) పార్టీ సంస్థకు వెలుపల దాని ప్రభావానికి లోను కాకుండానే జరిగాయని ముందు పేజీలలో గమనించాం.

భారత కార్మికవర్గం రవాణా సంబంధాలను విచ్ఛిన్నం చేసి, వాటిని విప్లవకారులకు అనుకూలంగా నిర్వహించి, ఆయుధాగారాల నుంచి ఆయుధాలనూ మందు గుండు సామాగ్రినీ సరఫరా చేయగలరనే నమ్మకం. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ వర్గాలలో కనుపించలేదు.

భారతదేశంలో రైల్వేలు 59,750 కి.మీ. వ్యాపించి ఉండి దేశంలో ప్రధాన రవాణా సౌకర్యంగా ఉన్నాయనే సంగతి గమనించాలి. 9,64,515 కి.మీ. వ్యాపించిన రోడ్డు రవాణా విభాగం రెండవ స్థానం ఆక్రమిస్తోంది. దానిలో మూడవ వంతు కంకర, తారు మొదలగు వాటితో నిర్మించినవే.[4] ఈ కీలక రవాణా రంగాల కార్మికులు, భారత ఆర్థిక వ్యవస్థలో వారి స్థానాన్ని ఇవి తెలుపుతాయి. రైల్వే తంతితపాలా సౌకర్యాలను విచ్ఛిన్నం చెయ్యడం, విమానాశ్రయాల దిగ్బంధం, రోడ్లను పేల్చి వేయడం

వంటి నగర కార్మిక చర్యలు, చైనా వియత్నాం దేశాలలోని గ్రామీణ సంఘర్షణలకు తోడ్పడ్డాయి. దానివల్ల 'ఎర్ర ప్రాంతాలకు' త్వరగా సైనికులను పంపలేక పోయారు. శత్రువులకు సరుకుల సరఫరా నిలిచిపోయింది. కాని మన దేశంలో మాత్రం అటువంటి కార్మిక వర్గ చర్యలు జరిగే అవకాశాన్ని గుర్తించలేదు. వాటిని కనుక గ్రామీణ పోరాటాలతో సమన్వయపరచి ఉంటే, ఆ ఉద్యమం వాళ్లు కోరుకున్న 'ఉన్నత దశకు' చేరుకుని ఉండేదేమో!

## అనైక్యత-ఒంటరితనం-విచ్ఛిన్నం

ఉద్యమం 'ఉన్నత దశకు' చేరుకునేలోగానే ఒకరితో ఒకరు పోట్లాడుకునే అనేక ముఠాల సముదాయంగా సి.పి.ఐ. (మా.లె.) పార్టీ తయారైంది. దాని కార్యకర్తలు క్రమంగా ప్రజల నుంచి వేరై పోయి ఏకాకులయ్యారు. చారుమజుందారు ఆ ఉద్యమాన్ని నడిపిన తీరు కూడా దీనికి కొంత వరకూ కారణం. 1967-72 కాలపు భారత కమ్యూనిస్టు విప్లవకారుల పరాజయాలను అర్థం చేసుకోవాలంటే చారుమజుందారు పాత్రను నిష్పక్షపాతంగా పరిశీలించడం ఎంతో అవసరం.

అతని వీరోచిత పోరాటం, చావుల వల్ల ప్రసరించే వెలుగులో భావికాలంలో అతని చర్యలలోని తప్పులు శూన్యంలోకి జారుకోవచ్చు. కాని ఈనాడు అతని విమర్శకులు అతనిలో గల ప్రతికూలాత్మకమైన ప్రతి విషయాన్నీ ఎదిరించాలని భావిస్తున్నారు. సత్యనారాయణ సింగు నాయకత్వంలోని సి.పి.ఐ.(మా.లె.) పార్టీ ఆత్మ విమర్శనా సమీక్షలో చెప్పినట్టుగా "చారుమజుందారు పాత్రను పరిశీలించేటప్పుడు చనిపోయిన వాళ్లందరూ మంచివాళ్లే అనే హైందవ మౌఢ్యానికి లోను కాకూడదు."[5]

సుదీర్ఘమైన పోరాట కాలంలో చారుమజుందారు ఒక ఎత్తుగడ నుండి మరో ఎత్తుగడకు తను చూపించే ప్రాధాన్యతను మారుస్తూ తన భావాలను మార్చాడని ఉద్యమ చరిత్ర వల్ల తెలుస్తుంది. తన ఉపన్యాసాలలోనూ, రాతలలోనూ 1965, 1968. ఆ తరువాత 1972 కాలాలలో చట్టబద్ధమైన సంఘర్షణలకూ, ప్రజా ఉద్యమాలకూ ప్రజా పోరాటాలకూ ఇచ్చిన ప్రాధాన్యత; రాజ్యాధికారాన్ని పట్టుకునేందుకై ఆ చర్యలను సాయుధ చర్యలతోనూ కుట్ర తరహా కార్యకలాపాలతోనూ మేళవించ వలసిన అవసరం; మొదలైన వాటి గురించి చారుమజుందారు తన రాతలలోనూ ఉపన్యాసాలలోనూ 1965 నుంచి 1968 వరకూ, ఆ తరువాత 1972లోనూ వక్కాణించాడు. 1967-71 సంవత్సరాలలో అతనికి ఈ పోరాట రూపాల పట్ల నిరసన భావం ఉండేది. ఖతం చర్యల గురించి (36) ప్రజా సంఘాల గురించి (28)

భారత దేశ విముక్తి గురించి (43) అతను చేసిన ప్రకటనల వల్ల కేడర్లు విస్తృత ప్రజా పునాది గల పరిధిలోంచి పరిమిత ప్రాంతాలలోనే పలుకుబడిగల స్థాయికి తగ్గిపోయి, ఏకాకులుగా అయ్యారు. 1969–71 కాలంలో చారుమజుందారులో చోటు చేసుకున్న ఈ ధోరణి మూలంగానే నాడు అత్యవసరంగా పరిణమించిన వివిధ కమ్యూనిస్టు గ్రూపులకు చెందిన విప్లవకారుల సమన్వయం సాధ్యం కాలేదు. ఈ ధోరణి వల్లనే అతని భక్తులు తుపాకులు చూపైనా సరే అతని 'అధికారాన్ని' పార్టీలో నిలబెట్టాలని భావించారు. చివరకు ఆ ధోరణి కలకత్తాలోని కమల్ సన్యాల్, అగ్నిరేల హత్యలకు కూడా దారి తీసింది. తప్పులను సవరించుకునేందుకు 1972లో ఎటువంటి ప్రయత్నాలు జరిగినా, జరగవలసిన నష్టమేదో అప్పటికే జరిగిపోయింది. పరిస్థితి చెయ్యిదాటి పోయింది.

1969–71 కాలపు రాతలను బట్టి చూస్తే చారుమజుందారు ఒకరకమైన అపోహలో విహరిస్తున్నట్టు కనపడుతుంది. అధికారం వల్ల సంతరించుకున్న అపోహ అది. స్నేహపూర్వక విమర్శన సహించలేకపోవడం, ఎటువంటి సలహాలను వినకపోవడం, పార్టీ ఆంతరంగిక విభేధాలలో బ్యూరోక్రటిక్ ధోరణిని అవలంభించడం. తన అనుయాయుల పవిత్ర పరిధి బయటనున్న విప్లవకారలను దుర్భాషలతో దుయ్యబట్టడం వంటి ధోరణులతో పార్టీ వర్గాలలో రక్షణ లేని వివాదాలు పడే అలవాటుకు దారి తీసింది.

ఈ ప్రవర్తనకు కారణాలేమిటి? మనం కొన్ని ఊహాగానాలు చెయ్యొచ్చు. చారుమజుందారు అనుభవం 1940లలో ఉత్తమ బెంగాలులో జరిగిన 'తేభాగా' ఉద్యమానికే పరిమితమైంది. అతనిలో అఖిల భారత దృక్పథం లేకపోయింది. తన పరిసరాలలో జరుగుతున్న పోరాటాల తీవ్రత చూసి దేశంలోని ప్రతి మూలా "అంటుకునేందుకు తయారు"గా ఉందనే భ్రమలో పడ్డాడు. కార్మికవర్గపు ముఖ్యపాత్రను లెక్కచెయ్యలేదు. భారతీయ ప్రజల రాజకీయ చైతన్యపు స్థాయిలలోని తేడాలను లక్ష్యపెట్టలేదు.

1970 నాటికి అతని ఆరోగ్యం దెబ్బతింది. దాంతో అతను ఎక్కువగా తిరగలేకపోయాడు. పోరాట ప్రాంతాల నుంచి పూర్తిగా వేరుపడిపోయాడు. శ్రీకాకుళం గోపీవల్లభపూరు ప్రాంతాల నుంచి పరాజయ వార్తలు అతనికి చేరుతూనే ఉన్నాయి. పార్టీపై అతని 'అధికారాన్ని' నిలబెట్టాలని చూసిన అతని భక్తుల వల్ల పెరిగిన అతని 'అహం' తన ఎత్తుగడలు ఓడిపోయాయని ఒప్పుకునేందుకు అడ్డు నిలిచింది.

తాను తిరుగులేని మనిషిననే అపోహ అతనిలో మరింతగా పెరగడానికి చైనా

పార్టీ (అతని పట్ల చూపిన) వైఖరి కూడా కారణమైంది. అతనిని 1970 నాటిదాకా ఏకైక సి.పి.ఐ. (మా.లె.) పార్టీనాయకునిగా చైనా పార్టీ ఆకాశానికెత్తింది. చారుమజుందారు నాయకత్వంలో భారతదేశమంతటా సాయుధ పోరాటాలు ప్రారంభమయ్యాయనే భావాన్ని పెకింగ్ రేడియో ద్వారాను, పెకింగ్ రివ్యూ పత్రిక ద్వారాను చైనాపార్టీ ప్రచారం చేసింది. చైనా పార్టీలాంటి శక్తివంతమైన పార్టీ నుంచి మెప్పుకోలు పొందిన చారుమజుందారు ఎత్తుగడలను వేలెత్తి చూపే సాహసాన్ని చేసిన వారికి పార్టీలో నిరసన లభించింది. (ఆ ఎత్తుగడలపై) రహస్యంగా అనుమానాలు పెంచుకున్న వాళ్ళు మౌనంగా ఉండవలసి వచ్చింది. బహిరంగంగా వాటిని వ్యతిరేకించిన వారిని పార్టీలోంచి తన్ని తరిమేశారు. విమర్శలనూ, అనుభవాలనూ మననం చేసుకొని నేర్చుకున్న గుణపాఠాల దృష్ట్యా సామూహిక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు అంతరించాయి. 1971 చివరలోనూ, 1972 ఆరంభంలోనూ తన తప్పులను తెలుసుకున్నాక కూడా చారుమజుందారు నిజాయితీతో కూడిన ఆత్మవిమర్శ చేసుకోలేదు. అతని చివరి వ్యాసం ఇలా మొదలైంది: "సాయుధ పోరాటం దేశంలో ఒక దశకు చేరాక ఎదురు దెబ్బ తగిలింది."(73) ఆ ఎదురుదెబ్బ వెనకాల గల తప్పుల్ని వివరించలేదు. ప్రజా ఉద్యమాల ఆవశ్యకత, మిగిలిన గ్రూపులతో ఐక్య సంఘటన, విశాల మనస్తత్వం మొదలైన వాటి గురించి ఆ వ్యాసంలో చెప్పాడు. ఇన్నాళ్లుగా అతని విమర్శకులు కావాలని మొత్తుకుంటున్న విషయాలనే ఇప్పుడు అతనూ కోరుకున్నాడు. 1969లోనే కనుక ఈ అంశాలను అతను అంగీకరించి ఉంటే నాటి నుంచి ఈ అంశాలపై పార్టీలో వచ్చిన చీలికలు రాకుండా ఉండేవి. లెనిన్ పేరుతో అతను ఉపన్యసించేవాడు కాని లెనిన్ హెచ్చరికను మరచిపోయాడు. "తప్పులు చేయనివాడు తెలివైనవాడు కాదు. అటువంటి మనుషులు లేరు. ఉండరు కూడా. తీవ్రమైన తప్పులు చేయనివాడే తెలివైనవాడు. వాటిని సులువుగా తొందరగా సరిచేసుకోవడం (కూడా) తెలివైన వాడికే తెలుస్తుంది."[6]

గొప్పవాళ్లు కోరుకోకపోయినా వాళ్ళ చుట్టూ వందిమాగాధులు చేరడం మామూలే. తన శిష్యుల మూఢభక్తిని నిరసించి ఉంటే చారుమజుందారు మరింత గొప్ప నాయకుడయ్యే వాడు. ఈ మూఢభక్తులే (కానుసన్యాల్, సౌరీన్‌బోసు, ఖాకోన్ మజుందారు, అషీంచటర్జీ, సరోజ్‌దత్తా) అతనిని 'విప్లవాధికారం' అనే పవిత్ర పీఠంపై కూచోపెట్టాలని చూశారు. 1970 పార్టీ కాంగ్రెస్‌లో తన్ను విప్లవాధికారంగా నిలబెట్టాలని చూసిన తన భక్తుల ప్రయత్నాలను అతను వారించలేదు. మిగతా ప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించిన దృష్ట్యా 'విప్లవాధికారాన్ని' స్థాపించడంలో తమ

పోరాటాన్ని కొనసాగించమనే వారికి సలహా ఇచ్చాడు. ఇది తన అనుయాయులకు పచ్చ దీపాన్ని చూపడమే. వాళ్ళు అధికారాన్ని నిలబెట్టడానికి జరిపిన ప్రయత్నంలో హద్దులు మీరారు. 'అధికార'మే చివరకు వాళ్ళను అడ్డుపెట్ట లేకపోయింది.

1971లో పోలీసులు చేతిలో చనిపోయిన సరోజ్‌దత్తా తప్ప అతన్ని 'అధికారం'లో నిలబెట్టి భగవత్స్వరూపుడుగా కొలిచిన భక్తులందరూ తరువాతి కాలంలో ఒక్కొక్కరే అతన్ని నట్టేటముంచి అనరాని మాటలనసాగారు. అషీంచటర్జీ 1971 జూలైలో తన అసమ్మతి పత్రాన్ని సమర్పించాడు. అందులో చారుమజుందారు 'నిర్మూలనపు' ఎత్తుగడలను దుయ్యబట్టాడు. 1972 అక్టోబరు 22వ తేదీనాటి 'మెయిన్ స్ట్రీమ్' పత్రికలో సౌరీన్ బోసు, కానుసన్యాలు కలసి ప్రచురించిన బహిరంగ లేఖలో చైనా కమ్యూనిస్టు పార్టీ సలహాలను (పార్టీ వర్గాలలో) తెలియబరచలేదని విమర్శించారు. ఇంకా తరువాత 1974లో కానుసన్యాలు నక్సల్బరీ తిరుగుబాటు నాటికే చారుమజుందారుతో విభేదాలు వచ్చినట్టుగా చెపుతూ చారుమజుందారుతో వచ్చిన విభేదాలను మరింత నిర్మొహమాటంగా వివరించాడు. కాని ఈ నాయకులలో ఒక్కరు కూడా (తరువాత చారుమజుందారు తన తప్పులను అంగీకరించినట్టు) తమ తప్పులను అంగీకరించలేదు. చారుమజుందారును దైవాంశ సంభూతునిగా నిలబెట్టడంలో తమ పాత్రను గురించి వాళ్ళు చెప్పుకోలేదు. 1970 కాంగ్రెసులో చారుమజుందారును ఆకాశానికెత్తడంలో వాళ్ళు తమలో తాము పోటీపడ్డారు. తమ పాత హీరో నుంచి తమ సంబంధాన్ని వేరుపరచుకోవడంలో కూడా వీళ్లు అంత తొందరనూ కనపరచారు. మొదటిలో చారుమజుందారుతో విబేధించిన అసిత్‌సేన్, సుశీతలరాయ్ చౌధురిలతో వీళ్ళు సామరస్యంతో సహకరించి ఉంటే, నిర్మూలనపు ఎత్తుగడలపై చారుమజుందారు చూపిన వక్కాణింపును అప్పుడే సవరించుకొనే అవకాశం ఉండేది.

సి.పి.ఐ.(మా.లె.) పార్టీ మొత్తం చరిత్రను పరిశీలిస్తే, నాయకుల పెట్టి బూర్జువా మనస్తత్వం వల్ల ఉద్యమపు తీరుతెన్నులలో చెడ్డ పరిణామాలు వచ్చాయని తెలుస్తుంది. వాళ్ళు గతంలో పాశ్చాత్య ప్రభావం పట్ల బానిస భావాన్ని కనపరచిన భారతీయ బూర్జువా వర్గాన్ని సరిగానే విమర్శించారు కాని మావోను గుడ్డిగా అనుసరించడంలో వాళ్ళు అలాంటి ధోరణినే కనపరచారు. "చైనా ఛైర్మనే మన ఛైర్మను," అనే నినాదం పెట్టి బూర్జువా విప్లవకారులను ఉత్తేజపరచి ఉండొచ్చు. కాని అటువంటి వ్యక్తి ఆరాధనా ధోరణులు చైనానే కలవరపరిచాయి. చైనాతో అతిగా తాదాత్మ్యకత చెందినందువల్ల, వాళ్ళ పట్ల జాతీయ భావాన్ని కనపరచలేని సాధారణ ప్రజలకు దూరమయ్యారు. తమ పెట్టి బూర్జువా అలవాట్లను బట్టి చారుమజుందారు అతని అనుచరులు త్వరగా

ముందుకు పోగలమని హెచ్చుగా అనుకొని, శత్రుబలాన్ని తక్కువగా అంచనా వేసారు. పార్టీ పత్రికలలో వెలువడిన వ్యాసాలలో ఈ ధోరణి బాగా కనపడింది. వాస్తవ దృక్పథంతో వార్తలను ప్రచురించడానికి బదులు, మతపరమైన ధోరణిని తలపిస్తూ గోరంతలు కొండంతలుగా చేసి చెప్పడం పరిపాటైంది.

చారుమజుందారు అతని అనుచరులు 'ఎర్ర పుస్తకాన్ని' (Red Book) మావో ఆలోచనను ఉదహరించేవారు. బహుశ వాళ్లు మావో 1947లో తన పార్టీ కామ్రేడ్లను బలికావద్దని హెచ్చరించిన "ఊహాత్మకవాదం, (Subjectivism), ఒంటెత్తుపోకడ, (Sectarianism) మార్పులేని పార్టీ రాతల పోకడలు (Stiro type writings) అనే మూడు "చెడ్డగాలుల" గురించి వాళ్ళు మర్చిపోయారేమో! 1970-71 కాలంలోని సి.పి.ఐ. (మా.లె.) పార్టీలో ఊహాత్మక వాదం వల్ల కలిగిన ముఖ్యమైన దురదృష్టకరమైన పరిణామం ప్రత్యేకించి కలకత్తాలో చెప్పుకోదగ్గ ప్రాణ నష్టం కలిగింది. 1971 జూలైలో అషీంచటర్జీ ఇలా ప్రశ్నించాడు. "కలకత్తాలో వీరుల జీవితాలన్నిటినీ బలిపెట్టడం అవసరమేనా అని మనల్ని మనం ప్రశ్నించుకునే ధైర్యం ఎందుకు లేదు?"[8]

ఈ విషయాన్ని చారుమజుందారు ఎలా భావించాడో మనం ఇది వరకే గమనించాం. ప్రతీ బుల్లెట్టూ, ప్రతీ మృతదేహం, పోరాటానికి మరింత మంది అనుచరులను సంపాదిస్తాయనీ, ప్రభుత్వాలనూ వాటి పోలీసు దళాలను మరింత ఎదిరించుతారని భావించాడు. 1970 మేలో పార్టీ కాంగ్రెసులో ఇలా అన్నాడు. "మృతవీరుల రక్తం ఉత్సాహాన్ని సృష్టిస్తుంది. యోధులను నవమానవులుగా మారుస్తుంది. వాళ్ళ హృదయాలలో వర్గద్వేషాన్ని నింపుతుంది...."(36) సి.పి.ఐ. (మా.లె.) పార్టీపై శత్రువు దాడుల వల్ల ప్రాణనష్టం పెరిగే సమయంలో చారుమజుందారు ప్రతీకారం తీర్చుకోవలసిందిగా పదే పదే చెప్పాడు. "కన్నుకు కన్ను పన్నుకు పన్ను" పోరాటం నడపాలన్నాడు. "హత్యకు హత్య ద్వారానే బదులు తీసుకోవాలి" (51). ఆ పిలుపును పురస్కరించుకొని యువకులెందరో పోలీసులపై ఉరికారు. వాళ్ళని చంపారు. వాళ్ళ తుపాకులు లాక్కున్నారు. అలా చేయడం ద్వారా ఎందరో యువకులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. కాని, దెబ్బకు దెబ్బ తీసే విధంగా అధికబలంతో శత్రువుతో తలపడిన చారుమజుందారు అనుచరులు దానివల్ల వచ్చిన జన నష్టాన్ని నిర్లక్ష్యం చేసారు. అటువంటి నిర్లక్ష్యాన్ని భరించే సమర్థత ఆనాడు పార్టీకి లేదు. ఎంత వీరోచితంగా పోలీసులను వాళ్ళు ఎదుర్కొన్నా, చెదురుముదురుగా జరిగిన సంఘటనలతో పోలిస్తే పోలీసులు తలపెట్టిన అణచివేత కార్యక్రమాలు ఎన్నో రెట్లు ఎక్కువగానే ఉండేవి. అటువంటి భారీస్థాయి దాడికి సరియైన జవాబు,

సక్రమమైన ప్రజాసైన్యపు ప్రతి దాడివల్లనే సాధ్యమవుతుంది.

విప్లవోద్యమం తన బలాలను అప్పుడప్పుడు వృథా చెయ్యకుండా, బోల్షివిక్ పార్టీ పునాదులను నిర్మించే రోజులలోనే లెనిన్ ఇలా అన్నాడు. "పది మంది వెధవలకు బదులు ఒక విప్లవకారుని బలిపెట్టడం కూడా మన బలాలను విచ్ఛిన్నం చేసుకోవడమే. అవి ఇప్పటికే పలచబడ్డాయి. కార్మికులు వాటి నుంచి కోరుకున్న పని మొత్తం నిర్వహించలేనంత పలచగా అవి ఉన్నాయి."[9] చైనా ఎర్రసైన్యం విజయవంతంగా ముందుకు సాగుతున్న ఉచ్ఛదశలో కూడా మావో తన అనుచరునిలా హెచ్చరించాడు. "మనం గెల్చుకొనే దానికంటే మనం పోగొట్టుకొనేదే ఎక్కువగా ఉండే ప్రతీకార దాడులను తప్పించుకొనేందుకు ప్రయత్నించాలి. మనం సరిసమానంగా బయటపడే (పోరాటాలను కూడా దాట వేసే ప్రయత్నం చేయాలి[10]". "ఎక్కడ పోరాటం ఉంటే అక్కడ అర్పణ ఉంటుందని, చావు సాధారణ విషయమని" ఆత్మార్పణను పొగడుతూనే ఇలా హెచ్చరించాడు. "అనవసర త్యాగాన్ని తప్పించుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నించాలి"[11]. 1971లో దేశంలో శైశవ దశలో ఉన్న విప్లవ పార్టీ బలాన్ని పరిరక్షించుకోవడం ముఖ్యమని ఎవరైనా అనుకోవాలి. "నవ మానవుల"ను పరిరక్షించుకునేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతాయని అనుకుంటారు. "నవ మానవులు" చారుమజుందారు అభిప్రాయంలో, "చావును లెక్కచెయ్యరు. స్వార్థపరమైన ఎటువంటి ఆలోచనకైనా అతీతులు, వట్టి చేతులతో తుపాకులను పట్టుకునేందుకు సిద్ధపడతారు" శత్రువు కోరిన నాడు కాక, సాయుధ సంఘటిత విప్లవకారులకు అనుకూలమైన నాడే పోరాటాన్ని నడపాలనేది, విప్లవాత్మక యుద్ధ ప్రాథమిక సూత్రాలలో ఒకటి. సి.పి.ఐ. (మా.లె.) నాయకత్వం దీన్ని నిర్లక్ష్యం చేసింది.

1970లో తుపాకులను లాక్కొనే కార్యక్రమపు ఆరంభ దశలలో పార్టీ నాయకత్వం ప్రభుత్వ దమనాత్మక శక్తిని తక్కువగా అంచనా వేసింది. ఆ డిశెంబరులో చారుమజుందారు ఒక లేఖలో ఇలా రాశాడు. "ఒక మఫ్టీ పోలీసు దళాన్ని ఇద్దరు లేక ముగ్గురు కార్యకర్తలు కనక చంపగలిగితే వాళ్ళ (మఫ్టీ పోలీసు దళపు) ధైర్యం సన్నగిల్లుతుంది. పోలీసుల నుంచి మనం కొన్ని పిస్తోలులు సంగ్రహించగానే మనపై దమన చర్యను కొనసాగించేందుకు వాళ్లు భయపడతారు" (48) పశ్చిమ బెంగాలు పోలీసులు మొదట్లో భయపడిన మాట నిజమే. కాని అతి త్వరలోనే వాళ్లు పోరాటపు వాతావరణానికి అలవాటుపడి, మిలిటరీ, పారా-మిలటరీ పోలీసుల సాయంతో విప్లవకారులను అధిగమించారు.

## సైనిక పరాజయం

సి.పి.ఐ. (మా.లె.) నాయకులలో చాలామంది సైనికపరంగా ఆలోచించడం నిరసించేవారు. దానివల్ల 'సైనికతత్వం' ఏర్పడుతుందనీ, ప్రజలను రాజకీయంగా చైతన్యవంతం చెయ్యడం నిర్లక్ష్యం జరగవచ్చునీ, వాళ్ళ భయం. కాని సైనిక శిక్షణకు ప్రాముఖ్యత ఇవ్వకుండా, రాజకీయ ప్రచారానికే ప్రాముఖ్యతనివ్వడం, కొన్ని చెడు ఫలితాలకు దారి తీసింది.

1. ప్రజా విమోచన సైన్యం సరిగా అభివృద్ధి చెందలేదు.
2. శత్రువు సైనిక శక్తిని తెలివితక్కువగా అంచనా వేయడం.
3. భారత సైన్యాలను రాజకీయంగా చైతన్యవంతం చేయవలసిన అవసరం, అవకాశం గురించి ఏమీ ఆలోచించలేదు. ఆ విధంగా వాళ్ళను తమ వైపుకు తిప్పుకోవచ్చునే పరిజ్ఞానం నాయకత్వానికి రాలేదు.

ఉద్యమం మొదలైన నాటినుంచీ సైనికానుభవం, శిక్షణ విషయాలను చిన్న చూపు చూశారు. 1967 నక్సల్బరీ తిరుగుబాటను అణచివేసినప్పుడు కానుసన్యాలు, "సైనికపరమైన పూర్తి అజ్ఞానమే మా పోరాటం తాత్కాలికంగా పరాజయం పొందడానికి కారణం" అన్నప్పుడు చాలామంది కామ్రేడులు అతనిని నిరసించారు. తూర్పు బెంగాలులో పనిచేసిన చారుమజుందారు శిష్యుడిలా అన్నాడు. "సైనిక విషయాలు తెలియకపోవడం వల్లనే పరాజయం కలిగిందని చాలా మంది చెప్పవచ్చు. కాని, ఈ భావన సరియైనది కాదని, అది మావో ఆలోచనకు వ్యతిరేకం అని మా అభిప్రాయం. ఈ భావం వల్ల రాజకీయాలకంటే సైనిక విషయాలకే ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చినట్టవుతుంది."[12] తరువాత వాళ్ళు మావోను ఉదహరించారు: "... యుద్ధాన్ని యుద్ధం చేసి నేర్వడమే మన ముఖ్య పద్ధతి. అందులో మొదట నేర్చి తరువాత ఆచరించడం, కాక ముందు ఆచరించి దాని ద్వారా నేర్చుకోవడం అన్నమాట. (అక్కడ) ఆచరించడం నేర్చుకోవడం (రెండూ) ఒకటే"[13]. కాని, ఆ కొటేషను దీనికి సంబంధించినది కాదు. సాధారణ పౌరుడు యుద్ధ విద్యను ఎలా నేర్చుకోవాలో మావో చెప్పాడని పైన ఉదహరించిన వాక్యాల తరువాత వచ్చే వాక్యం వల్ల తెలుస్తుంది. "మామూలు పౌరుడికీ సైనికుడికీ మధ్య అంతరం ఉంది. అది దాటరాని అడ్డుగోడ (Great Wall) కాదు. ఆ తేడాను తొందరగానే పూరించవచ్చు. విప్లవంలో, యుద్ధంలో పాల్గొనడమే దాన్ని పూరించే పద్ధతి". అదే వ్యాసంలో మావో "నేర్చుకోవడాన్ని" ఆచరణను "మేళవించమని తన అనుయాయులను కోరాడు. "అన్ని సైనిక సూత్రాలు, సిద్ధాంతాలు కూడా పూర్వీకులు కాని, నేటివారు కాని గతించిన యుద్ధాల అనుభవాన్ని

క్రోడీకరించిన సూత్రీకరణలే. గత యుద్ధాల నుంచి సంక్రమించినవీ, రక్తం వెచ్చించి సంపాదించుకున్న గుణపాఠాలను శ్రద్ధతో అధ్యయనం చెయ్యాలి. అది ఒక సంగతి. మరో సంగతి. ఈ సూత్రీకరణలను మనం అనుభవం ద్వారా పరీక్షించుకోవాలి. ఉపయోగించే వాటిని ఆకళింపు చేసుకోవాలి. లేని వాటిని వదిలెయ్యాలి. ప్రత్యేకించి మనదైన (అనుభవాన్ని) దానికి చేర్చాలి. చివరి సంగతి ఎంతో ముఖ్యం. లేకుంటే యుద్ధాన్ని నిర్వహించలేం. "నిజానికి మావో పదే పదే విప్లవ కారుల సైనిక శిక్షణా (వసరాన్ని) నొక్కి చెప్పాడు. సైన్యంలో అధికారులు, సైనికులు, యుద్ధకళను పెంపొందించుకోవాలి..." అని అక్టోబరు 1947 నాటి, "చైనా ప్రజా విమోచన సైన్యపు మానిఫెస్టో" అనే వ్యాసంలో మావో గుర్తు చేసాడు.[14] చింగ్ పర్వతాలలో మావో నిర్మించిన 'మొదటి కార్మికుల రైతుల విప్లవ సైన్యం' 1927 నాటి మొదటి విభాగం వాంపోవా మిలటరీ అకాడమీలో శిక్షణ పొందిన కమ్యూనిస్టుల చేరికతో పటిష్టమైంది. ఊచుంగ్‌లోని జాతీయ ప్రభుత్వానికి చెందిన గార్డు రెజిమెంటు సభ్యులు కూడా అందులో చేరారు.[15]

కాని సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఒక వైపు సైనిక విషయాలను అలక్ష్యం చేస్తూనే ప్రజాబాహుళ్యపు సాయుధ దాడిని కోరుకోవడమనే, అవకతవక విధానాన్ని చేపట్టింది. సైనిక నిపుణతను వాంఛించిన విమర్శకులను "రివిజనిస్టు"లుగా దుయ్యబట్టిన పార్టీ ఆంధ్రరాష్ట్ర కమిటీ ఇలా అంది. "మనం విప్లవం నిర్వహిస్తున్న ప్రస్తుత శకంలో ప్రజా శక్తి పట్ల ప్రపంచ విద్రోహం గజగజలాడుతుండగా, విముక్తి ప్రాంతాలను ఏర్పరిచేందుకు 1926లో చైనా కామ్రేడులు అనుసరించిన పద్ధతులన్నీ తూ.చా. తప్పకుండా పాటించక్కరలేదు... భారీ స్థాయిలో, విశాల భూభాగంలో, నిర్మూలనా యుద్ధం చేసి, ఎర్రసైన్య నిర్మాణానికి స్థావర ప్రాంతాల ఏర్పాటుకు మార్గం వేయవచ్చు."[16]

చారుమజుందారు కూడా రాజకీయ ప్రబోధం ద్వారా 'నవ మానవ' శిక్షణకే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చాడు కాని, సైనిక విషయాల శిక్షణకు ప్రాముఖ్యత ఇవ్వలేదు. రాజకీయంగా చైతన్యవంతమైన బీదరైతులు, ఆయుధాలను కొల్లగొట్టేందుకు సిద్ధపడినప్పుడే, ప్రజా విమోచన సైన్యాన్ని నిర్మించాలన్నాడు. అషీం చటర్జీ ఈ షరతు అనవసరమని తలచాడు.(60) చారుమజుందారు తుపాకులను పట్టుకోవాలని పిలుపునిచ్చాడు. "భూమిలేని వ్యవసాయ కార్మికుడు తన చేతికి తుపాకిని తీసుకుంటే, విద్రోహాత్మక పోలీసులు సైనికులు భయపడి మూకగా వచ్చి తమ తమ ఆయుధాలను గెరిల్లాల పరం చేస్తారు. శత్రుబలాలలో బీటలు ఏర్పడతాయి..."(43) రైతులు తుపాకీలు

పట్టుకున్నారు. ప్రజా విముక్తి సైన్యపు ఏర్పాటుకై చారుమజుందారు పెట్టిన షరతు అమలుకు వచ్చింది. 1971లో మగర్జున తదితర ప్రాంతాలలో జరిగిన చర్యల తరవాత కూడా ఆశించిన పరిణామం రాలేదు.

అధునాతనాయుధ సంపత్తి, శిక్షణలతో కూడిన పాలకవర్గాల సైనిక సంపత్తి పై నమ్మశక్యం కాని నిర్లక్ష్యం, విప్లవకారులకుందేమో అనిపించింది. ప్రభుత్వ దమన యంత్రాంగాలలో దానంతటదే రాబోయే చీలికను గురించి కలలు కంటున్నారు. తమ బలాల సైనిక శిక్షణ విషయంలో అలక్ష్యం చేసారు. ప్రభుత్వం మాత్రం విప్లవ వెల్లువను అణచేందుకు పోలీసు బలగాన్ని మరింత పెంచింది. 1959 నుంచి 60 నాటికి పశ్చిమ బెంగాలు పోలీసు దళం పది శాతం పెరిగింది. 1960లో 49.034 మంది గల ఆ బలగం 1972 నాటికి 91.714కు పెరిగింది. తరువాత మరో రెండు బెటాలియన్లను దానికి చేర్చేందుకు కూడా నిర్ణయించారు. రాష్ట్ర పోలీసు దళానికి తోడుగా, సి.ఆర్.పి. దళాలు, తూర్పు సరిహద్దు రైఫిలు దళం, మొదలగు అర్థ సైనిక దళాలు కూడా ఉన్నాయి. వీటన్నిటినీ తీర్చిదిద్దేందుకు 1971 జూలై నాటికే, పశ్చిమ బెంగాలు రాష్ట్రానికి కేంద్రం 42 లక్షల రూపాయలను మంజూరు చేసింది.[17]

ఒక పరిశీలకుడి అంచనాల ప్రకారం మన దేశంలో 1971 నాటికి 6,00,000 మంది పోలీసులున్నారు. వారిలో కనీసం సగం మంది సాయుధ పోలీసు దళానికి చెందినవారే. రెండు రకాల పోలీసులనూ లెక్కలోనికి తీసుకుంటే ప్రతి 800 మంది జనాభాకు ఒక పోలీసు ఉన్నాడు. "మొత్తంలో సాయుధ పోలీసుల సంఖ్య కూడా పెరిగింది. భావిలో కూడా ఆ నిష్పత్తి పెరుగుతుంది" అని కూడా చెప్పాడు.[18]* 1973-74 సంవత్సరపు భారత పార్లమెంటరీ పబ్లిక్ అకౌంట్సు కమిటీ నివేదిక ఆ పెరుగుదల నిష్పత్తిని పేర్కొంది. ఆ నివేదిక ప్రకారం కేంద్ర రిజర్వుదళంపై ప్రభుత్వపు ఖర్చు 1968-69 నాటి రూ. 13.54 కోట్ల నుంచి 1973-74 నాటికి రూ. 35.78 కోట్లకు పెరిగింది. 1964-65 సంవత్సరాలలో ఈ దళానికి 16 బెటాలియన్లున్నాయి. 1965-66, 1972-73 సంవత్సరాలలో దానికి మరో 16 బెటాలియన్లు కొత్తగా చేర్చారు. ఆ కాలంలో భారత రిజర్వు పోలీసు దళపు 28 బెటాలియన్లను అందులో విలీనం చేసారు. ఆ దళం అలా 60 బెటాలియన్లయింది. సరిహద్దు భద్రతా దళాలపై

* *ఈ నిష్పత్తి మన రాష్ట్రంలో ఇప్పుడు 1:1400 ఉంది. దీన్ని వెంటనే 1:1000 తగ్గేలా పోలీసుల్ని రిక్రూట్ చేసుకోవాలని పోలీసు వర్గాల కోరిక. క్రమంగా దీన్ని 1:500 (పోలీసు కమిషన్ నివేదిక నిర్దేశించిన స్థాయికి) తీసుకు వస్తేనే శాంతి భద్రతలు పరిరక్షించగలమని వారి అభిప్రాయం - అను ది హిందూ, తేది 4/82.*

ఖర్చు 1968–69 సంవత్సరంలో రూ.25.44 కోట్లు కాగా 1974–75 బడ్జెటు అంచనాలలో రూ.57.41 కోట్లకు పెరిగింది. అది పేరుకు ఇండో–పాక్ సరిహద్దు రక్షణకు మాత్రమే కాని 1973–74 నాటికి దాన్ని 13 రాష్ట్రాలలో "అంతరంగిక భద్రత"ను పరిరక్షించేందుకు ఉపయోగించారు.[19]

కేంద్ర ప్రభుత్వ కార్మాగారాలలోనూ, సంస్థలలోనూ, కాపలాకాస్తూ పారిశ్రామిక అలజడులప్పుడు సాయపడేందుకు, 1969–70 సంవత్సరంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాన్ని (సి.ఐ.ఎస్.ఎఫ్.)* ఏర్పరిచారు. 1971–72లో 10,220 మందున్న ఆ దళం, 1972–73 నాటికి 15,545కు పెరిగింది. పారామిలటరీ–పోలీసు బలగాలపై పెరిగే ఖర్చుపై వ్యాఖ్యానిస్తూ ఆ కమిటీ నివేదిక ఇలా ఆరోపించింది. "…. కేంద్రంలోనూ రాష్ట్రాలలోనూ పోలీసులపై పెరిగే ఖర్చు స్థాయి అభివృద్ధి పథకాలకు కావలసిన వనరులకు ఎసరు పెట్టే దశకు చేరుకుంది."

పోలీసులపైనా పారామిలటరీ దళాలపై జరిగే ఈ పెంపు, నేరాలను నిరోధించేందుకు కాని, పరిరక్షించేందుకు కాని కాదని; ప్రజా నిరసనోద్యమాలను అణచేందుకే వాటిని పెంచుతున్నారనీ, అది ప్రత్యేకంగా పశ్చిమ బెంగాలు, బీహారు, పంజాబు ఆంధ్రప్రాంతాలలోనూ, దేశంలోని తదితర ప్రాంతాలలోనూ జరిగే ఉద్యమాలనుద్దేశించే వాటిని పోషిస్తున్నారనే సంగతి పబ్లికు ఎక్కౌంట్సు కమిటీ చెప్పినదాన్ని బట్టి తెలుస్తోంది. "… కేంద్రంలోనూ రాష్ట్రాలలోనూ పోలీసులపై బాగా ఖర్చు జరిగినప్పటికీ నేరాలు పెరుగుతూనే ఉన్నాయి…. మీదు మిక్కిలి (ఉన్నతాధికారులతో సహా) పోలీసు దళం తీవ్రమైన నేరాలను చేయడంలో పాలు పంచుకుంటోంది." పోలీసుల సంఖ్య పెంచడానికి తోడుగా ప్రభుత్వం ఎన్నో దమనాత్మక చట్టాలు చేసి వాళ్ళకు సర్వాధికారాలు కట్టిబెట్టింది. 1971 మే 7వ తేదీన రాష్ట్రపతి గిరి సంతకం చేసిన ఆంతరంగిక భద్రతా చట్టం ఎం.ఐ.ఎస్.ఎ. (MISA) వాటికి పరాకాష్ట.

కొన్ని సందర్భాలలో ప్రభుత్వ రక్షణ విభాగాన్ని కూడా పోలీసులకు సాయంగా పంపి, ప్రజా పోరాటాలను అణచింది.

## భారత సైన్యము

అమెరికన్, చైనీస్, రష్యన్ సైన్యాలను మినహాయిస్తే ప్రపంచంలోని అతిపెద్ద

---

* *Central Industrial Security Force.*

* *Maintenance of Internal Security Act.*

సైన్యాలలో భారత సైన్యం కూడా ఒకటి. భారత ప్రభుత్వాధీనంలో గల అతి భారీ ప్రభుత్వ రంగ సంస్థగా దాన్ని చెప్పుకోవచ్చు. దేశాదాయంలో మూడోవంతు దానికి ఖర్చవుతోంది. దానిలో 8.25 లక్షల మంది పని చేస్తున్నారు.

1961 నుంచి 1971 దాకా 476 సందర్భాలలో సివిల్ బలగానికి తోడుపడేందుకు సైన్యాన్ని పిలిచారు. దీన్ని బట్టి ప్రజా ఉద్యమాలను అణచడంలో సైన్యం పాత్ర ఎటువంటిదో ఊహించవచ్చు. అదీకాక 1950ల నుంచీ కూడా నాగాలాండ్, మణిపూర్ మిజో కొండలలో తిరుగుబాటును ఎదుర్కొనేందుకు భారతసైన్యాన్ని, వైమానిక దళాన్ని వినియోగిస్తున్నారు.[20]

తీవ్రవాదియైన విప్లవకారుడి దృక్పథంలో, భారతసైన్యం (వర్గపరంగా) శత్రు కూటానికే చెందుతుంది. కాని నేటి సైనిక దళపు తీరుతెన్నుల బట్టి, ఓరిమితో చేసే రాజకీయ ప్రబోధానికి అది లొంగ వచ్చునేమో అనే సంగతిని ఆలోచించాలి.

భారత సైన్యాన్ని మరింత నిశితంగా పరిశీలిద్దాం. పదాతి దళం దాని ముఖ్య విభాగం. దాడి సమయంలో అది శత్రుబలాలను చుట్టుముట్టి నాశనం చెయ్యవలసి ఉంటుంది. అందుకోసం శత్రువు ఆధీనంలోని భూభాగంపై వాళ్ళు సంచారం చెయ్యాలి. ఆకాశంపై నుంచి శత్రువు జరిపే దాడుల నుంచి బయటపడాలి. మందుపాతరలను (mine-fields) దాటాలి. ఎన్నో అవాంతరాలను దాటాలి. అనేక రంగాలలో పదాతి దళానికే ఎక్కువ నష్టాలు సంభవించాయంటే ఆశ్చర్యం లేదు. 1962 చైనా–ఇండియా యుద్ధంలో ఈ దళంలోని మృతుల శాతం 72% ఉంది. 1965 ఇండో–పాక్ యుద్ధంలో అది 82.6%కి పెరిగింది. నాగామిజోకొండల తిరుగుబాటు నిరోధక చర్యలలో అది 94 శాతం ఉంది.[21]

భారత సైన్యానికి వెన్నెముకగా వ్యవహరించే ఈ పదాతిదళంలోని సైనికుడే 1971 నాటికి అతి తక్కువ జీతాన్ని అందుకుంటున్నాడు. కొన్ని రకాల వంటవాళ్ల స్కేళ్లకంటే అతని స్కేలు (వేతన స్థాయి) చాలా తక్కువ. దర్జీలు, బూటుపనివాళ్లు వంటి వృత్తి సైనికులతో దాదాపు సమాన స్కేలులో ఉన్నాడు.[22] కాని పదాతి సైనికుడికి తన ఇబ్బందుల్ని చెప్పుకునే అవకాశం లేదు. సంఘాలు ఏర్పరచుకుని సమ్మె చేసే హక్కు వాళ్ళకు లేదు.

భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళాలకు చెందిన నిపుణుల బృందం సైనిక దళాల జీతభత్యాలపై 1971 నాటి నివేదికలో పరిస్థితినిలా వ్యాఖ్యానించింది. "దేశంలో సాంఘిక–రాజకీయ ఆందోళన పెరుగుతోంది. స్కూల్లోను, ఇంట్లోను, యూనివర్సిటీలోనూ కార్మాగారాలలోనూ కార్యాలయాలలోనూ అన్ని రంగాలలోనూ

అధికారాన్ని (Authority) ఎదిరిస్తున్నారు. ఇంతవరకూ దానివల్ల వచ్చిన విజయాల దృష్ట్యా, యువతరంలో ఆందోళనా ధోరణి ఎక్కువైంది. విచ్ఛిన్నకర ధోరణులు పెరుగుతున్నాయి. సాయుధ దళాల వంటి క్రమశిక్షణాయుత సంస్థలు (సరిగా) పనిచేయడానికి ఇటువంటి వాతావరణం మంచిది కాదు. దానికి కూడా అనేక వైపుల నుంచి అనారోగ్యప్రదమైన ఒత్తిడులు కలిగే అవకాశం ఉంది." ఆ బృందం ఇలా హెచ్చరించింది.

"…. వాళ్ళ కార్యకలాపాలు తప్పు దోవన పడితే, నిరాశ చెందిన మాజీ సైనికులు ప్రమాదం తెచ్చిపెట్టవచ్చు. ప్రభుత్వ యంత్రాంగానికి మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టే అవాంఛనీయ శక్తులకు అది గట్టి ప్రోత్సాహాన్ని కూడా ఇవ్వొచ్చు. సైనిక దళాలను వాళ్ళ సర్వీసు కాలంలోనూ, పదవీ విరమణ తరువాత కూడా ఈ విషపూరిత ప్రలోభం నుంచి తప్పించుకునేందుకు కావలసిన పరిస్థితులనూ వాతావరణాన్ని వాళ్ళకు కల్పించడం తెలివైనవి."[23]

భారత సైన్యంలో క్రమశిక్షణ సన్నగిల్లుతోందనేందుకు కూడా నిదర్శనాలున్నాయి. 1965–66 సంవత్సరాలలో "పూర్తిగా సైనికపరమైన నేరాల" గురించిన సైనిక విచారణలు (Court-Martials) 13,267 జరిగాయి. హోదా తగ్గుదల, సీనియారిటీకోత, 14 సంవత్సరాల జైలు వంటి 12,789 శిక్షలు అమలు జరిగాయి.[24] "విషపూరిత ప్రలోభాలు" "అనారోగ్యప్రదమైన ఒత్తిడులు" అవాంఛనీయశక్తులకు గట్టి ప్రోద్బలం వంటి విషయాల పట్ల సైనికాధికారులు కలవరపడుతుండగా అటువంటి విషయాల గురించి సి.పి.ఐ. (మా.లె.) పార్టీ పట్టించుకోనేలేదు. ఏదో ఒకటి రెండు సందర్భాలలో జరిగిన నగర చర్యలలో ఒకరిద్దరు సైనికులుగాని మాజీ సైనికులుగాని పాల్గొన్న సంఘటనలు మినహాయిస్తే, సైన్యంలో సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కార్యకలాపాలు లేవు. తక్కువ జీతాలతో సతమతమయ్యే జవాన్ల అసంతృప్తిని పార్టీ గుర్తించలేదు. వాళ్ళను రాజకీయంగా చైతన్యవంతం చేసేందుకు పార్టీకి ఎటువంటి కార్యక్రమమూ లేకపోయింది. అటువంటి కార్యక్రమం ద్వారా సైన్యంలో కాలూనుకొని అప్పుడే మొదలవుతున్న ప్రజావిమోచన దళానికి అనుబంధంగా దానిని భావిలో వాడుకోవాలనే ఊహ కూడా పార్టీకి లేకపోయింది.

అదీకాక సి.పి.ఐ. (మా.లె.) పార్టీ వ్యవసాయిక విప్లవానికి పురికొల్పాలనుకున్న గ్రామీణ రైతాంగానికీ సైనికజవాన్లకూ దగ్గర సంబంధాలున్నాయి. అనాదిగా గ్రామ ప్రజలే సైనిక దళాలకు చాలా మట్టుకు మనుషుల్ని పంపుతున్నారు.

వాళ్ళు కూడా అనేక రకాల రైతు కుటుంబాలకు చెందిన వారే. రాయితీలను

లాంఛనాలను కుమ్మరించి, వాళ్ళను రైతుమిత్రుల నుంచి వేరు చేయాలని అధికార వర్గాలు గతంలో ఎన్నో ప్రయత్నాలు చేసాయి. 1970–71 సంవత్సర కాలంలో అడ్డుగోడలు బద్దలవసాగాయి. 1971 ఫిబ్రవరి నాటి నిపుణుల సెల్ సమర్పించిన నివేదిక ఇలా వాపోయింది. “ఈనాడు గతంలోలాగ సైనిక విభాగాలు ప్రత్యేక వ్యవస్థగా లేవు. గతంలో వలె ఉన్నత వర్గాల నుంచి అధికారులూ కొన్ని తరహాల ప్రజల నుంచే ఇతర సైనిక సిబ్బందీ రావడం లేదు. వాళ్ళ యూనిట్ జీవనంలో ఉన్న ఆచ్ఛాదన దేశంలో సార్వత్రికంగా ఉన్న పరిస్థితుల నుంచి వాళ్ళను పూర్తిగా వేరు పరచలేదు” అందువల్ల వ్యవసాయక అసంతృప్తి యొక్క ఫలితాలు ప్రభావాలు ఆయా ప్రాంతాల జవాన్లపై పడక తప్పదు.

జవాన్లకే కాక, వాళ్ళలాగే అధ్వాన్నపు జీతాలతో సతమతమయ్యే ఇతర తరగతుల ఉద్యోగులు కూడా, (సైన్యంలో 22 వంతులున్న వాళ్ళు) దాదాపు 4000 మంది దాకా ఉన్నారు. వారిలో చాలా మంది దళిత కులాలకు చెందిన వాళ్ళే. మెస్ బార్బర్లుగానూ, చాకళ్ళుగానూ, స్వీపర్లుగానూ పనిచేసేవాళ్లు. భారత గ్రామీణ సంఘంలోని అట్టడుగు వర్గాల నుంచి వచ్చారు.[25] ఆఫీసర్లలో కూడా చాలా మంది మధ్య తరగతుల నుంచి వచ్చినవారే కావడం వల్ల భారతీయ మధ్య తరగతి సతమత మవుతున్న సమస్యలు వీళ్ళను కూడా స్పృశించక మానవు. ఒక ఆఫీసర్ల శిక్షణా కేంద్రంలో జరిపిన సర్వేలో, వారిలో 52.5% కేడట్లు రూ. 500 లోపు నెలసరి ఆదాయం కల కుటుంబాల నుంచి వచ్చిన వారేనని తేలింది.[26] దాన్ని బట్టి సైన్యంలో కూడా రాజకీయ ప్రచారానికి సారవంతమైన వాతావరణం ఉందని తెలుస్తుంది. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ దీన్ని నిర్లక్ష్యం చేసింది.

ప్రభుత్వ పారామిలటరీ దళాలు కూడా అసంతృప్తితో కుతకుతలాడుతున్నాయి. 1973లో అది కనీవినీ ఎరుగని తిరుగుబాటుకు దారితీసింది. ఆ సంవత్సరం మేలో లక్నో విద్యార్థుల ఆందోళన జరిగింది. పోలీసులకు సాయపడేందుకై రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర సాయుధ పోలీసుల్ని (పి.ఎ.సి.) కూడా రంగంలోకి దించింది. తమను రంగంలోంచి ఉపసంహరించుకోవాలని కోరుతూ వాళ్ళు విద్యార్థులతో కలిసి సంయుక్తంగా 1973 మే 23వ తేదీన ప్రదర్శన జరిపారు. అప్పటికే చాలీచాలని జీతాలు, అధ్వాన్న పరిస్థితులపై అసంతృప్తిచాయలు పి.ఎ.సి.లో కనపడుతున్నాయి. మే 22వ తేదీన సైన్యసాయంతో (ప్రభుత్వం) రాష్ట్రంలోని పి.ఎ.సి. ఆయుధాగారాలను స్వాధీనం చేసుకోబోయారు. కాన్పూర్, రామనగర్, వారణాసి మొదలైన ప్రాంతాలలో పి.ఎ.సి. సైన్యాన్ని ఎదిరించింది. సాయంకాలానికి తిరుగుబాటుదార్లు లొంగక

తప్పలేదు. కాని గోరక్‌పూర్, జహంగీరాబాదులలో వాళ్ళు, 24, 25 తేదీల దాకా లొంగలేదు. 379 పి.ఎ.సి. వాలంటీర్లు అరెస్టయ్యారనీ మరో 600 మంది పరారీలో ఉన్నారనీ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మే 27వ తేదీన ప్రకటించింది.*

భారతీయ ఆర్థిక జీవనంలోని విప్లవాత్మక విభాగాలనన్నిటినీ స్పృశించలేదని మనం సి.పి.ఐ. (మా.లె.) పార్టీని నిందించేముందు, పార్టీకి అతి తక్కువ సమయం ఉందనే సంగతిని ముందుగా గమనించాలి. 1967 నుంచి 1972 దాకా గల వ్యవధి ఐదు సంవత్సరాలు మాత్రమే. అది ఒక సుసంఘటితమైన వ్యవస్థగా రూపొందేలోగానే విప్లవకారులలో గల చిన్న చిన్న గ్రూపులలో సిద్ధాంత విభేదాలు తలెత్తాయి. సుశిక్షుతులైన సైనిక దళాలలో శత్రువు వాళ్ళపై కురికాడు. ఆ కొద్దికాలంలోనూ సంఘటనల ప్రవాహంలో ఉక్కిరిబిక్కిరి అయిన నాయకులు ఎప్పటికప్పుడు కొత్త పరిస్థితులకు తాత్కాలిక చర్యలనే నిర్దేశించవలసి వచ్చింది. తరువాత కాలంలో కొట్టొచ్చినట్టు కనిపించే సి.పి.ఐ. (మా.లె.) పార్టీలోపాలు పరంపరలో భారత జాతీయ పరిస్థితిని గురించి పార్టీ చేసిన వాస్తవిక పరిశీలన మరుగు పడిపోవచ్చు. 1967–72 నాటి వాస్తవిక పరిస్థితి 1969లో పార్టీ చేసిన పరిశీలనకు తూ.చ. తప్పకుండా సరిపోతుంది. “ఇదివరకెన్నడూ కనీవినీ ఎరుగని విధంగా ఈనాడు పాలకవర్గాలు మరింత క్లిష్టమైన ఆర్థిక రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయారు. సామ్రాజ్య వాదానికీ ప్రజలకూ, ఫ్యూడలిజానికీ రైతులకూ, శ్రమశక్తికీ పెట్టుబడికీ. (పాలకవర్గాలలోని వివిధ వర్గాలకూ) మధ్యగల వైరుధ్యాలు నానాటికీ తీవ్రమౌతున్నాయి... కార్మిక వర్గం రైతాంగం. పెట్టిబూర్జువాలు, పెరుగుతూన్న దారిద్ర్యానికి నిరుద్యోగానికి బలైపోతున్నారు. నేటి కరువు దారిద్ర్యాలతో సతమతమయ్యే ప్రజలలో 95 శాతం సహనాన్ని కోల్పోయి; మౌలికమైన మార్పులకై అర్రులు చాస్తున్నారు....”

ఎటువంటి సైనికనైపుణ్యం లేకపోయినా ఆ ఉద్యమం మన గలిగిందంటే అది ప్రస్తుత రాజకీయ ఆర్థికవ్యవస్థ యొక్క లోపాన్నే సూచిస్తుంది. ఉద్యమానికి ఇంధనంగా

* *చారుమజుందారు సి.పి.ఐ. (మా.లె.) పార్టీ నుంచి నాటికే తెగతెంపులు చేసుకున్న ఉత్తర భారత సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కమిటీ సభ్యులు ఆ సంవత్సరం జూన్–జూలైలలో ఈ రచయితతో ఇలా అన్నారు. తమ తమ ఆయుధాలతోనూ మందుగుండు సామాగ్రితోనూ తిరుగుతున్న 300 మాజీ పి.ఎ.సి. తిరుగుబాటుదార్లు పార్టీని అడిగారు. “కాని వాళ్ళను చేర్చుకునేందుకు మాకు ఈ ప్రాంతంలో స్థావర ప్రాంతం లేదు.” కొన్ని నెలల తరవాత వాళ్ళు మధ్యప్రదేశ్ లోయలలోని దోపిడీ దొంగలలో చేరారని తెలిసింది.*

పనిచేసిన శక్తుల పటుత్వాన్ని కూడా అది సూచిస్తుంది. సి.పి.ఐ.(మా.లె.) పార్టీ 1972లో దెబ్బతిన్నమాట నిజమే. కాని నాటి ప్రేలుడుకు కారణమైన వ్యవస్థ నేటికే కుళ్ళు కంపుకొడుతూనే ఉంది. ఆ సంక్షోభం బద్దలయ్యేందుకు మందుగుండుగా పనిచేసిన కారణాలింకా ఇంకిపోలేదు. సి.పి.ఐ. (మా.లె.) పార్టీపై పాలక శక్తులు రుద్దిన పరాజయం సైనికపరమైనది. ఆ మాటకొస్తే వాళ్ళ విజయమూ తాత్కాలికమే. పాలక శక్తుల రాజకీయ ఆర్థిక పరాజయాలను కప్పిపెట్టుకునేందుకు విప్లవకారుల పరాజయమొక్కటే చాలదు. కమ్యూనిస్టు విప్లవకారులను రాజ్యాంగ చట్టాన్ని నిరసించేలా చేసిన పార్లమెంటరీ సంస్కరణల నత్తనడకలు, పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడిలతో సరితూగలేక పోతున్నాయి. సామాజిక దారిద్ర్యం మాట చెప్పక్కరలేదు. నక్సల్బరీ తిరుగుబాటుకు 5 ఏళ్ళ తరువాత, అంటే 1972లో 20 సంవత్సరాల క్రితం దారిద్ర్యరేఖకింద ఎందరు ప్రజలున్నారో నేడుకూడా అంతేమంది ప్రజలున్నారని కేంద్రప్రణాళికల శాఖ సహాయమంత్రి మోహన్‌ధారియా పార్లమెంటులో అన్నాడు.[27] మరోపక్క 1967నాటి నుంచీ భారీపరిశ్రమలు లాభాలను గుంజుకుంటేనే ఉన్నాయి. ఒకానొక రిజర్వుబాంకు అధ్యయనం ప్రకారం. 1968-69 సంవత్సరంలో 200 పెద్దకంపనీల లాభాలు రూ. 45 కోట్లుకాగా, 1970-71 నాటికి అవి రెట్టింపుకు పైగా, అంటే రూ. 97కోట్లకు పెరిగాయి.

## ప్రభుత్వ విధానాలు 1971-72

సి.పి.ఐ. (మా.లె) పార్టీ తెచ్చిపెట్టిన సవాలును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తన మొత్తం యంత్రాంగాన్నెలా సమీకరించిందో చూశాం. కాని 1967-72 కాలంలో ఈ సవాలును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం రాజకీయ ఆర్థిక రంగాలలో ఎటువంటి చర్యలు తీసుకుందో చూద్దాం.

గెరిల్లా ఉద్యమాల కారణాలను పరిశీలించి తిరుగుబాటు నిరోధకచర్యపై పరిశోధన చేసిన కమ్యూనిస్టు వ్యతిరేక నిపుణుల రాజకీయ తిరుగుబాటుదార్లపై జరిపే దమనకాండకు తోడుగా సాధారణ ప్రజలకు రాయితీలను కల్పించాల్సిన అవసరాన్ని ఏకగ్రీవంగా నొక్కివక్కాణించారు. అమెరికా మాజీప్రధాని లిండన్‌జాన్సనుకు సలహాదారు, ఆర్థికశాస్త్రవేత్త, ప్రొఫెసరు, మాజీ రహస్య సమాచార శాఖాధికారి అయిన వాల్ట్ విట్‌మన్ రుస్టో ఇలా అన్నాడు. "మావోసేటుంగు తన మనషులను ఈదాలని ఉద్బోధించిన సముద్రం ఏర్పడకుండా మనం చూడవచ్చు. దీనికి సైనికపరమైన నిరోధకచర్యా కార్యక్రమ మొకటేచాలదు. గ్రామీణాభివృద్ధి, సైద్ధాంతిక

ప్రచారకార్యక్రమాలు కూడా అవసరం. గెరిల్లాయుద్ధాన్ని ఎదుర్కొనేందుకు మంచిపద్ధతి, దాన్ని జరగనివ్వకపోవడమే."[28]

1970 సంవత్సరంలో కలకత్తా పోలీసు కమిషనరు తన పోలీసుశాఖలో అధ్యయనానికి కొన్నిభాగాలను సర్క్యులేటు చేసిన పుస్తకం తాలూకు గ్రంథకర్త. మలయాలో గెరిల్లా వ్యతిరేక కార్యకలాపాలను అధ్యయనం చేసిన సర్‌రాబర్టుథాప్సన్, "సైనిక ప్రయత్నం, పౌరప్రయత్నం సమపాళ్ళలో ఉండాలని" భావించాడు. లేకుంటే, "పౌరపరమైన (సంక్షేమ) చర్యలు లేకపోతే సైనికకలాపాలు శాశ్వత ఫలితాలను ఇవ్వలేని పరిస్థితి ఏర్పడవచ్చునని"[29] భావించాడు.

ఏభైల ఆరంభంలో కమ్యూనిస్ట్ – హక్ విప్లవాన్ని విజయవంతంగా అణచిన ఫిలిప్పైన్స్ అధ్యక్షుడు 'మెగస్సాసే' విధానాలలో ఈ దమనచర్యల రాయితీల మేళవింపు సరిగ్గా జరిగిందని ఈ అమెరికన్, బ్రిటిషు నిపుణుల భావన. "తిరుగులేని బలప్రయోగం, తిరుగులేని స్నేహం"గా ప్రసిద్ధిచెందిన విధానాన్ని, మెగస్సాసే. కమ్యూనిస్టు విప్లవకారులపైనా, వారి భూమి లేని రైతాంగ అనుచరులపైనా, నిర్దాక్షిణ్యమైన దమనచర్యల రూపంలో "బల" ప్రయోగం చేసాడు. ధనికరైతులకు, మధ్యరైతులకు, పెట్టిబూర్జువాలకులాభించేలా భూసంస్కరణలను అమలుపరచి రాయితీలరూపంలో 'స్నేహాన్ని' అమలు పరిచాడు.*

వ్యావసాయిక రంగంలో యథాస్థితికి భంగం తెచ్చిన నక్సల్బరీ తిరిగుబాటు జరిగిన వెంటనే భారతపాలక వర్గాలు కూడా మిగతా అర్ధవలస రాజ్యాలలోని తమ స్నేహితుల అనుభవాలను, విదేశీనిపుణల అభిప్రాయాలను తెలుసుకుని త్వరగా పాఠాలు నేర్చుకోసాగారు. 1967 నాటినుంచీ రూపుదిద్దుకుంటూన్న కొత్త ఎత్తుగడలు, 1969 చీలిక తరువాత స్పష్టత సంతరించుకున్నాయి. అనేక పరిస్థితుల కలయికవల్ల వచ్చిన చీలిక అది. ఇందిరా గాంధీ బీదజనబాంధవిగా పోజులుకొడుతూ, బూటకపు సోషలిజపు కల్లబొల్లినినాదాలు వల్లెవేయసాగింది. ఆమె తలపెట్టిన చర్యలు బ్యూరోక్రటిక్ పెట్టుబడిని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉద్దేశింప బడినవే. ప్రజలలో కొన్ని వర్గాలకు రాయితీలు సంక్రమించాయి. నాటి పరిస్థితులలో అటువంటి రాయితీల అమలువల్ల మరింత కరెన్సీ చలామణిలోకి వచ్చింది. అది లోటుబడ్జెటు విధానానికి దారితీసింది. మొరార్జీ, ఎస్ కె.పాటిల్ అతుల్యఘోష్‌లు

* *ఇదే ఫిలిప్పైన్సు నమూనాను పుణికిపుచ్చుకుని, 1975 జూన్ 25న ఇందిరాగాంధీ – సంజయ్ పాలకవర్గం, అత్యవసర పరిస్థితిని ప్రవేశపెట్టడం – 20 – సూత్రాలు పథకం ప్రకటించడం గమనించాలి – అను.*

ప్రాతినిధ్యం వహించిన ఛాంధసపూర్వీకులను ఈ చర్యలు దూరం చేసాయి. ఇందిరాగాంధి 'సోషలిస్టు' పలుకుబడిని పెంచాయి. 1969లో ఇందిరాగాంధీకి 'సోషలిజం' పైకల మక్కువకంటె, అధికారానికై జరిగిన కుమ్ములాటలో ఆవిడవేసుకొన్న బురఖామాత్రమే అని (తరువాత సంఘటనలు నిరూపించినట్టు) అనుకోవాలి. 1967 నుంచి కూడా వామపక్షీయులు ఆర్థికరంగంలోని కీలక పరిశ్రమల జాతీయీకరణ, వ్యావసాయిక వ్యవస్థలో మార్పులు, వంటి వాటికి ఆందోళన చేస్తూ, కాంగ్రెసుకు ఎన్నికల వైఖరిలో సవాలుగా తయారయ్యారు. 1969లో పార్టీని చీల్చడానికే నిర్ణయించుకుని, వామపక్షీయుల నినాదాలను తాను సొంతం చేసుకుని, ఇందిరాగాంధీ వాళ్ళకున్న కొద్దిపాటి చోదకశక్తినీ కూడా దోచుకుంది.

కానీ, నినాదాలను సొంతం చేసుకుంటే చాలదు. గతసంవత్సరాలలో వామపక్షీయులు వదరుతున్న సోషలిస్టు వాగ్ధాటికీ, కాంగ్రెసు చేస్తూ వచ్చిన ఎన్నికల వాగ్దానాలకూ ప్రతిగా, రాజ్యాంగ రాజకీయాల వెలుపల జరుగుతున్న ఉద్యమమే సి.పి.ఐ. (మా.లె.) పార్టీకార్యక్రమం. శ్రీకాకుళం నక్సల్బరీలలో తిరుగుబాటుల తరువాత కేంద్ర దేశీయాంగశాఖ పరిశోధన విధాన విభాగం ఇలా హెచ్చరించింది. "దేశంలోని వివిధ ప్రాంతాలలో గల రైతాంగ రాజకీయ సంస్థలు సంస్థాపరంగా ఇంకాబలంగా లేకపోయినా వాటికి సుధీర్ఘమైన ఆందోళనలు లేవదీసే సమర్థత లేనప్పటికీ, సాపేక్షంగా కొద్దిమంది ధనికరైతులకూ, ఎందరో కౌలుదార్లకూ, భూమిలేని వ్యవసాయ కార్మికులకూ (నడుమ) విస్తృతమవుతున్న అంతరంవల్ల గ్రామప్రాంతాలలో వచ్చే ఘర్షణ ముందు మాసాలలోనూ సంవత్సరాలలోనూ పెరగవచ్చు.[30] అనుకూలమైనవీ వాస్తవమైనవీ చర్యలను చేపట్టాలి. అదే పరిశోధన. విధాన విభాగం ఇలా సలహా ఇచ్చింది. "........యావత్తుదేశం ప్రాతిపదికగా సమస్య యొక్క తీవ్రతను రాష్ట్రాలు అర్థం చేసుకుంటే రాష్ట్రాలను కొంత కార్యక్రమానికి పురికొల్పవచ్చు" కాని కేంద్రంలోలాగే రాష్ట్రాలలో కూడా ప్రభుత్వాలు "సాపేక్షంగా ధనికులైన కొద్ది మంధి రైతులు", అంటే ప్యూడలు భూస్వాములచేతులలో ఉన్నాయి. తన అంతాన్ని తానే కోరుకుని కాంగ్రెసు, వారిపై చర్యలు తీసుకోలేదు. వ్యావసాయిక సంబంధాలపై ప్రణాళికా సంఘపు కార్యాచరణదళం 1973లో కూడా ఇలా చెప్పుకుంది. "దేశగ్రామ ప్రాంతాలలో ఇప్పుడున్న సాంఘిక-ఆర్థిక పరిస్థితులదృష్ట్యా తగినంత రాజకీయ సంకల్పం ఉంటేకాని భూసంస్కరణల విషయంలో ఎన్నదగిన అభివృద్ధి సాధ్యపడదు. ఈ ముఖ్యమైన పరిస్థితి (తగినంత రాజకీయ సంకల్పం) ఈనాడు లేదనేది, ఒకచేదు నిజం....."[31] అటువంటి పరిస్థితిలో తీపి తీర్మానాల చిలకపలుకులు, అందమైన

న్యాయచట్టాలు; ఇంకెంత మాత్రమూ ప్రజలకోర్కెలను చల్లబరచలేవు. తాత్కాలికంగానైనా నమ్మకాన్ని కలిగించి, సంక్షేమాన్ని అరచేతిలో చూపించే మరికొన్ని చర్యలు అవసరమయ్యాయి.

1969 జూలైలో ఇందిరాగాంధీ దేశంలోని 14పెద్ద బ్యాంకులను జాతీయం చేసింది. ఈ విధంగానైనా కొన్ని చర్యలు వనరులు బ్యాంకుల నుంచి చిన్న రైతులకూ మధ్యరైతులకూ అందుతాయంది. గతంలోవాళ్లు తమ అప్పులకు వడ్డీ వ్యాపారులపై ఆధారపడుతూ హెచ్చువడ్డీలను చెల్లించేవారు. ఈ చర్యవల్ల దేశంలోని గ్రామ ప్రాంతాలలోని చిన్నరైతులలోనూ మధ్య రైతులలోనూ తన పార్టీకి పలుకుబడిని సంపాదించి మరోకొత్త అనుచర వర్గాన్ని సంపాదించుకోవచ్చునని కూడా ఆశించింది. ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయంచేసి వాటి యజమానులైన బడాపారిశ్రామికులపై చర్య తీసుకోగలిగిన తీవ్రవాదిగా కూడా చలామణీ అయింది. వామపక్షీయులు చాలా సంవత్సరాలుగా బ్యాంకులు జాతీయీకరణను కోరుతున్నారు ఇందిరాగాంధీ వాళ్ళనలా చిత్తుచేసింది.

కాని మరో మూడేళ్ళలో ఆ ఉత్సాహం సన్నగిల్లింది. 1972 నాటికి బ్యాంకుల జాతీయీకరణవల్ల వస్తుందని చెప్పిన సంక్షేమం నామమాత్రమేననీ, అదీ కూడా కొద్దిమంది చిన్నరైతులని మధ్యరైతులనూ మాత్రమే స్పృశించగలదని తేలిపోయింది. రిజర్వుబాంకు ఆ సంవత్సరంలో ప్రకటించిన ఒక బులెటిన్‌లో 34 షెడ్యూల్డు బ్యాంకులు ఇచ్చిన అప్పులను రంగాల వారీగా విశ్లేషిస్తూ, 1972 ఏప్రిలు నాటికి బ్యాంకులు జారీ చేసిన రుణాలలో 96 శాతంలో మొత్తం మీద వ్యావసాయిక రంగానికి ప్రత్యక్ష రుణాలశాతం 8.6 శాతం అనీ పరోక్ష ఋణసహాయం 4.5 శాతంగానూ పేర్కొంది. బ్యాంకుల రుణాలలో హెచ్చు భాగం గతంలో లాగే భారీపరిశ్రమలకూ మధ్యతరహా పరిశ్రమలకే లభించింది. భూమిలేని వారి పునరావాసానికి వద్దాం. ప్రతి జిల్లాలోనూ 1000 మందికి ఉపాధికల్పించే బృహత్పథకాన్ని ఇందిరాగాంధి 1971 ఎన్నికలలో ప్రజల ముందువాగ్దానం చేసింది. రోడ్లనిర్మాణం, నీటిపారుదల, మురుగు నీటి పారుదల పథకాలు, మొదలైనవి వాళ్ళకు ఉపాధిని కలిగిస్తాయని భావించారు. కాని అటువంటి ప్రాజెక్టులు శాశ్వతమైన, క్రమమైన, ఉద్యోగావకాశాలను కల్పించలేవు. కనుక (ప్రభుత్వం) వాటి మీద పెట్టిన ఖర్చు దానంకింద, నిరుద్యోగభృతి క్రింద తయారయ్యింది.

అదికాక దేశంలోని కీలక ప్రాంతాలలో ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించారు. ఉదాహరణకు 1972-73 సంవత్సరాలలో పశ్చిమబెంగాలులో రాష్ట్రప్రణాళికా

మండలి 'సమగ్రప్రాంతీయ అభివృద్ధి కార్యక్రమం' (Comprehensive Area Development Programme) (CADP)న్ని కొన్ని ఎన్నికచేసిన గ్రామప్రాంతాలలో అమలు జరపాలని యోచించింది. ఆ మండలి (West Bengal Planning Board) సభ్యుడైన పన్నాలాల్ దాస్ గుప్తా* ఒక పథకాన్ని రూపొందించాడు. దాని ప్రకారం కొన్ని ఎన్నిక చేసిన ప్రాంతాలలో భూకమతాలలో ప్రస్తుతం ఉన్న తేడాలలాగే ఉంటాయి. రైతులుమాత్రం తమకు కావలసిన ఋణాన్ని, విత్తనాలు, ఎరువులు, మొదలైన వాటిని స్థానిక ప్రాజెక్టు కేంద్రం (Project Authority) నుంచి తెచ్చుకుంటారు. పంటలతీరును వాటి ఉత్పత్తిని నిర్ణయించి ఆ ప్రాంతపు అభివృద్ధిని రచించేందుకు ప్రాజెక్టు కేంద్రాన్ని స్థాపించారు. నవీన వ్యవసాయిక పద్ధతులకు అనుబంధంగా కావలసిన యంత్రసామాగ్రి మరమ్మతుకుతోడు వ్యవసాయిక ఉత్పత్తులపై ఆధారపడిన పరిశ్రమల ఏర్పాటు వల్ల రెండవస్థాయి ఉపాధి కల్పించేందుకు కూడా పథకం ఏర్పరచబడింది. పంటను అమ్మే విషయంలో కూడా బాధ్యత ప్రాజేక్టు కేంద్రానిదే. ప్రాజెక్టు ప్రాంతంలోని పెద్ద భూస్వాములు బ్లాకులలో గల తమ పొలాలను పెంచేందుకు అనుమతి లేదు. కానివాళ్ళు పొరుగు ప్రాంతాలలో భూములు కొనుక్కోవచ్చు. ఆ విధంగా వాళ్ళు కులక్కులుగా ఎదగవచ్చు. ఆ విధంగా తమకూ బీదవారికీగల అంతరాన్ని విస్తృతం చెయ్యొచ్చు. అదీగాక ఈ భూస్వాములకు గ్రామాలలోగల పలుకుబడి సాంఘికశక్తి ఆధారంగా స్థానిక ప్రాజెక్టు కేంద్రంపై ఆధిపత్యం వహించి ఎరువులు పురుగుమందులు వంటి వ్యవసాయ సరుకులను జాతీయ బాంకుల నుండి ద్రవ్యాన్ని సమకూర్చి పెట్టాయనేది గమనించాలి.

సమగ్ర ప్రాంతీయాభివృద్ధి పథకం Command Area Development Programme (CADP) క్రింద నక్సల్బరీని దేబ్రాను ఎన్నుకోవడం గమనార్హం.

---

* *రివల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా (ఆర్.సి.పి.ఐ.) పన్నాలాల్ దాస్‌గుప్తా 1947 ఆగస్టు నెలలోనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా చిన్న తరహా తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు. 1962లో జైలు నుంచి విడుదలయ్యాక సాయుధ విప్లవం ద్వారా అధికారాన్ని పట్టుకునే రాజకీయాలను విడిచిపెట్టి సర్వోదయ రాజకీయాలకు సంబంధించిన వ్యవసాయ సంస్కరణవైపు మొగ్గాడు. తాగూరు గ్రామీణాభివృద్ధి సంఘానికి కార్యదర్శి. జయప్రకాష్ నారాయణ్ దాని అధ్యక్షుడు. 1972 కాంగ్రెసు ప్రభుత్వ కాలంలో ఆయనను పశ్చిమ బెంగాలు ప్రణాళికా మండలి (West Bengal Planning Board) సభ్యుడిగా చేశారు. (ప్రస్తుత) వ్యవస్థ ఒక మాజీ విప్లవకారుని ఎలా విలీనం చేసుకుంటుందో చెప్పేందుకు పన్నాలాల్ దాస్ గుప్తా ఒక చక్కటి ఉదాహరణ.*

1967-72 కాలంలో సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కార్యకలాపాలకు ముఖ్యకేంద్రమైన ఆదిమవాస భూభాగాలలో అభివృద్ధి పథకాలుగా పిలువబడే ఈ చర్యల అమలుకు వీటిలో కొన్ని ప్రాంతాలను ఎన్నిక చేయాలని ప్రభుత్వం తలపెట్టింది. ఆంధ్రలోని శ్రీకాకుళాన్ని ఒరిస్సాలోని గంజాం ప్రాంతాన్ని కూడా ఎన్నిక చేసారు. *

ఆదిమ బీదజనపు అప్పులను రద్దుచెయ్యమని స్థానికాధికారులను ప్రభుత్వం ఆజ్ఞాపించింది. వాళ్ళకు ప్రత్యామ్నాయంగా బాంకులు తదితర సంస్థలనుంచి వ్యవసాయాభివృద్ధికై అప్పులివ్వాలని కూడా ఆదేశించారు. 1964లో శ్రీకాకుళంలోని 'కీలకగ్రామాల'లో అభివృద్ధి కార్యక్రమాలు ఎలా అమలు పరిచారో కూడా చూశాం!

1969 నాటినుంచీ తలపెట్టిన సంస్కరణలవల్ల అట్టడుగువర్గాల ప్రజలకు రేఖాత్మకంగానూ నామమాత్రంగానూ రాయితీలను కలిగిస్తూనే, ఉన్నత వర్గాల వారికి రక్షణాపరమైన అవకాశాలను కలిగించారు. బ్యాంకుల జాతీయాకరణ, బడాపారిశ్రామిక కుటుంబాలపై చర్యలువంటి కుహనాసోషలిస్టు నినాదాలతో మొదట్లో బూర్జువావర్గం దూరమైనా, గతంలో కంటె హెచ్చులాభాలు వాళ్ళ బొక్కసాలలో వచ్చిపడుతూంటే, ప్రజలను మభ్యపరచే ఆ నినాదాల యొక్క అసలు బలాన్ని గుర్తించిన వాళ్ళు, మరింత బలాన్ని విశ్వాసాన్నీ పుంజుకున్నారు. పబ్లికురంగంలో గల ద్రవ్య సంస్థలు వాళ్ళకు ఋణాలిస్తూనే ఉన్నాయి. జాతీయాకరణ జరిగిన రెండేళ్ళకు, అంటే 1971లో జాతీయం చేయబడ్డ 14బాంకుల నుంచి పెద్ద పారిశ్రామిక కుటుంబాలకు అందిన రుణసహాయం, రూ. 534.75 కోట్లకు పెరిగింది. ఆ మొత్తం 1969 జూలైలో రూ.440.28 కోట్లు మాత్రమే.[33]

పరిశ్రమలలోనూ వాణిజ్యంలోనూ గుత్తపెట్టుబడి సంస్థలపై తీసుకున్న ప్రభుత్వ చర్యల తీరుకూడా అలాగే ఉంది. గుత్తపెట్టుబడి సంస్థలపై తీవ్రచర్యలు తీసుకుంటామని బెదిరింపులు జారీచేసి, వెనువెంటనే దేశం యొక్క ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు మార్గాలు ఆలోచించేందుకు అదే బడా పారిశ్రామికవేత్తలతో అప్యాయంగా సమావేశాలు పరంపరగా జరిగేవి. 1970 ఆగుస్టు నాటికి గుత్తసంస్థలు – వర్తక కలాపాల చట్టం. (Monopolies and Restrive Trade Practices Act) కింద వచ్చే బడా పారిశ్రామిక సంస్థలకు 22 పారిశ్రామిక లైసెన్సులు జారీచేసారు. అప్పటికే దేశీయంగా

---

* *తరువాత కరీంనగర్ జిల్లాలోని పోచంపాడు ప్రాజెక్టు క్రింద జగిత్యాల సిరిసిల్లా ప్రాంతాలనూ, నాగార్జునసాగర్ ప్రాజెక్టుకింద హుజూర్ నగర్ నల్గొండ ప్రాంతాలు కూడా ఈ పథకానికై ఎంపిక చేయబడ్డాయి. ఈ పథకం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అమలు జరుగుతుంది.*

సాంకేతిక పరిజ్ఞానం లభ్యమవుతున్న రంగాలలో విదేశీ సహకారాన్ని ఆశించబోమని ప్రభుత్వం ప్రకటించిన విధానానికి భిన్నంగా 1970 జూలై–సెప్టెంబరు మూడు నెలల్లో 49 విదేశీసహకార ప్రతిపాదనలు మంజూరయ్యాయి. వాటిలో 10 బ్రిటనుకు లభించగా అగ్రస్థానాన్ని సంపాదించుకుంది. 1972 నవంబరు 30వ తేదీ నాటికి MRTP చట్టం కింద నమోదయిన 853 సంస్థల నికరపు ఆస్తులు, రూ 4,847 కోట్లు, ప్రైవేటురంగంలోని 34 మొత్తం కంపెనీల నికరాస్తులలో అవి సగం ఉన్నాయి.[34] ప్రభుత్వమూ, బడాపారిశ్రామిక వేత్తలూ 1973 ఆరంభానికి 'సంయుక్త రంగం' (Joint Sector) అనే భావనతో ఆడుకుంటున్నారు. అందులో ప్రైవేటురంగం పబ్లికురంగంతో కలసి అధికారాన్ని పంచుకుంటుంది. కొన్నిరంగాలలోని సంఘటిత పారిశ్రామిక కార్మికుల జీతాలు పెంచారు. ప్రభుత్వ కార్యాలయాల తెల్లచొక్కా ఉద్యోగుల జీతాల్ని కూడా పెంచారు.

ఇందిరాగాంధి ప్రవేశపెట్టిన చర్యలన్నీ కొన్నివర్గాల ప్రజలను సంతృప్తి పరచేందుకో, కొన్ని ప్రాంతాల అభివృద్ధికో పరిమితమైనవే. ఈ విషయంలో ఆమెకు అమెరికన్ నిపుణుల వత్తాసుకూడా ఉంది. వారిలో ఒకడు ఇండియా గురించి ఇలా అన్నాడు. "చివరి స్థాయి దారిద్ర్యంపై కేంద్రం తలపెట్టిన దాడివల్ల, ఒకే ప్రాంతంలోని దురదృష్టకర ప్రజలలో తరగతుల మధ్య అంతరాలను అంతరింపజేయాలి. వివిధ ప్రాంతాల మధ్య ఆదాయాలను త్వరలో సమం చెయ్యకూడదు" పశ్చిమ బెంగాలులో కొన్ని ప్రాంతాలలో తలపెట్టిన సహకార వ్యవసాయక్షేత్రాల విధానం కూడా సమగ్రంగా ప్రజా సంక్షేమాన్నిచ్చే కార్యక్రమానికి బదులు సంక్షేమంతో విలసిల్లే కొన్ని చెదురు మదురు ప్రాంతాలను సృష్టించే ధోరణినే కనబరచింది.

ప్రాంతాలకూ తరగతులకూ మధ్య అటువంటి హెచ్చుతగ్గులే హరిత విప్లవం వల్ల కూడా వచ్చాయని చూశాం. కొత్త వంగడాలు బాగా నీటి పారుదల గల దేశంలోని వాయువ్యరాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలనే సుసంపన్నంగా తీర్చిదిద్దాయి. ఆ 'విప్లవం' అదే ప్రాంతంలో అసమానతలను తెచ్చిపెట్టింది. కొత్తవంగడాలు ప్రవేశపెట్టడానికి కావలసిన అనుబంధ వ్యావసాయిక చర్యలను భరించగల ఆర్థికస్తోమత గలిగిన ధనికరైతులే అత్యధిక లాభాలనార్జించారు.

సంఘంలోని ప్రతీసామాజిక పొరలోనూ స్వార్థప్రయోజనాల్ని కాక్షించే వర్గాన్ని సృష్టించి, తద్వారా ఆ వర్గానికి జాతీయ ఆర్థిక రంగపు (రాజకీయ) కుట్రలో భాగాన్ని కల్పించడమే ఇందిరాగాంధి ఆశయం. కొన్ని ప్రత్యేక ప్రాంతాలలో గల దిగువ మధ్య తరగతి ప్రజలలోని కొన్నిభాగాలు మాత్రం ప్రస్తుతవ్యవస్థలో కొంత స్వప్రయోజనాన్ని

పొందగా, దేశమంతటా ఈ తరగతులలోని మిగతా ప్రజలు మాత్రం ఈ లాభసాటి కార్యక్రమానికి వెలుపలే మిగిలిపోయి, దగాపడుతున్నారు. ప్రతీసాంఘిక వర్గీకరణలోనూ కొందరుసభ్యులు 'లోపలా' మరికొందరు 'బయటా' ఉండడంవల్ల 'లోపలి' వారిలో 'లోపలి' వారికీ; 'లోపలి' వారికీ 'బయటి' వారికీ మధ్య ఘర్షణ పరంపరలు పుట్టుకొస్తాయికాని; మొత్తం సాంఘిక వ్యవస్థను పరిరక్షించే వారికీ. వ్యతిరేకించేవారికి మధ్య మౌలికమైన సంఘర్షణ వచ్చే ప్రమాదం లేదు. అటువంటి అంతర్వర్గఘర్షణలు (Inter-class Conflicts) ప్రాంతీయాంతర ఘర్షణలు (Inter Regional Clashes) ప్రాంతీయ వర్గీకరణలు (Regional Classifications) ప్రస్తుత సంఘాన్ని ఏదోలా నడుస్తున్న వ్యాపారసంస్థగా (going-concern) తులనాత్మకం చేస్తూ ముందుకు నడుపుతాయి. భావిలో గ్రామప్రాంతాలలో వచ్చే ఆందోళనలలో ఈ పచ్చగా ఉన్న వర్గాలు, బడుగు ప్రాంతాలుగా (Buffer-areas) వ్యవహరిస్తాయి. విస్తృత ప్రాంతంలో సంచరించాలనుకున్న తిరుగుబాటుదార్ల సమన్వయాన్ని అటువంటి రాయితీలనుభవించే ప్రజాబాహుళ్యాలు నిరోధిస్తారు. అంటుకునేందుకు నిరాకరించే కొన్ని ప్రాంతాలను ఏర్పరిచి, ఆమె "నక్సల్బరీ జ్వాలలను" "దేశంలోని ఒకానొక" "అత్యంత దహనాత్మక ప్రాంతంనుంచి" మరో ప్రాంతానికి వ్యాపించకుండా జాగ్రత్తపడింది.

## నగర సమస్యలు 1967–72

సి.పి.ఐ (మా.లె.) పార్టీ ఉద్యమంలో నగరయువతయొక్క పాత్ర ప్రత్యేకించి పశ్చిమబెంగాలులో ఎటువంటి ప్రాముఖ్యతను సంతరించుకుందో చూశాం. దాన్ని బాగా గమనించిన ప్రభుత్వం ఆందోళన చెందిన యువతను సమాధాన పరచేందుకు వేరేకార్యక్రమాన్ని రూపొందించింది.

దమనచర్యలతో పాటు చక్కగా మేళవించిన ఆర్థిక రాజకీయ రాయితీలను కూడా యువతకు ఎరచూపింది. 1969లో బాంకుల జాతీయాకరణతో కలకత్తాలోనూ నగరాలలోనూ, నిరుద్యోగులూ వ్యాపారదక్షులూ ఐన యువకులు ఋణాలు పొందారు. కాని ఇది సముద్రంలో నీటిబొట్టు మాత్రమే. ఎన్నో కర్మాగారాలు మూసివేతకు దారి తీసిన సార్వత్రిక ఆర్థిక సంక్షోభం పట్టణ నిరుద్యోగ సమస్యను మరింత తీవ్రంచేసింది. యువతను సంతృప్తిపరచే రాజకీయ చర్యకూడా తరవాత జరిగింది. 1970 మధ్యలో కేంద్రదేశీయాంగ శాఖ సహాయకమంత్రి కె.సి.పంత్ జూలై 21వ తేదీన యువ 'నక్సలైట్ల'తో సంప్రదించేందుకు పార్లమెంటులో ప్రభుత్వ సంసిద్ధతను ప్రకటించి

దేశాన్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తాడు. మూడురోజుల తరువాత మరో అంశాన్ని వివరిస్తూ, సి.పి.ఐ (మా.లె.) పార్టీలో 'నిబద్ధం కాని శక్తులను' దాని నుంచి దూరంచేసేందుకు (సాయపడే) నమ్మించే విధానపు ఆవశ్యకతను పేర్కొన్నాడు. ఈ ప్రకటనకు తరువాతి చర్యగా పశ్చిమ బెంగాలులోని ఇందిరాగాంధీ కాంగ్రెసుపార్టీ 1971లో 'నిబద్ధులు కాని నక్సలైట్లకు' తన ద్వారాలను బాహాటంగా తెరచింది. ఉద్యోగాలనూ పోలీసులు నుంచి రక్షణనూ కల్పిస్తామని వాళ్ళకు వాగ్దానం చేసింది. ఈ 'నిబద్ధులు కాని వాళ్ళు' అనేక కారణాలవల్ల ఉద్యమంలో చేరారు. నైరాశ్యం ఓరిమిలేకపోవడం, అలక్ష్యం చేయబడుతున్నామనేభావన, అధికారం పట్లకలలు, ఇదివరకు అందరాని విజయావకాశాలకు దారితీసే హింసను గుర్తించి వీళ్ళు ఆ ఉద్యమంలో జేరారు.

పశ్చిమబెంగాలులోని కాంగ్రెసు పార్టీ* కూడా తన ప్రత్యేక ధోరణిలో నగరయువకుల ఈ అవసరాలన్నిటినీ తీర్చింది. యువకులు తమ నిగూఢపు ఊహాంతరాలలో కోరుకునే వన్నీ – అధికారం, అధికారిక గుర్తింపు, హోదా, వీటితోపాటు విప్లవం గురించిన వాగ్దానం – కాంగ్రెసు పార్టీ వాళ్ళముందు పెట్టింది. సి.పి.ఐ (మా.లె.) పార్టీలతో పోటీగా నిలిచేందుకు పెట్టుబడిదారీ – వ్యతిరేక, కుహనా సోషలిస్టు నినాదాలను దత్తం చేసుకుంది. 1971లో పశ్చిమబెంగాలులో జరిగిన సమయంలోనైనా ఆ సమస్యను తూర్పు ప్రాంతంలో ఎదుర్కొనే వీలు కాంగ్రెసుకు కలిగించాయి. పశ్చిమబెంగాలు, బీహారు, అస్సాం, త్రిపుర ప్రాంతాల్లోకి వచ్చే వేలాది కాందిశీకులను ఆదరించేందుకు రక్షణ శిబిరాలను ఏర్పాటుచేసారు. కాంగ్రెసులో జేరిన నిరుద్యోగ యువకులకు క్యాంపు వాలంటీరు ఉద్యోగాల్ని వెదజల్లారు.

సి.పి.ఐ (మా.లె.) పార్టీ విద్యావిధానాన్ని నాశనం చెయ్యాలనుకుంది. స్కూళ్ళను కాలేజీలను బహిష్కరించడం పరీక్షలను విచ్ఛిన్నం చెయ్యడం దాని వ్యూహంలోని కొన్ని ముఖ్యాంశాలు. యువత నైరాశ్యాన్ని బహిర్గతం చేసేందుకు కాంగ్రెసు పార్టీ మరో పద్ధతిని అనుసరించింది. ఇందిరాగాంధి నాయకత్వంలో అవతరిస్తున్న నవీన సాంఘికవ్యవస్థను ఎరచూపించి కాంగ్రెసు పార్టీ యువకులను మళ్లీ పరీక్షాకేంద్రాలకు ఆకర్షించింది. ఉద్యోగానికి పాసుపోర్టులుగా పనికి వచ్చే డిగ్రీలను సంపాదించుకునే కోరిక కల వాళ్ళను లాలించేందుకు ఆ పార్టీ పరీక్షాలయాల్లో సామూహికంగా కాపీ

---

* *ఇక ముందు కాంగ్రెసు పార్టీ అంటే ప్రత్యేకించి చెపితే తప్ప ఇందిరాగాంధీ కాంగ్రెసు పార్టీగానే ఉపయోగించబడింది.*

చెయ్యడాన్ని ప్రోత్సహించింది. కాపీ చెయ్యడం అభ్యర్థుల జన్మహక్కుగా పేర్కొంటూ కాంగ్రెసు పార్టీకి చెందిన విద్యార్థి సంస్థ ఛత్రపరిషత్ బహిరంగంగా ప్రకటించింది. ఒక్క కలకత్తాలోనే 1971 సంవత్సరపు పరీక్షలలో 70 శాతం అభ్యర్థులు సామూహికంగా కాపీ చేసినట్టు అధికార నివేదికల ప్రకారం తెలిసింది. ముఖ్యంగా కాలేజీ ఉపాధ్యాయులైన వాచర్లు అడ్డుపడగా వాళ్ళను తన్నారు. చాలామంది వాచర్లు వాళ్ళను వాళ్ళ మానాన వదలి పారిపోయారు. 10,000 మంది బాలబాలికలకు నష్టంకలిగిస్తూ కలకత్తా విశ్వవిద్యాలయం 30 కేంద్రాలలో పరీక్షలను రద్దు చేసింది. కాంగ్రెసు విద్యార్థి సంఘాలలోకి గుమిగూడిన విద్యార్థులు సమ్మె చేస్తూ విశ్వవిద్యాలయాల వద్ద పికెటింగ్ జరిపారు. పేపర్లు దిద్దడం, ఫలితాలను ప్రకటించడం, మళ్ళీ కొత్తగా పరీక్షలు నిర్వహించడం వంటి కార్యకలాపాలన్నీ యూనివర్శిటీలో స్తంభించిపోయాయి. *

సి.పి.ఐ. (మా.లె.) పార్టీ యువకులు చావు దెబ్బలు కొడుతున్న కూలిపోబోయే విద్యా విధానాన్ని మరణశయ్య నుంచి మళ్లా ముందుకు తెచ్చి వీళ్లు ప్రతిష్ఠించారు. మామూలుగా మళ్లీ ఆ భాగోతం మొదలైంది.

ఆర్థిక విషయాలలోలాగే, మిగిలిన విషయాలలో కూడా, ఇందిరాగాంధీ దేశంలోని ఉత్పత్తి సంబంధాలను మౌలికంగా మార్చడానికి బదులుగా; ప్రజా బాహుళ్యంలోని కొన్ని విభాగాలకు అవకాశవాదయుతమైన రాయితీ లివ్వడమనే విధానాన్ని చేపట్టింది. యువజన సమస్యల పరిష్కారం విషయంలో కూడా, సిలబస్సు (పాఠ్యాంశాలను) మార్చడం వంటి విధానాలతో విద్యా విధానాన్ని మూలం నుంచి మార్చడానికి బదులు కుహనా విప్లవాత్మకనినాదాలతో యువజనులను మభ్యపెట్టి, వాళ్ళకు బూటకపు స్వేచ్ఛను పంచియిచ్చే విధానాన్నే చేపట్టింది. నిరుద్యోగులలో చాలామందికి డబ్బు ఎరచూపి లొంగదీసుకున్నారు. ఛత్రపరిషత్ యూనిట్లకు చాలామంది జీతాలు పొందే నాయకులయ్యారు. మరికొందరు కాంగ్రెసు యువజన విభాగమైన 'యువజన కాంగ్రెసు'లో సద్దుకున్నారు. మరికొందరు స్థానిక అసెంబ్లీసభ్యులు, మంత్రుల దయాదాక్షిణ్యాలతో ఇతర వ్యాపకాలను కలిగించుకున్నారు. ఈ నాయకుల అనుగ్రహచ్ఛాయలకింద సంచరించే అనేకమంది కుర్రవాళ్ల గుంపులు పల్లికిలిస్తూ, దుకాణదార్ల నుంచీ, మధ్యతరగతి ప్రజలనుంచీ, 'పూజ'లకనీ, సాయంకాలపు

---

* *1972 జూన్‌లో నేను బర్ద్వాన్ వెళ్లినప్పుడు ప్రసిద్ధులైన యువజన నాయకుల ఆధ్వర్యంలోని విద్యార్థులు పరీక్షా సమయాలలో విద్యార్థులే వాచర్లుగా ఉండాలని కోరడం చూశాను.*

సాంస్కృతీ సమావేశాలకనీ, బెదిరించి చందాలు దండుకొన్నారు. నిజానికి ఆ చందాలు తమసొంత ఖర్చులు చూసుకునేందుకు పనికొచ్చేవి. ఆవిధంగా ఒక యువకుల తరం మొత్తంగా దిగజారిపోయారు. లంచగొండితనానికీ, తదితర అవినీతికర విధానాలకూ లొంగిపోయారు. వాళ్లలోగల అభ్యుదయతత్త్వం అంతరించుకుపోయింది. తమతమ స్వార్థప్రయోజనాలను సిగ్గులేకుండా గడుపుకునే ముసలి కుక్కల స్థాయికి లేత వయసులోనే ముదిరి దిగజారిపోయారు. మూర్ఖులుగా, జ్ఞానహీనులుగా, భ్రష్టులుగా తయారయ్యారు. సంఘాన్ని పట్టిపీడించే అవగుణాలను సరిచేసే సామర్థ్యాన్ని పోగొట్టుకున్నారు. ఈ నీతిబాహ్యమైన సాంఘిక వ్యవస్థలోవాళ్లు చాలా ప్రయోజనాలను పెంచుకోగా, దానిపై తిరగబడే వాంఛను చంపుకోవలసివచ్చింది.

వాళ్లు చివరకొక మహాభూతంగా తయారయ్యారు. అతితర్వలో చాలా ఎక్కువ ఆశించి కాంగ్రెసుకు లొంగిపోయిన వీళ్లు, ఆదాయాల మార్గాలు సన్నగిల్లడం, అనుకున్న ఉద్యోగాలు దూరానే ఉండి కవ్వించడంతో నిరాశ చెందారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ అత్యధిక సంఖ్యలో గెలుపొందిన మూడునెలలలోనే, అంటే జూలై 72లో–పశ్చిమబెంగాలు యువతలో ప్రచారం పొందుతున్న నినాదం ఒకటి ఉంది. "చీలంనక్సల్, హోలంనాబో, చాక్రీనపాలే, అబర్‌హాబో!" (స్వేచ్ఛగా అనువదిస్తే– "ఒకనాటి నక్సలైట్లం. కొత్తకాంగ్రెసు (అంటే ఇందిరా కాంగ్రెసు) అయాం! ఉద్యోగం దొరక్కపోతే మళ్లీ.....")

సి.పి.ఐ. (మా.లె.) పార్టీలోని నిబద్ధ యువసముదాయాన్ని ఆకర్షించుకునే ప్రయత్నాలు సి.పి.ఐ. సాయంతో జరిగాయి. నాటి దేశీయాంగశాఖ సహాయమంత్రి కె.సి.పంతును ప్రతిధ్వనిస్తూ ఒక సి.పి.ఐ. సిద్ధాంతి 1971 నవంబరులో ఇలా అన్నాడు".... నక్సలైటు పంథాను ఎన్నుకున్న ఈ ఓరిమిలేని యువకులతోనూ విద్యార్థులతోనూ ఏదో ఒకరకమైన చర్చకాని, సంప్రదింపు కాని సాధ్యం....." వాళ్ల హింసాయుతపంథాను ఎన్నుకున్న ఈ ఓరిమిలేని యువకులతోనూ, విద్యార్థులతోనూ ఏదో ఒక రకమైన చర్చకాని, సంప్రతింపు కాని సాధ్యం....."[36] వాళ్లు హింసాయుత పంథాను విడనాడాలని ప్రోత్సహించేందుకు ఆశతో ఇలా అన్నాడు. "నక్సలైట్లలోని విప్లవకారులనూ అభ్యుదయవాదులనూ, విప్లవ పట్టాల నుంచి తొలగిపోయి, సమకాలీన మావోయిజపు బురదలో కూరుకుపోయిన సాటి విప్లవకారులుగా సి.పి.ఐ. గుర్తిస్తుంది." నక్సలైట్లకూ సి.పి.ఐ.కూ గల ఉమ్మడి సంబంధంగా 'అభ్యుదయా'న్ని పేర్కొంటూ, అదే భావికాలానికి 'ఆశాజనకం'గా పేర్కొంటూ ఇలా ముగించాడు. "ఈ ఆశ ఫలించాలంటే మావోయిజానికి భారతీయ ప్రతిరూపమైన నక్సలిజాన్నుంచి నక్సలైట్లు తమ్ము తాము పరిరక్షించుకోవాలి."

లొంగిపోయే 'నక్సలైట్ల'పై ప్రభుత్వం కేసులను ఉపసంహరించుకుంటుందని 1971లో పంజాబు ముఖ్యమంత్రి జైల్‌సింగు ప్రకటించాడు. ఏ కొద్దిమందో మినహా జైళ్ల బైటా వెలుపలా గల నిబద్ధులైన సి.పి.ఐ. (మా.లె.) పార్టీ యువకులు మాత్రం ప్రభుత్వం నుంచీ ఇతర అనధికార స్థాయిలనుంచీ జాలువారే ఆ వాలు చూపులకు లొంగలేదు.

## ఆదాయాల పునఃపంపిణీ

1969 తరువాత ఇందిరాగాంధీ అనుసరించిన విధానాలన్నిటివల్లా, ధనవంతుల జేబులకు చిల్లుపడకుండా, ప్రజలల్లో కొన్ని విభాగాలకు రాయితీలు కుమ్మరించడమే జరిగిందని చూశాం. కాని అట్టి తాత్కాలిక చర్యలు కొన్ని విభాగాల అశాంతినే చల్లార్చాయి. ఆర్థిక పెరుగుదలకు సంబంధించిన మౌలిక సమస్యను అవి పరిష్కరించలేదు. కనీస జీవన స్థాయికిందున్న ప్రజల ఆదాయాలు పెరగాలి. అటువంటి జీవన స్థాయి పెరుగుదలకు సంబంధించిన తిండి గింజలు, నూనె గింజలు, బట్ట, ఇంధనం వంటి సరుకుల ఉత్పత్తి కూడా పెరగాలి. U-సెక్టార్‌కు సరఫరా చేసే వినియోగ వస్తువుల ఉత్పత్తి విధానం మారి, జీవన అవసరాలకు పనికి వచ్చే వస్తూత్పత్తికి మారడం అందుకు అవసరమౌతుంది. అలా చేయడమంటే, పై నున్న కొద్దిమంది భాగ్యవంతుల జీవన సరళిపై దాడి చేయడమే. పైనున్న కొద్దిమంది ప్రయోజనాలను పరిరక్షిస్తూ, అధికారంలో ఉన్న ఇందిరాగాంధి తన గద్దె నిలుపుకోవాలంటే అటువంటి పని తలపెట్టకూడదు.

ఆర్థిక పెరుగుదల హెచ్చు స్థాయిలో జరగాలంటే, పెట్టుబడి స్థాయి కూడా పెరగాలి. దేశం లోపలి వనరులనే సమీకరించాలంటే. గ్రామ ప్రాంతంలోని ఫ్యూడలు భూస్వాములు నగర ప్రాంతంలోని పారిశ్రామిక బడా పెట్టుబడిదారులూ ఎదురుగానే ఉన్నారు. గతంలో లాగే 1969 తరవాత కూడా సోషలిజపు నినాదాల మాట అటుంచి, పెద్ద భూస్వాముల నుంచీ, బడా పారిశ్రామిక వేత్తల నుంచీ మిగులును సమీకరించేందుకు ప్రభుత్వం ముందుకు రాలేదు.

ధనిక రైతులను సంతృప్తిపరచే ప్రభుత్వం, ఏటేటా మరింత హెచ్చు సేకరణ ధరకు (Procurement Price) వాళ్ల నుంచి ఆహార ధాన్యాలను కొంటోంది. బడా పారిశ్రామిక వేత్తలను సంతోషపెట్టేందుకై అదే ప్రభుత్వం, వాళ్లు శ్రమశక్తిని ఇతోధికంగా దోచుకుంటూ సాధించుకున్న అధిక లాభాల ద్వారా మిగులు విలువను పెంచుకోనిచ్చింది. క్రమంగా కొనుగోలు శక్తిని పెంచుకునే అతి చిన్న ప్రజా విభాగపు

అవసరాలకనుగుణంగా తీర్చిదిద్దిన పారిశ్రామికోత్పత్తులను, తమ వస్తువులను, ఈ కొద్దిమంది ధనవంతులకూ ఈ పారిశ్రామికవేత్తలు అమ్ముకుంటున్నారు. గ్రామప్రాంతంలోనూ, నగర ప్రాంతంలోనూ పెరిగే అసంతృప్తి తీవ్రప్రమాదంగా పరిణమిస్తోంది. దానికి సైనికపరమైన అణచివేత ఒకటే చాలదు. ఆర్థికపరమైన అడ్డుకట్ట కూడా వెయ్యాలి. అప్పుడే (పాలకవర్గాలు) తాము తీసుకువస్తామని ప్రజలకు వాగ్దానం చేసిన 'సోషలిజం' కాని, 'ప్రజాస్వామిక సంక్షేమ రాజ్య' భువన భవన ఛాయలతో కాని, ప్రజలను మభ్యపరచే వీలవుతుంది!

ఆ పరిస్థితిలో ధనవంతుల వనరులకు ముప్పు రాకుండా, బదుగు వర్గాలలో కొందరికి ఉపాధి కల్పించి, మరిన్ని సాంఘిక సంక్షేమ పథకాలను చేపట్టాలంటే; లోటుబడ్జెట్టు విధానం*, విదేశీ సహాయం, దిగుమతులపై ప్రభుత్వం ఆధారపడాలి. లోటు బడ్జెటు విధానం ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. 1971 దాకా 3 లేక 4 శాతం మేరకు పెరుగుతూ వచ్చిన ధరలు 1972లో 20 శాతం పెరిగాయి. 1973లో 26 శాతం పెరిగాయి. 1973లో ఆహార ధాన్యాలు 50 నుంచి 80 శాతం దాకా పెరిగాయి.

1973 డిశెంబరులో ప్రభుత్వం తన ఐదవ పంచవర్ష ప్రణాళిక రూపొందించింది. పాఠశాలలు, గ్రామీణ ఆరోగ్య పథకాలు, నీటి సరఫరా భూమిలేని వారికి ఇళ్ళ స్థలాల పంపిణీ, మురికివాడల నిర్మూలన, గ్రామీణ విద్యుదీకరణవంటి కనీసావసరాల పథకాలకు కావలసిన నిధులు కూడా విదేశీ సహాయం, లోటుబడ్జెటు విధానాల నుంచే ఆశించి, రూ. 28030 కోట్లు వాటికై కేటాయించారు. ఇతర మార్గాలలో వనరులను సమీకరించడంలో ప్రభుత్వం విఫలమైనందుకు నిరసనగా ప్రణాళిక సంఘం నుంచి రాజీనామా చేసిన ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త బి.ఎస్.మిన్హాస్ డిసెంబరు 5న మాట్లాడుతూ, "తీవ్రమైన భూసంస్కరణలు హెచ్చుగా నున్న వ్యవసాయాదాయాలపై పన్నులు విధించడంతో" సహా, అసమానతలపై మరింత ధృడమైన దాడి జరిగితే కాని, ప్రణాళిక యొక్క గొంతెమ్మ కోర్కెలన్నీ "ఇతోధికమైన ద్రవ్యోల్బణానికి దారితీసే భారీ స్థాయి లోటుబడ్జెటు విధానం" అవలంభిస్తేనే సాధ్యమౌతాయన్నాడు. పరోక్షపు పన్నుల రూపంలో కూడా మరిన్ని వనరుల సమీకరణను ప్రణాళిక ఆశించింది. అటువంటి పరోక్షపు పన్నుల భారమంతా చివరకు వినియోగదారులే చెల్లించుకోవాలి. బీదప్రజలు, మధ్యతరగతి ప్రజలు, తమదైనందిన జీవనపు వినియోగ వస్తువుల

---

* *ట్రెజరీబిల్లులను (రూ. 25,000/- అంతకు ఎక్కువ విలువలో) జారీ చేసి రూపాయి నోటు నాణెములను సరఫరా చెయ్యడం ద్వారా రిజర్వు బ్యాంకు ప్రభుత్వానికి కల్పించే పరపతి విధానాన్నే స్థూలంగా లోటుబడ్జెటు విధానంగా చెప్పొచ్చు.*

ధరల రూపంలో ఆ బరువు మోయాల్సి వచ్చింది.

## విదేశీ సహాయం

ప్రభుత్వ సంక్షేమ పథకాలకూ ప్రణాళికలకూ పోషణ జరిగే మరో మార్గం; అగ్రరాజ్యాల దయా దాక్షిణ్యాలతో వచ్చే విదేశీ సహాయం.

భారతదేశానికి అతిపెద్ద రుణదాత అమెరికాయే. 1971 నాటి పాకిస్తాను యుద్ధం కారణంగా అమెరికా పాకిస్తానుపట్ల పక్షపాతవైఖరి నవలంబించి మన దేశానికి సహాయాన్ని నిలుపు చేసింది. విజయం తలకెక్కిన మత్తులో అమెరికా సహాయాన్ని నిరాకరించాలనే ప్రలాపాలు కూడా వినిపించాయి. కాని ఆర్థిక పెరుగుదలకు అదే అడ్డదారి. ఆ విదేశీ సహాయంపై మోజు వదులుకోవడం కష్టమే! ఆ సాయానికి సోవియటు యూనియన్ ఒక్కదానిపైనే ఆధారపడడం కూడా మంచిది కాదు. అమెరికా ప్రభుత్వం భారతదేశాన్ని అధికారపరంగానే వ్యతిరేకించింది. 1971 సంవత్సర కాలంలో చాలా మంది అనధికార వార్తాహరులు దేశాన్ని సందర్శించి ఇందిరా గాంధీకి మద్దతు తెలిపారు. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ అప్పుడు ఇలా వ్యాఖ్యానించింది. "భారతదేశానికి సోషలు సామ్రాజ్యవాదుల మద్దతు" బహిరంగంగా ఉండి, అమెరికా అండదండలు మాత్రం "బహిరంగంగానూ రహస్యంగా"నూ కూడా ఉన్నాయి. ఆ కాలంలో సెనేటర్లు కెన్నెడీ, ఆడ్లాయ్ స్టీవెన్‌సన్‌ల భారతీయ పర్యటనను నిదర్శనంగా పేర్కొంది.[37]

1971 నాటి యుద్ధ జ్వాలలు చల్లారలేదు. 1972 జనవరిలో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు రాబర్ట్ మెక్‌నామరా ఇండియా వచ్చాడు. రాబోయే ఐదు సంవత్సరాలలో బాంకు భారతదేశానికిచ్చే పరపతిని రెట్టింపు చేస్తుందని ప్రకటించాడు. ఆ బ్యాంకు చాలా వరకు అమెరికా చెప్పుచేతలలోనే నడుస్తుంది. అమెరికా విదేశాంగ వైఖరిలో భాగంగానే దాని వైఖరి పరిగణించవచ్చు. 1966లో చేసిన రూపాయి విలువ తగ్గింపులో (Devaluation) బాంకు వత్తిడి కూడా ఉందని గమనించాలి. ఆ తరవాత అంటే 1972 ఫిబ్రవరి 1వ తేదీన అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ* (International Development Agency - IDA) భారతదేశంలో ఎరువుల ఉత్పత్తికి 58 మిలియన్ల డాలర్ల రుణసహాయాన్ని మంజూరు చేసింది.**

---

* *ప్రపంచ బ్యాంకుకు అనుబంధ సంస్థ.*

* *రూపాయి విలువ తగ్గింపు వంటి చర్యలు అంతర్జాతీయ ద్రవ్యనిధి (International Monetary Fund) IMF సలహాపై తీసుకుంటారు. – అను.*

త్వరలోనే భారత ప్రభుత్వం కూడా అమెరికా పట్ల తన దాస్యాన్ని కనపరచింది. దాని వలస వాదతత్త్వ వైఖరులను అమెరికా నిరసించిన తరవాత ఆ పునరుద్ధరణ జరిగింది. న్యూఢిల్లీలో జరిగిన 'ఐక్య ఆసియా అసెంబ్లీ' (One Asia Assembly) మహాసభలో 1973 ఫిబ్రవరి 6వ తేదీన ఇందిరాగాంధీ తన ప్రసంగంలో ప్రజాస్వామ్యం పట్ల (అమెరికా) వ్యక్తం చేసిన ప్రేమకు, వియత్నాంలో భారీ స్థాయిలో నెరపుతున్న బాంబులదాడికీ పొత్తెలా కుదురుతుందని వ్యంగ్యంగా అమెరికాను ఎత్తిపొడిచింది.[38] వెంటనే ఈ ప్రసంగం పట్ల అమెరికా నిరసన తెలిపింది. ప్రెసిడెంటు నిక్సను దిగ్భ్రాంతి చెందాడు. కొత్తగా భారతదేశానికి రాయబారిగా నియమితుడైన డేనియల్ పాట్రిక్ మాయేనిహాన్ ముందే పెట్టుకున్న ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నాడు.[39] ఋణదాత కోపాన్ని చవి చూచిన ఇందిరాగాంధీ కొంచెం తలవంచింది. న్యూఢిల్లీ ఉపన్యాసం జరిగిన మూడు రోజులలోగానే, ఫిబ్రవరి 9వ తేదీన ఖాట్మండులో మాట్లాడుతూ, వియత్నాంపై తన మాటలు "ఏ దేశాన్ని విమర్శించే ఉద్దేశం"తో అనలేదని ఇందిరాగాంధీ క్షమాపణ చెప్పుకుంది.[40]

భారతీయ గులాముల సలాములను అమెరికా గుర్తించింది. 1971 డిసెంబరులో నిలుపు చేసిన అత్యవసర దిగుమతుల (Priority Imports) కై కేటాయించిన 87.6 మిలియన్ల డాలర్ల అభివృద్ధి ఋణాన్ని విడుదలకై నిర్ణయించి ఆ సంగతిని 1973 మార్చి 15వ తేదీన ప్రకటించింది. అంతర్జాతీయ అభివృద్ధి విభాగపు సహాయ పాలనాధికారి డి.జి. మేక్డనాల్డు ఆ నిర్ణయంలోని ఆంతర్యాన్ని తెలుపుతూ, ఆ సహాయం వల్ల "అమెరికన్ ఆర్థిక సహాయానికి తగిన సరుకులు సేవలు" అందుతాయన్నాడు. ఆ సందర్భంలో భారతదేశానికి ఎరువుల అవసరాన్ని కూడా పేర్కొన్నాడు. అమెరికన్ ప్రైవేటు సంస్థల నుంచి ఇండియా అధిక ధరలను చెల్లించి ఆ ఎరువులను కొనుక్కోవాలి.

ప్రపంచ బ్యాంకు మొదలగు సంస్థల నుంచి 1972-73 సంవత్సరాలలో భారత దేశానికి దొరికిన విదేశీ సహాయం 1973 మార్చి నెలాఖరుకు రూ 742 కోట్ల రూపాయిలైంది. గత సంవత్సరంలో ఆ మొత్తం రూ. 722 కోట్లు. పాకిస్తానుపై గెలిచాక లేవదీసిన స్వయం పోషక నినాదపు నకిలీ కిరీటపు ఇమిటేషన్ జిలుగు తగ్గిపోయింది. సొంతగూని నడుంతో, పాత బానిస రూపం బట్టబయలైంది. ఈ మార్పుకు అమెరికా సంతోషించింది. 1974 అక్టోబరులో భారతదేశాన్ని సందర్శించిన అమెరికన్ విదేశాంగ కార్యదర్శి హెన్రీకిస్సింగర్ ఇండో-అమెరికన్ సంబంధాల గురించి ఇలా అన్నాడు. "... తరుచుగా (వచ్చే) మా వివాదాలన్నీ కుటుంబపు పొరపొచ్చాలు వంటివి"[41] మరో విదేశాంగ కార్యదర్శి జాన్‌ఫాస్టర్ డల్లెస్ ఇరవై ఏళ్ళ కిందట సరిగ్గా

ఇదే అన్నాడు.

అమెరికా తరవాత మనకు మరో ప్రముఖ రుణదాత సోవియట్ యూనియన్. 1981 నాటి ఇండో సోవియట్ ఒడంబడిక, దాని అనుబంధ ఒప్పందాల వల్ల భారత దేశంలో అమెరికాది కింద చెయ్యి అయ్యే ప్రమాదం కూడా వచ్చింది. 1973-74లో ఇండియా సోవియట్ రష్యా అందజేసిన ఋణ సహాయం రూ. 139 కోట్లు. కాని నాటికే సోవియట్ యూనియన్‌కు అసలు వడ్డీలు రూ. 56.70 కోట్లు ఋణపడి ఉన్నాం. 1962లో మొదలైన ఈ ఋణసహాయం తరువాత పది సంవత్సరాలలో భారీ స్థాయికి చేరింది. ఆయుధాలు, యుద్ధ నిపుణులు దౌత్యపరంగానూ ఇండియా సోవియట్ యూనియనుపై ఎంతగా ఆధారపడిందో 1971 ఇండో-పాక్ యుద్ధ కాలంలో కనిపించింది. తూర్పు పాకిస్తాను సమస్యపై అంతర్జాతీయ సమితి (సమావేశంలో) భారత్‌కు అనుకూలంగా సోవియట్ రష్యా వీటోను ప్రయోగించింది. హిందూ మహాసముద్రంలోని అమెరికన్ సప్తమ నౌకాదళ ప్రమాదాన్నించి భారతదేశాన్ని రక్షించింది. ఆయుధాలు, విమానాలు, యుద్ధనౌకలు దిగుమతి చేసుకోవడంతో సరిపోలేదు. ఆ కీలక సమయంలో ప్రముఖ సోవియట్ దౌత్యాధికారులు భారత ప్రభుత్వానికి యుద్ధ నిర్వహణలో సలహా సహాయాల నందించారు. సోవియట్ ఉపవిదేశాంగమంత్రి, వార్సా సంధి సంస్థ ప్రధాన కార్యదర్శి ఐన నికొలాయ్ ఫిర్యూబిన్, సోవియట్ ఎయిర్ మార్షలు పి.ఎన్. కౌటుకోఫ్‌లు ఆ సమయంలో భారతదేశాన్ని సందర్శించారు.

భారతదేశం 1973 నాలుగో పాదంలో తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొంది. సోవియట్ యూనియన్ అందించిన 20 లక్షల టన్నుల గోధుమలను అప్పుగా స్వీకరించింది. ఖరీఫ్ పంట దిగుబడి బాగానే ఉంది. ప్రభుత్వం రైతులకు అధిక సేకరణ ధరలను ఇవ్వడానికి కూడా సిద్ధపడింది. అయినా పెద్ద భూస్వాములు ప్రభుత్వానికి గోధుమలు అమ్మలేదు. ఆ విధంగా ఆ కొరత కృత్రిమమైనదే. స్వేచ్ఛావిపణిలో ధర పెరుగుతుందనీ, లేదా మరింత హెచ్చు సేకరణ ధర రావచ్చని వాళ్ళు గోధుమ దాచి పెట్టారు. 1973 నాటికి ప్రభుత్వం 50 లక్షల టన్నుల గోధుమలను సేకరించింది. ప్రభుత్వం సేకరించాలనుకున్న పంట 81 లక్షల టన్నులు.

ఆర్థిక పెరుగుదలకు సులభ మార్గంలో పునాది వెయ్యాలంటే భారత పాలక వర్గాలకు ఒక పరిష్కారం; మరింతగా విదేశీ ఋణాన్ని సహాయాన్ని పొందడమే. దేశంలోని ఆంతరంగిక వైరుధ్యాలను పరిష్కరించి, ఆర్థికాభివృద్ధి సాధించడం కష్టతరమైన పద్ధతి. అందుకని భావిలో కూడా భారత దేశం (పోటీపడుతున్న)

సోవియట్–అమెరికన్ దయాదాక్షిణ్యాలపై చాలా రంగాలలో ఆధారపడుతుంది. భారత పాలకవర్గాలు కూడా తాత్కాలికంగా లాభాన్ని పొందుతాయి. తరచు వచ్చే ఆర్థిక సంక్షోభాలకు అలాంటి సహాయంతో ఉపశాంతి తెచ్చి తరచు తలెత్తే తీవ్రపరిస్థితులకు తాత్కాలిక ఏర్పాట్లతో ఎదుర్కోవడం జరుగుతుంది.

## భారత ప్రభుత్వపు భరత నాట్యం

గత సంవత్సరాలలో సంచలనాత్మక జిలుగు వెలుగులలో జిగేలుమనిపించిన ప్రభుత్వ విధానాల నిజస్వరూపం. ఎమ్యూజ్‌మెంటు పార్కులోని బూతుడాన్సులా క్రమంగా అసలు రంగును బయటపెట్టుకుంటున్నాయి. ఆశయాల విలువల్ని నడిబజార్లో విప్పుకొని జుగుప్సాకరంగా రాక్షసలాస్యం చేస్తున్నాయి.

నినాదాలు, సంక్షేమ చర్యలు తెరచాటుకు తప్పుకుంటున్నాయి. దేశం యొక్క 'అర్ధవలస' అర్ధవ్యూడలు స్వభావం పురివిప్పుకుంటోంది. 'బడా భూస్వాముల' 'కాంప్రదార్ బ్యూరోక్రటిక్ పెట్టుబడిదారుల' ఆధీనంలో కొట్టుకుంటున్న దేశ సామాజికార్థికపు అంగాలు కొన్ని వాచి; మరికొన్ని కృశించి పుల్లలై పోగా, వికృతమైన ఆర్థిక వ్యవస్థ రంగంపై ఆసికాలాడుతోంది. కమ్యూనిస్టు విప్లవకారులు ఇదే ఆర్థిక వ్యవస్థపై తమ దాడిని (అప్పటికే) ప్రారంభించారు.

భారత ప్రభుత్వం గతంలో ప్రకటించుకున్న మేరకు 1974 గోధుమ పంటపై టోకు వ్యాపారాన్ని రద్దు చేసింది. దాంతో స్వేచ్ఛావిపణిలో భూస్వాములు అధిపతులయ్యారు. క్వింటాలుకు రూ. 71 నుండి రూ. 82కు కొనుగోలు ధరను పెంచి అధిక ధరలకై ఆందోళన చేసే గోధుమ పండిస్తున్న బడా భూస్వాములను తృప్తిపరిచింది. ఆ సెప్టెంబరులోనే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ధాన్యం కొనుగోలు ధరను రూ. 74 నుంచి మరింత పెంచాలనుకున్నాయి. వ్యవసాయ వస్తువుల ధరల సంఘం (Agricultural Prices Commissions) అంతకుముందే కొనుగోలు ధరను "24 నెలలో రూ. 74 నుంచి రూ. 100కు పెంచడం వల్ల ద్రవ్యోల్బణానికి ఆజ్యం" పోసినట్టేనని హెచ్చరించింది కూడా. ఆ సమయంలోనే గుజరాత్, ఒరిస్సా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర బెంగాలు రాష్ట్రాలు దారుణమైన కరువు కౌగిలిలో అల్లాడాయి. మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రజారోగ్య ఇంజనీరింగ్ శాఖల ఉపమంత్రి కె.ఎల్.కసోరియాకు రాయపూర్ జిల్లా పర్యటనలో బీదరైతులు భూమిలేని రైతులు (ప్రభుత్వ) సహాయాన్ని కోరుతూ, తాము తినే "గడ్డి విత్తనాలను" బహుమతిగా ఇచ్చారు.[42]

గతంలో విదేశీ ఆధిపత్యంపై చూపిన కోపతాపాలు పారిశ్రామిక రంగంలో కూడా

సన్నగిల్లాయి. ప్రభుత్వం 1974 జూలై నాటికి విదేశీ సహకారంతో నెలకొల్పే 113 పరిశ్రమ (సంస్థ)లకు అనుమతినిచ్చింది. 26 ఒప్పందాలను కుదుర్చుకున్న అమెరికా అగ్రస్థానంలో ఉంది. ఈ పరిశ్రమల ద్వారా రెడీమేడ్ దుస్తులు. తోలువాచీపట్టీలు, రిస్టువాచీలు, ఆట వస్తువులు మొదలైన వినియోగ వస్తువులు తయారవుతున్నాయి. ఈ ఉత్పత్తి విధానం, సంపన్నవర్గాల వినియోగావసరాలకే కొమ్ము కాస్తుంది. ఈ వస్తువుల తయారీకి కావలసినంతవరకు దేశీయంగా లభించే సాంకేతిక పరిజ్ఞానం విషయంలోనైనా ఖరీదైన దిగుమతి (వి) భాగాన్ని కుదించుకునే ఉద్దేశ్యం కనపడలేదు.

ఈ వీధి భాగోతాన్ని రక్తి కట్టించేందుకు ఇందిరాగాంధి మాత్రం ఎడతెరిపి లేకుండా కొత్త కొత్త అంశాలను ప్రదర్శిస్తూనే ఉంది. అటువంటి అంశాలలో తరచు మంత్రి వర్గపు మార్పులు కూడా ఒకటి. * అలా మార్పులు జరిగినప్పుడు కొందరు మంత్రులు పదవిని కోల్పోవడమో హోదా తగ్గడమో మామూలు విషయం. మరికొందరు మంత్రులు నియమితులవడం మామూలే. ప్రత్యర్థులు మాత్రం ఆయా మార్పులు ఎందుకు జరిగాయో, చిలవలు పలవలుగా రాజకీయ ఊహాగానాలు చేస్తూ, కొత్త మంత్రులు 'ప్రగతి నిరోధకులా' 'అభ్యుదయవాదులా' అని జుట్లు పీక్కుంటూ కాలం వెళ్ళ బుచ్చేవారు. దొంగలాటకు బాజాలు వాయించేవారు.

దేశ సరిహద్దులకవతల కూడా అటువంటి రాజకీయ సంచలనాలను కలిగించడంలో ప్రభుత్వం పాత్ర వహించింది. బూర్జువా ప్రజాస్వామ్య సాంప్రదాయకపు విలువల దృష్ట్యా, బంగ్లాదేశ్‌లోని సైనిక నియంతృత్వం వెనుకబడిన ప్రభుత్వ రూపమే. సిక్కింలో కూడా ఫ్యూడలు రాజరికమే అమలులో ఉంది. తూర్పు బెంగాలు సిక్కిం ప్రజల కడగండ్లపై అపార శ్రద్ధను కనపరుస్తున్నట్లు నటించిన భారత ప్రభుత్వం, బంగ్లాదేశ్‌లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని (యుద్ధం చేసి మరీ) స్థాపించింది. సిక్కింకు అనుబంధ ప్రతిపత్తిని ప్రసాదించింది. ప్రజాస్వామ్య చరిత్రలోనే ఘనతకెక్కిన ముందంజలుగా ఈ రెంటినీ చెలామణీ చెయ్యడానికుపక్రమించింది. రెండు దేశాలలోనూ కొనసాగే ఫ్యూడలు భూ సంబంధాలను, వలస దోపిడీని (ఎవరైనా వాటిని చూసే ప్రయత్నాన్ని) ఆ చర్యలు (కొంతవరకు) మరుగుపరిచాయి.

* *1971 నాటి పార్లమెంటరీ ఎన్నికల తర్వాత, 1974 నాటికి ఇందిరాగాంధీ ఏడుసార్లు కాబినెట్ మార్పులు చేసింది.*

## దేశవ్యాప్తంగా ఆందోళన

చెట్లు విశ్రాంతి కోరుకున్నంత మాత్రాన గాలి ఆగదు* ఆకలి గొన్న ప్రజ మళ్ళీ కలత చెందుతోంది. 1972 నాటి గరీబీ హటావో నినాదాల జోల పాటతో నిద్రపోయిన ప్రజావళి; 1973 నాటికి జోలపాట ఆగిపోగా, మళ్ళీ విలపించసాగారు.

1969 తరువాత రంగులు పులుముకున్న పాలకవర్గాల సుందరాకారంతో మొహమ్మోత్తిన మొదటి ఛాయలు 1973 నాటి రాష్ట్ర సాయుధ పోలీసు దళపు Provincial Armed Constabulary-PAC తిరుగుబాటులో కనిపించాయి. 1947 అధికార మార్పిడి తరువాత అలాంటి తిరుగుబాటు జరగడం అదే మొదటిసారి. అప్పటికే దేశంలోని అనేక ప్రాంతాలలో ఆహారపు ఆందోళనలు (Food riots) కూడా మొదలయ్యాయి. 1973 ఏప్రిలు 17 తేదీ నుంచి 21వ తేదీ వరకూ నాగపూర్ (మహారాష్ట్ర)లో ఆహారానికై చేసిన ప్రదర్శనలలో తీవ్రమైన ఘర్షణలు కూడా జరిగాయి. అహమ్మదాబాదు (గుజరాత్) ప్రజలు ఆహారపు గోదాములపై దాడి చేసారు. ప్రభుత్వ భవనాలకు నిప్పెట్టారు. ఇది 1973 జూలై 14నాటి సంగతి. ఆహారానికై ఆందోళన జరిపి కేరళ ప్రజలపై ఆగస్టు నెలలోనే పోలీసులు కాల్పులు జరిపారు. కార్మిక వర్గం కూడా రంగంలోకి దూకింది. మే నెలలో లోకో రన్నింగ్ సిబ్బంది చర్యతో కొత్తమలుపు వచ్చింది. సాంప్రదాయికపు కేంద్ర ట్రేడ్ యూనియన్ సంస్థల నాయకత్వాన్ని కాదని వాళ్ళు కొత్తతరం నాయకుల కింద సంఘటితమై ఆ సమ్మె చేసారు. నాయకులు రహస్య జీవనం నెరపుతూ సమ్మె నిర్వహించారు. ఏ విధమైన కోర్కెలనూ (ప్రత్యేకంగా పురస్కరించుకుని ఆ సమ్మె జరగలేదు. పని గంటల తగ్గింపుకై ఆ సమ్మె (ప్రధానంగా) జరిగింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలతో కొంతకాం సాగాక ఆ సమ్మె విరమించుకున్నారు. కాని 1974 మొదట్లో మళ్ళీ మొదలైంది.

1973 దాటి 74 వచ్చే సరికి 'దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళన', చారుమజుందారు జోస్యాన్ని (వ్యంగ్యంగానైనా) నిజం చేసింది. ఆహార సరుకుల ధరలు పెరుగసాగాయి. జనవరి నెల మొదట్లో గుజరాతు మహారాష్ట్రాలలో ఆహారపు ఆందోళనలు మొదలయ్యాయి. జనవరి 3వ తేదీన నాగపూరు బహిరంగ సభలో ప్రజలు నినాదాలిచ్చి, ఏకధాటిగా గెలిచెయ్యడంతో, ఏర్పడిన అల్లరి వల్ల ఇందిరాగాంధీ ప్రసంగాన్ని విరమించుకుని, సమావేశాన్ని వదిలిపెట్టి పోయింది.

---

* *వర్గపోరాటాలుంటూనే ఉంటాయని మావో చెప్పినట్టు జూన్ 2, 1966 నాటి పీపుల్స్ డైలీ ఉదహరించింది. (చూ॥ జెరోమ్‌ఛెన్ – మావో పత్రాలు ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయం ప్రెస్సు – ఇండియా 1971)*

కాలేజీ కేంటీన్లలో నానాటికీ పెరిగే బిల్లులకు నిరసనగా అహమ్మదాబాదు విద్యార్థుల ఆందోళన గుజరాత్‌లో అశాంతికి నాంది పలికింది. అధికాహారం, ఆహార సరుకుల ధరలు తగ్గింపు, అవినీతి ఆరోపణలున్న ముఖ్యమంత్రి రాజీనామాలనూ కోరుతూ. ఆ ఆందోళన త్వరలో మహోధృత ప్రజా ఉద్యమంగా మారింది. జనవరి 10 నుంచి 27వ తేదీ దాకా దాదాపు గుజరాత్‌లోని అన్ని పట్టణాలలోనూ గ్రామాలలోనూ ఆహార ధాన్యాల దోపిడీ, ప్రభుత్వ ఆస్తుల దహనకాండ, పోలీసులతో తలపడి తుపాకులు లాక్కోవడం జరిగాయి. జనవరి 27వ తేదీన సైన్యాన్ని దించి పరిస్థితిని కొంత వరకూ అదుపులోకి తెచ్చుకున్నారు. ముఖ్యమంత్రి చిమన్‌భాయ్‌పటేల్ ఫిబ్రవరిలో రాజీనామా చేసాడు. రాష్ట్రపతి పాలన విధించాక కూడా, ఫిబ్రవరి మార్చి మాసాలలో, పోలీసులతో తరచు తీవ్ర ఘర్షణలు సాగుతూనే ఉన్నాయి.

ఆ సంవత్సరం జనవరి, ఫిబ్రవరి మాసాలలో రాష్ట్ర జనాభాలో 9వ శాతం ఉన్న నిమ్నజాతి ప్రజలు మహారాష్ట్రలో ఎదురు తిరిగారు సాంఘికంగానూ, ఆర్థికంగానూ పీడనకు గురవుతున్న "నిమ్నజాతి ప్రజలు" "దలిత్ పాంథర్ల' (దళిత=అణగారిన, పాంథర్లు=చిరుత పులులు అమెరికాలోని 'బ్లాక్ పాంథర్ల' ఉద్యమం నుంచి గ్రహించబడినది) – నాయకత్వంలో తమ హక్కుల పోరాటాన్ని మొదలెట్టారు. అగ్రవర్ణాలకు చెందిన వర్తకులు వ్యాపారస్తులవంటి పాలకవర్గాల ప్రజలతో వాళ్ళు తలపడ్డారు. పోలీసులు అగ్రవర్ణస్తుల కొమ్ము కాచారు. ఎప్పటిలాగే దోపిడీదార్లకు ప్రభుత్వ అండదండలు కల్పించింది. త్వరలోనే ఆ ఘర్షణలు వర్గపోరాట లక్షణాన్ని సంతరించుకున్నాయి. అన్ని రకాల పీడిత ప్రజలనూ ఏకం చెయ్యాలని దళిత పాంథర్ల మానిఫెస్టో కోరింది. పీడిత ప్రజల ఉద్ధరణ అనేది ప్రస్తుత రాజకీయ వ్యవస్థ పరిధిలో సాధ్యం కాదు కాబట్టి, ఎన్నికల బహిష్కరణకు కూడా (దళిత పాంథరు నాయకత్వం) పిలుపునిచ్చింది. తరువాతి కాలంలో బొంబాయి నార్త్ పార్లమెంటరీ నియోజక వర్గంలో జరిగిన ఎన్నికలలో పై నిర్ణయాలకు కట్టుబడ్డ దళిత జాతి ప్రజలు ఓటు చెయ్యలేదు.

ఆ సంవత్సరం మార్చిలో అధిక ధరలకు, ఆహార ధాన్యాల కొరతకు, రాజకీయాలలో పెచ్చరిల్లుతున్న అవినీతికి నిరసనగా బీహారు విద్యార్థులు జరిపిన ఆందోళనలో పోలీసులతో తీవ్ర ఘర్షణలు జరిగాయి. మిగతా ప్రజలు కూడా విద్యార్థులతో పోలీసులు పరిస్థితిని అదుపులో పెట్టలేనందున సైన్యం రంగంలోకి వచ్చింది. 1974 ఆగస్టు–సెప్టెంబరు మాసాలు మొదలుకొని కరువు వాత బడ్డ ప్రజలు ఇళ్ళ నుంచి రైళ్ళ నుంచి ఆహార ధాన్యాలను దోచుకుంటున్న వార్తలు దేశం నాలుగు చెరగుల నుంచీ అందసాగాయి.

దేశంలో గతంలో ఎన్నడూ కనీ వినీ ఎరుగని రైల్వే సమ్మె కూడా 1974లోనే జరిగింది. 21 రోజుల పాటు రవాణా స్తంభించి పోయింది. ఇతర పారిశ్రామిక ప్రభుత్వ సంస్థల ఉద్యోగులతో సమాన జీతాలను కోరుతూ బోనసును పెంచాలనే కోరికతో ఆ సమ్మె మే 8వ తేదీన మొదలైంది. సమ్మె మొదటి ఎనిమిది రోజులపాటు విజయవంతంగా నడిచింది. సమ్మెదార్లపై దమనకాండను నడుపుతూన్న ప్రభుత్వం ప్రాంతీయ సేన (Territorial Army) సాయంతో రైళ్ళను నడపాలనుకుంది. దాదాపు పాతికవేల మంది రైల్వే ఉద్యోగులను విచారణ లేకుండా అదుపులోకి తీసుకున్నారు. మరెన్నో వేలమందిని బర్తరఫ్ చేసారు. ముఖ్య కేంద్రాలలోని సమ్మెదారుల వసతి గృహాలపై దాడి చేసి పోలీసులు వాళ్ల కుటుంబాలను రోడ్లపై కీడ్చారు. దక్షిణ, దక్షిణ-మధ్య రైల్వేలలో పరిస్థితి 'మెరుగుపడింద'నీ, తూర్పు, తూర్పు-దక్షిణ రైల్వేలలో మాత్రం పరిస్థితి 'అంత బాగా'లేదనీ ప్రభుత్వం మే 14వ తేదీన ప్రకటించింది. పశ్చిమాన బొంబాయి ప్రాంతం స్తంభించింది. దమన చర్యకు బెదరి, రాయితీలు ఆశించినందువల్ల పట్టుదల చెదిరిన నాయకత్వ విభాగం ఊగిసలాడసాగింది. సమ్మె కొనసాగించాలా వద్దా అనే సంగతి ప్రాంతీయ పద్ధతిపై (Zonal basis) నిర్ణయించుకోవలసిందిగా సి.పి.ఐ. నాయకత్వంలోని అఖిల భారత కార్మిక సంఘ సమాఖ్య (AITUC) కార్మికులను కోరింది. చాలా మంది నాయకులు జైళ్లలో ఉన్నారు. మిగతా సాంఘిక - ఆర్థిక రంగాలలో సహకార చర్యలు (అంతగా) జరగలేదు. ప్రభుత్వం ఎటువంటి రాజీధోరణిని కాని సుహృద్భావాన్ని కాని ప్రదర్శించలేదు. ఆ పరిస్థితిలో సమ్మెను కొనసాగించడం వల్ల లాభం లేదనిపించింది. ఎటువంటి షరతులు లేకుండా మే 21వ తేదీన సమ్మె నిలుపు చేసారు. అప్పటికే అనేక ప్రాంతాలలో (Zones) సమ్మె వీగిపోతున్న ఛాయలు కన్పించాయి.

1947 తరువాత మొట్టమొదటిగా జరిగిన ఆ వీరోచిత చర్యలలో పాశవిక దమననీతిని కూడా ఎదురొడ్డి పోరాడగలిగిన కార్మికుల పోరాట వైఖరి వెల్లడైంది. అదీగాక వ్యవస్థను విచ్ఛిన్నం చెయ్యగల వాళ్ల శక్తి సామర్థ్యాలు కూడా ఋజువయ్యాయి. సమ్మె కాలంలో దాదాపు 500 కోట్లు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం పేర్కొంది.

1973-74 నాటి స్థితి పెరుగుతున్న విప్లవాత్మక పరిస్థితిని సూచించింది. గతంలో ప్రజాందోళనలకు దూరంగా నిలచిన గుజరాతు, దక్షిణాదిన మైసూరు వంటి రాష్ట్రాలలో స్వయంచోదితంగా పెల్లుబికిన ప్రజల అసంతృప్తి చారుమజుందారు జోస్యాన్ని (వాస్తవ పరిస్థితి యొక్క మౌలిక పరిణామం మేరకు - అను నిజం చేసింది. "గతంలో ఒకటి రెండు జిల్లాలలోనే ఆందోళనలు చూశాం. రానున్న ఆందోళన మరింత విస్తృత

ప్రాంతాలలో గతంలో కంటె ఉన్నత స్థాయిలో ఉంటుంది."(73)

గుజరాత్ ఉద్యమం, ముఖ్యమంత్రి రాజీనామా తరవాత కూడా కొనసాగింది. రైల్వే కార్మికులు రహస్య జీవనం గడుపుతూ సమ్మె నిర్వహించారు. అహమ్మదాబాదులో పోలీసుల నుంచి తుపాకులను లాక్కున్నారు. దళిత్ పాంథర్లు బొంబాయిలో ఎన్నికలు బహిష్కరించారు. ఇంతవరకూ చట్టబద్ధతలో నిర్బంధించుకున్న ఉద్యమాలు, ఈ లక్షణాల మూలంగా అడ్డకట్టలు తెంచుకుని పొంగి పొరలుతున్నాయనిపించింది. కాని ఆ ఆందోళనలన్నీ ఏకపక్షంగా జరిగాయి. వేరు వేరు కాలాలలో జరిగాయి. ఏక కాలంలో సంఘటితమైన సవాలును ఎదుర్కోవలసిన అవసరం ప్రభుత్వానికి రాలేదు.

గతంలో కూడా అటువంటి అసంతృప్తి, ప్రత్యేకించి అరవైలలో కూడా, దానంతటగా తరచు బయటపడినా, సమీకరించిన దాడి రూపంలో అది బయటపడలేదు. సంఘటితమైన వామపక్ష నాయకత్వం లేకపోవడమే దానికి కారణం. ప్రజలలో రాజకీయ పరిజ్ఞానం తక్కువగా ఉండడం మరో కారణం. 1967 కాంగ్రెసు పరాజయం తరువాత కూడా. తిరిగి 1969లోనూ తన మాటలలో 'సోషలిజం' మసాలాను వేసి ఇందిరాగాంధి కొద్ది వ్యవధిలో చాలా మంది ప్రజల అభిమానాన్ని చూరగొంది. కాలం చెల్లిన నాయక పరంపరను చిత్తు చేసింది.

దేశంలో గల అత్యధిక ప్రజలు మరింత కొనుగోలు శక్తిని కోరుకొన్నారేకాని, రాజకీయ సాంఘిక వ్యవస్థలో మార్పును కోరలేదు. వాళ్ల ఆశలు ఇంకా పార్లమెంటరీ ఎన్నికలపైనే ఉన్నాయి. సాయుధ విప్లవం గురించి వాళ్లింకా ఆలోచించడం లేదు. సి.పి.ఐ.(మా.లె.) పార్టీ ఒక సాయుధ శక్తిగా ప్రజలలో తగినంతగా వేళ్లూనుకోలేదు. చిన్న సంస్థ కావడంతో శతృ తుపాకుల ఉక్కు తెరను చీల్చుకుని, దుష్ప్రచారపు కుత్సిత రాజకీయాల రక్త వైతరణిని దాటి, నొక్కిన కుత్తుక నుంచి తన సందేశాన్ని అత్యధిక ప్రజాబాహుళ్యానికి వినిపించేలా నినదించలేకపోయింది. అందువల్ల అజ్ఞానపుటంధకారపు టంచులలో పోరాడుతున్న ఓటర్లు రాజకీయ భరతనాట్యపు చిందులకు మతిపోగొట్టుకుని, వర్గచైతన్యాన్ని సంతరించుకోలేని దుస్థితిలో పడిపోయి, ఆయా కాలాలలో ఇందిరాగాంధి మెచ్చుకోలు కబుర్లకు లొంగిపోయిన ప్రధానవర్గంగా ఉంటూ, 1971లోనూ 1972లోనూ కూడా ఆమెకు బలాన్ని చేకూర్చారు.

1973-74 నాటి ప్రజా ఆందోళనలు సరియైన నాయకత్వం లేక వీగిపోయాయి. ప్రజల వేదనల నుంచి స్రవించిన కన్నీటిబొట్లను, బాధా స్రవంతులను ఉధృతమైన గంగా స్రవంతిగా మార్చేందుకు తగిన విప్లవాత్మక పార్టీ అవసరం. కల్లోలిత

జీవనంలోంచి కాకతాళీయంగా వచ్చిన భావోద్వేగాలను ఉద్దేశపూర్వకంగా ఆ పార్టీ వ్యక్తపరచాలి.

## 1973-74లో కమ్యూనిస్టు విప్లవకారులు

విప్లవకారుల పార్టీగా వెలుగొందిన సి.పి.ఐ. (మా.లె.) పార్టీ పరిస్థితి 1973-74లో ఎలా ఉంది?

1972 జనవరిలో ఒక పోలీసు అధికారి శ్రీకాకుళంలోని పరిస్థితి గురించి ఇలా అన్నాడు. "…. విప్లవం తగ్గు ముఖం పడుతూన్న శాంతి భద్రతలు నెలకొనగానే గిరిజన సమస్య పరిష్కరించబడిందని అనుకోవడం పొరబాటు. పైలా వాసుదేవరావు, వెంపటాపు భారతి, కురంగి చక్రపాణి, అరిక సోములు, పూర్ణచంద్రగోమంగో* పల్లి పురుషోత్తం రావి దాసు, గణనాధ పాత్రో వంటి రెండవ స్థాయి నాయకులు ఇంకా తిరుగుబాటుదార్లను సమీకరించి, ఇంకా ఆ ప్రాంతంలో సాయుధ పోరాటాన్ని కొనసాగించాలనుకుంటున్నారు.[43] పార్టీ చీలినా కూడా అటువంటి రెండవ తరహా నాయకులు పోలీసు ఉచ్చుల నుంచి దాటుకుని 1973-74 కాలంలో దేశంలో అనేక ప్రాంతాల గ్రూపులను ఏర్పరిచారు. దీనికి తోడు సి.పి.ఐ. (మా.లె.) పార్టీలో చేరని చంద్రపుల్లారెడ్డి నాయకత్వంలోని రెవల్యూషనరీ కమ్యూనిస్టు కమిటీ (ఆర్.సి.సి.) ఆంధ్రలో పనిచేస్తోంది. పశ్చిమ బెంగాలులో కమ్యూనిస్టు విప్లవకారుల మావోయిస్టు కేంద్రం (Moaist Centre of Communist Revolutionaries) తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు.

ప్రతీఘాత విప్లవమే నెగ్గిన వాస్తవ పరిస్థితులలో ఎటువంటి సర్దుబాట్లూ చేసుకోవడానికి తయారుగా లేని చారుమజుందారు ప్రగాఢానుచరులు, ప్రచ్ఛన్నంగా ఉంటూనే, 1973-74 కాలంలో తమ యుద్ధాన్ని కొనసాగించేందుకు శాయశక్తులా ప్రయత్నించారు. 1972 చివరి కాలానికి బీహారులోని పాట్నా జిల్లాలోని పూన్ పూన్ ప్రాంతం ఒక స్థావరంగా రూపొందుతోంది. భూస్వాములను పోలీసు తొత్తులను చంపడంతో పాటు, చారుమజుందారు విప్లవ కమిటీల విషయంలో ఇచ్చిన ఆఖరు సందేశాన్ని అక్కడి కమ్యూనిస్టు విప్లవకారులు అమలు జరిపేందుకు ప్రయత్నించారు.

---

* ఈ రెండు పేర్లూ కూడా ఆంగ్లమూలంలో పురుషోత్తంపల్లి, రాబిదాస్‌గా పేర్కొనబడ్డాయి. రచయిత బెంగాలీ భాషలో పేర్లను అనువదించటం వల్ల కాని లేక బెంగాలీ యాసతో పలికి అలా రాసి ఉంటాడని భావించి వాళ్ల అసలు పేర్లను ఊహించి రాసాను - అను.

ఆ ప్రాంతపు పార్టీ నిర్వాహకుల నివేదిక ఇలా ప్రకటించింది. "విప్లవ కమిటీ నాయకత్వంలో గెరిల్లా స్క్వాడ్ల సాయంతో పూన్ పూన్‌లోని పంట మాసూలు ఉద్యమం మొదలైంది. ఆరు గ్రామాలలో ఆ ఉద్యమం భారీ స్థాయికి చేరుకుంది."[44] ఆ నివేదిక విప్లవ కమిటీ కార్యకలాపాలనిలా వర్ణించింది. "విప్లవ కమిటీలు గ్రామ రక్షణ దళాలను ఏర్పరుస్తున్నాయి. గ్రామ రక్షణ దళాలు విప్లవ కమిటీల నాయకత్వంలో సొరంగాలను నిర్మిస్తున్నారు. పట్టుకున్న పంటను విప్లవ కమిటీలు ప్రజలకు పంచుతున్నారు. మిగులు పంటను నిలువచేస్తున్నారు...." 1973లో పూన్ పూన్ గ్రామాలపై పోలీసులు దాడి చేసారు. విప్లవకారులు ఆ సొరంగాలలో ఆహార ధాన్యాలను భద్రంగా దాచగలిగారు. ఆ సొరంగాలు అవసరమైతే వాళ్లకు పారిపోయేందుకు కూడా ఉపయోగించాయి.

చైనా కమ్యూనిస్టు పార్టీ లిన్‌పియావోను నిరసించింది. 1973 ఆగస్టులో జరిగిన చైనా పార్టీ పదవ కాంగ్రెసులో లిన్‌పియావో "కుట్ర" గురించి తెలిసిన సమాచారం వల్ల చారుమజుందారు ప్రగాఢానుచరులలో విభేధాలు పెరిగాయి. పూన్‌పూన్ ఉద్యమనాయకులలో కార్యకర్తలలో అనేకులు చైనా పార్టీ కథనాన్ని నమ్మారు. కాని పశ్చిమ బెంగాలు సి.పి.ఐ. (మా.లె.) పార్టీ రాష్ట్రకమిటీ మాత్రం లిన్‌పియావోపై ఆరోపించిన నేరాలను నమ్మలేదు. "శతృవుపై ప్రజల మొత్తం శక్తిని సమీకరించి ప్రయోగించేందుకు" గెరిల్లా యుద్ధమొకటే మార్గం అని చెప్పిన లిన్‌పియావో సూత్రీకరణను ఆచరిస్తూనే ఉంది. ఎనిమిదవ కాంగ్రెసు ముందు జరిగినట్టుగానే, రివిజనిస్టులు చైనా పార్టీలో పై చేయి సంపాదించుకున్నట్టుగానే, ఇప్పుడు కూడా జరిగి ఉండవచ్చునని, మళ్లీ మావో మౌనం వహించి అవకాశం గురించి ఎదురు చూస్తూ ఉండవచ్చునని పశ్చిమ బెంగాలు కమిటీ భావించి ఉండొచ్చు. కాని పశ్చిమ బెంగాలు పార్టీ ఏమీ చెప్పలేదు.

పశ్చిమ బెంగాలు రాష్ట్రకమిటీకీ ఉత్తర భారతకమిటీకి కూడా విభేదాలు ఏర్పడ్డాయి. 1973 సెప్టెంబరులో ఉత్తర భారత కమిటీ వెలువరించిన 'లిబరేషన్' సంచికలో గతంలోని పొరపాట్లను ఇలా వివరించింది. "పార్టీ నాయకత్వం ఆలస్యంగానైనా పొరపాట్లను సరిదిద్దే ప్రయత్నాలను చేస్తోంది. చారుమజుందారు చివరి వ్యాసం ఈ దిశలోనే జరిగిన ప్రయత్నం. 1972 జూలై నెలలో చారుమజుందారు పాల్గొన్న సమావేశంలో దేశం నలుమూలలనుంచీ వచ్చిన ప్రముఖ కామ్రేడ్లు పొరపాట్లు జరిగాయనీ వాటిని సరిదిద్దాల్సిన సమస్య కూడా ఉందనీ ఏకగ్రీవంగా అన్నారు" ఇంక పొరపాట్ల విషయంలో ఇలా అంది. "సాయుధ పోరాటాల రూపాలను పద్ధతులనూ నిర్ణయించడంలో మనం 'వామ' పక్ష పెడధోరణికి (చెందిన) పొరపాట్లను

చేసాం. ఆచరణలోనూ, సైద్ధాంతికంగానూ కూడా ఇతర పోరాట రూపాలను వదిలేశాం. ఆ సాయుధ పోరాట రూపాలతో ఇతర పోరాట రూపాలను మేళవించలేకపోయాం.... గెరిల్లా యుద్ధం ప్రధాన పోరాటరూపంగా ఉంటూ దానితో ఆర్థిక రాజకీయ పోరాటాలవంటి ఇతర పోరాటాలను ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని మేళవించాలి.... చట్టవ్యతిరేకమైన రహస్య కార్యకలాపాలతో జత చేయాలి. జైలులో ఉన్న కామ్రేడ్ల విషయంలో (కూడా) పార్టీ ఇదే విధానాన్ని అనుసరిచేస్తుంది." "తృతీయ ప్రపంచ యుద్ధ ప్రమాదాన్ని మనం పెద్దగా చేసి చెప్పాం. స్వదేశానికి సంబంధించినంత మేరకు మనం శత్రువును ఎత్తుగడల పరంగా తక్కువగా అంచనా వేశాం. ఈ రెండు తప్పుడు అంచనాల మూలంగానూ మనం ఆచరణలో కొన్ని తీవ్రమైన పొరపాట్లు చేసాం" అని ఆ నివేదిక పేర్కొంది.

పశ్చిమ బెంగాలు కమిటీ నాయకత్వం ఆధ్వర్యంలో సి.పి.ఐ. (మా.లె.) పార్టీ రెండవ కాంగ్రెసు సమావేశాన్ని 1973 ఆగస్టులో బర్ద్వాన్ జిల్లాలోని ఒక గ్రామంలో జరుపుకుంది. 1970 మొదటి కాంగ్రెసు సమావేశంలోనూ 1972 నాటి కేంద్ర కమిటీ సమావేశంలోనూ వెలిబుచ్చిన అభిప్రాయాలను ఆ సమావేశంలో పునరుద్ఘాటించారు. లిన్‌పియావోను వ్యతిరేకించినవారిని 'పార్టీ వ్యతిరేకులు'గా పేర్కొన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీని మాత్రం "ఘనమైన, కీర్తివంతమైన, సరియైన"[45] (Great Glorious and Correct) పార్టీగా పేర్కొన్నారు. అతని వ్యతిరేకులనుంచి చారుమజుందారు గతంలో మరీ దూరం చేసిన పాత అభిప్రాయాలనే ఆ సమావేశం పునరుద్ఘాటించింది.

"గ్రామ ప్రాంతంలో విస్తృతంగా విముక్తి ప్రాంతాలను నిర్మించ"మని పార్టీ కాంగ్రెసు ఇచ్చిన పిలుపును పురస్కరించుకుని పశ్చిమ బెంగాలులో 1974లో తిరిగి సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కార్యకలాపాలు పుంజుకున్నాయి. కొన్ని గ్రామాలలో భూస్వాములను చంపారు. నగరాలలో పోలీసుల నుంచి తుపాకీలు లాక్కొన్నారు. 24 – పరగణాలు, హుగ్లీ నాడియా జిల్లాలలోని కొన్ని ప్రాంతాలు పార్టీ పలుకుబడిలోకి వచ్చాయి. హుగ్లీ బర్ద్వాన్ సరిహద్దులలో ఉన్న (అటువంటి గ్రామాలలో ఒకటైన) కమలాపూరుపై పోలీసులు 1974 జూన్–జూలై మాసాలలో దాడి చేసారు. (ఈ గ్రామంలోనే పార్టీ కాంగ్రెసు జరిగింది.) మొత్తం గ్రామంలోని జనాభా సాయుధులై పోలీసులతో పోరాడారు. పోలీసుల చుట్టివేత నుంచి పార్టీ కార్యకర్తలను గెరిల్లా స్క్వాడునూ ఆ విధంగా కాపాడారు. పోలీసులకూ గెరిల్లాలకు మధ్య అటువంటి పోరాటాలెన్నో ఆ సంవత్సరంలో జరిగాయి. ఆ విధంగా గెరిల్లాలు జైళ్ళనుంచీ పోలీసు చుట్టివేత నుంచీ

తప్పుకునేవారు. ఈలోగా 1973 ఏప్రిలు మాసాంతములో సత్యనారాయణ సింగు నాయకత్వంలోని సి.పి.ఐ. (మా.లె.) పార్టీ తన కేంద్రకమిటీ సమావేశాన్ని కలకత్తాలో జరుపుకుంది. ఆంధ్రలో పార్టీ పునర్వవస్థీకరించేందుకు ప్రయత్నిస్తున్న పైలా వాసుదేవరావు దానికి హాజరయ్యాడు. ఆంధ్రలో చంద్రపుల్లారెడ్డి గ్రూపుతో కలిసి పనిచేయాలనీ, దేశంలో గల మిగతా మావోయిస్టు గ్రూపుల మధ్య ఐక్యత సాధించాలనీ కూడా కలకత్తా సమావేశం నిర్ణయించింది. గతంలో జరిగిన 'వామపక్ష ఒంటెత్తువాద పొరపాట్లను ఆ సమావేశం గర్హించింది. ఆర్థిక కోర్కెలపైన నగర కార్మికులు చేసే ఉద్యమాలను బలపరచాలని నిశ్చయించింది. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ తరఫున పైలా వాసుదేవరావు, సత్యనారాయణ సింగు, కమ్యూనిస్టు రివల్యూషనరీ కమిటీ తరఫున చంద్రపుల్లారెడ్డి, రామనరసయ్య* వేణుగోపాలుల సంతకాలతో విప్లవకారులందరూ ఐక్యం కావాలనే విజ్ఞప్తిని చేసారు. దేశంలోని "నవవిప్లవవెల్లువ" గురించి పేర్కొంటూ, "విప్లవ సాయుధ పోరాటాలను విస్తరించే అవకాశం ఆశాజనకంగా ఉంది" అని భావించారు. ఇంకా ఇలా చెప్పారు. "ఈ విప్లవ పరిస్థితిలో భారత ప్రజలకు, వారి పోరాటం విజయవంతమయ్యేందుకు, సరియైన నాయకత్వం వహించేందుకు కమ్యూనిస్టు విప్లవకారులు ముందుకు రావాలి. మన విభేదాలను పరిష్కరించుకుని మన ఐక్యతను బలపరచుకోవడం ద్వారా ఈ విధిని నెరవేర్చగలం" కాని ఆ సమావేశం తక్షణ కార్యక్రమంగా ఆచరించేందుకు ఎటువంటి కార్యక్రమాన్నీ నిర్దేశించలేదు. వక్కాణింపు చాలావరకు ఆ విజ్ఞప్తిలో పేర్కొన్నట్టుగా సిద్ధాంతపరమైన చర్యలకూ వారి ప్రకటనలో చెప్పినట్టు "కాగితాలను పత్రాలనూ ఇచ్చి పుచ్చుకోవడం (పరస్పరం) ఉద్దేశాలనూ అనుభవాలనూ పంచుకోవడం..."[46] వరకే పరిమితమైంది.

ఒక ఏడాది గడిచాక సత్యనారాయణసింగు 1974 మే నెలలో మరింత సానుకూల పద్ధతిలో తన పార్టీ కార్యక్రమాన్ని ఒక ఇంటర్వ్యూలో వివరించాడు. గ్రామ ప్రాతిపదికగా గల సాయుధ సంఘర్షణ అవసరాన్ని పునరుద్ఘాటిస్తూ ఇలా అన్నాడు. "ఆర్థిక పోరాటాన్ని రాజకీయ పోరాటంతోనూ చట్టపరమైన (పోరాటాన్ని) చట్టవిరుద్ధమైన (పోరాటంతోనూ), బహిరంగ (పోరాటాన్ని) రహస్య (పోరాటంతోనూ) ప్రజా సంస్థను సాయుధ సంస్థతోనూ, సాయుధ పోరాటాన్ని ఇతర పోరాట రూపాలతోనూ అనుసంధించడమే మా ఎత్తుగడల పంథా"[47] ప్రజాసైన్యపు ఏర్పాటును గూర్చి ఇలా ప్రతిపాదించాడు. "భౌతిక స్థితిగతులు, చైతన్యస్థాయి ప్రజా సంస్థాత్మకత్వంలో గల

* *మూలంలో రామనర్సియ (Ram Narsiya) అని ఉంది – అను.*

అసమానతల దృష్ట్యా, అనుకూల భూస్థితి గల ఒక ప్రాంతంలో ప్రజా విముక్తి సైన్యం మొదలయ్యే దశకు ప్రజా పోరాటాన్ని అభివృద్ధి పరచవచ్చును. ఈ సైన్యం అనేక గెరిల్లా స్క్వాడ్లలో గల దళ సభ్యులతో మొదలౌతుంది. అది ప్రాంతీయ సైనికాధికారపు ఆధీనంలో పనిచేస్తుంది. ప్రాంతీయ పార్టీ కమిటీకి, దాని ఆదేశానికి ఆ సైనికాధికారం లోబడి ఉంటుంది.... సైన్యాన్ని ఏర్పరిచే దశకు మనం ఇంకా చేరుకోలేదు. ఇంకా మనం సాయుధ గెరిల్లా స్క్వాడ్ల దశలోనే ఉన్నాం."

ఇతర గ్రూపులకు చెందిన సి.పి.ఐ. (మా.లె.) విప్లవకారుల గురించి సత్యనారాయణ సింగు ఇలా అన్నాడు. "వారిలో కొందరు పంజాబులోని (ఒకానొక) సోహాల్ నాయకత్వం కింద పనిచేస్తున్నారు. సునీతిఘోష్ వాళ్ళ కేంద్రసమీకరణ సంఘపు సభ్యులలో ఒకడు. వాళ్లు చారువర్గీయులైనా కూడా, లిన్‌పియావో పంథాను తిరస్కరించి, మన పంథాకు దగ్గరగా నున్న ఎత్తుగడల పంథాను అనుసరిస్తున్నట్టు చెపుతున్నారు. మనకూ వాళ్ళ ఎత్తుగడల పంథాకూ ఎటువంటి తేడా లేదని వాళ్ళ పత్రాలను చూశాక తెలిసింది. ఎటొచ్చి ఉన్న విబేధమల్లా చారుమజుందారు (పాత్ర) పట్లగల అంచనా, పార్టీ చరిత్రకు సంబంధించిన ఇతర విషయాలలోనే.... లిన్‌పియావో (పంథా)ను తిరస్కరించి ప్రజా పంథాను అనుసరించే చారు అనుయాయులతో మనం కలిసి పనిచేసేందుకు అనుకూలమైన అవకాశం ఉందని మా అభిప్రాయం" అషీం చటర్జీ గురించి ఇలా అన్నాడు ".... ఇప్పుడతను నా సహచరుడు. మేం కలిసి పని చేస్తున్నాం."

"నవ విప్లవ వెల్లువ"ను సూచించే ప్రస్తుత పరిస్థితిని వర్ణిస్తూ ఇలా అంగీకరించాడు. "సమీకరణ శక్తి, దెబ్బ కొట్టే శక్తి, మన పార్టీకి తక్కువగా ఉండటమొకటే లోపం. చారు నాయకత్వ కాలంలో వామపక్ష అవకాశ వాద పంథాను అనుసరించడం వల్ల తప్పనిసరిగా ఏర్పడ్డ ఫలితమే అది" ప్రజా ఉద్యమాల పట్ల తన "పంథా"ను ఇలా వివరించాడు. "బీహారులో ఉద్యమాన్ని బలపరుస్తున్నా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఉద్యమం లోపల గల ప్రగతి నిరోధక భావజాలాన్నీ నాయకత్వాన్నీ వ్యతిరేకిస్తూనే సంఘంలో మౌలికమైన మార్పుకై నడిపే మా విప్లవ పోరాటానికి ప్రస్తుత ఉద్యమాన్ని ముడిపెట్టడానికి ప్రయత్నిస్తున్నాం... ఈనాడు ఈ ఉద్యమంలో విప్లవకారుల కంటే ప్రగతి నిరోధకులే అత్యధిక సంఖ్యలో ఉన్నారు. కాని కాలక్రమేణా సరియైన రాజకీయ పంథాను అనుసరించి సరియైన విప్లవాత్మక ఆచరణతో ప్రజలపై అత్యంత శ్రద్ధను చూపితే తప్పకుండా మా పార్టీ నిర్ణాయకశక్తిగా అవతరిస్తుంది."

సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ప్రాబల్యానికి బయటగా పనిచేస్తున్న వివిధ గ్రూపులలోనూ మావోయిస్టు సెంటర్ ఆఫ్ కమ్యూనిస్టు రివల్యూషనరీస్ (కమ్యూనిస్టు విప్లవకారుల

మావోయిస్టు కేంద్రం) ఎం.సి.సి.ఆర్.ని 1973లో వార్తలలో కెక్కింది. పశ్చిమ బెంగాలులో గల దుర్గాపూర్‌కు 25 మైళ్ళదూరం గల రక్షిపూర్ చుట్టుపక్కల గల గ్రామాలలోని భూస్వాములపై దాడులు చేసి తుపాకులు లాక్కోవడం వంటి సంఘటనల వల్ల వాళ్ళు ప్రసిద్ధికెక్కారు. సంతాలు ఆదివాసుల నివాసమై అడవులతో నిండిన ఆ ప్రాంతాన్ని ఆ సంఘటనల తరువాత 'కల్లోలిత ప్రాంతం'గా ప్రకటించారు. దానికి పూర్వ రంగాన్ని వివరిస్తూ 1973 జనవరి 5వ తేదీన స్టేట్సుమన్ విలేకరి ఇలా రాసాడు. "ఆదివాసేతరలకూ (ఎగువ తరగతి బెంగాలీలు) ఆదివాసులకూ రోజు కూలీ రేటు పెంపుదల గురించిన వివాదం వల్ల సంబంధాలు పూర్తిగా తెగి పోయాయి.... ఒక ఆదివాస సంక్షేమ శాఖ అనేది జిల్లాలో ఉన్నా కూడా గత 25 సంవత్సరాలలో ఆ శాఖ జిల్లాలో ఎటువంటి సంక్షేమ కార్యక్రమాన్ని నిర్వహించలేదు. ఆదివాసులు దయనీయమైన పరిస్థితికి వచ్చారు. వారిలో కొందరు దోపిడీదొంగలుగా మారారని కూడా అంటారు. తీవ్రవాదులు ఈ పరిస్థితిని అలుసుగా తీసుకున్నారని ఒక సీనియరు ప్రభుత్వోద్యోగి అన్నాడు."

80 చదరపు మైళ్ళ ప్రాంతంలో వ్యాపించిన 'గార్ జంగల్' అడవి ప్రాంతాన్ని చుట్టిముట్టి ఆరు పోలీసు క్యాంపులను జనవరిలో నెలకొల్పారు. తరువాత నెలకొన్న ప్రశాంతత దృష్ట్యా ఆ క్యాంపుల్ని మార్చి 28వ తేదీన ఉపసంహరించుకున్నారు. అధికారులు పరిస్థితి ఒక కొలిక్కి వచ్చిందని భావించారు. ఉపసంహరణ జరిగిన కొద్ది గంటలకే ఎమ్.సి.సి.ఆర్. మనుషులు ఒక గ్రామంలో భూస్వామిని ఎత్తుకు పోయారు. అదే విలేఖరి ఆ సంఘటనపై వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నాడు "స్థానిక ఆదివాసేతర ప్రజల (మధ్య తరగతి, పై తరగతుల బెంగాలీలు) సహకారంతో ఆదివాస ప్రజలను నక్సలైట్ల ప్రాబల్యం నుంచి తప్పించేందుకు (198 ఎకరాల భూమిని పంచి ఇవ్వడం, బట్టలు ఇవ్వడం మొదలైన చర్యల ద్వారా) అధికార వర్గాలు చేసిన ప్రయత్నం విఫలమైందనే సంగతిని ఈ సంఘటన ఋజువు చేస్తోంది."[48]

బయట పనిచేస్తున్న ఇటువంటి కమ్యూనిస్టు విప్లవకారుల గ్రూపులు కాక దేశంలోని అనేక జైళ్ళలో బంధించబడిన నాయకులు తప్పించుకుని వచ్చి ప్రత్యామ్నాయ పథకాలను రూపొందించుకుని సాయుధ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.

కానూసన్యాలు, సౌరీన్‌బోసు, నాగభూషణ పట్నాయక్, తేజేశ్వరరావులు తాము "ఏ గ్రూపుకూ ముఠాకూ చెందమని" 1972 అక్టోబరులో జైలు నుంచి రాసిన ఒక లేఖలో ప్రకటించారు. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ లోపలా బయటా ఉంటూ మావో ఆలోచనపై విశ్వాసం గల గ్రూపులన్నిటితోనూ తమకు గల సంబంధం "విరోధాత్మకం

కాదని" చెప్పుకున్నారు. "తమ తమ ప్రాంతాలలో పోరాటపు సమీక్షను తయారు చేయమనీ, పార్టీ అంతటా అంతరంగిక చర్చలు ప్రారంభించమనీ, నక్సల్బరీ వెలుగులో పొరపాట్లను సరిదిద్దుకునే ప్రయత్నం చెయ్యమనీ... సాయుధ పోరాటాన్ని ముందుకు తీసుకుపోయేందుకై నవ ఐక్యతను సృష్టించమనీ" పార్టీ సభ్యులందరకూ విజ్ఞప్తి చేసారు.

రెండు సంవత్సరాల తరువాత అషీంచటర్జీ జైలు నుంచి చేసిన ఒక ప్రకటనలో ఈ విజ్ఞప్తిని ఉదహరిస్తూ, "దానికి తగిన ప్రాముఖ్యతను" ఇవ్వాలన్నాడు. "పార్టీని పునర్వవస్థీకరించడం ప్రస్తుతం ముఖ్య కర్తవ్యం. గత కాలపు (మన) అనుభవాన్ని ఆకళింపు చేసుకోందే ఇది జరగదు." దేశంలో గల లిన్‌పియావో అనుయాయుల గురించి చెపుతూ "వీళ్లతో ఏకమవ్వాలనే భావనే చాలా భయానకం" అన్నాడు. "తమ కార్యకలాపాలను ప్రజాస్వామ్య పరిమితులలో పరిమితం చేసుకునే" నమ్మకం కలవారి గురించి చెపుతూ దాన్ని "చక్కటి చిక్కటి విద్రోహం"గా వర్ణించాడు. చారుమజుందారు గురించి ఆసక్తికరంగా సమీక్షించాడు. "కొందరు కామ్రేడ్లు అతని తీవ్రమైన రాజకీయ పొరపాట్లను మించిన అతని ధ్యేయంలోని నిజాయితీని పేర్కొంటారు... అతన్ని అమరవీరుడుగా నిలబెడుతూ వీర మరణానికి పురికొల్పిన ధ్యేయంలో గల నిజాయితీని మరిచిపోయిన మరికొందరు అతని రాజకీయ పొరపాట్లనే లెక్కలోకి తీసుకుంటారు... కామ్రేడ్ చారుమజుందారును ఒక సంకేతంగా మార్చడం తప్పు. అతన్ని విద్రోహిగా పేర్కొనడం అంటే సి.పి.ఎం. భాషను మాట్లాడడమే. చారుమజుందారు తనకు తెలియకుండానే ఒక అంతర్జాతీయ కుట్రకు బలయ్యాడు."[49]

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం జైలులో బంధించబడ్డ కె.జి. సత్యమూర్తి మాత్రం కానూసన్యాలుకూ అషీంచటర్జీకి కూడా దూరంగా ఉన్నాడు. పార్వతీపురం కుట్ర కేసును విచారిస్తున్న ప్రత్యేక మెజిస్ట్రేటు ముందు విచారణలో కోర్టులో (1973 జూన్‌లో) ఇలా ప్రకటించాడు. "చారుమజుందారు చూపిన బాట మాకుంది" బహుశః చారుమజుందారును విమర్శించిన వాళ్లనుద్దేశించి జైలుకు పంపిన లేఖలో ఇలా చెప్పాడు. "ఆయుధాలను వదిలిపెట్టేందుకు వివిధ సిద్ధాంతాల ముసుగులో పిలుపులు ఇస్తున్నారు." "శత్రువు సైనికపరంగా బలంగా ఉన్నంత మాత్రాన, తాత్కాలిక సైనిక పరాజయాలను ఎదుర్కొన్నప్పుడల్లా సాయుధ పోరాట పంథాను వదలి మన ఉద్యమాన్ని శత్రువు అనుమతించిన పరిమితులకు తెచ్చి శత్రువుకు అంగీకారయోగ్యంగా దాన్ని మలచుకుంటావా?"[50] అని ప్రశ్నించాడు.

ఈ ప్రకటనలు, సమాధానాలు మొదలైనవన్నీ చూస్తే భారతదేశంలోని కమ్యూనిస్టు విప్లవకారులు ఒక రకమైన మేధోపరమైన జైత్రయాత్ర చేస్తున్నారనిపిస్తుంది. గతంలోకి

పోయి విమర్శించి, వర్తమానంలోకి చొచ్చుకుని, భావిని దర్శించేందుకు సాగించిన ప్రయత్నం అది. వాళ్ల మాటలలోని అస్తవ్యస్తత అసంపూర్ణతలు, సంసిద్ధతకు ముందు వచ్చే తడబాటుగానే భావించాలి. చారుమజుందారు తన జీవిత చరమ దశలో తన భావాలలో తెచ్చుకున్న మార్పును చారుమజుందారు అనుయాయులు తమలోకి తెచ్చుకోలేకపోతున్నారు. వాళ్లింకా ప్రజా ఉద్యమాలపై పాతకాలపు చిన్న చూపునే పెంచుకుని ఉన్నారు. సాయుధ పోరాటాలపై నమ్మకం ఉన్న ఇతర విప్లవకారులతో ఒక అవగాహనకు రావడం విషయంలో కూడా అటువంటి చులకన భావమే వాళ్లకుంది. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే కొన్ని చెదురు మదురు స్థావరాలకు పరిమితమై హటాత్తుగా జరిగే చర్యలకే పరిమితమై పోయే ప్రమాదంలో వాళ్లు పడిపోతారు.

పరస్పరం సంబంధంలేని వ్యక్తులూ ముఠాలుగా ఉంటూ మిగతా గ్రూపులు ఇంకా నీరసంగానే ఉన్న కలగూర గంప చర్యలు తలపెట్టేముందు ఐక్యతకు అర్రులు చాస్తున్నారు. వాళ్లలో చాలా మంది తాత్కాలికంగా సాయుధ పోరాటం నిలుపు చేసి పాలక వ్యవస్థ చిందర వందర చేసిన (తమ) బలాన్ని పుంజుకున్నాక తరువాత దశలోని పోరాటానికి సన్నాహం చేసుకోవాలనే అభిప్రాయంలో ఉన్నారు. ఈ మేధోపరమైన వాదోపవాదాలలోనే కూరుకుపోయే ప్రమాదం కూడా ఉంది. అంతర్గత విమర్శలపైనా, విబేధానికీ ప్రాముఖ్యతనిచ్చే యుద్ధరంగాన్ని వదలి వాస్తవ కార్యక్రమాలకు సున్నా చుట్టే అవకాశమూ ఉంది.

చురుకుగానో నెమ్మదిగానో ఉన్న ఈ గ్రూపులూ పార్టీలూ కూడా భారత దేశంలో 1973లో చాలా నగర ప్రాంతాలను కల్లోలితం చేస్తున్న ఆందోళన నుంచి నేటికీ దూరంగానే ఉన్నారు. ఎన్నో విధాలుగా వాళ్లు ఆ కల్లోలాల ప్రాముఖ్యతను ఒప్పుకో(కపోవ)డం వేరే సంగతి. ఉండుండి వెలువడుతున్న కల్లోలిత ప్రజావాహిని మనోస్థితిని బహిర్గతం చేసే ఆ ఉద్యమాలలో కమ్యూనిస్టు విప్లవ గ్రూపులలో ఏ ఒక్కటీ ప్రత్యక్షంగా పాల్గొనడంగాని నాయకత్వం వహించిన జాడ కాని ఇంత వరకూ లేదు.

ప్రజలు ధ్వజమెత్తిన ఉద్యమాలతో ముడిపెడితేనే తమ దెబ్బల తీవ్రతను విప్లవకారులు పెంచవచ్చునేది నిజం. ఈ ప్రజాందోళనలన్నీ వాటంతటవే విప్లవంగా ప్రజ్వరిల్లుతాయనే మధ్య తరగతి గుడ్డి నమ్మకాన్నుంచి భారత విప్లవకారులింకా బయటపడలేదు. ఈ ప్రజా ఉద్యమాల జీవనాడిని స్పృశించి సాయుధ పోరాటాశయాల్ని నెరవేర్చుకుందామనే అవగాహన ఇంకా వాళ్ల తలకెక్కలేదు. ప్రజా

ఉద్యమాల దుందుడుకుతత్వం అనైక్యతల కారణంగా ఆందోళనాశక్తులు పాలక శక్తులపై సమైక్యమైన దాడి జరపలేదు. తమ దమనశక్తులను కేంద్రీకరించిన పాలక వర్గాలు అన్ని రకాల ఆందోళనలనూ ఓడించి ప్రజా వర్గాలపై పరాజయాన్ని సులువుగానే రుద్దగలిగారు.

భారత పాలక వర్గాలు అమెరికా రష్యాల మద్దతును కలిగి ఉన్నాయని గుర్తుంచుకోవాలి. కమ్యూనిస్టు విప్లవకారుల వల్ల ఏదైనా ప్రమాదం ఏర్పడితే ఆయా దేశాల సాయుధ శక్తిపైన కూడా ఆధారపడతారు. కనుక భారత పాలక వర్గాలపై జరిపే దాడి ఎటువంటిదైనా గెలవాలంటే ఏక కాలంలో అనేక రకాలుగా సుసంఘటితంగా మేళవించిన దాడుల సమూహాలపై ఆధారపడి ఉంటుంది. గ్రామ ప్రాంతంలో సుదీర్ఘమైన రైతాంగ గెరిల్లా యుద్ధంతో ప్రాంతీయ ప్రాతిపదికపై అధికారాన్ని పట్టుకోవాలి. పారిశ్రామిక సమ్మెలు, ఆందోళనలు, ఆర్థిక జీవనాన్ని పరిపాలనను స్తంభింపజేయాలి ప్రభుత్వపు సాయుధ యంత్రాంగంలో కనీసం ఒక విభాగాన్నైనా తమ వైపుకు తిప్పుకోవడంకాని తటస్థంగా చేసే ప్రయత్నం కాని జరగాలి. మొదటి రెండు రంగాలలోనూ పొందిన విజయాలపై మూడవ రంగంలో పొందే విజయం ఆధారపడి ఉంటుంది.

## చైనాతో సంబంధాలు

చైనా పట్ల ఈ పార్టీలకూ గ్రూపులకూ గల వైఖరి, వారి పట్ల చైనాకు గల వైఖరీ కూడా తమ ప్రభావాన్ని చాలా వరకు చూపెట్టవచ్చు. గతంలో లాగా అది మాత్రం నిర్ణాయకంగా ఉండదు.

పార్టీలో చీలిక తరవాత చైనా బహిరంగంగా ఏ గ్రూపునూ బలపరుస్తున్నట్టు ప్రకటించలేదు. అదీకాక భారత చైనా ప్రభుత్వాల మధ్య అప్పుడప్పుడు స్నేహం వెల్లివిరుస్తోంది. ఇటీవల చైనాలో పునరుద్ధరించబడ్డ చైనా – ఇండియా మైత్రీ సంఘం పంపిన ఆహ్వానాన్ని పురస్కరించుకొని 1974 మధ్యలో కొందరు భారతీయ మేధావులు భారత ప్రభుత్వపు అనుమతితో ప్రోద్బలంతో చైనాను సందర్శించారు. దీన్ని బట్టి ఒక అవగాహన (ఏర్పడే అవకాశం) అనతి దూరంలోనే ఉందనే నిర్ణయానికి రాకూడదు. రెండు దేశాల (మధ్యగల) అధికారిక సంబంధాలు అనిశ్చితంగానే ఉన్నాయి.

(సోవియట్ విదేశీ విధానాలతో సి.పి.ఐ. తలమునుకలయినట్టుగానే) చైనా అంతర్జాతీయ విధానాలతో భారత కమ్యూనిస్టు విప్లవకారుల తాదాత్మ్యం (1971

నాటి తూర్పు బెంగాలు సంఘటనల కాలంలో అషీంచటర్జీలాగా) చైనా (అనుసరించిన) దౌత్యనీతికి తాము సంజాయిషీలు సమాధానాలు తయారు చేసుకుంటూ ఉండడం కొనసాగిస్తే, చైనా విధానాలలో వచ్చిన మార్పుల వల్ల కాని, చైనా నాయకుల వ్యక్తిగత అదృష్టాలలో వచ్చే మార్పుల వల్ల అటూ ఇటూ ఊగిసలాడే మనస్థిమితం లేని విప్లవకారుల కూటమి (హాస్యాస్పదంగా) తయారవుతుంది.

మిగతా దేశాలలో విప్లవకారుల విజయానికి తగిన కారణాలున్నాయి. వాళ్ళు చాలా మటుకు విదేశీ నాయకులకు కాని, (విదేశీ విప్లవ) రూపాలకు కాని బానిస భావం చూపలేదు. గతంలో ఎన్నడూ ఎదుర్కోని పరిస్థితులకు (అనుగుణంగా) కొత్త విధానాలను కొత్త సాంఘిక రీతులను రూపొందించుకోవడంలో తమ ప్రతిభను కనపరుచుకున్నారు. చైనా విప్లవకాలంలో మావో కూడా ఒకానొకదశలో స్టాలిన్‌తోనూ కొమింటరన్‌తోను తలపడకుండా చైనాలో స్వతంత్ర్య వ్యూహాన్ని అమలు పరచడమనే కత్తిమీద సామును (చాకిచక్యంగా) నిర్వహించాడు.

## భావిలో అవకాశాలు

ప్రత్యక్షమైన విదేశీ దురాక్రమణ భారతదేశంలో లేనందువల్ల వియత్నాం, ఆఫ్రికా దేశాల విమోచనోద్యమాలకూ, భారతీయ సాయుధ పోరాటతత్త్వానికీ తేడా ఉండక తప్పదు. నియంతృత్వం నగ్నంగా నాట్యం చేస్తున్న లాటిన్ అమెరికా దేశాల పోరాటాలకు కూడా అది భిన్నంగానే ఉంటుంది.

సామ్రాజ్యవాదులు తెర వెనుక నుండే ఇండియాలో తమ పబ్బం గడుపు కుంటున్నారు. (వ్యవస్థ యొక్క దమనాత్మకరూపంపై ప్రజాస్వామ్యపు ముసుగు సంవత్సరాల తరబడి అలవాటుగా అతుక్కుపోయింది. ఈ దేశంలో అసమ్మతివాదుల్ని చిలకపలుకుల ములుకులతో చంపుతారు. ఈ దేశంలో చాలా వివరంగా నిర్మించిన తతంగాలతోనూ నియమాలతోనూ ప్రతిపక్షపు గొంతు నులుముతారు. పవిత్రమైన చట్టాలను నిర్మించి వాటికి రాజ్యాంగపరమైన, న్యాయపరమైన మర్యాదలను అంటగట్టి చేవలేకుండా చేస్తారు.

ఈ దేశంలో పాలకవర్గాలు సాయుధపోరాటం తెచ్చిపెడుతున్న ప్రమాదం అంతగా లేదని ప్రపంచాన్ని మోసగిస్తూనే మరోవైపు సాయుధ తిరుగుబాటు ఛాయలు ఎక్కడ ఏ మాత్రం కనిపించినా హింసాత్మక దమన చర్యలతో అణచడానికి ప్రయత్నిస్తారు. ఎటువంటి వ్యతిరేకతనైనా, సి.ఐ.ఎ. ప్రోద్బలంతో జరుగుతున్నట్టు చెప్పుకోవడం ఈ దేశ ప్రభుత్వానికే చెల్లుతుంది. సామ్రాజ్యవాద కుట్రలకు బలైన సోషలిస్టు బలి

పశువులా ఈ ప్రభుత్వం నటించగలదు. ఒకవైపు సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఖైదీలు (సంవత్సరాల తరబడి జైళ్ళలో చిత్రహింసలకు గురవుతూ) మగ్గుతున్నా, ఈ దేశపు ప్రధాని ఇందిరాగాంధి చిలీలో నియంతృత్వానికి బలైపోయిన వారిపట్ల కన్నీరు కార్చగలదు.

అప్పుడప్పుడు ప్రశాంతత మళ్ళీ ఆవరించినట్టు కనపడవచ్చు. ఏదో నాటికి దేశంలో గల ఆంతరంగిక వైరుధ్యాలన్నీ బద్దలయ్యే అగ్నిగోళం కాక మానదు. ఆర్థిక రంగంలో ప్రభుత్వం పొందే ప్రతీ పరాజయం (విప్లవ శక్తులు ముందుకు సాగేందుకు) మరో కుదుపునిస్తాయి. ఆర్థిక సంఘర్షణ రాజకీయ సంక్షోభాన్ని మరింత తీవ్రంగా పెంచుతుంది.

రక్తం చిప్పిలితున్న భారత భూభాగంలో 1967–72 కాలాలలో ఏర్పడిన చాలుల లోంచి మెల్లగా మరో నవతరం పుట్టుకొస్తోంది. ముందు నాయకత్వం వహించిన విప్లవకారుల అపూర్వానుభవంతో వాళ్ళు ఉత్తేజితులై ఆ విప్లవకారుల లోపాలను అధిగమించగలరా?

పారిశ్రామిక కార్మికుల సంగతి చూద్దాం. జీతాల పెంపు, ధరల పెరుగుదల అనే విషవలయంలో కొట్టుకుంటున్న వాళ్ళు ఇంక ఊపిరి పీల్చుకునేందుకు ఆశలు సన్నగిల్లాయని వాళ్ళు ఎంత ఎక్కువగా గుర్తిస్తే అంత తొందరగా కార్మిక (వృత్తి పోరాట) తత్వం నుంచి బయటపడి (విప్లవతత్వాన్ని అలవర్చుకుని) విప్లవకారులవుతారు.

సి.పి.ఐ. (మా.లె.) పార్టీ సాయుధ పోరాటానికి కేంద్రంగా ఉండిన గ్రామసీమలే చిట్టచివరకు విప్లవ విజయానికి నిర్ణాయకంగా ఉంటాయి. ప్రగతికీ విద్రోహానికీ జరుగుతున్న తులాభారంతో మొగ్గుకు కావలిసిన బరువుగా లక్షలాది గ్రామీణజనులే ఉంటారు.

1962–72 కల్లోలిత సంవత్సరాలు భారత దేశ గ్రామీణ జీవనంలో ఉండే ప్రశాంతతను పైపై మెరుగుగా నిరూపించాయి. (ఆ ప్రశాంతత) ఆకలి గొన్న కోట్లాది ప్రజల ఆగ్రహజ్వాలలను దాచిపెడుతోంది. కాని తోక అంటుకున్న ఆ జ్వాల సన్నగా మెల్లగా ముందుకు పోతూ ప్రస్తుత వ్యవస్థను కూల్చివేసే ప్రేలుడు పదార్థానికి దగ్గరవుతోంది. పాలకవర్గాలు ఎదుర్కోబోయే అంతిమ తీర్పుకు సంకేతాన్నందిస్తోంది.

* * *

# References

## అధ్యాయం - 1


1. 'భారతీయ వ్యవసాయం చిన్న సమీక్ష' జనవరి, 1970 భారత ప్రభుత్వ ఆహార, వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రచురణ.
2. ఎన్.ఎస్.ఎస్. భూమి కేంద్రీకరణ స్థాయిలను తగ్గించి చెపుతోందనేందుకు బలమైన కారణాలున్నాయి. భూపరిమితుల గురించి ముందుగానే ఊహించిన ధనిక రైతులు ఎన్.ఎస్.ఎస్. ప్రశ్నావళికి తమ భూముల గురించి సరైన సమాచారం ఇచ్చారని భావించలేం.
3. వి.ఎమ్. దండేకర్, నీలకంఠరథ్ 'భారత దేశంలో దారిద్ర్యం-1, వైఖరుల - కార్యక్రమాలు' 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లి' (జనవరి 9, 1971) పే. 115
4. ప్రీతంసింగ్ 'కులక్కులు, ముజిక్కులు' మైన్‌స్ట్రీమ్ (ఆగస్టు 8, 1970) పే. 20.
5. అదే వ్యాసం.
6. వ్యవసాయ కూలీలపై జరిగిన అఖిల భారత సదస్సు (1965)లో ఎమ్.వి.ఎస్. రావ్, అసిస్టెంట్ డైరెక్టర్, కేంద్ర గణాంక సంస్థ సమర్పించిన మెమోరాండం.
7. 'ఆల్ ఇండియా రూరల్ క్రెడిట్ సర్వే' వాల్యూం 2 పే. 167.
8. ప్రణాబ్ కె. బర్ధన్ '60'లలో భారత గ్రామీణ ప్రాంతాలలో దారిద్ర్య ప్రసారం. 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' వార్షిక సంచిక 1973.
9. 'హరిజన్' (దేవుని కుమారుడు) అనే పదం నిమ్నజాతి ప్రజలనుద్దేశించి చెప్పేందుకు గాంధీ మొదటగా ఉపయోగించాడు. వీరిలోని మిలిటెంటు వర్గాలు ఆ పదానికి మారుగా 'దళిత్' అణగదొక్కబడిన వారుగానే చెప్పుకుంటారు.
10. భారత కమ్యూనిస్టు పార్టీ (మా.లె.), 1969, రాజకీయ తీర్మానం.
11. 'గ్రామీణ ప్రాంతాలలో వర్గాలనెలా విశ్లేషించాలి' (మావోసేటుంగు, --- రచనలు, వాల్యూం 1, పే 137-139, పెకింగ్ ప్రతి)లో మావో వ్యాసం ఆధారంగా ఈ సమీక్ష చేసారు. 1933 నాటి చైనాలో గ్రామీణ ప్రజలను మావో; భూస్వామి, ధనికరైతు, మధ్యరైతు, బీదరైతు, రైతు కార్మికుడు, అని నాలుగు తరగతులుగా విభజించాడు. భూమిలేని వారిని మావో 'కార్మికులు'గా పేర్కొనగా, సి.పి.ఐ.(మా.లె.) మాత్రం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలోని కార్మికవర్గం నుంచి వచ్చిన వారు కాదు; బలవంతంగా తమ భూమిని లాక్కొనగా

భూమిని కోల్పోయి, దానికై అర్రులు చాచే 'భూమిలేని రైతుల'నే విషయాన్ని వక్కాణించేందుకు ఆ పదాన్నే ఉపయోగించింది.

12. సి.పి.ఐ.(మా.లె.) రాజకీయ తీర్మానం, 1969.
13. 'భారత దేశంలో వ్యావసాయిక వికాసావకాశం' డేనియల్ తోర్నర్, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ ఆర్థిక శాస్త్ర విభాగం, 1956. పే. 16.
14. వివేక్ భట్టాచార్య, 'భారతదేశంలో గ్రామ సమస్య' మెట్రోపాలిటన్ బుక్ కం. ఢిల్లీ 1971 పే. 54.
15. మూడవ పంచవర్ష ప్రణాళిక, 14వ అధ్యాయం, పే. 224.
16. 'భూ సంస్కరణలు: విధానం, చట్టం, అమలు', 'మైన్‌స్ట్రీమ్' నవంబరు 4, 1972.
17. వోల్ఫ్ లాడ్జిన్స్కి 'హరితవిప్లవం – 142; స్టేట్సుమన్ పత్రిక సెప్టెంబరు 11, 12 – 1970.
18. ఫ్రాంకైన్ ఆర్ ఫ్రాంకెల్ – 'భారత దేశ హరిత విప్లవం' ఆక్సుఫర్డ్ విశ్వవిద్యాలయ ముద్రాలయం. బొంబాయి 1971 పే. 201.
19. వోల్ఫ్ లాడ్జిన్స్కి – 'హరిత విప్లవం' – 142 స్టేట్సుమన్ పత్రిక సెప్టెంబరు 11, 12 తేదీలు 1970.
20. ఫ్రాంకైన్, ఆర్. ఫ్రాంకెల్. 'భారతదేశ హరిత విప్లవం' పే. 197.
21. అదే వ్యాసం. పే. 198
22. ఛెస్టర్ బౌల్సు 'న్యూఢిల్లీ నుంచి ఒక దృక్పథం' ఎలైడ్ పబ్లిషర్స్, బొంబాయి, 1969 పే. 83.
23. పేట్రియాట్ పత్రిక, నవంబరు, 29, 1969.
24. కటీబ్ అన్సారి. 'భారత వ్యవసాయం; పెట్టుబడిదారీయా లేక దాని పూర్వదశయా?' 'పీపుల్స్ పవర్' జనవరి–ఫిబ్రవరి, 1974 (బొంబాయి నుంచి వెలువడే పత్రిక)
25. సి.పి.ఐ. (మా.లె.) రాజకీయ తీర్మానం, 1969.
26. నిర్మల్ కుమార్ బోస్ 'గాంధీయిజంపై వ్యాసాలు', మెర్రిట్ ప్రచురణలు, కలకత్తా 1962. పే. 86–87.
27. 'యంగ్ ఇండియా', మే 18, 1921.
28. ఇండియన్ ఏన్యుయల్ రిజిస్టర్', 1938, 1, 17–ఎన్.ఎన్. మిత్రచే ప్రకటితము, కలకత్తా.

29. కార్ల్. సి. టేలర్, హెలెన్, డబ్ల్యూ జాన్సన్ తదితరులు, 'భారత దేశంలో ప్రజాస్వామ్య పునాదులు' ఓరియంట్ లాంగ్‌మన్, కలకత్తా 965 పే. 6.
30. సుప్రకాశ్ రే 'భారత్ కృషక్ – బిద్రోహ ఓ గణతాంత్రిక సంగ్రాం' (భారత దేశంలో రైతాంగ తిరుగుబాట్లు ప్రజాస్వామిక సంఘర్షణలు) డిఎన్‌బిఎ బ్రదర్స్, కలకత్తా, 1972 పే 17–44 చాలాకాలం సునిశిత పరిశోధనలలో ఎన్నో సమకాలీన పత్రాలను పరిశీలించి ప్రత్యేకించి 18, 19 శతాబ్దాలలో బెంగాలు రైతాంగ సంఘర్షణల గురించి వివరంగా రే బెంగాలీలో రాసిన పుస్తకం.
31. రంగపూర్ సూపర్‌వైజర్, శ్రీపుర్లింగ్, డిసెంబర్ 29, 31, 1772 తేదీలలో రెవెన్యూ కౌన్సిలుకు రాసిన రెండు లేఖలు ఆధారంగా రే పుస్తకంలో పొందుపరచిన పోరాటపు వర్ణన యొక్క పునరనువాదం. ఈ వర్ణనను మావో సలహాతో పోల్చుకోండి. "శతృబలానికి మన బలానికీ అపారమైన తేడా ఉన్నప్పుడు, మన బలాన్ని నష్టపోకుండా శతృవును ఓడించేందుకు తగిన సమయానికి నిరీక్షించేప్పుడు, స్థావర ప్రాంతానికి వెనుదిరిగి, ఆ విధంగా శతృవును లోపలికి ఆకర్షించాలి. ఆ విధంగానే మన ప్రతిదాడికి అనువైన పరిస్థితులను ఏర్పరచుకోగలం." (చైనా విప్లవ యుద్ధంలో వ్యూహం – మావోసేటుంగ్ ఏరిన రచనలు, వాల్యూం. 1, పే. 219. పెకింగ్ ప్రతి 1965)
32. రాజయ్యన్ 'దక్షిణ దేశ తిరుగుబాటు' – ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం. 1800–1801, రావ్ అండ్ రాఘవన్, మైసూరు 4, 1974 తూర్పు ఇండియా కంపెనీ దోపిడీలతో దరిద్రులైన మద్రాసు, కేరళ, మైసూరు రైతాంగం నిర్వహించిన వలస వ్యతిరేక పోరాటం, సమకాలీన బ్రిటిష అధికారుల లేఖలు, కథనాలు, జానపదగేయాలు ద్వారా తెలిసే ఆసక్తికర సమాచారం ఆధారంగా రాసిన పుస్తకం.
33. అదే పుస్తకం, పే. 125 మావో చెప్పిన దానితో పోల్చి చూడండి. "దాని విస్తరణతత్వం వల్ల గెరిల్లా యుద్ధం అంతటా వ్యాపిస్తుంది. దాని వివిధ కార్యక్రమాలైన, శతృవును వేధించడం, నిరోధించడం, విచ్ఛిన్నం చేయ్యడం.... దాని సూత్రం బలాలను నలువైపులా ఉంచుకోవడం." ("గెరిల్లా యుద్ధపు వ్యూహ సమస్యలు" – ఏరిన రచనలు మావోసేటుంగ్ వాల్యూం – 2 పే. 84 పెకింగ్ ప్రతి. 1965) "... శతృవుపై విస్తరీకరించిన దాడులు... చెయ్యడం ఎంతో ముఖ్యం... ఈ విధంగా మన బలాలు ఎప్పుడు ఎలా దాడి చేస్తాయో శతృవుకు తెలియదు..." ('దీర్ఘకాలిక యుద్ధం' – మావోసేటుంగ్ ఏరిన రచనలు

వాల్యూం – 2, పే. 166)

34. కె. రాజయ్యన్, 'దక్షిణ దేశ తిరుగుబాటు – ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం, 1800–1801, పే. 295.

35. కె.కె. దత్తా '1857కు ముందు బ్రిటిషు వ్యతిరేక కుట్రలు – ఉద్యమాలు' మీనాక్షి ప్రకాశన్, మీరట్, 1970. పే. 39లో ఉదహరించినది.

36. సుప్రకాశ్‌రే, 'భారత్ కృషిక్ బిద్రోహ.... పే. 216–233.

37. ఆర్.సి.మజుందార్, 'సిపాయి తిరుగుబాటు–1857 తిరుగుబాటు', ఫిర్మా కె.ఎల్. ముఖోపాధ్యాయ, కలకత్తా, 1963. పే. 216

38. కల్నల్, జి.బి. మల్లెసన్, 'భారత సైనిక తిరుగుబాటు చరిత్ర', వాల్యూం – 3, లండన్, 1880 పే. 287.

39. "తేభాగా సంగ్రాం" (నాయకులు, పాల్గొన్నవారు బెంగాలీలో రాసిన వ్యాసాలు, జ్ఞాపకాల సంకలనం) 'కళాంతర్' కలకత్తా, మే 14 1973.

40. పి. సుందరయ్య, 'తెలంగాణా ప్రజా పోరాటం, గుణపాఠాలు' డిసెంబరు 1972 సి.పి.ఐ. (మా.) కలకత్తా.

41. రావి నారాయణ రెడ్డి 'వీర తెలంగాణా' సి.పి.ఐ., న్యూఢిల్లీ, అక్టోబరు, 1973 పే. 50–51.

42. అదే పుస్తకం పే. 56–57.

43. సి. రాజేశ్వరరావు, 'చారిత్రాత్మక తెలంగాణా పోరాటం' సి.పి.ఐ. న్యూఢిల్లీ, అక్టోబరు 1972. రావి నారాయణ రెడ్డి 'వీర తెలంగాణా' పే. 65.

44. పి. సుందరయ్య 'తెలంగాణా ప్రజాపోరాటం, గుణపాఠాలు' సి.పి.ఐ. (మా) కలకత్తా. డిశెంబరు 1972.

45. అదే గ్రంథం. పే. 395.

46. రావి నారాయణరెడ్డి 'వీర తెలంగాణ' పే. 65.

47. ఛెస్టర్ బౌల్సు 'రాయబారి నివేదిక' హార్పర్ అండ్ బ్రదర్స్ న్యూయార్కు, 1954, పే. 127.

48. రావి నారాయణ రెడ్డి, 'వీర తెలంగాణ' పే. 65.

49. అదే గ్రంథం పే. 64.

50. పి. సుందరయ్య 'తెలంగాణా ప్రజా పోరాటం...' పే. 121.

51. సి. రాజేశ్వరరావు 'చారిత్రాత్మక తెలంగాణ పోరాటం' పే. 39 పి. సుందరయ్య 'తెలంగాణ ప్రజాపోరాటం.... పే. 120. జాగీర్ల రద్దు చట్టపు 'ప్రగతిశీల'త్వాన్ని

రాజేశ్వర్రావే అనుకోకుండా బట్టబయలు చేసాడు." 17 కోట్లు నష్టపరిహారం చెల్లించి జాగీర్లను రద్దు చేసారు. ఎంతో విస్తీర్ణం గల భూముల్ని భవనాలను వ్యక్తిగత ఆస్థులుగా జాగీర్దార్ల చేతుల్లోనే ఉంచేశారు. ప్రభువే కాక, అతి పెద్ద జాగీర్దారైన, నైజాముకు అతని జాగీరుకు పరిహారంగా సాలుకు కోటి రూపాయలు భరణంగా ఇచ్చి నామమాత్రపు ప్రభువుగా నిలబెట్టారు. హైదరాబాదు జిల్లాలో దాదాపు 20,000 ఎకరాల భూమినీ, ఎన్నో సువిశాల రాజభవనాలనూ, కోట్లకొద్దీ విలువైన ధన కనకవస్తు వాహనాలనూ వజ్రాలనూ స్వంత ఆస్థులుగా పరిగణించి కట్టబెట్టారు." ('చారిత్రాత్మక తెలంగాణ పోరాటం' పే. 19.)

52. చేరీపేవియర్ 'తెలంగాణా సాయుధ సంఘర్షణ' ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' ప్రత్యేక సంచిక, ఆగస్టు 1967.
53. పి. సుందరయ్య 'తెలంగాణ ప్రజాపోరాటం...' పే. 437-38.
54. సి. రాజేశ్వరరావు 'చారిత్రాత్మక తెలంగాణ పోరాటం...' పే. 28.
55. రావి నారాయణ రెడ్డి 'వీర తెలంగాణ' పే. 60.
56. 1948 తరువాతి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని విబేధాలను గూర్చి మరింత వివరమైన కథనాన్ని 3వ అధ్యాయంలో చూడండి.
57. 'ప్రస్థుత వ్యవసాయి ఘర్షణల స్వభావం - కారణాలు' - పరిశోధన, ప్రచార విభాగం, దేశీయాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ రూపొందించిన అప్రకటిత పరిశీలన. పే. 9.
58. 'లిబరేషన్', సెప్టెంబరు. 1968.
59. సి.పి.ఐ. (మా.లె.) రాజకీయ తీర్మానం 1969.

## అధ్యాయం - 2

1. జె.ఎఫ్. బల్సారా 'ఇండియాలో వేగంగా జరిగే పట్టణాభివృద్ధి సమస్యలు' (ప్రణాళిక సంఘపు పరిశోధనా కార్యక్రమ కమిటీ ఆధ్వర్యంలో 9 నగరాలలో సామాజికార్థిక సర్వేలో తెలిసిన విషయాల ఆధారంగా రూపొందించిన నివేదిక) పాపులర్ ప్రకాశక్ బొంబాయి - 1964.
2. ఆషీస్ బోస్ 'ప్రజలు నగరాలకెందుకు వలస పోతారు?' 'యోజన' పత్రిక జనవరి 26, 1695.

3. పట్టణ గృహనిర్మాణంపై ఫోర్డు ఫౌండేషన్ బృందం వారి నివేదిక, గృహనిర్మాణం, పనులు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, 1965.
4. కలకత్తా బృహన్నగర ప్రణాళిక సంస్థ (సి.ఎం.పి.ఓ.) కలకత్తా బృహన్నగర జిల్లాభివృద్ధికై ఆధార ప్రణాళిక, 1966, పే. 27.
5. కలకత్తా విశ్వవిద్యాలయం, ఆర్థిక శాస్త్ర విభాగం, 'కలకత్తాను భారత దేశపు ఆర్థిక శాస్త్రవేత్తలకు పరిచయం', పే. 7.
6. సి.ఎం.పి.ఓ.... ఆధార ప్రణాళిక పే. 17.
7. విల్ఫ్రెడ్ మేలన్‌బామ్ 'ఇండియా నగర నిరుద్యోగం' 'ఫాసిఫిక్ వ్యవహారాలు', XXX నం. 2, జూన్. 1967.
8. జె.ఎఫ్. బల్సారా 'ఇండియాలో వేగంగా జరిగే పట్టణాభివృద్ధి సమస్యలు'.
9. సి.ఎం.పి.ఓ..... ఆధార ప్రణాళిక పే. 24.
10. కార్ల్‌మార్క్సు, ఫ్రెడరిక్ ఏంగెల్సు, 'కమ్యూనిస్టు మానిఫెస్టో' ఏరిన రచనలు, ప్రోగ్రెస్ పబ్లిషర్సు, మాస్కో 1970, పే. 44.
11. గణాంకపట్టీ, ఇండియా, 1962 & 1968.
12. బి.వి. కృష్ణమూర్తి "ప్రజా సంక్షేమానికై అధికార ఉన్నత వర్గపు తయారీకై ప్రణాళిక" ఎకనామి అండ్ పొలిటికల్ వీక్లీ, మే 27, 1967.
13. అదే వ్యాసం.
14. వి.ఎమ్. దండేకర్, నీలకంఠ్ రథ్, 'ఇండియాలో దారిద్ర్యం', ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, జనవరి, 9, 1971, పే. 115.
15. డా॥ రఫిక్ జకారియా 'నగరాల గందరగోళం', ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా, సెప్టెంబరు, 1, 1974.
16. ప్రత్తి నూలు ఉత్పత్తి 1965-66లో 907 మిలియన్ కె.జి.ల నుంచి 1968-69 నాటికి 972 మి॥ కే.జి.లకు పెరిగింది. 1969-70లో 962 మి॥ కే.జీ.లకు పడిపోయింది. అలాగే పంచదార ఉత్పత్తి కూడా 1965-66లో 3.5 మి॥ టన్నుల నుంచి, 1968-69లో 3.6 మి॥ టన్నులకు, 1969-70లో 4.9 మి॥ టన్నులకు పెరిగి, 1970-71 నాటికి మళ్ళీ 317 మి॥ టన్నులకు పడిపోయింది. 'ఇండియా - ఆర్థిక సమాచారపు పాకెట్ బుక్, 1971.
17. ఖరీదైన రేయాన్ నూలు ఉత్పత్తి 1965-66లో 756.00 టన్నుల నుంచి 1968-69 నాటికి 992,00 టన్నులకు, 1971 నాటికి 1.1 మి॥ టన్నులకూ పెరిగింది. ఇండియా - ఆర్థిక సమాచారపు పాకెట్ బుక్ - 1971)

ఏర్–కండిషనర్లు, రిఫ్రిజరేటర్లు కార్లు మొ॥ వాటిలో అటువంటి ధోరణులే కనిపిస్తాయి.

18. గుత్త సంస్థల దర్యాప్తు సంఘం.
19. బెంగాలు వాణిజ్య మండలి, పశ్చిమ బెంగాలు : ఒక సునిశిత పరిశీలన ఆక్స్‌ఫర్ట్ & ఐబిహెచ్ పబ్లిషింగ్ కం, 1971 పే. 112.
20. భారతీయ వాణిజ్య పరిశ్రమల సమాఖ్య – 'పారిశ్రామిక స్తబ్దత – కారణాలు, చికిత్సలు'.
21. కిగ్సిలేమార్టిన్ 'న్యూస్టేట్స్‌మన్ అండ్ నేషన్, ఏప్రిలు 12, 1958.
22. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమ వాణిజ్య సమాఖ్యలో లాల్‌బహదూర్ శాస్త్రి ప్రసంగం. 'ది హిందూ', జనవరి 1, 1961.
23. మైఖేల్ కిడ్రాన్ 'భారతదేశంలో విదేశీ పెట్టుబడులు' ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయం ప్రెస్సు, లండన్, 1965, పే. 146.
25. పరేశ్ ఛటోపాధ్యాయ 'భారతదేశ ఆర్థికాభివృద్ధిలో కొన్ని ధోరణులు', 'ఫ్రాంటియర్', జనవరి 1, 1972.
26. పారిశ్రామిక లైసెన్సుల జారీ విధానపు దర్యాప్తు కమిటీ నివేదిక.
24. పారిశ్రామిక లైసెన్సుల జారీ విధానపు దర్యాప్తు కమిటీ నివేదిక.
27. అఖిల భారత కార్మిక సంఘాల కాంగ్రెసు (ఎఐటియుసి) భారత గుత్త సంస్థల పెరుగుదల'.
28. సి.పి.ఐ. (మా.లె.) రాజకీయ తీర్మానం, 1969.
29. 'మన విదేశీ రుణభారం', 'కల్కి'లో చర్చ సెప్టెంబరు, 1958 (డేనియల్‌ల తీఫ్ 'ఇండియా – విదేశీ సహాయం' గ్రంథంలో ఉదహరించబడినది. పే. 61)
30. అమెరికన్ వాణిజ్య శాఖ 'భారతదేశంలో పెట్టుబడి' 1953.
31. మైఖేల్‌కి డ్రాన్ 'భారతదేశంలో విదేశీ పెట్టబడులు'పే. 190.
32. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా బుల్లెటిన్ మే. 1958 (మైఖేల్ కిడ్రాన్ భారతదేశంలో విదేశీ పెట్టుబడులు గ్రంథంలో ఉదహరించబడినది పే. 246)
33. 'ఎకనామిక్స్ టైమ్సు' పత్రిక, జూలై 22, 1971. ఎన్.కె. చంద్రా 'పాశ్చాత్య సామ్రాజ్యవాదం, నేటి ఇండియా–1, ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, వార్షిక సంచిక ఫిబ్రవరి 1973లో ఉదహరించబడినది.
34. ఎన్.కె. చంద్రా, 'పాశ్చాత్య సామ్రాజ్యవాదం – నేటి ఇండియా – 1, ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, వార్షిక సంచిక, ఫిబ్రవరి 1973.

35. ఆదాయపు పన్ను చట్టం, 1961.
36. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా బులెటిన్ (పరేశ్ ఛటోపాధ్యాయ 'భారతదేశ ఆర్థికాభివృద్ధిలో కొన్ని ధోరణులు' 2 ఫ్రాంటియర్ జనవరి 1, 1972లో ఉదహరించబడినది).
37. భవనీపథక్ 'భారత బూర్జువా వర్గ స్వభావం' 'లిబరేషన్' డిసెంబర్ 1967.
38. ఎన్.కె. చంద్రా, 'పాశ్చాత్య సామ్రాజ్యవాదం – నేటి ఇండియా – 1'.
39. మైఖేల్ కిడ్రాన్ 'ఇండియాలో విదేశీ పెట్టుబడులు' పే. 302.
40. అదే గ్రంథం. పే. 313
41. ఎస్. వి. కపాడే ఎఐసిసి ఆర్థిక సమీక్ష, అక్టోబరు 30, 1962.
42. తాతా ఆర్థిక సలహా విభాగం. 'భారతదేశ గణాంక రూపం' 1970.
43. మైఖేల్ కిడ్రాన్ 'ఇండియా విదేశీ పెట్టుబడులు' పే. 302.
44. ఆర్. ఉలయనో విస్కీ "తృతీయ ప్రపంచం: గణాంక నియతి సమస్యలు', 'సోవియట్ రివ్యూ' నం. 49, 1971.
45. జర్నల్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ అండ్ ట్రేడ్', సెప్టెంబరు 1969, పే. 1107.
46. మైఖేల్ కిడ్రాన్ 'భారతదేశంలో విదేశీ పెట్టుబడులు; పే. 263–264.
47. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ 'ఇండియా – ఆర్థిక సమాచారపు పాకెట్' బుక్, 1971.
48. ప్రత్యక్ష పన్నుల దర్యాప్తు కమిటీ, తుది నివేదిక, 1971.
49. బి.సి. దత్తా 'అమాయకుల తిరుగుబాటు' సింధు పబ్లిషర్సు, (ప్రై) లి. బొంబాయి, 1971, పే. 221.22
50. ఇక్కడ ఇచ్చిన అంకెలన్నీ ఉజ్జాయింపువే. 'ఇండియా–ఆర్థిక సమాచారపు పాకెట్ బుక్, 1971', (ఆర్థిక మంత్రిత్వ శాఖ, GOI) లేబర్ గణాంకాల పాకెట్ బుక్, 1972 (కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ GOI) ఆధారం.
51. మావోసేటుంగ్ 'చైనా విప్లవం–చైనా కమ్యూనిస్టు పార్టీ' (ఏరిన రచనలు వాల్యూం – II, పే. 324)
52. ఉజ్జాయింపు అంకెలు 'కార్మిక గణాంకాల పాకెట్ బుక్', 1972 (భారత ప్రభుత్వం.
53. అదే సమాచారం
54. ఆర్. పామీదత్తు, 'ఇండియా టుడే', పీపుల్స్ పబ్లిషింగ్ హౌసు, బొంబాయి, 1947, పే. 304.

వి.వి. బలబూసవిచ్ ఎ.ఎమ్.డైకోవ్, 'భారతదేశ సమకాలీన చరిత్ర', పీపుల్స్ పబ్లిషినిగ్ హౌసు, న్యూఢిల్లీ, 1964 పే. 238.
55. ముజఫర్ అహమద్, కమ్యూనిస్టు పార్టీ, గథర్ ప్రోతమ్ జుగ్, (కమ్యూనిస్టు పార్టీ మొదటి దశ) నేషనల్ బుక్ ఏజెన్సీ, కలకత్తా పే. 32.
56. లాయడ్ ఐ. రుడాల్ఫ్, ససేన్ హోబర్ రుడాల్ఫ్, కరుణా అహమద్ 'ఇండియాలో విద్యార్థి రాజకీయాలు – జాతీయ రాజకీయాలు' ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, ప్రత్యేక సంచిక, జూలై 1972.
57. ఫ్రెడ్రిక్ ఏంగిల్స్ 'జర్మనీ రైతు యుద్ధానికి ముందుమాట' ఏరిన రచనలు, ప్రోగ్రెస్ పబ్లిషర్సు, మాస్కో, 1970, పే. 240.
58. మావో సేటుంగ్ 'చైనా సంఘంలో వర్గముల పరిశీలన' ఏరిన రచనలు, వాల్యూం – 1, పెకింగ్ ప్రతి, పే. 19.
59. ఫ్రాంజ్ ఫానన్ 'భూమిపై దరిద్రులు' పెంగ్విన్ బుక్సు, 1967, పే. 109.

## అధ్యాయం – 3

1. వి.వి. బాలబుషెవిచ్, ఎ.ఎమ్. డైకోవ్, 'భారత దేశ సమకాలీన చరిత్ర' పీపుల్సు పబ్లిషింగ్ హౌస్, న్యూఢిల్లీ, 1968. పే. 430.
2. సి.పి.ఐ. (మా.లె.) కార్యక్రమం, 1970.
3. ఎన్.ఎన్.మిత్రా, 'ఇండియన్ ఏన్యుయల్ రిజిస్టర్, 1974.
4. అదే సమాచారం.
5. 'వామపక్ష రాజకీయ ఫిరాయింపులకు మౌలికమైన కారణాలు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశపు సమీక్ష' – సి.పి.ఐ. (మా.లె.) కేంద్ర కమిటీ అక్టోబరు 5–9 తేదీలలో కలకత్తా సమావేశంలో ఆమోదించిన తీర్మానం, 1968.
6. 'పీపుల్స్ ఎజ్' నవంబరు 30, 1947.
7. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కార్యక్రమం, 1970.
8. 'నక్సల్బరీ శిక్షా' నుంచి అనువదించినది. (నక్సల్బరీ గుణపాఠాలు) చారుమజుందారు సంభాషణల కథనాన్ని యథాతథంగా పొందుపరుస్తూ సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఉత్తర బెంగాలు బీహారు సరిహద్దు ప్రాంతీయ కమిటీ రూపొందించిన నివేదిక.
9. సి.పి.ఐ. (మా.లె.) రాజకీయ తీర్మానం, 1969.
10. భారత గణాంకాలలో భారతదేశ విదేశీ ఆస్థి అప్పుల నివేదిక, 1948 సర్వే

ఆఫ్ ఇండియా వారి భారత దేశ విదేశీ ఆస్థి అప్పుల నివేదిక, 1955.

11. పి. సుందరయ్య 'తెలంగాణా ప్రజా పోరాటాలు, గుణపాఠాలు' గ్రంథంలో ఉదహరించినది.
12. సి.పి.ఐ. (మా.లె.) రాజకీయ తీర్మానం, 1969.
13. రావినారాయణరెడ్డి 'వీర తెలంగాణ' పే. 64, పి. సుందరయ్య 'తెలంగాణా ప్రజాపోరాటాలు గుణపాఠాలు' పే. 257.
14. పి. సుందరయ్య, అదే గ్రంథం, పే. 134–135.
15. 1వ అధ్యాయంలో ఉదహరించిన బెస్టర్ బౌల్సు వ్యాఖ్యలను చూడుడు.
16. పైనుదహరించిన పి. సుందరయ్య గ్రంథం పే. 308.
17. అజయ్ ఘోష్ 'పార్టీ విధానంపై కొన్ని సందేహాలు' నవంబరు 1955.
18. 'న్యూయార్కు టైమ్సు' ఏప్రిలు 1954.
19. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా బుల్లెటిన్ 1956.
20. సర్వే ఆఫ్ ఇండియా విదేశీ అప్పులపై నివేదిక, డిశెంబరు, 1955.
21. 'న్యూఏజ్' జూలై 12, 1954.
22. 'న్యూఏజ్' సెప్టెంబరు 10, 1954.
23. ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ 'మోగాలో నేటి గందరగోళం' అఖిల భారత కిసాన్ సభ, 1954.
24. 'వామపక్ష రాజకీయ ఫిరాయింపులకు మౌలికమైన కారణాలు – ప్రత్యేకించి ఆంధ్రదేశపు సమీక్షా' – సి.పి.ఐ. (మా) కేంద్ర కమిటీ అక్టోబరు 5–9 తేదీలలో కలకత్తా సమావేశంలో ఆమోదించిన తీర్మానం, 1968.
25. టి. నాగిరెడ్డి, డి. వెంకటేశ్వరరావు తదితరులు 'పార్టీ సభ్యులకు బహిరంగ లేఖ, 1968.
26. 'వామపక్ష రాజకీయ ఫిరాయింపులకు మౌలికమైన కారణాలు – ప్రత్యేకించి ఆంధ్రదేశపు సమీక్ష' – సి.పి.ఐ. (మా) కేంద్ర కమిటీ అక్టోబరు 5–9 తేదీలలో కలకత్తా సమావేశంలో ఆమోదించిన తీర్మానం, 1968.
27. 'నక్సల్బరీ శిక్షా'
28. ఎల్. ట్రాట్స్కీ 'టెర్రరిజం – కమ్యూనిజం, ఏన్, ఆర్బర్ పేపర్, బాక్, మేఛిగన్ విశ్వవిద్యాలయ ప్రెస్సు, 1961, పే. 58.
29. 'నక్సల్బరీ శిక్షా'
30. ప్రతాప్ మిత్రా కమ్యూనిస్టు పార్టీ – నక్సలైట్లు సి.పి.ఐ. పే. 15.

31. 'నక్సల్బరీ శిక్షా'
32. 1969 మేడే రాలీలో కానూసన్యాలు ప్రసంగం నుంచి పార్టీ అవతరణ కూడా అప్పుడే ప్రకటించారు. సుందరయ్య రణదివే, నంబూద్రిపాద్, ప్రమోద్ దాస్ గుప్తా, హరే కృష్ణ కోనార్‌ల నుద్దేశించినది. వారందరూ సి.పి.ఐ.(మా) పొలిట్‌బ్యూరో సభ్యులు.

## అధ్యాయం - 4

1. కానూసన్యాలు 'తెరై రైతు ఉద్యమ నివేదిక' 1969.
2. 'పూర్వతరంగ'లో కానూసన్యాలు వ్యాసం, మే 1974.
3. అదే వ్యాసం.
4. అదే వ్యాసం.
5. 'పీపుల్సు డెమోక్రసీ' మే 21, 1967.
6. కానుసన్యాలు 'తెరై రైతు ఉద్యమ నివేదిక' 1967.
7. పటము చూడుడు.
8. కానుసన్యాలు 'తెరై రైతు ఉద్యమ నివేదిక' 1969.
9. నక్సల్బరీ శిక్షా
10. అసిత్ భట్టాచార్య 'నక్సల్బరీ సమాచారం-II" మైన్‌స్ట్రీమ్, జూలై 15, 1967.
11. 'పీపుల్స్ డెమోక్రసీ' జూన్ 25, 1967.
12. కానుసన్యాలు 'తెరై రైతు ఉద్యమ నివేదిక' 1969.
13. 'ప్రస్తుత వ్యావసాయిక ఆందోళనల స్వభావం కారణాలు' భారత ప్రభుత్వ దేశీయాంగ శాఖ పరిశోధన విధాన విభాగం వారు తయారు చేసిన అముద్రిత నివేదికలోని అంకెల నాధారంగా చేసుకుని చెప్పినది.
14. 'ప్రస్తుత వ్యావసాయిక ఆందోళనల స్వభావం కారణాలు' భారత ప్రభుత్వ దేశీయాంగ శాఖ పరిశోధన విధాన విభాగం వారు తయారు చేసిన అముద్రిత నివేదికలోని అంకెల నాధారంగా చేసుకుని చెప్పినది.
15. 'పేట్రియాట్' నవంబరు 29, 1969.
16. 'ప్రస్తుత రాజ్యాంగము ప్రజా ప్రతినిధుల సభలు పెట్టిన ఆంక్షల పరిధిలో విప్లవాత్మకమైనదేమైనా చేయడం అసంభవం. కాని రైతాంగానికి తక్షణ సహాయాన్నిచ్చేలా కొన్ని అభ్యుదయకరమైన చర్యలు అమలు చేయడం తప్పక కుదురుతుంది' - సి.పి.ఐ. (మా) బెంగాలీ వారపత్రిక 'గణశక్తి'కి హరేకృష్ణ నోనార్ ఇచ్చిన ఇంటర్వ్యూ. 'పీపుల్సు డెమోక్రసీ' మే 21, 1967 సంచికలు

ప్రచురితమైనది.
17. స్టేట్స్‌మన్, జూన్ 25, 1967.
18. మన పార్టీకీ చైనా పార్టీకి కొన్ని ప్రాథమిక విషయాలపై గల భిన్నాభిప్రాయాలు 'మరియు' దేశంలో ఆర్థిక రాజకీయ పరిణామాలు మన కర్తవ్యం' – సి.పి.ఐ. (మా) కేంద్ర కమిటీ మదురై సమావేశంలో ఆమోదించిన తీర్మానాలు ఆగస్టు 18–27, 1967.
19. సి.పి.ఐ. (మా) ప్రణాళిక.
20. 'సిద్ధాంత చర్చకు ముసాయిదా' – సి.పి.ఐ. (మా) కేంద్ర కమిటీ మదురై సమావేశంలో ఆమోదించినది. ఆగస్టు 18, 27, 1967.
21. 'లిబరేషన్' డిశెంబరు, 1967.
22. అదే పత్రిక ఫిబ్రవరి, 1968.
23. అదే పత్రిక మే, 1968

## అధ్యాయం – 5

1. ఎన్. వై. నాయుడు 'పార్వతీపురం ఏజెన్సీలో గిరిజన తిరుగుబాటు' ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ నవంబరు 25, 1972.
2. 'శ్రీకాకుళం నక్సలైట్లు పలుకుబడికి కారణం' హిందూ ఆగస్టు 8, 1969.
3. స్టేట్స్‌మన్ ఏప్రిలు 11, 12, 1968.
4. పీపుల్సు డెమక్రసీ నవంబరు 19, 1967.
5. 'శ్రీకాకుళ నివేదిక' లిబరేషన్, మే, 1967
6. అదే సమాచారం.
7. అదే సమాచారం
8. లిబరేషన్, మే, 1968
9. అదే సమాచారం.
10. అదే సమాచారం.
11. అదే సమాచారం.
12. అదే సమాచారం.
13. స్టేట్సుమన్, డిసెంబరు 14, 1968
14. అమృత బజారు పత్రిక, డిసెంబరు 22, 1968.
15. ఎస్.ఐ.డి.ఐ.బి. కోరాపుట్ కె.ఎన్. మిశ్రా వ్యాసం 'ఒరిస్సా పోలీసు మాగ్జైన్'

జనవరి, 1972.

16. 'ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దు కిరువైపులా కలాపాలు సాగిస్తున్న సుబ్బారావు పాణిగ్రాహి అనే వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు' – అమృత బజారు పత్రిక డిసెంబరు 8, 1968.
17. పీపుల్సు డెమోక్రసీ (డిసెంబరు 8, 1968)లో ఉదహరించినది.
18. పీపుల్సు డెమోక్రసీ (మార్చి 17, 1968)లో ఉదహరించినది.
19. 'లిబరేషన్', మే, 1969.
20. 'ప్రస్తుత వ్యావసాయిక ఆందోళనల స్వభావం – కారణాలు' భారత ప్రభుత్వ దేశీయాంగ శాఖ పరిశోధన విభాగం రూపొందించిన అముద్రిత పరిశీలనా ప్రతం పే 8–9.
21. 'లిబరేషన్' మే, 1969.
22. 'లిబరేషన్' జూన్, 1969.
23. లిడ్విగ్‌కుగలేమాన్‌కు కార్ల్‌మార్క్సు లేఖ ఏప్రిలు 12, 1871, (కార్ల్‌మార్క్సు, ఫ్రెడ్రిక్ పంగెల్సు) 'పారిస్ కమ్యూన్' ప్రోగ్రెస్ పబ్లిషర్సు, మాస్కో, 1971 పే. 284.
24. సి.పి.ఐ. (మా.లె.) శ్రీకాకుళం జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ జూన్ 15, 1969న చేసిన ప్రకటన నుంచి 'లిబరేషన్' ఆగస్టు 1969 సంచికలో ఉదహరించినది.
25. అదే సమాచారం.
26. 'స్టేట్సుమన్' ఆగస్టు 6, 1969.
27. 'లిబరేషన్' అక్టోబరు, 1969.
28. టి. నాగిరెడ్డి ప్రభృతులపై మోపిన కుట్ర కేసు తాలూకు నిందారోపణ పత్రం నుంచి. ప్రత్యేక మొదటి తరగతి మేజిస్ట్రేటు కోర్టు, హైదరాబాదు.
29. పై ఛార్జిషీటులో ఉదహరించిన ఒక పత్రం నుంచి.
30. సి. చంద్రశేఖరరావు "ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రాంతం–II ఫ్రాంటియర్ జూలై 29, 1972.
31. మూడవ అధ్యాయం చూడుడు.

## అధ్యాయం – 6

1. 'లిబరేషన్' జూన్, 1968.
2. సత్యనారాయణసింగు, 'ముసాహరి, దాని గుణపాఠాలు' 'లిబరేషన్' అక్టోబరు,

1969.

3. అదే సమాచారం.
4. అదే సమాచారం.
5. 'లిబరేషన్' ఫిబ్రవరి 1969.
6. 'నేపాల్ టుడే' జూలై 15, 1968.
7. 'లిబరేషన్' ఏప్రిలు, 1969.
8. నాగిరెడ్డి 'తక్షణ కార్యక్రమం'
9. ప్రమేద్‌సేన్ గుప్తా 'విప్లబ్‌కోన్ పాథే' (విప్లవం ఏ మార్గంలో పోతోంది?) 1970 పే. 98.
10. సత్యనారాయణ సింగు నాయకత్వంలోని సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఆత్మ విమర్శనా సమీక్ష ప్రతి నుండి. దాన్ని రహస్యంగా 1974లో సర్కులేట్ చేసారు.
11. లిబరేషన్, మే, 1969.
12. అదే సమాచారం.
13. అధ్యాయం 5 చూడుడు.
14. 'చారుమజుందారు ఆశించిన విధంగా పయనించే శ్రీకాకుళం' లిబరేషన్, సెప్టెంబరు, 1969.
15. శ్రీకాకుళంలో ప్రకాశించే గెరిల్లా సంఘర్షణ జ్వాలలు, 'లిబరేషన్' అక్టోబరు, 1969.
16. లిబరేషన్, అక్టోబరు, 1969.
17. అదే సంచిక, సెప్టెంబరు, 1969.
18. సత్యనారాయణ సింగు, 'వ్యావసాయిక విప్లవం–ప్రతీఘాత వర్గాలలో సంక్షోభం', లిబరేషన్, సెప్టెంబరు, 1969.
19. సత్యనారాయణ సింగు 'ముషాహరి–గుణపాఠాలు' లిబరేషన్ అక్టోబరు, 1969.
20. అదే సమాచారం.
21. సత్యనారాయణ సింగు 'కార్మిక వర్గపు పార్టీ నిర్మాణం – వ్యవసాయిక విప్లవం', లిబరేషన్, నవంబరు, 1969.
22. ఈ రచయితకు కోనార్ ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వాఖ్య చేసాడు.
23. 'సి.పి.ఐ. (మా.లె.) దేబ్రా థాణా ఆర్గనైజింగ్ కమిటీ నివేదిక' లిబరేషన్, డిశెంబరు, 1969.
24. ఆనంద బజారు పత్రిక, డిశెంబరు, 24, 1968.

25. దేశబ్రతి ఏప్రిలు, 23, 1970.
26. 'కొన్ని కేడర్లు దేబ్రా రైతు సంఘర్షణపై చేసిన సమీక్ష' బెంగాలీ పత్రిక 'లాల్–తారా' మే 7–22, 1976.
27. 'లిబరేషన్' జనవరి, 1970.

## అధ్యాయం - 7

1. చైనా మహా సాంస్కృతిక విప్లవంపై ముఖ్య పత్రాలు విదేశీ భాషా ముద్రణాలయం, పెకింగ్, 1970, 322–24 పేజీలు.
2. వ్యూహాత్మక అధ్యయనాల సంస్థ వార్షిక నివేదిక, 1970.
3. 1974లో రహస్యంగా సర్క్యులేట్ చేసిన సత్యనారాయణసింగు నాయకత్వంలోని సి.పి.ఐ. (మా.లె.) పార్టీ యొక్క ఆత్మ పరిశీలనా పత్రం నుంచి.
4. సత్యనారాయణ సింగు నాయకత్వంలోని సి.పి.ఐ. (మా.లె.) పార్టీ కేంద్ర కమిటీ నవంబరు 7, 1974 సమావేశంలో ఆమోదించిన తీర్మానం నుంచి.
5. 1974లో రహస్యంగా సర్క్యులేట్ చేసిన సత్యనారాయణ సింగు నాయకత్వంలోని సి.పి.ఐ.(మా.లె.) పార్టీ యొక్క ఆత్మ పరిశీలనా పత్రం నుంచి.
6. అదే పత్రం నుంచి.
7. 'నక్సలిజం తగ్గుదల – II' టైమ్స్ ఆఫ్ ఇండియా ఆగస్టు 1, 1972 తేదీన సి. సుబ్బారావు సమాచారంలో ఉదహరించినది.
8. 'రివిజనిజాన్ని ఎదుర్కోండి – ఆంధ్ర సాయుధ పోరాట సమీక్ష' ఆంధ్రా స్టేట్ కమిటీ లిబరేషన్ జూలై – 71 జనవరి, 72.
9. అమృతారంగస్వామి 'గ్రామనిర్మాణం – ఆంధ్రప్రయోగం' ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ సెప్టెంబరు 7, 1974.
10. 'శ్రీకాకుళం సమాచారం'లో ఉదహరించినది. ఫ్రాంటియర్ మార్చి 20, 1970.
11. లిబరేషన్ జూలై 1971 – జనవరి 1972.
12. కె.ఎన్. మిశ్రా సీనియర్ పోలీసు సూపరింటెండెంటు, సమాచార విభాగము, కోరాపుట్, 'కోరాపుట్ జిల్లాలో – నేరాలు' ఒరిస్సా పోలీసు మేగజైన్ జనవరి, 1972.
13. ఆంధ్రప్రదేశ్ సి.పి.ఐ. (మా.లె.) రాష్ట్రకమిటీ రాసిన లేఖలో ఈ వాదనలను ఉదహరించారు. లిబరేషన్ జూలై 71 – జనవరి 72 సంచికలలో ఆ లేఖ ప్రచురించబడింది.

14. లిబరేషన్ జూలై 1971 – జనవరి 1972.
15. అదే సంచిక.
16. 'తటస్థ'లైన భూస్వాములనూ 'క్రూరులైన' భూస్వాములనూ ముషాహరి ప్రాంతంలోని సత్యనారాయణ సింగు, దేబ్రా–గోపీవల్లభపూరు ప్రాంతపు నాయకులూ కూడా ఇదే మాదిరిగా విశ్లేషించారు. తరువాత దశలో చారుమజుందారుతో వచ్చిన విభేధాలలో ఈ వైఖరి ప్రముఖ పాత్రను వహించింది.
17. మావో సేటుంగ్ 'జపానుపై నిరోధక యుద్ధంలో మన విజయం తరువాత మన వైఖరి, సంగతి' ఆగస్టు 13, 1945 (ఏరిన రచనలు వాల్యూం – 4, పేజీ 19).
18. కొత్త వెల్లువ, వామపక్ష దుందుడుకు వైఖరితో సంఘర్షణ – సి.పి.ఐ. (మా.లె.) పార్టీ బీహారు కమిటీ తీర్మానం.
19. మావో సేటుంగ్ 'కేంద్రం సమావేశపరిచిన మేధావుల సభలో ప్రసంగం' జనవరి 20, 1956 (జెరోమ్‌చెన్ మావో పత్రాలలో ఉదహరించబడినది. ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయం ప్రెస్సు, బొంబాయి, 1971 పే. 21).
20. బెంగాల్ – బీహారు – ఒరిస్సా సరిహద్దు ప్రాంతీయ కమిటీ (సి.పి.ఐ. మా.లె) జూలై 1971లో ప్రచురించిన రహస్య పత్రం నుంచి గ్రహించబడినది. ఇకముందు బి.బి.ఓ.బి.ఆర్.సి. పత్రంగా సూచించబడును జూలై 1971.
21. దేశవ్రతి జూలై 6, 1970.
22. బి.బి.ఓ.బి.ఆర్.సి. పత్రం జూలై 1971.
23. అదే పత్రం.
24. సి.కె. కుటుంబరెడ్డి 'ఓటు చేస్తారా?' ఫ్రాంటియర్ ఫిబ్రవరి 27, 1971.
25. 'తీవ్రమైన పొరపాటు' అనే సంతకం చేయని వ్యాసంలో ఉదహరించబడినది. ఆంధ్రప్రదేశ్ విప్లవ కమ్యూనిస్టుల కమిటీ (RCC) విడుదల చేసిన పత్రాన్ని ఆ వ్యాసం చర్చించింది. ఫ్రాంటియర్ జూలై 29, 1972.
26. సుశీతల్ రే ఛౌధురీ 'వామ పక్ష దుందుడుకు ధోరణిపై పోరాడండి' (బహుశా 1971 ఆరంభంలో రాసిన పత్రం. తరువాత సత్యనారాయణ సింగ్ నాయకత్వంలోని పోటీ సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ప్రచురించిన లిబరేషన్ మార్చి–మే 1972 సంచికలో అది ప్రచురించబడింది.)
27. BBOBRC పత్రం జూలై 1971.

28. మావో సేటుంగ్ 'ఒక నిప్పు రవ్వ ప్రయరీమంటను రగులుస్తుంది' జనవరి 5, 1930. ఏరిన రచనలు మొదటి భాగం పే. 127.

## అధ్యాయం - 8

1. భారతీయ విద్యపై మెకాలేమినిట్ మరియు ఉపన్యాసాలు - సం॥ జి.ఎమ్.యంగ్, లండన్ 1935 పే. 359.
2. బినయ్‌ఘోష్ బెంగాలీ వ్యాసం - 'గరీబ్ గణబిద్రోహ ఓ భాగబన్' నుంచి అనువదించబడినది. ఏక్సనాన్ ఆటం సంచిక 1972.
3. సుప్రకాశ్‌రే 'భారతర్ క్రిషక్ బిద్రోహ ఓ గణ తాంత్రిక్ సంగ్రామ్' పేజీలు - 336-337.
4. సరోజ్‌దత్తా సుభాష్‌బోస్ (1970 సంవత్సరంలో సి.పి.ఐ. (మా.లె.) ప్రకటించిన కరపత్రం).
5. సేట్సుమన్ (పత్రిక) ఏప్రిలు 21, 1969.
6. ప్రకాశ్ కారట్ 'భారత రాజకీయాలలో ఆంగ్ల విద్యావంతుల పాత్ర' సోషల్ సైంటిస్టు, నవంబరు 1972.
7. గున్నార్ మిర్దల్ ఆసియన్ డ్రామా మూడో భాగం. పెంగ్విన్‌బుక్సు 1968, పే 1669.
8. చూ॥ అధ్యాయం - 4.
9. సరోజ్‌దత్తా 'విగ్రహ విధ్వంసంపై సమర్థన' దేశబ్రతి 1970.
10. కలకత్తా విశ్వవిద్యాలయపు సి.పి.ఐ. (మా.లె.) కమిటీ నిగూఢంగా ప్రచురించిన కరపత్రం నుంచి.
11. ఎన్. ముల్లా వ్యాఖ్యానం, తరువాత సుప్రీంకోర్టు ఆ వ్యాఖ్యను రికార్డుల నుంచి తొలగించింది. యు.పి. - మహమ్మద్ నాయిం, ఆలిండియా రిపోర్టర్ 1964 ఎస్.సి. 703.
12. స్టేట్స్‌మన్ పత్రిక జూన్ 16, 1970.
13. స్టేట్స్‌మన్ పత్రిక జూలై 18, 1970.
14. స్టేట్స్‌మన్ పత్రిక జూన్ 20, 1970.
15. నక్సల్బరీ శిక్షా.
16. జుగంతర్ సెప్టెంబరు 27, 1970.
17. ఆనంద బజార్ పత్రిక అక్టోబరు 29, 1970.

18. అదే పత్రిక నవంబరు 21, 1970.
19. స్టేట్స్‌మన్ పత్రిక డిశంబరు 12, 1970.
20. నక్సల్బరీ శిక్షా నుంచి అనువదించబడినది.
21. బెంగాలీలో రాసిన తేదీలేని లేఖ నుంచి బహుశః 1970 చివర రాసి ఉండొచ్చు.
22. మార్చి 25, 1973 పీపుల్స్ డెమోక్రసీ పత్రికలో (ప్రచురించిన) పి. సుందరయ్య ఆర్.కె. గార్గుకు రాసిన లేఖ.
23. డేవిడ్ గలూలా తిరుగుబాటును అణచే యుద్ధ పద్ధతి సిద్ధాంతం – ఆచరణ పే. 68.
24. ఆనంద బజార్ పత్రిక అక్టోబరు 21, 1970.
25. సుశీతల్ రే చౌధురీ 'వామపక్ష దుందుడుకు వాదాన్ని ఎదిరించండి'.
26. బిబిఓబిఆర్‌సి పత్రం జూలై 1971.
27. అదే సమాచారం.
28. సత్యనారాయణ సింగు ఇచ్చిన ఇంటర్వ్యూ నుంచి హిందూస్తాన్ స్టాండర్డు, పత్రిక మే 10, 1974న ప్రచురితం.
29. సుశీతల్ రే చౌధురీ 'వామపక్ష దుందుడుకు వాదాన్ని ఎదిరించండి'.
30. బిబిఓబిఆర్‌సి పత్రం జూలై 1971.
31. పశ్చిమ బెంగాలులో హుగ్లీ (జిల్లా)లోని ఒక గ్రామంలో జరిగిన సమావేశంలో సరోజ్‌దత్తా ఇచ్చిన ఉపన్యాసం నుంచి తరువాత 'పూజ్ ఆకాశ్ లాల్' (తూర్పు ఆకాశం ఎరుపు)లో ప్రచురితం.
32. 'నవంబరు 1970 చివర చారుమజుందారుకు ఒక పార్టీ ప్రతినిధి సమర్పించిన నివేదిక తాలూకు నకలు' (చారుమజుందారు మరణించాక పార్టీ వర్గాలలో రహస్యంగా పంచబడిన పత్రం).
33. అదే సమాచారం.
34. జైలు నుంచి కానుసన్యాలు, చౌదరి తేజేశ్వరరావు, సౌరీన్ బోసు, డి. నాగభూషణ పట్నాయక్, కొల్లా వెంకయ్య, డి. భువన మోహన్ పట్నాయక్‌లు 'పార్టీ కామ్రేడ్లకు రాసిన బహిరంగ లేఖ' నుంచి గ్రహించబడినది.
35. డమ్ డమ్ సెంట్రల్ జైలు – మే 14, 1971; హౌరా జైలు – మే 16, 1971; సూరి జైలు – జూన్ 1971; ఆలిపూర్ స్పెషల్ జైలు – జూన్ 31, 1971; అసన్‌సోల్ జైలు – ఆగస్టు 5, 1971; ఆలిపూర్ సెంట్రల్ జైలు – డిశంబరు 26, 1971.

36. మావో సేటుంగ్ 'హూనాన్‌లో రైతాంగ ఉద్యమంపై జరిపిన దర్యాప్తు పై నివేదిక' మార్చి 1927, ఏరిన రచనలు 4వ భాగం పే. 28.
37. వి.ఐ. లెనిన్ 'లెఫ్ట్‌వింగ్ కమ్యూనిజం – అతివాద బాలారిష్టం' ఏరిన రచనలు 2వ భాగం పే. 580 మాస్కో 1947.
38. వినయ్‌ఘోష్ 'బెంగాలు పునరుజ్జీవనోద్యమంపై ఒక విమర్శ' ఫ్రాంటియర్ సెప్టెంబరు 25, 1971.
39. పాయింట్ ఆఫ్ వ్యూ (దృక్పథం) ఢిల్లీ నవంబరు 14, 1970.
40. స్టేట్స్‌మన్ పత్రిక ఫిబ్రవరి 1970.

## అధ్యాయం - 9

1. లిబరేషన్ జనవరి–మార్చి 1971.
2. లిబరేషన్ జూలై 1971 – జనవరి 1972.
3. అదే సమాచారం.
4. అదే సమాచారం.
5. లిబరేషన్ ఆగస్టు 10, 1972.
6. అదే సమాచారం.
7. లిబరేషన్ జూలై, 1971 – జనవరి 1972.
8. నక్సల్బరీ శిక్షా.
9. లిబరేషన్ జూలై, 1971 – జనవరి 1972.
10. అదే సమాచారం.
11. అదే సమాచారం.
12. అదే సమాచారం.
13. అదే సమాచారం.
14. అదే సమాచారం.
15. హిందూస్తాన్ టైమ్స్ జూన్ 26, 1971.
16. లిబరేషన్ జూలై 1971 – జనవరి 1972.
17. అదే సమాచారం.
18. 'బీర్భంపై నివేదిక' – ఒక విలేకరి ఫ్రాంటియర్ జూన్ 26, 1971.
19. అదే సమాచారం.
20. లిబరేషన్ జూలై 1971 – జనవరి 1972.

21. అదే సమాచారం.
22. అదే సమాచారం.
23. అదే సమాచారం.
24. అదే సమాచారం.
25. అదే సమాచారం.
26. అదే సమాచారం.
27. అదే సమాచారం.
28. అదే సమాచారం.
29. అదే సమాచారం.
30. 'బీర్భంపై నివేదిక' – ఒక విలేకరి, ఫ్రాంటియర్ జూన్ 26, 1971.
31. ప్రబీర్ బాసు 'ఇందిర బీర్భం యుద్ధం' ఫ్రాంటియర్ జూలై 31, 1971.
32. లిబరేషన్ జూలై 1971 – జనవరి 1972.
33. అదే సమాచారం.
34. అదే సమాచారం.
35. అదే సమాచారం.
36. మావో సేటుంగ్ 'చైనా విప్లవ యుద్ధంలో వ్యూహపు సమస్యలు' డిశెంబరు 1936 ఏరిన రచనలు మొదటి భాగం పే. 238.
37. మావోసేటుంగ్ 'చైనా విప్లవ యుద్ధంలో వ్యూహం' డిశెంబరు 1936 ఏరిన రచనలు 1వ భాగం పే. 240.
38. మావోసేటుంగ్ 'ప్రస్తుత పరిస్థితి – మన కర్తవ్యం' డిశెంబరు 25, 1947 ఏరిన రచనలు 4వ భాగం, పే. 161.
39. బిబిఓబిఆర్సి పత్రం జూలై 1971.
40. పీపుల్స్ డైలీ ఏప్రిలు 11, 1971.
41. రేడియో పాకిస్తాన్ ఏప్రిలు 12, 1971.
42. లిబరేషన్ ఆగస్టు 1970.
43. లిబరేషన్ జూలై 1971 – జనవరి 1972.
44. దేశబ్రతి మే 1, 1971.
45. డక్కా రేడియో
46. ఫిబ్రవరి 4, 1971 తేదిన 'తూర్పు పాకిస్తాను మార్క్సిస్టు లెనినిస్టు పార్టీ కామ్రేడు (రాసిన) లేఖ' నుంచి మే 1, 1971 దేశబ్రతి సంచికలో ప్రచురితం.

47. ఢక్కాలోని పాకిస్తాన్ సైనికాధికారులకు రావల్పిండిలోని ముఖ్య సైనికాధికార కార్యాలయానికీ మధ్య పంపుతున్న వార్తలను రహస్యంగా విని సేకరించిన భారతీయ సైనిక సమాచార విభాగపు వర్గాల నుంచి గ్రంథకర్త సేకరించిన సంగతులు.
48. అదే సమాచారం.
49. ప్రత్యేక విలేకరి 'గంగా డెల్టాలో వియత్నాం పోకడలు' ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ మే 1, 1971.
50. అసిత్ పాల్ తండ్రి హీరాలాల్ పాల్ బెంగాలీ వార్తాపత్రిక దర్పన్ మార్చి 19, 1971లో ఇచ్చిన వాగ్మూలం నుంచి గ్రహించబడినది.
51. పార్టీ అంతరంగిక పత్రం (1).
52. పాకిస్తాన్‌పై పార్టీ అంతరంగిక పత్రం – దేశబ్రతి – లిబరేషన్ ధోరణి (2)
53. సత్యనారాయణ సింగ్ నాయకత్వపు సి.పి.ఐ., (మా.లె.) ప్రచురించిన లిబరేషన్ మార్చి – మే 1972.
54. పాకిస్తాన్‌పై పార్టీ అంతరంగిక పత్రం – దేశబ్రతి – లిబరేషన్ ధోరణి (2)
55. అదే సమాచారం.
56. అదే సమాచారం.
57. చౌ.ఎన్.లై. 'చైనా కమ్యూనిస్టు పార్టీ 10వ కాంగ్రెసుకు నివేదిక' ఆగస్టు 24, 1973 పెకింగ్ రివ్యూ నం. 35836, సెప్టెంబరు 7, 1973.
58. అదే సమాచారం.
59. అదే సమాచారం.
60. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జూన్ 5, 1971.
61. చౌఎన్‌లై 'చైనా కమ్యూనిస్టు పార్టీ 10వ కాంగ్రెసుకు నివేదిక.
62. లిన్‌పియావో 'ప్రజా యుద్ధపు విజయం వర్ధిల్లాలి' 1965.
63. మావోసేటుంగ్ 'ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితి అవగాహన పట్ల కొన్ని అంశాలు' ఏప్రిలు 1946 ఏరిన రచనలు నాలుగో భాగం పే. 87.
64. సరోజ్‌దత్తా 'రివిజనిజాన్ని ఎదుర్కోవడం ద్వారా విప్లవ సంఘర్షణను కొనసాగించండి' ఆగస్టు 3, 1971.
65. అదే సమాచారం.
66. యునైటెడ్ నేషన్స్‌లో చైనా ప్రతినిధి వర్గపు నాయకుడు చియాకౌన్ హువా నవంబరు 27, 1971న చేసిన ప్రసంగం నుంచి.

67. జనవరి 19, 20, 1973, తేదీలలో సి.పి.ఐ. (మా.లె.) తూర్పు పాకిస్తాన్ సి.పి.ఐ. (మా.లె.) ప్రతినిధులకు జరిగిన రహస్య సమావేశపు ప్రచురించని, సమావేశ వివరాలు.
68. లిబరేషన్ జూలై 1971 – జనవరి 1972.
69. ఇండో – పాక్ యుద్ధ సమయంలో వైట్‌హౌస్ సమావేశాలు తాలూకు (జాక్ అండర్సన్ పాత్రికేయుడు) ప్రకటించిన వివరాలు.
70. పీపుల్సు డైలీ ఏప్రిలు 11, 1971.
71. పెకింగ్ రేడియో డిశెంబరు 5, 1971.
72. నెవిల్ మేక్స్వెల్‌కు చౌఎన్‌లై ఇచ్చిన ఇంటర్వ్యూ, సండే టైమ్స్ డిశెంబరు 5, 1971.
73. లిబరేషన్ (సత్యనారాయణ సింగ్ నాయకత్వపు సి.పి.ఐ. (మా.లె.) ప్రచురణ) మార్చి – మే 1972.
74. సి.పి.ఎం.లోని విప్లవాత్మక విభాగానికి బహిరంగ లేఖ. దేశవ్రతి (సత్యనారాయణ సింగ్ నాయకత్వపు సి.పి.ఐ. (మా.లె.) ప్రచురణ) ఏప్రిలు 1, 1972.
75. లిబరేషన్ ఆగస్టు 10, 1972.
76. అదే సమాచారం.
77. దీపక్ బిస్వాస్, అనల్‌రే, దిలీప్ బెనర్జీలతో సహా ఐదుగురు ప్రముఖ సి.పి.ఐ. (మా.లె.) సభ్యులు సంతకం చేసిన ఫిబ్రవరి 7, 1973వ తేది లేఖ నుంచి గ్రహించబడినది.
78. లిబరేషన్ ఆగస్టు 10, 1972.
79. పశ్చిమ బెంగాలు దేశీయాంగ మంత్రి సుబ్రతా ముఖర్జీ పశ్చిమ బెంగాలు అసెంబ్లీలో చేసిన ప్రకటన – ఆనందబజార్ పత్రిక, మార్చి 17, 1973న ప్రచురించిన ప్రకారం (ఆ ప్రకటనన నుంచి) గ్రహించబడినది.
80. అఖిల భారత మహిళా అసోసియేషన్, కలకత్తా, మే 1974 నాడు జారీ చేసిన ప్రకటన.
81. ప్రొలిటేరియన్ పాత్ వాల్యూం – 4 సం. 1–2 జనవరి – ఏప్రిలు 1975.
82. డెక్కన్ హెరాల్డు సెప్టెంబరు 17, 1974.
83. ఇండియన్ ఎక్స్‌ప్రెస్సు ఫిబ్రవరి 22, 1974.
84. కార్ల్‌మార్క్సు 'ఫ్రాంసులో అంతర్యుద్ధం' మే 30, 1871 కార్ల్‌మార్క్సు – ఫ్రెడిక్ ఏంగెల్సు ఏరిన రచనలు ప్రోగ్రెస్ ప్రచురణలు మాస్కో 1970. పే, 305.

## అధ్యాయం - 10

1. లిబరేషన్ జూలై - జనవరి 1972.
2. అదే సమాచారం.
3. బిబిఓబిఆర్‌సి పత్రం జూలై 1971.
4. ఇండియా పాకెట్ బుక్ - ఆర్థిక సమాచారం, 1971.
5. సత్యనారాయణ సింగు నాయకత్వపు సి.పి.ఐ. (మా.లె.) ఆత్మ విమర్శనా సమీక్ష, 1974లో దాని కాపీలు రహస్యంగా సర్క్యులేట్ చేసారు.
6. వి.ఐ. లెనిన్, 'వాపక్ష దుందుడుకువాదం - అతివాద బాలారిష్టం', వి.ఐ.లెనిన్ ఏరిన రచనలు 2వ భాగం పే. 583. విదేశీ భాషా ప్రచురణాలయం మాస్కో 1947.
7. మావో సేటుంగ్ 'పార్టీ పని ధోరణిని సరిదిద్దండి' ఫిబ్రవరి 1, 1942 ఏరిన రచనలు 3వ భాగం పే. 36 పెకింగ్ ముద్రణ.
8. వి.ఐ. లెనిన్ సంకలన రచనలు 3వ భాగం, మాస్కో ప్రచురణ పేజీలు 280-81.
9. డిటో.
10. మావోసేటుంగ్ 'ప్రస్తుత పరిస్థితి మన కర్తవ్యం' డిశెంబరు 25, 1947, ఏరిన రచనలు 4వ భాగం పే. 161.
11. మావోసేటుంగ్ 'ప్రజలను సేవించండి' సెప్టెంబరు 8, 1944 ఏరిన రచనలు 3వ భాగం పే. 228.
12. నక్సల్బరీ శిక్షా - ఎన్‌బిబిఆర్‌సి సి.పి.ఐ. (మా.లె.)
13. మావోసేటుంగ్ 'చైనా విప్లవ యుద్ధంలో వ్యూహపు సమస్యలు' డిసెంబరు 1936 ఏరిన రచనలు 1వ భాగం పేజీలు 189-90.
14. మావోసేటుంగ్ ఏరిన రచనలు 4వ భాగం పే. 152.
15. మావోసేటుంగ్ 'చింకియాంగ్ పర్వతాలలో పోరాటం' నవంబరు 25, 1928 ఏరిన రచనలు 1వ భాగం పేజీలు 75-99.
16. లిబరేషన్ జూలై 1971-జనవరి 1972.
17. కేంద్ర హోంశాఖ సహాయకమంత్రి శ్రీ కె.సి.పంత్ 1971 జూలై 21వ తేదీన పార్లమెంటులో చేసిన ప్రకటన నుంచి గ్రహించబడినది.
18. డేవిడ్ హెచ్. బేలే 'భారతదేశంలో పోలీసులు' (ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ నవంబరు 6, 1971).

19. కేంద్ర దేశీయాంగ శాఖా వార్షిక నివేదిక 1973-74.
20. 'భారత సైనికాధికారుల, జె.సి.ఓ.ల తదితర అధికారుల వేతనాలు, అలవెన్సులు తదితర రాయితీలపై ప్రతిపాదనలు' - సైనిక ముఖ్య కార్యాలయం మూడవ వేతన సంఘానికి సమర్పించినది. 1971.
21. అదే సమాచారం.
22. అదే సమాచారం.
23. సైనిక విభాగపు సిబ్బంది వేతనాలు ఎలవెన్సులపై నివేదిక, నిపుణుల విభాగపు నివేదిక, ఫిబ్రవరి 22, 1971.
24. 'వేతనాలు ఎలవెన్సులు తదితర విషయాలపై నివేదిక'.
25. అదే సమాచారం.
26. అదే సమాచారం.
27. హిందూస్తాన్ టైమ్స్ ఆగస్టు 10, 1972.
28. వాల్టు, డబ్ల్యు రుస్తోవ్ 'గెరిల్లా చర్యను ఎలా ఎదుర్కోవాలి', 'నవీన గెరిల్లా యుద్ధం' సం॥ ఫ్లాంక్లిన్ మార్క్ ఒసాంకా పే. 470.
29. సర్ రాబర్ట్ థాంప్సన్ 'కమ్యూనిస్టు దాడిని ఓడించడం ఎలా' ఫ్రెడ్రిక్ ఎ. ప్రగేర్, న్యూయార్కు, 1966, పే. 55.
30. 'ప్రస్తుత వ్యావసాయిక సంఘర్షణ స్వరూపం కారణాలు' పే. 36-37.
31. స్టేట్సుమన్ పత్రిక మే 2, 1973.
32. స్టేట్సుమన్ పత్రిక మే 22, 1973.
33. న్యూఏజ్ అక్టోబరు 22, 1972.
34. 1973 ఫిబ్రవరి 22వ తేదీన పార్లమెంటుకు సమర్పించిన భారత ప్రభుత్వపు దేశీయార్థిక పరిశీలన.
35. జాన్. పి. లూయీస్ 'భారత దేశంలో కావాలి సరియైన విప్లవతత్వం' (ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ ప్రత్యేక సంచిక జూలై 1970).
36. మొహిత్‌సేన్, కమ్యూనిస్టు పార్టీ-నక్సలైట్లు సి.పి.ఐ. ప్రచురణ 1971.
37. లిబరేషన్ జూలై 1971 - జనవరి 1972.
38. స్టేట్సుమన్ పత్రిక ఫిబ్రవరి 1, 1973.
39. స్టేట్సుమన్ పత్రిక ఫిబ్రవరి 9, 1973.
40. స్టేట్సుమన్ పత్రిక 10, 1973.
41. హిందూస్తాన్ టైమ్సు పత్రిక అక్టోబరు 29, 1974.

42. దక్కన్ హెరాల్డ్ సెప్టెంబరు 17, 1974.
43. కె.ఎన్.మిశ్రా పోలీస్ సబ్ ఇనస్పెక్టరు డి.ఐ.బి. కోరాపుట్ – కోరాపుట్ జిల్లాలో నేరాలు (ఒరిస్సా పోలీసు మేగజైన్ జనవరి 1972).
44. దేశవ్రతి ఫిబ్రవరి 15, 1973.
45. డిశంబరు 1974లో సి.పి.ఐ. (మా.లె.) రెండవ కాంగ్రెసు సమావేశంలో సమర్పించిన రాజకీయ వ్యవస్థా నివేదిక.
46. 1973 మే–జూన్ మాసాలలో ప్రచ్ఛన్నంగా పంచిన ఒక టైపు చేసిన విజ్ఞప్తి ప్రతి నుంచి గ్రహించినది.
47. హిందూస్తాన్ స్టాండర్డు పత్రిక మే 20–21 తేదీలు, 1974.
48. స్టేట్సుమన్ పత్రిక మార్చి 30, 1973.
49. ఫ్రాంటియర్ మే 18, 1974.
50. 1973 పిలుపు తెలుగు పత్రికలో ప్రచురించిన తెలుగు లేఖ మూలం నుంచి అనువదించబడినది.

**అనుబంధం - 1**

# కొందరు సి.పి.ఐ. (మా.లె.) పార్టీ నాయకుల జీవిత విశేషాలు (1967-72)

**బిశ్వకర్మ (బిశ్వకర్మాకర్), బాబూలాల్:**

జననం 1938. ఉత్తర బెంగాలులోని భూమి లేని రైతు కుటుంబంలో జన్మించాడు. 15 సంవత్సరాల చిరుతప్రాయంలోనే, అంటే 1953లో మొదటి రాజకీయ చర్యలో పాల్గొన్నాడు. ఆ ప్రాంతంలోని రైతుల కోపానికి గురైన భూస్వామి - షావుకారుపై కౌలుదారులు ప్రదర్శన జరిపారు. హెచ్చు వడ్డీలను గుంజడమే ఆ షావుకారు ఆనవాయితీ, జరిగిన ఘర్షణలో బాబూలాల్ గాయపడి, అరెస్టయ్యాడు. తరువాత బెయిలుపై విడుదలయ్యాడు.

1955 సంవత్సరంలో, బాబూలాల్ సి.పి.ఐ. రైతు సంస్థ కిసాన్ సమితికి సిలిగురి సబ్ డివిజన్‌లోని పున్సివాడా పోలీసు స్టేషన్ ప్రాంతంలో పూర్తి కాలపు కార్యకర్తగా పనిచేయసాగాడు. 1956 నాటి అవిభక్త కమ్యూనిస్టు పార్టీలో పూర్తి స్థాయి సభ్యత్వం సంపాదించుకున్నాడు.

భూస్వాములు అక్రమంగా అనుభవిస్తూన్న మిగులు భూమిని ఆక్రమించేందుకు సి.పి.ఐ. తలపెట్టిన పోరాటాలలో 1959-60 కాలంలో బాబూలాల్ కూడా పాల్గొన్నాడు. త్వరలోనే అతడు సబ్ డివిజన్ కిసాన్ సమితి సహాయ కార్యదర్శి, హతిగిషా యూనియన్ కిసాన్ సిమితి కార్యదర్శి పదవిని చేపట్టాడు. తెరై టీ తోటల కార్మికుల సంఘపు కార్యాచరణ సంఘ సభ్యుడుగానూ, సహాయ కార్యదర్శిగానూ ట్రేడ్ యూనియన్ కలాపాలలో కూడా పాల్గొన్నాడు.

సి.పి.ఐ. చీలిక తరువాత బాబూలాల్, సి.పి.ఐ. (మా) పార్టీలో చేరాడు. 1967 నాటి నక్సల్బరీ తిరుగుబాటులో అతను ప్రముఖ పాత్ర వహించాడు. సి.పి.ఎం. నుంచి బహిష్కరించారు. త్వరలోనే బెయిల్ మీద విడుదలైన అతను బెయిలును అతిక్రమించి 1968 మార్చిలో అండర్ గ్రౌండులోకి పోయాడు. ఇతర సి.పి.ఎం. అసమ్మతి దారులతో కలిసి ఉద్యమాన్ని సంఘటిత పరచసాగాడు.

సెప్టెంబరు 7, 1968 అర్ధరాత్రిన, నక్సల్బరీ పోలీస్ స్టేషను కిందున్న బిర్సింగ్ జోటి గ్రామ సమీపంలో సాయుధ పోలీసులతో నాలుగు గంటల పాటు తుపాకీతో తీవ్రంగా పోరాడి చనిపోయాడు.

## సరోజ్‌దత్తా :

ప్రముఖ పాత్రికేయుడు, పశ్చిమ బెంగాలు అవిభక్త సి.పి.ఐ. దినపత్రిక స్వాధీనతాలో పనిచేశాడు. ప్రసిద్ధ కవి.

సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ప్రముఖ వ్యక్తులలో ఒకడైన దత్తా పొలిట్ బ్యూరో సభ్యుడు. పశ్చిమ బెంగాలు రాష్ట్ర కమిటీ కార్యదర్శి.

కలకత్తాలోనూ దాని పరిసర పట్టణాలలోనూ 1970–71లో ఉవ్వెత్తుగా లేచిన యువజనోద్యమంలో ప్రముఖ పాత్రను వహించాడు. జాతీయ నాయకుల సంఘ సంస్కర్తల విగ్రహాలను ధ్వంసం చేసేవారికి తన రాతల ద్వారా సైద్ధాంతిక బలాన్ని చేకూర్చాడు.

సి.పి.ఐ. (మా.లె.) పార్టీ బెంగాలీ వారపత్రిక దేశ్‌బ్రతిలో శశాంక అనే కలం పేరుతో పార్టీలో అసమ్మతి ధోరణులను తీవ్రంగా విమర్శించాడు. వ్యంగ్యోక్తిలో అందె వేసిన చేయి కావడం చేత, సి.పి.ఐ. (మా.లె.) పార్టీకి వెలుపల పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని నాగిరెడ్డి గ్రూపునూ, పశ్చిమ బెంగాలులోని అసిత్‌సేన్ అనుయాయులనూ తదితర మావోయిస్టు గ్రూపులను నిశితంగా విమర్శించాడు.

1971 ఆగస్టు 4 / 5 తేదీ అర్ధరాత్రి కలకత్తాలోని ఒక రహస్య స్థావరం నుంచి పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. 5వ తేదీ తెల్లవారు ఝామున పోలీసులు మైదాన్‌లో మారుమూలకు తీసుకువెళ్ళి కాల్చి చంపారు. సరోజ్ దత్తా పరారీలోనే ఉన్నాడని కలకత్తా పోలీసులు నేటికీ అంటారు.

అతని హత్యపై చారుమజుందారు ఇలా వ్యాఖ్యానించాడు. "కామ్రేడ్ సరోజ్‌దత్తా ఒక పార్టీ నాయకుడు. ఒక నాయకునిలాగే అతను వీరమరణం పొందాడు. యువకులందరూ అతని విప్లవ వాంఛను ఆదర్శంగా పెట్టుకోవాలి."

## ఆదిభట్ల కైలాసం:

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలోని కార్యవలస గ్రామంలోని భూస్వామి కుమారుడు. తండ్రి మాటను కాదని ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి వారసత్వపు ఆస్తిని కాలదన్నాడు. వెంపటాపు సత్యనారాయణతో కలిసి 1955 నుంచీ శ్రీకాకుళం ఏజెన్సీ ప్రాంతపు గిరిజనులలో పనిచేసాడు. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఏర్పడ్డాక అందులో చేరాడు. 1970 జూలైలో కాల్చి చంపబడే వరకూ కొండ ప్రాంతపు రైతు ఉద్యమాన్ని నిర్వహించాడు. అప్పటికి నలభై ఏళ్లుంటాయి.

## నిర్మల :

పంచాది కృష్ణమూర్తి భార్య నిర్మల. 22 ఏళ్ళ వయసు. ఇద్దరు పిల్లల తల్లి. తన భర్తతో ఉద్యమంలో చేరింది. భర్తను చంపాక ఆ ఖాళీని పూరించడానికి పూనుకుంది. భూస్వాముల ఇళ్ళపై దాడులు జరిపే గెరిల్లాలతో ఆమె కూడా వెళ్ళేది. వర్గశత్రువుల నిర్మూలనలో చురుకుగా పాల్గొంది.

ఆంధ్రప్రదేశ్ – ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో 1969 డిసెంబరు 22వ తేదీ తెల్లవారు జామున పోలీసులు ఒక రహస్య స్థావరాన్ని చుట్టుముట్టి మరో ఐదుగురు గెరిల్లాలతో ఆమెను పట్టుకున్నారు. తరువాత నిర్మలతో సహా ఆ ఆరుగురినీ కాల్చి చంపారు.

## పంచాది కృష్ణమూర్తి :

ఆంధ్రప్రదేశ్ పోలీసులు మొదట చంపిన విప్లవకారులలో ఒకడు. ముప్పై ఐదు సంవత్సరాల వయసు కల కృష్ణమూర్తి పోరాటాన్ని మైదానాలకు విస్తరించే కార్యక్రమం చేపట్టిన తరుణంలో, మరో ఐదుగురు యువ కామ్రేడ్లతో సహా సోంపేట రైల్వే స్టేషనులో అరెస్టయ్యాక పోలీసులు కాల్చి చంపారు.

## చారుమజుందారు :

1918లో సిలిగురిలోని భూస్వామ్య కుటుంబంలో పుట్టిన చారుమజుందారు (ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్న) పబ్నాలోని ఎడ్వర్డ్స్ కళాశాలలో చదివాడు. నాడు చట్టబహిష్కారం పొందిన సి.పి.ఐ.లో 1938లో చేరాడు. ఉత్తర బెంగాలులోని జల్పైగురి ప్రాంతపు పార్టీ రైతాంగ విభాగాన్ని సంఘటిత పరిచేందుకు అంకితమయ్యాడు.

నలభైలలో జల్పైగురిలో తలెత్తిన తేభాగా ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించాడు. దోమోహనిలోని బెంగాల్ దూఆర్స్ రైల్వే కార్మికులను సమీకరించడంలో కూడా ముందున్నాడు. డార్జిలింగ్ జిల్లాలోని టీ తోటల కార్మికులను సమీకరించేందుకు చారుమజుందారు 1948లో సిలిగురికి తిరిగి వచ్చాడు. 1947 తరువాత సి.పి.ఐ. తిరుగుబాటు దశలో అతను అరెస్టయ్యాడు.

చారుమజుందారు సి.పి.ఐ.లో కూడా "తీవ్ర రివిజనిస్టు వ్యతిరేక" ధోరణికి ప్రసిద్ధి చెందాడు. నాయకత్వపు "రివిజనిస్టు పెడదారులను" నిశితంగా విమర్శించిన చారుమజుందారును 1962 భారత్ – చైనా యుద్ధ సమయంలో, చైనా–అనుకూల వైఖరి ఉన్నట్టు అనుమానించబడిన ఇతర సి.పి.ఐ. నాయకులతోనూ, చురుకైన

కార్యకర్తలతోనూ, అరెస్టు చేసారు. 1963లో విడుదలయ్యాక సిలిగురి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి సి.పి.ఐ. అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయాడు. సంఖ్యలో చిన్నదైనా తన్ను ఎంత మంది ఓటర్లు బలపరుస్తున్నారో తెలుసుకోవడం ద్వారా, చైనాను ఎందరు బలపరుస్తున్నారో తెలుసుకుని, వారితో తన కార్యక్రమాన్ని ప్రారంభించడం తన ఆశయమని చెప్పాడట.

1964 నాటి సి.పి.ఐ. చీలిక తరువాత అతను సి.పి.ఎం.లో చేరాడు. నాటి సమస్యలపై మరు సంవత్సరమే ఒక కరపత్రాన్ని పంచాడు. పార్టీ నాయకత్వం అతని చర్యను గర్హించింది. తరువాత 'ఎనిమిది పత్రాలుగా' ప్రసిద్ధి చెందిన వాటిలో అది కూడా ఒకటి.

1965 నుంచి 1967 కాలం దాకా చారుమజుందారు గ్రామ ప్రాంతంలో కేంద్రీకరించమనీ తమ తమ గ్రామాలలో అధికారాన్ని పట్టుకునేందుకు రైతులను సాయుధ పోరాటానికి తయారు చెయ్యమనీ తన అనుచరులను కరపత్రాల ద్వారా నిరంతరం కోరుతూనే ఉన్నాడు.

1967 ఎన్నికల తరువాత ఇతర రాజకీయ శక్తులతో కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యాలని ఆశించడంతో సి.పి.ఎం.కూ అతనికీ గల విబేధాలు తారస్థాయికి చేరుకున్నాయి. 1967లో పశ్చిమ బెంగాలులో ఐక్యసంఘటన ప్రభుత్వం ఏర్పడగానే వచ్చిన నక్సల్బరీ తిరుగుబాటుకు, హృద్రోగంతో సిలిగురిలో మంచం పట్టిన చారుమజుందారే సిద్ధాంత సారథిగా నిలిచాడు. 1967 చివరకు అతన్ని సి.పి.ఎం. నుంచి బహిష్కరించారు.

1969లో సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఏర్పడగానే చారుమజుందారు దానికి ప్రధాన కార్యదర్శి అయ్యాడు. 1970 ఆరంభానికి దేశంలో అనేక ప్రాంతాలకు వ్యాపించిన ఆ ఉద్యమం విషయంలో చైనా కమ్యూనిస్టు పార్టీ మెప్పు పొందాడు, సంవత్సరం లోగానే పార్టీలో విబేధాలు తలెత్తాయి. చాలా మంది నాయకులు చారుమజుందారు నిర్దేశించిన ఎత్తుగడల పట్ల అసంతృప్తిని వెలిబుచ్చారు.

1970లో, పార్టీ పత్రికలను బహిష్కరించి, పోలీసులు పార్టీ కార్యాలయాలకు సీళ్ళు వేయగానే. చారుమజుందారు అండర్ గ్రౌండులోకి పోయి నిరంతర హృద్రోగంతోనే, పోరాటానికి నాయకత్వం వహించాడు. 1972 జూలై నెలలో కలకత్తాలో ఒక ఇంటి నుండి అతన్ని పట్టుకున్నారు. సంవత్సరాలుగా హృద్రోగంతో చితికి పోయిన చారుమజుందారు, పోలీసుల ప్రశ్నల ధాటికి తాళలేక గుండెపోటుతో మరణించాడు. జూలై 27న తేదీన హాస్పటలుకు తరలించినా, సరైన వైద్య సహాయం

ఇవ్వనందున మరునాడు చనిపోయాడు.

## సుబ్బారావు పాణిగ్రాహి :

ఆంధ్రప్రదేశ్‌లోని (శ్రీకాకుళం జిల్లాలోని) సోంపేట తాలూకాలో ఒరియా కుటుంబంలో పుట్టిన సుబ్బారావు స్కూల్లో చదివే లేత వయసునాడే నలభైల చివరలో మొదలైన తెలంగాణ సాయుధ పోరాటపు సంవత్సరాలలోనే కమ్యూనిస్టు ఉద్యమంలో చేరాడు. సి.పి.ఐ. నాయకత్వం విషయంలోనూ తరువాత కాలంలో సి.పి.ఎం. నాయకత్వం పైనా కూడా తీవ్రవాద వైఖరిని అవలంబించి గర్హించాడు. అతని తీవ్రవైఖరి అతన్ని సి.పి.ఐ. (మా.లె.) పార్టీకి దగ్గర చేసింది. ఒకానొక సమయంలో శ్రీకాకుళం ఉద్యమాన్ని దాపునే ఉన్న ఒరిస్సాకు విస్తరింప చేసే బాధ్యతను కూడా చేపట్టాడు.

సుబ్బారావు విప్లవకవి. పాటలతో ముగ్గురు కళాకారులు కూడి నిర్వహించే 'జముకల కథను' బహుళ ప్రచారానికి తెచ్చాడు. అతనికి జానపదకళలపై మక్కువ ఎక్కువ. గిరిజన రైతాంగ పోరాటాన్ని జముకల కథగా తయారు చేసి ఆంధ్రప్రదేశ్‌లో గానం చేసాడు.

నవంబరు 1969లో సుబ్బారావు సి.పి.ఐ. (మా.లె.) పార్టీ తాలూకు సోంపేట ఏరియా కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. కొద్ది రోజుల తరువాత డిశంబరు నెలలోని కొందరు గెరిల్లాలతో, నిర్మలా కృష్ణమూర్తితో సహా పట్టుబడిన అతన్ని పోలీసులు (మిగిలిన వారితో సహా) కాల్చి చంపారు. చంపబడిన నాటికి అతని వయసు 35 సంవత్సరాలు.

## సుశీతల్ రే చౌధరి :

సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఆంగ్లమాస పత్రిక లిబరేషన్ సంపాదకుడు. పార్టీ పశ్చిమ బెంగాలు రాష్ట్ర కమిటీ కార్యదర్శి.

1947 – ముందు కాలం నుంచీ విప్లవాత్మక జాతీయ గ్రూపులతో సంబంధం కల సుశీతల్ చౌధురి తరువాత సి.పి.ఐ. సభ్యుడయ్యాడు. 1964 చీలిక తరువాత, సి.పి.ఎం. పార్టీలో చేరాడు. సి.పి.ఎం. బెంగాలీ వారపత్రిక 'దేశహితైషి'కి సంపాదకుడు. 1967 నక్సల్బరీ తిరుగుబాటు కాలంలో దాన్ని సమర్థిస్తూ వ్యాసాలను ప్రచురించాడు. దీనిపట్ల కోపం వహించిన సి.పి.ఎం. రాష్ట్ర నాయకత్వం అతన్ని పార్టీ నుంచి తొలగించింది. కలకత్తాలోని ధర్మతలా వీథిలోని 'దేశహితైషి' కార్యాలయాన్ని ముట్టడించిన సి.పి.ఎం. దౌర్జన్యకారులు సుశీతల్ చౌధరినీ అతని అనుచరులను

బలవంతాన ఆఫీసు నుంచి గెంటి వేశారు.

కమ్యూనిస్టు విప్లవకారుల అఖిల భారత సమన్వయ సంఘానికీ, పశ్చిమ బెంగాలు రాష్ట్ర సమన్వయ సంఘానికీ కూడా సుశీతల్ రే ఛౌదరి కన్వీనర్‌గా పని చేసాడు. సి.పి.ఐ. (మా.లె.) పార్టీ ఏర్పాటు కాగానే పార్టీ కేంద్ర ఆర్గనైజింగ్ కమిటీలో సభ్యుడయ్యాడు. పార్టీ 1970 కాంగ్రెసు తరువాత; పశ్చిమ బెంగాలు రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు.

అనతికాలంలోని కలకత్తా యువజనోద్యమం విషయంలో తన విభేధాలను తెలుపసాగాడు. విగ్రహాలపైనా, విద్యా సంస్థలపైనా విచక్షణ లేకుండా జరిగే దాడులను నిరసించాడు. అతని అభ్యంతరాలపట్ల చారుమజుందారు నిశితంగా మందలింపులు తెలిపాడు. కాలం జరిగే కొద్ది అతను కేంద్ర నాయకత్వ పంథా నుంచి మరీ మరీ దూరమైనపోయాడు.

భౌతికంగా అస్వస్థత, రాజకీయ విబేధాలతోనూ కమిలిపోయిన సుశీతల్ రే చౌధురి. 1971 మార్చి 13వ తేదీన గుండెపోటువల్ల మరణించాడు.

### వెంపటాపు సత్యనారాయణ :

శ్రీకాకుళ రైతాంగం దైవ సమానంగా భావించే వెంపటాపు సత్యనారాయణ మామూలు ఉపాధ్యాయుడు. 1965 నుంచీ ఆదిభట్ల కైలాసంతో కలిసి శ్రీకాకుళం కొండలోని గిరిజన రైతాంగంలో పని చేసాడు. 'గప్పగారు'గా గిరిజన రైతాంగం ప్రేమించి ఆరాధించారు. అతని వల్ల ప్రోత్సాహం పొందిన గిరిజనులు మొదట 1968లో భూస్వాముల, షాహుకార్ల పీడనకు వ్యతిరేకంగానూ; తరువాత ఆ గ్రామాల్లో అధికారాన్ని చేపట్టేందుకూ, సాయుధులై పోరాడారు.

వెంపటాపు సత్యం 1969లో సి.పి.ఐ. (మా.లె.) పార్టీలో చేరాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీలో విబేధాలు వచ్చే వరకూ. చాలాకాలం పాటు శ్రీకాకుళం కొండలలో పార్టీ ప్రభావాన్ని నిలబెట్టగలిగాడు. ఇదే సమయంలో ఆ ప్రాంతంలో పోలీసు దమనకాండ కూడా మొదలైంది. 1970 జూలైలో వెంపటాపునూ, కైలాసాన్ని చేజిక్కించుకున్న పోలీసులు వారిని కాల్చి చంపారు.

* * *

**అనుబంధం - 2**

# చారుమజుందారు రచనల పట్టిక

1. ప్రస్తుత పరిస్థితులలో మన కర్తవ్యం (పత్రం. నం.1), జనవరి 28, 1965.
2. రివిజనిజంపై ధ్వజమెత్తి జనప్రజాస్వామిక విప్లవ విజయానికి సాగిపోండి. (పత్రం నం. 2) 1965.
3. భారత దేశంలో స్వయంచోధిత విప్లవ ప్రజ్వలనానికి మూలమేది? (పత్రం నం. 3) 1965.
4. నవీన రివిజనిజంపై పోరాటాన్ని కొనసాగించండి. (పత్రం నం. 4) 1965.
5. 1965 సంవత్సరం ఎట్టి అవకాశాలను సూచిస్తోంది? (పత్రం నం. 5) 1965.
6. రివిజనీజంపై రాజీలేని పోరాటం నడుపుతూ నిజమైన విప్లవాత్మక పార్టీని నిర్మించడమే నేటి ప్రధాన కర్తవ్యం (పత్రం నం. 6) ఆగస్టు 12, 1966.
7. పేరు లేనిది (పత్రం నం. 7) 1966/67.
8. రివిజనిజాన్ని ఎదుర్కొనడం ద్వారా రైతాంగ పోరాటాన్ని ముందుకు తీసుకుపోవాలి (పత్రం నం. 8) ఏప్రిలు 1967.
9. నక్సల్బరీ వీరోచిత రైతాంగం వర్ధిల్లాలి! దేశవ్రతి శిశిరం 1967.
10. విప్లవ పార్టీని నిర్మించాల్సిన సమయం వచ్చింది. దేశవ్రతి అక్టోబరు 26, 1967.
11. నక్సల్బరీ కామ్రేడుకు లేఖ, 1967.
12. యువకులకూ విద్యార్థులకూ దేశ వ్రతి మే 1, 1968.
13. భారతీయ జన ప్రజాతంత్ర విప్లవం, దేశ వ్రతి మే 16, 1969.
14. ఐక్య సంఘటన - విప్లవ పార్టీ లిబరేషన్ జూలై, 1968.
15. నా కామ్రేడ్లకు దేశవ్రతి ఆగస్టు 1, 1968.
16. విప్లవ పార్టీ నిర్మాణాన్ని చేపట్టండి, దేశవ్రతి శిశిర సంచిక, 1968.
17. వర్గ విశ్లేషణ, పరిశోధన, అధ్యయనాల ద్వారా రైతాంగ వర్గ సంఘర్షణను వృద్ధి చేయండి. దేశవ్రతి అక్టోబరు 17, 1968.

18. ఎన్నికలను బహిష్కరించండి – అనే నినాదపు అంతర్జాతీయ ప్రాముఖ్యత, నవంబరు 21, 1968.
19. గ్రామాల్లో పనిచేసే కామ్రేడ్లకు దేశ బ్రతి డిశెంబరు 26, 1968.
20. శ్రీకాకుళం – అది భారత దేశపు యేనాన్ అవుతుందా? దేశబ్రతి మార్చి 13, 1969.
21. మనం ఇప్పుడు పార్టీని ఎందుకు ఏర్పరచాలి. దేశబ్రతి మార్చి 20 1969.
22. పరిమళ బాబు రాజకీయాలు ఘటన ప్రభ మే 1969.
23. యువతకు, విద్యార్థులకూ పార్టీ పిలుపు దేశబ్రతి ఆగస్టు 21, 1969.
24. బయటపడుతున్న పచ్చి రివిజనిస్టు ధోరణులను నిరసించండి దేశ బ్రతి సెప్టెంబరు 4, 1969.
25. ఛైర్మన్ యొక్క చైనాపై దాడి జరగవచ్చు. విప్లవ కార్యక్రమాన్ని త్వరపరచండి సెప్టెంబరు 19, 1969.
26. చైనా ఛైర్మన్ మన ఛైర్మన్, చైనా పంథాయే మన పంథా నవంబరు 1969.
27. రైతాంగ విప్లవకారులకు పిలుపు, డిశెంబరు 11, 1969.
28. భారతదేశపు రైతాంగ విప్లవ పోరాటాల అనుభవాలను క్రోడీకరించుకుని ముందుకు సాగండి. డిశెంబరు, 12, 1969.
29. గెరిల్లా చర్యలపై కొన్ని మాటలు దేశబ్రతి జనవరి 15, 1970.
30. 70లను విప్లవ దశాబ్దంగా రూపొందించండి దేశబ్రతి జనవరి 22, 1970.
31. శ్రీకాకుళ రైతాంగ పోరాటాలు అజేయం. దేశబ్రతి మార్చి 5, 1970.
32. విప్లవ యువకులకూ విద్యార్థులకూ కొన్ని సలహాలు. దేశబ్రతి మార్చి 5, 1970.
33. కార్మికులలో మన పార్టీ కర్తవ్యాలు, దేశబ్రతి మార్చి 12, 1970.
34. కార్మిక వర్గానికి, దేశబ్రతి మార్చి 12, 1970.
35. ప్రపంచ విప్లవంలో మరువలేని దినం మే 20, దేశబ్రతి మార్చి 5, 1970.
36. రివిజనిజాన్ని ఎత్తిచూపి నిరసించి, నాశనం చేయండి. మే 15 – 16, 1970.
37. నేడు పశ్చాత్తాపానికి సమయం కాదు. దావానలంలా విజృంభించాల్సిన సమయం జూలై 6, 1970.

38. బీద రైతులకూ భూమిలేని రైతులకు అధికారం పట్టుకునే రాజకీయాలను బోధించేందుకు సందేహించకండి జూలై 14, 1970.
39. శ్రీకాకుళపు కామ్రేడ్లకు జూలై 14, 1970.
40. యువకుల, విద్యార్థుల ఉద్యమం (గురించి) శిశిరం, 1970.
41. రైతాంగ విప్లవ పోరాటంతో ఐక్యత సాధించండి. ఆగస్టు 8, 1970.
42. దూరాన్నించి లేఖ, సెప్టెంబరు 1, 1970.
43. గొప్ప విప్లవానికి తయారై ముందుకు సాగండి. అక్టోబరు 1, 1970.
44. పార్టీ పంథాపై రివిజనిస్టుల దాడికి సమాధానం. అక్టోబరు 1970.
45. తూర్పు బెంగాలు కమ్యూనిస్టు పార్టీ (మా.లె.)కు శుభాకాంక్షలు నవంబరు 7, 1970.
46. వీరోచిత మృతవీరుల హత్యలకు ప్రతీకారం తీర్చుకోండి. నవంబరు 22, 1970.
47. రైతాంగ రాజకీయాధికారాన్ని ఏర్పరచేందుకు ప్రాధాన్యాత చూడండి. దేశవ్రతి డిశెంబరు 1, 1970.
48. ఒక కామ్రేడ్‌కు లేఖ డిశెంబరు 13, 1970.
49. మిడ్నపూర్ జైలు హత్యలకు ప్రతీకారం జరపండి. డిశెంబరు 21, 1970.
50. ప్రజావిమోచన సైన్యం నిర్మించి ముందుకు సాగిపొండి ఫిబ్రవరి 10, 1971.
51. శత్రు తుపాకులను ఆయుధాలను పట్టుకొని రైతాంగ గెరిల్లా స్క్వాడ్లను సాయుధుల్ని చేయండి, ఫిబ్రవరి 23, 1971.
52. జైల్ కామ్రేడ్లకు లాల్‌సలాం ఫిబ్రవరి, 20, 1971.
53. తూర్పు బెంగాలు భవిష్యత్తుతో సామ్రాజ్యవాదుల జూదం మార్చి 4, 1971.
54. పంజాబు కామ్రేడ్లకు ఏప్రిలు, 1971.
55. కామ్రేడుకు లేఖ ఏప్రిలు 4, 1971.
56. పార్టీ కాంగ్రెసు తరువాత సంవత్సరం (సమీక్ష) మే 20, 1971.
57. పాకిస్తాను, కమ్యూనిస్టు పార్టీ పాత్ర, జూన్ 29, 1971.
58. ఛైర్మన్ మావో పేరుతో చెలామణీ అవుతున్న కృశ్చేవ్ సిద్ధాంతం జూలై 1971. దేశవ్రతి, సెప్టెంబరు 1, 1971.

59. కా(మ్రేడ్లకు ఆగస్టు 4, 1971.

60. ప్రజా విమోచన సైన్యం – స్థావర ప్రాంతం, (పార్టీ పంథాపై ఖోకోన్ పత్రాలకు జవాబు) ఆగస్టు 9, 1970.

61. మృతవీరుల సంస్మరణలో ఆగస్టు 4, 1970.

62. తూర్పు బెంగాలు నుంచి వచ్చిన మిత్రులకు (సందేశం) సెప్టెంబరు 7, 1971.

63. బీర్భం కామ్రేడ్లకు (సందేశం) సెప్టెంబరు 10, 1971.

64. పార్టీ యంత్రాంగాన్ని పటిష్టం చేయండి అక్టోబరు 4, 1971.

65. పంటల మాసూలు ఉద్యమం, నవంబరు 18, 1971.

66. నగర ప్రాంతాలలో పార్టీ కలాపాలపై ఒక వివరణ, నవంబరు 18, 1974.

67. 1971 నాటికి కోట్లాది భారత ప్రజలు దేశ విముక్తి ఇతిహాసాన్ని వివరిస్తారు. డిశెంబరు 21, 1971.

68. ఇండో–సోవియట్ ఒప్పదం నశించాలి. డిశెంబరు 20, 1971.

69. డిశెంబరు 21, 1972 రాసిన శీర్షిక లేని హిందీ వ్యాసం. సి.పి.ఐ. (మా.లె.) హిందీ పత్రిక లోక్–యుధ్ జూన్ 1972 సంచికలో ప్రచురించబడింది.

70. ప్రజాయుద్ధం ద్వారా ప్రజారాజ్యాన్ని స్థాపించండి మార్చి 11, 1972.

71. మేడే, 1972 (గురించి సందేశం), ఏప్రిలు 22, 1972.

72. త్రిపుర కామ్రేడ్లకు (తేదీ లేని) లేఖ, 1972.

73. ప్రజా ప్రయోజనాలే పార్టీ ప్రయోజనాలు, జూన్ 9, 1972.

74. అముద్రిత వివరణలు 1972.

* * *



IN THE WAKE OF NAXALBARI

నక్సల్బరీ ఒక ఊరు కాదు అనే పుస్తకాన్ని సుమారు రెండు దశాబ్దాల కింద అఖిల భారత విప్లవ విద్యార్థి సమాఖ్య అచ్చేసింది. ఆ రోజుల్లో విప్లవంలోకి వచ్చిన యువతరానికి, విద్యార్థులకు ఆ పుస్తకం గొప్ప ప్రేరణ. వాస్తవానికి నక్సల్బరీ ఎప్పుడూ ఒక ఊరు కాదు. ఒక రాజకీయ పంథా. అందువల్లే దేశవ్యాప్తమైంది.

సుమంతా బెనర్జీ రాసిన నక్సల్బరీ వెలుగులో.. 1980లో ఇంగ్లీషులోనూ, 1982లో తెలుగులోనూ వచ్చింది. కృష్ణమూర్తి అనువాదం చేసిన ఈ పుస్తకాన్ని హైదరాబాదులోని సామ్యవాద సాహితి అనే సంస్థ అచ్చేసింది. మూడు దశాబ్దాల తర్వాత ఈ తరం పాఠకుల కోసం, విప్లవాభిమానుల కోసం విరసం పునర్ముద్రిస్తోంది. నక్సల్బరీ పంథా దేశ వ్యాప్త ఐక్య విప్లవోద్యమంగా పురోగమిస్తున్న తరుణంలో ఉద్యమ ప్రారంభదశను తెలుసుకోడానికి ఈ పుస్తకం గొప్పగా పనికి వస్తుంది. అందువల్ల అప్పట్లో ఈ పుస్తక రచనకు ఉన్నట్లే, ఇవాళ పునర్ముద్రణకు కూడా విప్లవోద్యమ వికాస చరిత్రలో ప్రాధాన్యత ఉంది.

ఈ పుస్తకం చదువుతూ ఉంటే ఉద్యమాలు ఆనాటి లాగా లేవు కదా? అంత ఉద్వేగంగా లేవు కదా? అనిపిస్తుంది. నిజమే. ఆనాటికంటే చాలా పరిణతితో, దీర్ఘకాలిక దృష్టితో, తప్పొప్పులపై నిర్మోహమాటమైన స్వీయ విమర్శతో విప్లవ ప్రజాస్వామిక పోరాటాలు ఒక క్రమంలో పురోగమిస్తూ అంతిమ విజయం సాధిస్తాయనే వాస్తవిక అవగాహనతో సాగుతున్నాయని స్పష్టమవుతుంది.